వాల్మీకి
రామాయణము

అరణ్య, కిష్కింధ, సుందర కాండలు

1370 (10)



సహజ కవి మల్లెమాల
మనసుపడి మక్కువతో సేకరించిన
ఈ పుస్తకాన్ని సాహిత్యాభిమానుల కోసం
సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి
ఆనందంతో బహూకరిస్తున్నాం.
- మల్లెమాల కుటుంబం

వచనానువాదం
శ్రీనివాస శిరోమణి

వాల్మీకి రామాయణము

(అరణ్య, కిష్కింధ, సుందరకాండలు)

ద్వితీయ సంపుటము

అనువాదకుడు :

శ్రీ శ్రీనివాస శిరోమణి

ఎడిషన్ రైట్

M/s నవరత్న బుక్ హౌస్, విజయవాడ

త్రివేణి పబ్లిషింగ్ హౌస్

మచిలీపట్టణము

ప్రథమ ముద్రణము : 1956

పండ్రెండవ ముద్రణము : 2002

ప్రతులు : 2000

894.827 82
-శివా- వాల్2

© **Triveni Publishing House**
Machilipatnam

ఎడిషన్ రైట్ : **M/s నవరత్న బుక్ హౌస్,** విజయవాడ

కాలపరిమితి : 3 సం॥లు (అక్టోబరు 2002 నుండి సెప్టెంబరు 2005 వరకు)

మూల్యము : రు. **200-00**

C. 14983

ప్రతులకు :

M/s నవరత్న బుక్ హౌస్

28/22/20, రహమాన్ స్ట్రీట్

అరండల్ పేట

విజయవాడ - 2

Phone : 0866–432813

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No 97631
హైదరాబాద్-500032

ముద్రణ :

త్రివేణి పబ్లిషింగ్ హౌస్

మచిలీపట్నం - 521 001

విషయ సూచిక

అరణ్యకాండ

రాముని దండకారణ్య ప్రవేశము	1
విరాధ వధ	3
శరభంగుని బ్రహ్మలోకప్రాప్తి	8
ఋషులకు రాముని అభయము	11
సుతీక్ష్ణుని ఆశ్రమము	12
సీత ధర్మోపదేశము	14
పంచాప్సర సరోవర దర్శనము	19
వాతాపి వధ	22
అగస్త్యాశ్రమ సందర్శనము	23
రాముడు జటాయువును కలిసికొనుట	28
పంచవటీ ప్రవేశము	30
శూర్పణఖ	35
ఖరుడు	43
ఖరుని యుద్ధము	45
ఖరుని వధ	60
అకంపనుడు రావణుని కలుసుకొనుట	62
రావణుని గుణగణాలు	66
శూర్పణఖ రావణుని రెచ్చగొట్టుట	68
మారీచ రావణుల సంభాషణ	74
మారీచుని జింక రూపము	85
సీత లక్ష్మణుని తూలనాడుట	92
రావణుడు సీత వద్దకు వచ్చుట	95
సీతాపహరణము	103
జటాయువు హితబోధ	106
రావణ జటాయువుల యుద్ధము	108
సీత రావణుని దూషించుట	114
సీతాదేవి లంకా ప్రవేశము	115
సీత రావణుని హెచ్చరించుట	120
రాముడు సీతకై పరితపించుట	122

సీతావియోగమున రాముడు దుఃఖించుట 128
లక్ష్మణుడు రాముని ఓదార్చుట 141
జటాయువు సీతజాడ తెలుపుట 145
కబంధుడు రామలక్ష్మణులను పట్టుకొనుట 149
కబంధుని వృత్తాంతము 155
కబంధుడు సుగ్రీవుని గూర్చి రామునితో చెప్పుట 157
శబరి వృత్తాంతము 162

కిష్కింధాకాండ **169**

రాముని ఆవేదన 169
సుగ్రీవుడు రాముని చూచి భయపడుట 177
హనుమంతుడు రామలక్ష్మణులను కలిసికొనుట 179
రామ సుగ్రీవుల స్నేహము 184
వాలి సుగ్రీవుల వైర వృత్తాంతము 194
వాలి బల పరాక్రమములు 198
వాలి సుగ్రీవుల యుద్ధము 205
వాలికి తార హితబోధ 211
వాలి వధ 214
వాలి రాముని ప్రశ్నించుట 217
రాముని ధర్మోపదేశము 220
తార రోదనము 228
హనుమంతుని హితబోధ 230
వాలి మరణ సన్నివేశము 231
తార రోదనము 234
సుగ్రీవుని వైరాగ్యము 236
రాముడు తారను ఓదార్చుట 239
వాలి అంత్యక్రియలు 241
సుగ్రీవుని పట్టాభిషేకము 244
రామలక్ష్మణులు గుహలో నివసించుట 247
వర్షాకాల వర్ణనము 250
సుగ్రీవునికి ఆంజనేయుని కర్తవ్యోపదేశము 255
శరత్కాల వర్ణనము 258

లక్ష్మణుడు కిష్కింధకు బయలుదేరుట 265
లక్ష్మణుని కిష్కింధా ప్రవేశము 271
సుగ్రీవునిపై లక్ష్మణుని ఆగ్రహము 276
తార లక్ష్మణుని శాంతపరచుట 278
వానర వీరుల సమీకరణము 280
సుగ్రీవుడు రాముని దర్శించుట 284
వానర సమూహము రామసుగ్రీవుల వద్దకు వచ్చుట 286
వానర వీరులకు సుగ్రీవుని ఆదేశము-వివిధ ప్రదేశ వర్ణనము 289
రాముడు హనుమంతునికి తన అంగుళీయకము నిచ్చుట 308
సుగ్రీవుని భూమండల సంచార విశేషములు 310
వానరుల సీతాన్వేషణ 312
హనుమంతాదులు బిలములోనికి ప్రవేశించుట 316
బిలములో తాపసి దర్శన మిచ్చుట 319
అంగదుని ప్రాయోపవేశ నిర్ణయము 327
సంపాతి 329
సంపాతి రావణుని జాడ నెఱింగించుట 332
సంపాతి వృత్తాంతము 337
లంకాపట్టణ ప్రయాణ సన్నాహము 342
హనుమంతుని వృత్తాంతము 345
ఆంజనేయుని లంకా పట్టణ ప్రయాణము 348

సుందరకాండ **355**

మైనాక పర్వతము 361
నాగమాత సురస 364
సింహిక వధ 366
లంకా పట్టణ వర్ణనము 368
హనుమంతుని లంకా పట్టణ ప్రవేశము 372
లంకాధి దేవతను జయించుట 374
సీతాన్వేషణ ప్రారంభం 376
హనుమంతుడు రాక్షస మందిరాలు వెతుకుట 378
పుష్పక విమాన వర్ణనము 385
రావణుని రాజభవన సౌందర్యము 386
హనుమంతుని ఆలోచనలు 401

హనుమంతుని అశోకవన ప్రవేశము 405
అశోకవనములో సీతాదేవి కనిపించుట 409
రావణుడు సీతను ప్రలోభపెట్ట జూచుట 421
సీత రావణుని హెచ్చరించుట 424
రావణుడు సీతను బెదిరించుట 426
రాక్షస స్త్రీలు సీతాదేవిని బెదిరించుట 429
సీత ఆక్రోశము 435
త్రిజట స్వప్నము 439
శుభ నిమిత్తాలు 444
హనుమంతుని బుద్ధికుశలత 445
సీత హనుమంతుని చూచుట 449
సీతా హనుమంతుల సంభాషణ 451
రాముని ఆనవాలు 461
సీత దుఃఖోపశమనము 464
సీత చూడామణిని హనుమంతుని కిచ్చుట 469
వానరుల బలపరాక్రమ వర్ణనము 474
హనుమంతుడు అశోకవనమును ధ్వంసము చేయుట 479
హనుమంతుడు రాక్షసులను సంహరించుట 480
హనుమంతుడు అమాత్య పుత్రులను వధించుట 485
సేనా నాయకుల వధ 487
అక్షకుమారుని వధ 489
ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రంతో ఆంజనేయుని బంధించుట 492
ఆంజనేయుడు సభా మధ్యములో రావణుని చూచుట 498
రావణునికి హనుమంతుని హితోపదేశము 499
విభీషణుని ధర్మోపదేశము 502
లంకా దహనము 508
హనుమ లంక నుండి బయలుదేరుట 512
హనుమ అంగదాదులను కలుసుకొనుట 516
హనుమంతుని లంకా ప్రయాణ విశేషాలు 518
కర్తవ్య నిర్ణయము 528
మధువనమును ధ్వంసము చేయుట 530
సీతతో తన సంభాషణ హనుమ రామునికి చెప్పుట 539

అరణ్యకాండ

1

రాముని దండకారణ్య ప్రవేశము

ఆ ధైర్యవంతుడు, ఆ దుర్ధర్షుడు రాముడు దురవగాహము అయిన దండకారణ్యము ప్రవేశించినాడు. ఎవరికీ చూడను అలవి కాకుండా కన్నులు మిరుమిట్లు కొలుపుతూ ఆకాశమధ్యములో తేజరిల్లే సూర్యమండలమువలె రక్షోసురాదులకు ఎవరికీ చూడను అలవి కాకుండా తపస్స్వాధ్యాయజనిత బ్రహ్మతేజముతో తేజరిల్లుతూ ఉన్న తాపసాశ్రమ మండలము అక్కడ రాముడికి కనిపించింది.

అది సర్వభూత శరణ్యము అయిన తాపసాశ్రమాల సమూహము. అక్కడికి అప్సరాంగనలు ఎప్పుడూ వచ్చి అక్కడ వారిని పూజించి, నాట్యము ఆడి, పోతూ ఉంటారు.

స్వాదుఫలాలు ఇచ్చే మహోన్నత వృక్షాలు అన్నీ పూలు పూసి పిందెలు కట్టుతూ ఉన్నవి. మధురగానము చేసే రకరకాల పక్షులు అక్కడ నివసిస్తూ ఉన్నవి. జింకలు మొదలు అయిన వన్యమృగాలు అన్నీ అన్యోన్యవైరము లేకుండా అక్కడ యథేష్టముగా తిరుగుతూ ఉన్నవి. ఆ ఆశ్రమపదాల ముంగిళ్ళు అన్నీ చక్కగా అలికి ముగ్గులు పెట్టి ఉన్నవి. హోమాదుల కోసము తెచ్చిన దర్భలూ, స్నానానంతరము ఆరవేసిన వల్కలాలూ అంతటా కనిపించినవి. ఆ ఆశ్రమాలలో అగ్నిహోత్రగృహాలు విశాలముగా ఉన్నవి. స్రుక్స్రువాది యజ్ఞోపకరణాలూ, కృష్ణాజినాలూ, దర్భాసనాలూ, జలకలశాలూ, సమిధలూ, ఫలమూలాలూ, దేవతార్చన కోసము తెచ్చిన పూలూ ఆ ఆశ్రమాలలో సమృద్ధముగా ఉన్నవి. అక్కడ కాసారాలు కమలాలతో కళకళలాడుతూ ఉన్నవి. సూర్యుడివలెనూ, అగ్నిహోత్రుడివలెనూ వృద్ధమునులు వల్కలాజినధారులు అయి ఆ ఆశ్రమాలలో తేజరిల్లుతూ ఉన్నారు. వారు అందరూ ఫలమూలాహారులు, జితేంద్రియులు. వారు, ఆ వృద్ధమునులు పూజించే నియతాహారులు అయిన పరమర్షులున్నూ అక్కడనే నివసిస్తూ ఉన్నారు.

ఆ ఆశ్రమమండలము భూతబలులతోనూ, వైశ్వదేవాది హోమాదులతోనూ, బ్రహ్మవేత్తలు అయిన బ్రాహ్మణోత్తముల వేదపారాయణ ధ్వనులతోనూ మరి ఒక బ్రహ్మలోకమువలె శోభిస్తూ ఉంది.

ఆ తేజోవంతుడు రాముడు తన వింటి అల్లెత్రాడును విప్పివేసి ఆ ఆశ్రమాలకు అభిముఖముగా నడువసాగినాడు. చీకట్లను పోగొట్టి చల్లని వెన్నెల కాయడానికి వచ్చే చంద్రుడివలె, సమస్తప్రాణికోటిని కాపాడడానికి వస్తూ ఉన్న ఆ రాముణ్ణీ, అతని వెంట నడుస్తూ ఉన్న సీతాదేవినీ, లక్ష్మణుణ్ణీ ఆ ఆశ్రమాలలో ఉంటూ ఉన్న దివ్యజ్ఞానసంపన్నులు అందరూ చూచినారు. అంతట ఆ ధర్మచారులు, ఆ దృఢవ్రతులు, ఆ మహర్షులు పరమసంతోషముతో లేచి రాముడికి ఎదురుగుండా పోయినారు. ఆ తేజోవంతుణ్ణి చూచీ చూడడముతో వారు మంగళాశీర్వాదము చెప్పినారు. ఆ మహానుభావుడి విగ్రహాన్ని కన్నులారా చూచినారు. ఆ అవయవాల పొందికకూ, ఆ లావణ్యానికీ, ఆ దేహమార్దవానికీ, ఆ శోభనవేషానికీ విస్మితులు అయిపోయినారు.

సీతారామలక్ష్మణుల రూపలావణ్యాదులను అక్కడి పశు పక్షి మృగాదులున్నూ కన్నులు ఆర్పకుండా చూడసాగినవి. అంతట ఆ మహాభాగులు ఆ అతిథులను తమ ఆశ్రమమండలానికి తీసికొనిపోయి కూర్చుండబెట్టినారు. అగ్నిహోత్రులవంటి ఆ మునులు రాముడికి స్వాగతము చెప్పి అర్ఘ్యమూ, పాద్యమూ ఇచ్చినారు. ఆ అడవిలో పండిన పండ్లూ, కందమూలాలూ, పూలూ సమర్పించినారు. తమ ఆశ్రమాలను అన్నిటినీ చూపించి, వాటిని సొంతముగా భావింపవలసింది అని నివేదించినారు. చేతులు జోడించి, "ఓ మహాయశా! నీవు ధర్మాన్ని పరిపాలిస్తున్నావు. మాకు అందరికీ శరణ్యుడవు, మాన్యుడవు, పూజనీయుడవు. నీవు దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించే దండధరుడవు. రాజువు కాబట్టి, నీవు మాకు తండ్రివంటివాడవు.

"ఓ రామా! రాజు దేవేంద్రుడి నాల్గవ భాగాన పుట్టుతాడు. అందువల్ల, ప్రజలను అందరినీ కాపాడుతాడు. సమస్తభోగాలూ అనుభవిస్తాడు. ప్రజలు అందరూ అతనిని పూజిస్తారు. రామా! మేము అందరమూ నీ దేశమువాండ్లము. నీవు అయోధ్యలో ఉన్నా, ఇటు వనవాసానికి వచ్చినా నీవే మా రాజువు. నీవు మమ్ములను కాపాడవలెను. మేము తపస్సే మా ధనముగా భావించినాము. కోపాన్ని జయించినాము. ఆయుధాలను వర్జించినాము. జితేంద్రియులము అయినాము. అయినప్పటికిన్నీ, నీ బిడ్డలవంటి వాండ్లము. నీవు ఎప్పుడూ మమ్ములను కాపాడుతూ ఉండవలెను" అని చెప్పినారు.

ఈ విధముగా చెప్పి ఆ మహర్షులు సీతారామలక్ష్మణులకు ఫలమూలాదులే కాకుండా, వివిధాహారాలూ సమర్పించి సంతోషపెట్టినారు. అప్పుడు ఆ ప్రాంతాలలో

ఉంటూ ఉన్న ఇతర మహర్షులున్నూ, తపస్విద్ధులున్నూ, శాస్త్రోక్తాచారసంపన్నులున్నూ వచ్చి సీతారామలక్ష్మణులను స్తోత్రము చేసినారు.

2

విరాధ వధ

సీతారామలక్ష్మణులు ఆ రాత్రి ఆ ఆశ్రమమండలములో గడపి, సూర్యోదయము అవుతూ ఉండగా స్నానసంధ్యావందనాదులు ముగించుకొని, అక్కడి మహర్షులకు అందరికీ వీడ్కోలుచెప్పి ప్రయాణము అయి దండకారణ్యములో నడువసాగినారు.

ఆ మహారణ్యములో పెద్దపులులూ, తోడేళ్ళూ మొదలు అయిన ఘాతుక మృగాలు అప్పుడు ఎందుకో భయపడి దాగుకొన పోతున్నవి. పక్షులు చడీ చప్పుడు లేకుండా చెట్లమీద కూర్చుని ఉన్నవి. కంటికి కనపడని ఈలపురుగులు మాత్రము చెవులు గింగిర్లు ఎత్తేటట్లు రొదపెట్టుతున్నవి. చెట్లూ, తీగెలూ, గుల్మాలూ మొదలు అయినవి అన్నీ నలిగిపోయి ఉన్నవి. చెరువులలో నీళ్లు అన్నీ మురుకులుగా కనిపించినవి. సీతారామలక్ష్మణులు ఆ అడవి మధ్యకు పోయినారు. ఆ ప్రదేశము ఘోర మృగాలకు ఉనికిపట్టుగా వారికి తోచింది.

అక్కడ ఒక కొండంత ఎత్తున ఒక ఘోరాకారుడు కనిపించినాడు. వాడు ఎందుకో పెద్దపెట్టున కేకలు పెట్టుతున్నాడు. వాడిది పెద్ద నోరు. పెద్ద పెద్ద గుంట కన్నులు. విశాలము అయిన దేహము. మిట్టపల్లాలుగా ఉన్న పెద్ద పొట్ట. ఒకదానితో ఒకటి సంబంధము లేకుండా ఎక్కువ తక్కువగా ఉన్న అవయవాలు. ఒండ్లు అంతా నెత్తురుతోనూ, మాంసముతోనూ భీభత్సముగా ఉంది. నెత్తురు కారుతూ మాంసము వదలని పులితోలు కప్పుకొని ఉన్నాడు. మూడు సింహాలూ, నాలుగు పెద్దపులులూ, రెండు తోడేళ్ళూ, పది జింకలూ, కొవ్వు కారుతూ దంతముతో ఉన్న పెద్ద ఏనుగు తలా వాడిచేతిలో ఉన్న ఇనుపశూలానికి గుచ్చి ఉన్నవి. సమస్తప్రాణికోటికీ భయము పుట్టేటట్టు వాడు నోరు తెరచి కేకలువేస్తూ ఉన్నాడు.

ఆ రాక్షసుడు, ఆ వికారాకారుడు సీతారామలక్ష్మణులను చూచినాడు. మహోగ్రుడు అయినాడు. సంహారకాలములో యముడివలె భయంకరముగా అరుస్తూ నేల అంతా అదిరిపోయేటట్లు పరుగెత్తుకొంటూ వచ్చి చటుక్కున సీతాదేవి నడుము పట్టుకొని లేవనెత్తి తన భుజముమీద కూర్చోపెట్టుకొని, కొంచెము దూరముగా పోయి నిలుచుని, "మీరు ఎవండ్లు? జటావల్కలాలతో మునివేషాలు వేసుకొని, శరచాపఖడ్గాలు తీసుకొని, ఒక భార్యను వెంటపెట్టుకొని నా దండకారణ్యానికి వచ్చినారు. మీ ఆయుర్దాయము అయిపోయింది. మీరు తాపసులు అయినట్లయితే, మీకు ఒక ఆడుది ఎందుకు? మీరు ముని దూషకులు. పాపులు. నేను ఎవడనో మీకు

తెలుసునా? నా పేరు విరాధుడు. ఇదిగో ఆయుధము. నేను ఈ అడవిలో తిరుగుతూ ఋషులను చంపి, వారి మాంసమును తిని జీవిస్తూ ఉన్నాను. ఈ వరారోహను నేను భార్యగా ఉంచుకొంటాను. మిమ్మలను ఇద్దరినీ చంపివేసి మీ నెత్తురు తాగుతాను. కావలిస్తే నాతో పోట్లాడండి" అన్నాడు.

ఆ దురాత్ముడు ఇంత క్రూరముగా చెప్పుతూ ఉంటే సీతాదేవి, భయముతో ఓరుగాలికి అరటిచెట్టువలె వణికిపోయింది. రాముడు విరాధుడి భుజముమీద ఉన్న సీతాదేవిని చూచినాడు. నోటమాట పెగలలేదు. అతని గొంతు ఎండిపోయింది. ఎట్లాగో లక్ష్మణుడితో, "తమ్ముడా! జనకమహారాజు కూతురిని, నా భార్య మైథిలిని ఈ రాక్షసుడు ఎత్తి భుజముమీద కూర్చుండ పెట్టుకొన్నాడు. చూడు, మన విషయములో కైకేయీదేవి కోరుకున్నట్లు ఇప్పుడు అయిపోతూ ఉంది. ఆమె దూరదృష్టి కలది. కొడుకుకు రాజ్యము ఇప్పించడముతో ఆమె తృప్తి పడలేదు. నన్ను అడవులకు పంపించింది. ఈనాడు ఆమె కోరిక సఫలము అవుతున్నది. సీతను పరపురుషుడు తాకినాడు. ఈ దుఃఖము నేను భరించలేను. రాజ్యము పోయినప్పుడు నాకు దుఃఖమే రాలేదు. మన తండ్రి పోయినప్పుడున్ను నేను ఇంత దుఃఖపడలేదు"అంటూ ఉండగా అతని కళ్ళలో నీళ్ల గిర్రున తిరిగినవి.

లక్ష్మణుడు క్రుద్ధుడు అయిపోయినాడు. ఎదిరించిన పామువలె బుసలు కొట్టుతూ, "అన్నా! నీవు సమస్తప్రాణికోటికీ ప్రభువువు. దేవేంద్రుడితో సరిసమానము అయినవాడవు. నేను నీవెంట ఉన్నాను, ఎందుకు పరితపించడము? ఇదిగో, నా బాణముతో విరాధుణ్ణి హతమారుస్తాను. ఈ భూమి వాడి నెత్తురు త్రాగుతుంది. భరతుడు రాజ్యకాముడు అయినాడు అని నేను అనుకొన్నప్పుడు, వాడి మీద నాకు వచ్చిన కోపాన్ని అంతా ఇప్పుడు వీడిమీద చూపిస్తాను. దేవేంద్రుడు పర్వతముమీద వజ్రాయుధము వదిలినట్టు, ఇప్పుడు వీడి విశాలవక్షస్థలముమీద నా బాణము వదులుతాను. అది వీడి దేహములోంచి దూసుకొని పోతుంది. వీడు గిరగిర తిరుగుతూ నేలమీద పడి చస్తాడు." అన్నాడు.

3

ఆ కాంతిమంతుడు లక్ష్మణుడు రాముడితో ఈ విధముగా చెప్పి విరాధుణ్ణి చూచి నవ్వుతూ, "ఎవడురా నీవు? ఈ అడవిలో విచ్చలవిడిగా తిరుగుతున్నావు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు విరాధుడు "మీరు ఎవరు, ఎక్కడికి పోతున్నారు అని నేను అడుగుతున్నాను, ముందు చెప్పండి" అని ఆ అడవి అంతా మారుమ్రోగిపోయేటట్టు

అరచినాడు. అట్లా మండిపడుతూ ఉన్న విరాధుణ్ణి చూచి రాముడు, "ఓ రాక్షసుడా! మేము ఇక్ష్వాకువంశీయులము. క్షత్రియులము. సదాచారసంపన్నులము. మా తండ్రి దశరథమహారాజు ఆజ్ఞాపించినందువల్ల, మేము ఈ దండకారణ్యానికి వచ్చినాము. ఇకను నీవు ఎవడవో చెప్పు? నీవు ఎందుకు ఈ దండకారణ్యములో తిరుగుతున్నావు" అని అడిగినాడు.

విరాధుడు, "ఓ రామా! చెప్పుచున్నాను, తెలుసుకో. నేను జయుడి కొడుకును. మా తల్లి శతహ్రద. ఈ పృథ్విలో రాక్షసులు అందరూ నన్ను 'విరాధుడు' అని పిలుస్తారు. నేను తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ణి మెప్పించినాను. ఆయన నన్ను అనుగ్రహించి, నేను ఏ ఆయుధానికీ చావకుండా ఉండేటట్టు వరము ఇచ్చినాడు. నన్ను ఎవడూ భేదించలేడు, ఛేదించలేడు, చంపలేడు. మీరు ఈ ఆడుదానిమీద ఆశ వదులుకొని, నాకు విడిచిపెట్టి వచ్చినదారినే పారిపొండి. నేను మీ ప్రాణాలు తీయను" అన్నాడు.

రాముడు కన్నులు ఎర్రచేసి ఆ పాపచేతనుణ్ణి చూచి, "ఓ క్షుద్రుడా! నీచము అయిన అన్యస్త్రీహరణము తలపెట్టినావు. నీవు నీ చావు కోరుకొంటున్నావు. నిన్ను చంపివేస్తాను, నిలు. నిన్ను ప్రాణముతో పోనీయను" అంటూ, అప్పటికి అప్పుడు ధనుస్సు సజ్యము చేసి అల్లె త్రాడు మ్రోగించి గరుత్మంతుడివలెనూ, వాయువువలెనూ అమితవేగముతో పోయే ఏడు బాణాలు చటుక్కున ఎక్కుపెట్టి, ఆ వికారాకారుడిమీద వదిలినాడు. నెమలి రెక్కలతోనూ, బంగారు ములుకులతోనూ ఉన్న ఆ బాణాలు విరాధుడి దేహానికి గ్రుచ్చుకొని, కొద్దిగా నెత్తురు అయి నేలమీదపడి అగ్నిహోత్రమువలె తేజరిల్లినవి.

ఆ బాణాల తాకిడికి నొచ్చి విరాధుడు సీతాదేవిని భుజముమీదినుంచి దింపి, కుపితుడు అయిపోయి మహాభయంకరముగా అరుస్తూ, ఇంద్రధ్వజమువలె ఉన్నతము అయిన తన శూలాన్ని తీసుకొని నోరు తెరచి, నాలుక చాపి రామలక్ష్మణుల మీదికి పరుగెత్తినాడు. ప్రళయకాలాన అందరినీ మింగివేసే యముడివలె పరుగెత్తుకొని వస్తూ ఉన్న ఆ విరాధుడిమీద రామలక్ష్మణులు మంటలు మండే బాణాలవాన కురిపించినారు.

అప్పుడు ఆ భయంకరాకారుడు నిలుచుని ఒక నవ్వు నవ్వి, తన కాయాన్ని పెంచినాడు. ఆ బాణాలు అన్నీ ఆ ఘోరాకారుడి కాయము నుంచి క్రింద పడిపోయినవి. బ్రహ్మదేవుడి వరమహిమవల్ల వాడు ప్రాణాలు చిక్కపట్టి, చేతిలో ఉన్న శూలాన్ని రామలక్ష్మణులమీద విసిరివేసినాడు. అమితవేగముతో మేఘాలలో మెరుపువలెనూ, మంటలతో పొగలతో పిడుగువలెనూ వస్తూ ఉన్న ఆ శూలముమీద

ఆ కోదండ విద్యాపారంగతుడు రాముడు రెండు బాణాలు వదలినాడు. విరాధుడు చేతిలో పట్టుకొనే ఆ శూలము, వజ్రాయుధపాతానికి మేరుపర్వతశిలలవలె ముక్కలు ముక్కలు అయిపోయింది. అంతట విరాధుడు వారిమీదికి పరుగెత్తినాడు. అట్లా మీద పడవస్తూ ఉన్న విరాధుణ్ణి రామలక్ష్మణులు నల్లతాచుపాములవంటి ఖడ్గాలతో బలముగా కొట్టసాగినారు. కత్తిదెబ్బలు తింటూనే ఆ భయంకరుడు రామలక్ష్మణులను కౌగిట వేసుకొని, ఆ అడవిలోకి పోసాగినాడు. రాముడు వాడి అభిప్రాయము తెలుసుకొని, "లక్ష్మణా! మనము పోవలెను అనుకొన్న దారినే వీడు పోతున్నాడు, మంచిదే. వీణ్ణి మనము వీడి ఇష్టమువచ్చినట్లు పోనిద్దాము" అని చెప్పినాడు. అప్పుడు విరాధుడు కౌగిట ఉన్న ఆ బలవంతులను తన బలపరాక్రమముతో లేవనెత్తి పసిపిల్లలనువలె తన భుజాలమీదికి ఎక్కించుకొని, దిక్కులు పిక్కటిల్లి పోయేటట్లు కేకలు పెట్టుకొంటూ ఎట్టఎదుట దట్టము అయిన పెద్ద పెద్ద చెట్లతో మహామేఘ సమూహము వలెనూ, నానావిధ పక్షి సంఘాలతో విచిత్రముగానూ, నక్కలూ, తోడేళ్లు మొదలు అయిన వన్యమృగాలతో భయంకరముగానూ ఉన్న మహారణ్యమువైపు నడిచినాడు.

4

రామలక్ష్మణులను విరాధుడు అట్లా ఎత్తుకొని పోతూ ఉంటే, "అయ్యో! సత్యవంతుణ్ణీ, సచ్ఛీలుణ్ణీ, పరిశుద్ధుణ్ణీ దాశరథిని తమ్ముడితో కూడా రాక్షసుడు ఎత్తుకొనిపోతున్నాడు. ఇక తోడేళ్ళూ, పెద్దపులులూ, చిరుతపులులూ నామీద పడి నన్ను తినివేస్తవి" అని ఏడుస్తూ, సీతాదేవి తన చక్కని చేతులు ఎత్తి, "ఓ రాక్షసోత్తమా! నీకు దండము పెట్టుతాను. రామలక్ష్మణులను వదలిపెట్టు. నన్ను ఎత్తుకొని పో" అని అరచి చెప్పింది.

రామలక్ష్మణులు వైదేహి మాటలు విన్నారు. ఆ దురాత్ముణ్ణి వెంటనే చంపివేయవలెను అనుకొన్నారు. లక్ష్మణుడు ఆ భయంకరాకారుడి ఎడమభుజాన్ని నరికివేసినాడు. అదే సమయాననే వాడి కుడిభుజాన్ని రాముడు నరికివేసినాడు. రెండు బాహువులూ తెగిపోయి మహామేఘము అంతటి ఆ రాక్షసుడు, వజ్రాయుధము దెబ్బకు పర్వతము వలె నేలకూలిపోయినాడు. అప్పుడు రామలక్ష్మణులు వాణ్ణి, ఆ విరాధుణ్ణి కాళ్ళతో తొక్కుతూనూ, మోకాళ్ళతో కుమ్ముతూనూ, పిడికిళ్ళతో గుద్దుతూనూ, పదేపదే పయికి ఎత్తి క్రింద పడవేస్తూనూ నలుగకొట్టినారు. ఎన్నో బాణాలు తగిలి వాడి దేహము అంతా తూట్లు పడిపోయింది. కత్తుల దెబ్బలకు చేతులు తెగిపోవడమే కాకుండా, ఒండ్లు అంతా గాయాలు అయినవి. నలగపొడిచినందువల్ల కీళ్ళు అన్నీ కదిలిపోయినవి. ఎత్తి ఎత్తి పడవేసినందువల్ల

ఎముకలు అన్నీ విరిగిపోయినవి. కాని, ఆ రాక్షసుడు విరాధుడు చావలేదు. చావకుండా పర్వతమువలె నేలమీద పడిఉన్న విరాధుణ్ణి రాముడు జాగ్రత్తగా పరిశీలించి చూచినాడు. ఎటువంటి భయావస్థలో అయినా అభయము ఇచ్చే ఆ కాంతిమంతుడు తమ్ముడితో, "లక్ష్మణా! వీడు తపస్సుచేసి బ్రహ్మదేవుణ్ణి మెప్పించి వరము సంపాదించినాడు. పోరాటములో ఏ ఆయుధానికీ వీడు చావడు. వీణ్ణి పాతిపెట్టవలెను" అన్నాడు.

రాముడు ఇట్లా అంటూ ఉన్న మాటను విరాధుడు విన్నాడు. రాముణ్ణి తేరిపార చూచినాడు. "ఓ పురుషోత్తమా! నీవు దేవేంద్రుడితో సరిసమానము అయిన బలవంతుడవు. లోకనాధుడవు. నీ చేతిలో నా చావు మూడింది. నేను నా అజ్ఞానమువల్ల, నీవు ఎవడవో తెలుసుకోలేక పోయినాను. నాయనా! నీవు కౌసల్యాదేవి కన్న సత్పుత్రుడవు రాముడివా? రామా! తెలుసుకొన్నాను. ఈ మహాభాగ వైదేహి. ఈ మహాయశుడు నీ తమ్ముడు లక్ష్మణుడు. ఇప్పుడు అంతా తెలిసింది. ఓ రామా! నేను 'తుంబురుడు' అనే గంధర్వుణ్ణి. నేను రంభాసక్తుణ్ణి అయి కుబేరుడి కొలువు చేయడము మానివేసినాను. అందుకు ఆయనకు నామీద కోపము వచ్చింది. శాపము పెట్టినాడు. ఆ పాడు శాపము నుంచి నేను ఇట్లా ఘోరాకారముతో రాక్షసుణ్ణి అయి పోయినాను. నేను ఆ మహాయశుణ్ణి అప్పుడే వేడుకొన్నాను. ఆయన ప్రసన్నుడు అయి, 'దశరథరాముడు ఎప్పుడు నిన్ను యుద్ధములో చంపివేస్తాడో, అప్పుడు నీకు ఎప్పటి రూపము వచ్చి నీవు మళ్ళీ స్వర్గానికి వస్తావు' అని చెప్పినాడు. ఓ పరంతపా! నీ అనుగ్రహమువల్ల ఇప్పుడు పరమదారుణము అయిన శాపమునుంచి విముక్తుణ్ణి అవుతున్నాను. ఇక నా లోకానికి నేను పోతాను. నీకు శుభము అవుతుంది.

"నాయనా! ఇక్కడికి ఒకటిన్నర యోజనము దూరములో 'శరభంగుడు' అనే మహర్షి నివసిస్తూ ఉన్నాడు. ఆయన ధర్మాత్ముడు. గొప్ప తపస్వి. సూర్యుడితో సమానము అయిన తేజోవంతుడు. నీవు ఆయన దగ్గరకు పో. ఆ మహాత్ముడు నీకు మేలు చేస్తాడు. రామా! ఒక గుంట తీసి నన్ను పాతిపెట్టు. నీవు సుఖంగా శరభంగుడి దగ్గరకు పో. ప్రాణము పోయిన రాక్షసులను గుంటలో పాతిపెట్టడము సనాతన ధర్మము. గుంటలో పాతిపెట్టితేనే రాక్షసులు పుణ్యలోకానికి పోతారు" అని చెప్పి ఆ శరపీడితుడు, ఆ బలవంతుడు విరాధుడు తన రాక్షసదేహాన్ని వదలిపెట్టి, స్వర్గానికి పోవడానికి ఉద్యుక్తుడు అయినాడు.

విరాధుడు చెప్పింది అంతా రాముడు విన్నాడు. ఆ రౌద్రకర్ముడికి భయంకరము అయిన ఏనుగుకువలె అక్కడనే ఒక గుంట తీయమని లక్ష్మణుడితో చెప్పి, విరాధుడి గొంతుమీద కాలువేసి తొక్కిపట్టి నిలుచున్నాడు. లక్ష్మణుడు వెంటనే పలుగు తీసికొని ఆ పర్వతాకారుడి పక్కనే ఒక పెద్ద గొయ్యి త్రవ్వినాడు. ఆ

గోతిలో విరాధుణ్ణి పడత్రోయడానికి రాముడు వాడి గొంతుమీదినుంచి కాలు తీసినాడు. ఆ అన్నదమ్ములు వాణ్ణి గోతిలో పడత్రోయ పోయినారు. ఎప్పుడూ పెద్ద పెద్ద కేకలు పెట్టే ఆ గాడిద చెవుల విరాధుడు అప్పుడు మహాభయంకరముగా అరవడము మొదలుపెట్టినాడు. పోరాటానికి ఎన్నడూ వెనుతీయని ఆ శీఘ్రపరాక్రములు రామలక్ష్మణులు ఉభయులూ పోరాటములో చావకుండా నేలమీద పడి భయంకరముగా అరుస్తూ ఉన్న ఆ మహాసురుడు ఏ నిశితాయుధానికి చావడు అని నిశ్చయించు కొన్నందువల్లనూ, వాడి అంతట వాడే తాను ఏ ఆయుధానికీ చావను అని చెప్పినందువల్లనూ తమ బలము అంతా ఉపయోగించి సంతోషముతో వాణ్ణి లేవనెత్తి ఆ గుంటలో పడవేసినారు. వాడు, ఆ రాక్షసుడు చెప్పినట్లే ఆ అన్నదమ్ములు ఆ గుంటను పూడుస్తూ ఉంటే, ఆ అడవి అంతా మారుమ్రోగిపోయేటట్లు వాడు కేకలు వేయసాగినాడు. వాడు ఆ గుంటలోన [illegible] లేవకుండా ఉండడానికి ఆ అన్నదమ్ములు రాళ్లువేసి ఆ గుంట పూడ్చి, ఆ కారడవిలో ఆ వనచరుడి భయము లేకుండా చేసివేసి పులకితగాత్రులు అయినారు. అంతట ఆ కాంచనచిత్రిత ధనుర్ధరులు, ఆ మహారణ్యములో ఆకాశములో సూర్యచంద్రులవలె శోభించినారు.

5

శరభంగుని బ్రహ్మలోకప్రాప్తి

సీతాదేవి విరాధుడికి భయపడిపోయింది. సిగ్గుపడిపోయింది. ఏడువసాగింది. రాముడు ఆమెను కౌగలించుకొని ఓదార్చి, తేజోవంతుడు అయిన తమ్ముణ్ణి చూచి, "తమ్ముడా! ఈ అడవి మహాభయంకరముగా ఉంది. దుర్గమముగా ఉంది. మనము ఇదివరకు ఇటువంటి అడవి చూడలేదు. ఇప్పుడు మనము ఇక్కడ ఉండడము మంచిది కాదు. ఇప్పుడే శరభంగుడి ఆశ్రమానికి పోదాము" అన్నాడు.

అంతట వారు శరభంగమహాముని ఆశ్రమమువైపు నడచినారు. ఆ తపోధనుడు శరభంగుడు దేవతలవంటి ప్రభావము కలవాడు. తన బలముతో బ్రహ్మ సాక్షాత్కారము అయినవాడు. ఆ మహాత్ముడి ఆశ్రమము సమీపములో రాముడికి ఒక మహాద్భుత దృశ్యము కనిపించింది.

ఆకాశములో రథముమీదినుంచి ఒక దివ్యతేజుడు కిందికి దిగినాడు. సూర్యాగ్నిహోత్రుల కాంతులతో అతని దేహము తేజరిల్లుతూ ఉంది. అతడు మహాకాంతులు వెదజల్లుతున్న ఆభరణాలు పెట్టుకొని ఉన్నాడు. స్వచ్ఛము అయిన వస్త్రాలు ధరించి ఉన్నాడు. బంగారుపిడులు వేసినవి, మహావిలువచేసేవి అయిన వింజామరలతో అందగత్తెలు అతనికి వీస్తున్నారు. రంగురంగుల పూలదండలు వేళ్ళాడుతూ తెల్లటిమేఘమండలమువలెనూ, గుండ్రముగా చంద్రబింబమువలెనూ,

కనపడుతూ ఉన్న శ్వేతచ్ఛత్రము అతనికి పట్టినారు. అతని అంతటి కాంతిమంతులు కొంతమంది అతనిని వెంబడించినారు. దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, పరమర్షులూ ఆకాశములో నిలిచి, అతడు కిందకి దిగుతూ ఉంటే వేదవాక్యాలతో స్తోత్రము చేయసాగినారు. అతడు నేల అంటకుండా శరభంగుడి ఆశ్రమములోనికి పోయినాడు. అతడు దేవేంద్రుడు. ఆ మహర్షితో సంభాషించడము మొదలుపెట్టినాడు. అది అంతా రాముడు చూచినాడు.

అప్పుడు రాముడు లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! అదిగో, అటు ఆకాశమువంక చూడు. ఎంతో ఆశ్చర్యకరముగానూ, కాంతివంతముగానూ, శ్రీమంతముగానూ ఒక రథము కనపడుతున్నది. అది మధ్యాహ్నసూర్యుడివలె కన్నులు మిరుమిట్లు కొలుపుతున్నది. దానికి ఆకుపచ్చని గుర్రాలు కట్టి ఉన్నవి. దేవేంద్రుడి రథానికి ఎటువంటి గుర్రాలు కట్టుతారు అని మనము విన్నామో అవిగో, అవే. నిస్సందేహముగా అవే. అదిగో చూడు. వందలకొద్దీ యువకులు ఖడ్గపాణులు అయి ఆ రథముచుట్టూ నిలుచుని ఉన్నారు. వారు అందరూ ఇరవైఅయిదుఏండ్ల వయస్సు మించనివారు. అందరూ విశాలవక్షులు. వారి ఎదురురొమ్ములమీది హారాలలో కెంపుల పతకాలు అగ్నిహోత్రమువలె జ్వలిస్తున్నవి. వారి బాహువులు ఇనుపగుదియలవలె ఉన్నవి. రక్తాంబరాలతోనూ, ధగధగలాడే కుండలాలతోనూ వారు పెద్ద పులులవలె దురాసదులుగా ఉన్నా, చూడ చక్కనివారుగా కనబడుతున్నారు. వారు అందరూ దేవతలు.

"లక్ష్మణా! నేను ఇప్పుడు శరభంగుడి ఆశ్రమంలోకి పోయి, ఆ రథములో వచ్చిన ద్యుతిమంతుడు ఎవడో కనుక్కొని వస్తాను. అంతవరకూ నీవు సీతతో కూడా ఇక్కడనే ఉండు" అని చెప్పి ఆ ఆశ్రమమువైపు నడచినాడు.

ఎదురుగుండా వస్తూ ఉన్న రాముణ్ణి చూచి దేవేంద్రుడు శరభంగుడితో, "అడుగో, రాముడు వస్తూ ఉన్నాడు. అతడు ఇక్కడికి వచ్చే లోపలనే నేను వెళ్లిపోవలెను. ఇప్పుడు నేను అతనిని చూడ కూడదు. ఏవరికీ, ఏ మాత్రమూ చేయ నలవికాని ఒక దుర్ఘట కార్యము అతడు చక్కపెట్టవలసిఉంది. అతడు ఆ కార్యము చక్కబెట్టిన తరువాత నేను అతనిని చూస్తాను. అతడున్నూ నన్ను అప్పుడు చూడవచ్చును. ఇప్పుడు కాదు" అని చెప్పి, శరభంగుణ్ణి సమ్మానించి వీడ్కోలు చెప్పి, ఆకాశములో ఉన్న రథము ఎక్కి వెళ్ళిపోయినాడు. అదిన్నీ రాముడు చూచినాడు. వెనుకకు మళ్ళినాడు. సీతాలక్ష్మణులను వెంటపెట్టుకొని శరభంగుడి ఆశ్రమములోకి నడచినాడు.

దేవేంద్రుడు వెళ్లిపోయిన తరువాత శరభంగుడు అగ్నిహోత్రాన్ని ఉపాసిస్తూ కూర్చున్నాడు. అప్పుడు సీతారామలక్ష్మణులు వచ్చి ఆ మహర్షికి పాదాభివందనము

చేసినారు. ఆయన వారిని గౌరవించి ఉచితాసనాలు ఇచ్చి కూర్చుండబెట్టినాడు. ఆతిధ్యము ఇచ్చినాడు. రాముడు అప్పుడు ఆ మహర్షిని, అక్కడికి వచ్చి వెళ్ళింది దేవేంద్రుడేనా అని అడిగినాడు. "అవును, అని చెప్పి ఆ మహర్షి, "రామా! ఆత్మసాక్షాత్కారముకానివారు పోనలవికాని బ్రహ్మలోకాన్ని మహోగ్రతపస్సు చేసి నేను జయించినాను. నన్ను బ్రహ్మలోకము తీసికొని పోవడానికి దేవేంద్రుడు ఇక్కడికి వచ్చినాడు. ఇంతలో నీవు ఇక్కడికి వచ్చినట్టు నాకు తెలిసింది. నిన్ను చూడకుండా పోకూడదు అనుకొని, నేను ఆయనతో బ్రహ్మలోకము పోలేదు. ఓ పురుషపుంగవా! నీవు పరమధార్మికుడవు. మహాత్ముడవు. నిన్ను కలుసుకొన్న తరువాతనే బ్రహ్మలోకము పోవచ్చును అని నిలచిపోయినాను.

"ఓ రామా! నేను అక్షయము అయిన స్వర్గలోక బ్రహ్మలోక భోగభూములను జయించినాను. వాటిని నీవు స్వీకరి౦చు" అని చెప్పినాడు.

ఈ విధముగా (అతిధి సత్కారానికి) శరభంగుడు చెప్పిన మాటలు విని ఆ సర్వశాస్త్రవిశారదుడు రాముడు, "ఓ మహామునీ! తాము జయించినవాటిని తామే అనుభవించవలెను. పయిగా నేను క్షత్రియుడను. నాకు ప్రతిగ్రహణాధికారము లేదు. నేనే ఆ యా లోకాలను స్వయముగా సంపాదించుకొంటాను. నేను ఈ అడవిలో ఉండడానికి, తాము నివాసస్థానము ఏది అయినా చెప్పితే చాలును" అన్నాడు,

రాముడు దేవేంద్రుడితో తుల్యుడు అని తెలుసుకొని ఆ మహాప్రాజ్ఞుడు శరభంగుడు, "రామా! ఈ అడవిలో ఇక్కడికి దగ్గరలోనే 'సుతీక్ష్ణుడు' అనే ఆయన ఉన్నాడు. ఆయన మహాప్రభావము కలవాడు. ధర్మాత్ముడు. ధర్మాచరణ పరాయణుడు. ఆయన నీకు మేలు చేస్తాడు. నీవు ఆయన దగ్గరకు పోవలసింది. నీవు నివసించడానికి రమణీయమూ, పరిశుద్ధమూ అయిన ప్రదేశము ఆ తపస్వి నీకు చూపిస్తాడు. రామా! నీవు ఈ మందాకినీ (ఏటి) ప్రవాహానికి ఎదురుగుండా పోవలెను. అంటే, ఇక్కడనుంచి నీవు పశ్చిమాభిముఖముగా పోవలెను. నీకు ఈ ఏటిలో అక్కడక్కడ పూలతెప్పలు అగుపడతవి. ఆ దారినే పోతే, ఆ సుతీక్ష్ణుడు ఉంటూ ఉన్న ప్రదేశము నీకు కనపడుతుంది.

"నాయనా! నీవు ఇక్కడ కొంచెముసేపు ఉండు. పాము కుబుసాన్నివలె, నేను నా ఈ జీర్ణదేహాన్ని వదలిపెట్టి పోతాను. నీవు చూడు" అని చెప్పినాడు.

అంతట ఆ బ్రహ్మమేధమంత్రవిదుడు, ఆ తేజోవంతుడు శరభంగుడు అగ్నిహోత్రాన్ని జ్వలింపచేసి, ఆజ్యము వేల్చి ఆ అగ్ని హోత్రములోకి పోయినాడు.

అప్పుడు ఆ మహాత్ముడి రోమాలూ, కేశాలూ, నెత్తురూ, మాంసమూ, సర్వావయవాలు దగ్ధము అయిపోయినవి. అది జూచి రాముడూ, లక్ష్మణుడూ, సీతాదేవీ ఆశ్చర్యపడిపోయినారు. అప్పుడు శరభంగుడు అగ్నిహోత్రకాంతులతో ముప్ఫయిఏండ్ల యువకుడివలె ఆ అగ్ని చయములోంచి లేచిపోయినాడు.

ఆ మహానుభావుడు ఆహితాగ్నుల లోకాలనూ, మహాత్ముల లోకాలనూ, ఋషుల లోకాలనూ, దేవతల లోకాలనూ అతిక్రమించి బ్రహ్మలోకము పోయినాడు. అక్కడ ఆ పుణ్యకర్ముడు, ఆ బ్రాహ్మణోత్తముడు శరభంగుడు సపరివారముగా ఉన్న బ్రహ్మదేవుణ్ణి చూచినాడు. బ్రహ్మదేవుడున్నూ ఆ శరభంగుణ్ణి చూచి సంతోషించి స్వాగతము చెప్పినాడు.

6

ఋషులకు రాముని అభయము

శరభంగుడు బ్రహ్మలోకము చేరిన తరువాత, ఆ మహారణ్యములో నివసిస్తూ ఉన్న మహర్షులు అందరూ సమావేశము అయి మహాతేజోవంతుడు అయిన రాముడి దర్శనము చేయడానికి బయలుదేరినారు.

వైఖానసులూ, వాలఖిల్యులూ, శ్రీపాదప్రక్షాళకులూ, మరీచిపాయులూ, అశ్మకుట్టులూ, పత్రాహారులూ, దంతోలూఖలినులూ, ఉన్మజ్జకులూ, గాత్రశయ్యులూ, అశయ్యులూ, అభ్రావకాశకులూ, సలిలాహారులూ, వాయుభక్షకులూ, ఆకాశనిలయులూ, స్థండిలశయ్యులూ, వ్రతోపవాసకులూ, ఆర్ద్రపటవాసులూ, జపపరాయణులూ, తపోనిత్యులూ, పంచతపోన్వితులూ, బ్రహ్మతేజోవంతులూ, దృఢయోగులూ, సమాధినిష్ఠులూ అయిన తాపసులు అందరూ శరభంగుడి ఆశ్రమానికి పోయినారు. ఆ ధర్మజ్ఞులు అందరూ పరమధర్మజ్ఞుడూ, ధర్మమూర్తులలో శ్రేష్ఠుడూ అయిన రాముణ్ణి చూచి, "ఓ రామా! దేవతలలో దేవేంద్రుడివలె, రఘువంశీయులలో నీవు శ్రేష్ఠుడవు. దేవలోకానికి నీవు ప్రభుడవు. నీవు మహారథుడవు. (విరాధుణ్ణి చంపిన) పరాక్రమానికీ, (శరభంగుడు ఆర్జించిన పుణ్యలోకాలను వర్జించిన) సౌజన్యానికీ నీవు ముల్లోకాలలోనూ ప్రసిద్ధికి ఎక్కినావు. నీ పితృభక్తి అసమానము. నీ సత్యవ్రతము అమోఘము. నీవు పరమ ధార్మికుడవు. ఓ ప్రభూ! ఒకందుకు నిన్ను యాచించవలెను అని మేము వచ్చినాము. అందుకు నీవు మమ్ములను క్షమించవలెను. ప్రజల ఆదాయములో ఆరవపాలు పన్నుగా పుచ్చుకొని, ఆ ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడని ప్రభువుకు అధోగతి తప్పదు. ఎప్పుడూ హెచ్చరికతో, సమస్తోపాయాలతో అందరి ప్రాణాలనూ తన ప్రాణమువలె చూచుకొంటూ, అందరినీ తన కన్నబిడ్డలనువలె కాపాడే ప్రభువు కీర్తి ఈ భూలోకంలో శాశ్వతముగా ఉంటుంది. అంతేకాదు,

జీవితానంతరము ఆ ప్రభువు బ్రహ్మలోకములో పూజనీయుడు అవుతాడు. ఫలమూలాహారులు అయిన పరమర్షులు పన్ను చెల్లించక పోయినప్పటికిన్నీ వారి పుణ్యార్జితములో నాల్గవ భాగము వారిని కాపాడే రాజుకు చెందుతుంది. ఓ రామా! ఈ సమూహములో ఎక్కువమందిమి బ్రాహ్మణులము. అందరమూ వానప్రస్థులము. మమ్మలను అనాధులవలె రాక్షసులు చంపివేస్తున్నారు. నీవు మాకు నాధుడవు. భయంకరులు అయిన రాక్షసులు హింసించిన మహామునుల దేహాలను నీవు మా వెంట వచ్చి చూడవలెను. మందాకినీనది మొదలుకొని పంపానది వరకు చిత్రకూటములో నైతేనేమి, మరి ఎక్కడను అయితేనేమి మహర్షులను అందరినీ రాక్షసులు మహాఘోరముగా వధించి వేస్తున్నారు. రాక్షసులు పగబట్టి ఇట్లా ఈ వనములో ఘోరకృత్యాలు చేయడము మేము సహించలేకుండా ఉన్నాము.

"రామా! మేము మా రక్షణార్ధము నీ శరణు చొచ్చినాము. నీవు మమ్మలను రక్షించవలెను. నీవు పరాక్రమశాలివి. రాజువు. ఈ పృధ్విలో నీకన్నా మాకు మరి ఒక దిక్కు లేదు. రాక్షసుల బాధ తొలగించి నీవు మమ్మలను కాపాడవలెను" అని మహర్షులు అందరూ చెప్పుకొన్నారు.

ఈవిధముగా ఆ మహాతపస్సంపన్నులు చెప్పుకొన్నది అంతా, ఆ ధర్మాత్ముడు రాముడు విన్నాడు. అంతట ఆ ధైర్యవంతుడు రాముడు, "ఓ మహర్షులారా! మీరు నన్ను ఆజ్ఞాపించవలెనుకాని, ఈవిధముగా వేడుకొనడము బాగాలేదు. ఇది తగిన పనికాదు. నేను పిత్రాజ్ఞాపరిపాలనము కోసము ఇక్కడికి వచ్చినాను. నేను ఆత్మార్థము వచ్చినప్పటికిన్నీ దుష్ట శిక్షణమూ, శిష్ట రక్షణమూ నా ధర్మము. కాబట్టి, మీపని నేను నెరవేరుస్తాను. మిమ్మలను రాక్షసులనుండి రక్షించడమువల్ల నాకు మరి ఒక సత్ఫలము ఒనకూడుతుంది. ఇది దైవికము. ఓ మహర్షులారా! మీరు నా వీర్యమూ, నా తమ్ముడి పరాక్రమమూ చూస్తారు" అని ఆ మహర్షులకు అందరికీ అభయము ఇచ్చినాడు.

అంతట ఆ ధర్మాత్ముడు, ఆ మునిజనపూజ్యుడు రాముడు సీతా లక్ష్మణులతో సుతీక్ష్ణుడి ఆశ్రమానికి బయలుదేరినాడు. వారిని ఆ మహర్షులు అందరూ వెంబడించినారు.

7

సుతీక్ష్ణుని ఆశ్రమము

ఆ పరంతపుడు రాముడు సీతాలక్ష్మణులతోనూ, వైఖానసాది బ్రాహ్మణులతోనూ సుతీక్ష్ణుడి ఆశ్రమానికి బయలుదేరినాడు. వారు జలప్రవాహాలను

దాటి మహామేఘము వలె ఎంతో ఎత్తుగానూ, విశాలముగానూ ఉన్న పర్వతప్రాంత సాంద్రారణ్యములోకి పోయినారు. అది భయంకరారణ్యముగా తోచింది. ఫల పుష్ప వృక్షాలు అక్కడ సమృద్ధముగా ఉన్నవి. ఒక ఏకాంత ప్రదేశములో వల్కలాలతో ఆశ్రమము కనిపించినది. అక్కడికి పోయినారు. సుఖాసీనుడు అయి ఉన్న సుతీక్ష్ణుణ్ణి చూచినారు. బహుకాలము నుంచీ తపస్సుచేసుకొంటూ ఉన్నందువల్ల ఆయన దేహము అంతా బురదకొట్టుకొని ఉంది. జడలు అన్నీ దుమ్ముకొట్టుకొని ఉన్నవి.

"ఓ మహాత్ముడా! నీవు ధర్మజ్ఞుడవు అనీ, అమోఘతపఃప్రభావుడవు అనీ నీ దర్శనము చేయడానికి వచ్చినాను. నా పేరు రాముడు. నేను నమస్కారము చేస్తున్నాను. నన్ను ఆశీర్వదించ ప్రార్థిస్తున్నాను" అని చెప్పుకోగానే, సుతీక్ష్ణమహాముని కన్నులు తెరచి ఆ పరమధార్మికుణ్ణి, ఆ మహాపరాక్రమశాలిని రాముణ్ణి చూచి, రెండు చేతులా కౌగిలించుకొని, "ఓ రామా! నీకు స్వాగతము. నీవు ధర్మవేత్తలలో శ్రేష్ఠుడవు. ఈ ఆశ్రమము ఇంతవరకూ అనాధముగా ఉంది. ఇప్పుడు నీవు వచ్చినందువల్ల ఇది సనాధము అయింది. ఓ రామా! ఓ మహాయశా! నిన్ను నేను ఎదురుచూస్తూ ఉన్నాను. అందువల్ల, నేను ఈ దేహము వదిలిపెట్టి దేవలోకము పోకుండా కూర్చున్నాను. నీవు రాజ్యభ్రష్టుడవు అయి, చిత్రకూటము చేరింది మొదలు నిన్ను గురించి వింటున్నాను.

"రామా! దేవేంద్రుడు ఇక్కడకు వచ్చినాడు. నా పుణ్యకర్మవల్ల నేను సర్వలోకాలనూ జయించినాను అని చెప్పినాడు. నాయనా! నేను నా తపోబలముతో జయించిన లోకాలను అన్నింటినీ నీకు ఇస్తాను. నీవు నీ భార్య సీతాదేవితోనూ, నీ తమ్ముడు లక్ష్మణుడితోనూ ఆ లోకాలలో విహరించు" అని చెప్పినాడు.

ఈ విధముగా చెప్పిన తపశ్శాలిని, సత్యవాదిని సుతీక్ష్ణుణ్ణి, కాశ్యపుడు బ్రహ్మదేవుణ్ణి వలె చూచి రాముడు, "ఓ మహర్షీ! ఆ యా లోకాలను నేనే స్వయముగా సంపాదించుకొంటాను. నేను ఇక్కడ ఈ అడవిలో నివసించడానికి, ఏది అయినా చోటు చెప్పితే చాలును. స్వామీ! తాము అన్నిటా సమర్థులు అనీ, సర్వప్రాణికోటికీ మేలు చేసే వారు అనీ గౌతమవంశీయుడు శరభంగమహర్షి నాకు చెప్పినాడు" అన్నాడు.

రాముడు చెప్పిన ఈ మాటలకు ఆ లోకప్రసిద్ధుడు సుతీక్ష్ణుడు మహదానందముతో మధురముగా, "రామా! ఈ ఆశ్రమానికి మహర్షులు వస్తూ ఉంటారు. కందమూలఫలాలు ఇక్కడ ఎప్పుడూ సమృద్ధముగా దొరుకుతవి. ఈ ఆశ్రమమే బాగుంటుంది. నీవు ఇక్కడనే ఉండవలసింది. అయితే, ఓ మహాయశా! మృగ సమూహాలు ఏ భయమూ లేకుండా ఇక్కడికి వచ్చి తిరుగుతూ, ఇక్కడి వారిని

వ్యామోహపెట్టి (తపోభంగముచేసి) పోతూ ఉంటవి. ఇక్కడ ఈ మృగాలబాధ తప్ప మరి ఏ ఇతర దోషమూ లేదు" అని చెప్పినాడు.

అప్పుడు ఆ ధీరుడు రాముడు వింటిత్రాటిని మ్రోగిస్తూ, "ఆ మృగ సమూహాలు నేను ఉండగా వచ్చేటట్టయితే, వజ్రాయుధకాంతులతోపోయే కఱకు అయిన అంచుల బాణాలు వదిలి, నేను వాటిని చంపివేస్తాను. అందువల్ల, మిమ్ములను కష్టపెట్టినవాణ్ణి అవుతాను. అంతకన్నా బాధ నాకు ఏమి ఉంటుంది? అందువల్ల, తమ ఈ ఆశ్రమములో ఆట్టే సేపు ఉండడము నాకు ఇష్టము లేదు" అంటూ సాయంసంధ్యను ఉపాసించడానికి లేచినాడు.

ఆ రాత్రికి రాముడు సీతాలక్ష్మణులతో సుతీక్ష్ణుడి ఆ రమణీయాశ్రమములో గడప తలచుకొన్నాడు.

చీకటిపడపోతూ ఉండగా, సుతీక్ష్ణుడు సీతారామలక్ష్మణులకు తాపసులు తినే అన్నము స్వయముగా పెట్టినాడు. వారిని చక్కగా సత్కరించినాడు.

8

రామలక్ష్మణులు ఆ రాత్రి సుతీక్ష్ణుడి ఆశ్రమములో సుఖముగా గడపి, ఉషఃకాలాన్నే నిద్రలేచినారు. కాలాతిక్రమణము చేయకుండా, రాముడు సీతాదేవితో కలువపూల ఘుమఘుమలు గుబాళిస్తున్న చెరువులో చల్లటి నీళ్ళలో స్నానము చేసినాడు. సీతారామలక్ష్మణులు విగతకల్మషులు అయి అగ్నిహోత్రుణ్ణి, దేవతలను ఆరాధించి ఉదయిస్తూ ఉన్న సూర్యుడిని చూచి సుతీక్ష్ణుడి దగ్గరకు పోయి, "ఓ మహాత్మా! పరమపూజ్యుడవు అయిన నీవు మమ్ములను పూజించినావు. మేము రాత్రి ఇక్కడ సుఖముగా గడపినాము. తమకు వీడ్కోలు చెప్పి పోవడానికి వచ్చినాము. మా వెంట వచ్చిన మహర్షులు మమ్ములను తొందర చేస్తున్నారు. ఈ దండకారణ్యములో ఉన్న పుణ్యశీలురనూ, వారి ఆశ్రమాలనూ వెంటనే చూడవలెను అనుకుంటున్నాను. జ్వాలలు లేని అగ్నిహోత్రాలవంటి ఈ మునిపుంగవులతో, ఈ ధర్మనిత్యులతో, ఈ తపోదాంతులతో మేము పోవడానికి తాము అనుమతించవలెను. నడమంత్రపుసిరి వచ్చిన రాజువలె, సూర్యుడు ఆకాశము ఎక్కి మిటమిటలాడే లోపలనే మేము ప్రయాణము అయిపోవలెను" అని చెప్పి, సుతీక్ష్ణుడికి సాష్టాంగ నమస్కారము చేసినారు. సుతీక్ష్ణుడు స్నేహాతిశయముతో రామలక్ష్మణులను లేవనెత్తి గట్టిగా కౌగలించుకొని, "రామా! నీవు నీ నీడవలె నిన్ను అనుసరిస్తున్న నీ భార్య సీతతోనూ, నీ తమ్ముడు లక్ష్మణుడితోనూ నిరుపద్రవము అయిన దారిపట్టి పో! ఓ వీరుడా! ఈ దండకారణ్యములో పరమాత్మ ధ్యానపరాయణులు అయిన తాపసుల రమణీయాశ్రమాలను అన్నిటినీ చూడు. నాయనా! అక్కడ ఫలమూలాలు సమృద్ధముగా

ఉంటవి. మృగాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఉంటవి. పరస్పరవైరము లేకుండా పక్షిగణాలు ప్రశాంతముగా ఉంటవి. చెరువులలోనూ, కొలనులలోనూ తామరలు విరగపూసి ఉంటవి. నీళ్లు నిర్మలముగా ఉంటవి. నీరుకోళ్ళు సంతోషముగా విహరిస్తూ ఉంటవి. కొండవాగులు నేత్రపర్వముగా ప్రవహిస్తూ ఉంటవి. నెమళ్ళు అరుస్తూ, ఆడుతూ ఉంటవి. ఆ అడవులు మనోహరముగా ఉంటవి. నాయనా! నీవు నీ భార్యతోనూ, తమ్ముడితోనూ పో. మీరు మళ్ళీ ఒకసారి నా ఆశ్రమానికి రావలెను సుమా!" అన్నాడు.

"అట్లాగేను" అని చెప్పి, సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణుడికి ప్రదక్షిణముచేసి ప్రయాణసన్నద్ధులు అయినారు. అప్పుడు ఆ అన్నదమ్ములకు ఆ విశాలనేత్ర సీతాదేవి అమ్ముల పొదులూ, విండ్లూ, ఖడ్గాలూ అందించింది. వారు మంగళకరములు అయిన అమ్ముల పొదులు కట్టుకొని ధనుస్సుల ధ్వనులతో ఆ ఆశ్రమములోనుంచి బయలుదేరినారు.

9

సీత ధర్మోపదేశము

సుతీక్ష్ణ మహాముని అనుమతితో రాముడు బయలుదేరుతూ ఉండగా సీతాదేవి స్నేహపూర్వకముగానూ, హృదయంగమముగానూ రాముడితో, "ప్రభూ! తాము మహాత్ములు అయినప్పటికిన్నీ అతిసూక్ష్మముగా ఆలోచించి చూస్తే, తాము ఇప్పుడు అధర్మానికి పాల్పడపోతున్నట్లుగా ఉంది. కామజవ్యసనాలను మూటినీ వర్జిస్తేనే ధర్మము ప్రాప్తము అవుతుంది. కామజవ్యసనాలలో మిథ్యాభాషణము గొప్ప వ్యసనము. అంతకన్నా పరదారాభిగమనమూ, అకారణ రౌద్రమూ గొప్ప వ్యసనాలు. నాథా! తాము ఇదివరకు ఎన్నడూ అబద్ధము ఆడి ఎరుగరు. ఇకను అబద్ధము ఆడపోయేది లేదు. ధర్మనాశముచేసే పరదారాభిలాష తమకు లేనేలేదు. తమకు అటువంటిది ఎప్పుడూ ఉండదు. మనసులో అయినా తమకు అటువంటి బుద్ధి పుట్టదు. ధర్మిష్ఠులూ, సత్యసంధులూ అయినందువల్ల తాము స్వదారనిరతులూ, పిత్రాజ్ఞాపరిపాలకులూ అయినారు. ఓ మహాభాగా! తమలో సత్యమూ, ధర్మమూ మూర్తీభవించినవి. తాము లక్ష్మణుడికన్నా పెద్దలు అయినందువల్ల, వైరాగ్యములో కూడా తామే అతనికన్నా పెద్దలు అయినారు. సమస్త సద్గుణాలూ తమలో పాదుకొని పోయినవి. తమకు ఉన్నన్ని సద్గుణాలు జితేంద్రియులకు తప్ప మరి ఎవరికీ ఉండవు. తమ వశ్యేంద్రియత్వము నేను ఎరుగుదును. అందుకు శుభరూపమే సాక్షి.

"ఓ మహాభాగా! వైరము లేకుండా ప్రాణిహింస చేయడము రౌద్రవ్యసనము. తాము ఇప్పుడు పరాక్రమవ్యామోహమునుంచి తమకు వైరము లేకపోయినప్పటికిన్నీ,

ఋషులను కాపాడడానికి రాక్షసులను వధిస్తాము అని ప్రతిజ్ఞ చేసినారు. అందుకోసమే తాము తమ తమ్ముడితో కూడా ధనుర్ధరులు అయి ఈ దండకారణ్యములోకి బయలుదేరుతున్నారు. ఇట్లా బయలుదేరిన మిమ్ములను చూస్తూ మీ సత్యప్రతిజ్ఞ, మీ ఏకపత్నీవ్రతము మొదలు అయిన మీ నడవళ్ళను గురించీ, మీ క్షేమాన్ని గురించీ ఆలోచించిన కొద్దీ నా మనస్సు తల్లడిల్లిపోతూ ఉంది. నా దిగులు చెప్పలేకుండా ఉన్నాను. మీరు ఇందుకు దండకలో తిరగడము నాకు ఇష్టములేదు. కారణము చెప్పుతాను, వినవలెను. మీరు పరమపరాక్రమవంతులు. మీరు మీ తమ్ముడితో కూడా ధనుర్బాణధరులు అయి ఉన్నారు. అందువల్ల, మీకు కనపడే రాక్షసులు అందరి మీదనూ మీరు బాణాలు వదులుతారు.

"నాథా! అగ్నిహోత్రుడు సమీపములో కట్టెలు ఉంటే విజృంభిస్తాడు. అదే విధముగా క్షత్రియుడు చేతిలో ఆయుధము ఉంటే విజృంభిస్తాడు. ఈ సందర్భములో నేను విన్న ఒక కథ చెప్పుతాను. మృగ పక్షి సమూహాలు సంతోషముగా సంచరించే ఒక పవిత్రవనములో పూర్వము ఒకప్పుడు ఒక ఋషి తపస్సు చేసుకొంటూ ఉండేవాడు. అతడు పరిశుద్ధుడు. సత్యసంధుడు. దేవేంద్రుడు ఆ ఋషి తపస్సు విఘ్నము చేయడానికి ఒక భటుడి వేషము వేసుకొని, ఒక ఖడ్గము తీసుకొని ఆ ఋషి దగ్గరకు పోయినాడు. మహోగ్రముగా తపస్సు చేసుకొంటూ ఉన్న ఆ ఋషిని చూచి దేవేంద్రుడు తన నిశితాయుధాన్ని దాచిపెట్టి, అడిగినప్పుడు ఇవ్వమని ప్రార్థించినాడు. ఆ ఋషి అందులకు అంగీకరించి, ఆ ఖడ్గాన్ని తీసుకొన్నాడు. అది తన దగ్గర న్యాసముగా ఉంచినందువల్ల, ఆ ఋషి ఎప్పుడూ ఏమరకుండా ఆ ఖడ్గాన్ని దగ్గరనే ఉంచుకొన్నాడు. ఫలమూలాదులు తెచ్చుకోవడానికి పోయినా, ఆ ఋషి ఆ ఖడ్గాన్ని వెంట తీసుకొని పోయేవాడు. ఎప్పుడూ ఆయుధము చేతిలో ఉండడమువల్ల, కాలక్రమేణా ఆ ఋషి తపస్సు చేయడము తగ్గించినాడు. ఆ ఋషి బుద్ధి చలించింది. రౌద్రాభిరతుడు అయినాడు. ధర్మబుద్ధి కృశించిపోయింది. ప్రమత్తుడు అయినాడు. ఆయుధ సహవాసమువల్ల చివరకు ఆ ఋషికి ఒండ్లు తెలియకుండా పోయింది. ప్రాణిహింస చేయడము మొదలుపెట్టినాడు. అధర్మానికి ఒడికట్టినాడు. నరకానికి పోయినాడు. అందువల్ల, 'అగ్ని సంబంధము వంటిదే ఆయుధ సంబంధము' అని పెద్దలు చెప్పుతూ ఉంటారు.

"ప్రభూ! మీ మీద నాకు ఉన్న గౌరవమునుంచీ, స్నేహమునుంచీ మీకు తెలిసిన ధర్మాన్నే మీకు జ్ఞాపకము చేస్తున్నాను. కాని, నేను ధర్మబోధ చేయడములేదు. మీరు ధనుర్ధరులు అయి ఈ దండకారణ్యములో రాక్షసులను అకారణముగా చంపివేడము అకార్యము. మీరు ఈ రౌద్రబుద్ధి ఎట్లాగు అయినా వదులుకోవలెను. అపరాధము చేయనివారిని మీరు చంపడము నాకు ఇష్టము లేదు.

"ఓ వీరా! అడవిలో ఆపన్నులు అయిన ఋషులను రక్షించటానికి ధనుస్సు ఉపయోగించవలెను కాని, అకారణముగా రాక్షసులను చంపడానికి ఉపయోగించ కూడదు. ఆయుధము ఎక్కడ, అడవి ఎక్కడ? క్షాత్రము ఎక్కడ, తపస్సు ఎక్కడ? ఇవి పరస్పర విరుద్ధాలు. మనము దేశధర్మాన్ని గౌరవించవలెను. ఈ అడవిలో మనము తపస్సు చేయవలెను. ఆయుధ ధారణమువల్ల రౌద్రబుద్ధి పుట్టుతుంది. మనము తిరిగి అయోధ్యకు పోయినప్పుడు మీరు ఆయుధాలను ధరించవచ్చును. క్షత్రధర్మము అవలంబించ వచ్చును. తాము రాజ్యము వదులుకొని వచ్చినారు. తాము నిరతమూ ఋషులే అయ్యేటట్లయితే, మా అత్తగారు (కైకేయీదేవి) అక్షయముగా సంతోషిస్తుంది.

"ప్రభూ! ధర్మమువల్ల అర్థము సమకూరుతుంది. ధర్మమువల్ల సుఖము సమకూరుతుంది. ఈ జగత్తుకు అంతటికీ ధర్మమే మూలము. అందువల్ల, సమర్థులు అయినవారు అనేక నియమాలతో, వ్రతోపవాసాదులతో శరీరాన్ని కృశింపచేసి ధర్మము సంపాదించుకొంటున్నారు. సుఖములోనుంచి సుఖము రాదు.

"ఓ శాంతుడా! తమకు తెలియనిది ముల్లోకాలలోనూ ఏమీ లేదు. తమది పరిశుద్ధము అయిన బుద్ధి. ఈ తపోవనములో తామూ ధర్మాచరణకే పూనుకోవలెను.

"ఓ ప్రభూ! స్త్రీ సహజమైన చాపల్యమువల్ల నేను ఇది అంతా చెప్పినాను. తమకు ధర్మము ఉపదేశించే సామర్థ్యము ఈ జగత్తులో ఎవరికి ఉంది? తాము తమ తమ్ముడితో కూడా చక్కగా ఆలోచించి, ఏది ధర్మము అని తమకు తోస్తుందో దానినే చేయవలసింది. ఆలస్యము చేయవద్దు" అని చెప్పింది.

10

సీతాదేవి భర్తృభక్తితో చెప్పింది అంతా ఆ ధర్మాత్ముడు రాముడు విన్నాడు. "ఓ దేవీ! నీవు జనకమహారాజు కూతురవు. సమస్త ధర్మాలూ తెలుసుకొన్నావు. నీకు నా మీద ఉన్న స్నేహానికీ, నీ వంశగౌరవానికీ తగినట్టు నాకు హితము చెప్పినావు. ఎవరూ ఆపన్నులు కాకుండా ఉండడానికి క్షత్రియులు ధనుర్ధరులు అవుతారు అని నీవే చెప్పినావు. ఇక నేను ఏమి చెప్పేది? ఈ దండకారణ్యములో ఉంటూ ఉన్న మునులు అందరూ సంశ్రితవ్రతులు. వారికి అందరికీ ఒక రక్షకుడు కావలసివచ్చి, వారి అంతట వారే బయలుదేరి నా దగ్గరకు వచ్చినారు. నన్ను శరణు జొచ్చినారు. వారు అందరూ ధర్మాత్ములు. మూలాఫలాహారులు. క్రూరకర్ములు అయిన రాక్షసులకు వారు భయపడిపోయినారు. వారికి సుఖము లేకుండా పోయింది. వారు అందరూ నియమబద్ధులు అయి తపస్సు చేసుకొంటూ ఉండే ఆ యా కాలాలలో నరమాంసభక్షకులు అయిన రాక్షసులు పోయి వారిమీదపడి, వారిని చంపివేసి తినడము

మొదలు పెట్టినారు. రాక్షసులు వారిని అట్లా భక్షించి వేస్తూ ఉంటే, వారు ఆ బాధలు పడలేక నా దగ్గరకు వచ్చి అనుగ్రహించవలసినది అని నన్ను వేడుకొన్నారు. నా అంతట నేనే పోయి ఉపాసించవలసిన ఆ మహర్షులు నా దగ్గరకు వచ్చి నన్ను వేడుకొంటూ ఉంటే, నాకు వల్లమాలిన సిగ్గు వేసింది. అంతట నేను వారికి పాదాభివందనముచేసి నన్ను క్షమించవలసింది అనీ, నేను ఏమి చేయవలెనో చెప్పవలసింది అనీ వారిని అందరినీ అడిగినాను.

అంతట ఆ మహర్షులు అందరూ చేరి, "ఓ రామా! ఈ దండకారణ్యములో కామరూపులు అయిన రాక్షసులు అనేకమంది మమ్ములను బాధ పెడుతున్నారు. నీవు మమ్ములను కాపాడవలెను. వాండ్లు అందరూ ఏమాత్రము ఎదిరించను అలవికాని మాంసాహారులు. వాండ్లు హోమకాలాలలోనూ, దర్శపౌర్ణమాసాది పర్వకాలాలలోనూ వచ్చి మా క్రతువులను చెడకొట్టుతున్నారు. మమ్ములను నానా బాధలూ పెట్టుతున్నారు. మేము తాపసులము అయినప్పటికిన్నీ, గతిలేనివాండ్లము అయిపోయినాము. మేము వెదుకుకొంటూ నీ దగ్గరకు వచ్చినాము. నీవే మాకు పరమగతివి. మేము మా తపోబలముతో ఆ రాక్షసులను అందరినీ చంపివేయ గలము. అయితే, తపస్సు అందరికీ అలవి అయిన పని కాదు. ఎన్నో విఘ్నాలు వస్తూ ఉంటవి. తపస్సిద్ధులు కావడము ఎంతో కష్టము అయిన పని. కష్టపడి సంపాదించుకొన్న మా తపోబలము రాక్షసుల కోసము వ్యర్థము చేయడము మాకు ఇష్టము లేదు. అందువల్ల రాక్షసులు మమ్ములను ఎన్ని బాధలు పెట్టినా, మేము శాపము పెట్టకుండా ఊరక ఉంటున్నాము. ఓ రామా! నీవూ, నీ తమ్ముడూ వచ్చి ఋషులము అయిన మమ్ములను కాపాడవలెను. ఈ అడవిలో నీవు తప్ప మా నాథుడు ఎవడూ లేడు. నీవే మా నాథుడవు" అని చెప్పినారు.

"ఓ జానకీ! నేను ఆ మహర్షులు చెప్పింది అంతా విన్నాను. ఈ దండకారణ్యములో ఉన్న ఋషులను అందరినీ అన్నివిధాలా రక్షిస్తాను అని ప్రతిజ్ఞ చేసినాను. నేను చేసిన ప్రతిజ్ఞ బ్రతికి ఉండగా తప్పను. అందులో మహర్షులకోసము నేను ప్రతిజ్ఞ చేసినాను. సీతా! నా సత్యవ్రతము నీవు ఎరుగుదువు. నేను నా ప్రాణము అయినా వదలుకొంటాను. నిన్ను అయినా వదలుకొంటాను. లక్ష్మణుణ్ణి అయినా వదలుకొంటాను. కాని, నా సత్యము వదలుకొనను. ఎవరికి అయినా ఒక ప్రతిజ్ఞ చేస్తే, ఆ ప్రతిజ్ఞ ఎప్పుడూ తప్పను. అందులో విశేషించి బ్రహ్మవేత్తలకు చేసిన ప్రతిజ్ఞ అసలే తప్పను. ఓ జానకీ! మహర్షులు అందరూ వారి అంతట వారు వచ్చి నన్ను యాచించక పోయినా, నేను వారిని అందరినీ అవశ్యమూ కాపాడవలెను. అది నా ధర్మము. అటువంటి సందర్భములో వారే వచ్చి నన్ను ప్రార్థించినారు. నేను వారిని అందరినీ కాపాడుతాను అని ప్రతిజ్ఞ చేసినాను. ఇక నేను చెప్పేది ఏమీ లేదు.

"ఓ మైథిలీ! నీకు నా మీద ఉన్న స్నేహమునుంచీ, నీ సౌహార్దమునుంచీ నీకు తోచింది నీవు చెప్పినావు, సంతోషము. ఎవరు అయినా తమ ఇష్టులకే హితము చెప్తుతారు కాని, అయిష్టులకు చెప్పరుకదా! నీవు చెప్పింది నీ వంశానికీ, నీ అంతరాత్మకూ అనురూపముగా ఉంది. నీవు నాకు నా ప్రాణముకన్నా గొప్పదానవు. అయితే, నీవు నా సహధర్మచారిణివి. నేను ఏ ధర్మము అనుసరిస్తే నీవూ ఆ ధర్మమే అనుసరించవలెను" అంటూ ఆ ధైర్యవంతుడు, ఆ ధనుర్ధరుడు రాముడు తన ప్రియురాలు అయిన జనకరాజపుత్రికకు చెప్పి తమ్ముడితో కూడ రమణీయము అయిన తపోవనానికి బయలుదేరినాడు.

11

పంచాప్సర సరోవర సందర్శనము

రాముడు ముందు నడచినాడు. అతని వెనుక విల్లూ, అంబులూ తీసుకొని లక్ష్మణుడు బయలుదేరినాడు. వారి ఇద్దరి మధ్యనూ ఆ సుమధ్యమ సీతాదేవి నడిచింది. వారు నానావిధపర్వతసానువులనూ, వనాలనూ, ఎన్నో నదులనూ, ఆ నదుల ఇసుక దిబ్బలమీద తిరిగే హంసలనూ, చక్రవాకపక్షులనూ, రకరకాల జలపక్షులతో ఉన్న తామరకొలనులనూ, గుంపులు గుంపులుగా తిరుగుతూ ఉన్న జింకలనూ, మదము ఎక్కి విచ్చలవిడిగా పెద్ద పెద్ద కొమ్ములతో తిరుగుతూ ఉన్న అడవిదున్నలనూ, అడవిపందులనూ, చెట్లను పెళ్ళగించి వేస్తూ ఉన్న ఏనుగులనూ చూస్తూ సూర్యాస్తమయము అయ్యేవరకూ నడిచినారు. అక్కడ ఒక యోజనము వైశాల్యాన ఉన్న చెరువును ఒకదాన్ని చూచినారు. ఆ తటాకమునిండా తెల్లతామరలూ, ఎర్రతామరలూ విరగపూసి ఎంతో సొగసుగా ఉన్నవి. ఒడ్డున ఏనుగుల మందలు తిరుగుతూ ఉన్నవి. సారసపక్షులూ, రాజహంసలూ, కలహంసలూ మధురగానము చేస్తూ ఉన్నవి. జలాలు నిర్మలముగా కనిపించినవి. ఆ రమ్యసరస్సులోనుంచి సంగీతాలూ, జంత్రవాద్యాలూ వినిపించినవి. అయితే అక్కడ ఏ ఒక్క వ్యక్తిన్నీ కనిపించలేదు. అంతట రాముడున్నూ, లక్ష్మణుడున్నూ అతి కుతూహలముతో 'ధర్మభృత్తు' అనే మహర్షిని చూచి, "ఓ మహామునీ! ఈ తటాకము అత్యద్భుతముగా ఉంది. ఇక్కడ ఎవరూ కనిపించకపోయినప్పటికిన్నీ, ఈ చెరువులో నుంచి జంత్రగాత్రగానము వినపడుతున్నది. ఇది ఏమిటో తెలుసుకోవలెను అని మాకు ఎంతో కూతూహలముగా ఉంది. చెప్పకూడని అంత రహస్యము కాకపోయినట్లయితే మాకు చెప్పవలెను" అని అడిగినారు.

ధర్మభృత్తు, "రామా! ఈ తటాకము పేరు పంచాప్సరము. ఈ సరస్సులో నుంచి గీతవాద్యధ్వనులు ఎప్పుడూ వినబడుతూ ఉంటవి. దీనిని మాండకర్ణిమహర్షి

తన తపోబలముతో నిర్మించినాడు. ఆ మహానుభావుడు పదివేలసంవత్సరాలు నీళ్ళలో ఉంటూ, వాయుభక్షణము చేస్తూ తీవ్రము అయిన తపస్సు చేసినాడు. ఆ తపస్సుకు అగ్నిహోత్రుడు మొదలు అయిన దేవతలు అందరూ భయపడిపోయినారు. వారు అందరూ సమావేశము అయి ఆలోచించినారు. తమలో ఎవరిదో ఒకరి స్థానము కోసము మాండకర్ణి ఆ విధముగా తపస్సు చేస్తున్నాడు అని నిశ్చయించినారు. అంతట వారు మాండకర్ణి తపస్సు విఘ్నము చేయడానికి మెరుపుతీగెలవలె తళతళలాడే అయిదుగురు అప్సరసలను పంపించినారు. ఆ అయిదుగురూ అప్సరసలలో ప్రధానము అయినవారు. దేవకార్యము నెరవేర్చడానికి వారు ఆ మహర్షి దగ్గరకు పోయినారు. మంచిచెడ్డలు అన్నీ తెలిసిన ఆ మాండకర్ణి మహాముని మన్మథపరవశుడు అయ్యేటట్టు ఆ అప్సరసలు చేసినారు. ఆ అయిదుగురూ ఆయనకు భార్యలు అయినారు. ఆ అప్సరసలతో నివసించడానికి అప్పుడు మాండకర్ణి మహర్షి ఈ తటాకములో బయటికి కనపడకుండా వుండే భవనము తన తపోబలముతో నిర్మించినాడు. తన తపోబలమువల్ల ఆ మహాముని యువకుడున్నూ అయినాడు. ఆ అయిదుగురు అప్సరసలున్నూ యథాసుఖముగా ఆయనను రమింపచేస్తున్నారు. వారు క్రీడిస్తున్నందు వల్ల వారి ఆభరణాల ధ్వనులతో కలసిన జంత్రగాత్ర ధ్వనులు ఆ చెరువులోనుంచి ఎప్పుడూ వినపడుతూ ఉంటవి" అని ఆ చెరువు పుట్టుకను గురించి చెప్పినాడు.

ఈ విధముగా ధర్మభృత్తు చెప్పింది విని రామలక్ష్మణులు ఆశ్చర్యపడి పోయినారు. ఆ తటాకాన్ని గురించి ఇట్లా చెప్పుతూ ఉన్న కథ వింటూ నడుస్తూ ఉండగా దర్భలతోనూ, వల్కలాలతోనూ, బ్రహ్మతేజముతోనూ తేజరిల్లుతూ ఉన్న తాపసాశ్రమమండలము ఒకటి వారి ఎట్టఎదుట కనిపించింది. ఆ మహాయశుడు రాముడు సీతాలక్ష్మణులతో ఆ ఆశ్రమమండలములోనికి పోయినాడు. అక్కడ ఋషులు అందరూ వారిని సమ్మానించినారు. శ్రీమంతము అయిన ఆ ఆశ్రమాలలో ఋషుల సపర్యలు అందుకొంటూ, ఆ మహాస్త్రవేత్త రాముడు రాక్షసబాధ పోగొట్టడానికి ఒక్కొక్క మహర్షి ఆశ్రమములో రెండేసి పర్యాయములు నివసించినాడు. అట్లా ఒక ఆశ్రమములో పదమూడు మాసాలూ, ఒక ఆశ్రమములో ఒక సంవత్సరమూ, ఒకచోట నాల్గు మాసాలూ, ఒకచోట అయిదు మాసాలూ, ఒకచోట ఏడు మాసాలూ, ఒకచోట ఒకటింపాతిక మాసమూ, ఒకచోట ముప్పాతిక మాసమూ, ఒకచోట మూడు మాసాలూ సుఖముగా, సంతోషముగా కాలము గడుపుతూ ఉండగా పదిసంవత్సరాలు ఇట్టే అయిపోయినవి.

అంతట ఆ ధర్మజ్ఞుడు, ఆ కాంతిమంతుడు రాముడు సీతాలక్ష్మణులతో మళ్ళీ సుతీక్ష్ణుడి ఆశ్రమానికి పోయినాడు. అక్కడ మునులు అందరూ ఆ అరిందముణ్ణి

పూజించినారు. ఆ ధర్మాత్ముడు అక్కడ కొంతకాలము ఉన్నాడు. ఒకనాడు ఆ సుతీక్ష్ణమహర్షిని చూచి, "ఓ మహర్షీ! ఈ వనములోనే మహాత్ముడు అగస్త్యమహర్షి ఉంటూ వున్నాడు అని వారూ వీరూ చెప్పుకొంటూ వుంటే విన్నాను. ఈ అడవి చాలాపెద్దది. నాకు దారి తెలియదు. ఆ మహాత్ముడి ఆశ్రమానికి ఇక్కడినుంచి ఎటుపోవలెనో తాము సెలవు ఈయవలెను. నేను సీతాలక్ష్మణులతో పోయి అగస్త్య మహాముని దర్శనముచేయవలెను అనీ, ఆ మహానుభావుడికి మ్రొక్కవలెను అనీ, ఆ మహాత్ముడికి సేవచేయవలెను అనీ అనుకొంటున్నాను" అన్నాడు.

సుతీక్ష్ణమహర్షి అందుకు సంతోషించి, "రామా! నీవు సీతా లక్ష్మణులతో పోయి అగస్త్యమహర్షిని చూడవలసింది అని నేనే చెప్పుదాము అనుకొంటున్నాను. దైవాత్తు నీవే అడిగినావు. ఆ మహాత్ముడు వున్న తావు చెప్పుతాను. ఈ ఆశ్రమమునుంచి దక్షిణదిక్కుగా నాలుగు యోజనాల దూరము పోవలెను. అక్కడ పూలచెట్లూ, పండ్లచెట్లూ విరివిగా కనబడుతవి. నానావిధపక్షులూ మధురగానము చేస్తూ ఉంటవి. పిప్పలిచెట్లు శోభాయమానముగా కనిపిస్తవి. కొంచెము మెరకను చెట్లమధ్యను శ్రీమంతము అయిన అగస్త్యభ్రాత ఆశ్రమము వుంది. ఆ ఆశ్రమప్రాంతములో నిర్మలోదకాలతో తామరకొలనులు ఎన్నో ఉన్నవి. హంసలూ, చక్రవాకపక్షులూ, నీరుకోళ్ళూ ఆ కొలను దగ్గర ఉంటవి.

"రామా! నీవు ఆ అగస్త్యభ్రాత ఆశ్రమములో ఆ రాత్రి ఉండి, ఉదయమే లేచి అక్కడనుంచి దక్షిణదిక్కుగా పెద్ద పెద్ద చెట్ల ప్రక్కను ఉన్న దారిన ఒక యోజనము పోతే అగస్త్యాశ్రమము కనబడుతుంది. మహారమణీయము అయిన మహావృక్షాలమధ్య ఆ ఆశ్రమము ఉంది. నీవు నీ భార్యతోనూ, లక్ష్మణుడితోనూ అక్కడ సుఖముగా ఉండవచ్చును.

"రామా! నీకు ఆ మహానుభావుణ్ణి అగస్త్యుణ్ణి చూడవలెను అని బుద్ధి పుట్టింది. కనుక, ఇకను ఏ మాత్రమూ ఆలస్యము చేయకుండా ఇప్పుడే బయలుదేరి పోవడము మంచిది" అని చెప్పినాడు.

అంతట సీతారామలక్ష్మణులు ఆ సుతీక్ష్ణమహర్షికి నమస్కారముచేసి అగస్త్యాశ్రమానికి ప్రయాణము అయినారు. రమణీయము అయిన వనాలూ, మహా మేఘాలవంటి పర్వతాలూ, నదులూ, సరస్సులూ చూచుకొంటూ సుతీక్ష్ణ మహర్షి చెప్పిన దారిన నడిచి అగస్త్యభ్రాత ఉంటూ ఉన్న ఆశ్రమము దగ్గరకు సుఖముగా పోయినారు. రాముడు సంతోషముతో, "లక్ష్మణా! ఇదే మహాత్ముడూ, పుణ్యకర్ముడూ అయిన అగస్త్య మహర్షి తమ్ముడి ఆశ్రమము. సందేహములేదు. సుతీక్ష్ణమహర్షి చెప్పిన గుర్తులు అన్నీ కనబడుతున్నవి. అవిగో, పండ్లబరువునుంచిన్నీ, పూలబరువు

నుంచిన్నీ వంగిపోయిన చెట్లు వేలకువేలు దారిలో ఉన్నవి. పిప్పలి బాగా పండినందువల్ల గాలికి వగరువాసన కొట్టుతూ ఉంది. అవిగో, ఋషులు తెచ్చుకొన్న కట్టెలమోపులు అక్కడక్కడ కనబడుతున్నవి. అదిగో, ఆ వనమధ్యములో ఉన్న ఆశ్రమమునుంచి ధూమశిఖ నల్లటి మేఘశిఖరమువలె కనబడుతున్నది. అరుగో, బ్రాహ్మణులు. వారు పుణ్యతీర్థాలలో స్నానముచేసి, స్వయముగా కోసి తెచ్చుకొన్న పూలతో పుష్పబలులు ఇస్తున్నారు. తమ్ముడా! సుతీక్ష్ణుడు చెప్పిన దానిని బట్టి నిస్సందేహముగా అగస్త్యుడి తమ్ముడి ఆశ్రమపదము ఇదే. ఈ ఆశ్రమములో ఉంటూ ఉన్న ఆయనగారి అన్న అగస్త్యమహర్షి లోకానికి మేలు చేయవలెను అనే అభిలాషతో మృత్యువును నిగ్రహించి, ఈ దక్షిణదేశాన్ని ఋషులకు నివాసయోగ్యము అయిన ప్రదేశముగా చేసినాడు.

వాతాపి వధ

"ఇల్వాలుడూ, వాతాపీ అనే అన్నదమ్ములు ఇద్దరు రాక్షసులు ఇక్కడ ఉంటూ, బ్రాహ్మణులను చంపివేస్తూ ఉండేవాండ్లు. క్రూరుడు అయిన ఇల్వాలుడు బ్రాహ్మణ వేషముతో సంస్కృతభాషలో మాట్లాడుతూ, శ్రాద్ధము అని చెప్పి బ్రాహ్మణులను పిలిచేవాడు. అప్పుడు వాడి తమ్ముడు వాతాపి మేషరూపము ధరించేవాడు. ఇల్వాలుడు శ్రాద్ధకర్మకు చెప్పినట్లు ఆ మేకమాంసాన్ని వండి బ్రాహ్మణులకు పెట్టేవాడు. ఆ బ్రాహ్మణులు భోజనము చేసిన తరువాత 'వాతాపీ! బయటికిరా' అని కేక వేసేవాడు. అప్పుడు వాతాపి ఆ బ్రాహ్మణుల పొట్టచీల్చుకొని, మేకవలె అరుస్తూ బయటికి వచ్చేవాడు. కామరూపులూ, నరమాంసభక్షకులూ అయిన ఆ అన్నదమ్ములు నిత్యమూ అట్లా చేస్తూ, వేలకొద్దీ బ్రాహ్మణులను చంపివేసినారు. అప్పుడు దేవతలు అగస్త్యుణ్ణి ప్రార్థించినారు. అగస్త్యుడున్నూ ఇల్వలుడి ఆమంత్రణము అంగీకరించి, శ్రాద్ధములో వాతాపిని అందరు బ్రాహ్మణుల వలెనే తినివేసినాడు. శ్రాద్ధాంతాన ఇల్వాలుడు అగస్త్యుణ్ణి, "తృప్తుడవు అయినావా" అని అడిగి, ఉత్తరాపోశనము ఇచ్చి తమ్ముణ్ణి బయటికి రమ్మని ఎప్పటి మాదిరిగా పిలిచినాడు. అప్పుడు ఆ ధీమంతుడు, ఆ మునిశ్రేష్ఠుడు అగస్త్యుడు ఇల్వాలుణ్ణి చూచి నవ్వుతూ 'నేను తిన్నాను. జీర్ణము అయిపోయినాడు. ఈపాటికి యమసదనానికి పోయి ఉంటాడు. నీ తమ్ముడు మేషరూపుడు, ఇక బయటకి ఎట్లా వస్తాడు?' అని అన్నాడు.

"ఇల్వాలుడు క్రుద్ధుడు అయిపోయినాడు. అగస్త్యుణ్ణి హింసించవలెను అనుకొని ఆయనమీద పడపోయినాడు. ఆ మహాతేజోవంతుడు అగస్త్యమహర్షి నిప్పులురాలే చూపు చూచినాడు. దానితో వాడు, ఆ ఇల్వాలుడు అప్పటికి అప్పుడు దగ్ధము అయిపోయినాడు. ఈ కనబడుతున్నది, ఆ మహాత్ముడి తమ్ముడి ఆశ్రమము. తమ్ముడా! తటాకాలతోనూ, మహావృక్షాలతోనూ అది శోభిస్తూ ఉంది" అని చెప్పుతూ

ఉండగా, సూర్యాస్తమయము అయింది. సంధ్యాకాలము వచ్చింది. అంతట రాముడు తమ్ముడితో యథావిధిగా సంధ్యను ఉపాసించినాడు.

అంతట సీతారామలక్ష్మణులు ఆ ఆశ్రమపదములోనికి పోయినారు. ఆ అగస్త్యభ్రాత వారికి చక్కగా స్వాగతము చెప్పి మూలాలూ, ఫలాలూ ఇచ్చినాడు. వారు అవి తిని ఆ రాత్రి అక్కడ వుండి, వేకువనే ప్రాతఃకాలానుష్ఠాలను ముగించుకొని అగస్త్యభ్రాత దగ్గరకు పోయి, "మహాత్మా! నమస్కారము. రాత్రి సుఖముగా కడపినాము. ఇప్పుడు వీడ్కోలు చెప్పడానికి వచ్చినాము. మేము మీ అన్నగారి దర్శనము చేయడానికి పోతున్నాము" అని చెప్పినారు.

ఆ ముని సీతారామలక్ష్మణులకు పోయిరావలసింది అని సెలవు ఇచ్చినాడు.

అగస్త్యాశ్రమ సందర్శనము

సీతారామలక్ష్మణులు ఆ అడవి చూస్తూ, సుతీక్ష్ణుడు చెప్పిన దారిన నడువ సాగినారు. నీవారపు పయిర్లూ, వందలకొద్దీ పనసచెట్లూ, పొగడచెట్లూ, చంద్రచెట్లూ, కానుగచెట్లూ, ఇప్పచెట్లూ, మారేడుచెట్లూ, తుమ్మికిచెట్లూ కనిపించినవి. అవి అన్నీ పూలు పూసినవి. ఆ చెట్లకు అల్లుకొని ఉన్న లతలున్నూ పూసినందువల్ల, ఆ చెట్లు అన్నీ రకరకాల పూలతో చిత్రవిచిత్రాలుగా కనిపించినవి. కొమ్మలను కొన్నిటిని ఏనుగులు తొండాలతో విరుచుకొని తింటూ ఉన్నవి. అంతటా కోతులు చెరలాడుతూ ఉన్నవి. పూలూ, పిందెలూ తిని మత్తెక్కిన పక్షులు గుంపులు గుంపులుగా ఆ చెట్లమీద కూర్చుని మనోహరముగా పాటలు పాడుతూ ఉన్నవి. అప్పుడు ఆ రాజీవలోచనుడు రాముడు వెంటవస్తూ ఉన్న తమ్ముడితో, "లక్ష్మణా! చెట్ల ఆకులు అన్నీ నునుపు తేలినవి. మృగాలూ, పక్షులూ అన్యోన్యవైరము లేకుండా, హాయిగా సంచరిస్తూ ఉన్నవి. ఇది అంతా చూస్తూ ఉంటే, ఆ భావితాత్ముడి ఆశ్రమ సమీపానికి మనము వచ్చినట్టు ఉన్నాము. ఆ మహాత్ముడు వింధ్యపర్వతాన్ని స్తంభింప చేసినందువల్ల 'అగస్త్యుడు' అని లోకములో ప్రసిద్ధి కెక్కినాడు. అగస్త్యమహర్షి ఆశ్రమము ఇదే అయి ఉండవలెను. చెట్లలోనుంచి దట్టము అయిన పొగలు పైకి లేస్తున్నవి. అవిగో, ఆరవేసిన వల్కలాలు అలంకారముగా ఉన్నవి. మృగసమూహాలు ప్రశాంతముగా సంచరిస్తూ ఉన్నవి. రకరకాలపిట్టలు మహామధురముగా పాటలు పాడుతూ ఉన్నవి.

"తమ్ముడా! ఈ మహానుభావుడి ప్రభావమువల్ల రాక్షసులకు దక్షిణదిక్కు అంటే మహాభయము అయిపోయింది. తాము ఇక్కడ అనుభవించేది ఏమీలేదు అని వారు తెలుసుకొన్నారు. ఆ పుణ్యకర్ముడు ఈ దక్షిణదిక్కున నివాసము పెట్టుకొన్నప్పటినుంచీ, రాక్షసులు ఋషులతో వైరము లేకుండా శాంతచిత్తులవలె

ప్రవర్తిస్తున్నారు. ఆ మహాత్ముడు నివసిస్తున్నందువల్లనే, ఈ దక్షిణదిక్కుకు 'అగస్త్యదిక్కు' అనే పేరు వచ్చింది.

"పర్వతాలలో శ్రేష్ఠము అయిన వింధ్యపర్వతము సూర్యుడి మార్గాన్ని అడ్డగిస్తూ పెరిగిపోవడము మొదలుపెట్టింది. అప్పుడు ఈ మహాత్ముడు ఆ పర్వతాన్ని 'అట్లా పెరగవద్దు' అని ఆజ్ఞాపించినాడు. ఈ లోకములో ఈయన అంతటి ప్రసిద్ధకర్ముడు మరి ఒకడు లేడు. ఈయన చిరంజీవి.

"తమ్ముడా! ఈ కనపడుతున్నదే వినయవంతులు సేవించే శ్రీమంతమూ, శ్రమాపహరమూ అయిన అగస్త్యుడి ఆశ్రమము. నేను అగస్త్యమహర్షిని ఆరాధిస్తూ, మిగతా వనవాసకాలము అంతా ఈ ఆశ్రమములో కడపతలచినాను. ఇక్కడ దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, పరమర్షులూ ఆహారాన్ని నిగ్రహించి తపస్సు చేసుకొంటూ ఉన్నారు. అగస్త్యమహర్షిని వారు అందరూ ఎప్పుడూ ఉపాసిస్తూ ఉంటారు. అబద్ధాలు ఆడేవాడుకానీ, క్రూరుడుకానీ, వంచకుడుకానీ, ఘాతకుడుకానీ, శాస్త్రనియమాలను పాటించకుండా యథేష్టముగా ప్రవర్తించేవాడుకానీ ఈ మహర్షి సమక్షములో బ్రతకడు. ఈ అగస్త్యమహాముని మహిమ అటువంటిది. ఈ ఆశ్రమములో దేవతలూ, యక్షులూ, నాగులూ మొదలు అయినవారే కాకుండా, పక్షులు కూడా ధర్మాన్ని పాటిస్తూ నియతాహారముతో నివసిస్తూ ఉంటవి. ఇక్కడ అనేకమంది మహర్షులు తమ దేహములను వదలిపెట్టి నూత్నదేహాలు ధరించి సూర్యసమాన కాంతులతో తేజరిల్లే విమానాలలో స్వర్గలోకానికి పోయినారు. ఈ ఆశ్రమములో అగస్త్య సాన్నిధ్యములో ఆరాధించిన వారిని అనేకమందిని దేవతలు మెచ్చుకొని యక్షత్వమూ, అమరత్వమూ ఇచ్చినారు. వివిధ రాజ్యాధిపత్యాలను కూడా ఇచ్చినారు.

"లక్ష్మణా! మనము ఇప్పుడు అగస్త్యుడి ఆశ్రమానికి వచ్చినాము. నీవు ముందుగా లోపలికి పోయి, 'నేను సీతాసహితముగా వచ్చినాను' అని అగస్త్యమహర్షికి నివేదించవలెను" అని చెప్పినాడు.

12

లక్ష్మణుడు ఆ ఆశ్రమపదములోకి పోయి అగస్త్యమహర్షి శిష్యుణ్ణి ఒకణ్ణి చూచి, "దశరథమహారాజు జ్యేష్ఠపుత్రుడు రాముడు, ఆయన భార్య సీతాదేవితో కూడా వచ్చి ఉన్నాడు. నేను ఆ బలశాలి తమ్ముణ్ణి. నా పేరు లక్ష్మణుడు. నేను ఆయనకు ఇష్టుణ్ణి, అనుకూలుణ్ణి, భక్తుణ్ణి. మమ్ములను గురించి మీరు వినే ఉంటారు. మేము పితృాజ్ఞను శిరసావహించి సీతాదేవితో కూడా ఈ భయంకరారణ్యానికి వచ్చినాము. అగస్త్యమహర్షి దర్శనము చేయవలెను అనే

కోరికతో ఇప్పుడు మేము ఇక్కడికి వచ్చినాము అని ఆ మహాత్ముడికి నివేదించ వలెను" అని చెప్పినాడు.

"అట్లాగేను" అంటూ ఆ అగస్త్యశిష్యుడు రామాగమనాన్ని గురించి చెప్పడానికి వెంటనే అగ్నిహోత్రగృహములోకి పోయి, ఆ దుష్ప్రధర్షుణ్ణి చూచి చేతులు జోడించి, "దశరథమహారాజు పుత్రులు రామలక్ష్మణులు ఇద్దరున్నూ, రాముడి భార్య సీతాదేవియున్నూ మన ఆశ్రమ పదానికి వచ్చి ఉన్నారు. వారు తమకు సేవచేయడానికి వచ్చినట్టున్నూ, తమ దర్శనము ఇప్పించవలెను అనీ నాతో చెప్పినారు. ఇక నేను ఏమి చేయవలెనో తాము సెలవీయవలెను" అన్నాడు.

అరిందములు అయిన రామలక్ష్మణులు మహాభాగ అయిన సీతాదేవితో కూడా వచ్చినారు అని చెప్పగానే అగస్త్యుడు, "శిష్యుడా! సీతారామలక్ష్మణులు పూజనీయులు. వారిని నీవు ఎందుకు లోపలికి తీసుకొని రాలేదు? నా భాగ్యవశమువల్ల రాముడు బహుకాలానికి నన్ను చూడవచ్చినాడు. అతడు ఎప్పుడు వస్తాడా అని నేను ఎదురుచూస్తూ ఉన్నాను. వారిని వెంటనే లోపలికి తీసుకొని రావలసింది" అని చెప్పినాడు.

ఆ ధర్మజ్ఞుడు, ఆ మహాత్ముడు అగస్త్యమహర్షి అట్లా అన్నందువల్ల, చేతులు కట్టుకొని నిలుచుని ఉన్న ఆ శిష్యుడు సంభ్రాంతుడు అయి నమస్కారము చేసి బయటికి పోయి లక్ష్మణుణ్ణి చూచి, "నాయనా! రాముడు ఎక్కడ ఉన్నాడు? అగస్త్యమహర్షిని ఇప్పుడే చూడవచ్చును. ఆయనే రాముణ్ణి చూడవలెను అనుకొంటున్నారు" అని చెప్పినాడు. అంతట లక్ష్మణుడు ఆ శిష్యుణ్ణి ఆశ్రమద్వారము దగ్గరకు తీసుకొనిపోయి సీతారాములను చూపించినాడు. ఆ శిష్యుడు అగస్త్యుడు అన్న మాటలు రాముడితో చెప్పి వినయవిధేయతలతో, ఎంతో గౌరవముతో యథాన్యాయముగా సీతారామలక్ష్మణులను లోపలికి తీసుకొనిపోయినాడు. ఆ ఆశ్రమములో ప్రశాంతముగా ఉంటూ ఉన్న జింకలు మొదలు అయిన మృగాలనూ, ఆ ఆశ్రమాన్నీ, ఆ ఆశ్రమములో బ్రహ్మస్థానాన్నీ, అగ్నిస్థానాన్నీ, విష్ణుస్థానాన్నీ, దేవేంద్రస్థానాన్నీ, సూర్యస్థానాన్నీ, చంద్రస్థానాన్నీ, భగస్థానాన్నీ, కుబేరస్థానాన్నీ, ధాతృస్థానాన్నీ, విధాతృస్థానాన్నీ, వాయుస్థానాన్నీ, శేషస్థానాన్నీ, అనంతునిస్థానాన్నీ, గాయత్రీస్థానాన్నీ, వసుస్థానాన్నీ, పాశహస్తుడు అయిన వరుణునిస్థానాన్నీ, కార్తికేయుడి స్థానాన్నీ, ధర్మస్థానాన్నీ చూస్తూ రాముడు సీతాలక్ష్మణులతో లోపలికి పోయినాడు.

రాముణ్ణి చూచీ చూడటముతో అగస్త్యుడు శిష్యులతోకూడా లేచి ఎదురుగుండా పోయినాడు. మునులను అందరినీ వెంటబెట్టుకొనివస్తూ ఉన్న ఆ

ప్రదీప్తతేజస్విని అగస్త్యుణ్ణి చూచి రాముడు లక్ష్మణుడితో, "తమ్ముడా! అదిగో, ఆ మునులు అందరితో వస్తూ ఉన్న ఆ మహాతేజోవంతుడే అగస్త్యమహర్షి అనుకొంటున్నాను" అని చెప్పి పరమానందభరితుడు అయి ఎదురుగుండా పోయి, ఆ సూర్యసమానతేజోవంతుడి రెండుపాదాలూ పట్టుకొని నమస్కారము చేసినాడు. అతని వెనకనే సీతాలక్ష్మణులన్నూ ఆ మహర్షికి పాదాభివందనము చేసినారు. అంతట రాముడు చేతులు జోడించి నిలుచున్నాడు. ఆ మహాత్ముడు రాముణ్ణి కుశలప్రశ్నచేసి, పాద్యము ఇచ్చి పూజించి, ఆసనము చూపించి కూర్చుండమని చెప్పినాడు. అంతట ఆ మహర్షి అగ్నిని వ్రేల్చి (వైశ్వదేవము చేసి), అర్ఘ్యము ఇచ్చి అతిధులను పూజించి, వానప్రస్థ ధర్మాన్ని అనుసరించి వారికి ఫలమూలాద్యాహారాలు ఇవ్వతలచి, మొట్టమొదటివాడుగా చేతులు జోడించి కూర్చున్న ధర్మకోవిదుణ్ణి రాముణ్ణి చూచి, "వైశ్వదేవముచేసి, అర్ఘ్యముఇచ్చి అతిధిని పూజించవలెను. రామా! తపస్వి అయినవాడు అట్లాకాకుండా మరి ఒకవిధముగా చేసేటట్లయితే, తప్పుడు సాక్ష్యముచెప్పినవాడివలె పరలోకములో తన మాంసాన్ని తానే భక్షిస్తాడు. రామా! నీవు సమస్త లోకాలకున్నూ రాజువు. పరమధార్మికుడవు. మహారథుడవు. పూజనీయుడవు. మాన్యుడవు. నీవు నాకు ఇప్పుడు ప్రియాతిథివిగా వచ్చినావు" అని చెప్పి ఫలమూలాలనూ, ఇంకా ఇతర వన్యద్రవ్యాలనూ, పూలనూ ఇచ్చి యథావిధిగా పూజించి, "రామా! ఇదిగో, రత్న కాంచనాలతో పొదిగిన ఈ దివ్యధనుస్సు విష్ణుమూర్తిది. దీనిని విశ్వకర్మ చేసినాడు. సూర్యసంకాశము అయిన ఈ అమోఘ శరోత్తమాన్ని బ్రహ్మదేవుడు నాకు ఇచ్చినాడు. అగ్నిహోత్రజ్వాలలవంటి అక్షయసాయకాలు ఉన్న ఈ రెండు తూణీరాలనూ, బంగారము ఒరతోనూ బంగారము పిడితోనూ ఉన్న ఈ ఖడ్గాన్ని నాకు దేవేంద్రుడు ఇచ్చినాడు.

"రామా! పూర్వము మహావిష్ణువు ఈ ధనుస్సుతోనే యుద్ధములో మహాసురులను అందరినీ సంహారముచేసి, దేవతలకు రాజ్యలక్ష్మిని తెచ్చిపెట్టినాడు.

"రామా! నీవు మానము కాపాడే మహాత్ముడవు. నీవు శత్రువులను జయించడానికి, దేవేంద్రుడు వజ్రాయుధమునువలె ఈ ధనుస్సునూ, ఈ అమ్ములపొదులనూ, ఈ ఖడ్గాన్నీ తీసికోవలసింది" అని చెప్పి, ఆ మహాత్ముడు ఆ ఆయుధాలను రాముడికి ఇచ్చివేసినాడు.

13

"రామా! లక్ష్మణా! మీరు సీతాదేవిని వెంటపెట్టుకొని నన్ను చూడడానికి వచ్చినారు, సంతోషము. లక్ష్మణా! నీవు మీ అన్నను అనుసరించినావు. నాకు

తృప్తిగా ఉంది. మీకు శుభము అవుతుంది. మార్గాయాసమువల్ల మీ ఒండ్లు చెమటలు పోసినవి. మీరు బాగా అలసిపోయినారు. ఈ జనకరాజసుత, ఈ మైథిలి నలిగిపోయినది. స్పష్టముగా కనపడుతున్నది. ఈమె విశ్రాంతి కోరుతున్నది. ఈమె సుకుమారి. ఎన్నడూ కష్టపడి ఎరుగదు. రామా! భర్తృస్నేహమునుండి ఈమె ఈ ఘోరారణ్యములో బాధలు లెక్కచేయకుండా నీతో బయలుదేరి వచ్చింది. ఈమె ఈ ఆశ్రమములో సంతోషముగా ఉండేటట్లు నీవు చూడవలెను. ఇట్లా భర్తను వెంబడించడము ఈమెకు తప్ప ఏ ఆడదానికీ చేయను అలవికాని పని.

"రామా! స్త్రీలు పెనిమిటి మంచిస్థితిలో ఉన్నంతకాలమూ అనురాగము చూపిస్తూ, సంతోషపెట్టుతూ ఉంటారు. పెనిమిటికి విషమస్థితి వస్తే విడిచిపెట్టి పోతారు. స్త్రీలచిత్తము మెఱుపువలె చంచలిస్తూ ఉంటుంది. బుద్ధి ఖడ్గాద్యాయుధాలవలె నిశితముగా ఉంటుంది. వారు చిరకాలస్నేహబంధాన్ని ఇట్టే తెగవేయగలరు. ఈ పని చేయవచ్చును,ఈ పని చేయకూడదు అనే విచక్షణ లేకుండా ఏ పనిని అయినా వాయు వేగముతో చేసివేస్తారు. అయితే, ఈ దోషాలు ఏవీ నీ భార్య సీతాదేవికి లేవు. ఈమె అరుంధతీదేవి అంతటి శ్లాఘనీయ. పతివ్రతలలో ఈమె అగ్రగణ్య. ఓ అరిందమా! నీవు పతివ్రతారత్నము అయిన ఈ సీతతోనూ, ఈ లక్ష్మణుడితోనూ ఏ దేశములో నివసిస్తే ఆ దేశము శోభిస్తుంది. మీరు ఏ ఆశ్రమంలో ఉంటే ఆ ఆశ్రమానికి అలంకారము అవుతారు. కాబట్టి, నా ఆశ్రమములో మీరు ఉండవలసింది" అని అగస్త్యమహర్షి చెప్పినాడు.

రాముడు దీప్తాగ్నిహోత్రుడివంటి ఆ అగస్త్యమహర్షిని చూచి చేతులు జోడించి వినయముతో, "ఓ మహామునీ! తాము వరదులు. నన్నూ, నా భార్యనూ, నా తమ్ముణ్ణీ మెచ్చుకొన్నారు. నేను ధన్యుణ్ణి అయినాను. అనుగృహీతుణ్ణి అయినాను. అయితే, నేను మరి ఎక్కడను అయినా ఆశ్రమపదము ఏర్పరచుకొని, ఏకాగ్రచిత్తముతో సుఖముగా ఉండవలెను అనుకొంటున్నాను. జలసమృద్ధమూ, బహువనసమేతమూ అయిన ప్రదేశము ఏది అయినా తాము నాకు సెలవు ఈయవలెను" అని అడిగినాడు.

ఆ ధర్మాత్ముడు, ఆ ధీమంతుడు అగస్త్యమహర్షి కొంచెము సేపు ఆలోచించినాడు. దృఢనిశ్చయము చేసి, "నాయనా, రామా! ఇక్కడికి రెండు యోజనాల దూరములో 'పంచవటి' అనే ప్రదేశము ఉంది. అది జలసమృద్ధమూ, బహుమూలఫలోపేతమూ, శ్రీమంతమూ అయిన ప్రదేశము. నీవు సీతాలక్ష్మణులతో అక్కడికి పోయి ఆశ్రమపదము ఏర్పరుచుకోవలసింది. మీ తండ్రి దశరథమహారాజు ఆజ్ఞాపించిన నీ వనవాసకాలములో చాలాభాగము అయిపోయింది. నీవు నీ ప్రతిజ్ఞ చెల్లించుకొని సుఖముగా రాజ్యము ఏలవలెను.

"రామా! యయాతివలె, నీ తండ్రి దశరథమహారాజు జ్యేష్ఠ పుత్రుడవు అయిన నీవల్ల తరించినాడు. అతడు ధన్యుడు. రామా! నాకూ, దశరథమహారాజుకూ ఉన్న స్నేహమునుంచీ, నా ప్రభావముద్వారా నీ విషయము అంతా నాకు తెలుసును. అందువల్లనే, నిన్ను ఇక్కడనే సుఖముగా ఉండుమని చెప్పినాను. అయితే, నీ మనస్సులో ఉన్న అభిప్రాయము ఇప్పుడు తపోబలమువల్ల నాకు తెలిసింది. కాబట్టి, నిన్ను పంచవటికి పంపుతున్నాను.

"ఓ పుణ్యాత్ముడా! పంచవటీ అరణ్యప్రాంతము రమణీయము అయింది. శ్లాఘనీయము అయింది. జింకలు మొదలు అయిన మృగాలు, నానావిధపక్షులు అక్కడ నివసిస్తూ ఉన్నవి. ఆ ప్రదేశము విజనముగా ఉంటుంది. అది పవిత్రము అయిన ప్రదేశము. ఇక్కడికి సమీపములో ఉంది. అక్కడికి సమీపములో గోదావరినది ఉంది. మనోహరము అయిన ఆ ప్రదేశములో నీవు నీ భార్యతోకూడా సుఖముగా ఉండవచ్చును.

"రామా! నీవు ఆపన్నులను రక్షించడములో అత్యంత సమర్థుడవు. అక్కడ పంచవటిలో ఉంటూనే తాపసులను కాపాడవచ్చును. ఓ ధీరుడా! ఆ అగపడుతున్న ఇప్పచెట్ల అడవికి ఉత్తరము దిక్కున మర్రిచెట్టు కనపడేవరకూ మీరు పోవలెను. అక్కడ ఒక మిట్ట ఉంది. అది ఎక్కితే పర్వత సమీపమున అరణ్యము కనపడుతుంది. అక్కడ చెట్లు అన్నీ పూలు పూస్తూ ఉంటవి. అదే 'పంచవటి' అని ప్రసిద్ధికి ఎక్కింది' అని చెప్పినాడు.

అంతట రాముడు,సీతాలక్ష్మణులతో ఆ అగస్త్యమహర్షికి పాదాభివందనము చేసి వీడ్కోలు చెప్పినాడు. పంచవటికి పోవడానికి ఆ అన్నదమ్ములు ధనుర్ధరులు అయి, తూణీరాలు ధరించి సీతాదేవిని వెంటపెట్టుకొని అగస్త్యమహాముని చెప్పిన దారిన ఏకాగ్రచిత్తులు అయి నడచినారు.

14

రాముడు జటాయువును కలిసికొనుట

సీతారామలక్ష్మణులు అట్లా పంచవటికి నడిచిపోతూ మార్గమధ్యములో ఒక మర్రిచెట్టుమీద మహాకాయముతో అమితభయంకరముగా కూర్చుని ఉన్న ఒక గృధ్రాన్ని చూచినారు. అది రాక్షసేమో అనుకొన్నారు. "నీవు ఎవరవు" అని దానిని ప్రశ్నించినారు. ఆ గద్ద, "రామా! నేను మీ తండ్రి దశరథమహారాజు స్నేహితుణ్ణి" అని మృదుమధురముగా చెప్పింది. అంతట రాముడు ఆ గద్దను గౌరవముతో కులము, పేరు అడిగినాడు.

ఆ గృధ్రము తనను గురించి చెప్పుకోవడానికి ముందుగా సమస్తప్రాణుల పుట్టుకనుగురించీ చెప్పతలచుకొని, "రామా! ముందు ప్రజాపతులు ఎవరెవరో చెప్పుతాను. ప్రజాపతులలో మొట్టమొదటివాడు కర్దముడు. ఆయన తరువాత విక్రీతుడున్నూ, శేషుడున్నూ, అనేకమంది పుత్రులను కన్న మహావీర్యవంతుడు సంశ్రయుడున్నూ, స్థాణుడున్నూ, మరీచియున్నూ, అత్రియున్నూ, మహాబలవంతుడు అయిన క్రతువున్నూ, పులస్త్యుడున్నూ, అంగీరసుడున్నూ, ప్రచేతసుడున్నూ, పులహుడున్నూ, దక్షుడున్నూ, వివస్వతుడున్నూ వరుసగా ప్రజాపతులు అయినారు.

"ఓ మహాయశా! దక్షప్రజాపతికి అరవైమంది కూతుళ్ళు పుట్టినారు. వాండ్లు అందరూ కీర్తిమంతులు అయినారు. వారిలో 'అదితి, దితి, దనువు, కాళిక, తామ్ర, క్రోధవశ, మనువు, అనల' అనే ఎనిమిదిమందిని కాశ్యపుడు వివాహము చేసుకొన్నాడు. వాండ్లను అందరినీ చూచి సంతోషముతో, 'ముల్లోకాలూ పాలించే పుత్రులను, తనతో సమానము అయినవాండ్లను కనవలెను' అని చెప్పినాడు. రామా! ఆ కాశ్యపుడు చెప్పినట్టుగా దితి, అదితి, దనువు, కాళికా మనసా సంకల్పించుకొన్నారు. తక్కినవారు అట్లా చేయలేదు.

"రామా! అదితికి పన్నెండుమంది ఆదిత్యులూ, ఎనిమిదిమంది వసువులూ, పదకొండుమంది రుద్రులూ, ఇద్దరు అశ్వినీదేవతలూ, ఇంకా ముప్పయిముగ్గురు దేవతలున్నూ పుట్టినారు. దితి కీర్తిమంతులు అయిన దైత్యులను కన్నది. సముద్ర వలయితము అయిన ఈభూమి సమస్త అరణ్యాలతోను పూర్వము దైత్యులది అయింది.

"నాయనా, రామా! దనువు హయగ్రీవుణ్ణి కన్నది. కాళిక నరకుణ్ణి కన్నది. తామ్ర 'క్రౌంచిని, భాసిని, శ్యేని, ధృతరాష్ట్రి, శుకిని' అనే లోకప్రసిద్ధులు అయిన అయిదుగురు ఆడపిల్లలను కన్నది. వారిలో క్రౌంచినికి గుడ్లగూబలు పుట్టినవి. భాసినికి భానపక్షులు పుట్టినవి. శ్యేనికి మహాతేజోవంతము అయిన డేగలు, గద్దలు పుట్టినవి. ధృతరాష్ట్రికి కలహంసలు, హంసలు అనేవి అన్నీ పుట్టినవి. చక్రవాకపక్షులను కూడా ఆమె కన్నది. శుకినికి నత పుట్టింది. నతకు వినత పుట్టింది.

"రామా! క్రోధవశకు 'మృగిని, మృగమంద, హరి, భద్రమద, మాతంగి, శార్దూలి, శ్వేత, సురభి, సమస్తలక్షణసంపన్న అయిన సురస, కద్రువ' అనే పదిమంది కూతుళ్లు పుట్టినారు. వారిలో మృగికి సమస్తము అయిన జింకలు పుట్టినవి. మృగమందకు ఎలుగుబంట్లూ, సృమర మృగాలూ, చమరీ మృగాలూ పుట్టినవి. హరికి సింహాలూ, మహావేగవంతము అయిన వానరాలూ, భద్రమదకు 'ఇరావతి' అనే కూతురూ పుట్టినారు. ఈ ఇరావతికి 'ఐరావతము' అనే పెద్దఏనుగు పుట్టింది. అది

దేవేంద్రుడికి వాహనము అయింది. మాతంగికి ఏనుగులు పుట్టినవి. శార్దూలికి పెద్దపులులు, కొండముచ్చులు పుట్టినవి. శ్వేతకు దిగ్గజాలు పుట్టినవి. సురభి 'రోహిణి, గంధర్వి' అనే ఇద్దరు కూతుళ్ళను కన్నది. ఆ రోహిణికి ఆవులు పుట్టినవి. గంధర్వికి గుర్రాలు పుట్టినవి. సురస దివ్యసర్పాలను కన్నది. కద్రువ సామాన్య సర్పాలను కన్నది. మనువు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులలో మొగవాండ్లను కన్నది. అనల పవిత్రము అయిన ఫలవృక్షాలను సృష్టించినది. శుకి మనుమరాలు అయిన వినత వంశాన్ని, సురస చెల్లెలు అయిన కద్రువ వంశాన్ని చెప్పుతాను. కద్రువ భూమిని మోస్తూ ఉన్న ఆదిశేషుణ్ణి కన్నది. వినతకు 'గరుడుడు, అరుణుడు' అనే ఇద్దరు కొడుకులు పుట్టినారు. నేను ఆ అరుణుడికి శ్యేనికి పుట్టినాను. నా కన్నా ముందు నా అన్న సంపాతి పుట్టినాడు. నా పేరు జటాయువు.

"రామా! నీకు ఇష్టము అయ్యేటట్లయితే, నేను నీకు సహాయుణ్ణిగా ఉంటాను. ఇది చాలా భయంకరము అయిన అడవి. ఎన్నో క్రూరమృగాలు తిరుగుతూ ఉంటవి. రాక్షసులు యథేష్టముగా సంచరిస్తూ ఉంటారు. నాయనా! నీవు, లక్ష్మణుడు ఎందుకు అయినా బయటకి పోయినప్పుడు, నేను ఈ సీతాదేవిని కనిపెట్టుకుని ఉంటాను" అని జటాయువు చెప్పింది.

రాముడు ఆ జటాయువును గౌరవించి కౌగలించుకొన్నాడు. వారు అట్లా పంచవటికిపోతూ దశరథమహారాజును గురించి చెప్పే విషయాలకు ఉప్పొంగిపోతూ, శలభాలను అగ్నిహోత్రుడివలె శత్రువులను దహించివేసే రాముడు సీతాలక్ష్మణులతో నడిచినాడు.

15

పంచవటీ ప్రవేశము

సీతారామక్ష్మణులు నానావిధాల మృగాలు, రకరకాల పాములు తిరిగే పంచవటికి పోయి చేరినారు. రాముడు మహాతేజోవంతుడు అయిన లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! అగస్త్యమహాముని మనకు చెప్పిన పంచవటికి వచ్చినాము. ఈ అడవిలో చెట్లు అన్నీ పూలు పూసి ఉన్నవి. ఇక్కడ ఏ ప్రదేశములో మనము ఆశ్రమము వేసుకోవడానికి బాగాఉంటుందో నిర్ణయించు. ఈ అడవి అంతా పారచూడు. ఆశ్రమానికి యోగ్యము అయిన స్థలము నిర్ధారణ చేయడములో నీవు సమర్థుడవు. లక్ష్మణా! ఏ ప్రదేశము అయితే సీతాదేవికి సంతోషముగా ఉంటుందో, నీకూ నాకూ హాయిగా ఉంటుందో, అటువంటి ప్రదేశము చూడవలెను. చుట్టూ రకరకాల చెట్లతో వనరామణీయకముగానూ, బురదా గిరదా లేకుండా సమమట్టముగా

ఇసుకకొండి నేలతో స్థలరామణీయకముగానూ ఆ ప్రదేశము ఉండవలెను. దగ్గరలో దర్భలు, పూలు, సమిధలూ దొరికేటట్టుగా ఉండవలెను. అంతేకాదు, సమీపములో ఒక చెరువుకూడా ఉండవలెను. అటువంటి ప్రదేశాన్ని చూడవలసింది" అని చెప్పినాడు.

ఈ మాటలకు లక్ష్మణుడు చేతులు జోడించి సీతాదేవి సమక్షములో, "రామా! నీదగ్గర నేను నూరుసంవత్సరాలు ఉన్నా పరతంత్రుణ్ణిగానే ఉంటాను. నేను స్వతంత్రుణ్ణి కాను. నీవే ఒక మనోహరము అయిన ప్రదేశము నిర్ణయించి ఆశ్రమము నిర్మించమని చెప్పితే చేయకలను" అని చెప్పినాడు. పూజ్యము అయిన మనస్సుతో లక్ష్మణుడు చెప్పిన మాటలకు రాముడు సంతోషించి స్వయముగా ఆలోచించి, తాను చెప్పినవి అన్నీ సమకూరిన ప్రదేశము ఒకటి చూచినాడు. అంతట తన చేతితో లక్ష్మణుడి చేతులు పట్టుకొని, "తమ్ముడా! ఈ ప్రదేశము సమమట్టముగా ఉంది. ఇది శ్రీమంతముగా ఉంది. ఇదిగో, ఈ సమీపములో రమణీయము అయిన తామర కొలనుకూడా ఉంది. అందులో పద్మాలు అన్నీ వికసించినవి. సూర్యసమాన కాంతులతో కనపడడమే కాకుండా, మంచి ఘుమ ఘుమ వాసనలు కొట్టుతూ ఉన్నది.

"ఆ భావితాత్ముడు అగస్త్యమహర్షి చెప్పినట్టుగా, చుట్టూ ఉన్న చెట్లు అన్నీ పూలు పూసినవి. అదిగో, గోదావరినది. హంసలు, కారండవాలు, చక్రవాకాలు అక్కడ తిరుగుతూ ఉన్నవి. ఈ ప్రదేశము ఎంతో రమణీయముగా ఉంది. అతి దగ్గర కాకుండానూ, బాగా దూరము కాకుండానూ ఎత్తు అయిన పర్వతాలు ఉన్నవి. అదిగో, జింకలు మొదలు అయిన మృగాలు ఎన్నో కనపడుతున్నవి. అక్కడనుంచి నెమళ్ళ కేకలు వినపడుతున్నవి. ఆ కొండలలో ఎన్నో గుహలు ఉన్నవి. ఆ కొండలను ఆవరించి పెరుగుతూ ఉన్న పెద్ద పెద్ద చెట్లు అన్నీ కూడా పూలు పూసినవి. ఆ కొండలు అన్నీ పెద్ద పెద్ద ఏనుగులవలెనూ, ఆ యా దేశాలలో దొరికే బంగారు, వెండి, రాగి రంగుల గైరిక ధాతువులు ఆ ఏనుగులకు చేసిన అలంకారాలవలె తళతళలాడుతూనూ ఉన్నవి.

"ఆ పర్వతప్రాంతారణ్యములో మద్దిచెట్లూ, తాటిచెట్లూ, కానుగుచెట్లూ, ఖర్జూరపుచెట్లూ, పనసచెట్లూ, మామిడిచెట్లూ, జలకదంబాలూ, నేమిచెట్లూ, పున్నాగచెట్లూ శోభాయమానముగా కనపడుతున్నవి. తియ్యమామిడిచెట్లూ, బొట్టుగుచెట్లూ, సంపెంగ చెట్లూ, మొగలిపొదలూ పూలుపూసి ఘుమఘుమ వాసనలు కొట్టుతూ ఉన్నవి. ఇంకా ఎన్నో లతలు, గుల్మాలు నేత్రపర్వముగా కనపడుతున్నవి. అశోకవృక్షాలూ, కదంబవృక్షాలూ, పార్ణాసవృక్షాలు మహోన్నతముగా పెరిగినవి. చందనపుచెట్లూ, స్పందనపుచెట్లూ, నిమ్మచెట్లూ, ఇనుమద్దిచెట్లూ, చంద్రచెట్లూ, ఉమ్మెత్తచెట్లూ, జమ్మిచెట్లూ, మోదుగుచెట్లూ, కలిగొట్టుచెట్లూ అంతటా ఆవరించినవి.

"లక్ష్మణా! ఇది పుణ్యప్రదము అయిన ప్రదేశము. పావనము అయిన ప్రదేశము. ఎన్నెన్నో మృగాలు, ఎన్నెన్నో పక్షులు ఇక్కడ సుఖముగా నివసిస్తూ ఉన్నవి. మనమున్నూ జటాయువుతో కూడా ఇక్కడ ఉందాము" అని చెప్పినాడు.

అంతట ఆ మహాబలవంతుడు లక్ష్మణుడు ఆశ్రమ నిర్మాణానికి పూనుకొన్నాడు. పొడుగాటి గట్టి గట్టి వెదుళ్ళు స్తంభాలుగా పాతిపెట్టినాడు. త్రవ్విన మట్టితో గోడలు పెట్టినాడు. పయిన అడ్డముగా జమ్మివాసాలువేసి గట్టిత్రాళ్ళతో కట్టినాడు. ఆ వాసాలమీద ఆకులూ, దర్భలూ, రెల్లూ వేసి చక్కని కప్పు అమర్చినాడు. పర్ణశాలలో నేల అంతా చదును చేసినాడు. అది విశాలముగా చూడ చక్కని పర్ణశాల అయింది. అంతట ఆ కాంతిమంతుడు గోదావరికి పోయి స్నానముచేసి కమలాలూ, పండ్లూ తెచ్చినాడు. యధావిధిగా వాస్తుపూజ చేసినాడు. శాంతి చేసినాడు. సీతారాములు ఆ పర్ణశాలను చూచి, ఎంతో ముచ్చట పడ్డారు. రాముడు స్నేహాతిశయముతో రెండుచేతులా లక్ష్మణుణ్ణి గట్టిగా కౌగలించుకొని, "ఓ సమర్థుడా! నీవు మహత్కార్యము చేసినావు. నా సంతోషము చెప్పలేను. నీకు నేను ఇవ్వ కలిగిన పారితోషికము ఈ కౌగిలింతే. నాయనా, లక్ష్మణా! నీవు నా హృదయము తెలిసినవాడవు. ఏ ఏ పనులు చేస్తే నేను సంతోషిస్తానో ఆ యా పనులే నీవు చేస్తూ ఉంటావు. నీవు ధర్మజ్ఞుడవు. నన్ను కాపాడుతున్నావు. నీవు ఉండడమునుంచి ధర్మాత్ముడు అయిన మన తండ్రి దశరధమహారాజు చనిపోయినట్లుగా లేదు" అని చెప్పి, ఆ జితేంద్రియుడు, లక్ష్మీవర్ధనుడు ఆ ఆశ్రమములో ప్రవేశించినాడు.

బహుమూలఫల సమన్వితము అయిన ఆ పంచవటిలో రాముడు సీతాలక్ష్మణులతో, దేవలోకములో దేవేంద్రుడివలె సుఖముగా కాలము గడపసాగినాడు.

16

ఆ మహాత్ముడు రాముడు పంచవటిలో సుఖముగా ఉంటూ ఉండగా శరత్కాలము గడచిపోయింది. కామినీ కాముకులకు ఇష్టము అయ్యే హేమంత ఋతువు వచ్చింది.

సీతారాములు తెల్లవారుఝామున రమణీయము అయిన గోదావరినదిలో స్నానం చేయడానికి బయలుదేరినారు. వారి వెంట లక్ష్మణుడు వినయ విధేయతలతో జలకలశముతో నడుస్తూ, "అన్నా, రామా! నీకు ఇష్టము అయిన హేమంతకాలము వచ్చింది. ఇది మంగళకరము అయిన ఋతువు. అంతేకాదు, సంవత్సరానికి అంతటికీ ఈ ఋతువు అలంకారమువంటిది. మంచుకు ఇప్పుడు అందరి దేహాలు కరుకు ఎక్కిపోయినవి. భూమి సస్యశాలిని అయింది. నీళ్ళు ముట్టుకోవడానికి

అలవికాని అంతగా చల్లపడిపోయినవి. అగ్నిహోత్రుడు మనోహరుడు అయి సత్పురుషులు నూత్న ధాన్యాలు తినడానికి ముందుగా ఆగ్రయణయజ్ఞాలు పితృదేవతలను, దేవతలను ఆరాధించి విగతకల్మషులు అవుతున్నారు. ఇప్పుడు పల్లెపట్టులలో సమస్త పదార్థాలు సమృద్ధముగా దొరుకుతూ ఉంటవి. ఆవులు కావలసినన్ని పాలు ఇస్తూ ఉంటవి. మహానగరాలలో మహారాజులు దండయాత్రాసక్తులు అవుతూ ఉంటారు.

"రామా! సూర్యుడు ఇప్పుడు యముడు సేవించే దక్షిణదిక్కున తిరుగుతూ ఉన్నందువల్ల, ఉత్తరదిక్కు నుదుట బొట్టులేని స్త్రీవలె కనపడుతున్నది. సూర్యుడు దూరము అయిపోయినందువల్ల, హిమకోశాఢ్యుడు హిమముతో యథార్థముగా హిమగిరి అవుతున్నాడు. ఇప్పుడు మధ్యాహ్న సూర్యుడు మనోహరుడు అవుతున్నాడు. ఎండలో తిరగటమే సుఖముగా ఉంటూ ఉంది. చెట్లనీడలు, శీతలోదకాలు ఇప్పుడు పనికిమాలినవి అయిపోయినవి. ఉదయాస్తమయాలలో సూర్యుడు మెత్తనివాడు అయిపోయినాడు. చీకటి పడడముతో మంచు కురుస్తూ చలి ముదురుతున్నది. గాలి విపరీతముగా వీస్తున్నది. వన్యమృగాలు బయటికి రావడము లేదు. జనసంచారము శూన్యము అయిపోయింది. మంచువల్ల ఏదీ కనపడడము లేదు. రాత్రులలో ఎవరూ ఆరుబయట పడుకోవడములేదు. పుష్యమి వచ్చింది. రాత్రిపూట లోకము అంతా బూజుపట్టినట్టు అయిపోతున్నది. చలిగాలివీస్తూ రాత్రికాలము పొడుగు ఎదుగుతున్నది. చంద్రుని సౌభాగ్యము అంతా ఇప్పుడు సూర్యుడికి సంక్రమించింది. నిట్టూర్పులకు మాసిపోయిన అద్దమువలె, చంద్రుడు ఇప్పుడు కావిరంగుతో కనపడుతున్నాడు. పున్నమినాటి పండువెన్నెల, మంచుకు మాసిపోయి ఎండకు వాడిపోయిన సీతాదేవివలె శోభించడము లేదు. ఉదయకాలాన స్వాభావికముగా చల్లగా వీచే పడమటిగాలి ఇప్పుడు మంచు తగులుకొని మరింత చల్లగా వీస్తున్నది. మంచుకప్పుకొని కనపడకుండా పోయిన అడవులు, యవలపయిర్లు, గోధుమ పయిర్లు సూర్యోదయముకాగానే కళకళలాడుతూ కనిపించడమే కాకుండా, మంచు అంతా బిందువులు బిందువులు అయి ఆనందబాష్పాలు రాలుస్తున్నట్లు కనపడుతున్నవి. రాత్రి అంతా ముడుచుకొని పడుకొన్న క్రౌంచపక్షులు, బెగ్గురుపక్షులు మహా మధురముగా అరుస్తూ ఉన్నవి. వరిపయిర్లు పండి బంగారు కాంతులతో ఖర్జూర పుష్పాల ఆకారముతో, గట్టి గట్టి గింజలతో వెన్నులు బరువై కొంచెము వంగి శోభాయమానముగా కనపడుతున్నవి. పొద్దు ఎక్కినప్పటికిన్నీ సూర్యకిరణాలను పొగమంచు కమ్ముకొన్నందువల్ల, సూర్యుడు చందమామవలె చల్లగా కనపడుతున్నాడు. పూర్వాహ్ణములో ఎండవేస్తున్నదే తెలియకుండాను, మధ్యాహ్నము అప్పుడు

సూర్యబింబము కొంచము ఎర్రగానూ తెల్లగానూ కనపడుతూ ఉన్నా, ఎండ సుఖముగా ఉంటూనూ ఉంది. మంచు పడడముచేత అడవులలో పచ్చికబయళ్ళు తడిసి, లేత ఎండకు మంచుబిందువులు వజ్రాలవలె తళతళ లాడుతూ కనపడుతున్నవి. అడవిఏనుగు దప్పికకొని తేటలుగా ఉన్న నీళ్ళు త్రాగపోయి చల్లదనాన్ని ఓర్చుకోలేక తొండాన్ని వెనుకకు లాగుతున్నది. యుద్ధరంగానికి పోయిన శౌర్యహీనులవలె జలచరపక్షులు నీళ్ళదాకా పోయి చలికి భయపడి, నీళ్ళలో మునగకుండా దిక్కులు చూస్తూ కూర్చుంటున్నవి. అడవులలో చెట్లు అన్నీ పొగమంచుకు దుప్పటి కప్పుకొన్నట్టుగానూ, పూలులేనందువల్ల కన్నులు మూసుకొన్నట్టుగానూ, మంచునీటికి ఆకులు చిగుళ్ళు ముణుచుకొనిపోయి నిద్రపోతున్నట్టుగానూ కనపడుతున్నవి. పొగమంచు కురుస్తున్నందువల్ల నదులలో నీళ్ళు కంటికి కనపడడము లేదు. గట్టుల ఇసుక తడితడిగా ఉంది. బెగ్గురుపక్షుల కూతలు మాత్రము వినపడుతున్నవి. సూర్యుడి మృదుత్వమునుంచి, మంచు కురుస్తూ ఉండడమునుంచి కొండవాగులలో నిర్మలోదకాలు, అగాధజలాలు విషమువలె త్రాగను అలవికాకుండా ఉన్నవి. కమలాలు ముదిరి మంచుపడి పూలరేకులూ, అకరువులూ, దుద్దులూ రాలిపోయి కాడలు మాత్రము మిగిలి, కమలాకరాలు కళాకాంతులు లేకుండా ఉన్నవి.

"అన్నా, రామా! అయోధ్యానగరములో ఆ ధర్మాత్ముడు, ఆ నరశార్దూలము భరతుడు రాజ్యమూ, రాజపుత్రుడను అనే అభిమానమూ, నానావిధరాజభోగాలూ వదులుకొని నీమీద భక్తితో నిన్నే తలచుకొంటూ, నీకోసము దుఃఖపడుతూ తపస్సు చేస్తూ, నియతాహారముతో కాలము గడుపుతూ, చల్లటి కటిక నేలమీద పడుకొంటూ ఈ వేళకు నిద్రలేచి స్నానానికి బయలుదేరుతూ ఉంటాడు. అనుచరులతో సరయూనదికి పోతాడు. ఎంతోసుఖముగా పెరిగిన ఆ సుకుమారుడు, ఎప్పుడూ సుఖము అనుభవించవలసిన ఆ భరతుడు ఈ అపరాత్రము అప్పుడు సరయూ శీతలోదకాలలో ఎట్లా మునుగుతున్నాడో!

"ఆ పద్మపత్రాయతాక్షుడు, ఆ శ్యామాంగుడు, ఆ ప్రియభాషి, ఆ సత్యవాది, ఆ వీరుడు, ఆ ధర్మజ్ఞుడు, ఆ జితేంద్రియుడు, అకార్యాచరణకు సిగ్గుపడిపోయే ఆ మనోహరుడు, ఆ అరిందముడు, ఆ దీర్ఘబాహువు భరతుడు సమస్తభోగాలు త్యజించి సర్వాత్మనా నిన్ను అనుసరిస్తూ, నీవు ఇక్కడ తాపసివిగా ఉంటూ ఉంటే వాడు అక్కడ అయోధ్యలో తాపసిగా ఉంటూ స్వర్గాన్ని జయించినాడు.

"రామా! మొగవాండ్లు తల్లి స్వభావాన్ని అనుసరించి పుట్టుతారు అనే లోకోక్తిని భరతుడు తారుమారుచేసినాడు. సజ్జనుడు అయిన దశరథమహారాజు ఆమె భర్త. అంత సజ్జనుడు అయిన భరతుడు ఆమె పుత్రుడు. ఆమె, ఆ

కైకేయీదేవి ఎందుకు అంత క్రూరశీలిని అయిందో" అని లక్ష్మణుడు స్నేహముతో అడుగుతూ ఉంటే, ఆ నిందావాక్యాన్ని సహించలేక రాముడు, "నాయనా! నీవు కైకేయీదేవిని నిందించవద్దు. భరతుణ్ణి గురించి చెప్పు; వింటాను; సంతోషిస్తాను. దృఢవ్రతుణ్ణి. వనవాసము చేయడానికే నిశ్చయించుకొన్నాను. అయినప్పటికిన్నీ, భరతుడిమీద స్నేహాతిశయమువల్ల నా మనస్సు తపించిపోతూ ఉంది. వాణ్ణి ఎప్పుడు ఎప్పుడు చూద్దామా అనిపిస్తున్నది. భరతుడి మనోహరము అయిన మాటలు నేను మరవలేను. తలచుకొన్నకొద్దీ నా మనస్సు ఉప్పొంగిపోతుంది. అవి ప్రియాలు, మధురాలు, హృద్యాలు. ఆ వాక్యాలు అమృతసోనల వంటివి.

"నాయనా! నేను పరమార్థవిదుడు అయిన భరతుడితోనూ, పరమ పరాక్రమవంతుడు అయిన శత్రుఘ్నుడితోనూ, నీతోనూ ఎప్పుడు ఒక్కచోట కలిసి ఉంటానో?" అంటూ దుఃఖపడుతూ ఆ గోదావరీ పావనోదకాలలో సీతాలక్ష్మణులతో స్నానముచేసి పితృదేవతలకు, దేవతలకు తర్పణాలు వదలి సంధ్యావందనము సూర్యోపస్థానము నిర్వర్తించి సేవించే పార్వతీ నందీశ్వరులతో రుద్రుడివలె దేదీప్యమాన దివ్యతేజముతో విరాజిల్లినాడు.

17

శూర్పణఖ

రాముడు స్నానసంధ్యావందనాదులు ముగించుకొని, గోదావరీ తీరమునుంచి సీతాలక్ష్మణులతో తమ పర్ణశాలకు పోయి, పూర్వాహ్ణములో చేయవలసిన బ్రహ్మయజ్ఞము మొదలు అయిన కర్మలను అన్నిటినీ లక్ష్మణుడితో కూడా పూర్తిచేసి తమ్ముడితోను, సీతాదేవితోను ఆడుతూ కూర్చున్నాడు.

అట్లా సీతాసమేతుడు అయి కూర్చున్న రాముడు చిత్రానక్షత్రములో చంద్రుడి వలె తేజరిల్లుతూ ఉండగా, ఆ ఆశ్రమపదములోకి యాదృచ్ఛికముగా ఒక రాక్షసాంగన వచ్చింది. అది దశగ్రీవుడి తోబుట్టువు. దాని పేరు శూర్పణఖ. అది రాముణ్ణి చూచింది.

ఆ పద్మపత్రాయతాక్షుణ్ణి, ఆ సింహవక్షుణ్ణి (ఆ విశాలవక్షుణ్ణి), ఆ మహాబాహువును, ఆ దీప్తాస్యుణ్ణి, ఆ జటామండలధరుణ్ణి, ఆ అత్యంత ప్రియదర్శనుణ్ణి, ఆ సుకుమారుణ్ణి, ఆ మహాబలవంతుణ్ణి, ఆ రాజలక్షణలక్షితాంగుణ్ణి, ఆ గజవిక్రాంతగామిని, ఆ ఇందీవరశ్యాముణ్ణి, మన్మథుడితో సరిసమానము అయిన ఆ కాంతిమంతుణ్ణి, దేవేంద్రుడివంటి రాముణ్ణి శూర్పణఖ లోపలికివచ్చి కన్నులారా చూచింది. కామమోహిత అయిపోయింది.

రాముడు సుందరముఖుడు, అది దుష్టముఖి. అతడు విశాలాక్షుడు, అది విరూపాక్షి. అతని తలవెంట్రుకలు తుమ్మెదరెక్కలవలె నల్లటివి, దానిది రాగిబొచ్చు. అతనిది శాతోదరము, దానిది మహోదరము. అతనిది సురూపము, దానిది కురూపము.

అతనిది సుస్వరము, దానిది భైరవస్వరము. అతడు వయస్సులో ఉన్న వన్నెకాడు, అది ముసలి డొక్కు. అతనిది చమత్కార వాక్కు, దానిది గ్రామ్య వాక్కు. అతనిది సదాచారము, దానిది దురాచారము. అతడు ప్రియదర్శనుడు, అది అసహ్యాదర్శన. ఆ శూర్పణఖ మన్మధపరవశ అయిపోయింది.

అది రాముణ్ణి చూస్తూ, "ఓయీ! నీవు జటలతో తాపసివిగా కనపడుతున్నావు. భార్యను దగ్గర పెట్టుకొని కాముకుడవుగా కనపడుతున్నావు. శరచాపాలతో క్షత్రియుడవుగా కనపడుతున్నావు. రాక్షసులు తిరిగే ఈ ప్రదేశానికి నీవు ఎట్లా వచ్చినావు? ఎందుకు వచ్చినావు? యధార్థము చెప్పు" అని అడిగింది.

ఆ పరంతపుడు రాముడు కపటము లేనివాడు. ఎన్నడూ అనృతము ఆడి ఎరుగడు. అందులో విశేషించి తాపసాశ్రమములో ఉన్నాడు. పైగా స్త్రీ సమక్షములో ఎంతమాత్రము అబద్ధము ఆడడు. తనను గురించి సర్వమూ చెప్పతలచి, "దశరథమహారాజు దేవతలతో సరిసమానము అయిన పరాక్రమవంతుడు. నేను ఆయన జ్యేష్ఠపుత్రుణ్ణి. నన్ను రాముడు అని అందరూ పిలుస్తూ ఉంటారు. ఇతడు నా కంటె చిన్నవాడు. నా తమ్ముడు. వీని పేరు లక్ష్మణుడు. వీడు ఎప్పుడూ నన్ను అనుసరించుకొని ఉంటున్నాడు. ఈమె విదేహరాజపుత్రి, నా భార్య, సీతాదేవి అని ప్రసిద్ధికి ఎక్కింది. మా తండ్రి దశరధమహారాజూ, మా తల్లి కైకేయీదేవి నన్ను వనవాసము చేయమని ఆజ్ఞాపించినారు. నేను వారి ఆజ్ఞాబద్ధుణ్ణి అయి ధర్మకాంక్షతో ధర్మనిర్వహణ కోసము వనవాసము చేయడానికి ఈ మహారణ్యానికి వచ్చినాను.

"ఇక నీవు ఎవరవో తెలుసుకోవలెను అని కుతూహలముగా ఉంది. నీవు ఎవరి పెండ్లానివి? నీ పేరు ఏమిటి? ఇంత మనోజ్ఞాంగివి, నీవు ఎవరి కూతురివి? నీవు రాక్షసిగా నాకు కనపడడము లేదు. ఇక్కడికి ఎందుకు వచ్చినావో యధార్థము చెప్పు" అని అడిగినాడు.

ఈ మాటలకు దానికి మరింత మరులు పుట్టి, "రామా! యథార్థము చెప్పుతాను, వినవలసింది. నేను శూర్పణఖ అనే రాక్షస స్త్రీని. నేను కామరూపిణిని. నా పేరు చెప్పితే ప్రాణికోటి అంతా భయపడి పోతుంది. నేను ఒక్కతెనూ ఈ మహారణ్యములో యథేష్టముగా తిరుగుతూ ఉంటాను. విశ్రవసుడి పుత్రుడు, మహాబలవంతుడు, అమిత వీర్యవంతుడు అయిన 'రావణుడు' అనే రాక్షసరాజు పేరు వినే ఉంటావు. వాడు నా అన్న. ఎప్పుడూ నిద్రపోతూ ఉండే మహాబలవంతుడు కుంభకర్ణుడు, రాక్షసచేష్టలు లేని ధర్మాత్ముడు విభీషణుడు, మహాయోధులు అని ప్రసిద్ధికి ఎక్కిన ఖర దూషణులు నా తోబుట్టువులు. అయితే, నేను వాండ్లను లెక్కచేయకుండా నా ఇష్టము వచ్చినట్టు తిరుగుతున్నాను.

"ఓ పురుషోత్తముడా! నాకు అపూర్వముగా నీ దర్శనము అయింది. నిన్ను నేను భర్తగా భావించినాను. నేను మహాప్రభావము కలదానను. స్వచ్ఛందబలగామినిని. నీవు నాకు బహుకాలము భర్తగా ఉండవలెను. ఈ సీత నీకు ఎందుకు? దీనితో ఏమి చేస్తావు? ఇది వికృతముగా ఉంది. పైగా కురూపి. ఇది నీకు తగింది కాదు. నీకు తగిన దానను నేను. నన్ను నీ భార్యగా చేసుకో! ఈ కురూపినిని, ఈ దుర్మార్గురాలిని, ఈ నడుము వంగిన దానిని, ఈ పొడుగాటి దానిని, ఈ మనుష్య స్త్రీనీ, నీ తమ్ముణ్ణీ నేను తినివేస్తాను.

"ప్రియుడా! నీవూ, నేనూ పర్వతశిఖరాలమీదను, వివిధవనాలలోను విహరిస్తూ ఈ దండకారణ్యము అంతా తిరుగుదాము" అంటూ మదము ఎక్కి మాట్లాడింది.

రాముడు దాని మాటలు విని నవ్వినాడు.

18

రాముడు కామపాశావపాశిత అయి ఉన్న శూర్పణఖను చూచి నవ్వుతూ మృదువుగానూ, స్పష్టముగాను, "అమ్మా! నేను ఈమెను కట్టుకొన్నాను. ఈమె నన్ను సంతోషపెట్టుతూ ఉంది. నీవు సవతిపెట్టే బాధలు పడలేవు. అడుగో, వాడు నా తమ్ముడు లక్ష్మణుడు. చూడ చక్కనివాడు. సదాచారసంపన్నుడు. మంచి వీర్యవంతుడు. భార్య లేనివాడు. ఇంతవరకూ భార్యాసుఖము ఎరగనివాడు. భార్య కావలసినవాడు. పైగా మంచి యౌవనములో ఉన్నాడు. నీ రూపానికి అనురూపము అయినవాడు. నీ చారెడు చారెడు కన్నులకు, నీ పెద్ద పెద్ద పిరుదులకు వాడు తగిన పెనిమిటి అవుతాడు. నీవు వాణ్ణి, నాతమ్ముణ్ణి పెనిమిటిగా చేపట్టేటట్లయితే నీకు సవతిపోరు ఉండదు. మేరు పర్వతాన్ని సూర్యకాంతివలె, నీవు వాణ్ణి భర్తగా భజించు, బాగుంటుంది" అని చెప్పినాడు.

ఈ మాటలకు ఆ కామమోహిత వెంటనే రాముణ్ణి వదిలిపెట్టి లక్ష్మణుడి దగ్గరకు పోయి, "ఓ వన్నెకాడా! నేను ఎండాకాలములో చల్లగానూ, చలికాలములో వేడిగానూ ఉండే నా దేహముతో నిన్ను సుఖపెట్టుతాను. సంతోషపెట్టుతాను. నీ రూపానికి తగిన భార్యను అవుతాను. నీతో సుఖముగా విహరిస్తాను. నిన్ను ఈ దండకారణ్యము అంతా తిప్పుతాను" అని చెప్పింది.

లక్ష్మణుడు మాటకారి. ఈ మాటలకు నవ్వుతూ, చేటలవంటి గోళ్ళు ఉన్న ఆ శూర్పణఖను చూచి, "ఓ కమలవర్ణినీ! నేనే ఒకరికి దాసుణ్ణి. నాకు భార్యవు అయి నీవూ ఎందుకు దాసివి కావలెను అని కోరుకుంటున్నావు? నేను మా అన్నగారికి దాసుణ్ణి. పరాధీనుణ్ణి. ఓ విశాలాక్షీ! ఓ అమలవర్ణినీ! నీవు సర్వార్థ సమృద్ధుడు

అయిన మా అన్నగారినే చేపట్టు. ఆయనకు చిన్నపెండ్లానివిగా నీకోరికలు అన్నీ ఈడేర్చుకొని సంతోషముతో ఉండు. నీవు చేపట్టితే ఆయన ఇప్పుడు ఉన్న ఆ విరూపను, ఆ దుర్మార్గురాలిని, ఆ గేడిని, ఆ నడుములేనిదానిని, ఆ ముసలమ్మను వదలిపెట్టి నిన్నే భార్యగా భజిస్తాడు. ఓ శూర్పణఖా! నీవు వరవర్ణినివి. వరారోహవు. తారతమ్యాలు తెలిసినవాడు ఎవడు అయినా సరే, నీ ఉత్తమాకారాన్ని వదలిపెట్టి మానవాంగనమీదకి మనస్సు పోనీయడు" అని చెప్పినాడు.

ఈ మాటలు లక్ష్మణుడు వేళాకోళముగా అన్నాడు అని ఆ గేడి రాక్షసి తెలుసుకోలేదు. ఆ రాకాసి మరులుకొని, మైమరచి వేళ్లాడుతూ ఉన్న పొట్టతో పర్ణశాలలోకి పోయి, సీతాదేవితో కూర్చొని ఉన్న ఆ పరంతపుణ్ణి, ఆ దుర్ధర్షుణ్ణి రాముణ్ణి చూచి, "నీవు ఈ విరూపను, ఈ దుర్మార్గురాలిని, ఈ గేడిదానిని, ఈ నడుములేని దానిని, ఈ ముసలమ్మను భార్యగా పెట్టుకొని నన్ను గౌరవించకుండా ఉన్నావు. ఇప్పుడే నీకళ్ళ ఎదుటనే దీనిని, ఈ మానవాంగనను నమిలివేస్తాను. నాకు ఇక సవతిపీడ లేకుండా పోతుంది. నీతో కూడా నా యిష్టము వచ్చినట్టు సుఖముగా తిరుగుతాను" అంటూ కోపముతో రేగింది. దాని మిడిగుడ్లు అప్పటికి అప్పుడు కొరవులువలె అయిపోయినవి. రోహిణీనక్షత్రముమీద మహోల్కమువలె, జింకపిల్ల కన్నులవంటి కన్నులతో చూస్తూ ఉన్న సీతాదేవిమీద పడిపోయింది. మృత్యుపాశమువలె సీతాదేవి మీద పడపోతున్న ఆ శూర్పణఖను ఆ మహాబలవంతుడు రాముడు కుపితుడై నిగ్రహించినాడు.

అంతట లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! పెద్దమనుష్యులుకానివాండ్లతోనూ, క్రూరులతోనూ ఏమి అయినప్పటికిన్నీ పరిహాసము ఆడకూడదు. ఇప్పుడు ఈ వైదేహికి ఏ అపాయమూ రాకుండా చూడు. ఓ నరశార్దూలమా! ఈ వికృతాకారకు, ఈ దుష్టురాలికి, ఈ మహోదరికి మదము ఎక్కింది. దీనిని విరూపను చేయడము ఉచితము" అని రాముడు చెప్పినాడు. ఈమాటలు వినీ వినడముతో లక్ష్మణుడు క్రుద్ధుడు అయిపోయి రాముడి ప్రక్కను ఉన్న ఖడ్గము లాగుకొని ఆ శూర్పణఖ రెండు చెవులూ, ముక్కూ తెగవేసినాడు.

ఆ భయంకరాకార చెవులూ, ముక్కూ తెగిపోయి వికృతస్వరముతో ఏడుస్తూ, వచ్చిన దారినే అడవిలోకి పరుగెత్తి, నెత్తురుతో ఒండ్లు అంతా తడిసిపోయి వర్షాకాలములో మేఘాల ఉరుములవలె కేకలు పెట్టుతూ, నెత్తురు కారకుండా చేతులు అడ్డము పెట్టుకొంటూ, గర్జిస్తూ జనస్థానము పోయింది. అక్కడ రాక్షససమూహముతో ఉన్న ఉగ్రదర్శనుణ్ణి ఖరుణ్ణి చూచి, ఆకాశమునుంచి పిడుగువలె నేలకూలింది. నెత్తురుతో పొర్లాడుతూ, భయముతో ఒండ్లు తెలియకుండా పోయింది.

19

నెత్తురుతో తడిసిపోయి ఒండ్లు తెలియకుండా అట్లా నేలమీదపడి ఉన్న తోబుట్టువును శూర్పణఖను ఖరుడు చూచినాడు. క్రోధసంతప్తుడు అయిపోయి, "అక్కా! లే, జరిగింది అంతా చెప్పు. నిన్ను ఇట్లా విరూపను చేసినవాడు ఎవడో చెప్పు, స్పష్టముగా చెప్పు. కోరలనిండా విషముతో ఎదుటికి పోయినా ఏమీ చేయకుండా కూర్చున్న కృష్ణసర్పాన్ని, విలాసముగా చిటికెనవ్రేలితో చెనకినవాడు ఎవడు? కాలపాశాన్ని తెలియక మెడకు తగిలించుకొన్నవాడు ఎవడు? నిన్ను తాకడము అనే విషము పుచ్చుకొన్నవాడు ఎవడు?

"అక్కా! నీవు ఎంతో బలముకలదానవు. పరమపరాక్రమముకలదానవు. ఇష్టమువచ్చినట్లు ఎక్కడికి పడితే అక్కడికి పోగలదానవు. కామరూపిణివి. యముడి అంతటి దానవు. నీవు ఎక్కడికి పోయినావు? నీకు ఈ దురవస్థ ఎందుకు వచ్చింది? ఎవడినుంచి వచ్చింది? ఏ మహా పరాక్రమవంతుడు నిన్ను ఇట్లా విరూపను చేయకలిగినాడు? ఈ ప్రాణికోటిలో వాడు ఎవడు? వాడు దేవుడా, గంధర్వుడా, చెప్పు. మహర్షులలో ఎవడైనా ఇట్లా చేసినాడా? చెప్పు. ఈ లోకములో నాకు అప్రియము చేసేవాడు ఎవడూ లేడు. పాకాసురుణ్ణి సంహారముచేసిన సహస్రాక్షుడు సయితము, నాకు అపకారము చేయడానికి వెరుస్తాడు. నిన్ను ఇట్లా చేసినవాడు ఎవడో చెప్పు. నిన్ను విరూపను చేసినవాడు ఎక్కడ ఉన్నా, ఎవరితో ఉన్నా నీళ్ళలో కలిసిపోయిన పాలను విడకొట్టుకొని త్రాగే హంసవలె, ఇప్పుడే నా బాణాలతో వాడి ప్రాణాలు తోడివేస్తాను. నా బాణాలకు వాడు బ్రతకడము ఉత్తది. ఆయువుపట్లు అన్నీ తెగి వాడు కూలిపోతాడు. నురుగులతో కారే వాడి ఎర్రటి నెత్తురును ఈ భూమి త్రాగుతుంది. పక్షులు గుంపులు గుంపులుగా పోగు అయి, వాడి కళేబరాన్ని చీల్చుకొని సంతోషముగా తింటవి. నేను ఎవడిని అయినా యుద్ధానికి ఈడిస్తే, వాణ్ణి దేవతలు అయినా రక్షించలేరు. గంధర్వులు అయినా రక్షించలేరు. రాక్షసులు అయినా రక్షించలేరు. చివరకు పిశాచాలు అయినా వాణ్ణి రక్షించలేవు. నిన్ను ఇట్లా విరూపను చేసినవాడు ఎవడో చెప్పు. ఈ దండకారణ్యములో నిన్ను ఎదిరించి జయించిన ఆ దుర్మార్గుడు ఎవడో చెప్పు. ఎందుకు అట్లా పడుకొంటావు? తెలివి తెచ్చుకో. గుర్తు తెచ్చుకో, చెప్పు" అన్నాడు ఖరుడు.

శూర్పణఖ కన్నీళ్ళు కారుస్తూ, "వాండ్లు యువకులు, రూపసంపన్నులు, సుకుమారులు, మహాబలవంతులు, పుండరీకవిశాలాక్షులు, వల్కలాజినధారులు. వాండ్లు ఫలమూలాహారులు, జితేంద్రియులు, తాపసవేషులు, ధర్మాచరణ పరాయణులు, అన్నదమ్ములు, దశరథమహారాజు పుత్రులు రామలక్ష్మణులు.

రాజలక్షణలక్షితాంగులు. వాండ్లు గంధర్వరాజులవలె కనిపించినారు. వాండ్లు దేవతలో, మనుష్యులో నేను నిశ్చయించుకోలేక పోయినాను. వాండ్ల ఇద్దరి మధ్యను ఒక యువతిని చూచినాను. అది మంచి రూపసి. సమస్తాభరణభూషిత. సుమధ్యమ. దానినుంచి, ఆ ఆడుదాని నుంచి ఆ అన్నదమ్ములు ఇద్దరూ ఏకము అయి నన్ను అనాథనువలె ఇట్లా చేసివేసినారు. ఆ కుటిలవర్తననూ, ఆ అన్నదమ్ములనూ చంపివేసి, నురుగులతో కారే వారి వెచ్చని నెత్తురు నేను త్రాగవలెను. ఇది నా కోరిక. నాయనా! నీవు నా కోరికను చెల్లించవలెను" అని చెప్పింది.

శూర్పణఖ ఈమాటలు పూర్తిచేసేలోపలనే ఖరుడు మహాబలవంతులు అయిన రాక్షసులను, యములవంటివాండ్లను పధ్నాలుగుమందిని పిలిపించి, "ఓ యోధులారా! చీర కృష్ణాజినాంబరధారులూ, శస్త్రసంపన్నులూ అయిన ఇద్దరు మనుష్యులు ఒక ఆడుదానితో ఈ ఘోరారణ్యానికి వచ్చినారు. మీరు వాండ్లను ఇద్దరినీ, ఆ ఆడుదానినీ చంపివేయవలెను. మా అక్క, ఈ శూర్పణఖ వాండ్ల నెత్తురు త్రాగుతుంది. ఇది మా ఇద్దరి కోరిక. మా ఈ కోరికను మీరు నెరవేర్చవలెను. మీ పరాక్రమము చూపించవలెను. మీరు ఈ పనికి ఇప్పుడే బయలుదేరవలెను" అని ఆజ్ఞాపించినాడు.

అంతట ఆ పధ్నాలుగుమంది రాక్షసులు గాలికి పరుగులు ఎత్తే మేఘాలవలె, శూర్పణఖతో రామాశ్రమానికి పోయినారు. ఆ మహాతేజోవంతుణ్ణి చూచినారు. నిశితాస్త్రాలతో పోయిన ఆ నిశాచరులు కార్చిచ్చును చూచిన ఏనుగులవలె నిలుచుండిపోయినారు.

20

అంత శూర్పణఖ తన వెంట వచ్చిన రాక్షసులతో సీతారామలక్ష్మణులను గురించి చెప్పింది. పర్ణశాలలోకి తీసుకొనిపోయింది. సీతాదేవితో కూర్చుని ఉన్న ఆ మహాబలవంతుణ్ణి రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ చూపించింది.

ఆ కాంతిమంతుడు రాముడున్నూ ఆ వచ్చిన రాక్షసులను, శూర్పణఖను చూచినాడు. తేజస్సుతో ప్రజ్వలిస్తూ ఉన్న లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! నీవు కొంచెము సేపు ఈ సీతను కనిపెట్టుకొని ఇక్కడనే ఉండు. నేను ఈ శూర్పణఖ వెంటపెట్టుకొని వచ్చిన రాక్షసులను సంహరిస్తాను" అన్నాడు. "అట్లాగేను" అని లక్ష్మణుడు సీతాదేవికి కాపుగా అక్కడ ఉండిపోయినాడు.

ఆ విదితాత్ముడు, ఆ ధర్మాత్ముడు బంగారు పొదిగిన పెద్దధనుస్సును సజ్యముచేసి రాక్షసులను చూచి, "ఓ రాక్షసులారా! మేము దశరథమహారాజు పుత్రులము, రామలక్ష్మణులము. నా భార్య సీతతో కూడా దుర్గమము అయిన ఈ దండకారణ్యానికి

వచ్చి ఫలమూలాలు తింటూ, ఇంద్రియ నిగ్రహముతో తపస్సు చేసుకుంటూ ధర్మము ఆచరిస్తున్నాము. మీరు మమ్ములను ఎందుకు హింసించ తలచినారు? సాధుహింసకులూ, పాపాత్ములూ అయిన మిమ్ములను అందరినీ యుద్ధముచేసి చంపివేయవలసినది అని మహర్షులు మమ్ములను ఆజ్ఞాపించినారు. అందుకోసము మేము అన్నదమ్ములము ధనుర్ధరులము అయి ఇక్కడికి వచ్చినాము.

"ఓ రాక్షసులారా! మీరు యుద్ధముచేయ తలచుకొన్నట్లయితే నిలవండి. పారిపోవద్దు. ప్రాణాలు తీపి అయితే మీదారిన మీరు పారిపొండి" అని చెప్పినాడు.

ఈ మాటలకు ఆ బ్రహ్మఘ్నులు, ఆ శూలపాణులు పద్నాలుగుమందీ క్రుద్ధులు అయిపోయి, "ఓరీ మనుష్యుడా! మా ప్రభువు ఖరుడు మహామంచి పరాక్రమవంతుడు. ఆయనకు నీవే కోపము తెప్పించినావు. నీవే ఇప్పుడు మాచేత హతము అయిపోయి ప్రాణాలు వదలుతావు. నీవు ఒక్కడివి, మేము పద్నాలుగుమందిమి. పద్నాలుగుమందిమే కాదు, అనేకమందిమి. నీవు ఏదో యుద్ధము చేస్తాను అంటున్నావు, మా ఎదుట నిలబడే శక్తి నీకు ఉందా? రా, పోరాటానికి రా. మేము వదలే శూలాలకు, ఇనుపగుదియలకు, అడ్డకత్తులకు నీవు నిర్వీర్యుడవు అయిపోయి, నీ చేతిలో ఉన్న ధనుస్సు జారవిడిచి ప్రాణాలు వదులుతావు" అంటూ మరింత క్రుద్ధులు అయిపోయి, పద్నాల్గుమందీ పద్నాలుగు శూలాలను ఒక్కసారిగా రాముడిమీద విసిరివేసినారు. ఆ దుర్జయుడు రాముడు ఆ క్షణమే ఆ పద్నాలుగు శూలాలమీదను పద్నాలుగు బంగారు బాణాలను వదలినాడు. ఆ శూలాలు అప్పటికి అప్పుడు ముక్కలు ముక్కలు అయిపోయినవి. సూర్యసమానతేజముతో తళతళ లాడుతూ సానపెట్టిన పదనునుంచి శిలలను అయినా పగులకొట్టుకొని పోయే ఆ బాణాలను తీసుకొని, ఆ మహాతేజోవంతుడు పరమకుపితుడు అయి వింటిని వంచి ఆ బాణాలను ఎక్కుపెట్టి, ఆ పద్నాలుగుమంది రాక్షసులను గురిచేసి దేవేంద్రుడు పర్వతాలమీద పిడుగులు వదిలేటట్లు వదిలినాడు. ఆ బంగారు బాణాలు ములుకులతో ధగధగలాడుతూ అమితవేగముతో ఆ రాక్షసుల వక్షస్థలాలను ఛేదించుకొని పోయి, నెత్తురుతో తడిసి పుట్టలలోనుంచి బయటికి పోయే పాములవలె దూసుకొని పోయి, పిడుగుల ధ్వనులతో నేలమీద పడ్డవి. గుండెలు తూట్లుపడి కారుతున్న నెత్తురుతో అవయవాలు అన్నీ తడిసిపోయి, వికారాకారాలతో ఆ రాక్షసులు వేళ్ళు నరికిన చెట్లవలె నేలకూలినారు.

ప్రాణాలుపోయి నేలకూలిన ఆ పద్నాలుగుమంది రాక్షసులనూ శూర్పణఖ చూచింది. దానికి ఒళ్ళు ఎరగని కోపము వచ్చింది. భయంకరముగా అరిచింది. ఏమి చేయడానికీ తోచలేదు. భయము వేసింది. అక్కడ కాలూని నిలుచుండలేక పోయింది. దుఃఖముతో బాధపడుతూ, పెద్దపెట్టున కేకలు పెట్టుకుంటూ

పరుగెత్తుకొని పోయి ఏడుస్తూ, కన్నీళ్ళు కారుస్తూ, కారుతున్న బంక ఎండిపోయిన అందుగుచెట్లవలె కొంచెము పక్కుకట్టిన నెత్తురుతో ఖరుడి ఎట్టఎదుట నేలకూలింది.

21

మళ్ళీ వచ్చి అట్లా నేలమీద పడిపోయిన శూర్పణఖను ఖరుడు చూచినాడు. అది రాక్షసుల అనర్థము కోసము వచ్చింది అని పాపము వాడికి తెలియదు. వాడికి కోపము వచ్చింది. బిగ్గరగా, "అక్కా! ఇది ఏమిటి? ఇప్పుడేకదా మాంసాశనులూ, శూరులూ అయిన రాక్షసులను పొమ్మని ఆజ్ఞాపించినది. మళ్ళీ ఎందుకు వచ్చినావు? ఎందుకు ఏడుస్తున్నావు? నేను పంపించినవాండ్లు నా భక్తులు. నామీద ఎంతో అనురాగముకలవాండ్లు. నాకు ఎప్పుడూ మేలుచేసేవాండ్లు. వాండ్లు ఎటువంటివాండ్లను అయినా చంపివేయకలరు. ఎవండ్లకూ చంప నలవికానివాండ్లు. నేను చెప్పిన పని చేయకుండా ఉండరు. నీవు దేనికోసము దిక్కులేనిదానివలె అరుస్తున్నావు? పామువలె ఎందుకు నేలమీద పొర్లాడుతావు? కారణము ఏమిటి? నేను ఉండగా నీవు దిక్కులేనిదానివలె ఏడవడము ఎందుకు? ముందు లే, లే. భయపడవద్దు. దిగులుపడవద్దు" అని ఊరడించినాడు.

ఎవరికీ ఎదిరించను అలవికాని ఆ శూర్పణఖ కళ్ళవెంట కారుతున్న నీళ్ళు తుడుచుకొంటూ సోదరుణ్ణి చూచి, "నిజమే, నేను చెవులు, ముక్కు పోగొట్టుకొని నెత్తురుకారుకొంటూ నీ దగ్గరకు వస్తే, నీవు నన్ను ఓదార్చినావు. నీకు కోపమువచ్చి ఆ రామలక్ష్మణులను చంపివేయడానికీ, నన్ను సంతోషపెట్టడానికీ పధ్నాలుగుమంది రాక్షసులను పంపించినావు, వాస్తవమే. వాండ్లు శూలాలతోను, అడ్డకత్తులతోను రాముడి మీద పడ్డారు. అయితే, రాముడు వాండ్ల ఆయువుపట్టులమీద బాణాలు వదిలి వాండ్లను పధ్నాలుగుమందినీ ఇట్టే చంపివేసినాడు. క్షణలేశములో వాండ్లు చచ్చి నేలమీద పడిపోయినారు. అటువంటి మహాబలవంతులు రాముడిచేత అట్లా చావడము చూచినాను. నాకు ఎంతో భయము వేసింది. ఓ నిశాచరుడా! నేను భయముతోను, దుఃఖముతోను నీ దగ్గరకు వచ్చినాను. ఎటుచూచినా నాకు భయము వేస్తూ ఉంది. అందువల్ల, మళ్ళీ నిన్ను శరణుజొచ్చినాను.

"తమ్ముడా! నేను ఇప్పుడు 'దిగులు' అనే సొరచేపలతోనూ, 'భయము' అనే తరంగాలతోనూ ఎంతో విశాలము అయిన దుఃఖసముద్రములో మునిగిపోతున్నాను. తమ్ముడా! నన్ను రక్షించవా? నీవు నావెంట పంపించిన రాక్షసులను రాముడు తీక్షణ బాణాలతో చంపివేసినాడు. వాడు దండకారణ్యము నివాస స్థానముగా చేసుకొని రాక్షసులకు కంటకుడు అయిపోయినాడు. నాయనా! నీకు నామీదను, ఆ రాక్షసుల

మీదను దయ ఉన్నట్లయితే, రాముడితో తుల్యము అయిన శక్తీ, తేజస్సూ నీకు ఉన్నట్లయితే వాణ్ణి వెంటనే చంపివేయవలెను. చెవులూ, ముక్కూ పోయి సిగ్గుమాలిన దానిని అయిపోయినాను. నా శత్రువును రాముణ్ణి నీవు ఇప్పుడే చంపివేయవలెను. నీవు అట్లా వెంటనే చేయకపోయేటట్లయితే నేను బ్రతుకను. నీ ఎదుటనే ప్రాణాలు వదులుతాను.

"ఓ ఖరుడా! యుద్ధములో ఆ మహాపరాక్రమవంతుడు రాముడి ఎట్టఎదుట నిలిచే శక్తి నీకూ, నీ సైన్యానికీ లేదు అని నా బుద్ధికి తోస్తున్నది. శూరుణ్ణి అనే గర్వము ఉన్నది తప్ప, నీవు శూరుడవు కావు. నీవు నిజముగా శూరుడవే అయినట్లయితే ఆ అన్నదమ్ములను, రామలక్ష్మణులను ఈపాటికి చంపినేసేవాడవు. నీవు వాండ్లకు చాలవు. నీ విక్రమము అబద్ధము. మహాపరాక్రమశాలిని అనీ, మహాశూరుణ్ణి అనీ బొంకులాడు తున్నావు. ఓ నిశాచరుడా! నీవు కులము చెడకొట్టడానికి పుట్టినావు. నీకు రాముడితో సరిసమానము అయిన శక్తీ, తేజస్సూ ఉంటే వెంటనే రాముణ్ణి, ఆ దండకారణ్య నిలయుణ్ణి చంపు. లేకపోయేటట్లయితే నీవు నీ బంధువులతో కూడా ఈ జనస్థానము నుంచి లేచిపో. బలహీనుడు, అల్పవీర్యుడు ఈ జనస్థానములో ఉండకూడదు. వెంటనే వెళ్ళిపో. నీవు అట్లా చేయకపోయేటట్లయితే, రాముడి పరాక్రమానికి పరాజితుడవు అయి నాశనము అయిపోతావు. ఆ దశరథాత్మజుడు రాముడు మహాతేజోవంతుడు. వాడి తమ్ముడు, నన్ను విరూపను చేసిన లక్ష్మణుడున్నూ మహావీర్యవంతుడు" అంటూ ఏడుస్తూ చెప్పి, పెద్దపొట్టవేసుకొన్న ఆ శూర్పణఖ చేతులతో పొట్ట కొట్టుకొంటూ ఎలుగెత్తి ఏడవసాగింది.

22

ఖరుడు

ఖరుడు శూరుడు. అతనిని రాక్షసులమధ్య శూర్పణఖ అట్లా అవమానము అయిన నానామాటలూ అంటూ ఉంటే అతడు మహోగ్రుడు అయిపోయి, "శూర్పణఖా! నీకు జరిగిన అవమానానికి నాకు ఎంత కోపముగా ఉందో మాటలతో చెప్పలేను. అది పర్వకాలములో సముద్రమువలె, ఆపడానికి అశక్యముగా పొంగిపోతూ ఉంది. వాడు, రాముడు మానవుడు. వాడిది అల్పాయువు. వాడి పరాక్రమాన్ని లెక్కచేయ నవసరమే లేదు. వాడి దుష్ట చర్యలకు వాడు ఇప్పుడే నా చేత హతము అయిపోతాడు. శూర్పణఖా! నీవు ఏడవవద్దు. నేను వాణ్ణి, ఆ రాముణ్ణి వాడి తమ్ముడు లక్ష్మణుడితో కూడా యమసదనానికి పంపించి వేస్తాను. వాణ్ణి గొడ్డలితో నరుకుతాను. వాడి వేడి వేడి నెత్తురు నీవు త్రాగవలెను" అన్నాడు.

ఖరుడి నోటినుంచి ఈ క్రూరవాక్కులు వెలువడగానే శూర్పణఖ ఉబ్బిపోయింది. దానికి పట్టశక్యముకాని సంతోషము వచ్చింది. అది మూర్ఖురాలు. అట్లాగే జరుగుతుంది అని నమ్మింది. ఆ క్షణమువరకూ అది ఖరుణ్ణి తిట్టింది. అంతట అతనిని ప్రశంసించడము మొదలు పెట్టింది. అంతవరకూ దూషించిన సోదరి పొగడడము మొదలు పెట్టగానే, ఖరుడున్నూ కోపపరవశుడు అయిపోయి దూషణుణ్ణి చూచి, "ఓ సేనాపతీ! మన సైనికులను భీమవేగులను, నల్లటి మేఘాలవలె భయంకరము అయినవాండ్లను, యుద్ధములో వెనకఅంగ వేయనివాండ్లను, ఎటువంటి క్రూరకృత్యాలు చేయడానికి అయినా వెనుతీయనివాండ్లను, లోకహింసావిహారులను, పెద్ద పులులవంటివాండ్లను, ఉగ్రతేజస్సులను, పెద్దపెద్ద నోళ్ళు ఉన్నవాండ్లను, మహాదర్పముతో యుద్ధముచేసేవాండ్లను, నా చిత్తాన్ని అనుసరించి పోయేవాండ్లను, మహాబలవంతులను మన పధ్నాలుగువేలమంది రాక్షసయోధులను ఇప్పుడే యుద్ధసన్నద్ధులను చేయవలెను. యుద్ధప్రయత్నాలను అన్నిటినీ ఈక్షణమే చేయవలెను.

"ఓ సేనాపతీ! వెంటనే నా రథాన్ని సిద్ధము చేయించు. నా వివిధవిచిత్ర ధనుస్సులను, బాణాలను, ఖడ్గాలను, వాడివాడి ఈటెలను తెప్పించు.

"ఓ సౌమ్యుడా! ఆ దుర్వినీతుణ్ణి చంపివేయవలెను. అందుకు మహాబలవంతులు పుట్టిన పులస్త్యవంశములో రణకోవిదుణ్ణి అయిన నేనే ముందుగా పోవలెను అనుకుంటున్నాను" అని చెప్పినాడు.

ఖరుడు ఈ మాటలు పూర్తిచేయగానే పంచవన్నెల గుర్రాలు పూన్చి సూర్యుడివలె ధగధగలాడుతూ ఉన్న రథము సిద్ధము అయి వచ్చింది అని దూషణుడు చెప్పినాడు.

బంగారుతో మలాముచేసినందువల్ల ఆ రథము మేరుపర్వతశిఖరమువలె ధగధగలాడుతూ ఉంది. దాని పోలుకర్రకు వైడూర్యమణులు పొదిగి ఉన్నవి. దానివి బంగారు చక్రాలు. బంగారముతో చేసిన పక్షులూ, చేపలూ, పూలచెట్లూ, కొండలూ, సూర్యచంద్రబింబాలూ, నక్షత్రాలూ మొదలు అయిన బొమ్మలతోనూ, బంగారు గంటలతోనూ ఆ రథము అలంకరించి ఉంది. అది ఎంతో విశాలము అయిన రథము. అందులో కత్తులూ, బాకులూ మొదలు అయిన ఆయుధాలు అన్నీ అమర్చి ఉన్నవి. ధ్వజాలతో శోభిస్తున్నది.

ఖరుడు కోపోద్రేకముతో ఆ రథము ఎక్కినాడు.

రథము ఎక్కిన ఖరుణ్ణి రాక్షసయోధులు అందరూ చూచినారు. అంతట ఆ భీమపరాక్రములు అందరూ మహాబలవంతుడు అయిన దూషణుణ్ణీ, రథము ఎక్కిన

ఖరుణ్ణే ఆజ్ఞకోసము ఎదురుచూస్తూ నిలుచున్నారు. పెద్ద పెద్ద విండ్లతోను, భయంకరము అయిన ఆయుధాలతోను యుద్ధ సన్నద్ధులు అయి వచ్చి నిలుచున్న రాక్షసయోధులను అందరినీ రథముమీద కూర్చున్న ఖరుడు చూచినాడు. వారిని అందరినీ వెంటనే బయలుదేరవలసింది అని ఆజ్ఞాపించినాడు.

అంతట ఆ ఖరుడి చిత్తాన్ని అనుసరించిపోయే ఆ పధ్నాలుగువేలమంది రాక్షసయోధులున్నూ మహాభయంకరము అయిన ముద్గరాలతోనూ, అడ్డకత్తులతోనూ, శూలాలతోనూ, మంచి పదను అయిన గొడ్డళ్ళతోనూ, చక్రాయుధాలతోనూ, తోమరాయుధాలతోనూ, ఈటెలతోనూ, భయంకరము అయిన ఇనుప గుదియల తోనూ, పెద్దపెద్ద విండ్లతోనూ, గదలతోనూ, పెద్ద పాడుగాటి కత్తులతోనూ, రోకళ్ళవంటి దుడ్డుకర్రలతోనూ, వజ్రాయుధమువంటి ఎనిమిది అంచుల ఆయుధాలతోనూ జనస్థానము నుంచి కోలాహల ధ్వనులతో అమితవేగముగా బయలుదేరినారు.

ఆ సేనల వెనుక ఖరుడి రథము కదిలింది. ఆ మహాసైన్యము ఉరవడితో పోవడము ఖరుడు చూచినాడు. అప్పుడు ఆ రథసారథి ఖరుడి అభిప్రాయము తెలుసుకొని, గుర్రాలను అమితవేగముగా వదలినాడు. ఆ రథధ్వానముతో దిక్కులూ, దిక్కుల మూలములూ పిక్కటిల్లిపోయినవి.

ఆ రాక్షససైన్యమూ, రథమూ ఉరవడిగా పోయినకొద్దీ ఖరుడి కోపము పెరిగిపోయింది. ఎప్పుడు ఎప్పుడు శత్రువును వధించడమా అని యముడివలె తొందరపడుతూ, రథాన్ని ఇంకా వేగముగా తోలవలసింది అని అతడు రాళ్ళ వాన కురిసే మేఘమువలె గర్జించినాడు.

23

ఖరుని యుద్ధము

ఖరుడి రాక్షససైన్యము జనస్థానమునుంచి కదిలింది. పొలిమేర దాటలేదు. అప్పుడు ఆకాశాన గాడిదరంగుతో మబ్బులు దట్టముగా కమ్ముకొన్నవి.

పూలు పరచిన ఆ రాజవీధిలో మిట్టపల్లాలులేని సమప్రదేశాన పరుగెత్తుతున్న ఖరుడి రథాశ్వాలు కారణములేకుండా కాళ్ళు జారి కిందపడిపోయినవి. ఎంతో ఎత్తున ఉన్న హేమధ్వజముమీద మహాకాయముతో భయంకరము అయిన గద్ద ఒకటి వాలింది. ఎంత అదలించినా, బెదరించినా కదలకుండా అది అక్కడనే కూర్చుంది.

అప్పుడు సూర్యుడి గాలిగుడి (పరివేషము) నల్లపడిపోయి, అంచులు మాత్రము నెత్తురు రంగుతో కొరవి చక్రమువలె కనిపించింది. ఇనుపగుదియవంటి మనిషి మొండెము ఒకటి సూర్యబింబము సమీపాన కనిపించింది.

అది పర్వదినము కాకపోయినా సూర్యుణ్ణి రాహువు మ్రింగివేసినాడు. సూర్యుడి కాంతులు మాసిపోయినవి. ముందుకు సాగిపోవడానికి అలవికాకుండా ఎదురుగాలి కొట్టింది. సంధ్యాకాలము కాకపోయినా పడమటిదిక్కున ఆకాశము నెత్తురుతో తడిసిన గుడ్డవలె అగుపించింది.

తూర్పుదిక్కున నక్కలు పెద్దపెట్టున మొఱ్ఱో మంటూ మొరుగుతూ, ఆ మహాసైన్యానికి ఎదురుగుండా వచ్చి నిప్పులు కక్కుతూ భయంకరముగా అరచినవి. క్రూరమృగాలు, మాంసముతినే మహాభయంకరము అయిన రాబందులు, గద్దలు మొదలయిన పక్షులు సైన్యసమీపానికి వచ్చి వివిధ వికృత స్వరాలతో కర్ణకఠోరముగా అరచినవి.

తామరకొలనులో కమలాలు వాడిపోయినవి. చేపలూ, జలపక్షులూ కనబడకుండా అడుగుకు పోయి దాగుకున్నవి. పూలూ, పండ్లూ, ఆకులూ రాలి చెట్లు మోండ్లు అయిపోయినవి. గోరువంకలు వీచీ కూచీ మంటూ శ్రుతికటువుగా కూయసాగినవి.

పగిలిపోయిన కొండలవలె మేఘాలు పరుగులు ఎత్తుతూ ఆకాశాన్ని అనాకాశము చేసివేసినవి. అమంగళముగానూ, పరమభయంకరముగానూ నెత్తురువాన కురవడము మొదలుపెట్టింది.

ఒళ్ళు గగురుపుట్టించేటట్లు చిమ్మచీకట్లు కమ్ముకొన్నవి. దిక్కులూ, విదిక్కులూ తెలియకుండా పోయినవి. నక్షత్రాలు మిణుగురుపురుగులవలె నేల రాలినవి. చూడటానికి మహాభయంకరముగా మంటలు మండుతూ పిడుగులు పడ్డవి. కొండలూ, అడవులూ మొదలు అయిన వాటితో భూమి కంపించింది.

రథముమీద కూర్చున్న ఆ ధైర్యవంతుడు ఖరుడు అధైర్యపడవద్దు అని అరచి రాక్షసయోధులకు చెప్పుతూ ఉండగా, వాడి గొంతు ఎండి మాటలు తడపడిపోయినవి. వాడి ఎడమభుజము అదిరింది. అకారణముగా వాడి కళ్ళలో నీళ్ళు కమ్ముకొన్నవి. వాడికి హఠాత్తుగా మాడుపోటు పుట్టింది. అట్లా అయినప్పటికిన్నీ, వ్యామోహము (శ్రీరాముణ్ణి చంపివేయవలెను అనే వ్యామోహము) వాణ్ణి వదలలేదు. ఆ మహోత్పాతాలకు వాడు ఒక్క నవ్వు నవ్వి రాక్షసయోధులను అందరినీ చూచి, "ఓ యోధులారా! నేను నా బలపరాక్రమమునుంచి ఈ ఉత్పాతాలను లెక్కచేయను. బలవంతుడు ఎవడు అయినా బలహీనుణ్ణి లెక్కచేస్తాడా! నేను నక్షత్రాలను సయితము నా తీక్ష్ణబాణాలతో ఆకాశమునుంచి పడగొట్టగలను. నాకు కోపమువస్తే మృత్యువును అయినా చంపి వేస్తాను. రాముడు తాను బలవంతుణ్ణి అని గర్వపడుతున్నాడు. నా

తీక్ష్ణబాణాలను వాడు ఎరుగడు. వాణ్ణి, వాడి తమ్ముడు లక్ష్మణుణ్ణి చంపివేయకుండా నేను ఇంటికి మళ్ళను. రామలక్ష్మణులకు ఎందుకోసము విపరీతబుద్ధి పుట్టిందో! అందుకోసమే, మా అక్క శూర్పణఖ వాండ్ల నెత్తురు త్రాగవలెను అనుకొంటున్నది. ఆమె కోరిక ఈడేరవలెను. అందుకే, నేను ఇప్పుడు పోతున్నాను. మీరు భయపడవద్దు. ఇదివరకు ఎన్నడూ ఏ యుద్ధములోను నేను అపజయము ఎరుగను. ఇది మీరు అందరూ ప్రత్యక్షముగా చూచిన విషయమే. నేను అబద్ధము ఆడడము లేదు. కోపమువచ్చి నేను యుద్ధానికి బయలుదేరితే, దేవేంద్రుడు అయినా ఐరావతముమీదినుంచి వజ్రాయుధముతో కూడా నేలకూలుతాడు. ఇంక ఈ మానవులను, ఈ అర్భకులను గురించి చెప్పేది ఏమిటి" అంటూ అరచినాడు.

ఆ గర్జనకు ఆ మహాసైన్యములో రాక్షసులు అందరూ మృత్యుపాశబద్ధులు అయి అమితముగా హర్షించినారు. అంతట ఖరుడి రథము అమితవేగముతో బయలుదేరింది. అప్పుడు ఆ మహోగ్రసైన్యము అంతకన్నా అమితవేగముతో కదలింది.

అప్పుడు 'శ్యేనగామి, పృథుగ్రీవుడు, యజ్ఞశత్రువు, విహంగముడు, దుర్జయుడు, కరవీరాక్షుడు, పరుషుడు, కాలకార్ముకుడు, మేఘమార, మహామాలి, సర్పాస్యుడు, రుధిరాశనుడు' అనే పన్నెండుమంది అమాత్యులు ఖరుడికి ఇరుపార్శ్వాలా బయలుదేరినారు. వారి వెనుక దూషణుడు, 'మహాకపాలి, స్థూలాక్షుడు, ప్రమాథి, త్రిశురుడు' అనే నల్గురు సేనానాయకులతో పోయినాడు.

సూర్యచంద్రులమీదికి పోయే అంగారకాది గ్రహాలవలె రామలక్ష్మణులమీదికి ఆ బలవంతులు ఆ రాక్షససైన్యముతో సమరాభికాంక్షతో భీమవేగముతో పోయినారు.

24

ఆ ఖరపరాక్రముడు ఖరుడు రామాశ్రమముమీదికి బయలుదేరగానే పుట్టిన మహోత్పాతాలను రామలక్ష్మణులున్నూ చూచినారు. ఒళ్ళు గగురుపుట్టించే ఆ ఘోర ఉత్పాతాలు కనపడగానే రాముడు లక్ష్మణుడితో, "ఓ మహాబాహూ! మహోత్పాతాలు ఎంత భయంకరముగా పుట్టినవో చూడు. ప్రజలు అందరూ-ప్రజలే కాదు, సమస్త ప్రాణికోటీ- నాశనము అయిపోతుందేమో అనిపిస్తున్నది. తమ్ముడా! ఇవన్నీ రాక్షస సంహారము కోసము పుట్టినవి. గాడిదరంగు మబ్బులు ఆకాశములో పరుగులు ఎత్తుతూ, మహాభయంకరముగా ఉరుముతూ నెత్తురు ధారలుగా కురుస్తున్నవి. లక్ష్మణా! చూడు. నా బాణాలు అన్నీ పొగలు రాజుకొంటూనూ, నా బంగారువిండ్లు అటూ ఇటూ పొర్లాడుతూనూ యుద్ధాన్ని కాంక్షిస్తున్నవి. అభినందిస్తున్నవి. ఇప్పుడు మన ఎదుట కూస్తున్న అడవిపక్షుల కూతలనుపట్టి మనకు ఏ భయమూలేదు అనీ,

శత్రువులకు ప్రాణసంశయము అనీ తోస్తున్నది. మంచి మహాయుద్ధము జరుగుతుంది. సందేహము లేదు. నా కుడిభుజము మాటిమాటికీ అదురుతూ ఉంది. త్వరలోనే మనకు జయము, శత్రువులకు అపజయము అవుతుంది.

"తమ్ముడా! యుద్ధానికి ఉద్యుక్తులు అయ్యేవారి ముఖాలు కళకళలాడుతూ ఉండవలెను. అట్లా కళకళలాడుతూ ఉండకపోయేటట్లయితే, వాండ్ల బ్రతకడము ఉత్తది. ఇప్పుడు నీ ముఖము కళకళలాడుతూ ఉంది. ప్రసన్నముగా ఉంది.

"నాయనా! రాక్షసుల గర్జనలూ, ఆ క్రూరకర్ములు మ్రోగిస్తున్న భేరీల భాంకృతులూ కర్ణకఠోరముగా వినపడుతున్నవి. ఆపదలు రాపోతున్నవి అని ఆశంకించినప్పుడు ముందుగానే అవసరము అయిన ఏర్పాట్లు అన్నీ చేసుకోవడము బుద్ధిమంతుల లక్షణము. కాబట్టి, నీవు ఇప్పుడే ధనుర్బాణాలు తీసుకొని వైదేహిని వెంటపెట్టుకొనిపోయి, చెట్లు దట్టముగా కమ్ముకొని పయికి కనపడకుండా ఉండే కొండగుహలో ఉండు. నాయనా, లక్ష్మణా! నీవు నా ఈ మాటకు ఎదురు చెప్పవద్దు. నేను ఒట్టు పెట్టుతున్నాను. నీవు ఇప్పుడే బయలుదేరు.

"తమ్ముడా! నీవు శూరుడవు. మహాబలవంతుడవు. నీవు ఒక్కడవే ఈ రాక్షసులను అందరినీ సంహారము చేయకలవు. నాకు తెలుసును. కాని, ఇప్పుడు వీళ్ళను అందరినీ నేనే స్వయముగా చంపివేయవలెను అనుకొంటున్నాను'' అన్నాడు.

అంతట లక్ష్మణుడు ధనుర్ధరుడు అయి సీతాదేవిని వెంటపెట్టుకొని దుర్గమము అయిన కొండగుహలోకి పోయినాడు. అప్పుడు రాముడు మంచి ఉపాయమే తోచింది అనుకొంటూ, అగ్నిహోత్రమువలె ధగధగలాడే కవచము తొడుగుకొని, చిమ్మచీకటిలో పొగలు, గిగలు లేకుండా భగభగమండే మంటవలె కనపడుతూ దశదిశలూ మారుమోగిపోయేటట్టు ధనుష్టంకారము చేయసాగినాడు.

ఆ జరగబోయే యుద్ధము చూడవలెను అనే కుతూహలముతో అప్పుడు అక్కడికి దేవతలు, బ్రహ్మర్షులు, మహాత్ములు, గంధర్వులు, సిద్ధులు, చారణులు మొదలు అయిన పుణ్యకర్ములు అందరూ చేరి ఒకరితో ఒకరు, "లోకహితమూ, గోబ్రాహ్మణహితమూ కాంక్షించేవారికి శుభము అయితీరుతుంది. అసురపుంగవులను అందరినీ చక్రధరుడు అయిన మహావిష్ణువువలె ఈ రాక్షసులను అందరినీ ధనుర్ధరుడు అయిన ఈ రాముడు సంహారము చేయవలెను అని చెప్పుకొంటూ, రాక్షసులు పధ్నాలుగువేలమంది ఉన్నారు. వాండ్లు ఎటువంటి ఘోరకృత్యాలను అయినా చేసివేస్తారు. ధర్మాత్ముడు రాముడు ఒక్కడేను, ఇంతమందితో ఎట్లా యుద్ధము చేస్తాడో చూడవలసిందేను'' అనుకొంటూ, అందరూ విమానాలలో కూర్చున్నారు.

ఎటువంటి దుర్ఘటకార్యాన్ని అయినా ఇట్టే సాధించే రాముడు ఒక్కడూ యుద్ధముఖాన నిలుచున్నాడు. అప్పుడు ఆ తేజోవంతుడి రౌద్రాకారాన్ని చూచి ప్రాణికోటి అంతా భయపడి పోయింది. అప్పుడు ఆ ధనుర్ధరుడి రూపము క్రుద్ధుడు అయి శూలము పట్టుకొని నిలుచున్న ప్రళయకాలరుద్రుడివలె కనిపించింది.

మహాగంభీరధ్వనులతోనూ, ధ్వజాలతోనూ, భయంకరము అయిన కవచాలతోనూ, వివిధాయుధాలతోనూ వస్తూ ఉన్న ఆ రాక్షససైన్యాన్ని రాముడు చూచినాడు. ఆ అడవి అంతా కంపించి పోయేటట్టు ఆ రాక్షససైనికులు సింహనాదాలు చేస్తూనూ, ఒకండ్లను ఒకండ్లు చూచి 'రాముణ్ణి నేను చంపివేస్తాను అంటే, నేను చంపివేస్తాను' అని పెద్దపెద్ద కేకలు పెట్టుతూనూ, ధనుష్టంకారాలు చేస్తూనూ, సంతోషాతిశయముతో దేహాలు పెంచుతూనూ, పెద్దపెట్టున ఒక్కసారిగా అరుస్తూనూ, దుందుభులు మోగిస్తూనూ రాముడిమీదికి నడువసాగినారు.

ఆ మహాభయంకర ధ్వనులకు ఆ అడవిలో ఉన్న క్రూరమృగాలు అన్నీ భయపడిపోయినవి. అంతట అవి వెనుకకు తిరిగి చూడకుండా చప్పుడు రాని వైపుకు పరుగెత్తి పారిపోయినవి.

గంభీరధ్వనులతోనూ, వివిధాయుధాలతోనూ ఆ రాక్షస సైన్యము అప్పుడు ఒక మహాసముద్రమువలె వచ్చి, రాముడి చుట్టూ నిలిచింది. ఆ రణపండితుడు రాముడు తన చుట్టూ ఉన్న సైన్యాన్ని తేరిపార చూచినాడు. సమస్తరాక్షసులనూ సంహారము చేయడానికి ఆ తేజోవంతుడు తన పెద్దధనుస్సును సజ్యముచేసి అమ్ములపొదిలో నుంచి బాణాలు తీసుకొని మహోగ్రుడు అయి తేరిపార చూడను అలవికాని ప్రళయకాలాగ్ని వలె జ్వలిస్తూ ఉంటే, వనదేవతలు అందరూ భయపడిపోయినారు. దక్షయజ్ఞము ధ్వంసము చేయడానికి ఉంకించిన పినాకపాణివలె అట్లా యుద్ధముఖాన నిలుచున్న ఆ తేజోవంతుణ్ణి, ఆ కోదండపాణిని రాముణ్ణి చూచి, సర్వభూతాలూ భయపడి పారిపోయినవి.

అప్పుడు ఆ రాక్షససైన్యము అగ్నిహోత్రకాంతుల కవచాలతోనూ, ఆభరణాలతోనూ, కార్ముకాలతోనూ, ధ్వజాలతోనూ సూర్యోదయకాలాన నీలమేఘ సమూహమువలె కనిపించింది.

25

క్రుద్ధుడు అయి శత్రుసంహారము చేయడానికి చేతిలో చాపము పట్టుకొని నిలుచుని ఉన్న రాముణ్ణి, రాక్షససైన్యము వెనక రథముమీద వస్తూ ఉన్న ఖరుడు

చూచినాడు. రాముణ్ణి చూచీ చూడడముతో ఖరుడు చాపము ఎత్తి, శరము సంధించి, రధాన్ని రాముడికి ఎదురుగుండా తోలవలసింది అని సారధిని ఉద్దేశించి అరచినాడు. సారథి ఖరుడి ఆజ్ఞను శిరసావహించినాడు. ఏకాకిగా ధనుస్సు సజ్యము చేస్తూ ఉన్న ఆ మహాబాహువువైపుకు గుఱ్ఱాలను తోలినాడు. అట్లా పోతూ ఉన్న రధాన్ని చూచి, శ్యేనగామి మొదలు అయిన అమాత్యులు అందరూ మహానాదాలు చేస్తూ ఖరుణ్ణి వెంబడించినారు. రాక్షసుల మధ్యను రధములో పోయిన ఖరుడు, అప్పుడు నక్షత్రాల మధ్యను ఉదయించిన అంగారకుడివలె అగుపించినాడు.

అంతట ఆ ఖరుడు రాముడిమీద ఒక్క వెయ్యి బాణాలు వదలి సింహనాదము చేసినాడు.

ఆ అసమాన పరాక్రముడు, ఆ భయంకర ధనుర్ధరుడు రాముడు అజయ్యుడుగా నిలుచుని ఉండడము చూచి, రాక్షసయోధులు అందరూ క్రుద్ధులు అయిపోయినారు. వివిధాయుధాలూ వర్షముగా కురిపించినారు. ప్రయోజనము లేకపోయింది. అంతట, ఆ రాక్షసయోధులు మరింతగా క్రోధావేశపరవశులు అయిపోయి ఇనపగుదియలూ, అడ్డకత్తులూ, శూలాలూ, ఈటెలూ, ఖడ్గాలూ, గొడ్డళ్ళూ తీసికొని రాముడిమీదికి పరుగెత్తినారు. రాముణ్ణి చంపివేయడానికి ఆ అమిత పరాక్రమవంతులు, మహామేఘాలవంటి ఆ రాక్షసులు కారుమబ్బులు ఉరిమినట్లు మహాభయంకరముగా కేకలు పెట్టుకొంటూ కొందరు రధాలమీదనూ, కొందరు గుఱ్ఱాలమీదనూ, కొందరు కొండలంతటి ఏనుగులమీదనూ రాముడి మీదికి పరుగెత్తినారు. ఆ ఘోర రాక్షసయోధులు అందరూ గుంపులు గుంపులుగా రాముడి చుట్టూ మూగినారు. హిమవత్పర్వతము మీద మేఘాలవలె, రాముడిమీద ధారాపాతముగా బాణవర్షము కురిపించసాగినారు.

మహానదీప్రవాహాలు అన్నీ సముద్రముపోటుకువలె, ఆ రాక్షసులు వదలిన సమస్తాయుధాలూ రాముడి బాణాలకు తలలు ఒగ్గినవి.

ఉరుములు ఉరుముతూ, మెరుపులు మెరుస్తూ పొగలతో మంటలతో పిడుగులు పడుతున్నప్పటికీ మహాచలము చలించనట్లు, రాక్షసులు మహా భయంకరధ్వనులు చేస్తూ, ఘోరాయుధాలు వదలుతూ దేహాన్ని గాయపరుస్తున్నప్పటికీ రాముడు ఏమాత్రమూ బాధపడలేదు.

దేహానికి గాయాలు అయి సర్వావయవాలూ నెత్తురుతో తడిసి రాముడు అప్పుడు దినాంతమున కాపోతూ ఉండగా మబ్బులు ఆవరించిన సూర్యుడివలె అందరకూ అగుపించినాడు.

అట్లా వేలకొద్దీ రాక్షసులు చుట్టూ మూగితే ఒకే ఒకడుగా ఉన్న రాముణ్ణి చూచి దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, పరమర్షులూ మొదలైనవారు అందరూ కించపడ్డారు.

అప్పుడు రాముడు పరమకుపితుడు అయి కార్ముకాన్ని మండలాకారముగా వంచి వందలకొద్దీ, వేలకొద్దీ అర్ధచంద్రాకారపు బాణాలను వేడుకగా వదలడము మొదలుపెట్టినాడు. రాముడు అట్లా విలాసముగా వదలిన ఆ బాణాలు అన్నీ దుర్నివారాలూ, దుస్సహాలూ, గురితప్పని యమదండాలూ అయినవి. అవి అన్నీ ఆ రాక్షసులకు కాలపాశాలు అయినవి. అవి వాళ్ళ ప్రాణాలను తీసివేసినవి. అవి ఆ రాక్షసుల దేహాలను భేదించి, నెత్తురుతో తడిసి ఆకాశానికి ఎగిరి అగ్నిహోత్రజ్వాలలవలె తేజరిల్లినవి.

ఆ మండలాకార చాపములోనుంచి రాముడు లెక్కపెట్టను అలవికాని అన్ని మహోగ్రబాణాలను వదలినాడు. అవి అన్నీ ఆ రాక్షసుల ప్రాణాలను అపహరించిన తరువాతనే బయటికి వచ్చినవి.

రాముడు ఆ బాణాలతో ఆ యుద్ధములో రాక్షసుల చేతులలో ఉన్న విండ్లను వందలకొద్దీ విరగకొట్టినాడు. ధ్వజాగ్రాలను చెదరకొట్టినాడు. ఆ రాక్షసయోధులు ధరించిన కవచాలను చిరగకొట్టినాడు. ఆ యోధుల తలలను ఎగరకొట్టినాడు. దండకడియాలతో కూడా వాండ్ల బాహువులను నరికివేసినాడు. ఆ బాణాల తాకిడికి ఏనుగుతొండాలవంటి తొడలు తెగి కొందరు నేలకూలినారు. బంగారు సొమ్ములతో రధాలకు పూంచిన గుర్రాలూ, సారధులూ తెగి రధాలు పడిపోయినవి. ఏనుగులు మావటివాండ్లతో కూడా నేలకు ఒరిగినవి. గుర్రాలు రౌతులతో కూడా పడిపోయినవి. కాలిబంట్లు యమసదనానికి ఎప్పుడో పోయినారు. ఆ నాళాకారపు బాణాలూ, ఆ కర్ణాకారపు బాణాలూ, ఆ ఆయస బాణాలూ దేహాలను భేదించుకొనిపోతూ ఉంటే ఆ రాక్షసులు అందరూ ఆర్తులై అతి భయంకరముగా అరచినారు. ఆ నిశితాస్త్రాలు అందరి ఆయువుపట్టులలోను పడ్డవి. ఆ రాక్షససైన్యము అప్పుడు ఎండుటడవికి అగ్గి అంటుకొన్నట్టుగా అయిపోయింది.

అంతట ఆ రాక్షససైన్యములో అప్పటికి చావకుండా మిగిలిన భీమబలాఢ్యులు కొంతమంది రాముడికి ఎదురుగుండా పరుగెత్తి గొడ్డళ్ళూ, శూలాలూ, ఖడ్గాలూ విసరివేసినారు. ఆ మహాబాహువు రాముడు తన బాణాలతో ఆ ఆయుధాలను ముక్కలు ముక్కలు చెయ్యడమేకాకుండా, వారి కంఠాలను ఖండించివేసినాడు. ఆ రాక్షసయోధులు తలలు తెగిపోయి, కవచాలు చిరిగి[illegible]కాలు విరిగిపోయి గరుత్మంతుడి రెక్కల ఉరవడికి నేలకూలిన [illegible].

97631

రామబాణవిద్ధులు అయినప్పటికిన్నీ, చావకుండా మిగిలిన రాక్షసులు యమబాధపడుతూ, ఏడుస్తూ ప్రాణాలు కాపాడుకోవడానికి ఖరుడి దగ్గరికి పరుగెత్తినారు.

అప్పుడు దూషణుడు వాండ్లను అందరినీ ఓదార్చినాడు. ఉత్సాహపరిచినాడు. క్రుద్ధుడు అయిపోయి రుద్రుడిమీదికి యముడివలె, రాముడి మీదికి పరుగెత్తినాడు. ఆ దూషణుడి అండను ఆ రాక్షసయోధులు కొందరు మళ్ళీ రాముడితో యుద్ధము చేయడానికి పోయినారు. ఆయుధాలు పోకొట్టుకొన్న వాండ్లు సాలవృక్షాలనూ, తాళవృక్షాలనూ, పెద్దరాతిబండలనూ ఆయుధాలుగా చేసుకొన్నారు. అంతట ఆ రాక్షసయోధులు కొందరు శూలాలూ, ముద్గరాలూ, విండ్లూ తీసుకుని రాముడిమీద యుద్ధానికి తలపడ్డారు. ఆ మహాబలవంతులు అందరూ ఆయుధాల వర్షమూ, బాణాల వర్షమూ కురిపించినారు. చెట్లవాన కురిపించినారు. రాళ్ళవాన కురిపించినారు. ఆ రాక్షసయోధులకూ, రాముడికీ అప్పుడు అత్యద్భుతముగా, అతిభయంకరముగా ఒళ్ళు గగురుపుట్టించే పోరాటము సాగింది.

అప్పుడు ఆ రాక్షసులు అందరూ పరమకుపితులు అయి రాముణ్ణి అన్నివైపులా కమ్ముకొన్నారు. దిక్కులూ, విదిక్కులూ తెలియకుండా బాణవర్షము కురిపించడము మొదలు పెట్టినారు.

అంతట ఆ మహాబలవంతుడు రాముడు అమితభయంకరముగా సింహనాదము చేసినాడు. పరమభాస్వరమైన గాంధర్వాస్త్రాన్ని వదలినాడు. ఆ మండలాకార ధనుస్సులోనుంచి అప్పుడు వేలకువేలు బాణాలు వెలువడి దశదిశలూ వ్యాపించినవి. సూర్యుడితోకూడా ఆకాశము కనిపించకుండా అంతా అంధకార బంధురము అయిపోయింది. రాక్షసులు తమమీద వచ్చిపడుతూ ఉన్న బాణాలకు బాధపడడము తప్ప రాముడు బాణాలు ఎట్లా తీస్తున్నదీ, ఎట్లా ఎక్కు పెడుతున్నదీ, ఎట్లా వదలుతున్నదీ చూచి తెలుసుకోలేక పోయినారు. రాఘుడు ఆ బాణాలను అన్నిటినీ కక్కుతున్నట్టుగా వాండ్లకు తోచింది.

ఆ రామబాణ పరంపరలకు అప్పుడు ఆ యుద్ధభూమి అంతటా రాక్షసయోధులు గుంపులు గుంపులుగా వివశులు అయి పడిపోయినారు. గుంపులుగా చచ్చిపడిపోయినారు.

ఆ యుద్ధభూమిలో చచ్చిపోయినవాండ్లూ, క్రిందపడి పొర్లాడుతూ ఉన్న వాండ్లూ, కొనఊపిరితో కొట్టుకులాడుతూ ఉన్నవాండ్లూ, రెండుతుండ్లుగా తెగిపోయినవాండ్లూ, ముక్కలు ముక్కలు అయిపోయినవాండ్లూ, దేహాలు చీలిపోయినవాండ్లూ వేలకొద్దీ కనిపించినారు. తలగుడ్డలు ఊడిపోకుండా

తెగిపడిపోయిన తలలు, అదేవిధముగా బాహుపురులు చెక్కుచెదరకుండా తెగిపడిపోయిన బాహువులూ, అలంకారముచేసిన చెడ్డీలు చెదరకుండా తెగిపడిపోయిన తొడలూ, కడియాలు కదలకుండా తెగిపడిపోయిన (మోకాళ్ళవరకూ) కాళ్లూ బీభత్సముగా కనిపించినవి. గుర్రాల మీద ఉన్నవాండ్లు గుర్రాలతోనూ, ఏనుగులమీద ఉన్నవాండ్లు ఏనుగులతోనూ, రథాలమీద ఉన్నవాండ్లు రథాలతోనూ, చామరాలు పట్టుకొన్నవాండ్లు చామరాలతోనూ, విసనకర్రలు పట్టుకొన్నవాండ్లు విసనకర్రలతోనూ, జండాలు పట్టుకొన్నవాండ్లు జండాలతోనూ, ఇనుపగుదియలూ, ఈటెలూ, అడ్డకత్తులూ, గొడ్డళ్లూ, ఖడ్గాలూ పట్టుకొన్నవాండ్లు అందరూ వాండ్లవాండ్ల ఆయుధాలతోనూ ముక్కలుముక్కలు అయి పడిపోయినారు. ఆయుధాలుగా వాడిన పెద్దపెద్ద బండలు అన్నీ పిండిపిండి అయిపోయిన్నీ, విండ్లు అన్నీ ముక్కలుముక్కలుగా విరిగిపోయిన్నీ ఆ యుద్ధభూమి పరమభయంకరముగా కనిపించింది.

26

తన సైన్యము అంతా హతము అయిపోవడము దూషణుడు చూచినాడు. ఖిన్నుడు అయిపోయినాడు. అంతట మరి ఒక అయిదువేలమందిని రాముడితో యుద్ధము చేయడానికి ఆజ్ఞాపించినాడు. వాండ్లు ఎటువంటి యుద్ధములో అయినా వెనుకకు మళ్ళని యోధులు. ఎదిరించను అలవికాని భీమవేగులు. అంతట ఆ రాక్షసయోధులు అందరూ రాముణ్ణి అన్నివైపులా కమ్ముకొన్నారు. ఎడతెగకుండా శూలాలూ, పట్టిసాలూ, ఖడ్గాలూ, రాళ్ళూ, చెట్లూ రాముడిమీద వానగా కురిపించసాగినారు. ఎటువంటి వానను అయినా కన్నుమూసుకొని నిర్లక్ష్యముచేసే ఆబోతువలె రాముడు ఒక్క క్షణము ఓపికపట్టినాడు. అంతట తన తీక్ష్ణ బాణాలతో ప్రాణహరము అయిన ఆయుధవర్షాన్ని నిగ్రహించినాడు. ఆ ధర్మాత్ముడు రాముడు మరింత కోపావిష్టుడు అయి, అగ్నిహోత్రమువలె జ్వలిస్తూ దూషణుడితో కూడా ఆ సైన్యము అంతటిమీదనూ బాణాలు వదలినాడు.

అప్పుడు ఖరుడి సేనానాయకుడూ, శత్రుదూషణుడూ అయిన ఆ దూషణుడు కుపితుడు అయిపోయి, వజ్రాయుధమువంటి బాణాలను రాముడిమీద వదలినాడు. ఆ మహావీరుడు రాముడు అందుకు కత్తివంటి బాణము ఒకటి వేసి, ఆ దూషణుడి ధనుస్సును ఖండించినాడు. మరి నాల్గుబాణాలు వదలి ఆ దూషణుడి రథాశ్వాలను నరికివేసినాడు. ఒక అర్ధచంద్రాకారపు బాణముతో సారథి శిరము ఛేదించినాడు. అంతటితో పోనీక, దూషణుడి ఎదురురొమ్ములమీద మూడుబాణాలు వదలి పెట్టినాడు.

దూషణుడి విల్లు విరిగిపోయింది. విరథుడు అయినాడు. గుర్రాలు పడిపోయినవి. సారథి చచ్చిపోయినాడు. దూషణుడు కోపముతో రేగిపోయినాడు. ఒండ్లు గగురుపుట్టించే కొండకొమ్ముకొమ్మువంటి పరిఘను ఒక దానిని తీసుకొన్నాడు. ఆ పరిఘకు బంగారుకట్లు వేసి ఉన్నవి. అంతటా తీక్ష్ణమైన మేకులు తాపడము చేసి ఉన్నవి. వజ్రమువలె అది అభేద్యము అయినది. వజ్రాయుధమువలె అది అమోఘము అయినది. అది దేవసేనలను మర్దించినది. శత్రువుల మేదస్సుతో తడిసిపోయినది. దానితో దూషణుడు అదివరకు శత్రుపట్టణద్వారాలను అనేకము పగలకొట్టినాడు. మహాసర్పమువంటి ఆ పరిఘను చేతిలో పట్టుకొని ఆ క్రూరకర్ముడు దూషణుడు రాముడిమీదికి పరుగెత్తినాడు. అట్లా పరిఘతో తనపై పడవస్తూ ఉన్న దూషణుణ్ణి రాముడు చూచినాడు. రెండు బాణాలతో వాడి రెండుబాహువులూ తెగవేసినాడు. ఆ రెండుబాహువులు క్రిందపడే లోపలనే ఆ భయంకరమైన పరిఘ ఉత్సవాంతాన దేవేంద్రుడి ధ్వజమువలె, దూషణుడి చేతిలోనుంచి జారి ఆ యుద్ధముఖాన నేలమీద పడిపోయింది. దంతాలు ఊడకొట్టిన మదపుటేనుగువలె, రెండుచేతులూ తెగిపోయిన దూషణుడు అక్కడ నేలమీదపడి చచ్చిపోయినాడు.

ఆ యుద్ధముఖాన అట్లా పడి చచ్చిన దూషణుణ్ణి చూచి, అప్పుడు భూతకోటి అంతా 'బలే బలే' అంటూ రాముణ్ణి ప్రశంసించింది.

అంతలో 'మహాకపాలుడు, స్థూలాక్షుడు, ప్రమాథి' అనే ముగ్గురు సేనానాయకులున్నూ మృత్యుపాశావపాశితులై రాముడుమీదికి కోపోద్రేకముతో పరుగెత్తినారు. పెద్దశూలముతో మహాకపాలుడూ, ఇనుపగుదియతో స్థూలాక్షుడూ, పెద్ద గొడ్డలితో ప్రమాథీ తనమీదికి పరుగెత్తుకొని రావడము రాముడు చూచినాడు. వారి అంతట వారుగా వచ్చే అతిథులనువలె, వారిని రాముడు వెంటనే శతతీక్ష్ణాగ్ర బాణాలతో సత్కరించినాడు. ఉత్తమోత్తమము అయిన బాణాలతో మహాకపాలుడి శిరము ఉత్తరించినాడు. లెక్కలేనన్ని బాణాలు వేసినందువల్ల కొమ్మలూ, బోదె విరిగి పడిపోయిన చెట్టువలె, ప్రమాథి తుండెములు మొండెములు అయి నేలకూలినాడు. స్థూలాక్షుడి రెండు కళ్ళూ రాముడు బాణాలు వదలినాడు. అంతటితో కోపము శమించక దూషణుడివెంట వచ్చిన అయిదువేలమంది రాక్షసులనూ అయిదువేల బాణాలు వదలి క్షణలేశములో యమసదనానికి పంపించినాడు.

ఖరుడు ఇది అంతా చూచినాడు. పరమక్రుద్ధుడు అయిపోయినాడు. మహాబలవంతులు అయిన తన సేనాధ్యక్షులను చూచి, "ఓ రాక్షసయోధులారా! దూషణుడున్నూ, వాడివెంట పోయినవాండ్లున్నూ యుద్ధములో చచ్చిపోయినారు.

ఇప్పుడు మీరు అందరూ వివిధాయుధాలతోనూ, మన మహాసైన్యముతోనూ పోయి ఆ అల్పుణ్ణి, ఆ మానవమాత్రుణ్ణి రాముణ్ణి చంపివేయవలెను అని ఆజ్ఞాపించినాడు. అంతట, 'శ్యేనగామి, పృధుగ్రీవుడు, యజ్ఞశత్రువు, విహంగముడు, దుర్జయుడు, కరవీరాక్షుడు, పరుషుడు, కాలకర్ముడు, మేఘమాలి, మహామాలి, సర్పాస్యుడు, రుధిరాశనుడు' అనే పన్నెండుమంది సేనాధ్యక్షులూ సేనాసమేతులై రాముడి మీదికి పోయినారు. ఉత్తమోత్తమము అయిన బాణాలను రాముడిమీద వేయడము మొదలుపెట్టినారు.

అంతట ఆ మహాతేజస్వి రాముడు బంగారముతోనూ, వజ్రాలతోనూ అలంకరించిన బాణాలను, అగ్నిహోత్రముతో సరిసమానము అయిన వాటిని ఆ రాక్షసులమీద వదలినాడు. బంగారు ములుకులతో ఉన్న ఆ బాణాలు పొగలు రాజుకొంటూనూ, మంటలు మండుతూనూ పోయి ఆ రాక్షసులమీద పడ్డవి. మంటలు మండుతూ పడే పిడుగులకు పెద్దపెద్ద చెట్లవలె, అప్పుడు ఆ రాక్షసులు నేల కూలినారు.

రణముఖాన రాముడు, నూరుమంది రాక్షసులు ఎదిరిస్తే నూరు కర్ణాకార బాణాలతోనూ, వెయ్యిమంది ఎదిరిస్తే వెయ్యి బాణాలతోనూ రాక్షసులను అందరినీ పడగొట్టినాడు. ఆ బాణాల తాకిడికి ఆ రాక్షసుల కవచాలూ, ఆభరణాలూ, ఆయుధాలూ, విండ్లూ, దేహాలూ ఛిన్నాభిన్నము అయిపోయినవి. వారు నెత్తురు కారుతూ (జుట్లుముళ్లు తెగిపోయినందువల్ల) జుట్లు విరబోసికొని నేలకూలినారు. అట్లా నేలకూలిన రాక్షసులతో ఆ యుద్ధభూమి, దర్భలు పరచిన మహావేదికవలె కనిపించింది. ఆ రాక్షస కళేబరాలతోనూ, రక్తమాంసాలతోనూ ఆ ప్రదేశము అంతా బురద బురద అయి భయంకరము అయిన నరకమువలె తోచింది.

ఒక్క మానవుడు (కాలిబంటు) రాముడు, మహాభయంకరముగా క్రూరకృత్యాలు చేసే పధ్నాలుగువేలమంది రాక్షసులను సంహారము చేసినాడు. మహావీర్యవంతులూ, సహించను అలవికాని పరాక్రమవంతులూ, భయంకరులూ అయిన రాక్షసులు అందరూ చచ్చిపోయినారు. ఖరుడి సమస్తసైన్యమూ నాశనము అయిపోయింది.

ఇక పోరాటానికి అటు మహారధుడు అయిన ఖరుడూ, వాడి సేనాధ్యక్షుడు అయిన త్రిశిరుడూ, ఇటు శత్రుశూరుడు అయిన రాముడూ మిగిలినారు.

అప్పుడు ఖరుడు, వజ్రాయుధము వదలబోయే ఇంద్రుడివలె మహారథము ఎక్కి రామునిమీదికి పోయినాడు.

27

రామాభిముఖుడు అయిపోతూ ఉన్న ఖరుడికి సేనాధ్యక్షుడు అయిన త్రిశిరుడు అడ్డముపోయి, "ఓ విక్రాంతుడా! నీవు నన్ను నియోగించు, నీవు తొందరపడవద్దు. చూడు, ఆ మహాబాహువును రాముణ్ణి నేను ఇప్పుడు చంపివేస్తాను. వాణ్ణి, ఆ రాముణ్ణి ఏ రాక్షసుడు అయినా చంపివేయ వచ్చును. అందువల్ల, వాణ్ణి నేను చంపుతాను. నేను ఆయుధము పట్టుకొని సత్యప్రమాణము చేస్తున్నాను. ప్రభూ! నీవు రణోత్సాహము ఒక కొంచెముసేపు చాలించు. నేను రాముడికి మృత్యువును అవుతానో, వాడే నాకు మృత్యువు అవుతాడో నీవు మధ్యస్థుడుగా ఉండి చూడు. నేను రాముణ్ణి చంపివేసేట్లయితే నీవు పరమసంతోషముతో జనస్థానానికి పోవచ్చును. నేనే చచ్చిపోయేటట్లయితే, నీవు రాముడితోయుద్ధము చేయవచ్చును. నేను ఉండగా నీవు పోరాడడము నాకు ఇష్టము లేదు" అంటూ బతిమిలాడినాడు. మృత్యులోభమువల్ల త్రిశిరుడు ఖరుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకొన్నాడు.

అంతట ఖరుడు, 'పో, పోరాడు' అని త్రిశిరుణ్ణి ఆజ్ఞాపించినాడు. మూడు శిఖరాల పర్వతమువలె త్రిశిరుడు రథము ఎక్కి రాముడిమీదికి పోయినాడు. మహామేఘమువలె శరధారాసమూహాన్ని వదలినాడు. చివుకు తప్పెటవలె అరచినాడు. త్రిశిరుడూ, రాముడూ మదపుటేనుగూ, సింహమూవలె పోరాడినారు. అప్పుడు త్రిశిరుడు అమితకోపముతో రాముడి నుదుట మూడుబాణాలు వేసినాడు. అందుకు రాముడు నవ్వుతూ, "ఆహా! రాక్షసవీరుడు శూరుడు, బలవంతుడు. ఎంతపని చేసినాడు! తన బాణాలతో నా నొసటను పూలు చెక్కినాడు" అంటూ కోపముతో రేగి, విషసర్పాలవంటి పధ్నాలుగుబాణాలను ఆ త్రిశిరుడి వక్షస్థలముమీద వేసినాడు. అంతట, వంకరటింకర లేకుండా కణుపులు తేలిన నాలుగుబాణాలు వేసి, త్రిశిరుడి రథానికి కట్టిన నాలుగు గుర్రాలను పడకొట్టినాడు. మరి ఎనిమిదిబాణాలు వదలి సారథిని రథముమీదనే తెగవేసినాడు. ఇంకొక్క బాణముతో ఆ రథధ్వజాన్ని విరగకొట్టినాడు.

అప్పుడు ఆ రథముమీదనుంచి దిగుతున్న త్రిశిరుడి హృదయాన్ని భేదించడానికి ఒక్క బాణాన్ని వదలినాడు. మరి మూడుబాణాలతో వాడి శిరస్సులను ఎగరకొట్టినాడు. అవి, ఆ మూడు శిరస్సులూ నెత్తురు కక్కుతూ నేలమీద పడ్డవి.

మిగిలిఉన్న ఖరుడి సేవకులు అంతట అక్కడ నిలవలేకపోయినారు. పెద్దపులిని చూచిన జింకలవలె పరుగెత్తినారు. అట్లా పరుగెత్తుకొని పారిపోతూ ఉన్న సేవకులను ఖరుడు స్వయముగా మళ్ళించి, చంద్రుణ్ణి పట్టబోయే రాహువువలె రాముడిమీదికి పోయినాడు.

28

ఆ యుద్ధములో దూషణుడూ, త్రిశిరుడూ చచ్చిపోవడము ఖరుడు చూచినాడు. రాముడి పరాక్రమాన్ని గురించి ఆలోచించినాడు. భయపడ్డాడు. ఎదిరించను అలవికాని అంతటి ఆ రాక్షససైన్యాన్ని ఒక్క రాముడు సంహారము చేసివేసినాడు. హతము అయిపోయిన ఆ సైన్యాన్నీ, చచ్చిపడి ఉన్న త్రిశిరుణ్ణీ, దూషణుణ్ణీ ఖరుడు చూచినాడు. విమనస్కుడు అయినాడు. దేవేంద్రుడిమీదికి 'నముచి' అనే రాక్షసుడువలె, రాముడి మీదికి పోయినాడు. ధనుస్సును బలముకొద్దీ వంచినాడు. కుపితకృష్ణసర్పాల వంటి ఇనుప బాణాలను, రక్తపానము చేసేవాటిని రాముడిమీద వదిలినాడు.

రధముమీద ఉన్న ఆ మహారధుడు ఖరుడు తన ధనుర్విద్యాకౌశలముతో వింటిని అనేకవిధాల మోగిస్తూ, దిక్కులూ విదిక్కులూ తెలియకుండా పోయేటట్లు బాణాలు వదలడము మొదలు పెట్టినాడు. రాముడు అది చూచినాడు. పర్జన్యుడు వానను కురిపించేటట్లు, నిప్పురవ్వలు రేగే నిప్పులవంటి బాణాలు కురిపించి ఆకాశము కనపడకుండా చేసివేసినాడు. ఖరుడూ, రాముడూ అట్లా పోరాడుతూ ఒకండ్లను ఒకండ్లు చంపుకోవలెను అని నిశితాస్త్రాలు వదలడముతో వారి చుట్టూ, పైనా ఆకాశము అనాకాశము అయిపోయింది. బాణాలు కమ్ముకొన్నందువల్ల సూర్యుడు వారికి కన్పించడము మానివేసినాడు. అప్పుడు ఖరుడు రాముడిమీద నాళాకారపు ఇనుపబాణాలను, కరకు కొనల కర్ణాకారపు బాణాలను మదపుపటేనుగుమీద బరికోలలవలె వదలినాడు. పెద్ద ధనుస్సుతో అట్లా పోరాటము సాగిస్తూ ఉన్న ఖరుడు, అప్పుడు సర్వభూతకోటికీ పాశహస్తుడు అయిన యముడివలె కనిపించినాడు. రాముడు మహాబలవంతుడు అయినప్పటికిన్నీ, తన సర్వసైన్యాన్నీ సంహారము చేసినందువల్ల అలసిపోయి ఉంటాడు అనీ, పౌరుషానికి మాత్రము పోరాటానికి నిలుచున్నాడు అనీ ఖరుడు అనుకొన్నాడు.

సింహపరాక్రమముతో, ఆ సింహవిక్రముడు ఖరుడు తన పైకి వస్తూ ఉంటే క్షుద్రజంతువును సింహమువలె, ఆ ఖరుణ్ణి రాముడు చూచినాడు. కాని చలించలేదు. అంతట ఖరుడు సూర్యుడివలె తేజరిల్లుతూ రధముమీద అగ్నిహోత్రముమీదికి మిడుతవలె, రాముడి మీదికి పోయినాడు. తన హస్తలాఘవము అంతటితోనూ బాణము వదలినాడు. అదిపోయి ఆ మహాపరాక్రమవంతుడు రాముడు శరము ఎక్కుపెట్టిన వింటి పిడికిటి ప్రదేశములో పడి, ఆ వింటిని విరగకొట్టింది. అంతటితో వాడి కోపము తీరక దేవేంద్రుడి వజ్రాయుధముతో సరిసమానము అయిన వాటిని,

మంచి కణుతులు ఉన్నవాటిని ఏడు బాణాలను వదలి, సూర్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్న రాముడి కవచాన్ని కొట్టినాడు. ఆ కవచము ఊడి నేలమీద పడ్డది. అంతట ఖరుడు మరి ఒక వెయ్యిబాణాలు వెంటవెంటనే రాముడిమీద వదలి దేహాన్ని గాయపరచి, సంతోషాతిశయముతో పెద్దపెట్టున కేకలు వేసినాడు.

బాణాలు గుచ్చుకొని రాముడి అవయవాలు అన్నీ గాయాలు అయినవి. రాముడు కోపముతో రేగినాడు. అగస్త్యుడు ఇచ్చిన వైష్ణవధనుస్సును తీసుకొన్నాడు. సజ్యము చేసినాడు. అతిగంభీరముగా అల్లెత్రాటిని మ్రోగించినాడు. అంతట ఆ శత్రుసంహారకుడు రాముడు కోపోద్రేకముతో పొగలులేని అగ్నిహోత్రమువలె తేజరిల్లుతూ, ఎక్కుపెట్టిన ధనుస్సుతో ఖరుడిమీదికి పరుగెత్తినాడు. బంగారు ములుకులతోనూ వంకరలు లేని కణుపులతోనూ ఉన్న బాణాలను వదలి ఖరుడి రథధ్వజాన్ని పడకొట్టినాడు. దర్శనీయమైన ఆ బంగారు ధ్వజము దేవతలు ఆజ్ఞాపించినందువల్ల సూర్యుడివలె నేలమీద ముక్కలు ముక్కలు అయి పడ్డది.

ఆయువుపట్టులు అన్నీ తెలిసిన ఖరుడు అంతట క్రుద్ధుడు అయి ఏనుగును తోమరాలతోవలె, రాముణ్ణి నాలుగు బాణాలతో కొట్టినాడు. అంతటితో వదలి పెట్టకుండా అప్పటికి అప్పుడు రాముడిమీద అనేకబాణాలు వదలినాడు. రాముడు రక్తసిక్తాంగుడు అయిపోయినాడు. అంతట అతడు మరి ఒక విల్లు తీసుకున్నాడు. ఉత్తమోత్తమము అయిన ఆరు బాణాలు వదలినాడు. ఒకటి ఖరుడి శిరముమీదనూ రెండు వాడి బాహువులమీదనూ పడ్డవి. మూడు అర్ధచంద్రాకారపు బాణాలు పోయి వాడి వక్షస్థలములో గుచ్చుకొన్నవి.

ఆ మహాపరాక్రమవంతుడు రాముడు మరి పదమూడు బాణాలు సూర్యుడితో సరిసమానము అయిన వాటిని తీసికొని ఒక బాణముతో ఖరుడి రథము కాడినీ, నాలుగు బాణాలతో గుర్రాలనూ, ఆరవ బాణముతో ఆ రథసారథి శిరాన్నీ, మరి మూడింటితో ఆ రథము నొగనూ, రెండింటితో ఆ రథము కండ్లనూ, పన్నెండవ బాణముతో ఖరుడు ఎక్కుపెట్టుకొన్న చాపాన్నీ ఖండించి, వజ్రాయుధమువంటి పదమూడవ బాణముతో ఖరుణ్ణి కొట్టి ఒక్క నవ్వు నవ్వినాడు.

ఖరుడి చేతిలో ఉన్న విల్లు విరిగిపోయింది. రథసారథి చచ్చిపోయినాడు. గుర్రాలున్నూ చచ్చిపడిపోయినవి. రథము పడిపోయింది. అప్పుడు ఆ రాక్షసుడు ఖరుడు ఒక చేతితో గదపట్టుకొని కిందికి దూకి నిల్చున్నాడు.

విమానాగ్రభాగాలనుంచి అది అంతా చూస్తూ ఉన్న దేవతలూ, పరమర్షులూ పరమానందభరితులు అయి చేతులు జోడించి రాముణ్ణి అభినందించినారు.

29

విరథుడు అయిపోయి గద చేతిలో పట్టుకొని నేలమీద నిల్చున్న ఖరుణ్ణి చూచి, ఆ మహాతేజోవంతుడు రాముడు మెత్తమెత్తగానూ, పరుషముగానూ, "ఓ ఖరుడా! నీవు ఏనుగులూ, గుర్రాలూ, రథాలూ మొదలు అయిన వాటితో పెద్దసైన్యము సమకూర్చుకొని సర్వలోకాలకూ రోతపుట్టించే పనులు అతిదారుణముగా చేసినావు. ప్రాణికోటిని దుఃఖపెట్టే క్రూరుడూ, పాపకర్ముడూ ముల్లోకాలకూ ప్రభువు అయినప్పటికిన్నీ బ్రతుకడు. లోకవిరుద్ధకృత్యాలుచేసే భయంకరుణ్ణి దుష్ట సర్పాన్నివలె, జనులు అందరూ ఏకమై చంపివేస్తారు. కామమువల్లకానీ, లోభమువల్లకానీ ఒండ్లు తెలియకుండా పాపకృత్యాలు చేసేవాడు భ్రష్టుడు అయిపోతాడు. ఒడికల్లు తిన్న నలికండ్లపాములవలె చస్తాడు.

"ఓ ఖరుడా! నీవు ఈ దండకారణ్యములో నివసిస్తూ ఉన్న ధర్మచారులను, మహాపూజ్యులను తాపసులను చంపివేసినావే! అందువల్ల, నీకు ఏమి ఫలము వచ్చింది? పాపకర్ములూ, క్రూరులూ, లోకానికి జుగుప్స పుట్టించేవాళ్ళూ ఎంత ఐశ్వర్యవంతులు అయినప్పటికిన్నీ, వేళ్లు కుళ్ళిన చెట్లవలె అచిరకాలములోనే కూలిపోతారు. ఋతుకాలము వచ్చినప్పుడు అన్ని చెట్లూ పూలు పూస్తవి. అదేవిధముగా, కాలము రాగానే ప్రాణికోటి తాను చేసిన పాపఫలము అవశ్యము అనుభవిస్తుంది. విషాన్నము తిన్నవాడు వెంటనే ఫలము అనుభవిస్తాడు. అదేవిధముగా, అత్యుత్కట పాపకృత్యాలు చేసినవాడు వెంటనే పాపఫలము అనుభవిస్తాడు.

"ఓ రాక్షసుడా! భయంకరము అయిన పాపకృత్యాలను చేస్తున్నవాండ్లనూ, లోకానికి కీడుచేస్తున్న దుష్టాత్ములనూ సంహారము చేయవలసింది అని భరతమహారాజు ఆజ్ఞాపించినందువల్ల, నేను ఇట్లా వచ్చినాను. ఇప్పుడు నేను నీమీద వదలే బంగారు ములుకుల బాణాలు నిన్ను భేదించి, పుట్టలలోనుంచి పాములవలె బయటికి వస్తవి. ఓ ఖరుడా! నీ సైన్యము నా చేతిలో చచ్చిపోయింది. ఇప్పుడు నీవు నా చేతిలో చచ్చిపోతావు. అందువల్ల, నీవు నీ సైన్యముతోకూడా ఇదివరకు ఈ దండకారణ్యములో నీవు భక్షించిన మహర్షుల దగ్గరకు పోతావు. నీవు ఇదివరకు ఏ ఏ పరమర్షులను హింసించినావో, వారు అందరు ఇప్పుడు నా బాణాలకు నీవు నేలకూలి దురవస్థ పడుతూ ఉండడము విమానాలలోనుంచి చూచి సంతోషిస్తారు. ఓ ఖరుడా! ఇక ఇప్పుడు నీ చేతనైన ప్రయత్నాలను చేసుకో. నీ ఇష్టము వచ్చినట్లు నన్ను కొట్టడానికి ప్రయత్నించు. నేను తాడిపండునువలె నీ తల పడకొట్టపోతున్నాను."

ఈ మాటలకు ఖరుడు పరమక్రుద్ధుడు అయిపోయినాడు. కన్నులు ఎర్రపడిపోయినవి. ఒండ్లు తెలియకుండా పోయింది. పకపక నవ్వుతూ, "ఓ దశరథుడి

కొడుకా! అల్పులు అయిన రాక్షసులను చంపివేసినావు. నిన్ను నీవే పొగడుకొంటున్నావు. బలవంతులూ, పరాక్రమవంతులూ గర్వపడరు. తమను తాము పొగడుకోరు.

"ఓ రాముడా! ఈ లోకములో అల్పులూ, పిరికివాండ్లూ, క్షత్రియాధములూ నీవలె నిరర్ధకముగా తమను తాము పొగడుకొంటారు. యుద్ధములో, అందులో మరణకాలము ఆసన్నము అయిన సమయములో, వీరుడు ఎవడూ తన వంశాన్ని పొగడుకొంటూ ఆత్మస్తుతి చేసుకోడు. నిన్ను నీవు పొగుడుకొంటున్నందువల్ల, నీ అల్పత్వము తెలిసింది. బంగారురంగుమంటలు మండే దర్భలు అప్పుడే ఆరిపోతవి.

"ఓరాముడా! గైరికాది ధాతువులతో పర్వతమువలె గదాధరుణ్ణి అయి అకంపముగా నిలుచుని ఉన్న నన్ను చూస్తూ ఉన్నావా? ముల్లోకాలను సంహారము చేయడానికి పాశహస్తుడు అయిన ఒక్క యముడు చాలు. నీ ప్రాణాలు తీయడానికి గదాపాణిని అయిన నేను ఒక్కణ్ణి చాలు. నీకు ఎంతో చెప్పవలసి ఉంది. అయితే, ఇప్పుడు అవకాశములేదు. సూర్యుడు అస్తమించ పోతున్నాడు. పోరాటానికి విఘ్నము అవుతుంది. నేను ఇప్పుడే నిన్ను చంపివేసి, నీ చేత చచ్చిన పద్నాలుగువేల రాక్షసుల భార్యల కన్నీళ్ళు తుడువవలెను. ఆలస్యము చేయను" అంటూ కుపితుడు అయిపోయి, పిడుగువలె మంటలు మండుతూ ఉన్న ఆ పెద్దగదను రాముడిమీద విసరినాడు. అడ్డము అయిన చెట్లనూ, గుల్మాలనూ భస్మముచేస్తూ మృత్యుపాశమువలె అంతరిక్షములో వస్తూ ఉన్న ఆ గదను, రాముడు బాణాలతో ముక్కలు ముక్కలుగా నరికివేసినాడు. అది మంత్రాలకూ, ఓషధులకూ ముక్కలు ముక్కలు అయి పోయిన పామువలె భూమిమీద పడ్డది.

30

ఖరుని వధ

నిరాయుధుడు అయి తొట్రుపాటుపడుతూ ఉన్న ఖరుణ్ణి చూచి ఆ ధర్మవత్సలుడు రాముడు, "రాక్షసాధమా! నీ బలసర్వస్వము అంతా బయటపడ్డది. నీవు మదము ఎక్కి కొట్టుకులాడుతున్నావు. నీవు శక్తిహీనుడవు. వృథాగా అరచినావు. ప్రగల్భాలు పలకడములో నీవు సమర్థుడవు. నా బాణాలకు నీ గద ఛిన్నాభిన్నము అయిపోయి, నేలమీద పడి నిన్ను మోసము చేసింది. 'నన్ను ఇప్పుడే చంపివేసి నాచేత చచ్చిన రాక్షసుల భార్యల కన్నీళ్ళు తుడుస్తాను' అని నీవు అన్నమాట అబద్ధము అయిపోయింది. నీవు నీచుడవు. దుష్టస్వభావుడవు. దురాచారుడవు. నా బాణాలతో నీ కంఠము ఇప్పుడే తెగవేస్తాను. నిన్ను చీల్చివేస్తాను. నురుగుల బుడగలతో కారే నీ నెత్తురును ఈ భూమి తాగుతుంది. నీవు ఈ భూమిమీద పడి, దుమ్ము ధూళి కొట్టుకొని, చేతులు చాచి దుర్లభాంగననువలె కౌగలించుకొని పెద్ద నిద్రపోతావు.

నీవు అట్లా దీర్ఘనిద్రపోగానే, ఈ దండకారణ్యములో మహాతపశ్శాలులు అయిన మునులు అందరూ సుఖపడతారు. ఓ రాక్షసుడా! నా బాణాలకు జనస్థానములో రాక్షసులు అందరూ హతము అయిపోగానే, మహామునులు అందరూ ఈ వనములో నిర్భయముగా సంచరిస్తారు.

"ఓ ఖరుడా! ప్రతివారిని భయపెట్టే రాక్షసాంగనలు అందరూ మొగుళ్ళుపోయి ఏడుస్తూ భయముతో ఇక్కడినుండి పారిపోతారు. నీకు అనురూపులు అయిన నీ భార్యలు అందరూ, ఇక కామరూప పురుషార్థము పోయి ఏడుస్తారు. శోకము అంటే ఏమిటో ఇక తెలుసుకొంటారు. ఓ ఘాతుకుడా! ఓ క్రూరుడా! ఓ బ్రాహ్మణ కంటకుడా! నీ భయమునుంచి మహర్షులు అగ్నిహోత్రాలలో హవిస్సు వ్రేల్చలేక పోయినారు" అన్నాడు.

ఈ మాటలకు ఖరుడికి పట్టరాని కోపము వచ్చింది. చెదరిపోయేటట్టు అరిచి, "రాముడా! నీవు గర్వపడుతున్నావు. మృత్యువశుడవు అయినందువల్ల భయపడవలసిన సమయములో నీవు నిర్భయముగా ఇది చెప్పవచ్చును, ఇది చెప్పకూడదు అనే జ్ఞానము లేకుండా మాట్లాడుతున్నావు. మృత్యుపాశబద్ధులు అయినవాండ్లు ఇంద్రియాధీనత తప్పి యుక్తాయుక్తాలు తెలుసుకోలేరు" అని రాముడితో చెప్పుతూ, నాలుగు వైపులా చూచి కనుబొమలు ముడివేసి, పెదవి కొరికి దగ్గరలో ఉన్న ఒక సాలవృక్షాన్ని పెళ్ళగించి రెండుచేతులా ఎత్తి రాముడిమీద విసరివేసి, 'చచ్చినావు' అని అరిచినాడు.

ఆ ప్రతాపవంతుడు రాముడు తనమీద పడపోతున్న ఆ చెట్టును బాణసమూహముతో ముక్కలు ముక్కలుగా నరికివేసినాడు. అప్పుడు రాముడికి తీవ్రము అయిన కోపము వచ్చింది. దేహము అంతటా చెమటలు కమ్ముకొన్నవి. కనుకొలకులు ఎర్రపడిపోయినవి. ఖరుడిమీద ఒక్క వెయ్యిబాణాలు వదలినాడు వాడి దేహము అంతటా చిల్లులు పడ్డవి. ప్రస్రవణపర్వతమునుంచి జలధారలవలె ఖరుడి దేహమునుంచి రక్తధారలు ప్రవహించినవి. వాడు విహ్వలుడు అయిపోయినాడు. వాడి నెత్తురు మదము వాసనలు కొట్టింది. అట్లా నెత్తురు కారుతూనే వాడు ఎదురుగుండా తనమీదికి పరుగెత్తుకొని వస్తూ ఉంటే, రాముడు కొంచెము వెనుకకు తప్పుకొన్నాడు. అగ్నిహోత్రముతో సమానము అయిన మరి ఒక చాపము తీసినాడు. బ్రహ్మదండము వంటి ఆ చాపము దేవేంద్రుడు ఇచ్చినాడు. రాముడు ధనుస్సును ఈడ్చి ఖరుడిమీద బాణము వదలినాడు. అది పిడుగువలె ధ్వనిచేస్తూ ఖరుడి ఎదురురొమ్ములో పడ్డది. ఆ బాణాగ్నికి వాడు శ్వేతారణ్యములో రుద్రుడు దహించివేసిన అంధకాసురుడివలెనూ, దేవేంద్రుడు వజ్రాయుధముతో వధించిన వృత్రాసురుడివలెనూ,

నురుగులు కక్కుతూ నముచివలెనూ, పిడుగు మంటలకు బాలాసురుడివలెనూ నేలకూలినాడు.

అప్పుడు రాజర్షులు, బ్రహ్మర్షులు మొదలైనవారు అందరూ సంతోషించి, "రామా! ఇందుకే, ఈ ఖరాదులను నీవు వధించడానికే పాకాసురుణ్ణి సంహారముచేసిన మహాతేజోవంతుడు దేవేంద్రుడు శరభంగాశ్రమానికి వచ్చినాడు. ఇందుకే మహర్షులు అందరూ ఉపాయముగా నిన్ను ఇక్కడికి పంపించినారు. నీవు ఖరాది పాపకర్ములను, క్రూరకర్ములను సంహారము చేసినావు. ఇకను ఈ దండకారణ్యములో మహర్షులు ధర్మము ఆచరిస్తూ సుఖముగా నివసిస్తారు" అని ప్రశంసించినారు. అప్పుడు దేవతలు, చారణులు మొదలైనవారు అందరూ సంతోషముతో దుందుభులు మోగించినారు. పూలవాన కురిపించినారు.

ఆ మహాసంగ్రామములో రాముడు ఒకటిన్నర ముహూర్తముసేపటిలో భయంకరులు అయిన ఆ ఖరదూషణాదులనూ, వారి పద్నాలుగువేల సైనికులనూ సంహారము చేసివేసినాడు.

"ఆహా! ఆత్మజ్ఞానముకల రాముడు ఎంతటి మహత్కార్యముచేసినాడు! అతని పరాక్రమము ఆశ్చర్యము. సామర్థ్యము ఆశ్చర్యము. మహావిష్ణువువలె కనపడుతున్నాడు" అని చెప్పుకొంటూ దేవతలు అందరూ వెళ్ళిపోయినారు.

అప్పుడు లక్ష్మణుడు సీతాదేవితోకూడా పర్వతగుహలోనుంచి వచ్చినాడు. వారు ముగ్గురూ తమ ఆశ్రమములోనికి పోయినారు. అప్పుడు వైదేహి ఆ శత్రుసంహారకుణ్ణి రాముణ్ణి చూచి సంతోషముతో కౌగలించుకొన్నది. అంతమంది రాక్షసులను సంహారము చేసినప్పటికీ బాధను అనుభవించకుండా ఉన్న ఆ రాముణ్ణి చూచి, ఆ చంద్రనిభానన సీతాదేవి మళ్ళీ కౌగలించుకొన్నది.

31

అకంపనుడు రావణుని కలుసుకొనుట

జనస్థానములో రాముడు రాక్షససంహారము చేసివేయగానే 'అకంపనుడు' అనే రాక్షసుడు ఏమాత్రము జాగుచేయకుండా లంకాపట్టణము పోయి రావణుణ్ణి చూచి, "ప్రభూ! జనస్థానములో రాక్షసులు అందరూ యుద్ధములో హతము అయిపోయినారు. ఖరుడున్నూ చనిపోయినాడు. నేను ఎట్లాగో తప్పించుకొని ఇక్కడికి ఈ వర్తమానము చెప్పడానికి వచ్చినాను" అన్నాడు.

ఈ మాటలకు దశగ్రీవుడు క్రుద్ధుడు అయిపోయినాడు. కన్నులు నిప్పుకణికలు అయిపోయినవి. ఆ కన్నులతో కాల్చివేసేటట్టు చూస్తూ, "ఎవడురా ఆ

వచ్చినవాడు? మనోహరము అయిన నా జనస్థానములో రాక్షసులను అందరినీ హతమార్చినవాడు ఎవడురా? సమస్తలోకాలలోనూ గతిమాలినవాడు ఎవడురా? నాకు అప్రియము చేస్తే కుబేరుడు అయినా, దేవేంద్రుడు అయినా, మహావిష్ణువు అయినా సుఖముగా ఉండడము ఉత్తదే! నేను ఎవడనో వాడికి తెలియదా? నేను యముడికి యముడనే! అగ్నిహోత్రుణ్ణి అయినా దహించివేస్తానే! మృత్యువును అయినా చంపివేస్తానే! నాకు కోపము వస్తే నా తేజస్సుతో ఆదిత్యుణ్ణి, అగ్నిహోత్రుణ్ణి ఒక్కసారిగా దహించివేస్తానే! వాయువును కదలకుండా మెదలకుండా చేస్తానే" అంటూ కోపముతో రేగినాడు. అప్పుడు ఆ దశగ్రీవుణ్ణి చూచి అకంపనుడు భయపడిపోయి, చేతులు జోడించి మాటలు తడబడుతూ అభయము వేడుకొన్నాడు.

అప్పుడు ఆ రాక్షసరాజు దశగ్రీవుడు అకంపనుడికి అభయము చెప్పినాడు. అంతట వాడు స్పష్టముగానూ, నిర్భయముగానూ, "రాజా! వాడు మంచి రూపసి. యువకుడు. ఆబోతుమూపురమువంటి మూపులవాడు. పొడుగాటి గుండ్రని బాహువుల వాడు. వాడు వీరుడు. కాంతిమంతుడు. మహాయశుడు. వాడితో సరిసమానము అయిన బలవంతుడు, పరాక్రమవంతుడు మరి ఒకడు ఎక్కడనూ ఉండడు. వాడు దశరథుడి పుత్రుడు. వాడి పేరు రాముడు. అయ్యో! వాడు, ఆ రాముడు మన జనస్థానాన్ని అంతా నాశనము చేసివేసినాడు. వాడే దూషణుణ్ణి చంపివేసినాడు. ఖరుణ్ణి సంహారము చేసివేసినాడు" అంటూ ఖిన్నుడు అయిపోయినాడు.

ఆ రాక్షసరాజు రావణుడు అకంపనుడి మాటలకు నాగేంద్రుడివలె బుసలుకొట్టుతూ, "ఓ అకంపనుడా! ఆ రాముడితో దేవేంద్రుడు దేవసేనలను అన్నిటినీ వెంటపెట్టుకొని వచ్చినాడా ఏమిటి, చెప్పు" అని ప్రశ్నించినాడు.

మహాత్ముడు అయిన రాముడి బలాన్ని గురించి, పరాక్రమాన్ని గురించి స్పష్టముగా చెప్పవలెను అనుకొని అకంపనుడు, "ప్రభూ! రాముడు మహాతేజోవంతుడు. ఈ జగత్తులో ఉన్న ధనుర్ధరులు అందరిలోనూ అగ్రగణ్యుడు. దివ్యాస్త్రసంపన్నుడు. మహాశౌర్యవంతుడు. యుద్ధములో దేవేంద్రుడి అంతటివాడు. ఆ రాముడికి అనురూపము అయిన తమ్ముడు ఒకడు ఉన్నాడు. వాడు అమితబలవంతుడు. రక్త రేఖాంచితనేత్రుడు. వాడి కంఠస్వరము దుందుభిస్వరము వంటిది. వాడి ముఖము చంద్రబింబము వంటిది. వాడి పేరు లక్ష్మణుడు.

"అగ్నిహోత్రుడికి వాయువు తోడు అయినట్లు రాముడికి వాడు, ఆ లక్ష్మణుడు తోబుట్టువు అయినాడు. అయితే ఆ కాంతిమంతుడు, ఆ రాజశ్రేష్ఠుడు రాముడు ఒక్కడే జనస్థానాన్ని అంతా నాశనము చేసివేసినాడు. దేవతలు ఎవరూ వాడికి తోడు రాలేదు. ఆ ఒక్క మానవుడే ఇంతపని చేసినాడా అనే సంశయము వద్దు. ఆ

రాముడు వదలిన బంగారురెక్కల బాణాలు బంగారు ములుకులతో నోళ్ళు తెరచుకొన్న పాములవలె, వచ్చి రాక్షసులను అందరినీ కరచి చంపివేసినవి. రాక్షసయోధులు ఏ ఏ ఆయుధాలతో పోరాటానికి పోతే రాముడు ఆ యా ఆయుధాలతో ఎట్టఎదుట కనపడి వాండ్లను అందరినీ భయకర్శితులను చేసివేసినాడు. ఓ రాక్షసేంద్రా! ఈవిధముగా రాముడు జనస్థానాన్ని అంతా నాశనము చేసివేసినాడు" అని చెప్పినాడు.

"ఓ అకంపనుడా! నేను ఇప్పుడే జనస్థానానికి పోయి వాణ్ణి, ఆ రాముణ్ణి వాడి తమ్ముడు లక్ష్మణుడితో కూడా చంపివేస్తాను" అంటూ రావణుడు లేచినాడు.

అంతట అకంపనుడు, "ఓ ప్రభూ! రాముడి బలపౌరుషాలను గురించి యథార్థవృత్తాంతము అంతా చెప్పుతాను, తాము వినవలెను. ఆ మహాయశుడు రాముడు అసాధ్యుడు. కుపితుడు అయినప్పుడు తన విక్రమముతో శరసమూహాన్ని వదలి వరదలై పారే మహాప్రవాహాన్ని అడ్డగించివేయగలడు. తన శరపరంపరలతో చుక్కలతోను, అశ్విన్యాది నక్షత్రాలతోను, గ్రహాలతోను ఆకాశాన్ని అనాకాశము చేసివేయగలడు. ఆ కాంతిమంతుడు మునిగిపోతున్న ఈ భూమిని పైకి లేవనెత్త గలడు. చెలియలికట్టను తెగకొట్టి, ఈ లోకాలను అన్నిటినీ మహాసముద్రము చేయగలడు. మహాసముద్రాన్ని అరికట్టగలడు. వాయువేగాన్ని నిరోధించగలడు. ఆ మహానుభావుడు తన పరాక్రమముతో ఈ లోకాలను అన్నిటినీ సంహారము చేసివేయగలడు. మళ్ళీ అన్నిలోకాలనూ సృష్టించగలడు.

"ఓ దశగ్రీవుడా! పాపులు ఎవరూ స్వర్గాన్ని జయించలేరు. అదేవిధముగా రాముణ్ణి యుద్ధములో నీవుకాని, ఈ లోకములో ఉన్న రాక్షసులుకాని జయించలేరు. సురాసురులు అందరూ ఏకము అయినా రాముణ్ణి జయించలేరు అని నేను అనుకొంటున్నాను. అయితే, ఆ రాముణ్ణి చంపివేయడానికి ఒక ఉపాయము ఉంది. చెప్పుతాను, ఏకమనస్కుడవు అయి వినవలెను. రాముడికి ఒక భార్య ఉంది. ఆమె ఈలోకములో ఉన్న సమస్త స్త్రీలలోనూ ఉత్తమోత్తమురాలు. భువనైకసుందరి. సుమధ్యమ. యౌవనమధ్యస్థ. ఎక్కువ తక్కువలు లేకుండా ఏ అవయవము ఎంత ఉండవలెనో, అంతగా తీర్చిదిద్దిన విగ్రహము. ఆమె స్త్రీ రత్నము. రత్నాభరణ భూషిత. ఆమె పేరు సీత. ఆ సీతతో సరిసమానము అయిన సీమంతిని దేవతా స్త్రీలలో లేదు. గంధర్వాంగనలలో లేదు. దానవాంగనలలో అంతకన్నా లేదు. అటువంటి అప్సరస ఎక్కడనూ లేదు. ఇక మానవాంగనల విషయము చెప్ప నగత్యమే లేదు.

"ప్రభూ! నీవు ఏదోవిధముగా వంచనచేసి ఆ మహారణ్యములోనుంచి సీతను దొంగిలించుకొని రావలెను. రాముడు కాముకుడు. సీతావిరహముతో వాడు ప్రాణాలు వదులుతాడు" అని చెప్పినాడు.

ఆ రాక్షసరాజుకు రావణుడికి ఆ ఆలోచన రుచించింది. అంతట ఆ మహాబాహువు ఆలోచించసాగినాడు. అకంపనుణ్ణి చూచి, "మంచిది, నేను ఒక్కణ్ణే సారధితో కూడా ప్రొద్దునే లేచి పోతాను. సంతోషముగా సీతను ఈ మహానగరానికి తీసుకొని వస్తాను"అన్నాడు.

సూర్యకాంతులతో తేజరిల్లుతూ కంచరగాడిదలు పూంచిన బంగారు రధము ఎక్కి రావణుడు ప్రయాణము అయినాడు. అది నక్షత్రమార్గానపోతూ మేఘాలలో చంద్రుడివలె శోభించింది. రావణుడు ఆ రథములో మారీచాశ్రమానికి పోయినాడు. తాటక కొడుకు అయిన మారీచుణ్ణి కలుసుకొన్నాడు.

మారీచుడు రావణుడికి అర్ఘ్యము, పాద్యము, ఆసనము ఇచ్చి కూర్చుండబెట్టి, మానవ దుర్లభము అయిన భక్ష్యభోజ్యాదులను ఇచ్చి పూజించి అర్థవంతముగా, "ఓ రాక్షసేశ్వరా! రాక్షసులు అందరూ కుశలముగా ఉన్నారా? ఓ రాజా! నీవు ఇప్పుడు ఏదో తొందరపనిమీద ఇక్కడికి వచ్చినట్లు నేను ఆశంకిస్తున్నాను, చెప్పవలసింది" అని అడిగినాడు.

అంతట ఆ మహాతేజోవంతుడు, ఆ మాటనేర్పరి రావణుడు, "నాయనా, మారీచా! ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసివేస్తూ, నాకు తలారిగా జనస్థానములో ఉంటూ ఉన్న ఖరుణ్ణీ, వధించను అలవికాని రాక్షసయోధులనూ రాముడు యుద్ధములో సంహారము చేసివేసినాడు. నేను ఇప్పుడు వాడి భార్యను దొంగిలించుకొని పోవడానికి వచ్చినాను. నీవు నాకు సాయము చేయవలెను" అన్నాడు.

ఈమాట వినీవినడముతోనే మారీచుడు, "ఓ రాక్షసశార్దూలమా! ఎవడు ఆ మిత్రరూపశత్రువు, ఇట్లా నీకు చెప్పినవాడు? వాడు ఎవడు, నీ ఐశ్వర్యానికి ఓర్వలేకుండా ఉన్నవాడు? సీతను ఎత్తుకొని రమ్మని నీతో చెప్పినవాడు ఎవడు? ప్రభూ! రాక్షసలోకానికి అంతటికీ నీవు శృంగమువలె ఉన్నావు. నిన్ను పడగొట్ట తలచినవాడు ఎవడో నీకు ఇట్లా చెప్పినాడు. నిన్ను ఇట్లా ప్రోత్సాహ పరచినవాడు ఎవడో నీ శత్రువు. సందేహము లేదు. విషసర్పము నోటిలోనుంచి కోరను నీచేత పీకించ తలచినవాడు ఎవడు? ఎవడు, ఎందుకు నిన్ను ఈ తప్పుడుత్రోవ త్రొక్కమన్నాడు? రాజా! సుఖముగా నిద్రపోతున్నవాడితల పగులకొట్టినట్లు ఈ దుష్ట ఆలోచన నీ తలకు ఎక్కించినవాడు ఎవడు? రాజా! ఎవడో నీకు మహానర్థము తలపెట్టినాడు.

"ఓ రావణప్రభూ! రాముడు ఇప్పుడు ఒక మదపుటేనుగువలె ఉన్నాడు. పరిశుద్ధవంశములో జన్మించడమే ఆ ఏనుగు తొండం, మహాబాహువులే దాని పొడుగాటి దంతాలు. ప్రతాపమే దాని మదజలము. ఆ మదజలగంధానికి ఇతర ఏనుగులు

ఏవీ దరిచేరకుండా పరుగెత్తిపోతవి. అందువల్ల, రాముడు అనే మదగజముతో ఇప్పుడు పోరాడడము మంచిదికాదు.

"ఓ రాక్షసేంద్రా! ఆ రాముడు ఇప్పుడు నృసింహుడు. కోపోద్రేకముతో చెలరేగిన సింహము, తన తోకను నడుముపైకి ఎత్తినట్టు యుద్ధముఖాన నిలిచినాడు. వాడి అయిన బాణాలను గోళ్ళవలెను, ఖడ్గాదులను కోరలవలెను ఉపయోగించినాడు. మృగాదులను సింహమువలె, రాక్షసులను అందరినీ వాడు సంహారము చేసివేసినాడు. ఇప్పుడు ఆ నృసింహము నిద్రపోతున్నది. నీవు దానిని ఇప్పుడు మేలుకొలపడము మంచిదికాదు.

"ఓ రాక్షసరాజా! రాముడు బడబాముఖము. వాడి చాపమే మొసలి. వాడి భుజవేగమే అడుసు. బాణపరంపరలే దాని అలలు. యుద్ధమే మహాసముద్రము. నీవు ఆ భయంకర మహాబిలములో పడిపోవద్దు. ప్రభూ! కోపము వద్దు. ప్రసన్నుడవు అయి తిరిగి లంకాపట్టణానికి పో! అక్కడ నీ అంతఃపురములో నీ స్వంతభార్యలతో క్రీడించు. రాముడు ఇక్కడ, ఈ అడవిలో వాడి భార్యతో క్రీడిస్తూ ఉంటాడు" అని హితము చెప్పినాడు.

మారీచుడు చెప్పిన మాటలు విని, రావణుడు లంకాపట్టణములో సర్వోత్తమము అయిన తన గృహానికి మళ్ళీ ప్రయాణము అయిపోయినాడు.

32

రావణుని గుణగణాలు

భయంకర పరాక్రములు అయిన పద్నాలుగువేలమంది రాక్షసులను ఒక్క రాముడు చంపివేయడము శూర్పణఖ చూచింది. దూషణుడు, త్రిశిరుడు, ఖరుడు ఆ రాముడితో పోరాడి చావడమున్నూ చూచింది. మళ్ళీ మహామేఘమువలె గర్జించింది. ఏ ఇతరులూ ఎదిరించి ఎరగని ఆ మహారాక్షసులను అందరినీ ఒక్కగాను ఒక్కడుగా సంహారము చేసివేసిన రాముడి అద్భుత పరాక్రమానికి శూర్పణఖ భయపడిపోయింది. రావణుడు పరిపాలిస్తున్న లంకాపట్టణానికి పరుగెత్తింది.

దేవలోకములో దేవతలతో కూర్చున్న దేవేంద్రుడివలె లంకాపట్టణములో పుష్పకవిమానాగ్రభాగములో మంత్రులతో ఆ మహాతేజోవంతుడు రావణుడు కూర్చుని ఉన్నాడు. బంగారు ఇటుకరాళ్ళతో కట్టిన వేదిలో ఆజ్యధారలకు జ్వలిస్తున్న అగ్నిహోత్రుడివలె, ఆ కనకాసనముమీద రావణుడు కనిపించినాడు. సూర్యసమాన కాంతులతో తేజరిల్లుతూ దేవతలకుకాని, గంధర్వులకుకాని, భూతాలకుకాని, మహాత్ములు అయిన ఋషులకుకాని జయించను అలవికాని ఆ శూరుడు నోరు తెరచుకొన్న యముడివలె కూర్చున్నాడు.

దేవాసుర యుద్ధములో వజ్రాయుధము దెబ్బలకు, వాడి గాత్రము అంతా గాట్లు పడిపోయింది. ఐరావతము దంతాలతో పోరాడినందువల్ల, వాడి విశాల వక్షస్థలము అంతటా కాయలు కాసినవి. దేవతల యుద్ధాలలో విష్ణుమూర్తి వాణ్ణి అనేకవందలమార్లు చక్రాయుధములతో కొట్టినాడు. మహాయుద్ధాలలో వాడు అనేక ఆయుధాల దెబ్బలు తిన్నాడు. సమస్తదేవతలు సమస్తాయుధాలతోను వాణ్ణి కొట్టినారు. ఆ యా ఆయుధాల దెబ్బల గుర్తులు అన్నీ వాడి దేహము అంతటా కనిపిస్తూ ఉంటవి.

వాడు దశగ్రీవుడు. వింశద్భుజుడు. దర్శనీయము అయిన ఛత్రచామరాలతోను, నిగనిగలాడే వైడూర్యమణుల కాంతులతోను, తప్త కాంచన మయము అయిన కుండలాలతోను, తెల్లటి పలువరుసతోను, పెద్ద ముఖముతోను, దీర్ఘబాహువులతోను వాడు కొండ అంతటివాడు. సమస్తరాజలక్షణ శోభితుడు.

వాడు, ఆ రావణుడు కలవరపెట్టను అలవికాని సముద్రాన్ని కలవరపెట్ట గలడు. పెద్దపెద్ద పర్వతాలను ఎగరకొట్టివేయగలడు. ఎప్పుడూ యజ్ఞాలకు విఘ్నాలు కలుగచేస్తూ ఉంటాడు. వాడు దేవతలను మర్దించినాడు. ధర్మాన్ని ఛేదించివేసినాడు. పరదారలను చెరచినాడు. భోగవతీపురము పోయి సర్పరాజు అయిన వాసుకిని జయించినాడు. తక్షకుడి ప్రియభార్యను లేవనెత్తుకొని వచ్చినాడు. కైలాసపర్వ తానికి పోయి కుబేరుణ్ణి జయించి, పుష్పకవిమానాన్ని తెచ్చుకొన్నాడు. కోపము వచ్చి కుబేరుడి చైత్రరథము అనే ఉద్యానవనాన్నీ, పుష్కరిణినీ ధ్వంసము చేసివేసినాడు. దేవేంద్రుడి నందనోద్యానవనాన్నీ, ఇంకా దేవతల ఇతర ఉద్యానవనాలనూ నాశనము చేసివేసినాడు.

వాడు, ఆ రావణుడు పర్వతశిఖరాకారుడు. సూర్యచంద్రులు ఉదయించకుండా తన చేతులతో అడ్డగించి వేయకలడు. ఆ ధైర్యవంతుడు మహారణ్యములో పదివేల సంవత్సరాలు అత్యుగ్రముగా తపస్సుచేసి, బ్రహ్మదేవుడికి తన తలలను కానుకగా ఇచ్చినాడు. బ్రహ్మదేవుణ్ణి మెప్పించినాడు. దేవ దానవ పిశాచ పత గోరగులు ఎవరూ యుద్ధములో తనను చంపకుండా ఉండేటందుకు వరము సంపాదించినాడు. మానవుడిని గురించి మాత్రము వరము అడగలేదు.

ఆ మహాబలుడు యజ్ఞాలలో బ్రాహ్మణులు స్తుతించే పవిత్రము అయిన సోమాన్ని నాశనము చేసివేస్తూ ఉంటాడు. యజ్ఞాలలో దక్షిణలు ఇచ్చే సమయాలలో బ్రహ్మహత్యలు చేస్తూ ఉంటాడు. వాడు క్రూరుడు. దయాదాక్షిణ్యాలు లేనివాడు. దుర్మార్గుడు. తన హితము కోసము ప్రజలకు అహితము చేస్తూ ఉంటాడు. వాడు సమస్తప్రాణికోటినీ ఏడిపించ కలడు. సమస్తలోకాలనూ భయపెట్టి కలడు. అటువంటి ఆ మహాబలవంతుణ్ణి, ఆ శూరుణ్ణి, తన తోబుట్టువును శూర్పణఖ చూచింది.

దివ్యవస్త్రాభరణాలతోనూ, దివ్యపుష్పమాలలతోనూ సింహాసనముమీద మంత్రులమధ్యను శోభాయమానముగా కూర్చుని ఉన్న ఆ శత్రుహంతను, ఆ పౌలస్త్యవంశనందనుణ్ణి రావణుణ్ణి శూర్పణఖ సమీపించింది.

ఎక్కడికి పడితే అక్కడికి నిర్భయముగా పోయే ఆ శూర్పణఖ, ఆ మహాపరాక్రమవంతుడు లక్ష్మణుడు విరూపను చేసివేసిన తన ముక్కూ, చెవులూ ఆ దీప్తవిశాలలోచనుడికి రావణుడికి చూపిస్తూ భయవిహ్వల అయిపోయింది.

33

శూర్పణఖ రావణుని రెచ్చగొట్టుట

అంతట ఆ దీనురాలు కోపముతో రేగి, మంత్రుల మధ్యను కూర్చుని ఉన్న ఆ లోకరావణుణ్ణి చూచి అతి పరుషముగా, "ఓ రాక్షసుడా! నీవు మదము ఎక్కి కొట్టుకులాడుతున్నావు. కామభోగాలు యథేష్టముగా అనుభవిస్తూ కూర్చున్నావు. నిరంకుశుడవు అయిపోయినావు. ఎటువంటి ఘోరాలు జరుగుతున్నవో, ఎటువంటి భయోత్పాతాలు పుట్టుతున్నవో తెలుసుకోకుండా ఉన్నావు. రాజు లుబ్ధుడు అయిపోయి యథేష్టముగా సంచరిస్తూ గ్రామ్యభోగాలు అనుభవిస్తూ కూర్చుంటే, వాణ్ణి ప్రజలు మెచ్చరు. గౌరవించరు. ఆ రాజును వల్లకాటిలో నిప్పులవలె వదలిపెట్టి పోతారు. అదనుకు అవసరము అయిన పనులను స్వయముగా చేసుకోని రాజు, రాజ్యముతోకూడా నాశనము అయిపోతాడు. ప్రజలకు ఆ యా సమయాలలో దర్శనము ఈయకుండాను, వేగులవాండ్లను పెట్టుకోకుండాను స్త్రీ పరతంత్రుడు అయిపోయిన రాజును, ఏటి అడుసును చూచిన ఏనుగులవలె ప్రజలు దూరమునుంచే తప్పుకొని అవతలికి పోతారు. స్త్రీ పరతంత్రులు అయి దేశాన్ని కాపాడుకోని రాజుల రాజ్యము, సముద్రములో మునిగిపోయిన పర్వతమువలె వృద్ధిచెందదు.

"ఓ రాక్షసుడా! నీవు దేవతలతోను, గంధర్వులతోను, దానవులతోను విరోధము పెట్టుకొన్నావు. వేగులవాండ్లను పెట్టుకోకుండా విషయలోలుడవు అయిపోయినావు. నీవు ఇకను ఈ రాజ్యము ఎట్లా యేల తలచుకొన్నావు? నీవు పసివాడివలె ప్రవర్తిస్తున్నావు. వివేకములేదు. బుద్ధిహీనుడవు అయిపోయినావు. తెలుసుకోవలసిన విషయాన్ని తెలుసుకోకుండా ఉన్నావు. ఇకను నీవు దొరతనము ఎట్లా చేస్తావు?

"ఓ రాక్షసుడా! నీవు ఇంతవరకూ అపజయము ఎరుగవు. అప్పటికి అప్పుడు వివిధవృత్తాంతాలు వేగులవాండ్లవల్ల తెలుసుకొంటూనూ, బొక్కసాన్ని కాపాడుకొంటూనూ, రాజనీతిని తప్పకుండానూ ఉండే రాజే రాజు. అట్లా చేయని రాజు మూఢుడు. రాజులు దూరదేశ వృత్తాంతాలను వేగులవాండ్లవల్ల తెలుసుకొంటూ ఉంటారు. కనుకనే వాండ్లను 'దీర్ఘచక్షువులు' అని అంటారు. జనస్థానము

నాశనము అయిపోయిన సంగతీ, నీ స్వజనులు అందరూ హతము అయిపోయిన సంగతీ నీవు తెలుసుకోకుండా ఉన్నావు. నీకు వేగులవాండ్లు లేరు. నీ చుట్టూ ప్రాకృతులు అయిన సచివులు చేరినారు. ఒక్క రాముడు భయంకరపరాక్రములు అయిన పధ్నాలుగు వేలమంది రాక్షసయోధులను, దూషణుడితో కూడా ఖరుణ్ణి చంపివేసినాడు. వాడు, ఆ రాముడు ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసి వేయగలడు. వాడు ఋషులు అందరికీ అభయము ఇచ్చినాడు. జనస్థానములో రాక్షసులను అందరినీ నాశనము చేసివేసినాడు. దండకారణ్యములో ఋషులకు అందరికీ క్షేమము కలుగచేసినాడు.

"ఓ రావణుడా! నీవు నీ దేశములో పుట్టిన భయంకరావస్థను తెలుసుకోకుండా ఉన్నావు. నీవు వేగులవాండ్లు మొదలు అయిన వాండ్లకు కోరిన ధనము ఇవ్వని లుబ్ధుడవు. ప్రమత్తుడవు. స్త్రీ పరతంత్రుడవు. క్రూరుడు, గర్వి, ప్రమత్తుడు, శఠుడు, అల్పప్రదాత అయిన రాజు ఆపదలపాలు అయినప్పుడు, ఆదుకోడానికి ప్రజలు ఎవరూ పరుగెత్తిపోరు. అహంకారి అయి ఎవరినీ దరిచేరనీకుండా, తన్ను తానే పొగుడుకొంటూ సమయాసమయాలు తెలుసుకోకుండా అందరినీ కోపపడుతూ ఉండే రాజులను ఆపత్కాలములో స్వజనులే చంపివేస్తారు. భయసమయాలలో జాగ్రత్తతో ఉండకుండానూ, తన పనులు తాను చేసుకోకుండానూ ఉండే రాజు రాజ్యభ్రష్టుడు అయిన దీనుడు అయి, గడ్డిపోచతో సరిసమానము అయిపోతాడు.

"ఓ రావణుడా! ఎండిన కట్టెలు అయినా, మట్టిగడ్డలు అయినా, చివరకు దుమ్ము అయినా ఎందుకో ఒకందుకు పనికివస్తుంది. పదభ్రష్టుడు అయిన రాజు మాత్రము ఎవరికీ, ఎందుకూ పనికిరాడు. కట్టుకొని విడిచివేసిన వస్త్రమువలెనూ, పెట్టుకొని తీసివేసిన పూలదండవలెనూ రాజభ్రష్టుడు అయిన రాజు ఎంత సమర్థుడు అయినప్పటికిన్నీ, ఎవరికీ ఎందుకూ పనికిరాకుండా పోతాడు. అప్రమత్తుడు, సర్వజ్ఞుడు, విజితేంద్రియుడు, కృతజ్ఞుడు అయిన రాజు ఎంతకాలము అయినా చెక్కుచెదరకుండా ఉంటాడు. నిగ్రహానుగ్రహ సమర్థుడై రాజనీతి విషయములో ఎప్పుడూ మేలుకొని ఉండే రాజు దైహికముగా నిద్రపోయినా ప్రజలు పూజిస్తారు.

"రావణుడా! జనస్థానములో రాక్షసవధను నీవు వేగులవాండ్లవల్ల తెలుసుకోలేదు. నీవు దుర్బుద్ధివి. రాజులకు ఉండవలసిన గుణాలు ఏవీ నీకు లేవు. నీవు విషయసుఖాలలో పడిపోయినావు. అందరినీ అవమానిస్తూ ఉంటావు. దేశ కాల విభాగాలు తెలుసుకోకుండా ఉన్నావు. నీకు గుణదోష నిశ్చయ జ్ఞానము లేదు. నీవు త్వరలోనే రాజ్యభ్రష్టుడవు అయిపోతావు. నాశనము అయిపోతావు" అని చెప్పింది.

శూర్పణఖ ఇట్లా పేర్కొన్న తన దోషాలను అన్నిటిని గురించీ ఆ ధనవంతుడు, ఆ బలవంతుడు, ఆ దర్పితుడు రావణుడు మనస్సులో చాలాసేపు ఆలోచించి చూచినాడు.

34

క్రుద్ధురాలు అయి పరుషముగా మాట్లాడిన శూర్పణఖను చూచి రావణుడు కోపముతో, "ఎవడు ఆ రాముడు? వాడు ఎటువంటి వీర్యవంతుడు? వాడి రూపము ఎటువంటిది? వాడు ఎటువంటి పరాక్రమవంతుడు? చొరను అలవికాని దండకారణ్యానికి వాడు ఎట్లా వచ్చినాడు ? ఎందుకు వచ్చినాడు ? వాడు రాక్షసయోధులను అందరినీ ఎట్లా చంపినాడు? ఖరుణ్ణి, దూషణుణ్ణి, త్రిశిరుణ్ణి ఎట్లా చంపినాడు? వాడి ఆయుధము ఏమిటి" అని అడిగినాడు.

శూర్పణఖ క్రోధపరవశ అయి ఉన్నప్పటికిన్నీ, రాముణ్ణి గురించిన యథార్థము చెప్పవలెను అనుకొని, "వాడు, ఆ రాముడు దశరథమహారాజు కొడుకు. ఆజానుబాహువు. వెడల్పు అయిన కన్నులవాడు. చీరకృష్ణాజినాంబరుడు. మన్మథుడితో సరిసమానము అయిన రూపసి. బంగారుపట్టుబంధముతో ఇంద్రధనుస్సువంటి వింటిని పట్టుకొని వంచి, మహావిషసర్పాలవంటి తళతళలాడే బాణాలు వదులుతాడు. అయితే, ఆ రాముడు మన రాక్షసయోధులతో యుద్ధము చేసినప్పుడు వాడు బాణాలు ఎట్లా తీసిందీ, ఆ తీసిన బాణాలను వింటికి ఎట్లా ఎక్కించిందీ, ఎట్లా వదిలిందీ నాకు కనబడలేదు. కాని ఇంద్రుడి రాళ్ళవానకు పయిరులవలె, రాముడి బాణవర్షానికి రాక్షససైన్యము అంతా నేలకూలడము మాత్రము నాకు కనిపించింది. కాలిబంటు ఒక్కడు, ఒకటిన్నర ముహూర్తము పైచిలుకు కాలములో కరుకు అయిన బాణాలు వదలి పధ్నాలుగువేలమంది రాక్షసయోధులను, దూషణుడితో కూడా ఖరుణ్ణి వధించివేసినాడు. ఋషులకు అభయము ఇచ్చినాడు. దండకారణ్యములో వాండ్లు హాయిగా ఉండేటట్టు చేసినాడు. నేను ఆ రాముణ్ణి తిరస్కరించినదానను. అయితే ఆ మహాపరాక్రమవంతుడు, ఆ విదితాత్ముడు రాముడు స్త్రీవధను శంకించినందువల్ల, ఎట్లాగో నేను ఒక్కతెనూ తప్పించుకొని రాగలిగినాను.

"ఆ రాముడికి మహాతేజోవంతుడూ, గుణగణాలలోను పరాక్రమములోను ఆతనికి తుల్యము అయినవాడూ, వీర్యవంతుడూ, అనురాగము కలవాడూ, భక్తుడూ అయిన తమ్ముడు లక్ష్మణుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. వాడు, ఆ లక్ష్మణుడు కోపధారి. వాణ్ణి ఎవండ్లూ జయించలేరు. వాడు ఎవండ్లను అయినా జయించివేయ కలడు. వాడు పరమపరాక్రమశాలి. బుద్ధిమంతుడు. బలవంతుడు. వాడు రాముడి కుడిభుజము. బహిఃప్రాణము.

"ఆ రాముడి ధర్మపత్ని ముఖము చంద్రబింబమువంటిది. వెడల్పు అయిన కన్నులు గలది. ఆమె పెనిమిటికి ప్రియురాలు. ఎప్పుడూ పెనిమిటిని సంతోష పెట్టుతూనూ, ఆ పెనిమిటికి మంచిచేస్తూనూ ఉంటుంది. చక్కని తలవెంట్రుకలు, అందము అయిన ముక్కు, అందము అయిన తొడలు, ఆ యశస్విని వనదేవతవలెను, అపరలక్ష్మీదేవివలెను విరాజిల్లుతూ ఉంటుంది. ఆమెది తప్తకాంచనవర్ణమువంటి దేహము. ఎర్రగా కొనలు తేలిన గోళ్ళు, మంచి పిరుదులు, సన్నము అయిన నడుము. ఆమె శుభకరి. పేరు సీత. విదేహదేశములో పుట్టింది. ఆమెవంటి రూపసి దేవతలలోకాని, గంధర్వులలోకాని, కిన్నరులలోకాని నాకు కనపడలేదు. ఈ మహీతలములో ఇదివరకు నేను ఎన్నడూ అటువంటి రూపసిని చూచి ఎరుగను.

"ఆమె, ఆ సీత ఎవడికి భార్య అవుతుందో, ఎవణ్ణి సంతోషముతో కౌగలించుకొంటుందో, వాడు సమస్తలోకాలలోను దేవేంద్రుడికన్నా ఎక్కువవాడు అవుతాడు. ఆమె, ఆ సీత సుశీల. ఆమెది మెచ్చుకోవలసిన దేహము. ఆమెతో సరిసమానము అయిన రూపము ఈ భూమిమీద మరి ఎవరికీ లేదు. ఆమె నీకు తగిన భార్య. అదేవిధముగా నీవునూ ఆమెకు తగిన పెనిమిటివి. నేను ఆ పెద్దపెద్ద మొత్తలదానిని, ఆ బలిసిన పిరుదులు స్తనాలు ఉన్నదానిని సీతను, నీకు భార్యగా తేవడానికి ప్రయత్నము చేసినాను. అందుకు ఆ క్రూరుడు లక్ష్మణుడు నన్ను విరూపను చేసివేసినాడు.

"ఓ మహాభుజా! నీవు ఆ పూర్ణచంద్రాననను, ఆ వైదేహిని చూచేటట్లయితే అప్పటికి అప్పుడు మన్మధుడి బాణాలకు తల ఒగ్గుతావు. ఆ సీతను భార్యగా చేసుకోవలెను అని నీకు బుద్ధి పుట్టినట్లయితే, జయముకోసము వెంటనే నీవు నీ కుడిపాదము ముందు ఎత్తిపెట్టు. ఓ రాక్షసేశ్వరా! అక్కడ అట్లా ఆ ఆశ్రమములో ఉంటూ ఉన్న ఆ క్రూరుణ్ణి రాముణ్ణి చంపివేసి రాక్షసులను అందరినీ సంతోషపెట్టు. ఆ మహారధుణ్ణి, అంటే తననూ, తన సారథినీ, గుర్రాలనూ కాపాడుకొంటూ పదివేలమంది విలుకాండ్లతో పోరాడే ఆ లక్ష్మణుణ్ణీ, ఆ రాముణ్ణీ నీ నిశితాస్త్రాలతో చంపివేసినట్లయితే ఆ సీత అనాధ అయిపోతుంది. అప్పుడు ఆమెను నీవు ఇట్టే భార్యనుగా చేసుకోవచ్చును. ఆమెతో సమస్తభోగాలూ అనుభవించ వచ్చును. ఓ రాక్షసేశ్వరా! నేను చెప్పింది నీకు రుచించేటట్లయితే, నీవు నిర్విశంకముగా నేను చెప్పినట్టుగా చేయవలసింది.

"ఓ రావణుడా! నీ బలాతిశయాన్ని తెలుసుకో. నీ బలముతో ఆ సర్వాంగ సుందరిని, ఆ అబలను సీతను తెచ్చుకో. భార్యనుగా చేసుకో. ఓ రాక్షసుడా! జనస్థాన ములో రాక్షసులను అందరినీ, దూషణుడితో కూడా ఖరుణ్ణీ రాముడు సూటిగాపోయే

బాణాలు వదలి చంపివేసినాడు అనే సంగతి నీవు ఇప్పుడు విన్నావు. ఇకను ఈ విషయములో నీవు ఏమిచేయవలెనో నీవే నిర్ణయించుకోవలెను" అని చెప్పింది.

35

ఒళ్ళు గగురుపుట్టేటట్టు శూర్పణఖ చెప్పింది అంతా రావణుడు విన్నాడు. పని తెలుసుకొన్నాడు. మంత్రులను పంపించివేసినాడు. లోపలికి పోయినాడు. ఆ పనిని గురించి ఆలోచించసాగినాడు. గుణదోషాలను, బలాబలాలను నిర్ణయించినాడు. ఇట్లా చేయవలెను అనుకొన్నాడు. స్థిరచిత్తుడు అయినాడు. ప్రచ్ఛన్నముగా యాగశాలకు పోయినాడు. సారథిని చూచి రథము సిద్ధము చేయవలసింది అని ఆజ్ఞాపించినాడు. లఘువిక్రముడు ఆ సారధి క్షణమాత్రములో రావణుడికి ఇష్టము అయిన రథాన్ని ఆయత్తము చేసినాడు. రత్నాలు పొదిగిన ఆ బంగారు రథానికి పిశాచముఖాల కంచరగాడిదలను బంగారు సొమ్ములతో అలంకరించి పూంచినాడు. అది ఎట్లా పొమ్మంటే అట్లా పోతుంది. రావణుడు ఆ రథము ఎక్కినాడు.

శ్వేతచ్ఛత్రముతో, శ్వేతపుష్పమాలలతో, నిగనిగలాడే వైఢూర్యమణివంటి దేహకాంతులతో, తప్తకాంచనకుండలాలతో, దర్శనీయము అయిన వస్త్రాలతో, ఇరవై భుజాలతో ఆ మునిజనహంతకుడు, ఆ దేవశత్రువు దశగ్రీవుడు తన చిత్తము వచ్చినట్టు పోయే రథముమీద దశశీర్షాలపర్వతమువలె కనిపించినాడు. ఆ రథము మీద అట్లా పోతున్న రావణుడు ఆకాశములో బలాకపంక్తులతోనూ, తళతళలాడే విద్యుల్లతలతోనూ పరుగులు ఎత్తే నీలమేఘమువలె కనిపించినాడు. ఆ రథము మేఘనాదముతో సముద్రతీరానికి పోయింది.

ఆ సముద్రతీరాన నానావిధ పుష్ప ఫల వృక్షాలూ ఉన్నవి. ఎన్నో పర్వతాలు ఉన్నవి. చల్లని మంగళకరము అయిన జలాలతో తామరకొలనులు, విశాలము అయిన అగ్నివేదికలతో ఆశ్రమపదాలు అక్కడ అంతటా కనిపించినవి. అరటిచెట్లూ, కందిచెట్లూ, కొబ్బరి చెట్లూ పూలు పూసి, పిందెలు కట్టుతూ శోభాయమానముగా ఉన్నవి. మద్దిచెట్లూ, తాటిచెట్లూ పూలు పూస్తున్నవి.

అప్పుడు ఆ సముద్రతీరాన వేలకొద్దీ నాగులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు తిరుగుతున్నారు. దివ్యాభరణాలతో, దివ్యరూపాలతో క్రీడారతివిధిజ్ఞలైన అప్సరసలు, దివ్యకాంతులతో తేజరిల్లే దేవతాంగనలు, అమృతపానము చేసిన దేవతలు విహరిస్తున్నారు.

మరీచిపాయులూ, అత్యంతనియతాహారులూ, అయోనిజులూ అయిన వైఖానసులూ, వాలఖిల్యులూ, మాషులు, జితకాములు అయిన సిద్ధులూ, చారణులూ,

పరమర్షులూ అక్కడ ఆ సముద్రతీరాన నివసిస్తున్నారు. హంసలూ, క్రౌంచపక్షులూ, బెగ్గురుపక్షులూ, నీరుకోళ్ళూ మహాశ్రావ్యధ్వనులు చేస్తూ ఉన్నవి. సముద్రతేజస్సుతో ఆ తీరము వైడూర్యమణులు పరిచినట్టుగా నిగనిగలాడుతూ కనిపించింది.

అప్పుడు ఆ సముద్రతీరాన అవి అన్నీ చూస్తూ రథములో పోతూ ఉన్న రావణుడికి, విశాలము అయిన తెల్లటి విమానాలు అంతటా కనిపించినవి. అవి దేవతలు తపోబలముతో సంపాదించినవి. అవి ఎక్కడికి పడితే అక్కడికి పోగలవు. వాటిలో అప్సరసలు, గంధర్వులు ఉన్నారు. అవి పూలదండలతోను, గీత వాద్య ధ్వనులతోను పోతున్నవి.

శ్రేష్ఠము అయిన అగరుచెట్లూ, నాణ్యము అయిన తక్కోలముచెట్లూ, బంక కారుతున్న చందనముచెట్లూ, జాతిచెట్లూ, కానుగుచెట్లూ, మిరియపు పొదలూ వందలకొద్దీ వేలకొద్దీ ఉన్న ఉద్యానవనాలలో నుంచి గుబాళిస్తున్న సుగంధాన్ని ఆఘ్రాణిస్తూ, సముద్రతీరాన వెదచల్లినట్టుగా ఉన్న పొడి పొడి ముత్యాలనూ, శంఖాలనూ, పగడాలనూ చూస్తూ; బంగారుకొండలూ, వెండికొండలూ దాటుతూ; మనోహరము అయిన సెలయేళ్ళ ప్రక్కనుంచీ, నిర్మల జలాలతో ఉన్న ప్రవాహాల ప్రక్కనుంచీ పోతూ రత్నాలవంటి స్త్రీలతోనూ, ఏనుగులతోనూ, గుర్రాలతోనూ, రథాలతోనూ ధనధాన్యసమృద్ధము అయిన పట్టణాలు చూస్తూ; మిట్టపల్లాలు లేకుండా సమమట్టముగా సముద్రతీరాన చల్లగాలి వీస్తూ స్వర్గధామమువలె ఉన్న ప్రదేశములో ఒక పెద్దమఱ్ఱిచెట్టు దగ్గరకు చేరినాడు.

ఆ మఱ్ఱిచెట్టు కొమ్మలు అన్నివైపులా నూరుయోజనాల దూరము వ్యాపించినవి. ఆ మహావృక్షము ఒక మహామేఘమువలె కనిపించింది. దాని చుట్టూ ఋషులు నివసిస్తున్నారు. మహాబలవంతుడు అయిన గరుత్మంతుడు పూర్వము ఒక ఏనుగునూ, ఒక పెద్ద తాబేలునూ తినడానికి తెచ్చుకొని ఆ మఱ్ఱిచెట్టు కొమ్మమీద కూర్చున్నాడు. ఆ మహాబలశాలి భారానికి తట్టుకోలేక ఆ చెట్టుకొమ్మ అప్పటికి అప్పుడు విరిగిపోయింది. అప్పుడు ఆ చెట్టుకొమ్మ క్రింద తపస్సు చేసుకొంటూ ఉన్న మరీచీపాయులనూ, వైఖానసులనూ, ఋషులనూ, వాలఖిల్యులు మొదలు అయిన మహర్షులనూ రక్షించడానికి ఆ గరుత్మంతుడు ఆ నూరుయోజనాల మఱ్ఱికొమ్మనూ, ఏనుగునూ, తాబేలునూ అమితవేగముతో అవతలికి తీసికొనిపోయినాడు. అంతట ఆ ధర్మాత్ముడు గరుత్మంతుడు ఒక్క పాదముమీద నిల్చుని ఆ గజకచ్ఛపాలను తిని, ఆ కొమ్మతో నిషాదులను అందరినీ చంపివేసి వారి బాధలనుండి ఆ మహర్షులను అందరినీ తప్పించి ఎంతో సంతోషపడ్డాడు.

ఆ సంతోషముతో ఆ మతిమంతుడు రెండింతలు విక్రమించినాడు. అమృతము తేవడానికి బయలుదేరినాడు. మహేంద్రభవనానికి అమర్చిన ఇనుప కిటికీలను విరిచివేసి, రత్నమయము అయిన గోడలను పగులకొట్టి, లోపలికి పోయి దాచి ఉంచిన అమృతాన్ని ఎత్తుకొని పోయినాడు.

ఆ మఱ్ఱిచెట్టు పేరు సుభద్రము. గరుత్మంతుడివల్ల ఆ చెట్టుకొమ్మ విరగడము మొదలు అయిన గుర్తులు కనపడుతూ ఉంటవి. అక్కడ, ఆ చెట్టుక్రింద అనేకమంది మహర్షులు తపస్సు చేసుకొంటున్నారు.

రావణుడు ఆ చెట్టు దగ్గరనుంచి బయలుదేరినాడు. అరణ్యమధ్యములో ఏకాంతముగానూ, మనోహరముగానూ ఉన్న ఆశ్రమములోకి పోయినాడు. జటావల్కల ధారియై కృష్ణాజినము కప్పుకొని ఉన్న నియతాహారుణ్ణి మారీచుణ్ణి చూచినాడు.

ఆ మారీచుడు ఆ రాక్షసరాజును యథావిధిగా మానవ దుర్లభము అయిన నానావిధమహార్హపదార్థాలతో పూజించినాడు. అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి భోజనము పెట్టినాడు. అంతట అర్థవంతముగా, "ఓ రాక్షసప్రభూ! లంకలో అందరూ క్షేమముగా ఉంటూ ఉన్నారు కదా! మళ్ళీ ఏమి పనిమీద తొందరగా వచ్చినావు" అని అడిగినాడు.

36

మారీచ రావణుల సంభాషణ

"నాయనా, మారీచా! నేను చెప్పే మాటలు అన్నీ నీవు వినవలసింది. నేను ఆపన్నుణ్ణి అయినాను. ఇప్పుడు నీవే పరమగతివి.

"నా తమ్ములు ఖరుడూ, మహాబాహువు అయిన దూషణుడూ, నా చెల్లెలు శూర్పణఖా, త్రిశిరుడూ, ఇంకా ఎంతోమంది రాక్షసులూ నేను ఆజ్ఞాపించినందువల్ల దండకారణ్యములో మహర్షులను అందరినీ బాధిస్తూ, జనస్థానములో నివసిస్తూ ఉండడము నీవు ఎరుగుదువు.

"ఆ జనస్థాన రాక్షసులు అందరూ భయంకరపరాక్రములు. శూరులు. మహోత్సాహులు. ఖరుడి చిత్తాన్ని అనుసరించిపోతూ ఉండేవాండ్లు. వాండ్లు పద్నాలుగువేలమంది. వాండ్లు అందరూ ఖరుడివెంట పోయి నానావిధాయుధాలు తీసికొని రాముడితో పోరాడినారు. వాడు, ఆ రాముడు పరమకుపితుడు అయినప్పటికిన్నీ, ఏ కొంచెము పరుషము అయిన మాట అనకుండా తన ధనుర్విద్యాపాండిత్యము చూపించినాడు. ఒక్క కాలిబంటు, అందులో మానవుడు భయంకరపరాక్రములు అయిన పద్నాలుగువేలమంది రాక్షసయోధులను నిశితాస్త్రాలతో చంపివేసినాడు. ఆ పోరాటములో ఖరుడూ, దూషణుడూ, త్రిశిరుడూ చచ్చిపోయినారు. దండకారణ్యము ఋషులు అందరికీ నిర్భయము అయిన ప్రదేశము అయింది.

"మారీచుడా! తండ్రికి కోపమువచ్చి తరిమివేస్తే, ఆయువు అయిపోయి, వాడు, ఆ రాముడు భార్యతోకూడ ఈ అడవికి వచ్చినాడు. వాడు క్షత్రియపాంసనుడు. నా సైన్యానికి హంతకుడు అయినాడు. వాడు దుశ్శీలుడు. క్రూరుడు. కఠినుడు. మూర్ఖుడు. ఆశపాతకుడు. అజితేంద్రియుడు. వాడు ధర్మాన్ని త్యజించినాడు. అధర్మానికి పూనుకొన్నాడు. ప్రాణికోటికి కీడుచేయ తలపెట్టినాడు. వైరము ఏమీ లేకుండానే తనకు బలము ఉందని, అడవిలో ఒంటరిగా తిరుగుతూ ఉన్న నా చెల్లెలు ముక్కూ, చెవులూ కోసి విరూపను చేసివేసినాడు. అందువల్ల వాడి భార్యను, దేవకన్యవంటి సీతను నేను ఎత్తుకొనిపోవలెను అని వచ్చినాను. ఇందుకు నీవు నాకు తోడుకావలెను.

"ఓ మారీచుడా! నీవూ, నా తమ్ములూ నాకు తోడు అయి నా ప్రక్కను ఉండేటట్లయితే, దేవతలు అందరూ ఏకము అయి ఎత్తివచ్చినా నేను లెక్కచేయను.

"ఓ మారీచుడా! నీవు సమర్థుడవు. నీవు నాకు తోడుగా ఉండు. పరాక్రమానికీ, దర్పానికీ, పోరాటానికీ నీతో సమానము అయినవాడు నాకు మరి ఒకడు లేడు. నీవు ఉపాయము తెలిసినవాడవు. గొప్పవాడవు. శూరుడవు. అంతేకాదు, సర్వమాయా విశారదుడవు. నాయనా! ఇందుకోసమే నేను నీ దగ్గరకు వచ్చినాను. నాకు సాయపడడానికి నీవు ఏమి చేయవలెనో చెప్తుతాను, విను.

"ఓ రాక్షసుడా! నీవు వెండిచుక్కలతో చిత్రము అయిన బంగారు జింకవు అయిపోయి, రాముడి ఆశ్రమప్రదేశములో సీత ఎట్టఎదుట తిరుగవలెను. నీవు జింక రూపముతో కనిపించగానే ఆ సీత నిన్ను పట్టుకోవలసింది అని పెనిమిటితోనూ, లక్ష్మణుడితోనూ తప్పకుండా చెప్తుతుంది. అంతట రామలక్ష్మణులు నీవెంట పడతారు. అప్పుడు ఆ శూన్యారణ్యములో ఏ బాధా లేకుండా సుఖముగా ఆ సీతను చంద్రప్రభను రాహువువలె, నేను అపహరించుకొనిపోతాను. నేను కృతార్థుణ్ణి అవుతాను. రాముడు భార్యావిరహకర్శితుడు అవుతాడు. అప్పుడు వాణ్ణి నేను సులభముగా, నిర్భయముగా కొట్టుతాను" అని చెప్పినాడు.

అది అంతా మారీచుడు విన్నాడు. భయపడిపోయినాడు. దుఃఖపడ్డాడు. ఆ మహాబలవంతుడికి నోరు ఎండిపోయింది. ఎండిపోయిన పెదవులు నాలుకతో నాకుతూ కన్నులు ఆర్పకుండా, చచ్చిపోయినవాడివలె రావణుడివంక చూడసాగినాడు.

ఆ మహావనములో రాముడి పరాక్రమము ఎరిగినవాడు మారీచుడు ఒక్కడే. అందువల్లనే వాడు భయపడ్డాడు. విషణ్ణుడు అయినాడు. తనకూ, రావణుడికీ మేలు అయ్యే విషయము చెప్పవలెను అనుకొన్నాడు. చేతులు జోడించినాడు.

37

మారీచుడు సంగతులు అన్నీ తెలిసినవాడు. మాటనేర్పరి. రావణాసురుణ్ణి చూచి, "రాజా! ఇచ్చగాలమారిమాటలు చెప్పేవాండ్లూ, వినేవాండ్లూ ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు దొరుకుతూ ఉంటారు. కాని, రోగికి పథ్యమువలె అప్రియము అయినప్పటికిన్నీ, మేలుచేసే విషయము చెప్పేవాండ్లూ, వినేవాండ్లూ దొరకడము అరుదు. ప్రభూ! నీకు వేగులవాండ్లు లేరు. రాముడు మహావీర్యవంతుడు అనీ, గొప్పగుణవంతుడు అనీ, మహేంద్రుడు వరుణుడు అంతటివాడు అనీ నీవు తెలుసుకోలేదు. నీవు చపలుడవు. నేను చెప్పితే నీవు నమ్మలేదు, నిజము.

"నాయనా, రావణా! ఇకను ఈ భూమిమీద రాక్షసులకు సుఖము ఉందా? రాముడికి కోపమువస్తే అరాక్షసము చేయకుండా ఉంటాడా? ఆ జనకరాజసుత నీ ప్రాణము తీయించడానికి పుట్టిందా ఏమిటి? నేను దుఃఖము అనుభవించవలసి ఉందా ఏమిటి? యధేష్టముగా ప్రవర్తించే నీవు, నిరంకుశుడవు అయిన నీవు ఏలికవు అయినావు. అందువల్ల నీతోనూ, సమస్త రాక్షసులతోనూ లంకాపట్టణము నాశనము అయిపోతుందా ఏమిటి? పాపాలోచనలు చేస్తూ, చిత్తము వచ్చినట్టు విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ దుశ్శీలుడు అయిపోయే రాజు తననూ, తన బంధువులనూ, తన రాజ్యాన్నీ చేతులారా నాశనము చేసుకొంటాడు.

"ఓ ప్రభూ! రాముణ్ణి తండ్రి తరిమివేయలేదు. అతడు మర్యాద తప్పినవాడు కాడు. లుబ్ధుడు కాడు. క్షత్రియపాంసనుడు కాడు. ధర్మగుణహీనుడు కాడు. క్రూరుడు కాడు. ప్రాణికోటికి కీడుచేసేవాడు కాడు. అతడు, కౌసల్యాదేవి కడుపున పుట్టిన ఆనందవర్ధనుడు. ఆడితప్పని తన తండ్రిని కైకేయీదేవి మోసము చేయడము అతడు చూచినాడు. ఆమె కోరిక చెల్లించడానికీ, తన తండ్రి దశరథమహారాజును సంతోషపెట్టడానికీ రాముడు రాజ్యాన్ని వదలుకొన్నాడు. సమస్తభోగాలూ వదలుకొన్నాడు. దండకారణ్యానికి వచ్చినాడు. రాముడు కఠినుడు కాడు. అపండితుడు కాడు. అజితేంద్రియుడున్నూ కాడు. నీవు అతనిని గురించి అబద్ధాలూ, తప్పుడు మాటలూ విన్నావు. నీవు ఆ ధర్మాత్ముణ్ణి అట్లా అనవద్దు.

"ఓ రాజా! ధర్మము ఈలోకములో రాముడి రూపాన అవతరించింది. అతడు సజ్జనుడు. సత్యపరాక్రముడు. దేవతలకు దేవేంద్రుడివలె, సర్వలోకాలవారికీ రాముడు ప్రభువు. ఆ రాముడు తన తేజస్సుతో సీతాదేవిని కాపాడుతున్నాడు. సూర్యుడినుంచి సూర్యతేజాన్నివలె, రాముడిదగ్గరనుంచి సీతను ఎంత బలవంతంగా అయినా అపహరించడానికి ఎట్లా వీలు అవుతుంది?

"ఓ ప్రభూ! రాముడు అగ్నిహోత్రము. ఆ అగ్నిహోత్రానికి ధనుస్సులూ, ఖడ్గాలూ ఇంధనాలు. బాణాలే ఆ అగ్నిహోత్రజ్వాలలు. అది దరిచేరను అలవికాని మంటలు మండుతుంది. నీవు ఆ అగ్నిహోత్రములో పడిపోవద్దు.

"రాముడే యముడు. కోపముతో రేగి శత్రుసంహారము చేయడానికి ఎక్కుపెట్టే ఆ ధనుస్సే యముడు మంటలు కక్కుతూ తెరిచే నోరు. ఆ వీరుడు వదలే బాణాలే ఆ యముడి తీక్ష్ణకాంతులు. చాపపాతమే కాలపాశము. సంతోషముగా సుఖముగా ఉంటూ ఉన్న నీ జీవితాన్ని, నీ రాజ్యాన్ని వదలుకొని, నీవు ఆ యముడి దగ్గరకు పోవద్దు. ఆ జనకాత్మజ ఎవడి భార్యో వాడి తేజము అప్రమేయము. ఆ రాముడి వింటి అండను ఆ సీతాదేవి ఈ అడవిలో ఉంటూ ఉంది. ఆమెను అపహరించే సామర్థ్యము నీకు లేదు. ఆ నరసింహుడికి, ఆ సింహవక్షుడికి ఆ భామిని ప్రాణముకన్నా ప్రియతరము అయిన భార్య. ఆమె ఎప్పుడూ అతనిని అనుసరించుకొని ఉంటున్నది. ఆ ఓజస్వంతుడి ప్రియురాలు, ఆ సుమధ్యమ, ఆ మైథిలి సీతాదేవి పట్టుకోను అలవికాని దీప్తహుతాశన శిఖ.

"ఓ రాక్షసరాజా! ఎందుకు ఈ వ్యర్థప్రయత్నము? పోరాటములో రామదర్శనముతో నీ జీవితము అంతము అయిపోతుంది. నీవు దుర్లభము అయిన రాజ్యము ఏలుతున్నావు. ఆ రాజ్యపాలనము చేస్తూ నీవు బహుకాలము సుఖముగా జీవించతలచుకొన్నట్టయితే, ఆ రాముడి జోలికి పోవద్దు. అతనికి అపకారము చేయవద్దు.

"ఓ రావణప్రభూ! నీవు విభీషణాది ధర్మిష్టులు అయిన మంత్రులు అందరితోనూ ఆలోచించు. గుణదోషాలూ, బలాబలాలూ నిర్ణయించు. నీ బలాన్ని గురించీ, రాముడి బలాన్ని గురించీ యథార్థము తెలుసుకో. ఏది కీడో, ఏది మేలో నిర్ధారణ అయిన తరువాత తగినట్టు ప్రవర్తించవలెను.

"ఓ రాక్షసేంద్రా! నీవు యుద్ధములో రాముణ్ణి ఎదుర్కొనడము మంచిదికాదు అని నేను అనుకుంటున్నాను. ఎన్నిసార్లు అయినా ఈమాటే చెప్పుతాను.

38

"నేను ఒకానొకప్పుడు నా యౌవనములో శిరస్సున కిరీటము, చెవులకు తప్తకాంచనకుండలాలు పెట్టుకొని, చేతిలో ఒక పెద్దఇనుపగుదియ పట్టుకొని, ఒక వెయ్యిఏనుగులబలముతో, అమితపరాక్రమముతో కొండ అంత ఎత్తున నీల మేఘమువలె ఈ భూమి అంతా సంచరిస్తూ, సమస్తము అయిన వాండ్లనూ భయపెట్టుతూ, ఋషుల మాంసము తింటూ దండకారణ్యములో ఉంటూ ఉండేవాణ్ణి.

"ధర్మాత్ముడు అయిన విశ్వామిత్రమహర్షి అప్పుడు నాకు భయపడి స్వయముగా దశరథమహారాజు దగ్గరకు పోయి, 'ఓరాజా! ఇప్పుడు నన్ను జాగ్రత్తగా కాపాడ కలిగినవాడు రాముడు ఒక్కడే. నేను చేస్తున్న యజ్ఞము సమాప్తము కావలెను. 'మారీచుడు' అనే రాక్షసుడు నన్ను మహాఘోరముగా బాధపెట్టుతున్నాడు. రాముణ్ణి నా వెంట పంపించవలెను' అని అడిగినాడు.

"అందుకు ఆ ధర్మాత్ముడు దశరథమహారాజు ఆ విశ్వామిత్రమహర్షితో, 'ఓ మహాభాగా! రాముడు పన్నెండుఏండ్ల పిల్లవాడు. అస్త్రవిద్య పూర్తిచేయలేదు. నా సైన్యాన్ని అంతా తమవెంట పంపిస్తాను. కావలెను అనేటట్లయితే, నా చతురంగ బలాలతో నేనే వస్తాను. మీచిత్తము వచ్చినట్టు రాక్షసులను సంహారము చేసివేస్తాను' అని చెప్పినాడు.

"అందుకు ఆ మహర్షి, 'ఓ రాజా! ఈ భూలోకములో రాముడు ఒక్కడు తప్ప ఎంతసైన్యము అయినా మారీచుడికి చాలదు. రాజా! నీవు యుద్ధాలలో దేవసేనలను నడిపినవాడవు. నీవు చేసిన పనులకు నీవు ముల్లోకాలలోనూ ప్రసిద్ధికి ఎక్కినావు. నీ సైన్యము చాలా గొప్పది. దానిని ఇక్కడనే ఉండనివ్వు. ఓ పరంతపా! రాముణ్ణి తీసుకొనిపోతాను. నీకు శుభము అవుతుంది' అని చెప్పి, రాముణ్ణి వెంట పెట్టుకొని పరమ సంతోషముతో తన ఆశ్రమానికి వచ్చినాడు.

"అప్పుడు రాముడు యజ్ఞదీక్షలో ఉన్న విశ్వామిత్రుడి దగ్గర నిలుచుని దండకారణ్యము అంతా మారుమ్రోగిపోయేటట్టుగా ధనుస్సు చిత్రముగా మ్రోగించడము మొదలు పెట్టినాడు. ఆ కాంతిమంతుడికి అప్పటికి మీసాలు మొదలు అయిన యౌవన చిహ్నాలు ఏవీ అంకురించలేదు. తామరరేకులవంటి కన్నులు, శిఖలో బంగారు పూలదండలు తళతళలాడుతున్నవి. ఒక్కటే వస్త్రము కట్టుకొన్నాడు. ఉదయిస్తున్న బాలచంద్రుడివలె దేహకాంతులతో శోభిస్తున్నాడు.

"నేను అప్పుడు మంచిబలములో ఉన్నాను. అప్పటికే అనేకవరాలు సంపాదించినవాణ్ణి, మేఘాకారుణ్ణి. తప్తకాంచనకుండలాలు చెవులకు వేళ్ళాడుతూ అమితదర్పముతో నేను విశ్వామిత్రుడి ఆశ్రమానికి పోయినాను. ఆయుధధారుణ్ణి అయి హఠాత్తుగా ఆ ఆశ్రమములో ప్రవేశించినాను. రాముడు నన్ను చూచినాడు. తొట్రుపాటు పడకుండా ధనుస్సు సజ్యము చేసినాడు. నేను నా అజ్ఞానమువల్ల రాముణ్ణి పిల్లవాడు అనుకొన్నాను. ఏమాత్రమూ లెక్కచేయకుండా విశ్వామిత్రమహర్షి యజ్ఞవేదిక మీదికి పరుగెత్తినాను. అంతట రాముడు శత్రుబర్హణము అయిన నిశితాస్త్రాన్ని నామీద వదలినాడు. ఆ బాణము నన్ను నూరుయోజనాల దూరము

ఎగురనెత్తుకొనిపోయి సముద్రములో పడవేసింది. ఆ బాణము నన్ను అట్లా ఆ సముద్రములో పడతోయడములో నేను ఎంతో లోతుకు పోయినాను. చాలాసేపటి వరకు నాకు తెలివి రాలేదు. చివరకు నేను లంకాపట్టణము చేరినాను. అప్పుడు రాముడు నన్ను చంపివేయవలెను అనుకోలేదు. అందువల్ల బ్రతికి ఉన్నాను. అప్పటికి రాముడు బాలుడు. అకృతాస్త్రుడు. అక్లిష్టకర్ముడు. నాకు సహాయులు అయిన వాండ్లను అందరినీ అతడు చంపివేసినాడు. నన్ను మాత్రము వదలిపెట్టినాడు.

"ఓ రావణప్రభూ! నేను 'వద్దు' అని చెప్పుతున్నాను. అయినప్పటికిన్నీ, నీవు ఆ రాముడితో విరోధము పెట్టుకొనేటట్లయితే తక్షణమే ఆపదలపాలు అయిపోతావు. నీవు ఒక్కడవే కాదు, రాక్షసులు అందరూ ఆపదలు అనుభవిస్తారు. ఇప్పుడు నానావిధక్రీడలతో, సమస్తభోగాలతో సంతోషము అనుభవిస్తూ ఉత్సవాలు చేసుకొంటూనూ, సభలు చేసుకుంటూనూ ఉన్న రాక్షసులను అందరినీ నీవు దుఃఖాలపాలు చేసినవాడవు అవుతావు. రాక్షసులకు అందరికీ మహానర్థము తెచ్చి పెట్టేవాడవు అవుతావు. హర్మ్యప్రాసాదాలతో, రత్నాభరణాలతో శోభాయమానముగా ఉంటూ ఉన్న లంకాపట్టణము సీత నిమిత్తము నాశనము అయిపోవడము చూస్తావు. ఎన్నడూ, ఏ పాపమూ చేయని పరిశుద్ధులు సహితము పాపుల సహవాసమువల్ల, పాముల మడుగులో చేపలవలె నాశనము అయిపోతారు. దివ్యచందనము పూసుకొని దివ్యాభరణాలతో తేజరిల్లే నీ పరివారము అంతా నీ తప్పిదమునుంచి రామబాణాభిహతము అయిపోయి నేలకూలడము నీవు చూస్తావు. చావగా మిగిలిన రాక్షసులు కాపాడే గతిలేక పెండ్లాలను వదలిపెట్టి పారిపోవటమూ, పెండ్లాలతో పారిపోవడమూ దశదిశలా చూస్తావు. లంకాపట్టణము అంతటా బాణసమూహాలు కమ్ముకొని మహాభవనాలు అన్నీ అగ్గి అంటుకొని భగభగ మండిపోవడము చూస్తావు.

"ఓ రాజా! పరదారలను చెరచడముకన్నా మహాపాపము మరి ఒకటి లేదు. నీకు ఒక వెయ్యిమంది భార్యలు ఉన్నారు. వాండ్లతో సుఖము అనుభవించు. నీ గౌరవాన్ని, నీ సంపదను, నీ వంశాన్ని కాపాడుకో. నీ రాజ్యాన్ని కాపాడుకో. నీవు సంతోషముగా, సుఖముగా బహుకాలము బ్రతికి ఉండవలెను. నీ భార్యలు అందరూ సుందరాంగనలు. నీకు అనుకూలలు. నీ మిత్రులు అందరూ నమ్మకస్థులు. నీవు నీ భార్యలతో సుఖము అనుభవిస్తూ, నీ మిత్రులను అందరినీ సంతోషపెట్టుతూ బహుకాలము బ్రతకతలచుకొన్నట్లయితే రాముడికి అపకారము చేయవద్దు.

"ఓ ప్రభూ! నేను నీ సుహృదుణ్ణి. నేను ఎంతగానో నీతో 'వద్దు' అని చెప్పుతున్నాను. నీవు 'కాదు' అని బలవంతముగా సీతను ఎత్తుకొని పోయేటట్లయితే,

నీ చతురంగబలాలు నాశనము అయిపోతవి. నీ బంధువులు అందరూ నాశనము అయిపోతారు. నీవున్నూ రామబాణ హతుడవు అయి యమలోకానికి పోతావు.

39

"అప్పుడు (ఆ విశ్వామిత్రమహర్షి ఆశ్రమములో) ఆ పోరాటములో ఎట్లాగో తప్పించుకొని బయటపడ్డాను. ఇటీవల జరిగింది చెప్పుతాను, సావధానముగా వినవలెను.

"రాముడు అట్లా చేసినప్పటికిన్నీ, నేనునిర్విణ్ణుణ్ణి అయిపోలేదు. సమయము కోసము కనిపెట్టుకొని ఉన్నాను. కొంతకాలానికి ఇద్దరు రాక్షసులతో కూడా మృగరూపము ధరించి మళ్ళీ దండకారణ్యము చేరినాను. పెద్ద దేహముతో, పైకి జింకవలె కనపడుతూ మంటలు మండే నాలుకతో, తీక్ష్ణము అయిన కోరలతో దండకారణ్యములో తిరుగుతూ యజ్ఞశాలలలోనూ, పుణ్యతీర్థాలలోనూ, చైత్యవృక్షాల క్రిందా, ఋషుల సమావేశాలలోనూ అందరినీ భయపెట్టుతూ, ఆ అడవిలో అడ్డము అయిన వాండ్లను అందరినీ బెదిరిస్తూ, ధర్మాచరణపరాయణులు అయిన ఋషులను చంపివేసి వారి నెత్తురు త్రాగుతూ, వారి మాంసము తింటూ మదము ఎక్కిపోయి క్రూరుణ్ణి, ధర్మదూషకుణ్ణి అయిపోయినాను.

"అప్పుడు తాపసవేషముతో ఉన్న ఆ ధర్మాత్ముణ్ణి రాముణ్ణి, మహారథుడు అయిన లక్ష్మణుణ్ణి, పరమపూజ్యురాలు అయిన సీతాదేవిని చూచి, వారి దగ్గరకు పోయినాను. వాడి అయిన కొమ్ములతో జింకరూపములో ఉన్న నన్ను, వారు గుర్తు పట్టలేదు. నాకు మాత్రము ఆ మహానుభావుడి బాణము దెబ్బ జ్ఞాపకము వచ్చింది. పూర్వవైరము తలచుకొన్నాను. ఇప్పుడు రాముడు తపసి. నియతాహారుడు. నన్ను ఏమీ చేయలేడు అనుకొన్నాను. సర్వప్రాణికోటికి మేలు చేయడానికి అడవికి వచ్చిన ఆ మహాబలవంతుణ్ణి రాముణ్ణి నా కొమ్ములతో పొడిచి చంపివేయవలెను అనుకొన్నాను. బుద్ధితక్కువవాణ్ణి అయి రాముణ్ణి ఎదిరించడానికి ఎదురుగుండా పరుగెత్తినాను.

"అంతట రాముడు వింటిని ఎక్కుపెట్టి గరుత్మంతుడి రెక్కలవలె మహాధ్వని చేస్తూ, శత్రువులను నరికివేసే మూడు బాణాలు నామీద వదలినాడు. ఆ బాణాలు వజ్రాలవంటివి. అవి నెత్తురు త్రాగుతవి. వాటికి వంగిన కణుపులు ఉన్నవి. ఆ మూడు బాణాలు రావడము నేను చూచినాను. రాముడి బాణాలు ఎంత భయంకరము అయినవో నేను అదివరకు చూచినందువల్లను, రాముడి పరాక్రమము నాకు తెలిసి ఉన్నందువల్లను నేను ఆ బాణాలకు అందకుండా పరుగెత్తి పారిపోయినాను. ఆ బాణాలు తగిలి నావెంట వచ్చిన ఇద్దరు రాక్షసులూ చచ్చిపోయినారు. రాముడి బాణాన్ని ఎట్లాగో తప్పించుకొని పరుగెత్తినందువల్ల నేను బ్రతికి ఉన్నాను.

"నేను ఇప్పుడు సమస్త దుర్వృత్తులూ మానివేసినాను. యోగ్యుణ్ణి అయినాను. తపోనిష్ఠతో, మనోనిగ్రహముతో ఇక్కడ ఉంటున్నాను.

"ఓ ప్రభూ! నాకు ఆ చీరకృష్ణాజినధరుడు, ఆ ధనుర్ధరుడు, పాశహస్తుడు అయిన యముడివలె చెట్టు చెట్టునా ఎప్పుడూ కనపడుతూ ఉంటాడు. నాకు భయము భయముగా ఉంటున్నది. నేను ఎటుచూచినా, ఏది చూచినా వందలకొద్దీ వేలకొద్దీ రాములు నాకండ్లకు పొడకొట్టుతూ ఉంటారు. ఈ అడవి అంతా రామమయముగా నాకు తోస్తున్నది. శూన్యములో కూడా రాముడే కనపడుతూ ఉంటాడు. కలలో కూడా నాకు రాముడు కనపడుతూ ఉంటే, నేను తెలివి తప్పిపోయి కలవరిస్తూ ఉంటాను. ఆ రాముడి భయమునుంచి 'ర' అనే అక్షరముతో ఆరంభము అయ్యే పేర్లు రత్నాలు అన్నా రథాలు అన్నా నేను హడలి పోతూ ఉంటాను. ఓ రావణాసురుడా! ఆ రాముడి ప్రభావము ఎరిగినవాణ్ణి నేను. నేను చెప్పుతున్నాను, నీవు ఆ రాముడితో పోరాడలేవు. వాడు బలిని అయినా, నముచిని అయినా సంహారము చేసివేస్తాడు.

"ఓ రాక్షసుడా! నీవు ఆ రాముడితో పోట్లాడేటట్లయితే పోట్లాడు, ఊరక ఉంటే ఊరుకో. నేను బ్రతికి ఉండటము ఇష్టము అయినట్లయితే, రాముణ్ణి గురించి నీవు నాతో ఏమీ మాట్లాడవద్దు. ఈలోకములో ఇతరుల అపరాధమునుంచి అనేకమంది ధార్మికులు, సజ్జనులు, యోగ్యులు సపరివారముగా నాశనము అయిపోతూ ఉంటారు.

"ఓ రాజా! నేను నీ అపరాధమునుంచి నాశము అయిపోవలసి వస్తుంది. నీకు నచ్చినట్లు నీవు చేసుకో. నేను నిన్ను వెంబడించను. ఆ మహాతేజోవంతుడు, ఆ మహాధైర్యవంతుడు, ఆ మహాబలవంతుడు రాముడు రాక్షసలోకానికి అంతటికీ తప్పకుండా హంతకుడు అవుతాడు.

"ఓ ప్రభూ! శూర్పణఖ హేతువునుంచి ఖరుణ్ణీ, జనస్థాన రాక్షసులనూ అంత క్రూరముగా రాముడు వధించడములో తప్పు ఏమిటో యధార్థము చెప్పు.

"ఓ రాజా! నేను బంధుహితము కోరేవాణ్ణి. నీ మంచికోసము చెప్పుతున్నాను. నీవు నా మాటలు వినకపోయేటట్లయితే, గురి తప్పని రామబాణముచే నీవు సబాంధవముగా హతము అయిపోతావు."

40

'రాముడి జోలికి పోవద్దు' అని మారీచుడు ఎంత చక్కగా చెప్పినా, చావదలచుకొన్నవాడు మందుపుచ్చుకోనట్లుగా రావణాసురుడు వినలేదు. ఆ రాక్షసరాజునకు కాలము ముంచుకొని వస్తూ ఉన్నందువల్ల, వాడు రోగికి పథ్యమువలె

మేలుచేసే మాటలు చెప్పితే వినకపోవడమే కాకుండా బేసబబుగానూ కఠినముగానూ, "ఓ మారీచుడా! నీవు అనుచిత ప్రసంగము చేసినావు. నీవు చెప్పిన మాటలు చవిటి నేలను చల్లే విత్తనాలవలె పనికిమాలినవి. వాడు, ఆ రాముడు నీ తల్లిని అకారణముగా చంపడమే కాకుండా, నా చెల్లెలిని విరూపను చేసివేసిన పాపశీలుడు. ఆడుదాని మాటకోసము అడవికి వచ్చిన మూర్ఖుడు. పైగా వాడు మానవుడు. నీవు చెప్పినట్లు వాడా నన్ను యుద్ధములో భేదించేది? అది అశక్యము. బుద్ధిలేని ఒక ఆడుదాని మాట విని తల్లిదండ్రులను, మిత్రులను, రాజ్యాన్ని హఠాత్తుగా వదలుకొని వచ్చిన మూర్ఖుడు వాడు. ఖరఘాతకుడు. వాడికి వాడి ప్రాణముకన్నా ప్రియతరము అయిన వాడి పెండ్లాన్ని సీతను, నీ ఎట్టఎదుట నేను అవశ్యమూ ఎత్తుకొని పోతాను.

"ఓ మారీచుడా! ఈ పని చేయవలెను అని నేను మనస్సులో నిశ్చయించుకొన్నాను. దేవేంద్రుడితో కూడా సురాసురులు అందరూ ఏకము అయి వచ్చినా నా ఈ నిశ్చయానికి తిరుగు ఉండదు. నేను ఈ కార్య నిశ్చయములో గుణదోషాలను గురించికాని, ఉపాయాపాయాలను గురించికాని నిన్ను అడగకుండానే నీ ఇష్టము వచ్చినట్టు చెప్పినావు. ఓ రాక్షసుడా! బ్రతికి బాగుపడతలచుకొన్న మంత్రి, అందులో సమస్తమూ తెలిసినవాడు రాజు అడిగితేనే, చేతులు జోడించి తనకు తోచింది చెప్పవలెను. అది హితము, శుభము అయింది అయినప్పటికిన్నీ, రాజు అభిప్రాయానికి విరుద్ధము కానిది అయితేనే మృదువుగా, వినయ విధేయతలతో చెప్పవలెను. రాజు ఎప్పుడూ గౌరవనీయుడు. అందువల్ల హితవాక్యము అయినప్పటికిన్నీ, నిర్లక్ష్యముగానూ, గౌరవలోపముగానూ చెప్పితే రాజు మెచ్చుకోడు.

"పరాక్రమవంతులు అయిన రాజులు ఇంద్ర, అగ్ని, యమ, వరుణ, సోమ స్వరూపముతో తేజరిల్లుతూ ఉంటారు. అందువల్లనే, రాజు దేవేంద్రుడి వలె పరాక్రమముతో ప్రవర్తిస్తాడు. అగ్నిహోత్రుడివలె తేజరిల్లుతూ ఉంటాడు. యముడివలె శిక్షిస్తూ ఉంటాడు. వరుణుడివలె సుఖపెట్టుతూ ఉంటాడు. చంద్రుడివలె సంతోషపెట్టుతూ ఉంటాడు. కాబట్టి, రాజులు సర్వకాలసర్వావస్థలలోను మాన్యులు, పూజ్యులు. నీవు రాజధర్మము తెలియక అజ్ఞానమువల్ల నీఇంటికి వచ్చిన నాతో పరుషముగా మాట్లాడినావు. నా క్షేమాన్ని గురించికానీ, నేను చేయతలచుకొన్న పనిలో గుణదోషాలను గురించికానీ నిన్ను నేను అడుగలేదు.

"ఓ మారీచుడా! నీవు అమితపరాక్రమవంతుడవు. ఈ మహాకార్యములో నీవు నాకు తోడ్పడవలెను. నేను చెప్పేటట్టు నీవు చేయవలసిందేతప్ప మారు మాట్లాడకూడదు.

"నీవు ఇక ఏమి చేయవలెనో చెప్పుతాను, విను. నీవు వెండిచుక్కలతో బంగారు జింకవు అయిపోయి, రామాశ్రమములో సీత ఎట్టఎదుట తిరగవలెను. నీ మృగరూపముతో నీవు ఆమెను ప్రలోభపెట్టవలెను. బంగారు జింకవు అయిన నిన్ను చూచి ఆమె ఆశ్చర్యపడిపోయేటట్టు చేసి, అంతట ఆ ప్రాంతాలలో యథేష్టముగా తిరుగుతూ ఉండవలెను. ఆ మైధిలి బంగారు జింకను తనకు తెచ్చిపెట్టమని రాముణ్ణి అడుగుతుంది. అప్పుడు రాముడు జింకను పట్టుకోవడానికి బయలుదేరుతాడు. అంతట నీవు దూరముగా పోయి రాముడి గొంతుతో, 'అయ్యో సీతా! అయ్యో లక్ష్మణా' అంటూ కేకలు పెట్టవలెను. అందుకు లక్ష్మణుడు కలవరపడి పోతాడు. అతణ్ణి పొమ్మని సీత తొందర చేస్తుంది. స్నేహాతిశయమువల్ల రాముడి కోసము లక్ష్మణుడు బయలు దేరుతాడు. అట్లా రామలక్ష్మణులు ఇద్దరూ అవతలికి పోగానే శచీదేవిని దేవేంద్రుడివలె, సీతను నేను ఎత్తుకొని పోతాను.

"ఓ రాక్షసుడా! నీవు ఈపని చేసిపెట్టిన తరువాత, నీ ఇష్టము వచ్చినచోట నీవు ఉండవచ్చును. ఓ మారీచుడా! నీవు సువ్రతుడవు. నీవు నాకు ఈపని చేసిపెట్టుతావు. కనుక, నా రాజ్యములో సగభాగము నీకు ఇస్తాను. నీవు మంచివాడవు. నాపని చక్కపెట్టడానికి నీవు చక్కని జింకవు అయిపో. నేనూ రథముమీద నిన్ను వెంబడిస్తాను. రాముణ్ణి వంచించడముతో యుద్ధము చేయకుండానే సీతను సంపాదిస్తాను. నేను కృతార్థుణ్ణి అవుతాను. నిన్ను కూడా నాతో లంకాపట్టణానికి తీసుకొని పోతాను.

"ఓ మారీచుడా! నీవు ఈపని చేయను అనేటట్లయితే, నిన్ను ఇప్పుడే చంపివేస్తాను. ఈపని నీవు అవశ్యమూ చేయవలెను. నీవు ఈ పని చేయవలెను అని నిన్ను నేను బలవంతము చేస్తున్నాను. నేను రాజును. రాజుకు ఎదురుతిరిగేవాడు బ్రతకడు, సుఖపడడు. నీవు రాముడివల్ల చావక పోవచ్చును. కాని, నాతో విరోధము పెట్టుకుంటే నీవు బ్రతికి ఉండడము ఉత్తది. చక్కగా ఆలోచించుకో! ఇకను ఏమి చేస్తావో నీ ఇష్టము" అని రావణాసురుడు చెప్పినాడు.

41

రావణాసురుడు రాజరికముతో తనకు ప్రతికూలముగా ఇట్లా ఆజ్ఞాపించగానే మారీచుడు మరింత పరుషముగా, "ఓ రాజా! నీవూ, నీ కొడుకులూ, నీ మంత్రులూ నాశనము అయిపోయే ఈ ఉపదేశము నీకు ఏ పాపకర్ముడు చేసినాడు? నీవు సుఖముగా ఉండడము సంతోషించ లేకుండా ఉన్న పాపిష్ఠివాడు ఎవడు? నిన్ను ఇట్లా ఉపాయముగా మృత్యుద్వారము దగ్గరకు పంపిస్తున్న వాడు ఎవడు? హీనపరాక్రములు

అయిన రాక్షసులు (స్పష్టముగా) ఎవండ్లో నీ శత్రువులు, నిన్ను ఆ బలవంతుడిచేత చంపించి వేయవలెను అనుకొన్నారు. నీవు నీ స్వయంకృతాపరాధమువల్ల నాశము అయిపోయేటందుకు ఎవడో క్షుద్రుడు ఈ అహితము నీకు బోధించినాడు.

"ఓ రావణాసురుడా! నీవు తప్పుదారి పట్టితే, నీ మంత్రులు అందరూ నిన్ను నిగ్రహించకుండా ఉన్నారు. వాండ్లను చంపివేయవలెను. వాండ్లను నీవు ఇంకా చంపివేయకుండా ఉన్నావే! రాజు తనచిత్తము వచ్చినట్టు ప్రవర్తిస్తూ తప్పుడు త్రోవ త్రొక్కితే, సత్పురుషులు అయిన సచివులు సమస్తవిధాలా ఆ రాజును నిగ్రహిస్తారు. నిన్ను అట్లా నిగ్రహించవలసిన నీ మంత్రులు నిన్ను నిగ్రహించకుండా ఉన్నారే!

"ఓ రాజా! రాజు సద్గుణాలవల్ల ధర్మార్థకామాలు సమకూరుతవి. మంత్రులున్నూ కీర్తిమంతులు అవుతారు. రాజు సద్గుణాలు విపర్యయము అయిపోయినప్పుడు, అంతా వ్యర్థము అయిపోతుంది. రాజు దుర్గుణాలవల్ల మంత్రులేకాదు, ప్రజలు అందరూ దుఃఖాలపాలు అయిపోతారు. ఓ అజయ్యుడా! ధర్మానికి అయినా, జయానికి అయినా రాజే మూలకారణము. అందువల్ల, సర్వకాలసర్వావస్థలలోనూ అందరూ రాజును కాపాడవలెను.

"రాజు క్రూరుడు, ప్రజలకు ప్రతికూలుడు, అవినీతిపరుడు అయ్యేటట్లయితే, ఆ రాజ్యము నిలిచి ఉండడము అశక్యము. రాజు బుద్ధిలేనివాడు, మంత్రులు తీక్ష్ణోపాయులు అయ్యేటట్లయితే, బుద్ధితక్కువ సారధి వేగముగా పోయే గుర్రాలను మిట్టపల్లాలు తెలియక తోలితే తానూ, తన రధమూ, గుర్రాలూ నాశనము అయిపోయేటట్టుగా రాజూ, రాజ్యమూ, మంత్రులూ నాశనము అయిపోతారు.

"ఓ రాజా! ఈలోకములో యోగ్యులు, ధర్మానుష్ఠానపరులు, సజ్జనులు అయిన చాలామంది ఇతరుల తప్పిదమునుంచి సపరివారముగా నాశము అయిపోతూ ఉంటారు. రాజు క్రూరుడూ, ప్రజలకు ప్రతికూలుడూ అయి రాజ్యము ఏలేటట్లయితే, ప్రజలు నక్కలు కాపాడే మేకలవలె క్షీణించిపోతారు. ఓ రావణాసురుడా! నీవు కఠినుడవు. దుర్బుద్ధివి. అజితేంద్రియుడవు. నీవు రాక్షసులకు రాజువు అయినావు. రాక్షసులు నాశము అయిపోక తప్పదు.

"ఓ రావణాసురుడా! ఈ ఘోర తప్పిదము నా నెత్తిన పడడము కాకతాళీయము. నీవు ససైన్యముగా నాశనము అయిపోతావు. అందుకు నేను ఏడుస్తున్నాను. రాముడు నన్ను చంపివేస్తాడు. వెంటనే నిన్నూ చంపివేస్తాడు. శత్రువు చేతిలో చస్తాను కాబట్టి, నేను కృతార్థుణ్ణి అవుతాను. రామదర్శనముతో నేను చస్తాను. సీతను అపహరించి నీవు సబాంధవముగా చస్తావు. ఒకవేళ మనము

ఇద్దరమూ కలిసి రామాశ్రమములోనుంచి సీతను తెచ్చేటట్లయితే నీవూ బ్రతకవు, నేనూ బ్రతుకను, రాక్షసులూ మిగులరు, లంకా ఉండదు.

"ఓ రావణాసురుడా! నేను నీ మేలు కోరి వద్దు అని చెప్పుతూ ఉంటే వినకుండా ఉన్నావు. ఇంతకూ స్నేహితులు చెప్పే మంచిమాటలు గతాయుష్కులూ, మృతప్రాయులూ వినరు. ఏమి చేయడము?" అన్నాడు మారీచుడు.

42

మారీచుని జింక రూపము

మారీచుడు ఆ రాత్రించర ప్రభువుకు భయపడిపోయినాడు. దుఃఖపడ్డాడు. అంతట రావణాసురుణ్ణి చూచి, "ఓ రాక్షసరాజా! మనము పోదాము. ఆ శరచాపఖడ్గధరుడు రాముడు నన్ను చంపివేయడానికి మళ్ళీ ఆయుధము ఎత్తడము చూస్తాను. నాప్రాణము పోతుంది. రాముణ్ణి ఎదిరించినవాడు ఎవడూ ప్రాణాలతో మళ్ళలేదు. యమదండము దెబ్బ తినడానికి నీవు సిద్ధము అయినావు. నీతోపాటు నేనూను! నీకు దుర్బుద్ధి పుట్టింది. ఏమిచేయడానికి అయినా నావల్లను ఏమి అవుతుంది? నాయనా, రాక్షసుడా! నేను పోతాను. నీకు శుభము అవుతుంది" అన్నాడు మారీచుడు.

ఈ మాటలకు రావణాసురుడు సంతోషించినాడు. మారీచుణ్ణి గట్టిగా కౌగిలించుకొని, "ఓ మారీచుడా! ఈ మాట నీది. నేను కోరినట్టు పౌరుషముగా చెప్పినావు. ఇప్పుడు నీవు మారీచుడవు. ఇంతకు ముందు నీవు ఎవడవో రాక్షసుడవు.

"ఓ మారీచుడా! నీవూ నాతోపాటు ఈ పిశాచముఖాల కంచరగాడిదలు కట్టిన రత్నభూషిత రధము ఎక్కు. సీతను ప్రలోభపెట్టిన తరువాత, యధేష్టముగా నీ దారిన నీవు పో. నేను, ఎవరూ లేనప్పుడు సీతను ఎత్తుకొని పోతాను" అని చెప్పినాడు.

అంతట రావణ, మారీచులు ఉభయులూ విమానమువంటి ఆ రధము ఎక్కి ఆ మారీచాశ్రమమునుంచి అప్పటికి అప్పుడు ప్రయాణము అయినారు. పెద్దపెద్ద పట్టణాలను, చిన్నచిన్న పట్టణాలను, అడవులను, కొండలను, నదులను, ఆ యా రాజ్యాలను చూస్తూ పోయి దండకారణ్యము చేరినారు. రావణాసురుడు రామాశ్రమాన్ని చూచినాడు. అంతట బంగారు రథము దిగి మారీచుడి చెయ్యి పట్టుకొని, "ఓ చెలికాడా! చుట్టూరా అరటిచెట్లతో ఆదిగో, రామాశ్రమపదము. మనము వచ్చిన పని తొందరగా చేయవలెను" అని చెప్పినాడు.

అంతట మారీచుడు ఆ రామాశ్రమ వాటికలో తిరుగడానికి జింక అయిపోయినాడు.

అది మహదాశ్చర్యము అయిన మృగరూపము. దాని కొమ్ముల కొనలు ఇంద్రనీలమణులవలెనూ, దాని ముఖము తెలుపు నలుపుగానూ, దాని నోరు ఎఱ్ఱకమలమువలెనూ, నల్లకలువవలెనూ, దాని చెవులు నిగనిగలాడే నల్లకలువవలెనూ, దాని కంఠము కొంచెము ఎత్తుగానూ, దాని పెదవి ఇంద్రనీలముపలుకువలెనూ, దాని పొట్ట తెల్లటి మల్లెపూవువలెనూ, చంద్రబింబమువలెనూ, వజ్రమువలెనూ, దాని పక్కలు ఇప్పపూలవలెనూ, తక్కిన అవయవాలు పద్మకేసరాలవలెనూ, దాని గిట్టలు వైడూర్యమణులవలెనూ, దాని పిక్కలు సన్నగానూ కీలుకీలూ పొంకంగానూ, పైకి ఎత్తిన తోక ఇంద్రధనుస్సువలెనూ ధగధగలాడుతూ, తళతళలాడుతూ నానావిధ రత్నకాంతులతో నిగనిగలాడుతూ కనిపించింది.

క్షణలేశములో మారీచుడు ఆ పరమశోభనము అయిన జింకగా మారిపోయి, అందము అయిన ఆ అడవిలో రామాశ్రమపదము దగ్గరగా నానావిధవర్ణాలతో విచిత్రముగానూ, దర్శనీయముగానూ, మనోహరముగానూ కనపడుతూ సీతాదేవిని ప్రలోభపెట్టటానికి అటూ ఇటూ ఎగిరి గంతులు వేస్తూ, పచ్చికనేలలు అంతటా తిరుగుతూ చిత్రవిచిత్రము లయిన వన్నెలతో, వెండివంటి వందలకొద్దీ తెల్లటి చుక్కలతో చూచేవాండ్లకు సంతోషమువేసేటట్టు చెట్ల చిగురుటాకులు విరుచుకొని తింటూ, రామాశ్రమములో అరటిచెట్లతో ఇల్లుగా ఉన్నచోటికి పోయి, ఆ తరువాత కొండ గోగుచెట్ల దగ్గరకు పోయి సీతాదేవి తనను చూడడానికి వీలుగా ఇక్కడా, అక్కడా తిరగసాగినాడు.

ఆ మహామృగము, ఆ మృగోత్తరము కమలకేసరవర్ణమువంటి విచిత్రము అయిన వీపుతో రామాశ్రమ సమీపములో యథాసుఖముగా, శోభాయమానముగా తిరుగుతూ, అక్కడను అట్టేసేపు ఉండకుండా అవతలికి పరుగెత్తుతూ మళ్ళీ తిరిగివస్తూ, ఆటలాడుతూ, ఒకచోట భూమిమీద పడుకుంటూ లేచి ఆశ్రమ ద్వారము దగ్గరకు పరుగులు ఎత్తింది. జింకల గుంపులో చేరిపోయినట్లు కొంతదూరముపోయి తిరిగి వచ్చింది. విచిత్రముగా మండలాకారముగా తిరిగింది.

ఆ అడవిలో ఉన్న మృగాలు ఆ మారీచమృగాన్ని చూచి అబ్బుర పడిపోయి దగ్గరకు వచ్చినవి. వాసన చూచినవి. భయమువేసి దశదిశలా పరుగులు ఎత్తినవి. మారీచుడు మృగాలను చంపి తినేవాడు. అయినప్పటికిన్నీ, తన సంగతి బయటపడకుండా ఉండటానికోసము ఆ యా మృగాలు వచ్చి ముట్టుకొంటున్నా ఆ కాస్సేపూ చంపడము మానుకొన్నాడు.

ఆ సమయాన ఆ శుభలోచన సీతాదేవి పూలుకోసుకోవడానికి పూలచెట్ల దగ్గరకు వచ్చింది. ఆ మదిరాక్షి, ఆ రుచిరానన పూలుకోసుకొంటూ కొండగోగుచెట్లు,

అశోకచెట్లు, మామిడిచెట్లు ఉన్న చోటికి పోయింది. ముత్యాలవంటి చుక్కలతోను, రత్నాలవంటి చుక్కలతోను ఉన్న ఆ జింకను వనవాసము చేయ తగని ఆ పరమాంగన ఉత్ఫుల్ల నయనాలతో చూచింది. ఆశ్చర్యపోయింది. తెల్లటి పలువరుసతోను, ఎర్రటి పెదవులతోను ఉన్న నోరు తెరచింది. ఆ రంగురంగుల జింకను వాత్సల్యముతో చూచింది.

తనను సీతాదేవి చూస్తూ ఉంది అని తెలుసుకొని ఆ మాయజింక మరింత చిత్రంగా తళతళలాడుతూ తిరిగింది. అటువంటి నానారత్నమయము అయిన జింకను అదివరకు ఎన్నడూ చూడనందువల్ల, ఆ జనకాత్మజ ఎంతో విస్మయపడిపోయింది.

43

ఆ ఒప్పులకుప్ప, ఆ బంగారుబొమ్మ, ఆ సుశ్రోణి సీతాదేవి పూలు కోసుకొంటూ ఆ జింకను చూచింది. దాని రెండు పక్కలూ బంగారు రంగుతోను, వెండి రంగుతోను కనిపించినవి. ఆమె విస్మయ పడిపోయింది. పెనిమిటినీ, లక్ష్మణుణ్ణీ ఆయుధాలతో కూడా రమ్మని కేక వేసింది.

పెద్దపులులవంటి ఆ అన్నదమ్ములు రామలక్ష్మణులు ఆమె పిలుపు విన్నారు. వెంటనే ఆ ప్రదేశము అంతా కలయచూస్తూ పోయి ఆ జింకను చూచినారు. దాన్ని చూచీ చూడడముతో లక్ష్మణుడు శంకించి రాముడితో, "రాజా! ఇది, ఈ మృగము మారీచుడు అనిపిస్తున్నది. వాడు, ఆ రాక్షసుడు వాడిచిత్తము వచ్చిన రూపముతో తిరుగుతూ ఉంటాడు. సంతోషముగా వేటాడడానికి వచ్చే రాజులను వాడు ఈ పాపిష్టి వేషము వేసుకొని మోసముచేసి, చంపివేసి వాండ్ల మాంసము తింటూ ఉంటాడు. వాడు, ఆ మారీచుడు మాయావిదుడు.

"ఓ నరశార్దూలమా! మేఘాలలో ధగధగలాడుతూ కనిపించే గంధర్వనగరము ఎంత నిజము అయిందో, ఈ జింక అంత నిజము అయింది. ఇది మారీచుడి మాయ. వాడు ఈ జింకరూపము ధరించినాడు. ఓ రామా! నీవు జగతీనాథుడవు. నీకు తెలియంది ఏమీ లేదు. రత్నాల చుక్కలతో ఇటువంటి విచిత్రము అయిన జింక జగత్తులో ఎక్కడనూ ఉండదు. ఇది మాయజింక. సందేహము లేదు" అని చెప్పుతూ ఉంటే, సీతాదేవి ఆ జింకతోలు కోసము ముచ్చటపడ్డందువల్ల తెల్లని చిరునవ్వు నవ్వుతూ లక్ష్మణుణ్ణి మాట్లాడనీయకుండా, "ఆర్యపుత్రా! మనోహరము అయిన ఆ జింక చర్మముమీదికి నా మనస్సు పోయింది. దానిని మీరు నాకు తెచ్చి పెట్టవలెను. మనకు ఈ జింక వేడుకగా ఉంటుంది. మన ఆశ్రమపదములో మహాసాధువులు అయిన సృమరాలు, చమరాలు, మనోహరము లయిన జింకలు, చుక్కల జింకలు, చక్కని ఆకారాలతో కిన్నరమృగాలు, వానరాలు, ఎలుగుబంట్లు ఎన్నో ఉన్నవి. అయితే, అవి ఏవీ ఈ జింకవంటివి కావు.

"రాజా! ఇటువంటి దేహకాంతులతో, ఇటువంటి తేజస్సుతో ఇంత నెమ్మది అయిన జింకను ఇదివరకు ఎన్నడూ మనము చూడలేదు. మహావిచిత్రము అయిన దేహముతో, రత్నాలచుక్కలతో తళతళలాడుతూ ఆకాశములో చంద్రమండలమువలె, ఈ మహారణ్యములో ఈ జింక ఎంతో శోభాయమానముగా తేజరిల్లుతూ ఉంది. దీని దేహకాంతులు, దీని కంఠస్వరము, దీని అవయవ సంపత్తి అద్భుతముగా ఉన్నవి. విచిత్రము అయిన ఆకారము. ఆశ్చర్యము అయిన సౌందర్యము. ఈ జింక నా హృదయాన్ని కాజేసింది. దీనిని మీరు ప్రాణముతో పట్టుకొని వచ్చేట్లయితే మనకే కాదు, అందరికీ ఆశ్చర్యమువేసేటట్లు ఇది మనదగ్గర ఉంటుంది. వనవాసము ముగించుకొని మనము మళ్ళీ మన రాజ్యానికి వెళ్ళితే ఇది, ఈ జింక మన అంతఃపురానికి అలంకారముగా ఉంటుంది.

"ప్రభూ! దీని రూపము చూచి భరత శత్రుఘ్నులు, నా అత్తగార్లు, ఇంకా అందరూ తప్పకుండా ఆశ్చర్యపడిపోతారు. అప్పుడు ఈ జింక నాకూ, మీకూ కూడా ఆశ్యర్యము కలుగచేస్తుంది. ఓ నరశార్దూలమా! ఈ జింక ప్రాణాలతో తమకు పట్టుపడకపోయేటట్లయితే దీని అందము అయిన చర్మము అయినా నాకు మీరు తెచ్చి పెట్టవలెను. బంగారు మయము అయిన ఈ జింకతోలు దర్భాసనముమీద పరచి మిమ్ములను ఉపాసించవలెను అనుకొంటున్నాను.

"నాథా! తనకు కావలసింది చేసిపెట్టుమని ఇల్లాలు పెనిమిటిని ఇట్లా ఆజ్ఞాపించడము ఘోరమే. తప్పిదమే. ఏ స్త్రీ అయినా తన భర్తను ఇట్లా తొందర చేయడము సరిఅయిన పని కాదు. కాని, ఈ జింకతోలు నన్ను విస్మయ పెట్టింది, ఏమి చేసేది" అని చెప్పింది.

ఆ జింక కాంచనరూపానికి, ఇంద్రనీలమణులవంటి దాని కొమ్ములకు, బాలసూర్యుడివంటి దాని దేహకాంతికి, నక్షత్రపథములో నక్షత్రాలవంటి దాని ఒంటిమీద చుక్కలకు రాముడున్నూ అబ్బురపడిపోయాడు. అతడి మనస్సున్నూ ఆ జింకమీదికి పోయింది. అందుకుతోడు దాన్ని పట్టుకోవలసింది అని సీతాదేవి ప్రేరేపించింది. అద్భుతమయిన ఆ మృగాన్ని మళ్ళీ చూచినాడు. దాని రూపానికి ఆశపడ్డాడు.

అంతట రాముడు తమ్ముణ్ణి చూచి, "లక్ష్మణా! ఈ జింక కోసము సీత ఎంత ఆశపడుతున్నదో చూడు. ఇంత అందము అయిన జింక ఇప్పుడు, ఇక్కడ తప్పితే మరి ఎప్పుడూ, ఎక్కడా మనకు దొరకదు. దీనితో సమానము అయిన జింక నందనోద్యానవనములో ఉండదు. చైత్రరథవనములో ఉండదు. ఈ భూమిమీద ఇటువంటిది ఇకను ఎక్కడ ఉంటుంది? దీని రోమరాజము ప్రతిలోమముగాను,

అనులోమముగాను ఎంతో మనోహరముగా ఉంది. అదిగో, అది ఆవలించింది. దాని నాలుక మండుతున్న మంటలు నోటిలోనుంచి వెళ్ళుకొని వచ్చినట్లు కనపడుతున్నది. ఇప్పుడు చూడు, ఆ నాలుక మేఘాలలో మెరుపువలె తళతళలాడుతూ ఉంది. దాని ముట్టె ఇంద్రనీల మణులతో చేసిన గిన్నెమాదిరిగా ఉంది. దానిపొట్ట శంఖమువలెను, ముత్యాలవలెను తెల్లగా ఉంది. దాని ధగధగలు, తళతళలు చూస్తూ ఉంటే, దాని రూపము ఇటువంటిది అని నిరూపించడానికి వీలుకాకుండా ఉంది. దాని కోసము ఎవడు ఆశపడకుండా వుండ కలడు? నానారత్నమయముగాను, బంగారుమయముగాను ఉన్న దాని దివ్యరూపము చూస్తూ ఉంటే ఎవడు మనస్సులో ఆశ్చర్యపడకుండా ఉండగలడు?

"లక్ష్మణా! రాజులు ధనుర్విద్యావినోదము కోసము, మాంసము కోసము మహారణ్యాలలో జింకలను వేటాడి చంపివేస్తూ ఉంటారు. వేటాడడము కోసము చేసే ప్రయత్నాలవల్లనే రాజులు మహారణ్యాలలో రత్నాలు, మాణిక్యాలు, బంగారము మొదలు అయిన వివిధధాతువులను సంపాదించుకొంటూ ఉంటారు. తమ్ముడా! సంకల్ప మాత్రము వలననే శుక్రుడికి సమస్తసంపదలు సమకూడేటట్టు, రాజులకు మహారణ్యాలవల్లనే సమస్తధనసారము సమకూడి బొక్కసము వృద్ధి అవుతూ ఉంటుంది.

"లక్ష్మణా! అర్థి (తనకు ఇది కావలెను అనుకొనేవాడు) ఏ ఇతర ఆలోచనా లేకుండా తనకు కావలసినదాని కోసమే పనిచేసి సంపాదించుకొంటూ ఉంటాడు. అందువల్లనే, (అట్లా సంపాదించుకొన్న) దానినే అర్థము అని నీతిశాస్త్రజ్ఞులూ, అర్థ సంపాదన సమర్థులూ అన్నారు. నేను ఈ మృగరత్నాన్ని వదిలి పెట్టను. నాణ్యము అయిన దీని బంగారు చర్మముమీద నేను ఈ సన్నటి నడుముగల సీతతో కూర్చోవలెను. దీని చర్మముకన్నా నల్లచారలఇఱ్ఱిచర్మముకానీ, బొట్లఇఱ్ఱిచర్మముకానీ, గొఱ్ఱెకంబళికానీ, మేక కంబళికానీ మెత్తగా ఉండదు. అటు ఆకాశములో మృగశీర్ష తారామృగముగాను, ఇటు మహారణ్యములో ఈ జింక మహామృగముగాను అమితకాంతులతో తేజరిల్లుతూ ఉన్నది.

"లక్ష్మణా! నీవు ఈ జింక మారీచుడి మాయ అంటున్నావు. అట్లా అయినట్లయితే, ఈ జింకను చంపివేయడమే నా కర్తవ్యము. మారీచుడు దుష్టుడు. ఘాతుకుడు. ఈ మహారణ్యములో వాడు అనేకమంది మునిపుంగవులను చంపి వేసినాడు. మునిపుంగవులనే కాదు, మహాధనుర్ధరులు అయిన రాజులు అనేకమంది వేటాడడానికి ఈ అడవికి వస్తూ ఉంటే వారిని, ఆ వచ్చిన రాజులను అనేకమందిని వంచనచేసి చంపివేసినాడు.

"తమ్ముడా! మారీచుడు వాతాపివంటి రాక్షసుడు. వాడు, ఆ వాతాపి అనే రాక్షసుడు తాపసులనూ, బ్రాహ్మణోత్తములనూ మోసపుచ్చి వారి కడుపులో దూరి అశ్వతరివలెనూ, తేలువలెనూ వారి పొట్టలు చీల్చుకొని బయటికి వచ్చేవాడు. అట్లా పొట్టలు చీలి చచ్చిపోయిన బ్రాహ్మణుల మాంసము తింటూ ఉండేవాడు. అట్లా చాలాకాలము జరిగింది. అంతట కొంతకాలానికి వాడు, ఆ వాతాపి మహాతేజోవంతుడు అయిన అగస్త్యమహర్షికి ఆహారము అయిపోయినాడు.

"లక్ష్మణా! నీకు నేను ఇదివరకు వాతాపిని గురించి చెప్పినాను. వాడు ఆ అగస్త్యమహర్షి పొట్టలోనుంచి బయటికి రావడానికి ప్రయత్నము చేస్తూ ఉంటే, ఆ మహాత్ముడు ఒక నవ్వు నవ్వి, 'ఓ వాతాపీ! నీవు ఈ లోకములో బ్రాహ్మణులను అనేకమందిని నీ పొట్టను పెట్టుకొన్నావు. ఇప్పుడు నేను నిన్ను నా పొట్టను పెట్టుకొన్నాను' అని చెప్పినాడు. అంతటితో ఆ వాతాపి బాధ ఈ లోకానికి వదలిపోయింది.

"ఓ లక్ష్మణా! నేను ధర్మనిత్యుణ్ణి. జితేంద్రియుణ్ణి. నన్ను అతిక్రమించేవాడు ఎవడూ బ్రతకడు. అగస్త్యుడు వాతాపినివలె, నేను మారీచుణ్ణి చంపివేస్తాను. తమ్ముడా! నీవు ధనుఃకవచాదులతో సన్నద్ధుడవై ఈ మైథిలిని జాగ్రత్తగా కనిపెట్టుకొని ఇక్కడనే ఉండు. ఇకను మనము చేయవలసిన పని అంతా ఈమె, ఈ సీత కోసమే.

"లక్ష్మణా! నేను ఆ మృగాన్ని చంపివేస్తాను లేదా ప్రాణాలతో పట్టుకొని వస్తాను. నేను వెళ్ళిపోతున్నాను. వెంటనే వస్తాను. ఈ వైదేహికి ఆ జింకతోలుమీద మనస్సు అయింది. అందువల్ల, దాని చర్మమే ప్రధానము. ఇకను ఆ జింక ఉండదు. ఒక్క బాణముతో కొట్టివేస్తాను. నేను జింక చర్మము తెచ్చేవరకు నీవు ఏ మాత్రము ఏమరకుండా ఆశ్రమములోనే ఉండు. నేను వేగిరముగా వస్తాను.

"తమ్ముడా! మహాసమర్థుడూ, అమితబలవంతుడూ, బుద్ధిమంతుడూ అయిన జటాయువును తోడుచేసుకో. అనుక్షణమూ అన్నిటినీ, అన్నివైపులా ఆశంకిస్తూ ఈ మైథిలిని కనిపెట్టుకొని ఉండు" అని చెప్పినాడు.

44

తమ్ముణ్ణి అట్లా ఆజ్ఞాపించి ఆ మహాతేజోవంతుడు రాముడు బంగారుపిడి వేసిన ఖడ్గాన్ని, రెండు అమ్ముల పొదులను, వీరచిహ్నము అయిన ముప్వంకల వింటిని తీసుకొన్నాడు. అంతట ఆ ఉదగ్రపరాక్రముడు బయలుదేరినాడు.

అట్లా పయిన పడవస్తూ ఉన్న ఆ రాజేంద్రుణ్ణి రాముణ్ణి మారీచుడు చూచినాడు. భయపడిపోయినాడు. మోసము చేయవలెను అనుకొన్నాడు. కనపడకుండా పోయినాడు. చటుక్కున దూరాన కనిపించినాడు. ఎదురుగుండా దూరాన తేజరిల్లుతూ ఉన్న ఆ

జింకను రాముడు చూచినాడు. ఖడ్గాన్ని మొలలో దోపుకొని విల్లు ఎక్కుపెట్టి ఆ జింక దగ్గరకు పరుగెత్తినాడు. అట్లా పరుగెత్తుకొని వస్తూ ఉన్న రాముణ్ణి ఆ జింక వెనకకు తిరిగి తిరిగి చూస్తూ, బాణము మీదపడుతుంది ఏమోను అని ఆశంకిస్తూ కలవరపడిపోయి, ఆకాశానికి ఎగురుతున్నట్టుగా దాట్లువేసుకొంటూ శరత్కాలములో అప్పుడు అప్పుడు మబ్బుతునకల మాటున కనిపించే చంద్రబింబమువలె ఆ మహారణ్యములో చెట్ల గుంపులలో అప్పుడు అప్పుడు కనపడుతూ, మరుగుపడుతూ పరుగెత్తింది. చేతితో పట్టుకోడానికి వీలు అయ్యేటట్లు దగ్గరలో కనిపించింది. క్షణలేశములో పోయి అంతదూరాన కనిపించింది.

మృగరూపము ధరించిన మారీచుడు అట్లా కాసేపు కనపడుతూను, కాసేపు కనపడకుండాను రాముణ్ణి రామాశ్రమమునుంచి ఆ అడవిలో చాలాదూరము లాగుకొనిపోయినాడు.

ఆ జింక అట్లా తనను మరిపిస్తున్నందుకు రాముడు క్రుద్ధుడు అయిపోయినాడు. అయితే, దాన్ని చూస్తూ దాని సౌందర్యానికి పరవశుడు అయిపోయినాడు. మృగరూపములో ఉన్న మారీచుడు అట్లా రాముడికి వెర్రిఎత్తేటట్టు చేసినాడు. అంతట రాముడు సంభ్రాంతచిత్తుడయి అట్లా పచ్చికపట్టున ఒక చెట్టునీడను నిలుచున్నాడు. అంతలో ఆ జింక దగ్గరగా వన్యమృగాలలో కనిపించింది. రాముడు దాన్ని పట్టుకోపోయినాడు. పట్టుకోవడానికి వస్తూ ఉన్న రాముణ్ణి అది చూచింది. భయపడ్డది. మళ్ళీ కనపడకుండా పోయింది. ఉత్తరక్షణాన మళ్ళీ ఆ మృగము చెట్లచాటునుంచి రావడము ఆ మహాతేజోవంతుడు చూచినాడు. దానిని చంపివేయడానికి కృతనిశ్చయుడు అయినాడు.

ఆ మహాబలవంతుడు, ఆ శత్రుమర్దనుడు రాముడు పరమకుపితుడు అయి సూర్యకిరణాలవలె తళతళలాడుతూ ఉన్న సుదృఢము అయిన బాణాన్ని ధనుస్సులో సంధించి, బలముకొద్దీ లాగి ఆ జింకను గురిచేసి వదలినాడు. బ్రహ్మనిర్మితము అయిన ఆ మహాస్త్రము బుసలుకొట్టుతూ ఉన్న పామువలె దూసుకుపోయి, మంటలు మండుతూ పిడుగువలె ఆ జింకమీద పడ్డది.

ఆ శరము ఆ మారీచుడి మృగరూపాన్ని ఛేదించింది. వాడి హృదయాన్ని ఛేదించింది. వాడు తాటిచెట్టు అంత ఎత్తున ఎగిరి భయంకరముగా అరుస్తూ కొన ఊపిరితో నేలమీద కూలపడ్డాడు. వాడి కృత్రిమ రూపము పోయింది. రావణాసురుడు చెప్పింది అప్పుడు వాడికి జ్ఞాపకము వచ్చింది.

ఆశ్రమమునుంచి లక్ష్మణుణ్ణి పంపించివేసి సీతాదేవి ఒంటరిగ ఉండడానికి రావణాసురుడు ఆమెను ఎత్తుకుపోవడానికి అదే అదను అని గుర్తించినాడు.

తక్షణము రాముడి కంఠస్వరముతో, 'అయ్యో! సీతా! లక్ష్మణా!' అని అరచినాడు. అనుపమానము అయిన రామబాణము ఆయువుపట్టులో పడ్డందువల్ల మృగరూపము పోయి రాక్షసరూపముతో ఆ మహాకాయుడు చచ్చిపోయినాడు.

రంగురంగుల బాహుపురులతో, సర్వాభరణాలతో, బంగారు కంఠమాలలతో, పెద్దపెద్ద కోరలతో శరాహతుడు అయినందువల్ల, ఒండ్లు అంతా నెత్తురుతో తడిసిపోయి ఘోరముగా కనపడుతూ, నేలమీద నెత్తురులో పొరలాడుతూ ఉన్న ఆ రాక్షసుణ్ణి రాముడు చూచినాడు. లక్ష్మణుడు చెప్పిన మాటలు జ్ఞాపకము వచ్చినవి. ఆ మహానుభావుడి మనస్సు సీతమీదికి పోయింది.

"ఇది మారీచుడి మాయ అని లక్ష్మణుడు చెప్పినాడు. అట్లాగే అయింది. నాచేత చచ్చినవాడు మారీచుడే, మాయావి. 'అయ్యో! సీతా! లక్ష్మణా!' అని అరుస్తూ చచ్చినాడు. ఇది విని సీతాదేవి ఎట్లా ఉందో? ఆ మహాబాహువు లక్ష్మణుడు ఏమి అవస్థ పడుతున్నాడో" అని ఆ ధర్మాత్ముడు ఆలోచించసాగినాడు. ఒళ్లు గగురుపొడిచింది. రోమాలు నిక్కపొడుచుకొన్నవి. మారీచుణ్ణి అయితే చంపివేసినాడు కాని, వాడి అరుపును గురించి ఆలోచించడమువల్ల తీవ్రముగా దిగులుపడ్డాడు. ఆ దిగులువల్ల భయము వేసింది.

అప్పుడు రాముడు మరి ఒక మృగాన్ని చంపి, దాని మాంసము తీసుకొని జనస్థానాభిముఖుడు అయి త్వరత్వరగా నడచినాడు.

45

సీత లక్ష్మణుని తూలనాడుట

ఆ అడవిలోనుంచి వచ్చిన ఆ ఆర్తనాదము సీతాదేవి విన్నది. అది తన పెనిమిటి కంఠస్వరమేను అనుకొన్నది. లక్ష్మణుణ్ణి చూచి, "పో, నీవు పో, పరుగెత్తు. పోయి మీ అన్నగారిని చూడు. పరమార్తుడు అయి పెద్దగా అరిచినట్టు నాకు వినిపించింది. నీకు అట్లా వినిపించలేదా? ఇప్పుడు నా మనసు మనస్సులో లేదు. నా ప్రాణము నిలిచేటట్టుగా లేదు. అడవిలో ఆక్రందనము చేస్తూ ఉన్న అన్నగారిని నీవు పోయి కాపాడు. రాక్షసులకు చిక్కి ఆపన్నుడు అయినాడు. సింహాలకు చిక్కిన ఆబోతువలె శరణు కోరుతున్నాడు. నీవు పో, మీ అన్నగారి దగ్గరకు పరుగెత్తు" అంటూ సీతాదేవి తొందర చేయసాగింది.

ఆమె అట్లా తొందరచేస్తూ ఉన్నా లక్ష్మణుడు అన్నగారి శాసనమే గుర్తు ఉంచుకొన్నందువల్ల అక్కడనుంచి కదలలేదు. అతడు కదలకుండా, మెదలకుండా ఊరక ఉన్నందువల్ల జనకాత్మజ కుపిత అయింది. లక్ష్మణుణ్ణి చూచి, "ఓ సౌమిత్రీ!

నీవు ఈ దురవస్థలో మీ అన్నగారిని కాపాడడానికి పోకుండా ఇక్కడనే ఇంకా ఉన్నావు. నిన్ను చూస్తూ ఉంటే నీవు ఆయనకు మిత్రరూపములో ఉన్న శత్రువు ఏమోను అనిపిస్తున్నది.

"ఓ లక్ష్మణా! నీవు నా కోసము ఆయన నాశనము అయిపోవలెను అనుకొంటున్నావు. నిస్సంశయముగా నీవు నా కోసము ఆశపడే ఆయన దగ్గరకు పోకుండా ఉన్నావు. మీ అన్నగారికి దుఃఖము వస్తే, నీకు సంతోషముగా ఉన్నట్టు నేను తలుస్తున్నాను. మీ అన్నగారిమీద నీకు స్నేహము లేదు. అందువల్లనే, ఆ ద్యుతిమంతుణ్ణి ఇప్పుడు పోయి చూడకుండా ఇక్కడ నిశ్చింతగా ఉన్నావు. నీకు మీ అన్నగారు ప్రధానము. ఆయన కోసమే నీవు ఇక్కడకి వచ్చినావు. ఇప్పుడు ఆయనకు ప్రాణ సంశయావస్థ వస్తే, నీవు ఇక్కడనుంచి కదలకుండా ఉన్నావు. నాతో నీకు ఇక్కడ ఏమి పని ఉంది" అని ఏడుస్తూ, కన్నీళ్ళతో తడిసిపోతూ భయపడిపోయిన ఆడుజింకవలె గజగజలాడింది.

"ఓ వైదేహీ! నీ పెనిమిటిని పన్నగులుకాని, అసురులుకాని, దేవతలుకాని గంధర్వులుకాని, మానవులుకాని, రాక్షసులుకాని జయించడము అశక్యము. నామాట సంశయించవద్దు. ఓ సీతాదేవీ! నీవు మంగళస్వరూపిణివి. నీ పెనిమిటి రాముడు యుద్ధములో దేవేంద్రుడితో సరిసమానము అయినవాడు. మా అన్న రాముడితో పోరాడకలవాడు ఈ జగత్తులో ఎవడూ లేడు. యుద్ధములో మా అన్నను ఎవడూ చంపలేడు. వాణ్ణి గురించి నీవు అట్లా అనవద్దు. రాముడు లేకుండా ఉన్నప్పుడు, ఈ అడవిలో నిన్ను ఒంటరిగా వదలిపెట్టి పోవడము నాకు ఇష్టము లేదు.

"ముల్లోకాలలోనూ బలవంతులలో బలవంతులు అయిన వాండ్లతో సమకూర్చిన సైనిక బలమంతా దేవేంద్రుడితోనూ, దేవతలతోనూ వచ్చినా రాముడి బలము అనివార్యము. నీ మనస్సు స్థిమితముగా ఉంచుకో! నీవు సంతాప పడవద్దు. నీ పెనిమిటి ఆ మృగోత్తమాన్ని చంపి తెస్తాడు. మనకు వినిపించింది రాముడి కంఠస్వరము కాదు. ఎవడో మాయగొంతుతో అట్లా అరచినాడు. అది ఆ మారీచుడి మాయే అయి ఉంటుంది. మేఘాలలో కనిపించేది గంధర్వనగరము అనుకొన్నట్టు, అది రాముడి కంఠధ్వని అని నీవు అనుకొంటున్నావు. అది ఎంత నిజమో, ఇదీ అంతే నిజము.

'వైదేహీ! ఆ మహాత్ముడు రాముడు నాతో 'ఈ వరారోహను నీ దగ్గర న్యాసముగా ఉంచుతున్నాను' అని చెప్పి, నిన్ను నాదగ్గర దాచిపెట్టినాడు. దాచి ఉంచిన సొత్తును దాచిపెట్టినవాడికి నేను అప్పగించవలెను. అందువల్లనే, నేను నిన్ను

వదలిపెట్టి పోను. ఓ వైదేహీ! ఖరుడి చావువల్లను, జనస్థానములో రాక్షసులను అందరినీ వధించడమువల్లను మనము రాక్షసులకు పగవాండ్లము అయినాము. రాక్షసులు హింసావిహారులు. అందువల్ల, వాండ్లు ఈ మహారణ్యములో మనలను వ్యామోహపెట్టడానికి నానావిధస్వరాలతో, నానావిధ ఆర్తనాదాలు చేస్తూ ఉంటారు. వాటిని గురించి మనము ఆలోచించ నవసరము లేదు" అని లక్ష్మణుడు చెప్పినాడు.

లక్ష్మణుడు ఈవిధముగా చెప్తుతూ ఉంటే, సీతాదేవి క్రుద్ధురాలు అయింది. కన్నులు ఎర్రచేసింది. నిజము ఆడుతున్న లక్ష్మణుణ్ణి చూచి అతిపరుషముగా, "నీవు చేయకూడనిపని చేయ నారంభించినావు. నీవు కులపాంసనుడవు. ఘాతుకుడవు. నా ప్రభువు మహాకష్టములో ఉంటే, నీవు సంతోషపడుతున్నావు. నాకు అట్లా కనిపిస్తున్నావు. ఆ మహానుభావుడు ఆపదలో ఉండడము చూచి నీవు ఇట్లా మాట్లాడు తున్నావు. ప్రచ్ఛన్న శత్రువులు అయిన నీబోటి క్రూరులకు ఇటువంటి పాపబుద్ధులు పుట్టడంలో ఆశ్చర్యము ఏమీ లేదు. నీవు దుష్టుడవు. భరతుడు పంపించటమువల్లనో, నీ అంతట నీవో నా నిమిత్తము, నీవు ఇక్కడ ఒక్కడు అయిన మీ అన్న వెంటపడి అడవికి వచ్చినావు. ఓ సౌమిత్రీ! నీకుకాని, భరతుడికికాని అది సిద్ధించదు.

"ఆ ఇందీవరశ్యాముడు, ఆ పద్మపత్రాయతాక్షుడు రాముడు నా భర్త. నేను అన్యుణ్ణి ఎట్లా కామిస్తాను? ఓ సౌమిత్రీ! నేను నీ సమక్షములోనే నా ప్రాణము వదలుతాను. సందేహము లేదు. రాముడు కాకుండా మరి ఒకడితో నేను ఒక్కక్షణము అయినా ఈ భూమిమీద బ్రతకను" అన్నది సీతాదేవి.

సీతాదేవి ఇంత పరుషముగా మాట్లడుతూ ఉంటే ఆ విజితేంద్రియుడు లక్ష్మణుడికి ఒండ్లు గగురు పొడిచింది. సీతాదేవిని చూస్తూ చేతులు జోడించి, "ఓ మైథిలీ! నీ మాటలకు బదులు చెప్పడము నాకు ఇష్టము లేదు. నీవు నాకు దేవతవు. ఓ వైదేహీ! స్త్రీలు అనుచితము అయిన మాటలు అనడములో విచిత్రము ఏమీ లేదు. అది స్త్రీ స్వభావము. స్త్రీ స్వభావము అన్నిలోకాలలోనూ అట్లాగే కనపడుతున్నది. స్త్రీలు ధర్మము వదలిపెట్టుతారు. వారు చంచలచిత్తలు. క్రూరహృదయులు. విరోధము పెట్టుతారు.

"ఓ జనకాత్మజా! ఓ వైదేహీ! నీవు ఇప్పుడు అన్న మాటలు, ఎర్రగా కాల్చిన ఇనుపబాణాలు నా చెవులలో గుచ్చినట్లుగా ఉంది. ఇటువంటి మాటలు నేను సహించలేను. న్యాయము మాట్లాడే నాతో నీవు అన్యాయము, కఠినము అయిన మాటలు అన్నావు. నీవు అన్న మాటలు అన్నీ, ఇక్కడి వనచరదేవతలు అందరూ విన్నారు. ఆ దేవతలే నాకు సాక్షులు. నేను మా అన్నగారి ఆజ్ఞను మీరలేదు. అందుకు నీవు నన్ను ఇట్లా సందేహిస్తున్నావు. స్త్రీత్వమే స్వాభావికముగా దుష్టము

అయింది. ఛీ! అది నశింపవలెను. నేను ఇప్పుడు రాముడి దగ్గరకు పోతున్నాను. నీకు స్వస్తి. ఓ విశాలాక్షీ! ఇకను ఈ వనదేవతలు అందరూ నిన్ను కాపాడవలెను. ఓ జనకాత్మజా! ఈ ఘోరశకునాలనుంచి నేను మళ్ళీ రాముడితో కూడా వచ్చి నిన్ను చూడకలనో, చూడలేనో నాకు తెలియదు" అన్నాడు.

లక్ష్మణుడు ఇట్లా చెప్పిన మాటలు విని సీతాదేవి కన్నీళ్ళు కార్చుస్తూ ఏడుస్తూ తీవ్రముగా, "రాముడు రాకపోయేటట్లయితే నేను గోదావరిలో పడిపోతాను లేదా ఉరి పెట్టుకుంటాను. అట్లాకాకపోయేటట్లయితే ఎత్తు అయిన ప్రదేశమునుంచి క్రిందపడి చచ్చిపోతాను. తీక్ష్ణము అయిన విషము అయినా త్రాగుతాను. అగ్నిహోత్రములో అయినా పడిపోతాను. నేను రాముణ్ణి తప్ప మరి ఒకణ్ణి కాలితో అయినా తాకను" అంటూ లక్ష్మణుణ్ణి నిందించి, దుఃఖాతిశయముతో రెండు చేతులా పొట్ట కొట్టుకుంటూ ఏడువసాగింది.

అట్లా ఏడుస్తూ ఉన్న ఆ విశాలనేత్రను, ఆ ఆర్తరూపను సీతాదేవిని లక్ష్మణుడు చూచినాడు. అతని మనస్సు కదలిపోయింది. ఆమెను ఓదార్చబోయినాడు. ఆ మరదితో ఆమె ఒక్కమాట అయినా మాట్లాడలేదు. అంతట ఆ ధైర్యవంతుడు ఆమెకు నమస్కారము అని చెప్పి, చేతులు జోడించి తలవంచి నమస్కారము చేసి, ఆమెవంక చూస్తూ చూస్తూ రాముడి దగ్గరకు బయలుదేరినాడు.

46

రావణుడు సీత వద్దకు వచ్చుట

సీతాదేవి అట్లా అంత పరుషముగా మాట్లాడినందుకు లక్ష్మణుడు కుపితుడు అయిపోయి, తనకు ఎంతమాత్రమూ ఇష్టము లేకపోయినప్పటికిన్నీ రాముడి కోసము బయలుదేరినాడు.

అంతవరకూ కనిపెట్టుకొని ఉన్న దశగ్రీవుడికి అప్పుడు అవకాశం దొరికింది. వెంటనే సన్నటి కాషాయవస్త్రము కప్పుకొన్నాడు. తల వెంట్రుకలు జటలుగా మార్చివేసినాడు. దండానికి కమండలము తగిలించి, ఎడమ భుజముమీద పెట్టుకొన్నాడు. కాళ్లకు పావకోళ్ళు తొడుగుకొన్నాడు. గొడుగు తీసుకొని అట్లా పరివ్రాజక వేషముతో సీతాదేవి దగ్గరకు బయలుదేరినాడు.

సూర్యాస్తమయము అయి చంద్రోదయము అయ్యేలోపల, సంధ్యాకాలములో కటికచీకటివలె రామలక్ష్మణులు ఇద్దరూ లేని ఆ సమయంలో, ఆ అడవిలో ఆ అతిబలవంతుడు సీతాదేవి దగ్గరకు పోయినాడు. చంద్రుడు వదలిపెట్టిపోయిన రోహిణిని దారుణము అయిన (అంగారక) గ్రహమువలె అమాయకురాలిని, ఆ యశస్వినిని రామపత్నిని అప్పుడు ఆ రావణాసురుడు చూచినాడు.

ఆ క్రూరకర్ముణ్ణి, ఆ ఉగ్రతేజుణ్ణి చూచి అప్పుడు ఆ జనస్థానములో ఉన్న మహోన్నతవృక్షాలు అన్నీ గజగజ వణకిపోయినవి. గాలి వీచడము ఆగిపోయింది. ఉరవడితో పరుగులు ఎత్తే గోదావరీనది ఆ రక్తలోచనుడు చూస్తూన్నందువల్ల భయపడి స్థిమితముగా నడవడము మొదలుపెట్టింది.

రాముడు లేకుండా ఉండే సమయము కోసము కనిపెట్టుకుని ఉన్న ఆ దుర్జనుడు దశగ్రీవుడు సుజనవేషముతో సన్యాసిరూపాన, శనైశ్చరుడు చిత్రానక్షత్రాన్ని వలె వైదేహిని సమీపించినాడు. పచ్చిగడ్డి కమ్ముకొని పయికి కనపడకుండా ఉన్న పాడుపడ్డ బావివలె, పుణ్యవేషము వేసుకొన్న ఆ పాపాత్ముడు రావణాసురుడు ఆ వైదేహిని, రాముడి భార్యను చూస్తూ నిలుచున్నాడు.

ఆ పర్ణశాలలో పున్నమిచంద్రుడివంటి ముఖముతో, తామరరేకులవంటి కన్నులతో, మల్లెమొగ్గలవంటి పలువరుసతో, దొండపండువంటి పెదవులతో, పసుపు పట్టుచీరతో ఉన్న ఆ మంగళస్వరూపిణి సీతాదేవి పెనిమిటిని గురించి దిగులుతో బాధపడుతూ, కన్నీళ్ళు కారుస్తూ ఉండగా ఆ దుష్టాత్ముడు, బ్రాహ్మణ సన్యాసి వేషములో ఉన్న ఆ రాక్షసరాజు రావణాసురుడు ఆమెను సమీపించినాడు. మన్మథ పరవశుడు అయినాడు. తన వేషానికి అనుగుణముగా వేదపఠనము చేయడము మొదలుపెట్టినాడు.

ఈ లోకములో స్త్రీలకు అందరికీ మేలుబంతి అయిన ఆ సీమంతినిని, పద్మాసనము వదలి పెట్టిన లక్ష్మీదేవివలె దేహకాంతులతో తేజరిల్లుతూ ఉన్న ఆ సీతాదేవిని పొగడ తలచుకొని వినయము ఉట్టి పడుతూ, "నీవు ఎవరవు? బంగారము వంటి దేహచ్ఛాయతో, పసుపుపట్టుచీరతో, పద్మమువంటి ముఖముతో, పద్మపత్రాల వంటి నేత్రాలతో, పద్మలతవలె ఉన్న నీవు ఎవరవు?

"నీ శుభాననము చూస్తూ ఉంటే నీవు పార్వతీదేవివో, కీర్త్యధిష్ఠానదేవతవో, కాంత్యధిష్ఠానదేవతవో, ఐశ్వర్యాధిష్ఠానదేవతవో, మంగళకరి అయిన లక్ష్మీదేవివో తెలియడంలేదు. నీవు అప్సరసవా? నీ పెద్ద పెద్ద పిరుదులు చూస్తూ ఉంటే, నీవు స్వైరచారిణి అయిన రతీదేవివి ఏమోను అనిపిస్తున్నావు. నీ పలువరుస కొనలు తేలి తెల్లగా తళతళలాడుతూ ఉంది. నీ విశాలనేత్రాలు నల్లటి కనుపాపలతో, ఎర్రటి కనుకొలుకులతో మహానిర్మలముగా ఉన్నవి. నీ జఘనము ఎంతో విశాలముగా ఉంది. నీ తొడలు ఏనుగుతొండాలవలె ఉన్నవి. నీ స్తనాలు బలిసి ఎత్తుగాను, గుండ్రముగాను ఒకదానితో ఒకటి ఒరుసుకొనిపోతూను, కొంచెం కదులుతూను కొనలుతేలి తాటిపండ్లవలె మనోహరముగాను, వాటిమీద వేళ్ళాడుతున్న మణిమయహారాలతో అందముగాను ఉన్నవి.

"ఓ విలాసినీ! నీ అందము అయిన చిరునవ్వు, నీ పిడికెడు నడుము, తుమ్మెద రెక్కలవంటి నల్లటి నీ జుట్టు నదీప్రవాహము గట్లనువలె నా మనస్సును పడలాగుతున్నవి. నీ రూపమువంటి రూపాన్ని నేను ఇదివరకు ఈ మహీతలములో ఎక్కడనూ చూడలేదు. గంధర్వాంగనలలో చూడలేదు. యక్షకన్యలలో చూడలేదు. కిన్నర యువతులలో చూడలేదు. జగత్తుకు అంతటికీ అగ్రగణ్యము అయిన నీ రూపము, నీ సౌకుమార్యము, నీ వయస్సు, నీవు ఈ మహారణ్యములో ఉండడము నన్ను పిచ్చి ఎత్తిస్తున్నవి.

"ఓ భామినీ! నీవు ఘోరారణ్యములో ఉండవలసిన దానవు కావు. నీవు ఉండవలసిన చోటికి నీవు పోవలెను. భయంకరులు, అందులో చిత్తము వచ్చిన రూపము ధరించే రాక్షసులకు ఇది ఉనికిపట్టు. నీవు ఇక్కడ ఉండకూడదు. సర్వ సమృద్ధముగాను, సుగంధవాసనలు గుబాళిస్తూను ఉండే రమ్యము అయిన ప్రాసాదాగ్ర భాగాలలో నీవు నివసించవలెను. మహానగర సమీప ఉద్యానవనాలలో నీవు విహరిస్తూ ఉండవలెను.

"ఓ శోభనా! ఓ అసితేక్షణా! నీవు పెట్టుకొన్నందువల్లనే, ఆ పూలదండలు అంత శ్రేష్ఠముగా ఉన్నవి. నీవు కట్టుకొన్నందువల్లనే, ఆ చీర అంత అందముగా ఉంది. నీవు పూసుకొన్నందువల్లనే, ఆ గంధము అంత ఘుమఘుమలాడుతూ ఉంది. అదే విధముగా నీకు భర్త అయ్యేవాడే ఈ లోకములో రాణిస్తాడు.

"ఓ వరాననా! నీవు ఏకాదశరుద్రులకు సంబంధించినదానవా? సప్తమరుత్తులకు సంబంధించిన దానవా? అష్టవసువులకు సంబంధించిన దానవా? ఓ వరారోహా! నీవు ఎవరవు? నా కన్నులకు దేవకన్యగా భాసిస్తున్నావు. ఇక్కడికి గంధర్వులు రారు. దేవతలు రారు. కిన్నరులు రారు. మానవుల సంగతి చెప్పనే అక్కరలేదు. ఇది రాక్షసుల నివాస స్థానము. నీవు ఇక్కడికి ఎట్లా వచ్చినావు? ఈ అడవిలో కోతులు, కొండముచ్చులు, ఎలుగుబంట్లు, చిరతపులులు, పెద్దపులులు, సింహాలు, రాబందులు మొదలు అయిన మహాభయంకరము అయిన పక్షులు తిరుగుతూ ఉంటవే! వాటి భయము నీకు లేదా? మదము ఎక్కి అమితబలముతో అతిభయంకరముగా ఘీంకారాలు చేస్తూ విచ్చలవిడిగా తిరిగే ఏనుగులకు అయినా భయపడకుండా నీవు ఒక్కతెవు ఇక్కడ ఎట్లా ఉంటున్నావు?

"ఓ కల్యాణీ! నీవు ఎవరవు? ఎవరి దానవు? ఎక్కడ నుంచి ఇక్కడికి వచ్చినావు? ఎందుకోసము వచ్చినావు? ఇది రాక్షసులు సంచారముచేసే భయంకరము అయిన దండకారణ్యము. ఇక్కడ నీవు ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు" అంటూ ఆ దురాత్ముడు రావణుడు ఆమెను పొగడుతూ అడిగినాడు.

బ్రాహ్మణ సన్యాసి వేషముతో, దండకమండలాలతో, కాషాయాంబరాలతో వచ్చినందువల్ల వాడు, ఆ రావణాసురుడు అలా అడుగుతూ ఉన్నప్పటికీ ఉపేక్షించడానికి వీలుకాక ఆ మైథిలి సమస్త అతిథి సత్కారాలు చేసి, వాణ్ణి పూజించడానికి సిద్ధము అయింది. పీట వేసింది. పాద్యము ఇచ్చింది. భోజనము సిద్ధముగా ఉంది అని చెప్పింది.

సౌమ్యదర్శనుడుగా కనపడుతున్న ఆ సన్యాసి అపాయదర్శనుడు అని ఆ మైథిలికి తెలియదు. అందువల్లనే, వాణ్ణి బ్రాహ్మణ్ణివలె ఆదరించి, "ఓ బ్రాహ్మణుడా! ఈ పాద్యజలము తీసుకోవలసింది. ఇదిగో బృసి (పీట), యథేష్టముగా కూర్చోవలసింది. ఉత్తమము అయిన వన్యపదార్థాలతో మీకోసము ఈ భోజనము సిద్ధము చేసినాను. ఏ కొరతా లేకుండా తినవలసింది" అని ఆ మైథిలి నిండుగా చెప్పుతూ ఉంటే వాడు, సన్యాసి వేషములో ఉన్న ఆ రావణాసురుడు ఆమెను చక్కగా చూస్తూ, తన చావు కోసము ఆమెను బలవంతముగా ఎత్తుకొని పోవలెను అని మనస్సులో దృఢపరచుకొన్నాడు.

అప్పుడు ఆ సీతాదేవి రామలక్ష్మణుల కోసము ఎంత ఎదురు చూచినా ఆ మహారణ్యము తప్ప మరి ఏమీ కనిపించలేదు.

47

రావణాసురుడు వైదేహిని లేవతీసుకొని పోవడానికి వచ్చి అట్లా అడుగుతూ ఉంటే ఆమె వాడి పరివ్రాజకవేషము చూచి వాడు బ్రాహ్మణుడు అనీ, అందులో అతిథిగా వచ్చినాడు అనీ, అడిగినదానికి బదులు చెప్పకపోతే శాపముపెట్టుతాడు ఏమోను అనీ కొంచెముసేపు ఆలోచించి ఇట్లా చెప్పడము మొదలు పెట్టింది :

"ఓ బ్రాహ్మణోత్తమా! నీకు శుభము అవుతుంది. నేను మహాత్ముడు అయిన మిథిలాపతి జనకమహారాజు కుమార్తెను. నన్ను సీత అంటారు. నేను రాముడి భార్యను. ఇక్ష్వాకుల ఇంట్లో పన్నెండు సంవత్సరాలు సమస్త దివ్యభోగాలు సర్వసమృద్ధముగా అనుభవిస్తూ నా భర్తతో కాపురము చేసినాను. పదమూడవ సంవత్సరములో మా మామగారు దశరథమహారాజు మంత్రులను, సామంతరాజులను సమావేశపరచి రామరాజ్యాభిషేకాన్ని గురించి ఆలోచించి నిశ్చయించినారు.

"రాముడికి రాజ్యాభిషేకము చేయపోతూ ఉండగా, మా అత్తగార్లలో ఒక ఆమె అయిన కైకేయీదేవి పెనిమిటి అయిన దశరథమహారాజును ఆడినమాట తప్పను అని ఒట్టు పెట్టుకోమని నిర్బంధించింది. సత్యసంధుడు అయినందువల్ల ఆయన అందుకు ఒప్పుకొన్నాడు. అంతట ఆమె అదివరకు ఆయనకు తాను చేసిన ఉపకారము జ్ఞాపకము చేసింది. అప్పుడు ఎప్పుడో కోరుకోమన్న వరాలను ఇప్పుడు

చెల్లించవలసింది అనీ, అందుకు తన కొమారుడికి భరతుడికి పట్టము కట్టవలెను అనీ, నా పెనిమిటిని రాముణ్ణి వనవాసము చేయించవలెను అనీ కోరుకొన్నది. ఆ కోరిక చెల్లించకపోయేట్లయితే అన్నము తినకుండా, నీళ్ళు త్రాగకుండా, నిద్రపోకుండా ప్రాణము వదులుతాను అని శపథముగా చెప్పింది. ఆ వరాలకు బదులు సువర్ణరత్నాద్యాభరణాలు ఎన్నో ఇస్తాను అని మా మామగారు చెప్పినారు. ఆమె అందుకు ఒప్పుకోలేదు. ఆ పరాక్రమవంతుడు దశరథమహారాజు కామార్తుడు అయినందువల్ల, కైకేయీదేవి కోరిక చెల్లించి ఆమెను సంతోషపెట్టడానికి రాముడి రాజ్యాభిషేకము మానుకొన్నాడు.

మహాతేజోవంతుడు అయిన నా పెనిమిటికి అప్పుడు ఇరవైఅయిదు సంవత్సరాల వయస్సు. నా వయస్సు పద్దెనిమిది ఏండ్లు. మహాబాహువు, విశాలాక్షుడు అయిన నా పెనిమిటి రాముడు మహాబలవంతుడు అనీ, పరిశుద్ధుడు అనీ, సత్యసంధుడు అనీ, సమస్తప్రాణికోటికి మేలుచేసేవాడు అనీ అప్పటికే ఈ లోకములో ప్రసిద్ధికి ఎక్కినాడు. పట్టాభిషేకము జరుగుతుంది అనుకొని నా పెనిమిటి తండ్రి దగ్గరకు పోయినాడు. అప్పుడు కైకేయీదేవి నా పెనిమిటితో అకంటకము అయిన రాజ్యము భరతుడు ఏలవలెననీ, పధ్నాలుగు సంవత్సరాలు రాముడు అరణ్యావాసము చేయవలెననీ దశరథమహారాజు ఆజ్ఞాపించినాడు అని తెగతెంపుగా మహారాజు ఎట్టఎదుటనే చెప్పింది.

"ఓ బ్రాహ్మణోత్తమా! నా పెనిమిటి దేనికీ భయపడడు. 'అట్లాగేను' అని అడవికి బయలుదేరినాడు. ఒకరికి ఇవ్వడముతప్ప పుచ్చుకోవడము ఆయనకు తెలియదు. నిజము చెప్పడము తప్ప ఆయన ఎన్నడూ అబద్ధము ఆడడు. ఆయన సత్యవ్రతుడు. ఆయనకు ఎప్పుడూ తోడుగా ఆయన సవతితల్లి కొడుకు 'లక్ష్మణుడు' అనే తమ్ముడు ఒకడు ఉన్నాడు. అతడు అమితపరాక్రమవంతుడు. యుద్ధములో ఎటువంటి శత్రువులను అయినా ఇట్టే చంపివేస్తాడు. అతడు ధర్మాచరణపరాయణుడు. ధనుర్ధరుడు అయిన ఆ తమ్ముడున్నూ, నేనున్నూ నా పెనిమిటిని వెంబడించి అరణ్యావాసానికి వచ్చినాము. నా పెనిమిటి ధర్మనిత్యుడు. జితేంద్రియుడు. జడలు తాల్చి తాపసవేషముతో ఆయన తన తమ్ముణ్ణీ, నన్నూ వెంటపెట్టుకొని ఈ దండకారణ్యానికి వచ్చినాడు. కైకేయీదేవినుంచి అట్లా రాజ్యభ్రష్టులము అయిన మేము నా పెనిమిటి పరాక్రమాతిశయమునుంచే ఈ ఘోరారణ్యములో ఉంటున్నాము.

"ఓ స్వామీ! మీరు ఏదో ఆలోచిస్తున్నారు. శ్రమగా ఉన్నట్లు అయితే కొంచెముసేపు విశ్రమించండి. నా భర్త త్వరగానే వస్తాడు. అనేక వన్యపదార్థాలను, జింకలను, ఉడుములను, పందులను కొట్టి వాటి మాంసము తీసుకొని వస్తాడు.

"ఓ బ్రాహ్మణోత్తమా! తాము ఎవరో తెలియలేదు. తమది ఏ కులము? తమ గోత్రము ఏమిటి? తాము ఒంటరిగా ఎందుకు ఈ దండకారణ్యానికి వచ్చినారు?"

సీతాదేవి ఈవిధముగా ప్రశ్న చేయగానే వాడు, ఆ రావణాసురుడు వెంటనే, "ఓ సీతా! ముల్లోకములలో దేవాసురపన్నగులను అందరినీ భయపెట్టిన రాక్షసేశ్వరుడు రావణాసురుడు అనేవాడు మరి ఎవడో కాదు, నేనే!

"సుందరీ! నిన్ను, బంగారమువంటి దేహముమీద పసుపుపట్టుచీర కట్టుకొన్న నిన్ను చూస్తూ ఉంటే నా స్వంత భార్యలమీద నాకు మనస్సు పోవడము లేదు. ఓ సీతా! నీకు శుభము అవుతుంది. నేను ఎక్కడ ఎక్కడనుంచో తెచ్చి పెండ్లాములు చేసికొన్న ఉత్తమాంగనలు ఎంతోమంది ఉన్నారు. వాండ్ల అందరిలోనూ నీవు నాకు అగ్రమహిషివి అవుతావు. నాది లంకాపట్టణము. ఆ పట్టణము సముద్ర మధ్యములో పర్వతాగ్రముమీద ఉంది. అక్కడ ఉద్యానవనాలలో నీవూ, నేనూ విహరించుదాము. నీవూ ఈ అరణ్యావాసము మరిచిపో. ఓ సీతా! నీవు నా భార్యవు అవుతావు. సర్వాభరణభూషితలు అయిన దాసీలు అయిదువేలమంది నీకు ఎప్పుడూ సేవ చేస్తూ ఉంటారు" అని చెప్పినాడు.

ఆ రాక్షసుడి మాటలను లక్ష్యపెట్టకుండా ఆ ఒప్పులకుప్ప, "ఓ రాక్షసుడా! నా పెనిమిటి రాముడు దేవేంద్రుడితో సరిసమానము అయినవాడు. కదలించను అలవికాని మహాపర్వతమువంటివాడు. క్షోభపెట్టను అలవికాని మహాసముద్రము వంటివాడు. సర్వశుభలక్షణసంపన్నుడు. మహాబాహువు. మహోరస్కుడు. సింహవిక్రాంతగామి. సింహమువంటివాడు. మహాపూజ్యుడు. సత్యసంధుడు. జితేంద్రియుడు. మహాత్ముడు. సమస్తలోకాలనూ రంజింపచేసే పూర్ణచంద్రాననుడు. మఱ్ఱిచెట్టువలె అందరికీ ఆశ్రయము ఇచ్చే మహానుభావుడు. నేను ఆ మహానుభావుణ్ణి నా పెనిమిటి రాముణ్ణి ఆశ్రయించుకొని ఆయన ఛాయగా ఉంటున్నాను.

"రాక్షసుడా! నీవు నక్కవు. నేను ఆడుసింహాన్ని. నన్ను కోరుకొంటున్నావు. సూర్యకిరణాలను చేతులలో పట్టుకోవలెను అనుకొంటున్నావు. అది అలవికాని పని. రాముడి ప్రియభార్యను కోరుకొంటున్నావు. నీకు ఇకను చచ్చిపోయేవాండ్లకువలె చెట్లు అన్నీ బంగారము చెట్లుగా కనపడుతవి. నీవు చచ్చిపోతావు.

"ఓ రాక్షసుడా! ఆకలి అయి ఆవలిస్తున్న సింహము నోటిలోనుంచీ, కోపముతో రేగిన క్రూరసర్పము నోటిలోనుంచీ కోరలను పెకలించ తలచినావు. పర్వతాలు అన్నిటిలో ఉత్తమోత్తమము అయిన మందరగిరిని చేతితో ఎత్తుకొని పోవలెను అనుకొంటున్నావు. కాలకూటవిషము త్రాగి సుఖముగా పోవలెను అనుకొంటున్నావు.

"ఓ రాక్షసుడా! నీవు రాముడి ప్రియభార్యను ఎత్తుకొనిపోయేటట్లయితే, సూదులతో కన్నులు తుడుచుకొన్నట్లు అవుతుంది. మంగలికత్తి వాయిని నాలుకతో నాకినట్లు అవుతుంది. మెడలో పెద్దరాయి కట్టుకొని సముద్రము ఈదినట్లు అవుతుంది. సూర్యచంద్రులను ఇద్దరినీ రెండు చేతులతో పట్టుకుపోయినట్లు అవుతుంది. రాముడి భార్యను, సకలకల్యాణవృత్తను నీవు ఎత్తుకొనిపోయేటట్లయితే, భగభగ మండే అగ్నిహోత్రాన్ని పై గుడ్డలో మూటకట్టుకున్నట్టు అవుతుంది. ఉక్కుకొనల శూలముమీద నడచినట్లు అవుతుంది.

"ఓ రాక్షసుడా! అడవిలో సింహానికి గుంటనక్కకు ఎంత అంతరమో, మహాసముద్రానికి చిన్నచెలమకు ఎంత అంతరమో, బంగారానికి సీసానికి ఎంత అంతరమో, మంచిగంధానికి ఎర్రబురదకు ఎంత అంతరమో, మహారణ్యములో మదపుటేనుగుకు జంగుపిల్లికి ఎంత అంతరమో, గరుత్మంతుడికి కాకికి ఎంత అంతరమో, నెమలికి నీరుకాకికి ఎంత అంతరమో, సురాసారానికి కుండడుగు నీళ్ళకూ ఎంత అంతరమో, ఆ దశరథరాముడికీ నీకూ అంత అంతరము ఉంది.

"రాముడు సహస్రాక్షుడితో సరిసమానము అయిన ప్రభావము కలవాడు. ఆయన చేతిలో కార్ముకము, బాణాలు తీసుకొని బయలుదేరితే నీవు నన్ను అపహరించి నప్పటికి, నెయ్యి తాగే ఈగవలె అనుభవించలేవు. నీవు చచ్చిపోతావు" అని చెప్పింది.

ఆ పరిశుద్ధహృదయ సీతాదేవి ఇట్లా మంచిధైర్యముగా ఆ రాక్షసరాజుతో చెప్పిందే కాని, గాలిదెబ్బకు సన్నని అరటిచెట్టువలె దేహము అంతా కంపించిపోతూ బాధపడసాగింది. అట్లా గజగజ వణకుతూ ఉన్న ఆ సీతాదేవిని చూచి మృత్యువుతో సరిసమానము అయిన ప్రభావముగల ఆ రావణాసురుడు ఆమెను మరింత భయపెట్ట తలచినాడు.

48

రావణాసురుడికి కోపము వచ్చింది. కనుబొమలు ముడిపడి పోయినవి. అతిపరుషముగా, "ఓ వరవర్ణినీ! నేను కుబేరుడి సవతితల్లికి పుట్టినవాణ్ణి, అతని తమ్ముణ్ణి. నేను దశగ్రీవుణ్ణి. నన్ను రావణాసురుడు అంటారు. నేను పరమ పరాక్రమశాలిని. మృత్యుదేవతకు మానవులవలె నన్ను చూచి దేవగంధర్వపిశాచపత గోరగులు అందరూ భయపడి పరుగులు ఎత్తి పారిపోతారు. కారణాంతరాలవల్ల నేను, నా అన్న కుబేరుడు పోట్లాడుకున్నాము. నేను జయించినాను. వాడు ఓడిపోయినాడు. నా పరాక్రమానికి వాడు నిలువలేకపోయినాడు. వాడు, ఆ వైశ్రవణుడు ఆ కుబేరుడు భయార్తుడు అయి సకలైశ్వర్యాలు, పట్టణము వదలుకొని పలాయనము అయినాడు. సురక్షితముగా ఉంటుంది అనుకొని కైలాసపర్వతానికి పోయినాడు.

"ఓ కల్యాణీ! పుష్పకవిమానము వాడిదే, ఆ కుబేరుడిదే. నేను నా పరాక్రమముతో వాడి దగ్గరనుంచి ఆ పుష్పకవిమానము లాగుకొన్నాను. ఆ విమానములో కూచొని కోరుకున్న చోటుకు, కోరుకొన్నట్టు ఆకాశమార్గాన పోవచ్చును. ఓ మైథిలీ! నాకు కోపము వస్తే నాముఖము చూడడానికి దేవేంద్రుడితో కూడా దేవతలు అందరూ భయపడిపోతారు. భయపడడమే కాదు, పరుగెత్తి పోతారు. నేను ఉన్న చోట వాయువు గాలివీచడానికి భయపడతాడు. సూర్యుడు శీతకిరణాలు ప్రసరిస్తాడు. నేను నిలుచున్నచోట చెట్ల ఆకులు కదలవు. నన్ను చూచి నదులు స్థిమితముగా ప్రవహిస్తవి.

"ఓ సీతా! దేవేంద్రుడికి అమరావతీపట్టణమువలె, నాకు సముద్రానికి అవతలిగట్టున రాక్షసులతో మంగళకరము అయిన లంకాపట్టణము ఉంది. ఆ లంకాపట్టణము చుట్టూ తెల్లటి ప్రహరీగోడ ఉంది. పట్టణము లోపల అంతటా బంగారుమయము అయిన మేడలు వైడూర్యమణులు తాపటము చేసిన ద్వారాలతో ఉన్నవి. లంకాపట్టణము దూరానికి తెల్లగా ధగధగలాడుతూ కనపడుతూ ఉంటుంది. ఏనుగులు, గుర్రాలు, రథాలు పట్టణము అంతటా తిరుగుతూ వుంటవి. తూర్యనాదాలతో ఎప్పుడూ మహావైభవముగా ఉంటుంది. పట్టణము అంతటా ఎన్నో రమ్యోద్యానవనాలు ఉన్నవి. లంకలో చెట్లు ఆ కాలము, ఈ కాలము అనే భేదము లేకుండా అన్ని కాలాల్లోను కాయలు కాస్తూ, పండ్లు పండుతూ ఉంటవి.

"ఓ సీతా! నీవు రాజపుత్రివి. నీ మనస్సు మంచిది. నా మాట విను. నీవు నాతో లంకాపట్టణములో ఉండేటట్లయితే మానవాంగనలు అనుభవించే సుఖాలు గడ్డి పోచతో సరిసమానముగా తోస్తవి. ఓ వరవర్ణినీ! నీవు అక్కడ నాతో దివ్యమానుష భోగాలు అనుభవిస్తూ ఉంటే, కలలో అయినా రాముణ్ణి తలచుకోవు. పైగా గతాయుష్కుడు అని కూడా తెలుసుకొంటావు. రాముడు జ్యేష్ఠపుత్రుడు అయినప్పటికిన్నీ, అల్పవీర్యుడు అనేకదా అతణ్ణి అరణ్యానికి వెళ్ళగొట్టి దశరథమహారాజు తన ప్రియపుత్రుణ్ణి భరతుణ్ణి గద్దె ఎక్కించినాడు. రాముడు రాజ్యము పోగొట్టుకొన్నాడు. బుద్ధిలేనివాడు. తాపసిగా తపిస్తున్నాడు. వాడితో నీవు అనుభవించేది ఏమిటి? ఓ విశాలాక్షీ! నేను సర్వరాక్షసులకు ప్రభువును. కామావేశముతో నేను స్వయముగా నీ దగ్గరకు వచ్చినాను. మన్మధశరావిష్టుడను అయినాను. నన్ను నీవు తిరస్కరించవద్దు. ఓ భీరూ! రాముడికి భయపడి నన్ను నీవు తిరస్కరించినట్లయితే, పురూరవుణ్ణి కాలితో తన్నివేసిన ఊర్వశివలె నీవు తర్వాత పశ్చాత్తాపపడుతావు. ఓ వరవర్ణినీ! రాముడు మానవుడు. యుద్ధములో నా వేలికి చాలడు. నీ భాగ్యవశమువల్ల నేను నీ కోసము వచ్చినాను. నీవు నన్ను భజించు" అన్నాడు.

ఈ మాటలకు వైదేహికి కోపము వచ్చింది. కన్నులు ఎర్రబడి పోయినవి. ఈ విజనప్రదేశములో నిర్భయముగా ఎంతో కఠినముగా, "ఓ రాక్షసుడా! సర్వభూతకోటి నమస్కరిస్తూ ఉన్న వైశ్రవణుడి తమ్ముడను అని చెప్పుకొన్నావు. అటువంటివాడి తమ్ముడవు అయి ఇటువంటి అశుభము ఎందుకు తలపెట్టినావు? ఓ రావణాసురుడా! నీవు క్రూరుడవు. ఇంద్రియలోలుడవు. నీకు దుర్బుద్ధి పుట్టింది. నీవు నాశము అయిపోతావు. నీవు ఒక్కడవే కాదు, నీవు పరిపాలిస్తున్న రాక్షసులు అందరూ కూడా నీ నుంచి తప్పకుండా నాశము అయిపోతారు.

"ఓ రాక్షసుడా! నీవు దేవేంద్రుడి భార్యను, అప్రతిమానరూపసి అయిన శచీదేవిని అవమానించినా బ్రతికితే బ్రతుకుతావు ఏమో కాని, రాముడి ప్రియభార్యను అవమానించినా, అపహరించినా బ్రతకడము ఉత్తది.

"ఓ రావణాసురుడా! నీవు నన్ను అవమానించేటట్లయితే, అమృతము త్రాగినవాడవు అయినా నీవు బ్రతకవు" అని సీతాదేవి చెప్పింది.

49

సీతాపహరణము

"ఓ సీతా! నీవు వెర్రిదానివలె ఉన్నావు. నా బలాన్ని గురించీ, నా పరాక్రమాన్ని గురించీ చెప్పితే నీవు విన్నట్టే తోచదు. నేను ఆకాశములో నిల్చుని నా రెండు చేతులతోను ఈ భూమిని ఎత్తి పారవేయకలను. సముద్రజలాన్ని అంతా ఇట్టే త్రాగివేయకలను. యుద్ధముచేసి మృత్యువును చంపివేయకలను. ధరణీతలాన్ని పగులకొట్టివేయకలను.

"ఓ పిచ్చిదానా! నన్ను గురించి నీకు ఏమీ తెలియకుండా ఉంది. నేను కోరిన కోరికలు ఇచ్చే రాజును. కామరూపుణ్ణి, నన్ను చూడు" అంటూ తన ప్రతాపము చూపించడానికి చప్పట్లు కొట్టినాడు. తక్షణమే మహాకాయుడు అయిపోయినాడు.

అంతవరకు సౌమ్యముగాను, పూజనీయముగాను ఉన్న పరివ్రాజకరూపము పోయింది. కాలాంతకుడివలె కనిపించినాడు. సాయంకాల సూర్యకాంతులవలెను, కణకణలాడుతున్న అగ్నికణాలవలెను కన్నులు, గోరోచనపువన్నెతో కనుకొలకులు కనిపించినవి. నిగనిగలాడే నీలమేఘమువంటి దేహచ్ఛాయతో, తళతళలాడే తప్తకాంచన కుండలాలతో, కన్నులు చెదరిపోయే రక్తాంబరముతో, ధనుర్బాణాలతో, మహాకాయముతో, పదిముఖాలతో ఆ రాక్షసరాజు రావణాసురుడు ఆ స్త్రీ రత్నాన్ని మైథిలిని చూస్తూ నిలుచున్నాడు.

బంగారు దేహచ్ఛాయతో, పసుపుపట్టు చీరతో, కొనలతో కూడా నల్లటి కేశపాశముతో, సమస్తాభరణాలతో సూర్యకాంతివలె కన్నులు మిరుమిట్లు కొలుపుతూ

ఉన్న ఆ మైథిలితో, "ఓ నితంబినీ! నేను నీకు సరి అయిన పెనిమిటిని. నన్ను నీవు భర్తగా ఆశ్రయించు. నావలె నీవు ముల్లోకాలలోనూ ప్రసిద్ధికి ఎక్కుతావు. నేను నీకు కొనియాడతగిన పెనిమిటిని. బహుకాలానికి నీకు నేను దొరికినాను. నన్ను భర్తగా భజించు. నేను నీకు ఎప్పుడూ అప్రియము చేయను.

"ఓ తెలివితక్కువదానా! నీకు సమస్తమూ తెలుసును అనుకొంటున్నావు. కాని, నీవు ఏమీ తెలియనిదానవు. నీవు ఆ మానవుడిమీదికి నీ మనస్సు పోనీయవద్దు. నీ మనస్సు నామీద ఉంచు. ఎవతో సవతితల్లి చెప్పింది అని వాడు సుహృజ్జనులనూ, రాజ్యాన్నీ వదలుకొని వచ్చి క్రూరమృగాలు సంచారముచేసే ఈ ఘోరారణ్యములో కాపురము పెట్టినాడు. రాజ్యము చేతిలోనుంచి జారవిడిచినాడు. అసిద్ధార్థుడు. మానవుడు కనుక అల్పాయుష్కుడు. వాడిలో, ఆ రాముడిలో ఏ గొప్ప గుణాలకు నీవు వాడిమీద ఇంత అనురాగముతో ఉంటున్నావు?" అని అడిగినాడు.

పరివ్రాజకవేషముతో కనపడగానే అంత సంతోషముగా సత్కరించి ఎంతో ప్రియముగా మాట్లాడిన ఆ మైథిలిని సమ్మానించి సంతోషపెట్టవలసిందిపోయి, ఆ దుష్టాత్ముడు రావణాసురుడు కామోద్రేకముతో మైమరచిపోయి ఆకాశములో రోహిణిని బుధుడువలె, ఆ సీతాదేవిని పట్టుకోవడానికి ఎదురుగుండా పోయినాడు.

ఆ పద్మపత్రాయతాక్షి కేశపాశాన్ని తన ఎడమచేతితోనూ, ఆమె తొడలను కుడిచేతితోనూ పట్టుకొని పైకి లేవనెత్తినాడు. మృత్యుమూర్తివలె పెద్దపెద్ద కోరలతోను, పెద్దపెద్ద చేతులతోను, కొండంత ఎత్తున అట్లా ఉన్న ఆ రావణాసురుణ్ణి చూచి అక్కడి వనదేవతలు అందరూ భయార్తులు అయి పరుగులు ఎత్తినారు.

అంతవరకూ మాయముగా ఉన్న రావణాసురుడి మహారథము అప్పుడు పిశాచముఖాల కంచరగాడిదలతో, బంగారు చక్రాలతో మహాధ్వనులు చేస్తూ అక్కడికి వచ్చి నిలుచున్నది. ఆ రావణాసురుడు అట్లా పట్టుకొన్న ఆ యశస్విని సీతాదేవి దుఃఖార్త అయి అడవిలో దూరగతుడు అయిపోయిన రాముణ్ణి ఉద్దేశించి, "రామా, రామా!" అని అరుస్తూ, ఏడుస్తూ ఉంటే వాడు, ఆ రావణాసురుడు పెద్దపెట్టున కేకలు వేస్తూ, ఆమెను బెదరిస్తూ (ఆమెను పట్టుకొన్న పాళముగానే) రథము ఎక్కి, ఆమెను ఒడిలో కూర్చుండపెట్టుకొన్నాడు. ఆ అకామ కన్నెతాచువలె ఎగిరిపడి ఆ రథోపరిభాగాన పడి పొర్లాడుతూ ఉంటే, ఆ కామాతురుడు ఆమెను గట్టిగా పట్టుకొన్నాడు. రథము కదిలింది.

ఆ రాక్షసరాజు అట్లా ఆ రథముమీద ఎత్తుకొనిపోతూ ఉంటే ఆ సీతాదేవి ఒండ్లు తెలియనిదానివలెను, పిచ్చిదానివలెను కేకలు వేసింది. ఏడుస్తూ, "ఓ లక్ష్మణా! అన్నగారిని ఎప్పుడూ సంతోషపెట్టే ఓ మహాబాహూ! ఈ రాక్షసుడు రావణాసురుడు

కుపితుడు అయి నన్ను ఎత్తుకొని పోతున్నాడు. అయ్యో! నీకు తెలియదుకదా! ఓ రామా! ధర్మము కోసము సుఖాన్ని, ధర్మాన్ని, చివరకు ప్రాణాన్ని అయినా త్యాగము చేసే నీవు, ఇప్పుడు ఈ రాక్షసుడు అధర్మముగా నన్ను ఎత్తుకొని పోవడము ఎరుగవు కదా!

"ఓ పరంతపా! నీవు దుష్టులను శిక్షించేవాడవు. నీవు ఈ పాపిష్టి రావణాసురుణ్ణి శిక్షించవా? అవును, దుష్టకృత్యాలకు ఫలము తక్షణమే అనుభవానికి రాదు. కాలము రానిదే పయిర్లు పండవు. ఓ రావణాసురుడా! కాలకర్మమువల్ల నీ బుద్ధి బుగ్గి అయిపోయి నీవు ఈపని చేస్తున్నావు. రాముడు నిన్ను ఘోరకష్టాలు పెట్టుతాడు. నిన్ను చంపివేస్తాడు.

"అయ్యో! కైకేయీదేవి, ఆమె బంధువులు కోరుకొన్నట్టుగానే ఇప్పుడు అవుతూ ఉందే! ఆ ధర్మకాముడి ధర్మపత్నిని ఇప్పుడు రాక్షసుడు ఎత్తుకొని పోతున్నాడే! ఇకను, ఈ విషయము ఆ యశస్వికి ఎట్లా తెలుస్తుంది? ఎవరు చెప్పుతారు? అవిగో, విరపూసిన కొండగోగుచెట్లు కనపడుతున్నవి. వాటితో చెప్పుతాను. 'ఓ కొండగోగు చెట్లల్లారా! రావణాసురుడు సీతను ఎత్తుకుపోయినాడు' అని రాముడు రాగానే చెప్పండి. అదిగో, పూలుపెట్టుకొన్న శిఖరాలతో ప్రస్రవణపర్వతము నన్ను చూస్తున్నది. 'ఓ ప్రస్రవణపర్వతమా! నీకు నమస్కారము చేస్తున్నాను. రావణాసురుడు సీతను ఎత్తుకొనిపోయినాడు' అని రాముడు రాగానే చెప్పవలెను. అదిగో, హంసలు, కారండవాలు సేవిస్తూ ఉన్న గోదావరీనది. 'ఓ గోదావరీ! సీతను రావణాసురుడు ఎత్తుకొని పోయినాడు' అని రాముడు రాగానే చెప్పవలెను. ఓ వృక్షాదిదేవతలారా! మీకు అందరికీ నమస్కారము చేస్తున్నాను. సీతను రావణాసురుడు ఎత్తుకొనిపోయినాడు అని మీరు అయినా రాముడితో చెప్పవలెను.

"ఓ మృగములారా! ఓ పక్షులారా! మిమ్ములను శరణము వేడుతున్నాను. మీరు అయినా నా పెనిమిటి దగ్గరకు పోయి, 'ఓ రామా! నీకు నీ ప్రాణముకన్నా ఎక్కువ అయిన నీ ప్రియురాలిని సీతను రావణాసురుడు ఎత్తుకొనిపోయినాడు' అని చెప్పండి. ఆ మహాబాహువుకు తెలిస్తే ఈ రావణాసురుడే కాదు, దేవేంద్రుడు నన్ను ఎత్తుకొనిపోయి స్వర్గలోకములో దాచిపెట్టినా, యమధర్మరాజు నన్ను ఎత్తుకొనిపోయి యమలోకములో బంధించినా పరాక్రమించి నన్ను తెచ్చుకొంటాడు' అని ఆ విశాలనేత్ర, ఆ సుశ్రోణి ఎంతో దుఃఖపడుతూ, జాలిపుట్టేట్టు ఏడుస్తూ, రావణాసురుడి చేతిలో చిక్కి రథముమీద పోతూ చెట్టుమీద ఉన్న జటాయువును చూచింది. భయముతో, దుఃఖముతో బాధపడుతూ గజగజలాడుతూ, "ఓ పూజ్యుడా! ఓ జటాయువా! చూడు, పాపకర్ముడు ఆ రాక్షసరాజు రావణాసురుడు జాలిలేకుండా నన్ను దిక్కులేనిదానివలె

ఎత్తుకుపోతున్నాడు. వీడు రాక్షసుడు. బలవంతుడు. క్రూరుడు. సాయుధుడు. జయముగా లేవతీసుకొని పోతున్నాను అని విర్రవీగుతున్నాడు. వీడు కూటయుద్ధము చేసే దుర్మార్గుడు. వీణ్ణి అడ్డగించడము నీకు శక్యము కాదు. ఓ జటాయువా! నన్ను ఈ రాక్షసుడు రావణాసురుడు ఎత్తుకొని పోయినాడు అని రాముడికీ, లక్ష్మణుడికీ చెప్పు" అని కేకలు పెట్టుతూ చెప్పింది.

50

జటాయువు హితబోధ

చెట్టుమీద నిద్రపోతున్న జటాయువు సీతాదేవి అరుపులు, ఏడ్పులు విన్నాడు. కన్నులు తెరచినాడు. రథములో రావణాసురుణ్ణి, సీతాదేవిని చూచినాడు. పర్వతశిఖరమువంటి ఆ పక్షిశ్రేష్ఠుడు ఆ చెట్టుమీదనుంచే తీక్షణము అయిన ముక్కుతో శుభకరముగా, "ఓ దశగ్రీవుడా! నేను సనాతనము అయిన ధర్మము తప్పనివాడను. సత్యవాదిని. నా పేరు జటాయువు. నేను గృధ్రరాజును. మహాబలవంతుడను.

"ఓ రావణాసురుడా! రాముడు సమస్తలోకాలకూ ప్రభువు. దేవేంద్రుడితోను, వరుణుడితోను సరిసమానము అయినవాడు. సమస్తప్రాణికోటికి మేలుచేసినవాడు. దశరథమహారాజు పుత్రుడు. నీవు ఇప్పుడు ఎత్తుకొనిపోతున్న నితంబిని సీతాదేవి ఆ లోకనాధుడి ధర్మపత్ని. మహాపతివ్రత.

"ఓ బలవంతుడా! ధర్మాచరణపరాయణుడు అయిన రాజు పరదారలను తాకవచ్చునా? అందులో, రాజుల భార్యలను తమ తల్లులవలె కాపాడవలెనే! ఇది ఏమిటి, నీవు ఇట్లా చేస్తున్నావు? ధీరుడు అయినవా డెవడూ ఇతరులు నిందించే పని చేయడు. పరదారలను పట్టుకోవడము అతినీచము అయిన పని. ఓ రాక్షసుడా! నీ మతి మార్చుకో. తన భార్యనువలెనే ఇతరుల భార్యలనుకూడా పరపురుషులు తాకకుండా నీవు కాపాడవలెను.

"ఓ పౌలస్త్యనందనా! రాజు సత్ప్రవర్తనను పట్టే ప్రజలు శాస్త్రములో చెప్పిన ధర్మాన్నీ, అర్థాన్నీ, కామాన్నీ తెలుసుకొంటూ ఉంటారు. కాబట్టి, నీవు రాజధర్మము తప్పవద్దు. ధర్మార్థకామాలకు రాజు బొక్కసమువంటివాడు. రాజు ధార్మికుడు అయితే ప్రజలున్నూ ధార్మికులుగా ఉంటారు. ఈలోకములో పుణ్యపాపాలకు, శుభాశుభాలకు రాజే మూలకారణము.

"ఓ రాక్షసశ్రేష్ఠుడా! నీవు పాపిష్టివాడవు అయిపోయినావు. విషయలోలుడవు అయినావు. దేవలోక నివాసానికి పాపకర్ముడివలె, రాజ్యము ఏలడానికి నీవు అనర్హుడవు. వారి వారి సహజ స్వభావాన్ని మార్చివేయడము ఇతరులకు ఎవరికీ, ఏమాత్రమూ

అలవికాదు. పెద్దల హితబోధ దుష్టాత్ముల తలకు ఎక్కదు. ఒకవేళ ఎక్కినా, అది అట్టే కాలము ఉండదు. నేను చెప్పుతున్నాను, విను. రాముడు ధర్మాత్ముడు. మహాబలవంతుడు. నీ దేశములోకాని, నీ పట్టణములోకాని ఎన్నడూ ఏ అపరాధమూ చేయలేదు. నీవు ఎందుకు ఈ అపరాధము చేస్తున్నావు? ఎటువంటి కష్టకార్యాన్ని అయినా రాముడు ఇట్టే చేసివేయకలడు. జనస్థానములో చేరి రాముడు ఖరాసురుణ్ణి చంపివేసినాడు. అందువల్ల, ఆ లోకనాథుడి భార్యను ఎత్తుకొనిపోతున్నాను అంటావేమో! అయితే చెప్పుతాను. ఖరుడు శూర్పణఖను వెనకవేసుకొని మర్యాదను అతిక్రమించి నాడు. మితిమీరి ప్రవర్తించినాడు. అందువల్ల రాముడు ఖరుణ్ణి చంపివేసినాడు. అందులో రాముడి అపచారము ఏమిటో యథార్థము చెప్పు.

"ఓ రాక్షసుడా! సీతాదేవిని ఈక్షణమే వదలిపెట్టి నీ దారిని నీవు పో! లేకపోయేటట్లయితే దేవేంద్రుడి వజ్రాయుధానికి వృత్రాసురుడివలె, రాముడి భయంకర నేత్రాగ్నిహోత్రజ్వాలలకు నీవు దహనము అయిపోతావు. నీవు నీ గుడ్డకొంగున విషసర్పాన్ని మూటకట్టుకొని పోతున్నావు. నీకు తెలియడము లేదు. నీ కంఠానికి కాలపాశము తగులుకొన్నది. నీవు చూచుకోకుండా ఉన్నావు.

"ఓ బుద్ధిమంతుడా! ఎవడు అయినా తనను కుంగదీసి చంపివేయకుండా ఉండే బరువునే మోయవలెను. రోగాన్ని రానీయకుండా జీర్ణము అయ్యే అన్నమే తినవలెను. ఏపని చేయడం ధర్మముకాదో, ఏపని చేయడంవల్ల ఐశ్వర్యసంబంధము అయిన యశస్సురాదో, ఏ పనిచేయడమువల్ల దేహాయాసముతప్ప మరి ఏ లాభము ఉండదో ఆ పని ఎవడూ చేయడు.

"ఓ రావణాసురుడా! నేను పుట్టి అరవైవేల సంవత్సరాలు అయిపోయినవి. పితృపైతామహము అయిన గృధ్రరాజ్యము ఏలినాను. నేను ఇప్పుడు ముసలివాణ్ణి, నీవు పడుచువాడవు. నేను నిరాయుధుణ్ణి, నీవు కవచాదులు ధరించి ధనుర్బాణాలతో ఉన్నావు. అయినప్పటికిన్నీ, నీవు సీతాదేవిని తీసుకొని పోతున్నావు కనుక, నిన్ను నేను కుశలముగా పోనీయను. నేను చూస్తూ ఉండగా అట్లా జరగడానికి వీలులేదు. వేదవిదుడి ఎదుట న్యాయశాస్త్రవాదబలముతో వేదప్రామాణ్యాన్ని కదలించడానికి ఎట్లా వీలుపడదో, అదేవిధముగా నా ఎట్టఎదుట నీవు నీ బలముతో సీతాదేవిని ఎత్తుకొని పోవడానికి వీలుపడదు.

"రావణాసురుడా! నీవు శూరుడవు అయినట్లయితే పోరాడు. కాదా, కొంచముసేపు ఆగు. ఇదివరకు ఖరుడి మాదిరిగా నీవూ నేలకూలి పెద్ద నిద్రపోతావు. యుద్ధాలలో దైత్య దానవులను ఎంతమందినో సంహారము చేసిన ఆ వల్కలాజినధరుడు

రాముడు వస్తాడు. నిన్ను అచిరకాలములో చంపివేస్తాడు. ఓ నీచుడా! ఆ రాజకుమారులు రామలక్ష్మణులు దూరము పోయినారు అనీ, వారిని పిలుచుకొని రావడము నాకు చేతకాదు అనీ, వారి భయమునుంచి నీవు వారి కంటపడకుండా గబగబ పోవలెను అనీ అనుకొంటున్నావు. సందేహము లేదు.

"ఓ రాక్షసుడా! నేను బ్రతికి ఉండగా ఆ కమలపత్రాక్షిని, ఆ మంగళరూపిణిని, రాముడి ప్రియమహిషిని సీతాదేవిని నీవు తీసుకొని పోవడానికి వీలులేదు.

"ఓ రాక్షసుడా! ఓ దశగ్రీవుడా! ఓ రావణాసురుడా! నిలు నిలు. కొంచెము సేపు చూడు. నా శక్తికొద్దీ నీకు యుద్ధాతిధ్యము ఇస్తాను. తొడిమనుంచి పండునువలె, నిన్ను నీ రథశ్రేష్ఠమునుంచి పడకొట్టుతాను" అంటూ ఆ రావణాసురుడి రధము వెంటపడ్డాడు.

51

రావణ జటాయువుల యుద్ధము

జటాయువు ఇట్లా న్యాయబద్ధముగా చెప్పుతూంటే రావణాసురుడు క్రుద్ధుడు అయిపోయినాడు. వాడి ఇరవైకన్నులు నిప్పుకణికలు అయిపోయినవి. తప్తకాంచన కుండలాల తళతళలతో, జ్యోతులవలె జ్వలిస్తూ ఉన్న కన్నులతో జటాయువును ఎదిరించినాడు.

అప్పుడు ఆ మహారణ్యములో ఆ పక్షిరాజు ఆ రాక్షసరాజుమీద కలియపడి పోరాటము సాగించినాడు. అప్పుడు వారు ఉభయులూ గాలి ఉరవడికి ఆకాశములో ఒకదానితో ఒకటి ఢీకొని పోరాడే నీలమేఘాలవలెను, రెక్కలతో ఎగిరి పోట్లాడుకొంటున్న రెండు మాల్యవంతపర్వతాలవలెను కనిపించినారు.

అప్పుడు ఆ మహాబలవంతుడు రావణాసురుడు మహాఘోరము అయిన నాళాకారపు ఇనుప బాణాలను, కరకుకొనల కర్ణాకారపు బాణాలను జటాయువుమీద వానగా కురిపించినాడు. ఆ జటాయువు ఆ అస్త్రాలను, ఆ బాణాలను లెక్కచేయకుండా రెక్కలతో విదిలించివేస్తూ, కరకు అయిన తన కాలి గోళ్ళతో రావణాసురుడి దేహము అంతా గీరి, వ్రణాలు చేసి పయికి ఎగిరినాడు. అంతట రావణాసురుడు మహోగ్రుడు అయి ఆ శత్రువును అంతటితో హతమార్చి వేయవలెను అనుకొని, మహాభయంకరము అయిన మృత్యుదండాలవంటి పది బాణాలను తీసినాడు. వాటి ముఖాలు ఉక్కుశలాకలతో చేసినవి. సాన పట్టినవి. మహాతీక్షణమ్ము అయినవి. గురి తప్పకుండా సూటిగా పోయేవి. ఆ పది బాణాలనూ వింట సంధించి, ఆకర్ణాంతమూ లాగి జటాయువుమీద వదలినాడు.

రధములో కన్నీళ్లు కారుస్తూ ఉన్న సీతాదేవిని చూచి, జటాయువు ఆకాశములోనికి పోతున్న బాణాలకు అందకుండా కిందికి దూకినాడు. రావణాసురుడు చేతిలో పట్టుకొన్న ముక్తామణిమయము అయిన చాపముమీద వాలి, ఆ చాపాన్ని బాణముతో కూడా కాళ్ళతో విరగకొట్టి ఆ పరాక్రమవంతుడు పైకి ఎగిరినాడు. అంతట రావణాసురుడు మరి ఒక ధనుస్సు తీసుకొని వందలకొద్దీ బాణాలు జటాయువు చుట్టూ వదలినాడు. అప్పుడు అట్లా చుట్టూపడ్డ బాణాలమధ్య జటాయువు గూటిలో కూర్చున్న పక్షివలె కనిపించినాడు.

అంతట ఆ మహాతేజోవంతుడు జటాయువు తన రెక్కలతో ఆ బాణాలను అన్నింటినీ ఎగరకొట్టి, చటుక్కున పోయి రావణాసురుడి వింటిమీద వాలి మళ్ళీ విరగకొట్టినాడు. అంతటితో ఆగకుండా ఆ మహావీర్యవంతుడు రావణాసురుడు తొడుగుకొన్న అగ్నిసదృశము అయిన కవచాన్ని రెక్కలతో ఎగురకొట్టినాడు. బంగారు తాళ్ళతో ఉన్న పిశాచముఖాల కంచరగాడిదలను కొరికి చంపివేసినాడు. మణులు తాపటము చేసిన బంగారు చక్రాలతోను, నాణ్యము అయిన నొగతోను, అగ్నిహోత్రమువలె తేజరిల్లుతూ కోరుకొన్న చోటుకు కోరుకొన్నట్టు పోయే రధాన్ని పడకొట్టినాడు. నిండుచంద్రుడివంటి శ్వేతచ్ఛత్రాన్ని చించివేసి, వింజామరలు వీస్తూ ఉన్న రాక్షసులను చంపివేసినాడు. అంతట ఆ కాంతిమంతుడు రధసారధి గొంతు కొరికి, శిరాన్ని ఖండించి వేసినాడు.

రావణాసురుడి విల్లు విరిగిపోయింది. రధము కూలిపోయింది. రధానికి పూంచిన కంచరగాడిదలు చచ్చిపోయినవి. సారధి తలలేని మొండెముగా పడిపోయినాడు. అప్పుడు ఆ రాక్షసుడు రావణాసురుడు వైదేహిని చంకను ఎత్తుకొని భూమిమీదకి దూకినాడు. అట్లా అయిపోయిన ఆ రావణాసురుణ్ణి అప్పుడు సమస్తభూతాలూ చూచినవి. "బలే బలే" అంటూ జటాయువును మెచ్చుకొన్నవి.

ఆ పక్షిరాజు జటాయువు ముసలివాడు అయినందువల్ల అలసిపోయినాడు. రావణాసురుడు అది కనిపెట్టినాడు. చంకను ఎత్తుకొని ఉన్న సీతాదేవితో కూడా ఆకాశానికి ఎగిరినాడు. అది చూచి గృధ్రరాజు ఎగిరి రావణాసురుడి వెనుక రివ్వునపోయి కలుసుకొని అడ్డగించి, "ఓరీ బుద్ధితక్కువవాడా! రాముడి భార్యను నీవు తీసుకొని పోతున్నది రాక్షసవంశము సమూలముగా నాశము అయిపోవడానికే. రాముడి బాణాలు వజ్రసమానము అయినవి. అవి వృధా అయిపోవు. నీవు కామాతురుడవు అయి సీతను ఎత్తుకొనిపోవడము, దప్పిక అయినవాడు పరివారజనముతోను, మిత్రులతోను, బంధువులతోను, చతురంగబలాలతోను నీళ్లు అనుకొని విషము త్రాగినట్లు అవుతుంది. కార్యాకార్యవిచక్షణాజ్ఞానములేనివాండ్లు ఈ పని చేస్తే ఈ

ఫలము అనుభవించవలసి వస్తుంది అనే ఆలోచన లేకుండా, నీవలె చేయరాని పని చేసి నాశము అయిపోతూ ఉంటారు. గాలానికి కట్టిన ఎర్రను మింగిన చేపవలె, కాలపాశాన్ని కట్టుకొనిపోతున్న నీవు ఎక్కడికి పోయినా బ్రతుకనే బ్రతుకవు. నీవు ఇప్పుడు ఈ ఆశ్రమములో చేస్తున్న మహాపరాధానికి ఆ రామలక్ష్మణులు, ఎవరికీ ఎదిరించను అలవికాని ఆ వీరులు నిన్ను ఎన్నడూ, ఏమాత్రమూ మన్నించరు.

"ఓ రావణాసురుడా! నీవు పిరికిపందవు. ఎవరూ లేని తెరపి చూచుకొని సీతను ఎత్తుకొని పోతున్నావు. ఇది లోకము నిందించే దొంగపని. వీరులు ఎవరూ ఇట్లా చేయరు. నీవు శూరుడవు అయితే కొంచెముసేపు ఉండు. నీ తమ్ముడు ఖరుణ్ణి చూస్తావు. మృత్యువు ఆసన్నము అయినప్పుడు ఆత్మవినాశానికి అసత్కార్యాలు చేసేటట్టు, నీవు ఇప్పుడు ఈ చేయరాని పనిని చేస్తున్నావు. నీకు మరణ సమయము ఆసన్నము అయింది. ఇటువంటి పాపకృత్యానికి, ఇటువంటి అధర్మానికి నీవు ఒడికట్టినావు. నిన్ను త్రిమూర్తులు సహితము కాపాడలేరు" అంటూ, ఆ వీర్యవంతుడు జటాయువు ఎంతో చక్కగా చెప్పినాడు.

రావణాసురుడు ఆ మాటలు లెక్క చేయకుండా ముందుకు సాగిపోయినాడు. అంతట జటాయువు ఎగిరి, వాడి వీపుమీద వాలినాడు. మదము ఎక్కి చెలరేగిన ఏనుగు మీద మావటివాడు అంకుశముతోవలె, జటాయువు రావణాసురుడి వీపుమీద వాలి తీక్షణము అయిన గోళ్ళతో వీపు అంతా గీరినాడు. ముక్కుతో పొడిచినాడు. కొరికినాడు. నెత్తిన జుట్టు అంతా పీకినాడు. జటాయువు అట్లా పదే పదే రక్కుతూ, గీరుతూ, పొడుస్తూ, కరుస్తూ ఉంటే రావణాసురుడు బాధపడుతూ, కోపముతో పెదవులు అదిరిపోతూ, గజగజ వణకుతూ సీతాదేవిని ఎడమ చంకకు మార్చుకొని, జటాయువును అరచేతితో చరిచినాడు. అంతట ఆ అరిందముడు జటాయువు ఆ రావణాసురుడికి ఎదురుగుండా పోయి, ఎడమ చేతులు పదింటినీ కొరికివేసినాడు. ఆ పదిచేతులూ తెగి నేలమీద పడిపోయినవి. అయితే, ఉత్తరక్షణాననే ఆ పదిచేతులూ పుట్టలోనుంచి పడగలు విప్పి ఆడుతూ వచ్చే తాచుపాములవలె మళ్ళీ పుట్టుకొని వచ్చినవి.

రావణాసురుడికి పట్టశక్యముకాని కోపము వచ్చింది. చంకను ఉన్న సీతాదేవిని దింపివేసినాడు. జటాయువును పిడికిళ్ళతో గుద్ది కాళ్ళతో తొక్కినాడు. అప్పుడు ఆ అసమానపరాక్రములు ఉభయులూ ఒక కొంచెముసేపు మహాఘోరముగా పోరాడినారు. జటాయువు ఆకాశానికి ఎగిరిపోయినాడు. రావణాసురుడు చటుక్కున కత్తి దూసి రెండు పక్కలూ, రెండు రెక్కలూ నరికివేసినాడు. అంతటితో పోనీకుండా రెండు కాళ్ళూ నరికివేసినాడు. కొనవూపిరితో జటాయువు నేలకూలినాడు. నేలకూలి

నెత్తురులో పొర్లాడుతూ ఉన్న జటాయువును సీతాదేవి చూచింది. ఆపదపాలు అయిన ఆప్తబంధువు దగ్గరకువలె జటాయువు దగ్గరకు పరుగెత్తింది.

నీలమేఘవర్ణముతో, తెల్లని వక్షఃస్థలముతో, ఆరిపోయిన దావానలమువలె నేలమీద ఉన్న ఆ మహాపరాక్రమవంతుణ్ణి జటాయువును చూచి రావణాసురుడు సంతోషించినాడు.

అప్పుడు ఆ శశిప్రభానన, ఆ జనకరాజసుత సీతాదేవి అట్లా నేలకూలిన ఆ పక్షిరాజును జటాయువును పదే పదే కౌగిలించుకొని ఎలుగెత్తి ఏడువసాగింది.

52

ఆ రాక్షసరాజు రావణాసురుడు ఆ రామాశ్రమము దగ్గర నేలమీద పడిపోయి కొనఊపిరితో కొట్టుకులాడుతున్న జటాయువును చూస్తూ నిలుచున్నాడు. రావణాసురుడు అట్లా చంపివేసిన ఆ గృధ్రరాజును ఆ చంద్రవదన సీతాదేవి చూచింది. ఆమెకు పెద్ద పెట్టున దుఃఖము వచ్చింది. ఆమె ఆ దుఃఖము భరించలేకపోయింది. ఆ జటాయువును కౌగిలించుకొన్నది. ఆవురుమని ఏడ్చింది.

అట్లా ఏడుస్తూ ఏడుస్తూ ఆ సీతాదేవి ఆలోచించసాగింది. "సుఖదుఃఖాలు రాపోతూ ఉండగా కన్నులు, భుజాలు మొదలు అయినవి అదరడమూ, పక్షులు అటూ ఇటూ తిరుగుతూ అరవడమూ మొదలు అయిన లక్షణాలు అందరికీ కనపడుతూనే ఉంటవి. రామా! నాకు ఈ మహద్వ్యసనము వచ్చినట్టు నిజముగా నీకు ఇప్పటికీ తెలియలేదు అనుకొంటాను. ఓ రామా! నిజముగా నా కోసమే ఈ పక్షులు, మృగాలు నీ దగ్గరకు పరుగులు ఎత్తుకొని వస్తూ ఉన్నవి. ఓ ప్రభూ! నామీద ఎంతో దయతో జటాయువు నన్ను కాపాడడానికి వచ్చినాడు. నా అభాగ్యమువల్ల పాపిష్టి రావణాసురుడి చేతిలో చచ్చిపోయి నేలకూలినాడు అని, అక్కడికి దగ్గరలోనే రామలక్ష్మణులు ఉన్నట్టు గొంతు యెత్తి, "ఓ రామా! ఓ లక్ష్మణా! మీరు ఇప్పుడు నన్ను కాపాడవలెను" అంటూ భయముతో కేకలు పెట్టింది.

ఆ సీతాదేవి "రామా! లక్ష్మణా!" అని అరుస్తూ చెదరిపోయిన ఆభరణముల తోను, నలిగిపోయిన పూలదండలతోను దిక్కులేని దానివలె ఏడుస్తూ, పూలతీగవలె వణికిపోతూ పోయి ఒక చెట్టును కౌగిలించుకొని, "రామా! రామా!" అని కేకలు వేయసాగింది. కాలాంతకుడివంటి ఆ రాక్షసరాజు రావణాసురుడు అప్పుడు ఆమెను ఎదుర్కొని, "వదలిపెట్టు, ఆ చెట్టును వదలిపెట్టు" అని గద్దిస్తూ తన ప్రాణాలు తుదముట్టడానికి ఆమె కేశపాశాన్ని పట్టుకొన్నాడు.

ఆ రాక్షసుడు సీతాదేవిని అట్లా అవమానిస్తూ ఉంటే చరాచరము అయిన ఈ జగత్తు అంతా అజ్ఞానాంధకారములో మునిగిపోయింది. విమూఢము అయిపోయింది. గాలి వీచడము ఆగిపోయింది. సూర్యుడున్నూ వెలావెలా పోయినాడు. అప్పుడు ఆ దీనురాలిని, ఆ సీతాదేవిని లోకకర్త అయిన బ్రహ్మదేవుడు దివ్యదృష్టితో చూచినాడు. "దేవకార్యము నెరవేరింది" అని చెప్పినాడు. దండకారణ్యవాసులు అయిన మహర్షులు అందరూ ఆ సీతాదేవి దురవస్థను చూచి దుఃఖపడ్డారు. అయితే, ఆమె నుంచి దైవికముగా రావణాసురుడికి వినాశకాలము వచ్చింది అని సంతోషపడ్డారు.

"రామా! రామా! లక్ష్మణా!" అని అరుస్తూ ఉన్న, ఏడుస్తూ ఉన్న సీతాదేవిని చంకను ఎత్తుకొని ఆ రావణాసురుడు ఆకాశమార్గానికి ఎగిరి పోయినాడు.

ఆ జనకరాజపుత్రి మేలిమివన్నె బంగారు సొమ్ములవంటి దేహచ్ఛాయతో, పసుపుపట్టుచీరతో కన్నులు మూసి తెరిచేలోపల కనపడకుండా పోయే మెరుపుతీగవలె అప్పుడు ఆకాశములో రావణాసురుడి అంకభాగాన కనిపించింది.

అట్లా ఆమెను ఎత్తుకొనిపోతూ ఉంటే, పమిటచెంగు గాలికి ఎగిరినందువల్ల రావణాసురుడు అప్పుడు ఆకాశములో భగభగ మండుతూ ఉన్న కొండవలె కనిపించినాడు. ఆ మంగళరూపిణి ఒంటిమీదనుంచి ఘుమఘుమలాడే ఎర్రతామర పూలు అప్పుడు ఆ రావణాసురుడి చుట్టూ పడ్డవి.

ఆకాశములో గాలికి ఎగురుతూ ఉన్న ఆమె పట్టుచీర మధ్యాహ్న సూర్యకాంతులనుంచి ఎర్రరంగు మేఘమువలె కనిపించింది.

రాముడు లేనప్పుడు రావణాసురుడు అట్లా దొంగతనముగా ఎత్తుకొనిపోతూ ఉంటే, సీతాదేవి ముఖకమలము నాళము ఊడిపోయిన కమలమువలె కళాకాంతులు లేకుండా కనిపించింది.

ఆమె విశాల లలాటముమీద ముంగురులు కమ్ముకొన్నందువల్ల, ఏ లోపమూ లేకుండా వికసిస్తూ ఉన్న తామరమొగ్గలవలెనూ, మేఘాల మాటున ఉదయిస్తున్న చంద్రబింబమువలెనూ కనిపించింది.

విశాలము అయిన నేత్రాలతో, తీర్చిదిద్దిన ముక్కుతో, ఎర్రటి పెదవులతో, తళతళలాడుతూ తెల్లగా అలంకారముగా అగుపించే పలువరుసతో చూడ చక్కని చంద్రబింబమువలె కనిపించే ఆమె ముఖబింబము రాముడు లేకుండా చూచి రావణాసురుడు ఎత్తుకొని పోతూ ఉంటే ఏడుస్తూ, కన్నీళ్ళు కారుస్తూ, భయముతో వణికిపోతూన్నందువల్ల, పట్టపగలు ఉదయించిన చంద్రబింబమువలె కనిపించింది.

ఆ నీలదేహుడు రావణాసురుడు మేలిమిబంగారువన్నె సీతాదేవిని అట్లా ఎత్తుకొనిపోతూ ఉంటే, ఆమె ఆ ఇంద్రనీలమణికి వేసిన బంగారుతీగవలె వెలావెలా, కనిపించింది. చిగురుటాకుల కాంతులతో నిగనిగలాడే సీతాదేవిని ఆ నల్లటి రావణాసురుడు అట్లా ఎత్తుకొనిపోతూ ఉంటే బంగారు నడికట్టు తాడుతో ఏనుగు ఆకాశంలో పోతూ ఉన్నట్టు కనిపించింది.

ఆ రావణాసురుడి నల్లటి మహాకాయము నీలమేఘమువలెనూ, ఆ జనకాత్మజ ఆభరణాల చప్పుళ్ళు ఉరుములవలెనూ, ఆమె దేహకాంతులు మెరుపులవలెనూ ఆకాశములో తోచినవి.

ఆ సీతాదేవి తలలో పూలు అన్నీ గాలి గమన వేగానికి వెంటనే నేలమీద పడకుండా, అంతటా ఎగురుతూ ఆ రాక్షసుణ్ణి వెంబడించి, మేరుపర్వతము చుట్టూ నక్షత్రాలవలె ఆ రావణాసురుడి చుట్టూ కనిపించినవి. సీతాదేవి పాదమునుంచి రత్నాలు పొదిగిన అందె జారిపోయి, విద్యున్మండలమువలె మెరుస్తూ, మనోహర ధ్వనులుచేస్తూ నేలమీద పడింది.

సీతాదేవిని రావణాసురుడు ఆకాశమార్గాన అట్లా ఎత్తుకొనిపోతూ ఉంటే, ఆమె తేజస్సు తోకచుక్కవలె కనిపించింది. అగ్నివర్ణము అయిన ఆమె ఆభరణాలు చెల్లాచెదరై పడుతూ ఉంటే, నక్షత్రాలు మహాధ్వనులు చేస్తూ ఆకాశమునుంచి నేలమీద పడుతున్నట్టు కనిపించినవి. సీతాదేవి స్తనాంతరమునుంచి ముత్యాలు పొదిగిన చంద్రహారము జారి పడిపోతూ ఉంటే, ఆకాశమునుంచి జారుతూ ఉన్న గంగానదివలె కనిపించింది.

ఆ రావణాసురుడి గమన వేగానికి పెద్దగాలి కొట్టడమువల్ల చెట్లు అన్నీ కదలిపోతూ వాటిమీద నానావిధపక్షులు మహాధ్వనులు చేస్తూ ఉంటే, అవి సీతాదేవిని చూచి 'భయపడవద్దు' అని అరచి చెప్పుతున్నట్టు కనిపించినవి. కమలాలు కాంతులు మాసిపోయిన్నీ, చేపలు మొదలు అయిన జలచరాలు భయపడిన్నీ, తామరకొలనులు తమ సఖి మైథిలి దురవస్థకు నిట్టూర్పులు విడుస్తూను, ఏడుస్తూను ఉన్నట్టు కనిపించినవి. అప్పుడు సింహాలు, పెద్దపులులు, ఇంకా ఇతర వన్యమృగాలు అన్నివైపులనుంచీ వచ్చి చేరి, ఆ రావణాసురుడు సీతాదేవిని ఎత్తుకొని పోతూన్నందుకు కోపము వచ్చి సీతాదేవి నీడవెంట పరుగులు ఎత్తసాగినవి. సీతాదేవిని ఎత్తుకొనిపోతున్నందుకు పర్వతాలు అన్నీ చేతులు ఎత్తినట్టు శిఖరాలతోను, కన్నీళ్ళు కారుస్తున్నట్టు జల ప్రవాహాలతోను కనిపించినవి. సీతాదేవి దురవస్థను చూచి దీనుడు అయి సూర్యుడు తెల్లపోయినాడు.

సమస్తభూతగణాలు సమావేశము అయి, "రావణాసురుడు రాముడి భార్యను వైదేహిని దొంగిలించుకొని పోతున్నాడు. ఈ ప్రపంచములో ధర్మము ఎక్కడ

ఉంది? సత్యము ఎక్కడ ఉంది? నిష్కాపట్యము ఎక్కడ ఉంది? దయ ఎక్కడ ఉంది" అని ఏడువసాగినవి.

జింకపిల్లలు భయపడిపోయి కన్నీళ్ళు కారుస్తూ తలలు పైకి ఎత్తి ఏడువసాగినవి.

"రామా! లక్ష్మణా!" అంటూ మధుర స్వరముతో గట్టిగా అరుస్తూ, ఏడుస్తూ, పదేపదే భూమివంక చూస్తూ ఉన్న సీతాదేవిని చూచి, వనదేవతలు అందరూ గజగజ వణకడము మొదలు పెట్టినారు.

ముంగురులు చెదరిపోయి, ముఖాన బొట్టు చెమటకు చెరిగిపోయి ఏడుస్తూ ఉన్న ఆ మహాపతివ్రతను సీతాదేవిని రావణాసురుడు తన చావుకోసము తీసుకొని పోయినాడు.

53

సీత రావణుని దూషించుట

రావణాసురుడు ఆకాశములో అట్లా తీసుకొని పోతూ ఉంటే, ఆ జనకరాజసుత ఘోరముగా దుఃఖపడ్డది. మహాభయపడ్డది. కంపించి పోయింది. జాలిపుట్టేటట్టు ఏడ్చినది. ఏడవడమువల్లను, కోపమువల్లను కన్నులు ఎర్రపడిపోయినవి. ఆ భయంకర నేత్రుణ్ణి రావణాసురుణ్ణి చూచి, "ఓ నీచుడా! ఓ రావణాసురుడా! రామలక్ష్మణులు లేని సమయము కనిపెట్టి నన్ను దొంగిలించుకొని పారిపోతున్నావే! ఇటువంటి పాడుపని చేస్తున్నందుకు నీకు సిగ్గువేయడము లేదా? దుష్టాత్ముడా! నీవు పిరికిపందవు. నన్ను అపహరించవలెను అనుకొన్నావు. నిశ్చయముగా నీవే జింకరూపముతో మాయచేసి, నా పెనిమిటిని దూరము తీసుకొని పోయినావు. నన్ను కాపాడడానికి వచ్చిన మా మామగారి మిత్రుణ్ణి గృధ్రరాజును, ముసలివాణ్ణి చంపివేసినావు. ఓ రాక్షసాధముడా! నీ పరాక్రమాన్నిగురించీ, నీ పేరునుగురించీ ఎంత గొప్పగానో చెప్పుకొన్నావు. యుద్ధములో జయించి నీవు నన్ను తీసుకొనిపోవడము లేదు.

"నీచుడా! ఒంటరిగా ఉన్న పరాయివాడి పెండ్లాన్ని దొంగతనముగా ఎత్తుకొని పోతున్నావు. ఇటువంటి నీచకృత్యము చేయడానికి నీకు సిగ్గులేదా? శూరుడను అనే అహంకారము తప్ప నీకు శౌర్యము లేదు అనీ; నీవు క్రూరము, కుత్సితము, అధర్మిష్ఠము అయిన పని చేసినావు అనీ మొగతనము ఉన్న వాండ్లు అందరూ చెప్పుకొంటారు. నీవు చెప్పుకొన్న నీ బలము, నీ శౌర్యము కాలిపోను. నీ చరిత్ర తగులపడిపోను. నీ వంశానికి అంతటికీ అపకీర్తి తెచ్చినావు. ఇట్లా ఇంత వేగముగా పరిగెత్తి పోతున్నావు. నేను ఏమి చేయకలను? రెండు ఘడియలు నిలు. నీవు ప్రాణంతో తిరిగిపోవు. నీవు నీ సైన్యము అంతటితో వచ్చినా ఆ రాజపుత్రులు, ఆ

రామలక్ష్మణుల కంటపడ్డట్లయితే ఒక్క ముహూర్తము సేపు అయినా బ్రతికి ఉండేవాడవు కావు. అడవిలో కార్చిచ్చుకు పక్షులవలె, ఆ రామలక్ష్మణుల బాణస్పర్శకు నీవు అల్లాడిపోయేవాడవు. నీ మంచి చూసుకో! ఇప్పుడు అయినా నన్ను వదలిపెట్టు.

"ఓ రావణాసురుడా! నీవు నన్ను వదలిపెట్టకపోయేటట్లయితే, నన్ను ఎత్తుకొనిపోయినావు అనే కోపముతో నా పెనిమిటి తమ్ముడితో కూడా వస్తాడు. నిన్ను నాశనము చేసివేస్తాడు. ఓ నీచుడా! బలవంతముగా నన్ను ఎత్తుకొని పోతూ ఉన్న నీ ప్రయత్నము అంతా నిరర్థకము అయిపోతుంది. దేవేంద్రుడివంటి నా పెనిమిటిని చూడకుండా శత్రువశను అయి నేను అట్టేకాలము జీవించను. వినాశ కాలములో విపరీత బుద్ధులు పుట్టుతూ ఉంటవి. అట్లాగే నీవు ఇప్పుడు నిజముగా నీ మంచి ఏదో, నీ మేలు ఏదో చూచుకోకుండా ఉన్నావు. చచ్చిపోయేవాండ్లకు బ్రతుకు రుచించదు. నీ కంఠానికి కాలపాశము తగులుకొన్నది. నాకు కనపడుతూనే ఉంది. ఓ దశాననుడా! భయపడవలసిన ఈ సమయములో నీవు నిర్భయముగా ఉన్నావు. నీవు ఇక నెత్తురుతో పారే వైతరణీనదినీ, భయంకరము అయిన కత్తులే చెట్ల ఆకులుగా ఉండే అడివినీ చూస్తావు. మేలిమివన్నె బంగారు పూలతోనూ, వైడూర్యమణులవంటి ఆకుల తోనూ, అంతటా ఇనుప ముండ్లతోనూ ఉండే బూరుగుచెట్టును చూస్తావు. నీవు దయమాలినవాడవు. ఆ మహాత్ముడికి, రాముడికి ఇటువంటి అపకారము చేస్తున్నావు. విషము త్రాగినవాడివలె నీవు చచ్చిపోతావు. నీవు ఇంక చిరకాలము జీవించవు.

"ఓ రావణాసురుడా! నీవు కాలపాశానికి కట్టుపడిపోయినావు. నా పెనిమిటి మహాపరాక్రమవంతుడు. నీవు ఎక్కడికి పోయినా నిన్ను సుఖముగా ఉండనీయడు. తమ్ముడు లేకుండా ఒంటరిగా మహారణ్యములో పద్నాలుగువేలమంది రాక్షసులను రెప్పపాటు కాలములో సంహారము చేసివేసిన మహావీరుడు, సర్వాస్త్రకుశలుడు, మహాబలవంతుడునైన రాముడు తన ప్రియభార్యను అపహరించిన నిన్ను తీక్షణ బాణాలతో వధించకుండా వదిలిపెట్టడు" అని ఎంతో కఠినముగా ఇంకా ఎన్నో మాటలు అన్నది. భయదుఃఖాదులు ఆవేశించి జాలిపుట్టేట్టు ఏడ్చింది.

ఆ సీతాదేవి అట్లా ఏడుస్తున్నా, అంత గట్టిగా చెప్పినా, భయమువేసి గజగజ వణుకుతున్నా ఆ పాపాత్ముడు రావణాసురుడు ఏమాత్రమూ లెక్కచేయలేదు.

54

సీతాదేవి లంకాప్రవేశము

రావణాసురుడు సీతాదేవిని అట్లా ఎత్తుకుని పోతూ ఉంటే ఆమెను రక్షించేవాడు ఎవడూ, ఎక్కడనూ కనపడలేదు. అయితే, ఆమె ఒక పర్వతశిఖరముమీద

వానరపుంగవులను అయిదుగురిని చూచింది. వారు రాముడితో చెప్పితే చెప్పవచ్చును అనుకొని ఆ విశాలాక్షి తన బంగారు పట్టుఉత్తరీయములో సొమ్ములు మూటకట్టి వానరశ్రేష్ఠుల మధ్యను పడవేసింది. ఆ రావణాసురుడు వాడి ప్రయాణ సంభ్రమములో ఆమె ఏమి చేస్తున్నదీ గమనించలేదు. అందువల్ల, ఆమె ఆభరణాలను తీసి మూటకట్టి పారవేయడము వాడికి తెలియనే తెలియదు.

రావణాసురుడు ఎత్తుకొనిపోతూ ఉంటే అట్లా అరుస్తూ ఉన్న ఆ విశాలాక్షిని, ఆ వరారోహను ఆ అయిదుగురు వానరులు తేనె కన్నులతో రెప్పలు ఆర్పకుండా తేరిపార చూచినారు. అంతవరకూ రాముణ్ణి గురించి ఆలోచిస్తున్న రావణాసురుడు పంపాసరస్సు దాటి లంకాపట్టణము సమీపిస్తూ సంతోషపడుతూ పోతున్నాడే కాని, చంకను ఉన్నది వాడివాడి కోరలతో మహావిషముకక్కే ఆడుతాచుపాము అని తెలుసుకోలేదు. వింటిలోనుంచి దూసుకొనిపోయే బాణమువలె ఆకాశమార్గాన అడవులు, నదులు, పర్వతాలు, సరస్సులు అతివేగముగా దాటిపోయినాడు. సమస్త నదులకూ శరణముగానూ, తిమింగలాది మహాజలచరాలకు అన్నిటికీ ఆశ్రయముగానూ, అక్షయము అయిన వరుణాలయముగానూ ఉంటూ ఉన్న సముద్రాన్ని సమీపించినాడు. సీతాదేవిని అట్లా ఎత్తుకొనివస్తున్న ఆ రావణాసురుణ్ణి ఆ సముద్రము చూచింది. భయపడ్డది. తొట్రుపాటుపడ్డది. అలలు ఆగిపోయినవి. యధేష్టముగా సముద్రములో విహరించే మహాజలచరాలు అన్నీ అడుగుకుపోయి దాక్కున్నవి.

అప్పుడు అట్లా సీతను ఎత్తుకొనిపోతున్న రావణాసురుణ్ణి చూచి అంతరిక్షములో సంచారముచేసే సిద్ధులూ, చారణులూ, "ఇంతటితో వీడి పని సరి" అనే మాట వదలినారు. ఆ రావణాసురుడి చంకలోనుంచి జారిపోవడానికి ఆ సీతాదేవి ఎంతో గింజుకులాడుతూ ఉంటే, ఆమె తనకు మృత్యుదేవత అవుతుంది అని తెలియక రావణాసురుడు ఆమెను గట్టిగా పట్టుకొని లంకాపట్టణములో తీర్చిదిద్దినట్లు ఉన్న రాజవీధిలో, కిటకిటలాడే జనులతో ఎన్నో లొట్టికట్లు ఉన్న తన అంతఃపురములో దిగినాడు. మయుడు మాయామయముగా నిర్మించిన ఆ రాజభవనములో శోకముతో ఒండ్లు ఎరగకుండా ఉన్న ఆ సీతాదేవిని దించినాడు.

మహాఘోరముగా కనిపించే పిశాచముఖాల రాక్షసాంగనలను పిలిచి, "నా ఆజ్ఞ లేకుండా ఏ పురుషుడుకాని, ఏ స్త్రీకాని ఈ సీతను చూడకుండా మీరు కావలి ఉండవలెను. ముత్యాలు, రత్నాలు, బంగారము ఆభరణాలు ఏవి అడిగితే అవి అన్నీ, నా ఆజ్ఞగా భావించి ఈమెకు ఇచ్చివేయవలెను. ఈ వైదేహితో తెలిసికాని, తెలియకకాని ఎవరు ఏ కొంచెము అప్రియము చెప్పినా వాండ్ల ప్రాణాలు ఎగిరిపోతవి" అని చెప్పి, ఆ మహాప్రతాపుడు రాక్షసరాజు అంతఃపురములోనుంచి అవతలికి పోయినాడు.

ఇకను ఆ తరువాత చేయవలసిన పనిని గురించి ఆలోచిస్తూ మహా వీర్యవంతులూ, నరమాంసభక్షకులూ అయిన ఎనిమిదిమంది రాక్షసులను చూచినాడు. బ్రహ్మాదిదేవతల వరదానమువల్ల ఒండ్లు ఎరగకుండా విర్రవీగుతున్న ఆ మహా వీర్యవంతుడు, ఆ రావణాసురుడు ఆ ఎనిమిదిమంది రాక్షసుల బలపరాక్రమాలను పొగడి, "ఓ రాక్షసవీరులారా! మీరు వెంటనే నానావిధాయుధాలు తీసుకొని జనస్థానము పొండి. ఇదివరకు ఖరాలయముగా ఉంటూ వచ్చిన జనస్థానము, ఇప్పుడు అది హతస్థానము అయిపోయింది. అక్కడి రాక్షసులు అందరూ హతము అయిపోయినారు. ఆ జనస్థానము ఇప్పుడు పాడుపడిపోయింది. మీరు భయాన్ని దూరముగా పారవేసి మీ పౌరుషముతోను, మీ బలముతోను అక్కడ ఉండవలెను. నేను ఖరదూషణులను నాయకులనుగా చేసి గొప్ప సైన్యాన్ని ఆ జనస్థానములో ఉంచినాను. యుద్ధములో రాముడి బాణాలకు గురి అయి వాండ్లు అందరు చచ్చిపోయినారు. నేను అధైర్యపడి బయలుదేరడము లేదు అని మీరు అనుకోవద్దు. ఓర్వరాని కోపముతో ఒండ్లు ఎరగకుండా ఉన్నాను. అందువల్ల, నేను ఇప్పుడు పోతలచుకోలేదు. రాముడిమీద మహాదారుణము అయిన వైరముతో ఉన్నాను. ఆ శత్రువుమీద పగ తీర్చుకోవడానికే ఆలోచిస్తున్నాను. పోరాడి శత్రువును చంపివేయకుండా నేను నిద్రపోలేను. ఖరదూషణాదులను వధించిన ఆ రాముణ్ణి చంపివేసినప్పుడే, పేదవాడికి పెన్నిధి దొరికినట్టు నేను సంతోషపడతాను. సుఖపడతాను. మీరు జనస్థానములో ఉంటూ రాముడు ఎప్పుడు ఎప్పుడు, ఏమి ఏమి చేస్తున్నదీ తెలుసుకొని, ఉన్నది ఉన్నట్టు నాకు వర్తమానాలు తెలియచేస్తూ ఉండవలెను. మీరు ఎనిమిదిమందీ ఏమాత్రమూ ఏమరుపాటు లేకుండా పొండి. రాముణ్ణి చంపివేయడానికి ఎప్పుడూ తగిన ప్రయత్నాలు చేస్తూ ఉండండి. యుద్ధముఖాన మీ బలపరాక్రమాలను నేను అనేక పర్యాయములు చూచినాను. అందువల్లనే మిమ్ములను జనస్థానము పోవలసింది అని నియోగిస్తున్నాను' అని చెప్పినాడు. రావణాసురుడు అంత అర్థవంతముగా అట్లా చెప్పిన ప్రియవాక్యాలకు ఉప్పొంగిపోయి తమ ఏలికకు నమస్కారము చేసి, ఎవరి కంటనూ పడకుండా ఆ ఎనిమిదిమందీ ఏకము అయి జనస్థానానికి వెళ్ళిపోయినారు.

అంతట ఆ రావణాసురుడు సీతను అట్లా పట్టి తెచ్చుకొన్నందుకు అమితంగా సంతోషపడ్డాడు. రాముడితో చెడ్డవైరము పెట్టుకొన్నాడు. అజ్ఞానమువల్ల ఆనందించినాడు.

55

అమితబలవంతులు, మహాభయంకరులు అయిన ఆ ఎనిమిదిమంది రాక్షస యోధులను అట్లా పంపించివేసి రావణాసురుడు మతి చెడిపోయినందువల్ల తాను

కృతకృత్యుడు అయినట్టుగా తలచినాడు. మన్మథబాణాలు తగిలి సీతాదేవిని గురించే తలచుకొంటూ ఆమెను చూడడానికి వెంటనే బయలుదేరినాడు. ఆమెను ఉంచిన రమ్యము అయిన అంతఃపురములోకి పోయినాడు.

రాక్షసాంగనల నడుమ ముఖము అంతా కన్నీళ్ళు కమ్ముకొని దీనురాలు అయి దుఃఖముతో బాధపడుతూ, గాలి ఉరవడికి మహాసముద్రములో మునుగుతూ తేలుతూ ఉన్న నావవలెను, మందలోనుంచి తప్పిపోయి చుట్టూ కుక్కలు చేరిన ఆడుజింకవలెను తలవంచుకొని శోకపరాయణ అయి ఉన్న సీతాదేవిని చూచినాడు.

ఆ శోకపరను, ఆ దీనురాలిని, ఆ వివశను సీతాదేవిని బలవంతముగా తీసుకొని దేవతాగృహతుల్యము అయిన తన గృహాన్ని చూపించడానికి బయలుదేరినాడు. హర్మ్యాలతోను, ప్రాసాదాలతోను, వేలకొలది స్త్రీలతోను, నానావిధపక్షి సమూహాలతోను, రకరకాల రత్నాలు, స్ఫటికాలు, వజ్రవైఢూర్యాలు పొదిగిన వెండి బంగారాల స్తంభాలతోను చూడచక్కగా ఉన్న తన రాజభవనము అంతా చూపించినాడు.

అక్కడ మేలిమి బంగారముతో చేసిన ద్వారము దగ్గరకు తీసికొనిపోయినాడు. కాలుపెట్టగానే దుందుభుల చప్పుళ్ళు చేసే విచిత్రము అయిన బంగారుమెట్లమీద సీతాదేవిని వెంటపెట్టుకొని ఎక్కి మేడమీదికి పోయినాడు. వెండితోను, దంతాలతోను చేసిన కిటికీలున్నూ, ఆ చూడ చక్కని కిటికీలలోనుంచి చుట్టూ ఉన్న మేడల బంగారు కిటికీలున్నూ కనిపించినవి. నేలమీద ఆ యా మణులు తాపటము చేయడమునుంచి చిత్రవిచిత్రముగా కనిపిస్తూ ఉన్న భూమి భాగాలను, దిగుడు బావులను, చుట్టూ నానావిధవృక్షాలు ఉన్న కోనేళ్ళను ఆ శోకపరాయణకు చూపించినాడు. ఆ పాపాత్ముడు తన మనోహర భవనాన్ని అంతా చూపించి, ఆమెకు ఆశ పుట్టేటట్టు చేయవలెను అనే అభిలాషతో, "ఓ సీతా! ఇక్కడ, ఈ లంకలో పదికోట్లమంది రాక్షసులు ఉన్నారు. వీండ్లుకాకుండా ఇరవైరెండుకోట్లమంది రాక్షసులు ఉన్నారు. వాండ్లు అందరూ భయంకర క్రూరకర్ములు. వాండ్లకు అందరికీ నేను ప్రభువును. ముసలివాండ్లు, పిల్లవాండ్లు తప్ప తక్కిన ముఖ్యము అయిన రాక్షసులకు ఒక్కొక్కరికీ వేయిమంది పరిచారకులు ఉన్నారు. నా రాజరికము అంతా నీ స్వాధీనము చేస్తాను. నా ప్రాణము నీ ఆధీనము చేస్తాను. ఓ విశాలాక్షి! నీవు నాకు నా ప్రాణముకన్నా ఎక్కువ అయినదానవు.

"ఓ ప్రియురాలా సీతా! ఎన్నో వేలమంది ఉత్తమాంగనలు నాకు భార్యలుగా ఉన్నారు. నీవు నన్ను చేపట్టేటట్లయితే, వారికి అందరికీ నీవు ఈశ్వరివి అవుతావు. ఇతర ఆలోచన ఎందుకు? నా మాట విను. నేను కామాగ్నితప్తుడనుగా ఉన్నాను. నన్ను అనుగ్రహించు. ఈ లంకాపట్టణము వైశాల్యము నూరు యోజనాలు. చుట్టూ

సముద్రము ఉంది. దేవేంద్రుడితోకూడా సురాసురులు అందరూ ఏకము అయి వచ్చినా, ఈ పట్టణాన్ని ముట్టడించను అలవికాదు. నాతో సరిసమానము అయిన పరాక్రమవంతుడు ముల్లోకాలలోను దేవతలలోకాని, గంధర్వులలోకాని, యక్షులలోకాని, పక్షులలోకాని నాకు కనిపించలేదు. రాముడు రాజ్యభ్రష్టుడు, దీనుడు, పైగా తాపసుడు. వాడి ఆయువు అయిపోయింది. వాడి తేజము అల్పము. వాడితో ఏమి చేస్తావు? సీతా! నీవు నన్ను భజించు. నేను నీకు సరి అయిన భర్తను. ఓ భీరూ! యౌవనము అస్థిరము. ఇక్కడ నాతో హాయిగా క్రీడించు. ఓ సీతా! ఓ సుందరాననా! నీవు రాముని గురించి తలచుకోవద్దు. వాడు, ఆ రాముడు ఇక్కడికి రావలెను అని మనస్సులో అయినా అనుకోలేడు. మహాజవముతో ఆకాశములో వీచే గాలిని తాళ్ళతో కట్టివేయడానికి అలవికాదు. భగభగమండే మంటలను పట్టుకోవడానికి అలవికాదు. ఓ శోభనా! నేను నా భుజములతో పరిపాలిస్తూ ఉన్న ఈ లంకాపట్టణమునుంచి నిన్ను అవతలికి తీసుకొనిపోగల పరాక్రమవంతుడు ముల్లోకాలలోను లేడు. నీవు ఈ లంకా మహారాజ్యాన్ని అంగీకరించు. దేవతలు, నావంటి వాండ్లు నీకు పరిచారకులు అవుతారు. చరాచరము అయిన ఈ జగత్తు అంతా నీకు తల ఒగ్గుతుంది. నీవు పట్టాభిషేకము చేసుకో. సంతోషించు. నాతో సుఖించు. నీవు ఇదివరకటి దుష్కృతమునుంచి వనవాసము చేసినావు. అది అయిపోయింది. ఇక నీ సుకృత ఫలము ఇప్పుడు ఇక్కడ అనుభవించు. ఓ మైథిలీ! దివ్యగంధపుష్పమాలికలు వేసుకో. ఉత్తమాభరణాలు అన్నీ పెట్టుకో. నన్ను ప్రేమించు. ఓ సుశ్రోణీ! నేను నా భుజబలముతో మా అన్న వైశ్రవణుడి పుష్పకవిమానము సంపాదించినాను. అది సూర్యకాంతులతో తేజరిల్లుతూ ఉంటుంది. అది ఉత్తమోత్తమము అయింది. ఎంతో విశాలము అయింది. అందము అయింది. ఓ సీతా! నీవు నాతో ఆ విమానములో సుఖముగా విహరించు. ఓ వరారోహా! నీ ముఖము కమలమువలె నిర్మలము అయింది. ఓ వరాననా! నీవు చూడ చక్కనిదానవు. ఏడ్చి ఏడ్చి ఎందుకు నీ ముఖము అట్లా పాడుచేసుకొంటావు?" అని చెప్పుతూ ఉంటే, ఆ వరానన సీతాదేవి చంద్రబింబము వంటి ముఖబింబాన్ని చీరచెంగుతో కప్పుకొని కన్నీళ్ళు కారుస్తూ ఏడువసాగింది.

ధ్యానపరాయణ అయి, దీన అయి, దుఃఖముతో కాంతిహీన అయి, అస్వస్థ అయిపోయిన సీతాదేవిని చూస్తూ ఆ పాపిష్ఠి రాక్షసరాజు రావణాసురుడు, "ఓ వైదేహీ! ధర్మలోపము అవుతుంది అనే సిగ్గు వద్దు. ఇది దైవికము అయిన సంబంధము. ఇది (చేతకాని మొగుడిని వదలిపెట్టి మరి ఒక మొగుడిని చేపట్టడము) ఆర్షసమ్మతము అయింది. నీ నునుపు అయిన పాదాలకు నేను నా తలలు అన్నీ సోకేటట్లు నమస్కారము చేస్తున్నాను. నేను నీ వశవర్తిని. నీ దాసుణ్ణి. నన్ను అనుగ్రహించు. నేను మన్మథ

పీడితుణ్ణి అయి ఎండిపోతూ ఇటువంటి చచ్చుమాటలు అంటున్నాను. ఇంతవరకూ రావణాసురుడు ఏ ఒక స్త్రీకి తలఒగ్గి నమస్కారము చేయలేదు" అని చెప్పినాడు.

ఆ రావణాసురుడు ఆ జనకరాజతనయతో ఇట్లా చెప్పి కాలవశంగతుడు అయి ఆ సీత తనదే అనుకొన్నాడు.

56

సీత రావణుని హెచ్చరించుట

దుఃఖముతో కంది కుంగిపోతూ ఉన్న సీతాదేవి ఆ రావణాసురుడు చెప్పింది అంతా విన్నది. ఒక గడ్డిపోచను తనకూ, రావణాసురుడికీ నడుమను ఉంచి నిర్భయముగా, "ఓ రాక్షసుడా! దశరథమహారాజు ధర్మసేతువువలె అచలుడు. సత్యసంధుడు. ప్రసిద్ధుడు. ఆయన జ్యేష్ఠపుత్రుడు రాముడు ధర్మాత్ముడు. ముల్లోకాలలోను ప్రసిద్ధికి ఎక్కినాడు. ఆజానుబాహువు. వెడదకన్నులవాడు. నా పెనిమిటి, నాదేవుడు ఇక్ష్వాకువంశములో పుట్టినాడు. సింహస్కంధుడు. మహా తేజోవంతుడు. ఆయనకు లక్ష్మణుడు అనే తమ్ముడు ఉన్నాడు. ఆ తమ్ముడితో కూడా ఆయన వస్తాడు. నీ ప్రాణాలు తీసివేస్తాడు.

"ఓ రాక్షసుడా! నీవు ఆ రాముడి సమక్షంలో నన్ను బలవంతముగా తీసుకొనిరావడానికి ప్రయత్నము చేసి ఉన్నట్లయితే తెలిసేది. ఖరుడితో పాటు నీవూ ఆ జనస్థానములో నేలమీద మరి లేవకుండా నిద్రపోతూ ఉండేవాడవు. భయంకరాకారులు, మహాబలవంతులు అయిన రాక్షసులు ఉన్నారు అని చెప్తుతున్నావు. వాండ్లు అందరూ రాముడి ఎదుట, గరుత్మంతుడి ఎదుట విషసర్పాలవలె నిర్వీర్యులు అయిపోతారు. ఆ మహానుభావుడు అల్లెత్రాటిని లాగి వదిలే బంగారు బాణాలు, ప్రవాహతరంగాలు ఏటిగట్లనువలె నిన్ను కూలతోస్తవి.

"రావణాసురుడా! నీవు సురలకుకాని, అసురులకుకాని అవధ్యుడవు అయితే అయి వుండవచ్చును. కాని, రామునికి వధ్యుడవు కాక తప్పదు. నీవు ఆ మహాత్ముడితో మహావైరము పెట్టుకొన్నావు. నిన్ను ఆయన ప్రాణాలతో ఉండనీయడు. నీవు ఇంక బ్రతికి ఉండేది కొద్దికాలమే. యూపస్తంభానికి కట్టివేసిన పశువు జీవించడము ఉత్తది. రాముడు నిన్ను పరాభవిస్తాడు. మహాతేజోవంతుడు, రోషకషాయితాక్షుడు అయి, నిన్ను చూచిన తక్షణమే నీవు దగ్ధము అయిపోతావు. రాముడు అంటే నీకు ఏమీ తెలియకుండా ఉంది. ఆ మహాతేజోవంతుడు చంద్రుణ్ణి ఆకాశంనుంచి నేలకు పడకొట్టకలడు. సముద్రము ఎండిపోయేటట్టు చేయకలడు. ఈ జగత్తును అంతా నాశనము చేసివేయకలడు. ఆ మహాయశుడు నిన్ను చంపి సీతను విడిపించుకొని పోతాడు అని వేరే చెప్పవలెనా?

"ఓ రావణాసురుడా! నీ ఆయువు అయిపోయింది. నీ ఐశ్వర్యము అయిపోయింది. నీ బలము ఉడిగిపోయింది. నీవు జ్ఞానహీనుడవు అయిపోయినావు. నీవు చేసిన పాడుపనినుంచి ఈ లంకాపట్టణము వైధవ్యము అనుభవిస్తుంది. ఓ దుర్మార్గుడా! నీవు నన్ను నా పెనిమిటినుంచి ఎడబాపినావు. ఈ పాపకృత్యము నిన్ను సుఖముగా ఉండనీయదు. నిన్ను నానాదుఃఖాలపాలు చేస్తుంది. నా పెనిమిటి రాముడు దైవబలము ఉన్నవాడు. మహాతేజోవంతుడు. కేవలము తన పరాక్రమము నుంచి ఘోరారణ్యాము అయిన ఆ దండకలో నిర్భయముగా నివాసము పెట్టుకొన్నాడు. ఆయన వస్తాడు. నీతో యుద్ధము చేస్తాడు. శరవర్షముతో నీ మదము, నీ బలము, నీ పరాక్రమము, నీ గర్వము వదలకొట్టుతాడు. నీ దేహములోనుంచి ప్రాణాన్ని ఎగురకొట్టుతాడు.

"ఓ రాక్షసుడా! భూతకోటి అంతా కాలానికి కట్టుబడి ఉంది. ఎప్పుడు ఎవడు దుర్బుద్ధులు పుట్టి దుష్కృత్యాలకు సిద్ధము అవుతాడో, అప్పుడు వాడికి కాలము తీరుతుంది. నీకు కాలము ముంచుకొని వస్తూ ఉంది. ఓ రాక్షసుడా! నీవు నన్ను అవమానించినావు. నీకూ, నీ రాక్షసులకూ, నీ అంతఃపురానికి మరణకాలము ఆసన్నము అయినది.

"ఓ రావణాసురుడా! యజ్ఞశాల నట్టనడుమను స్రుగ్భాండమండితము, ద్విజాతిమంత్రపూరితము అయిన వేదిక ఒక చండాలుడు చెడకొట్టివేయలేడు. అది వాడికి అలవికాదు. ఓ రాక్షసుడా! రాముడు ధర్మనిత్యుడు. నేను ఆయన ధర్మపత్నిని. పతివ్రతను. నన్ను వశపరచుకోవలెను అనుకొంటున్నావు. అది అశక్యము. కమలవనములో రాజహంసతో క్రీడించే హంస గడ్డిదుబ్బులలో తిరిగే నీరుకాకిని కన్ను ఎత్తి అయినా చూడదు.

"ఓ రావణాసురుడా! నా ఈ దేహము ఇప్పుడు ఒక కట్టెవంటిది. ఈ కట్టెవంటి దేహాన్ని నీవు బంధించ దలచుకొంటే బంధించు. భక్షించ దలచుకొంటే భక్షించు. ఈ దేహాన్నికాని, ప్రాణాన్నికాని కాపాడుకోవలసిన అవసరము నాకు ఏమీ లేదు. ఈ పృథ్విలో అపవాదము రావడము మాత్రము నేను సహించలేను" అని కోపావేశముతో పరుషముగా చెప్పి సీతాదేవి చూస్తూ ఊరకున్నది.

ఈ మాటలకు రావణాసురుడి దేహము గగురుపాడిచింది. భయంకరుడు అయినాడు. "ఓ సీతా! నా మాట విను. ఓ భామినీ! నీకు నేను పన్నెండు మాసాలు గడువు ఇస్తున్నాను. ఓ చారుహాసినీ! నీవు ఈ గడువు కాలములోపల నన్ను చేరకపోయేటట్లయితే, ఆ మరునాటి ప్రాతఃకాల భోజనానికి నిన్ను నా వంటవాండ్లు ముక్కలు ముక్కలుగా నరికి వేస్తారు" అని కఠినముగా చెప్పి, ఆ శత్రురావణుడు

రావణాసురుడు క్రుద్ధుడు అయిపోయి రాక్షసాంగనలను చూచి, "ఓ రాక్షసాంగనలారా! మీ మీ చిత్తము వచ్చినట్లు మాంసము తింటూ, నెత్తురు త్రాగుతూ ఉండండి. వెంటనే మీ మీ వికృతాకారాలు, ఘోరాకారాలు ధరించండి. ఈ సీత గర్వము అణచివేయండి" అని చెప్పినాడు.

అంత ఆ ఘోరాకారలు చేతులు జోడించి రావణాసురుడికి నమస్కారము చేసి, సీతాదేవి చుట్టూ మూగినారు.

అప్పుడు ఆ భయంకరాకారుడు రావణాసురుడు పాదఘట్టనలతో భూభాగము అంతా చలించి పగిలిపోయేటట్లుచేస్తూ ఆ రాక్షసస్త్రీలను చూచి, "ఓ రాక్షసస్త్రీలారా! ఈ మైథిలిని అశోకవనమధ్యానికి తీసుకొని పోవలెను. ఎవరికంటా పడకుండా ఈమెను గూఢముగా ఉంచవలెను. మీరు ఏమాత్రమూ ఏమరుపాటు లేకుండా కావలి కాయవలెను. కొత్తగా పట్టుకొనివచ్చిన ఆడుఏనుగునువలె మీరు ఈమెను బెదరిస్తూ, మధ్యమధ్య మంచిమాటలు చెప్పుతూ మచ్చిక చేసుకోవలెను. వశపరచుకోవలెను" అని ఆజ్ఞాపించినాడు.

ఆ రాక్షసాంగనలు అందరూ రావణాసురుడి ఆజ్ఞలను శిరసావహించి సీతాదేవిని అశోకవనానికి తీసుకొని పోయినారు. ఆ అశోకవనములో నానావిధ పుష్పఫలవృక్షాలు ఆ ఈ కాలము అనే భేదము లేకుండా పూలు పూస్తూను, కాయలు కాస్తూను ఉంటవి. రకరకాల పక్షులు సర్వకాలాలలోను మదము ఎక్కి పాటలు పాడుతూ ఉంటవి. అక్కడ ఆ అశోకవనములో అప్పుడు ఆ రాక్షసస్త్రీలమధ్యను జనకరాజపుత్రి సీతాదేవి, పెద్దపులులమధ్య లేడివలె భయపడిపోతూ ఉంది. శోకపరీతాంగి అయిపోయింది. తాళ్ళతో కట్టివేసిన ఆడుజింకవలె అయిపోయింది.

ఆ వికృతనేత్రలు, ఆ వికారాకారలు బెదరిస్తూఉంటే ఆ జనకరాజసుత తన ప్రియుడు, తన దైవము, తన పెనిమిటి అయిన రాముణ్ణి అనుక్షణమూ స్మరిస్తూ ఆ అశోకవనములో ఉంది.

57

రాముడు సీతకై పరితపించుట

మృగరూపముతో తిరిగి తిప్పలు పెట్టిన ఆ కామరూపుణ్ణి మారీచుణ్ణి రాముడు చంపివేసినాడు. వెంటనే వెనుకకు మళ్ళినాడు. సీతాదేవిని చూడవలెను అనే తహతహతో తొందర తొందరగా అడుగులు వేస్తున్నాడు. అప్పుడు అతని వెనకనుంచి ఒక నక్క క్రూరముగా కూత పెట్టింది. మారీచుడు చచ్చిపోతూ అరచిన అరపుకే ఏదేదో శంకిస్తూ గబగబా నడుస్తూ ఉన్న ఆ రాముడికి ఆ నక్క అరుపునుంచి

రోమహర్షణము అయింది. అది దారుణంగా తోచింది. ఆలోచించినాడు. నక్క అట్లా అరచినందువల్ల ఎదో అమంగళము అయింది అనుకొన్నాడు.

"అయ్యో! సీత సుఖముగా లేదా ఏమిటి? సీతను రాక్షసులు భక్షించలేదు కదా! మృగరూపము ధరించిన మారీచుడు నా కంఠస్వరముతో అరచిన అరుపు లక్ష్మణుడు విన్నట్లయితే సీతకూడా వినే వుంటుంది. ఒక వేళ లక్ష్మణుడు 'పోను' అన్నా సీత వాణ్ణి తొందరచేసి పంపించి ఉంటుంది. వాడు, లక్ష్మణుడు ఆ మైథిలిని వదిలిపెట్టి నా దగ్గరకు బయలుదేరి ఉంటాడు.

"మారీచుడు బంగారు జింక అయి నన్ను నా ఆశ్రమములో ఉండనీయకుండా ఇంత దూరము లాగుకొని వచ్చి, నా బాణము దెబ్బకు చచ్చిపోతూ రాక్షసుడు అయి, 'అయ్యో లక్ష్మణా! చచ్చిపోతున్నాను' అని ఎందుకు ఆర్తనాదము చేసినాడో, ఇప్పుడు తెలుస్తున్నది. రాక్షసులు అందరూ చేరి సీతను చంపివేయవలెను అనుకొన్నారు. నిజము. అందుకోసము మారీచుడు అట్లా చేసినాడు. నేను వదలిపెట్టి వచ్చిన తరువాత, ఈ మహారణ్యములో సీతాలక్ష్మణులు క్షేమముగా ఉంటారా? జనస్థాన నివాసమునుంచి రాక్షసులతో వైరము వచ్చింది. ఇప్పుడు భయంకరము అయిన దుర్నిమిత్తాలు కనపడుతున్నవి' అనుకొంటూ, ఆ రఘుకులదీపకుడు రాముడు తనను ఆ రాక్షసుడు మృగరూపముతో ఆశ్రమమునుంచి అంతదూరము తీసుకొని పోవడము, నక్క అరవడము, తాను ఏమేమో శంకించడము ఆలోచించుకుంటూ జనస్థానానికి నడువసాగినాడు.

అట్లా వ్యాకులచిత్తుడు అయి అడుగులు వేస్తూ ఉన్న రాముణ్ణి మృగాలు, పక్షులు దీనముఖాలతో సమీపించినవి. ఆ మహాత్ముడికి అవి అన్నీ అప్రదక్షిణము చేసినవి. ఘోరముగా కేకలు పెట్టినవి. ఆ మహాఘోర నిమిత్తాలను చూచి రాముడు అమితవేగముతో తన ఆశ్రమానికి పోతూ మహాబలవంతుడు అయిన లక్ష్మణుణ్ణి గురించీ, సీతాదేవిని గురించీ ఆలోచించసాగినాడు. అప్పుడు కళాకాంతులు మాసిపోయి ఎదురుగుండా వస్తూ ఉన్న లక్ష్మణుణ్ణి చూచినాడు.

మనోవ్యాకులముతో దుఃఖపడుతూ ఉన్న లక్ష్మణుడు తనకన్నా ఎక్కువ మనోవ్యాకులముతో బాధపడుతూ, దుఃఖపడుతూ ఉన్న రాముణ్ణి సమీపించినాడు. రాక్షసులకు ఉనికిపట్టు అయిన ఆ మహారణ్యములో లక్ష్మణుడు సీతాదేవిని అట్లా ఒంటరిగా వదలిపెట్టి రావడము రాముడికి అకార్యముగా తోచింది. రాముడు లక్ష్మణుడి ఎడమచేయి పట్టుకొని తియ్యగానూ పరుషముగానూ, "తమ్ముడా! నీవు సీతను వదలిపెట్టి ఇక్కడకు వచ్చినావు. చేయకూడని పని చేసినావు. ఇకను ఇక్కడ మనము క్షేమముగా ఉండకలమా? ఇప్పుడు అన్నీ దుర్నిమిత్తాలే కనపడుతున్నవి.

"లక్ష్మణా! ఎన్నివిధాల ఆలోచించినా సీత మన ఆశ్రమప్రదేశములో లేదు అనిపిస్తూ ఉంది. రాక్షసులు భక్షించివేసినారు ఏమోను! అవును, అంతే అయి ఉంటుంది, సందేహము లేదు. ఓ పురుషశార్దూలమా! ఆ జనకరాజసుత బ్రతికి బాగా ఉండడము మనము చూస్తామా? ఏమంటే చూడు, జింకల మందలు, నక్కల మందలు, పక్షులు సూర్యుడిదిక్కు ముఖము అయి మహాభయంకరముగా అరుస్తున్నవి. ఓ బలవంతుడా! ఆ సీత ఇంకా క్షేమముగా ఉంటుందా?

"తమ్ముడా! ఆ జింక నన్ను వ్యామోహపెట్టి చాలాదూరము లాగుకొని పోయింది. చివరకు నేను దానిమీద బాణము వదలినాను. అది లేడిరూపము వదలిపెట్టి రాక్షసుడుగా మారిపోయి మరీ చచ్చిపోయింది. నా ఎడమకన్ను అదిరింది. ఆ మాయజింకను చంపివేసినాను అనే సంతోషము లేకుండా పోయింది. నాకు మనోవ్యాకులముగా ఉంది.

"లక్ష్మణా! సందేహములేదు. సీత ఇప్పుడు ఆశ్రమములో లేదు. రాక్షసులు ఎత్తుకొనిపోయి ఉంటారు లేదా రాక్షసులు ఎత్తుకొని పోతూ ఉంటే దారిలో అయినా ఉండి ఉంటుంది కాని, ఆశ్రమములో మాత్రము లేదు" అని దుఃఖముతో అన్నాడు.

58

ఆ మహారణ్యములో వైదేహిని ఒంటరిగా వదలిపెట్టి వచ్చినందులకు వ్యాకులపడుతూ ఉన్న లక్ష్మణుణ్ణి చూచి ఆ ధర్మాత్ముడు దశరథమహారాజు పుత్రుడు రాముడు, "లక్ష్మణా! నేను దండకారణ్యానికి ప్రయాణము అవుతూ ఉంటే నన్ను వదలిపెట్టి ఉండలేక నా వెంటపడి వచ్చిన ఆమెను, నీవు ఒంటరిగా వదలిపెట్టి నా దగ్గరకు వచ్చినావు. తమ్ముడా! వైదేహి ఇప్పుడు ఎక్కడ ఉంది? నేను రాజ్యభ్రష్టుణ్ణి అయిపోయినాను అనీ, మనోవ్యాకులముతో దండకారణ్యములో తిరుగుతాను అనీ ఆమె అనుకొన్నది. నా కష్టకాలములో నాకు తోడునీడగా ఉందామని అనుకొని ఆమె నా వెంట వచ్చింది. ఆ సుమధ్య, ఆ వైదేహి ఇప్పుడు ఎక్కడ ఉంది?

"ఓ వీరుడా! దేవకన్నెవంటి ఆ సీత నా ప్రాణానికి తోడునీడగా ఉంది. ఆమె లేకుండా నేను ఒక కొంచెముసేపు అయినా బ్రతికి ఉండడము ఉత్తది. ఇప్పుడు ఆమె ఎక్కడ ఉంది? లక్ష్మణా! ఆ బంగారుబొమ్మ జనకరాజపుత్రి లేకపోయేటట్లయితే ఈ భూలోకాధిపత్యముకాని, ఆ దేవలోకాధిపత్యముకాని నేను ఒల్లను. ఓ సౌమిత్రీ! ఓ సౌమ్యుడా! నా ప్రాణముకన్నా నాకు ప్రియము అయిన ఆ మైథిలి బ్రతికి ఉందా? నా వనవాసము దబ్బర అయిపోదుకదా! లక్ష్మణా! సీతకోసము నేను చచ్చిపోతే, నీవు

అయోధ్యకు పోతావు. కైకేయీదేవి తన కోరిక ఈడేరినందుకు సంతోషపడుతుంది. తమ్ముడా! ఇట్లా జరుగుతుందా ఏమిటి?

"ఓ లక్ష్మణా! మా అమ్మ కౌసల్యాదేవి తనకు ఉన్న ఒక్క కొడుకూ చచ్చిపోతే తపించిపోతూ, పుత్రుడితోను, రాజ్యముతోను కోరికలు అన్నీ ఒనకూడిన ఆ కైకేయీదేవికి అణకువతో ఊడిగము చేయవలసి వస్తుందా ఏమిటి? లక్ష్మణా! సీత బ్రతికి ఉన్నట్లయితే ఆశ్రమానికి మళ్ళీ వస్తాను. ఆ సువృత్త చచ్చిపోయినట్లయితే నేనూ నా ప్రాణాలు వదలుతాను. ఆశ్రమానికి పోగానే పకపకనవ్వుతూ వచ్చి ఆ వైదేహి, ఆ సీత నాతో మాట్లాడడానికి లేకపోయేటట్లయితే, నేను ఇక బ్రతుకకలనా? ఉత్తది. నేను బ్రతుకను.

"తమ్ముడా! వైదేహి బ్రతికి ఉందా లేదా చెప్పు. నీవు ఏమరుపాటుతో ఉంటే, దిక్కులేనిదానివలె సీతను రాక్షసులు భక్షించివేసినారా ఏమిటి? లక్ష్మణా! సీత సుకుమారి. బాల. ఎప్పుడూ, ఏ దుఃఖమూ ఎరుగదు. నా ఎడబాటుకు చింతాకులితచిత్త అయి ఉంటుంది. ఏడుస్తూ ఉంటుంది. నిజము. తమ్ముడా! వాడు, ఆ రాక్షసుడు, ఆ దురాత్ముడు కపటోపాయము పన్నినాడు. బిగ్గరగా 'లక్ష్మణా' అని అరచినాడు. ఆ అరుపునకు నీకూ అన్నివిధాలా భయమువేసి ఉంటుంది. నా కంఠస్వరమువంటి ఆ స్వరము వినగానే వైదేహి భయభ్రాంత అయి ఉంటుంది. ఆమె పొమ్మంటే నీవు వెంటనే నన్ను చూడడానికి బయలుదేరి వచ్చినావు అనుకొంటాను.

"లక్ష్మణా! నీవు సీతను అట్లా ఆశ్రమములో వదలిపెట్టి రావడముతో అన్ని విధాలా కష్టము తెచ్చిపెట్టినావు. క్రూరరాక్షసులు మనకు ప్రతీకారము చేయడానికి నీవు అవకాశము ఇచ్చినావు. నేను ఖరుణ్ణి చంపివేయడముతో రాక్షసులు అందరూ దిగులుపడిపోయినారు. వాండ్లు అందరూ మాంసాహారులు. వాండ్లు, ఆ ఘోరరాక్షసులు సీతను చంపివేసి ఉంటారు. సందేహము లేదు" అని చెప్పి ఆ సుందరాంగిని, ఆ వరారోహను సీతాదేవిని తలచుకొంటూ, లక్ష్మణుడితో త్వరత్వరగా జనస్థానానికి నడవసాగినాడు.

దుఃఖము మూర్తీభవించినట్లు ఉన్న ఆ తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి అట్లా తప్పుపట్టుతూ ఆ మహావీరుడు రాముడు బహుదూరము నడచి అలసిపోయి, ఆకలి వేసి, దప్పికతో నోరు ఎండిపోతూ నిట్టూర్పులు విడవడము మొదలు పెట్టినాడు. అతని ముఖము వివర్ణము అయిపోయింది. ఆశ్రమప్రదేశాన్ని సమీపించినాడు. అది శూన్యముగా తోచింది. విహారప్రదేశాలను చూచినాడు. అతని వెంట్రుకలు గగురుపొడిచినవి. ఆ మహానుభావుడు దుఃఖములో మునిగిపోయినాడు.

59

రామలక్ష్మణులు ఆశ్రమానికి వేగముగా నడచి పోతున్నారు. ఆశ్రమము వదలిపెట్టి వచ్చినందుకు లక్ష్మణుడు దుఃఖపడుతూ అడుగులు వేస్తున్నాడు. అప్పుడు దారిలో రాముడు లక్ష్మణుణ్ణి చూచి, "లక్ష్మణా! నిన్ను నమ్మి నేను సీతను ఆశ్రమములో వదలిపెట్టి వచ్చినాను. నీవు ఎందుకు ఆమెను వదలిపెట్టి వచ్చినావు? తమ్ముడా! మైథిలిని వదలిపెట్టి వస్తూ ఉన్న నీవు కనపడగానే సీతకు ఏమి కీడు మూడిందోను అనే ఊహ నాకు వచ్చింది. నా మనస్సు మహావ్యథపడ్డది. యథార్థము చెప్పుతున్నాను. నీవు దూరాన ఉండగనే నా ఎడమకన్ను, ఎడమ భుజము, గుండెలు అదరినవి" అన్నాడు.

రాముడు ఇట్లా అన్నందుకు ఆ శుభలక్షణుడు లక్ష్మణుడు మరింత దుఃఖపడ్డాడు. దుఃఖపడుతూ ఉన్న రాముణ్ణి చూచి, "రామా! నా అంతట నేను, నా బుద్ధిపూర్వకముగా సీతాదేవిని వదలిపెట్టి రాలేదు. ఆమె నన్ను మహోగ్రము అయిన మాటలు అన్నది. నన్ను పొమ్మని కోరింది. నిర్బంధించింది. అందువల్ల, నేను నీ దగ్గరకు వచ్చినాను.

'అయ్యో, సీతా! లక్ష్మణా! కాపాడు' అని నీ గొంతుతో అరవడము ఆమె చెవిన పడ్డది. ఆ ఆర్తనాదానికి ఆమె భయవిహ్వాల అయిపోయింది. నీ మీద ఆమెకు ఉన్న అనురాగమునుంచి నీకు ఏదో విపత్తు వచ్చింది అనుకొని, ఆమె పెద్దపెట్టున ఏడుస్తూ పో పొమ్మని నన్ను తొందర పెట్టింది. నీ శౌర్యపరాక్రమాదులు ఎరిగి ఉండడమునుంచి నేను కదలలేదు. అప్పుడు ఆమెకు నమ్మకము పుట్టడానికి నేను ఇట్లా చెప్పినాను కూడాను.

"ఓ పూజ్యురాలా! మా అన్న రాముణ్ణి భయపెట్టకలిగే రాక్షసుణ్ణి ఈ జగత్తులో నేను ఇంతవరకూ చూడలేదు. ఇక ముందు చూడను. నీవు నిర్విచారముగా ఉండు. ఎవడో అట్లా అరచినాడు. రాముడు దేవతలను సైతము కాపాడే శక్తిమంతుడు. ఆ శౌర్యవంతుడు, ఆ పరాక్రమవంతుడు మా అన్న రాముడు ఇట్లా నింద్యముగా 'సీతా, కాపాడు' అంటూ ఆర్తనాదము చేయడు. ఓ మంగళరూపిణీ! ఎవడో రాక్షసుడు ఏదో ప్రయోజనము కోసము మా అన్న గొంతువంటి గొంతు పెట్టుకొని 'కాపాడు' అని అరచినాడు. అంతేకాదు, 'ఓ లక్ష్మణా! నన్ను కాపాడు' అనే స్వరము మా అన్నదిగా నాకు తోచలేదు. నీవు సామాన్యస్త్రీ వలె దుఃఖపడవద్దు. కలతపడవద్దు. స్వస్థచిత్తముతో ఉండు. తొందరపడవద్దు. యుద్ధములో రాముణ్ణి జయించకలవాడు ఎవడూ ఇంతవరకు ముల్లోకాలలోను పుట్టలేదు. ఇకముందు

పుట్టబోడు. దేవేంద్రుణ్ణి పురస్కరించుకొని దేవతలు అందరూ ఎత్తి వచ్చినా యుద్ధములో రాముణ్ణి జయించలేరు.'

"ఇట్లా నేను ఎంత చెప్పినా ఆమె నా మాటలు నమ్మలేదు. ఆమెకు ఒండ్లు ఎరుగని ఆవేశము వచ్చింది. ఆమె కన్నీళ్ళు కారుస్తూ, 'ఓ లక్ష్మణా! నీవు మీ అన్న చచ్చిపోతే నన్ను పొందవలెను అనే పాపిష్ఠి ఆలోచనలో ఉన్నావు. నీవు నన్ను పొందలేవు. ఆయన అట్లా ఆర్తనాదము చేస్తూ ఉంటే, నీవు ఎందుకు కదలకుండా ఉన్నావు? నీవు భరతుడితో ఏదో ఏర్పాటుచేసుకొని నా పెనిమిటిని వెంబడిస్తున్నావు. నీవు ఆ మహాత్ముడికి మారువేషములో ఉన్న పగవాడవు. ఎప్పుడు సమయము దొరుకుతుందా అని నా కోసము నీవు ఆయన వెంట వస్తున్నావు. అందువల్లనే, నీవు ఆ మహానుభావుడి దగ్గరకు పోకుండా ఉన్నావు' అని నన్ను నిందించింది.

"ఆమె నన్ను ఇట్లా మాటలు అంటూ ఉంటే నాకు కోపము వచ్చింది. నా కన్నులు ఎఱ్ఱపడిపోయినవి. నోట మాట పెగలక ఏడుపు వస్తూ, నా పెదవులు వణకిపోయినవి. నేను ఆశ్రమములో ఉండలేక పోయినాను. నీకోసము బయలుదేరినాను. ఎదురుగుండా నీవు కనిపించినావు" అని చెప్పినాడు.

రాముడికి దుఃఖముతో ఒండ్లు తెలియకుండా పోయింది.

అంతట అతడు లక్ష్మణుడితో, "నీవు సీతను వదలిపెట్టి రావడము అనే అకృత్యము చేసినావు. రాక్షసులను అందరినీ జయించే సామర్థ్యము నాకు ఉంది అని నీకు తెలిసిన్నీ, సీత కోపోద్రేకముతో మాట్లాడింది అని నీవు ఆమెను ఒంటరిగా వదలిపెట్టి వచ్చినావా? నీవు మైథిలిని అట్లా వదలిపెట్టి వచ్చినందువల్లనే, నీవు వస్తున్నావు అనే సంతోషము లేకపోయింది. ఆమె అవివేకి, అందులో క్రుద్ధురాలు అయి పరుషముగా మాట్లాడితే నీవు ఆమెను వదలిపెట్టి వచ్చినావా?

"తమ్ముడా! ఆమె నిన్ను పొమ్మని తొందరచేసినందుకు నీవు కోపపరవశుడవు అయినావు. నా ఆజ్ఞను అతిక్రమించినావు. (ఆమె అవివేకమువల్ల అట్లా అన్నది అనుకొని నీవు ఊరకుండవలసినది. అట్లా కాకపోతే మరుగున ఉండి అయినా నీవు ఆమెను కనిపెట్టుకొని ఉండవలసింది. నీవు అది ఏదీ చేయలేదు.) ఎన్నివిధాల చూచినా నీవు చేసింది తప్పుగానే కనపడుతున్నది.

"లక్ష్మణా! మృగరూపముతో నన్ను వ్యామోహపెట్టి బహుదూరము లాగుకొనిపోయిన ఆ రాక్షసుడు నేలకూలినాడు. నేను వింట బాణము ఎక్కించి లాగి విలాసముగా వదలినాను. వాడు ఆ బాణము దెబ్బకు మృగరూపము వదలిపెట్టి బాహుపురులతో రాక్షసుడు అయినాడు. శరాహతుడు అయిన ఆ రాక్షసుడు అప్పుడు

నా కంఠస్వరముతో అంతదూరము వినిపించేటట్టు అంత దారుణము అయిన ఆర్తనాదము చేసినాడు. అందుకు నీవు సీతను దిగవిడిచి వచ్చినావు" అన్నాడు.

60

సీతా వియోగమున రాముడు దుఃఖించుట

అట్లా ఆశ్రమానికి వస్తూ ఉండగా, రాముడి ఎడమకంటి క్రిందభాగము అదరడము మొదలుపెట్టింది. కాళ్ళు తడబడిపోయినవి. ఒండ్లు వణుకు పుట్టింది. అట్లు పదే పదే కనబడుతున్న దుర్నిమిత్తాలనుంచి సీత క్షేమముగా లేదు అనుకొన్నాడు. అందువల్ల, ఆమెను చూడవలెను అని మరింత తహతహలాడినాడు. చేతులు, కాళ్ళు విదలిస్తూ పక్షివలె ఎగిరిపోయి ఆశ్రమములో వాలినాడు.

ఆ ఆశ్రమము పాడుపడ్డట్టుగా తోచింది. అంతటా పారచూచినాడు. హేమంత కాలాన కమలాలులేని కాసారమువలె ఆ పర్ణశాల కళాకాంతులు లేకుండా కనిపించింది. పూలు అన్నీ రాలిపోయినందువల్లను, తుమ్మెదలు వికారధ్వనులు చేస్తూ ఉన్నందువల్లను ఆశ్రమ తరులతాదులు తనను చూచి ఏడుస్తున్నట్టుగా కనిపించినవి. మృగ వన దేవతలు అంతర్ధానము అయిపోయినందువల్లను ఆ ఆశ్రమపదము పాడుపడ్డట్టుగా అగుపించింది. ఆ ఆశ్రమములో కృష్ణాజినాలు, దర్భాసనాలు, పీటలు, చాపలు చెల్లాచెదరు అయిపోయి ఉన్నవి. అంతా చిందరవందరగా కనిపించింది. తన ఆశ్రమము అట్లా అయిపోయినందుకు రాముడికి దుఃఖము పొంగిపొర్లింది.

ఆ భీరువును సీతాదేవిని ఎవరు అయినా రాక్షసులు ఎత్తుకొని పోయినారో, భక్షించివేసినారో లేక ఆమె చనిపోయిందో, ఏది అయినా విపత్తు వచ్చిందో, అట్లా కాకపోయేటట్లయితే ఆమె ఎక్కడను అయినా దాగుకొన్నదో, అడవికి పోయిందో, నీళ్ళు తెచ్చుకోవడానికి గోదావరికి పోయిందో, పూలూ పళ్లూ కోసి తెచ్చుకోవడానికి పోయిందో అనుకొంటూ, రాముడు మహాప్రయాసముతో వెదకడము మొదలు పెట్టినాడు. ఎంత వెదకినా ఆ సీతాదేవి అక్కడ ఎక్కడనూ కనిపించలేదు. దుఃఖముతో అతని కన్నులు ఎఱ్ఱపడిపోయినవి. పిచ్చిఎత్తినవాడివలె చెట్టుచెట్టు దగ్గరకు పోయినాడు. గుట్టగుట్ట దగ్గరకు పోయినాడు. గోదావరినది దగ్గరకు పోయినాడు. ఆయా వాగుల దగ్గరకు పోయినాడు. అంతటా వెదకి చూచినాడు. సీతమాత్రము కనిపించలేదు.

అంతట అతడు ఏడుస్తూ, ఎదుట కనిపించిన కదంబవృక్షము దగ్గరకు పోయి, "ఓ కదంబవృక్షమా! నీ పూలు అంటే నా ప్రియురాలికి సీతకు ఎంతో ఇష్టము. నీవు ఆమెను చూచినావా? ఆ శుభాననను నీవు చూచి ఉన్నట్లయితే చెప్పు. ఓ

బిల్వవృక్షమా! నీ చక్కని పళ్ళవంటివి నా ప్రియురాలి స్తనాలు. నా ప్రియురాలిని సీతను నీవు చూచినావా? ఆమె పసుపుపట్టుచీర కట్టుకొన్నది. చిగురుటాకులవంటి దేహము. నీవు ఆమెను చూచి ఉంటే చెప్పు. ఓ అర్జునవృక్షమా! నీవు అంటే నా ప్రియురాలికి ఎంతో ఇష్టము. ఆ భీరువును, జనకరాజపుత్రిని సీతను నీవు చూచినావా? ఆమె ఇప్పుడు ఎక్కడ ఉందో చెప్పు. ఓ కకుభవృక్షమా! నీ బోదెవంటివి నా ప్రియురాలి తొడలు. ఆ మైధిలిని నీవు బాగా ఎరుగుదువు. నీవు చిగురుటాకులతోను, పూలతోను కళకళలాడుతున్నావు. నిన్ను చూడడానికి ఆమె వచ్చి ఉంటుంది. నీవు నా ప్రియురాలిని చూచినావా? కకుభవృక్షమా! నా ఇల్లాలు సీత ఇప్పుడు ఎక్కడ ఉందో చెప్పు. ఓ తిలకవృక్షమా! నీవు అంటే నా ప్రియురాలికి ఎంతో ప్రేమ. నీ దగ్గర తుమ్మెదలు జుమ్మని పాటలు పాడుతున్నవి. నిన్ను చూడడానికి ఆమె వచ్చి ఉంటుంది. నీవు ఆమెను బాగా ఎరుగుదువు. ఓ తిలకవృక్షమా! నా భార్య ఇప్పుడు ఎక్కడ ఉందో చెప్పు. ఓ అశోకవృక్షమా! నీవు విరహజనుల శోకాలను పోగొట్టుతావు. నా ప్రియురాలు సీత కనపడక నేను శోకోపహతచేతస్కుడను అయినాను. ఓ అశోకవృక్షమా! నా ప్రియురాలు ఎక్కడ ఉందో చప్పున చెప్పు. నీ పేరు సార్ధకపరచుకో. ఓ తాళవృక్షమా! నీకు పండే పళ్ళవంటివి నా ప్రియురాలి స్తనాలు. నీవు ఆ నితంబినిని ఎరుగుదువు. దయ ఉంచి ఆమె ఇప్పుడు ఎక్కడ వుందో చెప్పు. ఓ జంబూవృక్షమా! నా ప్రియురాలి దేహము నీ పళ్ళంత నునుపుగా ఉంటుంది. నీవు ఆమెను ఎరుగుదువు. ఇప్పుడు ఆమె ఎటుపోయిందో నిస్సంకోచముగా చెప్పు. ఓ కర్ణికారవృక్షమా! నీవు ఎన్నో చక్కని పూలు పూసినావు. నా ప్రియురాలు సీత ఎప్పుడూ నీ పూలకోసము, నీ దగ్గరకు పరుగెత్తుకొని వస్తూ ఉండేది. ఆ పతివ్రతను నీవు ఎరుగుదువు. ఆమె ఇప్పుడు ఎక్కడ ఉందో చెప్పు" అని ఆ మహాశయుడు రాముడు మామిడిచెట్లను, మద్దిచెట్లను, పనసచెట్లను, గోరంటచెట్లను, చంద్రచెట్లను, దాడిమచెట్లను, మల్లెపొదలను, గురివిందపొదలను, మొగలిపొదలను సీతను గురించి అడుగుతూ, తిరిగి చూస్తూ పిచ్చిపట్టినవాడివలె అయిపోయినాడు.

"ఓ జింకా! ఈ చెట్లు ఏవీ నా ప్రియురాలు ఎక్కడ ఉన్నదీ చెప్పడములేదు. ఆ నా ప్రియురాలు నీ పిల్లవంటి కన్నులతో చూస్తూ తిరుగుతూ ఉండేది. ఆ మైథిలిని నీవు ఎరుగుదువు. ఆ చపలాక్షి మీ జింక మందలలో ఏమైనా దాగుకొన్నదేమో చెప్పు. ఓ గజరాజమా! నీ తొండమువంటివి నా ప్రియురాలి తొడలు. నీవు ఆమెను ఎరుగుదువు. నీవు ఆమెను చూచినావా? చూచి ఉన్నట్లయితే చెప్పు. ఓ శార్దూలమా! నీవు భయపడవద్దు. నిన్ను నేను ఏమీ చేయను. చంద్రబింబమువంటి నా ప్రియురాలిని నీవు చూచినావా? చూస్తే నిర్భయముగా చెప్పు.

"ఓ ప్రియురాలా! ఎందుకు పరుగెత్తి పారిపోతున్నావు? ఓ కమలేక్షణా! దూరదూరముగా పోతున్నావు ఎందుకు? చెట్లచాటుకు పోయి కనపడకుండా దాగుకొంటున్నావా ఏమిటి? ఎందుకు మారుమాట్లాడవు? ఓ నితంబినీ! నిలు, నిలు. నీకు నా మీద దయలేదా? ఇంత నవ్వులాట నీవు ఎరుగవే! ఎందుకు నన్ను ఇట్లా ఉపేక్షిస్తున్నావు? ఓ వరవర్ణినీ! నీవు పరుగెత్తుతూ ఉంటే నీ పసుపుపట్టుచీర నాకు కనపడుతూనే ఉంది. నామీద ప్రేమలేదా? ఉంటే నిలు.

"ఆ చారుహాసిని లేదు. ఆమె ఇప్పుడు ఇక్కడ లేనే లేదు. రాక్షసులు ఆమెను తప్పకుండా చంపివేసి ఉంటారు. లేకపోతే ఆమె నన్ను ఇట్లా ఉపేక్షించదు. ఇట్లా నన్ను బాధపెట్టదు. నేను లేనప్పుడు రాక్షసులు ఆ చిన్నదాని అవయవాలు అన్నీ విరుచుకొని తిని ఉంటారు. తెల్లటి పలువరుసలతో, ఎర్రటి పెదవులతో, చక్కని ముక్కుతో, తళతళలాడే కుండలాలతో చంద్రబింబమువంటి నా ప్రియురాలి ముఖబింబము, రాక్షసులు చుట్టూ మూగగానే రాహువు పట్టవచ్చిన చంద్రబింబమువలె వెలా తెలా పోయి ఉంటుంది. సంపంగిపువ్వువన్నెతో, సమస్తకంఠాభరణాలతో కళకళలాడుతూ ఉండే ఆ శుభాంగి కంఠాన్ని రాక్షసులు పిసికివేస్తూ ఉంటే ఎంత ఏడ్చిందో? గజగజ వణికిపోతూ చేతులతో అడ్డగించపోతే, రాక్షసులు బంగారు బాహుపురులు, హస్తాభరణాలు పెట్టుకొన్న ఆమె చేతులను విరుగతీసి ఉంటారు. అవును, తప్పకుండా అంతే అయి ఉంటుంది. అయ్యో! ఎంతమంది బంధువులనో వదలుకొని ఆ బాల నా వెంటబడి వచ్చినందుకు, ఆమెను రాక్షసులు భక్షించడానికి నేను వదలిపెట్టి పోయినట్లు అయింది. బాటసారులు వదలిపెట్టి పోయిన స్త్రీని క్రూరమృగాలవలె, ఆమెను రాక్షసులు భక్షించివేసి ఉంటారు.

"ఓ లక్ష్మణా! నా ప్రియురాలు నీకు ఇప్పుడు ఎక్కడను అయినా కనపడుతూ ఉందా? ఓ మంగళరూపిణీ! ఓ ప్రియురాలా! ఓ సీతా! ఎక్కడికి పోయినావు? ఏమి అయిపోయినావు? అయ్యో!" అంటూ వెక్కి వెక్కి ఏడ్చినాడు.

అట్లా వెక్కి వెక్కి ఏడుస్తూ రాముడు ఆ అడవిలో అటునుంచి ఇటు, ఇటునుంచి అటు పరుగులు ఎత్తుతూ, దుఃఖాతిశయమువల్ల జడపదార్థాలు సయితము సీతను గురించి చెప్పకలవు అనే భ్రాంతితో ప్రశ్నిస్తూ, ఆ యా లతాదులను చూచి సీతాదేవి అనుకొని భ్రమపడిపోతూ, ప్రతిచోట ప్రియురాలిని వెదకుతూ దరీ త్రోవా తెలుసు కోకుండా కైపెక్కినవాడివలె తిరగడము మొదలు పెట్టినాడు. అతడు ఒకచోట నిలువలేక పోయినాడు. అడవులు, నదులు, కొండలు, కొండవాగులు, కాకులు దూరని కారడవులు తిరిగి చూచినాడు. ఆ మహారణ్యము అంతా గాలించి చూచినాడు. ఆ అడవిలో ఎక్కడను అతనికి సీతాదేవి కనపడలేదు. ఆమెను వెతకడానికి మళ్ళీ బయలుదేరినాడు.

61

ఆ ఆశ్రమపదము పాడుపడిపోయింది. పర్ణశాలలో సీత లేదు. ఆసనాలు మొదలు అయినవి చెల్లాచెదరుగా పడి ఉన్నవి. ఎంత వెతకినా వైదేహి కనపడలేదు. అంతట రాముడు చేతులు కట్టుకొని లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! సీత ఏమి అయి ఉంటుంది? ఇక్కడనుంచి ఎక్కడికి పోయి ఉంటుంది? సౌమిత్రీ! ఆమెను ఎవరు ఎత్తుకొని పోయి ఉంటారు? ఆమెను ఎవరు భక్షించి ఉంటారు అని అడిగి, "ఓ సీతా! చెట్టుచాటున దాగుకొని నవ్వులాట పట్టిస్తున్నావా? నీ నవ్వులాట ఇక చాలించు. నేను నీకోసము బాధపడుతున్నాను. దుఃఖపడుతున్నాను. రా, త్వరగా నా దగ్గరకు రా! ఓ సీతా! నీవు చాలా మంచిదానవు. నీదగ్గర నిర్భయముగా ఆడుకొనే జింకపిల్లలు ఇప్పుడు నీవు కనపడనందువల్ల కన్నీళ్ళు కారుస్తూ, నిన్ను గురించే ధ్యానము చేస్తూ ఉన్నవి.

"లక్ష్మణా! సీతలేకపోయేటట్లయితే నేను జీవించను. ఎవరో ఆమెను ఎత్తుకొని పోయినారు. ఈ మహాదుఃఖముతో నేను ఇంకను బ్రతికి ఉండడము వట్టిది. నేను చచ్చిపోతాను. లక్ష్మణా! అప్పుడు అక్కడ మన నాయనగారు దశరథమహారాజు నన్ను చూస్తాడు. తప్పకుండా ఆయన నన్ను చూస్తాడు. 'నేను ఆజ్ఞాపించినట్టు పధ్నాలుగు సంవత్సరాలు వనవాసము చేస్తాను అని నీవు ప్రతిజ్ఞ చేసినావు. నీవు గడువుకాలము అయిపోకుండానే ఇక్కడికి, నా దగ్గరకు ఎందుకు వచ్చినావు? నీవు నీ ఇష్టమువచ్చినట్లు ప్రవర్తించినావు. నీవు దుష్టుడవు. అబద్ధాలు ఆడేవాడవు' అని ఆయన పరలోకములో నన్ను నిందిస్తాడు. తప్పకుండా నిందిస్తాడు.

"ఓ నితంబినీ! ఓ సుమధ్యమా! నేను ఇప్పుడు వివశుణ్ణి అయిపోయినాను. దుఃఖముతో తపించిపోతున్నాను. నా మనోవ్యాకులము చెప్పలేను. భగ్నమనోరథుణ్ణి అయిపోయినాను. ఋజువర్తనము లేనివాణ్ణి కీర్తి వదలిపెట్టి పోతుంది. నేను అటువంటివాణ్ణికానే! నీవు నన్ను వదలిపెట్టి ఎక్కడికి పోయినావు? నీవు నన్ను వదలిపెట్టిపోతే, నేను బ్రతికి ఉండడము వట్టిది'' అంటూ రాముడు సీతను చూడవలెను అనే తహతహతో ఎంత దుఃఖపడ్డా, ఎంత విలపించినా ఆ జనకాత్మజ కనిపించలేదు.

సీతాదేవి కనబడక పెద్దరొంపిలో దిగపడ్డ ఏనుగువలె, దురవస్థలోపడ్డ రాముడి దుఃఖోపశమనము కోసము లక్ష్మణుడు అప్పుడు, "ఓ శూరుడా! నీవు మహాబాహువువు, దుఃఖపడవద్దు. ఆ మైథిలి ఎక్కడ ఉందో మనము ఇద్దరమూ వెతకుదాము. ఈ అడవిలో గుహలవంటి పొదరిండ్లు ఎన్నో ఉన్నవి. ఆ మైథిలికి వనసంచారము అంటే ఎంతో మక్కువ. ఆమెకు జలప్రవాహములు అంటే ఎంతో సంతోషము. కాబట్టి,

ఆమె ఈ అడవిలో ఎక్కడను అయినా తిరుగుతూ ఉండవచ్చును. లేదా విరగపూసిన తామర కొలను దగ్గరకు అయినా పోయి ఉండవచ్చును. కాకపోతే చేపలు చెర్లాడుతూ, ప్రబ్బలి తీగెలు అల్లిబిల్లిగా అల్లుకొన్న నదిలో స్నానము చేయడానికి అయినా పోయి ఉండవచ్చును. లేదా నవ్వులాటగా ఆమె ఈ అడవిలో ఎక్కడను అయినా దాగుకొని ఉన్నది ఏమో? ఓ పురుషపుంగవా! వైదేహి నిన్నూ నన్నూ భయపెట్టవలెను అనుకొన్నది ఏమో! లేక నీ నా సామర్థ్యము తెలుసుకోతలంచుకొన్నది ఏమో! అందుకోసమే, ఆమె ఈ అడవిలో ఏదో ఒకచోట దాగుకొన్నది ఏమో!

"ఓ కాంతిమంతుడా! ఆమెను ఇప్పుడే వెతకుదాము. అవసరము అయ్యేటట్టయితే ఈ అడవి అంతా గాలించి చూదాము. ఆమె ఎక్కడ ఉందీ విచారించి తెలుసుకొందాము. నీవు విచారపడవద్దు" అని చెప్పినాడు.

లక్ష్మణుడు ప్రేమాతిశయముతో ఇట్లా చెప్పినందువల్ల రాముడు శాంతించినాడు. లక్ష్మణుణ్ణి తోడుచేసుకొని వెంటనే వెతకడానికి బయలుదేరినాడు. సీతకోసము ఆ రామలక్ష్మణులు అడవులు, కొండలు, నదులు, సరస్సులు వెదకినారు. ఆమె కనపడలేదు. అంతట రాముడు ఒంటరిగా ప్రస్రవణపర్వత సానువులు అన్నీ తిరిగి చూచినాడు. ఆ కొండగుహలు అన్నీ వెతకినాడు. ఆ పర్వతశిఖరము ఎక్కి చూచినాడు. ఎక్కడనూ సీత కనుపించలేదు. ఆ ప్రస్రవణపర్వతము అంతా వెతకడము అయిన తరువాత రాముడు లక్ష్మణుడితో, "ఓ సౌమిత్రీ! ఆ మంగళరూపిణి ఈ పర్వతముమీద లేదు" అన్నాడు. అప్పటికి దండకారణ్యాము అంతా వెదకి వచ్చిన లక్ష్మణుడు దుఃఖముతో తపించిపోతూ ఉన్న ఆ దీప్తతేజోవంతుణ్ణి రాముణ్ణి చూచి, "ఓ రామా! నీవు మహాప్రాజ్ఞుడవు. నీకు తెలియనిది ఏమీ లేదు. ఆ మహాబాహువు విష్ణుమూర్తి బలిచక్రవర్తిని బంధించి భూభాగాన్ని అంతా స్వాధీనము చేసుకొన్నాడు. నీవున్నూ సీతను ఎత్తుకొనిపోయినవాణ్ణి శిక్షించి, ఆమెను తెచ్చుకొంటావు" అన్నాడు.

స్నేహాతిశయముతో లక్ష్మణుడు అన్న ఈ మాటలకు రాముడి మనస్సు దుఃఖముతో వికలము అయిపోయింది. మహావ్యథపడుతూ, "ఓ మహాప్రాజ్ఞుడా! నీవూ, నేనూ ఈ అడవి అంతా వెతకడము అయిపోయింది. కమలాలు విరగపూసే కాసారాలు, కొండగుహలు, సెలయేళ్లు వెతకడమున్నూ అయిపోయింది. కొండ అంతా తిరిగి చూడడమున్నూ అయిపోయింది. నా ప్రాణముకన్నా నాకు ఎక్కువ అయిన ఆ సీత ఎక్కడనూ కనిపించలేదు" అంటూ, రాముడు కనపడకుండా పోయిన సీతకోసము వెతకి వెతకి నలిగిపోయి దుఃఖమువచ్చి ఏడ్చినాడు. ఆ సంతాపముతో రాముడి అవయవాలు అన్నీ విరవిరపోయినవి. ఆ రాజీవలోచనుడు

తెలివి తప్పిపోయినాడు. చేష్టలు ఉడిగిపోయినాడు. దీనుడు అయి పెద్ద వేడినిట్టూర్పులు విడుస్తూ, చతికిలపడి పోయినాడు. ఆ నిట్టూర్పులకన్నా అధికము, కన్నీళ్ళు కారుస్తూ గద్గద కంఠముతో, "అయ్యో, ప్రియురాలా!" అని అరచి బిగ్గరగా ఏడువసాగినాడు.

అప్పుడు ఆ ధర్మజ్ఞుడు లక్ష్మణుడు చేతులు జోడించి వినయముతో రాముణ్ణి ఓదార్చసాగినాడు. అయితే, ఆ ఓదార్పు మాటలు రాముడి చెవికి ఎక్కలేదు. సీత కనపడలేదని వెక్కి వెక్కి ఏడువసాగినాడు.

62

ఆ ధర్మాత్ముడు, ఆ మహాబాహువు, ఆ కమలలోచనుడు రాముడు సీత కనపడనందువల్ల ప్రియావిరహముతో మనస్సు పాడయిపోయి ఆమె అక్కడ లేకపోయినప్పటికీన్నీ, మన్మథ పారవశ్యమువల్ల అక్కడ ఎట్టఎదుట కనపడుతున్నట్లుగానే భావించి గద్గదస్వరముతో; "ఓ ప్రియురాలా! నీవు పూల మక్కువతో పూచిన అశోకచెట్ల కొమ్మలలో దాగుకొని నన్ను ఏడిపిస్తున్నావు.

"ఓ దేవీ! అరటిచెట్లలో దాగుకొన్నా, అరటిబోదెలవంటి నీ రెండు తొడలు నాకు కనపడుతూనే ఉన్నవి. వాటిని దాచుకోవడము నీకు చేతకాలేదు.

"ఓ కల్యాణీ! నీవు కొండగోగుచెట్ల చాటున తిరుగుతున్నావు. నీ పరిహాసము నన్ను బాధపెట్టుతూ ఉంది. ఇక నీ నవ్వులాట చాలించు. ఓ సీతా! నన్ను ఎగతాళి చేస్తే నీకు ఏమి లాభము? ఇటువంటి పరిహాసానికి ఇదివరకు అయితే సంతోషించేవాణ్ణి. ఓ దేవీ! నేను ఇప్పుడు డస్సిపోయి ఉన్నాను. ఇప్పుడు ఇటువంటి పరిహాసాన్ని హర్షించలేను. అందులో ఇక్కడ, ఈ ఆశ్రమపదములో ఇటువంటి పరిహాసము మంచిది కాదు. ఓ ప్రియురాలా! నీవు పరిహాసప్రియవు. నేను ఎరుగుదును. ఓ విశాలాక్షీ! ఇకను ఇక్కడికి రా. నీవు లేనందువల్ల ఈ పర్ణశాల పాడుపడ్డట్టుగా ఉంది.

"ఓ లక్ష్మణా! రాక్షసులు సీతను భక్షించి అయినా ఉంటారు లేదా ఎత్తుకొని పోయి అయినా ఉంటారు. అంతే, నిజముగా అంతే. ఏమి అంటే నేను ఇంత విలపిస్తూ ఉన్నా ఆమె నా దగ్గరకు రాకుండా ఉంది. తమ్ముడా! చూడు, సీతను రాక్షసులు భక్షించినారు అని ఈ జింకల మందలు కన్నీళ్ళు కారుస్తూ నాకు తెలియచెప్పుతున్నవి.

"అయ్యో, ప్రియురాలా! పూజ్యురాలా! నీవు పతివ్రతవే! వరవర్ణినివే! ఎక్కడికి పోయినావు? అయ్యో! నీనుంచి కైకేయీదేవి కోరిక ఈడేరుతుంది కాబోలు! సీతతో కూడా అడవికి వచ్చిన నేను సీత లేకుండా అయోధ్యకు పోగలనా? సీత లేని

శూన్యాంతఃపురములో ఉండగలనా? నేను ఒంటరిగా అయోధ్యకు పోయేటట్టయితే లోకులు నన్ను నిర్వీర్యుడనీ, నిర్దయుడనీ చెప్పుకొంటారు. సీతను రాక్షసులు అపహరించడమువల్ల లోకము నన్ను పిరికివాడు అని అనుకొంటుంది. వనవాసము అయిపోయి అయోధ్యకుపోతే, నన్ను కుశలప్రశ్న చేయడానికి మిథిలాధిపతి జనకమహారాజు వస్తాడు. నేను అప్పుడు ఆయన ముఖము చూడడము ఎట్లా? ఆ విదేహరాజు నన్ను ఒక్కణ్ణీ చూచి, తన కూతురిమీద ప్రేమనుంచి తపించిపోతాడు. మూర్ఛపోతాడు. తప్పదు. అందువల్ల, భరతుడు ఏలే అయోధ్యకు నేను పోనే పోను. అయోధ్యకే కాదు, స్వర్గానికి అయినా పోను. నా వెంట సీత లేకుండా ఉండేటట్లయితే స్వర్గము అయినా నా కంటికి పాడుపడ్డట్లు కనిపిస్తుంది.

"తమ్ముడా! నీవు నన్ను అడవిలో వదలిపెట్టి ఆ చక్కని అయోధ్యకు పో. సీత లేకుండా నేను ఎట్లాగూ బ్రతకను. నీవు భరతుణ్ణి గట్టిగా కౌగిలించుకొని రాముడు అనుమతించినాడు అనీ, రాజ్యము ఏలవలసింది అని నేను చెప్పినాను అనీ వాడితో చెప్పు. నాయనా! మన అమ్మ కైకేయీదేవికీ, మీ అమ్మ సుమిత్రాదేవికీ, మా అమ్మ కౌసల్యాదేవికీ యథాన్యాయముగా నేను నమస్కారము చేసినాను అని చెప్పు. తమ్ముడా! నీవు నేను చెప్పినట్టు చేసేవాడవు కాబట్టి, నీవు మా అమ్మ కౌసల్యాదేవిని ప్రత్యేకముగా కాపాడుతూ ఉండవలెను. ఓ శత్రుకర్శనా! మా అమ్మకు కౌసల్యాదేవికి సీతను గురించీ, నన్ను గురించీ సవిస్తరముగా చెప్పు" అంటూ ఏడ్చినాడు.

సీతాదేవి కనపడనందువల్ల మనోవ్యాకులతతో రాముడు ఆ అడవిలో అట్లా ఏడుస్తూ ఉంటే, లక్ష్మణుడికి భయము వేసింది. ముఖము వివర్ణము అయిపోయింది. మనస్సు వ్యథపడిపోయింది. ఎంతో బాధ పడ్డాడు.

63

అతడు దశరథమహారాజు అంతటివాడి పుత్రుడు. రాజ్యము వదలుకొన్నాడు. అరణ్యవాసము చేస్తున్నాడు. ప్రియురాలితో ఎడబాటు వచ్చింది. ఆ ఎడబాటుకు అతనిలో దుఃఖము పొంగిపొర్లింది. ఆమెను స్మరించడముతో అతనికి మోహము అతిశయించింది. శోకముతో, మోహముతో బాధపడుతూ ఆర్తరూపుడు అయిపోయినాడు. మీదుమిక్కిలి తమ్ముణ్ణి దుఃఖపెడుతూ, తాను మరింత దుఃఖపడసాగినాడు. తనతోపాటు దుఃఖపడుతూ ఉన్న లక్ష్మణుణ్ణి చూచి, తన వ్యసనానికి అనుగుణముగా వేడివేడి నిట్టూర్పులు విడుస్తూ ఏడుస్తూ, "తమ్ముడా! ఈ భూమిమీద నావలె దుష్కృతాలు చేసినవాడు నేను తప్ప మరి ఒకడు ఉండడు అనుకొంటున్నాను. ఏమి అంటే, పరంపరగా దుఃఖముమీద దుఃఖమువచ్చి నా

గుండెలనూ, నా మనస్సునూ భేదిస్తున్నది. నేను పూర్వజన్మలో కావలెను అని అనేకమార్లు పాపకృత్యాలు నిజముగా చేసి ఉంటాను. ఆ నా పాపాలు అన్నీ ఇప్పుడు పరిపాకము అయినవి. అందువల్లనే, నాకు ఇప్పుడు దుఃఖముమీద దుఃఖము వచ్చిపడుతూ ఉంది.

"లక్ష్మణా! నాకు రాజ్యము పోయింది. స్వజనులను అందరినీ వదలిపెట్టి వచ్చినాను. మా అమ్మ కౌసల్యాదేవితో నాకు ఎడబాటు అయింది. మన తండ్రి దశరథమహారాజు చనిపోయినాడు. వీటిని అన్నిటినీ ఒక్కొక్కటే ఆలోచిస్తూ ఉంటే దుఃఖము సముద్రము అలలవలె వచ్చి నన్ను ముంచి వేస్తూ ఉంది. తమ్ముడా! ఈ నిర్జనారణ్యములో సీతతో ఉండడమునుంచి ఇంత దుఃఖమూ నా దేహములో అణిగిపోయింది. ఇప్పుడు సీత ఎడబాటునుంచి హఠాత్తుగా అరణి కట్టెలలోనుంచి అగ్ని ప్రజ్వరిల్లేటట్టు, నాలో అణగిఉన్న దుఃఖాగ్ని ఇప్పుడు రేగింది. దుఃఖాగ్ని జ్వాలలు నన్ను ఇప్పుడు దహించి వేస్తున్నవి.

"తమ్ముడా! నా ప్రియురాలిని ఏ రాక్షసుడో బలవంతముగా ఆకాశానికి ఎత్తుకొనిపోయి ఉంటాడు. ఆ పూజ్యురాలు, భీరువు భయపడి వికృతస్వరముతో పెద్దపెట్టున ఎంతో ఏడ్చి ఉంటుంది. నిజము. నాణ్యము అయిన రక్తచందన చర్చవల్ల ఎర్రగా, కన్నులపండుగగా కనిపించే నా ప్రియురాలి గుండ్రటి స్తనాలు రాక్షసులు భక్షించడానికి కోసి వేస్తే నెత్తురు కారుతూ బురద బురద అయి ఉంటవి. అంతే, అట్లాగే అయి ఉంటవి. ఉంగరాలు తిరిగిన తల వెంట్రుకలతో మనోహరముగా, స్పష్టముగా, మృదువుగా మాట్లాడే నా ప్రియురాలి ముఖబింబము రాక్షసుడి చేతికి చిక్కినందువల్ల, రాహువు కబళించిన చంద్రబింబమువలె అయిపోయి ఉంటుంది. నిశ్చయముగా అంతే. ఎప్పుడూ ఎంతో అందము అయిన హారాలతో అలంకరించుకో వలసిన ఆ సువ్రత కంఠాన్ని, రాక్షసులు ఈ నిర్జనారణ్యములో తెగవేసి నెత్తురు తాగి ఉంటారు.

"లక్ష్మణా! నీవూ, నేనూ లేనందువల్ల ఈ విజనారణ్యములో ఆ మనోహరాయతనేత్రను, నా ప్రియురాలిని సీతను రాక్షసులు లాగుకొనిపోతూఉంటే ఆమె క్షణక్షణమూ అన్నిదిక్కులూ చూస్తూ, లేడివలె అరుస్తూ తప్పకుండా ఏడ్చి ఉంటుంది. తమ్ముడా! ఆమె ఉదారశీల. మనోహరముగా మందహాసముచేస్తూ ఉండేది. ఆ సీత పూర్వము ఈ బండరాతిమీద నాతో కూడా కూర్చొని ఆ యా ఎగతాళి మాటలకు నవ్వుతూ, నిన్ను గురించి ఎన్నో మాటలు చెప్పింది.

"ఈ గోదావరీనది నదులు అన్నిటిలోనూ శ్రేష్ఠము అయింది. ఈ నదిలో స్నానము చేయడానికి నా ప్రియురాలు ఎప్పుడూ ఎంతో సంతోషపడుతూ ఉండేది.

ఆమె ఒకవేళ ఈ గోదావరీనదికి పోయింది ఏమోను అని ఆలోచిస్తున్నాను. ఆమె అట్లా చేసి ఉండదు. నన్ను వదలిపెట్టి ఆమె ఒక్కతే పోదు. ఆమె గోదావరికి పోయి ఉండదు.

"ఆమె పద్మానన. పద్మవిశాలనేత్ర. పద్మాలు కోసి తెచ్చుకోవడానికి ఏమి అయినా పోయింది ఏమో? అట్లా పోయి ఉండదు. నేను లేకుండా పద్మాలు కోసి తెచ్చుకోవడానికి పోదు.

"ఈ అడవిలో విరగపూసినచెట్లమీద నానావిధపక్షులూ మనోహరముగా పాటలు పాడుతూ ఉంటే, ఆమె అక్కడికి పోయింది ఏమో? అట్లా నా ప్రియురాలు చేయదు. ఆమె పిరికిది. పిరికితనము నుంచి ఒంటరిగా పోయి ఉండదు.

"ఓ సూర్యుడా! నీవు ఈ లోకములో జరుగుతున్నవి, జరగపోతున్నవి చూస్తూ ఉంటావు. సమస్త పుణ్యకర్మలకు, పాపకర్మలకు నీవు సాక్షివి. ఆ నా ప్రియురాలు ఎక్కడికి పోయింది? ఎవరు ఎత్తుకొని పోయినారు? చెప్పు. నేను ఇప్పుడు కొత్తగా దుఃఖపడను. నేను ఎప్పుడూ దుఃఖమే అనుభవిస్తున్నాను. ఓ ఆదిత్యుడా! చెప్పు.

"ఓ వాయుదేవుడా! సమస్తలోకాలలోను నీకు తెలియంది ఎప్పుడూ, ఏమీ లేదు. ఆ సత్కుల ప్రసూత నా ప్రియురాలు సీతను రాక్షసులు ఎత్తుకొనిపోయినారో, ఎత్తుకొనిపోతూ ఉంటే దారిలోనే ఉందో, కాక చనిపోయిందో, చెప్పు" అంటూ ఏడ్చినాడు.

ఇట్లా విలపిస్తూ శోకపారవశ్యముతో దేహము స్వాధీనము తప్పిపోయి విసంజ్ఞుడు అయిపోతూ ఉన్న రాముణ్ణి చూచి ఆ మహాధైర్యవంతుడు, ఆ యుక్తాయుక్త వివేచనాపరుడు లక్ష్మణుడు సమయోచితముగా, "ఓ పూజ్యుడా! నీవు దుఃఖపడవద్దు. ధైర్యాన్ని అవలంబించు. సీతాదేవిని వెతకడానికి ఉత్సాహముతో లేవవలసింది. ఈ లోకములో ఉత్సాహవంతులు ఎటువంటి దుష్కర కార్యాలను అయినా చేయకలరు. ఉత్సాహవంతులు ఎన్నడూ చెడరు" అని చెప్పినాడు.

ఆ మహాపౌరుషవంతుడు లక్ష్మణుడు అట్లా చెప్పుతూ ఉంటే, ఆ రఘువంశవర్ధనుడు రాముడు ఆ మాటలు వినిపించుకోలేదు. అతడు ధైర్యము కోల్పోయినాడు. అతనికి మళ్ళీ దుఃఖము వచ్చింది.

64

రాముడు దీనుడు అయిపోయినాడు. దైన్యముతో లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! సీత కమలాలు తెచ్చుకోవడానికి గోదావరికి పోయి ఉంటుంది. నీవు వెంటనే అక్కడికి పోయి వెతుకు" అని చెప్పినాడు.

అంతట ఆ శత్రుసంహారకుడు లక్ష్మణుడు అమితవేగముతో రమణీయము అయిన గోదావరీనదీతీరానికి పోయినాడు. రేవులు అన్నీ వెతికి చూచినాడు. తిరిగివచ్చి, "రామా! గోదావరి రేవులు అన్నీ చూచినాను. అక్కడ సీతాదేవి కనపడలేదు. పెద్ద గొంతుతో ఆమెను పిలిచినాను. జవాబు లేదు. మన కష్టాలు పోకొట్టే ఆ సీతాదేవి ఎక్కడికి పోయిందో, ఇప్పుడు ఎక్కడ ఉందో నాకు తోచడము లేదు" అని చెప్పినాడు.

ఈ మాటలకు రాముడు దుఃఖపరవశుడు అయిపోయినాడు. స్వయముగా గోదావరికి బయలుదేరినాడు. నది దగ్గరకు పోయి, "ఓ గోదావరీ! సీత ఎక్కడ ఉంది?" అని ప్రశ్నించినాడు. ఆ గోదావరీనది మాట్లాడలేదు. 'రావణాసురుడు ఎత్తుకొని పోయినాడు' అని ఆ గోదావరీనదికాని, భూతాలుకాని చెప్పలేదు. అయితే, ఆ యా భూతాలు తమకుగాను గోదావరీనదిని చెప్పవలసిందని ప్రోత్సహించినవి. అట్లా ఆ భూతాలు అన్నీ పురికొల్పుతూ ఉన్నా, రాముడు అట్లా దుఃఖపరవశుడు అయి అడుగుతూ ఉన్నా ఆ గోదావరీనది సీతాదేవిని గురించి ఏమీ చెప్పనేలేదు. ఆ గోదావరి ఆ దురాత్ముడి భయంకరాకారాన్నీ, వాడి క్రూరకృత్యాన్నీ తలచుకొని భయపడిపోయింది. అందువల్లనే, ఏమీ చెప్పకుండా మెదలకుండా ఊరక ఉంది.

సీతాదేవి జాడ తెలియనందువల్ల రాముడు కృశించిపోతున్నాడు. గోదావరీనది చెప్పుతుంది అనే ఆశ నిరాశ అయిపోయింది. అంతట లక్ష్మణుడితో, "తమ్ముడా! నీవు మంచివాడవు. ఈ గోదావరీనది చూచాయగా అయినా వైదేహిని గురించి చెప్పలేదు. వనవాసము గడువుకాలము సమీపిస్తున్నది. సీత లేకుండా నేను అయోధ్యకు ఏమి అని పోయేది? మా అమ్మ కౌసల్యాదేవికికాని, జనకమహారాజుకుకాని ఈ అప్రియము ఏమి అని చెప్పేది? రాజ్యము వదలుకొని నేను ఈ మహారణ్యానికి వస్తూ ఉంటే, తానూ నా వెంట వచ్చి నాతోపాటు వన్యపదార్థాలు తింటూ, బ్రతుకుతూ నా సమస్త దుఃఖాలూ పోగొట్టిన ఆ వైదేహి ఇప్పుడు ఎక్కడికి పోయింది?

"ఆ జనకరాజపుత్రి, వెంటవుండడమునుంచే బంధువర్గాన్ని అంతా వదలుకొని వచ్చినా, ఏ కష్టమూ లెక్కచేయకుండా నేను కాలము గడిపినాను. ఇప్పుడు ఆమె లేకుండా నేను నిద్రపోగలనా? నాకు ఇక ఒక్కొక్కరాత్రి ఒక్కొక్క యుగముగా ఉంటుంది అనుకొంటున్నాను.

"లక్ష్మణా! సీత కనపడేటట్టయితే నేను ఈ గోదావరీతీరములోను, ఈ జనస్థానములోను, ఈ ప్రస్రవణపర్వతముమీదను, ఇంకా ఇక్కడ ఉన్న రమణీయ ప్రదేశాలలోను విహరిస్తాను.

"ఓ వీరుడా! ఇవిగో, ఈ మృగాలు నన్ను పదే పదే చూస్తున్నవి. ఇవి నాకు ఏమో చెప్పవలెను అనుకొన్నట్టు వీటి ఇంగితాలవల్ల నాకు తోస్తున్నది" అంటూ పెద్దపులివంటి రాముడు కన్నీళ్ళు కారుస్తూ ఆ మృగాలను చూచి, "సీత ఎక్కడ ఉంది" అని ప్రశ్నించినాడు.

రాముడు అట్లా అడుగగానే ఆ మృగాలు అన్నీ గబుక్కున పైకి ఎగిరి దక్షిణాభిముఖము అయి ఆకాశాన్ని చూపిస్తూ, ఆ మైథిలిని ఎత్తుకొని పోయిన మార్గాన్ని పట్టి నేలమీద పరుగులు ఎత్తుతూ, వెనకకు తిరిగి రాముడివంక చూడసాగినవి. ఆ మృగాలు అట్లా ఆకాశమార్గాన్నిపట్టి భూమిని చూచుకొంటూ పరుగెత్తుతూ ఉంటే, వాటి చేష్టలనుపట్టి అవి మాట్లాడినట్టే వాటి అభిప్రాయము లక్ష్మణుడు కనిపెట్టినాడు. అంతట ఆ బుద్ధిమంతుడు ఆర్తుడు అయిపోయి, "ఓ ప్రభూ! నీవు సీత ఎక్కడికి పోయింది అని మృగాలను అడిగినావు. వెంటనే ఈ మృగాలు పైకి ఎగిరి, భూమిమీద దక్షిణదిక్కు చూపిస్తున్నవి. బాగుంది. మనము ఇప్పుడు రాక్షసులు ఉండే నైర్‌ృతి దిక్కుగా పోదాము. ఏది అయినా ఆమె జాడ తెలిస్తే తెలుస్తుంది. ఒకవేళ ఆ పూజ్యురాలు కనపడితేనూ కనపడవచ్చును" అని చెప్పినాడు.

ఆ కాంతిమంతుడు రాముడు "మంచిదేను" అంటూ లక్ష్మణుణ్ణి వెంటపెట్టుకొని నేలవంక చూస్తూ, అన్యోన్యము మాట్లాడుకొంటూ దక్షిణదిక్కుగా కొంతదూరము నడచినాడు. అక్కడ నేలమీద దారిలో పడి ఉన్న పూలను ఉభయులూ చూచినారు. వాన కురిసినట్టుగా నేలమీద పడి ఉన్న ఆ పూలను చూచీ చూడముతో రాముడు దుఃఖపడి పోయినాడు. లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! ఇక్కడ ఈ నేలమీద పడి వున్న ఈ పూలు ఎవరివో నీకు తెలుసునా? నాకు తెలుసును. నేనే ఈ పూలను కోసితెచ్చి సీతకు ఇచ్చినాను. ఆమె అవి తలలో ముడుచుకొన్నది. ఇక్కడ పడిపోయినవి. వాడిపోకుండా సూర్యుడు, ఎగరకొట్టకుండా వాయుదేవుడు, వాటిని పెట్టుకొని మహాయశస్విని అయిన ఈ భూదేవి నాకోసము ఈ పూలను కాపాడుతున్నారు అనుకొంటున్నాను" అని చెప్పి ఆ పురుషర్షభుడు, ఆ ధర్మాత్ముడు రాముడు సెలయేళ్ళకు పుట్టినిల్లు అయిన ప్రస్రవణపర్వతాన్ని చూచి, "ఓ పర్వతనాథుడా! నేను వదలిపెట్టిపోయిన ఆ సర్వాంగ సుందరిని సీతను నీవు ఈ మహారణ్యములో చూచినావా లేదా, చెప్పు" అని అడిగినాడు.

ఆ కొండ పలకలేదు. రాముడు క్రుద్ధుడు అయిపోయినాడు. సింహము అల్పమృగముతోవలె రాముడు ఆ కొండతో, "ఓ పర్వతమా! బంగారువన్నెతో బంగారుబొమ్మవంటి నా సీతను చూపించు లేదా నీ సానువులను అన్నిటినీ ధ్వంసము చేసివేస్తాను" అన్నాడు. ఆ కొండ ఏదో ప్రతిధ్వనించిందేకాని మైథిలిని గురించి

చెప్పడముకాని, చూపించడముకాని చేయలేదు. అంతట రాముడు ఆ కొండతో, "ఓ శిలోచ్ఛ్రయమా! నిన్ను ఇప్పుడు నా బాణాగ్నితో దహించి వేస్తాను. నీవు భస్మము అయిపోతావు. తరులతాదులుకాని, చివరకు ఇంత పచ్చికకాని ఇక్కడ లేకుండా చేసివేస్తాను. అప్పుడు నిన్ను ఎవరూ సేవించరు" అని చెప్పి లక్ష్మణుడి వంక చూచి, "తమ్ముడా! ఆ పూజ్యురాలు, ఆ చంద్రనిభానన నా ప్రియురాలు సీత ఎక్కడ ఉందీ చెప్పకపోయేటట్లయితే ఈ నదిని ఎండకొట్టుతాను'' అంటూ క్రుద్ధుడు అయిపోయినాడు. కంటితో దహించివేసేవాడివలె నేలవంక చూచినాడు.

అప్పుడు ఆ నేలమీద బయటికి వెళ్ళుకొని వచ్చినట్టుగా రాక్షసుడి పెద్దపెద్ద అడుగులూ, ఆ రాక్షసుడు తరుముతూ ఉంటే భయపడి రాముడి కోసము అటూ ఇటూ పరుగులు ఎత్తుతూ సీతాదేవి వేసిన అడుగులూ కనిపించినవి.

రాముడు ఆ రాక్షసుడి అడుగులను, సీతాదేవి అడుగులను చూచినాడు. అక్కడ విరిగి పడి ఉన్న ధనుస్సును, అమ్ముల పొదులను, ముక్కలు ముక్కలు అయిపోయిన రథాన్ని చూచినాడు. సంభ్రాంతచిత్తుడు అయిపోయినాడు. తనను ఎప్పుడూ సంతోషపెట్టే తమ్ముడితో, "సౌమిత్రీ! చూడు, వైదేహి ఆభరణాలనుంచి బంగారు తునకలు నేలమీద రాలినవి. ఆమె పెట్టుకొన్న రకరకాల పూలదండలు ఇక్కడ, ఈ నేలమీద చెల్లాచెదురుగా పడి ఉన్నవి. ఈ నేల అంతటా బంగారు బిందువులతో సమానము అయిన రక్తబిందువులు ఆవరించినవి, చూడు.

"లక్ష్మణా! కామరూపులు అయిన రాక్షసులు సీతను ముక్కలు ముక్కలుగా నరికి పంచుకొని తిని అయినా ఉంటారు లేదా ఆ వైదేహి కోసము ఇద్దరు రాక్షసులు వివాదపడి ఇద్దరున్నూ ఇక్కడ ఘోరముగా పోట్లాడుకొని అయినా ఉంటారు.

"తమ్ముడా! రత్నాలు, ముత్యాలు పొదిగి బంగారముతో అలంకరించిన పెద్ద ధనుస్సు విరిగి నేలమీద పడి వుంది. ఇది ఎవరిది అయి ఉంటుంది? వైడూర్యమణులు పొదిగి బాలసూర్యప్రభలతో ధగధగలాడుతూ ఉన్న కవచము తెగి నేలమీద పడి వుంది. ఇది ఎవరిది అయి ఉంటుంది? నూరు కమ్ములతోను, శ్రేష్ఠము అయిన పూలదండలతోను ఉన్న ఈ ఛత్రము దండము విరిగి నేలమీద పడి వుంది. ఇది ఎవరిది అయి ఉంటుంది? బంగారు తాళ్ళతో, భయంకర రూపాలతో, మహాకాయాలతో, పిశాచముఖాలతో ఉన్న ఈ కంచరగాడిదలు యుద్ధములో చచ్చి నేలకూలినవి. ఇవి ఎవరివి అయి ఉంటవి? యుద్ధము కోసము ఎత్తిన టెక్కెము విరిగిపోయిన్నీ, యుద్ధ రథము పగిలిపోయిన్నీ భగభగమండుతున్న అగ్నిహోత్రమువలె తేజరిల్లుతూ ఉన్నవి. ఇవి ఎవరివి అయి ఉంటవి? బంగారముతో అలంకరించి మొనలు పోయిన పొడుగాటి (నాలుగువందల అంగుళాల పొడుగాటి) బాణాలు నేల

అంతటా వెదజల్లినట్టుగా ఉన్నవి. ఇవి అన్నీ ఏ భయంకరకర్ముడివి అయి ఉంటవి? లక్ష్మణా! బాణాలతో నిండి ఉన్న అమ్ముల పొదులు రెండూ నుగ్గు నుగ్గు అయిపోయినవి. మునికోలా, పగ్గాలూ చేతితో పట్టుకొని చచ్చి పడి ఉన్న వీడు ఎవడి సారథి అయి ఉంటాడు? యుద్ధములో చచ్చి తలగుడ్డలతోను, మణికుండలాలతోను పడి ఉన్న ఈ ఇద్దరూ ఎవడి చామరగ్రాహులు అయి ఉంటారు? ఈ పోకడ ఎవడిదో ఒక రాక్షసుడిది అయి ఉంటుంది. సందేహములేదు. ఇప్పుడు రాక్షసులతో వైరము నాకు నూరింతలు అయ్యింది. ఇక రాక్షసుల అందరి ప్రాణము తీసివేస్తాను, చూడు.

"తమ్ముడా! తపించిపోయిన ఆ సీతను కామరూపులు, ఘోరహృదయులు అయిన ఆ రాక్షసులు ఎత్తుకొనిపోయి ఉంటారు లేదా భక్షించి ఉంటారు. కాక, ఆమె చనిపోయి అయినా ఉంటుంది. తమ్ముడా! ఆపత్కాలములో ధర్మము కాపాడుతుంది అంటారే! ఈ ఘోరారణ్యములో సీతను ధర్మము కాపాడలేదు. రాక్షసులు సీతను ఎత్తుకొని పోవడమో, భక్షించి వేయడమో చేసివేసినారు. ఇకను ఈ లోకములో ఏ దేవతలు, ఏమి చేసి నన్ను ఏమి సంతోషపెట్టుతారు? వారికి ఏమి శక్తి ఉంది?

"లక్ష్మణా! ఎటువంటి శూరుడు అయినా, ఈ లోకాలను అన్నిటినీ సృష్టించేవాడు అయినా దయాపరుడుగా ఉండేటట్లయితే, సర్వప్రాణికోటీ అజ్ఞానమువల్ల వాణ్ణి అవమానిస్తుంది. నేను లోకహితార్థిని అయి, జితేంద్రియుణ్ణి అయి దయాపరత్వముతో మెత్తగా ఉండడమునుంచి దేవతలు నన్ను నిర్వీర్యుణ్ణిగా తలచినారు, అంతే! నేను గుణవంతుణ్ణిగా ఉండడముకూడా ఒక దోషము అయింది. చంద్రుడి వెన్నెలను సంహరించి సూర్యుడు తన తేజముతో ఈలోకాన్ని అంతా తాపము ఎత్తించేటట్టు, నా కారుణ్యాదిగుణాలను అన్నిటినీ పోను అణచి సమస్తభూతాలను, సమస్తరాక్షసులను నాశనముచేసివేయడానికి నా తేజము చూపిస్తాను.

"లక్ష్మణా! ఇకను యక్షులనుకాని, గంధర్వులనుకాని, పిశాచాలనుకాని, రాక్షసులనుకాని సుఖముగా ఉండనీయను. తమ్ముడా! నా అస్త్రాలతో, నా బాణాలతో ఈ జగత్తును అంతా నింపివేస్తాను. ఆకాశము కనపడకుండా చేసివేస్తాను. ముల్లోకాలలోను ఏ ఒక్కడూ తిరుగడానికి వీలుకాకుండా చేసివేస్తాను.

"గ్రహగణాల సంచారాన్ని నిరోధిస్తాను. చంద్రుణ్ణి కదలనీయను. అగ్నిని, జలాన్ని, వాయువును, సూర్యుణ్ణి కనపడనీయను. పర్వతాగ్రాలను పడకొట్టుతాను. తరులతాగుల్మాదులను ధ్వంసము చేసివేస్తాను. జలాశయాలను ఎండకొట్టుతాను. సముద్రాన్ని రూపుమాపుతాను. ముల్లోకాలను నిర్మూలనము చేసివేస్తాను. ఓ సౌమిత్రీ! దేవతలు సీత క్షేమము ఆలోచించలేదు. ఆమెను సురక్షితముగా నాకు ఒప్పగించలేదు. వారు ఇప్పుడే నా పరాక్రమాన్ని చూస్తారు. నేను నా వింటి

అల్లెత్రాటిని లాగి వదలే బాణాలు ఆకాశాన్ని నిరవకాశము చేసివేస్తవి. దేవతల విమాన సంచారాన్ని అరికట్టుతాను. సమస్తభూతాలను ఎగురనీయకుండా చేస్తాను.

"లక్ష్మణా! నా బాణాల బాధకు మృగాలు, పక్షులు భ్రాంతిపడిపోతవి. చచ్చిపోతవి. జగత్తు అంతా వ్యాకులపడిపోయేటట్టు చేస్తాను. అంతా తారుమారు అయిపోయేటట్టు చేస్తాను. అడ్డగించను అలవికాని బాణాలను ఆకర్ణాంతమూ లాగి వదలి సీత నిమిత్తము జీవలోకములో రాక్షసులను, పిశాచాలను రూపుమాపుతాను. నేను కోపముతో వదలే బాణాలు ఎంత బలముతో, ఎంత దూరము పోతవో దేవతలు ఇప్పుడే చూస్తారు. నా కోపానికి ముల్లోకాలు నాశనము అయిపోతవి. ఇకను దేవతలు ఉండరు. దైతేయులు ఉండరు. రాక్షసులు ఉండరు. పిశాచాలు ఉండవు. దేవ, దానవ, యక్ష, రాక్షస లోకాలను ముక్కలు ముక్కలు చేసివేస్తాను.

"ఓ లక్ష్మణా! రాక్షసులు ఎత్తుకొనిపోయిన సీతనుకాని, చచ్చిపోయిన సీతనుకాని దేవతలు నాకు తెచ్చియివ్వకపోయేటట్లయితే, ఈ లోకాలను అన్నిటినీ అల్లకల్లోలము చేసివేస్తాను. చరాచరము అయిన ముల్లోకాలను, ముల్లోకాలనే కాదు, ఈ జగత్తును అంతా నాశనము చేసివేస్తాను" అంటూ, రాముడు రోషతామ్రాక్షుడు అయిపోయినాడు. ధనుస్సు పట్టుకొన్నాడు. భగభగ మంటలు మండుతూ క్రూర విషసర్పమువలె భయంకరము అయిన బాణాన్ని ఆ వింటికి ఎక్కించినాడు. అంతట ఆ కాంతిమంతుడు. ఆ పరపురంజయుడు రాముడు ప్రళయకాలాగ్నివలె తేజరిల్లుతూ, "లక్ష్మణా! ఈలోకములో సమస్తప్రాణికోటికిన్నీ మృత్యువు, ముసలితనము, కాలము, అదృష్టము అనివార్యాలు. వాటిని ఎవడూ నిగ్రహించలేడు. తప్పించుకోలేడు. అదేవిధముగా నేను క్రుద్ధుణ్ణి అయినప్పుడు నన్ను ఎవడూ నిగ్రహించలేడు. తప్పించుకోలేడు. ఆ పతివ్రతను, ఆ మైథిలిని సీతను ఇదివరకు ఉన్నట్టుగా ఇప్పుడు దేవతలు తీసుకొని వచ్చి నాకు ఇవ్వవలెను. అట్లా వారు చేయకపోయేటట్లయితే ఈ జగత్తును అంతా నాశనము చేసివేస్తాను" అన్నాడు.

65

లక్ష్మణుడు రాముని ఓదార్చుట

సీతాదేవి కనపడకుండాపోయినందువల్ల రాముడు దుఃఖముతో కృశించిపోతూ, తపించిపోతూ ప్రళయకాలాగ్నివలె సమస్తలోకాలను నాశనము చేసివేయడానికి ఉద్యుక్తుడు అయినాడు. చేతిలో ఉన్న ధనుస్సును పరిశీలిస్తూ, అల్లెత్రాటిని మ్రోగిస్తూ, మాటిమాటికీ నిట్టూర్పులు విడుస్తూ, యుగాంతకాలాన రుద్రుడివలె ఈ జగత్తును అంతా దగ్ధము చేసివేయడానికి భయంకరాకారుడు అయినాడు.

రాముడికి అంత కోపము రావడముకానీ, అతడు అంత భయంకరాకారుడు కావడముకానీ లక్ష్మణుడు అదివరకు ఎన్నడూ చూచియుండలేదు. అందువల్ల, అతడు భయపడిపోయినాడు. అతనికి దుఃఖము వచ్చింది. నోరు ఎండిపోయింది. అంతట అతడు చేతులు జోడించి రాముణ్ణి చూచి, "ఓ ప్రభూ! నీవు జితేంద్రియుడవు. సమస్తప్రాణికోటికీ మేలుచేయడమే ఇంతవరకూ పనిగా పెట్టుకొన్నావు. నీవు జన్మతః మృదుస్వభావుడవు. ఇప్పుడు కోపపారవశ్యమువల్ల నీవు నీ నైజస్వభావాన్ని వదలిపెట్టి ఇంత భయంకరాకారము ధరించడము అనుచితము. చంద్రుడికి చల్లని వెన్నెల కాంతులు, సూర్యుడికి కన్నులు మిరుమిట్లు కొలిపే తీవ్రకాంతులు, వాయువుకు ప్రపంచము అంతా సంచారముచేసే స్వభావము, భూమికి క్షమాగుణము ఇట్లా ఒక్కొక్కరికి ఒక్కొక్క ప్రత్యేక గుణమే ఉంది. ఇటువంటి అన్నిగుణాలు అసదృశముగా మూర్తీభవించిన పరమయశస్వివి నీవు. ఇప్పుడు ఒక్కడి అపరాధము కోసము సమస్తలోకాలలో నిరపరాధులను అందరినీ సంహారముచేయ తలపెట్టడము అసమంజసము.

"ఓ రామా! ఆయుధాలతోను, ఇంకా ఇతర యుద్ధోపకరణాలతోను ముక్కలు ముక్కలుగా నేలమీదపడి ఉన్న ఈ రథము ఎవడిదో, ఎవడు దీనిని ఇట్లా పగలకొట్టినాడో, ఎందుకు పగలకొట్టినాడో మనకు బోధపడలేదు. కంచరగాడిదల గిట్టలు, రథచక్రాల అరవడులు మాత్రమే మనకు నేలమీద కనపడుతున్నవి. రక్తబిందువులతో ఈ ప్రదేశము అంతా పరమభయంకరముగా ఉంది. ఇక్కడ ఇంతకు మునుపు పెద్దపోరాటము సాగింది అనుకోక తప్పదు.

"రామా! నీవు ఏ విషయము అయినా ఊహించి చెప్పేవాండ్లలో శ్రేష్ఠుడవు. ఇక్కడ జరిగిన పోరాటములో ఒక్కడే రథముమీద ఉన్నాడు. మరి ఒకడు రథముమీద రాలేదు. అంతేకాదు, ఒక మహాసైన్యము వచ్చిన ఆనవాళ్ళు అయినా ఇక్కడ కనిపించడములేదు. అందువల్ల, ఒక్కడు చేసిన పనికి లోకాలను అన్నిటినీ నాశనము చేయ తలపెట్టడము అన్యాయము. రాజులు తప్పిదానికి తగిన శిక్షనే విధిస్తారు. వారు ప్రశాంతచిత్తులుగాను, మృదుస్వభావులుగాను ఉంటారు. నీవు రాజులవంటి వాడవు మాత్రమేకాదు, సమస్తప్రాణకోటికీ శరణ్యుడవు, పరమగతివి.

"ఓ రామా! నీ భార్యను అపహరించడము మంచిది అని ఎవడూ అనడు. యజ్ఞదీక్షితుణ్ణి ఋత్విజులు మోసము చేయరు. అట్లా చేసేటట్లయితే యజ్ఞము విఘ్నము అయిపోయి, వారే నాశనము అయిపోతారు. ఆ భయమునుంచి ఋత్విజులు ఎన్నడూ యజ్ఞదీక్షితుడికి అపకారము చేయరు. అదేవిధముగ నదులు, సముద్రాలు, పర్వతాలు, దేవతలు, గంధర్వులు నీకు ఎన్నడూ అప్రియము చేయరు. నీవు లోకరక్షకుడవు అనే సంగతి అందరికీ తెలుసు.

"ఓ ప్రభూ! సీతాదేవిని ఎవడు ఎత్తుకుపోయినాడో వాణ్ణి నీవు వెదకవలెను. నేను చేతిలో విల్లూ, అంబులూ పట్టుకొని నీవెంట వస్తాను. ఈ దండకారణ్యములో ఉంటూ ఉన్న మహర్షులు అందరూ మనకు తోడుగా మనవెంట వస్తారు. ఆ దురాత్ముణ్ణి వెదకి పట్టుకొందాము. వివిధారణ్యాలలోను వెతుకుదాము. పర్వతాల లోను, భయంకరము అయిన పర్వతగుహలలోను శోధించుదాము. నదులు వెతుకుదాము. తామరకొలనులు వెతుకుదాము. సముద్రాలు వెతుకుదాము. అత్యంత జాగ్రత్తతో దేవ గంధర్వలోకాలు వెతుకుదాము. సీతాదేవిని ఎత్తుకొని పోయినవాడు దొరికేటంతవరకూ వెతుకుదాము.

"ఓ కోసలేంద్రా! సామోపాయము అవలంబించుదాము. నయవినయాలతో చెప్పుదాము. నీ సచ్ఛీలానికి దేవతలు నీ భార్యను నీకు ఇవ్వకపోయేటట్లయితే, అప్పుడు నీవు దేవేంద్రుడి వజ్రాయుధముతో సరిసమానము అయిన నీ బంగారు ములుకుల బాణాలతో ఈ జగత్తును అంతా నాశనముచేసి వేయవచ్చును" అని లక్ష్మణుడు చెప్పినాడు.

66

దుఃఖముతో అట్లా తపించిపోతూ, అనాథుడివలె విలపిస్తూ, మహామోహముతో బాధపడుతూ, ఏడుస్తూ, తెలివితప్పిపోతూ ఉన్న రాముణ్ణి సుమిత్రాపుత్రుడు లక్ష్మణుడు కొంచెముసేపు ఊరడించి ఆ మహానుభావుడి కాళ్ళు పిసుకుతూ, "ఓ రామా! దశరథమహారాజు గొప్ప తపస్సు చేస్తే, మహాగొప్ప యజ్ఞాలు చేస్తే దేవతలకు అమృతము దొరికినట్లుగా నీవు ఆయనకు పుట్టినావు. ఆ మహానుభావుడు నీ సద్గుణాలకు బద్ధుడు అయిపోయి, నీ ఎడబాటుకు తాళలేక స్వర్గతుడు అయినాడు అని భరతుడు మనకు చెప్పినాడు.

"ఓ రామా! నీవు మహామహులు పుట్టిన కాకుత్థ్సవంశములో పుట్టినావు. ఇప్పుడు సంప్రాప్తము అయిన ఈ దుఃఖాన్ని నీవే సహించలేకపోయేటట్లయితే ఒక సామాన్యుడూ, అల్పబలుడూ అయినవాడు ఏమి సహిస్తాడు? ఓ నరశార్దూలమా! ఈ దుఃఖమునుంచి నీవు నీ పరాక్రమముతో ఈ ప్రపంచాన్ని అంతా దహించివేసే టట్లయితే, ప్రజలు అందరూ ఆర్తులు అయిపోయిన తరువాత నీవు వారిని సుఖపెట్టేది ఏమిటి? సంతోషపెట్టేది ఏమిటి? నహుషుడి పుత్రుడు యయాతి స్వర్గానికిపోతే దేవేంద్రుడు అసూయతో, 'నీ రాజ్యములో శ్రేష్ఠుడు ఎవడు' అని ప్రశ్నించినాడు. యయాతి యథార్థము చెప్పతలచుకొని, 'నేనే శ్రేష్ఠుడను' అని చెప్పినాడు. అంతట దేవేంద్రుడు, 'నీవు ఆత్మశ్లాఘపరాయణుడవు. నీవు స్వర్గములో ఉండడానికి

వీలులేదు' అని స్వర్గమునుంచి కిందికి పడదోసినాడు. అంతట యయాతి భూమి మీదపడి దుఃఖాలపాలు అయినాడు.

"వశిష్ఠమహర్షి బ్రహ్మవేత్తలలో అగ్రగణ్యుడు. మహామంత్రవేత్త. మనకు పురోహితుడు. ఆయన నూర్గురు పుత్రులు విశ్వామిత్రుడు శాపము పెట్టినందువల్ల ఒక్కనాడు, ఒక్క సమయాన చనిపోయినారు.

"సూర్యచంద్రులు ఇద్దరూ ఈ జగత్తుకు రెండు కన్నులు. వారు ధర్మస్వరూపులు. మహాబలవంతులు. సమస్తలోకాల స్వరూప స్థితి ప్రవృత్తులకు కారకులు. వారికి ఉభయులకూ గ్రహణాలు వస్తూ ఉంటవి. ఈ జగత్తు అంతా నమస్కారముచేసే తల్లివంటి భూదేవికిన్నీ స్థిమితము లేకుండా ఉంది.

"ఓ పురుషపుంగవా! దేవేంద్రుడు మొదలు అయిన దేవతలు కూడా సుఖదుఃఖాలను అనుభవిస్తూ ఉంటారు అని విన్నాము. మహామహాప్రాణులు దేవతలే దైవసంకల్పాన్ని అతిక్రమించలేకుండా ఉంటే, ఇక తక్కిన దేహధారులు అయిన ప్రాణుల సంగతి చెప్పవలసిన పనేలేదు. రామా! నీవు దుఃఖపడవద్దు. వైదేహిని ఎవడో ఎత్తుకొని పోయినా, ఆమె ఒకవేళ చనిపోయినా నీవు దుఃఖపడడము అనుచితము. ఎప్పుడూ యథార్థము చూస్తూ వివేకము కోలుపోని నీబోటివాండ్లు మహాకష్టకాలాలలో కూడా దుఃఖపడరు.

"ఓ పురుషోత్తమా! నీవు నీ బుద్ధితో జాగ్రత్తగా ఆలోచించి చూడు. మహాప్రాజ్ఞులు స్వబుద్ధితో శుభాశుభాలు తెలుసుకొంటారు. పూర్వజన్మలో చేసిన కర్మఫలాన్నే మనము ఇప్పుడు అనుభవిస్తున్నాము. పూర్వము మనము చేసిన కర్మల గుణదోషాలను ఇప్పుడు తెలుసుకోవడము అశక్యము. తెలుసుకొన్నా ప్రయోజనము లేదు. ఆ కర్మఫలము అనుభవించక తప్పదు. అందువల్ల, దుఃఖపడడము నిరర్థకము. రామా! ఈవిషయము నీవే నాకు అనేకవిధాల బోధించినావు. ఇప్పుడు నీకు ఈ విషయము తెలియచెప్పకలవాడు ఎవడు ఉన్నాడు? సాక్షాత్తూ బృహస్పతి అయినా నీకు చెప్పలేడు. నీవు మహాప్రాజ్ఞుడవు. నీ బుద్ధిబలము దేవతలకు సయితము ఉండదు. అయితే, దుఃఖము నుంచి ఇప్పుడు నిద్రపోతున్న నీ జ్ఞానాన్నే నేను మేలుకొలుపుతున్నాను.

"ఓ ప్రభూ! నీవు ఇక్ష్వాకువంశములో పుట్టినావు. ఈ వంశీయులకు కృత్యాకృత్య జ్ఞానము అపారము. అటు స్వర్గములో దేవ గంధర్వాది ప్రాణి వర్గాన్నీ, ఇటు ఈ మానవలోకములో బ్రాహ్మణ క్షత్రియాది ప్రాణి వర్గాన్నీ, సమస్తలోక సంహార సమర్థము అయిన నీ పరాక్రమాన్నీ ఆలోచించి చూడు. శత్రువులు అయినవారిని సంహారము చేయడము సమంజసము. అందువల్ల, శత్రువును

పట్టుకోవడానికి ప్రయత్నము చేయవలెను. ఓ పురుషోత్తమా! సర్వమూ నాశనము చేసివేయడమువల్ల ప్రయోజనము ఏమిటి? ఏ పాపాత్ముడు మన శత్రువో తెలుసుకోవలెను" అని లక్ష్మణుడు చెప్పినాడు.

67

జటాయువు సీత జాడ తెలుపుట

రాముడు పెద్దవాడు అయినప్పటికిన్నీ, చిన్నవాడు లక్ష్మణుడు యుక్తి యుక్తముగా చక్కగా చెప్పిన మాటలను ఆలకించి అంగీకరించినాడు. కోపాన్ని నిగ్రహించినాడు. అంతట బంగారు తాపటము చేసిన ఆ మహాధనుస్సును సల్లించి లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! ఇకను ఇప్పుడు ఏమి చేదాము? ఎక్కడికి పోదాము? సీత ఎక్కడ ఉందో తెలుసుకోనే ఉపాయము ఏదో ఆలోచించు" అన్నాడు.

అప్పుడు లక్ష్మణుడు రాముణ్ణి చూచి, "అన్నా! నానావిధతరులతాదులతో ఎంతో రమణీయముగా ఉంటూ ఉన్న ఈ జనస్థానములో రాక్షసులు అనేకమంది నివసిస్తున్నారు. అందువల్ల, ముందుగా మనము ఈ జనస్థానములోనే సీతను వెతకవలెను. ఈ జనస్థాన పర్వతాలలోనే గుట్టల నడుమను, నానావిధ క్రూరమృగాలు నివసించే భయంకరము అయిన కొండగుహలలోను, ఇంకా ఇతర గుహలలోను, దుర్గమ ప్రదేశాలలోను, ఇక్కడి కిన్నరుల నివాస స్థానాలలోను, గంధర్వుల గృహాలలోను చక్కగా వెతికి చూడవలెను. నేనూ నీ వెంట ఉంటాను. ఓ పురుషపుంగవా! వాయు వేగానికి అచలాలు ఏమాత్రమూ చలించవు. అదేవిధముగా, నీవంటి ధైర్యవంతులు, బుద్ధిబలసంపన్నులు ఎన్ని ఆపదలు వచ్చినా ఏమాత్రమూ చలించరు" అన్నాడు.

అంతట జనస్థాన ప్రాంతము అంతా వెతకడానికి ఉభయులూ బయలు దేరినారు. రాముడు క్రుద్ధుడు అయి భయంకరము అయిన అర్ధచంద్రాకారపు బాణాన్ని వింటికి ఎక్కించి, ఆ జనస్థానారణ్యము అంతా వెతకడానికి లక్ష్మణుణ్ణి వెంటపెట్టుకొని బయలుదేరినాడు.

ఆ అన్నదమ్ములు కొంచెము దూరము పోయినారు. అక్కడ నేలమీద నెత్తురుతో తడిసి ఉన్న పర్వతశిఖరాకారుణ్ణి జటాయువును చూచినారు. అట్లా నేలమీద పడి ఉన్న ఆ జటాయువును చూడగానే రాముడు లక్ష్మణుడితో, "తమ్ముడా! వీడే, ఈ పక్షిరాజే సీతను భక్షించి ఉంటాడు. సందేహము లేదు. వీడు రాక్షసుడు అయి ఉంటాడు. గద్ద రూపముతో ఈ అరణ్యానికి వచ్చి చేరినాడు. ఈ విశాలాక్షిని వైదేహిని తప్పకుండా వీడే తిని ఉంటాడు. అందువల్లనే, హాయిగా నేలమీద పడుకొని ఉన్నాడు. గురితప్పకుండా భయంకరముగా మంటలు మండుతూ పోయే బాణాలతో

ఇప్పుడు వీణ్ణి తెగవేస్తాను" అంటూ అర్ధచంద్రాకార బాణము సంధించి ఉంచిన ఆ ధనుస్సును మ్రోగించి, సముద్రవలయితము అయిన భూభాగాన్ని అంతా గజగజ లాడిస్తూ జటాయువుమీదికి పోయినాడు.

జటాయువు దశరథమహారాజుకు మిత్రుడు. అట్లా తనమీదికి వస్తూ ఉన్న రాముణ్ణి చూచినాడు. నురుగులతో నెత్తురు కక్కుతూ దీనస్వరముతో, "ఓ ఆయుష్మంతుడా! ఈ మహారణ్యములో మూలిక కోసము వెతుకుతూ ఉన్నట్టుగా నీవు వెతుకుతూ ఉన్న ఆ సీతాదేవిని, నా ప్రాణాన్ని, రెంటినీ రావణాసురుడు అపహరించినాడు. నాయనా! నీవూ, లక్ష్మణుడూ లేని సమయములో ఆ మహా బలవంతుడు రావణాసురుడు సీతాదేవిని ఎత్తుకొనిపోతూ ఉంటే నేను చూచినాను. ఆ మైథిలిని విడిపించి తీసుకొని రావడానికి నేను వాడిమీదికి, ఆ రావణాసురుడిమీదికి పోయినాను. వాడితో పోరాడినాను. వాని రథము విరగగొట్టినాను. అదిగో, చూడు. అది నేలమీద పడి ఉంది. వాని ధనుస్సు విరిచివేసినాను. వాడి కవచము ఊడకొట్టినాను. వాడి రథసారధిని నా రెండు రెక్కలతోనూ కొట్టి చంపివేసినాను. చూడు. అడుగో, వాడు నేలమీద పడి ఉన్నాడు. ఆ పోరాటములో నేను అలసిపోయినాను. అప్పుడు ఆ రావణాసురుడు వాడి ఖడ్గముతో నా రెండు రెక్కలను తెగవేసినాడు. అంతట వాడు ఆ వైదేహిని, ఆ సీతాదేవిని ఎత్తుకొని ఆకాశానికి ఎగిరిపోయినాడు. నన్ను ఆ రావణాసురుడు ఇదివరకే చంపివేసినాడు. నేను ఇప్పుడు కొన ఊపిరితో ఉన్నాను. నీవు ఇప్పుడు నన్ను చంపనక్కరలేదు" అని చెప్పినాడు.

ఈమాటలకు రాముడి ముఖము అంతటా కన్నీళ్ళు కమ్ముకొన్నవి. సంతాపము రెండింతలు అయి బాధపడుతూ, సీతను గురించి తెలియ చెప్పినందుకు ఉత్సాహము వచ్చి ఆ జటాయువును కౌగిలించుకొన్నాడు. చేతిలో ఉన్న ధనుస్సును జారవిడిచినాడు. దుఃఖపరవశుడు అయి నేలమీద చతికిలబడి ఏడవసాగినాడు. ఆ దుర్గమారణ్యములో, ఇరుకు అయిన ఆ దారిలో ఒంటరిగా పోరాడి నిట్టూర్పులు విడుస్తూ చావపోతున్న ఆ జటాయువు కోసము ఏడుస్తూ రాముడు లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! రాజ్యము పోయింది. వనవాసములో సీతను కోలుపోయినాను. ఈ జటాయువు చనిపోవడానికి సిద్ధముగా ఉన్నాడు. ఇటువంటి దౌర్భాగ్య స్థితిలో అగ్నిహోత్రుడు అయినా బూడిద అయిపోతాడు. నేను ఇప్పుడు మహాసముద్రములో పడేటట్లయితే, నా దౌర్భాగ్యస్థితినుంచి అన్నినదులకూ ఆశ్రయము అయిన ఆ మహాసముద్రము తప్పకుండా ఎండిపోతుంది. దుఃఖము అనే పెద్ద వలలో పడిపోయినాను. చరాచరము అయిన ఈ జగత్తులో ఇప్పుడు నాకన్నా గొప్ప దౌర్భాగ్యుడు మరి ఒకడు ఉండడు.

'తమ్ముడా! ఈ జటాయువు మన నాయనగారి మిత్రుడు. ముసలివాడు. నా భాగ్యవిపర్యయమునుంచి ఇప్పుడు ఇట్లా ఈ నేలమీద పడి ఉన్నాడు" అంటూ ఏమేమో చెప్పి తన తండ్రివలె ప్రేమతో, గౌరవముతో జటాయువు దేహము అంతా తడవడము మొదలు పెట్టినాడు. రెండు రెక్కలూ తెగిపోయి నెత్తురు కారుతూ ఉన్న ఆ జటాయువును కౌగలించుకొని, "ఓ వృద్ధుడా! నా ప్రాణసమాన అయిన ఆ మైథిలి ఇప్పుడు ఎక్కడ ఉంది" అని అడిగి, పట్టరాని దుఃఖమువచ్చి రాముడు ఆ నేలమీద పడిపోయినాడు.

68

అట్లా నేలమీద పడి ఉన్న జటాయువును రాముడు చూచినాడు. మైత్రినే సంపదగా భావించి తన వెంట వస్తూ ఉన్న తమ్ముడితో, "లక్ష్మణా! ఈ జటాయువు నాకు ఉపకారము చేయడానికి రాక్షసుడిమీదికి పోయినాడు. యుద్ధము చేసినాడు. ఆ రాక్షసుడి చేతిలో హతము అయిపోయినాడు. నా కోసమే ఇంకా ప్రాణము విడువకుండా కనిపెట్టుకొని ఉన్నాడు. ప్రాణము ఇంకా ఉంది. కష్టపడుతున్నాడు. హీనస్వరము పడిపోయింది" అని చెప్పి, "ఓ జటాయువా! చెప్పగల శక్తి ఉంటే చెప్పు. నిన్ను ఆ రాక్షసుడు ఎట్లా వధించినాడో చెప్పు. సీత సంగతి చెప్పు. ఆ రావణాసురుడు సీతను ఎందుకు ఎత్తుకొని పోయినాడు? నేను ఏమి అపరాధము చేసినాను అని వాడు నా ప్రియురాలిని అపహరించినాడు? నేను వాడికి ఏమి అపకారము చేసినాను? ఓ పక్షిరాజా! చంద్రబింబమువలె మనోహరము అయిన నా ప్రియురాలు సీత ముఖబింబము అప్పుడు ఎట్లా ఉంది? ఆమె ఏమి చెప్పింది? ఆ రాక్షసుడు రావణాసురుడు ఎటువంటి పరాక్రమవంతుడు? వాడి ఆకారము ఎట్లా ఉంటుంది? వాడు ఎటువంటి పనులు చేస్తూ ఉంటాడు? వాడి నివాస స్థానము ఎక్కడ? శక్తి ఉంటే చెప్పు" అని అడిగినాడు.

అంతట జటాయువు దీనాత్ముడు అయి సన్నటి గొంతుతో, "రామా! వాడు, ఆ రాక్షసరాజు మాయతో గాలిని రేగకొట్టి, మేఘాలు ఆవరించి చీకట్లు కమ్ముకొనేటట్టు చేసి సీతను ఎత్తుకొని ఆకాశమార్గాన పోయినాడు. నాయనా! నేను ఆ పోరాటములో అలసిపోయినాను. అప్పుడు ఆ రాక్షసుడు నా రెండు రెక్కలు నరికివేసి సీతను ఎత్తుకొని దక్షిణదిశగా పోయినాడు. ఇప్పుడు నా ప్రాణము సుడిపడుతున్నది. నా కన్నులు తిరుగుతున్నవి. బంగారుచెట్లు, వాటిమీద వట్టివేళ్ళవంటి వెంట్రుకలు కనపడుతున్నవి. కాబట్టి, నా ఆయుర్దాయము అయిపోయింది.

"నాయనా, రామా! 'విందము' అనే ముహూర్తములో రావణాసురుడు సీతాదేవిని ఎత్తుకొని పోయినాడు. అది వాడు ఎరుగడు. ఆ ముహూర్తములో

కనపడకుండా పోయే సొమ్ము మళ్ళీ యజమానికి తప్పకుండా దొరుకుతుంది. అందువల్ల, త్వరలోనే సీతాదేవిని నీవు తెచ్చుకొంటావు. జానకిని అపహరించిన ఆ రావణాసురుడు గాలము మింగిన చేపవలె తప్పకుండా చచ్చిపోతాడు. నాయనా! నీవు మైథిలి కోసము దిగులు పడవద్దు. నీవు త్వరలోనే యుద్ధముచేసి ఆ రావణాసురుణ్ణి చంపివేస్తావు. సీతాదేవిని తెచ్చుకొని హాయిగా ఉంటావు" అని చెప్పినాడు.

అట్లా తెలివి తప్పకుండా రాముడితో చెప్తుతూ ఉండగానే, మరణసమయము ఆసన్నము అవుతూ ఉన్నందువల్ల, నోటిలోనుంచి మాంసముతో నెత్తురు కారడము మొదలు పెట్టింది. అప్పుడు మళ్ళీ, "రామా, నాయనా! వాడు, ఆ రావణాసురుడు విశ్రవసుడి పుత్రుడు. కుబేరుడికి సాక్షాత్తూ తమ్ముడు" అన్నాడు. అంతే. రాముడు చేతులు జోడించి, 'చెప్పు, చెప్పు' అంటూనే ఉన్నాడు. జటాయువు శిరము నేలమీదికి ఒరిగిపోయింది. కాళ్ళు వెనుకకు చాచినాడు. పక్కలు ఎగర వేసినాడు. ప్రాణము ఆ దేహాన్ని వదలిపెట్టి ఆకాశములో కలిసిపోయింది.

పర్వతమువలె నేలమీద పడివున్న ఆ జటాయువు కళేబరాన్ని రాముడు చూచినాడు. ఏడ్చి ఏడ్చి అతడి కన్నులు ఎర్రబడిపోయినవి. అంతట అతడు లక్ష్మణుడితో, "సౌమిత్రీ! రాక్షసులకు ఉనికిపట్టు అయిన ఈ దండకారణ్యములో ఈ జటాయువు ఎన్నో సంవత్సరాలనుంచీ సుఖముగా ఉంటూ ఉన్నాడు. చాలా ముసలివాడు అయిపోయినాడు. చిరకాలము సుఖము అనుభవించినాడు. ఈ వయస్సులో ఒక రాక్షసుడితో పోరాడి నేలకూలినాడు. కాలము ముగించుకొని వచ్చింది. కాలాన్ని ఎవడూ అతిక్రమించలేడు. తమ్ముడా! ఈ జటాయువు నాకు ఉపకారము చేయవలెను అనుకొన్నాడు. తన తండ్రి తాతలనాటినుంచి వచ్చిన గద్దలరాజ్యము వదలిపెట్టి, మన వెంటపడి ఇక్కడికి వచ్చినాడు. సీతాదేవిని విడిపించవలెను అని పోరాడినాడు. ప్రాణము కోలుపోయినాడు.

"ఓ సౌమిత్రీ! మృగ పక్షి జాతులలో కూడా ధార్మికులు, సాధువులు, శూరులు, స్నేహపాత్రులు కనబడుతున్నారు. లక్ష్మణా! నీవు పరంతపుడవు, మంచివాడవు. చూడు, రాక్షసుడు సీతను ఎత్తుకొని పోయినాడు అనే దుఃఖముకన్నా ఈ జటాయువు చచ్చిపోయినందుకు నేను ఎంతో ఎక్కువగా దుఃఖపడుతున్నాను. బాధపడుతున్నాను. నా బాధ చెప్పలేను. ఆ శ్రీమంతుడు, ఆ మహాయశుడు దశరథమహారాజువలె ఈ జటాయువు నాకు పూజ్యుడు. మాన్యుడు. నాయనా, లక్ష్మణా! నీవు కట్టెలు తెచ్చిపెట్టవలెను. నాకోసము ఆ భయంకర రాక్షసుడి చేతిలో హతము అయిపోయిన ఈ పక్షిరాజుకు నేనే దహన సంస్కారము చేస్తాను" అని చెప్పినాడు.

అంతట రాముడు, "ఓ మహాబలవంతుడా! ఓ పక్షిరాజా! యజ్ఞశీలురు అందరూ ఏ లోకానికి పోతారో, ఆహితాగ్నులు అందరూ ఏ లోకానికి పోతారో, సన్యాసులు అందరూ ఏ లోకానికి పోతారో, భూదాతలు అందరూ ఏ లోకానికి పోతారో ఆ లోకానికి, ఆ ఉత్తమోత్తమ లోకానికి నీవు పోవలెను అని నేను నీకు యధావిధిగా దహన సంస్కారము చేస్తున్నాను. నీవు ఆ ఉత్తమ లోకానికి పోయి హాయిగా ఉండు" అని చెప్పి భగ భగ మండుతూ ఉన్న చితిమీదికి జటాయువును తన స్వంత బంధువునువలె ఎక్కించి దుఃఖపడిపోయినాడు. అంతట ఆ వీర్యవంతుడు లక్ష్మణుడితో కూడా ఆ మహారణ్యములోకి పోయి కేసరీమృగాలను చంపి తీసుకొనివచ్చినాడు. అందము అయిన పచ్చని పచ్చిక నేలమీద దర్భలు పరచి, ఆ మాంసాన్ని తీసి ముద్దలు ముద్దలుగా చేసి జటాయువుకు పిండప్రదానము చేసినాడు. చనిపోయిన వారు స్వర్గానికి పోయేటందుకు బ్రాహ్మణులు చెప్పే పితృదేవతాకము అయిన మంత్రాలను అన్నిటినీ ఆ జటాయువు కోసము రాముడు జపము చేసినాడు. అప్పుడు ఆ అన్నదమ్ములు ఉభయులూ ఆ జటాయువుకు జలతర్పణాలు వదలడానికి గోదావరీనదికి పోయినారు. యధాశాస్త్రముగా ఆ గోదావరీనదిలో స్నానముచేసి ఆ గోదావరీ పావనోదకాలతో జటాయువుకు జలతర్పణాలు వదలినారు.

ఆ పక్షిరాజు ఒక పతివ్రత కోసము ఏ ఆయుధమూ లేకుండా స్వశక్తితో పోరాడినాడు. ఆ వయస్సులో ఎవడూ చేయను అలవికాని పని చేసినాడు. ఆ యుద్ధములో చనిపోయినాడు. మహర్షి అంతటి రాముడు అతనికి దహన సంస్కారము చేసినాడు. అందువల్ల, ఆ జటాయువు అప్పటికి అప్పుడు పుణ్యలోకానికి పోయినాడు. అటువంటి దుష్కర కార్యముచేసి జటాయువు ఈలోకములో మహాయశస్వి అయినాడు.

రామలక్ష్మణులు ఆ జటాయువుకు పిండోదకాలు వదలి, ఆ పక్షిరాజు చెప్పినట్టు పోయి సీతాదేవిని కలుసుకోవడానికి స్థిరచిత్తముతో మహావిష్ణువు, దేవేంద్రుడువలె అరణ్యములోనుంచి బయలుదేరినారు.

69

కబంధుడు రామలక్ష్మణులను పట్టుకొనుట

రామలక్ష్మణులు శరచాపఖడ్గాలు ధరించి సీతాదేవిని వెతుకుతూ ఆ దండకారణ్యములో నైరుతి దిక్కుగా నడువసాగినారు. అదివరకు ఎవరూ ఆ దారిన నడచిన జాడలు ఏవీ వారికి కనిపించలేదు. నానావిధవృక్షలతాగుల్మాదులు అంతటా ఆవరించి చొరను అలవికాకుండానూ, సింహాలు పెద్దపులులు మొదలు అయిన క్రూరమృగాలు, కొండచిలువలు మొదలు అయిన దుష్టసర్పాలు యధేష్టముగా

సంచారముచేస్తూనూ ఆ ప్రాంతము అంతా మహాభయంకరముగా ఉంది. ఆ మహాబలవంతులు అమితవేగముతో ఆ ప్రాంతములో దండకారణ్యము దాటి అవతలికి పోయినారు.

ఆ మహాతేజోవంతులు అట్లా జనస్థానమునుంచి మూడు క్రోసులు దూరము నడిచి క్రౌంచారణ్యము ప్రవేశించినారు. రంగురంగుమబ్బులవలె రకరకాల మహోన్నత వృక్షాలు చిత్రవిచిత్రముగాను; వన్నెవన్నెలపూలతో కళకళలాడుతూను, నానావిధ పక్షిగణాలతోను, వివిధవిషసర్పాలతోను, క్రూరమృగాలతోను ఉన్న ఆ మహారణ్యములో ఆ అన్నదమ్ములు సీతాదేవిని వెతుకుతూను; అక్కడ అక్కడ ఆగుతూను మరి మూడు క్రోసుల దూరము నడిచి ఆ క్రౌంచారణ్యము దాటి మతంగాశ్రమమువైపు పోసాగినారు.

అట్లా పోతూ దారిలో ఒక భయంకరారణ్యములోకి పోయినారు. మహా భయంకరమైన పక్షులు, పాములు, క్రూరమృగాలు సంచారముచేసే ఆ అడవిలో పాతాళమువలె ఎంతో లోతు అయిన గుహను ఒకదానిని ఆ అన్నదమ్ములు రామలక్ష్మణులు చూచినారు. అది ఎప్పుడూ చీకట్లు కమ్ముకొని లోపల ఏమీ కనిపించకుండా ఉంటుంది. పెద్దపులులవంటి ఆ అన్నదమ్ములు ఆ గుహను పరిశీలించసాగినారు.

అప్పుడు అక్కడ మహదాకారముతో, వికృతాననముతో మహాభయంకరముగా కనిపించే రాక్షసస్త్రీని వారు చూచినారు. అంతంతమాత్రపు ధైర్యవంతులు ఆ రాక్షసిని చూస్తే జడుసుకొంటారు. దాని రూపము ఏవ పుట్టిస్తుంది. వేళ్ళాడే పెద్ద బానవంటి పొట్టతో ఎంతో ఎత్తున ఉంది. వాడివాడి కోరలతోను, బిరుసెక్కిన దేహముతోను, విరపోసుకొన్న వెంట్రుకలతోను అది మహాభయంకరముగా సింహాదుల మాంసము తింటూ ఉంది.

అప్పుడు ఆ రాక్షసి ఎదురుగుండా వస్తూ ఉన్న ఆ అన్నదమ్ములను రామలక్ష్మణులను చూచింది. వెంటనే లేచి వారికి ఎదురుగుండా పోయింది. ముందు నడుస్తున్న లక్ష్మణుణ్ణి చూచింది. హుటాహుటి దగ్గరకు పోయి, "ఓ చిన్నవాడా! రా! మనము ఇద్దరమూ రమింతాము, రా" అంటూ లక్ష్మణుణ్ణి పట్టుకొన్నది. దగ్గరకు లాగుకొని కౌగలించుకొని, "ఓ వీరుడా! నీవు నా నాథుడవు. నా పేరు అయోముఖి అంటారు. నీవు నాకు దొరికినావు. నేను నీకు దొరికినాను. నీవు నాకు ప్రియుడవు. నేను నీకు ప్రియురాలను. ఇక నీవు బ్రతికి ఉండేటంతవరకున్నూ ఇదిగో, ఈ పర్వత శిఖరాలమీదను, అదిగో ఆ నదుల ఇసుకదిబ్బలమీదను మనము ఇద్దరమూ రమిస్తూ సుఖముగా ఉందాము" అని చెప్పింది. లక్ష్మణుడు అందుకు కుపితుడు అయిపోయినాడు. ఆ రాక్షసి అట్లా ఇంకా ఏమేమో చెప్పుతూ ఉండగానే

కత్తి దూసి దాని ముక్కూ, రెండుచెవులూ, రెండు స్తనాలు తెగవేసినాడు. అంతట ఆ రాక్షసి వికృత స్వరముతో కేకలు పెట్టుతూ వచ్చినదారినే పరుగెత్తి పారిపోయింది.

ఆ రాక్షసి అట్లా పారిపోయిన తరువాత ఆ మహాపరాక్రమవంతులు ముందుకు సాగి కొంతదూరము పోయినారు. అప్పుడు ఆ మహాతేజోవంతుడు, ఆ అమిత బలవంతుడు, ఆ సదాచారసంపన్నుడు, ఆ పరిశుద్ధుడు లక్ష్మణుడు దివ్యతేజముతో నడుస్తూ ఉన్న రాముణ్ణి చూచి చేతులు జోడించి, "అన్నా, రామా! రా, నా ఎడమ భుజము ఇప్పుడు అమితముగా అదురుతూ ఉంది. నాకు ఎందుకో దిగులు దిగులుగా ఉంది. దుర్నిమిత్తాలు ఎన్నో కనపడుతున్నవి. ఓ పూజ్యుడా! నీవు ఇప్పుడు అన్నిటికీ సంసిద్ధుడవు అయి ఉండు. మనకు మేలు అయ్యేటట్టు నీవు చేయవలెను. ఈ దుర్నిమిత్తాలనుపట్టి మనకు ఇప్పుడు ఏదో భయంకరావస్థ రాబోతున్నది. అయితే, పోరాటములో మనకు జయము అవుతుంది అన్నట్లుగా, వంజుళపక్షి పెద్దగా అరుస్తూ ఉంది" అని చెప్పినాడు.

ఆ ఓజస్వంతులు సర్వసన్నద్ధులు అయి ఆ అడవి అంతా వెదకవలెను అని నిశ్చయించుకొన్నారు. కొద్దిగా ముందుకు సాగిపోయినారు. అప్పుడు ఆ అడవిలో మహోన్నతవృక్షాలు అన్నీ విరిగి పడిపోతున్నట్లు మహాభయంకరము అయిన ధ్వని బయలుదేరింది. పెద్ద గాలి ఎడా పెడా కొట్టింది. ఆ మహారణ్యములో రేగిన ఆ గాలీ, ఆ మహాధ్వనీ భూమ్యాకాశమధ్యప్రదేశాన్ని అంతా ఆవరించినవి. ఆ మహాభయంకర ధ్వని ఎక్కడనుంచి వస్తున్నదా అని రామలక్ష్మణులు అన్నిదిక్కులా చూస్తూ ఉన్నారు.

అప్పుడు అక్కడ ఎట్టఎదుట ఒక పొదలో మహాకాయుణ్ణి, ఒక రాక్షసుణ్ణి చూచినారు. వాడి వక్షఃస్థలము ఎంతో విశాలముగా ఉంది. వాడు పెద్ద కొండ అంత ఎత్తున ఉన్నాడు. అయితే వాడికి తల లేదు. మెడ లేదు. ఒక పెద్దమొండెముగా కనిపించినాడు. పెద్ద నోరు, పెద్ద విశాలము అయిన నొసలు కడుపుననే ఉన్నవి. దేహము అంతటా సూదులవంటి వెంట్రుకలు దట్టముగా ఉన్నవి. మహాపర్వతమువలె అచలముగానూ, భయంకరముగా ఉరుముతూ ఉన్న నీలమేఘమువలెనూ పెద్ద పెద్ద కేకలు వేస్తూ ఉన్నాడు. వక్షఃస్థలాన ఉన్న నొసటను ఒక కన్ను ఉంది. అది చాలా వెడల్పు, పొడుగు అయిన కన్ను. ఆ కంటిరెప్పలు ఎంతో పెద్దవి. కనుపాప తేనె రంగులో ఉంది. ఎంత దూరాన ఉన్న వాటిని అయినా వాడు, ఆ రాక్షసుడు ఆ ఒంటి కంటితో వడివడిగా చూస్తాడు. ఆ కంటిలోనుంచి వాడు చూచే చూపు మంటలు మండుతూ ఉన్నట్టుగా చూపరులకు కనిపిస్తుంది. వాడి వాడికోరలతో వాడి నోరు ఎంతో పెద్దది. ఎప్పుడూ నోరు తెరుస్తూ, నాలుక ఆడిస్తూ ఉంటాడు. వాడి బాహువులు మహాభయంకరము అయినవి. ఒక్కొక్క బాహువును వాడు ఒక్కొక్క

యోజనము దూరము చాపుతూ ఉంటాడు. ఆ రెండు చేతులు అట్లా చాస్తూ సింహాలను, ఏనుగులను, ఎలుగుబంటులను, ఇంకా ఇతర క్రూరమృగాలను, పక్షిగణాలను పట్టుకొని దగ్గరకు లాగుకొని కబళించి వేస్తూ ఉంటాడు. ఆ చేతులు విదిలించి వాడికి అయిష్టము అయినవాటిని అవతల పారవేస్తూ ఉంటాడు.

అప్పుడు ఆ రాక్షసుడు ఆ దారిన వస్తూ ఉన్న రామలక్ష్మణులను ఆ చేతులతో పట్టుకొన్నాడు. అంతట వారిని ఆ చేతులతోనే విదిలించి వేసినాడు. వారు అంతట ఒక క్రోసెడు దూరము అవతలకు పోయి పడ్డారు. ఆ తరువాత వాడు ఆ పొడుగాటి చేతులతో రామలక్ష్మణులను ఇద్దరినీ పట్టుకొని బలవంతముగా అదిమివేసినాడు. ఆ మహాబలవంతులు పెద్ద ధనుస్సులతోను, పెద్దపెద్ద ఖడ్గాలతోను ఉన్నప్పటికిన్నీ, ఆ రాక్షసుడు వారిని అట్లా నొక్కివేయగానే ఉక్కిరి బిక్కిరి అయిపోయినారు. అప్పుడు రాముడు మాత్రము ధైర్యము కోలుపోలేదు. వ్యధపడలేదు. రాముని అంతటివాడు కాడు కనుక, లక్ష్మణుడికి ధైర్యము మందగించింది. ఎంతో వ్యథపడిపోయినాడు. విషణ్ణుడు అయిపోయినాడు. రాముణ్ణి చూచి, "ఓ వీరా! నేను ఇప్పుడు ఈ రాక్షసుడి అధీనుణ్ణి అయిపోయినాను. నేను వివశుణ్ణి అయిపోయినాను. నన్ను గురించి నీవు ఆలోచించవద్దు. నీవు నన్ను ఈ రాక్షసుడికి ఒప్పగించి తప్పించుకొని పో! నన్ను ఈ భూతానికి బలిగా ఇచ్చి వేయవలసింది. నీవు పారిపోవలసింది. నీవు అచిరకాలములోనే సీతాదేవిని కలుసుకొంటావు. నేను చెప్పినట్టు నీవు చేయడము ఎంతో మంచిది అని నా అభిప్రాయము. ఓ రామా! నీవు పితృపైతామహము అయిన రాజ్యము ఏలుతూ, నన్ను తలచుకొంటూ ఉంటే చాలు" అని లక్ష్మణుడు చెప్పినాడు.

ఇట్లా చెప్పుతూ ఉన్న లక్ష్మణుణ్ణి చూచి రాముడు, "తమ్ముడా! నీవు వీరుడవు. నీవు భయపడవద్దు. నీవంటివాడు ఇట్లా దిగులుపడి పోకూడదు" అని ధైర్యము చెప్పుతూ ఉండగా, ఆ దానవోత్తముడు కబంధుడు మేఘగంభీరధ్వనితో, "మీరు ఎవండ్లు? ఆబోతులమూపులవంటి భుజాలతోను, పెద్దపెద్ద ధనుస్సులతోను, ఖడ్గాలతోను ఈ భయంకరారణ్యానికి ఎందుకు వచ్చినారు? మీకు ఇక్కడ ఏమి పని ఉంది, చెప్పండి. నాకు ఇప్పుడు ఆకలివేస్తూ వుంది. మీరు నా ఆకలి పోకొట్టడానికి ఇక్కడికి వచ్చినట్టుగా ఉన్నారు. మిమ్ములను ఇప్పుడే తినివేస్తాను. మీ ధనుస్సులు, మీ ఖడ్గాలు మిమ్ములను కాపాడలేవు. మీ భుజబలము మిమ్ములను కాపాడదు. నా నోటి దగ్గరకు వచ్చినారు. మీరు ఇంక బ్రతకడము ఉత్తది" అన్నాడు.

ఆ దురాత్ముడు కబంధుడి మాటలు రాముడు విన్నాడు. గొంతు ఎండిపోతూ ఉన్న లక్ష్మణుణ్ణి చూచి, "నాయనా! నీవు సత్యపరాక్రమవంతుడవు. మనకు ఇప్పుడు

కష్టముమీద కష్టము వచ్చిపడుతూ ఉంది. సీత ఎడబాటునుంచి ఇప్పుడు మనకు భయంకరము, ప్రాణాంతకము అయిన ఈ కష్టము వచ్చింది. లక్ష్మణా! నీవు పెద్దపులివంటివాడవు. సమస్తభూతకోటినీ కాలకర్మానికి తలఒగ్గవలసిందే, తప్పదు. కాలాన్ని ఎదిరించగలవాడు ఎవడూ లేడు. కాలవిపర్యయమునుంచి నీ, నా చిత్తము ఇప్పుడు వికలము అయిపోతూ ఉంది. అయితే కాలానికి అసాధ్యము అయింది ఏమీ లేదు. శూరులు, అమితబలవంతులు, సమస్తశస్త్రాస్త్రవేత్తలు అయినవారు కూడా యుద్ధభూమిలో కాలానికి కట్టుపడిపోయి ఇసుకతో వేసిన ఆనకట్ట మహాప్రవాహానికి కొట్టుకొనిపోయేటట్టు నాశనము అయిపోతూ ఉంటారు. అందువల్ల, ఇప్పుడు ఈ కబంధుడు ఏమి అవుతాడో, మనము ఏమి అవుతామో కాలమే నిర్ణయించవలెను. తమ్ముడా! నీవు మహాపౌరుషశాలివి. అధైర్యపడవద్దు" అంటూ ఆ సత్యపరాక్రముడు, ఆ దృఢపరాక్రముడు, ఆ ప్రతాపవంతుడు దాశరథి చిత్తస్థైర్యముతో లక్ష్మణుడికి చెప్పినాడు.

70

కబంధుడు రామలక్ష్మణులను తన బాహుపాశాలతో పెనవేసి పట్టుకొన్నాడు. ఆ అన్నదమ్ములు అట్లా కట్టుపడిపోయి ఏమి చేయడమా అని ఆలోచిస్తూ, ఆ రాక్షసుడి వంక చూడసాగినారు. అప్పుడు ఆ రాక్షసుడు, "ఓ క్షత్రియులారా! ధనుఃఖడ్గాద్యాయుధాలతో వీరులవలె ఇక్కడికి వచ్చినారు. బుద్ధిలేనివాండ్లవలే ఎందుకు అట్లా చూస్తూ నిల్చున్నారు? నాకు ఆకలివేస్తూ ఉంది. దైవము మిమ్ములను నాకు ఆహారముగా పంపించినాడు. ఇదిగో, మిమ్ములను మింగివేస్తున్నాను" అంటూ కబంధుడు నోరు తెరచినాడు.

అంతవరకూ దిగులుదిగులుగా ఉన్న లక్ష్మణుడికి రాక్షసుడు అన్న ఆ మాటలకు కోపము వచ్చింది. పరాక్రముడు అయినాడు. తమకు మేలు అయ్యే పద్ధతి ఆ సమయాన అతడికి తోచి రాముడితో, "అన్నా! నీవు వీణ్ణి ఏమి చేయడమా అని ఆలోచిస్తున్నావు. వీడు, ఈ రాక్షసాధముడు ఇప్పుడే నిన్నూ, నన్నూ మింగివేస్తాడు. అందువల్ల, వీణ్ణి వెంటనే హతమార్చవలెను. రామా! నీవు రాజువు. రాజులు క్రతు మధ్యములోనుంచి బయటికి తోలిన పశువులను చంపివేయడము నింద్యము అని ఉపేక్షిస్తారు. కాని, క్రతుమధ్యములో ఉన్న పశువును అవశ్యము చంపివేస్తారు. వీడికి తల లేదు. కాళ్ళు లేవు. మొండెముగా ఉన్నాడు. అందువల్ల, వీడు నిశ్చేష్టుడు అని నీవు అనుకొంటున్నావేమో! ఈ మహాకాయుడికి, ఈ భయంకరుడికి పరాక్రమము అంతా బాహువులలో ఉంది. వీడు తన భుజబాహుబలముతో ఈ లోకాన్ని అంతా జయించినాడు. అంతేకాదు, మనలను కూడా వీడు ఇప్పుడు బాహువులతోటే

పట్టుకొని ఉన్నాడు. అందువల్ల, ఇప్పుడు వీడి బాహువులను తెగవేయడమే మన కర్తవ్యము" అని ఆ శుభలక్షణలక్షితుడు, ఆ మహావీరుడు లక్ష్మణుడు చెప్పినాడు.

లక్ష్మణుడు రాముడితో ఇట్లా చెప్పుతూ ఉన్న మాటలను ఆ భయంకరాకారుడు కబంధుడు విన్నాడు. అంతట వాడు క్రుద్ధుడు అయిపోయినాడు. రామలక్ష్మణులను అప్పటికి అప్పుడు కబళించివేయవలెను అనుకొన్నాడు. కడుపున ఉన్న నోరు తెరచినాడు. వాడు చేతులతో దగ్గరకి లాగుకొనే లోపలనే ఆ సమయజ్ఞులు రామలక్ష్మ ణులు కత్తులు దూసినారు. ఆ ఖడ్గాలను చూచి అప్పుడు ఆ రాక్షసుడు భయపడి పోయినాడు. వాడి చేతులు వణకడము మొదలుపెట్టినవి. వాడు ఆ రామలక్ష్మణులను పట్టుకొని ఉన్న పట్టు తప్పిపోయింది. అంతట రాముడు వాడి కుడిభుజము గూడు తెగవేసినాడు. ఆ క్షణమే వాడి ఎడమభుజము గూడు లక్ష్మణుడు తెగవేసినాడు.

మహాబాహువులు రెండూ తెగిపోయి ఆ కబంధుడు అప్పుడు మహా మేఘమువలె భూమ్యాకాశాలు రెండూ మారుమోగిపోయేటట్టు గర్జిస్తూ నేలమీదికి ఒరిగిపోయినాడు. నెత్తురు వరదలు అయి వాడి భుజాల గూళ్ళలోనుంచి ప్రవహించ సాగింది. వాడు ఆ నెత్తురుతో తడిసిపోయినాడు. అంతటితో వాడి దర్పము అణగిపోయింది. అప్పుడు వాడు రామలక్ష్మణులను చూచి వినయముగా, "ఓ వీరులారా! మీరు ఎవరు? ఇక్కడికి ఎందుకు వచ్చినారు" అని అడిగినాడు.

అంతట ఆ మహాబలవంతుడు లక్ష్మణుడు, "ఓ కబంధుడా! ఇతడు ఇక్ష్వాకువంశములో పుట్టినాడు. దశరథమహారాజు జ్యేష్ఠపుత్రుడు. రాముడు అని అందరూ అంటారు. నేను ఇతని తమ్ముణ్ణి. నా పేరు లక్ష్మణుడు. ఈ రాముడు దేవేంద్రుడి అంతటి పరాక్రమవంతుడు. దండకారణ్యములో నివసిస్తూ ఉన్నాడు. ఇతడు లేని సమయము కనిపెట్టి రాక్షసుడు ఒకడు ఇతని భార్యను అపహరించినాడు. మేము ఆమెను వెతుకుకొంటూ ఇటు వచ్చినాము.

"ఓ రాక్షసుడా! నీవు ఎవడవు? తల లేకుండాను, కాళ్ళు లేకుండాను కబంధాకారుడవుగా ఈ మహారణ్యములో ఎందుకు ఉంటున్నావు? చిత్రమే! నీ నోరు నీ రొమ్ములలో ఉంది. నీ నాలుక అగ్నిజ్వాలవలె ఉంది. పాపము ఇప్పుడు నీ చేతులు తెగిపోయి నేలమీదపడి పొర్లాడుతున్నావు. ఇంతకు నీవు ఎవడవు" అన్నాడు.

ఆ శుభలక్షణుడు లక్ష్మణుడు ఇట్లా అడుగుతూ ఉంటే, ఆ కబంధుడికి అదివరకు దేవేంద్రుడు చెప్పింది జ్ఞాపకము వచ్చింది. అది అంతా తల్చుకొంటూ తనకు శాపవిమోచన కాలము ఆసన్నము అయింది అని ఎంతో సంతోషపడుతూ,

"ఓ నరశార్దూలములారా! మీకు స్వాగతము. నా భాగ్యవశమువల్ల ఇప్పుడు మీ దర్శనము నాకు అయింది. అంతే కాకుండా, మీరు నా బాహువులను తెగవేసి నాకు ఉపకారము చేసినారు.

"ఓ పురుషోత్తమా! నా దౌష్ట్యమువల్ల నాకు ఈ వికారాకారము వచ్చింది. అది అంతా చెప్పుతాను, ఓ రామప్రభూ! నీవు వినవలెను" అన్నాడు కబంధుడు.

71

కబంధుని వృత్తాంతము

"ఓ ప్రభూ! నీవు మహాబాహువవు. అమితబలవంతుడవు. పరమ పరాక్రమవంతుడవు. నేను పూర్వము సూర్యుడివలెను, చంద్రుడివలెను, దేవేంద్రుడివలెను అచింత్య వైభవోపేతము అయిన రూపముతో ఉంటూ ఉండేవాడిని. నేను అప్పుడు ముల్లోకాలలోనూ ప్రసిద్ధికెక్కినాను. అటువంటి నేను, లోకభీకరము అయిన మహదాకారము ధరించి అడవులలో అక్కడక్కడ తపస్సు చేసుకొనే మహర్షులను భయపెట్టుతూ తిరుగసాగినాను.

అప్పుడు ఒకప్పుడు 'స్థూలశిరుడు' అనే మహర్షి కందమూలాదుల కోసము అడవిలో తిరుగుతూ ఉంటే, నేను నా మహదాకారముతో ఆయనను ఎదిరించినాను. ఆయనకు అప్పుడు నామీద కోపము వచ్చింది. అంతట ఆ మహర్షి నన్ను చూచి, 'ఓ దుర్మార్గుడా! అందరూ ఏవగించుకొనే క్రూరరూపముతో ఉండ' మని ఘోరశాపము పెట్టినాడు. నేను చేసింది అపరాధమే అనీ, నాకు శాపవిమోచనము అయ్యే మార్గము అనుగ్రహించమనీ ఆయనను ప్రార్థించినాను. అంతట ఆ మహాత్ముడు, 'నీవు ఉండే విజనారణ్యానికి రాముడు వచ్చి ఎప్పుడు నీ చేతులు తెగకొట్టుతాడో అప్పుడు నీకు శాపవిమోచనము అవుతుంది అనీ, అంతట నీ దివ్యసుందరరూపము వస్తుంది అనీ' చెప్పినాడు.

"ఓ లక్ష్మణా! ఈ రామప్రభువు ఇక్ష్వాకువంశీయుడు అని చెప్పినావు. నేను శ్రీ అనేవాడి పుత్రుణ్ణి. నా పేరు ధనువు. ఘోరరూపముతో ఉండమని మునిశాపము పెట్టినాడు. ఈ కబంధ రూపము నాకు దేవేంద్రుడు ఇచ్చినాడు.

"ముని శాపముపెట్టి పోయిన తరువాత నేను మహోగ్రము అయిన తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ణి సంతోషపెట్టినాను. ఆ దేవుడు నాకు దీర్ఘాయుర్దాయము అనుగ్రహించినాడు. అంతటితో నాకు గర్వము వచ్చింది. నా శత్రువు అయిన దేవేంద్రుడు నన్ను ఏమి చేస్తాడు అనుకొని ఎదిరించినాను. దేవేంద్రుడికీ, నాకూ యుద్ధము అయింది. ఆ యుద్ధములో దేవేంద్రుడు తన నూరు అంచుల వజ్రాయుధాన్ని నామీద వదిలినాడు. అది నా తలను, నా రెండు తొడలను నా

దేహములోకి తోసివేసింది. అప్పుడు నన్ను చంపివేయమని దేవేంద్రుణ్ణి నేను వేడుకొన్నాను. 'బ్రహ్మదేవుడు ఆయుర్దాయము అనుగ్రహించినందువల్ల అది దబ్బర అయిపోదు' అని ఆయన చెప్పినాడు. 'అయితే, తిరగడానికి కాళ్ళు లేకుండాను, తినడానికి నోరు లేకుండాను నేను బ్రతికి ఉండడము ఎట్లాగు' అని దేవేంద్రుణ్ణి అడిగినాను. అందుకు ఆయన నాకు యోజనము పొడుగు బాహువులను, నా కడుపులోనే తీక్షణము అయిన కోరలతో నోటిని ఏర్పరచినాడు. అప్పటినుంచీ నేను సింహాలను, పెద్దపులులను, ఏనుగులను, ఇంకా ఇతర మృగాలను నా ఈ పొడుగాటి చేతులతో పట్టుకొని దగ్గరకు లాగుకొని తింటూ బ్రతుకుతున్నాను. దేవేంద్రుడు కూడా 'రాముడు వచ్చి నా చేతులు విరగకొట్టి నన్ను దహించివేయగానే నాకు ఎప్పటి రూపము వస్తుంది అనీ, నాకు స్వర్గలోకములో తావు ఇస్తాను అనీ' చెప్పినాడు.

"రామా! నాకు ఈ కబంధాకారము వచ్చినప్పటినుంచీ ఈ అడవిలో కనపడ్డవాటిని అన్నిటినీ 'ఇది భక్ష్యము, ఇది అభక్ష్యము' అనే భేదము లేకుండా పట్టుకొని తింటున్నాను. అట్లా తింటూ ఉన్నప్పటికిన్నీ, ఈ దేహాన్ని కాపాడుకోవడము ఎంతో కష్టముగానే ఉంది. అయితే, ఆ మహర్షి చెప్పినట్టు, దేవేంద్రుడు చెప్పినట్టు రాముడు తప్పకుండా వస్తాడు అనీ, నాకు శాపవిమోచనము అవుతుంది అనీ కాలము గడుపుతున్నాను.

"ఓ రామా! ఆ చెప్పిన రాముడవు నీవే! ఇంతకాలానికి వచ్చినావు. నా చేతులు విరగకొట్టినావు. ఇక నీవు నన్ను దహించివేయవలెను. ఓ రామా! నీకు జయము అవుతుంది. నీకు శుభము అవుతుంది. నీవు తప్ప మరి ఒకడు ఎవడూ నాకు మోక్షము ఇవ్వలేడు అని ఆ మహర్షి చెప్పినాడు, దేవేంద్రుడు చెప్పినాడు. ఓ పురుషోత్తములారా! నాకు ఇప్పుడే దహన సంస్కారము చేయవలెను. నేను నా బుద్ధికి తోచినంత ఉపాయము మీకు చెప్పుతాను. మీ కార్యసాధనానికి మీరు ఎవరితో స్నేహము చేయవలసిందీ చెప్పుతాను అని, దహనము చేయవలసింది" అని వేడుకొన్నాడు.

అంతట ఆ ధర్మాత్ముడు రాముడు లక్ష్మణుణ్ణి దగ్గర ఉంచుకొని "ఓ కబంధుడా! నీవు చెప్పింది అంతా విన్నాను. నీకు కావలసింది చేస్తాను. నాకు కావలసింది నీవు చెప్పవలెను. నేనూ, నా తమ్ముడూ బయటికి వెళ్ళిపోయిన సమయము కనిపెట్టి జనస్థానము నుంచి నా భార్యను సీతాదేవిని రావణాసురుడు అనేవాడు ఎత్తుకొనిపోయినాడు అని తెలిసింది. కాని వాడి నివాసము ఎక్కడో తెలియలేదు. వాడి ఆకారము ఎటువంటిదో తెలియలేదు. వాడు ఎంతటి పరాక్రమవంతుడో తెలియలేదు. ఓ కబంధుడా! పరోపకారము చేయడమే మా

పనిగా పెట్టుకొన్నాము. అయితే ఇప్పుడు మేము శోకార్తుల వలెను, అనాధుల వలెను అల్లాడిపోతున్నాము. నీవు మమ్ములను కనికరించవలెను. ఓ కబంధుడా! ఏనుగులు విరిచివేసిన చెట్లు ఎండిపోయినవి, ఇక్కడ ఎన్నో ఉన్నవి. గుంటతీసి మంచి ఎండు కట్టెలతో నీకు దహన సంస్కారము చేస్తాము. నీవు ఎరిగి ఉంటే యధార్థము చెప్పు. సీతాదేవిని రావణాసురుడే ఎత్తుకొనిపోయినాడో, మరి ఎవడు అయినా ఎత్తుకొని పోయినాడో చెప్పు. ఎక్కడికి ఎత్తుకొనిపోయినాడో చెప్పు. నీవు నాకు ఎంతో మంచి చేసినవాడవు అవుతావు" అని చెప్పినాడు.

"ఓ రామప్రభూ! నాకు దివ్యజ్ఞానము లేదు. నీ భార్య మైధిలిని గురించి నాకు ఏమీ తెలియదు. నన్ను దహించివేయవలసింది. అప్పుడు నాకు నా పూర్వరూపము వస్తుంది. తెలివితేటలు వస్తవి. సీతాదేవి ఎక్కడ ఉన్నదీ తెలుసుకోకలవాడు ఎవడో చెప్తుతాను. నన్ను తగలవేయనంతవరకూ ఏమి చెప్పడానికీ నాకు సామర్థ్యము లేదు. శాపము నుంచి నా దివ్యజ్ఞానము భ్రష్టము అయిపోయింది. స్వయంకృతాపరాధమువల్ల లోకము అస్యహించుకొనే ఈ రూపమే కాకుండా, తెలివితేటలు లేకుండా కూడా ఉన్నాను.

"ఓ రామా! సూర్యుడి గుర్రాలు ఇప్పటికే చాల దూరము పరుగెత్తినవి. ఇకను అవి అలసిపోతవి. సూర్యుడు అస్తమించే లోపలనే నన్ను యధావిధిగా దహించివేయ వలసింది. ఓ వీరుడా! నీవు నన్ను గుంటలో పెట్టి దహించివేయగానే సీతను ఏ రాక్షసుడు ఎత్తుకొని పోయిందీ తెలుసుకోకల శక్తిమంతుణ్ణి గురించి చెప్తుతాను. వాడు నీతిమంతుడు. మహాపరాక్రమవంతుడు. నీకు సంతోషముగా సహాయము చేస్తాడు. నీవు వాణ్ణి స్నేహము చేసుకో. వాడికి తెలియని ప్రదేశము ముల్లోకాలలోనూ లేదు. కారణాంతరాలవల్ల వాడు సమస్తలోకాలూ తిరిగి చూచినాడు. వాడు ఎరుగనివాడు ఎవడూ లేడు" అని కబంధుడు చెప్పినాడు.

72

కబంధుడు సుగ్రీవుని గూర్చి రామునితో చెప్పుట

కబంధుడు ఇట్లా చెప్పగానే ఆ వీరులు ఇద్దరూ అక్కడ కొండదగ్గర ఒక పల్లపుప్రదేశములో ఆ కబంధుడి కళేబరాన్ని పెట్టినారు. దానికి నిప్పు అంటించినారు. ఆ చితికి అన్ని వైపులా మండుతున్న కొరవులు లక్ష్మణుడు తగిలించినాడు. అంతట అది భగభగమండుతూ ఉన్నప్పటికిన్నీ, ఆ కబంధుడి దేహములో ఉన్న కొవ్వునుంచి ఆ కళేబరము మందము మందముగానే కాలడం మొదలు పెట్టింది. ఆ మహా బలవంతుడి రాక్షసాకారము అంతా తగలపడిపోగానే పొగలులేని అగ్నిహోత్రమువలె

ధగధగలాడుతూ నిర్మలవస్త్రాలు, దివ్యమాలికలు, సమస్తాభరణాలు ధరించిన ఒక దివ్యవిగ్రహము సంతోషము ఉట్టిపడుతూ ఆ చితిలోనుంచి గబుక్కున పైకి లేచింది. ఆ మహాతేజోవంతుడి కోసము అప్పుడు అక్కడికి ఒక విమానము వచ్చింది. ఆ విమానముమీద అలంకారముగా హంసలూ మొదలు అయిన బొమ్మలు అమర్చి ఉన్నవి. దాని తళతళకాంతులు దశదిశలా వ్యాపించినవి. ఆ దివ్యదేహుడు ఆ విమానముమీద కూర్చున్నాడు. అది అప్పటికి అప్పుడు అంతరిక్షానికి ఎగిరిపోయింది. అక్కడినుంచి ఆ దివ్యపురుషుడు రాముణ్ణి చూచి, "ఓ రామా! నీకు సీతాదేవి దొరికే ఉపాయము చెప్పుతాను, విను. నేను చెప్పేది యధార్థము. ఈలోకములో (సంధి విగ్రహ యాన ఆసన ద్వైదీభావ సమాశ్రయాలు అనే) ఆరు ఉపాయాలు ఉన్నవి. ఈ ఉపాయాలవల్లనే రాజులు సమస్తకార్యాలు చక్కపెట్టుకొంటూ ఉంటారు.

దురవస్థలో ఉన్న మరి ఒకరితో చేరితేనే తన కార్యము సాధించుకొన కలుగుతాడు. ఓ రామా! నీ భార్యను ఎవడో అపహరించినందువల్ల నీవు దురవస్థలో పడ్డావు. నీనుంచి లక్ష్మణుడూ దురవస్థలో పడ్డాడు. మీరు ఉభయులూ ఇప్పుడు చేతకానివాండ్లు అయిపోయినారు. అందువల్ల, నీవంటి దురవస్థలో ఉన్నవాడితోటే నీవు అవశ్యము స్నేహము చేసుకోవలెను. రామా! నేను చాలా ఆలోచించినాను. నీవు నేను చెప్పేవాడితో స్నేహము చేసుకోకపోయేటట్లయితే, నీకు కార్యసిద్ధి అవుతుంది అని నాకు తోచడము లేదు.

"రామా! నేను చెప్పేది విను. నీవు మైత్రికి మహాశ్రేష్ఠుడవు. 'సుగ్రీవుడు' అనే వానరుడు ఒకడు ఉన్నాడు. వాడితో నీవు స్నేహము చేసుకోవలెను. వాడి అన్న దేవేంద్రుడి పుత్రుడు 'వాలి' అనే వానరుడు మరి ఒకడు ఉన్నాడు. ఆ వాలికి కోపము వచ్చి సుగ్రీవుణ్ణి దేశమునుంచి తరిమివేసినాడు. ఇప్పుడు ఆ మహాబలవంతుడు, ఆ పరాక్రమశాలి సుగ్రీవుడు మరి నలుగురు వానరులతో చేరి పంపాసరోవర సమీపాన ఋశ్యమూకపర్వతముమీద నివసిస్తూ ఉన్నాడు. ఆ వానరేంద్రుడు సుగ్రీవుడు మహావీర్యవంతుడు. అమితతేజోవంతుడు. కాంతివంతుడు. సత్యసంధుడు. వినయాన్వితుడు. ధైర్యశాలి. మతిమంతుడు. దక్షుడు. ప్రగల్భుడు. పూజ్యుడు. ఆ మహాబలవంతుణ్ణి సుగ్రీవుణ్ణి వాలి రాజ్యకారణమువల్ల దేశములోనుంచి వెళ్ళకొట్టినాడు.

"రామా! ఆ సుగ్రీవుడు నీకు మిత్రుడు అవుతాడు. సీతను వెతకడములో నీకు తోడుపడతాడు. నీకు మేలు చేస్తాడు. నీవు ఇక మనస్సులో అయినా దుఃఖపడనక్కరలేదు. రామా! నీవు ఇక్ష్వాకువంశీయులలో శ్రేష్ఠుడవు. నీకు తెలియంది ఏమీలేదు. ఏ కాలానికి ఏది ఎట్లా జరుగవలెనో, ఆ కాలానికి అది అట్లా జరుగుతూ ఉంటుంది. అది మార్చివేయడము ఎవడికి అయినా అలవికాని పని. కాలాన్ని

అతిక్రమించగలవాడు ఎవడూ లేడు. నీవు ఇక్కడనుంచి ఇప్పుడే బయలుదేరి ఆ మహాబలవంతుడు సుగ్రీవుడి దగ్గరకు పో. అతడితో స్నేహము చేసుకో. ఒకరికి ఒకరు ద్రోహము చేసుకోకుండా ఉండడానికి ఆ సుగ్రీవుడూ, నీవూ అగ్నిసాక్షిగా స్నేహితులు కండి. ఆ వానరుడు సుగ్రీవుడు ఇప్పుడు అన్యసహాయార్థిగా ఉన్నాడు. నిన్ను చులకన చేయడు. అతడు కృతజ్ఞుడు. కామరూపుడు. అతనికి కావలసిన పని మీరు చేసిపెట్టవలెను. అతని పని మీరు వెంటనే చేసిపెట్టినా, చేసిపెట్టక పోయినా మీ పని అతడు చేసి పెట్టుతాడు. ఆ సుగ్రీవుడు 'ఋక్షరజుడు' అనే వాడి క్షేత్రజుడు. సూర్యుడి వీర్యానికి పుట్టినాడు. వాలితో వైరము వచ్చింది. ఆ వాలికి భయపడి పంపాతీరాన నివసిస్తూ ఉన్నాడు. మీరు ఇప్పుడే అక్కడి ఆ ఋష్యమూక పర్వతానికి పోయి ఆయుధసాక్షిగా, సత్యప్రమాణముగా, ఆ సుగ్రీవుడితో స్నేహము చేసుకోండి. ఆ కపికుంజరుడు ఈలోకములో నరమాంసభక్షకులు అయిన రాక్షసులను అందరినీ ఎరుగును. వారు, ఆ రాక్షసులు అందరూ ఎక్కడ ఎక్కడ ఉంటూ ఉన్నది కూడా ఆ సుగ్రీవుడికి తెలుసు.

"ఓ అరిందమా! ఓ రామా! ఈలోకములో సూర్యుడు ఎంత లెక్క ఎండ కాస్తున్నాడో అంత లెక్కా సుగ్రీవుడు ఎరుగనిది ఏమీ లేదు. అతడు వానరులతో కూడా బయలుదేరి విశాలము అయిన పర్వతాలను, దుర్గమారణ్యాలను, గిరిగుహలను, మహానదులను వెదకి నీ భార్య సీతాదేవి ఎక్కడ ఉన్నదీ తెలుసుకో కలుగుతాడు. నీ భార్యను వెతకడానికి అతడే కాకుండా, మహాకాయులు అయిన వానరులను అనేక మందిని అన్నిదిక్కులకూ పంపించ కలుగుతాడు. ఆ నీ భార్య రావణాసురుడి ఇంట్లో ఉన్నదీ లేనిదీ తెలుసుకో కలుగుతాడు. రామా! ఆ మహాపతివ్రత, ఆ నితంబిని సీతాదేవి నీ ఎడబాటుకు ఇప్పుడు ఎంత తపించిపోతూ ఉందో! రామా! నీవు వెంటనే సుగ్రీవుడి దగ్గరకు పో!

"ఓ ప్రభూ! నీ ప్రియురాలు సీతాదేవి మేరుపర్వతాగ్రముమీద ఉన్నా, పాతాళ లోకములో ఉన్నా , మరి ఎక్కడ ఉన్నా, ఎంతమంది రాక్షసులు ఎదిరించినా వారిని అందరినీ సంహారముచేసి ఆ వానరప్రవరుడు నీకు తెచ్చిపెట్టుతాడు" అని దివ్యరూపము ధరించిన ఆ కబంధుడు చెప్పినాడు.

73

ఆ కార్యసాధకుడు కబంధుడు సీతాదేవిని తెచ్చుకోవడానికి రాముడికి ఈ ఉపాయము చెప్పి అందుకు అనుగుణముగా మళ్ళీ, "రామా! ఇక్కడినుంచి పడమటి దిక్కుగా పోతే నేరేడుచెట్లు, మోరటిచెట్లు, పనసచెట్లు, జువ్విచెట్లు, మర్రిచెట్లు, రావిచెట్లు, తిందుకచెట్లు, కొండగోగుచెట్లు, మామిడిచెట్లు, చంద్రచెట్లు, పొన్నచెట్లు, బొట్టుగుచెట్లు,

నీలాశోకచెట్లు, కదంబచెట్లు, కానుగచెట్లు, గన్నేరుచెట్లు, నల్లజీడిచెట్లు, అశోకచెట్లు, రక్తచందన చెట్లు పూలు పూసి శోభాయమానముగా కనపడతవి. ఆ చెట్లలోనుంచి చక్కని దారి ఉంది. ఆ దారిన ఆ అడవి దాటి కొంతదూరము పోతే నందనవనము వలెను, ఉత్తరకురుదేశమువలెను మనోహరము అయిన మరి ఒక వనము వస్తుంది. తేనెలు కారే రకరకాలపండ్లు అక్కడ దొరుకుతవి. కుబేరుడి చైత్రరథవనములోవలె ఆ అడవిలో చెట్లు ఋతు భేదము లేకుండా అన్ని కాలాలలోను పూలు పూస్తూను, కాయలు కాస్తూను, పండ్లు పండుతూను ఉంటవి. అక్కడి చెట్లకొమ్మలు ఎంతో దూరము పోయి, పండ్ల బరువుకు అన్నీ నేలకు వంగి ప్రతి చెట్టూ ఒక్కొక్క కొండవలెను, నేలకు వచ్చిన మేఘమువలెను ఎంతో శోభాయమానముగా కనపడు తుంది. మీరు ఆ చెట్లు ఎక్కికానీ లేదా ఆ కొమ్మలు వంచుకొనికానీ, అమృతమువంటి పండ్లను కోసుకొని తినవచ్చును. మీరు అట్లా హాయిగా పండ్లు తింటూ ఆ అడవిని దాటి అడవినీ, కొండను దాటి కొండనూ దాటుకుంటూ పోతే, మీకు పంపాసరస్సు కనపడుతుంది. అక్కడ కాళ్ళకు గుచ్చుకొనే పలుగురాళ్ళు ఉండవు. అక్కడ రాళ్ళమీద కాళ్ళు జారవు. అన్నిరేవులూ ఒక్కమాదిరిగా మనోహరముగా ఉంటవి. ఏ రేవులోను పాచి ఉండదు. నీళ్ళ అడుగున ఇసుక ఉంటుంది. ఆ పంపా సరస్సులో కమలాలు, నీలోత్పలాలు ఎప్పుడూ విరగపూసి ఉంటవి.

"రామా! ఆ పంపాసరోవరజలాలు కన్నుల పండువుగా నీకంట పడగానే నీరుకోళ్లూ, కొంచపిట్టలూ, కురరపిట్టలూ, హంసలూ నీకు వీనులవిందుగా పాటలు పాడుతవి. అవి మనుష్యులనుచూచి భయపడవు. ఏమి అంటే, ఆ ప్రాంతానికి ఏ మానవుడూ పోయి ఆ పిట్టలను కొట్టి ఎరుగడు. అవి అన్నీ బాగా బలిసి ఉంటవి. వాటి మాంసము నెయ్యి ముద్దలు ముద్దలు చేసుకొని తిన్నట్టుగా కమ్మగా ఉంటుంది. మీరు ఆ పక్షుల మాంసము తినవలసింది."

"రామా! ఆ పంపాసరస్సులో మంచి గండుచేపలు, సొరచేపలు, రొయ్యలు అపారముగా దొరుకుతవి. నీ తమ్ముడు లక్ష్మణుడు నీమీద ఎంతో భక్తితో ఉంటున్నాడు. ఆ చేపలను పట్టుకొని వాటి చర్మము, రెక్కలు, ముండ్లు తీసివేసి ఇనుప ఊచకు గుచ్చి కాల్చిపెట్టమని అతనితో చెప్పు. నీవు ఆ చేపలను తింటూ ఉంటే నీ తమ్ముడు తామరాకు దొప్పలో ఆ పంపా నిర్మలోదకాలు నీకు తెచ్చిపెట్టుతాడు. ఆ జలాలు వెండివలెను, స్ఫటికాలవలెను ఉండడమే కాకుండా పద్మ గంధముతో ఘుమఘుమ లాడుతూను చల్లగాను, కమ్మగాను ఉంటవి. ఆ జలాలు నీకు ఆరోగ్యాన్ని ఇస్తవి."

"ఓ నరోత్తమా! అక్కడి గిరిగుహలలో పడుకొని నిద్రపోయి లేచి ఆ అడవులలో తిరుగుతూ, దాహమువేసి అడవిపందులు ఆ పంపాసరస్సులో నీళ్లు తాగడానికి

ఆబోతులవలె రంకెలు పెట్టుతూ వస్తూ ఉంటవి. అవి బలిసి ఎంతో అందముగా కనపడుతవి. రామా! నీవు సాయంకాలము అప్పుడు ఆ పంపాతీరాన పూలదండలు పెట్టుకొన్నట్లు కనపడే చెట్లను చూస్తూను, ఆ పంపాజలాలమీదనుంచి వచ్చే చల్లగాలి తగుల్తూను ఉంటే నీ దుఃఖము అంతా మరచిపోతావు. అక్కడ విరగపూసిన బొట్టుగుచెట్లు, కానుగచెట్లు, వికసించిన నీలోత్పలాలు, కమలాలు చూస్తూ ఉంటే, నీ దుఃఖము అంతా మాయము అయిపోతుంది. అక్కడి పూలు రాలిపోవు. అవి వాడిపోవు. ఎప్పుడూ క్రొత్త క్రొత్తగా పూసినట్లు కనపడుతూ ఉంటవి. ఆ పూలు పెట్టుకొనేవారు ఎవరూ అక్కడ లేరు. పూర్వము మతంగమహాముని శిష్యులు అక్కడ నివసిస్తూ ఉండేవారు. వారు అందరూ మహర్షులు. మహాసమాధిలో ఉండేవారు. వారు గురువుల కోసము ఆ అడవిలో నుంచి కందమూలాదులు మోసుకొని వస్తూ ఉండేవారు. ఆ బరువు మోయలేక వారు అలిసిపోతే వారి దేహాలమీదనుంచి చెమట బిందువులు రాలుతూ ఉంటే, అవి భూమిమీద పడకుండా గాలికి ఎగిరి ఆ యా చెట్లమీద పడ్డవి. అవి వాండ్ల తపఃప్రభావమువల్ల పూలదండలు అయినవి. కనుక, ఆ పూలు ఎంతకాలము అయినా పాడు అయిపోకుండా ఉంటూ ఉన్నవి. ఆ మతంగమహర్షి శిష్యులు అందరూ స్వర్గతులు అయిపోయినారు. అయితే, వారి పరిచారిక చిరంజీవినిగా సన్యాసినిగా ఇప్పటికిన్నీ అక్కడనే ఉంది. ఆమె శబరి. ఆమె గురుపరిచర్యా ధర్మము తప్పి ఎరగదు.

"ఓ రామా! నీకు సర్వప్రాణికోటీ నమస్కరిస్తూ ఉంది. నీవు దేవుడితో సరిసమానము అయినవాడవు. ఆ శబరి నీ దర్శనముచేసి స్వర్గానికి పోవలెను అనుకొంటూ, నీ కోసము కనిపెట్టుకొని ఉంటూ ఉంది. రామా! నీవు పంపాసరస్సు పడమటి గట్టుకు పోయేటట్లయితే బయటికి కనపడకుండా ఒక నిగూఢ ప్రదేశములో ఆ శబరి ఉంటూ ఉన్న అసమాన పుణ్యాశ్రమపదము కనపడుతుంది. ఆ వనములోను, అక్కడి ఋశ్యమూకపర్వత ప్రాంతములోను రకరకాల ఏనుగులు అపారముగా ఉన్నవి. మతంగమహర్షి నిర్మించిన మహావనము అయినందువల్ల, ఎన్నో ఏనుగులు అక్కడ ఉన్నప్పటికిన్నీ అవి ఆ పుణ్యాశ్రమపదములోకి పోవు. నానావిధపక్షులూ అక్కడ మనోహరముగా పాటలు పాడుతూ ఉంటవి. నీవు ఆ వనములోనికి పోగానే నీ దుఃఖము అంతా పటాపంచలు అయిపోతుంది. నీకు అక్కడ హాయిగా ఉంటుంది. ఆ పంపాసరస్సుకు ఎదురుగుండా ఋశ్యమూకపర్వతము ఉంది. ఆ పర్వతముమీద చెట్లు అన్నీ ఎప్పుడూ పూలతో ఉంటవి. ఆ పర్వతాన్ని ఏనుగుపిల్లలు ఎప్పుడూ కావలికాస్తూ ఉంటవి. అందువల్ల, ఆ పర్వతముమీదికి పోవడము సులభ సాధ్యము కాదు. బ్రహ్మదేవుడు ఆ పర్వతాన్ని ఒక నిమిత్తము కోసము నిర్మించినాడు. అది ప్రశస్తము అయిన పర్వతము. ఆ పర్వతముమీద పడుకొని నిద్రపోయిన వాడికి

ధనము దొరికినట్టు కలవస్తే, మేలుకొన్న తరువాత యథార్థముగా ధనము దొరుకుతుంది. పాపకర్ముడు, దురాచారుడు ఆ కొండమీదికి పోలేడు. ఒకవేళ ఎవడు అయినా పాపకర్ముడు, దురాచారుడు ఆ కొండ ఎక్కేటట్లయితే, వాడు నిద్రపోతూ ఉండగా రాక్షసులు వచ్చి వాణ్ణి చంపివేస్తారు. మతంగారణ్యములో ఉంటూ ఉన్న ఏనుగుపిల్లలు ఆ పంపాసరస్సులో క్రీడిస్తూ ఉంటే, వాటి ఘీంకారాలు ఆ ఋశ్యమూకపర్వతముమీదికి వినపడుతూ ఉంటవి. నీలమేఘాలవంటి పోతుటేనుగులు పోట్లాడుకొని, పొడుచుకొని నెత్తురుతో తడిసిపోయి వేటికి అవి వేరు అయిపోయి ఆ పంపాతీరాన తిరుగుతూ ఉండడము ఆ ఋశ్యమూకపర్వతము మీదికి కనపడుతూ ఉంటుంది. ఆ యా వనాలలో ఏనుగులు అన్నీ ఆ పంపా సరోవరములో అవ్యయ నిర్మల శీతలోదకాలు తనివితీరాతాగి వాటి వాటి తావులకు పోతూ ఉంటవి. రామా! నీవు అక్కడ పెద్దపులులు, ఎలుగుబంట్లు, నీలమణులవంటి నల్లచారల దుప్పులు నిర్భయముగా తిరగడము చూస్తే నీ విచారము అంతా పోతుంది.

"ఓ రామా! ఆ ఋశ్యమూకపర్వతములో ఒక పెద్దరాయి మూతపెట్టిన ఒక పెద్దగుహ ఉంది. ఆ గుహలోకి పోవడము చాలాకష్టము. ఆ గుహ తూర్పు ద్వారానికి ఎదురుగుండా ఒక చెరువు ఉంది. ఆ చెరువుచూట్టూ నానావిధ ఫలవృక్షాలూ కనపడతవి. అందులో నీళ్లు ఎంతో చల్లగా ఉంటవి. వివిధమృగాలూ అక్కడ యథేష్టముగా తిరుగుతూ ఉంటవి. సుగ్రీవుడు నలుగురు వానరులతోనూ ఆ గుహలలో ఉంటూ ఉన్నాడు. అప్పుడప్పుడు అతడు ఆ పర్వతశిఖరముమీద విహరిస్తూ ఉంటాడు. మీరు వెంటనే బయలుదేరిపోయి ఆ సుగ్రీవుడితో సహవాసము చేయవలెను" అని చెప్పి ఆ కబంధుడు పూలదండలతో, దివ్యరూపముతో ఆకాశములో సూర్యుడివలె తేజరిల్లుతూ కనిపించినాడు.

అట్లా ఆకాశములో ధగధగలాడుతూ కనిపించిన ఆ కబంధుణ్ణి చూచి రామలక్ష్మణులు, "ఓ కబంధుడా! ఇంక నీదారిన నీవు హాయిగా పో" అని చెప్పినారు. ఆ కబంధుడు రామలక్ష్మణులతో, "ఓ సోదరులారా! మీరూ ఇప్పుడే బయలుదేరి పొండి. మీపని నెరవేరుతుంది" అని చెప్పి ఋశ్యమూకపర్వతానికి పైనుంచి దారి చూపిస్తున్న వాడివలె దివ్యరూపముతో ఆకాశమార్గాన పోతూ మళ్ళీ రామలక్ష్మణులతో, "ఓ రామా! నీవు తప్పకుండా సుగ్రీవుడితో స్నేహము చేసుకో" అని చెప్పినాడు.

74

శబరి వృత్తాంతము

రామలక్ష్మణులు సుగ్రీవుణ్ణి కలుసుకోవడానికి కబంధుడు చెప్పినట్టు పడమటి దిక్కుగా బయలుదేరి పోయి ఆ యా కొండలు దాటుతూ, ఆ యా అరణ్యాలలో తేనె

రుచులు ఊరే పండ్లుతింటూ, ఆ రాత్రికి ఆ దారిలో ఒక కొండమీద విశ్రమించి, మరునాడు ఉదయము బయలుదేరి పంపాసరోవర పశ్చిమతీరము చేరినారు.

అక్కడ శబరి ఉంటూ ఉన్న రమ్యాశ్రమము చూచినారు. ఆ ఆశ్రమము చుట్టూ ఎన్నో మహోన్నత వృక్షాలు ఉన్నవి. ఆ వృక్ష రామణీయకము చూస్తూ ఆ ఆశ్రమ పదములోకి పోయినారు. అట్లా తన ఆశ్రమానికి వస్తూ ఉన్న ఆ రామలక్ష్మణులను ఆ సిద్ధురాలు శబరి చూచింది. చూచీ చూడడముతోనే ఆమె చేతులు జోడించి రాముడి పాదాలకు నమస్కారము చేసింది. లేచి లక్ష్మణుడి పాదాలకు నమస్కారము చేసింది. ఆ అన్నదమ్ములకు ఆమె యధాశాస్త్రముగా అర్ఘ్యము, పాద్యము, ఆచమన జలము ఇచ్చింది. అంతట ఆ పరమవృద్ధు, సిద్ధులందరూ పూజించే ఆ సిద్ధాంగన వారి ఎదుట చేతులు జోడించి నిలుచున్నది.

రాముడు ఆ తీక్ష్ణతపోవ్రతను, ఆ శ్రమణిని చూస్తూ, "ఓ శబరీ! నీవు తపస్సే నీ ధనము అనుకొన్నావు. సంతోషము. నీ తపస్సుకు అంతరాయాలను అన్నిటినీ జయించినావా? నీవు కోపాన్ని జయించినావా? ఆహారాన్ని నిగ్రహించినావా? నీవు పట్టవలసిన వ్రతాలన్నీ పట్టినావా? నీ తపస్సు పెరుగుతూ ఉందా? నీ మనస్సు సుఖముగా ఉందా? నీ గురుసేవ సఫలము అయిందా? ఓ చారుభాషిణీ! చెప్పు" అంటూ రాముడు అడిగినాడు.

"ఓ రామా! నీ దర్శనమువల్ల నా తపస్సు అంతా ఫలించింది. నాకు ఇప్పుడు తపస్సిద్ధి అయింది. నా గురుసేవ సఫలము అయింది. ఓ పురుషోత్తమా! నీవు దేవతలు అందరిలోనూ శ్రేష్ఠుడవు. నిన్ను పూజించే భాగ్యము నాకు ఇప్పుడు కలిగింది. ఇప్పుడు నా జన్మ సఫలము అయింది. నాకు ఇకను స్వర్గమే సిద్ధిస్తుంది. ఓ అరిందమా! ఓ రఘునందనా! ఓ రామా! నీ చల్లని చూపువల్ల నేను ఇప్పుడు పరిశుద్ధురాలను అయినాను. నీ అనుగ్రహమువల్ల అక్షయము అయిన దివ్యలోకాలకు పోతాను."

"ఓ ప్రభూ! నేను మతంగమహాముని శిష్యులు అయిన మహర్షులకు సేవచేస్తూ ఉండేదాన్ని. ఆ మహాభాగులు, ఆ ధర్మజ్ఞులు నీవు చిత్రకూటము వచ్చి చేరిన రోజులలో దివ్యవిమానాలమీద స్వర్గలోకానికి పోతూ నన్ను చూచి, 'ఓ శబరీ! రాముడు లక్ష్మణుడితో కూడా ఈ పుణ్యాశ్రమానికి వస్తాడు. నిన్ను చూస్తాడు. నీవు అప్పుడు ఆ రామలక్ష్మణులకు అతిథి సత్కారము చేయవలెను. రామసందర్శనము వల్ల నీకు అత్యుత్తమ అక్షయలోకాలు ప్రాప్తము అవుతవి' అని చెప్పినారు.

"ఓ పురుషోత్తమా! అప్పటినుంచి ఈ పంపాతీరాన దొరికే వివిధవన్య ఫలాలను సంపాదించి నీకోసము దాచి పెట్టి ఉంచినాను. కాబట్టి నా ఆతిధ్యాన్ని నీవు, నీ

తమ్ముడు అంగీకరించవలెను" అంటూ ఎన్నడూ బ్రహ్మజ్ఞానానికి వెలికాకుండా ఉంటూ ఉన్న ఆ శబరి వారిని సత్కరించింది.

అంతట ఆ ధర్మాత్ముడు రాముడు, "ఓ శబరీ! దనువంశీయుడు కబంధుడు నీ గురువుల ప్రభావాన్ని గురించీ, నిన్ను గురించీ నాకు చెప్పినాడు. నీకు ఇష్టము ఉన్నట్లయితే నీ గురువుల ప్రభావము, ఇక్కడి విశేషాలు నాకు చూపించ వలసింది" అన్నాడు. ఈ మాట రాముడి నోటినుంచి వచ్చి రావడముతో శబరి రామలక్ష్మణులకు ఉభయులకున్నూ ఆ మహావనము అంతా చూపిస్తూ, "ఓ రామా! మేఘసమూహాల వంటి వృక్షాలతోను, నానావిధమృగపక్షిగణాలతోను కనపడుతున్నది ఇదే 'మతంగ వనము' అని ప్రసిద్ధికి ఎక్కింది. ఓ కాంతిమంతుడా! ఇక్కడనే పరమాత్మవేత్తలు అయిన మా గురువులు మంత్రవేత్తలు అయిన ఋత్విజులను ముందు ఉంచుకొని మంత్రయుక్తముగా యజ్ఞాలు చేసినారు. ఇదిగో ఇదే, ఆ యజ్ఞవేదిక. నా గురువులు వార్ధక్యమువల్ల చేతులు వణకుతూ పూజ చేసిన యజ్ఞ వేదిక పడమటిమిట్ట ఇదే. నేను నా గురువులకు శ్రద్ధాసక్తులతో సేవచేస్తూ ఉండేదాన్ని. వారి తపఃప్రభావమువల్లనే ఈ యజ్ఞవేదులు ఇప్పటికీ అసమానకాంతులతో దిశలు అన్నిటినీ శోభిల్ల చేస్తున్నవి. వారు, నా గురువులు ఉపవాసాలవల్లను, వార్ధక్యమువల్లను స్వయముగా పోలేక ఇక్కడికే సప్తసాగరాలను తెప్పించినారు. అదిగో, అదే సప్తసాగరాలు వచ్చి చేరిన సరస్సు. వారు అందులో స్నానముచేసి చెట్లమీద ఆరవేసుకొన్న వల్కలాలు, వారు లేనందువల్ల ఇంకా తడితడిగానే ఉన్నవి. దేవపూజ కోసము నల్లకలువలతోను, ఇంకా ఇతర పూలతోను ఆ మహర్షులు కట్టిన పూలదండలు అవిగో, ఇప్పటికీ ఇంకా వాడిపోలేదు.

"ఓ రామా! నీవు ఈ వనము అంతా చూచినావు. వినవలసిన విషయాలు అన్నీ విన్నావు. నాకు అనుమతి ఇచ్చేటట్లయితే ఈ శిథిల దేహాన్ని త్యజించి వేస్తాను. నేను పరిచర్యచేసిన ఆ పరమాత్మవేత్తల దగ్గరకు వెళ్ళిపోవలెను అని కోరికగా ఉంది" అని చెప్పింది.

రామలక్ష్మణులు ఆ శబరి సత్కారానికి ఎంతో సంతోషించినారు. ఆ తపోవన వైభవానికి ఆశ్చర్య పడిపోయినారు. అంతట రాముడు, "ఓ శబరీ! నీవు భక్తితో నన్ను సత్కరించినావు. పూజించినావు. ఇంక నీవు సుఖముగా, యధేష్టముగా దివ్యలోకానికి పో" అని చెప్పినాడు.

రాముడు అట్లా అనుజ్ఞ ఇవ్వగానే తల అంతా జడలుకట్టుకొనిపోయి వల్కలాలు ధరించి, కృష్ణాజినాలు కప్పుకొని ఉన్న ఆ వృద్ధురాలు శబరి ఆమె శిథిల దేహాన్ని వదలిపెట్టడానికి అగ్నిప్రవేశము చేసింది.

అంతట ఆమె దివ్యాభరణాలతో, దివ్యాంబరాలతో, దివ్యమాల్యాను లేపనాలతో, జ్వలితాగ్నిహోత్ర కాంతులతో, అత్యంత దర్శనీయము అయిన రూపముతో ఆకాశములో మెరుపుతీగవలె తళతళ లాడుతూ, పరమాత్మవేత్తలూ, ఆమె గురువులూ అయిన మహర్షులు నివసిస్తూ ఉన్న పుణ్యలోకానికి సమాధియోగ బలమువల్ల అప్పటికి అప్పుడు పోయింది.

75

శబరి దివ్యకాంతులతో తేజరిల్లుతూ స్వర్గానికి వెళ్లిపోయిన తరువాత, ఆ ధర్మాత్ముడు రాముడు అక్కడ నివసించిన మహామునుల ప్రభావాన్ని గురించి ఆలోచించి ఆలోచించి, తనకు ఎన్నడూ మేలుచేసే ఏకాగ్రచిత్తుణ్ణి లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! పరమాత్మవేత్తలు అయిన మహర్షుల ఆశ్రమపదాన్ని చూచినాము. అనేక ఆశ్చర్య విషయాలు తెలుసుకొన్నాము. పెద్దపులులు మొదలు అయిన వన్యమృగాలు ఇక్కడ అన్యోన్యవైరము లేకుండా నిర్భయముగా తిరగడము చూచినాము. ఇక్కడ నానావిధ పక్షుల కుహూనాదాలు విన్నాము. ఈ సప్తసాగర తీర్థములో స్నానముచేసి మనము పితృతర్పణాలు వదలినాము. కాబట్టి, ఆ యా అమంగళాలు అన్నీ మనను వదలిపెట్టి పోయిఉంటవి అనుకొంటున్నాను. త్వరలోనే మనకు శుభము అవుతుంది. యధార్థము. అందువల్లనే, నా మనస్సుకు తృప్తిగా ఉంది. శుభము జరగపోయేటప్పుడు ముందుగా మనస్సుకు తోస్తూ ఉంటుంది. మనము ఇప్పుడే ఇక్కడనుంచి వెళ్ళిపోదాము. ఆ ధర్మాత్ముడు సూర్యపుత్రుడు సుగ్రీవుడు వాలి భయమునుంచి పంపాసరోవర సమీపాన ఉన్న ఋష్యమూకపర్వతముమీద నివసిస్తున్నాడు అని మనము విన్నాము. అందువల్ల, మనము ఆ రమణీయము అయిన పంపాసరస్సుకు పోవలెను. ఆ వానర శ్రేష్ఠుడు సుగ్రీవుడు సీతాదేవిని వెదకిపెట్టుతాడు అని కబంధుడు చెప్పినందువల్ల అతణ్ణి ఎప్పుడు చూద్దామా అనుకొంటున్నాను" అని చెప్పినాడు.

"అన్నా! ఇప్పుడే వెళ్ళిపోదాము. నా మనసు కూడా నన్ను తొందరపెట్టుతూ ఉంది" అన్నాడు లక్ష్మణుడు. అంతట ఆ శత్రుసంహారకులు రామలక్ష్మణులు పంపా సరోవరానికి బయలుదేరినారు.

ఎర్రతామరపూలతోను, ఎర్రకలవపూలతోను, ఎర్రగాను గుంపులు గుంపులుగా ఉన్న తెల్లకలవపూలతో తెల్లగాను, గుంపులు గుంపులుగా ఉన్న నల్ల కలవలతో నల్లగాను దూరానికి ఆ పంపాసరస్సు చిత్రకంబళమువలె రామలక్ష్మణులకు గోచరించింది. దాని చుట్టూ ఉన్న నానావిధతరులతలు నేత్రపర్వముగా కనిపించినవి. ఆ ఎర్రతామరపూలతోను, తెల్లతామరపూలతోను, నల్లకలవపూలతోను, తీరాన ఉన్న

అనేకవృక్షాలతోను, మామిడితోపులతోను, ఆ యా తోపులలో ఉన్న నెమళ్లు మొదలు అయిన పక్షులకేకలతోను సమస్త ఆభరణాలు పెట్టుకొని దగ్గరకు రమ్మని పిలుస్తున్న ప్రౌఢాంగనవలె ఆ పంపాసరస్సు అప్పుడు ఆ అన్నదమ్ములకు కనిపించింది.

ఆ పంపాసరస్సు బాగా దూరముగా ఉన్నందువల్ల, దారిలో దగ్గరగా ఉన్న మతంగసరస్సులో రామలక్ష్మణులు స్నానము చేసినారు. అంతట వారు ఏమరుపాటు లేకుండా హెచ్చరికతో ఆ ప్రాంతము అంతా చూస్తూ నడచినారు. అక్కడ విరగపూసిన వివిధవృక్షాలతోను, చీకుకొక్కెరలు, నెమళ్లు, బెగ్గురుపక్షులు, చిలుకలు మొదలు అయిన పక్షుల కలకలధ్వనులతో కలకలలాడుతూను ఉన్న వనములోనుంచి పోతూ ఆ పంపాసరోవరతీరాన ఉన్న అందము అయిన బొట్టుగుచెట్లను, అశోకచెట్లను, పున్నాగచెట్లను, పొగడచెట్లను, విరిగిచేవచెట్లను చూచినారు. ఆ యా సరస్సులను, ఆ యా వృక్షాలను చూస్తూ నడుస్తూ ఉంటే, రాముడి మనస్సు సీతాదేవిమీదికి పోయింది. కామపీడితుడు అయినాడు. ఆ పంపాసరోవరములో స్ఫటికాల కాంతులతో ఉన్న నిర్మలోదకాలను, మెత్తని ఇసుకను పదే పదే చూచి రాముడు లక్ష్మణుడితో, "తమ్ముడా! ఈ సరోవరతీరాన్నే గైరికాదిధాతువులతో ధగధగలాడుతూను, పవిత్రములయిన పుష్పఫలవృక్షాలతో కలకలలాడుతూను ఋష్యమూకపర్వతము కనిపిస్తూ ఉంటుంది అనీ; అక్కడ ఆ మహాపరాక్రమశాలి ఋక్షరజుడి పుత్రుడు సుగ్రీవుడు ఉన్నాడు అనీ మనకు కబంధుడు చెప్పినాడు. నాయనా! నీవు అక్కడికి పోయి రావలెను అని చెప్పి మళ్ళీ, లక్ష్మణా! నేను రాజ్యభ్రష్టుణ్ణి. దీనుణ్ణి. ఆ సీత నా వెంట ఉండడము నుంచి ఇన్నాళ్లూ అన్నీ మరచిపోయినాను. ఇప్పుడు నా మనస్సు అంతా ఆ సీతమీదనే ఉంది. ఆ సీత లేకుండా నేను ఇంక బ్రతికి ఉండడము ఎట్లా? నీవే ఆ సుగ్రీవుడిదగ్గరకు పోయిరా" అంటూ ఆ అనన్య చేతస్కుడు మన్మథతాపముతో, మనోవ్యాకులముతో, దుఃఖముతో వెంట ఉన్న లక్ష్మణుడితో చెప్పి, మనోహరము అయిన ఆ పంపాసరస్సు దగ్గరకు నడిచినాడు.

అరణ్యకాండ - సమాప్తము

కిష్కింధాకాండ

కిష్కింధాకాండ

1

రాముని ఆవేదన

రాముడు లక్ష్మణుడితో కూడా పంపాసరస్సు దగ్గరకు పోయినాడు. ఆ సరోవరము నిండా గలిబిలిగా ఉన్న కమలాలనూ, నల్లకలువలనూ, చేపలనూ చూచినాడు. ఆ కమలాల నుంచి సీతాదేవి ముఖకమలమూ, ఆ నల్లకలువల నుంచి ఆమె నేత్రాలూ, ఆ చేపల చూపుల నుంచి ఆమె కడకంటి చూపులూ అతడికి జ్ఞాపకము వచ్చినవి. కామపరవశుడు అయినాడు. దుఃఖపడ్డాడు. ఆతని దేహేంద్రియాలు కంపించిపోయినవి. విలపించినాడు.

ఆ పంపాసరస్సును చూచీ చూడటముతో రామునికి సంతోషము వేసింది. దేహము ఉప్పొంగి పోయింది. లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! ఈ పంపాజలాలు వైఢూర్యమణివలె నిర్మలముగా ఉన్నవి. కమలాలూ, కలువలూ మనోహరముగా వికసించినవి. తీరాన ఉన్న వృక్షాలు ఎత్తు అయిన శిఖరాలతో పెద్ద కొండలవలె కనపడుతున్నవి. ఈ పంపాతీరారణ్యాము శోభాయమానముగా ఉంది.

"లక్ష్మణా! అటు భరతుడు అయోధ్య వెలుపల వ్రతోపవాసాదులతో ఉంటూ ఉన్నందువల్లనూ, ఇటు సీతను కోలుపోయినందువల్లనూ నేను దుఃఖముతో తపించిపోతున్నాను. ఈ మనోవ్యధలు నన్ను పీడిస్తున్నవి. ఇట్లా నేను ఒకటి రెండు దుఃఖాలతో బాధపడుతూ ఉన్నప్పటికిన్నీ ఇక్కడ చిత్రవిచిత్రముగా కనపడుతున్న ఈ అడవులనూ, రకరకాల పూలు రాలిన ఈ నేలనూ, శుభకరము అయిన ఈ పంపా నిర్మలోదకాలనూ చూస్తూ ఉంటే సంతోషము వేస్తున్నది. ఈ సరస్సు నిండా కమలాలూ, కలువలూ విరగపూసినవి. వివిధ మృగాలూ ఇక్కడ హాయిగా తిరుగుతున్నవి. పక్షులు పాటలు పాడుతూ ఉన్నవి. నలుపు ఎక్కిన పచ్చిక బయళ్ళ మీద రంగు రంగుల పూలు రాలినందువల్ల నేలమీద రత్నకంబళము పరచినట్లుగా ఉంది.

"లక్ష్మణా! దండిగా పూలు పూసిన పెద్ద పెద్ద చెట్లను పూలు విరగపూసిన లతలు అంతటా అల్లుకొని, సమస్తాభరణాలతోనూ అలంకరించుకొన్న ప్రియులను వారి వారి కాంతలు కౌగలించుకొన్నట్టుగా కనపడుతున్నవి. నాయనా! ఇది వసంతకాలము. చెట్లు అన్నీ పూలు పూస్తూనూ, కాయలు కాస్తూనూ ఉన్నవి.

సువాసనలతో గాలి మహా హాయిగా వీస్తూ మన్మథోద్దీపకముగా ఉంది. గాలి ఉరవడికి వివిధ వృక్షాలు కదులుతూ నేలమీదనూ, రమ్యము అయిన రాళ్ళమీదనూ పూలు వెదజల్లుతూ ఉన్నవి. వానలు కురిపించే మేఘాలవలె ఈ అడవిలో చెట్లు అన్నీ పూలవానలు కురిపిస్తూన్నవి. నేల రాలిన పూలనూ, నేల రాలుతూ ఉన్న పూలనూ, చెట్లమీదనే ఉన్న పూలనూ చూస్తూ ఉంటే, వాయువు పూలబంతుల ఆటలు ఆడుతూ ఉన్నట్టుగా ఉంది. విరగపూసిన చెట్లకొమ్మలను వాయువు ఆడిస్తూ ఉంటే, ఆ పూల మీద నిలువలేకుండా ఆ వాయువుకు వంత పాడుతున్నట్టుగా తుమ్మెదలు ఝుంకారము చేస్తూ ఉన్నవి. వెనుకనుంచి పాటలు పాడుతూ, నటులచేత నర్తనము చేయించే వాడివలె మదించిన కోకిల ధ్వనులతో పాటలు పాడుతూ, చెట్లచేత నర్తనము చేయించటానికి వస్తూ ఉన్నట్టు వాయువు పర్వత గుహలలో నుంచి బయటకు వీస్తూ ఉంది. అన్ని వైపులా అమితంగా వీస్తూ ఉన్న గాలి నుంచి ఆయా చెట్ల కొమ్మలు అన్నీ పెనవేసుకొని ఆ యా చెట్లు అన్నీ పూలదండలు కట్టుతున్నట్టు కనపడుతున్నవి. ఇప్పుడు గాలి బడలికను పోగొట్టుతూ, సుగంధము గుబాళిస్తూ చందనశీతలముగా ఒంటికి సుఖాన్ని ఇస్తూ వీస్తూ ఉంది. మధుగంధము గుబాళిస్తున్న ఈ వనములో వృక్షాలు అన్నీ గాలికి కదులుతూ, తేనెటీగల ధ్వనులనుంచి అరుస్తు న్నట్టుగా ఉన్నవి. రమణీయము అయిన కొండ నెత్తాలలో, మనోహరముగా పూలు పూచిన మహావృక్షాలు అన్నీ ఆ యా పర్వత శిఖరాలను అందుకొంటున్నందువల్ల ఆ యా పర్వతాలు అన్నీ పూలరాసులవలె విరాజిల్లుతున్నవి. ఆ వృక్షశిఖరాలమీద పూలు అన్నీ గాలి ఉరవడికి కదులుతూనూ, ఆ పూలచుట్టూ తుమ్మెదలు ఝుంకారాలు చేస్తూనూ ఉండడము చూస్తూ ఉంటే, నల్లటి వెంట్రుకలతో పూలు ముడుచుకొన్న గాయకులు తలలు ఆడిస్తూ, పాటలు పాడుతూ, నృత్యము చేస్తూ ఉన్నట్లు ఆ వృక్షాలు కనబడుతున్నవి. అవిగో చూడు, కొండ గోగుచెట్లు అంతటా విరగబూసి బంగారు ఆభరణాలు పెట్టుకొని, పీతాంబరాలు కట్టుకొన్న పురుషులవలె అగపడుతున్నవి.

"లక్ష్మణా! ఇది వసంత ఋతువు. సీతాదేవి లేదు. రకరకాల పక్షులు పాటలు పాడుతూ ఉంటే నాకు దుఃఖము వస్తున్నది. దుఃఖాక్రాంతుణ్ణి అయిన నన్ను, మన్మథుడు మరింత బాధ పెట్టుతున్నాడు. తాపము ఎత్తిస్తున్నాడు. కోకిల నన్ను వెక్కిరిస్తునట్టుగా సంతోషముతో కుహూనాదాలు చేస్తూ ఉంది. మనోహరము అయిన ఆ సెలఏటి దగ్గర ఉన్న నీరుకోడి సంతోషముతో అరుస్తూ, మన్మథావిష్టుణ్ణి అయిన నన్ను ఎంతో దుఃఖపెట్టుతూ ఉంది. మనువు ఆశ్రమములో ఉంటూ ఉన్నప్పుడు, నా ప్రియురాలు సీత, ఈ నీరుకోళ్ళ ధ్వనులు వినగానే ఎంతో సంతోషముతో నన్ను పిలిచి వాటిని చూపించేది. వాటిని మెచ్చుకొనేది. చూడు, రకరకాల పోతుపిట్టలూ, పెంటిపిట్టలూ వచ్చి పాటలు పాడుతూ, వృక్షలతాగుల్మాదుల మీద వాలుతున్నవి.

మగపిట్టలు ఆడుపిట్టలను కలుసుకొని తమ తమ చేష్టలకు మెచ్చుకొంటున్నవి. వాటిని చూచి గండుతుమ్మెదలు సంతోషముతో మధుర ధ్వనులు చేస్తున్నవి. ఇట్లా ఈ పంపాతీరాన పక్షులు గుంపులు గుంపులుగా కూడి సంతోషపడుతున్నవి. ఈ వృక్షాలు కోకిల ధ్వనులతోనూ, నీరుకోళ్ళ ధ్వనులతోనూ నాకు మరులు పుట్టిస్తున్నవి. అశోక వృక్షానికి పూసిన పూలే కణకణలాడే నిప్పులుగానూ, తుమ్మెదల ధ్వనులే ఆ నిప్పుకణాలు పెట్లుతూ చేసే చిటపట చప్పుళ్ళుగానూ, చిగుళ్ళే భగభగ మండుతూ ఉన్న మంటలుగానూ ఈ వసంతాగ్ని నన్ను కాల్చి వేస్తున్నది.

"లక్ష్మణా! ఆ మృదుభాషిణి, ఆ సుకేశి, ఆ సూక్ష్మపద్మాక్షి సీతాదేవి లేకుండా నేను బ్రతికి ఉండడంవల్ల ప్రయోజనము లేదు. అందమయిన అడవులలో అన్నివైపులా కోకిలల మధురాలాపాలతో వసంత ఋతువు రాగానే నా భార్య సంతోషపడుతూ ఉండేది. లక్ష్మణా! మన్మధబాధవల్ల నాలో శోకాగ్ని రగులుకొన్నది. వసంతఋతువు అయినందువల్ల ఇప్పుడు అది పెద్ద మంటలు మండుతూ ఉంది. ఇకను ఆలస్యము లేకుండా అది నన్ను దహించి వేస్తుంది. ఇప్పుడు ఆ నా ప్రియురాలు కనపడకుండా, మనోహరము లయిన వృక్షాలు కనబడుతున్నందువల్ల మన్మధుడు మరింత తాపము ఎత్తిస్తున్నాడు. ఆ వైదేహి నా కంటికి అగుపడకుండా ఉన్నందువల్ల నా దుఃఖము పొంగి పొర్లుతూ ఉంటే, అగుపడుతూ ఉన్న ఈ వసంతము మలయమారుతము వీస్తూ నాకు చెమట అయినా పోయకుండా నన్ను కష్టపెట్టుతున్నది. లక్ష్మణా! ఆ మృగశాబాక్షి సీతాదేవిని తలుచుకుంటూ నేను దుఃఖముతో బాధపడుతూ ఉంటే, ఈ వసంతవాయువు అతి క్రూరముగా నాకు తాపము ఎత్తిస్తున్నది.

"తమ్ముడా! అటుచూడు. ఆ కొండనెత్తాలలో నెమళ్ళు నాట్యము చేస్తూ ఉంటే, స్ఫటికాల కిటికీలవంటి వాటి రెక్కలు గాలికి ఎగురుతూ ఎంతో శోభాయమానముగా కనబడుతున్నవి. అట్లా ఆటలు ఆడుతూ ఉన్న పోతునెమళ్ళు ఒండ్లు ఎరుగకుండా నాట్యము చేస్తున్నవి. వాటిని చూస్తూ ఉంటే నా బాధ ఎక్కువ అవుతూ ఉంది. ఆ కొండ నెత్తాలలో వెతుకుకొంటూ పోయిన పెంటినెమలి నాట్యము చేస్తూ ఉన్న తన పోతునెమల్ని చూచి మన్మధార్త అయి అది ఆ పోతునెమలితో నాట్యము చేస్తూ ఉంది. చూడు, ఆ పోతునెమలి తన సొగసు అయిన రెక్కలు విప్పి ఆడుతూ నన్ను చూచి ఎగతాళి చేస్తున్నట్టు కేకలు వేస్తూ, ఆడుతూ పరుగెత్తుతున్న తన ప్రియురాలి వెంట పడుతున్నది. ఇంతకూ ఆ పెంటినెమలిని రాక్షసుడు ఎవడూ ఎత్తుకొనిపోలేదు. అందువల్లనే, ఆ పోతునెమలి ప్రియురాలితో కూడా మనోహరము అయిన ఆ కొండ నెత్తములో నృత్యము చేస్తున్నది. తమ్ముడా! ఈ వసంత కాలములో నేను ఇవి అన్నీ చూస్తూ ఈ అడవిలో ఉండలేను.

"లక్ష్మణా! పురుషుడు స్త్రీ వెంట పడతాడు అనేది లోక ప్రసిద్ధము. కాని, అటు చూడు. కామాతిశయమువల్ల ఆడునెమలే పోతునెమలివెంట పడుతున్నది. తమ్ముడా! తిర్యక్కులలో కూడా ఎంత రాగాతిశయము ఉందో చూడు. నా ప్రియురాలిని జానకిని రాక్షసుడు ఎత్తుకొనిపోకపోయినట్లయితే, ఆ విశాలాక్షికూడా ఈ వసంతఋతువులో మదన ప్రేరిత అయి నామీదికి వచ్చేది.

"తమ్ముడా! ఈ అడవిలో ఇంత సమృద్ధముగా పూసిన పూలు అన్నీ నాకు ప్రయోజనము మాలినవి అయిపోయినవి. అందువల్లనే, అంత నిగనిగలాడుతూ ఉన్న పూలను నేను ఉపయోగించుకోకుండా వదలిపెట్టడమూ, వాటి మధువును తుమ్మెదలు గ్రోలటమూ, అవి అందువల్ల నేల రాలటమూ జరుగుతున్నది.

"లక్ష్మణా! చూడు. పక్షులు గుంపులు గుంపులుగా చేరి సంతోషాతిశయముతో మహామధురముగా కేకలు పెట్టుతూ అన్యోన్యము ఆహ్వానించుకొంటున్నట్లు ఉన్నవి. తమ్ముడా! ఆ పక్షుల మధురాలాపాలు వింటూ, వాటిని చూస్తూ ఉన్న నాకు, ఇప్పుడు కామాతిశయమువల్ల పిచ్చి ఎత్తేట్టుగా ఉంది.

"లక్ష్మణా! నా ప్రియురాలు ఉన్నచోటకూడ ఇప్పుడు వసంత ఋతువే అయ్యేట్లయితే, ఆమె మన్మథపారవశ్యముతో నావలెనే తప్పకుండా దుఃఖపడుతూ ఉంటుంది. బాధపడుతూ ఉంటుంది. ఆమె ఉన్నచోట ఇప్పుడు నిజముగా వసంత ఋతువు కాకపోయినా, నా ఎడబాటునుంచి ఆ అసితపద్మాక్షి సుఖముగా ఉండదు. బాధపడుతూనే ఉంటుంది. దుఃఖపడుతూనే ఉంటుంది. ఒకవేళ నా ప్రియురాలు ఉన్నచోట కూడా వసంత ఋతువే అయినట్లయితే ఆమె చుట్టూ రాక్షసులు చేరి బెదిరించుతూ ఉంటే ఆ సుశ్రోణి ఏమి చేస్తుంది? ప్రాణము వదలుతుంది.

"తమ్ముడా! ఆ పద్మపత్రాక్షి, ఆ మృదుమధురభాషిణి సీతాదేవి యౌవనమధ్యస్థ అయినందువల్లనూ, పరమపతివ్రత అయినందువల్లనూ నా ఎడబాటు ఓర్చుకోలేదు. తప్పకుండా ప్రాణము వదులుతుంది. అంతే. ఆమె బ్రతుకదు అని నాకు గట్టిగా తోస్తుంది. ఆ వైదేహి తన అనురాగము అంతా నామీదనే ఉంచింది. నేనూ అన్నివిధాలా నా అనురాగము అంతా ఆ సీతమీదనే ఉంచినాను. అందువల్ల, మేము ఒకరిని ఒకరము వదలిపెట్టి జీవించి ఉండడము ఉత్తది.

"లక్ష్మణా! నా కాంతను గురించి ఆలోచిస్తున్న ఈ సమయములో చల్లగా, హాయిగా ఘుమఘుమ వాసనలు కొట్టుతూ వీస్తున్న గాలి నన్ను అగ్నిహోత్రమువలె దహించివేస్తోంది. ఇదివరకు సీతతోకూడా ఉన్నప్పుడు హాయిగా వీస్తున్నది అనుకొనే గాలే, ఇప్పుడు సీత లేనందువల్ల నన్ను మహాబాధ పెట్టుతున్నది.

"తమ్ముడా! ఇదివరకు అంతరిక్షములో అతిపరుషముగా కాకి కూసి ఆమె వియోగాన్ని సూచించింది. ఆ సీత నా సరసను లేని ఈ సమయములో ఇప్పుడు ఈ కాకి చెట్టుమీద కూర్చొని సంతోషముగా 'కా కా' అని అరుస్తూ ఆ సీతాసంయోగాన్ని సూచిస్తున్నది. కాకే పంచవటిలో సీతా వియోగాన్ని కలుగచేసింది. ఇప్పుడు కాకే నన్ను ఆ విశాలాక్షి సీతదగ్గరకు తీసుకొనిపోతుందేమో!

"తమ్ముడా! ఈ అడవిలో పూలు పూసిన చెట్లకొమ్మమీద కూర్చున్న పక్షుల మహామధుర ధ్వనులు వింటున్నందువల్ల, నేను కామపరవశుణ్ణి అవుతున్నాను, చూడు. కామాతుర అయి కంపించిపోతూ ఉన్న ప్రియురాలి దగ్గరకు పోయే ప్రియుడివలె, గాలికి కదులుతున్న బొట్టుగు పూగుత్తి దగ్గరకు తుమ్మెద పోతున్నది, చూడు. విరహిజనులకు శోకము వృద్ధి చేసే ఈ అశోక వృక్షము, గాలికి కదులుతున్న పూలగుత్తులతో నన్ను బెదరకొట్టుతున్నది. తమ్ముడా! ఈ మామిడిచెట్టు చూడు. విరగపూసినందువల్ల దేహమునిండా చందనచర్చ చేసుకొని విలాసముతో విర్రవీగే కాముకుడివలె కనపడుతున్నది.

"ఓ నరశార్దూలమా! ఈ పంపాతీరాన చిత్రవిచిత్రముగా ఉన్న ఈ వనాలలో కిన్నరులు విహరిస్తున్నారు. కమ్మని వాసనలు కొట్టుతూ ఈ పంపాసరస్సులో ఉన్న కమలాలు బాలభాస్కరులవలె ధగధగలాడుతున్నవి. నిర్మలోదకాలతోనూ, పద్మాలతోనూ, సౌగంధికాలతోనూ, హంసలతోనూ, కారండవ పక్షులతోనూ ఈ సరస్సు కళకళలాడుతూ ఉన్నది. జలము అంతటా పద్మాలూ, తుమ్మెదలు కదిలించిన పద్మకింజల్కాలూ వ్యాపించి, ఈ పంపాసరోవరము బాలసూర్యునివలె వెలుగొందుతున్నది. తీరాన చిత్ర విచిత్రము లయిన కొండ నెత్తాలతోనూ, అరణ్యమధ్యప్రదేశాలతోనూ, నీళ్ళు త్రాగవచ్చిన ఏనుగుల మందలతోనూ, జింకల గుంపులతోనూ, చక్రవాక పక్షులతోనూ ఈ పంపాసరస్సు ఎంతో శోభాయమానంగా ఉంది. గాలి ఉరవడికి పంపానిర్మలోదకాలు అలలు అలలుగా లేచి పద్మాలమీద పడుతూ ఉంటే, అవి మహామనోహరముగా కనబడుతూ ఉన్నవి. ఇటువంటి కమలాలను చూచి ఎప్పుడూ ముచ్చటపడే ఆ పద్మపత్ర విశాలాక్షి వైదేహి లేకుండా బ్రతకడము నాకు ఇష్టము లేదు. ఎప్పుడూ కల్యాణాత్మకము అయిన కబుర్లు చెప్పే ఆ కల్యాణి సీతాదేవి ఇప్పుడు ఎక్కడ ఉందో! ఆమె ఉన్న తావు తెలుసుకోవటము దుర్లభముగా ఉన్న ఈ దురవస్థలో మాటిమాటికి ఆమెనే తలుచుకొనేటట్టు చేస్తూన్న మన్మధుడి వక్రబుద్ధి ఏమి అనవలెను? ఈ వసంత ఋతువూ, ఈ విరగబూసిన చెట్లూ లేకుండా ఉంటే మదనతాపము అణచుకోవడము నాకు అలవి అయ్యేది. ఆ సీతాదేవి నా సరసను ఉన్నప్పుడు ఎంతో రమణీయముగా కనిపించినవే, ఆమె

లేనందువల్ల ఇప్పుడు అసహ్యాముగా కనబడుతున్నవి. కమల కేసరాలతో చెట్ల సందులలో నుంచి వస్తూన్న గాలి, ఆ సీతాదేవి నిట్టూర్పులను జ్ఞాపకము చేసి నాకు తాపము ఎత్తిస్తూ ఉంది.

"లక్ష్మణా! చూడు. ఈ పంపాసరస్సు దక్షిణతీరాన ఉన్న కొండ నెత్తములో పరమశోభనముగా పూచిన కర్ణికార వృక్షాన్ని చూస్తూంటే, సీతాదేవి దేహయష్టి జ్ఞాపకము వస్తుంది. నానావిధ ధాతువులతో ఉన్న ఈ పర్వతము మీదినుంచి గాలి వరవడికి నానావర్ణ పరాగాలూ కొట్టుకొని వస్తున్నవి. ఈ పర్వత సానువులలో పలాశ వృక్షాలు అంతటా పూలు పూసినందువల్ల, భగభగ మండుతూ ఉన్న మంటలవలె కనపడుతున్నవి.

"తమ్ముడా! ఈ పంపాతీరాన మల్లెతీగెలూ, జాజితీగెలూ, గన్నేరుచెట్లూ, మొగలిపొదలూ, వావిలిచెట్లూ, అడవిమొల్లలూ, పూలగురివిందలూ, మంచి మొల్లలూ అంతటా పూలు పూసి ఒకదానితో ఒకటి కలుసుకొనిపోయి మధుగంధాన్ని గుబాళిస్తున్నవి. అవిగో, అటు చూడు. కానుగు, ఇప్ప, పొగడ, తినాప, సంపంగి, బొట్టుగు, ఉలిమిరి, ఖర్జూరము, పద్మకము, నీలాకోకము - మున్నగు చెట్లు ఎట్లా విరగబూసినవో చూడు. ఆ పర్వత సానువులలో సింహ కేసరాల వంటి పింజరంగుతో లొద్దుగచెట్లు పూలు పూసినవి. అదేవిధముగా ఊడుగు, గొజ్జగి, పూర్ణకవృక్షాలూ, వేప, మామిడి, కలిగొట్టు చెట్లూ, కోవిదార వృక్షాలూ, నారింజ, కేతకి, విరిగి, దిరిసెన, ఇరుగుడు, సంద్ర- మున్నగు చెట్లు పరమశోభాయమానముగా పూలు పూసినవి. అదిగో, ఆ కొండక్రింద బూరుగు, మోదుగ, నేమి, చందనము, స్పందనపు చెట్లు రమణీయముగా పూలు పూసినవి.

"తమ్ముడా! ఎంతో అందముగా పూలు పూసిన చెట్లను అల్లుకొని ఉన్న పూలతీగలున్నూ పూలు పూసినవి. ఆ యా చెట్లకొమ్మలు గాలికి కదులుతూ ఉంటే, ప్రియుడు ఎటుపోయినా వదిలిపెట్టకుండా వెంటపడే ఉత్తమాంగనవలె, పూలతీగెలు ఆ యా కొమ్మలవెంట పడుతున్నవి. ఈ చెట్టుమీదినుంచి ఆ చెట్టుమీదికీ, ఈ కొండమీదినుంచి ఆ కొండమీదికీ, ఈ వనమునుంచి ఆ వనానికీ పోయి అన్ని రసాలను ఆస్వాదించి, సంతోషించి మందము మందముగా గాలి వీస్తోంది.

"నాయనా, లక్ష్మణా! కొన్ని చెట్లు ఆకులే లేకుండా పూలు పూసి మధుగంధాన్ని గుబాళిస్తున్నవి. మరికొన్ని చెట్లు మొగ్గలు తొడుగుతూ ఉంటే వాటి ఆకులూ, కాడలూ నల్లగా కనబడుతున్నవి. తుమ్మెదలు ఇది రమణీయముగా ఉంది, ఇది రుచిగా ఉంది, ఇది బాగా విచ్చింది అని చెప్పుకొంటూ, ప్రతి పూవుమీదా వాలి మధువు తాగి, మదము ఎక్కి తిరుగుతున్నవి. మధువు కోసము ఆశపడి తుమ్మెదలు ఈ పంపాతీరాన ఉన్న చెట్లను వేటినీ వదలిపెట్టకుండా ఉన్నవి.

"లక్ష్మణా! ఇక్కడ, ఈ నేలమీద వాటి అంతట అవే రాలిన పూలు, పడుకొని హాయి అనుభవించడానికి వేసిన పూలపాన్పులవలె కనపడుతున్నవి. కొండ నెత్తాలలో రాలిన పూలు పసుపూ, ఎరుపూ మొదలైన రకరకాల రంగులతో అమర్చిన శయ్యలుగా కనబడుతున్నవి. ఇంతకూ ఇది వసంతఋతువు అయినందువల్ల చెట్లు అన్నీ పోటీపడి పూలు పూస్తున్నట్టుగా ఉన్నవి. పూలు పూసిన వృక్షశిఖరాలు గాలికి తలలు ఆడిస్తూనూ, పూల కోసము మూగిన తుమ్మెదలు ఝుంకారాలు చేస్తూనూ ఉంటే ఒక చెట్టు పిల్చుకొంటూ ఉన్నట్టు కనపడుతున్నవి.

"లక్ష్మణా! అదిగో, అటు చూడు. పంపలో ప్రియురాలితో జలకమాడి, సంతోషంతో క్రీడిస్తూ ఉన్న ఆ కారండవపక్షి నా కామవికారాన్ని ఉద్దీపింపచేస్తూ ఉంది. ఈ పంపాసరోవర సౌందర్యము ఈ లోకంలో ఒక్క గంగానదికే ఉంది. అందువల్లనే, అది మనోహరము అయిన నది అని ప్రసిద్ధికి ఎక్కింది. ఆ పతివ్రత సీతాదేవి దొరికేట్టయితే మనము ఇక్కడనే ఉండిపోదాము. మనము ఇక్కడనే ఉండేట్టయితే నేను అయోధ్యారాజ్యాన్నే కాదు, దేవేంద్ర పదవిని అయినా ఆశించను. మనోహరము అయిన ఈ పచ్చిక బయళ్ళలో ఆ సీతాదేవితో విహరిస్తూ ఉంటే నాకు ఏ దుఃఖమూ ఉండదు. ఏ ఇతరానికీ నేను ఆశపడను. సుందరము అయిన ఆకులతో, రకరకాల పూలచెట్లతో ఉన్న ఈ అడవి ఆ ప్రియురాలు లేకుండా ఉన్న నన్ను పిచ్చి ఎత్తిస్తున్నది. చక్రవాక పక్షులతోనూ, కారండవ పక్షులతోనూ, నీరుకోళ్ళ తోనూ ఈ పంపాసరస్సు ఎంతో మనోహరముగా ఉంది. చూడు. వరాహాలూ, జింకలూ నిర్భయముగా వచ్చి నీళ్ళు తాగుతున్నవి. పక్షులు అన్నీ సంతోషాతి శయముతో మహామధురముగా గానము చేస్తున్నవి. ఆ యౌవనమధ్యస్థ, ఆ చంద్రముఖి, ఆ పద్మాక్షి సీతాదేవి తలపుకు వస్తున్నది. నన్ను కామవికారము కాల్చి వేస్తున్నది.

"తమ్ముడా! చిత్రము అయిన ఆ పర్వతసానువులో ఆడజింకలతో మగ జింకలు ఎట్లా ఎంత హాయిగా క్రీడిస్తున్నవో చూడు. ఆ మృగశాబాక్షి వైదేహిని ఎడబాసి నేను ఎట్లా బాధపడుతున్నానో చూడు. మనోహరము అయిన ఆ పర్వతసానువులలో ఎక్కడబడితే అక్కడ యథేష్టముగా విహరిస్తున్న మృగపక్షి సమూహాలు నన్ను మహావ్యధ పెట్టుతున్నవి. ఆ కాంతను, నా ప్రియురాలిని సీతాదేవిని చూడ గలిగితేనే నేను సుఖపడతాను. సంతోషపడతాను. ఈ పంపాతీర వనాలలో నుంచి బయలుదేరి, పద్మ సౌగంధికాలమీదినుంచి ఘుమఘుమ వాసనలతో వచ్చే ఈ మందమారుతము మంగళకరము అయింది. సమస్త దుఃఖాలనూ పోగొట్టుతుంది. ప్రియురాండ్లతో పుణ్యవంతులే దీన్ని అనుభవిస్తారు.

"లక్ష్మణా! ఆ పద్మాక్షి, జనకాత్మజ, నా ప్రియురాలు ఇప్పుడు నడియౌవనములో ఉంది. నా ఎడబాటునుంచి ఆమె వివశ అయి ఉంటుంది. ఆమె ఇప్పుడు బ్రతికి ఉందో లేదో? రాజ్యభ్రష్టుణ్ణి అయి అడవులకు బయలుదేరిన నన్ను వెంబడించి నా మతి చెడకుండా చేసిన ఆమె ఎడబాటు సహించి నేను బ్రతికి ఉండటము ఎట్లాగు? ఆ శుభాంగి, ఆ సుగంధి నా కంటికి కనపడకుండా ఉన్నందువల్ల నా మనస్స్వాస్థ్యము తప్పింది. స్వాభావికము అయిన చిరునవ్వుతోనూ, అప్పుడప్పుడు ఆగంతుకముగా వచ్చే చిరునవ్వుతోనూ, ఆ నా ప్రియురాలు వైదేహి గుణవంతముగానూ, మధురముగానూ, హితముగానూ, అసమానముగానూ చెప్పే మ్మాటలను మళ్ళీ నేను ఎప్పుడు వింటాను? ఆ సాధ్వి, ఆ శ్యామాంగి సీతాదేవి స్వయముగా వనవాస దుఃఖము అనుభవిస్తూ, ఏ దుఃఖమూ ఎరుగనిదానివలె సంతోషపెట్టే మాటలు మన్మథ కర్శితుణ్ణి అయిన నాకు ఇకను ఎప్పుడు చెప్పుతుంది? ఇకను ఆమెను చూడటము ఉత్తది. నేను బ్రతకడమూ ఉత్తది" అంటూ ఆ మహాత్ముడు రాముడు అనాథుడివలె విలపించినాడు.

లక్ష్మణుడు సమయోచితముగానూ, మారుమాట్లాడడానికి వీలు కాకుండానూ, "ఓ రామా! నీవు పురుషోత్తముడవు. దుఃఖాన్ని అణచుకో. నీకు శుభము అవుతుంది. నీవు దుఃఖపడవద్దు. నీవంటి ధీరుడికి బుద్ధి మాంద్యము పనికిరాదు. నీకు తెలియనిది ఏమీ లేదు. ఎంతో స్నేహము చేసినవాడు ఎడబాసినందువల్లనే దుఃఖము వస్తుంది. అందువల్ల, అతి స్నేహము పనికిరాదు. అతిస్నేహము వల్లనే తడిసిన వత్తికూడా తగలబడిపోతుంది.

"అన్నా! పాతాళానికి పోయినా, అంతకన్నా అడుగుకుపోయినా ఆ రావణాసురుణ్ణి బ్రతకనిచ్చేది లేదు. ఆ పాపిష్టి రాక్షసుడి జాడ తెలియడమే తరువాయి, వాడు బ్రతికిఉండ తలచుకొంటే నీకు సీతాదేవిని సమర్పిస్తాడు, లేదా చావనైనా చస్తాడు. ఆ రావణాసురుడు సీతాదేవిని నాకు సమర్పించకుండా, ఆమెను వెంట తీసుకొనిపోయి అదితి గర్భములో దూరినా, వాణ్ణి నేను బ్రతకనీయను. సంహారము చేసివేస్తాను.

"ఓ పూజ్యుడా! ధైర్యము అవలంబించు. నీవు దైన్యపడవద్దు. ధైర్యముతో ప్రయత్నము చేయందే ఏ కార్యమూ సిద్ధించదు. ప్రయత్నము చేస్తేనే ఏ కార్యము అయినా సిద్ధిస్తుంది. అందువల్ల, దైన్యపడి కార్యము పాడుచేసుకోకూడదు.

"ఓ పూజ్యుడా! ధైర్యమే ఉత్సాహానికి మూలము. ఉత్సాహమే బలము. ఉత్సాహాన్ని మించిన బలము ఏదీ లేదు. ఈ లోకములో ఉత్సాహవంతుడికి దుర్లభము అనేది ఏదీ లేదు. అంతేకాదు, ఉత్సాహవంతులు ఎటువంటి కష్టకాలాలలో అయినా దుఃఖపడరు. అందువల్ల, నీవు ఇప్పుడు ఉత్సాహాన్ని ఆశ్రయించు. అది

చాలు. సీతాదేవి మనకు దొరుకుతుంది. నీవు దుఃఖాన్ని తోసివెయ్యి. కామపరవశుడవు కావద్దు. ఓ రామా! నీవు మహాప్రభావము కలవాడవు. నీది సుశిక్షితము అయిన బుద్ధి. ఇంతకూ ఇప్పుడు నీవు నిన్ను తెలుసుకోలేకుండా ఉన్నావు" అని చెప్పినాడు.

లక్ష్మణుడు చెప్పిన ఈ మాటలు, దుఃఖముతో బాధపడుతున్న రాముడు విన్నాడు. దుఃఖాన్నీ, కామపారవశ్యాన్నీ అవతలికి తోసి పారవేసినాడు. ధైర్యవంతుడు అయినాడు. అంతట ఆ అచింత్య పరాక్రముడు, ఆ మహితాత్ముడు రాముడు లక్ష్మణుడితో కూడా ఏమరుపాటు లేకుండా నడుస్తూ, గాలికి ఉయ్యాలలు ఊగుతున్న వృక్షాలను చూస్తూ, మనోహరము అయిన ఆ పంపాసరస్సునుదాటి అవతల ఉన్న అరణ్యములోనికి పోయినాడు. అక్కడి సెలయేళ్ళనూ, కొండ గుహలనూ చూచుకొంటూ రాముడు ఉద్విగ్న మనస్కుడు అయి నడుస్తూ ఉంటే, ఆ మహాపరాక్రమవంతుడు లక్ష్మణుడు మత్తమాతంగ విలాస గమనముతో అప్రమత్తుడుగా, అచంచల మనస్కుడుగా సోదర ధర్మముతో ఆ రామునికి కాపుదలగా వెంటనడచినాడు.

చూచేవాండ్లకు ఆశ్చర్యము కలగజేస్తూ అట్లా నడుస్తూ ఉన్న ఆ రామలక్ష్మణులను, అప్పుడు ఋష్యమూక పర్వతముమీద తిరుగుతూ ఉన్న మహాబలవంతుడు వానర శ్రేష్ఠుడు సుగ్రీవుడు చూచినాడు. భయపడిపోయినాడు. నిశ్చేష్టుడు అయినాడు.

2

సుగ్రీవుడు రాముని చూచి భయపడుట

ఆ భద్రాకారులను, ఆ ధనుర్ధరులను రామలక్ష్మణులను చూచీ చూడటముతో, వారిని వాలే పంపించి ఉంటాడు అని సుగ్రీవుడు అనుకొన్నాడు. దిగులుపడిపోయినాడు. అన్నిదిక్కులా చూడసాగినాడు. ఎటుపోవడానికి తోచలేదు. అక్కడ ఎక్కడనూ ఒకచోట నిలువలేకపోయినాడు. ఎంతో భయము వేసింది. మనస్సు స్థిమితము తప్పిపోయింది. దుఃఖము వచ్చింది. అయితే, అతడు రాజధర్మము తెలిసినవాడు. అక్కడనే ఉండిపోవటములోనూ, మరొక చోటికి పోవటములోనూ వచ్చే కష్టసుఖాలను అన్నిటినీ సచివులు అందరితోనూ ఆలోచించినాడు. మరింత భయపడ్డాడు. ఆ రామలక్ష్మణులను చూస్తూ సుగ్రీవుడు అంతట సచివులతో, "వీండ్లను తప్పకుండా వాలే పంపించి ఉంటాడు. అందువల్లనే, ఈ దుర్గమారణ్యానికి నారచీరలు కట్టుకొని కపటవేషముతో వచ్చి ఇక్కడ తిరుగుతున్నారు" అని చెప్పినాడు. అంతట ఆ ధనుర్ధరులను సుగ్రీవుడి సచివులు అందరూ చూచినారు. ఆ పర్వత సానువునుండి బయలుదేరి అప్పటికప్పుడు మరి ఒక ఎత్తు అయిన పర్వతశిఖరము మీదికి పోయినారు. ఆ వానరవీరులు పర్వత శిఖరాలు కదలిపోయేటట్లు ఆ కొండమీదినుంచి ఈ కొండమీదికిన్నీ, ఈ కొండమీదినుంచి ఆ కొండమీదికిన్నీ ఎగిరి ఒక్కొక్కరు

ఒక్కొక్క తోవను పోయినారు. అట్లా ఆ వానరవీరులు ఎగిరిపోతూ ఉంటే ఆ పర్వతాలమీద ఉన్న పూలచెట్లు విరిగిపోయినవి. ఆ బలవంతులను చూచి పెద్దపులులూ, అడవిపిల్లులూ, జింకలూ బెదరిపోయినవి. వారు అందరూ వేగముగా సుగ్రీవుడు దాగుకొని ఉన్న చోటికి పోయినారు. చేతులు కట్టుకొని ఆ వానరేంద్రుడి దగ్గర నిలుచున్నారు. మాటనేర్పరి అయిన హనుమంతుడు అప్పుడు సుగ్రీవుణ్ణి చూస్తూ, "ఓ వానరులారా! వాలిని గురించిన భయము వదిలిపెట్టండి. ఇది ఋష్యమూక పర్వతము. వాలి భయము ఇక్కడ లేదు. ఓ వానరపుంగవా! నీవు వాలి భయమువల్ల ఇక్కడికి పరుగెత్తుకొని వచ్చినావు. ఆ భయంకరుడు, ఆ క్రూరుడు వాలి ఇక్కడికి రాలేడు. ఆ పాపకర్ముడు నీ అన్న వాలి ఇక్కడకు రావడానికి వీలులేదు. ఆ దుష్టాత్ముణ్ణి గురించి నీవు భయపడవలసిన అవసరము నాకు కనిపించటము లేదు. ఓ సుగ్రీవుడా! నీకు మనోదారుఢ్యము లేకపోయింది. చపలుడవు అయినావు. అయ్యో! నీ కోతి స్వభావము వ్యక్తపరచినావు. నీవు బుద్ధిమంతుడవు, లోకజ్ఞానము కలవాడవు. భావసూచకాలు అయిన ఎదుటివారి ఇంగితాలనుపట్టి నీవు నడచుకోవలెను. బుద్ధిబలము లేనిదే నీవు సర్వప్రజలను పరిపాలించలేవు" అని చెప్పినాడు.

ఇట్లా మంగళకరముగా హనుమంతుడు చెప్పింది విని సుగ్రీవుడు అంతకన్నా మంగళకరముగా, "ఓ హనుమంతుడా! ఆ ఆజానుబాహులను, శరచాపఖడ్గధారులు అయిన దేవకుమారులవంటి ఆ విశాలాక్షులను చూస్తే ఎవడు అయినా భయపడతాడు. ఆ పురుషోత్తములను వాలి పంపించి వుంటాడు అని సందేహించినాను. రాజులకు ఎంతోమంది స్నేహితులు ఉంటారు. అందువల్ల, రాజులను నమ్మరాదు. ప్రతివాడూ గూఢచారులు అయిన శత్రువులను తెలుసుకోవలెను. అట్లా తెలుసుకోక పోయేటట్లయితే, రాజమిత్రులు అయిన గూఢచారులు తమను ఎదుటివారు నమ్మేటట్టు చేసుకొంటారు. ఎదుటివారు ఏమరుపాటుతో ఉన్నప్పుడు దెబ్బతీస్తారు. వాలి తన పనులు నెరవేర్చుకోవటములో మహామేధావి. రాజులు అనేక ఉపాయాలతో శత్రువులను సంహరిస్తూ ఉంటారు. అందువల్ల, బుద్ధిమంతులు అయినవారు ప్రాకృత వేషధారులు అయి, ఎవరు ఎటువంటివారో తెలుసుకుంటూ ఉంటారు.

"హనుమంతుడా! నీవు ఇప్పుడు ప్రాకృత వేషముతో ఆ ధనుర్ధరుల దగ్గరకు పో. భావసూచకాలు అయిన వారి కాయిక వ్యాపారాదులనుపట్టీ, అవాంతర అభేదాలనుపట్టీ, సౌమ్య అసౌమ్య లక్షణాలనుపట్టీ, అన్యోన్య సంభాషణలనుపట్టీ వారు ఎవరో నీవు తెలుసుకో.

"నాయనా, హనుమంతుడా! నీవు వారి అభిప్రాయము ఏమిటో కనిపెట్టు. వారిని స్తోత్రము చేసి వుబ్బించు. ఇంగితాదులనుపట్టి వారు ఎవరో తెలుసుకో. వారు

దుష్టమనస్కులు అయ్యేట్లయితే, వారు నమ్మే మాటలు పదే పదే చెప్పు. వారు ఏమి ప్రయోజనము కోసము ధనుర్ధరులయి ఈ మహారణ్యానికి వచ్చినారో తెలుసుకో.

"ఓ వానరశ్రేష్ఠుడా! వారు పరిశుద్ధాత్ములు అయినట్లయితే, వారితో ఏమి మాట్లాడవలెనో నీకు తెలుసును. వారి మాటలనుపట్టి వారు దుర్మార్గులు అయిందీ, సన్మార్గులు అయిందీ నీవు తెలుసుకోగలవు. నాయనా, పోయిరా" అని సుగ్రీవుడు ఆజ్ఞాపించినాడు.

ఆ వాయుపుత్రుడికి, హనుమంతుడికి అప్పుడు రామలక్ష్మణుల దగ్గరకు పోవలెను అని బుద్ధిపుట్టి "అట్లాగేను" అని చెప్పి శత్రువులు దరిచేర నలవికాని ఆ భయంకరాకారుణ్ణి సుగ్రీవుణ్ణి శ్లాఘించినాడు.

3

హనుమంతుడు రామలక్ష్మణులను కలిసికొనుట

అంతట ఆ మహానుభావుడు హనుమంతుడు ఆ మహాబలవంతుల దగ్గరకు బయలుదేరినాడు.

మహాబుద్ధిమంతుడు అయిన సుగ్రీవుడి అభిప్రాయాన్ని అనుసరించి హనుమంతుడు అంతట తన వానరరూపము వదిలిపెట్టి ఎదుటివారిని మోసము చేయటానికి భిక్షురూపము ధరించినాడు. ఒక్క గంతువేసి ఆ ఋష్యమూక పర్వతముమీద నుంచి రామలక్ష్మణులు వున్నచోటికి పోయినాడు. వినయము ఉట్టిపడుతూ వారిని సమీపించినాడు. అంతట ఆ రామలక్ష్మణులకు నమస్కారము చేసినాడు. వారిని యధావిధిగా పూజించినాడు.

అంతట మృదువుగానూ, మధురముగానూ, "మీరు రాజర్షులవలెనూ, దేవతల వలెనూ కనపడుతున్నారు. తీక్ష్ణవ్రతదీక్షాపరులు అయిన తాపసులు ఏమోను అనిపిస్తు న్నారు. మీరు ఎవరు? ఎందుకు ఇక్కడకు వచ్చినారు? ఎట్లా వచ్చినారు? మీరు ఏదో వెతుకుతూ ఉన్నట్లు ఈ పంపాతీర వృక్షాలను అన్నిటినీ పరిశీలించి చూస్తూ నడిచి వస్తూ ఉంటే, ఇక్కడి వనాలలో మృగసమూహాలు అన్నీ భయపడి పరుగులెత్తుతూఉన్నవి.

"మీ దేహకాంతులనుంచీ, మీ తపోదీధితులనుంచీ ఈ పంపానదీ నిర్మలోదకాలు తళతళ మెరుస్తున్నవి. మీరు చాలదూరమునుంచి నడచి వస్తూ ఉన్నట్లు ఉన్నారు. నిట్టూర్పులు విడుస్తున్నారు. మీరు సింహాలవలె కనబడుతున్నారు. సింహాలకన్నా మీరు బలవంతులుగానూ, పరాక్రమవంతులుగానూ, ధైర్యవంతులు గానూ తోస్తున్నారు. కాబట్టే, ఈ మహారణ్యంలో మీరు ఇట్లా నడిచి రాగలిగినారు. వల్కలాలు అయితే కట్టుకొన్నారు. కాని మహావీరులవలె గోచరిస్తున్నారు. మీ మహాభుజాలు గుండ్రని ఇనుపగుదియలవలెనూ, ఏనుగు తొండాలవలెనూ

కనబడుతున్నవి. ధనుర్ధరులు అయిన మీరు మీ బాహువులకు ఆభరణాలు పెట్టుకోలేదు. ఎందువల్ల? మీ విండ్లు విచిత్రముగా ఉన్నవి. ఇంద్రధనుస్సువలెనూ, కాంచన భూషితము అయిన వజ్రాయుధమువలెనూ చిత్ర విచిత్ర కాంతులతో ధగధగలాడుతూ ఉన్నవి. మీ అంబులపొదులనిండా ఉన్న తీక్షణబాణాలు అన్నీ ప్రాణాలు తీసే సర్పాలవలె బుసలు కొట్టుతూ ఉన్నవి. బంగారు పిడులతో ఉన్న మీ పొడుగాటి ఖడ్గాలు, కుబుసాలు విడిచిన పాములవలె తేజరిల్లుతూ ఉన్నవి.

"మీరు ఉభయులున్ను ఒక్కరూపంలో ఉన్నారు. మిమ్ములనూ, తామరరేకుల వంటి మీ కన్నులనూ చూస్తూ ఉంటే మీరు వింధ్య మేరువు పర్వతాలతోనూ, మహారణ్యాలతోనూ, చుట్టూ సముద్రములతోనూ వున్న ఈ పృథ్విని అంతా పరిపాలించవలసిన మహానుభావులుగా తోస్తున్నారు. మీ తేజమూ, రూపమూ చూస్తూ వుంటే మీరు శ్రీమంతులు అయి ఉంటారు అనిపిస్తుంది. మంచి వయస్సులో వున్నారు. మీరు శత్రుసంహారము చేయటానికి పోతూ ఇటువచ్చిన రాజపుత్రులా, దేవలోకములోనుంచి ఈ భూమిమీదికి దిగివచ్చిన దేవతలా లేక యాదృచ్ఛికముగా ఈ భూభాగాన్ని చూచిపోవడానికి వచ్చిన సూర్యచంద్రులా, కాక దేవరూపములో వున్న మానవులా? అయితే, జటామండలధరులు అయి మీరు ఇక్కడికి ఎందుకు వచ్చినారు? ఇంతకూ మీరు ఎవరు?

"ఓ మహానుభావులారా! నేను ఇంత మాట్లాడినప్పటికిన్నీ మీరు ఎందుకో నాతో మాట్లాడటము లేదు. పోనీయండి. నేను ఎవరినో చెప్పుకొంటాను వినండి.

"సుగ్రీవుడు అనే వానరోత్తముడు ఒకడు ఉన్నాడు. అతడు సమస్త ధర్మాలు తెలిసినవాడు. మహావీరుడు. అతనిని, అతని అన్న మోసము చేసినాడు. అందుకు అతడు దుఃఖముతో బాధపడుతూ ఈ భూభాగాన్ని అంతా తిరిగి చూచినాడు. అతడు వానరులకు అందరికీ రాజుగా వుండతగినవాడు. ఇప్పుడు నన్ను అతడు పంపిస్తే నేను మీ దగ్గరకు వచ్చినాను. నా పేరు హనుమంతుడు. నేను వాయుదేవుడి పుత్రుడిని. వానరుణ్ణి. ఆ సుగ్రీవుడి సచివుణ్ణి. స్నేహధర్మము తెలిసిన సుగ్రీవుడు మీతో స్నేహము చేయవలెనని అనుకొంటున్నాడు. అందుకోసము నన్ను పోయిరమ్మన్నాడు. నేను ఆ సుగ్రీవుణ్ణి సంతోషపెట్టడానికి భిక్షురూపముతో ఋష్యమూక పర్వతము మీదనుంచి ఇక్కడకు వచ్చాను. నేను కామరూపుణ్ణి. అందువల్ల, నేను నా చిత్తము వచ్చిన చోటికి, నా చిత్తము వచ్చిన రూపముతో పోగలను" అని ఆ వాక్యకుశలుడు చెప్పి ఊరకున్నాడు.

ఇట్లా ఆ హనుమంతుడు చెప్పిన మాటలు ఆ మహావీరులు రామలక్ష్మణులు ఉభయులూ విన్నారు. ఆ మాటలకు రాముడు ఎంతో సంతోషపడ్డాడు. ఆ

కాంతిమంతుడు అంతట తనపక్కను ఉన్న లక్ష్మణుణ్ణి చూచి, "తమ్ముడా! మనము చూడవలెను అనుకుంటున్న సుగ్రీవుడి సచివుణ్ణి అని ఈ హనుమంతుడు చెప్పుతున్నాడు. ఆ కపీంద్రుడు, ఆ పూజ్యుడు సుగ్రీవుడు పంపిస్తేనే తాను మన దగ్గరకు వచ్చినాను అని కూడా అంటున్నాడు.

"అరిందమా! ఈ సుగ్రీవ సచివుడు హనుమంతుడు వాక్యజ్ఞుడుగా కనపడుతున్నాడు. నీవు ఇతనితో మధురముగా మాట్లాడవలెను. ఋగ్యజుస్సామ వేదాలు మూడింటినీ అధ్యయనము చేయనివాడు ఇతనివలె మాట్లాడలేడు. ఇతడు వ్యాకరణాన్ని అంతా అనేకసార్లు తప్పకుండా చదివి ఉంటాడు. అందువల్లనే ఇతడు ఇంతసేపు మాట్లాడినా నోటివెంట ఒక్క అపశబ్దమూ రాలేదు. ముఖములోకానీ కళ్ళలోకానీ, లలాటములో కానీ, కనుబొమ్మలలో కానీ, ఇంకా ఇతర అవయవాలలో కాని ఏ వికారమూ కనబడనీయకుండా మాట్లాడినాడు. ఆపి ఆపి మాట్లాడలేదు. గబగబా మాట్లాడలేదు. సందిగ్ధముగా మాట్లాడలేదు. విస్తారముగా మాట్లాడలేదు. హృదయములోనుంచి కంఠగతము అయిన మాటలను మధ్యమ స్వరములో అన్నాడు. వ్యాకరణ సంస్కారముతో అక్షరక్రమముగా దబదబకాకుండానూ, జాగు చేయకుండానూ మనోహరముగా మాటలు ఉచ్చరించినాడు. హృదయములో ఏ దోషమూ లేకుండానూ, కంఠము కంపించకుండానూ, తల ఆడించకుండానూ ఎంత చిత్రముగా మాట్లాడినాడు! ఇట్లా మాట్లాడితే శత్రుత్వముతో చంపవలెను అని కత్తి ఎత్తినవాడు సయితము సంతోషించి వదలిపెట్టుతాడు. ఇటువంటి దూతలేని రాజుకు కార్యసిద్ధి కాదు. ఇటువంటి గుణవంతులూ, కార్యసాధకులూ అయిన దూతలవల్లనే ఏ రాజుకు అయినా సర్వార్థాలూ సమకూడుతవి" అని చెప్పినాడు.

అంతట లక్ష్మణుడు ఆ సుగ్రీవ సచివుణ్ణి, ఆ వాయుపుత్రుణ్ణి హనుమంతుణ్ణి చూచి, "ఓ విద్వాంసుడా! సుగ్రీవుని గుణగణాలను గురించీ, ఎంతో పూజ్యము అయిన అతని స్వభావాన్ని గురించీ మేము ఇదివరకే విన్నాము. మేము ఆ వానరేశ్వరుణ్ణి వెతుకుకొంటూ వస్తున్నాము.

"ఓ హనుమంతుడా! నీవు సజ్జనులలో సజ్జనుడవు. సుగ్రీవుడు మాతో స్నేహము చేసుకోవలెను అనుకొంటున్నాడు అని నీవు చెప్పుతున్నావు. మేము నీవు చెప్పినట్టు ఆ సుగ్రీవునితో స్నేహము చేస్తాము" అన్నాడు.

ఇట్లా ఇంత నిపుణముగా లక్ష్మణుడు చెప్పింది హనుమంతుడు విన్నాడు. సంతోషపడ్డాడు. సుగ్రీవుడు ఇక వాలిని జయిస్తాడు అనుకొన్నాడు. సుగ్రీవుడికీ, రామలక్ష్మణులకూ స్నేహము కలుపవలెను అనుకొన్నాడు.

4

లక్ష్మణుడి మధుర భాషణము వినగానే సుగ్రీవుడితో రాముడికి ఏదో పని ఉంది అని హనుమంతుడు గ్రహించినాడు. సుగ్రీవుణ్ణి గురించి ఆలోచించినాడు. రాముడి పని నెరవేరిస్తే సుగ్రీవుడికి రాజ్యము వస్తుంది అని నిశ్చయించినాడు.

అంతట ఆ వానరశ్రేష్ఠుడు, ఆ వాక్యవిశారదుడు హనుమంతుడు పరమసంతోషముతో రాముణ్ణి చూచి, "ఓ రామప్రభూ! పంపాసరోవరంతో వున్న ఈ ఘోరారణ్యానికి, నానావిధ సర్పాలూ, క్రూర మృగాలూ సంచరించే ఈ దుర్గమారణ్యానికి నీవు ఎందుకు రావలసి వచ్చింది" అని అడిగినాడు.

రాముడు చెప్పమన్నందువల్ల లక్ష్మణుడు హనుమంతుడితో "ఓ వానరుడా! దశరథమహారాజు అనే కోసల దేశాధీశుడు ఉండేవాడు. ఆ ద్యుతిమంతుడు, ఆ ధర్మవత్సలుడు ఎప్పుడూ ధర్మము తప్పకుండా నాలుగు వర్ణాలవారినీ కాపాడుతూ రాజ్యం ఏలినాడు. ఆ మహానుభావుడు ఎవరినీ ఎన్నడూ ద్వేషించలేదు. ఆయనను ఎవడూ ఎన్నడూ ద్వేషించలేదు. ఆయన సమస్త లోకాలలోనూ రెండవ బ్రహ్మదేవుడివలె విరాజిల్లినాడు. అడిగిన దక్షిణలు ఇచ్చి అగ్నిష్టోమాది యజ్ఞాలు చేసి దేవతలను మెప్పించినాడు.

"ఆ దశరథమహారాజుకు ఇతడు జ్యేష్ఠపుత్రుడు. రాముడు అని ప్రసిద్ధి కెక్కినాడు. ఇతడు సర్వభూత శరణ్యుడు. పిత్రాజ్ఞాపాలకుడు. ఆ దశరథమహారాజు పుత్రులలో మిక్కిలి గుణవంతుడు. రాజలక్షణలక్షితాంగుడు, జ్యేష్ఠుడు అయినందువల్ల రాజ్యసంపద అంతా ఇతనిదే. అయితే, రాజ్యభ్రష్టుడు అయిపోయినాడు. వనవాసము చేయడానికి ఈ దుర్గమారణ్యానికి వచ్చినాడు. మహాతేజోవంతుడు అయిన సూర్యుణ్ణి కాంతి దినాంతకాలాన వెంబడించేట్టుగా, ఈ మహాతేజోవంతుణ్ణి ఈయన భార్య వెంబడించి వనవాసము చేయడానికి ఈతని వెంట వచ్చింది.

"నేను ఈతడి తమ్ముణ్ణి. నన్ను లక్ష్మణుడు అంటారు. ఈతని గుణగణాలనుంచి నేను ఇతడికి సేవచేస్తూ ఇతని వెంట ఉంటూ ఉన్నాను. ఈ మా అన్న రాముడు ఎవరు ఏ కొంచెము మేలు చేసినా మరిచిపోడు. అంతేకాదు, ఆ కాస్తనూ మహా గొప్ప మేలు చేసినట్టుగా భావిస్తూ ఉంటాడు. సమస్త ప్రాణికోటికీ మేలు చేయడమే ఇతడు తన పనిగా పెట్టుకొన్నాడు. ఈతడు మహా పూజనీయుడు. ఎప్పుడూ సుఖమును అనుభవించవలసినవాడు. అయితే యిప్పుడు ఐశ్వర్యహీనుడు అయి వనవాసము చేస్తూ ఉన్నాడు.

"మేము ఇద్దరమూ దగ్గర లేనప్పుడు కామరూపుడు అయిన రాక్షసుడు ఎవడో ఇతని భార్యను అపహరించినాడు. వాడు, ఆ రాక్షసుడు ఎవడో ఎక్కడివాడో మాకు తెలియదు. మేము వాణ్ణి వెతుకుకొంటూ వస్తూ ఉండగా, శ్రీ అనేవాడి పుత్రుడు దనువు అనేవాడు ఒకానొక మహర్షి శాపమువల్ల రాక్షసుడు అయి కబంధరూపంలో మాకు దారిలో కనిపించినాడు. వాడు మాతో, వానరపుంగవుడు సుగ్రీవుడు మహాపరాక్రమశాలి అనీ, పరమసమర్థుడు అనీ, రాముడి భార్యను అపహరించినవాణ్ణి వెదికి పట్టుకోకలడు అనీ చెప్పినాడు. రామానుగ్రహమువల్ల వాడు కబంధాకారము వదిలిపెట్టి దేదీప్యమాన దివ్యరూపము ధరించి సుఖముగా స్వర్గతుడు అయినాడు.

"ఓ హనుమంతుడా! నీవు అడిగినందువల్ల నేను జరిగింది జరిగినట్లు చెప్పినాను. ఇప్పుడు ఈ రాముడూ, నేనూ సుగ్రీవుడి శరణము కోసము ఇటు వచ్చినాము. రాముడు తన ధనాన్ని అంతా దానము చేసివేసినాడు. ఇదివరకు ఇతడు లోకనాధుడు అనే యశస్సు సంపాదించినాడు. ఇప్పుడు సుగ్రీవుణ్ణి తనకు నాధుణ్ణిగా చేసుకోడానికి వచ్చినాడు.

"ధర్మవత్సలుడూ, దీనజనశరణ్యుడూ అయిన దశరధమహారాజు కడుపున పుట్టి శరణాగతరక్షణ ధురంధరుడు అనీ, ధర్మాత్ముడు అనీ సర్వలోకాలలోనూ ప్రసిద్ధి కెక్కిన ఈ రాముడు, ఇప్పుడు సుగ్రీవుడికి శరణాగతుడు అవుతున్నాడు. ఎవడు అనుగ్రహించినంత మాత్రాన ప్రజలు అందరూ ఎప్పుడూ సంతుష్టులు అయ్యేవారో, అటువంటి రాముడు ఇప్పుడు వానరేంద్రుడి అనుగ్రహము కోసము ఎదురుచూస్తూ ఉన్నాడు. ఈ పృధ్విలో సర్వగుణోపేతులు అయిన సమస్తరాజులనూ కాపాడిన దశరధమహారాజుకు జ్యేష్ఠపుత్రుడు అయి, ముల్లోకాలలోనూ ప్రసిద్ధి కెక్కిన రాముడు, వానరరాజమాత్రుడు అయిన సుగ్రీవుణ్ణి శరణము అడుగుతున్నాడు. ఇప్పుడు భార్యావియోగ దుఃఖముతో బాధపడుతూ దుఃఖపరవశుడు అయివున్న రాముడు శరణము అడుగుతున్నాడు. వానర నాయకుడు సుగ్రీవుడు అనుగ్రహించ వలెను" అని కన్నీళ్ళు కారుస్తూ జాలి పుట్టేట్టుగా చెప్పినాడు.

అంతట హనుమంతుడు, "ఓ లక్ష్మణా! మీ వంటి జితేంద్రియులను, జితకోపులను, బుద్ధిమంతులను సుగ్రీవుడే వెదకుకొంటూ వచ్చి వుండవలసింది. అతని భాగ్యవశమువల్ల మీరే అతనికి దర్శనము ఇవ్వడానికి వస్తూ వున్నారు. సుగ్రీవుడున్నూ రాజ్యభ్రష్టుడు అయివున్నాడు. అతని అన్న వాలి అనేవాడితో అతనికి విరోధము వచ్చింది. అతడు సుగ్రీవుణ్ణి చాలా మోసము చేసినాడు. అతని భార్యను అతని అన్న అపహరించినాడు. అడవులకు వెళ్ళగొట్టినాడు. సుగ్రీవుడు మీకు సహాయం చేస్తాడు. అతనితో కూడా మేమూ సీతాదేవిని వెతకడములో

సహాయపడతాము" అంటూ మృదుమధురముగా చెప్పి రాముణ్ణి చూచి, "ఓ ప్రభూ! మనము ఇప్పుడు సుగ్రీవుడి దగ్గరకు పోదాము" అన్నాడు.

అప్పుడు ఆ ధర్మాత్ముడు లక్ష్మణుడు దూతను గౌరవించవలసిన విధముగా హనుమంతుణ్ణి గౌరవించి రాముణ్ణి చూచి, "అన్నా! వాయుపుత్రుడు ఈ హనుమంతుడు మనలను చూచి సంతుష్టుడు అయినాడు. యథార్థము చెప్పినాడు. ఆ సుగ్రీవుడికిన్నీ మనతో పని ఉంది. అందువల్ల, మనము కృతకృత్యులము అవుతాము. ఈ హనుమంతుడు వీరుడివలె కనబడుతున్నాడు. ప్రసన్న ముఖముతో సంతోషముగా, స్పష్టముగా చెప్పుతున్నాడు. ఇతడు చెప్పేది అబద్ధము కాదు" అన్నాడు.

అంతట ఆ మహాప్రాజ్ఞుడు హనుమంతుడు భిక్షురూపము వదలి పెట్టి తన ఎప్పటి వానరరూపము ధరించి, ఆ వీరులను రామలక్ష్మణులను తన వీపుమీద ఎక్కించుకొని సుగ్రీవుడి దగ్గరకు బయలుదేరినాడు.

అప్పుడు ఆ వానరవీరుడు, ఆ యశోవిశాలుడు, ఆ పరమపరాక్రమవంతుడు, ఆ మహాబలవంతుడు, పవనసుతుడు హనుమంతుడు సుగ్రీవుడు కృతకృత్యుడు అయినట్లే భావించి సంతోషపడ్డాడు.

5

రామ సుగ్రీవుల స్నేహము

హనుమంతుడు రామలక్ష్మణులను ఋష్యమూక పర్వతము మీదికి మోసుకొని పోయినాడు. వారిని అక్కడ కూర్చుండబెట్టి, "సుగ్రీవుణ్ణి పిలుచుకొని వస్తాను" అని వారితో చెప్పి హనుమంతుడు అక్కడనుంచి బయలుదేరి ఆ ఋష్యమూకములో ఉన్న మలయపర్వతము మీదికి పోయినాడు. రామలక్ష్మణులను చూచి సుగ్రీవుడు భయపడి అక్కడికి పారిపోయినాడు.

హనుమంతుడు అప్పుడు అక్కడ సుగ్రీవుణ్ణి చూచి, "ఓ వానరోత్తమా! నీవు చూచినవారిలో పెద్దవాడు రాముడు. వెంటవున్న చిన్నవాడు అతని తమ్ముడు లక్ష్మణుడు. వారు ఇక్ష్వాకు వంశీయులు. దశరథమహారాజు పుత్రులు. ఆయన రాజసూయాశ్వమేధాది యజ్ఞాలు చేసి అగ్నిహోత్రుడు మొదలయిన దేవతలను అందరినీ తృప్తిపరచినాడు. కోరుకొన్న దక్షిణలు యిచ్చినాడు. లక్షలకొద్దీ గోవులను దానము చేసినాడు. జితేంద్రియుడు అయి సత్యము తప్పకుండా ఈ భూమిని ఏలినాడు. ఆ మహాత్ముడి జ్యేష్ఠపుత్రుడు ఈ రాముడు. ఇతడునూ సత్యవ్రతుడు. దశరథమహారాజు తన మూడవ భార్యకు మాట ఇచ్చినందువల్ల రాముణ్ణి రాజ్యము వదలుకోవలసింది అని చెప్పినాడు. రాముడు సత్యవ్రతుడూ, పిత్రాజ్ఞాపాలకుడూ అయినందువల్ల

పితృాజ్ఞను శిరసావహించి రాజ్యము వదులుకొని అరణ్యావాసము చేయడానికి దండకారణ్యానికి వచ్చినాడు.

"రాముడు మహాప్రాజ్ఞుడు. ధృఢవిక్రముడు. సత్యపరాక్రముడు. అతడు లేనప్పుడు అతని భార్యను రావణాసురుడు అనే రాక్షసుడు ఎత్తుకొని పోయినాడు. నీతో స్నేహము చేస్తే నీవు తన భార్యను వెదికి పెట్టుతావు అనే నమ్మకముతో రాముడు తమ్ముణ్ణి వెంటపెట్టుకొని నిన్ను వెదుకుకొంటూ ఇటువచ్చినాడు. ఆ అన్నదమ్ములు రామలక్ష్మణులు ఇప్పుడు నీ శరణు అడుగుతారు. వారు ఉభయులు పూజనీయులు. మహావీరులు. నీవు వారిని ఉభయులనూ గౌరవించి వారితో స్నేహము చేయవలెను" అని చెప్పినాడు.

ఈ మాటలకు సుగ్రీవుడు సంతుష్టుడు అయినాడు. రామలక్ష్మణులను గురించిన ఆందోళనా, భయమూ వదలిపోయినవి. అంతట ఆ వానరోత్తముడు దర్శనీయము అయిన మనుష్యరూపము ధరించి, సంతోషముతో రామలక్ష్మణుల దగ్గరకు బయలుదేరినాడు. వారిని చూచి, "ఓ సోదరులారా! తాము సమస్తధర్మములూ తెలిసినవారు అనీ, పరమపరాక్రమవంతులు అనీ తమ సద్గుణాల నన్నిటినీ నాకు ఈ హనుమంతుడు తెలియజెప్పినాడు.

"ఓ ప్రభూ! తాము పరమయోగ్యులు కనుకనే వానరమాత్రుణ్ణి అయిన నాతో స్నేహము చేయడానికి వచ్చినారు. అంటే, తాము నన్ను సత్కరించడానికి వచ్చినారు అన్నమాట. నాకు తాము ఎంతో గొప్ప శుభము చేయబోతున్నారు. ఓ రామప్రభూ! ఇదిగో నా చెయ్యి చాచినాను. నీ చెయ్యి నా చేతిలో వేయవలసింధి. మనము స్నేహమర్యాదను పాటింతాము. ఎప్పటికీ మనము స్నేహితులుగా ఉందాము' అన్నాడు సుగ్రీవుడు.

ఇంత చక్కగా సుగ్రీవుడు చెప్పగానే రాముడు ఎంతో సంతోషముతో తన చేతితో సుగ్రీవుడి చెయ్యి గట్టిగా పట్టుకొన్నాడు. ఆ చెయ్యి నలుపుతూ స్నేహాతిశయముతో సుగ్రీవుణ్ణి గట్టిగా కౌగిలించుకొన్నాడు.

భిక్షురూపము వదిలిపెట్టి వానరరూపముతో ఉన్న హనుమంతుడు అప్పటికి అప్పుడు రెండు అరణికట్టెలు తెచ్చి అగ్నిహోత్రము రగులకొల్పినాడు. మండుతూ ఉన్న ఆ అగ్నిహోత్రము చుట్టూ పూలు ఉంచి పూజ చేసినాడు. అంతట హెచ్చరికతో ఆ అగ్నిహోత్రాన్ని రామసుగ్రీవుల మధ్యను ఉంచినాడు.

భగభగ మంటలు మండుతూ ఉన్న ఆ అగ్నిహోత్రానికి రాముడూ, సుగ్రీవుడూ ప్రదక్షిణము చేసినారు. అగ్నిసాక్షిగా ఇద్దరూ స్నేహితులు అయినారు. అంతట

ఎంతో సంతోషముతో ఒకరిని ఒకరు చూచుకొనసాగారు. అట్లా ఎంతసేపు ఒకరిని ఒకరు చూచుకొన్నా వారికి తనివితీరలేదు.

అప్పుడు సుగ్రీవుడు అత్యంత సంతోషముతో, "ఓ రామప్రభూ! నీవు నా స్నేహితుడవు. నా మనస్సుకు నచ్చినవాడవు. ఇకను నీ దుఃఖమే నా దుఃఖము. నీ సుఖమే నా సుఖము. నీ నా భేదాలు ఇకను మనకు లేవు. సుఖదుఃఖాలు ఇకను మనకు సరిసమానములు'' అంటూ దట్టముగా ఆకులతోనూ, విరగపూసిన తామరలతోనూ ఉన్న ఒక మద్దిచెట్టుకొమ్మ నరికి, ఆకులు పరిచి రాముణ్ణి కూర్చుండమని చెప్పి తనూ అతని సరసను కూర్చున్నాడు.

అప్పుడు హనుమంతుడు అత్యంత సంతోషముతో చందనవృక్షశాఖను విరగపూసిన దానిని ఒకటి విరిచి తెచ్చి లక్ష్మణుడు కూర్చుండటానికి ఇచ్చినాడు.

సుగ్రీవుడికి చెప్పనలవికాని సంతోషము వచ్చి ఆనందబాష్పాలు వదులుతూ రాముడితో మృదుమధురముగా, "ప్రభూ! నేను వంచితుడను. భయముతో బాధపడుతున్నాను. నా అన్న నా భార్యను అపహరించినాడు. వాడి భయమునుంచే నేను ఈ దుర్గమారణ్యములో నివసిస్తున్నాను. ఇప్పుడు నిన్ను ఆశ్రయించినాను. నా అన్న వాలి నన్ను వంచన చేయడమే కాకుండా నాతో విరోధము పెట్టుకున్నాడు. వాడి భయమువల్ల నేను దిగులుపడిపోయినాను. మతిభ్రమణముతో తిరుగుతూ ఉన్నాను. ఓ మహాభాగా! వాలి భయముతో బాధపడుతున్న నాకు నీవు అభయము ఇవ్వవలెను. నా భయము వదిలించవలెను. నీవు అందుకు సమర్థుడవు'' అని చెప్పినాడు.

అప్పుడు ఆ ధర్మజ్ఞుడు, ఆ ధర్మవత్సలుడు, ఆ మహాతేజోవంతుడు రాముడు మందహాసము చేస్తూ, "ఓ సుగ్రీవుడా! మైత్రికి ఉపకారమే ఫలము అని నాకు తెలుసును. నీ భార్యను అపహరించినవాణ్ణి నేను చంపివేస్తాను. ఇవిగో చూడు. అమోఘము అయిన నిశితాస్త్రాలు సూర్యచంద్రులవలె తేజరిల్లుతూ ఉన్నవి. కంకపక్షి రెక్కలు కట్టినవి. వీటి మొనలు అమిత తీక్షణము అయినవి. వీటి కణుపులు ఎక్కువ తక్కువలు లేనివి. కోపముతో చెలరేగిన పాములు పోయేటంత వేగముగా పోతవి. ఈ బాణాలతో ఆ దుష్టాచారుణ్ణి వాలిని పడగొట్టుతాను. క్రూర కృష్ణసర్పాలవంటి ఈ బాణాలు వాణ్ణి చంపివేస్తవి. దేవేంద్రుడి వజ్రాయుధము దెబ్బకు పర్వతమువలె, వాడు నేలకూలడము నీవు చూస్తావు'' అని చెప్పినాడు.

సుగ్రీవుడు సంతోషపడే మాటలు రాముడు అన్నందువల్ల అతడు పరమార్థముగా, "ఓ నృసింహుడా! నీవు నరులకు అందరికీ దేవుడివి. నీ అనుగ్రహమువల్ల నా ప్రియురాలూ, వానరరాజ్యమూ నాకు వస్తవి. నాతో వైరము

పెట్టుకొన్న నా శత్రువును చంపివేయడానికి ఇప్పుడు ఎట్లా వీలు అవుతుందో అట్లా చేయవలసింది" అన్నాడు.

ఇట్లా స్నేహపురస్సరముగా సుగ్రీవుడూ, రాముడూ మాట్లాడుకొంటూ ఉండగా, ఇటు కిష్కింధలో తప్తకాంచనమువంటి వాలి ఎడమ కన్నూ, అటు లంకాపట్టణంలో కమలపత్రమువంటి సీతాదేవి ఎడమ కన్నూ, నిప్పుకణమువంటి రావణాసురుడి ఎడమ కన్నూ ఒక్కసారిగా అదిరినవి.

6

సుగ్రీవుడు సంతోషముతో మళ్ళీ రాముడితో, "రామా! నా సచివుడు ఈ హనుమంతుడు ఈ భూమిమీద మంత్రులు అందరిలోనూ ఉత్తమోత్తముడు. నీవు ఎందుకు ఈ నిర్జనారణ్యానికి వచ్చిందీ నాకు చెప్పినాడు. సమయముకోసము కనిపెట్టుకొని ఉన్న రాక్షసుడు నీవూ నీ తమ్ముడూ లేనప్పుడు నీ భార్యను ఎత్తుకొనిపోతూఉంటే, ఆమె అప్పుడు దిక్కు లేక ఏడుస్తూఉంటే, అడ్డముపోయిన జటాయువును ఆ రాక్షసుడు చంపివేసి ఆమెను బలవంతముగా తీసికొని పోయినాడు అని నాతో చెప్పినాడు. రామా! నీవు భార్యావియోగమువల్ల అనుభవిస్తూ ఉన్న దుఃఖమును అచిరకాలములోనే నేను తొలగించి వేస్తాను. మధుకైటభులు ఎత్తుకొని పోయి పాతాళలోకములో దాచిపెట్టిన వేదశ్రుతిని మహావిష్ణువు మత్స్యావతారము ఎత్తి పోయి తెచ్చినట్టు, నీకు నీ భార్యను నేను తెచ్చిపెట్టుతాను. ఓ అరిందమా! నీ భార్య పాతాళములో ఉన్నా, ఆకాశములో ఉన్నా నేను తెచ్చి నీకు సమర్పిస్తాను. రామప్రభూ! నా మాట యధార్థము. నీకే తెలుస్తుంది.

"ఓ మహాబాహూ! దేవేంద్రుడితోకూడ సురాసురులు అందరూ ఏకము అయినా నీ భార్యను ఎవడూ ఏమీ అనుభవించలేడు. ఆమెను అనుభవించ తలచుకొన్నవాడు, విషభక్ష్యము తిన్నవాడివలె అయిపోతాడు. నీవు దుఃఖపడవద్దు. నీ కాంతను నేను తెచ్చిపెట్టుతాను.

"ఓ ఆజానుబాహూ! ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఆమె మైథిలి. సందేహము లేదు. ఆ క్రూరకర్ముడు, ఆ రాక్షసుడు రావణుడు చంకను ఎత్తుకొని ఆకాశములో పోతూ ఉంటే, ఆమె సర్పరాజు భార్యవలె తప్పించుకొని పోవడానికి గింజుకులాడుతూ, 'ఓ రామా! ఓ లక్ష్మణా!' అని పొలికేకలు పెట్టడము నేను విన్నాను. చూచినాను. అప్పుడు నేను ఈ కొండనెత్తముమీదను ఈ నలుగురు వానరులతో ఉన్నాను. ఆమె మమ్ములను చూచింది. ఆమె తన ఉత్తరీయములో సొమ్ములు అన్నీ మూటకట్టి మామీద పడవేసింది.

"ఓ రామా! మేము ఆ ఆభరణాలను అన్నిటినీ తీసి దాచిపెట్టినాము. వాటిని ఇప్పుడు తీసికొనివచ్చి చూపిస్తాము. నీవు గుర్తుపట్టు" అన్నాడు.

"మిత్రుడా! ఆలస్యము ఎందుకు, వాటిని ఇప్పుడే తెప్పించు" అన్నాడు రాముడు. ఈమాట వినీవినడముతో సుగ్రీవుడు చొరనలవికాని ఆ ఋష్యమూక గుహలోకి పోయినాడు. ఆ సుందరాభరణాలు అన్నీ ఉన్న ఉత్తరీయము మూట తెచ్చి రాముడికి ఇచ్చినాడు. రాముడు ఆ ఉత్తరీయాన్నీ, ఆ ఉత్తమాభరణాలనూ చూచినాడు. పొగమంచు కమ్ముకొన్న చంద్రునివలె అయిపోయినాడు. కన్నీళ్ళు కారుస్తూ, 'అయ్యో ప్రియురాలా!' అన్నాడు. నిలవలేకపోయినాడు. నేలమీద పడిపోయినాడు. ఆ సుందరాభరణాలను ఎదురొమ్ముమీద పెట్టుకొని ఒత్తుకొంటూ పుట్టలో పడుకొని కోపముతో బుసలు పెట్టే పామువలె నిట్టూర్పులు విడుస్తూ, ఎడతెగకుండా కన్నీళ్ళు కారుస్తూ, తన ప్రక్కన ఉన్న లక్ష్మణుణ్ణి చూచి ఏడుస్తూ, "తమ్ముడా! రాక్షసుడు ఎత్తుకొనిపోతూ ఉంటే సీతాదేవి తన ఒంటిమీద నుంచి తీసి నేలమీద పడవేసిన ఈ ఉత్తరీయాన్నీ, ఈ ఆభరణాలనూ చూడు. ఆమె ఈ ఆభరణాల మూటను పచ్చిక బయలుమీద పడవేసి ఉంటుంది. ఈ ఆభరణాలు ఎప్పటి మాదిరిగానే చెక్కు చెదరకుండా కనబడుతూ ఉన్నవి, చూడు" అన్నాడు.

అప్పుడు లక్ష్మణుడు, "అన్నా! ఆమె బాహుపురులు ఎట్లా ఉంటవో నాకు తెలియదు. ఆమె కుండలాలు ఎటువంటివో నేను ఎన్నడూ చూడలేదు. ఆమెకు నేను ఎప్పుడూ పాదాభివందనము చేస్తూ ఉండేవాణ్ణి. అందువల్ల, ఆమె అందెలు (నూపురాలు) మాత్రము నేను ఎరుగుదును" అన్నాడు.

రాముడు సుగ్రీవుణ్ణి చూచి దుఃఖముతో, "ఓ మిత్రుడా! ఆమె నా ప్రాణాలకన్నా నాకు ప్రియము అయింది. ఆ క్రూర రాక్షసుడు నా ప్రియురాలిని దొంగిలించి పోవడము నీవు చూచినావు కదా! వాడు ఏ దేశము పోయినాడో చెప్పు. ఏ రాక్షసుడు నా ప్రియురాలిని మైథిలిని అపహరించి నాకు అత్యుత్కటము అయిన కోపము తెప్పించినాడో, ఏ రాక్షసుడు నాకు ఇప్పుడు ఈ మహావ్యసనము తెచ్చిపెట్టినాడో, ఏ రాక్షసుడి కోసము నేను సమస్త రాక్షసులనూ సంహారము చేసివేయవలెనో, ఏ రాక్షసుడు తన ప్రాణనాశనము కోసము మృత్యుదేవత వాకిలి తెరచినాడో వాడు, ఆ రాక్షసుడు ఎక్కడ నివసిస్తున్నాడో చెప్పు.

"ఓ సుగ్రీవుడా! వనమధ్యమునుంచి నా ప్రియురాలిని సీతాదేవిని బలవంతముగా ఎత్తుకొనిపోయిన ఆ రాక్షసుడు నా పరమశత్రువు ఎవరో, ఎక్కడ ఉంటున్నాడో చెప్పు. వాణ్ణి ఇప్పుడే యమసదనానికి పంపించివేస్తాను" అన్నాడు.

7

ఆర్తుడు అయిపోయి రాముడు అట్లా అడుగుతూ ఉంటే సుగ్రీవుడు చేతులు జోడించి కన్నీళ్ళు కారుస్తూ గద్గదకంఠముతో, "ఓ ప్రభూ! నేను ఆ దుష్కులుణ్ణి ఎరుగను. ఆ పాపిష్టి రాక్షసుడి నివాసస్థలముకానీ, వాడి సామర్థ్యము కానీ, వాడి పరాక్రమము కానీ నేను ఎరుగను. నేను వాణ్ణి గురించి ఏమీ ఎరుగకపోయినప్పటికిన్నీ నీవు ఏమీ దుఃఖపడవద్దు.

"ఓ అరిందమా! నేను సత్యము చెప్పుతున్నాను. నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను. సీతాదేవిని నీకు సమర్పించే ప్రయత్నము చేస్తాను. నీవు సంతోషించేటట్లు చేస్తాను. నా పౌరుషముతో నిన్ను తృప్తి పరుస్తాను. నేను నా పరివారముతో కూడా పోయి ఆ రావణాసురుణ్ణి చంపివేస్తాను. ఓ రామా! నీవు వైక్లబ్యము వదలిపెట్టు. ధైర్యముతో ఉండు. నీవంటి మహామహితాత్ముడు ఇంత చులకన అయిపోకూడదు. భార్యాపహరణమువల్ల నేను దుఃఖపడుతున్నాను. అయితే, నేను నీవలె దుఃఖపడడము లేదు. ధైర్యము వదలలేదు. నేను సామాన్యుణ్ణి. అందులో వానరుణ్ణి అయినప్పటికిన్నీ, నా ప్రియురాలి కోసము నేను దుఃఖపడడము లేదు. ఓ రామా! నీవు మహాప్రభావము కలవాడవు. సుశిక్షితుడవు. ధైర్యవంతుడవు. నీకు ఇంకా నేను ఏమి చెప్పేది? నీవు కన్నీళ్ళు కార్చవద్దు. నీవు దుఃఖపడవద్దు. నీ దుఃఖాన్ని ధైర్యముతో నిగ్రహించు. ధైర్యము కోలుపోవడము బలవంతుల లక్షణము కాదు. కష్టకాలము వచ్చినప్పుడు కానీ, అర్థనాశనము అయినప్పుడుకానీ, ప్రాణము పోతుంది ఏమోను అన్న భయము వేసినప్పుడుకానీ బుద్ధిమంతుడు అయినవాడు తన బుద్ధిబలంతో ఆలోచిస్తాడు. ధైర్యంతో ఉంటాడు. దుఃఖపడడు. బుద్ధిబలము లేనివాడు అధైర్యపడతాడు. అందువల్ల, ఎప్పుడూ దుఃఖపడుతూ ఉంటాడు. బరువు ఎక్కువ అయిపోయిన పడవ నీళ్ళలో మునిగిపోయేట్టు దుఃఖభారముతో అవశుడు అయి కుంగిపోతాడు.

"ఓ ప్రభూ! నేను చేతులు జోడించి నిన్ను స్నేహముతో వేడుకొంటున్నాను. నీవు పౌరుషాన్ని అవలంబించు. దుఃఖపడవద్దు. దుఃఖానికి అవకాశమే ఇవ్వవద్దు. దుఃఖపడేవారికి సుఖము ఉండదు. పరాక్రమము ఉండదు. రామా! దుఃఖమువల్ల ప్రాణసంశయావస్థకూడా వస్తుంది. అందువల్ల, నీవు దుఃఖము వదలిపెట్టు. ధైర్యముతో ఉండు. నీ హితము కోసము నేను ఇదంతా స్నేహభావముతో మనవి చేసుకొంటున్నాను కాని, నేను ఒక ఉపదేష్టగా ఉపదేశించటము లేదు. నా స్నేహాన్ని నీవు గౌరవిస్తున్నావు. అందువల్ల చెప్పుతున్నాను. నీవు ఇక దుఃఖపడవద్దు" అని ఎంతో హృద్యముగా సుగ్రీవుడు ఓదార్చినాడు. అప్పుడు రాముడు కన్నీళ్ళు కారుతున్న తన ముఖము

ఉత్తరీయముతో తుడుచుకొని సుగ్రీవుణ్ణి కౌగలించుకొని, "ఓ సుగ్రీవుడా! నీవు నా మిత్రుడివి. స్నేహాతిశయముతో నా మేలుకోరుతున్నావు. నా కర్తవ్యాన్ని తెలియ చెప్పినావు. సఖుడా! నీవు నన్ను ఊరడించినావు. నాకు ఇప్పుడు ధైర్యము వచ్చింది. నీవంటి బంధువు విశేషించి ఈ కాలములో నాకు దొరకడం దుర్లభము.

"సఖుడా! నా ప్రియురాలు సీత ఎక్కడ ఉందీ, ఆ దురాత్ముడు, ఆ క్రూరుడు రావణాసురుడు ఎక్కడ ఉందీ వెతికే ప్రయత్నము నీవు నాకు చేసిపెట్టవలెను. నేను నీకు ఏమి చేయవలెనో నిష్కర్షగా, నిస్సందేహముగా చెప్పు. వీడు, ఈ రాముడు ఈ పని చేయగలడా లేదా అనే అపనమ్మకము వద్దు. నమ్మకముగా చెప్పు. వానాకాలాన మంచినేల నాటిన పయిరువలె నీవు చెప్పేది అంతా నాలో నాటుకొంటుంది, ఫలిస్తుంది.

"ఓ వానరశార్దూలమా! నేను నీమీద అభిమానముతో (వాలిని చంపివేస్తాను) అన్న మాట యథార్థము అనుకో. నేను ఇదివరకు ఎన్నడూ అబద్ధము ఆడి ఎరగను. ఇకముందు ఎప్పుడూ అబద్ధము ఆడను. నేను నీతో ప్రతిజ్ఞ చేసి (వాలిని చంపివేస్తాను అని) చెప్తున్నాను. సత్యముగా చెప్తున్నాను. ఇది నా శపథము" అన్నాడు.

అప్పుడు సుగ్రీవుడూ, అతని మంత్రులూ రాముడి శపథానికి ఎంతో సంతోషపడ్డారు.

అట్లా రాముడూ, సుగ్రీవుడూ సరిసమానము అయిన తమ సుఖ దుఃఖాలను ఒకరితో ఒకరు చెప్పుకొని వారు వారు చేయవలసిన పనులను నిర్ణయించుకొన్నారు.

ఆ మహానుభావుడు, ఆ నరర్షభుడు రాముడు చెప్పింది విని ఆ వానరవీరముఖ్యుడు, ఆ విద్వాంసుడు సుగ్రీవుడు తన కార్యము సిద్ధించినట్టు భావించినాడు.

8

సుగ్రీవుడు సంతుష్టుడు అయినాడు. లక్ష్మణుడి సమక్షములో రాముడితో, "రామా! నీవు సకలసద్గుణ సంపన్నుడవు. నాకు మిత్రుడవు అయినావు అంటే, దేవతలు ఇప్పుడు నన్ను అన్నివిధాలా అనుగ్రహించినారు అన్నమాట. సంశయము లేదు. ఓ ప్రభూ! నీవు పాపరహితుడవు. నీవు సాయపడేట్లయితే నేను దేవరాజ్యము నయినా సంపాదించగలను. ఇక నాకు వానర రాజ్యము వస్తుంది అని వేరే చెప్పవలెనా! మహామహులు పుట్టిన రఘువంశములో నీవు పుట్టినావు. నాకు అగ్నిసాక్షిగా మిత్రుడవు అయినావు. అందువల్ల నేను నా బంధువులకూ, నా స్నేహితులకూ మరింత పూజనీయుణ్ణి అయినాను.

"ఓ రామా! నేను నీకు తగిన స్నేహితుడను. ఈ సంగతి నీకు క్రమముగా ఋజువు అవుతుంది. నా గుణగణాలను గురించి నేను చెప్పుకోవడము నాకు ఇష్టము లేదు. ప్రభూ! ఆత్మజ్ఞానులకు ధైర్యము అచంచలముగా ఉంటుంది. అదేవిధంగా నీవంటి మహాత్ములకు, ఆత్మజ్ఞానసంపన్నులకు ఎవరిమీదను అయినా ప్రేమవస్తే, అది స్థిరంగా ఉండిపోతుంది. వెండిబంగారాలూ, వస్త్రాభరణాలూ మొదలు అయిన వాటిలో మిత్రులు అయినవారు నీ నా అనే భేదము పాటించరు. ధనవంతుడు అయినా, దరిద్రుడు అయినా, దుఃఖములో ఉన్నవాడు అయినా, సుఖపడుతున్నవాడు అయినా, తప్పుచేసినవాడయినా, ఒప్పుచేసినవాడు అయినా స్నేహితుడే ప్రతిమనిషికి పరమగతి. అందువల్లనే, స్నేహితుడు అయినవాడు స్నేహితుడికోసము తన ధనాన్ని అయినా, సుఖాన్ని అయినా, చివరకు ప్రాణాన్ని అయినా వదులుకొంటూ ఉంటాడు" అని చెప్పినాడు.

ధీమంతుడూ, కాంతివంతుడూ, దేవేంద్రునివంటివాడూ అయిన లక్ష్మణుణ్ణి దగ్గిర ఉంచుకొని ఈ మాటలు వింటూ ఉన్న రాముడు సుగ్రీవుడితో, "ఓ మిత్రుడా! స్నేహము అనేది అట్లాగే ఉంటుంది" అని చెప్పినాడు.

వారు అట్లా మాట్లాడుకొంటూ ఉండగా, ఆ దినము గడచిపోయింది.

మరునాడు –

రాముడూ, మహాబలవంతుడు అయిన లక్ష్మణుడూ నిలుచుని ఉంటే సుగ్రీవుడు ఆ అడవిలో అన్నివైపులా తేరిపారచూచినాడు. చక్కగా పూలు పూసి తుమ్మెదలు మూగుతూ తక్కువ ఆకులతోనూ, ఎక్కువ చిగుళ్ళతోనూ ఉన్న సాలవృక్షము కొమ్మను ఆకులే ఎక్కువగా ఉన్న దానిని విరిచి దాని ఆకులతో ఆస్తరణము అమర్చి, ఆ ఆస్తరణము మీద రాముణ్ణి కూర్చుండబెట్టి ఆయన సరసను సుగ్రీవుడు కూర్చుండడం చూచి, హనుమంతుడు మరి ఒక చెట్టుకొమ్మను విరిచి ఆస్తరణము నమర్చి లక్ష్మణుణ్ణి కూర్చుండబెట్టినాడు. వృక్షాలు అన్నీ ఫల పుష్పాలతో కళకళలాడుతూ ఉన్న ఆ పర్వతముమీద సముద్రుడివలె గంభీరముగానూ, ప్రసన్నముగానూ కనపడుతూ సుఖముగా కూర్చున్న ఆ సుందరాకారుణ్ణి రాముణ్ణి చూచి సుగ్రీవుడు సంతోషాతిశయముతో మాటలు తడబడుతూనూ, మృదుమధురము గానూ, "ఓ మిత్రుడా! నా అన్న వాలి నన్ను మోసము చేసినాడు. నన్ను వెళ్ళకొట్టి నా భార్యను అపహరించినాడు. నేను వాడి భయముతో బాధపడుతున్నాను. ఎంతో దుఃఖపడుతున్నాను. ఈ ఋష్యమూక పర్వతము మీద నివాసము పెట్టుకొన్నాను. మా అన్నతో వచ్చిన విరోధమునుంచి నేను చిత్తచాంచల్యముతో తిరుగుతున్నాను.

"ఓ రామా! నీవు సమస్తలోకాలవారి భయమూ పోగొట్టి రక్షించే సామర్థ్యము కలవాడవు. నా అన్న వాలినుంచి నేను ఇప్పుడు భయార్తుణ్ణి అయిపోయినాను. అనాథుణ్ణి అయిపోయినాను. నన్ను నీవు అనుగ్రహించవలెను" అన్నాడు.

సుగ్రీవుడు ఇట్లా చెప్పుతూ ఉంటే ఆ తేజస్వి, ఆ ధర్మజ్ఞుడు రాముడు మందహాసము చేస్తూ, "ఓ సుగ్రీవుడా! మిత్రుడు అయిన వాడికి ఉపకారము చేయవలెను. శత్రువుకు అపకారము చేయవలెను. నీ భార్యను అపహరించిన ఆ వాలిని నేను ఇప్పుడే చంపివేస్తాను. నా ఈ బాణాలు తీక్షణము అయిన తేజస్సుతో అమితవేగముతో పోతవి. ఇవి కార్తికేయుడి వనములో పుట్టినవి. బంగారు ములుకులు వేసినవి. కంకపక్షి రెక్కలు కట్టినవి. దేవేంద్రుడి వజ్రాయుధము వంటివి. వీటికి మంచి కణుపులు ఉన్నవి. వీటి మొనలు ఎంతో తీక్షణము అయినవి. ఇవి ప్రాణాలు కొరకే పాములవంటివి. నీకు అన్నగా పుట్టి, నీకు శత్రువు అయి పాపిష్ఠిపని చేసిన ఆ వాలిని నా బాణాలతో చంపి వేస్తాను. నా బాణాలకు వాడు పగిలిపోయిన పర్వతమువలె నేలకూలుతాడు" అన్నాడు.

ఈ మాటలకు ఆ వానరముఖ్యుడు అమితముగా సంతోషించి, మంచిది మంచిది అని, "రామా! శోకార్తులకు నీవే దిక్కు. నీవు ఇప్పుడు నాకు స్నేహితుడవు అయినావు. స్నేహముతో నా చెయ్యి పట్టుకోవడమే కాకుండా, అగ్నిసాక్షిగా నీవు నాకు స్నేహితుడవు అయినావు. అందువల్ల, నీవు నాకు నా ప్రాణముకన్నా ఎక్కువ అయిన వాడవు. నేను సత్యము మీద శపథముచేసి చెప్పుతున్నాను. నీవు స్నేహితుడవు అయినందువల్ల నా దుఃఖము నీతో చెప్పుకొంటున్నాను. నాలో అంతర్గతము అయిన ఈ దుఃఖము నా మతిని ఎప్పుడూ చెడకొట్టుతూ ఉంది. నీమీద నమ్మకమునుంచి నీతో చెప్పుకొంటున్నాను" అన్నాడు.

అంతట ఆ సుగ్రీవుడి ముఖము అంతా కన్నీళ్ళు కమ్ముకొన్నవి. దుఃఖాతిశయముతో నోటివెంట మాట పెగలలేదు. నదీప్రవాహమువలె వస్తూ ఉన్న కన్నీళ్ళను ధైర్యముతో తక్షణమే నిగ్రహించినాడు. కారిన కన్నీళ్ళు తుడుచుకొని, నిట్టూర్పులు విడుస్తూ నిర్మల నేత్రాలతో రాముణ్ణి చూస్తూ, "మిత్రుడా! నన్ను ఆ బలవంతుడు వాలి రాజ్యమునుంచి త్రోసివేసి పరుషవాక్యాలు ఆడి నన్ను వెళ్ళకొట్టినాడు. నా ప్రాణములకన్నా నాకు ఎక్కువ అయిన నా భార్య నపహరించినాడు. నా స్నేహితులను అందరినీ కారాగృహములో పెట్టినాడు.

"రామా! వాడు, ఆ దుష్టాత్ముడు నన్ను చంపివేయవలెను అనుకొన్నాడు. నామీదికి ఎంతోమందిని వానరులను పంపించినాడు. నేను వాండ్లను అందరినీ

చంపివేసినాను. రామా! అందువల్లనే నేను నిన్ను చూచినప్పుడు, నీవు వాలి పంపిస్తే వచ్చినవాడవు ఏమోను అని సందేహించి భయపడిపోయినాను. ఆ భయము నుంచే నిన్ను నేను సమీపించలేదు. భయకారణము ఉన్నప్పుడు ఎవరు అయినా భయపడక తప్పదు.

"ఓ ప్రభూ! ఈ హనుమంతుడు మొదలు అయిన వాండ్లు నా సహాయులు అయినారు. వీండ్లు నా వెంట ఉండడమునుంచి నేను ఇంకా బ్రతికి ఉన్నాను. ఈ వానరులకు నామీద ఉన్న స్నేహము నుంచి వారు ఎప్పుడూ నన్ను ఏమరకుండా కాపాడుతున్నారు. నేను ఎక్కడికి పోయినా వీండ్లు నన్ను వెంబడిస్తారు. నేను ఎక్కడ ఉంటే వీండ్లు అక్కడనే ఉంటారు. నా స్థితి సంక్షేపముగా చెప్పుకొన్నాను. ఓ రామా! నా జ్యేష్ఠ భ్రాత వాలి ప్రసిద్ధి కెక్కిన పరాక్రమవంతుడు. వాడు నా శత్రువు. వాడి చావుతో నా దుఃఖము అంతము అయిపోతుంది. వాడి చావును బట్టే నేను బ్రతికి ఉండడమూ, సుఖపడడమూ జరుగుతుంది. నేను ఇప్పుడు శోకార్తుణ్ణి. నా శోకము ఎట్లా అంతము అయ్యేదీ నీతో చెప్పుకొన్నాను. దుఃఖపడుతున్నవాడికి అయినా, సుఖపడుతున్నవాడికి అయినా స్నేహితుడే దిక్కు" అన్నాడు.

అంతట రాముడు, "ఓ సుగ్రీవుడా! నీకూ, ఆ వాలికీ విరోధము ఎందుకు వచ్చింది? యథార్థము చెప్పు. వైరకారణము వింటాను. వైరము బలీయమా, వైరకారణము బలీయమా అనే రెంటి బలాబలాలను నిర్ణయిస్తాను. వైరకారణము అయిన నీ అపరాధము అల్పముగానూ, వాడు ఆ వాలి నీతో పెట్టుకొన్న వైరమే ప్రబలంగానూ ఉన్నట్టయితే ఇప్పుడే వాణ్ణి సంహారము చేసిన్నీ, వైరకారణం అయిన నీ అపరాధమే ప్రబలముగానూ, వాడు ఆ వాలి నీతో పెట్టుకొన్న వైరము అల్పంగానూ ఉన్నట్టయితే వాణ్ణి సమాధానపరిచిన్నీ నీవు సుఖముగా ఉండేట్లు చేస్తాను. ఏమంటే, వైరమే బలీయమయినట్లయితే వాడు నిన్నో, నీవు వాణ్ణో సంహారము చేయక తప్పదు. వైరకారణమే బలీయము అయితే వాడు నీతోనో, నీవు వాడితోనో సమాధాన పడడానికి వీలు అవుతుంది. వాడు, ఆ వాలి నీ అన్న నిన్ను అవమానించినాడు అని వినగానే నా హృదయము కంపించింది. వర్షాకాల జలప్రవాహమువలె నాకు కోపము ముంచుకొని వచ్చింది. (అందువల్ల నేను వాణ్ణి చంపివేస్తే నీవు మళ్ళీ దుఃఖ పడకూడదు.) సంతోషముగా ఉండటానికి (జరిగింది అంతా) నిర్విశంకంగా నేను విల్లు ఎక్కుపెట్టే లోపలనే చెప్పు. నేను బాణం వదలిన తరువాత పగవాడు బ్రతికి ఉండడం ఉత్తది."

రాముడు అన్న మాటలకు సుగ్రీవుడూ, తక్కిన నలుగురు వానర వీరులూ అమితానందభరితులు అయినారు. అంతట లక్ష్మణుడు వినేటట్టుగా ఎంతో

సంతోషముతో సుగ్రీవుడు వైరకారణము ఉన్నది ఉన్నట్టు రాముడితో చెప్పను ఆరంభించినాడు.

9

వాలి సుగ్రీవుల వైర వృత్తాంతము

"ఓ రామా! మా అన్న వాలి ఎటువంటి శత్రువును అయినా సంహారము చేయకుండా వదలిపెట్టేవాడు కాడు. మా తండ్రి ఎప్పుడూ వాణ్ణి మెచ్చుకొంటూ ఉండేవాడు. నేను అతనిని గౌరవిస్తూ ఉండేవాణ్ణి. మా తండ్రి చనిపోగానే మంత్రులు అందరూ చేరి జ్యేష్ఠుడు అని మా అన్నను వానర రాజ్యానికి రాజుగా అభిషేకించినారు. పిత్రు పైతామహము అయిన రాజ్యాన్ని మా అన్న పరిపాలిస్తూ ఉంటే, నేను సర్వకాలసర్వావస్థలలోనూ సేవకుడివలె అతనికి సేవచేస్తూ ఉండేవాణ్ణి.

"దుందుభి జ్యేష్ఠపుత్రుడు మాయావి అనే రాక్షసుడు ఒకడు ఉండేవాడు. వాడు మహాపరాక్రమవంతుడు. వాడికిన్నీ, మా అన్న వాలికిన్నీ ఒకానొక స్త్రీ నుంచి విరోధము వచ్చింది. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఆ మాయావి ఒకనాడు అర్ధరాత్రము అప్పుడు అందరూ నిద్రపోతూ ఉండగా కిష్కింధానగర ద్వారము దగ్గరకు వచ్చి, భయంకరముగా సింహనాదము చేసి, వాలిని యుద్ధము చేయవలసింది అని సవాలు చేసినాడు. గాఢనిద్రలో ఉన్న మా అన్న వాలి, ఆ భైరవస్వరము విని లేచినాడు. ఓర్వలేకపోయినాడు. అప్పటికి అప్పుడు బయలుదేరినాడు. అతని స్త్రీలు అందరూ అప్పుడు అతనిని పోవద్దు అని చెప్పినారు. నేనూ నమ్రభావంతో పోవద్దు అని చెప్పినాను. వాడు మా మాటలు వినలేదు. మమ్ములను విదిలించివేసి కోపంతో ఆ అసుర శ్రేష్ఠుని చంపివేయడానికి హుటాహుటి పోయినాడు. నేను భ్రాతృప్రేమతో మా అన్నను వెంబడించినాను.

ఆ అసురుడు మా అన్ననూ, అతని వెనుక దూరంగా వస్తూ ఉన్న నన్నూ చూచినాడు. వాడికి భయం వేసింది. అంతట వాడు అమితవేగంతో పరుగెత్తసాగాడు. మేము మరింత వేగంగా వాడి వెంటపడ్డాము. పయిగా, అప్పుడు చంద్రోదయం అయింది. వెలుతురు వచ్చింది. మేము ఇక వాణ్ణి కలుసుకొంటాము. వాడు అప్పుడు ఒక బిలంలోకి చటుక్కున చొరపడ్డాడు. అది భూమిమీద ఉన్నప్పటికీ పై వరకూ గడ్డి కమ్ముకొని లోపలికి పోను అలవి కాకుండా ఉంది. వాడు, ఆ పగవాడు ఆ బిలంలోకి పోవడం మా అన్న వాలి చూచినాడు. రోషపరవశుడు అయినాడు. కోపంతో అతని దేహం అంతా కంపించిపోయింది. నా వంక చూచి, "సుగ్రీవుడా! నేను ఈ బిలములోకి పోయి శత్రువును ఇప్పుడే చంపివేస్తాను. నేను తిరిగి

వచ్చేటంతవరకూ నీవు ఏమరకుండా ఇక్కడనే ఈ బిలము వాకిట ఉండు" అని చెప్పినాడు. నన్ను తనవెంట రానీయవలసింది అని నేను వేడుకొన్నాను. ఆ పరంతపుడు అందుకు ఒప్పుకోలేదు. నేను తనను వెంబడించకుండా అక్కడే కనిపెట్టుకొని ఉండడానికి నా చేత తన అడుగులమీద ఒట్టు పెట్టించుకొన్నాడు. ఆ తరువాత అతడు బిలంలోకి పోయినాడు.

"వాలి ఆ బిలంలోకి పోయి సరిగా ఒక సంవత్సరం అయిపోయింది. నేను ఆ సంవత్సరం అంతా ఆ బిలద్వారం దగ్గరనే కనిపెట్టుకొని వున్నాను. ఒక సంవత్సరం అయిపోయినప్పటికిన్నీ వాలి బయటకు రానందువల్లనూ, అతడిమీద నాకు వున్న ప్రేమవల్లనూ భయపడిపోయినాను. తొట్రుపాటు పడిపోయినాను. అతడు చనిపోయినాడు ఏమోను అని సందేహించినాను. చాలాకాలం గతించింది. అప్పుడు ఆ బిలంలోనుంచి నురుగులతో కూడా నెత్తురు రావడం కనిపించింది. నేను దుఃఖపడిపోయినాను. యుద్ధంలో పాల్గొంటున్న అసురుల అరుపులు వినిపించినవి కాని మా అన్న వాలి జయజయధ్వనులు వినిపించలేదు.

"ఓ రామా! నేను ఆ చిహ్నాలను పట్టి మా అన్న వాలి చనిపోయినాడు అనుకొన్నాను. అంతట నేను ఆ బిలద్వారాన్ని ఒక కొండ అంత రాయితో మూసివేసినాను. శోకార్తుణ్ణి అయి మా అన్న వాలికి జలతర్పణము వదలి కిష్కింధకు వచ్చివేసినాను. జరిగింది నేను ఎవరితోనూ చెప్పకుండా దాచిపెట్టినాను. అయితే, మంత్రులు అందరూ జరిగింది అంతా అతిప్రయత్నముతో నావల్లనే తెలుసుకొన్నారు. అందరూ యోచించి సమ్మతించి నాకు రాజ్యాభిషేకము చేసినారు.

"నేను న్యాయ మార్గాన రాజ్యపాలనము చేయడము మొదలు పెట్టినాను. వాలి తన శత్రువు అయిన ఆ మాయావిని చంపివేసి కొంతకాలానికి కిష్కింధకు వచ్చినాడు. పట్టాభిషిక్తుణ్ణి అయి రాజ్యము ఏలుతున్న నన్ను చూచినాడు. కన్నులు ఎర్రచేసినాడు. నా మంత్రులను కారాగృహములో పెట్టినాడు. నన్ను తిట్టినాడు. అప్పుడు అతనిని నిగ్రహించే సామర్థ్యము నాకు ఉన్నప్పటికిన్నీ, అతడు నా అన్న అనే గౌరవమునుంచి నాకు అతణ్ణి నిగ్రహించవలెను అనే బుద్ధి పుట్టలేదు.

"ఆ మహాబలవంతుడు మా అన్న వాలి తన శత్రువులను సంహారము చేసివేసి పట్టణానికి రాగానే, నేను ఆయనను యథాశాస్త్రముగా గౌరవించి నమస్కారము చేసినాను. అందుకు అతడు సంతోషించలేదు. నన్ను ఆశీర్వదించను అయినా లేదు. ప్రభూ! నేను చేసింది ఉత్త నమస్కారము కాదు. నా కిరీటము అతని పాదాలకు తగిలేటట్లు సాగిలపడి నమస్కారము చేసినాను. నామీద వచ్చిన కోపమునుంచి అతడు, ఆ వాలి నన్ను అనుగ్రహించలేదు.

10

"అంతట మా అన్న వాలి కోపావేశపరవశుడు అయి నామీద పడవస్తూ ఉంటే, నేను అతన్ని సమాధానపరచి సంతోషపెట్టవలెను అనుకొని, 'అన్నా! నీవు నా భాగ్యవశంవల్ల కుశలముగా వచ్చినావు. శత్రువునుకూడా సంహారము చేసివేసినావు. నీవు అనాథులను సంతోషపెట్టేవాడవు. అనాథుణ్ణి అయిన నాకు నీవు ఒక్కడవే నాథుడవు. ఇదిగో, ఉదయిస్తున్న నిండుచంద్రుడివలె ఎన్నో కమ్ములతో వున్న ఈ శ్వేతచ్ఛత్రాన్ని నీకు ఎత్తి పట్టుతాను. ఈ వింజామరలతో వీస్తాను.

"ఓ రాజా! నేను ఆ బిలం వాకిట సంవత్సరంపైన కాలం కనిపెట్టుకొని ఉన్నాను. నీవు రాకపోవడమే కాకుండా, ఆ బిలంలో నుంచి నెత్తురు పైకి ఉబకడం మొదలు పెట్టింది. అది చూచినాను. ఆర్తుణ్ణి అయిపోయినాను. దుఃఖంతో నా హృదయం బ్రద్దలు అయిపోయింది. నా దేహం కంపించిపోయింది. అంతట ఆ బిలం ద్వారాన్ని ఒక కొండరాయితో మూసివేసి అక్కడనుంచి కిష్కింధకు వచ్చినాను. నీవు ఎంతకాలానికీ రాలేదు. పౌరులూ, మంత్రులూ దేశము అరాచకము అయిపోతుంది ఏమోను అని భయపడ్డారు. నేను కోరకపోయినప్పటికీ, నేను ఒప్పుకోకపోయినప్పటికీ నాకు రాజ్యాభిషేకము చేసినారు. అది తప్పు అయినట్టు అయితే నన్ను క్షమించవలెను.

"అన్నా! నీవే ఈ వానర రాజ్యానికి రాజువు. నీవే పూజనీయుడవు. ఇదివరకటివలె ఎప్పుడూ నీకు సేవ చేస్తూ ఉండడమే నా పని. నీవు లేకపోయినందువల్లనే నేను రాజ్యపాలనము చేసినాను. మంత్రులతోనూ, పౌరులతోనూ, పట్టణాలతోనూ చెక్కుచెదరకుండా ఇంతవరకూ నావద్ద నీ రాజ్యము ఇల్లడముగా ఉంది. ఇప్పుడు నీ సొమ్ము నీకు ఒప్పగిస్తున్నాను.

"రాజా! నీవు ఎటువంటి శత్రువును అయినా సంహారము చేయగల సమర్థుడవు. ఎంతో మంచివాడవు. నామీద కోపము వద్దు. నేను నిన్ను శిరసా యాచిస్తున్నాను. మంత్రులూ, పౌరులూ చేరి దేశము రాజశూన్యము కాకూడదు అని చెప్పినారు. నన్ను బలవంతముగా రాజును చేసినారు. నేను అయి రాజ్యము కోరలేదు. నా అంగీకారముమీద నన్ను రాజునుగా చేయలేదు. వారి అంతట వారు నన్ను రాజునుగా చేసినారు" అని నేను భ్రాతృగౌరవముతో చెప్పుకొంటూ ఉంటే మా అన్న వాలి 'ఛీ, ఛీ' అని నన్ను నానామాటలూ అన్నాడు.

"మా అన్న వాలి అంతటితో పోనీయ లేదు. తనకు ఇష్టులు అయిన పౌరులనూ, మంత్రులనూ రావించి నా స్నేహితుల ఎదట నన్ను అనరాని మాటలు అన్నీ అని వారి అందరితోనూ, 'ఓ పౌరులారా! ఆనాడు రాత్రి ఆ దుర్బుద్ధి, ఆ క్రూరరాక్షసుడు నన్ను యుద్ధానికి రమ్మని పిలవడము మీకు అందరికీ తెలిసిన

విషయమే. నేను అంతట రాజభవనమునుంచి బయటకు బయలుదేరడముతోనే నా తమ్ముడు, ఈ దుర్మార్గుడున్నూ నా వెనుక బయలుదేరినాడు. ఆ మహాబలవంతుడు మాయావి, మేము యిద్దరమున్నూ అప్పుడు వాడి వెంట పడడముచూచి భయపడి పరుగెత్తసాగినాడు. అమితవేగముతో మేమున్నూ వాడివెంటపడి పరుగెత్తినాము. వాడు అంతట చటుక్కున ఒక బిలములోనికి దూరినాడు. అ బిలము చాలా పెద్దది. మహాభయంకరము అయింది. వాడు, ఆ మాయావి ఆ బిలములోనికి పోయినట్లు మేము తెలుసుకొన్నాము. అప్పుడు నేను నా ఈ తమ్ముడితో, ఈ క్రూరకర్ముడితో 'నేను ఆ రాక్షసుణ్ణి వధించకుండా కిష్కింధకు తిరిగినాను. కాబట్టి నేను వాణ్ణి చంపివేసి తిరిగివచ్చేటంతవరకున్నూ ఈ బిలద్వారము దగ్గర కనిపెట్టుకొని ఉండు' అని చెప్పినాను. వీడు అక్కడ కనిపెట్టుకొని ఉంటాడు అనుకొని అటు పోనలవికాకుండా ఉన్న ఆ బిలములోకి పోయినవాణ్ణి, ఆ మాయావిని వెదకడము మొదలుపెట్టినాను. వాణ్ణి వెదకడములో ఒక సంవత్సరము గడచిపోయింది. అప్పుడు భయావహుడు మాయావి నాకు కనుపించినాడు. ఏకష్టమూ లేకుండా వాణ్ణీ, వాడి బంధువులనూ పట్టుకొని, కొట్టడము మొదలుపెట్టినాను. నా దెబ్బలకు వాడు, ఆ మాయావి అరుస్తూ నెత్తురు కక్కుకొన్నాడు. ఆ నెత్తురుతో ఆ బిలమంతా నిండిపోయింది. వాడు చచ్చిపోయాడు. నేను అప్పుడు అక్కడ ఉండలేకపోయినాను. బిలద్వారము దగ్గరకు వచ్చినాను. బిలద్వారము మూసివేసి ఉన్నందువల్ల అది ఎక్కడ ఉందో మొదట నాకు కనపడలేదు. నేను సుగ్రీవా, సుగ్రీవా! అని పదే పదే పిలిచినాను. జవాబు లేదు. నేను చాల దుఃఖపడి పోయినాను. ద్వారానికి రాయి మూతవేసి ఉంది. దాన్ని తన్ని పగలకొట్టి బయటికి వచ్చినాను. వీడు, ఈ సుగ్రీవుడు ఇక్కడ రాజుగా కూర్చున్నాడు. తానే ఈ రాజ్యము ఏలవలెను అనుకొని భ్రాతృగౌరవాన్ని విస్మరించి ఆ బిలములో నుంచి నన్ను బయటకు రానీయకుండా ఒక రాయి అడ్డము పెట్టి ఇక్కడకు వచ్చినాడు' అంటూ ఏ భయమూ లేకుండా కట్టుగుడ్డతో నన్ను కిష్కింధనుంచి వెళ్ళగొట్టినాడు.

"రామా! నన్ను వాలి చావగొట్టి మరీ వెళ్ళగొట్టినాడు. నా భార్యను అపహరించినాడు. నేను వాడి భయము నుంచీ, నా భార్యా వియోగ దుఃఖము నుంచీ మహారణ్యములో సంచరిస్తూ, సముద్రవలయితము అయిన ఈ భూమిని అంతా తిరిగి చూచినాను. వాడు రావడానికి వీలులేని ఈ ఋష్యమూక పర్వతానికి వచ్చి చేరినాను.

"ఓ రామా! నీవు అడిగినావు కనుక మా వైరవృత్తాంతము అంతా చెప్పినాను. నా అపరాధము ఏమీలేదు. అయినా, నేను ఇట్లా దుఃఖము అనుభవించవలసి వచ్చింది.

"ఓ రామా! నీవు మహావీరుడవు. సమస్తలోకాలకున్నూ అభయము ఇచ్చేవాడవు. నేను వాలివల్ల భయార్తుణ్ణి అయిపోయినాను. వాణ్ణి నీవు నిగ్రహించి నన్ను అనుగ్రహించవలెను" అని సుగ్రీవుడు చెప్పినాడు.

ఈ మాటలకు ఆ తేజస్వి, ఆ ధర్మజ్ఞుడు రాముడు మందహాసము చేస్తూ ధర్మ సహితముగా, "ఓ సుగ్రీవుడా! సూర్యసమానము అయిన ఈ నా బాణాలు అమోఘము అయినవి. తీక్షణము అయినవి. అమిత వేగముగా పోతవి. ఇవి ఆ దురాచారుడి మీదికి పోయి పడతవి. నీ భార్యను అపహరించిన ఆ పాపాత్ముడు నా కంటపడకుండా ఉన్నంతవరకే బ్రతికి ఉంటాడు. ఓ సుగ్రీవుడా! నీ దుఃఖాన్నిపట్టి ఊహిస్తూ ఉంటే, నీవు ఎటువంటి దుఃఖసముద్రములో మునిగిపోయి ఉన్నదీ నాకు తెలుస్తున్నది. నిన్ను ఆ దుఃఖసముద్రములో నుంచి తరింపచేస్తాను. పుష్కలముగా నీ కోరిక నెరవేరుతుంది" అన్నాడు.

ఈ మాటలకు సుగ్రీవుడు పరమసంతుష్టుడు అయినాడు.

11

వాలి బల పరాక్రమములు

హర్షపౌరుషవర్ధనము అయిన రాముడి మాటలు సుగ్రీవుడు విన్నాడు. అతణ్ణి స్తోత్రము చేసి చేతులు జోడించి, "ఓ రామప్రభూ! నీకు కోపము వస్తే యుగాంతకాల సూర్యుడివలె ప్రజ్వరిల్లుతూ ఆయుస్థానాలలోనుంచి దూరిపోయే నీ తీక్షణబాణాలతో నిస్సందేహముగా నీవు సమస్తలోకాలను దహించివేయగలవు. అయితే, నీవు ఇప్పుడు ఏకాగ్రచిత్తముతో వాలి బలపరాక్రమాలనూ, ధైర్యసాహసాలనూ వినవలెను. నీవు అవి అన్నీ విన్న తరువాతనే కర్తవ్యము నిర్ణయించడము మంచిది.

"ఓ రామా! వాలి సూర్యోదయము అయ్యేలోపల పడమటి సముద్రము నుంచి తూర్పు సముద్రానికీ, దక్షిణ సముద్రము నుంచి ఉత్తర సముద్రానికీ ఏ అలసటా లేకుండా పోయి అర్ఘ్యం ఇచ్చి వస్తాడు. ఆ పరమపరాక్రమవంతుడు పర్వతాగ్రాల మీదకి పోయి పెద్ద పెద్ద పర్వత శిఖరాలను పెళ్ళగించి గబగబా వాటిని బంతులవలె ఎగరవేసి పట్టుకొంటూ ఉంటాడు. తన బలం తెలుసుకోవడానికి మహారణ్యాలలో వివిధ వృక్షాలను, చేవతేలిన వాటిని అమితవేగంగా బాహుబలంతో విరిచివేస్తూ ఉంటాడు.

"వాలి రాజ్యపాలనానికి వచ్చినకాలంలో దుందుభి అనే రాక్షసుడు ఒకడు బయలుదేరినాడు. వాడు వెయ్యి ఏనుగుల బలంతో మహిషాకారంతో, మహాకాయంతో కైలాసపర్వతం అంత ఎత్తున ఉండేవాడు. వాడు అమిత వీర్యవంతుడు.

మహాపరాక్రమవంతుణ్ణి అనే గర్వం వల్లనూ, తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ణి మెప్పించి అనేక వరాలు సంపాదించిన మదం వల్లనూ వాడు సముద్రుడి మీదికి పోయినాడు. అలలతో ఉప్పొంగుతూనూ, రత్నరాసులతో విలసిల్లుతూనూ ఉన్న సముద్రుణ్ణి తనతో యుద్ధము చేయవలసింది అని ఆ దుందుభి సవాలు చేసినాడు.

"ఓ రామా! అప్పుడు ఆ ధర్మాత్ముడు సముద్రుడు కాలము ముంచుకొని వస్తూ ఉన్న ఆ దుందుభిని చూచి, "ఓ యుద్ధవిశారదుడా! నీతో యుద్ధము చేసే సామర్థ్యము నాకు లేదు. అయితే నీతో యుద్ధము చేయగలవాడు ఎవడో చెప్తాను, వినవలసింది.

"ఓ దుందుభీ! హిమవంతుడు అనే పర్వతరాజు ఉన్నాడు. ఆతడు మహామునులకు అందరికీ ఆశ్రయుడు. శంకరుడికి మామ. ఎన్నో పెద్ద పెద్ద గుహలతోనూ, చిన్న చిన్న గుహలతోనూ, పాషాణ రంధ్రాలతోనూ, మహారణ్యాలతోనూ విలసిల్లుతున్నాడు. ఆ హిమవంతుడితో సరిసమానముగా యుద్ధము చేసేవాడు ఎవడూ ఈ లోకములో లేడు. అటువంటివాడితో నీవు యుద్ధము చేయవలెను. అప్పుడు నీ యుద్ధకాంక్ష తీరి సంతోషిస్తావు" అని చెప్పినాడు.

అంతట ఆ అసురోత్తముడు తనకు సముద్రుడు భయపడి పోయినాడు అని తలంచినాడు. వింటినుంచి వెలువడ్డ బాణమువలె హిమవంతుడి మీదికి పోయినాడు. ఆ హిమవత్పర్వతము మీద తెల్లటి ఏనుగులు అంతటి రాళ్ళను దుందుభి తన కొమ్ములతో కుమ్మి లేవనెత్తి భూమి అంతటా విసరివేస్తూ సింహనాదము చేసినాడు. తెల్లటి మేఘము వంటి ఆకారముతో అందరికీ సంతోషము పుట్టించే ఆ ప్రశాంతచిత్తుడు హిమవంతుడు అప్పుడు ఆ పర్వతశిఖరము మీదనుంచి, "ఓ దుందుభీ! నీవు ధర్మవత్సలుడవు. నన్ను నీవు బాధించవద్దు. నీతో యుద్ధము చేసే శక్తి నాకు లేదు. అంతేకాకుండా, తపస్సు చేసుకొనే మహామునులకు అందరికీ ఆశ్రయము ఇచ్చినాను. అందువల్ల, నీవు యుద్ధము చేయమన్నప్పటికీ నేను చేయను" అని చెప్పినాడు.

ఆ ధీమంతుడు గిరిరాజు యిట్లా చెప్పేసరికి దుందుభికి కోపము వచ్చింది. కన్నులు ఎర్రచేసి, "ఓ హిమవంతుడా! నీవు యుద్ధము చేయలేను అంటున్నావు. నాకు తెలుసును. నా భయమునుంచి యుద్ధం చేయడం నీకు ఇష్టం లేకపోతే, పోనీ, యుద్ధోత్సాహి ఎవడో చెప్పు. నాతో యుద్ధము చేయకలవాడు ఎవడో చెప్పు" అని అడిగినాడు.

ఇట్లా ఇదివరకు ఎవడూ ఆ హిమవంతుణ్ణి అడిగి ఎరుగడు. అందువల్ల, ఆ ధర్మాత్ముడికి దుందుభిమీద కోపం వచ్చింది. అంతట మాట నేర్పరితనంతో,

"ఓ దుందుభీ! వాలి అనే వానరుడు ఒకడు ఉన్నాడు. వాడు శ్రీమంతుడు. అసమాన కాంతిమంతుడు. దేవేంద్రుడితో సరిసమానం అయిన పరాక్రమవంతుడు. అతడు ఇప్పుడు కిష్కింధా పట్టణంలో రాజ్యం చేస్తూ ఉన్నాడు. యుద్ధవిశారదుడు. సమస్త యుద్ధపద్ధతులూ తెలిసినవాడు. ద్వంద్వయుద్ధం చేయడంలో సమర్థుడు. నముచితో దేవేంద్రుడివలె, అతడితో నీవు యుద్ధం చేయవచ్చును. నీవు ఇప్పుడే యుద్ధం చేయవలెను అనుకొంటున్నట్టయితే, ఈ క్షణమే నీవు ఆ వాలిమీదికి పో. ఏ సమయంలో అయినా యుద్ధం చేయడానికి అతడు ఏ మాత్రమూ భయపడడు. అతడు శూరుడు. ఎన్నడూ ఎవరికీ ఎదిరించను అలవికాకుండా ఉన్నాడు" అని చెప్పినాడు.

హిమవంతుడు చెప్పింది అంతా విని, ఆ దుందుభి కిష్కింధా పట్టణానికి హుటాహుటి పరుగెత్తికొనిపోయినాడు. వర్షాకాలంలో ఆకాశాన జలపూర్ణ మయిన నీలమేఘంవలె ఆ మహాబలవంతుడు దుందుభి ఎనుపోతురూపంతో, వాడి వాడి కొమ్ములతో కిష్కింధానగర ద్వారం దగ్గరకు వచ్చి భూమి అంతా అదిరిపోయేటట్లు మహాభయావహంగా గర్జిస్తూ, దగ్గరలో ఉన్న పెద్దపెద్ద చెట్లను విరిచి వేస్తూ, గిట్టలతో నేల పగలతొక్కుతూ, కొమ్ములతో నగర ద్వారాన్ని కుమ్ముతూ ఉంటే, ఆ మహాధ్వనులు అంతఃపురంలో ఉన్న వాలికి వినిపించినవి. అతనికి కోపం వచ్చింది. నక్షత్రాలతో చంద్రుడివలె, అంతఃపురాంగనలతోకూడా వాలి అప్పటికి అప్పుడు బయలుదేరి బయటికి వచ్చినాడు. దుందుభిని చూచినాడు. స్పష్టముగా ముక్తసరిగా, "ఓ దుందుభీ! నిన్ను నేను ఎరుగుదును. నీవు మహాబలవంతుడవే. ఎందుకు అరుస్తున్నావు? ఎందుకు ఈ నగర ద్వారాన్ని కుమ్ముతున్నావు? నీ ప్రాణాలు కాపాడుకో" అని చెప్పినాడు.

ఈ విధంగా ఆ ధీమంతుడు, ఆ వానరేంద్రుడు వాలి చెప్పే చెప్పడంతో దుందుభి కుపితుడు అయిపోయి కన్నులు ఎర్రచేసి, "ఓ వీరుడా! నీవు స్త్రీల ఎదుట ఇట్లా గప్పాలు కొట్టుతూ మాట్లాడడము ఏమీ బాగాలేదు. నాతో పోరాడు. నీ బలము ఏమిటో బయటపడుతుంది. ఓ వానరుడా! ఇది రాత్రి సమయము. కాబట్టి నా కోపాన్ని అణచుకొంటున్నాను. నీవు ఈ రాత్రి అంతా కామభోగాలు అన్నీ యథేష్టముగా అనుభవించు. ప్రాతఃకాలము వరకూ నీకు గడువు ఇస్తున్నాను. నీవు సమస్త వానరులకూ రాజువు. కనుక నీ బంధువులనూ, స్నేహితులనూ కౌగలించుకొని ఆదరించు. ఇవ్వవలసిన వారికి ధనము ఇచ్చి సంతోషపెట్టు. నీ స్నేహితులను అందరినీ కలుసుకో. కిష్కింధానగరము అంతా తిరిగి చూడు. నీ అంతటివాణ్ణి మరి ఒకణ్ణి రాజుగా నిర్ణయించు. స్త్రీలతో హాయిగా క్రీడించు. నీ కోరికలు అన్నీ తీర్చుకో. తెల్లవారిన తరువాత రా. నీ మదము అణుస్తాను.

'ఓ వాలీ! ఏమరుపాటున ఉన్నవాణ్ణీ, తప్పతాగి కైపులో ఉన్నవాణ్ణీ, నిద్రపోతున్న వాణ్ణీ, నిరాయుధుణ్ణీ, నీవలె స్త్రీభోగార్థము మధుపానము చేసి మత్తెక్కి ఇతికర్తవ్యతామూఢుడు అయిపోయిన వాణ్ణీ చంపివేసేట్లయితే భ్రూణహత్యా దోషము పట్టుకొంటుంది. అందువల్ల, నీకు తెల్లవారే వరకూ గడువు ఇస్తున్నాను, పోయిరా" అన్నాడు.

ఈ మాటలు వినగానే తార మొదలు అయిన స్త్రీలను అందరినీ అంతఃపురానికి పంపించివేసి, వాలి ఆ దుందుభిని చూచి నవ్వుతూ సవిలాసముగా, "ఓ దుందుభీ! నీకు యుద్ధము అంటే భయము లేకపోయినట్లయితే నేను ఇప్పుడు కామపరవశుణ్ణి అయి ఉన్నాను అని నీవు అనుకోవద్దు. నా ఈ కామపారవశ్యము యుద్ధానికి పోబోయే ముందు ఉత్సాహము కోసము వీరులు చేసే మదిరాపానము వంటిది అనుకో" అని చెప్పుతూనే పరమక్రుద్ధుడు అయిపోయినాడు. తన తండ్రి దేవేంద్రుడు ఇచ్చిన కాంచనమాలను ధరించి యుద్ధసన్నద్ధుడు అయినాడు. పోయీపోవడంతో పర్వతము అంత ఎత్తున ఉన్న ఆ దుందుభి కొమ్ములు రెంటినీ రెండుచేతులా పట్టుకొని, వాణ్ణి ఇట్టే లేవనెత్తి కేకలు పెట్టుతూ, గిరగిర తిప్పుతూ నేలకువేసి కొట్టి సింహనాదము చేసినాడు. చెవులలో నుంచి నెత్తురు కారుతూ నేలమీదనుంచి దుందుభి లేచినాడు. ఉభయులూ క్రోధసంరంభులు అయినారు. పరస్పర జయేచ్ఛతో మహాఘోరముగా పోరాడినారు. శక్రతుల్యపరాక్రముడు వాలి అప్పుడు రాళ్ళు రువ్వుతూనూ, చెట్ల కొమ్మలతో బాదుతూనూ, పిడికిళ్ళతో గుద్దుతూనూ, ఎగిరి కాళ్ళతో తన్నుతూనూ దుందుభితో పోరాడినాడు. ఆ వానరుడికీ, ఆ అసురుడికీ అట్లా పోరాటము సాగినకొద్దీ దుందుభి బలము తిరిగి క్షీణించడమూ, వాలి బలము పెరగడమూ మొదలు పెట్టింది. అంతకు అంతకు పోరాడే ప్రయత్నమూ, బలమూ, పరాక్రమమూ దుందుభికి తగ్గిపోవడము వాలి కనిపెట్టినాడు. అంతట వాణ్ణి అమాంతమూ వాలి లేవనెత్తి నేలమీద విసిరివేసినాడు. అప్పుడు ఆ దుందుభి మహాకాయము అంతా నుగ్గు నుగ్గు అయిపోయింది. వాడి ప్రాణము పోయింది.

"ఆ మహాబలవంతుడు వాలి అప్పుడు దుందుభి కళేబరాన్ని తన చేతులతో లేవనెత్తి అటూ ఇటూ ఆడించి చూచి, అది ఒక యోజనము దూరము పోయి పడేట్లు విసరివేసినాడు. అట్లా విసరి వేయడములో ఆ దుందుభి శవము పోయి మతంగ మహాముని ఆశ్రమములో పడ్డది. దాని నోటిలోనుంచి, చెవులలోనుంచి కారుతున్న రక్తబిందువులు వాయువేగానికి పోయి మతంగ మహామునిమీద పడ్డవి.

"ఆ రక్తబిందువులను చూచి, ఆ మహాభాగుడు మతంగ మహాముని క్రుద్ధుడు అయిపోయినాడు. ముందు వెనుకలు ఆలోచించకుండా తన మీద తటాలున

నెత్తురు చినుకులు పడేట్టు చేసిన దురాత్ముడు, దుర్బుద్ధి, మూర్ఖుడు, మూఢుడు ఎవడు అయి ఉంటాడా అని ఆలోచిస్తూ, ఆ మహర్షి బయటకు వచ్చినాడు. ఆ తపోవనములో నేలమీద పర్వతాకారముగా పడివున్న దుందుభి కళేబరాన్ని చూచినాడు. అట్లా ఆ రాక్షస కళేబరాన్ని తన తపోవనములో పడేటట్లు విసరివేసినవాడు వాలి అని తపోబలముతో ఆ మహాత్ముడు తెలుసుకొన్నాడు.

అంతట మతంగ మహాముని వాలిని ఉద్దేశించి, "ఎవడు ఈ నా తపోవనంలో రక్తబిందువులు పడి పాడయిపోయేటట్లు చేసినాడో, ఎవడు నా యీ తపోవన వృక్షాలు అన్నీ విరిగిపోయేటట్లు రాక్షస కళేబరాన్ని విసరివేసినాడో, వాడు ఈ ఆశ్రమ పదానికి ఒక్క యోజన దూరము అవతల తప్ప ఇవతల కాలు పెట్టకూడదు. ఈ నా మాటలు ధిక్కరించి ఇవతలకు వచ్చేట్టయితే వాడు బ్రతకకూడదు" అని భయంకరము అయిన శాపము పెట్టినాడు.

ఆ మహర్షి అంతటితో ఊరుకోలేదు. అక్కడ ఉంటూ ఉన్న వాలి మిత్రులను అందరినీ చూచి, "నా ఈ తపోవనములో వాలి మిత్రులు అయిన వానరులు ఎవరూ ఉండకూడదు. వెంటనే వెళ్ళిపోవలెను. నేను పసిబిడ్డనువలె కాపాడుతూ ఉన్న ఈ తపోవనములో ఆకులుకానీ, మొక్కలుకానీ, పండ్లుకానీ, కందమూలాలుకానీ వాలికి సంబంధించిన వానరులు ఎవరూ ముట్టుకోకూడదు. నా ఈ శాపానికి ఒక్కదినము గడువు. ఇక్కడ రేపు ఉదయము వాలి సంబంధీకులు అయిన వానరులు ఉండేట్లయితే, వాండ్లు అందరూ రాళ్ళు అయిపోవలెను" అని శాపము పెట్టినాడు.

మతంగ మహర్షి శాపవాక్కులు విన్న వాలి మిత్రులు అందరూ అంతట అక్కడినుంచి బయలుదేరి వాలి దగ్గరకు పోయినారు. అట్లా వచ్చినవారిని అందరినీ చూచి, "ఓ వానరులారా! మతంగమహాముని ఆశ్రమమునుంచి మీరు అందరూ ఇక్కడికి ఎందుకు వచ్చినారు? మీరు అందరూ అక్కడ సుఖముగా ఉండడములేదా" అని వాలి అడిగినాడు. వారు, ఆ వానరులు అందరూ జరిగినది అంతా వాలికి తెలియచెప్పినారు. అప్పుడు వాలి మతంగమహాముని దగ్గరకు పోయి చేతులు జోడించి ప్రార్థించినాడు. కాని ఆ మహర్షి వాలిని మన్నించలేదు. వాలి ముఖం అయినా చూడకుండా ఆశ్రమములోనికి పోయినాడు. ఇకను అక్కడ ఉండేట్లయితే శాపము అనుభవించవలసివస్తుంది ఏమోనని అని భయపడి వాలి తిరిగి వచ్చివేసినాడు.

"ఓ రామా! అందువల్ల, మతంగమహాముని శాప భయమువల్ల వాలి ఈ ఋష్యమూక పర్వతము దగ్గరకు రాడు. ఈ పర్వతమువంక తొంగి చూడను

అయినా చూడడు. అందువల్లనే, నేను నా ఈ నలుగురు మంత్రులతో ఏ దిగులూ, విచారమూ లేకుండా ఈ మహావనములో తిరుగుతున్నాను.

"రామా! వాలి తన వీర్యాతిశయముతో విసరివేసిన దుందుభి అస్థిసమూహము అదిగో, చూడు. పర్వతశిఖరమువలె ఉంది.

"అవిగో, చూడు. కొమ్మలు నేలకు అంట వేళ్ళాడుతూ ఏడు పెద్ద పెద్ద మద్ది చెట్లు ఉన్నవి. వీటిని వాలి ఒక్కసారిగా పట్టుకొని ఒక్క ఊపు ఊపేవాడు. అంతట వీటి ఆకులు అన్నీ రాలిపోయేవి. ఏ ఆయుధ సహాయము లేకుండా తన భుజబలముతో ఈ చెట్ల ఆకులను అన్నిటినీ రాలకొట్టేవాడు.

"ఓ రాజా! నీకు ఆ వాలి బలపరాక్రమాలను గురించి చెప్పినాను. వాడితో నీవు యుద్ధము ఎట్లా చేస్తావో చెప్పు. ఆ వాలిని ఎట్లా చంపివేస్తావో చెప్పు" అన్నాడు.

సుగ్రీవుడు చెప్పుతూ ఉన్నది అంతా విని లక్ష్మణుడు ఒక్క నవ్వు నవ్వి, "ఓ సుగ్రీవుడా! ఏమిచేస్తే ఈ రాముడు ఆ వాలిని చంపి వేయకలడు అని నీవు నమ్ముతావో చెప్పు" అని అడిగినాడు.

"ఓ లక్ష్మణా! వాలి ఇదివరకు ఈ మద్దిచెట్లను ఏడింటిని ఒక్క బాణముతో కొట్టినట్లు ఒక్కసారిగా పడకొట్టేవాడు. ఇప్పుడు రాముడు ఈ ఏడు మద్ది చెట్లలో ఒకదాన్ని ఒక బాణముతో పడవేసేట్లయితేనూ, దుందుభి ఎముకల పోగును ఎనమన్నూరుచేతుల దూరము పోయి పడేట్టు ఒక కాలితో తన్ని వేయగలిగేట్లయితేనూ వాలిని చంపివేయగల పరాక్రమవంతుడు అని నేను నమ్ముతాను" అని చెప్పి, కొంచెముసేపు ఆలోచించి ఆ రక్తాంతలోచనుణ్ణి రాముణ్ణి చూచి, "రామా! వాలి వానరుడే. అయితే శూరుడు. శూరాగ్రగణ్యులను చంపివేసినాడు. బలానికీ, పౌరుషానికీ ప్రసిద్ధి కెక్కినాడు. యుద్ధాలలో అపరాజితుడు. దేవతలు కూడా చేయలేని పనులను ఎన్నిటినో చేసినాడు. వాడి భయంకర కృత్యాలు అన్నీ నాకు తెలిసినందువల్లనే ఆలోచించి ఈ ఋష్యమూక పర్వతముమీద నేను నివాసము పెట్టుకొన్నాను. వాడు అజయ్యుడు. ఎదిరించ నలవికానివాడు. పరమ కోపిష్ఠి. ఈ హనుమంతుడు మొదలు అయిన మంత్రులు నామీద అనురాగముతో ఎప్పుడూ నా వెంట ఉంటూ ఉన్నప్పటికిన్నీ, వాడు ఆ వాలి ఈ ప్రాంతానికి రాడు అని నాకు తెలిసినప్పటికిన్నీ, వాడు ఎప్పుడు ఎవరిని పురికొల్పి నామీదికి పంపిస్తాడోను అనే భయముతోనే ఈ మహారణ్యములో ఉంటున్నాను.

"ఓ మిత్రవత్సలా! నీవు శ్లాఘనీయుడవు. నాకు మిత్రుడవుగా దొరికినావు. మహర్షులు అందరూ హిమవంతుణ్ణి వలె ఓ పురుష శార్దూలమా! నేను నిన్ను

ఆశ్రయించినాను. ఏమంటే, బలవంతుడు అయిన నా దుర్భ్రాత పరాక్రమము ఎటువంటిదో నాకు తెలుసును. యుద్ధములో నీ పరాక్రమము ఎటువంటిదో నేను ఇదివరకు ఎరుగను. నిన్ను చలింపచేయడానికి, నిన్ను తక్కువ చేయడానికి, నిన్ను భయపెట్టడానికి నేను ఇదంతా చెప్పడము లేదు. వాడి భయంకర కృత్యాలు అన్నీ నేను స్వయముగా ఎరిగి ఉండడముచేత నాకు భయము పుట్టి ఇది అంతా చెప్పినాను.

"ఓ ప్రభూ! భస్మచ్ఛన్నము అయిన అగ్నిహోత్రమువంటి నీ మహాతేజస్సును నీ వాక్కూ, నీ బుద్ధీ, నీ ధైర్యమూ, నీ ఆకారమూ ఎంతగానో సూచిస్తున్నవి" అని సుగ్రీవుడు చెప్పినాడు.

రాముడు చిరునవ్వు నవ్వుతూ, "నీకు నా పరాక్రమాన్ని గురించి నమ్మకము లేకపోయినట్లయితే, నేను ఇప్పుడు నీకు గట్టి నమ్మకము పుట్టిస్తాను" అని సుగ్రీవుణ్ణి ఆశ్వాసిస్తూ ఆ దుందుభి అస్థిసమూహాన్ని పాదాంగుష్ఠముతో లేవనెత్తి అటూ ఇటూ ఆడించి, పది యోజనాల దూరము పోయి పడేట్టు ఎగచిమ్మినాడు.

ఆ రాక్షసుడి కళేబరము ఎండిపోయినందువల్ల రాముడు తన కాలి బొటనవేలితో దానిని ఎగరతన్నినాడు అని ఆ వీర్యవంతుడు సుగ్రీవుడు అనుకొని లక్ష్మణుడి సమక్షములో రాముడితో, "ఓ సఖుడా! ఇదివరకు తడిమాంసముతో ఉన్న దుందుభి మహాకాయాన్ని వాలి విసరివేసినాడు. ఇప్పుడు మాంసము లేనందువల్ల బరువు తగ్గిపోయి గడ్డిపోచవలె అయిపోయింది. రామా! నా అన్న అలసిపోయి దేహము స్వాధీనములో లేని సమయములో ఆ కళేబరాన్ని విసిరివేసినాడు. నీవు సంతోషముగా ఉన్న ఈ సమయములో ఎగచిమ్మినావు. అందువల్ల, వాడు ఎక్కువ బలవంతుడో, నీవు ఎక్కువ బలవంతుడవో తెలుసుకోవడము నాకు అశక్యముగా ఉంది. నాయనా, రామా! తడిది, ఎండింది అనే తారతమ్యమువల్లనే వాడు బలవంతుడా, నీవు బలవంతుడవా అనే సందేహము నన్ను బాధిస్తున్నది. నీవు సాలవృక్షాన్ని ఒక్క బాణముతో ఛేదించకలిగేట్లయితే ఉభయుల బలాబలాలూ నాకు స్పష్టము అవుతవి.

"రామప్రభూ! నీవు వదిలే బాణానికి ఈ సాలవృక్షము చీలిపోతుంది. సందేహము లేదు. ఆలోచించవద్దు. నీవు ఒక్క బాణముతో చంపివేస్తాను అని శపథము చేసినావు. నన్ను సంతోష పెట్టడానికి ఒక్క బాణము వదులు.

"ఓ ప్రభూ! మహాతేజోవంతులు అందరిలోనూ సూర్యుడు ఎటువంటివాడో, మహాపర్వతాలు అన్నిటిలోనూ హిమవత్ పర్వతము ఎటువంటిదో, సమస్త చతుష్పాత్తుల లోనూ సింహము ఎటువంటిదో, పరమపరాక్రమవంతులు అయిన మానవులు అందరిలోనూ నీవు అటువంటివాడవు. ఓ రామా! నీ బాణము వదులు" అన్నాడు.

12

వాలి సుగ్రీవుల యుద్ధము

సుగ్రీవుడి సుభాషితము ఆ మహాతేజోవంతుడు రాముడు విన్నాడు. అతణ్ణి నమ్మించడానికి కార్ముకము పట్టుకొన్నాడు. భయంకరము అయిన ఆ కార్ముకములో ఒక బాణము ఎక్కించినాడు. దిక్కులు పిక్కటిల్లి పోయేటట్లు అల్లెత్రాటిని మ్రోగించినాడు. సాలవృక్షానికి గురిపెట్టినాడు. బాణము వదలినాడు.

రాముడు వదలిన ఆ బంగారు బాణము అప్పుడు ఆ ఏడు మద్ది చెట్లనూ చీల్చివేస్తూ అమితవేగముతో పోయి కొండ నెత్తములో నేలమీద పడ్డది. అక్కడ ఆ నేలను పగులకొట్టి ఆ బాణము మళ్ళీ అంత వేగముతో స్వస్థానానికి (అంబులపొదిలోకి) వచ్చి చేరింది.

ఆ బాణము ఉరవడికి విరిగిపోయిన సప్తసాలవృక్షాలనూ ఆ వానరపుంగవుడు సుగ్రీవుడు చూచినాడు. విస్మితుడు అయిపోయినాడు. పరమ సంతుష్టుడు అయినాడు. చేతులు జోడించి మెడలో ఆభరణాలు అన్నీ వేళ్ళాడుతూ భూమిమీద శిరము ఆనించి రాముడికి నమస్కారము చేసినాడు. ఆ సర్వాస్త్రకోవిదుణ్ణి, ఆ శూరుణ్ణి, ఆ ధర్మజ్ఞుణ్ణి రాముణ్ణి చూచి సంతోషాతిశయముతో, "ఓ ప్రభూ! నీవు పురుషర్షభుడవు. దేవేంద్రుడితో కూడా దేవతలు అందరూ యుద్ధానికి వచ్చినా, వారిని అందరినీ నీ బాణాలతో చంపివేసే సామర్థ్యం నీకు ఉంది. ఇక వాలిని గురించి మరి చెప్పవలసిన పనేలేదు. ఒకే ఒక బాణముతో మహాసాల వృక్షాలను ఏడింటిని పడకొట్టినావు. యుద్ధములో నీ ఎదుట ఎవడు నిలువకలడు? నీవు మహేంద్ర వరుణులతో సరిసమానము అయినవాడవు. నీవు నా స్నేహితుడవు అయినావు. నా దుఃఖము అంతా పోయింది. నాకు సంతోషముగా ఉంది.

"ఓ రామా! నీవు నన్ను సంతోషపెట్టు. నా తోబుట్టువు రూపాన ఉన్న నా శత్రువును వాలిని ఇప్పుడే నీవు చంపివేయవలెను. ఎప్పుడో ఎందుకు, ఇప్పుడే ఆ పని చేయడము మంచిది. ఇదిగో అంజలి ఘటించినాను, బయలుదేరు" అన్నాడు సుగ్రీవుడు.

సర్వమూ తెలిసిన రాముడు ఆ ప్రియదర్శనుణ్ణి సుగ్రీవుణ్ణి కౌగిలించుకొని లక్ష్మణుడి అనుమతితో, "ఓ సుగ్రీవుడా! నీవు ముందు నడువు, మేమూ నీ వెంట ఇక్కడనుంచి కిష్కింధకు వస్తాము. నిన్ను హింసించిన మీ అన్నను, ఆ వాలిని యుద్ధానికి రమ్మని నీవు పిలువు" అని చెప్పినాడు.

అంతట వారు అందరూ కిష్కింధకు బయలుదేరి పోయినారు. అక్కడ ఆ నగరము వెలుపల ఒక దుర్గమారణ్యములో చెట్లచాటున వారు అందరూ ఉండిపోయినారు.

సుగ్రీవుడు గట్టిగా దట్టీ కట్టుకొని ఆకాశము పగిలిపోయేటట్టు భయంకరముగా గర్జించినాడు. కిష్కింధపట్టణములో ఉన్న వాలిని యుద్ధానికి రమ్మని సింహనాదము చేసినాడు. తన తమ్ముడి అరుపులు ఆ మహాబలవంతుడు వాలి విన్నాడు. క్రుద్ధుడు అయిపోయినాడు. అస్తగిరికి పోయే భాస్కరుడివలె బయలుదేరి వచ్చాడు.

వాలి సుగ్రీవులు పోరాడటము మొదలుపెట్టినారు. కోపోద్రేకముతో ఉభయులకూ ఒండ్లు తెలియకుండా పోయింది. ఆకాశములో బుధాంగారక గ్రహాలవలె మహాభయంకరముగానూ, తుములముగానూ పోరాడసాగినారు. పిడుగుల చప్పుళ్ళవలె అరచేతులతో ఒకరిని ఒకరు బాదుకొన్నారు. వజ్రాయుధముతోవలె పిడికిళ్ళతో కొట్టుకొన్నారు.

ధనుర్ధరుడు అయి ఉన్న రాముడు ఆ పరమపరాక్రమవంతులను ఉభయులనూ చూచినాడు. అశ్వినీదేవతలవలె వారు ఉభయులూ ఒక్క మాదిరిగా ఉన్నారు. ఆ ఇద్దరిలో వాలి ఎవడో, సుగ్రీవుడు ఎవడో గుర్తుపట్టలేకపోయినాడు. అందువల్ల, ప్రాణాంతకము అయ్యే బాణము వదలడానికి రాముడికి బుద్ధి పుట్టలేదు.

ఆ పోరాటములో అప్పుడు సుగ్రీవుడు భగ్నమనోరథుడు అయిపోయినాడు. తనను రక్షించడానికి రాముడు కనపడలేదు. అందువల్ల, ఋష్యమూకానికి పరుగెత్తసాగినాడు. అతడు బాగా అలసిపోయినాడు. ఒండ్లు అంతా నెత్తురుతో తడిసిపోయింది. దెబ్బలతో దేహం అంతా వయ్యలు వయ్యలు అయిపోయింది. కోపంతో వెంటపడుతున్న వాలిని చూచినాడు. అంతట సుగ్రీవుడు మతంగమహాముని తపోవనంలోకి పోయినాడు.

సుగ్రీవుడు అట్లా మతంగమహాముని వనంలోకి పరుగెత్తడం వాలి చూచినాడు. శాపభయమువల్ల ముందుకు అడుగు వేయలేక పోయినాడు. "ఒరే తప్పించుకొని పోయినావురా" అన్నాడు. వెనుకకు మళ్ళినాడు.

రాముడున్నూ లక్ష్మణుడితోనూ, హనుమంతుడితోనూ సుగ్రీవుడు వచ్చి చేరిన మతంగమహాముని వనానికి వచ్చినాడు. వారిని చూచి సుగ్రీవుడు సిగ్గుపడిపోయినాడు. నేలవంక చూస్తూ దుఃఖపడుతూ, "మిత్రుడా! నీ పరాక్రమాన్ని చూపించినావు. వాలిని పోరాటానికి పిలవమని చెప్పినావు. నా శత్రువుచే నన్ను కొట్టించినావు. నీవు ఇప్పుడు ఇంతకన్న చేసింది ఏమి ఉంది?

"ఓ రామా! నీవు అప్పుడే ఖండితముగా వాలిని చంపను అని చెప్పి ఉన్నట్లయితే, నేను ఇక్కడనే ఉండేవాణ్ణి" అని జాలిపుట్టేట్టు అన్నాడు.

అప్పుడు రాముడు, "నాయనా సుగ్రీవుడా! నేను ఎందుకు బాణం వదలలేదో కారణము చెప్పుతాను, విను. అన్నదమ్ములు ఉభయులూ ఒడ్డూ పొడుగులోనూ, ఆకారములోనూ, అలంకరణాలలోనూ ఒక్క మాదిరిగా కనిపించినారు. అంతేకాదు పరాక్రమములోనూ, కంఠ స్వరములోనూ, వర్చస్సులోనూ, చూపులోనూ, మాట్లాడడములోనూ మీ ఇద్దరిలోనూ నాకు ఏమీ భేదము కనిపించలేదు.

"ఓ సుగ్రీవుడా! మీ ఇద్దరి రూపమూ ఒక్క మాదిరిగా ఉండడము చేత, నేను నిన్ను గుర్తు పట్టలేక పోయినాను. నా బాణము అమిత వేగముగా ప్రాణము తీసివేస్తుంది. మీ ఇద్దరిలో నీవు ముఖ్యుడవు. నీవే నా చేతిలో నాశనము అయిపోతావు ఏమోను అని సందేహము వచ్చింది. అందువల్ల, నా చేతిలో ఉన్న భయంకరము అయిన బాణాన్ని నేను వదలలేదు.

"ఓ వీరుడా! నా అజ్ఞానమువల్ల, నా లాఘవమువల్ల నీవు విపన్నుడవు అయిపోయేట్టయితే నా మౌఢ్యమూ, నా బాల్యమూ వెల్లడి అవుతవి. నేను నీకు అభయము ఇచ్చినాను. నేనే నిన్ను చంపివేస్తే, నన్ను మహాపాతకము చుట్టుకుంటుంది. ఓ సుగ్రీవుడా! నేనూ, ఈ లక్ష్మణుడూ, ఆ వరవర్ణిని సీతాదేవీ నీ అధీనులము. మాకు ఈ వనములో నీవే రక్షకుడవు. నన్ను నీవు శంకించవద్దు. ఓ మిత్రుడా! నీవు పోయి మళ్ళీ పోరాడవలెను. ఆక్షణమే పోరాటములో నేను వాలిని ఒకే ఒక బాణంతో చంపివేస్తాను. నా బాణానికి వాడు కూలి పొర్లాడడం నీవు చూస్తావు.

"ఓ వానరేశ్వరుడా! మీరు ద్వంద్వయుద్ధం చేస్తూ ఉండేటప్పుడు నిన్ను గుర్తు పట్టడానికి వీలుగా నీవు ఏది అయినా ధరింపవలెను.

"ఓ లక్ష్మణుడా! అదిగో, గజపుష్పలత చక్కగా వికసించింది. అది శుభకరం అయింది. నీవు ఆ గజపుష్పలతను తెంచి తెచ్చి ఈ సుగ్రీవుడి మెడలో పూలదండగా ఉంచు" అని చెప్పినాడు.

అంతట లక్ష్మణుడు ఆ కొండ దగ్గర ఆకులు కనబడకుండా విరగపూసిన గజపుష్పలతను తెంపి తీసికొని వచ్చి సుగ్రీవుడి మెడలో పూలదండగా వేసినాడు. అప్పుడు ఆ కాంతిమంతుడు సుగ్రీవుడు నక్షత్రపంక్తులతో విపరీత (ఉత్పాతకాల) సూర్యుడువలె కనిపించినాడు.

రాముడి మాటలు సుగ్రీవుడు నమ్మినాడు. కొంగల పంక్తులతో సంధ్యాకాల మేఘంవలె గజపుష్పలతతోనూ, బంగారువన్నె దేహంతోనూ తేజరిల్లుతూ సుగ్రీవుడు రాముణ్ణి వెంటపెట్టుకుని మళ్ళీ కిష్కింధకు బయలుదేరినాడు.

13

ఆ ధర్మాత్ముడు రాముడు అంతట కాంచనభూషిత మహాచాపాన్నీ, సూర్యసమాన కాంతులతో ప్రజ్వరిల్లుతూ శత్రుసంహారం చేసే సాయకాలనూ తీసికొన్నాడు. అప్పుడు ఆ ఋష్యమూకం నుంచి కిష్కింధానగరానికి బయలుదేరినాడు.

గజపుష్పమాలతో మెడలు బలసిపోయినట్టు కనబడుతూ ఉన్న సుగ్రీవుడు మహాబలవంతుడు అయిన లక్ష్మణుణ్ణి వెంటపెట్టుకొని దారి చూపిస్తూ ముందు నడచినాడు. వారి ఉభయుల వెనుక ఆ మహాధీరుడు రాముడూ నడచినాడు. అతని వెనక వానరవీరులు హనుమంతుడూ, నీలుడూ, నలుడూ, వానరసేనానాయకులకు అందరికీ నాయకుడు, మహాపరాక్రమశాలీ అయిన తారుడూ నడచినారు.

అప్పుడు ఆ దారిలో పూలబరువుకు వంగిపోయిన చెట్లనూ, నిర్మలోదకాలతో సముద్రానికి పరుగులెత్తుతూ ఉన్న నదులనూ, పెద్ద పెద్ద రాళ్ళ చీలికలతోనూ, గృహాలవంటి పెద్ద పెద్ద గుహలతోనూ, చిన్న చిన్న గుహలతోనూ, బిలాలతోనూ, ఎత్తయిన శిఖరాలతోనూ ఉన్న పర్వతాలనూ చూస్తూ నడచినారు. శుభ్రజలాలతోనూ, వైడూర్యమణులవలె నిర్మలము అయిన తామరాకులతోనూ, వికసిస్తూనూ మొగ్గలు తొడుగుతూనూ ఉన్న కమలాలతోనూ శోభాయమానముగా ఉన్న తటాకాలను చూచినారు. ఆ మనోహర తటాకాలను ఆశ్రయించుకొని కారండపక్షులూ, సారస పక్షులూ, వంజులపక్షులూ, చక్రవాకపక్షులూ, హంసలూ, నీరుకోళ్ళూ, ఇంకా ఇతర పక్షులూ చేస్తూ ఉన్న కలకల ధ్వనులు వింటూనూ, లేతపచ్చిక మేస్తూ ఆ వనము అంతటా నిర్భయముగా పరుగులెత్తుతూనూ, నిలుచుంటూనూ ఉన్న జింకలను చూస్తూనూ, ఆ మహారణ్యములో పుట్టి పెరిగి మదము ఎక్కి రెండు రెండు తెల్లటి దంతాలతో ఒక్కొక్కటిగా తిరుగుతూ తటాకాలను పాడుచేస్తూనూ, ఏటిగట్లను కూలతోస్తూనూ, కొండ చరియలను పొడిచివేస్తూనూ, నేలమీది దుమ్ముతీసి నెత్తిన చల్లుకొంటూ నడిచివస్తూ ఉన్న కొండల వలెనూ, కిందికి దిగివస్తూ ఉన్న మేఘాలవలెనూ భయంకరముగా తోచే మదపుటేనుగులనూ, ఇంకా ఇతర వన్యమృగాలనూ, ఆకాశ ములో సంచరించే నానావిధ పక్షులను చూస్తూనూ వారు ముందుకు సాగిపోయినారు.

వాటిని అన్నిటినీ చూస్తూ వారు అమితవేగముతో పోతూ ఉండగా రాముడు ఆ ప్రాంతములో చెట్లు గుంపులు గుంపులుగా ఉన్న ఒక మహా వనాన్ని చూచి సుగ్రీవుడితో, "ఓ మిత్రుడా! మేఘసమూహాలవంటి చెట్లతో ఆ కనపడుతూ ఉన్న వనము చాలా విశాలముగా ఉంది. చుట్టూ అరటిచెట్లు ఉన్నవి. ఆకాశములో మేఘాలవలె చెట్లు గుంపులు గుంపులుగా నేత్రపర్వముగా కనబడుతున్నవి. ఇది ఎవరిదో తెలుసుకోవలెను అని కుతూహలముగా ఉంది" అన్నాడు.

సుగ్రీవుడు నడుస్తూనే, "ఇది విశాలము అయిన మున్యాశ్రమము. ఇందులో ఎన్నో ఎన్నో ఉద్యానవనాలు ఉన్నవి. ఇది శ్రమాపనయము అయిన ఆశ్రమ పదము. ఇక్కడ పండ్లూ, కందమూలాలూ, జలాలూ చాలా రుచ్యముగా ఉంటవి. తీక్ష్ణవ్రతులు అయిన 'సప్తజనులు' అనే ఏడుగురు మహర్షులు ఇక్కడ కఠిన నియమాలతో తలక్రిందులుగా నిలుచుంటూనూ, నీళ్ళలో పడుకొంటూనూ, ఆహారానికి బదులు ఏడురాత్రులకు ఒకమారు వాయుభక్షణము చేస్తూనూ ఏడునూర్ల సంవత్సరాలు నివసించి సశరీరులుగా స్వర్గతులు అయిపోయినారు. ఆ మహాప్రభావుల కోసము చుట్టూ వృక్షాలు ప్రాకారముగా పెరిగి దేవేంద్రాది దేవతలకు కానీ, రాక్షసులకుకానీ ప్రవేశించనలవికాని మహావనము అయింది. మానవులే కాదు, పక్షులూ, ఇంకా ఇతర వన్యమృగాలూ ఈ ఆశ్రమ పదములోనికి పోవు. ఒకవేళ అవి ఏవి అయినా తెలియక లోపలికి పోయేట్లయితే, తిరిగి బయటికి రావు.

"ఓ రామా! ఈ ఆశ్రమములో నాట్యము చేసేటప్పుడు అయ్యే ఆభరణాల చప్పుళ్ళూ, అవ్యక్త మధురాక్షరాలాపాలూ, గీతావాద్యధ్వనులూ ఎప్పుడూ వినపడుతూ ఉంటవి. ఈ వనములో నుంచి దివ్యగంధము గుబాళిస్తూ ఉంటుంది. త్రేతాగ్నులు ఎప్పుడూ జ్వలిస్తూ ఉంటవి. ఈ వనములో చెట్ల పై భాగాన ఆ త్రేతాగ్నుల పొగలు కమ్ముకొని పావురాయి దేహమువలె సొగసుగా కనపడుతూ ఉన్నవి. పొగలు కమ్ముకొన్నందువల్ల మేఘాలు ఆవరించిన వైడూర్య మణిమయ పర్వతాలవలె చెట్లగుంపులు శోభాయమానముగా కనపడుతూ ఉన్నవి.

"ఓ ధర్మాత్మా! నీవు నీ తమ్ముడితో కూడా ఆ సప్తజన మహర్షులను ఉద్దేశించి పరిశుద్ధాంతఃకరణముతో చేతులు జోడించి నమస్కారము చేయవలసింది. ఆ మహర్షులకు, ఆ ఆత్మవేత్తలకు నమస్కారము చేసే వారి దేహాలు చెక్కు చెదరకుండా ఉంటవి" అని చెప్పినాడు.

అంతట రామలక్ష్మణులు సుగ్రీవాదులతో ఆ మహానుభావులను ఉద్దేశించి నమస్కారము చేసి సంతుష్టాంతరంగులు అయి అక్కడ నుంచి ముందుకు నడిచినారు. ఆ సప్తజనాశ్రమము నుంచి వారు అందరూ బహుదూరము నడచినారు. ఎవరికీ ఎదిరింప నలవికాకుండా వాలి తన పరాక్రమముతో పరిపాలిస్తున్న కిష్కింధానగరము వారికి అప్పుడు కనిపించింది.

14

వారు అందరూ అతిత్వరితముగా నడిచి కిష్కింధానగర ప్రాంతానికి పోయినారు. అక్కడ ఒక దుర్గమారణ్యములో వారు అందరూ ఎవరికీ కనపడకుండా

చెట్ల చాటున నిలచినారు. అప్పుడు ఆ అరణ్యప్రియుడు, ఆ విపులగ్రీవుడు సుగ్రీవుడు ఆ అడవి అంతా తేరిపార చూచినాడు. కోపపరవశుడు అయిపోయినాడు. బాలభాస్కరుడివలె తేజరిల్లుతూ సుగ్రీవుడు విర్రవీగిన సింహమువలె అడుగులు వేస్తూ క్రియాదక్షుడు అయిన రాముడితో, "రామప్రభూ! తప్తకాంచన ద్వారాల తోనూ, ధ్వజయంత్రాలతోనూ, వానరులచేవలతోనూ వాలి తన పరాక్రమముతో పరిపాలిస్తున్న కిష్కింధానగరానికి మనము ఇప్పుడు వచ్చినాము.

"ఓ వీరుడా! నీవు వాలిని చంపివేస్తాను అని ప్రతిజ్ఞ చేసినావు. నీ ప్రతిజ్ఞ చెల్లించుకొనే కాలము ఆసన్నము అవుతూ ఉంది. తరులతాదులు అన్నీ తరుణము రాగానే ఫలిస్తవి. అదేవిధముగా, తరుణము రాగానే నీవు ఏ మాత్రమూ జాగు చేయకుండా నీ ప్రతిజ్ఞను సఫలము చేయవలెను" అన్నాడు. అందుకు ఆ ధర్మాత్ముడు, ఆ శత్రుసూదనుడు రాముడు, "ఓ సుగ్రీవుడా! గజపుష్పలతను లక్ష్మణుడు నీకు కంఠ హారముగా వేసినాడు. ఇక నిన్ను నేను సులభముగా గుర్తు పట్టగలను, సందేహము లేదు.

"ఓ వీరుడా! గజపుష్పలత మెడలో ఉన్న నీవు ఇప్పుడు నక్షత్ర పంక్తులతో విపరీత (ఉత్పాతకాల) సూర్యుడివలె తేజరిల్లుతూ ఉన్నావు. ఓ సుగ్రీవుడా! నేను ఇప్పుడు ఒక బాణముతో నీకు వాలి భయమూ, వాలికి నీతో వైరమూ వదిలించి వేస్తాను.

"ఓ మిత్రుడా! తోబుట్టువు రూపములో ఉన్న నీ శత్రువును నాకు చూపించు. వాణ్ణి నేను చూడడమే తరువాయి, చచ్చిపడి ఈ అడవిలో దుమ్ముతో పొర్లాడుతాడు. ఓ మిత్రుడా! వాలి నా కంటపడి మళ్ళీ ప్రాణాలతో పోయేట్లయితే దోషిగా భావించి, నిందించు. నీవు ఇప్పుడు నన్ను సందేహించవద్దు. నేను నీ ఎట్టఎదట ఒక్క బాణముతో ఏడు మద్దిచెట్లను చీల్చివేసినాను. అదే విధముగా, ఒక్క బాణముతో వాలిని చంపివేస్తాను.

"ఓ వీరుడా! ధర్మహాని అవుతుంది అనే భయమువల్లనే నేను ఇదివరకు ఎటువంటి కష్టకాలములో కూడా అనృతము ఆడలేదు. ఇప్పుడున్నూ అంతే, ఇక ముందున్నూ అంతే. ఈ భూమిమీద మొలకలెత్తే పైరును దేవేంద్రుడు వానతో సఫలము చేస్తాడు. నా ప్రతిజ్ఞను ఒక్క బాణముతో సఫలము చేసివేస్తాను. నీవు ఇక ఆందోళన పడవద్దు. ఆ హేమమాలాధరుడు వాలి నీవు ఇప్పుడు ఎట్లా గర్జిస్తే వెంటనే యుద్ధానికి పరుగెత్తుకొని వస్తాడో, అట్లా గర్జించు. వాడు, ఆ వాలి ఇంతవరకూ జయముతప్ప అపజయము ఎరుగడు అనీ, బలమునుంచి వాడు గర్వపడుతున్నాడు అనీ, పైగా వాడు యుద్ధప్రియుడు అనీ చెప్పినావు. వాణ్ణి నీవు ఎదుర్కొనలేక

పోయినావు. అందువల్ల, నీవు ఇప్పుడు గర్జించగానే వాడు ఏమాత్రమూ జాగుచేయకుండా వచ్చి పడతాడు.

"ఓ సుగ్రీవుడా! యుద్ధము అంటే భయపడని శూరుడు శత్రువు ఎదిరిస్తే సహించలేడు. అందులో తన పరాక్రమమంతా ఎరిగిన శూరుడు, స్త్రీల సమక్షములో ఉన్నప్పుడు శత్రువు వచ్చి ఎదిరిస్తే ఎంతమాత్రమూ సహించడు" అని చెప్పినాడు.

ఈవిధముగా రాముడు చెప్పింది అంతా ఆ హేమపింగళవర్ణుడు సుగ్రీవుడు విన్నాడు. అంతట ఆకాశము బ్రద్దలు అయిపోయేట్టు అమిత భయంకరముగా గర్జించినాడు. ఆ మహాభయంకర గర్జనానికి, అప్పుడు పట్టణములోనికి పోబోతున్న ఆవులు బెదరిపోయి ముఖాలు వెలవెలపోతూ, అరాజకము అయిన రాజ్యములో మదము ఎక్కిన పరపురుషులు తమను పట్టుకో వస్తే, వ్యాకులముతో చెల్లాచెదరు అయి పరుగులెత్తే కులాంగనలవలె దిక్కులు తెలియకుండా పరుగెత్తినవి. రణరంగములో దెబ్బలుతిన్న గుర్రాలవలె, జింకలు అమితవేగముతో అన్నివైపులకూ పరుగులెత్తి పారిపోయినవి. పుణ్యక్షయము అయిపోయిన నక్షత్రాలవలె, పక్షులు ఆకాశమునుంచి నేలకూలినవి. ఉప్పెనగాలికి రేగిన సముద్రమువలె, శౌర్యముతో తేజము అతిశయించిన ఆ సూర్యపుత్రుడు సుగ్రీవుడు, అప్పుడే మేఘసమూహాలు అన్నీ ఒక్కసారిగా ఉరిమినట్టు సింహనాదము చేసినాడు.

15

వాలికి తార హితబోధ

అంతఃపురములో ఉన్న వాలి, తన తమ్ముడు సుగ్రీవుడు సర్వభూతకోటీ సంచలించిపోయేట్లు చేసిన సింహనాదము విన్నాడు. ఆ మహాధ్వని వినీ వినడముతో ఆ వాలికి కామవిషయికము అయిన కైపు అంతా వదలిపోయింది. మహాకోపము వచ్చింది. ఆ కోపాగ్ని దేహము అంతా అలముకొన్నది. సంధ్యాతపప్రభలతో తేజరిల్లుతూ ఉన్న సూర్యుణ్ణి గ్రహణము పట్టినట్టు, వాలి అప్పుడు తేజోహీనుడు అయిపోయినాడు.

సుగ్రీవుడు చేసిన సింహనాదము శూరుడు ఎవడూ విని సహించడు. భూమి అదిరిపోయేటట్టు అడుగుల చప్పుడు చేస్తూ, వాలి అమితవేగముగా బయలుదేరినాడు. అప్పుడు తార భయపడి పోయింది. సంభ్రాంతచిత్త అయింది. గబగబా పోయి స్నేహాతిశయముతో వాలిని కౌగలించుకొన్నది. తన స్నేహాన్ని ప్రదర్శిస్తూ అతనికి మేలు చేయడం కోసము, "ఓ వీరోత్తమా! తమకు కోపము ఏటివరదంత వేగముగా వచ్చింది. ఇంత కోపము ఇప్పుడు వద్దు. రాత్రి పెట్టుకొన్న పూలదండలను

ప్రాతఃకాలాన లేవగానే అవతల పారవేసేటట్టు, మీరు ఇప్పుడు ఈ కోపాన్ని వదలి పెట్టండి. మీరు అట్లా చేయడము మంచిది.

"రాజా! మీరు రేపు ఉదయము ఆ సుగ్రీవుడితో యుద్ధము చేయండి. అందువల్ల, మీ బలపరాక్రమాలు కురచ అయిపోవు, మీ శత్రువు అధికుడు అయిపోడు. మీరు ముందు వెనుకలు ఆలోచించకుండా ఇప్పుడు ఇంత వేగముగా బయలుదేరడము నాకు ఇష్టము లేదు. ఇప్పుడు నేను మిమ్మలను ఎందుకు అడ్డగిస్తున్నానో చెప్తాతాను, మీరు వినవలెను. ఇంతకుముందే మీతో యుద్ధము చేసి మీ దెబ్బలు తిని, మీరు వెంటపడితే దిక్కున్నచోటికి పారిపోయినవాడు, ఇప్పుడు మళ్ళీ వచ్చి కోపముతో మిమ్మలను యుద్ధానికి రమ్మని పిలుస్తున్నాడు. అందువల్ల, నాకు సందేహం వచ్చింది. ఈతని గర్జనము వింటూ ఉంటే ఈతని పూనికకూ, ఈ సంరంభానికీ, ఈ గర్జనానికీ ఏదో పెద్ద కారణము ఉండి ఉంటుంది అనిపిస్తుంది.

"రాజా! ఈ సుగ్రీవుడు ఇప్పుడు ఇక్కడికి అన్యసహాయము లేకుండా రాలేదు అని నేను అనుకొంటున్నాను. ఈతడు ఎవరినో ఆశ్రయించినాడు. వారు ఎవరో సాయము వచ్చినందువల్లనే మళ్ళీ వచ్చి గర్జించినాడు. ఈతడు స్వభావసిద్ధంగా నేర్పరి, తెలివి అయినవాడు. సాయంవచ్చినవారి పరాక్రమాన్ని పరీక్షించకుండా ఉండడు. అతడు పరీక్షించి వారు నీకంటే శౌర్యవీర్య బలపరాక్రమవంతులు అని తెలుసుకొన్న తరువాతనే, ఆ సహాయం వస్తూ ఉన్నవారిని వెంటపెట్టుకొని వచ్చి ఉంటాడు.

"ఓ ప్రభూ! ఇది నా ఊహమాత్రమే కాదు. ఇంతకుముందే అంగదుడు చెప్పితే విన్నాను. అది మీ మంచికోసము చెప్తుతున్నాను, వినవలసింది. పిల్లవాడు అంగదుడు వనమధ్యములో విహరిస్తూ ఉండగా ఆప్తులు అయిన వేగులవాండ్లు వాడికి చెప్పిన వృత్తాంతము, వాడు నాకు చెప్పినాడు. ఇది ఇప్పుడు మీకు నేను చెప్తుతున్నాను.

"రాజా! ఇక్ష్వాకువంశీయులూ, అయోధ్యాధిపతి దశరథమహారాజపుత్రులూ అయిన రామలక్ష్మణులు అనే వాండ్లు, సుగ్రీవునకు సహాయపడి అతనిని సంతోష పెట్టడము కోసమే ఋష్యమూక పర్వతానికి వచ్చినారట. వాండ్లు శూరులు. సమర దుర్జయులు. వారిలో నీ తమ్ముడికి సహాయపడడానికి వచ్చినవాడు రాముడు. అతడు శత్రుసేనలను మర్దించడములో (విరాధఖరదూషణ కబంధాదులను వధించి, ప్రసిద్ధికెక్కినాడు. వాడు రణకర్కశుడు. ప్రళయకాలాగ్ని హోత్రుడివలె చెలరేగి, సమస్తమూ దహించివేసే శక్తిమంతుడు.

"రాజా! ఆ రాముడు సాధుజనులకు నివాసవృక్షమువంటివాడు. ఆపన్నులకు అతడు దిక్కు. ఆర్తులకు అతడు ఆశ్రయుడు. ఈ లోకములో అతడు ఒక్కడే

పరమయశస్వి. అతడు లౌకికజ్ఞానం ఉన్న బ్రహ్మజ్ఞాని. పితృాజ్ఞను జవదాటని ధీమంతుడు. గైరికాది ధాతువులకు పర్వతరాజము అయిన హిమవత్పర్వతమువలె సమస్త సద్గుణాలకు ఆ రాముడు పెద్ద గని.

"నాథా! అతడు, ఆ రాముడు రణరంగంలో అజయ్యుడు. అప్రమేయ బలపరాక్రముడు. ఆ మహాత్ముడితో మీరు విరోధం పెట్టుకోవడం అయుక్తము. రాజా! మీరు శూరులు. మీకు ఒక్కమాట చెప్పుతాను, కోపపడవద్దు. మీ తప్పులు ఎంచడానికి నేను చెప్పడం లేదు. నేను మీ మేలు కోరి చెప్పుతున్నాను. నా మాట మీరు వినవలెను. స్వామీ! మీరు సందేహించవద్దు. ఇప్పుడు సుగ్రీవుణ్ణి యువరాజుగా అభిషేకం చేయండి. అతడు ఇప్పుడు అధికబలవంతుడు. బలవంతుడు అయిన తమ్ముడితో విరోధం వద్దు. ప్రస్తుత స్థితినిబట్టి ఆ రాముడితో స్నేహం చేసుకోవడమూ, మీ తమ్ముడితో వైరం దూరంగా వదిలిపెట్టి అతణ్ణి దగ్గరకు చేరతీయడమూ మీకు ఎంత అయినా మంచిది అని నాకు తోస్తూ ఉంది.

"ప్రభూ! సుగ్రీవుడు మీకంటె చిన్నవాడు. అందులో మీ తమ్ముడు. అతడు అలిగితే మీరు అతనిని బుజ్జగించవలెను. అక్కడ ఋష్యమూక పర్వతంమీద ఉన్నా, ఇక్కడ కిష్కింధానగరంలో ఉన్నా, ఇంకా ఎక్కడ ఉన్నా అతడు మీ తమ్ముడే. మీకు అన్యుడు కాడు. మీ ఆత్మబంధువు. మీరు ఏమి చేసినా ఆ బాంధవ్యం పోదు. సుగ్రీవుడితో సరిసమానం అయిన ఆత్మబంధువు ఈ భూభాగంమీద మీకు ఇంకొకడు లేడు. అతనికి ధనకనకాదులు ఇచ్చి సత్కరించి మీ వెనుక మీకు అండగా ఉండేట్టు చేసుకోవలెను. మీరు అతనితో వైరం వదలిపెట్టవలెను. ఆ సుగ్రీవుడు విపుల సుగ్రీవుడుగా మీ ప్రక్కను ఉంటాడు. అతడు ఎప్పుడూ మీ తమ్ముడేను. మీరు ఇప్పుడు అతనిని చేరతీయవలెను. ఇంతకన్న ఇప్పుడు మార్గాంతరము లేదు.

"నాథా! నేను ఎప్పుడూ మీ మేలుకోరేదానిని అని మీరు అనుకొన్నట్లయితే, నన్ను సంతోషపెట్టడము మీకు ఇష్టము అయినట్లయితే నేను ఎంతో దూరము యోచించి యాచిస్తున్నాను. కనుక నేను చెప్పినట్టు చేయండి. నేను మీ మంచికోసము చెప్పుతున్నాను.

"ఓ ప్రభూ! ప్రసన్నులు కండి. పథ్యమువంటి నా ఈ మాట వినండి, కోపపడవద్దు. ఆ కోసలరాజు పుత్రుడు దేవేంద్రుడితో సరిసమానము అయిన పరాక్రమవంతుడు. మీరు అతనితో ఎంతమాత్రమూ కలహించవద్దు. మీకు అది మంచిది కాదు" అని చెప్పింది.

హితము చెప్పవలసిన కాలములో ఆ తార ఇంతదూరము ఇంత చక్కగా చెప్పింది. అయితే, వాలికి కాలము ముంచుకొని వస్తూ ఉంది. అందువల్ల, అతనికి ఆ తార చెప్పిన మాటలు రుచించలేదు.

16

వాలి వధ

అట్లా ఆ తారాధిపనిభానన తార చెప్పితే వాలి లెక్కచేయకుండా, "ఓ వరాననా! ఆ గర్జించినవాడు నాకు వైరి. అందులో వాడు నా తమ్ముడు. వాడు అంత ఆటోపముతో అరుస్తున్నాడు, నేను సహించడము ఎట్లా? ఓ పిరికిదానా! ఎదిరించను అలవికాని శూరులూ, యుద్ధములో వెనుతీయని వీరులూ తమను ఎవరు అయినా ఎదిరిస్తే సహించి ఊరుకోవడముకన్నా చచ్చిపోవడము మేలు. నోరు లేని సుగ్రీవుడు నన్ను తనతో యుద్ధము చేయమని పిలుస్తూఉంటే వాడి సంరంభాన్ని నేను ఎంతమాత్రమూ సహింపలేను.

"ఓ తారా! రాముడు ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు. అతడు పాపకార్యము ఎందుకు చేస్తాడు? తారా! నీవు నీ ఆడవాళ్ళతో వెనుకకు వెళ్ళిపో, ఎందుకు నా వెంటపడతావు? నీవు స్నేహాతిశయముతో నా కర్తవ్యాన్ని తెలియచెప్పినావు. నామీద నీకు ఉన్న భక్తిని అంతా చూపించినావు. నేను పోయి సుగ్రీవుడితో పోరాడుతాను. నీవు కలతపడవద్దు. వాడి గర్వాన్ని మాత్రమే అణచివేస్తాను. వాడి ప్రాణము తీయను. వాడు ఇప్పుడు యుద్ధానికి వచ్చి నిలుచున్నాడు. కాబట్టి చెట్లతోటీ, పిడికిళ్ళతోటీ కొట్టి, వాణ్ణి బాధపెట్టుతాను. వాడు, ఆ దుర్బుద్ధి నా పూనికను, నా దర్పాన్ని తట్టుకొనలేడు. వాడు తిరిగి పారిపోతాడు. నా ప్రాణంమీద ఒట్టుపెట్టుకొంటున్నాను. నేను వాణ్ణి చంపను. నీవు నన్ను అడ్డగించవద్దు. అంతఃపురంలో హాయిగా ఉండు. నేను సుగ్రీవుణ్ణి జయించి వస్తాను" అని చెప్పినాడు.

దాక్షిణ్యముతో ప్రవర్తిస్తూ, అందరినీ సంతోషపెట్టుతూ మాట్లాడే ఆ తార అప్పుడు వాలిని కౌగిలించుకొని మందము మందముగా ఏడుస్తూ ప్రదక్షిణము చేసింది. వాలి జయించడానికి మంత్రయుక్తముగా స్వస్త్యయనము చెప్పింది. దుఃఖపరవశ అయిపోయింది. అందరు స్త్రీలతోనూ అంతఃపురంలోకి పోయింది.

అప్పుడు వాలి క్రుద్ధుడు అయి కోపముతో రేగిన మహాసర్పము బుసలు కొట్టేట్టు నిట్టూర్పు విడుస్తూ, శత్రుదర్శన కాంక్షతో కిష్కింధా నగరము వెలుపలకు పోయినాడు. అన్నివైపులా తేరిపార చూచినాడు. చక్కగా దట్టీ కట్టుకొని అగ్నిహోత్రమువలె ప్రజ్వరిల్లుతూ యుద్ధానికి సిద్ధముగా నిలుచుని ఉన్న సుగ్రీవుణ్ణి చూచినాడు. పరమరోషముతో తానూ వస్త్రము గట్టిగా కట్టుకొన్నాడు. పిడికిలి బిగించి చెయ్యి ఎత్తి సుగ్రీవుడికి ఎదురుగుండా పోయినాడు. అప్పుడు సుగ్రీవుడున్నూ పిడికిలి గట్టిగా బిగించి అమిత వేగముతో ఆ హేమమాలాధరుడిమీద పడపోయినాడు. అట్లా తన మీద పడవస్తూ ఉన్న సుగ్రీవుణ్ణి వాలి చూచి క్రోధతామ్రాక్షుడు అయి,

"ఇదిగో, గట్టిగా వేళ్ళు ముడిచినాను. నా ఈ పిడికిలిపోటుకు నీ ప్రాణము పోతుంది. ఇక నీవు బ్రతుకవు" అన్నాడు.

ఈ మాటకు సుగ్రీవుడు మరింత క్రుద్ధుడై, "ఇదిగో, నా ఈ పిడికిలి నీ నెత్తిమీద పడీ పడటముతో నీవు చస్తావు" అన్నాడు.

ఆ ఈ మాటలు పూర్తి అయ్యేలోపలనే వాలి సుగ్రీవుణ్ణి పిడికిలితో ఒక్కపోటు పొడిచినాడు. ఆ దెబ్బకు సెలయేళ్ళు ప్రవహించే పర్వతమువలె దేహము అంతా నెత్తురు కారుతూ సుగ్రీవుడు కనిపించినాడు. అంతట ఆ సుగ్రీవుడు ఒక చెట్టును పెళ్ళగించి తెచ్చి వజ్రాయుధముతో పర్వతాన్నివలె వాలిని కొట్టసాగినాడు. అట్లా సాలవృక్షముతో వేట్లు వేస్తూ ఉంటే, వాలి విహ్వలుడు అయిపోయినాడు. బరువు ఎక్కువ అయిపోయిన సరుకులనౌక సముద్రములో వలె వాలి వణికిపోయినాడు. వారు ఉభయులూ భయంకరము లయిన బలవంతులు, పరాక్రమవంతులు. శత్రుసంహారము చేయడములో ఇద్దరూ ఆరితేరినవారు. ఆకాశములో సూర్య చంద్రులవంటి, వారు ఉభయులూ రేగినారు. ఒకరి లోపము ఒకరు వెదకడము మొదలు పెట్టినారు. అంతకు అంతకు ఆ పోరాటములో వాలికి బలమూ, పరాక్రమమూ పెరిగిపోయినవి. అతడు సుగ్రీవుడి దర్పాన్ని అణచివేసినాడు. అప్పుడు ఆ సుగ్రీవుడి బలము మందగించింది. అయితే కోపమూ, చురుకుతనమూ హెచ్చినవి. వారు ఉభయులూ అంతట చెట్లతోనూ, చెట్లకొమ్మలతోనూ, బరికెలతోనూ కొట్టుకొన్నారు. వజ్రాయుధము అంచులవంటి గోళ్ళతో ఒకరిని ఒకరు రక్కుకొన్నారు. పిడికిళ్ళతో పొడుచుకొన్నారు. గుద్దుకొన్నారు. ఎగిరి కాళ్ళతో తన్నుకొన్నారు. చేతులతో పదే పదే చరుచుకొన్నారు. వృత్రాసుర దేవేంద్రులవలె భయంకరముగా పోరాడినారు. ఉభయులూ నెత్తురుతో తడిసిపోయినారు. ఒకరిని ఒకరు బెదిరించుకొంటూ మేఘాలవలె గర్జించినారు. మళ్ళీ పోరాటము సాగించినారు.

సుగ్రీవుడు బలము ఉడిగిపోయి మాటిమాటికీ దిక్కులు చూడసాగినాడు. ఆర్తుడు అయిపోయిన ఆ సుగ్రీవుణ్ణి రాముడు చూచినాడు. ఆ మహాతేజోవంతుడు, ఆ పరాక్రమశాలి రాముడు వాలిని చంపివేయడానికి బాణము కోసము చూచినాడు. కృష్ణసర్పమువంటి బాణాన్ని వింట సంధించినాడు. కాలచక్రాన్ని యముడివలె అంతట ఆ ధనుస్సును రాముడు పూరించినాడు. ఆ జ్యాతలఘోషానికి అప్పుడు ప్రళయ కాలములో వలె మృగాలూ, పక్షులూ భయపడి ఒండ్లు ఎరగకుండా దశదిశలా పరుగు లెత్తినవి. రాముడు వింటి నుంచి బాణము వదలినాడు. పిడుగు పడుతున్నట్లు మహా ధ్వని చేస్తూ, మంటలు మండుతూ ఆ బాణము పోయి వాలి వక్షఃస్థలములో పడ్డది.

అమిత ఉరవడితో వచ్చిపడ్డ ఆ బాణానికి వీర్యాతిశయముతో విర్రవీగిన ఆ మహాతేజోవంతుడు, ఆ వానరరాజు వాలి విచేతనుడు అయిపోయినాడు. ఆశ్వయుజ పూర్ణిమనాడు ఉత్సవాంతాన నేలమీద పడతోసిన దేవేంద్రుడి ధ్వజమువలె వాలి నేలకూలినాడు.

రాముడు వదలిన కృష్ణసర్పమువంటి ఆ బాణము వెండి బంగారాలు పొదిగినందువల్ల యుగాంతాల మహామృత్యువువలె కాళకాంతులతోనూ, ధగధగల తోనూ, రుద్రదేవుడి లలాటమునుంచి వెలువడ్డ అగ్నిహోత్రమువలె నల్లటి పొగలతోనూ, భగభగ మంటలతోనూ కంపించింది.

సంజ్ఞలు తప్పి నెత్తురు మయము అయి నేలకూలిన ఆ దేవేంద్ర పుత్రుడి మహాకాయము విరగపూసి గాలి ఉరవడికి నేలకూలిన అశోక వృక్షమువలె అప్పుడు కనిపించింది.

13

రామబాణము పాటుకు ఆ రణకర్కశుడు వానరరాజు వాలి, గొడ్డలితో నరికిన చెట్టువలె నేలకూలడమునుంచి అప్పుడు ఆ వానర రాజ్యము చంద్రుడు లేని ఆకాశమువలె అయిపోయింది.

అట్లా నేలకూలినప్పటికిన్నీ వాలికి దేవేంద్రుడు ఇచ్చిన వజ్రఖచిత హేమమాల మెడలో ఉండడమునుంచి దేహకాంతులుకానీ, ప్రాణముకానీ, తేజస్సుకానీ, అతడి పరాక్రమము కానీ నష్టము అయిపోలేదు. చుట్టూ సంధ్యా రాగము అలముకొన్న మేఘము వలె అగుపించినాడు.

వాలి తేజము అప్పుడు మెడలో ఉన్న వజ్రఖచిత హేమమాల వల్లనూ, ఎదురు రొమ్ములలో నాటుకొన్న రామబాణము వల్లనూ, నెత్తురు వరదలు అయి కారుతూ ఉన్న దేహమువల్లనూ త్రివిధ వర్ణాలతో శోభించింది.

వాలి వక్షస్థలములో నాటుకొన్న బాణము స్వర్గానికి తీసుకొని పోయే ప్రభావము కలది. అది అగస్త్యుడు రాముడికి ప్రత్యేకముగా ఇచ్చిన దివ్యబాణము. అందులో అది రాముడు ఆ వానరవీరుడిమీద వదలిన బాణము కాబట్టి వాలికి ఉత్తమలోక ప్రాప్తి తప్పదు.

అంతవరకూ మహేంద్రుడివలె దుర్ధర్షుడుగానూ, ఉపేంద్రుడివలె దుస్సహుడుగానూ సంచరించిన ఆ సింహవక్షుడు, ఆ మహాబాహువు, ఆ హేమమాలాధరుడు వాలి నేలకూలి, మంటలు ఆరిపోయిన అగ్నిహోత్రుడివలెనూ, యుగాంతకాలాన భూమిమీదికి రుద్రదేవుడు పడతోసిన సూర్యుడివలెనూ అయిపోయి యమయాతనపడుతూ, తనమీద బాణము వదలిన మహావీరుణ్ణి మనస్సులో మెచ్చుకొంటూ, ఆ మహావీరుణ్ణే కన్నులారా చూడవలెనని అనుకొంటూ మెల్లమెల్లగా

తన తేనెకన్నులు తెరుస్తూనూ, మూస్తూనూ ఉన్నాడు. అప్పుడు వాలి దగ్గరకు రాముడు లక్ష్మణుణ్ణి వెంటపెట్టుకొని పోయి చూచినాడు. వాలి రాముణ్ణీ, అతని వెంట ఉన్న మహాబలవంతుణ్ణీ లక్ష్మణుణ్ణీ చూచినాడు.

వాలి రాముని ప్రశ్నించుట

అంతట వాలి వినయము ఉట్టిపడుతూ ధర్మసహితముగానూ, పరుషముగానూ, "ఓ రామా! నీవు రాజపుత్రుడవు. కులీనుడవు. ప్రియదర్శనుడవు. చరితవ్రతుడవు. సత్యసంపన్నుడవు. మహాపరాక్రమశాలివి. జగత్ప్రసిద్ధుడవు. ఇటువంటి నీవు, నేను మరొకడితో యుద్ధంచేస్తూ పరాఙ్ముఖుడను అయి ఉండగా నా ఎదురు రొమ్ముల మీద బాణం వదలినావు. నీకు ఏమి ఘనత వస్తుంది అని అట్లా చేసినావు?

"ఓ రామా! నీవు కరుణావేదివి అనీ, ప్రజాహితరతుడవు అనీ, దయామయుడవు, జితేంద్రియుడవు అనీ, సమయజ్ఞుడవు అనీ, దృఢవ్రతుడవు అనీ, సర్వప్రాణికోటీ చెప్పుకొంటూ ఉంది. శమమూ, దమమూ, ధైర్యమూ, సత్యమూ, క్షమా, పరాక్రమమూ, అపరాధ దండనము రాజులకు ఉండవలసిన గుణాలు. అవి అన్నీ నీలో ఉన్నవి అనుకొన్నాను. నీ వంశగౌరవాన్ని గురించి తలచుకొన్నాను. నా భార్య తార నన్ను పోవద్దు అనీ, నీవు అపకారము చేస్తావు అనీ అడ్డగించి నప్పటికిన్నీ, నేను సుగ్రీవుడితోకదా యుద్ధం చేసేది అనుకొని ఏ వెరపూ లేకుండా వచ్చినాను. నేను వాడితో పోరాడుతూ యుద్ధపారవశ్యములో ఉన్నప్పుడు నీవు నామీద బాణము వదులుతావు అని నిన్ను చూడకపూర్వము నాకు తోచలేదు. నీవు దుర్బుద్ధివి అనీ, ధర్మవేషము వేసుకొన్న పాపాచారుడవు అనీ, గడ్డి కమ్ముకొన్న బావివంటివాడవు అనీ నాకు తెలియదు. ఓ రామా! నీవు సజ్జన వేషము వేసుకొన్న దుర్జనుడవు. నివురు కప్పిన నిప్పువంటి వాడవు. ధర్మకవచము తొడుగుకొన్న అధార్మికుడవు.

"ఓ రాజపుత్రుడా! నీ దేశములో కానీ, నీ పట్టణములోకానీ నేను ఎవరికీ ఎన్నడూ, ఏ అపకారమూ చేయలేదు. నేను నిన్ను అవమానపరచలేదు. నేను ఏ పాపమూ ఎరుగను. కందమూల ఫలాలు తింటూ అడవిలో ఉంటూ ఉన్న వానరుణ్ణి. నేను నీతో పోరాడలేదు. మరి ఒకడితో నేను పోరాడుతూ ఉంటే నీవు నామీద బాణము వదిలినావు. ధర్మవేషము వేసుకొన్న అధార్మికుడవు అని ఇప్పుడు స్పష్టము అయింది. క్షత్రియ వంశములో పుట్టినవాడు, అందులో విద్యావంతుడు, యుక్తాయుక్తాలు తెలిసిన వాడు, ధర్మాత్ముడు అని పేరుపడ్డవాడు ఎవడూ ఇటువంటి క్రూరకృత్యము చేయడు.

"ఓ రామా! నీవు రఘువంశంలో పుట్టినావు. ధర్మాత్ముడవు అని ప్రసిద్ధి కెక్కినావు. ఇదా నీవు చేయవలసిన పని? నీవు దుర్జనుడవు. ఈ మహారణ్యంలో సజ్జన వేషం వేసుకొని ఎందుకు తిరుగుతున్నావు?

"ఓ రాజపుత్రా! సామమూ, దానమూ, ధర్మమూ, క్షమా, ధైర్యమూ, సత్యమూ, పరాక్రమమూ, అపరాధులను శిక్షించడమూ అనేవి ఎనిమిదీ రాజుల గుణాలు. రాజులు అపరాధులను దండించడం అవసరము. నేను ఏమి అపరాధం చేసినాను? నేను వనచరుణ్ణి. నీవు మహానగరవాసివి. నేను వానరుడను. నీవు నరుడవు. అందులో రాజువు. నేను కందగడ్డలూ, పండ్లూ, కాయలూ తింటూ ఉన్నవాణ్ణి. నీవు రాజాన్నం భోజనం చేస్తూ ఉన్నవాడివి. అది జాతి స్వభావము. నేను ఏమి నేరం చేసినాను అని నామీద నీవు బాణం వదిలినావు?

"ఓ రాజపుత్రుడా! వెండికానీ, బంగారంకానీ, భూమికానీ కలహకారణాలుగా ఉంటూ ఉంటవి. నీకూ నాకూ అటువంటి వేవీ లేవు. నేను తినే కందమూలాదులకు నీవు ఆశపడి, నేను తింటే నీకు లేకుండా పోతవి అనుకొని నామీద బాణము వదిలినావా?

"ఓ రామా! రాజధర్మములో నయమూ, వినయమూ, నిగ్రహమూ, అనుగ్రహమూ దేనికి అదిగా ఉంటుంది. నాలుగూ ఏకము అయి ఉండవు. ఆ యా సందర్భాలనుపట్టి రాజులు రాజనీతి అవలంబిస్తారు. అవసరము వచ్చినపుడు వినయముతో ప్రవర్తిస్తారు. నిగ్రహించవలసినప్పుడు నిగ్రహిస్తారు. అవసరాన్ని పట్టి అనుగ్రహిస్తారు. అంతేకాని, ఈ నాలుగింటినీ ఏకకాలాన ఏకము చేసివేసి, రాజులు యథేష్టముగా ప్రవర్తించరు. నీవు ఈ నాల్గింటినీ ఏకకాలాన ఏకము చేసివేసి నన్ను చంపడానికి వచ్చినావు. నీకు కామమే ప్రధానము. నీకు ఒక నిలకడ లేదు. నీవు ఇంద్రియలోలుడవు. నీకు ధర్మముమీద శ్రద్ధలేదు. అర్థము విషయంలో ఒక వ్యవస్థ లేదు. నీవు నీ చిత్తము వచ్చినట్టు ప్రవర్తించినావు. నీవు కేవలము శరాసనపరాయణుడవు.

"ఓ రామా! నీవు మహాత్ములు పుట్టిన కాకుత్స్థ వంశంలో పుట్టినావు. అనపరాధి అయిన నన్ను పొంచి ఉండి బాణంతో కొట్టినావు. ఇటువంటి అసహ్యము అయిన పని ఎందుకు చేసినావు? సత్పురుషులు సమావేశము అయి అడిగితే ఏమి అని సమాధానము చెప్పుతావు?

"ఓ రాజపుత్రా! రాజును చంపినవాడూ, బ్రాహ్మణుణ్ణి చంపినవాడూ, గోవును చంపినవాడూ, దొంగతనము చేసినవాడూ, ప్రాణులను హింసించినవాడూ, నాస్తికుడూ, అన్న కన్న ముందు పెండ్లి చేసుకొన్న తమ్ముడూ, చాడీలు చెప్పేవాడూ, స్నేహితుణ్ణి చంపినవాడూ, గురుభార్యతో పోయినవాడూ పాపాత్ములు. వీరు అందరూ నరకానికి పోతారు. ఓ రామా! నీవూ ఈ తెగలోని వాడవు.

"ఓ రామా! సత్పురుషులూ, ధార్మికులూ అయినవారు ఎవరూ పులి తోలువలెనూ, జింక తోలువలెనూ వానర చర్మాన్ని ధరించరు. చమరాది మృగాల

రోమాలవలె వానరరోమాలను ఎవరూ ఉపయోగించరు. ఏనుగుల ఎముకలవలె వానరుల ఎముకలను ఎవరూ వాడుకోరు. వాడుకోక పోవడమే కాకుండా, తాకను అయినా తాకరు. వానర మాంసము ఎవరూ తినరు. బ్రాహ్మణులూ, క్షత్రియులూ ఐదుగోళ్ళ జంతువులలో ఏదు పందినీ, అడవి పందినీ, ఉడుమునూ, తాబేలునూ, కుందేలునూ పట్టుకొని చంపితింటారు. కాని, ఐదుగోళ్ళ జంతువు అయినప్పటికిన్నీ వానరాన్ని పట్టుకొని చంపి తినరు. నీవు నన్ను ఎందుకు చంపినావు?

"ఓ రామా! నా భార్య తార నిజమే చెప్పింది. నన్ను పోవద్దు అని అడ్డగించింది. నేను దాని మాటలు అతిక్రమించాను. ఇప్పుడు యముడి వశము అయినాను. శీలసంపన్న అయిన స్త్రీకి ధూర్తుడు అయిన భర్తవలె, ఈ భూమికి నీవు రాజువు అయ్యేట్లయితే ప్రజలు సుఖము అనుభవించేది ఏమీ ఉండదు. నీవు రహస్యముగా అహితము చేసేవాడవు. పరులకు అపకారము చేసి బ్రతికేవాడవు. నీవు క్షుద్రుడవు. ప్రశాంతుడవుగా కనిపించే కుటిలుడవు. నీవు పాపివి. ఆ మహాత్ముడు దశరథ మహారాజుకు నీవు ఎట్లా పుట్టినావు?

"ఓ రాజపుత్రుడా! సత్ప్రవర్తనము అనే కట్టుతాళ్ళు తెంచుకొని, తోటి సాధువులు అయిన ఏనుగుల సత్ప్రవర్తనను అతిక్రమించి, ధర్మం అనే అంకుశాన్ని అలక్ష్యము చేసి, విచ్చలవిడిగా తిరుగుతూ ఉన్న రాముడు అనే మదపుటేనుగుచేత నేను హతము అయిపోయినాను. ఓ రామా! నీవు అమంగళమూ, అయుక్తమూ అయిన పని చేసినావు.

"రామా! నీకు అపకారము చేసినవాడిమీద చూపించవలసిన పరాక్రమము, ఉదాసీనుణ్ణి అయిన నామీద నీవు చూపించినావు. అది అయినా ముఖాముఖిగా కాకుండా చాటున ఉండి నీ పరాక్రమము ప్రదర్శించినావు. ఓ రామా! నీవు నా కంటబడి పోరాటము తటస్థించి ఉన్నట్లయితే, నీవు ఈపాటికి యమదర్శనము చేస్తూ ఉండేవాడివి. రామా! తప్పతాగి ఒండ్లు ఎరుగకుండా నిద్రపోతున్నవాణ్ణి పాము కరచివేసినట్లు, నీవు నామీద బాణము వదలినావు.

"ఓ రామా! సుగ్రీవుణ్ణి సంతోష పెట్టడానికే కదా నీవు నన్ను కొట్టింది. నీ పని చేసిపెట్టమని ముందుగా నీవు నన్నే అడిగి ఉన్నట్లయితే, నీ భార్య మైథిలిని ఆ రావణాసురుడు సముద్రములో దాచి ఉంచినా, పాతాళలోకములో దాచి ఉంచినా, మధుకైటభులు తీసుకొనిపోయి దాచి ఉంచినా, శ్వేతాశ్వతరీరూప శ్రుతిని మహావిష్ణువు హయగ్రీవరూపాన పోయి తెచ్చినట్లు, ఒక్కదినములో తెచ్చి నీకు ఇచ్చి ఉండేవాణ్ణి. అంతేకాదు, ఆ రావణాసురుడితో పోరాడి వాడి గొంతుకు తాడుపోసి లాగుకొని వచ్చి నీ ఎదుట ఉంచేవాణ్ణి!

"ఓ రామా! సుగ్రీవుడు నా తమ్ముడు. వాడు నాతో పోరాడి నన్ను చంపివేసి రాజ్యం సంపాదించడం సమంజసం. నా జ్ఞాతి కాబట్టి నాతో పోరాడవచ్చును. ఏ సంబంధమూ లేని నీవు వచ్చి వక్రపద్ధతిని నన్ను చంపి సుగ్రీవుడికి రాజ్యం కట్టపెట్టడం అన్యాయం, అధర్మం. పుట్టిన ప్రతివాడు చచ్చిపోక తప్పదు. అందువల్ల, నేను చచ్చిపోతున్నాను అని దుఃఖపడడము లేదు. నీవు పొంచి వుండి అధర్మంగా నన్ను చంపివేసి సుగ్రీవుడికి రాజ్యం అప్పగించపోతున్నందుకు విచారపడుతున్నాను. ఇది నీవూ ఆలోచించవలెను'' అన్నాడు.

ఈవిధంగా అంటూ రామబాణం గుచ్చుకున్నందువల్ల దేహం అంతా మంటలు మండుతూ ఉంటే, నోరు ఎండిపోతూ ఉంటే ప్రాణ ప్రయాణ బాధ పడుతూ, ఆ దేవేంద్ర పుత్రుడు అప్పుడు సూర్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్న రాముణ్ణి తదేకంగా చూడసాగినాడు.

18

రాముని ధర్మోపదేశము

రామబాణానికి నేలకూలిన వాలి స్మృహ తప్పిపోతూ ఉండగా తన మేలుకోసం వినయంతో, 'రామా! నీవు నామీద బాణం వదిలింది ధర్మయుక్తమా, అర్థలాభమా?' అని పరుషంగా అధిక్షేపించి కాంతులు మాసిపోయిన సూర్యుడివలెనూ, ఉరుములతో మెరుపుతో వాన కురిసి వెలిసి కదలకుండా మెదలకుండా ఉన్న మేఘంవలెనూ, భగభగ మంటలు మండి ఆరిపోయిన అగ్నిహోత్రమువలెనూ అయిపోయినాడు.

అట్లా నిష్ప్రభుడూ, నిశ్చేష్టుడూ, తేజోహీనుడూ అయి పడి ఉన్న వాలిని రాముడు చూచినాడు. తాను అట్లా బాణం వదలడం ధర్మయుక్తమూ, అర్థలాభమూ, సకలసద్గుణోపేతమూ అని చెప్పడానికి ఈ విధంగా మొదలు పెట్టినాడు :

"ఓ వానరుడా! నీవు ధర్మమూ, అర్థమూ, కామమూ అనే మూడు పురుషార్థాలనూ, లోకాచారాన్నీ తెలుసుకోకుండా (దేవతలు నీకూ, నీ తమ్ముడికీ ఉమ్మడి భార్యగా ఇచ్చిన తారతో కాల మాన సంవత్సర నియమం లేకుండా) నీవు ఒక్కడవే అనుభవించినావు. నీవు లేనప్పుడు దేశము అరాజకము అయిపోకుండా ఉండడానికి అమాత్యులూ, పౌరముఖ్యులూ యువరాజు అయిన నీ తమ్ముడికి సుగ్రీవుడికి పట్టము కట్టితే, అతను కోరకపోయినప్పటికిన్నీ తార తన పట్టమహిషి పదవి పోతుంది అనుకొని అతణ్ణి చేపట్టింది. నీవు తిరిగి రాగానే, నీ తమ్ముడు ఎన్ని విధాల చెప్పినా నీవు వినక అతణ్ణి తిట్టి, కొట్టి, కట్టుగుడ్డలతో నగరము నుంచి వెళ్ళకొట్టినావు. అంతటితో పోనీయక, అతని భార్యను అపహరించినావు. అప్పటికిన్నీ

నీవు తృప్తి పడలేదు. నీవు నీ తమ్ముణ్ణి చంపివేయడానికి అనేకమందిని పంపించి అడవులలోనయినా స్వేచ్ఛగా సంచరించడానికి వీలులేకుండా కూడా చేసివేసినావు. అందువల్లనేకదా అతడు, నీ తమ్ముడు ఋష్యమూక పర్వతము మీద నివసించవలసి వచ్చింది. ఇన్ని విధాలా నీవు ధర్మార్థకామాలను తారుమారు చేసినావు. లోకాచార విరుద్ధముగా ప్రవర్తించినావు. ఇప్పుడు నీవు అజ్ఞానమువల్ల నన్ను నిందిస్తున్నావు. ఓ వానరుడా! నీవు జ్ఞాన సంపన్నులు అయిన వృద్ధులనూ, పూజ్యులు అయిన ఆచార్యులనూ ధర్మార్థకామాల స్వరూపాన్ని కానీ, లోకాచారాన్ని కానీ ఎందుకు అడిగి తెలుసుకోలేదు? వానర చాపల్యమువల్ల ఆ ఈ విషయాలను అన్నీ ఇక్కడ నన్ను అడుగుతున్నావు.

"ఓ వానరుడా! పర్వతాలతో, మహారణ్యాలతో ఉన్న ఈ భూమి అంతా ఇక్ష్వాకులది. అందువల్ల, ఈ భూమిమీద సంచరించే మానవులనూ, మృగాలనూ, పక్షులనూ నిగ్రహించే అధికారమూ, అనుగ్రహించే అధికారమూ ఇక్ష్వాకు వంశీయుడు అయిన రాజుది. ఈ భూమిని ఇప్పుడు ఇక్ష్వాకు వంశీయుడు భరతుడు రాజ్యపాలనము చేస్తూ ఉన్నాడు. అతడు ధర్మాత్ముడు, సత్యసంధుడు, ఋజుశీలి, నీతిజ్ఞుడు, సుశిక్షితుడు, పరాక్రమశాలి, దేశకాలవిదుడు. అతడు ధర్మకామార్థ తత్త్వజ్ఞుడు. శాస్త్రములో చెప్పినట్లు సర్వమూ సుస్థిరముగా ఉంచుతూ ఉన్న రాజు. ధర్మహాని చేసిన దుష్టులను శిక్షిస్తూ, శిష్టులను రక్షిస్తూ రాజ్యము ఏలుతున్నాడు. ఆ భరతుడి ఆజ్ఞలను అనుసరించి అనేకమంది సామంతరాజులూ, నేనూ ఈ భూమిమీద ఎవరూ ధర్మహాని చేయకుండా చూస్తూ ఉన్నాము. ఆ ధర్మవత్సలుడి రాజ్యములో ఎవడూ ధర్మాన్ని తిరస్కరించడానికి వీలు లేదు. అందువల్ల, ఆ భరతుడి ఆజ్ఞలను పురస్కరించుకొని, ధర్మము తప్పినవాండ్లను మేము యథావిధిగా శిక్షిస్తాము.

"ఓ వానరుడా! నీవు ధర్మము తప్పినావు. నీవు చేసినవి అన్నీ తప్పిదాలు. కామవ్యాపారమే నీకు ప్రధానము అయింది. రాజులు నడిచే సత్పథము వదలి పెట్టినావు. ఓ వానరుడా! ధర్మమార్గము తప్పనివారు తనను కన్న తండ్రినీ, తనకన్న ముందు పుట్టిన అన్ననూ, విద్య చెప్పిన గురువునూ తమ తండ్రులుగా భావిస్తారు. అంతేకాదు, ధార్మికుడు అయినవాడు తన కొడుకునూ, తన తరువాత పుట్టిన తమ్ముణ్ణీ, గుణవంతుడు అయిన శిష్యుణ్ణీ తన పుత్రులవలె భావిస్తాడు. ధర్మము అనేది దేహేంద్రియాలకు గోచరించేది కాదు. అది పెద్దలు అయినవారికి కూడా పరమదుర్జ్ఞేయముగా ఉంటుంది. శుభాశుభాలకు కారణము అయిన ధర్మాధర్మాలు సర్వప్రాణికోటుల హృదయాకాశములో ఉండే పరమాత్మకే తెలుస్తవి.

"ఓ వానరుడా! నీవు చపలుడవు. పుట్టు గుడ్డివాడు పుట్టు గుడ్డివాండ్లతో వలె, నీవు నీవంటి సుశిక్షితులుకాని చపలులతో ఆలోచిస్తే ధర్మాధర్మాలు నీకు ఏమి

తెలుస్తవి? నేను ఇంకా స్పష్టముగా చెప్పుతాను, కోపము వద్దు. నన్ను నీవు తిట్టవద్దు. విను. నేను నిన్ను ఎందుకు వధించిందీ చెప్పుతాను. ఓ వాలీ! నీవు సనాతనము అయిన ధర్మాన్ని త్యజించినావు. నీవు నీ తమ్ముణ్ణి తరిమివేసినావు. అతని భార్యను అనుభవిస్తున్నావు. నీవు చేసింది పాపకృత్యము. నీ తమ్ముడు జీవించి ఉన్నాడు. అతడి పెండ్లాము రుమ నీకు కోడలు వంటిది. నీవు కామాతురుడవు అయి ఆమెను అనుభవిస్తున్నావు. నీవు ధర్మాన్ని అతిక్రమించినావు. నీవు కేవలము కామపరతంత్రుడవు అయిపోయినావు. అందులో, తమ్ముడి భార్యతో వ్యభిచరిస్తున్నావు. అందుకు మరణదండనమే శాస్త్రములో చెప్పి ఉంది. ధర్మాన్నీ, లోకాచారాన్నీ ధిక్కరించిన వాణ్ణి శాస్త్రములో చెప్పి ఉన్నట్లు శిక్షించవలసిందే తప్ప, మరొక విధముగా నిగ్రహించడానికి వీలులేదు. నేను సత్కులములో పుట్టినాను. క్షత్రియుడను. నీవు చేసిన పాపకృత్యాన్ని సహించలేకుండా ఉన్నాను. అందుకు తగినట్టు నిన్ను శిక్షించకుండా ఉండలేను. కూతురునుకానీ, తోబుట్టువునుకానీ, తమ్ముడి భార్యను కానీ కామాతురుడు అయి అనుభవించేవాడికి మరణదండనమే ధర్మశాస్త్రాలు విధించినవి.

"ఓ వానరుడా! సుగ్రీవుడితో నా స్నేహము నాకూ, లక్ష్మణుడికీ ఉన్న స్నేహమువంటిది. నా క్షేమం కోరేవాడు సుగ్రీవుడుకాని నీవు కాదు. నిన్నే ముందుగా సాయం చేయమని అడిగి ఉన్నట్టయితే నీవు ఏమేమో చేసి ఉండేవాణ్ణి అని చెప్పినావు. నీవు అన్నమాటలు వట్టి ప్రగల్భాలు. నా బాణం దెబ్బతిన్న తరువాత నీవు మాటసామెతకు అట్లా అన్నావు కాని, ధర్మాధర్మాలతో నిమిత్తం లేకుండా తమ్ముని తరిమివేసి, తమ్ముడి భార్యను అపహరించిన నీవా నాకు సాయపడేది (ఉత్తది). ఓ వానరుడా! వానరుల సమక్షములో నీ వైరవృత్తాంతము అంతా విన్నాను. (వైరకారణం కన్నా నీకు సుగ్రీవుడితో వైరమే బలీయం అని తెలుసుకున్నాను. వైర కారణం కాకుండా వైరమే బలీయం అయినందువల్ల సమయం దొరికినప్పుడు నీవు సుగ్రీవుడినో, సుగ్రీవుడు నిన్నో చంపి వేయక తప్పదు. లేదా బ్రతికి ఉన్నంతకాలమూ మీరు ఉభయులూ వైరులుగా నయినా ఉండక తప్పదు). సుగ్రీవుడికి భార్యను సంపాదించి పెట్టడానికి నేను అతనితో స్నేహం చేసినాను. నాకు అతడు స్నేహితుడు అయినందువల్ల, నా భార్యను వెతికిపెట్టడమే అతని పని. ధర్మం ఎరిగిన స్నేహితుడికి ధర్మజ్ఞుడు అయిన స్నేహితుడు తోడ్పడడమే ధర్మం. నేను నా స్నేహితుడికి సాయంచేయడానికి నిన్ను చంపివేస్తాను అని ప్రతిజ్ఞ చేసినాను. ప్రతిజ్ఞ దబ్బర అయిపోకూడదు. ఆ ఈ మహత్తర కారణాలు అన్నిటినుంచీ నిన్ను చంపివేయడం అన్నివిధాలా ధర్మం అని నిశ్చయించినాను.

"ఓ వానరవీరుడా! నేను చాటున ఉండి నిన్ను కొట్టినాను అనే మనస్తాపము నాకు లేదు. నీవు నన్ను అందుకు నిందించినావు అనే కోపము నాకు అంతకన్నా లేదు. యుక్తి యుక్తం అయిన కారణం చెప్పుతాను, నీవు వినవలెను. విన్న తరువాత నామీద నీకు వచ్చిన కోపం అంతా పోతుంది. (నీవు చేసిన అపరాధానికి మరణదండనంకన్న మరి ఒక శిక్ష లేదు అని చెప్పినాను. నీవు అపరాధివి కాబట్టి, నిన్ను ఎంత తొందరగా చంపివేస్తే అంత మంచిది. ఇంట చేరిన క్రూరసర్పాన్ని అభిముఖంగా పోయి చంపివేయ నవసరం లేదు. ఏవిధముగానైనా సరే ఎంత తొందరగా చంపి వేయకలిగితే ఆ ఇంటికి అంత మంచిది. అదే విధముగా మనుష్య మాంసము రుచి చూచిన పెద్దపులిని వెంటనే వేటాడి చంపివేయవలెను.) ధర్మకోవిదులు అయిన రాజర్షులు భక్ష్యజంతువు, అభక్ష్య జంతువు అనే భేదము లేకుండా దుష్టజంతువులను వేటాడి చంపివేస్తూ ఉంటారు. ఆ యా జంతువులను చంపివేయడానికి వలలు ఒడ్డుతారు. తాళ్ళు ఉచ్చులుపోసి పెట్టుతారు. వేటాడే వాండ్లు దాగుకొంటారు. తాము చంపతలచుకొన్న జంతువును చంపివేయడానికి వివిధ కపటోపాయాలూ అవలంబిస్తారు. పరుగెత్తుతున్న వాటిని అయినా, భయపడి దాగుకొన్నవాటిని అయినా, ఏ భయమూ లేకుండా నిలుచున్నవాటిని అయినా, ఏమరుపాటులో ఉన్నవాటిని అయినా, జాగరూకతతో ఉన్నవాటిని అయినా, ఎదురుగుండా వచ్చినవాటిని అయినా, పెడముఖం అయినవాటిని అయినా కొట్టి చంపివేస్తారు. (నేను వానరుడను, నన్ను చంపవచ్చునా అని నీవు ప్రశ్న వేసినావు. అయితే, నీవు వానరుడవుగా కాకుండా దుష్టమృగమువలె ప్రవర్తించినావు. నీవు ఒక దుష్టజంతువు అయిపోయినావు. దుష్టమృగాన్ని ఏ కపటోపాయంతో నయినా చంపివేయవచ్చును. అందులో ఏ దోషమూ లేదు.) అందువల్ల, నీతో యుద్ధము చేయవలసిన అవసరము నాకు ఏమీ లేదు. నీవు ఇంకొకరితో పోట్లాడుతూ ఉన్నప్పటికిన్నీ నేను నీ మీద బాణము వదలినాను.

"ఓ వానరుడా! నీ పాపకర్మలకు ఇప్పుడు ఈ విధముగా ప్రాయశ్చిత్తము అయింది అనుకొని సంతోషించు. మనువు సదాచారాన్ని గురించి రెండు శ్లోకాలు చెప్పినాడు. వాటిని ధర్మకుశలురు అందరూ అంగీకరించినారు. ఆ ప్రమాణాన్నే నేను ఇప్పుడు ఆచరణలో పెట్టినాను. అపరాధము చేసిన వారిని రాజు శిక్షించేట్లయితే, ఆ అపరాధి చేసిన అపరాధము క్షాళనము అయిపోయి పుణ్యాత్ముడివలె స్వర్గతుడు అవుతాడు. ఒక దొంగను రాజు శిక్షించేట్లయితే, ఆ దొంగవాడి దోషము అంతా ఇక్కడనే నశించిపోతుంది. అట్లా ఒక దొంగను వాడి దొంగతనానికి శిక్షించకుండా వదలిపెట్టేట్లయితే, ఆ పాపకృత్యము ఆ దొంగను బాధించడము అట్లా ఉండగా,

శిక్షించకుండా వదలిపెట్టిన రాజును కూడా బాధిస్తుంది. ఈ కారణమువల్లనే, మా పూర్వీకుడు మాంధాత అనే ఆయన ఒక శ్రమణకుడు నీవలెనే పాపకృత్యము చేస్తే, మహాఘోరము అయిన శిక్ష విధించినాడు. రాజు ఏమరుపాటులో ఉన్నప్పుడు అనేకమంది పాపకృత్యాలు చేసి, రాజుకు తెలియకుండా తప్పించుకొని తిరుగుతూ ఉండవచ్చును. అయితే, ఆ తరువాత రాజు వారిని పట్టుకొని శిక్షించేట్టయితే, వారి పాపాలు క్షాళనము అయిపోవడమే కాకుండా, ఆ రాజున్నూ పుణ్యలోకానికి పోతాడు.

"ఓ వానరుడా! నీకు కోపమువద్దు. నీవు దుఃఖపడవద్దు. నేను ధర్మము కోసము నిన్ను కొట్టినాను. నేను ఈ విషయములో స్వతంత్రుణ్ణికాను. ఇప్పుడు భరతుడు రాజు అని చెప్పినాను. మేము అతని ఆజ్ఞాబద్ధులము అయి ఉన్నాము. అందువల్ల, మా ఇష్ట ప్రకారం మాకు కోపం వచ్చినప్పుడు చంపివేయడానికీ, దయ వచ్చినప్పుడు వదలిపెట్టడానికీ వీలు లేదు. నీవు ధర్మాతిక్రమణము చేసినావు. లోక మర్యాదను అతిక్రమించినావు. భరతుడి ఆజ్ఞలను శిరసావహించడము నుంచీ, శాస్త్రము లలో చెప్పి ఉండటమునుంచీ నేను నిన్ను చంపివేయడానికి బాణము వదలినాను.

"ఓ వానరుడా! ప్రజలకు శుభము చేకూర్చేవాడూ, జీవనము కల్పించేవాడూ, ధర్మము ప్రతిష్ఠించేవాడూ రాజు. ఇందులో సందేహము లేదు. దేవతలే మనుష్యరూపాన రాజవంశములో పుట్టి, ఈ భూలోకములో ధర్మాన్ని కాపాడుతున్నారు. అందువల్ల, వారిని ఎవరూ బాధించకూడదు. ఆక్షేపించకూడదు. నిందించ కూడదు. నేను నా పితృ పైతామహము అయిన ధర్మాన్ని తప్పలేదు. నీవు ధర్మము అంటే ఏమిటో తెలుసుకోకుండా కోపోద్రేకమువల్ల నన్ను దూషించినావు. అందుకు నాకు నీమీద కోపము లేదు."

రాముడు ఈ విధముగా ధర్మాన్ని వివరించి చెప్పినాడు. ఇది అంతా విన్న వాలికి, అప్పుడు ధర్మస్వరూపము బోధపడ్డది. రాముడు తనను అట్లా వధించడములో దోషము ఏమీ లేదు అని తెలుసుకొన్నాను. అప్పుడు వాలికి దుఃఖము వచ్చింది. చేతులు జోడించినాడు. "ఓ రామా! నీవు సర్వజ్ఞుడవు. పురుషోత్తముడవు. నీవు చెప్పింది అంతా వాస్తవము. సందేహము లేదు. నేను అల్పజ్ఞుడను. అందులో వానరుడను. నేను నా అజ్ఞానమువల్ల అయుక్తాలూ, అప్రియాలూ ఆడినాను. నేను నీకు ఏమి సమాధానము చెప్పగలను?

"ఓ రామా! నీవు సమస్తార్థాలూ తెలిసిన పండితుడవు. ప్రజాహితరతుడవు. నా దోషాన్ని నీవు మన్నించవలెను. ఏ అపరాధానికి, ఏ దండనము విధించవలెనో నీవు నిర్మలబుద్ధితో నిర్ణయిస్తావు. నీ నిర్ణయానికి తిరుగులేదు.

"ఓ రామా! నీవు ధర్మజ్ఞుడవు. నేను ధర్మాన్ని అతిక్రమించినాను. అయినప్పటికిన్నీ, నన్ను క్షమించినాను అని ధర్మిష్ఠము అయిన వాక్కుతో చెప్పు. నన్ను రక్షించు. నేను చచ్చిపోతున్నాను అనే దుఃఖము నాకు లేదు. నా బంధువులను గురించి కానీ, తారను గురించి కానీ నాకు ఏ దుఃఖమూ లేదు. నా కొడుకు కనకాంగదుడు అంగదుడు మహాగుణవంతుడు. వాణ్ణి నేను గారాబముగా పెంచినాను. వాడు నా ముద్దుబిడ్డడు. వాడు నన్ను చూడకుండా ఒక్కక్షణము అయినా ఉండలేడు. నేను చచ్చిపోయిన తరువాత, నీళ్ళు ఎండిపోయిన చెరువు వలె వాడు ఎండిపోతాడేమో!

"ఓ రామా! వాడు నా ఏకపుత్రుడు. తార వాణ్ణి కన్నది. వాడు మహాబలవంతుడు. అయితే, ఏమీ తెలియనివాడు. వాడు నాకు ఇష్టుడు. పసివాడు. రామా! నీవు వాణ్ణి కాపాడవలెను. నీవు సుగ్రీవుణ్ణీ, నా పిల్లవాణ్ణి అంగదుణ్ణీ ఒక్కమాదిరిగా చూడవలెను. ఇకను వాండ్లను ఇద్దరిని రక్షించవలసినవాడవూ, శిక్షించవలసినవాడవూ నీవు. ఓ రామా! నాకు తెలుసును. నీవు నరనాథుడవు. నీవు భరతుణ్ణి ఎంత ప్రేమతో చూస్తున్నావో, లక్ష్మణుణ్ణి ఎంత ప్రేమతో చూస్తున్నావో నా పిల్లవాణ్ణి అంగదుణ్ణీ, నా తమ్ముణ్ణి సుగ్రీవుణ్ణీ అంత ప్రేమతో చూడవలెను.

"ఓ రామా! నా అపరాధమునుంచి తార అపరాధి అయింది. కాని దాని అంతట అది ఏ అపరాధమూ చేయలేదు. దానిని సుగ్రీవుడు అవమానించకుండా నీవు చూడవలెను. ఓ రామా! నీ అనుగ్రహము సంపాదించి నీ చిత్తము వచ్చినట్లు ప్రవర్తిస్తూ, నీ ఆజ్ఞలను శిరసావహించేవాడే నా తదనంతరము వానర రాజ్యము ఏలవలెను. ఏమంటే, నీ అనుగ్రహము సంపాదించేవాడు ఈ వానరరాజ్యమేకాదు, సమస్త భూమండలాన్ని ఏలగలుగుతాడు. భూమండలాన్నే కాదు, స్వర్గ రాజ్యాన్ని అయినా ఏలగలుగుతాడు.

"ప్రభూ! నన్ను పోవద్దు అని తార అడ్డగించింది. అయితే, నేను నీ చేతిలో చచ్చిపోయేట్లయితే నాకు స్వర్గము వస్తుంది అనుకొన్నాను. అందుకోసమే నా తమ్ముడు సుగ్రీవుడితో ద్వంద్వ యుద్ధము చేయడానికి వచ్చినాను" అంటూ ఆ వానరేశ్వరుడు వాలి చెప్పి, రాముడి వంక చూస్తూ ఊరుకున్నాడు.

అట్లా చక్కని జ్ఞానముతో మాట్లాడిన వానిని చూచి, రాముడు ధర్మరూపము ఇంకా తేటతెల్లముగా చెప్పతలచి, "ఓ వానరుడా! నీవు అంగదుడి కోసము సంతాప పడవద్దు. నీవు ఏదీ ఆలోచించవద్దు. మేము చేసిన దానిని గురించి కానీ, నీవు చేసిన దానిని గురించి కానీ ఆలోచించవద్దు. ఇది ధర్మము అని మేము నిశ్చయించి చేసినాము. దండించవలసిన వాణ్ణి దండించిన రాజా, దండార్హుడు అయి రాజ

దండనము అనుభవించినవాడూ తమ ప్రయోజనాలు సిద్ధించటమువల్ల కృతార్థులు అవుతున్నారు. నీవు ధర్మదృష్టము అయిన శిక్షను పొందినావు. నీవు చేసిన పాపము అంతా క్షాళనము అయిపోయింది. నీవు ఇప్పుడు ధర్మిష్ఠుడవు అయినావు. ఓ వానరశ్రేష్ఠుడా! నీవు ఇక శోకమూ, మోహమూ, భయమూ వదిలిపెట్టు. విధిని అతిక్రమించటము ఎవరికి అయినా అశక్యము.

"ఓ వానరుడా! నీవు అంగదుణ్ణి ఎట్లా చూచినావో సుగ్రీవుడూ, నేనూ అట్లా వాణ్ణి చూస్తాము, సందేహము వద్దు" అని చెప్పినాడు. ఆ మహాపూజ్యుడు, ఆ ధర్మపథానువర్తి, ఆ రణశూరుడు రాముడు అట్లా తియ్యగా చెప్పింది అంతా విని "ఓ ప్రభూ! నీవు నరనాథుడవు. భయంకర పరాక్రముడవు. దేవేంద్రుడితో సరిసమానుడవు. నీ బాణము దెబ్బకు నాకు తాపము ఎత్తింది. తెలివితేటలు లేక నిన్ను నిందించినాను. ఇప్పుడు నిన్ను వేడుకొంటున్నాను. నా తప్పు నీవు క్షమించవలెను" అని వాలి చెప్పినాడు.

19

అట్లా నేలమీద పడి ఉన్న వానరమహారాజు వాలి, సుగ్రీవుడు రాళ్ళతోనూ చెట్లతోనూ కొట్టిన దెబ్బలకు దేహము అంతా వ్రయ్యలు వ్రయ్యలు అయిపోయినందువల్లనూ, రామబాణము మరింత బాధ పెట్టుతూన్నందువల్లనూ ఆ ప్రాణాంత సమయాన మూర్ఛపోయినాడు.

రాముడు వదిలిన బాణానికి ఆ వానరశార్దూలము తన భర్త వాలి నేలకూలినాడు అని అంతఃపురంలో ఉన్న తార విన్నది. ఆ అప్రియమూ, మహాదారుణమూ అయిన వార్త వినీ వినడముతో భయభ్రాంత అయిపోయింది. కొడుకును వెంటపెట్టుకొని నానావిధ గిరిగుహలవంటి కక్ష్యలు అన్నీ దాటుకొంటూ అంతఃపురము వెలుపలికి వచ్చింది. తన నాథుణ్ణి చూడటానికి ఆ కిష్కింధానగరము నుంచి బయటికి బయలుదేరింది.

ధనుర్ధరుడు అయిన రాముణ్ణి చూచి బెదిరిపోయిన భీమపరాక్రములు, అంగదుడి పరివారంలో వారు, కిష్కింధ వెలుపలినుంచి పారిపోయి, పట్టణంలోకి పరుగెత్తుకొని వస్తూ ఉన్న వానరులు అప్పుడు ఆమెకు ఎదురు అయినారు. యూథపతిని వేటకాడు కొట్టితే యూథంలో నుంచి చెల్లాచెదురు అయి పారిపోయే మృగాలవలె, రాముడి బాణాలు తమమీద వచ్చి పడుతవేమోనని భయపడి పారిపోయి వస్తూ ఉన్న వానరవీరులు అందరూ ఆమెను సమీపించినారు. వారిని అందరినీ ఆమె చూచింది. పరమదుఃఖముతో, "ఓ వానరవీరులారా! యుద్ధాలలో ముందు నడిచే

మీరు అందరూ, ఎందుకు రాజసింహుణ్ణి వాలిని వదలిపెట్టి భయపడి దిక్కులేని వాండ్లవలె పరుగెత్తుకొని పారిపోయి వస్తున్నారు? రాజ్యము కోసము ఆ భయంకరుడు సుగ్రీవుడు తన వెంట రాముణ్ణి సాయము తెచ్చుకొన్నాడా? ఆ రాముడు ఎంత దూరము అయినా పోయే తీక్షణ బాణాలు వదలి నా పెనిమిటిని చంపివేసినాడా?" అని అడిగింది.

ఆ వానర వీరులు అంతట సమయోచితముగా, "ఓ రాణీ! నీకు పుత్రుడు ఉన్నాడు. వెంటనే వెనుకకు మళ్ళవలసింది. నీ కొడుకు అంగదుణ్ణి కాపాడుకో. యముడు రాముడి రూపములో వచ్చినాడు. ఇక మన నగరముమీద పడుతాడు. మన మహారాజును వాలిని చంపివేసినాడు. ఓ రాణీ! సుగ్రీవుడు వేసిన రాళ్ళనూ, చెట్లనూ వాలి నిగ్రహించినాడు. కాని, వజ్రాయుధమువంటి బాణాలు రాముడు వదలినాడు. వాటిని వాలి నిగ్రహించ లేకపోయినాడు. దేవేంద్రుడు అంతటి ఆ కాంతిమంతుడు నేలకూలినాడు, చనిపోయినాడు. మన సేనలు అన్నీ వెనుకకు పరుగెత్తుకొని వస్తూ ఉన్నవి.

"ఓ దేవీ! వెంటనే నగర బహిర్ద్వారాలు మూసివేయవలెను. అంగదుడికి రాజ్యాభిషేకము చేయవలెను. వాలి మహారాజు పుత్రుడు కాబట్టి, రాజ్యాధికారములో ఉంటాడు. కాబట్టి, అంగదుణ్ణి వానరులు అందరూ కొలుస్తారు. నీవు వెంటనే ఇట్లా చేయకపోయేట్లయితే, ఓ సుందరాననా! నీవు ఇక్కడ ఉండటం మంచిది కాదు. మన శత్రువులు అంతఃపురము తప్ప తక్కిన దుర్గమ ప్రదేశాలను ఈపాటికే ఆక్రమించుకొని ఉంటారు. ఇదివరకు వాలి వెళ్ళకొట్టినవారిలో భార్యలు ఉన్నవారు కొంతమంది, భార్యలు లేనివారు కొంతమంది. భార్యలు లేనివారు చిరకాలవిరహబాధవల్లనూ, భార్యలు ఉన్నవారు సమస్తమూ తమకే కావలెను అనే ఆశతోనూ సుగ్రీవాది జ్ఞాతుల సాయముతో మనకు ఎన్ని అయినా చిక్కులు తెచ్చిపెట్టుతారు" అని చెప్పినారు.

ఈవిధముగా ఆ అల్పబుద్ధులు చెప్పిన మాటలు విని ఆ మహా బుద్ధిమంతురాలు, ఆ చారుహాసిని తార, "ఓ వానరులారా! ఆ మహాభాగుడు, ఆ కపిసింహము, నా పెనిమిటి వాలిమహారాజే పోతే, నాకు ఈ కొడుకుతో ప్రయోజనము ఏమిటి? నాకు రాజ్యము ఎందుకు? నేను బ్రతికి ఉండటం దేనికి? రామబాణానికి పడిపోయిన ఆ మహాత్ముడి పాదాలు పట్టుకొంటాను. నేనూ ఆయనతోపాటు పోతాను" అని చెప్పి, ఏడుస్తూ రెండు చేతులతోనూ నెత్తీ, ఎదురు రొమ్మూ బాదుకొంటూ వాలి పడి ఉన్న తావుకు పరుగెత్తింది.

యుద్ధాలలో వెనుకకు తిరుగని రాక్షసులను అందరినీ సంహారము చేసిన దేవేంద్రుడి వజ్రాయుధమువలె పెద్ద పెద్ద కొండలను విసరివేసే వాడూ, పెద్ద పెద్ద

గాడ్పులు అంతటి వేగవంతుడూ, మహామేఘ సమూహాలు అన్నీ ఏకము అయి గర్జిస్తున్నట్లు గర్జించేవాడూ, దేవేంద్రుడు అంతటి పరాక్రమవంతుడూ, మాంసము కోసము శార్దూలము చేత చచ్చిపడిపోయిన సింహమువలెనూ, వాన కురిసి కురిసి వెలసిన మేఘమువలెనూ, సర్పము ఉండడముచేత గరుత్మంతుడు కూలతోసిన చైత్యవృక్షమువలెనూ నేలమీద పడివున్న తన పెనిమిటిని, వాలిని తార చూచింది. ధనుస్సును ఊతము చేసుకొని అక్కడ నిలుచుని ఉన్న రాముణ్ణి, అతని తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి, తన పెనిమిటి తమ్ముడు సుగ్రీవుణ్ణి ఆ శుభాంగి చూచింది. వారిని దాటి పోయి నేలమీద పడి ఉన్న పెనిమిటిని సమీపించింది. చూచింది. సంభ్రాంత చిత్త అయి నేలమీద పడిపోయింది. నిద్రనుంచి లేచినట్టుగా కొంచెము సేపటికి లేచి, 'ఓ పూజ్యుడా!' అని అరచింది. ప్రాణము వదలపోతూ ఉన్న పెనిమిటిని చూచి ఎలుగెత్తి ఏడ్చింది.

అట్లా గోరువంక పిట్టవలె ఏడుస్తూ ఉన్న తారనూ, ఆమె వెంట వచ్చి తండ్రిని చూచి దిగాలుపడి నిలుచుని ఉన్న అంగదుణ్ణీ చూడగానే సుగ్రీవుడికి దుఃఖము వచ్చింది.

20

తార రోదనము

ప్రాణాలు తీసివేసే రామబాణము గుచ్చుకొని నేలకూలి స్పృహ తప్పిపోయి ఉన్న తన పెనిమిటిని, ఆ తారాధిపానన తార చూచింది. దగ్గరకు పరుగెత్తింది. కౌగలించుకొంది. మదపుటేనుగు అంతటి వాడు రాముడి ఒక్క బాణానికి కూకటివేళ్ళు తెగిన చెట్టువలె నేల కూలినందుకు శోక సంతప్త అయి ఏడుస్తూ, "ఓ భయంకర పరాక్రముడా! ఓ వీరోత్తమా! ఓ వానరేంద్రా! నేను అనపరాధిని. దీనురాలను. అయ్యో! నాతో ఎందుకు మాట్లాడకుండా ఉన్నావు?

"ఓ వానరరాజా! లే! రాజసత్తములు ఎవరూ ఇట్లా ఈ నేలమీద పడుకోరు. లే! చక్కని శయ్యమీద పడుకో. అయ్యో! రాజా! చచ్చిపోయినప్పటికిన్నీ నన్ను వదలి పెట్టి ఈ భూమిని కౌగలించుకొన్నావు. ఇదా నా కన్న నీకు ఎక్కువ ప్రియురాలు?

"ఓ వీరాగ్రణీ ! స్వర్గానికి పోయేదారిలో ఈ కిష్కింధకన్న రమణీయము అయిన పట్టణము ఏది అయినా నీ ధర్మ మహిమతో నిర్మించుకొన్నావా? లేకపోతే, నీవు కిష్కింధ వదలిపెట్టి పోవు. ఆ యా కాలాలలో మధువాసనలు గుబాళించే వనాలలో మాతో విహరించినావే! ఇకను అట్లా మాతో విహరించవా? ఓ రాజా! గొప్ప గొప్ప వానర సమూహాలను పరిపాలించినావు. దేహము చాలించినావు. ఇక నాకు సంతోషము ఎక్కడిది? ఇకను ఏ ఆశా లేదు. దుఃఖసాగరములో పడిపోయినాను.

మునిగిపోతున్నాను. ఇట్లా నీవు నేలమీద పడి ఉంటే నిన్ను చూస్తూ ఉంటే నా హృదయము చెక్కలు చెక్కలు అయిపోలేదు. అది ఎంత గట్టిదో!

"ఓ రాజా! నీ తమ్ముణ్ణి సుగ్రీవుణ్ణి వెళ్ళకొట్టినావు. అతని పెండ్లాన్ని అపహరించినావు. దాని ఫలము నీవు ఇప్పుడు ఇట్లా అనుభవించవలసి వచ్చింది. రాజా! నీ మేలుకోరి నీకు హితము చెప్పినాను. నీ మేలు కోరిన నన్ను నీవు నీ అజ్ఞానమువల్ల నిందించినావు.

"ఓ పూజ్యుడా! నీవు మానము కాపాడేవాడవు. నన్ను వదలిపెట్టి పోతున్నావా? ఇక నీవు స్వర్గములో రూపయౌవన సంపన్నులూ, మన్మథ తంత్రచతురులూ అయిన అప్సరసల చిత్తాలను అపహరిస్తావు, నిజము.

"ఓ రాజా! నీవు ఎవరి వశమూ కావు. అటువంటి నిన్ను కాలము బలవంతముగా లాగుకొని వచ్చి సుగ్రీవుడికి ఒప్పగించింది. నీ ప్రాణము తీయడానికే కాలము అట్లా చేసింది. సందేహము లేదు.

"ఓ రాజా! నేను ఇదివరకు ఎన్నడూ, ఏ దుఃఖమూ ఎరుగను. దారిద్ర్యము ఎరుగను. ఇకను నేను అనాథవలె దరిద్రురాలను అయి, విధవను అయి దుఃఖముతో తపించిపోతూ బ్రతకకలనా? ఈ అంగదుడు ఇంతవరకూ గారాబముగా పెరిగినాడు. వీరుడు అయినప్పటికిన్నీ సుకుమారుడు. సుఖము అనుభవించవలసినవాడు. ఇక పినతండ్రి కోపాన్ని ఎట్లా తట్టుకొంటాడో, ఏమి దురవస్థ అనుభవిస్తాడో!

"ఓ కొడుకా! పితృధర్మముతో నిన్ను గారాబముగా పెంచిన నీ తండ్రిని చక్కగా చూడు. నాయనా! ఇక నీవు మీ తండ్రిని చూడడము అంటూ ఉండదు" అంటూ పెనిమిటిని ఉద్దేశించి, "ఓ ప్రియుడా! నీవు ఎందుకు బహుదూర దేశము ప్రయాణము అయిపోతున్నావో నీ పిల్లవాడికి చెప్పు. వాణ్ణి ఓదార్చు. వాడి శిరము ఆఘ్రాణించి వాడికి చెప్పవలసిన మాటలు చెప్పు. ఓ ప్రభూ! రాముడు నిన్ను వధించి సుగ్రీవుడికి ఇచ్చిన మాట చెల్లించుకొన్నాడు" అంటూ సుగ్రీవుణ్ణి చూచి,

"ఓ సుగ్రీవుడా! నీ అన్న, నీ పగవాడు హతుడు అయినాడు. నీ కోరికను ఈడేర్చుకో. ఇక హాయిగా రుమను అనుభవించు. ఏ దిగులూ లేకుండా రాజ్యము ఏలు" అని చెప్పి, పెనిమిటివంక చూచి, "ఓ రాజా! నేను ఇంత ఏడుస్తూ ఉన్నా, ఒక్కమాట అయినా సంతోషముగా మాట్లాడవా? ఓ వీరుడా! ఇదిగో, సుందరాంగనలు నీ భార్యలు అందరూ నిన్ను చూడటానికి వచ్చినారు. వీరిని అయినా కన్నెత్తి చూడు" అని చెప్పి ఏడువసాగింది.

అప్పుడు ఆ సుందరాంగనలు, వాలి భార్యలు అందరూ అంగదుణ్ణి కౌగలించుకొని ఏడవడము మొదలు పెట్టినారు. తార మళ్ళీ వాలిని చూచి, "ఓ

రాజా! అంగదుణ్ణి వదలిపెట్టి తిరిగి రాకుండా ఉండే దూరదేశము ప్రయాణము అయిపోతున్నావా? అంగదుడు నీ ప్రియపుత్రుడు. నీ గుణాలకూ, ఈ అంగదుడి గుణాలకూ తేడా లేదు. ఇటువంటి పిల్లవాణ్ణి వదలిపెట్టి పోతున్నావా? నీవు ఇట్లా చేయడము ఏమీ బాగాలేదు.

"నాథా! నేను ఏమి తప్పు చేసినాను? ఈ అంగదుడు ఏమి తప్పు చేసినాడు? వీడు నీకు ఏమి అప్రియము చేసినాడు? నేను ఏమి అప్రియము చేసినాను? అయ్యో, ప్రియుడా! నన్నూ, అంగదుణ్ణీ వదలిపెట్టి తిరిగి రాకుండా ఉండే దూరదేశానికి ఎందుకు ప్రయాణము అయిపోతున్నావు? "నాథా! నేను తెలిసి ఒక్క అప్రియమూ నీకు చేయలేదు. ఒకవేళ తెలియక నేను ఏది అయినా ఒక్క అప్రియము చేసి ఉన్న ట్లయితే, ఇప్పుడు నీ పాదాలకు మొక్కుతున్నాను. నన్ను క్షమించు" అంటూ ఏడ్చింది.

ఆ సౌందర్యవతి తార సపత్నులతో కూడా ఏడుస్తూ వాలి సమీపములో నేలమీద పడిపోయింది. ప్రాయోపవేశము చేసి చచ్చిపోవలెను అని నిశ్చయించుకొన్నది.

21

హనుమంతుని హితబోధ

ఆకాశమునుంచి జారిపోయిన నక్షత్రమువలె నేలకూలిన తారను హనుమంతుడు చూచినాడు. ఆమెను ఓదార్చ తలచుకొని మెల్లగా, "ఓ దేవీ! ఎందుకు ఏడుస్తావు? ఏడవవద్దు. ప్రతివాడూ తెలిసో తెలియకో పుణ్యాపాపకర్మలు చేస్తూ ఉంటాడు. ఆ యా కర్మలనుపట్టి శుభాశుభ ఫలాలు అనుభవిస్తూ పరలోకానికి పోతాడు. అందుకు, ఒకరి కోసము ఒకరు దుఃఖపడి ప్రయోజనము ఏమిటి? నిన్ను గురించి నీవు దుఃఖపడవలసినదానవు నీవు, ఇప్పుడు మరి ఒకరిని గురించి దుఃఖపడడము ఎందుకు?

"ఓ తారా! నీవు ఇప్పుడు దిక్కులేనిదానివి అయిపోయినావు. ఇంక ఎవరి కోసము నీవు జాలి పుట్టేట్టు ఏడుస్తున్నావు? ఈ దేహము నీటిబుడగ వంటిది. నీటిబుడగవంటి ఈ దేహము కోసము, ఒకరిని గురించి ఒకరు ఏడ్చి యేమి ప్రయోజనము? ఏమంటే, అందరి దేహాలూ నీటి బుడగలవంటివే.

"ఓ రాణీ! నీకు పుత్రుడు ఉన్నాడు. కాబట్టి నీవు ఆ పుత్రుణ్ణి చూచుకొంటూ ఉండవలెను. ఉత్తరోత్రా నీ పిల్లవాడికి ఉపయోగించే పనులు అన్నీ చూడు. ఆ యా పనులను గురించి ఆలోచించు. ఏడ్చి ఏమి లాభము? ప్రాణుల రాకపోకలు అస్థిరాలు. ఓ దేవీ! నీవు పండితురాలవు. నీకు తెలియంది ఏమీ లేదు. నీవు అశుభముగా ఏడవవద్దు. ఇప్పుడు ముందుగా వాలికి పరలోక సౌఖ్యము కోసము

ప్రేత కార్యాలన్నీ చేయించవలెను. అర్బుదాల సంఖ్యలో ఉన్న వానరులను అందరినీ చక్కగా విభజించి, అందరూ సుఖముగా జీవించే ఏర్పాట్లు అన్నీ వాలి చేసినాడు. కాలము తీరిపోయింది. అతడు సమస్తశాస్త్రాలూ చదివిన తత్త్వవేత్త. సామదాన క్షమాపరుడు. పుణ్యాత్ములు అందరూ పోయే లోకానికి పోతున్నాడు. అందువల్ల, అతని కోసము దుఃఖపడటము అనుచితము.

"ఓ భామినీ! నీవు దుఃఖపడవద్దు. సంతాప పడవద్దు. నీ ప్రాపున ఈ అంగదుడు రాజ్యము ఏలుతాడు. నీకు సంతానము ఉన్నందుకు ఇప్పుడు ఏది ముందు చేయవలెనో ఆలోచించి చూడు. అంగదుడిచేత వాలికి ఔర్ధ్వదైహిక క్రియలు అన్నీ ఇప్పుడు నీవు చేయించవలెను. ప్రేత సంస్కారాదులు అన్నీ అయిపోయిన తరువాత, అంగదుడికి రాజ్యాభిషేకము చేయించు. సింహాసనము ఎక్కిన కుమారుణ్ణి చూచుకొంటూ ఉంటే నీ దుఃఖము అంతా శమిస్తుంది" అని చెప్పినాడు.

హనుమంతుడు చెప్పిన ఈ మాటలు భర్తృవ్యసనముతో బాధపడుతూ ఉన్న తార విన్నది. అంతట ఆమె, "ఓ హనుమంతుడా! అంగదుడివంటి నూరుగురు కొడుకులు ఉండడముకన్న, ఆ వీరుడి గాఢాలింగనమే నాకు ఎంతో ఎక్కువయింది. ఆ మహానుభావుడికి, వాలికి సహజ సంస్కారాదులు చేయించడమూ, అంగదుడికి పట్టము కట్టడమూ నా పని కాదు. వాలి తరువాత ఆ యా పనులన్నీ చక్కపెట్టు కొనవలసినవాడు అంగదుడి పినతండ్రి సుగ్రీవుడు కాని, నేను కాదు.

"ఓ హనుమంతుడా! అంగదుడి విషయములో నేను ఆలోచించవలసింది ఏమీ లేదు. పుత్రుడికి ఉపకారము చేసేవాడు తండ్రి కాని తల్లి కాదు. తండ్రి తదనంతరము అవి అన్నీ పినతండ్రి చూచుకొంటాడు.

"ఓ వానరనాయకుడా! ఈ లోకములో కాని, పరలోకములో కాని ఆ వాలిని ఆశ్రయించుకొని ఉండడముకన్న శ్రేయము నాకు ఇంకొకటి లేదు. ఆ వీరుడు వాలి హతుడు అయి శత్రువుకు అభిముఖముగా పడుకొని ఉన్నాడు. నేను ప్రాయోపవేశము చేసి ఆయన వెంట ఉండడానికే నిశ్చయించుకొన్నాను" అని తార హనుమంతుడితో చెప్పింది.

22

వాలి మరణ సన్నివేశము

వాలి కొనప్రాణముతో మెల్ల మెల్లగా ఊపిరి విడుస్తూ, అన్ని వైపులా చూచినాడు. ఎట్టఎదుట అంగదుడూ, సుగ్రీవుడూ కనిపించినారు. తనను జయించిన సుగ్రీవుణ్ణి స్నేహభావంతో దగ్గరకు పిలిచి తేటతెల్లముగా, "ఓ సుగ్రీవుడా! నీవు ఇక నా దోషాన్ని పాటించవద్దు. అది అట్లా జరిగిపోయింది. నా బుద్ధి వ్యామోహము

నన్ను ఆ పనికి ఈడ్చింది. నాయనా! మనకు ఇద్దరికీ రాజ్యసౌఖ్యమూ, అన్నతమ్ములకు ఉండవలసిన అన్యోన్యమర్యాదా ఏకకాలాన లేకుండా పోయినవి. అది దైవికము. అందుకు నీవు మరొకవిధముగా అనుకోవద్దు. నేను ఇప్పుడు రాజ్యమూ, అఖండైశ్వర్యమూ, అజయ్యుడు అనే యశస్సూ, జీవితమూ వదలిపెట్టి యమసదనానికి వెళ్ళిపోతున్నాను. ఇక నీవు ఈ వానర రాజ్యానికి అంతటికీ రాజువు. ఈ రాజ్యము అంతా నీవు ఏలు.

"తమ్ముడా! నేను ఇప్పుడు ఈ చరమావస్థలో చెప్పుతూ ఉంది నీకు సుకరము అయినా, దుష్కరము అయినా చేయవలెను. నీవు ఈ అంగదుడు నా పుత్రుడు అయినప్పటికిన్నీ వీణ్ణి నీవు నీ ఔరస పుత్రుణ్ణిగా చూచుకోవలసింది. వీడు ఎప్పుడూ సుఖపడవలసినవాడు. ఇంతవరకూ ఎంతో సుఖముగా పెరిగినాడు. ఏమీ తెలియని పిల్లవాడు. నన్ను చూచి కన్నీళ్ళు కారుస్తూ ఇప్పుడు నేలమీద పడి ఏడుస్తూ ఉన్నాడు. వీడు నాకు నా ప్రాణము కన్న ఎక్కువ అయినవాడు. నేను వీణ్ణి నీకు అప్పగించి పోతున్నాను. నీవు వీడికి ఏమీ తక్కువ కాకుండా చూడవలెను. వీడికి కావలసినవి అన్నీ నావలెనే నీవూ ఇస్తూ ఉండవలెను. వీడికి ఏ కష్టమూ కలుగకుండానూ, ఏ భయమూ రాకుండానూ నీవు వీణ్ణి కాపాడవలెను.

"సుగ్రీవా! వీడు, ఈ అంగదుడు మంచి తేజోవంతుడు. నీతో సరిసమానము అయిన పరాక్రమవంతుడు. రాక్షసుల మీదికి నీవు యుద్ధానికి పోయేట్లయితే వీడు నీ ముందు నిల్చి పోరాడుతాడు. వీడు బలవంతుడు. వేగవంతుడు. యువకుడు. యుద్ధములో మన వంశానికి అనురూపము అయిన పనులు అన్నీ చేస్తాడు. వీణ్ణి నీవు కాపాడవలెను.

"నాయనా, సుగ్రీవా! సుషేణుడి కూతురు ఈ తార, అతిసూక్ష్మము అయిన విషయాలు ఆలోచించి, కర్తవ్యము నిశ్చయించడములో నేర్పరి. ఉత్పాతాలనుపట్టి రాబోయే ఆపదలను నిర్ణయించి చెప్పే శక్తిమంతురాలు. ఇది మంచిది అని తార ఏదయినా చెప్పితే, ఏ సందేహమూ లేకుండా అది నీవు చేయవచ్చును. ఈ తార నిర్ణయానికి తిరుగు ఉండదు. నాయనా! నీవు ఆమె చెప్పినట్లు చేస్తూ ఉండు.

"ఓ సుగ్రీవుడా! రాముడి పని నీవు అవిశంకముగా చేసిపెట్టవలెను. నీవు అట్లా చేయకపోయేట్టయితే అధర్మము చేసినవాడవు అవుతావు. నీవు అధర్మము చేసేట్లయితే, నిన్ను ఈ రామప్రభువు మన్నించడు. చంపివేస్తాడు.

"తమ్ముడా! దేవేంద్రుడు నాకు ఇచ్చిన ఈ కాంచనమాల మృత దేహముమీద ఉండేట్లయితే, దీని కాంతులు మాసిపోతవి. దీని శక్తి ఉడిగిపోతుంది. కాబట్టి, నా ప్రాణము పోకపూర్వమే ఈ హేమమాలను నీవు తీసుకో" అని చెప్పినాడు.

వాలి ఇట్లా భ్రాతృవాత్సల్యముతో మాట్లాడి, తన మెడలో ఉన్న కాంచనమాలను తీసి ఇచ్చి సుగ్రీవుణ్ణి ఆదరించినాడు. సుగ్రీవుడికి తాను వాలిని జయించినాను అనే సంతోషము అంతటితో ఎగిరిపోయింది. దుఃఖము వచ్చింది. గ్రహణము పట్టిన చంద్రునివలె అయిపోయినాడు. వైరాన్ని మరచిపోయినాడు. వాలి చెప్పినట్టు చేయడానికి ఒప్పుకొన్నాడు.

అంతట వాలి మరణసన్నద్ధుడు అయి తన పుత్రుణ్ణి అంగదుణ్ణి దగ్గరకు తీసుకొని, "నాయనా! నీవు ఇక సుగ్రీవుడి చెప్పుచేతలలో ఉండవలెను. దేశకాలాలనుబట్టి నీవు నడుచుకొంటూ ఉండవలెను. ప్రియము అయినా, అప్రియము అయినా నీవు ఓర్చుకోవలెను. సుఖము వచ్చినా, దుఃఖము వచ్చినా ఒక్కమాదిరిగా ప్రవర్తించవలెను. నాయనా! ఈ నిన్ను సుగ్రీవుడు నావలెనే ఆదరిస్తాడు. నీవున్నూ నాతో ఉంటూ ఉన్నట్టే ఈ సుగ్రీవుడితో ఉండేట్లయితే, వీడు నిన్ను గౌరవిస్తాడు కూడానూ.

"నాయనా! ఈ సుగ్రీవుడి శత్రువులతో కానీ, ఆ శత్రువులతో సంబంధము ఉన్నవాండ్లతో కానీ నీవు ఎంతమాత్రమూ చేరకూడదు. నీ ప్రభువు సుగ్రీవుడు. నీవు అతడి పనులే చక్కపెట్టుతూ ఉండవలెను. అతడి ఆజ్ఞలను నీవు శిరసావహించవలెను. అంతేకాదు, నీవు జితేంద్రియుడవు కావలెను. ఎవరితోను అయినా సరే నీవు అతి స్నేహము చేయవద్దు. అసలు స్నేహమే చేయకుండా బిగతీసుకొని కూర్చోవద్దు. రెండూ గొప్ప తప్పులే అవుతవి. అతి ఎప్పుడూ పనికిరాదు. మధ్యస్థముగా ఉండవలెను" అని చెప్పినాడు.

రామబాణము బాధ వాలికి క్షణక్షణానికీ ఎక్కువ అయిపోయింది. కళ్లు గిర్రున తిరిగిపోయినవి. నోరు తెరిచినాడు. పళ్లు అన్నీ బయట పడినవి. ప్రాణము పోయింది.

అప్పుడు అక్కడ ఉన్న వానరోత్తములూ, వానరయూధనాయకులూ పెద్ద పెట్టున ఏడువసాగినారు. "వానరరాజు వాలి స్వర్గతుడు అయినాడు. కిష్కింధానగరము ఇప్పుడు పాడుపడి పోయింది. ఒక్క నగరమే కాదు, అతడు విహరించిన ఉద్యానవనాలూ, కొండలూ, అడవులూ అన్నీ పాడుపడిపోయినవి" అన్నారు కొందరు. "వానరరాజు వాలి పోయినాడు. వానరు లందరి కాంతులూ మాసిపోయినవి" అన్నారు మరికొందరు. "ఉద్యానవనాలలోనూ, అడవులలోనూ ఆ వాలి నడిచే వేగానికి పూలగుత్తులు అతనికి ముందు వెనుకల ఎగురుతూ పోతూ ఉండేవి. ఇకను ఎవడు అట్లా నడవకలడు? పూలగుత్తులు ఇకను అట్లా ఎవడిని వెంబడిస్తవి" అన్నారు ఇంకా కొందరు.

"గోలభుడు అనే గంధర్వుడితో పదిహేను సంవత్సరాలు అహోరాత్రములు ఆ మహాబాహువు వాలి పోరాడి, పదహారో సంవత్సరములో చంపివేసినాడు. అటువంటి గోలభుణ్ణి చంపివేసి అందరి భయమూ పోగొట్టిన ఆ భయంకర పరాక్రముణ్ణి ఎట్లా చంపివేయగలిగినారో" అని అందరూ అన్నారు.

మహారణ్యములోకి కొత్తగా వచ్చిన సింహము, అంతవరకూ హాయిగా తిరుగుతూ ఉన్న ఆబోతును చంపివేసినప్పుడు అక్కడి ఆవులవలె, వాలిని రాముడు చంపివేయగానే వానర సమూహాలు అన్నీ చెల్లాచెదరు అయిపోయినవి.

నేలకూలిన వాలిని కౌగలించుకొని ఉన్న తార, తన పెనిమిటి ప్రాణము పోవడము చూచి దుఃఖసముద్రములో పడి మునుగుతూ తేలుతూ ఉంటే, నేల కూలినప్పటికిన్నీ చెట్టును వదలకుండా అల్లుకొని ఉన్న పూలతీగె కదులుతూ ఉన్నట్టు ఆమె కనబడింది.

23
తార రోదనము

లోకాంతరగతుడు అయిన వాలి ముఖము తార వాసన చూచి, "ఓ వీరుడా! నా మాట నీవు వినలేదు. మిట్టపల్లాలుగా ఉన్న ఈ మొరపరాళ్ళ కటిక నేలమీద పడుకోవలసిన కష్టము నీకు వచ్చింది. రాజా! నీకు ఈ భూమి నాకన్న ఎక్కువ ప్రియురాలు అయిందా? ఈ నేలను కౌగిలించుకొని పడుకొని ఉన్నావు. లేవకుండా ఉన్నావు. నాతో మాట్లాడకుండా ఉన్నావు.

"ఓ ప్రియుడా! నీవు ఎటువంటి సాహసము అయినా చేయకలవు. నీవు సుగ్రీవుడికి లోబడిపోయినావు. అందువల్ల, నీ దెబ్బలు తిని పారిపోయిన సుగ్రీవుడే పరాక్రమశాలి అయినాడు. విధి ఇట్లా ఉంది కాబోలు, ఆశ్చర్యము! బలవంతులు అయిన భల్లూక వీరులూ, వానర వీరులూ నిన్ను కొలుస్తూ ఉన్నారు. నీవు వాండ్లను అందరినీ ఉపేక్షించినావు అని వాండ్లు ఘోరముగా ఏడుస్తున్నారు. అంగదుడు విలపిస్తున్నాడు. నేను ఆర్తనాదాలు చేస్తూ ఏడుస్తున్నాను. మా ఏడ్పులకూ, పెడబొబ్బలకూ నీకు మెలకువ రాకుండా ఉంది.

"ఓ వీరా! నీవు పరిశుద్ధము అయిన వంశములో, అందులో మహాబలవంతులు పుట్టిన వంశంలో పుట్టినావు. నీకు యుద్ధము అంటే ఎంతో ఇష్టము. బంధువులను కాపాడడములో నీవు ఘటికుడవు. ఇటువంటి నీవు, నన్ను ఇప్పుడు ఒంటరిదానిని చేసి పోయినావు. తెలిసినవాడు ఎవడూ తన కూతురుని శూరుడు అయినవాడికి ఇవ్వకూడదు. నా భర్త శూరుడు. నన్ను చూస్తే శూరుడి భార్య గతి ఏమిటో తెలుస్తుంది. నేను విధవను అయినాను. నాశనము అయిపోయినాను. నా గర్వము

నాశనము అయిపోయింది. ఆడుది ఎప్పుడూ పతికి సేవచేస్తూ ఉండవలెను. అదే దాని భాగ్యము. ఆ భాగ్యము నాకు ఇప్పుడు భగ్నము అయిపోయింది. ఎంతో లోతూ, విశాలమూ అయిన శోకసాగరములో మునిగిపోతూ ఉన్నాను. చంపివేసిన నా భర్తను చూస్తూ ఉంటే నా హృదయము ముక్కలు ముక్కలుగా, చెక్కలు చెక్కలుగా పగిలిపోలేదు. నా హృదయము ఎంత గట్టిదో! ఇంత గట్టి హృదయము శిలాసారముతో చేసినది అయి ఉండవలెను. సందేహము లేదు. లేకపోతే ఎందుకు పగిలిపోలేదు?

"వానరరాజు నా పెనిమిటి, నా స్నేహితుడు, నా ప్రియుడు, యుద్ధములో పరమపరాక్రమవంతుడు, శూరుడు మరణించినాడు. పెనిమిటి పోయిన ఆడుదానికి కొడుకు ఉంటే ఉండవచ్చును. ధన ధాన్యాలు సంపూర్ణముగా ఉండవచ్చును. అయితే నేమిటి? అది విధవ. దానిని అందరూ విధవ అని పిలవక తప్పదు.

"ఓ వీరా! నీ దేహములో నుంచి వరదలు అయి పారిన నెత్తురులో నీవు పడుకొన్నప్పటికిన్నీ, నీవు లక్కరంగు ఆస్తరణము మీద పడుకొని ఉన్నట్టుగా ఉన్నావు. ఓ రాజా! నీ దేహము అంతా దుమ్ము కొట్టుకొన్నది. నెత్తురు కారుతూ ఉన్నది. కౌగిలించుకొనడానికి వీలుకాకుండా నా చేతులు జారిపోతున్నవి. ఓ రాజా! అతిదారుణము అయిన వైరము ఒక్క రామబాణముతో వదలిపోయింది. ఇప్పుడు సుగ్రీవుడు కృతకృత్యుడు అయినాడు. నీవు చనిపోయినావు. అయినప్పటికీ, నిన్ను వదలకుండా నీ వక్షస్థలాన్ని కౌగిలించుకొనవలెను అనుకొంటే, ఈ రామబాణము అడ్డము అయింది" అంటూ ఏడువసాగింది.

పర్వతగుహలో దూరి తళతళలాడుతున్న సర్పమువంటి ఆ రామబాణాన్ని ఆ వాలి దేహములో నుంచి అప్పుడు నీలుడు లాగి వేసినాడు. అట్లా లాగి వేసిన ఆ రామబాణము అస్తమయపర్వతము అడ్డగించిన సూర్యరశ్మివలె తేజరిల్లింది. ఆ వాలి గాయాలు అన్నిటినుంచీ కారిన రక్తధారలు పర్వతమునుంచి తామ్ర గైరికాది ధాతువులతో ప్రవహించే ప్రవాహమువలె నేలమీద పారినవి. రామబాణము దెబ్బతగిలి యుద్ధపరాగము అంతటా కమ్ముకొన్న ఆ వాలి దేహాన్ని తార తన అశ్రుధారలతో కడిగివేసింది. సర్వాంగాలూ రక్తసిక్తము అయి చచ్చిపోయిన తన పెనిమిటిని తార చూచి చూచి ఏడ్చింది. గోరోచనపు కన్నులు వాచిపోయేట్లు ఏడుస్తూ ఉన్న తన పుత్రుణ్ణి అంగదుణ్ణి దగ్గరకు తీసుకొని, "నాయనా! నీ తండ్రికి సంభవించిన ఈ భయంకరావస్థ చూడు. పాపకర్మముల నుంచి వచ్చిన వైరము ఇప్పుడు ఈవిధముగా అంతము అయింది. బాలభాస్కరుడివంటి అరుణ దేహుడు నీ తండ్రి ఇప్పుడు యమసదనానికి ప్రయాణము అయిపోతున్నాడు. ఈ మానదుడికి, ఈ వానరరాజుకు, నీ తండ్రికి నీవు ఇప్పుడు నమస్కారము చేయవలెను" అని చెప్పింది.

అంగదుడు అంతట లేచి పేరు చెప్పుకొని కండలు తిరిగిన తన గుండ్రని చేతులతో తండ్రి పాదాలు పట్టుకొని నమస్కారము చేసినాడు. అప్పుడు తార "ఓ రాజా! నీకు అంగదుడు నమస్కారము చేస్తే నీవు ఇదివరకు ఎప్పుడూ, 'దీర్ఘాయుష్యమస్తు' అని ఆశీర్వదించే వాడవు. ఇప్పుడు పలుకవు ఏమిటి? ఓ రాజా! సింహము చంపివేసిన ఆబోతును ఆవూ, దూడా వదలిపెట్టి పోలేవు. అదేవిధముగా నీవు చనిపోయినప్పటికినీ, నిన్ను వదలిపెట్టి మేము పోలేకుండా ఉన్నాము.

"నాథా! నీవు సంగ్రామము అనే మహాయజ్ఞము చేసినావు. రామబాణము అనే జలముతో నీవు యజ్ఞాంత స్నానము చేసినావు. నీ భార్యను నన్ను వదలిపెట్టి నీవు అవభృథ స్నానము చేయడము ఏమిటి? ఓ ప్రభూ! పూర్వము దేవేంద్రుడు యుద్ధములో సంతుష్టుడు అయి నీకు ఇచ్చిన హేమమాల ఇప్పుడు నీ వక్షస్థలాన కనపడదు ఏమిటి? ఓ మానదా! ప్రదక్షిణము చేస్తూ ఉన్నప్పటికీ, సూర్యరశ్మి మేరువు పర్వతాన్ని వదలనట్లు నీవు చనిపోయినప్పటికీ రాజ్యలక్ష్మి నిన్ను వదలకుండా ఉంది.

"ఓ రాజా! నా హితవచనము నీవు అప్పుడు వినకుండా పోయినావు. నిన్ను అప్పుడు యుద్ధానికి పోనీయకుండా అడ్డగించే సామర్థ్యము నాకు లేకుండా పోయింది. నేనూ, నా కొడుకూ ఇప్పుడు నాశనము అయిపోయినాము. యుద్ధములో నీవు హతము అయిపోగానే, నీతో పాటు నన్ను లక్ష్మి వదలిపెట్టి పోయింది" అని తార ఏడ్చింది.

24

సుగ్రీవుని వైరాగ్యము

అమిత వేగముతో పొంగి పొర్లుతూ ఉన్న శోకసాగరములో మునిగిపోయి రోదనము చేస్తూ ఉన్న తారను, ఆ బలవంతుడు సుగ్రీవుడు చూచినాడు. అతనికి దుఃఖము వచ్చింది. అట్లా తనవలె తన అన్నను ఎవడూ, ఎప్పుడూ చంపించి ఉండడు అనుకొన్నాడు. క్షణలేశములో నిర్విణ్ణుడు అయిపోయినాడు. ముఖము అంతా కన్నీళ్లు కమ్ముకొన్నవి. దేహము అంతా దుఃఖముతో తాపము ఎత్తింది. తారను చూచినకొద్దీ భ్రాతృవధ చేయించిన పాపము బాధించ సాగింది. ఆ దుఃఖతాపము భరించలేక పోయినాడు. భృత్యులను వెంటపెట్టుకొని మెల్లగా రాముడి దగ్గరకు పోయినాడు.

విషసర్పమువంటి బాణాన్నీ, మహచ్చాపాన్నీ చేతిలో పట్టుకొని ఉన్న ఆ పురుషోత్తముణ్ణి, ఆ యశస్విని, ఆ శుభలక్షణలక్షితాంగుణ్ణి, రాముణ్ణి చూచి, "ఓ నరేంద్రా! నీవు నీ ప్రతిజ్ఞ చెల్లించినావు కాని, నా మనస్సు ఇప్పుడు రాజభోగభాగ్యాలమీద పోవడము లేదు. నాకు ఇప్పుడు బ్రతికి ఉండవలెను అనే కోరిక కూడా పోయింది.

"ఓ రామా! పట్టమహిషి తార ఘోరముగా ఏడుస్తూ ఉంది. కిష్కింధా పౌరులు దుఃఖముతో తపించిపోతూ పెడబొబ్బలు పెట్టుతున్నారు. పితృవియోగము నుంచి అంగదుడు బ్రతికి ఉండడము సంశయముగా ఉంది. ఓ రామా! నా అన్న వాలి నన్ను అకారణముగా కిష్కింధానగరము నుంచి వెళ్ళగొట్టినాడు అనే క్రోధము వల్లనూ, నన్ను వాడు ఆడిన కఠినోక్తులు భరించలేక పోయినందువల్లనూ, నన్ను వాడు అమితముగా బాధించినందువల్లనూ వాణ్ణి చంపివేస్తాను అని నీవు అంటే నేను ఇష్టపడ్డాను. ఇప్పుడు నీవు ఆ వానరయూధ నాథుణ్ణి చంపివేసిన తరువాత నేను అమిత తీక్షణముగా బాధపడుతున్నాను. నేను ఈ దుఃఖతాపము భరించలేకుండా ఉన్నాను. నా జీవితాంతమూ నేను వానర వృత్తితో ఋష్యమూకము మీద నివసించడమే మంచిది అనిపిస్తూ ఉంది. ఇప్పుడు నాకు స్వర్గ రాజ్యము సంప్రాప్తము అయినా మంచిది కాదేమో ననిపిస్తూ ఉంది.

"ఓ రామా! అన్న వాలిది మహా గొప్ప స్వభావము. వాడు మహా మతిమంతుడు. ఆ యుద్ధములో నేను అలసిపోయినాను. వాడు అప్పుడు నాతో 'నేను నిన్ను చంపను. నీ దారిని నీవు పో' అని చెప్పినాడు. అటువంటి మాట అనడము వాడికే తగిపోయింది. నేను దుర్మార్గుణ్ణి. వాణ్ణి చంపించడము నాకే తగిపోయింది. అన్న చచ్చిపోయిన తరువాత రాజ్యలాభమువల్ల వచ్చే సంతోషము ఎక్కువ అయిందో, దుఃఖము ఎక్కువ అయిందో ముందుగా ఆలోచించుకోలేక పోయినాను. నా భార్యమీద నాకు ఉన్న కామాన్ని పురస్కరించుకొని మహాగుణవంతుడు అయిన అన్నను చంపించినాను. నావంటి పాపిష్ఠివాడు మరి ఒకడు ఉండడు. వాడు నా అన్న. వాడి గొప్పతనాన్ని ఉల్లంఘించలేదు. అందువల్లనే, నన్ను చంపివేయడము వాడికి ఇష్టము కాకపోయింది. వాడు మహాత్ముడు. నేను దురాత్ముడను. వాడు భ్రాతృమర్యాదను గౌరవించేవాడు. నేను భ్రాతృమర్యాదను వ్యతిక్రమించినాను. ప్రాణాపహారిని అయినాను.

"ఓ రామా! వాడు పోరాటములో నన్ను చెట్లతో బాదుతూ ఉంటే నేను ఆ దెబ్బలు భరించలేక ఆర్తనాదము చేయడము మొదలు పెట్టినాను. అప్పుడు వాడు నన్ను ఓదారుస్తూ, "ఇకను ఎప్పుడూ పోట్లాటకు రావద్దు, పో' అని చెప్పినాడు. ఆ పోరాటములో వాడు వాడి పూజ్య స్వభావమూ, తోబుట్టుతనమూ, సోదరధర్మమూ వ్యక్తపరిచినాడు. నేను కామమూ, క్రోధమూ, నా కపిత్వమూ వ్యక్తపరిచినాను.

"ఓ రామా! త్వష్టృ పుత్రుణ్ణి, విశ్వరూపుణ్ణి చంపిన దేవేంద్రుడికి వలె నా అన్న వాలిని చంపించడముచేత నాకు ఇప్పుడు మహాపాపము సంప్రాప్తము అయినది. పాపచింతకులు ఎవరూ చింతించలేని పాపము, పాపకృత్యాలు చేసేవారు ఎవరూ

చేయలేని పాపము, పాపకాంక్షులు ఎవరూ కాంక్షించలేని పాపము, పాపదర్శనులు ఎవరూ చూడలేని పాపము నేను చేసినాను. దేవేంద్రుడి పాపాన్ని భూదేవీ, స్త్రీలూ, జలాలూ, వృక్షాలూ తలా కొంచెము పంచుకొన్నవి. నేను కోతివాణ్ణి. నా పాపము ఎవరు పంచుకొంటారు? నన్ను క్షమించేవారు ఎవరు? నేను పాపశీలుణ్ణి, నీచుణ్ణి, లోకాపకారకార్యుణ్ణి, పరమ నింద్యుణ్ణి. ఓ రామా! అన్నను చంపించడముకన్న అధర్మము ఏమిటి ఉంది? ఇప్పుడు అంగదుడే చనిపోయేట్లయితే వంశము నాశనము అయిపోతుంది. నా దుష్కృత్యము ఇంకా ఏమి అని చెప్పేది? ప్రజాసన్మానానికి నేను అనర్హుణ్ణి. యువరాజ్యాధిపత్యానికి నేను అయోగ్యుణ్ణి. ఇక రాజ్యాధిపత్యాన్ని గురించి చెప్పవలసిన పనేలేదు.

"ఓ ప్రభూ! ఎక్కడెక్కడి వాననీళ్ళూ పల్లానికి చేరి నిలుస్తవి. అదేవిధముగా, ఎక్కడెక్కడి పాపాలూ నా మీద వచ్చిపడి నన్ను ముంచివేసినవి. మదము ఎక్కిన ఏనుగు ఏటిగట్లను కూలతోస్తుంది. అదేవిధముగా, భ్రాతృవధము అనే అపరకాయముతోనూ, సంతాపము అనే ఊర్ధ్వకాయముతోనూ, మహాపాపము అనే మత్తగజము క్షణక్షణము చెలరేగి నన్ను కూలతోస్తూ ఉంది.

"ఓ రామా! వన్నె మాసిపోయిన బంగారాన్ని పుటము వేస్తే మకిలి అంతా మాడిపోయి అసలు అయిన బంగారము మిగులుతుంది. కాని, నేను ఇప్పుడు సంతాపాగ్నిలో పుటము అవుతూ ఉంటే నాలో ఉన్న సువృత్తము కాస్తా తగులబడిపోయి భ్రాతృవధజనితము అయిన మహాపాపము మాత్రము మిగిలింది. నా నుంచి తన తండ్రి పోయినాడు అని ఈ అంగదుడు శోక తాపముతో కొట్టుకులాడుతున్నాడు. నా నుంచి తమ ఏలిక పోయినాడు అని మహాబలవంతులు అయిన వానర యూథపతులు అందరూ సగము సగము ప్రాణములతో కనపడుతున్నారు. పుత్రుడు, దొరకడము సులభమే. అయితే, అంగదుడివంటి సజ్జనుడు, అంగదుడివలె చెప్పినట్లు వినే పుత్రుడు దొరకడము దుర్లభము. అంతేకాదు, చనిపోయిన సోదరుడు ఏ దేశములో దొరుకుతాడు? ఒకవేళ అంగదుడు జీవించేట్లయితే తార వాణ్ణి సంరక్షించడానికే జీవిస్తుంది. అంగదుడు బ్రతికి ఉండక పోయేట్లయితే తార జీవించి ఉండడము ఉత్తది. ఇది ఇంతే. ఇది అంతా ఆలోచించి చూస్తూ ఉంటే, నేను బ్రతికి ఉండడము తప్పుగా తోస్తూ ఉంది. నేను చచ్చిపోయేట్లయితే, అక్కడ మా అన్న వాలిని కలుసుకోవచ్చును. ఇక్కడ అంగదుడున్నూ తన తండ్రిని చంపించిన పినతండ్రి చచ్చిపోయినందుకు సంతోషిస్తాడు. అందువల్ల, నేను ఇప్పుడు అగ్నిప్రవేశము చేయడానికి నిశ్చయించుకొన్నాను.

"ఓ రామా! నీ ఆజ్ఞలను శిరసావహించి ఈ హనుమంతుడు మొదలు అయిన వానరవీరులు సీతాదేవిని వెతికి పెట్టుతారు. ఓ ప్రభూ! నేను లేకపోయినా నీ పని ఏ లోపమూ లేకుండా నెరవేరుతుంది. సందేహము లేదు. ఓ రామా! నేను కులనాశకుడను. మహాపాపిని. నేను చేసింది మహాపరాధము. నేను ఇక బ్రతికి ఉండకూడదు. నేను అగ్నిహోత్రములో పడిపోతాను. నీవు అనుమతించవలెను" అన్నాడు సుగ్రీవుడు.

ఇట్లా సుగ్రీవుడు ఆర్తుడు అయిపోయి చెప్పింది అంతా విని ఆ పరవీరహంత, ఆ రఘుప్రవరుడు రాముడు కన్నీరు కార్చినాడు. విమనస్కుడు అయినాడు.

రాముడు తారను ఓదార్చుట

అప్పుడు వాలిని కౌగిలించుకొని చూస్తూ దిక్కులు పిక్కటిల్లిపోయేట్లు రోదనము చేస్తూ తనవంక పదే పదే చూస్తూ ఉన్న తారను ఓదార్చడానికి భూదేవి అంతటి ఆ క్షమావంతుడు, ఆ సకలలోక రక్షకుడు రాముడు బయలుదేరినాడు. అంతట మంత్రులు ఆ సంగతి, బుద్ధిమంతురాలికి తెలియచెప్పి ఆమెను బలవంతముగా లేవతీసినారు. అప్పుడు ఆమె పెనిమిటి కౌగిలి వదిలిపెట్టి దుఃఖముతో వణికిపోతూ నిలుచున్నది. శరచాపపాణి అయి స్వీయతేజముతో సూర్యుడివలె జ్వలిస్తూ ఉన్న ఆ రాజలక్షణలక్షితాంగుణ్ణి, ఆ పద్మపత్రాయతాక్షుణ్ణి, రాముణ్ణి ఆ మృగశాబనేత్రి తార చూచింది. అతడు రాముడు అని తెలుసుకొన్నది. ఆ దురాసదుణ్ణి, ఆ మహానుభావుణ్ణి, దేవేంద్రునితో సరిసమానము అయిన ఆ రాముణ్ణి అమితవేగముతో సమీపించింది. దుఃఖముతో దేహము వణికిపోతూ ఉన్నప్పటికిన్నీ మంచి మనోదార్ఢ్యముతో, పరిశుద్ధహృదయముతో ఆ విశుద్ధతత్త్వుణ్ణి, ఆ రణోత్కర్షణలబ్ధలక్షుణ్ణి రాముణ్ణి చూచి,

"ఓ రామప్రభూ! నీవు అప్రమేయుడవు. దురాసదుడవు. జితేంద్రియుడవు. ఉత్తమ ధార్మికుడవు. మహాసమర్థుడవు. అక్షయము అయిన కీర్తిమంతుడవు. భూదేవి అంతటి క్షమావంతుడవు. రక్తాంత లోచనుడవు. బాణాసన బాణపాణివి. మహాబలుడవు. సర్వాంగ సుందరుడవు. మానవాభ్యుదయము కోసము పుట్టి స్వరాజ్యము వదిలిపెట్టి ఈ జగదభ్యుదయము కోసము బయలుదేరిన దివ్యమంగళవిగ్రహుడవు. వాత్సల్య నిధివి. ఆశ్రితవాంఛాప్రదానదక్షుడవు. "ఓ ప్రభూ! నీవు ఒక్కబాణము వదిలి నా నాథుణ్ణి సంహారము చేసినావు. ఇప్పుడు నన్నూ, ఆ బాణముతోనే చంపివేయవలసింది అని ప్రార్థిస్తున్నాను. నేను చచ్చిపోయి నా ప్రియుణ్ణి కలుసుకుంటాను.

"ఓ రామప్రభూ! నా ప్రియుడు వాలి నన్ను వదలిపెట్టి ఎక్కడనూ సుఖముగా ఉండలేడు. సంతోషముగా ఉండలేడు. రకరకాల ఎఱ్ఱనిపూలు తలలో ముడుచుకొని,

చిత్రవిచిత్రముగా అలంకరించుకొని, అప్సరసలు స్వర్గములో నా ప్రియుడికి వాలికి ఎదురుగుండా పోతే, ఆ పద్మామలపత్రనేత్రుడు వారిని కన్నెత్తి అయినా చూడడు. నా కోసమే పరితపిస్తూ ఉంటాడు. నా కోసమే ఎదురు చూస్తూ ఉంటాడు. నేను పోకపోతే దిగులుపడి కృశించిపోతాడు.

"ఓ రామప్రభూ! ఋష్యమూక పర్వత మనోహరతటములో విదేహకన్య నీవెంట లేనందువల్ల నీవు ఎట్లా దిగులు పడుతూ ఉన్నావో, అదేవిధముగా నా ప్రియుడు స్వర్గములో నేను వెంట లేనందుకు దిగులు పడి వెలవెలపోతూ ఉంటాడు. యౌవనములో ఉన్నవాడు ప్రియురాలి ఎడబాటుకు ఎంత దుఃఖపడుతాడో నీవు ఎరుగుదువు. కాబట్టి, నీవు ఇప్పుడు నన్ను చంపివేయవలెను. నేను వెంట లేకపోవడం అనే దుఃఖము వాలికి తొలగించినవాడవు అవుతావు. భార్యాభర్తలను ఒక చోటికి చేర్చిన పుణ్యాత్ముడవు అవుతావు.

"ఓ రాజపుత్రా! నీవు మహాబుద్ధిమంతుడవు. ఏదో ఆలోచిస్తున్నావు. నన్ను చంపివేసేట్లయితే స్త్రీహత్యాదోషము నిన్ను బాధిస్తుంది అనుకొంటున్నావేమో! అటువంటిది ఏమీ లేదు. ఈ తార ఆ వాలి భార్య. అందువల్ల, ఈ దీనురాలు ఆ వాలి ఆత్మస్వరూపము. శాస్త్రాలలోనూ, వేదాలలోనూ భార్య పురుషుడి ఆత్మేకాని అన్యము కాదు అని చెప్పి ఉంది. కాబట్టి, నన్ను చంపివేసేట్లయితే స్త్రీహత్యాదోషం నిన్ను అంటదు. ఈలోకములో భార్యను భర్తకు దానము చేయడముకన్న గొప్పదానము మరి ఒకటి లేదు అని జ్ఞానవంతులు చెప్పుతూ ఉంటారు.

"ఓ వీరుడా! ధర్మము ఆలోచించి చూడు. నేను చెప్పినట్లు నన్ను నా భర్తకు దానము చేసేట్లయితే, నీవు చేసిన వీరహత్యాదోషము కూడ నిన్ను బాధించదు. ఓ ప్రభూ! నీవు నా నాథుడి నుంచి నన్ను వేరుచేసినావు. నన్ను అనాథనూ, ఆర్తురాలనూ చేసివేసినావు. అందువల్ల, నీవు ఇప్పుడు నన్ను చంపివేసేట్లయితే నేను పోయి నాథుడితో చేరుతాను. (నేను సభర్తృకను అవుతాను)

"ఓ రామా! నేను ఆ హేమమాలాధరుణ్ణి, ధీమంతుణ్ణి, ఆ మత్త మాతంగగామిని, ఆ వానరాధిపతిని వదలిపెట్టి చిరకాలము బ్రతికి ఉండడము ఉత్తది" అంటూ ఆ తార ఏడ్చింది.

అప్పుడు ఆ మహాత్ముడు రాముడు తారకు మంచి మాటలు చెప్పి ఓదార్చినాడు. అంతట ఆ తారను చూచి, "ఓ వీరపత్నీ! నీవు విమతివి కావద్దు. ఈ లోకాన్ని సృష్టించినవాడు బ్రహ్మదేవుడు. అతడే అందరి సుఖదుఃఖాలకూ కర్త. ముల్లోకాలలోనూ ఆ బ్రహ్మదేవుడు నియమించిన విధిని అతిక్రమించకలవారు

ఎవరూ లేరు. సమస్తమూ ఆ విధికి లోబడి ఉంది. ఆ విధిని తప్పించడము ఎవరి తరమూ కాదు.

"ఓ తారా! నీవు పరమసంతోషము అనుభవిస్తావు. నీ పుత్రుడు అంగదుడు యువరాజు అవుతాడు. బ్రహ్మదేవుడు అట్లా విధించినాడు. ఆ విధిని అతిక్రమించడము నీ తరము కాదు. శూరపత్నులు ఎవరూ నీవలె ఏడవరు" అని ఆ పరంతపుడు, ఆ మహాప్రభావుడు రాముడు చెప్పినాడు.

ఆ వీరపత్ని, ఆ సువేష, ఆ సురూప తార అంతట ఏడవడము మానివేసింది.

25

వాలి అంత్యక్రియలు

సుగ్రీవాదులతో సరిసమానముగా వాలి కోసము రాముడున్నూ దుఃఖపడుతూ లక్ష్మణుణ్ణి వెంటపెట్టుకొని సుగ్రీవుణ్ణీ, అంగదుణ్ణీ, తారనూ ఓదార్చి, ఇంకా ఇట్లా చెప్పినాడు :

"మీరు ఈ దుఃఖముతో ఎంత పరితపించినప్పటికిన్నీ చనిపోయినవాడికి మేలు అయ్యేది ఏమీ లేదు. మీరు ఇక ఏడ్పులు చాలించి చేయవలసిన పనిని గురించి ఆలోచించడము మంచిది. ఇప్పుడు మీరు వాలికి ఔర్ధ్వదైహిక క్రియలు చేయడము అవసరము. కాలానుగుణముగా కర్మ చేసితీరవలెను.

"దైవాన్ని ఎవరూ అతిక్రమించలేరు. ఈ లోకవృత్తానికి దైవమే కారణము. దైవమే సమస్త కార్యాలకూ సహాయకారి. దైవమే ఆ యా పనులు చేయడానికి సమస్త ప్రాణులనూ ప్రేరేపిస్తూ ఉంటుంది. ఈ లోకములో ఎవరికీ స్వాతంత్ర్యము అనేది లేదు. ఎవరూ ఏ పని చేయడానికీ స్వతంత్రుడు కాడు. ఎవణ్ణీ ఏ పని చేయడానికీ ఎవడూ ప్రేరేపించలేడు. ఈ లోకము అంతా దైవాధీనము అయి ఉంది. కాబట్టి, అందరికీ దైవమే పరమగతి.

"దైవము స్వతంత్రము అయింది. అది దేనికీ లోబడదు. దానికి అందరూ లోబడవలసిందేను. దానిని ఎవరూ అతిక్రమించలేరు. ఎవడూ దానిని వశపరచుకొనలేడు. దానిని పరాక్రమముతో జయించడము అనేది లేనేలేదు. దానికి పక్షపాతము లేదు. దానికి మిత్రజ్ఞాతి సంబంధము అంతకన్నా లేదు. దైవము వారి వారి కర్మలనుబట్టి ఫలము ఇస్తూ ఉంటుంది. వారి వారి కర్మపరిపాకాన్నిబట్టి ధర్మమూ, అర్థమూ, కామమూ అనుభవిస్తూ ఉంటారు. వానరరాజు వాలి అతడు ఆచరించిన కర్మను పట్టి ధర్మార్థ కామాలను అనుభవించడానికి పరలోకము పోయినాడు. అతడు తన ప్రాణాన్ని అయినా లెక్క చేయకుండా ధర్మాన్ని

అనుష్ఠించినాడు. స్వర్గతుడు అయినాడు. ఉత్తమగతికి పోయినాడు. ఇకను ఆ వానరాధిపతి కోసము దుఃఖపడవద్దు. చేయవలసిన పనిని వెంటనే మొదలు పెట్టవలెను."

ఈ విధముగా రాముడు చెప్పి ఊరుకున్నాడు. ఒండ్లు తెలియకుండా దుఃఖపడుతూ ఉన్న సుగ్రీవుణ్ణి లక్ష్మణుడు చూచి, "ఓ సుగ్రీవుడా! నీవు ఇక లేవవలెను. వాలికి ప్రేత క్రియలు చేయవలెను. వాలి దహన సంస్కారము కోసము మంచిగంధము కట్టెలూ, ఎండుకట్టెలూ తెమ్మని వానరులను ఆజ్ఞాపించు. అంగదుణ్ణి ఓదార్చు. వాలి దహనసంస్కారానికి అతడు ఉద్యుక్తుడు అయ్యేట్టు చూడు. నీవు బాలిశబుద్ధి మాను. ఇప్పుడు కిష్కింధా నగరము నీ ఆధీనములో ఉంది.

"ఓ సుగ్రీవుడా! నీవు ఇప్పుడు అంగదుడిచేత పూలదండలూ, వివిధ వస్త్రాలూ, నెయ్యి, నూనె, సుగంధద్రవ్యాలూ, ఇంకా ఈ సందర్భానికి అవసరమయ్యే అన్ని వస్తువులూ తెప్పించవలెను.

"ఓ తారుడా! నీవు ఇప్పుడే పోయి ఏ మాత్రమూ జాగు చేయకుండా శిబికను తీసుకొని రావలెను. చేయవలసిన పని ఎప్పటికి అప్పుడు చేసి వేయవలెను. అందులో ఇటువంటి సమయములో తొందర తొందరగా పనులు చేయడము ఎంత అయినా మంచిది.

"ఓ వానరనాయకులారా! మీలో బలవంతులూ, శిబికను మోయగల సమర్థులూ వాలిని మోసుకొని పోవడానికి సిద్ధముగా ఉండవలెను" అని చెప్పి, అందరినీ ఉత్సాహపరచినాడు.

ఇట్లా లక్ష్మణుడు చెప్పగానే తారుడు కిష్కింధా నగరానికి పోయి అప్పటికి అప్పుడు వానరయోధులచేత శిబికను మోయించుకొని వచ్చినాడు.

ఆ శిబిక సామాన్యము అయినది కాదు. శూరులు తప్ప ఎవరు పడితే వారు ఆ శిబికను మోయలేరు. అది రథము అంత పెద్దది. దానిలో భద్రాసనము ఉంది. దాని సంధిబంధాలు అన్నీ చక్కగా అమర్చి ఉన్నవి. వెలుపల అన్నివైపులా పక్షులూ, పదాతులూ, చెట్లూ చిత్రించి ఉన్నవి. అది సిద్ధులు ఎక్కిపోయే విమానము అంతది. దానికి చిన్న చిన్న కిటికీలూ, పెద్ద పెద్ద కిటికీలూ ఉన్నవి. అది బాగా విశాలము అయినది. దానిని విశ్వకర్మ ఎంతో అందముగా నిర్మించినాడు. కొండలూ, ఆ కొండలలో గుహలూ, మహారణ్యాలూ కొయ్యలతో చెక్కి ఆ శిబికకు తాపడము చేసి ఉన్నవి. లోపల పూలదండలతోనూ, శ్రేష్ఠము అయిన ఆభరణాలతోనూ అలంకరించి ఉంది. నున్నగా మెరుగుపెట్టిన ఆ శిబికకు రక్తచందనము రంగు వేసి ఉంది. పైన

కప్పిన పూలతోనూ, రక్తపద్మమాలికతోనూ అది తరుణాదిత్య కాంతులతో ధగధగ లాడుతూ ఉంది.

రాముడు ఆ శిబికను చూచి లక్ష్మణునితో, "తమ్ముడా! వెంటనే వాలి కళేబరాన్ని ఈ శిబికకు ఎత్తించి తీసుకొనిపోయి ప్రేతకార్యాలు ఆరంభించవలెను" అని చెప్పినాడు. అంతట లక్ష్మణుడు సుగ్రీవుణ్ణి ఆ యా పనులు చేయడానికి ప్రోత్సహించినాడు.

అప్పుడు అంగదుడూ, సుగ్రీవుడూ ఆర్తనాదాలు చేస్తూ, వాలి కళేబరాన్ని ఎత్తి ఆ శిబికలో ఉంచినారు. పూలదండలతోనూ, వస్త్రాలతోనూ ఆ శవాన్ని అలంకరించినారు. అప్పుడు సుగ్రీవుడు వానరనాయకులను అందరినీ చూచి, "ఓ వానరవీరులారా! ఈ పూజ్యుడికి తగినట్టుగా ఔర్ధ్వదైహిక క్రియలను అన్నిటినీ జరిపించవలెను. ఈ శిబికకు ముందర వానరవీరులు నానావిధరత్నాలు వెదజల్లుతూ నడువవలెను. ఈ భూమిమీద సంపన్నులు అయిన రాజులకువలె వాలికి ఉత్తరక్రియలు జరుగవలెను" అని చెప్పినాడు.

అప్పుడు తారుడూ మొదలయిన వాలి సమీప బంధువులు అందరూ అంగదుడి వెనుక రోదనము చేస్తూ నడచినారు. వారి వెనుక వానర స్త్రీలు అందరూ 'ఓ వీరుడా' అంటూ పెద్ద పెద్ద కేకలు పెట్టుతూ, ఏడుస్తూ నడిచినారు. తారా, ఆమె సపత్నులూ ఆ శిబిక వెనుక మహాజాలి పుట్టేట్టు ఏడుస్తూ నడిచినారు. ఆ వనమధ్యములో అంతమంది వానరాంగనలు ఆ విధముగా రోదనముచేస్తూ నడుస్తూ ఉంటే అక్కడి కొండలూ, అడవులూ ఏడుస్తూ ఉన్నట్టుగా తోచినది.

అక్కడ ఒక కొండవాగు దగ్గర ఇసుక తిన్నెమీద వానరులు అందరూ అమితముగా దుఃఖపడుతూ చితిని పేర్చినారు. వాహకులు తమ మూపుల మీదినుంచి ఆ శిబికను అక్కడ దించినారు. వారు అందరూ దుఃఖపడిపోయి అక్కడి ఒక ప్రదేశ ములో నిలుచుండిపోయినారు. అంతట తార శిబికలో ఉన్న వాలి శిరము ఎత్తి తన తొడలమీద పెట్టుకొని పెద్ద పెట్టున, "ఓ రాజా! ఓ నాథా! ఓ మహాబాహూ! ఓ వత్సలా! ఓ ప్రియుడా! మమ్ములను ఒక్కసారి కన్నెత్తి చూడు. ఇట్లా ఏడుస్తూ ఉన్న నన్నూ, ఈ నీ స్త్రీ జనాన్ని ఒక్కసారి కన్నెత్తి చూడవా? మేము ఏమి తప్పు చేసినాము?

"ఓ నాథా! నీవు పోయినప్పటికీ నీ ముఖము ఎప్పటి మాదిరిగా సంతోషముతో, అస్తమిస్తున్న సూర్యబింబమువలె కనబడుతూ ఉంది. ఓ రాజా! యముడు రామరూపముతో ఈ వనానికి వచ్చినాడు. మమ్ములను అందరినీ విధవలను చేసి నిన్ను లాగుకొని పోతున్నాడు.

"ఓ ప్రియుడా! ఈ నీ ప్రియురాండ్లు ఎంతదూరము నడిచి వచ్చినారో నీకు తెలియదా? ఈ చంద్రముఖులను నీవు ఓదార్చవా? ఓ రాజా! నీవు సుగ్రీవుడి వంకను అయినా చూడకుండా ఉన్నావే? ఓ ప్రభూ! తారుడు మొదలయిన నీ మంత్రులూ, పౌరముఖ్యులూ వచ్చి, నిన్ను చూచి ఏడుస్తూ ఉన్నారు. నీవు వారిని అయినా చూడవా?

"ఓ అరిందమా! ఎవరెవరికి ఏమేమి చెప్పవలెనో, వారి వారికి ఆ మాటలు చెప్పి పంపించు. వారు అందరూ వెళ్ళిపోయిన తరువాత ఈ వనములో మనము మన్మథ క్రీడలతో విహరించుదాము" అని చెప్పి వాలి మీద పడి ఏడవసాగింది.

అట్లా ఒండ్లు తెలియకుండా మాట్లాడుతూ ఏడుస్తూ ఉన్న తారను అప్పుడు వానరాంగనలు అందరూ లేవనెత్తి ఆ చోటునుంచి అవతలకు తీసుకొని పోయినారు.

అప్పుడు అంగదుడు దేహము అంతా వణికిపోతూ పెద్ద పెట్టున ఏడుస్తూ సుగ్రీవుడి సాయంతో తన తండ్రి వాలి కళేబరాన్ని ఎత్తి చితిమీద పెట్టినాడు. యథా శాస్త్రముగా అతడు ఆ చితికి నిప్పుపెట్టి, "ఓ తండ్రీ! బహుదూరము ప్రయాణము అయిపోతున్నావా" అని గజగజ వణికి, ఆ చితికి అప్రదక్షిణము చేసినాడు.

యథాశాస్త్రముగా వానరులు అందరూ చేరి వాలికి దహన సంస్కారాలు చేయించినారు. అంతట జలతర్పణాలు వదలడానికి శుభ్రశీతల జలాలు ప్రవహిస్తున్న ఆ సెలయేటి దగ్గరకు పోయినారు. అక్కడ వానరులందరూ అంగదుడి తరువాత తారా సుగ్రీవులతో వాలికి జలతర్పణాలు వదిలినారు.

ఆ మహాబలవంతుడు రాముడున్నూ దుఃఖపడుతూనే దగ్గర ఉండి సుగ్రీవుడిచేత వాలికి ప్రేతకార్యాలు అన్నీ చేయించినాడు.

26

సుగ్రీవుని పట్టాభిషేకము

తడిగుడ్డలతో ఉన్న సుగ్రీవుడు దుఃఖముతో తపించిపోతూ వానర మంత్రులనూ, వానరముఖ్యులనూ వెంటపెట్టుకొని రాముడి దగ్గరికి పోయినాడు. సంకట సమయము వచ్చినపుడు చేతులు జోడించి బ్రహ్మదేవుడి చుట్టూ మూగే మహర్షులవలె, వారు అందరూ రాముడి చుట్టూ చేరినారు.

అప్పుడు బాలభాస్కరుడివంటి ముఖకాంతితోనూ, మేరుపర్వతమువంటి దేహకాంతితోనూ తేజరిల్లే హనుమంతుడు చేతులు జోడించి వినయవిధేయతలతో, "ఓ రామప్రభూ! నీ అనుగ్రహమువల్ల సుగ్రీవుడికి ఇప్పుడు పితృపైతామహము అయిన రాజ్యము సంప్రాప్తము అయింది. నీ అనుమతితో సుగ్రీవుడు తన

స్నేహితులను వెంటపెట్టుకొని కిష్కింధానగరము ప్రవేశించి సమస్త కార్యాలూ చక్కపెట్టుతాడు. నానావిధ సుగంధ ద్రవ్యాలతోనూ, ఓషధులతోనూ రాజ్యాభిషిక్తుడు అవుతాడు. నిన్ను రత్నాలతోనూ, రకరకాల పూలదండలతోనూ పూజిస్తాడు. గిరిగుహ వంటి కిష్కింధానగరానికి నీవు నీ తమ్ముడితో కూడా రావలెను. వచ్చి సుగ్రీవుణ్ణి నీవే రాజుగా చేయవలెను. వానరులు అందరూ సంతోషిస్తారు" అని చెప్పినాడు.

ఆ వాక్యకోవిదుడు, ఆ బుద్ధిమంతుడు, ఆ పరవీరహంత హనుమంతుడు చెప్పింది విని రాముడు, "ఓ బుద్ధిమంతుడా! నేను నా పితృాజ్ఞనుపట్టి పధ్నాలుగు సంవత్సరాలవరకూ ఒక పట్టణములోకి కానీ, ఒక గ్రామములోకి కానీ పోకూడదు. అందులో మీ కిష్కింధ సర్వసమృద్ధమూ, రమణీయమూ అయిన మహానగరము. అందువల్ల, నేను రాను. మీరు అందరూ ఈ వానరోత్తముణ్ణి సుగ్రీవుణ్ణి వెంటపెట్టుకొని వెళ్ళండి. వెంటనే రాజ్యాభిషేకము చేయండి" అని చెప్పి, బలపరాక్రమాలు అతిశయించిన సుగ్రీవుణ్ణి చూచి,

"ఓ సుగ్రీవుడా! నీవు సదాచారసంపన్నుడవు. నీవు రాజ్యాభిషేకము చేసుకో. నీ రాజ్యాభిషేకము అయిపోగానే ఈ అంగదుణ్ణి యువరాజుగా అభిషేకము చేయించు. నీ వంశములో ఇతడు జ్యేష్ఠుడు. ఏకపుత్రుడు. బుద్ధిమంతుడు. నీతో సమానము అయిన పరాక్రమవంతుడు. యువరాజుగా ఉండతగినవాడు.

"ఓ సుగ్రీవుడా! నీవు ఎంతో మంచివాడవు. ఇప్పుడు వానాకాలం వచ్చింది. నాలుగు మాసాలు వర్షాలు పడుతూ ఉంటవి. వానాకాలానికి శ్రావణము మొదటి మాసము. అందువల్ల, ఇది యుద్ధోద్యోగసమయము కాదు. కాబట్టి, నీవు ఈ నాలుగు మాసాలు కిష్కింధలో సమస్తసుఖాలు అనుభవిస్తూ ఉండు. నేను నా తమ్ముడు లక్ష్మణుడితో కూడా ఈ కనబడే పర్వతగుహలో నివసిస్తాను.

"ఓ బుద్ధిమంతుడా! ఈ గిరిగుహ రమణీయముగానూ, మనోహరముగానూ ఉంది. తగినంత గాలికూడా ఈ గుహలో వీస్తూ ఉంటుంది. ఈ గుహ సమీపములోనే కమలాలూ, నీలోత్పలాలూ సమృద్ధంగా పెరిగిన జలాశయముకూడా ఉంది. ఓ సౌమ్యుడా! కార్తికమాసము రాగానే నీవు రావణ వధకు అన్ని ఏర్పాట్లు చేయవలెను. ఇది మన ఒడంబడిక. ఇక నీవు హాయిగా నీ పట్టణానికి పో! రాజ్యాభిషేకము చేసుకో! నీ సుహృదులతో సంతోషముగా ఉండు" అని చెప్పినాడు.

ఇట్లా రాముడు చేసిన ఏర్పాటుకు సుగ్రీవుడు అంగీకరించి, వాలి పరిపాలించిన కిష్కింధానగరానికి బయలుదేరినాడు. అప్పుడు వేలకొద్దీ వానరులు వచ్చి సుగ్రీవుడికి అభివాదము చేసినారు. అతనిని వెంబడించినారు. కిష్కింధా పౌరులు అందరూ సుగ్రీవుణ్ణి చూచి సమాధానపడి నేలమీద సాగిలపడి శిరసా నమస్కారము చేసినారు.

అట్లా నమస్కారము చేసిన వారిని అందరినీ అప్పుడు ఆ మహాబలవంతుడు, ఆ వీర్యవంతుడు సుగ్రీవుడు లేవనెత్తి వారి అందరితోనూ మంచిమాటలు మాట్లాడి సంతోషపెట్టినాడు. అంతట తన అన్న వాలి అంతఃపురములోకి పోయినాడు. తారను ఆశ్వాసించినాడు. ఆ అంతఃపురాన్ని స్వాధీనము చేసుకొన్నాడు. అప్పుడు అతని సుహృదులు రాజ్యాభిషేకము తలపెట్టినారు.

బంగారుకఱ్ఱ వేసిన శ్వేతచ్ఛత్రమూ, బంగారుపిడులు వేసిన రెండు తెల్లటి వింజామరలూ, సమస్త రత్నాలూ, ఓషధులూ, వనమూలికలూ, క్షీరవృక్షాల చిగుళ్ళూ, రకరకాల పూలూ, తెల్లటి వస్త్రాలూ, ఘుమఘుమలాడే వాసనలు గుబాళించే పూల దండలూ, తెల్లటి అంగరాగాలూ, మెట్టను పెరిగే కమలాలూ, చందనాలూ, నానావిధ సుగంధద్రవ్యాలూ, బంగారు రూపము అయిన అక్షతలూ, కుంకుమ పూవూ, తేనే, నెయ్యీ, పెరుగూ, పులితోలూ, అడవిపంది చర్మముతో చేసిన పాదరక్షలూ తీసుకొని వచ్చినారు. అభిషేకము చేయడానికి సంతోషముగా పదహారు మంది కన్నెపడుచులు మైపూతనూ, మనశ్శిలతో చేసిన తిలకాన్నీ, గోరోచనాన్నీ తీసుకొని వచ్చినారు.

అంతట బ్రాహ్మణోత్తములకు నానావిధమణులూ, వస్త్రాలూ, భక్ష్యాలూ ఇచ్చి సంతోషపెట్టినారు. మంత్రవిదులు అయిన పురోహితులు చుట్టూ దర్భలు పరిచి అగ్నిహోత్రము చేసినారు. జ్వలిస్తూ ఉన్న అగ్నిహోత్రములో మంత్రపూతముగా హవిస్సును వ్రేల్చినారు. నానావిధపుష్పమాలలతో శోభిస్తూ ఉత్తమాస్తరణాలు పరిచి ఉన్న ఆ ప్రాసాదాగ్రభాగాన బంగారు భద్రాసనము మీద సుగ్రీవుణ్ణి మంత్రాలు చదువుతూ తూర్పుముఖముగా కూర్చుండ పెట్టినారు. నదీ నదాలలోనుంచీ, సమస్త పుణ్య తీర్థాలలోనుంచీ, సమస్త సముద్రాలలోనుంచీ బంగారు కలశాలతో తెచ్చిన శుభ్రజలాలను అన్నిటినీ ఎద్దుకొమ్ముల ఆకారముతో ఉన్న బంగారు కలశాలలో పోసి వానరశ్రేష్ఠులు గజుడూ, గవాక్షుడూ, గవయుడూ, శరభుడూ, గంధమాదనుడూ, మైందుడు, ద్వివిదుడూ, నలుడూ, హనుమంతుడూ, జాంబవంతుడూ యథావిధిగా శుభ ముహూర్తాన వసువులు దేవేంద్రుణ్ణి వలె సుగ్రీవుణ్ణి అభిషేకము చేసినారు.

సుగ్రీవుడి రాజ్యాభిషేకము కాగానే అక్కడ సమావేశము అయిన వేలాది వానరులు సంతోషాతిశయముతో జయజయధ్వనులు చేసినారు. సుగ్రీవుడు రామాజ్ఞను తలదాల్చి అంగదుడికి అప్పుడు యువరాజ్యాభిషేకము చేసినాడు. అందుకు వానరులు అందరూ 'బాగుంది బాగుంది' అని సుగ్రీవుణ్ణి మెచ్చుకొన్నారు. వానరులు అందరూ అంగదుడి యువరాజ్యాభిషేకానికి, సుగ్రీవుడి రాజ్యాభిషేకానికి కారకులు అయిన రామలక్ష్మణులను గురించి పదేపదే చెప్పుకొని సంతోషించి కోలాహల ధ్వనులు చేసినారు. కిష్కింధానగరము అంతా పతాకాలతోనూ, ధ్వనులతోనూ శోభించింది.

అంతట ఆ వీర్యవంతుడు, ఆ వానరవాహినీపతి సుగ్రీవుడు తన భార్య అయిన రుమను వెంటపెట్టుకొని పోయి రాముణ్ణి సందర్శించి, తాను రాజ్యాభిషేకము చేసుకొన్న విషయం అంతా నివేదించి, తిరిగి కిష్కింధకు వచ్చి దేవేంద్రుడివలె రాజ్యపాలనము చేయసాగినాడు.

27

రామలక్ష్మణులు గుహలో నివసించుట

రాజ్యాభిషేకము చేసుకొన్న సుగ్రీవుడు రాముడి దర్శనము చేసుకొని వెళ్ళిపోయినాడు. అప్పుడు రాముడు తమ్ముణ్ణి వెంటపెట్టుకొని సింహాలూ పెద్దపులులూ భయంకరముగా గర్జిస్తూ జింకలూ, ఎలుగుబంట్లూ, కోతులూ, కొండముచ్చులూ, అడవిపిల్లులూ అంతటా తిరుగుతూనూ; నానావిధ గుల్మాలతోనూ, లతలతోనూ, మహావృక్షాలతోనూ, శుభ్ర జలాశయాలతోనూ, గండశిలలతోనూ, మేఘసమూహాలవలె కనబడుతూ ఉండే ఋష్యమూక పర్వత పంక్తులలో ఉన్న ప్రస్రవణ పర్వతానికి బయలుదేరినాడు.

ఆ పర్వతముమీద నివసించడానికి బాగా వెడల్పుగానూ, పొడుగుగానూ ఉన్న ఒక గుహను రామలక్ష్మణులు చూచినారు. ఆ పుణ్యాత్ముడు రాముడు సుగ్రీవుడితో చేసుకొన్న ఏర్పాటునుంచి నాల్గు మాసములు అక్కడనే నివసించవలెను. రాముడు ఆ ప్రదేశము అంతా పారచూచి, వినయవిధేయతలతో తనను కనిపెట్టుకొని ఉన్న లక్ష్మణుడితో, "తమ్ముడా! ఈ పర్వతగుహ మనోహరముగా ఉంది. బాగా విశాలముగా ఉంది. ఇందులోకి తగినంత గాలి వస్తూ ఉంది. వర్షాకాలము మూడు మాసాలూ (కార్తీక మాసమువరకూ) మనము ఇక్కడనే ఉందాము. ఈ పర్వత శిఖరము ఎంతో ఎత్తున మహారమ్యముగా ఉంది. ఈ పర్వతశిలలు తెల్లగానూ, ఎర్రగానూ, నల్లగానూ, నానావిధ ధాతువులతోనూ ధగధగలాడుతూ ఉన్నవి. ఈ కొండమీది సెలయేళ్లు తళతళలాడుతూ ప్రవహిస్తూ ఉన్నవి. రకరకాల చెట్లూ, చిత్రవిచిత్రము అయిన పొదరిండ్లూ నేత్రపర్వముగా కనపడుతూ ఉన్నవి. నెమళ్ళూ, నానావిధపక్షులూ కర్ణపేయముగా కేకలు వేస్తూ ఉన్నవి. జాజులూ, మొల్లలూ విరగపూసినవి. కదంబ వృక్షాలూ, వావిలి చెట్లూ, గోరంట చెట్లూ, మద్ది చెట్లూ, ఏరుమద్ది చెట్లూ చక్కని గాలి వీస్తూ ఘ్రాణేంద్రియాన్ని తృప్తిపరుస్తూ ఉన్నవి. ఈ గుహకు దగ్గరలోనే తామరకొలను కూడా ఉంది. చూడు, తామరలు అన్నీ విచ్చినవి.

"నాయనా! ఈ గుహకు ఈశాన్యదిశను పల్లముగా ఉంది. వాకిలి నైరుతి దిశను ఉంది. పడమటి దిక్కు మెరకగా ఉంది. అందువల్ల, ఈ గుహలోపల నివాత

ముగా ఉంటుంది. గుహ వాకిట కాటుక రంగుతో నునుపు అయిన చాపరాయి ఎంతో అందముగానూ, విశాలముగానూ ఉంది! ఉత్తరపు దిక్కున పర్వతశిఖరము కాటుక రంగుతో పైకిలేచిన మేఘమువలె ఎంతో అందముగా ఉంది. దక్షిణ దిశను ఉన్న పర్వతశిఖరము తెల్లగా కైలాసపర్వతమువలె తేజరిల్లుతూ ఉంది. ఈ గుహకు తూర్పున సంపంగి, బొట్టుగు, కానుగు, పూలగురివిందచెట్లూ, పద్మకాష్ఠవృక్షాలూ, సరళవృక్షాలూ, అశోకవృక్షాలూ, ప్రబ్బలి, తినాసపుచెట్లూ, పొగడచెట్లూ, మొగలిపొదలూ, చంద్ర, గిలకతాటి, లొద్దుడు, కదంబ బెత్తపు రేలచెట్లు మనోహరముగా పెరుగుతూ ఉన్నవి. ఈ చెట్లే కాకుండా, చిత్రకూటపర్వతము పక్కను గంగానదివలె ఇక్కడ తూర్పు ముఖముగా బురదలేకుండా శుభ్రజలాలతో సొగసయిన సెలయేరు ప్రవహిస్తూ ఉంది.

"ఆ సెలయేటి గట్టున ఉన్న నానావిధ వృక్షాలతోనూ, వందలకొద్దీ పక్షి సంఘాల నినాదాలతోనూ, అన్యోన్యమూ అనురాగముతో తిరిగే చక్రవాకముల జంటలతోనూ, హంసలతోనూ, సారసపక్షులతోనూ, ఇసుక తిన్నెలతోనూ ఈ సెలయేరు వస్త్రాభరణాలతో అలంకరించుకొని నవ్వుతూ, కేకలు పెట్టుతూ, పాటలు పాడుతూ, పరుగెత్తుతూ ఉన్న సుందరాంగనలవలె కనపడుతూ ఉంది.

"ఈ సెలయేటిలో ఒకచోట నల్లకలువలూ, ఇంకొకచోట ఎర్రకలువలూ, మరి ఒకచోట తెల్లకలువలూ భాసిస్తూ ఉన్నవి. జలపక్షులు పాటలు పాడుతూ ఉన్నవి. నెమళ్ళు, క్రౌంచపక్షులు కేకలు పెట్టుతూ ఉన్నవి. ఈ నదీతీరాన మునులు నివసిస్తూ ఉన్నారు. తీర్చిదిద్దిన పంక్తులవలె చందనపుచెట్లు పెరుగుతూ ఉన్నవి. ఏరుమద్ది చెట్లు వరుసలు మనసా సంకల్పించి వేసినట్లు కనబడుతున్నవి.

"లక్ష్మణా! ఈ ప్రదేశము ఎంతో మనోహరముగా ఉంది. నివసించడానికి యోగ్యంగా ఉంది. మనము ఈ వానాకాలం అంతా ఇక్కడనే ఉందాము. సుగ్రీవుడు ఏలుతూ ఉన్న కిష్కింధానగరం చిత్రవిచిత్ర కాననాలు అడ్డముకాని, ఇక్కడికి దగ్గరలోనే ఉంది. అక్కడి గీత వాద్య ధ్వనులూ, వానరుల అరుపులూ, మద్దెళ్ళ చప్పుళ్ళతో కూడా వినపడుతూ ఉన్నవి. ఆ కపివరుడు సుగ్రీవుడు తన భార్యతోనూ, మహైశ్వర్యముతోనూ, బంధువులతోనూ సుఖముగా, సంతోషంగా కాలం గడుపుతూ రాజ్యపాలన చేస్తూ ఉంటాడు" అని చెప్పినాడు.

లతాగృహాలతోనూ, అనేక గుహలతోనూ ఉన్న ఆ ప్రస్రవణ పర్వతంమీద రాముడు లక్ష్మణుడితో కూడా నివాసం పెట్టుకొన్నాడు. అట్లా అనేక వృక్షాలతోనూ, కోరుకొన్నవి దొరికే వన్య పదార్థాలతోనూ మనోహరం అయిన పర్వతం మీద నివసిస్తూ ఉన్నప్పటికిన్నీ, రాముడికి సంతోషం అనేది లేకపోయింది. అతడు అతడి ప్రాణము కన్న ఎక్కువ అయిన సీతాదేవిని అనుక్షణమూ తలచుకొంటూ దుఃఖపడసాగినాడు.

ఆనాడు పండుకొని ఉన్న రాముడు ఉదయాచలంమీద ఉదయించిన చంద్రుణ్ణి చూచినాడు. అతనికి నిద్రపట్టలేదు. ఒండ్లు ఎరగకుండా దుఃఖపడసాగినాడు. ఎప్పుడూ శోకపరాయణుడుగా ఉన్నప్పటికిన్నీ, అట్లా దుఃఖపడడం అదివరకు లక్ష్మణుడు చూడలేదు. అంతట అతడు రాముడితో, "ఓ వీరుడా! నీవు ఇట్లా దుఃఖపడడం మానుకొనవలెను. ఇట్లా దుఃఖపడేవాడు ఎవడూ ఏ పనీ చేయలేడు. ఇట్లా దుఃఖపడుతూ ఉంటే సర్వార్థాలూ నాశనము అయిపోతవి. ఇది నీకు తెలియని విషయము కాదు. ఓ రామా! నీవు క్రియాపరుడవు. దైవపరాయణుడవు. ఆస్తికుడవు. ధార్మికుడవు. ఎడతెగని ప్రయత్నము చేసేవాడవు. నీవు ఇట్లా దుఃఖపడుతూ ఏ ప్రయత్నమూ చేయకపోయేట్లయితే ఎవరినీ జయించలేవు. పైపెచ్చు ఆ రావణుడు రాక్షసుడు. వాడు మాయావి. ఇట్లా దుఃఖపడుతూ ఉండేట్లయితే, నీవు వాణ్ణి యుద్ధములో జయించడము ఉత్తది. నీవు ఈ దుఃఖాన్ని సమూలంగా పెళ్ళగించి వేయవలెను. స్థిరము అయిన ప్రయత్నముతో వాణ్ణి, ఆ రాక్షసుణ్ణి సపరివారముగా నిర్మూలనము చేయవలెను.

"ఓ రామా! సముద్రాలతోనూ, మహారణ్యాలతోనూ, మహాపర్వతాలతోనూ ఉన్న ఈ పృథివిని అంతా తలక్రిందులుచేసే శక్తి నీకు ఉంది. ప్రభూ! ఆ రావణాసురుణ్ణి సర్వనాశనము చేయకలవు అని నీకు ఒకరు చెప్పవలెనా? ఇది వర్షాకాలము. ఇప్పుడు దుఃఖించి ప్రయోజనము లేదు. శరదృతువు కోసము ఎదురు చూస్తూ ఉండవలెను. అప్పుడు ఆ రావణాసురుణ్ణి వాడి బంధువులతోనూ, మిత్రులతోనూ నీవు సర్వనాశనము చేసివేయకలవు. నివురుకప్పిన నిప్పును సమయము వచ్చినప్పుడు ఆజ్యాహుతులలో జ్వలింప చేసేటట్లు, నిద్రపోతున్న నీ పరాక్రమాన్ని నేను మేలుకొలుపుతాను" అని చెప్పినాడు.

ఇట్లా హితమూ, శుభకరమూ అయిన మాటలు లక్ష్మణుడు చెప్పినాడు. రాముడు విని, "తమ్ముడా! నీవు అనురాగముతో, స్నేహముతో నా మేలుకోరి నిజము అయిన పరాక్రమవంతుడు చెప్పే విధముగా చెప్పినావు. సర్వకార్యాలనూ చెడకొట్టే దుఃఖాన్ని వదిలిపెట్టుతున్నాను. అవసరము వచ్చినప్పుడు అప్రతిహతము అయిన నా తేజాన్ని ప్రదర్శిస్తాను. నీ మాటమీద నిలబడుతున్నాను. నదులు అన్నీ తేటనీళ్ళతో పారే శరత్కాలము వచ్చేవరకూ, సుగ్రీవుడు వస్తాడు అనే కనిపెట్టుకొని ఉంటాను. ఉపకారికి ప్రత్యుపకారము చేయడము వీరధర్మము. చేసిన ఉపకారము మరచిపోయి ప్రత్యుపకారము చేయనివాణ్ణి సత్పురుషులు మెచ్చరు. మెచ్చకపోవడమే కాదు, మనస్సులో బాధపడిపోతారు కూడాను" అన్నాడు.

రాముడు చెప్పిన ఈ మాటలకు లక్ష్మణుడు చేతులు జోడించి, ముందు చేయవలసిన పనిని గురించి ఆలోచించి తన అభిప్రాయము చెప్పతలచుకొని, ఆ ప్రియదర్శనుణ్ణి రాముణ్ణి చూచి, "ప్రభూ! వానరేశ్వరుడు సుగ్రీవుడు చెప్పినట్లు చేస్తాడు. అచిరకాలములో నీ కోరిక నెరవేరుస్తాడు. నీవు శత్రువును జయిస్తావు. ధైర్యముతో ఉండు. శరదృతువు కోసము ఎదురుచూస్తూ ఉండవలెను. ఈ వర్షాకాలము అంతా ఓర్చుకొని ఉండవలెను. కోపాగ్ని నిగ్రహించు. శరత్కాలము రాక తప్పదు. ఈ నాల్గు మాసాలూ శత్రుసంహార ప్రయత్నముతో, సింహాలు తిరిగే ఈ పర్వతముమీదనే ఉందాము" అన్నాడు.

28

వర్షాకాల వర్ణనము

వాలి వధ అయిన తరువాత, చేసుకొన్న ఏర్పాటు ప్రకారము సుగ్రీవుడు రాజ్యాభిషేకము చేసుకొని కిష్కింధా నగరములోనూ, రాముడు లక్ష్మణుడితో కూడా మాల్యవత్పర్వతము అనే ప్రస్రవణ పర్వతసానువులలోనూ నివసిస్తూ ఉన్నారు.

వానాకాలము ఆరంభం అయింది. రాముడు లక్ష్మణుణ్ణి చూచి, ఇట్లా చెప్పసాగినాడు :

"నాయనా! వానాకాలము వచ్చింది చూడు. మేఘాలు పర్వతాలవలె ఆకాశాన్ని ఆవరించినవి. సూర్యకిరణాల మూలకంగా సముద్రరసాన్ని క్రోలిన ఆకాశాన్ని కార్తీకం నుంచి ఆషాఢమాసం వరకూ నవమాసాలూ గర్భం ధరించి ఇప్పుడు రసాయనాన్ని ప్రసవిస్తున్నట్టుగా కనబడుతున్నది.

"లక్ష్మణా! ఈ పర్వతంమీదనుంచి మేఘాలు ఆకాశం వరకు సోపానపంక్తుల వలె ఉన్నవి. ఈ సోపానాలు ఎక్కిపోయి ఆకాశంలో సూర్యుణ్ణి కొండమల్లెపూల దండలతోనూ, ఏరుమద్దిపూలదండలతోనూ అలంకరించడానికి వీలు అయ్యేట్టుగా ఉంది.

"తమ్ముడా! సంధ్యారాగం అలముకొని మధ్య రక్తవర్ణముతోనూ, తెల్లటి కొనలతోనూ కనబడుతున్న మేఘపు తునకలు, ఆకాశానికి లేచిన వ్రణాలకు కట్టుకట్టిన తెల్లగుడ్డ పీలికలవలె తోస్తున్నవి. మందమారుతము నిట్టూర్పులవలెనూ, సంధ్యారాగము చందనచర్చలవలెనూ, తెల్లటి మేఘాలు పాలిపోయిన దేహమువలెనూ, ఆకాశము ఇప్పుడు కాంతను ఎడబాసిన కామార్తుడివలె కనపడుతున్నది. ఎండ వేడికి బెట్టవేసి కొత్తగా కురిసిన ఈ వానలకు తడిసి ఆవిర్లు తేలుతూ ఉన్న ఈ భూమి, దుఃఖముతో కన్నీళ్ళు కార్చే సీతాదేవివలె నాకు కనబడుతూ ఉంది.

"లక్ష్మణా! మేఘాల కడుపులోనుంచి బయలుదేరి మొగలిపూల వాసనలు గుబాళిస్తూ, కలువపూల అంత చల్లగా హాయిగా వీస్తూ ఉన్న గాలిని, చేతులతో జుర్రుకోబుద్ధి పుట్టుతున్నది. విరగపూసిన మద్దిపూలతోనూ, మొగలిపూల ఘుమఘుమల తోనూ, మీదపడుతూ ఉన్న జలధారలతోనూ ఈ పర్వతము, శత్రుబాధ వదలిపోయి రాజ్యాభిషేకము చేసుకొంటున్న సుగ్రీవుడివలె తోస్తున్నది. నల్లటి మేఘాలు అంతటా కమ్ముకొని తెల్లటి వానధారలతోనూ, హోరుగాలి పోసుకుంటున్న గుహలతోనూ ఈ పర్వతాలు, కృష్ణాజినాలు కప్పుకొని తెల్లటి యజ్ఞోపవీతాలు ధరించి వేదాధ్యయనం చేస్తూ ఉన్న బ్రహ్మచారులవలె కనపడుతూ ఉన్నవి. బంగారు కొరడాలతో వలె మెరుపు తీగెలతో కొట్టుతూ ఉంటే, ఆకాశము ఇప్పుడు బాధపడుతూ అరుస్తూ ఉన్నట్టు ఉరుములు ఉరుముతున్నవి.

"లక్ష్మణా! నల్లటి మేఘము మధ్యను చలిస్తున్న మెరుపు తీగెను చూస్తూ ఉంటే, రావణాసురుడి ఒడిలో నుంచి తప్పించుకొని పోవడానికి పెనుగులాడిన సీతాదేవి జ్ఞాపకము వస్తోంది. ఇట్లా మేఘాలు కమ్ముకొని నక్షత్రాలూ, చంద్రుడూ కనపడకుండా పోయి చిమ్మచీకట్లతో దిక్కులు తెలియకుండా ఉండడము కాముకులకు ఉత్సవ సమయము. వర్షాకాలం వచ్చింది అనే సంతోషంతో కొండనెత్తాలలో విరగపూసిన కొండమల్లెలు కొంచెం ఆవిర్లు కమ్ముకొని, ప్రియసమాగమానికి హసితవదనలు అయి ఆనందబాష్పాలు వదిలే ప్రియురాండ్లవలె కనపడుతూ, నాకు కామోద్దీపనం కలగచేస్తూ ఉన్నవి. ఇప్పుడు గాలిదుమారాలు లేవు. చల్లగాలి వీస్తూ ఉంది. ఎండకాలపు దేహతాపమూ, చెమటలు పోయటమూ ఆగిపోయినవి. రాజులు దండయాత్రలకు బయలుదేరడం మానుకొన్నారు. విదేశాలకు పోయిన మగవాండ్లు స్వదేశాలకు తిరిగివస్తూ ఉన్నారు. హంసలు మానస సరస్సుకు పోయినవి. చక్రవాక పక్షులు కామోద్రేకం నుంచి పెంటిపిట్టలను వదిలిపెట్టి తిరగలేకుండా ఉన్నవి. వానలు కురుస్తూ ఉన్నందువల్ల రహదార్లలో బండ్లు నడవడం ఆగిపోయింది. అక్కడక్కడ కమ్ముకొన్న మేఘాలనుంచి కొంత కనబడుతూనూ, కొంత కనపడకుండానూ ఉన్న ఆకాశం మధ్యలో, అక్కడక్కడ ఉన్న కొండలనుంచి అలలు లేకుండా ఉన్న మహా ప్రశాంత సముద్రం వలె కనపడుతూ ఉంది. కొండవాగులు ఇప్పుడు పర్వతధాతువులు కలిగి ఎర్రపడిపోయిన కొత్తనీళ్ళతోనూ, ఏరుమద్దిపూలతోనూ, కదంబపూలతోనూ, వెనుకనుంచి కేకలు వేసుకుంటూ పరుగులెత్తి వస్తూ ఉన్న నెమళ్ళతోనూ అమితవేగంగా ప్రవహిస్తున్నవి. తుమ్మెదలవలె నల్లగా ఉన్న నేరేడుపండ్లు కమ్మగా ఉండడం నుంచి తెగతింటున్నారు. మామిడిపండ్లు ముగ్గపండి రంగు చెడి, రుచి పోయి గాలికి నేలరాలుతూ ఉన్నవి. విద్యుల్లతలు పతాకాలుగానూ, కొక్కెర పంక్తులు పూలదండలు

గానూ, పర్వతాకారంతో కనబడుతున్న నీలమేఘాలు యుద్ధరంగంలో మదపుటేనుగుల వలె గర్జిస్తూ ఉన్నవి. వానలు కురిసినందువల్ల బయళ్లు అన్నీ దట్టముగా పచ్చిక పట్టినవి. నెమళ్ళు వేడుకగా నృత్యాలు చేస్తున్నవి. వాన కురిసి వెలిసిన తరువాత, అడవులు అపరాహ్ణ సమయాన మహారమణీయంగా కనపడుతూ ఉన్నవి. కొక్కెరలు వెంట వస్తూ ఉంటే జల భారంతో సాగిపోలేక మేఘాలు ఉరుములు ఉరుముతూ, అలసట తీర్చుకోడానికి పెద్ద పెద్ద పర్వతాలమీద ఆగుతూ ఆగుతూ ముందుకు ఎట్లాగో పోతున్నవి. గర్భధారణకోసం సంతోషంగా మేఘాలవెంట పడిపోతున్న కొక్కెరపంక్తులు ఆకాశానికి వేళ్ళాడ కట్టితే గాలికి ఊగులాడుతూ ఉన్న తెల్లతామర పూలదండవలె కనపడుతూ ఉన్నవి.

"తమ్ముడా! లేతపచ్చిక బయళ్ళలో మధ్య మధ్యను కనబడుతున్న ఆర్ద్రపురుగులతో ఈ భూమి, ఎర్రచుక్కలు దిద్దిన చిలుక రంగు శాలువ కప్పుకొన్నట్లుగా ఉంది. నదులు అన్నీ సముద్రుణ్ణి చేరడానికి గబగబా పరుగులెత్తుతూ ఉన్నవి. కొక్కెరలు సంతోషంతో మేఘాల వెంట పడుతున్నవి. స్త్రీలు కామపరవశలు అయి తమ ప్రియులను చేరపోతున్నారు. వన మధ్యంలో నెమళ్ళు నాట్యం ఆడుతున్నవి. కదంబవృక్షాలు విరగబూస్తున్నవి. ఆబోతులు కామోద్రేకంతో ఆవుల కోసం పరుగెత్తుతూ ఉన్నవి. వనాలూ, పయిర్లూ కళకళలాడుతూ ఉన్నవి. మహావిష్ణువును మెల్లగా నిద్ర ఆవరిస్తున్నది.

"లక్ష్మణా! ఇప్పుడు వానలు ఎడతెగకుండా కురుస్తున్నవి. నదులు వరదలు అయి పారుతున్నవి. మదపుటేనుగులు ఘీంకారాలు చేస్తున్నవి. వనమధ్య ప్రదేశాలు శోభాయమానంగా ఉన్నవి. కావలసిన ఆహారం ఒకచోటనే దొరుకుతూ ఉన్నందువల్ల కోతులు హాయిగా ఉంటున్నవి. ప్రియురాండ్లను ఎడబాసిన వాండ్లు తమ ప్రియురాండ్లను గురించే చింతిస్తున్నారు. వానలకు సంతోషముగా సంచరిస్తూ మొగలిపూల తావికి మరింత సంతోషపడుతూ, కొండవాగులు కిందికి దూకుతున్న చప్పుళ్ళకు హడలిపోతూ నెమళ్ళతో కూడా మదపుటేనుగులు చెవులు గింగిర్లు ఎత్తేట్లు అరుస్తున్నవి. కదంబ పూతేనె త్రాగి క్షణములో కైపు ఎక్కి కదలకుండా చెట్లకొమ్మల మీద కూర్చున్న తుమ్మెదలు, వాన దెబ్బలకు మెల్లగా మత్తును కోలుపోతున్నవి. బొగ్గుపొడి రాసులుగా కనబడుతూ రసమయం అయిన నేరేడుపండ్లు, నేరేడుచెట్ల కొమ్మలమీద మూగిన తుమ్మెదల గుంపులవలె కనపడుతున్నవి.

"లక్ష్మణా! పర్వతారణ్యంలోకి బయలుదేరి దారిపట్టిపోతున్న మదపుటేనుగు వెనుక నుంచి వినిపించిన మేఘగర్జనకు ఎదిరి ఏనుగు అనుకొని పోట్లాడటానికి వెనుకకు మళ్ళింది. ఒకచోట తుమ్మెదల గుంపులు ఝుమ్మని పాటలు పాడుతూ,

ఒకచోట నెమళ్ళు నాట్యం ఆడుతూ, ఒకచోట ఏనుగులు ఘీంకారాలు చేస్తూ ఉంటే, ఈ అడవి అనేకవిధాల అందంగా ఉంది. కదంబపూలతో, మంకెనపూలతో, అరటిపూలతో, ఏరుమద్దిపూలతో, మదం ఎక్కి కేకలు వేస్తూ నృత్యం చేస్తున్న నెమళ్ళతో ఈ వనమధ్య ప్రదేశం, తప్పతాగి తందనాలు ఆడే పానశాలవలె కనబడుతూ ఉంది. చాతకపక్షులు దప్పిక అయి ఇంతవరకూ రకరకాల రంగురెక్కలతో తిరుగుతూ దేవేంద్రుడు కురిపిస్తే దొప్పలవంటి ఆకులలోపడి మంచిముత్యాలవలె కనపడుతూ ఉన్న వర్షబిందువులను సంతోషంగా తాగుతున్నవి. తుమ్మెదల ఝుంకారం మనోహరం అయిన తంత్రీధ్వనిగాను, కప్పల బెకబెకలు కంఠ తాళాలుగాను, మేఘ గర్జనలు మృదంగ ధ్వనులుగాను ఈ అడవులు సంగీతాలు పాడుతున్నట్టుగా ఉన్నవి. నెమళ్లు ఒకచోట నాట్యం ఆడుతూనూ, ఒకచోట కేకలు వేస్తూనూ, ఒకచోట చెట్లకొమ్మలమీద ఆభరణాలవంటి తమ పింఛాలు వేళ్ళాడవేసుకొని కూర్చుంటూనూ ఉంటే, కొందరు పాటలు పాడుతూనూ, కొందరు నృత్యం చేస్తూనూ, కొందరు వింటూనూ ఈ అడవులలో సంగీత సభలు సాగిస్తున్నట్టుగా ఉంది.

"లక్ష్మణా! బహుకాలం సమస్త వ్యాపారాలూ నిరోధించి నిద్రపోయిన కప్పలు ఇప్పుడు మేఘగర్జనలకు మేలుకొని అనేక రూపాలతో, అనేక ఆకారాలతో, అనేక వర్ణాలతో బయటికి వచ్చి వానదెబ్బలు తిని బెకబెక ధ్వనులు చేస్తున్నవి. నదులు ఇప్పుడు పాతగట్లను ముంచి వేయును. ప్రవాహ వేగానికి చక్రవాక పక్షులను మోస్తూ కొట్టుకొని వచ్చిన కాయలతోనూ, పండ్లతోనూ, పూలతోనూ అమిత వేగంగా సముద్రాన్ని కలియపోవడం చూస్తూ ఉంటే పెద్దలను లెక్కచేయకుండా పెద్ద పెద్ద స్తనాలతోనూ, ఫలాద్యుపహారాలతోనూ, పుష్పాది భోగద్రవ్యాలతోనూ కామపరవశలు అయిన యువతులు తమ ప్రియులను చేరబోతున్నట్టుగా కనపడుతున్నవి.

"నీళ్లు కురిసిన మేఘాలమీదికి కొత్తగా నీళ్ళతో నిండిన నీల మేఘాలు వచ్చిపడి మేఘాలు మరింత నల్లగా కనపడుతూ ఉండడం చూస్తోంటే, కార్చిచ్చుకు కాలి చల్లారుతున్న కొండలమధ్య అక్కడక్కడ ఆరిపోకుండా భగభగ మంటలు మండుతూ ఉన్న కొండలు గుర్తుకు వస్తున్నవి. సంతోషంగా కేకలు వేస్తున్న నెమళ్ళతోను, ఆర్ద్రపురుగులు పట్టిన పచ్చిక బయళ్ళతోను, విరగబూసిన కదంబ వృక్షాలతోను, ఏరుమద్ది చెట్లతోను మనోహరంగా ఉన్న వనమధ్య ప్రదేశాలలో ఏనుగులు యథేష్టంగా తిరుగుతూ ఉన్నవి. నూత్న వర్షాధారలకు కేసరాలు దెబ్బతినిపోయిన కమలాలను వదలిపెట్టి, కొత్తగా కేసరాలతో వికసించిన కదంబపూలమీదికి ఇప్పుడు తుమ్మెదలు పోతూ ఉన్నవి.

"తమ్ముడా! ఏనుగులు మదము ఎక్కి తిరుగుతూ ఉన్నవి. అబోతులు ఆనందంతో రంకెలు వేస్తున్నవి. సింహాలు విశ్రాంతి తీసుకొంటున్నవి. పర్వతాలు విరగపూసిన చెట్లతో కళకళలాడుతూ ఉన్నవి. రాజులు యుద్ధోత్సాహం వదిలిపెట్టి హాయిగా కాలం గడుపుతున్నారు. ఆకాశాన వేళ్ళాడుతూ ఉన్న మేఘాలు సముద్రాన్ని, సముద్రఘోషాన్ని తిరస్కరించి మహాజల ప్రవాహాలనూ, తటాకాలనూ, సరస్సులనూ, బాహువులనూ, సమస్త భూమినీ ముంచివేస్తూ ఉన్నవి. వానలు ఎడతెగకుండా కురుస్తున్నవి. గాలి మహాఘోషముతో వీస్తూ ఉంది. నదులు గట్లు తెంచుకొని దార్లుతప్పి అమితవేగముతో ప్రవహిస్తూ ఉన్నవి.

"పెద్ద పెద్ద జలకుంభాలతో ప్రజలు అభిషేకించిన రాజులవలె, దేవేంద్రుడు ఇస్తే వాయువు తెచ్చిన మేఘాలు అనే జలకుంభాలు అభిషేకము చేస్తూ ఉన్న పర్వతాలు ఇప్పుడు తమ ఐశ్వర్యాన్నీ, ఆకాశాన్నీ ప్రదర్శిస్తూ ఉన్నవి. ఆకాశాన్ని ఇప్పుడు మేఘాలు ఆవరించినవి. నక్షత్రాలూ, సూర్యుడూ కనపడటములేదు. జలాలు వరదలు అయి ప్రవహిస్తున్నవి. భూమి కనపడటము లేదు. చీకట్లు అలముకొన్నవి. దిక్కులు తెలియటములేదు.

"వర్షధారలు కడిగివేసిన ఎత్తు అయిన పర్వత శిఖరాలూ, వాటి మీద పారుతూ ఉన్న పెద్ద పెద్ద సెలయేళ్ళ స్వచ్ఛోన్నతములు అయిన కామినీ స్తనాలమీద వేళ్లాడుతున్న ముత్యాలహారాలవలె శోభిస్తున్నవి. పర్వతాలమీదనుంచి పడుతూ ఉన్న సెలయేళ్ళు పెద్ద పెద్ద రాళ్ళు అడ్డము వచ్చినందువల్ల చెల్లాచెదురు అయిన ముత్యాల హారాలవలె కనపడుతూ, నెమళ్ళు కేకలు వేస్తూ ఉన్న గుహలలో వెదచల్లినట్లు పడుతున్నవి. సురత సమయములో ఒరిపిడికి తెగి అన్నిదిక్కులా రాలుతున్న దేవతాస్త్రీల ముత్యాలహారాలవలె వర్షధారలు అంతులేకుండా అంతటా పడుతూ ఉన్నవి. గూండ్లలోకి పోతున్న పక్షులనుంచీ, ముడుచుకొని పోతూన్న కమలాలనుంచీ, వికసిస్తూన్న జాజిపూలనుంచీ సూర్యాస్తమయము అవుతూ ఉందేమో అనిపిస్తూ ఉంది.

"రాజుల దండయాత్రలు ఆగిపోయినవి. దండు దారిలోనే నిలిచిపోయింది. పరస్పర విరోధాలు శాంతించినవి. బ్రాహ్మణులు సామవేదగానము చేసే భాద్రపదమాసము వచ్చింది. కోసలాధిపతి భరతుడు కావలసిన సమస్త సంభారాలనూ సమకూర్చుకొని, గృహకృత్యాలను అన్నిటినీ కట్టిపెట్టి ఆషాఢమాసంనుంచీ నియమంతో ఉండి ఉంటాడు. నేను ఎక్కడికి అయినా పోయి తిరిగి వచ్చినప్పుడు, నన్ను చూచి అయోధ్యా పౌరులు చేసే కోలాహల ధ్వనులవలె, ఇప్పుడు సరయూనది అమితవేగముతో, మహాధ్వనులతో వరదలు అయి ప్రవహిస్తూ ఉంటుంది.

"తమ్ముడా! సుగ్రీవుడికి శత్రుపీడ వదిలిపోయింది. భార్యనూ, గొప్ప రాజ్యాన్నీ సంపాదించుకొన్నాడు. ఈ వర్షాకాలంలో సమస్తభోగోపకరణాలతో సమస్తసుఖాలూ అనుభవిస్తున్నాడు. నా భార్యను రాక్షసుడు ఎత్తుకొని పోయినాడు. మహా గొప్పరాజ్యము నా చెయ్యి జారిపోయింది. ఇప్పుడు నా స్థితి నదీప్రవాహానికి కూలి పడిపోయే గట్టు మాదిరిగా ఉంది. ఈ వర్షాకాలము దుస్సహముగా ఉంది. నా దుఃఖానికి పొలిమేర కనబడడములేదు. రావణాసురుడు అసాధ్యుడు అయిన శత్రువు. ఈ మూడింటికీ అంతు కనపడటములేదు. ఈ వానాకాలము దండయాత్రకు వీలుకానందువల్లనూ, దార్లు తిన్నగా ఉండవు కనుకనూ సుగ్రీవుడు నాకు నమస్కారము చేసి సీతను వెతకడానికీ, రావణ సంహారానికీ ప్రయత్నాలు చేస్తాను అంటే, నేను ఏమాత్రమూ ఒప్పుకోలేదు. అంతేకాదు, అతడు ఇంతవరకూ అమితకష్టాలు అనుభవించినాడు. బహుకాలానికి భార్యను కలుసుకొన్నాడు. మన కార్యము మహత్తరము అయింది. అందువల్ల, ముందుగా నా పని చేయవలసింది అని చెప్పలేక పోయినాను. ఈ వర్షాకాలము అంతా సుగ్రీవుణ్ణి విశ్రాంతి అనుభవించమని చెప్పినాను. అదనుకు అతడి అంతట అతడే వస్తాడు. నేను చేసిన ఉపకారము మరచిపోడు. సందేహపడ నక్కరలేదు. ఓ శుభలక్షణా! నేను అందువల్ల సమయము కోసము ఎదురుచూస్తూ ఉన్నాను. నదులు నిర్మలోదకాలతో ప్రవహించే వరకూ, సుగ్రీవుడికి నామీద అనుగ్రహము వచ్చేవరకూ నేను కనిపెట్టుకొని ఉండవలెను. వీరుడు అయినవాడు, ఉపకారికి ప్రత్యుపకారము చేస్తాడు. కృతఘ్నుడు అయిన వాడు, చేసిన ఉపకారము మరచిపోయి మంచివాండ్ల మనస్సు నొప్పిస్తాడు."

ఇట్లా రాముడు చెప్పింది విని లక్ష్మణుడు ఆలోచించి, చేతులు జోడించి శుభకరము అయిన తన అభిప్రాయము చెప్పతలచి, ఆ ప్రియదర్శనుణ్ణి రాముణ్ణి చూచి, "అన్నా! నీవు మానవనాథుడవు. మహావీరుడవు. ఆ వానరేశ్వరుడు అన్నమాట తప్పేవాడు కాడు. అచిరకాలములో నీ కోరిక నెరవేరుస్తాడు. నీవు నీ శత్రువులను జయిస్తావు. ఈ వర్షాకాలము ఓర్చుకోవలెను. నీవు శరత్కాలము కోసము ఎదురు చూస్తూ ఉండవలెను" అన్నాడు.

29

సుగ్రీవునికి ఆంజనేయుని కర్తవ్యోపదేశము

మేఘాలూ, మెరుపులూ ఆకాశాన్ని వదలిపెట్టిపోయినవి. బెగ్గురు పక్షులు మనోహర ధ్వనులు చేస్తూ తిరుగుతూ ఉన్నవి. రాత్రిపూట వెన్నెల మహారమణీయముగా ఉంటున్నది.

సుగ్రీవుడు ఏ కొరతా లేకుండా సమృద్ధార్థుడు అయినాడు. అయితే, అతడు ధర్మసంగ్రహానికి మందగించినాడు. కాముకులు అవలంబించే మార్గములో పడ్డాడు.

అతనికి కావలసిన పనులు అన్నీ అయిపోయినవి. అన్ని కోరికలూ ఈడేరినవి. స్త్రీలోలుడు అయిపోయినాడు. ఇష్టురాలు అయిన భార్య రుమ, కోరుకొన్న తార అతడి సరసన చేరినారు. అన్ని భయాలూ తీరిపోయినవి. అహోరాత్రములూ ఆ ప్రియురాండ్లతో కాలక్షేపము అయిపోతున్నది. నందనవనంలో దేవేంద్రుడు అప్సరసలతో వలె, సుగ్రీవుడు కిష్కింధలో వానరాంగనలతో క్రీడిస్తూ ఉన్నాడు. రాజకార్యాలను కన్నెత్తి అయినా చూడకుండా మంత్రులవశము చేసివేసినాడు. రాజ్యము ఏమి అయిపోతుందనే సందేహము అయినా లేకుండా కామకేళిలో మునుగుతూ, తేలుతూ ఉన్నాడు.

ఇట్లా ప్రవర్తిస్తూ ఉన్న సుగ్రీవుణ్ణి హనుమంతుడు చూచినాడు.

హనుమంతుడు ఏపని ఎప్పుడు ఎట్లా చేయవలసిందీ చక్కగా తెలిసినవాడు. కాలోచిత ధర్మవిశేషాలను అన్నిటినీ ఎరిగినవాడు. అర్థస్వభావాన్ని అవగతము చేసుకొన్నవాడు. మాటనేర్పరి. స్నేహముతో, సంతోషముతో, తనమాట ప్రకారము చేస్తాడు అనే నమ్మకముతో సుగ్రీవుడి మంచికోసము యథార్థమూ, ధర్మిష్ఠమూ, నీతియుక్తమూ అయిన విషయాన్ని, మధురము అయిన హేతువులతో, మనస్సునకు ఇంపు అయ్యే మాటలతో ఆ వాక్యతత్త్వజ్ఞుడికి సుగ్రీవుడికి హనుమంతుడు ఈవిధముగా చెప్పసాగినాడు :

"ఓ సుగ్రీవుడా! నీకు రాజ్యము వచ్చింది. కీర్తి వచ్చింది. కులక్రమాగతము అయిన సంపద అభివృద్ధి అయింది. నీకు మిగిలిపోయింది మిత్రకార్యము నెరవేర్చడము ఒక్కటే. నీవు ఇకను అది చేయవలెను. ఏ సమయములో ఏది చేయవలెనో తెలుసుకొని మిత్రుల విషయములో చక్కగా ప్రవర్తించేవాడి రాజ్యమూ, కీర్తి, ప్రతాపమూ ఎప్పటికి అప్పుడు వృద్ధి అవుతూ ఉంటవి.

"ఓ రాజా! మిత్రులనూ, సైన్యాన్నీ, బొక్కసాన్నీ ప్రాణప్రదంగా సమకూర్చుకొనేవాడి ఒక్కడి రాజ్యమే అమితముగా అభివృద్ధి అవుతుంది. సుగ్రీవుడా! నీవు సదాచారసంపన్నుడవు. నీవు ఎప్పుడూ పుణ్యామార్గముపట్టి పోయేవాడవు. నీ ప్రతిజ్ఞ ప్రకారము నీవు ఇప్పుడు నీ మిత్రుడి పనిని చేసిపెట్టవలెను. ఎవడు తన పనులను వదులుకొని మిత్రకార్యము నెరవేర్చడానికి పూనుకోకుండా అలక్ష్యము చేస్తాడో, వాడికి అడుగు అడుగునా కష్టాలే వస్తవి. మిత్రుడు అయినవాడికి ఏ సమయములో ఏది చేయవలెనో ఆ సమయములో అది చేయకుండా కాలాతిక్రమణము చేసిన తరువాత ఎన్ని మహాకార్యాలు చేసినా వ్యర్థమే.

"ఓ అరిందమా! నీవు వీరుడవు. వైదేహిని వెదకిపెట్టడము నీవు ఇప్పుడు చక్కపెట్టవలసిన మిత్రకార్యము. ఇప్పటికే కాలాతీతము అయిపోయింది. ఓ రాజా!

రాముడు సర్వమూ తెలిసినవాడు. అతడు ఏ సమయములో ఏది చేయవలెనో తెలిసిన కాలవిదుడు. నీవు ఈ పని చేయవలెను అనే తొందర అతడి మనస్సులో ఎంత ఉన్నా, రాముడు నీ మనస్సును అనుసరించి పోయేవాడు కనుక, కాలము అతిక్రమించిపోతూ ఉంది అని నీతో చెప్పడు. అతడు ఉత్తమవంశ సంజాతుడు. అప్రమేయ ప్రభావుడు. చలనములేని ఆప్తుడు.

"ఓ రాజా! నీవు అప్రతిమాన గుణవంతుడవు. నీవు ఇప్పుడు రాముడి పని చేయవలెను. అతడు ముందుగా నీ పని చేసిపెట్టినాడు. సీతాదేవిని వెదకడానికి నీవు ఇప్పుడు వానరవీరులను ఆజ్ఞాపించవలెను. రాముడు వచ్చి నిన్ను అడుగక పూర్వమే నీవు ఈ పని చేసేట్లయితే, నీ ప్రతిజ్ఞకు కాలాతిక్రమణ దోషము పట్టదు. అతడు వచ్చి అడిగిన తరువాత అయ్యేట్లయితే, నీవు కాలాతిక్రమణ దోషము చేసినవాడవు అవుతావు.

"ఓ వానరేంద్రా! నీవు ఏ ఉపకారమూ చేయనివాడి కార్యాన్ని అయినా చేసిపెట్టుతావు. నీకు మహోపకారము చేసిన రాముడి పని నీవు చేసిపెట్టవలెను అని నేను చెప్పడము ఏమిటి? నీవు సమస్త వానర సమూహాలకూ, భల్లూక సమూహాలకూ నాథుడవు. పరమపరాక్రమవంతుడవు. రామకార్యము నెరవేర్చే సామర్థ్యము నీకు ఎంత అయినా ఉంది. సీతాదేవిని వెతకడానికి వానర సేవకులను ఆజ్ఞాపించకుండా నీవు జాగుచేయడానికి కారణము ఏమిటి? రాముడు తన కోదండముతో సురాసుర మహోరథులను అయినా ఎదిరించి జయించగల సమర్థుడు. అతడు అమిత శక్తిమంతుడు. అయితే, నీవు చేసిన ప్రతిజ్ఞను నీవు ఎంతవరకు నెరవేరుస్తావోనని నిరీక్షిస్తూ ఉన్నాడు. అతడు నీ స్నేహము చేయగానే నిన్ను సంతోషపెట్టవలెను అనుకొన్నాడు. వాలి తనకు శత్రువు కాకపోయినప్పటికినీ, నీ కోసము వాలి ప్రాణము తీయడానికి వెనుకాడలేదు. కాబట్టి, నీవు ఇప్పుడు భూమ్యాకాశాలు వెతికించి అతని ప్రియురాలు సీతాదేవి ఎక్కడ ఉందీ తెలుసుకోవలెను.

"ఓ సుగ్రీవుడా! రాముడు దేవాసురమరుద్గణాలకు సయితమూ భయపడడు. ఇక రాక్షసుల విషయము చెప్ప నవసరములేదు. ఆ శక్తిమంతుడు నిన్ను ఆదరించినాడు. నీకు ఉపకారము చేసినాడు. నీవు ఇప్పుడు అతనిని సర్వాత్మనా సంతోషపెట్టవలెను. నీవు ఆజ్ఞాపించేట్లయితే, మాలో ఎవడు అయినాసరే పాతాళములోకానీ, భూమిమీదకానీ, సముద్రములోకానీ, అటు ఆకాశములోకానీ వెదకడానికి వెనుకాడేవాడు ఉన్నాడా? ఎవరికీ భయపడని గుణవంతులు అయిన వానరులు ఒక కోటికిపైన నీ స్వాధీనములో ఉన్నారు. నీవు ఇక్కడనే ఉండి ఎవడు ఏపని, ఎక్కడనుంచి, ఎట్లా చేయవలెనో ఆజ్ఞాపించవచ్చును. ఇప్పుడు నీవు ఆజ్ఞాపించు."

ఇట్లా కాలోచితముగా హనుమంతుడు చెప్పింది అంతా ఆ అమిత పరాక్రమవంతుడు సుగ్రీవుడు విన్నాడు. ఉత్తమోత్తమము అయిన రామకార్యాన్ని గురించి యోచించినాడు. అన్నిదిక్కులలో ఉన్న సేనలను ఎప్పటికి అప్పటికి హెచ్చరికతో సమీకరించుకొంటూ ఉన్న నీలుణ్ణి, ఆ మతిమంతుడు సుగ్రీవుడు అంతట తనదగ్గరకు రావించుకొని, "ఓ సేనాధిపతీ! మనము ఇప్పుడు రామకార్యము నెరవేర్చవలసి ఉంది. నీవు సైన్యాలను అన్నిటినీ యూధపాలకులు అందరితో కూడా, ఇక్కడికి ఏ మాత్రమూ ఆలస్యము చేయకుండా పిలిపించవలెను. అన్నిదిక్కులలో ఉంటూ ఉన్న శీఘ్రగాములూ, ఉత్సాహవంతులూ అయిన మన సేనానాయకులనూ, ఇంకా ఇతర వానరవీరులనూ నా ఆజ్ఞగా ఇప్పుడే రప్పించు. సేనా సమూహాలు ఒకదానితో ఒకటి కలసిపోయి తికమక అయిపోకుండా చూడు. సైన్యాలు అన్నీ వచ్చిన తరువాత, ఏమి చేయవలసిందీ నీవే చూడు.

"ఓ నీలుడా! ఇది మొదలు పదిహేను రాత్రులలోపల ఎక్కడెక్కడి వానరులూ వచ్చి సేనలలో చేరవలెను అని ప్రకటించు. అట్లా ఏ వానరుడు అయినా సైన్యములో చేరకపోయినట్లయితే వాడికి మరణ దండనము విధించు. ఈ విషయములో వేరే విచారణ చేయనక్కరలేదు. ఇది నా నిర్ణయము, నా ఆజ్ఞ. నీవు ఇప్పుడే అంగదుణ్ణి వెంటబెట్టుకొని పోయి జ్ఞానవృద్ధులూ, వయోవృద్ధులూ అయిన వానరులకు అందరికీ ఈ విషయము తెలియచెప్పు" అని ఆజ్ఞాపించినాడు.

ఇట్లా ఆజ్ఞాపించి, ఆ వానరపుంగవుడు సుగ్రీవుడు అంతట తన అంతఃపురములోకి పోయినాడు.

30

శరత్కాల వర్ణనము

సుగ్రీవుడు కిష్కింధానగరములో అంతఃపురములో హాయిగా ఉంటూ ఉన్నాడు. వర్షర్తువు అంతా అయిపోయింది.

రాముడు వర్షాకాలము అంతా సీతావిరహముతో తపించిపోయినాడు. తెల్లటి ఆకాశాన్నీ, స్వచ్ఛము అయిన చంద్రమండలాన్నీ, వెండిపూత పూసినట్టు ఉన్న వెన్నెలరాత్రినీ చూచినాడు. సీతాదేవి ఎక్కడ ఉందీ తెలియదు. సుగ్రీవుడు కామపరతంత్రుడు అయిపోయినాడు అని తెలుసును. సీతాదేవిని వెతకడానికి ఏర్పాటు చేసుకొన్న గడువుకాలము కడచిపోయింది. రాముడు పరమాతురుడు అయిపోయినాడు. ఒండ్లు తెలియకుండా పోయింది. అంతట కొంచెముసేపటికి ఆ ద్యుతిమంతుడికి తెలివి వచ్చింది. ఎప్పుడూ మనస్సులో మెలగుతూ ఉన్నప్పటికిన్నీ,

సీతాదేవిని గురించే ఆలోచించ సాగినాడు. హేమధాతుభూషితము అయిన ఆ పర్వతాగ్రముమీద కూర్చున్న రాముడు, స్వచ్ఛాకాశాన్ని చూచినాడు. అది శరత్కాలము. మేఘాలూ, మెరుపులూ లేవు. బెగ్గురు పక్షులు మనోహరముగా కలకలధ్వనులు చేస్తూ ఉన్నవి. అతని మనస్సు మళ్ళీ వైదేహి మీదికి పోయింది. దుఃఖాన్ని నిగ్రహించలేక పోయినాడు. విలపించినాడు.

"ఆ బాల, నా ప్రియురాలు సారసపక్షుల స్వరముతో నాతో మాట్లాడుతూ ఉండేది. మనోహరము అయిన సారసపక్షుల ధ్వనులు విని, సంతోషపడుతూ ఆశ్రమంలో నాతో ఆడుకొంటూ ఉండేది. ఇప్పుడు ఆ చిన్నది ఎట్లా ఉంటూ ఉందో?

"అచ్చ బంగారురంగు పూలు పూసిన వేగిస చెట్లను చూచి, ఆమె ఎంతో ముచ్చటపడుతూ ఉండేది. ఇప్పుడున్నూ వేగిసపూలను చూస్తుంది. నాలుగువైపులా నాకోసం వెతుకుతుంది. నేను కనపడను. కనుక, ఇప్పుడు ఎంత దుఃఖపడుతుందో? ఇదివరకు ఆ కలభాషిణి, కలహంసల ధ్వనులకు నిద్రమేల్కొనేది. ఇప్పుడు ఆ సర్వాంగసుందరి ఎలా మేల్కొంటున్నదో! ఆ పుండరీక విశాలాక్షి నా ప్రియురాలు సీతాదేవి చక్రవాక పక్షుల ధ్వనులు విని, మరులుకొని తాళలేక నా దగ్గరకు పరుగెత్తుకొని వచ్చేది, ఇప్పుడు ఆమె ఎట్లా ఉంటూ ఉందో?

"ఆ మృగశాబాక్షి, నా ప్రియురాలు వైదేహి వెంటలేనందువల్ల ఈ సరస్సులూ, ఈ నదులూ, ఈ నడబావులూ చూస్తూ మహారణ్యాలలోనూ, ఉద్యానవనాలవంటి అడవులలోనూ తిరుగుతూ ఉన్నా నాకు సంతోషముగా లేదు, సుఖముగా లేదు.

"ఆ సీత సుకుమారి అనీ, నన్ను ఎడబాసి బాధపడుతూ ఉంది అనీ శరద్గుణ పూర్ణుడు అయిన కాముడు, ఆమెను బాధపెట్టకుండా ఉంటాడా? బాధ పెట్టుతాడు, అపరిమితముగా బాధ పెట్టుతాడు" అనుకొంటూ ఆ పురుషోత్తముడు రాముడు దేవేంద్రుడు కురిపించే వాన జలము కోసము చాతకపక్షివలె సీతాదేవి కోసము విలపించసాగినాడు.

పండ్ల కోసం పర్వతనెత్తాలలో మారుమూలలు అన్నీ తిరిగిన కాంతిమంతుడు లక్ష్మణుడు అప్పుడు అక్కడికి వచ్చినాడు. ఆ విజన ప్రదేశంలో అట్లా ఏకాకిగా దుస్సహ దుఃఖపారవశ్యంతో మయిమరచి పోయిన రాముణ్ణి చూచినాడు. ఆ పరిశుద్ధ హృదయుడు లక్ష్మణుడు దుఃఖపడిపోయి, "పూజ్యుడా! నీవు కామపరవశుడవు అయి ధైర్యం పోకొట్టుకొంటే ప్రయోజనం ఏమిటి? రామా! నీవు మహా ధైర్యవంతుడవు. నీవు యిప్పుడు కార్యసిద్ధికి అవసరమయ్యే ప్రయత్నాలను అన్నిటినీ చేయవలెను. మనస్సు చెడకొట్టుకోవద్దు. ధైర్యం అవలంబించు. జయం సమకూడే ఉపాయం

ఏదో ఆలోచించు. కాలాన్ని గమనించు. సాయం వచ్చే సుగ్రీవాదుల సామర్థ్యాన్ని గురించి యోచించు. నీవు సుగ్రీవుడి పని చేయడములో చూపించిన సామర్థ్యము ఇప్పుడు స్వకార్యసిద్ధికి ఉపయోగింపవలెను.

"ఓ రామా! నీవు మానవనాథుడవు. పూజనీయుడవు. మహావీరుడవు. ఆ వైదేహికి నీవే భర్తవు. ఆమెను మరి ఒకడు స్వాధీనము చేసుకోలేడు. అగ్నిహోత్ర జ్వాలను ఎవడు అయినా చేతులతో పట్టుకోకలడా? పట్టుకుంటే చేతులు తగలబడిపోకుండా ఉంటవా" అని నిర్భయముగా చెప్పినాడు.

ఇట్లా తన స్వభావానికి తగినట్టుగానూ, తత్కాలానికీ ఉత్తర కాలానికీ మేలు అయ్యేట్టుగానూ, రాజనీతియుక్తముగానూ, ధర్మార్థసహితంగానూ, సాంత్వయుక్తం గానూ, సులక్షణంగానూ లక్ష్మణుడు చెప్పిన మాటలు విని రాముడు, "తమ్ముడా! నీవు చెప్పినట్టు కార్యసిద్ధికి కావలసిన పనిని అంతా నిస్సంశయంగా చేయవలసిందే. అందుకు సాధన మయిన ఉత్సాహాదులు అవసరమే. మనం చేయవలసింది దుర్ఘట కార్యము. దాని ఫలపరిపాకాన్ని గురించి మనం చింతించ నవసరము లేదు. మనం చేయవలసింది చేయడమే కర్తవ్యం" అంటూ ఆ పద్మవిశాలాక్షి మైథిలిని గురించి తలచుకొన్నాడు. ఆ మహానుభావుడి నోరు ఎండిపోయింది.

అంతట రాముడు లక్ష్మణుణ్ణి చూచి, "నాయనా! సహస్రాక్షుడు అయిన దేవేంద్రుడు వర్షజలాలతో ఈ వసుంధరను అంతా తృప్తి పరిచినాడు. పంటలు అన్నీ పండేట్టు చేసినాడు. తాను చేయవలిసిన పనిని అంతా చేసివేసి కృతకృత్యుడు అయినాడు. స్నిగ్ధగంభీర ధ్వనులతో మేఘాలు పర్వతాలమీదనూ, మహోన్నత వృక్షాలమీదనూ సంచారం చేసి, కావలసినంత జలం వర్షించి అలసిపోయి ఊరుకొన్నట్టుగా ఉన్నవి. నల్లకలువరేకులవంటి నీలమేఘాలు దశదిశలూ నలుపు చేసి చేసి, ఇప్పుడు మదం ఉడిగిపోయిన ఏనుగులవలె పరుగులెత్త లేకుండా ఉన్నవి. వర్షవాయువులు జలగర్భంతో కొండమల్లెపూల సువాసనలతోనూ, ఏరుమద్దిపూల ఘుమఘుమలతోనూ వీచి వీచి ఇప్పుడు ఆగిపోయినవి. మేఘగర్జనలూ, మదపుటేనుగుల ఘీంకారాలూ, నెమళ్ళ కేకారావాలూ, కొండమీదనుంచి కిందపడే సెలయేళ్ళూ ఆగిపోయినవి. పెద్ద పెద్ద వానలు పర్వతాలు అన్నిటినీ శుభ్రముగా కడిగివేసినందువల్ల పర్వతసానువులు కుంకుమాది సుగంధద్రవ్యాలు పూసుకొన్నట్టు చిత్ర విచిత్రము అయిన రంగులతో కనపడుతున్నవి.

"లక్ష్మణా! ఈ శరదృతువు తన ఐశ్వర్యాన్ని ఏడాకుల అరటి చెట్ల కొమ్మలకూ, నక్షత్రాలకూ, సూర్యచంద్రులకూ, మదపుటేనుగులకూ పంచిపెట్టినట్టుగా ఉంది.

శరత్కాల లక్ష్మి అనేకము అయిన వాటిని ఆశ్రయించినట్టుగా ఉంది. అది సూర్యోదయానికి వికసించే రకరకాల రంగురంగుల పద్మాలమీద తాండవము ఆడుతూ నానావిధ కాంతులతోనూ తేజరిల్లుతూ ఉంది."

"అడవులలో ఏడాకుల అరటిచెట్లు పూలు విరగపూసి సుగంధవాసనలు కొట్టుతూ ఉంటే, ఆ పూలకోసము మూగిన తుమ్మెదలు మనోహరముగా ఝుంకారము చేస్తూ ఉంటే ఆ గాలి వెంట మద పారవశ్యముతో మదపుటేనుగులు పరుగులెత్తుతూ ఉన్నవి. పెద్ద పెద్ద రెక్కలనిండా పద్మాల పుప్పొళ్లు కొట్టుకొని కామోద్దీపనము కలుగ చేస్తూ మహానదులలో ఇసుకతిన్నెల మీదికి వచ్చిన చక్రవాక పక్షులతో హంసలు ఆడుకొంటూ ఉన్నవి. మదప్రాగల్భ్యముతో తిరుగుతూ ఉన్న మదపుటేనుగుల మీదనూ, గర్వముతో రంకెలు వేస్తూన్న ఆబోతుల మీదనూ, స్వచ్ఛజలాలతో మందము మందముగా ప్రవహిస్తున్న నదుల మీదనూ శరత్కాలలక్ష్మి తన శోభను బహువిధాల భాగించుకొని భాసిస్తోంది. దర్శనీయము అయిన మేఘాలు ఆకాశాన్ని వదిలిపెట్టి పోయినవి. అడవులలో నెమళ్లు తమ ఆభరణాలు అయిన పింఛాలు పోగొట్టుకొని, ప్రియురాండ్లమీద అనాసక్తులు అయి కాంతులు మాసిపోయి, సంతోషము అడుగు అంటిపోయి కేకలు వేయడము మానివేసి ఏమిటో ఆలోచిస్తున్నట్టుగా కనపడుతూ ఉన్నవి. వేగిసచెట్టు పూలు విరగపూసినవి. ఆ పూల బరువుకు కొమ్మలు అన్నీ వంగిపోయినవి. మనోహరము అయిన సువాసనలు గుబాళిస్తూ నయనాభిరామము అయిన బంగారు కాంతులతో ధగధగలాడుతూ వనమధ్య ప్రదేశాలలో వెలిగిపోతూ ఉన్నవి. ఏడు ఆకుల అరటిపూల వాసనలకు ఇప్పుడు ఏనుగులకు మదము ఎక్కినది. ఆ ఏనుగుల గండస్థలాలను భేదించుకొని మదజలము కారుతూ ఉంటే, మరింత విషయాసక్తులు అయి పెంటి ఏనుగులతో కూడా తామరకొలనులలోను, వనాలలోను విహరించడానికి మందము మందముగా నడిచిపోతున్నవి.

"మేఘాలు అంతర్ధానము అయిపోయినందువల్ల, ఆకాశము ఇప్పుడు చక్కగా తోమిన ఆయుధమువలె తళతళలాడుతూ ఉంది. వరదలు ఆగిపోయినందువల్ల, నదులు ఇప్పుడు శుభ్రజలాలతో ప్రవహిస్తున్నవి. ఎర్రకలువల మీదనుంచి వస్తున్నందువల్ల వాయువులు ఇప్పుడు చల్లగా ఉన్నవి. కావిరి విడిచినందువల్ల దిక్కులు చక్కగా కనపడుతూ ఉన్నవి. ఎండకాస్తున్నందువల్ల భూమిమీద బురద ఎండి, పెద్ద పెద్ద గడ్డలు విరిగి నెర్రెలు పడుతున్నవి. పరస్పర వైరమువల్లనూ, అసూయవల్లనూ రాజులు దండయాత్రలకు సిద్ధము అవుతూ ఉన్నారు. ఇది శరదృతువు అయినందువల్ల ఆబోతులు దేహదార్ఢ్యముతో శోభిస్తూ, ఉత్సాహముతో దుమ్ము ఎగచిమ్ముతూ కనబడ్డ ఆబోతులను కయ్యానికి కాలుదువ్వుతూ ఆవుల

మందల మధ్యకు పోయి సంతోషాతిశయముతో రంకెలు పెట్టుతూ ఉన్నవి. పెంటి ఏనుగులు పెనిమిటిమీద గాఢానురాగముతో మందలు మందలుగా బయలుదేరి మదము ఎక్కి మదన తాపముతో, మంద గమనముతో పోతూ ఉన్న పోతు ఏనుగువెంట పడుతూ ఉన్నవి. (అదివరకు ధనికులుగా ఉండి కాల విపర్యయమువల్ల దరిద్రులు అయినవారు, కొత్తగా ధనవంతులు అయిన వారు చేసే అవమానానికి ఏమీ చేయలేక దీనులు అయిపోయినట్టు, నెమళ్ళు వాటి వాటి ఉత్తమాభరణాలు అయిన పింఛాలు వదిలిపెట్టి నదీతీరానికి పోతే, వాటిని చూచి బెదిరిస్తున్నట్టు శరత్కాల గర్వముతో హంసలు కేకలు వేస్తూ ఉంటే, ఆ నెమళ్ళు గర్వము ఉడిగి, దీనలు అయి తలలు వంచుకొని పోతున్నవి. గండ స్థలాలను భేదించుకొని వస్తున్న మదజలాలతో మదపుటేనుగులు ఘీంకారాలు చేస్తూ కారండ పక్షులను, చక్రవాక పక్షులను భయపెట్టుతూ, అలంకారముగా కమలాలు విరగపూసిన కాసారాలలో కెలికి కెలికి నీళ్ళు త్రాగుతున్నవి. బురద అంతా కొట్టుకొనిపోయి స్వచ్ఛజలాలతోను, ఇసుక రేణువులతోను ఉన్న నదీతీరాలలో ఆవుల మందలు అంబారావాలు చేస్తూనూ, బెగ్గురు పక్షులు మనోహరముగా కూస్తూనూ, హంసలు సంతోషధ్వనులు చేస్తూనూ వచ్చి చేరుతున్నవి. మహానదులు ఉరవడిగా ప్రవహిస్తూ చేసే చప్పుళ్ళూ, కొండవాగులు నేలమీద పడుతూ చేసే చప్పుళ్ళూ, అమిత వేగముతో వీచే గాలి చప్పుళ్ళూ, కప్పల బెకబెకలూ ఇప్పుడు వినిపించటము లేదు. వర్షాకాలము అంతా బిలాలలో దాగుకొని ఆహారము లేకుండా కృశించి పోయిన మహాభయంకర విషసర్పాలు వివిధ వర్ణాలతో ఇప్పుడు బయటికి బయలుదేరి వస్తూ ఉన్నవి.

"సాయంసంధ్య అనే స్త్రీని చంద్రుడు అనే నాయకుడు కిరణాలు అనే చేతులు చాచి పట్టుకొంటూ ఉంటే, నక్షత్రాలు అనే వికసించిన కనుపాపలతో రక్తకాంతి అనే అతిశయించిన అనురాగముతో, ఆకాశము అనే చీరెను తన అంతట తానే విప్పి వేస్తోంది. ఉదయించిన చంద్రబింబము ముఖముగాను, నక్షత్రాలు తెరిచిన కన్నులుగాను, వెన్నెల ఉత్తరీయముగాను రాత్రి అనే స్త్రీ, తెల్లనిచీరె కట్టుకొన్న జవరాలువలె తేజరిల్లుతూ ఉంది. బెగ్గురుపక్షులు రమణీయంగా బారులు తీరి పండిన వరిగింజలు తిని సంతోషముతో పయికి ఎగురుతూ ఉంటే, పూలదండలు ఆకాశానికి ఎగిరిపోతున్నట్టు కనబడుతున్నవి. నిద్రపోతున్న హంసలతోను, తెల్లకలువలతోను ఉన్న విశాలము అయిన తటాకజలము, మబ్బులులేని రాత్రిపూట పూర్ణచంద్రుడితోను, నక్షత్రాలతోను తేజరిల్లే ఆకాశమువలె కనపడుతూ ఉంది. విచ్చలవిడిగా తిరుగుతూ ఉన్న హంసలు మొలనూళ్ళుగానూ, వికసించిన కలువలూ కమలాలూ పూలదండలుగానూ మంచిమంచి కోనేళ్ళు ఆభరణాలు పెట్టుకొని పూల

దండలు వేసుకొన్న ఉత్తమాంగనలవలె శోభిస్తున్నవి. ప్రభాతవాయువులకు వెదుళ్ళలో నుంచి వెలువడుతూ ఉన్న ధ్వనులూ, దూడలకోసము అరుస్తున్న ఆవుల అంబారవాలూ, కామాతురతవల్ల ఆబోతులు పెట్టుతూ ఉన్న రంకెలూ ఏకము అయి విచిత్రమయిన సంగీతాన్ని జ్ఞాపకము చేస్తున్నవి. నదీతారాలలో విరగపూసి మందమారుతానికి కదులుతూ ఉన్న రెల్లుపూలను చూస్తూ ఉంటే, తెల్లగా ఉతికిన పట్టుచీర కట్టుకొన్న స్త్రీల జఘనాలవలె నదీతీరాలు కనపడుతూ ఉన్నవి. అడవులలో అడ్డము లేకుండా తిరుగుతూ మధుపానము చేసి, మత్తెక్కి ప్రియురాండ్రతో కూడా చేరి సంతోషాతిశయముతో పద్మరాగాలూ వేగిసపూల పుప్పొళ్ళూ కొట్టుకొని గౌరవర్ణముతో తుమ్మెదలు గాలిని వెంబడించి పోతూ ఉన్నవి. చేపలు అనే ఒడ్డాణాలు పెట్టుకొని నదులు అనే స్త్రీలు రాత్రి అంతా రతికేళిలో ఓలలాడి అలసిపోయి, ప్రాతఃకాలాన తమ తమ ఇండ్లకు మందము మందముగా నడచిపోయేట్లు మెల్లమెల్లగా పారుతున్నవి. చక్రవాకపక్షులతోను, నాచుతోను, రెల్లుపూలతోను గోరోజనము అలముకొని మకరపత్రాలు అలంకరించుకొని తెల్లటి వలువలు కప్పుకొన్న స్త్రీల ముఖాలవలె ఉన్న ఏటిగట్లు శోభాయమానముగా కనపడుతున్నవి. నవసంగమములో సిగ్గుపడి పోయిన యువతులు తమ జఘనాలవలె నదులు ఇప్పుడు మెల్లమెల్లగా ఇసుక తిన్నెలను బయట వేస్తున్నవి.

"నల్లగోరంటపూలూ వేగిసపూలూ విరగపూస్తూనూ, తుమ్మెదలు ఝుంకారము చేస్తూనూ ఉన్న ఈ అడవిలో ఇప్పుడు కాముడు తన చేతిలో ఉన్న వింటికి భయంకరము అయిన బాణాలు ఎక్కుపెట్టి వీరవిహారము చేస్తున్నాడు. మేఘాలు చక్కగా వానలు కురిసి లోకాన్ని సంతోషపెట్టి, నదులను చెరువులను నింపి, భూమిమీద పయిర్లు అన్నీ పండేట్టు చేసి ఆకాశాన్ని వదిలిపెట్టి అగపడకుండా పోయినవి. నాయనా! జలాశయాలలో జలాలు అన్నీ నిర్మలము అయిపోయినవి. ఆడుకొంచపిట్టలు మహామధురముగా అరుస్తున్నవి. చక్రవాకపక్షులు సమూహాలు సమూహాలుగా వచ్చి చేరుతున్నవి. కొండ నెత్తాలలో వేగిసచెట్లూ, ఏడాకుల అరటిచెట్లూ, కాంచనపుచెట్లూ, మంకినచెట్లూ, ప్రేంఖణపుచెట్లూ విరగపూసినవి.

"లక్ష్మణా! చూడు. నదులలో ఇసుక తిన్నెలమీదికి హంసలూ, సారసపక్షులూ, చక్రవాకపక్షులూ, కురరిపక్షులూ వచ్చి విహరిస్తున్నవి.

"ఓ సౌమ్యుడా! నీవు రాజపుత్రుడవు. రాజులు అన్యోన్య వైరముతో ఒకరిని ఒకరు జయించడానికి యుద్ధప్రయత్నాలు చేసే సమయము ఇదే. సుగ్రీవుడు యుద్ధప్రయత్నము చేస్తున్నట్లు కనబడటము లేదు. వర్షాలు కురిసిన నాలుగు మాసాలూ సీతను చూచి నూరు ఏండ్లు అయినట్లుగా దుఃఖముతో బాధపడ్డాను.

పెంటిచక్రవాకము పోతుపిట్టను విడచిపెట్టి ఉండలేనట్టు, ఆ సీత పెనిమిటి అయిన నా వెంటపడి వచ్చింది. బహుభయంకరము అయిన దండకారణ్యానికి ఉద్యానవన విహారానికివలె బయలుదేరింది.

"లక్ష్మణా! రాజ్యము పోయి, దేశము వదలిపెట్టివచ్చి, మహారణ్యములో భార్యను కోలుపోయి దుఃఖార్తుణ్ణిగా ఉంటూ ఉన్న నామీద సుగ్రీవుడికి కృప లేకుండా వుంది. ఓ పరంతపా, లక్ష్మణా! ఈ రాముడు అనాథుడు. రాజ్యము పోగొట్టుకొన్నాడు. వీడి భార్యను రావణాసురుడు ఎత్తుకొనిపోయి వీణ్ణి పరాభవించినాడు. వీడు దూరదేశస్థుడు. ఇప్పుడు దీనుడు, కాముకుడు, నా శరణు చొచ్చినాడు అనే ఈ కారణాలవల్ల ఆ దురాత్ముడు వానరరాజు సుగ్రీవుడు నన్ను అవమానిస్తున్నాడు. వాడి పని నేను చేసిపెట్టినప్పుడు వాడు శరత్కాలము రాగానే సీతను వెతికే ప్రయత్నాలు చేస్తాను అని ప్రతిజ్ఞ చేసినాడు. వాడికి అది జ్ఞాపకము లేదు. వాడు దుర్మతి.

"నాయనా! నీవు ఇప్పుడు కిష్కింధకు పోయి గ్రామ్యసుఖాలలో మునుగుతూ ఉన్న ఆ బుద్ధిహీనుణ్ణి, వానరరాజు సుగ్రీవుణ్ణి చూడు. వాడితో నా మాటలుగా ఇట్లా చెప్పు :

"ఓ సుగ్రీవుడా! కార్యార్థులు అయి ముందుగా ఉపకారము చేసినవారికి వారి కార్యము నెరవేరుస్తాను అని ప్రతిజ్ఞ చేసి తప్పుకొనేవాడికన్నా పురుషాధముడు ఈ లోకములో మరొకడు ఉండడు. పుణ్యముకానీ, పాపముకానీ తాను అన్న మాటకు కట్టుబడి పని చేసిపెట్టేవాడు వీరుడు, పురుషోత్తముడు. స్నేహము చేసి స్నేహితులచేత తమ పని చేయించుకొని ప్రత్యుపకారము చేయనివాడు కృతఘ్నుడు. ఆ కృతఘ్నుడు చచ్చిపోతే వాడి కళేబరాన్ని కుక్కలూ, నక్కలూ కూడా చూడవు.

"లక్ష్మణా! ఆ సుగ్రీవుడితో ఇట్లా చెప్పు : ఇంతవరకూ వాడు బంగారు తొడుగుతో మెరుపు తీగెవలె మెరిసే ధనుస్సును నేను పోరాటములో ఎక్కుపెట్టడము చూడవలెను అనుకొంటున్నాడు. పోరాటములో కోపము వచ్చి నేను నారి సారిస్తూ ఉంటే అయ్యే పిడుగుల వంటి ధ్వనిని వాడు మళ్ళీ ఒకసారి వినవలెను అనుకొంటున్నాడు కాబోలు. నా పరాక్రమము వాడు చక్కగా ఎరిగి ఉండిన్నీ, నీవు నాకు సహాయుడవుగా ఉన్నావు అని తెలిసి ఉండిన్నీ, ఇట్లా కాలము గతించిపోతూ ఉంటే వాడికి, ఆ సుగ్రీవుడికి విచారము ఏమీ లేదు. ఓ వీరుడా! నీవు పరపురంజయుడవు. ఎందుకోసము మనము వాడితో స్నేహము చేసినామో, ఎందుకోసము నేను వాలిని చంపివేసినానో, ఎందుకోసము వాడితో సీతాన్వేషణానికి సంకేతము చేసుకొన్నానో వాడి పని అయిపోయింది కనుక, వాడు ఇప్పుడు గుర్తు ఎరగకుండా ఉన్నాడు. వర్షాకాలము కడిచిపోగానే సీతాన్వేషణ ప్రయత్నాలు చేస్తాను

అని ప్రతిజ్ఞ చేసిన సుగ్రీవుడు, ఇప్పుడు అంతఃపురాంగనలతో హాయిగా విహరిస్తూ ఉన్నాడు. వాడు స్త్రీలోలుడు అయిపోయినాడు. వర్షాకాలము నాలుగు మాసాలూ కడచిపోయినవి అని వాడికి తెలియదు. వాడు మంత్రులతోనూ. బంధుజనముతోనూ తప్పతాగి తందనాలు ఆడుతూ ఉన్నాడు. దుఃఖముతో, దైన్యముతో ఉన్న మన మీద వాడికి కనికరము లేదు.

"నాయనా! నీవు మహాబలవంతుడవు. నీవు పోయి నా కోపము తీరు వాడికి, ఆ సుగ్రీవుడికి తెలియచెప్పు. వాడితో ఇంకా ఇట్లాకూడా చెప్పు : ఓ సుగ్రీవుడా! వాలి చచ్చి ఏ దారిని పోయినాడో ఆ దారి ఇంకా అట్లాగే ఉంది. ఆ దారిని ఇంకా మూసివేయలేదు. నీవు చేసిన ప్రతిజ్ఞకు నిలబడు. వాలి పోయిన దారిన నీవు పోవద్దు. రాముడు ఒక్క బాణముతో వాలిని ఒక్కణ్ణే చంపివేసినాడు. నీవు నీ ప్రతిజ్ఞ తప్పేట్లయితే నిన్ను ఒక్కణ్ణేకాదు, నిన్ను సబాంధవముగా సంహారము చేసివేస్తాడు.

"నాయనా లక్ష్మణా! ఇప్పుడు మన స్థితి ఇట్లా ఉంది. నీవు ఏమేమిటి మాట్లాడితే మనకు మేలు అవుతుందో అని అన్నీ వాడితో మాట్లాడు. కాలము అతిక్రమించిపోతూ ఉంది. నీవు ఆలస్యము చేయవద్దు. త్వరగా పో, ఇంకా వాడితో ఇట్లా చెప్పు : ఓ వానరేశ్వరా! నీ ప్రతిజ్ఞ కాపాడుకో. శాశ్వతము అయిన ధర్మాన్ని గురించి ఆలోచించు. సత్యానికి కట్టుపడు. అట్లా చేయకపోయేట్లయితే నీవు రామబాణానికి గురి అయి యమసదనానికి పోవలసి వస్తుంది. మీ అన్న వాలిని చూస్తావు. నీవు అట్లా చేయవద్దు అని చెప్పు."

ఇట్లా కోపముతో రేగి దుఃఖపడుతూ ఉన్న అన్నగారిని ఆ భయంకర పరాక్రముడు లక్ష్మణుడు చూస్తూ తీవ్రముగా యోచించ సాగినాడు.

31

లక్ష్మణుడు కిష్కింధకు బయలుదేరుట

ఆ మహాసత్త్వుడు రాముడు విరహవేదనవల్ల దీనుడు అయిపోవడమూ, ఖిన్నుడు అయిపోవడమూ, మిత్రుడు ప్రతిజ్ఞ తప్పిపోయినందుకు పరమకుపితుడు అయిపోవడమూ చూచి లక్ష్మణుడు రాముడితో, "అన్నా! సుగ్రీవుడు స్నేహితులతో పాటు సుఖదుఃఖాలు అనుభవించవలెను అనే సదాచారానికి కట్టుపడేవాడు కాడు. అగ్నిసాక్షిగా చేసుకొన్న స్నేహమువల్ల సంప్రాప్తము అయిన సత్ఫలాన్ని వాడు తలచనే తలచడు. వాడు ఇక వానరరాజ్యలక్ష్మిని అనుభవించడము ఉత్తది. వాడు మనకు కలసిరావడము కల్ల. వాడికి బుద్ధిలేదు. అందువల్లనే, వాడు స్త్రీలోలుడు అయిపోయినాడు. నీవు చేసిన రాజ్యప్రదానానికి ప్రత్యుపకారము చేయవలెను అనే

ఆలోచనే వాడికి లేదు. వాడు రాజ్యపాలనానికి అనర్హుడు. వాడి అన్నను చూడడడానికి నేను వాణ్ణి పంపించివేస్తాను. నా కోపము ఉరవడి ఆగేట్టు లేదు. వాడు సత్యము తప్పినాడు. వాణ్ణి చంపివేస్తాను. వాలి పుత్రుడు అంగదుడు వానరవీరులను సహాయము చేసుకొని సీతాదేవి ఎక్కడ ఉందీ వెతికి పెట్టుతాడు'' అంటూ రణరంగములో చండకోపముతో పోరాడే యోధుడివలె బాణాసనము తీసుకొన్నాడు. అలా కిష్కింధకు పోబోతున్న లక్ష్మణుణ్ణి ఆ పరవీరహంత, ఆ ఆశ్రితవత్సలుడు రాముడు చూచి, "లక్ష్మణా! నీవు సజ్జనుడవు. మిత్రవధము పాపకృత్యము. నీవు అటువంటి పాపకృత్యము తలపెట్టవద్దు. కోపాన్ని వివేకముతో అణచివేసేవాడే వీరుడు. పురుష శ్రేష్ఠుడు. లక్ష్మణా! నీవు సదాచార సంపన్నుడవు. బుద్ధిమంతుడవు. మిత్రవధ అనే పాపానికి నీవు ఒడికట్టవద్దు. మనము సుగ్రీవుడితో స్నేహము చేసినాము. ఇంతవరకూ వాణ్ణి ప్రేమతో చూచినాము. ఇప్పుడున్నూ ఆ ప్రేమే వాడి విషయములో నీవు చూపించవలెను. సుగ్రీవుడితో నీవు పరుషముగా మాట్లాడవద్దు. మంచిమాటలతోనే 'కాలాతిక్రమణము చేయడము ధర్మమా' అని అడుగు. అలా అడిగితే చాలును'' అని చెప్పినాడు.

అంతట ఆ శత్రుసంహారకుడు లక్ష్మణుడు కోపాన్ని అణచుకొన్నాడు. ఆ మతిమంతుడు, ఆ ప్రాజ్ఞుడు అన్నగారికి మేలుచేస్తూ ఆయనను సంతోషపెట్టడమే తన పని అనుకొన్నాడు. రాముడు చెప్పినట్టు చెయ్యడానికి కిష్కింధకు బయలుదేరినాడు. ఇంద్రధనుస్సువలెనూ, మందరపర్వత శిఖరమువలెనూ తేజరిల్లుతూ ఉన్న ధనుస్సుతో కాలాంతకుడివలె నడువసాగినాడు.

లక్ష్మణుడు బుద్ధికి బృహస్పతి అంతటివాడు. సుగ్రీవుడితో చెప్పవలసిన మాటలూ, అతడు అందుకు చెప్పగలిగే సమాధానాలూ, అందుకు తాను చెప్పవలసిన ప్రత్యుత్తరాలూ ఆలోచించుకుంటూ, కామక్రోధవశంగతుడు అయిన రాముడి కోపము ఆవరించినందువల్ల త్రోవకు అడ్డము అయిన మద్దిచెట్లను, ఇనుమద్దిచెట్లను, తాటిచెట్లను పడతోసుకొంటూనూ, ఊరువుల వేగానికి పర్వతశిఖరాలమీద చెట్లను ఎగరకొట్టుతూ పోయే పెద్దగాలివలెనూ, పాదాలక్రింద పడిన రాళ్ళు పొడి పొడి అయ్యేటట్లు నలగతొక్కుతూ పోయే మదపుటేనుగువలెనూ లక్ష్మణుడు పెద్ద పెద్ద అంగలు వేస్తూ వేగముగా నడచినాడు. ఎవరికీ చొర నలవికాకుండా పర్వతాల మధ్యను వానరసైన్య సమూహాలు కావలి కాస్తున్న కిష్కింధానగరాన్ని చూచినాడు.

సుగ్రీవుడి మీద కోపముతో పెదవులు అదిరిపోతూ ఉన్న లక్ష్మణుడు కిష్కింధ వెలుపల తిరుగుతున్న భయంకరులు అయిన వానరులను సమీపించినాడు. వాండ్లు ధనుర్ధరుణ్ణి చూచినారు. ఎవరో శత్రువు అనుకొన్నారు. వాండ్లు అందరూ ఏనుగువంటి

వాండ్లు. వెంటనే పర్వతశిలలను, మహోన్నత వృక్షాలను పెళ్ళగించి చేతులలో పట్టుకొని శత్రువులను ఎదిరించడానికి సన్నద్ధులు అయినారు. అట్లా ఆ వానరులు యుద్ధసన్నద్ధులు అయినందుకు లక్ష్మణుడికి మరింత కోపము వచ్చింది. ఎండు కట్టెలు వేసిన అగ్నిహోత్రమువలె అయిపోయినాడు. అట్లా కుపితుడు అయి ప్రళయకాల మృత్యువువలె భయంకరంగా జ్వలిస్తున్న లక్ష్మణుణ్ణి ఆ వానరులు అందరూ చూచినారు. భయపడిపోయినారు. గజగజ వణుకుతూ గుంపులు గుంపులుగా దిక్కులు తెలియకుండా పరుగెత్తి పారిపోయినారు.

అట్లా పరుగెత్తి పారిపోయిన వానరులలో కొందరు సుగ్రీవుడి భవనము వద్దకు పోయినారు. లక్ష్మణుడు క్రుద్ధుడు అయి వచ్చినాడు అని చెప్పినారు. కామపారవశ్యములో తారతో ఉన్న సుగ్రీవుడు ఆ మాటలు వినిపించుకోలేదు.

అప్పుడు యథార్థము తెలిసికొని రావలసిందని వానరవీరులను మంత్రులు ఆజ్ఞాపించినారు. చూచేవాండ్లకు ఒండ్లు గగురుపుట్టించే ఆ పర్వతాకారులు అంతటా కిష్కింధా పట్టణములోనుంచి బయటికి బయలుదేరినారు. వాండ్లు అందరూ ఏనుగులు అంతటివాండ్లు. మేఘసమానులు. వాండ్లు అందరూ భయంకరాకారులు. వాండ్ల వాండ్ల గోళ్లూ, కోరలే వాండ్ల ఆయుధాలు. పెద్దపులులవంటి బలదర్పితులు. భయంకర ముఖులు. వాండ్లలో కొంతమంది పది ఏనుగుల బలము కలవాండ్లు. కొంతమంది నూరు ఏనుగుల బలము కలవాండ్లు. కొంతమంది వెయ్యి ఏనుగుల బలము కలవాండ్లు. వాండ్లు అందరూ ప్రాకారపరిఘలగుండా బయటికి పోయినారు. అందరూ చెట్లు చేతులలో పట్టుకొనిపోయి లక్ష్మణుడి ఎట్టఎదుట నిలుచున్నారు. అట్లా తన ఎట్టఎదుట నిలుచున్న ఆ బలవంతులను వానరవీరులను అందరినీ లక్ష్మణుడు చూచినాడు.

ఆ పరమపరాక్రమవంతుడు, ఆ బుద్ధిమంతుడు లక్ష్మణుడు సుగ్రీవుడి ప్రమత్తతనూ, అన్నగారి దుఃఖాన్ని తలచుకొన్నాడు. మళ్లీ కోపము వచ్చింది. పెద్ద పెద్ద నిట్టూర్పులు విడిచినాడు, కన్నులు జ్యోతులు అయిపోయినవి. పొగలతో మంటలు రగులుకొంటున్న అగ్నిహోత్రమువలె అయిపోయినాడు.

బాణాల ములుకులే చలించే నాలుకలుగాను, ధనుస్సే పడగగాను, తన తేజస్సే విషముగాను అయిదుతలలపాముపలె భయంకరుడు అయినాడు. జ్వలిస్తున్న ప్రళయకాలాగ్నివలెనూ, కోపమువచ్చిన ఆదిశేషునివలెనూ ఉన్న లక్ష్మణుణ్ణి అంగదుడు అప్పుడు అక్కడికిపోయి చూచినాడు. భయపడుతూ, దుఃఖపడుతూ తన దగ్గరకు వచ్చిన అంగదుణ్ణి ఆ మహాయశుడు, ఆ రోషతామ్రాక్షుడు లక్ష్మణుడు చూచి,

"నాయనా! నీవు పోయి నా రాక సుగ్రీవుడికి తెలియచెప్పు. అరిందముడు లక్ష్మణుడు తన అన్నగారి దుఃఖానికి తాపము ఎత్తి ఇక్కడకు వచ్చి వాకిట నిలుచుని ఉన్నాడు అనీ, అతడు చెప్పేది ఇష్టము అయ్యేట్లయితే చేయవలసింది అనీ చెప్పి నీవు వెంటనే తిరిగి నా దగ్గరకు రావలెను" అని చెప్పినాడు.

లక్ష్మణుడు చెప్పిన ఈ తీవ్రము అయిన మాటలకు అంగదుడు కలవరపడిపోయినాడు. దిగులుపడి పోయినాడు. ముఖము వెలవెలపోతూ, వెంటనే సుగ్రీవుడి భవనములోకి పోయినాడు. సుగ్రీవుడి పాదాలకు నమస్కారము చేసినాడు. అంతట రుమ పాదాలకు నమస్కారము చేసినాడు. మళ్ళీ తండ్రి కాళ్ళు పట్టుకొన్నాడు. తన తల్లి తార కాళ్ళు పట్టుకొన్నాడు. ఆమె కాళ్ళు పిసుకుతూ, లక్ష్మణుడు వచ్చిన సంగతి ఆమెకు తెలియచెప్పినాడు. ఆమె సుగ్రీవుణ్ణి మేలుకొలపడానికి ప్రయత్నాలు చేసింది. మద్యం తాగిన కైపువల్లను, మదనపరవశుడు అయి అలసిపోయినందువల్లను, ఒండ్లు ఎరుగకుండా నిద్రపోతున్నందువల్లను సుగ్రీవుడికి నిద్ర మెలకువ రాలేదు.

అప్పుడు అక్కడ చేరిన వానరవీరులు లక్ష్మణుడి కోపము చల్లార్చడానికి సుగ్రీవుడికి తప్ప మరి ఒకరికి సాధ్యముకాదు అనుకొన్నారు. అతనిని నిద్రలేపడానికి కిలకిలధ్వనులు చేసినారు. మహాప్రవాహమువలె వచ్చిన లక్ష్మణుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకోడానికి ఎడతెగకుండా ఉరుముతున్న ఉరుములవలెను, పిడుగులు పడుతున్న మహాధ్వనివలెను సింహనాదాలు చేసినారు.

ఆ మహాధ్వనికి సుగ్రీవుడికి నిద్ర మెలకువ వచ్చింది. తప్పతాగినందువల్ల తేలిపోతున్న ఎర్రని కన్నులు తెరచినాడు. చెదరిపోయిన ఆభరణాలతోను, పూలదండలతోను లేచి కూర్చున్నాడు. అంగదుడి మాట విని అప్పుడు ప్లక్ష ప్రభావులు అనే ఇద్దరు మంత్రులు సుగ్రీవుడి దగ్గరకు వచ్చినారు. వాండ్లు ఇద్దరూ సుగ్రీవుడికి ఇష్టులు. వాండ్లు చాలా దూరదృష్టి కలవాండ్లు. వారు ఒకరు ధర్మానికీ, ఒకరు అర్థానికీ సుగ్రీవుడి మంత్రులుగా ఉన్నారు.

దేవేంద్రుడివలె కూర్చున్న సుగ్రీవుణ్ణి ఆ మంత్రులు అర్థవంతము అయిన మాటలతో ప్రసన్నుణ్ణిగా చేసుకొన్నారు. తప్పుఒప్పులు తెలియచెప్పడానికి లక్ష్మణుడు వచ్చినాడు అంటూ సుగ్రీవుడికి దగ్గరగా కూర్చొని, "రాజా! రామలక్ష్మణులు సత్పురుషులు. సత్యసంధులు. రాజ్యాలు ఏలవలసినవారు. నీతో స్నేహముచేసి నీకు రాజ్యము ఇచ్చినారు. వారు మానవరూపములో అవతరించిన మహనీయులు. వారిలో ఒకడు అయిన లక్ష్మణుడు విల్లు చేతిలో పట్టుకొని నగరము వాకిట ఇప్పుడు నిలుచొని ఉన్నాడు. అతనికి వానరవీరులు అందరూ భయపడి గజగజ వణకుతూ

అరుస్తున్నారు. అతడు రామాజ్ఞవల్ల రామవాక్యమే సారథిగా, ప్రయత్నము చేయడమే రథముగా వచ్చినాడు. తార ప్రియపుత్రుణ్ణి అంగదుణ్ణి నీ దగ్గరకు పంపినాడు. అతడు వాకిట నిలుచొని తన చూపులతో వానరులను అందరినీ దహించివేసేట్టు చూస్తున్నాడు. నీవు ఇప్పుడు నీ పుత్రుడితోను, నీ బంధు జనులతోను పోయి అతనికి శిరసా నమస్కారము చేయవలెను. మహారాజా! తాము వెంటనే బయలుదేరవలెను. ఆలస్యము చేయవద్దు. అతడి కోపము చల్లార్చవలెను. ఆ ధర్మాత్ముడు రాముడు చేయమన్నట్లుగా నీవు మనఃపూర్వముగా పని చేసి చూపించవలెను. నీ ప్రతిజ్ఞ నిలబెట్టుకోవలెను. నీవు సత్యసంధుడవుగా ప్రవర్తించవలెను' అని చెప్పినారు.

32

లక్ష్మణుడు కోపముతో వచ్చినాడు అని అంగదుడి వెంట వచ్చిన ప్లక్ష, ప్రభావులు చెప్పిన మాటలు విని సుగ్రీవుడు కూర్చున్న చోటు నుంచి లేచినాడు.

అంతట ఆ మంత్రకుశలుడు సుగ్రీవుడు మంత్రాంగములో ఆరితేరి గురులాఘవాలు నిశ్చయించి చెప్పే మంత్రజ్ఞులను చూచి, "ఓ మంత్రిపుంగవులారా! ఇది ఏమిటి? నేను ఎప్పుడూ రామలక్ష్మణులను గురించి ఒక్క చెడుమాట అనలేదు. వారి విషయములో నేను ఒక్క చెడు పని చేయలేదు. నామీద రాముడి తమ్ముడికి, లక్ష్మణుడికి ఎందుకు కోపము వచ్చిందా అని ఆలోచిస్తున్నాను. ఎప్పుడూ నా లోపాలు కనిపెట్టుతూ వుండే శత్రువులు ఎవరో దురాత్ములు లేనిపోని దోషాలు నామీద లక్ష్మణుడితో చెప్పి వుంటారు. మీరు అందరూ మీ బుద్ధిబలముకొద్దీ నీతిపద్ధతిని నిపుణముగా ఆలోచించి లక్ష్మణుడికి ఎందుకు కోపము వచ్చిందో తెలుసుకోవలెను. లక్ష్మణుడు అన్నా, రాఘుడు అన్నా నాకు భయము లేదు. కాని, ఏ కారణమూ లేకుండా మిత్రుడు అయిన రాముడికి కోపము వస్తే కలవరపడిపోక తప్పదు. ఎవరితోనయినా స్నేహము చేయడము సులభము. అయితే, ఆ స్నేహాన్ని కాపాడుకోవడము మాత్రము కష్టము. చిత్తవృత్తి నిలకడగా ఉండదు. కనుక, ఏ కొంచెం తేడా వచ్చినా స్నేహము చెడిపోతుంది. ఆ మహాత్ముడు రాముడు నాకు చేసిన ఉపకారానికి తగినంత ప్రత్యుపకారము చేయడము నాకు శక్యముకాదే అని భయపడుతున్నాను" అని చెప్పినాడు.

అప్పుడు ఆ వానర మంత్రులు అందరి మధ్యనూ హనుమంతుడు లేచి స్వబుద్ధితో, "ఓ వానరేశ్వరా! స్నేహితుణ్ణి, అందులో శుభకరుడూ, ఉపకారీ అయిన స్నేహితుణ్ణి నీవు మరచిపోక పోవడము ఏమాత్రమూ ఆశ్చర్యము అయిన విషయము

కాదు. ఆ మహావీరుడు రాముడు నిన్ను సంతోష పెట్టడము కోసము ఏ మాత్రమూ జంకకుండా దేవేంద్రుడు అంతటి పరాక్రమవంతుణ్ణి వాలిని చంపివేసినాడు. ఆ రాముడికి అన్నివిధాల నీమీద కోపము వచ్చి ఉంటుంది. అయితే స్నేహమువల్లనే తన తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి నీ దగ్గరకు పంపించినాడు. లక్ష్మణుడు లక్ష్మీవర్ధనుడు. ఈ విషయములో సందేహము ఏమీ లేదు.

"ఓ సుగ్రీవుడా! నీవు ఏమరుపాటువల్ల కాలాన్ని గుర్తించకుండా ఉన్నావు. ఏడాకుల అరటిచెట్లు నల్లగా పూలు పూసినవి. శుభకరము అయిన శరదృతువు ఇపుడు వచ్చింది. ఆకాశము మేఘాలు లేకుండా నిర్మలముగా ఉంది. నక్షత్రాలూ, గ్రహాలూ చక్కగా కనపడుతున్నవి. పగలూ, రాత్రులూ కూడా దిక్కులు తెలుస్తున్నవి. నదులలోనూ, సరస్సులలోనూ జలాలు నిర్మలముగా ఉన్నవి.

"ఓ వానరపుంగవా! యుద్ధానికి బయలుదేరవలసిన కాలము వచ్చింది. నీవు నీ ప్రమత్తతవల్ల ఈ విషయము తెలుసుకోకుండా ఉన్నావు. కాబట్టి లక్ష్మణుడు ఇప్పుడు ఇక్కడికి వచ్చినాడు. అతడు ఎందుకు వచ్చిందీ స్పష్టముగా తెలుస్తూనే ఉంది. భార్యను కోలుపోయి దుఃఖపడుతూ ఉన్న ఆ మహాత్ముడు రాముడు చెప్పితే లక్ష్మణుడు ఇక్కడికి వచ్చినాడు. ఇప్పుడు ఇతడు నీతో పరుషముగా మాట్లాడినా నీవు ఓర్చుకోవలెను. సంకేతకాలము తప్పించిన అపరాధము నీవు చేసినావు. నీవు చేతులు జోడించి లక్ష్మణుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకో. ఇంతకన్నా మరి ఒక ఉపాయము నాకు తోచడము లేదు. మంత్రులు అయిన వాండ్లు రాజులకు అవశ్యమూ హితము చెప్పవలెను. అందువల్ల నిర్భయముగా నాకు తెలిసిన విషయము చెప్పినాను.

"ఓ రాజా! రాముడికి కోపము వచ్చి చాపము తీసుకొనేట్లయితే దేవాసుర గంధర్వ సహితము అయిన ఈ జగత్తు అంతా అతడి వశము అయిపోతుంది. అతడు అంత సమర్థుడు. కోపం వచ్చినా ప్రసన్నుణ్ణిగా చేసుకోడానికి వీలు అయ్యేవాడికి కోపము తెప్పించకూడదు. అందులో, విశేషించి అదివరకు అతని ఉపకారం పొంది ఆ ఉపకారాన్ని మరచిపోకుండా ఉన్నవాడు అతనికి ఎంత మాత్రమూ కోపము తెప్పించకూడదు.

"ఓ రాజా! నీవు ఇప్పుడు నీ పుత్రుడితోనూ, నీ బంధుజనముతోనూ పోయి ఆ రాముడికి శిరసా నమస్కారము చేసి భర్తకు భార్యవలె నీవు అతని వశము అయిపో. నీ ప్రతిజ్ఞ చెల్లించుకో. ఓ సుగ్రీవుడా! నీవు రాముడి ఆజ్ఞనుకానీ, లక్ష్మణుడి ఆజ్ఞనుకానీ మనస్సులో నయినా ఉల్లంఘించవద్దు. దేవేంద్ర వర్చస్కులు అయిన రామలక్ష్మణుల మానుష బలం నీవు ఎరుగుదువు" అని చెప్పినాడు.

33

లక్ష్మణుని కిష్కింధా ప్రవేశము

అంగదుడు మళ్లీ వచ్చి లక్ష్మణుణ్ణి లోపలికి రమ్మని పిలిచినాడు. అంతట ఆ శత్రుసంహారకుడు భయంకరము అయిన గుహవంటి కిష్కింధా నగరములోకి బయలుదేరినాడు. ఆ నగరము వాకిట కావలి ఉన్న మహాకాయులూ, మహా బలవంతులూ అయిన వానరులు ఆ లక్ష్మణుణ్ణి చూచి లేచి చేతులు జోడించి నిలుచున్నారు. క్రుద్ధుడు అయి నిట్టూర్పులు విడుస్తున్న ఆ ధనుర్ధరుణ్ణి చూచి వారు అందరూ భయపడి పోయినారు. ఆ మహాబాహువుని సమీపించలేక పోయినారు.

ఆ కాంతిమంతుడు లక్ష్మణుడు ఆ ద్వారములో నుంచి కిష్కింధానగరములోకి పోయినాడు. అది రత్నమయము అయిన పట్టణము. ఎటుచూచినా పూచిన చక్కని ఉద్యానవనాలు, రత్నఖచితము అయిన రమ్య హర్మ్యప్రాసాదాలు కనిపించినవి. వివిధ వస్తువులూ అమ్మే అంగళ్ళు ఎంతో శోభాయమానముగా ఉన్నవి. ఏ పండ్లు కావలెను అనుకొంటే ఆ పండ్లు పండే చెట్లు అక్కడ అంతా కనిపించినవి. ఆ చెట్లు అన్నీ అప్పుడు పూస్తూనూ, కాయలు కాస్తూనూ ఉన్నవి.

అక్కడ ఉన్న వానరులు అందరూ అందము అయినవాండ్లు. వాండ్లు దేవతలకూ, గంధర్వులకూ పుట్టినారు. దివ్యము అయిన పూలదండలతోను, దివ్యము అయిన వస్త్రాలతోను కనిపించినారు. వాండ్లు అందరూ కామరూపులు. ఆ రాజవీధి అంతటా చందనపు సువాసనలూ, అగరుఘుమఘుమ సువాసనలూ, పద్మసుగంధమూ, మైరేయ (ఆరెపూల సారాయి) వాసనలూ, మధు (ఇప్పపూల సారాయి) వాసనలూ గుబాళిస్తున్నవి. ఆ పట్టణములో తేటనీళ్ళతో పారుతున్న కొండవాగులున్నూ కనిపించినవి.

ఆ రాజవీధిలో నడచిపోతూ అంగదుడి రమ్యగృహాన్నీ, మైంద ద్వివిదుల నివాస స్థానాలనూ, గజ గవయ గంధమాదన శరభుల నికేతనాలనూ, సంపాతి భవనాన్నీ, విద్యున్మాలి నివేశనాన్నీ, సూర్యాక్షుని మందిరాన్నీ, హనుమంతుడి సదనాన్నీ, వీరబాహు సుబాహుల వేశ్మాలనూ, నల నీలుల సద్మాలనూ, కుముద సుషేణుల ఆలయాలనూ, తారుని ఆగారాన్నీ, జాంబవంతుడి నిలయాన్నీ, దధివక్త్రుని నిశాంతాన్నీ, సుపాటల సునేత్రుల నిలయాలనూ లక్ష్మణుడు చూచినాడు. అవే కాకుండా ఇంకా తక్కిన వానరవీరుల ఇండ్లనూ చూస్తూ నడిచినాడు. ఆ ఇండ్లు అన్నీ గట్టిగా బందోబస్తుగా కట్టినవి. తెల్లటి మేఘాలవలె తేజరిల్లుతూ ఉన్నవి. ఆ ఇండ్లకు అలంకారముగా పూలదండలు వేళ్ళాడుతూ ఉన్నవి. ఏ ఇంట చూచినా ధనధాన్యాలు సమృద్ధముగా ఉన్నవి. ఆ ఇండ్లలో స్త్రీలు రత్నాలవలె కనిపించినారు.

ఆ యా ఇండ్లను, ఆ యా వానరులను చూస్తూ లక్ష్మణుడు సుగ్రీవ భవనము దగ్గరకు పోయినాడు. ఆ భవనానికి చుట్టూ తెల్లటి ప్రాకారము ఉంది. అది లోపలికి పోనలవికాని దేవేంద్రభవనమువలెనూ, దాని ప్రాసాద శిఖరాలు కైలాస శిఖరాలవలె ఎంతో ఎత్తున తెల్లగానూ కనిపించినవి. ఆ భవనపు ఆవరణములో సమస్త ఫల వృక్షాలూ, పుష్ప వృక్షాలూ శోభాయమానముగా కనిపించినవి. అవే కాకుండా దేవేంద్రుడు ఇచ్చిన ఫల పుష్ప వృక్ష సమూహాలు నీలమేఘాలవలె కనిపించినవి. ఆ ఈ ఫల పుష్ప వృక్షాలే కాకుండా చల్లని నీడను ఇచ్చే మహోన్నత వృక్షాలున్నూ అక్కడ పెరుగుతూ ఉన్నవి.

ఆ భవన సింహద్వారము తప్తకాంచనముతో చేసింది. అది ఎంతో అందము అయింది. దానికి తెల్లటి పూలదండలు అలంకారముగా వేళ్ళాడకట్టి ఉన్నవి. మహాబలవంతులు అయిన వానర ద్వారపాలకులు ఆయుధపాణులు అయి అక్కడ కావలి కాస్తున్నారు. ఆ మహాబలవంతుడు లక్ష్మణుడు ఏ అడ్డూ లేకుండా మహామేఘాలలోకి పోయే సూర్యుడివలె ఆ సుగ్రీవ భవనములోకి పోయినాడు. నానారకాల జనులు ఉన్న ఏడుకక్ష్యలూ దాటినాడు. అక్కడ సురక్షితముగా ఉన్న అంతఃపురములోకి పోయినాడు.

అది విశాలము అయిన అంతఃపురము. అక్కడ బంగారు మంచాలూ, వెండి మంచాలూ, మహార్హము అయిన ఆస్తరణాలు పరిచిన ఆసనాలూ ఎన్నో కనిపించినవి. అక్కడ వీణానాదమూ, లయ, పదాల వరుసా తప్పిపోకుండా పాడుతూ ఉన్న మనోహరము అయిన సంగీతమూ వినిపించింది. సౌందర్యముతోనూ, యౌవనముతోనూ విర్రవీగిపోతున్న వివిధ రూపాల స్త్రీలను అనేకమందిని అక్కడ ఆ మహాబలవంతుడు లక్ష్మణుడు చూచినాడు. వాండ్లు అందరూ ఉత్తమ వంశ సంజాతలు. ఆ యువతులు అందరూ తలనిండా పూలు ముడుచుకొని చిత్రవిచిత్రము అయిన పూలదండలు మెడలలో వేళ్ళాడుతూ ఉత్తమాభరణాలతో ధగధగలాడుతూ ఏమరుపాటు లేకుండా పండ్లు ఏరుతూనూ, పూలదండలు కట్టుతూనూ కనిపించినారు.

అక్కడ సుగ్రీవుడి సేవకులలో తృప్తి పడనివాండ్లుకానీ, తమ తమ పనులలో జాగరూకతలేనివాండ్లుకానీ, మంచి వస్త్రాభరణాలు ధరించనివాండ్లుకానీ ఒక్కరూ కనిపించలేదు.

అప్పుడు అక్కడ ఆ కాంతిమంతుడు లక్ష్మణుడు స్త్రీల నూపురాల ధ్వనీ, మొలనూళ్ళ ధ్వనీ విని సిగ్గుపడిపోయినాడు. అట్లా వినిపిస్తున్న ఆభరణాల చప్పుళ్ళకు అప్పుడు ఆ వీరుడికి మహా చెడ్డ కోపము వచ్చింది. అంతట దిక్కులు పిక్కటిల్లిపోయేట్టు

ధనుష్టంకారము చేసినాడు. రామకార్యావసరమునుంచి అక్కడికి పోయిన ఆ మహాబాహువు కుపితుడు అయి తన సచ్ఛీలము కాపాడుకోడానికి అక్కడ ఉండకుండా ఒక మూలకు ఒదిగి నిలుచున్నాడు.

ఆ ధనుష్టంకారధ్వనికి సుగ్రీవుడు ఉలిక్కి పడిపోయినాడు. ఉత్తమాసనం మీది నుంచి లేచినాడు. అన్నగారిమీద భక్తితో లక్ష్మణుడు కుపితుడు అయి తన కోసము వచ్చినట్టు అంతకుపూర్వము అంగదుడు చెప్పి ఉండడమువల్లనూ, అప్పుడు వినిపించిన ఆ జ్యానాదము వల్లనూ లక్ష్మణుడు అప్పుడు అక్కడికి వచ్చినట్టు సుగ్రీవుడికి బోధపడ్డది. అతడికి భయము వేసింది. గొంతు ఎండిపోయింది. కలవరపడి పోయినాడు. అంతట ఆ అందకత్తెను తారను చూచి, "ఓ సుభ్రూ! రాముడి తమ్ముడు లక్ష్మణుడు స్వభావసిద్ధముగా మెత్తనివాడు. ఇటువంటివాడు ఎందుకో కోపముతో ఇక్కడికి వచ్చినట్టు ఉన్నాడు. అతడు అంత కోపముతో రావడానికి కారణము ఏమి అయి ఉంటుంది? ఓ తారా! నీవు చాలా బుద్ధిమంతురాలవు. ఆ చిన్నవాడికి ఎందువల్ల అంత కోపము వచ్చింది అని నీవు అనుకొంటున్నావు? అతడు పురుషోత్తముడు. అతడికి అకారణముగా కోపము రాదే! మనము ఏ కొంచెము అయినా అతనికి అప్రియము చేసినామా? నీకు ఏమి అయినా గుర్తు ఉందా? నీ బుద్ధి బలముతో ఆలోచించు. చప్పున చెప్పు. పోనీ, ఏమి అయినా కావచ్చును. నీవు ముందు పోయి చూడు. ఆ లక్ష్మణుడితో మాట్లాడు. చల్లని మాటలు చెప్పు. అతడు ప్రసన్నుడు అయ్యేటట్టు చూడు. సందేహించవద్దు. ఈ పని నీచేత నవుతుంది. ఇందుకు తగినదానవు నీవే. అతడు నిన్ను చూడగానే ప్రసన్నుడు అవుతాడు. ఆ నిర్మలచిత్తుడు నిన్ను కోపపడడు. మహాత్ములు స్త్రీల విషయములో దారుణముగా ప్రవర్తించరు. నీ సామవాక్యాలకు అతని మనస్సు కరిగిపోతుంది. ప్రసన్నుడు అవుతాడు. అప్పుడు ఆ కమలపత్రాక్షుణ్ణి, ఆ అరిందముణ్ణి నేను వచ్చి చూస్తాను. నీవు పో" అని చెప్పినాడు.

అప్పుడు ఆ తార ఎట్లా ఉందో అట్లా బయలుదేరింది. (సంభోగ వివశ అయినందువల్ల) అడుగులు తడపడిపోతూ, మదిరాపానమువల్ల కన్నులు తేలిపోతూ (చీర తిరిగి కట్టుకోనందువల్ల) మొలనూలూ, బంగారు మొలత్రాడూ వేళ్ళాడుతూ (చెదరిపోయిన వెంట్రుకలూ, ఊడి పోయిన రవికా, జారిపోతున్న చీరె మొదలు అయిన సంభోగ చిహ్నాలతో స్తనభారమునుంచి) కొంచెము వంగిపోయిన కాయపారు శరీరముతో ఆ తార లక్ష్మణుడి దగ్గరకు పోయింది. అట్లా తన ఎట్టఎదుటికి వచ్చి నిలుచున్న ఆ వానర రాజపత్నిని, తారను ఆ బుద్ధిమంతుడు లక్ష్మణుడు చూచినాడు. ఏమీ తోచక నిలుచుండి పోయినాడు. లజ్జ వేసింది. కోపానికి తావు లేకపోయింది.

తలవంచుకొన్నాడు. మద్యపానము మత్తువల్ల లజ్జ లేకుండా పోయిన ఆ తార లక్ష్మణుడి చూపులలో కోపము లేకపోవడము గమనించింది. అంతట స్నేహాతిశయముతో, ధైర్యముతో మహార్థవంతముగా మహామంచిగా, "ఓ రాజపుత్రా! నీ కోపానికి కారణము ఏమిటి? నీ మాట మీరినవాడు ఎవడు? ఎండుటడవిని దహించివేసే దావానలములో నిర్భయముగా పడదలచుకొన్నవాడు ఎవడు?" అని ఊరడిస్తూ అడిగింది.

స్నేహాతిశయముతో అట్లా నిష్కపటంగా అడిగిన తారతో, "ఓ తారా! నీవు నీ పెనిమిటికి మేలు చేయడమే పనిగా పెట్టుకొన్నావు. అందువల్ల ఇట్లా మాట్లాడుతున్నావు. నీ పెనిమిటి ధర్మార్థాన్ని సమకూర్చుకోడము మానివేసినాడు. మన్మథ వ్యాపారములో పడిపోయినాడు. రాజ్య కార్యాలను గురించి ఆలోచించడము లేదు. శోక పరాయణులము అయిన మమ్మలను గురించి తలంచుకోడము అయినా లేదు. మంత్రులూ, తానూ మద్యము సేవించడము కన్నా మరి ఒక పని చేయడము లేదు.

"ఓ తారా! వానరేశ్వరుడు యుద్ధ ప్రయత్నాలకు నాలుగు మాసాల గడువు కావలెను అని రాముడితో చెప్పినాడు. మద్యపానంతో గడువు కాలము అయిపోయిన సంగతి కూడా ఎరగకుండా ఉన్నాడు. ధర్మార్థస్థితికి పాటుపడేవాడు ఎవడూ ఇట్లా త్రాగుతూ ఉండడు. ఈ త్రాగుడును ఎవరూ కొనియాడరు. అంతేకాదు, అందువల్ల అర్థమూ, ధర్మమూ, కామమూ నాశనము అయిపోతవి.

"ఓ తారా! ఉపకారికి ప్రత్యుపకారము చేయకపోవడం కన్నా గొప్ప ధర్మలోపము మరి ఒకటి ఉండదు. అట్లా ప్రత్యుపకారం చేయకుండా గుణవంతుడు అయిన మిత్రుణ్ణి పోగొట్టుకోవడమువల్ల అర్థలోపము అవుతుంది. అర్థలోపమే కాదు, కామ లోపమున్నూ అవుతుంది. తన అర్థ కామాలకు మూలకారకుడు అయిన సత్యధర్మ పరాయణుడు ఆ అర్థ కామాలకన్న అధికుడు. ఈ సుగ్రీవుడు అటువంటి మిత్రుణ్ణి వదులుకుంటున్నాడు. ధర్మానికి కట్టుపడడము లేదు. అందువల్ల ఇతడికి ధర్మార్థకామాలు మూడూ నాశనము అయిపోతవి.

"ఓ రాజపత్నీ! నీవు కార్య స్వరూపము తెలిసినదానవు. సుగ్రీవుడు ఇట్లా కాలయాపనము చేస్తూ ఉంటే మేము ఏమి చేయవలెనో నీవు చెప్పు" అన్నాడు లక్ష్మణుడు.

ధర్మార్థాల సంబంధాన్ని ఇట్లా మనోహరముగా చెప్పిన లక్ష్మణుడి మాటలు విని ఆ తార ఆ మానవనాథుడు రాముడు అతనిని పంపించిన పని ఏమిటో

తెలుసుకొన్నది. లక్ష్మణుడు నమ్మేటట్టు మళ్ళీ, "ఓ రాజపుత్రా! ఇది కోపానికి సమయము కాదు. అందులో స్వజనుల విషయములో అతికోపము పనికిరాదు. సుగ్రీవుడు మీ ప్రయోజనాన్నే కాంక్షిస్తున్నాడు. అయితే అతడి ఏమరుపాటును మీరు సహించవలెను. నాయనా! వీర్యవంతుడు అయిన గుణాధికుడు తనకన్నా బలహీనుణ్ణి కోపపడి ప్రయోజనము ఏమిటి? నీవంటి సత్వగుణ సంపన్నుడూ, తపోనిధి అయినవాడూ కోపపరవశుడు అవుతాడా!

"నాయనా! యుద్ధ ప్రయత్నాలకు కాల విలంబనము కావడము నేను ఎరుగుదును. వానరవీర బంధువు ఆ రాముడు కుపితుడు అయిపోవడమూ నేను ఎరుగుదును. మీరు సుగ్రీవుడికి చేసిన మహోపకారము నేను ఎరుగక పోలేదు. అందుకు సుగ్రీవుడు ఏమి చేయవలెనో అదీ ఎరుగక పోలేదు. అయితే మన్మథుడి ధాక తట్టుకోలేము అని కూడా ఎరుగుదును. ఇప్పుడు సుగ్రీవుడు ఏ స్త్రీ జనము కోసము కామానికి కట్టుబడిపోయి ఉన్నాడో అదిన్నీ నేను ఎరుగుదును. ఓ లక్ష్మణుడా! నీ కోపపారవశ్యము చూస్తూ ఉంటే కామ వ్యాపారములో నీకు జ్ఞానము ఏమీ లేదు అనిపిస్తూ ఉంది. నాయనా! కామపరతంత్రుడు దేశకాలాలనూ, ధర్మార్థాలనూ ఆలోచించడు. వాడికి వాటితో నిమిత్తము ఉండదు.

"ఓ లక్ష్మణా! నీవు పరవీరహంతవు. ఆశ్రితవత్సలుడవు. సుగ్రీవుడు కామపరతంత్రుడు అయి నా దగ్గర ఉన్నాడు. కామపారవశ్యమువల్ల అతనికి ఇప్పుడు లజ్జాదులు లేకుండా పోయినవి. అయితే, అతడు నీకు తోబుట్టువువంటివాడు. నీవు అతనిని ఇప్పుడు క్షమించవలెను. కామాన్ని దరిచేరనీయకుండా ఉండే ధర్మపరాయణులూ, తపశ్చరణపరాయణులూ అయిన మహర్షులు సయితము కాముడికి లోపడిపోతూ ఉంటారు. వానరుడూ, స్వభావసిద్ధముగా చపలచిత్తుడూ అయిన ఈ కపిరాజు విషయలంపటుడు అయిపోవడములో ఆశ్చర్యము ఏమీలేదు" అంటూ మహార్థవంతముగా, విలాసముగా మద్యపానము మత్తుతో తూలిపోతూ చెప్పి తన పెనిమిటి మేలుకోసము మళ్ళీ లక్ష్మణునితో,

"నాయనా! నీవు సర్వోత్తముడవు. నేను చెప్పుతున్న విషయము విను. సుగ్రీవుడు కామపరవశుడు అయిఉన్నప్పటికిన్నీ మీ కార్యసాధనకు కావలసిన ప్రయత్నాలు అన్నీ చేస్తూనే ఉన్నాడు. వానర సేనలను అన్నిటినీ ఇక్కడికి రావించవలెను అని ఇదివరకే ఆజ్ఞాపించినాడు. వివిధ పర్వతాలమీదనూ నివసిస్తూ ఉన్న వానరవీరులు మహాపరాక్రమవంతులూ, కామరూపులూ అయిన వానరులు అనేక కోట్లమంది ఇప్పుడు కిష్కింధకు వచ్చి ఉన్నారు.

"ఓ మహాబాహూ! నీవు పరస్త్రీలు ఉన్నచోటికి పోకూడదు అనుకొని ఇక్కడ, ఈ మూల ఒదిగి నిలుచొని నీ సదాచారాన్ని కాపాడుకొంటున్నావు. కాని మిత్రుల భార్యలను చూడడము దోషము కాదు. అందువల్ల, నీవు నాతో లోపలికి రా! సుగ్రీవుణ్ణి చూడు. అతడితో మాట్లాడు" అని చెప్పింది.

రామకార్యావసరమువల్లను, తార వచ్చి సుగ్రీవుడితో మాట్లాడమని చెప్పినందువల్లను ఆ మహాబాహు, ఆ అరిందముడు లక్ష్మణుడు అప్పుడు సుగ్రీవుడి అంతఃపురములోకి పోయినాడు. దివ్యాభరణ కాంతులతోను, విచిత్రము అయిన దేహ కాంతులతోను, సూర్యసమానుడుగాను, దివ్యము అయిన పూలదండలతోనూ, దివ్యము అయిన వస్త్రాలతోనూ, జయించ నలవికాని దేవేంద్రునివలె తేజరిల్లుతూ, మహార్హము అయిన ఆస్తరణాలు పరచిన కనకాసనంమీద స్త్రీల మధ్యను కూర్చుని ఉన్న ఆ దివ్యరూపుణ్ణి సుగ్రీవుణ్ణి లక్ష్మణుడు చూచినాడు. పరమకుపితుడు అయినాడు. అతని కన్నులు నిప్పుకణికలు అయిపోయినవి. కాలాంతకుడివలె కనిపించినాడు.

అట్లా కాంచనాసనముమీద స్త్రీలమధ్యను రుమను గట్టిగా కౌగిలించుకొని కూర్చొని ఉన్న ఆ బలవంతుడు, ఆ వీరుడు, ఆ హేమగాత్రుడు, ఆ విశాలనేత్రుడు సుగ్రీవుడు అప్పుడు ఆ సువిశాలనేత్రుణ్ణి చూచినాడు.

34

సుగ్రీవునిపై లక్ష్మణుని ఆగ్రహము

అన్నగారి వ్యసనానికి తాపము ఎత్తి అట్లా అంతఃపురములోకి వచ్చి క్రుద్ధుడు అయి నిట్టూర్పులు విడుస్తూ భగభగ మండే అగ్నిహోత్రమువలె తేజరిల్లుతూ ఉన్న ఆ పురుషపుంగవుణ్ణి, ఆ అప్రతిహత పరాక్రముణ్ణి లక్ష్మణుణ్ణి చూచి సుగ్రీవుడు వణికిపోయినాడు. అంతట ఆ వానర శ్రేష్ఠుడు, కూర్చుని ఉన్న ఉన్నత కనకాసనము మీద నుంచి లేచినాడు. ఉత్సవార్థము అలంకారాలతో లేవనెత్తే దేవేంద్రుడి ధ్వజమువలె నిలుచున్నాడు. ఆకాశాన పూర్ణచంద్రుడు ఉదయించగానే నక్షత్రాలవలె ఆ సుగ్రీవుడు లేవగానే అతనితో పాటు రుమ మొదలు అయిన స్త్రీలు అందరూ లేచి నిలుచున్నారు.

ఆ శ్రీమంతుడు సుగ్రీవుడు అంతట చేతులు జోడించి ఎదురుగుండా పోయి పానమదమువల్ల ఎర్రపడిపోయిన కన్నులతో లక్ష్మణుణ్ణి చూస్తూ మహాకల్ప వృక్షమువలె నిలుచున్నాడు. అట్లా నక్షత్రాలమధ్య చంద్రుడివలె ఆ వానరాంగనల మధ్య రుమతో కూడా వచ్చి నిలుచున్న సుగ్రీవుణ్ణి చూచి లక్ష్మణుడు, "ఓ సుగ్రీవుడా! సత్కులసంజాతుడూ, బలవంతుడూ, కనికరముకలవాడూ, జితేంద్రియుడూ,

కృతజ్ఞుడూ అయిన రాజును ఈ లోకములో అందరూ పూజిస్తారు. అధర్మపరుడు అయి తనకు అదివరకు ఉపకారము చేసిన వారికి మిధ్యా ప్రతిజ్ఞ చేసిన రాజుకన్నా పాపిష్ఠివాడు మరి ఒకడు ఈ లోకంలో ఉండడు.

"ఒక గుర్రము విషయమై అబద్ధము ఆడేవాడు, నూరు గుర్రాలను చంపిన పాపాన పోతాడు. ఒక గోవు విషయము అయి అబద్ధము ఆడేవాడు, వెయ్యి గోవులను చంపిన పాపాన పోతాడు. ఒక మానవుడి విషయము అయి అబద్ధము ఆడేవాడు, బంధుహత్య చేసి ఆత్మహత్య చేసుకొన్నవాడి పాపాన పోతాడు.

"ఓ వానరరాజా! మిత్రులచేత ముందుగా తనపని చేయించుకొని కృతార్థుడు అయిన తరువాత తనకు పని చేసి పెట్టిన మిత్రుల పని చేయని వాణ్ణి, ఈ లోకములో కృతఘ్నుడు అంటారు. అటువంటి కృతఘ్నుణ్ణి ఎవరు అయినా చంపివేయ వచ్చును. అందులో దోషము ఏమీ లేదు. సర్వలోకాలవారూ పూజించిన స్వాయంభువ మనువు కృతఘ్నుణ్ణి చూచి క్రుద్ధుడు అయి ఒక శ్లోకము చెప్పినాడు. ఆ శ్లోకములో చెప్పింది విను : బ్రాహ్మణుణ్ణి చంపినవాడికీ, సురాపానము చేసినవాడికీ, దొంగతనము చేసినవాడికీ, భగ్నవ్రతుడికీ పెద్దలు ప్రాయశ్చిత్తాలు చెప్పినారు కాని, కృతఘ్నుడికి ప్రాయశ్చిత్తము లేనేలేదు.

"ఓ వానరుడా! నీవు ముందుగా రాముడి చేత నీ పని చేయించుకొన్నావు. నీవు చేస్తాను అని చెప్పిన ప్రకారము ఆ రాముడి పని నీవు చేయకుండా ఉన్నావు. ఇందువల్ల నీవు దుష్టుడవు. మిధ్యావాదివి. కృతఘ్నుడవు. ఓ వానరుడా! నీ పని చేయించుకొన్న తరువాత రాముడి పని చేసిపెట్టవలెను అని నీవు నిజముగా అనుకొన్నట్లయితే, ఈపాటికే సీతాదేవిని వెతికే ప్రయత్నాలు అన్నీ చేసి ఉండేవాడవు. నీవు విషయలోలుడవు అయిపోయినావు. నీ ప్రతిజ్ఞ మిధ్య అయింది. నీవు కప్పవలె అరిచే దుష్టసర్పానివి అని రాముడు ఎరుగడు. ఆ పూజ్యుడు, ఆ మహాత్ముడు, ఆ కరుణానిధి రాముడు నీవు దురాత్ముడవు అనీ, పాపిష్ఠి వాడవు అనీ తెలియక నిన్ను ఈ వానర రాజ్యానికి రాజును చేసినాడు.

"ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఏమాత్రము శ్రమ లేకుండా ఇట్టే చేసిపెట్టే ఆ రాముడి పనిని నీవు తలపెట్టకపోయేట్టయితే, నా తీక్షణ బాణాలతో నిన్ను నీ అన్న వాలి దగ్గరకు పంపించివేస్తాను. ఆ వాలి పోయిన దారి ఇంకా అట్లాగే తెరిచి ఉంది. ఆ దారిని ఇంకా మూసివేయలేదు. కాబట్టి ఓ సుగ్రీవుడా! ఇప్పుడు నీ ప్రతిజ్ఞమీద నిలబడు. వాలి మాదిరిగా నీవు పోవద్దు.

"ఓ సుగ్రీవుడా! నీవు ఇక్ష్వాకువంశశ్రేష్ఠుడు అయిన రాముడి కార్ముకములో నుంచి వెలువడే పిడుగులవంటి బాణాలను నిజముగా చూడలేదు. అందువల్లనే,

నీవు రామకార్యాన్ని గురించి ఆలోచించకుండా విషయసుఖాలు అనుభవిస్తూ సుఖముగా ఉన్నావు" అని చెప్పినాడు.

35

తార లక్ష్మణుని శాంతపరచుట

తన తేజముతో అగ్నిహోత్రునివలె జ్వలిస్తూ అట్లా మాట్లాడుతూ ఉన్న లక్ష్మణుణ్ణి చూచి ఆ తారాధిపానన తార, "లక్ష్మణా! నీవు సుగ్రీవుణ్ణి గురించి ఇట్లా మాట్లాడవద్దు. ఈ వానరేశ్వరుడితో ఇంత పరుషముగా నీవు, అందులో అతని పరమమిత్రుడు అయిన రాముడి తమ్ముడవు నీవు మాట్లాడడము ఏమీ బాగాలేదు. ఈ కపీశ్వరుడు ఎంతమాత్రమూ కృతఘ్నుడు కాడు. వంచకుడు కాడు. క్రూరుడు కాడు. కుటిలుడు కాడు. అనృతాలు ఆడేవాడు అంతకుముందే కాడు. ఏ ఇతరులకూ చేయనలవికాని ఉపకారము రాముడు తనకు చేయడము ఈ కపివీరుడు ఏమాత్రమూ మరచిపోలేదు. ఓ పరంతపా! రామానుగ్రహమువల్లనే ఈ సుగ్రీవుడు శాశ్వతము అయిన వానర రాజ్యాన్నీ, భార్య అయిన రుమనూ, నన్నూ సంపాదించు కొన్నాడు అనే సంగతి మాకు అందరికీ తెలుసును. అందువల్ల ఇతడు మరచిపోయినాడు అనుకోడానికి ఏమాత్రమూ వీలులేదు.

"నాయనా! ఈ సుగ్రీవుడు ఇదివరకు రాళ్ళమీదనూ, రప్పలమీదనూ బహుకాలము ఒంటరిగా పడుకొన్నాడు. సుఖము అనుభవించడము ఇప్పుడే మొదలు పెట్టినాడు. పూర్వము మేనకను దగ్గరకు తీసి ఎంతకాలము గతించిపోయిందీ తెలుసుకొనలేకపోయిన విశ్వామిత్రమహర్షివలె, రాముడితో ఏర్పాటు చేసుకొన్న సంకేతకాలము గతించి పోయింది అని ఈ సుగ్రీవుడు తెలుసుకోలేక పోయినాడు. నాయనా లక్ష్మణా! మహాతపస్సంపన్నుడూ, ధర్మవేత్తా అయిన విశ్వామిత్రుడు మేనకతో గడపిన పది సంవత్సరాలూ ఒక పగలుగా గడిచిపోయింది అనుకొన్నాడు. కాలజ్ఞులలో శ్రేష్ఠుడూ, మహాత్ముడూ అయిన విశ్వామిత్రమహర్షే మన్మథ పారవశ్యమువల్ల ఎంతకాలము గతించిందీ ఎరగకపోతే, ఇక తక్కిన వాండ్లను గురించి, అందులో వానరుణ్ణి గురించి ఏమి అని చెప్పవలెను? ఓ లక్ష్మణా! సుగ్రీవుడు బహుకాలము ఏకాకిగా బాధ పడ్డాడు. ఇప్పుడు దేహధర్మాన్ని అనుభవిస్తున్నాడు. ఇంతవరకూ కామసుఖాన్ని తనివితీరా అనుభవించి ఎరుగడు. అందువల్ల, ఇప్పుడు కామ పారవశ్యములో ఉన్న సుగ్రీవుణ్ణి నీవు క్షమించవలెను.

"నాయనా లక్ష్మణా! నీవు సుగ్రీవుడి నిశ్చయాభిప్రాయము తెలుసుకోకుండాను, యథార్థము ఆలోచించకుండాను పామరుడివలె కోపపడడము బాగాలేదు. నీవు పురుషర్షభుడవు. సత్త్వగుణ సంపన్నుడవు. నీవంటివాండ్లు ఆలోచించకుండా

హఠాత్తుగా కోపపరవశులు అయిపోరు. నాయనా! నీవు సమస్త ధర్మాలు తెలిసినవాడవు. సుగ్రీవుడి కోసము నేను నిన్ను మనసారా వేడుకొంటున్నాను. కోపమువల్ల వచ్చిన ఈ తొందరపాటును నీవు వదలిపెట్టవలెను. రామకార్యార్థము అవసరము అయ్యేట్లయితే ఈ సుగ్రీవుడు రుమనూ, నన్నూ, వానరరాజ్యాన్నీ, ధనధాన్యాలనూ, నిధినిక్షేపాలనూ త్యజించి వేస్తాడు అని నేను గట్టిగా చెప్పగలను. ఈ సుగ్రీవుడు యుద్ధములో రావణాసురుణ్ణి చంపివేసి రోహిణీదేవిని చంద్రుడితోవలె సీతాదేవిని రాముడితో చేరుస్తాడు.

"ఓ లక్ష్మణా! లంకాపట్టణములో ఒక లక్షకోట్ల మూడులక్షల అరవై వేలమంది రాక్షసులు ఉన్నారు. వాండ్లే కాకుండా ఇంకా అనేక లక్షలమంది రాక్షసులు దేశము అంతటా ఉన్నారు. వాండ్లు, ఆ రాక్షసులు అందరూ కామరూపులు. ఎవరికీ వాండ్లు భయపడరు. వాండ్లను అందరినీ చంపివేస్తేకానీ సీతను ఎత్తుకొని పోయిన రావణాసురుణ్ణి చంపి వేయడము అశక్యము. సైన్యసహాయము లేకుండా సుగ్రీవుడు ఒక్కడూ యుద్ధములో ఆ రాక్షసులను అందరినీ చంపివేయడము అంతకన్నా అశక్యము. పయిగా వాడు, ఆ రావణాసురుడు క్రూరకర్ముడు. వాడిమీదికి ఒంటరిగా పోవడము అసలే అశక్యము. వాలి నాకు ఈ విషయము చెప్పినాడు. ఆ వానరేశ్వరుడికి వాలికి ఆ రావణాసురుడి సంగతులు అన్నీ తెలుసు. ఆ రాక్షసుడికి అంతబలము ఎట్లా వచ్చిందో నాకు స్వయముగా తెలియదు. కాని వాలి చెప్పితే విన్నాను. మీకు సాయము చేయడము కోసమే వానరవీర సమూహాలను పిలుచుకొని రావడానికి అనేకమంది వానరశ్రేష్ఠులను సుగ్రీవుడు ఇదివరకే పంపించినాడు. ఈ వానరనాథుడు సుగ్రీవుడు మహాబలవంతులూ, పరమపరాక్రమవంతులూ అయిన వానరవీర సమూహాల రాకను ఎదురుచూస్తూ ఉన్నాడు. అందువల్ల, ఒంటరిగా వచ్చి చేసేది ఏమీ ఉండదు అనుకొని రామకార్యార్థము ఇంకా ఇతడు బయటికి బయలుదేరలేదు.

"ఓ లక్ష్మణుడా! రామకార్యార్థము రావలెను అని ఈ సుగ్రీవుడు ఇదివరకు ఆజ్ఞాపించిన మహాబలవంతులు అయిన వానరవీరులు అందరూ ఈనాడు ఇక్కడికి రావలసి ఉంది. నాయనా! నీవు కాకుత్స్థుడవు. అందువల్ల శత్రుసంహారకుడవు. ఆశ్రితవత్సలుడవు. నీకు కోపము వద్దు. ఈవేళ ఇక్కడికి కోట్లకొద్దీ వానరవీరులూ, కోట్లకొద్దీ భల్లూకరవీరులూ, గోలాంగూలవీరులూ వస్తారు. నీవు చూస్తావు.

"నాయనా! నిన్ను చూచీ, కోపముతో నెత్తురువలె ఎర్రపడిపోయిన నీ నేత్రాలను చూచీ మొదట జరిగినట్లు (వాలిని చంపివేసినట్లు) అవుతుందేమోను అనే

సంశయముతో ఈ వానరనాథుడి భార్యలు అందరూ భయపడుతున్నారు. నాయనా! నీవు ఎంత చెప్పినా వినకుండా ఉన్నావు" అన్నది.

36

వానర వీరుల సమీకరణము

ఇట్లా వినయముగా, ధర్మసహితముగా తార యథార్థము చెప్పివేసింది. లక్ష్మణుడు స్వభావతః మెత్తనివాడు. ఆమె చెప్పిన హేతువులు అన్నీ ఆలోచించినాడు. ఒప్పుకొన్నాడు. ప్రసన్నుడు అయినాడు.

అంతవరకూ భయపడుతూ ఉన్న సుగ్రీవుడు అప్పుడు లక్ష్మణుణ్ణి చూచి తడి గుడ్డనువలె తన భయాన్ని వదలిపెట్టినాడు. చిత్ర విచిత్రము అయిన రంగులతోనూ, ఘుమఘుమ వాసనలు గుబాళిస్తూనూ, తన మెడలో వేళ్ళాడుతూనూ, ఉన్న పూలదండలను అంతట ఆ సుగ్రీవుడు తెంచివేసి మన్మథ వ్యాపారాలను అన్నిటినీ తెంచివేసినట్లు తెలియపరచినాడు.

ఆ వానరోత్తముడు సుగ్రీవుడు ఆ భీమబలుణ్ణి లక్ష్మణుణ్ణి సంతోషపెట్టడానికోసము వినయము ఉట్టిపడుతూ, "ఓ లక్ష్మణా! నన్ను వదలిపెట్టిపోయిన సంపదా, కీర్తీ, శాశ్వతము అయిన వానర రాజ్యమూ, నాకు సంబంధించిన సర్వమూ నాకు రామానుగ్రహమువల్ల తిరిగి సంప్రాప్తము అయినవి గాని మరొకవిధముగా మాత్రము కాదు.

"ఓ అరిందమా! నీవు వీరుడవు. నేను నీకు చెప్పనక్కరలేదు. తన పనులవల్ల ఖ్యాతి కెక్కిన ఆ దేవుడికి రాముడికి ప్రత్యుపకారము చేసే సామర్థ్యము ఈ లోకములో ఎవడికి ఉంది? నేను సహాయమాత్రుణ్ణే. ఆ ధర్మాత్ముడే తన ప్రభావముతో సీతాదేవిని తెచ్చుకొంటాడు. రావణాసురుణ్ణి సంహారము చేసివేస్తాడు. ఏడు మహావృక్షాలనూ, పర్వతాన్నీ, భూమినీ ఒక్క బాణముతో ఛేదించి వేసిన ఆ మహావీరుడికి మరి ఒకడు సహాయము చేయడము ఏమిటి? నారి సారించిన మహాధ్వనికి మహాపర్వతాలతో కూడా ఈ భూమి అంతా సంచలించి పోయింది. ఆ మహావీరుడికి ఎవరి సహాయము ఏమి కావలసి ఉంటుంది? ఓ నరపుంగవా! ఆ రావణాసురుణ్ణి సైన్యసహితముగా సంహారము చేయడానికి ఆ రాజేంద్రుడు రాముడు ముందు నడుస్తూ ఉంటే, నేను ఆ మహానుభావుడి వెంట ఉంటాను, అంతే.

"ఓ లక్ష్మణా! నేను ఆ రామప్రభువు భృత్యుణ్ణి. నన్ను ఆ మహానుభావుడు ఏమీ చేయడు అనే నమ్మకమువల్లనో, చనువువల్లనో నేను కొంచెము కాలాతిక్రమణము చేసి ఉన్నట్లయితే నన్ను నీవు క్షమించవలెను. ఈ లోకములో తప్పు చేయకుండా ఉండేవాడు ఎవడూ లేడు" అని చెప్పినాడు.

ఇట్లా పూజ్యుడు ఆ సుగ్రీవుడు చెప్పింది విని లక్ష్మణుడు సంతుష్టుడు అయినాడు. సుగ్రీవుణ్ణి చూచి ప్రేమాతిశయముతో, "ఓ సుగ్రీవుడా! నీవు వానర నాథుడవు. విశేషించి నీవు వినయవంతుడవు కావడము వల్ల, మా అన్న రాముడు అన్నివిధాలా తోడు ఉన్నవాడు అయినాడు. ఓ వానరుడా! నీ పరిశుద్ధ స్వభావాన్నీ, నీ ప్రభావాన్నీ చూస్తూ ఉంటే ఉత్తమోత్తమము అయిన ఈ వానర రాజ్యలక్ష్మిని అనుభవించతగినవాడవు నీవేను అని తోస్తూ ఉంది. నీ సహాయముతో ఆ పరమ పరాక్రమవంతుడు రాముడు అచిరకాలములో యుద్ధము చేస్తాడు. శత్రుసంహారము చేస్తాడు. సందేహము లేదు. ధర్మము తెలిసినవాడూ, మేలు మరవనివాడూ, రణరంగములోనుండి వెనుకకు మళ్ళనివాడూ చెప్పేమాట నీవు చెప్పినావు, బాగుంది.

"ఓ సుగ్రీవుడా! నిగ్రహానుగ్రహ సమర్థుడు అయి ఉండి తమ తప్పు తాము తెలుసుకొని తాము తప్పు చేసింది వాస్తవమేను అని చెప్పేవాండ్లు మా అన్న రాముడూ, నీవూ తప్ప మరి ఒకండ్లు లేరు. ఓ వానరపుంగవా! నీవు పరాక్రమములోనూ, బలములోనూ మా అన్న రాముడితో సరిసమానము అయినవాడవు. దైవదత్తముగా నీవు మాకు సహాయము చేసేవాడవు అయినావు. ఓ వీరుడా! నీవు ఇప్పుడు నాతో బయలుదేరి రావలెను. భార్యను ఎత్తుకొని పోయినందువల్ల కృశించి పోతున్న నీ మిత్రుణ్ణి రాముణ్ణి నీవు ఊరడించవలెను. దుఃఖానికి లొంగిపోయిన మా అన్న రాముణ్ణి చూచి నేను నిలవలేకపోయినాను. వచ్చి నీతో పరుషముగా మాట్లాడినాను. అందుకు నీవు ఏమీ అనుకోవద్దు" అని చెప్పినాడు.

37

పూజ్యుడు అయిన లక్ష్మణుడు చెప్పిన మాటలు విని సుగ్రీవుడు తన ప్రక్కన నిలుచుని ఉన్న సచివుణ్ణి హనుమంతుణ్ణి చూచి, "ఓ హనుమంతుడా! మహేంద్రపర్వతముమీదనూ, హిమవత్పర్వతముమీదనూ, వింధ్యపర్వతము మీదనూ, కైలాసపర్వతముమీదనూ, తెల్లటి శిఖరాల మందరపర్వతము మీదనూ ఉంటూ ఉన్న వానరులతోపాటు పడమటి దిశను సముద్రతీరాన బాలభాస్కర ప్రభలతో భాసించే పర్వతాలమీద ఉంటూ ఉన్న వానరులనూ, సంధ్యాకాల మేఘాలవలె రక్తకాంతులతో తేజరిల్లే ఉదయపర్వతముమీద ఉన్న భయంకరము అయిన పద్మతాళ వనములో నివసిస్తున్న వానరులనూ, అంజనపర్వతముమీద కాటుకరాశులవలెనూ, కారుమబ్బులవలెనూ, నల్లటి దేహాలతో ఏనుగుల అంత బలవంతులుగా ఉంటూ ఉన్న వానరులనూ, మహాశైల గుహలలో బంగారు కాంతులతో తేజరిల్లే వానరులనూ, మేరుపర్వత పార్శ్వాన ఉంటూ ఉన్న వానరులనూ, ధూమ్రగిరిమీద ఉంటూ ఉన్న

వానరులనూ, అస్త్రాద్రిమీద తరుణాదిత్య కాంతులతో ధగధగ లాడుతూ కనిపించే వానరులనూ, ఘుమఘుమ వాసనలు గుబాళించే మనోహరము అయిన మహారణ్యాలలో మైరేయ మద్యము తాగుతూ భీమవేగులుగా ఉంటూ ఉన్న వానరులనూ, రమణీయములయిన తాపసాశ్రమాలలో ఉంటూ ఉన్న వానరులనూ, ఇంకా ఈ పృథ్వి అంతటా ఆ యా ప్రదేశాలలో ఉంటూ ఉన్న వానరులనూ నీవు ఇప్పుడే పిలిపించవలెను. ఆ యా వానరులను అందరినీ సామదానాది ఉపాయాలతో పిలుచుకొని రావడానికి వెంటనే వానర వీరులను ఇక్కడ నుంచి ఆ యా స్థలాలకు పంపించు. ఇది వరకే మహావేగముగా పోయే దూతలను నేను పంపించినాను. ఆ పోయినవాండ్లు వానర వీరులను అందరినీ తొందరగా వెంటపెట్టుకొని రావడానికి నీవు ఇప్పుడు మరి కొంతమంది వానరవీరులను పంపించు.

"ఓ హనుమంతుడా! విషయ సుఖాలలో పడిపోయిన వానర యోధులనూ, సోమరిపోతులుగా ఉంటూ ఉన్న వానర వీరులనూ, ఇంకా తక్కిన వానర నాయకులనూ నేను ఆజ్ఞాపించినాను అని చెప్పి, నీవు ఇక్కడికి పిలిపించవలెను. నేను ఆజ్ఞాపిస్తున్నాను కాబట్టి నేటికి పది రోజులలో వానర యోధులు అందరూ ఇక్కడికి వచ్చి తీరవలెను. అట్లా రాకుండా నా ఆజ్ఞను ధిక్కరించే దురాత్ములకు మరణదండనము విధించు. కనుక ఈ కిష్కింధకు కపిసింహులను అందరినీ పిలుచుకొని రావడానికి ఇక్కడ నుంచే, ఇప్పుడే లక్షలకొద్దీ భయంకరాకారులు అయిన వానరులు పర్వతాలు అంతటి మేఘాలవలె ఆకాశాన్ని ఆచ్ఛాదించి అన్ని దిక్కులకూ పోవలెను. ఇప్పుడే, ఈక్షణమే వానరులు అందరూ బయలుదేరి పోయి ఆ యా ప్రదేశాలలో నివసిస్తున్న వానరులను అందరినీ పిలుచుకొని రావలెను" అని చెప్పినాడు.

అప్పుడు వాయుసుతుడు హనుమంతుడు పరమపరాక్రమవంతులు అయిన వానరులను ఆ యా దిక్కులకు పంపివేసినాడు. వారు అందరూ సుగ్రీవాజ్ఞను శిరసా వహించి ఆకాశమార్గాన పోయినారు. ఆ పోయిన వానరులు సముద్రాల మధ్య ద్వీపాల లోనూ, పర్వతాలమీదనూ, మహారణ్యాలలోనూ, పెద్ద పెద్ద సరస్సుల దగ్గరనూ నివసిస్తున్న వానరులకు అందరికీ రామకార్యార్థము సుగ్రీవాజ్ఞను తెలియ చెప్పినారు. వారు ఆ రాజాజ్ఞను విన్నారు. ప్రళయకాల మృత్యువువంటి సుగ్రీవుడికి భయపడి పోయినారు. ఎక్కడెక్కడో ఉంటూ ఉన్న వానరులు అంతట కిష్కింధకు బయలుదేరినారు.

రామకార్యార్థము అప్పుడు అంజన పర్వతముమీద ఉంటూ ఉన్న మహావేగులు కాటుకవలె నల్లటి వానరులు ఒక మూడుకోట్ల మందిన్నీ, సూర్యుడు అస్తమించే అస్తగిరి మీద తప్తకాంచన దేహాలతో తేజరిల్లుతూ ఉన్న వానరులు పదిలక్షల కోట్ల

మందిన్నీ, వింధ్య పర్వతము మీద అంగారకుడి కాంతులతో తేజరిల్లుతూ భయంకర కర్ములు అయిన వానరులు అనేకవేలకోట్లమందిన్నీ అమితవేగముతో కిష్కింధా నగరానికి బయలుదేరినారు. పాల సముద్రము గట్టున తమాలవనములో నివసిస్తూ టెంకాయలు తినే వానరులు అసంఖ్యాకులున్నూ కిష్కింధకు బయలు దేరినారు. అడవులలోనూ, కొండగుహలలోనూ, నదీతీరాలలోనూ ఉంటూ ఉన్న అసంఖ్యాకము అయిన వానరసైన్యము సూర్యుణ్ణి మింగివేసేట్టు బయలుదేరింది.

నీలుడు అదివరకు వానరులను పిలుచుకొని రావడానికి పంపించిన వానరవీరులు, హిమవత్పర్వతముమీద మహేశ్వరుడి యజ్ఞవాటికలో ఉన్న మహావృక్షాన్ని చూచినారు. దేవతలను అందరినీ సంతోషపెట్టడానికి అదివరకు మహేశ్వర దేవతాకము అయిన యజ్ఞము ఒకటి అందము అయిన ఆ పర్వతము మీద జరిగింది. హోమము చేస్తూ ఉండగా జారి నేలమీద పడ్డ హవిస్సుల నుంచి ఆ క్షేత్రము అంతా పవిత్రము అయింది. అక్కడ తరులతాగుల్మాదులు అన్నీ దివ్యముగా మారిపోయినవి. అక్కడ పండ్లూ, కందమూలాలూ అమృతమువంటివి అయిపోయినవి. మనోహరము అయిన ఆ పండ్లనూ, ఆ కందమూలాదులనూ తిన్నవారికి ఒక మాసము వరకూ ఆకలి వేయదు. అక్కడికి పోయి ఆ ఫలమూలాదులను చూచిన వానరయూధపతులు అందరూ ఫలాహారులు. వారు సుగ్రీవుణ్ణి సంతోష పెట్టడానికి ఆ ఫలమూలాదులనూ, ఇంకా అక్కడ దొరికిన దివ్యౌషధులనూ, ఆ యజ్ఞవాటికలో పూస్తున్న సుగంధ పుష్పాలనూ తీసికొని బయలుదేరినారు.

ఆ వానరయూధపతులు ఈ భూమిమీద వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న వానరులను అందరినీ తొందరగా బయలుదేరి రావలసింది అని చెప్పి, ముందుగా కిష్కింధకు వచ్చినారు. ఆ వచ్చిన వానరయూధపతులు అంతట సుగ్రీవుణ్ణి చూడపోయి నారు. వారు తెచ్చిన ఫలమూలాలనూ, దివ్యౌషధులనూ, సుగంధ పుష్పాలనూ సుగ్రీవుడికి కానుకలుగా సమర్పించి, "ఓ రాజా! మేము సమస్త పర్వతాలలోనూ, సమస్త సముద్ర ద్వీపాలలోనూ, మహారణ్యాలలోనూ నివసిస్తూ ఉన్న వానర వీరులను అందరినీ తాము ఆజ్ఞాపించినట్లుగా పిలిచినాము. ఈ పృథ్వి మీద ఉన్న వానరులు అందరూ రామకార్యార్థము తమ ఆజ్ఞను శిరసావహించి బయలుదేరి వస్తూ వున్నారు. మేము తమకు ఈ విషయము చెప్పడానికి ముందుగా వచ్చినాము" అని విన్నవించినారు.

ఆ వానరయూధపతులు చెప్పిన మాటలు విని ఆ వానరేశ్వరుడు సుగ్రీవుడు సంతోషించి వారు సమర్పించిన కానుకలను ప్రేమాతిశయముతో అందుకొన్నాడు.

38
సుగ్రీవుడు రాముని దర్శించుట

ఆ వానరయూధపతులు సమర్పించిన కానుకలు అందుకొని, సుగ్రీవుడు మంచి మాటలతో సమ్మానించి వారిని అందరినీ పంపించి వేసినాడు. తాను నెరవేర్చవలసిన పనీ, రామకార్యమూ జయప్రదంగా అవుతుంది అని సంతోషపడ్డాడు.

లక్ష్మణుడు అప్పుడు ఆ భీమబలుణ్ణి, ఆ వానరోత్తముణ్ణి సుగ్రీవుణ్ణి చూచి సంతోషముతోనూ, అణకువతోనూ, "ఓ సుగ్రీవుడా! నీకు ఇప్పుడు ఇష్టము అయ్యేట్లయితే నాతో కూడా రాముడి దగ్గరకు రావలసింది" అని చెప్పినాడు. అందుకు సుగ్రీవుడు అమితానందముతో, "లక్ష్మణా! అట్లాగే చేద్దాము. మనము ఉభయులమూ పోదాము. నేను నీ ఆజ్ఞను జవదాటను" అని శుభలక్షణుడితో చెప్పి అక్కడ ఉన్న తారనూ, తక్కిన స్త్రీజనాన్నీ పంపించివేసినాడు.

అంతట సుగ్రీవుడు తన అంతఃపుర సేవకులను దగ్గరకు రమ్మని పిలిచినాడు. వారు అందరూ వెంటనే వచ్చి చేతులు జోడించి నిలుచున్నారు. ఆ సూర్యసమాన కాంతిమంతుడు సుగ్రీవుడు ఆ సేవకులతో తక్షణమే శిబికను తీసుకొనిరావలెను అని ఆజ్ఞాపించినాడు. వారు అప్పటికి అప్పుడు ఒక అందము అయిన శిబికను అక్కడికి తెచ్చినారు. ఆ శిబికను ఎక్కవలసింది అని లక్ష్మణుడితో చెప్పినాడు. అతడు ఎక్కిన తరువాత సుగ్రీవుడున్నూ ఆ శిబికను ఎక్కినాడు. సూర్యసమాన కాంతులతో తేజరిల్లుతూ ఉన్న ఆ కాంచన శిబికను మోయడానికి మహాకాయులయిన వానరులు వచ్చినారు. ఉత్తమోత్తమము అయిన వానర రాజ్యలక్ష్మి వరించిన ఆ సుగ్రీవుడికి శ్వేతచ్ఛత్రము పట్టినారు. తెల్లటి వింజామరలు వీచసాగినారు. ఆ శిబిక బయలుదేరింది. శంఖాలు పూరించినారు. భేరులు మ్రోయించినారు. వానరవీరులు అతితీక్షణాయుధాలు పట్టుకొని ఆ శిబికవెంట నడిచినారు.

రాముడు ఉంటూ ఉన్న ప్రస్రవణపర్వతము మీదికి ఆ శిబికను మోసుకొని పోయినారు. అక్కడ ఆ మహాతేజోవంతుడు సుగ్రీవుడు ఆ శిబికలోనుంచి లక్ష్మణునితో కూడా దిగినాడు. రాముడి దగ్గరకు పోయి చేతులు జోడించి నిలుచున్నాడు. ఆ సుగ్రీవుడిని వెంబడించిన వానరవీరులున్నూ చేతులు జోడించి నిలుచున్నారు. జోడించిన చేతులు శిరముమీదికి ఎత్తి నిలుచున్న ఆ వానరవీరులతో ఆ వానరసైన్యము తామర మొగ్గలతో నిండిన తటాకమువలె కనిపించింది. రాముడు వానర సైన్యాన్నీ, సుగ్రీవుణ్ణీ చూచి సంతోషించినాడు. సాష్టాంగ నమస్కారము చేసిన సుగ్రీవుణ్ణి ప్రేమాతిశయముతోనూ, గౌరవాతిశయముతోనూ లేవనెత్తి గట్టిగా కౌగలించుకొన్నాడు.

ఆ ధర్మాత్ముడు రాముడు కూర్చుండమని చెప్పినందువల్ల సుగ్రీవుడు అప్పుడు అక్కడ నేలమీద కూర్చున్నాడు. రాముడు అట్లా కూర్చొని ఉన్న సుగ్రీవుడితో, "ఓ వానరవీరా! ధర్మార్థకామాలను నియమిత కాలాలలో అనుష్ఠించే రాజే సరి అయిన రాజు. ధర్మార్థాలను వదలిపెట్టి కామాన్ని మాత్రమే సేవించేవాడు, చెట్టుకొమ్మ మీద పడుకొని నిద్రపోయినవాడివలె కిందపడ్డ తరువాత మేలుకొంటాడు. శత్రువులను సంహారముచేస్తూ, మిత్రులను సమకూర్చుకొంటూ, ఆ యా నియమిత కాలాలలో ధర్మార్థకామాలను మూటినీ అనుష్ఠించే రాజే రాజధర్మము నిర్వహించ గలుగుతాడు. ఓ వానరరాజా! నీవు శత్రుసంహారకుడవు. శత్రుసంహారము చేయడానికి అవసరము అయిన ప్రయత్నాలు అన్నీ చేయవలసిన శరదృతువు ఇప్పుడు వచ్చి ఉంది. ఇకను ఇప్పుడు ఏమి చేయవలసిందీ నీ మంత్రులతో ఆలోచించవలెను" అని చెప్పినాడు.

ఈ మాటలకు సుగ్రీవుడు, "ఓ మహాబాహూ! నీవు శూరాగ్రగణ్యుడవు. నేను పోగొట్టుకున్న సంపదనూ, కీర్తినీ, శాశ్వతము అయిన కపిరాజ్యాన్నీ నీ అనుగ్రహమువల్లనూ, నీ తమ్ముడు లక్ష్మణుడి అనుగ్రహమువల్లనూ నేను తిరిగి పొందగలిగితిని. ఉపకారికి ప్రత్యుపకారము చేయనివాడు పురుషాధముడు.

"ఓ శత్రుసూదనా! నా వెంట వచ్చిన ఈ వందలకొద్దీ వానరవీరులు ఈ పృథ్వీమీద నివసిస్తూ ఉన్న వానరవీరులను అందరినీ పిలిచి వచ్చినారు. ఇంకా చొర నలవికాని మహారణ్యాల సందులలో, గొందులలో ఉంటూ ఉన్న భయంకరాకారులూ, శూరులూ అయిన భల్లూక వీరులనూ, గోలాంగూల వీరులనూ నీ కార్యము కోసము పిలిచి వచ్చినారు.

"ఓ రామా! దేవ గంధర్వాంశలతో పుట్టి కామరూపులు అయిన వానరవీరులు అందరూ ఇప్పుడు తమ తమ సేనలతో బయలుదేరి వస్తూ ఉన్నారు. ఓ పరంతపా! నీ ఆజ్ఞాబద్ధులు అయి వానరవీరులు కొంతమంది వందలకొద్దిన్నీ, కొంతమంది కోట్లకొద్దిన్నీ వానరులను వెంటపెట్టుకొని వస్తున్నారు. వానరయూథపతులు అర్బుద సంఖ్యాకులతో కొందరూ, అర్బుద శతసంఖ్యాకులతో కొందరూ, ఖర్వ సంఖ్యాకులతో కొందరూ, ఖర్వ శతసంఖ్యాకులతో కొందరూ, మధ్య సంఖ్యాకులతో కొందరూ, అంత సంఖ్యాకులతోనూ, సముద్ర సంఖ్యాకులతో కొందరూ వస్తూ ఉన్నారు. వాండ్లు అందరూ దేవేంద్రుడితో సరి సమానము అయిన పరాక్రమవంతులు. మేరు మందర పర్వతాలు అంతటివాండ్లు, వాండ్లు మేరు పర్వతాలలో నివసిస్తూ ఉన్నారు. వాండ్లు అందరూ నీ నిమిత్తమే వస్తున్నారు. రావణాసురుణ్ణి భ్రాతృపుత్ర బంధు సహితముగా సంహారము చేసి వాండ్లు సీతాదేవిని తెచ్చి నీకు సమర్పించగల సమర్థులు. అటువంటివాండ్లు అందరూ నీ సన్నిధానానికి వస్తున్నారు" అని చెప్పినాడు.

తాను నిర్దేశించినట్టు ఆ వానరవీరుడు సుగ్రీవుడు చేసిన యుద్ధ ప్రయత్నాలకు అప్పుడు ఆ బుద్ధిమంతుడు రాముడు సంతోషపడ్డాడు. ఆ సంతోషాతిశయమునుంచి నల్లకలువలవంటి రాముడి నేత్రాలు వికసించినవి.

39

వానర సమూహము రామసుగ్రీవుల వద్దకు వచ్చుట

చేతులు జోడించి అట్లా చెప్పిన సుగ్రీవుణ్ణి ఆ పరమధార్మికుడు రాముడు తన రెండు చేతులా గట్టిగా కౌగలించుకొని, "ఓ మిత్రుడా! దేవేంద్రుడు వానలు కురిపించడములోనూ, సహస్రాంశుడు చీకట్లు పోకొట్టడములోనూ, చంద్రుడు స్వచ్ఛము అయిన చల్లని వెన్నెల కాయడములోనూ ఆశ్చర్యము ఏమీ లేదు. అది వాండ్ల సహజ ధర్మము. అదేవిధముగా నీ వంటివాడు మిత్రుడికి ప్రత్యుపకారము చేయడములో విచిత్రము ఏమీ లేదు. ఓ సుగ్రీవుడా! నీవు శత్రువులకు తాపము ఎత్తించేవాడవు. మహామంచివాడవు. నీవు నీ మిత్రులకు ఎప్పుడూ ప్రత్యుపకారము చేసి సంతోషపెట్టుతూ ఉంటావు. నీవు ప్రియవాదివి అని నేను ఎరుగుదును. ఓ మిత్రుడా! నీవు నాకు తోడుగా ఉండేట్లయితే సమస్త శత్రువులనూ నేను యుద్ధములో జయించి వేయకలను. నీవు నాకు మనస్సు కలసిన స్నేహితుడవు. నాకు తోడుగా ఉండటానికి నీవే తగినవాడవు.

"ఓ సుగ్రీవుడా! పూర్వము ఆత్మవినాశము కోసము అనుహ్లాదుడు పులోమి సహాయముతో దేవేంద్రుణ్ణి మోసపుచ్చి శచీదేవిని అపహరించినాడు. అదేవిధముగా రావణాసురుడు మారీచుడి సహాయముతో నన్ను వంచించి నా భార్యను వైదేహిని అపహరించినాడు. దేవేంద్రుడు అనుహ్లాదుణ్ణి, పులోమిని వధించినాడు. నేను మారీచుణ్ణి చంపివేసినాను. ఇంకా రావణాసురుడు మిగిలి ఉన్నాడు. అచిరకాలములో వాణ్ణి యుద్ధ ముఖాన నా నిశితాస్త్రాలతో సంహారము చేసి వేస్తాను" అని చెప్పుతూ ఉండగా, పెద్ద దుమ్ములేచి ఆకాశములో తీక్షణకాంతులలో తేజరిల్లుతూ ఉన్న సూర్యుడు కనపడకుండా పోయినాడు. ఆ దుమ్ముకూ, ఆ దుమారానికీ దిక్కులు తెలియకుండా పోయినవి. మహాపర్వతాలతోను, మహారణ్యాలతోను ఉన్న ఈ పృథ్వి అంతా చలించడము మొదలు పెట్టింది.

మహాపర్వతాకారులూ, మహాబలవంతులూ, తీక్షణదంష్ట్రులూ అయిన వానరవీరులు అసంఖ్యాకులు భూమిని అంతా ఆవరించి అక్కడికి వస్తున్నారు. రెప్పపాటు కాలములో కోట్లకొద్దీ వానరులతో ఆ ప్రదేశము అంతా నిండిపోయింది. వాండ్లు అందరూ నదీతీరాలనుంచీ, సముద్రద్వీపాలలోనుంచీ, ఇంకా మహారణ్యాలలోనుంచీ మహామేఘాలవలె గర్జిస్తూ బయలుదేరి వచ్చినారు. వాండ్లు అందరూ

మహాబలవంతులు. కామరూపులు. ఒక్కొక్క యూథపతి నూరుకోట్ల వానర సైన్యముతో కనిపించినాడు.

అప్పుడు అక్కడ పరాక్రమవంతుడూ, శ్రీమంతుడూ అయిన శతవలి అనే వానర సేనానాయకుడి వెంట మేరుపర్వతముమీద నివసించే వానరులు బాలసూర్యప్రభలతోనూ, చంద్రుడివలె గౌరవర్ణముతోనూ, పద్మకింజల్క వర్ణముతోనూ, ధవళ వర్ణముతోనూ పదివేలకోట్లమంది కనిపించినారు. కాంచన పర్వతమువంటివాడూ, మహాశూరుడూ, తార తండ్రి అయిన సుషేణుడు ఒక వెయ్యికోట్లమంది వానరులతో కనిపించినాడు. సుగ్రీవుడి మామ, రుమ తండ్రి అయిన తారుడు అనే యూథపతి మరి ఒక వెయ్యికోట్లమంది వానరులతో వచ్చి నిలుచున్నాడు.

కేసరి అనే వానర సేనానాయకుడు తరుణాదిత్యుడివంటి ముఖముతోను కమలకింజల్కాలవంటి దేహకాంతులతోను తేజరిల్లుతూ ఇరవైఒక్కవేల ఎనమన్నూట డెబ్బయిమంది వానరులతో వచ్చి కనిపించినాడు. సమస్త వానరులలోనూ శ్రేష్ఠుడూ, బుద్ధిమంతుడూ, కాంతిమంతుడూ అయిన అతడు హనుమంతుడి తండ్రి. భీమ విక్రముడూ, గోలాంగుల మహారాజు అయిన గవాక్షుడు వెయ్యికోట్లమంది వానరులతో వచ్చినాడు. శత్రువీరులను రూపుమాపే ధూమ్రుడు రెండువేలకోట్లమంది భయంకర వేగులు అయిన భల్లూకవీరులతో వచ్చినాడు. మహావీర్యవంతుడు అయిన పనసుడు అనే వానరయూథపతి పెద్దకొండలు అంతటి భయంకరాకారులు అయిన మూడుకోట్లమంది వానరులతో వచ్చినాడు. మహాకాయుడూ, నల్లటి కాటుకరాశివలె కనిపించే నీలుడు అనే వానరయూథపతి పదికోట్లమంది వానరులతో వచ్చినాడు. కాంచన శైలమువంటివాడూ, మహావీర్యవంతుడూ అయిన గవయుడు అనే వానరయూథపతి పదికోట్లమంది వానరులతో వచ్చినాడు. మహాబలవంతుడు అయిన దరీముఖుడు అనే వానరయూథపతి వెయ్యికోట్ల మంది వానరులతో వచ్చి సుగ్రీవుడి ఎదుట నిలుచున్నాడు.

అశ్వినీదేవతల పుత్రులూ, మహాబలవంతులూ అయిన మైంద ద్వివిదులు ఇద్దరున్నూ చెరి ఒక వెయ్యికోట్లమంది వానరులతో కనిపించినారు. వీరుడూ, బలవంతుడూ, మహాతేజోవంతుడూ అయిన గజుడు అనే వానర సేనానాయకుడు మూడుకోట్లమంది వానరులతో వచ్చినాడు. భల్లూకరాజూ, తేజోవంతుడూ అయిన జాంబవంతుడు పదికోట్లమంది భల్లూకవీరులతో వచ్చి సుగ్రీవుడి దగ్గర నిలుచున్నాడు.

బలవంతుడూ, పరాక్రమవంతుడూ అయిన రుమణ్వంతుడు అనే వానరవీరుడు నూరుకోట్లమంది వానరులతో వచ్చినాడు. గంధమాదనుడు అనే వానరవీరుడు పదిలక్షలకోట్లమంది వానరవీరులను వెంటపెట్టుకొని వచ్చినాడు.

యువరాజూ, తన తండ్రి వాలితో సరిసమానము అయిన పరాక్రమవంతుడూ అయిన అంగదుడు వెయ్యి పద్మాల బలముతోనూ, నూరు శంఖాల బలముతోనూ వచ్చినాడు. భీమపరాక్రమవంతుడూ, నక్షత్రమువంటి కాంతిమంతుడూ అయిన తారుడు (రుమ తండ్రి కాడు) అనే యూథపతి అయిదుకోట్లమంది వానరులతో దూరముగా కనిపించినాడు. పరమపరాక్రమశాలీ, వానరయూథపతీ, పదకొండుకోట్ల మంది వానరులకు ప్రభువూ అయిన ఇంద్రజానువు అనే వానరరాజు తన వానరులను అందరినీ వెంటపెట్టుకొని వచ్చినాడు. తరుణాదిత్యకాంతులతో తేజరిల్లుతూ రంభుడు అనే యూథపతి దశసహస్రాలూగానూ, సహస్రాలుగానూ, శతాలుగానూ వ్యూహాలు పన్నిన వానర బలముతో వచ్చినాడు. బలవంతుడూ, పరాక్రమవంతుడూ అయిన వానర యూథపతి దుర్ముఖుడు అనేవాడు రెండుకోట్ల మంది వానరులతో కనిపించినాడు.

భయంకర పరాక్రమశాలురూ, కైలాస శిఖరాలవంటి వాండ్లూ అయిన వెయ్యికోట్లమంది వానరులను వెంటపెట్టుకొని హనుమంతుడు వచ్చినాడు.

మహాపరాక్రమవంతుడు అయిన నలుడు నూరుకోట్లమంది వానరులను వెంటపెట్టుకొని వచ్చినాడు. సుగ్రీవుడికి ఇష్టుడూ, మహాపరాక్రమశాలీ, శ్రీమంతుడూ అయిన దధిముఖుడు అనే వానరయూథపతి పదికోట్లమంది వానరులతో వచ్చినాడు. శంఖుడూ, వహ్నీ, రంహుడూ అనే వానరవీరులూ, ఇంకా మరికొంతమంది వానర యూథపతులూ అడవులలో నుంచీ, పర్వతాలమీద నుంచీ, ఆ యా భూభాగాల నుంచీ లెక్కపెట్ట నలవికాని అంతమంది వానరవీరులను వెంటపెట్టుకొని వచ్చినారు. దేవతలకు జన్మించిన వానరులూ, సాధారణ వానరులూ (వానరులకు జన్మించిన వానరులు), ఈ భూలోకములో ఉంటూ ఉన్న వానరులూ అందరూ వచ్చినారు.

ఆ యా వానరవీరులు అందరూ ఉత్సాహాతిశయముతో ఎగిరి గంతులు వేస్తూనూ, సంతోషాతిశయముతో పెద్ద పెట్టున కేకలు పెట్టుతూనూ, సూర్యుడి చుట్టూ మేఘాలు కమ్ముకొన్నట్టు సుగ్రీవుడి చుట్టూ మూగినారు. ఆ మహాబాహువులు వానరవీరులు అందరూ అప్పుడు సంతోషాతిశయముతో అనేకవిధాల సింహనాదాలు చేస్తూ, తమ తమ తలలు ఎత్తి చూపిస్తూ తమ రాకను ఆ వానరేంద్రుడికి సుగ్రీవుడికి నివేదించుకొన్నారు.

ఆ వానర ముఖ్యులు కొందరు సుగ్రీవుడి దగ్గరకు పోయి వినయ విధేయతలతో చేతులు జోడించి వారి వారి యోగ్యతల ప్రకారము నిలుచున్నారు. అప్పుడు ఆ ధర్మజ్ఞుడు సుగ్రీవుడు రాముణ్ణి సమీపించి చేతులు జోడించి ఆ వానరనాయకులను అందరినీ గురించి నివేదించినాడు. అంతట ఆ వానరవీరులను ఉద్దేశించి, "ఓ సేనానాయకులారా! మీ మీ సేనలను ఇక్కడ కొండవాగుల దగ్గరనూ,

అడవులలోనూ హాయిగా విడిది చేయించండి. నియమబద్ధముగా మీ మీ సేనల బలాలను తెలుసుకోండి" అని సుగ్రీవుడు చెప్పినాడు.

40

వానర వీరులకు సుగ్రీవుని ఆదేశము - వివిధ ప్రదేశ వర్ణనము

ఈ విధముగా సమస్త సాధన సంపత్తి సమకూర్చుకొన్న సుగ్రీవుడు ఆ శత్రుబలహంతను, ఆ నరశార్దూలుణ్ణి రాముణ్ని చూచి, "ఓ ప్రభూ! నా రాజ్యములో ఉంటూ ఉన్న మహాబలవంతులూ, కామరూపులూ, మదపుటేనుగులవంటివాండ్లూ అయిన వానరులు అందరూ వచ్చి చేరినారు. ఈ వచ్చిన వానర సేనానాయకులు అందరూ పరమ భయంకరులు. దైత్య దానవ వీరులతో సరిసమానము అయిన వాండ్లు. ఈ సేనానాయకులు వెంటపెట్టుకొని వచ్చిన వాండ్లు అందరూ భీమవిక్రములు. పరమపరాక్రమవంతులు. ఇదివరకు చేసిన వీరకృత్యాలవల్ల వీండ్లు అందరూ ఖ్యాతి కెక్కినారు. అందరూ బలవంతులు. వీండ్లు ఎవండ్లూ ఎప్పుడూ అలసిపోరు. పరాక్రమానికి పేరుపడ్డారు. యుద్ధ ప్రయత్నాలలో సమర్థులు. వివిధ పర్వతాలమీదనూ, వివిధప్రాంతాలలోనూ వీండ్లు అందరూ నివసిస్తున్నారు. వీండ్లు ఈ భూమిమీదనే కాకుండా జలాలలో తిరగగలరు. ఆకాశములో ఎగిరి పోగలరు. వీండ్లు, ఈ అనేకకోట్లమంది నీ కింకరులు.

"ఓ అరిందమా! ఈ వానరవీరులు అందరూ స్వామిభక్తి పరాయణులు. నీ ఆజ్ఞలను జవదాటరు. నీ అభిప్రాయము ప్రకారము సమస్త పనులూ చేసివేయకలరు. ఈ వానరసేనానాయకులు అందరూ భయంకరము అయిన వేగముతో పోయే అనేక వేలమంది వానరవీరులతో సైన్యాలను సమకూర్చుకొని వచ్చినారు. వీరు అందరూ ఎప్పుడు ఎప్పుడు ఏమి ఏమి చేయవలెను అని నీవు అనుకొంటున్నావో అది అంతా చెప్పవలెను. వీరు అందరూ నీ చెప్పుచేతలలో ఉంటారు. ఇది అంతా నీ సైన్యము. ఇక నీ చిత్తము వచ్చినట్టు ఈ సేనలను ఆజ్ఞాపించు. వీండ్లు ఎవండ్లు ఏమి, ఏమి చేయవలసింది నాకు తెలిసి ఉన్నప్పటికిన్నీ ఆజ్ఞాపించవలసినవాడవు నీవు" అని చెప్పినాడు.

ఇట్లా చెప్పిన సుగ్రీవుణ్ణి ఆ దశరథాత్మజుడు రాముడు తన రెండు చేతులా కౌగిలించుకొని, "ఓ సుగ్రీవుడా! నీవు సమస్తమూ తెలిసినవాడవు. ఇప్పుడు వైదేహి జీవించి ఉందా లేదా అనే విషయము తెలుసుకోవలెను. రావణాసురుడు ఎక్కడ ఉంటూ ఉన్నాడో, వాడి దేశము ఏదో కూడా తెలుసుకోవలెను. వైదేహి సంగతి, రావణాసురుడి ఉనికిపట్టూ తెలిస్తే, ఆ తరువాత ఏమి చేయవలసిందీ మనము ఇద్దరమూ ఆలోచించి చేద్దాము.

"ఓ సుగ్రీవుడా! ఈ సేనలను ఆజ్ఞాపించడానికి నేను సమర్థుణ్ణి కాను. లక్ష్మణుడున్నూ సమర్థుడు కాడు. ఈ పనికి సాధకుడవూ, సమర్థుడవూ నీవే. సాధనానివీ నీవే. ఓ వానరరాజా! నా పని కోసము ఏమి ఏమి చేయవలసిందీ నీకు నిస్సందేహముగా తెలుసును. నీవే ఆజ్ఞాపించవలెను. నీవు నాకు రెండవ స్నేహితుడవు. మొదటివాడు లక్ష్మణుడు. నీవు పరాక్రమవంతుడవు. ప్రాజ్ఞుడవు. కాలాకాలాలు తెలిసినవాడవు. అర్థశాస్త్రవిదుడవు. కార్యసాధన సమర్థుడవు. నా మేలు కోరేవాడవు' అని చెప్పినాడు.

అంతట ఆ రామలక్ష్మణుల సాన్నిధ్యములో వానరరాజు సుగ్రీవుడు మేఘగంభీరఘోషుడూ, పర్వతాకారుడూ అయిన వినతుడు అనే వానరయూథపతిని చూచి, "ఓ వానరోత్తమా! నీవు కార్యాకార్య నిశ్చయ జ్ఞానులూ, దేశోచిత నీతిమంతులూ అయిన వానరులను ఒక లక్షమందినీ, ఇంకా సూర్యచంద్రుల పుత్రులు అయిన వానరులనూ వెంటపెట్టుకొని తూర్పుదిక్కుకు పోవలెను. ఆ దిక్కున పర్వత శృంగాలలోనూ, అడవులలోనూ, నదీప్రాంతాలలోనూ విదేహ రాజపుత్రిని సీతాదేవినీ, రావణాసురుణ్ణీ వెదకవలెను.

రమ్యము అయిన భాగీరథీనదీ ప్రాంతాలలోనూ, సరయూనదీ తీరాలలోనూ, కౌశికీనదీప్రాంత ప్రదేశాలలోనూ, కళిందపర్వతము మీద పుట్టి ప్రవహించే మనోహరము అయిన కాళిందీ అనే యమునానదీ ప్రాంతాలలోనూ, ఆ యమునానదీ సంబంధము అయిన మహాపర్వతము మీదనూ, సరస్వతీనదీ ప్రాంతాలలోనూ, మణులవంటి జలాలతో ప్రవహించే శోణ (సింధు) నదము ప్రాంతాలలోనూ, బ్రహ్మమాల దేశములోనూ, విదేహదేశములోను, మాళవదేశములోను, కాశీ కోసల దేశాలలోను, గొప్ప గొప్ప గ్రామాలు ఉన్న మగధదేశములోను, పుండ్రదేశములోను, అంగదేశము లోను, వంగదేశములోను, పట్టునూలు దొరికే కోశకారరాజుల పట్టణాలలోను, వెండిగనులు ఉన్న భూములలోను దశరథమహారాజు కోడలిని, రాముడి భార్యను సీతాదేవిని వెదకవలెను.

(హిమవత్పర్వతానికీ, వింధ్యపర్వతానికీ మధ్యను శరావతి అనే నది వలయాకారముగా ప్రవహిస్తూ ఉండేది అనీ, ఈ చెప్పిన ప్రదేశాలు అన్నీ ఆ శరావతి నదికి తూర్పున ఉన్నవి అనీ, కిష్కింధకు కాదు అనీ గోవిందరాజులు అనే వ్యాఖ్యాత అభిప్రాయము. మేరువుపర్వతానికి తూర్పున ఉదయాచలము వరకూ అంటే ఆర్యావర్తదేశానికి తూర్పున ఉన్న ప్రదేశాలు అన్నీ వెదకవలెను అని సుగ్రీవుడు చెప్పినాడేకాని కిష్కింధకు కాదు అని మహేశ్వరతీర్థులు అనే వ్యాఖ్యాత అభిప్రాయము.)

"ఓ వానరుడా! (తూర్పుదిక్కున) పట్టణాలలోను, విశాలము అయిన మందరపర్వతముమీదను, సముద్రాలలో ఉన్న పర్వతాలమీదను వెతకవలెను. అక్కడ (ఆ మందరపర్వతముమీదనూ, ఆ పట్టణాలలోనూ) కొందరు చెవులకు మూతులు ఉన్నవాండ్లూ, కొందరు పెదవులవంటి చెవులు ఉన్నవాండ్లూ, కొందరు భయంకరము అయిన ఇనుపముఖాలవాండ్లూ, కొందరు ఒక్క అడుగులో ఎంతదూరము అయినా అమితవేగముతో పోయేవాండ్లూ, కొందరు బలవంతులు అయిన (పురుషాదకులూ) నరమాంసభక్షకులూ, కొందరు జుంజురుజుట్లవాండ్లూ, వీండ్లే కాకుండా బంగారు దేహకాంతులతో అందముగా కనిపించే కిరాతులూ, ఆ సముద్రద్వీపాలలో పచ్చిచేపలు తినేవాండ్లూ, నీళ్ళలో తిరుగుతూ ఉండేవాండ్లూ, భయంకరము అయిన నరవ్యాఘ్రములు అని ప్రసిద్ధికెక్కిన కిరాతులూ ఉంటూ ఉన్నారు. వాండ్లు అందరూ నివసించే ఆ యా ప్రదేశాలు అన్నీ వెతకవలెను. (ఇంతవరకూ జంబూద్వీపాన్ని గురించి చెప్పి, ఇక ద్వీపాంతరాలను గురించి సుగ్రీవుడు చెప్పపోతున్నాడు అని వ్యాఖ్యాతల అభిప్రాయం.)

"ఓ వానరయూథపతీ! ఏ ఏ ద్వీపాంతరాలకు పర్వాతాలమీదనుంచి ఎగిరిపోవలెనో, ఏ ఏ సముద్రాలలో తెప్పలమీద పోవలెనో ఆ యా ప్రదేశాలకు, అట్లో పోయి వెతకవలెను. అట్లా మీరు యవద్వీపానికి పోవలెను. ఆ యవద్వీపములో రత్నాల గనులు ఉన్నవి. ఆ యవద్వీపము సప్తఖండాలుగా శోభిస్తున్నది. అక్కడనే బంగారు గనులు ఉన్న సువర్ణ రూప్యకము అనే ద్వీపము ఉంది. మీరు ఆ రెండు ద్వీపాలలోనూ వెతకవలెను. అక్కడ మీకు సీతాదేవి జాడకానీ, రావణాసురుడి జాడకానీ తెలియకపోయేట్లయితే, ఆ యవద్వీపము అవతల దేవదానవులు నివసించే శిశిరపర్వతానికి పోయి చూడవలెను. ఆ శిశిరపర్వతశిఖరము ఆకాశాన్ని అంటుతూ ఉంటుంది. ఆ పర్వతముమీద ఉన్న దుర్గమ ప్రదేశాలలోను, అక్కడి సెలయేళ్ళ దగ్గరను, అక్కడి అడవులలోను మీరు అందరూ హెచ్చరికతో ఆ యశస్వినిని, రామపత్నిని, సీతాదేవిని వెతకవలెను.

"ఓ వానరోత్తమా! నీవు అక్కడనుంచి ప్లక్షద్వీపము పోవలెను. అక్కడ సముద్రముగట్టున శోణము అనే నది ఉంది. ఆ నదిలో జలాలు రక్తవర్ణముతో ఉంటవి. అది అగాధము అయినది. అమితవేగముతో ప్రవహిస్తూ ఉంటుంది. ఆ నదీతీరాన సిద్ధులూ, చారణులూ నివసిస్తూ ఉంటారు. అక్కడ చిత్రవిచిత్రము లయిన అడవులు ఉన్నవి. అక్కడ ఎక్కడను అయినా రావణాసురుడు వైదేహితో ఉన్నాడేమో మీరు వెతకవలెను.

"ఆ ప్లక్షద్వీపములో ఈ చెప్పిన శోణనదీ ప్రాంతారణ్యాలే కాకుండా మనోహరము అయిన అనేక ఉద్యానవనాలు ఉన్నవి. పర్వతాలలో పుట్టి ప్రవహించే

నదులు ఉన్నవి. మీరు ఆ యా ఉద్యానవనాలలోనూ, ఆ యా నదీతీరాలలోనూ, కొండచరియలలోనూ వెతకవలెను.

"ఓ వానరోత్తమా! లవణ-ఇక్షు-సుర-సర్పి-దధి-క్షీర-జల సముద్రాలు అనే సప్తసముద్రాలలోను ఇక్షు సముద్రములో మహాభయంకరమయిన ద్వీపాలు ఉన్నవి. ఆ (ఇక్షు) సముద్రములో పెద్ద పెద్ద అలలు లేస్తూ ఉంటవి. గాలి విపరీతముగా వీస్తూ ఉంటుంది. ఆ సముద్రము అరుస్తూ ఉంటుంది. అక్కడ అసురులు ఉంటున్నారు. వాండ్లు మహాకాయులు. ఆహారము లేక ఆకలితో బాధపడుతూ ఆ సముద్రములో పడే నీడను పట్టి ఆ యా ప్రాణులను పట్టుకొని భక్షించివేస్తూ ఉంటారు. వారికి ఆ శక్తి బ్రహ్మానుగ్రహమువల్ల లభించింది. ఆ మహోదధి (ఆ ఇక్షు సముద్రము) లో మహోరగాలు తిరుగుతూ ఉంటవి. అది మహాధ్వనితో ప్రళయకాల మేఘమువలె కనపడుతూ ఉంటుంది. మీరు ఆ సముద్రములో రాక్షసులకు చిక్కకుండా ఉపాయముగా దాటిపోతే రక్తజలాలతో మహాభయంకరము అయిన లోహితము అనే సముద్రము కనపడుతుంది. ఆ సముద్రములో శాల్మలీ ద్వీపము ఉంది. ఆ ద్వీపములో పెద్ద కొండ బూరుగుచెట్టు కనపడుతుంది. అక్కడనే కైలాసమువలె తెల్లగా ఉండే గరుత్మంతుడి గృహము ఉంది. విశ్వకర్మ వివిధ రత్నాలతో ఆ గృహాన్ని అక్కడ నిర్మించినాడు.

ఆ శాల్మలీ ద్వీపములో మందేహులు అనే రాక్షసులు పర్వత శిఖరాలమీద ఉంటున్నారు. వాండ్లు భయంకరులు. కొండలు అంతటి వాండ్లు. వాండ్లు వివిధ రూపాలతో అందరినీ భయపెట్టుతూ ఉంటారు. బ్రాహ్మణులు జపము చేసే గాయత్రీ మంత్ర ప్రభావమువల్ల ప్రతిరోజూ సూర్యోదయకాలాన వాండ్లు సముద్రములో పడిపోతూ ఉంటారు. అట్లా ఆ సముద్రములో పడి వాండ్లు సూర్యకిరణాల తాపానికి మళ్ళీ పర్వతాలమీదికి చేరుతూ ఉంటారు.

(మందేహులు అనే ఆ రాక్షసులు ప్రతిరోజూ ప్రాతఃకాల సూర్యసంచారానికి అడ్డము రావడమూ, ఆ సమయాన బ్రాహ్మణులు గాయత్రీ జపము చేసి వదిలే అర్ఘ్య ప్రభావానికి ఆ మందేహులు దూరముగా పోవడమూ శ్రుతి ప్రసిద్ధము అయిన విషయము.)

"ఓ దుర్ధర్షులారా! మీరు అంతట సర్ప దధి సముద్రాలూ, ఆ సముద్రాలలో ఉన్న కుశ క్రౌంచ ద్వీపాలూ దాటిపోతే క్షీర సముద్రము కనపడుతుంది. దాని కరుళ్ళు పైకి లేస్తూ ఉన్న ముత్యాలహారాలవలెను, అది తెల్లని మేఘములవలెను శోభిస్తూ ఉంటుంది. ఆ క్షీరసముద్రము మధ్యను ఋషభము అనే తెల్లని మహాపర్వతము ఒకటి ఉంది. ఆ పర్వతము మీద అంతటా రజతవృక్షాలు పూలుపూసి

దివ్యగంధము గుబాళిస్తూ ఉంటవి. అక్కడ సుదర్శనము అనే సరస్సు ఒకటి ఉంది. సరోవరములో బంగారు కింజల్కాలతో వెండి కమలాలూ, రాజహంసలూ కనపడుతవి. అక్కడ దేవతలూ, చారణులూ, యక్షులూ, కిన్నరులూ అప్సరసాంగనలతో సంతోషముగా విహరించడానికి వస్తూ ఉంటారు.

"ఓ వానరులారా! క్షీరసముద్రము దాటిన తరువాత సర్వభూత భయావహము అయిన శుద్ధజలసముద్రము కనబడుతుంది. అది సముద్రాలలో శ్రేష్ఠము అయింది. ఔర్వుడి కోపమువల్ల పుట్టిన అశ్వముఖము అయిన (బడబాగ్ని అనే) మహాతేజస్సు అక్కడ, ఆ శుద్ధ జలసముద్రములో ఉంది. ఆ బడబాగ్నే ప్రళయకాలాన సచరాచరము అయిన సమస్తాన్నీ అమిత వేగముతో దహించి వేస్తుంది. ఆ సముద్రములో ఉంటూ ఉన్న భూతాలు అన్నీ శక్తిమంతాలు అయినప్పటికీన్నీ, ఆ బడబాగ్ని ముఖాన్ని చూచి అవి భయపడి అరిచే అరుపులూ, ఏడ్పులూ ఎప్పుడూ వినబడుతూ ఉంటవి. ఆ మంచినీళ్ళ సముద్రానికి ఉత్తరముగా పదమూడు యోజనాల దూరములో జాతరూపశిల అనే పెద్ద బంగారపు కొండ ఉంది.

"ఓ వానరులారా! ఆ పర్వతశిఖరము మీద ఈ భూమిని మోసే అనంతుడు అనే వేయితలల సర్పరాజు కూర్చుని ఉంటాడు. ఆయన చంద్రుడివలె తెల్లగా కనపడతాడు. ఆయన నేత్రాలు తామరరేకులవలె విశాలము అయినవి. నల్లని వస్త్రము ధరిస్తాడు. ఆయనకు దేవతలు అందరూ నమస్కరిస్తారు. ఆ మహాత్ముడికి మూడుతలల బంగారు తాటిచెట్టు ధ్వజము. అది ఆ పర్వత శిఖరముమీద స్థాపించి ఉంది. దానికి అరుగుకూడా వేసి ఉంది. ఆ తాళధ్వజాన్ని బ్రహ్మ విష్ణు మహేశ్వరులు పూర్వదిక్కుకు ఎల్లగా ఏర్పాటు చేసినారు. దానికి అవతల దేదీప్యమానమూ, కాంచనమయమూ అయిన ఉదయ పర్వతము కనపడుతూ ఉంటుంది. దాని శిఖరము నూరు యోజనాల విశాలము అయింది. అది ఆకాశాన్ని ఒరుసుకొనిపోయి ఉంటుంది. అది బంగారమువలె భాసిస్తూ ఉంటుంది. అక్కడ ఒక వేదిక ఉంది. ఆ పర్వతశిఖరముమీద సాల తాల తమాల కర్ణికార వృక్షాలు పూలు పూసి బంగారు మయముగా సూర్యకాంతులతో శోభిస్తూ ఉంటవి. అక్కడ ఒక యోజనము వైశాల్యముతో పదియోజనాల ఎత్తున బంగారుమయము అయిన సౌమనసశృంగము ఉంది. పూర్వము త్రివిక్రమావతారములో పురుషోత్తముడు అయిన మహావిష్ణువు మొదటి అడుగు ఆ సౌమనస శిఖరం మీద పెట్టి రెండవ అడుగు మేరుపర్వతము మీద ఉంచినాడు.

"ఓ వానరులారా! సూర్యుడు జంబూద్వీపానికి ఉత్తరభాగాన సంచారము చేసి మహోన్నతము అయిన ఈ సౌమనసశృంగముమీదికి వచ్చినప్పుడు, మేరువునకు

దక్షిణభాగాన ఉండేవారికి (మనకు అందరికీ) సూర్యదర్శనము అవుతుంది. ఆ సౌమనసశృంగముమీద వైఖానసులూ, వాలఖిల్యులూ అనే మహర్షులు తపస్సు చేసుకొంటూ నివసిస్తున్నారు. వారు సూర్యసమానకాంతులతో తేజరిల్లుతూ ఉంటారు. సమస్త ప్రాణికోటికీ జీవమూ, వెలుతురూ అయిన సూర్యుడు అక్కడ దివ్య దర్శనము ఇస్తాడు. కనుక అది సుదర్శన ద్వీపము అయింది.

"ఓ వానరులారా! ఆ ఉదయపర్వతము అంతటనూ అక్కడ అడవులలోనూ, అక్కడి గుహలలోనూ రావణాసురుణ్ణీ, సీతాదేవినీ మీరు వెతకవలెను. కాంచనమయము అయిన ఉదయగిరిమీదనుంచి సూర్యకాంతులు ప్రసరించడము వల్లనే పూర్వసంధ్య రక్తకాంతులు విరచిమ్ముతూ ఉంటుంది. ఈ కారణమువల్లనే, మొదట బ్రహ్మదేవుడు దీనిని సూర్యోదయస్థానముగా నిర్ణయించినాడు. అందువల్లనే ఈ పృథివికి ఇది పూర్వద్వారము అయింది. పూర్వదిక్కున్నూ అయింది. ఈ ఉదయపర్వతము వెనుక భాగములో ఉన్న సెలయేళ్ళదగ్గరనూ, గుహలలోనూ, అక్కడ అంతటనూ, రావణాసురుణ్ణీ, సీతాదేవినీ మీరు వెతకవలెను.

"ఆ ఉదయాచలానికి తూర్పుకు మీరు పోలేరు. అక్కడ సూర్యచంద్రుల సంచారము ఉండదు. అంధకారావృతము అయి ఉంటుంది. అక్కడ ఏమి ఉందీ కంటికి కనపడదు. ఆ ప్రదేశములో దేవతలు ఉంటారు. నేను చెప్పిన ప్రదేశాలలోను, నేను చెప్పకుండా వదిలిపెట్టిన ఇంకా ఇతర స్థలాలలోను, అన్ని పర్వతాలమీదను, గుహలలోను, అడవులలోను సీతాదేవి ఉందేమో వెతకి చూడవలెను.

"ఓ వానరులారా! నేను చెప్పినంతవరకు మీరు పోవలెను. ఆ పైన భూమి ఎంత ఉందో హద్దులేదు. సూర్యదర్శనము ఉండదు. మీరు ఉదయపర్వతము వరకూ పోయి ఒక నెల నిండేలోపల తిరిగి రావలెను. ఒక నెలకు పయిన మీరు అక్కడ ఎక్కడనూ ఉండకూడదు. నెల అయిపోయిన తరువాత వచ్చేవారికి మరణదండనము తప్పదు. సీతాదేవి జాడ తెలుసుకోండి. మీరు పోయే పని సఫలము చేసుకొని రండి. ఓ వానరులారా! పూర్వదిశ దేవేంద్రుడికి ప్రియము అయింది. అక్కడ అనేకములయిన అడవులు వున్నవి. ఆ పూర్వదిశను మీరు నేర్పరులుగా సంచారము చేసి రాముని ప్రియురాలు సీతాదేవి జాడ తెలుసుకొని రావలెను. అట్లా వచ్చిన తరువాత అన్ని సుఖాలూ మీరు అనుభవిస్తారు."

41

అట్లా చెప్పి సుగ్రీవుడు ఆ మహావానర సైన్యాన్ని తూర్పు దిక్కుకు పంపించినాడు. అంతట దక్షిణ దిక్కుకు ప్రసిద్ధ పరాక్రమవంతులను పంపించవలెను

అనుకొన్నాడు. వానరవీరుల తారతమ్యాలు చక్కగా తెలిసిన ఆ వానరవీరుడు, ఆ వానరరాజు సుగ్రీవుడు అగ్నిదేవుడి పుత్రుడు అయిన నీలుణ్ణీ, హనుమంతుణ్ణీ, సుహోత్రుణ్ణీ, శరారినీ, శరగుల్మణ్ణీ, గజుణ్ణీ, గవాక్షుణ్ణీ, గవయుణ్ణీ, సుషేణుడినీ, ఋషభుడినీ, మైందుడినీ, ద్వివిదుడినీ, విజయుడినీ, గంధమాదనుడినీ, హుతాశనసుతులు అయిన ఉల్కాముఖుణ్ణీ, అసంగుణ్ణీ, వేగానికీ పరాక్రమానికీ ప్రసిద్ధి కెక్కిన అంగదుడు మొదలైన శూరులనూ దక్షిణ దిక్కుకు పంపించడానికి నిర్ణయించి, ఈ వానర వీరులు అందరికీ అంగదుణ్ణి సేనానాయకుడిగా నియమించినాడు. అంతట ఈ విధముగా ఆ కపిరాజు సుగ్రీవుడు దక్షణదిశను చొర నలవికాని ప్రదేశాలను గురించి వివరించి చెప్పినాడు.

"ఓ వానరసేనానాయకులారా! వెయ్యి శిఖరాలతోనూ, నానావిధ వృక్ష లతాదులతోను వింధ్యము అనే పర్వతము ఉంది. దానికి దక్షిణాన మహోరగాలు నివసిస్తూ దాటిపోవ నలవికాని నర్మదానది ఉంది. దక్షిణదేశములో ఇంకా రమ్యము అయిన గోదావరీనదీ, కృష్ణవేణీనదీ, పూజనీయమూ మహోరగాలతో భయంకరమూ అయిన వరదానదీ, మేఖలానదీ, ఉత్కలానదీ ఉన్నవి. ఈ నదీ ప్రాంతములో మీరు సీతాదేవిని వెదకవలెను.

దశార్ణ దేశములో పట్టణాలలోనూ, అశ్వవంతి పట్టణములోనూ, అవంతీ పట్టణములోనూ వెదకవలెను. విదర్భదేశములోను, ఋషీక దేశములోను, రమణీయము అయిన మహిషక దేశములోను, వంగ దేశములోను, కళింగ దేశములోను, కౌశిక దేశములోను మీరు సీతాదేవిని వెదకవలెను.

"పయిన చెప్పిన గోదావర్యాది నదీ ప్రాంతాలలోనే కాకుండా, దండకారణ్యములో ఉన్న కొండలలోను, గుహలలోను, ఇంకా ఇతర దుర్గమ ప్రదేశాలలోను, ఆంధ్రప్రదేశములోను, పుండ్ర దేశములోను, చోళ దేశములోను, కేరళ దేశములోను, పాండ్య దేశములోను మీరు సీతాదేవిని వెదకవలెను.

"గైరికాది ధాతువులతో ధగధగ లాడుతూ ఉండే సహ్యాపర్వతానికి పోవలెను. ఆ సహ్యాద్రి పర్వత శిఖరాలు విచిత్రముగా కనపడుతూ ఉంటవి. అంతేకాదు, ఆ పర్వతము మీద చిత్రవిచిత్రము అయిన పూలు పూసే చెట్లు ఉన్నవి. చందన వృక్షాలతో అరణ్య ప్రదేశాలు ఉన్నవి. అక్కడ ఆ సహ్యాపర్వతము అంతటా మీరు సీతాదేవిని వెదకవలెను.

ఆ సహ్యాద్రి దాటిన తరువాత నిర్మలోదకాలతో మంగళకరము అయిన కావేరీనది కనపడుతుంది. ఆ నదీతీరాన అప్సరోగణాలు విహరిస్తూ ఉంటవి. ఆ

నదీ ప్రాంతములో వెదకవలెను. అక్కడ నుంచి మలయ పర్వతానికి పోవలెను. ఆ పర్వత శిఖరాలమీద మహాతేజోవంతుడు అగస్త్యమహర్షి సూర్యసమాన కాంతులతో తేజరిల్లుతూ ఉంటాడు. మీరు ఆయన దర్శనము చేయవలెను. ఆ మహాత్ముడి అనుగ్రహము మీరు సంపాదించవలెను. ఆయన అనుమతితో మీరు తామ్రపర్ణి నదిని దాటి పోవలెను. ఆ తామ్రపర్ణి నదిలో పెద్ద పెద్ద మొసళ్ళు ఉంటవి. ఆ తామ్రపర్ణి ఎత్తు అయిన ద్వీపాలతోను, ఆ ద్వీపాలలో పెరిగే చందన వృక్షాలతోను, యౌవనములో ఉన్న కాంత చందనచర్చ చేసుకొని ఉత్తుంగ స్తనాలతో ఊగులాడుతూ ప్రియుణ్ణి చేరపోయేట్టుగా సముద్రానికి పోతూ ఉంటుంది.

"ఓ వానరులారా! మీరు ఆ తామ్రపర్ణిని దాటిపోతే బంగారుమయము అయిన పాండ్యరాజుల పట్టణ ద్వారము కనబడుతుంది. శ్రేష్ఠము అయిన ముత్యాలతోనూ, రత్నాలతోనూ ఆ ద్వారము అలంకరించి ఉంటుంది. అది ఉత్తమము అయిన పట్టణము. ఆ పట్టణము చూచుకొని మీరు అక్కడినుంచి సముద్రతీరానికి రావలెను. అక్కడ ఆ సముద్రము దాటిపోయే ప్రయత్నాలు అన్నీ చేయవలెను. అక్కడ సముద్రంలో అగస్త్యమహర్షి ఒక పర్వతాన్ని ఉంచినాడు. అదే మహేంద్రపర్వతం. ఆ పర్వతముమీద చిత్రవిచిత్రము అయిన తరులతాదులు ఉన్నవి. అది సమస్త ఫల పుష్ప సమృద్ధము అయింది. అది శ్రీమంతమూ, బంగారుమయమూ అయిన పర్వతము. అక్కడ దేవర్షులూ, యక్షప్రవరులూ, సిద్ధులూ, చారణులూ, అప్సరసలూ విహరిస్తూ ఉంటారు. అది మనోహరము అయిన ప్రదేశము. ప్రతి పర్వదినానా దేవేంద్రుడు సముద్రస్నానము చేయడానికి అక్కడికి పోతూ ఉంటాడు. ఆ మహేంద్రపర్వతము సముద్రములోకి చొచ్చుకొనిపోయి ఉంటుంది.

"ఆ దక్షిణసముద్రములో దేదీప్యమానము అయిన ద్వీపము ఒకటి ఉంది. దాని వైశాల్యము నూరుయోజనాలు. అక్కడికి మనుష్యులు పోలేరు. దేవేంద్రసమాన తేజోవంతుడూ, దురాత్ముడూ, వధ్యుడూ అయిన రావణాసురుడు ఉండే ప్రదేశము అదే. అక్కడ ఆ ద్వీపము అంతటా సీతాదేవిని వెదకవలెను. ఇతర ప్రదేశాలలోకన్నా అక్కడ ఎక్కువగా వెదకవలెను. ఆ ద్వీపానికి ఉత్తరముగా, ఆ దక్షిణసముద్రము నడుమ అంగారక అనే రాక్షసి ఒకతె ఉంది. ఆ రాక్షసి నీళ్ళలోపడే నీడనుపట్టి ప్రాణికోటిని లాగివేసి భక్షిస్తుంది.

"ఓ వానరవీరులారా! మీరు అందరూ పరమపరాక్రమవంతులు. ఆ ద్వీపములో ప్రతి ప్రదేశమూ మీరు వెదకి చూడవలెను. సీతాదేవి అక్కడ లేదు అని మీకు నిస్సందేహంగా తెలిసేవరకున్నా మీరు ఆ ద్వీపములో ప్రతిచోటా వెదకవలెను.

అక్కడ ఆమె లేదు అని మీకు నిస్సందేహముగా తెలిసిన తరువాతనే మీరు అవతలకు పోవలెను.

"ఆ లంకాద్వీపానికి అవతల నూరుయోజనాల దూరములో లక్ష్మీప్రదము అయిన పుష్పితకము అనే పర్వతము ఒకటి ఉంది. అక్కడ సిద్ధులూ, చారణులూ నివసిస్తూ ఉంటారు. ఆ పుష్పితకగిరి సముద్రము మధ్యను చుట్టూ జలాలతో ఉంది. దాని శిఖరాలు ఆకాశాన్ని అంటుతూ ఉంటవి. అది ఒకవైపున సూర్యుడివలె ఎఱ్ఱగాను, ఇంకొక వైపున చంద్రుడివలె తెల్లగాను తేజరిల్లుతూ ఉంటుంది. ఆ పర్వతానికి బంగారు శిఖరము ఉంది. ఆ శిఖరాన్ని సూర్యుడు సేవించి దక్షిణ సంచారానికి పోతూ ఉంటాడు. దాని రజత శిఖరాన్ని చంద్రుడు సేవిస్తూ ఉంటాడు. ఓ వానరులారా! కృతఘ్నులకూ, నాస్తికులకూ ఆ పర్వతము కనపడదు. మీరు ఆ పర్వతశిఖరానికి నమస్కారము చేసి అక్కడ సీతాదేవిని వెదకవలెను.

"ఓ వానరులారా! మీరు అందరూ నిర్భయులు. ఆ పుష్పితక పర్వతము అవతల సూర్యవంతము అనే ప్రసిద్ధము అయిన పర్వతము ఉంది. అది పుష్పితక పర్వతానికి పధ్నాలుగు యోజనాల దూరములో ఉంది. అక్కడికి పోవడము చాలాకష్టము. అయినప్పటికిన్నీ మీరు అక్కడికి పోవలెను. ఆ సూర్యవంతానికి అవతల వైద్యుతము అనే పర్వతము ఉంది. అక్కడ కోరుకొన్న ఫలవృక్షాలు అన్నీ కనపడుతవి. అవి అన్ని కాలాలలోనూ పూలు పూస్తూనూ, కాయలు కాస్తూనూ, పండ్లు పండుతూనూ ఉంటవి. ఆ వైద్యుతపర్వతముమీద మహారుచ్యము అయిన ఫలమూలాదులు తిని, అక్కడ దొరికే తేనెత్రాగి దానికి అవతల ఉన్న కుంజర పర్వతానికి పోవలెను.

"ఆ కుంజర పర్వతము కన్నులపండువుగాను, మనస్సుకు ఉల్లాసము గాను ఉంటుంది. అక్కడనే విశ్వకర్మ అగస్త్యమహర్షి కోసము బంగారముతోను, వివిధ మణులతోను ఒక భవనము నిర్మించినాడు. అది చాలా ఎత్తు అయిన భవనము. అది ఒక యోజనము వెడల్పూ, పది యోజనాలు పొడుగూ ఉంటుంది.

"అక్కడనే సర్పాలయము అయిన భోగవతీ పట్టణము ఉంది. ఆ నగరకక్ష్యలు అన్నీ విశాలము అయినవి. అయితే అక్కడికి ఎవరికీ పోనలవికాదు. భయంకరము అయిన ఆకారాలతో, తీక్ష్ణము అయిన దంష్ట్రలతో మహావిషసర్పాలు అక్కడ అంతటా కావలి కాస్తూ ఉంటవి. అక్కడనే, ఆ పట్టణములోనే మహాప్రాజ్ఞుడు అయిన వాసుకి అనే సర్పరాజు కాపురము ఉంటున్నాడు. మీరు అగస్త్య భవనములోనుంచి పోయి ఆ భోగవతీ పట్టణములోనూ, ఆ పరిసరాలలోనూ సీతాదేవిని వెదకవలెను.

"ఆ భోగవతీపురానికి అవతల శ్రీమంతమూ, సమస్తరత్నమయమూ అయిన ఋషభ పర్వతము కనపడుతుంది. అది వృషభాకారముగా ఉంటుంది. అక్కడ గోరోచనపు వన్నెతోను, కమలదళాల వన్నెలతోను, హరిత వన్నెలతోను, శ్యామవర్ణము తోను, అగ్నిహోత్ర కాంతులతోను చందనవృక్షాలు కనపడుతవి. ఆ చందన వనాన్ని చూడవలసిందేకాని తాకి చూడటానికి వీలు ఉండదు. ఏమి అంటే రోహితులు అనే భయంకరులు అయిన గంధర్వులు ఆ చందన వనాన్ని కావలి కాస్తూ ఉంటారు.

"అక్కడ ఆ ఋషభ పర్వతముమీద శైలూషుడూ, గ్రామణీ, శిగ్రువూ, శుభ్రుడూ, బభ్రుడూ అనే గంధర్వరాజులు సూర్యసమాన తేజోవంతులు అయిదుగురు ఉంటున్నారు. పుణ్యకర్ములు చేసిన సూర్యసమాన తేజోవంతులూ, చంద్రసమాన తేజోవంతులూ, అగ్నిహోత్రసమాన తేజోవంతులూ అక్కడ కనపడుతారు. ప్రళయకాలాన ఈ పృథ్వి నాశనము అయిపోయినప్పుడు స్వర్గాది పుణ్యలోకాలు సాధించిన దుర్ధర్షులు అక్కడ నివసిస్తూ ఉంటారు.

"ఆ ఋషభ పర్వతానికి అవతల పితృలోకము ఉంది. అక్కడికి మీరు పోవద్దు. అక్కడ యముడి రాజధాని ఉంది. అది దుస్సహము అయిన చీకటిలో ఉంటుంది. ఓ వానరపుంగవులారా! మీరు అందరూ వీరులు అయినప్పటికిన్నీ ఋషభ పర్వతమువరకే మీరు పోవడానికీ, వెతకడానికీ వీలు అవుతుంది. మీ గమనశక్తి ఎంత గొప్పది అయినప్పటికిన్నీ ఋషభ పర్వతము దాటి అవతలకు పోలేరు.

"ఓ వానర సేనానాయకులారా! నేను చెప్పిన ప్రదేశాలలోను, నేను చెప్పకుండా వదలిపెట్టిన ఇంకా ఇతరప్రదేశాలలోను మీరు చక్కగా వెదకి సీతాదేవి ఎక్కడ ఉంటూందీ తెలుసుకొని మరీ రావలెను.

ఒక్కమాసం లోపల తిరిగివచ్చి 'సీతాదేవి నాకు కనబడ్డది' అని ఎవడు అయితే చెప్పుతాడో, వాడు నాతో సరిసమానము అయిన భోగభాగ్యాలు అనుభవించ కలుగుతాడు.

"ఓ యూథపతులారా! మీలో సీతాదేవిని చూచి వచ్చేవాడికన్నా నాకు ప్రియుడు అయ్యేవాడు మరొకడు ఉండడు. వాడు నాకు నా ప్రాణముకన్నా అధికుడు అవుతాడు. వాడు అనేక అపరాధాలు చేసినవాడు అయినప్పటికిన్నీ నాకు బంధువు అవుతాడు.

"వానరోత్తములారా! మీరు అమితబలపరాక్రమవంతులు. శౌర్య వీర్యాది సమస్త సద్గుణవంతులు అయినవారి వంశాలలో జన్మించినారు. సీతాదేవి ఎక్కడ ఉందీ మీరు సమస్త ప్రయత్నాలూ చేసి తెలుసుకొని రావలెను."

ఈ విధముగా సుగ్రీవుడు దక్షిణ దిక్కుకు పోయే వానర వీరులకు చెప్పినాడు.

42

అంగదుడి వెంట ఆ యా వానరవీరులను దక్షిణదిశకు పొమ్మని చెప్పిన తరువాత ఆ వానరరాజు సుగ్రీవుడు మేఘసమాన కాంతిమంతుడూ, తార తండ్రీ అయిన సుషేణుణ్ణీ, అతని వెంట మరీచమహర్షి జ్యేష్ఠపుత్రుడు అయిన మారీచ మహాకపినీ, అతని తమ్ములు అయిన మారీచులనూ పడమటి దిక్కుకు పంపించవలెను అనుకొన్నాడు.

ఆ మారీచమహాకపి అమిత తేజోవంతుడు. బుద్ధిబలములోను, పరాక్రమములోను దేవేంద్రుడు అంతటివాడు. వేగానికి గరుత్మంతుడితో సరిసమానము అయినవాడు. అతని తమ్ములు అయిన మారీచులున్నూ మహాబలవంతులు. అమితతేజోవంతులు. శూరులు.

ఆ వానరాధిపతి సుగ్రీవుడు అప్పుడు ఆ భీమవిక్రముణ్ణి సుషేణుణ్ణి చూచి నమస్కారము చేసి, "ఓ వానరోత్తమా! మీరు మారీచమహాకపినీ, అతని తమ్ములు అయిన మారీచులనీ, మరి రెండులక్షలమంది వానరవీరులనూ వెంటపెట్టుకొని పడమటిదిక్కుకు పోయి సీతాదేవిని వెదకవలెను.

"ఓ యూధపతులారా! మీరు బాహ్లిక దేశములోను, సురాష్ట్ర దేశములోను, భీమ దేశములోను, శూర దేశములోను, రమణీయము అయిన కుక్షి దేశములోను, ఇంకా ఆ పడమటిదిక్కున ఉన్న ఆ యా దేశాలలోను, ఆ యా దేశాల గ్రామాలలోను, పెద్ద పెద్ద పట్టణాలలోను, ఆ యా దేశాలలో వున్న గవనాలలోను, పొగడచెట్లు, విరిగిచెట్లు, మొగలిపొదలూ మొదలు అయిన రకరకాల చెట్లు ఉండే వనాలలోను, ఆ పడమటిదిక్కున చల్లని పావనోదకాలతో ప్రవహించే నదీప్రాంత ప్రదేశాలలోను, తాపసులు నివసించే మహారణ్యాలలోను, ఇంకా ఆ యా అడవులలోను, నిర్జల ప్రదేశాలలోను, ఎత్తు అయిన రాతి భూములలోను పర్వత సమూహాలతో దుర్గమము అయిన ప్రదేశాలలోను వెతుకుతూ పశ్చిమ తీరానికి పోవలెను.

"పశ్చిమసముద్రము అతి గంభీరము అయింది. ఆ సముద్రంలో తిములూ, నక్రాలూ, గ్రాహాలూ అనే మహాభయంకరము అయిన జలచరాలు అమితముగా ఉంటవి. ఆ తీరాన మనోహరము అయిన మొగలి తోపులూ, కానుగచెట్ల అడవులూ, కొబ్బరితోటలూ ఉన్నవి. మీరు వాటిని అన్నిటినీ హాయిగా తిరిగి చూడండి. ఆ సముద్రముగట్టున ఉన్న కొండలలోను, అడవులలోను రావణాసురుడు ఉంటున్నాడేమో మీరు వెతకవలెను.

"ఆ పశ్చిమసముద్రతీరాన ఉన్న మురచీపట్టణములోను, జటీపురములోను, అవంతీ పట్టణములోను, అంగలోపనగరములోను, అలక్షితము అనే మహారణ్యము లోను, ఇంకా ఆ తీరాన ఉన్న ఆ యా దేశాలలోను, పెద్ద పెద్ద పట్టణాలలోను వెదకవలెను.

"సింధునదము సముద్రములో సంగమించేచోట నూరు శిఖరాలతోను, ఆ శిఖరాలమీద మహోన్నత వృక్షాలతోను హేమగిరి అనే పర్వతము ఉంది. ఆ పర్వత నెత్తాలు అన్నీ మనోహరము అయినవి. ఆ నెత్తాలలో సింహాలు అనే పక్షులు ఉన్నవి. అవి చేపలనూ, ఇంకా ఇతర జలచరాలనూ, నీటి ఏనుగులను ఎత్తుకొని పోయి తమ గూండ్లలో పెట్టుకొంటూ ఉంటవి. ఆ హేమగిరి శిఖరాలమీద తనివితీర తిని మదము ఎక్కి ఏనుగులు ఉరుములు ఉరిమేటట్టు ఘీంకారాలు చేస్తూ సింహాలు అనే ఆ పక్షులు గూండ్లదగ్గర తిరుగుతూ ఉంటవి. ఆ హేమగిరి శిఖరాలమీద కాంచనవృక్షాలూ, రంగు రంగులతో విచిత్రము అయిన చెట్లూ ఎన్నో ఉన్నవి. అవి అన్నీ ఆకాశాన్ని అంటే మహోన్నత వృక్షాలు. ఓ వానరులారా! మీరు అందరూ కామరూపులు. కనుక ఆ పర్వతశృంగాలమీదికిపోయి ఆలస్యము చేయకుండా అంతటా వెతికి చూడండి.

"ఓ వానరులారా! ఆ పశ్చిమసముద్రములో పారియాత్రము అనే బంగారుమయము అయిన పర్వతము ఒకటి ఉంది. దాని శృంగాలు కన్నులు మిరుమిట్లు కొలుపుతూ ఉంటవి. ఆ పారియాత్ర పర్వతము వైశాల్యము ఒక నూరు యోజనాలు ఉంటుంది. ఆ పర్వతముమీద ఇరవైనాలుగుకోట్లమంది గంధర్వులు నివసిస్తున్నారు. వాండ్లు అందరూ మహాబలవంతులు. అగ్ని హోత్రముతో సరిసమానము అయిన తేజోవంతులు. కామరూపులు. వాండ్లు అందరూ మహాభయంకరులు. అగ్ని జ్వాలలవంటి ఆ గంధర్వులు వేలకు వేలమంది గుంపులు గుంపులుగా కలసి మెలసి ఉంటూ ఉన్నారు. ఓ వానరులారా! మీరు అందరూ భయంకర పరాక్రములు అయినప్పటికిన్నీ వాండ్లను సమీపించవద్దు. అక్కడ మీకు రకరకాల పండ్ల చెట్లు, కందమూలాలు కనపడుతవి. మీరు ఆ పండ్లను ముట్టుకోవద్దు. జయించడానికి అలవికాని మహాశూరులూ, ధైర్యవంతులూ, మహాబలవంతులూ, భీమవిక్రములూ అయిన గంధర్వులు ఫలమూలాలను కనిపెట్టుకొని కావలి ఉంటారు. మీరు ఆ ఫలమూలాలను ముట్టుకోకుండా ఏ కోతిపనులు చేసినా మిమ్ములను ఆ గంధర్వులు ఏమీ చేయరు. ఏ కొంచెము భయమూ లేకుండా మీరు అక్కడ తిరుగవచ్చును. ఓ వానరులారా! మీరు ఆ పారియాత్ర పర్వతము అంతటా జాగ్రత్తగా వెతకవలెను.

"ఆ పారియాత్రానికి అవతల ఆ సముద్రములో వైడూర్యమణి కాంతులతో తేజరిల్లే వజ్రము అనే పర్వతము ఉంది. అది వజ్రాలకు ఉనికిపట్టు. నానా తరు

లతాదులున్నూ ఆ పర్వతము మీద కనబడుతవి. దాని ఎత్తు ఒక నూరు యోజనాలు ఉంటుంది. దాని వైశాల్యమున్నూ నూరు యోజనాలు ఉంటుంది. శ్రీమంతము అయిన ఆ పర్వతము అంతటనూ, అక్కడ గుహలు అన్నిటిలోనూ మీరు చక్కగా వెతకవలెను.

"ఆ లవణసముద్రము నాల్గవ భాగములో చక్రవంతము అనే పర్వతము ఉంది. అక్కడనే విశ్వకర్మ వెయ్యి అంచుల చక్రాయుధాన్ని నిర్మించినాడు. హయగ్రీవుడు అనే రాక్షసుణ్ణి మహావిష్ణువు సంహారముచేసి ఆ చక్రాయుధాన్ని తీసుకొన్నాడు. అక్కడనే ఆ చక్రవంతపర్వతముమీదనే పంచజనుడు అనే రాక్షసుణ్ణి మహావిష్ణువు సంహారముచేసి వాడి అస్తితో పాంచజన్యము చేయించుకొన్నాడు. ఈవిధముగా మహావిష్ణువు శంఖచక్రాలు సంపాదించినాడు. ఆ చక్రవంత పర్వత సానువులు చిత్ర విచిత్రముగా వుంటవి. అక్కడ విశాలము అయిన గుహలున్నూ ఉన్నవి. ఆ పర్వత సానువులోను, ఆ కొండ గుహలలోను మీరు సీతాదేవినీ, రావణాసురుణ్ణీ వెతకవలెను.

"ఆ చక్రవంత పర్వతానికి అవతల అరవై యోజనాల దూరములో బంగారు శృంగాలతో మహాతేజోవంతము అయిన వరాహ పర్వతము ఉంది. మీరు ఆ పర్వతానికి పోవలెను. అక్కడ సముద్రము అగాధముగా ఉంటుంది. ఆ వరాహ పర్వతము మీద ప్రాగ్జోతిష పురము ఉంది. అక్కడ నరకుడు అనే రాక్షసుడు నివసిస్తూ ఉన్నాడు. వాడు దుష్టాత్ముడు. ఆ వరాహ పర్వత సానువులు ఆశ్చర్యముగా ఉంటవి. ఆ సానువులలోనూ, అక్కడి విశాలము అయిన గుహలలోనూ మీరు సీతాదేవిని వెతకవలెను.

"అక్కడికి అవతల సర్వసౌవర్ణమయము అయిన మేఘవంతము అనే పర్వతము ఉంది. ఆ పర్వతము వెలుపలా, లోపలా బంగారుమయముగా ఉంటుంది. అక్కడి కొండవాగులు బంగారు రంగులో ప్రవహిస్తూ ఉంటవి. ఆ పర్వతారణ్యాలలో సింహాలూ, పెద్దపులులూ, ఏనుగులూ, అడవిపందులూ ఒకటి గర్జించగానే, దానికి ప్రతిగా మరి ఒకటి గర్జిస్తుంటవి. ఆ విధముగా ఆ యా వన్యమృగాలు అన్నీ గర్జిస్తూ ఉంటే ఆ పర్వత ప్రదేశము ఆ గర్జన ధ్వనులతో మారుమ్రోగుతూ ఉంటుంది. అక్కడనే దేవతలు శ్రీమంతుడూ, పాకశాసనుడూ, హరిహయుడూ అయిన దేవేంద్రుడికి రాజ్యాభిషేకము చేసినారు. మహేంద్రుడు పరిపాలించిన ఆ శైలేంద్రానికి అవతల తరుణాదిత్య కాంతులతో విరగపూసిన జాతరూపమయము అయిన వృక్షాలతో శోభాయమానముగా అరవైవేల బంగారుపర్వత శృంగాలు కనపడుతుంటవి.

"ఆ పర్వతాల మధ్యను పర్వతరాజము అయిన సావర్ణిమేరు పర్వతము ఉంది. పూర్వము సూర్యుడు ప్రసన్నుడు అయి ఆ పర్వతానికి ఒక వరము ఇచ్చినాడు. ఆ వరప్రభావమువల్ల ఆ పర్వతముమీద ఉన్న వృక్ష శిలాదులు అన్నీ బంగారుమయము అయిపోయినవి. అంతేకాదు, ఆ పర్వతముమీద ఉంటూ ఉండే దేవ దానవ గంధర్వులు అందరూ కూడా రక్తవర్ణముతో, కాంచన ప్రభలతో తేజరిల్ల సాగినారు. విశ్వదేవులూ, మరుత్తులూ, వసువులూ, దేవతలూ సాయంసంధ్యా సమయాన ఆ సావర్ణిమేరువు పర్వతానికి పోయి సూర్యోపస్థానము చేస్తూ ఉంటారు. సూర్య భగవానుడు వారి పూజలను అందుకొనడానికి అవతల ఉన్న అస్తగిరి మీదకి పోయి ఎవరికీ కనబడకుండా అదృశ్యుడు అయిపోతూ ఉంటాడు.

"ఆ సావర్ణిమేరువుకున్నూ, అస్తగిరికిన్నీ అంతరము పదివేల యోజనాలు. సూర్యుడు ఆ పదివేల యోజనాల దూరమున్నూ ముహూర్తార్ధములో (ఒక్క గడియలో) దాటి, అమిత వేగముతో అస్తగిరి మీదకి పోతాడు.

"ఆ అస్తగిరి శృంగముమీద అనేక ప్రాసాద సమూహాలతో వరుణదేవుడికి విశ్వకర్మ ఒక భవనము నిర్మించినాడు. ఆ వరుణ భవనము సూర్య సమానకాంతులతో తేజరిల్లుతూ ఉంటుంది. అక్కడ చిత్ర విచిత్రము అయిన వృక్షాలూ, నానావిధ పక్షిసమూహాలూ శోభాయమానముగా కనపడుతవి. మహారమణీయము అయిన ఆ భవనములో ఆ పాశహస్తుడు వరుణదేవుడు నివసిస్తూ ఉన్నాడు.

"సావర్ణిమేరువు పర్వతానికిన్నీ, అస్తగిరికిన్నీ మధ్య చిత్రవర్ణము అయిన వేదిక ఒకటి ఉంది. ఆ వేదికమీద పదితలల బంగారు తాటిచెట్టు భాసిస్తూ ఉంటుంది. అక్కడనే బ్రహ్మదేవుడితో సరిసమానుడూ, మహాతపస్సంపన్నుడూ, ధర్మజ్ఞుడూ అయిన మేరుసావర్ణిమహర్షి నివసిస్తూ వున్నాడు. సూర్యప్రభలతో తేజరిల్లే ఆ మేరుసావర్ణిమహర్షికి మీరు సాష్టాంగ నమస్కారము చేయవలెను. సీతాదేవి వృత్తాంతము ఆయనను అడగవలెను. ఆయనకు తెలిస్తే చెప్పుతాడు. మీరు అక్కడి సరస్సుల దగ్గరనూ, అక్కడి నదీప్రాంతాలలోనూ సీతాదేవిని వెతకవలెను.

"ఓ వానరులారా! సూర్యుడు రాత్రి అయిపోగానే (ఉదయగిరి మొదలు) ప్రాణికోటి నివసించే ఈ ప్రదేశము వరకున్నూ వెలుతురును ఇస్తూ అస్తగిరికి పోతూ వుంటాడు.

"ఓ వానరులారా! మీరు ఇంతవరకూ పోవడానికి వీలు అవుతుంది. ఈ ప్రదేశము దాటిన తరువాత సూర్యరశ్మి వుండదు. అంతా అంధకారబంధురముగా ఉంటుంది. హద్దులు తెలియవు. (అస్తగిరికి) అవతల ఏమి ఉందో ఎవరమూ ఎరుగము. కాబట్టి మీరు అస్తపర్వతము వరకున్నూ పోయి సీతాదేవిని వెతకవలెను.

రావణాసురుడి వునికిపట్టు తెలుసుకోవలెను. ఒక్క మాసము నిండేలోపల మీరు తిరిగి రావలెను. అట్లా కాకుండా మాసము అయిపోయిన తరువాత తిరిగి వచ్చే వారికి మరణ దండనము తప్పదు.

"ఓ వానరులారా! ఈ మహాబాహువు, ఈ శూరుడు, ఈ పూజ్యుడు సుషేణుడు నా మామగారు. మీరు చేయవలసిన సమస్తము అయిన పనులకున్నూ ఆయన నియామకుడు. మీరు అందరూ ఈయన వెంట పోవలెను. ఈయన చెప్పే సమస్త పనులూ చేస్తూ ఈయన ఆజ్ఞలను అన్నిటినీ శిరసావహించవలెను. మీరు అందరూ పరమపరాక్రమవంతులు కాబట్టి మీకు కార్యసిద్ధి అవుతుంది. ఈ రాముడు అమిత పరాక్రమశాలి. మనకు ఉపకారము చేసినాడు. ఈయన భార్యను సీతాదేవిని మీరు చూచి వచ్చేట్లయితే మనము ఈయనకు ప్రత్యుపకారము చేసినవాండ్లము అవుతాము. కృతార్థులము అవుతాము.

"ఓ వానరులారా! నేను చెప్పింది కాకుండా ఇంకా ఈ పని నెరవేరడానికి ఏమి చేయవలెనో అది అంతా మీరు ఆలోచించండి. మీరు దేశకాలాలనూ, కార్యాకార్యాలనూ యోచించండి. కార్యము సాధించుకొని రండి" అని చెప్పినాడు.

ఇట్లా సుగ్రీవుడు నిపుణముగా చెప్పింది సుషేణుడూ, ఆయన వెంట పోయే వానరవీరులూ విన్నారు. అంతట ఆ వానరవీరులు అందరూ ఆ వానరరాజుకు వీడ్కోలు చెప్పి పడమటి దిక్కుకు పోవడానికి ప్రయాణ సన్నద్ధులు అయినారు.

43

సుగ్రీవుడు సుషేణుణ్ణి పడమటి దిక్కుకు పొమ్మని చెప్పిన తరువాత తన మంచికోసమున్నూ, రాముడికి మేలు చేయడముకోసమున్నూ సమస్త వానర నాయకులలో శ్రేష్ఠుడు అయిన శతవలిని చూచి, "ఓ వానరోత్తమా! నీవు, నీ మంత్రులు అయిన యమపుత్రులతోనూ, నీ అంతటి పరాక్రమవంతులు అయిన మరి ఒక లక్షమంది వానరవీరులతోనూ ప్రయాణము అయి హిమవత్పర్వతము ఉన్న ఉత్తర దిక్కుకు పోయి అక్కడ అంతటా ఆ యశస్వినిని సీతాదేవిని వెతకవలెను. ఆమె ఎక్కడ ఉందీ తెలుసుకొని రావలెను.

"ఓ వానరవీరులారా! మీరు కార్యజ్ఞులలో ఉత్తములు. మీరు పోతూ ఉన్న ఈ పని నెరవేరి రాముడు సంతోషించేట్లయితే మనము అందరమూ ఋణ విముక్తులము అవుతాము. కృతార్థులము అవుతాము. ఈ మహాత్ముడు రాముడు మనకు మహోపకారము చేసినాడు. ఈయనకు మనము ప్రత్యుపకారము చేస్తేనే మన జన్మ సఫలము అవుతుంది. తనకు ఏ ఉపకారమూ చేయని కార్యార్థికి పని

చేసిపెట్టితేనే జన్మ సఫలము అవుతుంది. అటువంటి అప్పుడు మనకు ముందుగా ఉపకారము చేసినవాడికి ప్రత్యుపకారము చేయడము ఎంత మంచిదో నేను చెప్పవలసిన పనే లేదు. ఓ వానరులారా! ఈ పరపురంజయుడు, ఈ సర్వోత్తముడు రాముడు సర్వభూతకోటికిన్నీ మాన్యుడు. మహానుభావుడు. ముఖ్యముగా మనలను ప్రేమిస్తున్నాడు. మన జన్మలు సార్థకము కావడానికి మనము ఈయన పని చేయవలెను. ఈ రామప్రభువును సంతోషపెట్టడానికీ, నాకు మేలు చేయడానికీ మీరు ఈ పని చేస్తున్నాము అని మనస్సులో ఉంచుకొని ఆ జానకీదేవిని వెతకవలెను. ఆమె ఎక్కడ ఉందీ తెలుసుకొని రావలెను. ఇది మీరు చేయవలసిన పని.

"ఓ వానరులారా! మీరు ఉత్తర దిక్కున మ్లేచ్ఛదేశములోను, పుళిందదేశములోను, శూరసేన దేశములోను, ప్రస్థలదేశములోను, భరత దేశములోను, మద్రదేశములోను, కురుదేశములోను, కాంభోజదేశములోను, యవనదేశములోను, శకదేశములోను, అరట్టక దేశములోను, బాహ్లిక దేశములోను, ఋషికదేశములోను, పౌరవదేశములోను, టంకణదేశములోను, చీనాదేశములోను, పరమచీనాదేశములోను, విహారదేశములోను, దరదదేశములోను, హిమవత్పర్వత ప్రాంత దేశములోను సీతాదేవిని వెతకవలెను. ఆ యా దేశాలలోనూ, చొర నలవికాని ఆ యా మహారణ్యాలలోనూ, నదీప్రాంతప్రదేశాల లోనూ, పర్వతమధ్యదేశాలలోను మీ పరాక్రమాతిశయముతోను, మీ బుద్ధిబలముతోను వెతికి, సీతాదేవి ఎక్కడ ఉందీ తెలుసుకొని ఆమెను చూచి రావలెను.

"ఆ యా దేశాల లోధ్రవనాలలోను, పద్మకవనాలలోను, దేవదారువనాలలోను రావణాసురుడు వైదేహితో ఉంటూ ఉన్నాడేమో మీరు వెతకవలెను.

"ఓ వానరులారా! దేవతలూ, గంధర్వులూ ఉంటూ ఉన్న సోమాశ్రమానికి పొండి. అక్కడనుంచి కాళము అనే పర్వతానికి పొండి. ఆ పర్వతగర్భములో బంగారము ఉంది. అందువల్ల ఆ పర్వత నెత్తాలు ధగధగలాడుతూ ఉంటవి. అవి చాలా విశాలము అయినవి. ఆ నెత్తాలలోనూ, ఆ పర్వతగుహలలోనూ, దాని కొనలలోనూ ఆ పూజ్యురాలిని సీతాదేవిని మీరు వెతకవలెను.

"మీరు ఆ కాళ పర్వతమునుంచి సుదర్శన పర్వతానికి పోవలెను. ఆ సుదర్శన పర్వతానికి అవతల దేవసఖము అనే పర్వతము ఉంది. ఆ పర్వతముమీద నానావిధ వృక్షాలూ ఉన్నవి. అక్కడ నానావిధ పక్షులూ నివసిస్తూ ఉన్నవి. మీరు అక్కడ అడవులలోనూ, సెలయేళ్ల దగ్గరనూ రావణాసురుణ్ణీ, సీతాదేవినీ వెతకవలెను.

"ఆ దేవసఖ పర్వతానికి అవతల శూన్యప్రదేశము ఉంది. అది నూరు యోజనాలవరకూ వ్యాపించి ఉంటుంది. అక్కడ, ఆ శూన్యప్రదేశములో ఒక కొండకానీ,

ఒక నదికానీ, చివరకు ఒక చెట్టుకానీ లేదు. ఏ ఒక్క జంతువున్నూ అక్కడ నివసించదు. అది పెద్ద ఎడారి. పయిన ఆకాశము తప్ప మరి ఏమీ అక్కడ లేదు. ఒండ్లు గగురుపుట్టించే ఆ ఎడారిని వేగముగా దాటి మీరు అవతలకు పోవలెను.

"ఆ ఎడారికి అవతల తెల్లటి కైలాసపర్వతము కనబడుతుంది. అది నేత్రపర్వముగా ఉంటుంది. ఆ పర్వతముమీద తెల్లటి మేఘకాంతులతో తేజరిల్లే ఒక బంగారు భవనము విశ్వకర్మ కుబేరుడికోసము నిర్మించాడు. ఆ భవనము సమీపములో విశాలము అయిన కొలను ఒకటి ఉంది. అందులో కమలాలూ, నీలోత్పలాలూ మహా రమణీయముగా ఉంటవి. హంసలూ, కారండవపక్షులూ అక్కడ విహరిస్తూ ఉంటవి. అప్సరసలు అక్కడ గుంపులు గుంపులుగా తిరుగుతూ ఉంటారు. విశ్రవసుడి పుత్రుడు కుబేరుడు అక్కడ నివసిస్తూ ఉన్నాడు. ఆ శ్రీమంతుడు యక్షులకు రాజు. ఈ లోకములో అందరికీ ధనము ఇచ్చేవాడు అతడే. సమస్త ప్రాణికోటీ నమస్కరించే ఆ యక్షరాజు కుబేరుడు అక్కడ యక్షులతో విలాసముగా విహరిస్తూ ఉంటాడు. ఆ కైలాసపర్వతము మీదనూ, చంద్రకాంతులతో శోభించే ఆ పర్వత శిఖరాలమీదనూ, అక్కడి గుహలలోనూ మీరు సీతాదేవిని వెతకవలెను.

"ఆ కైలాసపర్వతానికి అవతల క్రౌంచపర్వతము ఉంది. మీరు అక్కడికి పోవలెను. ఆ పర్వతానికి ఒక బిలము ఉంది. ఆ బిలములో నుంచి తప్ప మరి ఒక విధముగా ఆ పర్వతము దాటి అవతలకు పోలేరు. మీరు అందరూ ఏమరుపాటు లేకుండా హెచ్చరికతో ఆ బిలములోకి పోవలెను. అందులోనుంచి పోవడము చాలా కష్టసాధ్యము అయిన పని. దేవతలు పూజించే మహర్షులు ఆ బిలములో నివసిస్తూ ఉంటారు. వారు, ఆ మహాత్ములు దేవరూపాలతో సూర్యసమాన కాంతులతో తేజరిల్లుతూ ఉంటారు.

"ఓ వానరులారా! మీరు ఆ క్రౌంచపర్వత నెత్తాలలోనూ, గుహలలోనూ, ఆ పర్వతశృంగాలమీదనూ, ఆ పర్వతమధ్య ప్రదేశములోనూ, దాని కొనలలోనూ వెతకవలెను. ఆ క్రౌంచపర్వతము మీదనూ, వృక్షాలు ఉండని కామపర్వతముమీదనూ, పక్షులు అన్నిటికీ ఉనికిపట్టు అయిన మానసపర్వతము మీదనూ మీరు తిరిగి చూడవలెను.

"ఆ మానసపర్వతము మీదికి సాధారణ ప్రాణులే కాకుండా దేవ దానవ రాక్షసులు సహితమూ పోలేరు. మీరు అక్కడికి పోయి అక్కడే సమప్రదేశాలలోనూ, విషమ ప్రదేశాలలోనూ, ఆ మానసపర్వతము అంతటనూ వెతకవలెను.

"క్రౌంచపర్వతానికి అవతల మైనాకము అనే పర్వతము ఉంది. దానిమీద మయుడు స్వయముగా నిర్మించుకున్న భవనము ఉంది. అక్కడి సమభూములలోనూ,

ఇంకా అక్కడి గుహలలోనూ మీరు వెతకవలెను. ఆ మైనాకపర్వతముమీదనే గుఱ్ఱము ముఖాలతో కిన్నరాంగనలు కనపడతారు. ఆ కిన్నరాంగనల నివాసాలలో మీరు వెతకవలెను.

"ఓ వానరులారా! ఆ మైనాకపర్వతము దాటి అవతలకు పోతే మీకు సిద్ధాశ్రమము కనిపిస్తుంది. ఆ ప్రదేశములో సిద్ధులూ, తపస్సంపన్నులూ అయిన వైఖానసులూ, వాలఖిల్యులూ నివసిస్తూ ఉంటారు. వారు పరిశుద్ధులు. వారు వారి తపోబలముతో అణిమాద్యష్టైశ్వర్యాలూ సంపాదించినారు. ఆ మహానుభావులకు మీరు తప్పకుండా నమస్కారము చేయండి. అణకువతో సీతాదేవిని గురించి వారిని అడగండి. వారికి తెలిసి ఉంటే చెప్పుతారు.

"అక్కడనే వైఖానసము అనే సరస్సు ఒకటి ఉంది. ఆ సరస్సు నిండా బంగారువన్నె కమలాలు నేత్రపర్వముగా ఉంటవి. బాలసూర్య ప్రభలతో అందము అయిన హంసలు అక్కడ విహరిస్తూ ఉంటవి. సార్వభౌమము అనే దిగ్గజము అక్కడ ఏడు ఏనుగులతో విహరిస్తూ ఉంటుంది. సార్వభౌమము అనే ఆ ఏనుగే కుబేరుడి వాహనము.

"ఆ వైఖానస సరస్సుకు అవతల సూర్యచంద్రుల సంచారము ఉండదు. నక్షత్రాలు కనిపించవు. మేఘాలు ఉండవు. చడీచప్పుడూ లేకుండా అంతా నిశ్శబ్దముగా ఉంటుంది. సూర్యచంద్రుల సంచారము అక్కడ లేకపోయినప్పటికిన్నీ అక్కడ ఉంటూ ఉన్న దేవసమానులూ, స్వయంప్రకాశులూ అయిన తపస్సిద్ధుల దేహకాంతులవల్ల వెలుతురుగా ఉంటుంది.

"ఆ ప్రదేశానికి అవతల శైలోదము అనే నది ఉంది. ఆ నది ఉభయతీరాలలోనూ కీచకాలు అనే (గాలి కొట్టినప్పుడు చప్పుడు చేసే) వెదుళ్ళు దట్టముగా ఎంతో ఎత్తున ఎదిగి పెనవేసుకొనిపోయి వంతెనగా ఉంటూ ఉన్నవి. ఆ వెదుళ్ళ మీదుగా సిద్ధులు అవతలకూ ఇవతలకూ పోతూ వస్తూ ఉంటారు. అదే పుణ్యవంతులు నివసించే ఉత్తర కురుదేశము.

"ఆ ఉత్తర కురుదేశములో అనేకవేల నదులు ప్రవహిస్తూ వుంటవి. బంగారు కమలాలతోనూ, నీల వైడూర్యమణులవంటి ఆకులతోనూ ఆ నదులలో జలాలు మనోహరంగా ఉంటవి. అక్కడి జలాశయాలలో ఎఱ్ఱ కలువలూ, బంగారు కలువలూ తరుణాదిత్య కాంతులతో ధగధగలాడుతూ ఉంటవి. అక్కడి కొలనులు అంతటా నీలమణులవంటి రేకులతోనూ, బంగారు కింజల్కాలతోనూ నీలోత్పలాలు విచిత్రముగా ఉంటవి. అక్కడి నదులలో ఇసుకతిన్నెలు గుండ్రని ముత్యాలతోనూ, ఎంతో విలువ అయిన రత్నాలతోనూ బంగారు మయముగా ఉంటవి. ఆ నదుల

నడుమను సర్వరత్నమయము అయిన పర్వతాలు చిత్రవిచిత్ర కాంతులతోనూ, బంగారుమయము అయిన పర్వతాలు అగ్నిహోత్ర కాంతులతోనూ భాసిస్తూ ఉంటవి. అక్కడి వృక్షాలు అన్ని కాలాలలోనూ పూలు పూస్తూనూ, పండ్లు పండుతూనూ ఉంటవి. ఆ వృక్షాలను ఆశ్రయించుకొని ఎన్నో రకాల పక్షి సంఘాలు అక్కడ ఉంటూ ఉంటవి. అక్కడి గాలి ఎప్పుడూ వివిధ సుగంధవాసనలతో వీస్తూ ఉంటుంది. ఆ యా ఫల పుష్ప వృక్షాలే కాకుండా, కోరిన వస్తువులు ఇచ్చే వృక్షాలున్నూ అక్కడ వున్నవి. కొన్నివృక్షాలు నానావిధ వస్త్రాలు ఇస్తవి. కొన్నివృక్షాలు ముత్యాలు, వైఢూర్యమణులు పొదిగిన ఆభరణాలు స్త్రీలూ, పురుషులూ పెట్టుకోడానికి ఇస్తూ ఉంటవి. కొన్నివృక్షాలు చిత్రవిచిత్రము అయిన బంగారు ఆస్తరణాలను ఇస్తూ ఉంటవి. కొన్నివృక్షాలు రూప యౌవనవతులు అయిన కాంతలను ఇస్తూ ఉంటవి.

"అక్కడ గంధర్వులూ, కిన్నరులూ, కింపురుషులూ, నాగులూ, విద్యాధరులూ సూర్యకాంతులతో తేజరిల్లుతూ తమ తమ ప్రియురాండ్లతో విహరిస్తూ ఉంటారు. అక్కడ నివసించేవారు అందరూ పుణ్యవంతులు. వారు అందరూ క్రీడాపరాయణులు. కామార్థులు కలవారు. అందరూ వారి వారి ప్రియురాండ్లతో అక్కడ నివసిస్తున్నారు. అక్కడ వారి అట్టహాస ధ్వనులూ, గీతవాద్య ధ్వనులూ సర్వభూత మనోహరముగా ఎప్పుడూ వినపడుతూ ఉంటవి. అక్కడ సంతుష్టుడుకానివాడు కానీ, ఒంటరివాడు కానీ ఒక్కడూ కనిపించడు. అక్కడ సంతోషములూ, సౌఖ్యాలూ దినదిన ప్రవర్ధమానముగా ఉంటవి.

"ఆ ఉత్తరకురుదేశానికి ఉత్తరాన సముద్రము ఉంది. ఆ ఉత్తర సముద్రము మధ్యను సోమగిరి అనే పర్వతము ఉంది. అయితే విష్ణులోకములోను, బ్రహ్మలోకములోను, స్వర్లోకములోనూ ఉండే దేవతలకు తప్ప మరి ఎవరికిన్నీ ఆ సోమగిరి కనిపించదు. ఆ ప్రదేశములో సూర్య సంచారము లేకపోయినప్పటికిన్నీ ఆ సోమగిరి కాంతులే సూర్యకాంతులవలె అక్కడ వెలుతురును ఇస్తూ ఉంటవి. ఆ సోమగిరిమీదనే సర్వాత్మకుడు అయిన మహావిష్ణువూ, ఏకాదశాత్మకుడు అయిన శివుడూ, దేవతలకు అందరికీ దేవుడు అయిన బ్రహ్మదేవుడూ నివసిస్తూ ఉన్నారు. వారిని సేవించే బ్రహ్మర్షులున్నూ అక్కడనే ఉంటారు.

"ఓ వానరులారా! ఆ ఉత్తరకురుదేశానికి ఉత్తర దిక్కుకు మీరు ఏమి చేసినా, మీరు ఎంత శక్తిమంతులు అయినా పోలేరు. ఉత్తరకురుదేశము వరకూ మీరు పోగలరు. ఆ దేశానికి అవతల పోయినవారు లేరు.

"ఓ వానరపుంగవులారా! ఉత్తరకురుదేశానికి అవతల సూర్య సంచారము ఉండదు. హద్దులు తెలియవు. అక్కడ ఏమి ఉందో ఎవరమూ ఎరుగము.

"ఓ వానరవీరులారా! నేను చెప్పిన ప్రదేశాలలోనూ, నేను చెప్పకుండా వదలి పెట్టిన ప్రదేశాలలోనూ మీరు చక్కగా వెదకవలెను. మీరు అగ్నిదేవుడితో సరిసమానము అయినవాండ్లు. మీరు చక్కగా ఆ యా ప్రదేశాలు అన్నీ వెతికి విదేహరాజపుత్రిని చూచి వచ్చేట్లయితే ఈ రామప్రభువు మహా సంతోషపడతాడు. అంతకన్నా నేను ఎక్కువగా సంతోషిస్తాను.

"ఓ వానరులారా! మీరు ఈ రామకార్యము సాధించుకొని వచ్చేట్లయితే మిమ్ముమ్మలను మీ బంధువులతో కూడా నేను సమ్మానిస్తాను. మీ కోరికలు చెల్లిస్తాను. ఏ శత్రుభయమూ లేకుండా మీరు అందరూ హాయిగా సమస్తసుఖాలూ అనుభవించేట్టు చేస్తాను. మీరు మీ ప్రియురాండ్లతో సుఖముగా ఈ భూమి అంతటా విహరించేట్టు చూస్తాను" అని చెప్పినాడు.

44

రాముడు హనుమంతునికి తన అంగుళీయకము నిచ్చుట

ఆ యా దిక్కులకు పోయే వానరవీరులు అందరిలోను ఆ కార్యము సాధించగల సమర్థుడు హనుమంతుడు ఒక్కడేను అని ఆ వానరనాథుడు సుగ్రీవుడు గట్టిగా నమ్మి, పరమసంతోషముతో ఆ వాయుపుత్రుణ్ణి హనుమంతుణ్ణి చూచి, "ఓ వాయుపుత్రుడా! (సమస్త ప్రాణికోటి సంచారము చేసే) ఈ భూమిమీద కానీ, (పక్షులూ మేఘాలూ సంచారము చేసే) అంతరిక్షములో కానీ, (సిద్ధులూ విద్యాధరులూ మొదలు అయినవారు సంచారము చేసే) ఆకాశములోకానీ, (దేవతలు సంచారము చేసే) స్వర్గములో కానీ, (తిమి వక్ర గ్రాహాలు సంచారము చేసే) జలాలలోకానీ నీవు ఏ హద్దూ లేకుండా పోగలవు. అసురలోకమూ, గంధర్వలోకమూ, నాగలోకమూ, దేవలోకమూ, మానవలోకమూ, సముద్ర పర్వత సహితము అయిన సమస్తలోకాలూ నీవు ఎరుగుదువు.

"మహాకపీ! అప్రతిహత గమనానికీ, వేగానికీ, లాఘవానికీ నీవు నీ తండ్రి వాయుదేవుడు అంతటివాడవు. పరాక్రమానికి నిన్ను మించిన ప్రాణి ఈ భూమిమీద లేదు. కాబట్టి సీతాదేవి రాముడికి లభ్యము అయ్యే ఉపాయము అంతా నీవే ఆలోచించవలెను.

"ఓ హనుమంతుడా! దేహబలమూ, బుద్ధిబలమూ, పరాక్రమమూ, దేశకాలాలను అనుసరించి ప్రవర్తించే సామర్థ్యమూ, నీతిజ్ఞతా నీకు ఒక్కడికే ఉంది. నీవే ఈ కార్యము సాధించగలవు."

ఈ విధముగా సుగ్రీవుడు హనుమంతుణ్ణి నమ్మి చెప్పడము రాముడు గమనించినాడు. ఆలోచించసాగినాడు. "ఈ సుగ్రీవుడు అన్నివిధాలా కార్యసాధకుడు

హనుమంతుడేను అని నిశ్చయించినాడు. ఈతడి కార్యసాధన సామర్థ్యము సుగ్రీవుడు ఎరుగును. ఈ హనుమంతుడున్నూ తానే కార్యసాధన సమర్థుణ్ణి అనే నమ్మకము సుగ్రీవుడికి కలగచేసినాడు. ఈతనివల్ల ఈ పని అవుతుంది అని సుగ్రీవుడు అనుకొంటున్నాడు. కనుక ఈ పోతున్న హనుమంతుడే తప్పకుండా ఈ పని సాధించుకొని వస్తాడు" అని నిశ్చయించి, ఆ మహాతేజోవంతుడు రాముడు కార్యసాధన సమర్థుణ్ణి హనుమంతుణ్ణి చూచినాడు. తమకు కావలసిన పని నెరవేరినట్టే భావించినాడు. ఆ పరంతపుడు సంతుష్టుడు అయి ఆ హనుమంతుణ్ణి పిలిచి తన పేరు ఉన్న ఉంగరము తీసి పరమ సంతోషముతో అతనికి ఇచ్చి, "ఓ హనుమంతుడా! ఆ జనకరాజసుతకు ఈ ఉంగరము చూపించు. ఈ ఉంగరము చూస్తే నిన్ను ఆమె ఎవరో అని సంశయించదు. నీవు ఎవరో యని ఆమె భయపడదు. నీవు నా దగ్గరనుంచి వచ్చినావు అనుకొంటుంది.

"ఓ వానరోత్తమా! నీవు వీరుడవు. నీ ఉత్సాహమూ, నీ బలమూ, నీ పరాక్రమమూ ఎరిగిన సుగ్రీవుడు నీతో చెప్పిన దానినిబట్టి నీవు నా పని చేసుకొని రాగలవు అని నేను అనుకొంటున్నాను" అని చెప్పినాడు.

రాముడు ఇచ్చిన ఆ ఉంగరాన్ని ఆ వానరశ్రేష్ఠుడు హనుమంతుడు శిరము మీద పెట్టుకొన్నాడు. ప్రయాణసన్నద్ధుడు అయి రాముడి పాదాలమీదపడి నమస్కారము చేసినాడు. అంతట ఆ పవనసుతుడు హనుమంతుడు ఆ మహా వానరసేనను వెంటపెట్టుకొని మేఘాలులేని నిర్మలాకాశమండలములో నక్షత్రగణాలతో శోభాయమానముగా పోయే చంద్రుడువలె బయలుదేరినాడు.

అప్పుడు ఆ హనుమంతుణ్ణి రాముడు చూచి, "ఓ హనుమంతుడా! నీవు మహాబలవంతుడవు. సింహమువంటి పరాక్రమవంతుడవు. పవన సుతుడవు. అందువల్ల నీవు ఏ అడ్డూ లేకుండా ఎక్కడికి అయినా పోగలవు. నీ బలాన్ని నేను ఆశ్రయించినాను. నీ పరాక్రమము కొద్దీ సమస్త ప్రయత్నాలూ చేసి ఆ జనకరాజసుత సీత ఎక్కడ ఉందీ తెలుకొని రావలెను" అని చెప్పినాడు.

45

ఆ వానరరాజు సుగ్రీవుడు ఆ వానరవీరులను అందరినీ పిలిచి రామకార్యము నెరవేర్చడానికి నిష్కర్షకముగా మళ్ళీ, "ఓ వానరవీరులారా! మీరు ఎవరు ఎవరు, ఏ ఏ భూభాగాలు వెతకవలెనని చెప్పినానో ఆ యా భూభాగాలు అన్నీ చక్కగా వెతికి సీతాదేవిని ఎక్కడ ఉందీ తెలుసుకొని ఒక్కమాసములోపల తిరిగిరావలెను" అని శాసించినాడు.

ఆ ఉగ్రశాసనము విని వానర వీరులు అందరూ తమతమ వానర సమూహాలతో మిడుతలదండువలె ఈ నేలను అంతా ఆవరించి బయలుదేరినారు.

అప్పుడు శతవలి హిమవత్పర్వతము ఉన్న ఉత్తరదిక్కుకు ప్రయాణము అయినాడు. వానరయూధపతి వినతుడు తూర్పుదిక్కుకు బయలుదేరినాడు. మారుతాత్మజుడు హనుమంతుడు అంగదుడితోనూ, తారుడు మొదలయిన వానరవీరులతో దక్షిణదిక్కుకున్నూ, వానరోత్తముడు సుషేణుడు వరుణుడు పరిపాలించే పడమటిదిశకున్నూ ప్రయాణములు అయినారు.

సుగ్రీవాజ్ఞను శిరసావహించి ఆ వానరయోధులు అందరూ బయలుదేరిపోతూ, "రావణాసురుణ్ణి వధించి సీతాదేవిని మేము తెస్తాము అంటే మేము తెస్తాము" అని బీరాలు పలికినారు.

అప్పుడు ఆ మహాబలవంతులు అందరూ ఒక సమూహముకన్నా ఒక సమూహము గట్టిగా అరుస్తూ, తమను తాము పొగడుకుంటూ, అందరూ కలసి సింహనాదాలు చేస్తూ పరుగెత్తుతూ, వికృతముగా కేకలు పెట్టుతూ నడచినారు.

"నేను ఒకణ్ణే యుద్ధములో రావణాసురుణ్ణి చంపివేస్తాను" అని ఒకడు అన్నాడు. "ఆ సీతాదేవి ఎంత అవస్థపడుతూ ఉందో, నేను ఒకణ్ణే ఆ రావణాసురుణ్ణి చంపివేసి ఇప్పుడే ఆ సీతాదేవిని తీసుకొని వస్తాను, మీరు అందరూ ఇక్కడనే ఉండండి" అన్నాడు ఒకడు. "సీతాదేవి పాతాళలోకములో ఉన్నా నేను ఒక్కణ్ణే పోయి తీసుకొని రాగలను" అని ఒకడూ, "నేను చెట్లను విరిచివేస్తాను, పర్వతాలను పగులకొట్టుతాను, ఈ భూమిని చీల్చి వేస్తాను, సముద్రాలను క్షోభపెట్టుతాను, నేను ఒకణ్ణే సీతాదేవిని తీసుకొని రాగలను" అని ఒకడూ - ఇట్లా ఒక్కొక్కరే తమ ప్రతాపాన్ని గురించి చెప్పుకొంటూ, "నేను ఒక యోజనము దూరము ఎగురుతాను" అని ఒకడూ; నేను నూరుయోజనాలకన్నా ఎక్కువ దూరము ఎగురుతాను" అని ఒకడూ; "ఈ భూమిమీదకానీ, సముద్రములోకానీ, పర్వతాలమీదకానీ, పాతాళమధ్యములోకానీ నన్ను ఎవడూ అడ్డగించలేడు" అంటూ ఒకడూ సుగ్రీవుడి సాన్నిధ్యములో తమతమ సేనానాయకులతో చెప్పుకొంటూ ఆ వానరయోధులు బయలుదేరినారు.

ఆ వానర సేనానాయకులను ఆ యా దిశలకు పంపించివేసి సుగ్రీవుడు అదివరకటికన్నా ఎక్కువగా సంతుష్టుడు అయినాడు.

46

సుగ్రీవుని భూమండల సంచార విశేషములు

ఆ వానరవీరులు అందరూ వారు వారు పోవలసిన దిక్కులకు వెళ్లిపోయినారు. అప్పుడు రాముడు సుగ్రీవుణ్ణి చూచి, "ఓ వానరరాజా! నీవు ఈ భూమండలాన్ని అంతా ఎట్లా ఎరుగుదువు?" అని ప్రశ్నించినాడు.

సుగ్రీవుడు అణకువతో చేతులు జోడించి, "పురుషోత్తమా! ఇదివరకే నా కథ అంతా చెప్పినాను. మా అన్న వాలి నన్ను చంపివేయడానికి లేచినాడు. నేను అప్పుడు నా మంత్రులతో కూడా కిష్కింధానగరము నుంచి పరుగెత్తి పారిపోతూ వివిధారణ్యాలూ, నానానగరాలూ చూచినాను. ఈ భూమిని అంతా ఒక గోష్పాదముగా నేను అలాతచక్రము (కొరవికట్టెను గుండ్రముగా తిప్పుతూ ఉంటే ఏర్పడే చక్రము) వలె గిర్రున తిరిగినాను. అట్లా తిరుగుతూ ఈ భూమిని అంతా అద్దములోవలె స్పష్టముగా చూచినాను. నన్ను తరుముకొంటూ వాలి నా వెంట రావడము మొదలు పెట్టినాడు.

"అట్లా పరుగెత్తుతూ తూర్పుదిక్కుకు పోయినాను. ఆ దిక్కున ఉన్న వివిధారణ్యాలూ, వివిధపర్వతాలూ, రమణీయము అయిన నదులూ, సరోవరాలూ, సముద్రదీపాలూ చూచుకొంటూ సముద్రాలు అన్నీ దాటి ఉదయ పర్వతమువరకూ పోయినాను. ధాతువులతో ధగధగలాడే ఆ ఉదయపర్వతాన్నీ, అప్సరసలకు ఉనికిపట్టు అయిన పాలసముద్రాన్నీ చూచినాను.

"ఓ ప్రభూ! వాలి నా వెంటపడి నన్ను తరుముకొంటూ అక్కడికి వచ్చినాడు. నేను వాడి బాధ తప్పించుకోడానికి వాడికి తెలియకుండా వెనుకకు మళ్ళి, వింధ్యపర్వత ప్రాంతారణ్యానికి పరుగెత్తినాను. నేను వాడికి తెలియకుండా వింధ్యపర్వత ప్రాంతారణ్యానికి వచ్చినందుకు వాడికి మరింత కోపము వచ్చింది. వాడున్నూ నా వెనుక నన్ను తరుముకొంటూ వచ్చినాడు. నేను అంతట ఆ వింధ్యకు దక్షిణాన ఉన్న చందనవనములోకి పరుగెత్తినాను. అక్కడనుంచి నేను దక్షిణదిక్కుకు పోతూ, దండకారణ్యాది మహారణ్యాలు చూచుకొంటూ, సముద్రద్వీపాలు దాటి పితృలోకము వరకునూ పోయినాను. వాలి అక్కడికిన్నీ నన్ను తరుముకొంటూ వచ్చినాడు.

"నేను అంతట అక్కడనుంచి పడమటదిక్కుకు పరుగెత్తినాను. ఆ పడమటదిక్కున నానావిధ దేశాలు చూస్తూ అస్తగిరి వరకున్నూ పోయినాను. అక్కడికిన్నీ వాలి నా వెంటపడడము చూచినాను. నేను అంతట అక్కడనుంచి ఉత్తరదిక్కుకు పరుగెత్తి పోయినాను. హిమవత్పర్వతము మొదలు మేరుపర్వతము వరకూ పోయినాను. ఉత్తరసముద్రము చూచినాను. అక్కడకిన్నీ వాలి నన్ను చంపివేయడానికివచ్చినాడు.

"అట్లా నేను ఎక్కడికి పోయినా వాలి నా వెంటపడడమూ, నాకు ఎక్కడనూ ఒక ఆశ్రయము దొరకక నేను బాధపడడమూ బుద్ధిమంతుడు హనుమంతుడు చూచి నాతో, 'రాజా! పూర్వము మతంగమహర్షి తన ఆశ్రమపదములో వాలి కాలుపెట్టకూడదు అని శాపము పెట్టినాడు. ఆ సంగతి నాకు ఇప్పుడు జ్ఞాపకము వచ్చింది. వాలి ఆ ఆశ్రమపదములో అడుగుపెట్టేట్లయితే వాడి శిరస్సు నూరు

చెక్కలు అయిపోతుంది. అందువల్ల మనము మతంగమహర్షి ఆశ్రమపదానికి పోయి నిర్భయముగా, సుఖముగా ఉండవచ్చును' అని చెప్పినాడు.

"రామప్రభూ! మేము అంతట అక్కడనుంచి బయలుదేరి ఈ ఋష్యమూక పర్వతానికి వచ్చి చేరినాము. వాలి మతంగమహాముని భయమునుంచి ఇక్కడికి రాలేదు.

"ప్రభూ! నేను ఈ విధముగా ఈ భూమండలము అంతా తిరిగి కన్నులారా చూచినాను. ఆ తరువాత నీ దర్శనము అయ్యేటంత వరకున్నూ ఋష్యమూక పర్వతగుహలో నివసించినాను" అని చెప్పినాడు.

47
వానరుల సీతాన్వేషణ

సీతాదేవిని వెదకిరావడానికి సుగ్రీవుడు ఆజ్ఞాపించిన వానర సేనానాయకులు అందరూ అమితవేగముతో తాము పోవలసిన దిక్కులకు పోయి మహాపర్వతాలలోను, మహారణ్యాలలోను, దాటిపోనలవికాని నదీప్రాంత ప్రదేశాలలోను, ఆ యా వనాలలోను, ఆ యా లతాగృహాలలోను, ఆ యా పట్టణాలలోను, పల్లెలలోను, పచ్చిక బయళ్ళలోను వెదకి చూచినారు. వారికి అక్కడ ఎక్కడనూ సీతాదేవి కనిపించలేదు.

వారు అందరూ ముఠాలు ముఠాలుగా పోయి పగలు అంతా ఆ యా ప్రదేశాలు అన్నీ వెతికి, రాత్రిపూట అందరూ ఒకచోటికి చేరేవారు. అన్నికాలాలలోనూ పండ్లు పండే చెట్లమీద రాత్రిపూట పడుకొంటూ ఉండేవారు. ఈ విధముగా సుగ్రీవుడు పెట్టిన గడువుకాలము అంతా ఆ యా ప్రదేశాలు అన్నీ చక్కగా వెతకి చూచినారు. వారికి ఆ యా దిక్కులలో సీతాదేవికానీ, ఆమెను ఎత్తుకొని పోయిన రావణాసురుడు కానీ కనిపించలేదు. సీతాదేవి ఆ దిక్కున దొరుకుతుంది అనే ఆశ నిరాశ చేసుకొని గడువుకాలము అయిపోతూ ఉండగా, ఒక్కొక్కరే ప్రస్రవణపర్వతానికి తిరిగి ప్రయాణము అయినారు.

మహాబలవంతుడు అయిన వినతుడు సచివులతో కూడా తూర్పుదిక్కు అంతా వెతకి సీతాదేవి కనపడనందువల్ల వెనుకకు మళ్ళినాడు. పరమపరాక్రమవంతుడు అయిన మహాకపి శతవలి ఉత్తరదిక్కు అంతా వెతకి సీతాదేవి కనపడనందువల్ల సైన్యముతో కూడా కిష్కింధకు బయలుదేరినాడు. సుషేణుడు వానర సమూహాలతో పడమటిదిక్కు అంతా వెతకి సీతాదేవి కనపడనందువల్లనూ, గడువుకాలము అయిపోతున్నందువల్లనూ సుగ్రీవుడి దగ్గరకు ప్రయాణము అయినాడు.

వారు అందరూ ప్రస్రవణపర్వతానికి తిరిగి వచ్చినారు. రాముడితో కూడా ఉన్న సుగ్రీవుణ్ణి చూచి నమస్కారము చేసి, "రాజా! మేము సమస్త పర్వతాలూ,

దుర్గమారణ్యాలూ, నదీ ప్రాంతాలూ, సముద్ర తీరాలూ, మహానగరాలూ, సకల జనపదాలూ, లతాగృహాలూ, వనాలూ, కొండ గుహలూ వెతకి చూచినాము. చొరనలవికాని ప్రదేశాలలోను, దుర్గమము అయిన మిట్టపల్లాలలోను, పెద్దపెద్ద జంతువులు నివసించే ప్రదేశాలను వెతకి చూచినాము. మాకు సీతాదేవి ఎక్కడనూ కనిపించలేదు.

"ఓ రాజా! ఆ ధైర్యవంతుడు, ఆ మహాబలవంతుడు వాయుసుతుడు హనుమంతుడు సీతాదేవిని ఎత్తుకొని పోయిన దిక్కుకే పోయినాడు. అతడు ఇంతవరకూ తిరిగి రాలేదు. ఆ మహానుభావుడు తప్పకుండా ఆ మైథిలిని, సీతాదేవిని చూచి వస్తాడు" అని ఆ వానరవీరులు అందరూ చెప్పినారు.

48

సుగ్రీవుడు చెప్పినట్టుగా ఆ హనుమంతుడు అంగదుడితోనూ, తారుడితోనూ దక్షిణదిక్కుకు పోయి ఆ యా ప్రదేశాలలో వెతకడం మొదలుపెట్టినాడు. ఆ కపిశ్రేష్ఠుడు హనుమంతుడు ఆ వానరవీరులను అందరినీ వెంటబెట్టుకొని ఆ యా ప్రదేశాలు వెతుకుతూ చాలా దూరము పోయినాడు.

వింధ్యపర్వత గుహలలోనూ, ఆ పర్వత శిఖరాలమీదనూ, ఆ మహారణ్యాలలోనూ, దాటిపోనలవికాని ఆ యా నదీ ప్రాంతాలలోనూ, ఆ యా సరోవర ప్రాంతాలలోనూ, వివిధ వనాలలోనూ, మహోన్నత వృక్షాలు ఉన్న కొండలమీదనూ వెతకినారు. ఆ పరమపరాక్రమవంతులు ఎంత వెతకినా ఆ మైథిలి, జనకరాజసుత సీతాదేవి ఎక్కడనూ కనపడలేదు. ఆ దుర్ధర్షులు ఆ యా అరణ్యాలలో దొరికిన వివిధ కందమూలఫలాలు తింటూ, ఆ యా ప్రదేశాలలో ఆగుతూ, ప్రతిచోటా వెతుకుతూ దక్షిణదిక్కుకు సాగిపోయినారు.

ఆ మహాధైర్యవంతులు, దేనికీ భయపడని ఆ వానరయూథపతులు ఆ విధముగా చొరనలవికాని ఒక్కొక్క మహారణ్యములోకి పోయి ఎంతో కష్టపడి వెతకినారు. అట్లా ఒక్కొక్క అరణ్యమే చూచుకొంటూ ఆ దక్షిణదిక్కున ఒక దేశానికి పోయినారు. ఆ దేశము నిర్జనముగానూ, నిర్జలముగానూ, ఆకాశమువలె శూన్యముగానూ కనిపించింది. ఆ వానరవీరులు ఆ ప్రదేశము అంతా తిరిగి చూచినారు. ఒండ్లు గగుర్పొట్టించే ఆ దేశము దాటి అవతలకు పోయినారు.

ఆ వానరవీరులు అందరూ అట్లా పోయి పోయి మరి ఒక భయంకరము అయిన దేశము చేరినారు. అక్కడ పెద్ద పెద్ద చెట్లు అయితే ఉన్నవి. కాని ఆ చెట్లకు ఆకులుకానీ, పూలుగానీ, పిందెలుకానీ, కాయలుకానీ లేవు. పెద్ద పెద్ద నదులూ,

తటాకాలూ, సరోవరాలూ ఉన్నవి. కాని వాటిలో ఒక నీటిబొట్టు అయినా లేదు. సుగంధము గుబాళించే మెట్టతామరలు పూలు పూస్తున్నవి. కాని వాటిమీద తుమ్మెదలు మూగడము లేదు. రకరకాల లతలు ఉన్నవి. కాని వాటికి ఒక పువ్వుకానీ, ఆకుకానీ లేవు. పక్షుల గూండ్లు అయితే ఉన్నవి. కాని అక్కడ ఒక్క పక్షీ కనిపించలేదు. ఆ దేశములో ఉన్న మహారణ్యములో ఎనుపోతులూ, ఏనుగులూ, జింకలూ, పెద్దపులులూ ఉన్న లక్షణాలు కనిపించినవి. కాని ఆ మృగాలలో ఒక్కటిన్నీ అక్కడ కనిపించలేదు. అక్కడ సర్వౌషధులూ పెరిగిన చిన్నెలు ఉన్నవి. కాని ఒక్కటీ కనిపించలేదు. ఆ దేశము చూచి ఆ వానరవీరులు అందరూ విస్మితులు అయిపోయినారు.

మహాత్ముడూ, సత్యవాదీ, తపోబలసంపన్నుడూ, నియమాదులవల్ల దుష్ప్రధర్షుడూ అయిన కండుమహర్షి అదివరకు అక్కడ ఉంటూ వచ్చినాడు. ఆ మహర్షి పుత్రుడు పదహారు ఏండ్ల పిల్లవాడు ఆ దేశములో చనిపోయినాడు. ఆ దేశములో ఉన్న జనులుకానీ, ఆ మహారణ్యములో ఉన్న వనౌషధులుకానీ ఆ ముని బాలుడికి మరణ సమయములో ఉపయోగపడలేదు. అందుకు ఆ మహర్షికి కోపము వచ్చింది. ఒకరికి ఉపయోగపడని జనులూ, ఔషధాలూ ఉండి ప్రయోజనము ఏమిటి అనుకొన్నాడు. ఆ ధర్మాత్ముడు అంతట ఆ దేశము ఎవరికీ వాసయోగ్యము కాకుండానూ, మృగాలూ పక్షులూ నివసించకుండానూ, తరులతాగుల్మాదులు అన్నీ నిష్ప్రయోజకాలుగానూ శపించినాడు. అందువల్ల ఆ దేశము అట్లా అయిపోయింది. అయితే ఆ వానరవీరులు అందరూ మంచిపూనికతో ఆ దేశము అంతా తిరిగి చూచినారు.

అక్కడనుంచి దాటి అవతలకు పోయి ఆ వానరవీరులు అడవులనూ, కొండలనూ, కొండ గుహలనూ, ఆ యా నదులు పుట్టిన చోటులనూ వెదకి చూచినారు. అక్కడ ఎక్కడనూ వారికి సీతాదేవికానీ, ఆమెను అపహరించుకొనిపోయిన రావణాసురుడుకానీ కనిపించలేదు.

అంతట వారు అక్కడనుంచి వెంటనే బయలుదేరిపోయి వివిధ లతా గుల్మాదులు ఆవరించుకొని మహాభయంకరముగా ఉన్న ఒక కొండ గుహను చూచినారు. దేవతలను అయినా లెక్కచేయని క్రూరకర్ముడు అయిన రాక్షసుణ్ణి ఒకణ్ణి ఆ వానరులు అందరూ అక్కడ చూచినారు. పర్వతమువలె భయంకరాకారుడుగా ఉన్న ఆ రాక్షసుణ్ణి చూచీ చూడటముతో ఆ వానరవీరులు అందరూ తమ తమ దట్టీలను బిగించినారు. ఆ రాక్షసుడున్నూ కొండలు అంత ఎత్తున ఉన్న ఆ వానరవీరులను అందరినీ చూచీ చూడటముతో లేచి పిడికిలి బిగించి కోపముతో, "ఇదిగో, మీరు అందరూ చచ్చినారు" అంటూ వారిమీద కోపముతో

పడపోయినాడు. తమమీద పడవస్తూన్న రాక్షసుడే రావణాసురుడు అయి ఉంటాడు అని అంగదుడు అనుకొన్నాడు. ఉత్తరక్షణాన వాలిపుత్రుడు ఆ అంగదుడు తన అరచేతితో ఆ రాక్షసుణ్ణి ఒక్క చరుపు చరచినాడు. వాడు ఆ దెబ్బకు నెత్తురు కక్కుకొంటూ నేలకూలి చచ్చిపోయినాడు.

జయోత్సాహముతో ఆ వానరవీరులు అందరూ వాడే రావణాసురుడు అయి ఉంటాడు అనుకొన్నారు. అంతట ఆ కొండగుహను అంతా వెతికి చూచినారు. సీతాదేవి వారికి అక్కడ కనపడలేదు. అక్కడ ఉన్న మహారణ్యము అంతా వెతికి చూచినారు. అక్కడనూ సీతాదేవి కనిపించలేదు.

అంతట అక్కడనుంచి బయలుదేరి మహాభయంకరము అయిన మరి ఒక పర్వతగుహలోకి పోయినారు. ఆ గుహ అంతా వెతకినారు. ఆ వానరవీరులు అందరూ ఖిన్నులు అయిపోయినారు. ఆ గుహలో నుంచి బయటికి వచ్చినారు. అక్కడ ఆ విజన ప్రదేశములో ఒక చెట్టు దగ్గరకు పోయి ముఖాలు వేళ్ళాడ వేసుకొని కూర్చున్నారు.

49

అంగదుడు అమితముగా అలసిపోయినాడు. అయితే అతడు మహాప్రాజ్ఞుడు. ఆ వానరవీరులను అందరినీ ఆశ్వాసిస్తూ, "ఓ వానరవీరులారా! మనము ఆ యా వనాలూ, పర్వతాలూ, నదీప్రాంతాలూ, దుర్గమారణ్యాలూ, ఆ యా బిలాలూ, కొండగుహలూ చక్కగా వెతకి చూచినాము. దేవకన్యవంటి ఆ జనకాత్మజ సీతాదేవి మనకు ఈ స్థలాలలో ఎక్కడనూ కనిపించలేదు. ఆమెను అపహరించుకొని పోయినవాడూ కనిపించలేదు. మన గడువుకాలము చాలాభాగము అయిపోయింది. సుగ్రీవుడు ఉగ్రశాసనుడు కాబట్టి మీరు అందరూ ఏకము అయి మళ్ళీ వెతకవలెను. బద్ధకించవద్దు. దిగులు పడవద్దు. నిద్ర పోవద్దు. మీరు అందరూ లేచి ఆ సీతాదేవి కనపడేటంత వరకూ వెతకవలెను. విసుగులేమీ, ఉత్సాహమూ, ధైర్యమూ, కార్యసిద్ధిని కలుగచేస్తవి అని పెద్దలు చెప్పుతూ ఉంటారు. ఈ దుర్గమారణ్యములో మరి ఒకసారి వెతకవలెను. మీరు దిగులుపడవద్దు. వదలకుండా చేస్తే ఏపని అయినా అయి తీరుతుంది. విసుగుకోవద్దు. విసుగు పడవద్దు. కళ్ళు మూసుకొని కూర్చుండడము మంచిది కాదు.

"ఓ వీరులారా! సుగ్రీవుడు కోపిష్ఠివాడు. తీక్షణంగా దండిస్తాడు. ఆయనకు మనము ఎప్పుడూ భయపడవలసిందే. రాముడు మహాప్రభువు. అతనికిన్నీ మనము భయపడవలసిందే. ఇది అంతా మీ మంచికోసము చెప్పుతున్నాను. మీకు ఇష్టము

అయినట్లయితే ఇట్లా చేయవలెను. లేకపోయేట్లయితే మనకు అందరికీ మంచి అయ్యే పద్ధతి మరి ఒకటి ఏది అయినా ఉంటే చెప్పండి" అన్నాడు.

అంగదుడు చెప్పిన ఈ మాటలు గంధమాదనుడు విన్నాడు. అతడు దప్పికతోనూ, అలసటతోనూ ఖిన్నుడు అయి ఉన్నప్పటికిన్నీ, స్పష్టముగా మాట్లాడలేకపోయిప్పటికిన్నీ, "ఓ వానరయోధులారా! అంగదుడు సరి అయిన మాట చెప్పినాడు. అతడు చెప్పినట్లు చేయడమువల్ల మనకు మంచి అవుతుంది. పని సానుకూలము అవుతుంది. అంగదుడు చెప్పినట్టు చేయవలసిందేను. మనకు మార్గాంతరము లేదు. పర్వతాలమీదనూ, పర్వతగుహలలోనూ, బిలాలలోనూ, శూన్యారణ్యాలలోనూ, కొండవాగులదగ్గరనూ మనము మళ్ళీ వెతకవలెను. సుగ్రీవుడు ఆజ్ఞాపించినట్టుగా మనము సమస్తపర్వతాలూ, మహారణ్యాలూ, ఇంకా ఇతర ప్రదేశాలూ వెతకవలెను" అన్నాడు.

గంధమాదనుడు ఇట్లా చెప్పగానే ఆ మహాబలవంతులు వానరులు అందరూ లేచి వింధ్యపర్వతాలలో వ్యాపించిన ఆ దక్షిణదిశను శరత్కాల మేఘమువలె ధవళకాంతులతో ఉన్న రజతపర్వతానికి బయలుదేరినారు. అనేక శృంగాలతోనూ, గుహలతోనూ ఉన్న ఆ రజతపర్వతము ఎక్కినారు. అక్కడ లోధ్రవనాలలోనూ, ఏడాకుల అరటితోటలలోనూ వెదకి చూచినారు. ఆ పరమపరాక్రమవంతులు అలసిపోయి వున్నప్పటికిన్నీ ఆ రజతపర్వతాగ్రభాగానికి పోయినారు. అక్కడనూ వారికి రాముడి ప్రియురాలు కనపడలేదు. వారు ఆ పర్వత గుహలు అన్నీ వెదకినారు. గుహలు ఏమిటి, ఆ పర్వతము అంతా గాలించి చూచినారు. అక్కడనూ ఎక్కడనూ వారికి సీతాదేవి కనిపించలేదు.

ఆ వానరవీరులు అంతట ఆ పర్వతము దిగినారు. అక్కడ ఒక చెట్టు కిందికి అందరూ చేరినారు. ఒక ముహూర్తము సేపు అలపు తీర్చుకొనడానికి కూర్చున్నారు. అలపు తీరగానే ఆ దక్షిణదిక్కు అంతటా వెదకడానికి ఉద్యుక్తులు అయినారు.

వారు అలపు తీర్చుకొనేలోపల హనుమంతుడు మొదలు అయిన వానరపుంగవులు అందరూ బయలుదేరి వింధ్యపర్వతానికి మళ్ళీపోయి అక్కడ అంతా వెదకి వచ్చినారు.

50

హనుమంతాదులు బిలములోనికి ప్రవేశించుట

హనుమంతుడు అంగదుణ్ణీ, తారుణ్ణీ వెంటపెట్టుకొని పోయి సింహ శార్దూలాలు నివసించే ఆ వింధ్యపర్వతగుహలూ, వనాలూ, విషమ ప్రదేశాలూ,

శిలామయభూములూ, పెద్దపెద్ద సెలయేళ్ళు పారే చోటులూ, నదీతీరాలూ వెదకినారు. ఆ తరువాత వారు ఆ వింధ్యపర్వత నైరుతిదిశన ఉన్న కొండలకు పోయినారు. ఆ నైరుతి కొనకు చేరుతూ ఉండగా సుగ్రీవుడు నిర్ణయించిన గడువుకాలము కాస్తా గతించిపోయినది. ఆ నైరుతి దిగ్భాగాన వాయుసుతుడు హనుమంతుడు మొదలు అయిన వానరవీరులు అందరూ ఒకరికి ఒకరు సమీపముగా ఒకరితో ఒకరు కలసి వెతకసాగినారు. ఆ దక్షిణదిశన పర్వతాలతో పెనవేసుకొనిపోయిన ఆ యా ప్రదేశాలు అన్నీ వెతుకుతూ గజుడూ, గవాక్షుడూ, శరభుడూ, గంధమాదనుడూ, మైందుడూ, ద్వివిదుడూ, సుషేణుడూ, జాంబవంతుడూ, నలుడూ, హనుమంతుడూ, యువరాజు అయిన అంగదుడూ అక్కడ నోరు తెరచినట్టు ఉన్న ఒక బిలాన్ని చూచినారు.

వారు అందరూ అలసిపోయి ఆకలిదప్పులతో తపించిపోతూ ఇన్ని నీళ్ళకోసము వెతుకుతూ ఉండగా వారికి ఆ పర్వతబిలము కనిపించినది. అది మయుడు అనే దానవుడు నివసించిన బిలము. దానినే ఋక్షబిలము అంటారు. ఆ వానరవీరులు అందరూ నీళ్లు దొరుకుతవి ఏమోను అనే ఆశతో ఆ బిలముదగ్గరకు పోయినారు. లతలూ, గుల్మాలూ, వృక్షాలూ ఆవరించి ఆ బిలము చొరనలవి కాకుండా కనిపించినది. అయితే ఆ బిలములోనుంచి హంసలు, సారసాలు మొదలు అయిన పక్షులు నీళ్లలో తడిసిపోయి పద్మపరాగము కొట్టుకొన్నందువల్ల ఎర్రపడిపోయినరెక్కలతో బయటికి రావడము చూచినారు. అంతేకాదు, ఆ బిలములోనుంచి సుగంధవాసనలు గుబాళించడమున్నూ గమనించినారు. అందుకు ఆ మహాబలవంతులు అందరూ ఆశ్చర్యపడిపోయినారు. ఆ బిలములో నీరు దొరుకుతుంది అని ఆ వానరులందరూ అనుకొన్నారు. అయితే నానావిధ వన్యమృగాలూ ఆ బిలములో కనిపించినవి. అది బలిచక్రవర్తి ఉండే పాతాళలోకానికి పోయే దారి ఏమోను అనిపించింది. ఆ బిలము దుర్దర్శనముగానూ, భయంకరముగానూ తోచింది. ఏ వైపునుంచి ఆ బిలములోకి పోవడానికిన్నీ వీలు కనిపించలేదు. అందువల్ల అందులో నీళ్ళు ఉంటవి అని తోచినప్పటికిన్నీ ఆ తేజోవంతులకు ఎవరికిన్నీ సంతోషము లేకుండా పోయింది. చొరనలవికాని ఎటువంటి ప్రదేశాలలో నయినా అవలీలగా పోయే పర్వతాకారుడు హనుమంతుడు అప్పుడు ఆ వానరవీరులను అందరినీ చూచి, "ఓ వానరవీరులారా! పర్వతాలు అల్లుకు పోయిన ఈ దక్షిణ దిక్కు అంతా వెదకి వెదకి మనము అందరమూ అలసిపోయినాము. మనకు ఆ మైథిలి సీతాదేవి ఎక్కడనూ కనపడలేదు. ఆకలిబాధ అట్లా ఉండగా, దప్పికతో ఇప్పుడు మన గొంతులు ఎండిపోతున్నవి. మనము ఇప్పుడు ఇన్ని నీళ్ళు తాగవలెను. నీళ్ళలో తడిసిపోయిన హంసలూ, క్రౌంచ పక్షులూ, చక్రవాక పక్షులూ, బెగ్గురు పక్షులూ ఈ బిలములో నుంచి బయటికి వస్తూ

వున్నవి. పయిగా ఈ బిలము వాకిటిలో ఉన్న వృక్షాలు అన్నీ పచ్చగా కనిపిస్తున్నవి. కాబట్టి ఈ బిలములో జలసమృద్ధము అయిన బావికానీ, మడుగుకానీ తప్పకుండా ఉండి ఉంటుంది" అని చెప్పినాడు.

అంతట ఆ వానరవీరులు అందరూ ఆ బిలములో నుంచి వస్తూ ఉన్న సింహ శార్దూలాది ఘాతుక మృగాలనూ, ఆ యా పక్షులనూ చూస్తూ లోపలికి పోయినారు. లోపలికి పోయినకొద్దీ సూర్యకిరణప్రసారము తగ్గిపోయింది. ఒండ్లు గగురుపుట్టించేట్లుగా చీకట్లు కమ్ముకున్నవి. ఆ బిలము అంతటా చెట్లు ఉన్నవి. తిమిరావృతము అయిన ఆ బిలములో దారితప్పి ఎవరి దారి వారు అయిపోకుండా ఉండడానికి ఒకరిని ఒకరు పట్టుకొని నడువసాగినారు. వారికి కన్నులు ఉన్నా ప్రయోజనము లేకపోయింది. అక్కడ వారికి ఏమీ కనిపించలేదు. వారి తేజస్సూ, వారి పరాక్రమమూ ఆ బిలములో పనికిరాకుండా పోయినవి. గాలివలె నిరాధారముగా ఆ అంధకారములో వారు ఒక యోజనము దూరము పోయినారు. వారికి అప్పుడు మరింత దాహము వేసింది. కలవరపడిపోయినారు. వారికి తెలివి తప్పిపోవడము మొదలుపెట్టింది. అయితే వారు ధైర్యము కోలుపోలేదు. క్షుత్పిపాసలతో నీరసపడిపోయినారు. ప్రాణాలమీద ఆశ వదులుకొన్నారు. ముఖాలు వేళ్ళాడవేసినారు. అట్లా అయిపోయినప్పటికిన్నీ ముందుకు పోసాగినారు. కొంచెము వెలుతురు కనిపించింది. ఉత్సాహము వచ్చింది. గబగబా ముందుకు అడుగులు వేసినారు. ఎట్టఎదుట వెలుతురు, ఆ వెలుతురులో మనోహరము అయిన ప్రదేశము కనిపించింది.

అక్కడ భగభగ మండే అగ్నిహోత్రమువలె ధగ ధగ లాడే కాంచన వృక్షాలనూ, మద్ది చెట్లనూ, తాటి చెట్లనూ, సురపొన్న చెట్లనూ, వేరుమద్ది చెట్లనూ, అశోక వృక్షాలనూ, చంద్ర చెట్లనూ, సంపంగి చెట్లనూ, నాగకేసర చెట్లనూ, పూచిన కొండగోగు చెట్లనూ చూచినారు. బంగారు రంగుతో అందము అయిన పూలగుత్తులతోనూ, ఎర్రటి చిగురుటాకులతోనూ, శిఖరాలవలె అల్లుకొని పోయిన లతలతోనూ ఆ యా చెట్లు సమస్తాభరణాలతో అలంకరించుకొన్న సుందరాంగనలవలె శోభాయమానముగా కనిపించినవి. అక్కడ ఆ చెట్ల మధ్యను వైఢూర్యములు పొదిగిన వేదికలున్నూ కనిపించినవి. అక్కడ తామర కొలనులలో నీళ్ళు వైఢూర్యములవలె తోచినవి. నానావిధ పక్షులూ ఆ కొలనుదగ్గర విహరిస్తూ ఉన్నవి. బాలసూర్య ప్రభలతో కాంచన కమలాలూ వికసించినవి. బంగారుమయము అయిన పెద్దపెద్ద తాబేళ్ళూ, బంగారు చేపలూ ఆ కొలనులో హాయిగా తిరుగుతూ ఉన్నవి.

అక్కడ బంగారు విమాన గృహాలూ, వెండి విమాన గృహాలూ కనిపించినవి. ఆ గృహాలు అన్నింటికీ బంగారు కిటికీలు అమర్చి ఉన్నవి. ముత్యాల జాలర్లు

వేళ్ళాడుతూ ఉన్నవి. ఆ గృహాలలో నేలలు వైఢూర్యమణులు పొదిగి బంగారముతోనూ, వెండితోనూ చపటా చేసి ఉన్నవి. ఆ గృహాల ఆవరణలలో పూలు పూస్తూ ఉన్న చెట్లూ, పండ్లు పండుతూ ఉన్న చెట్లూ ప్రవాళమణి కాంతులతో తేజరిల్లుతూ ఉన్నవి. వాటిమీద బంగారు తుమ్మెదలు మూగుతూ ఉన్నవి.

ఆ గృహాలలో మణులు పొదిగిన బంగారు శయ్యలూ, అటువంటివే ఆసనాలూ, ఉత్తమోత్తమము అయిన వాహనాలూ, బంగారముతోనూ వెండితోనూ కంచుతోనూ చేసిన ఆ యా పాత్రల రాసులూ, దివ్యము అయిన అగరు చందనాది సుగంధ ద్రవ్యాలూ, పరిశుద్ధమూ రుచ్యమూ అయిన పానీయాలూ, రసవంతము అయిన తేనెలూ, మహార్ఘము అయిన వస్త్రరాసులూ, చిత్రవర్ణ కంబళాలూ, చిత్రాసనాలూ, అగ్నిహోత్రకాంతులతో ధగధగలాడుతూ ఉన్న బంగారు రాసులూ ఆ వానరవీరులు అందరూ చూచినారు.

ఆ మహాబలవంతులు ఆ యా ప్రదేశాలు అన్నీ వెతుకుతూ అక్కడ ఒక వృద్ధాంగనను చూచినారు. ఆమె వల్కలాలు కట్టుకొని కృష్ణాజినము కప్పుకొని నియతాహారమువల్ల కృశించిపోయినప్పటికిన్నీ దివ్యతేజముతో జ్వలిస్తూ ఉన్న తాపసి. ఆమెను చూచి వానరులు అందరూ భయపడి పోయినారు. విస్మితులు అయిపోయినారు. అక్కడనే నిలిచిపోయినారు.

అంతట ఆ పర్వతాకారుడు హనుమంతుడు చేతులు జోడించి ఆ వృద్ధాంగనకు నమస్కారముచేసి, "నీవు ఎవరవు? ఈ బిలము ఎవరిది? ఈ రత్నాలు మొదలు అయిన ఉత్తమ ద్రవ్యాలు అన్నీ ఎవరివి?" అని ప్రశ్న వేసినాడు.

51

బిలములో తాపసి దర్శన మిచ్చుట

కృష్ణాజినము కప్పుకొని ఉన్న ఆ ధర్మచారిణి ఆ తాపసిని, ఆ మహానుభావురాలిని హనుమంతుడు అట్లా ప్రశ్నించి మళ్ళీ, "ఓ పూజ్యురాలా! మేము ఆకలిదప్పులతో డస్సిపోయి ఉన్నాము. చచ్చిపోతున్నాము. సాహసము చేసి అంధకారబంధురము అయిన ఈ బిలములో చొరపడ్డాము. దప్పికతో తపించిపోతూ ఉండగా మాకు ఈ బిలము కనిపించింది. ఇందులో నీళ్ళు ఉంటవి అనుకొని వచ్చినాము. ఇక్కడి ఈ అద్భుత పదార్థాలను చూస్తూ ఉంటే మా మతి పోతూ ఉంది. మేము ఏమి చేయడానికీ తోచక బాధపడుతున్నాము.

"ఓ మహాభాగా! బాలసూర్య ప్రభలతో ధగధగలాడుతూ ఉన్న ఈ బంగారు చెట్లూ, పరిశుద్ధము, తిన యోగ్యము లయిన ఈ కందమూలాలూ, ఈ ఫలాలూ,

రత్నాల జాలర్లు వ్రేళ్లాడుతూ బంగారు కిటికీలతో ఉన్న ఈ వెండి బంగారు విమాన గృహాలు ఎవరివి? ఎవరి ప్రభావమువల్ల పవిత్రము అయిన ఈ బంగారుచెట్లు పూలు పూసి, పండ్లు పండుతూ, ఘుమఘుమ వాసనలు గుబాళిస్తూ ఉన్నవి? ఎవరి ప్రభావమువల్ల ఈ నిర్మలోదకాలలో బంగారు కమలాలు వికసిస్తున్నవి? ఈ కొలనులో ఈ బంగారుతాబేళ్ళూ, బంగారు చేపలూ ఎవరి ప్రభావము వల్ల తిరుగుతూ ఉన్నవి? ఓ పూజ్యురాలా! ఇది అంతా నీ ప్రభావమేనా లేక మరి ఎవరి తపోమహిమ నుంచి అయినా ఇవి అన్నీ ఇట్లా ఉంటూ ఉన్నవా? మాకు తెలియడము లేదు. ఇది అంతా నీవే మాకు చెప్పవలెను'' అన్నాడు.

హనుమంతుడు ఈ విధముగా అడిగినందువల్ల ఆ సర్వభూత హితపరాయణ, ఆ ధర్మచారిణి, ఆ తాపసి హనుమంతుణ్ణి చూచి, "ఓ వానరుడా! అమిత తేజోవంతుడున్నూ, మహామాయావీ అయిన మయుడు అనే దానవ శ్రేష్ఠుడు తన విచిత్ర శక్తితో ఆ కాంచన వనాన్నీ, ఇక్కడి సమస్తాన్నీ నిర్మించినాడు. ఈ దివ్యకాంచన భవనాన్ని నిర్మించిన ఆ మయుడే దానవులకు విశ్వకర్మ అయినాడు.

"ఆ మయుడు మహావనములో అనేకవేల సంవత్సరాలు బ్రహ్మదేవుణ్ణి ఉద్దేశించి తపస్సు చేసినాడు. ఔశనసము అయిన ధనాన్ని (విచిత్ర నిర్మాణ ప్రతిపాదక శిల్పశాస్త్ర జ్ఞానధనాన్ని) వానికి బ్రహ్మదేవుడు వరముగా ఇచ్చినాడు. కోరుకొన్నవి అన్నీ చేసుకోగల బలవంతుడు ఆ మయుడు. తన మాయాబలముతో ఈ కాంచన వనాన్ని నిర్మించి హేమ అనే అప్సరసాంగనాసక్తుడు అయి కొంతకాలము ఇక్కడ సుఖముగా నివసించినాడు. అప్పుడు దేవేంద్రుడు విక్రమించి తన వజ్రాయుధముతో కొట్టి ఆ మయుణ్ణి చంపివేసినాడు.

"కోరుకొన్న భోగాలను అన్నిటినీ శాశ్వతముగా అనుభవించడానికి అనువు అయిన ఈ హిరణ్మయ గృహాన్నీ, ఈ కాంచన వనాన్నీ బ్రహ్మదేవుడు హేమకు ఇచ్చినాడు. ఆ హేమ నా ప్రియసఖి. ఆమె నృత్యగీత విశారద. ఆ హేమ ఈ భవనోత్తమాన్ని కాపాడమని నాకు ఇచ్చింది. ఓ వానరుడా! నేను మేరుసావర్ణి కూతురిని. నాపేరు స్వయంప్రభ. ఈ కాంచన వనాన్నీ, ఈ బంగారు భవనాన్నీ నేను కాపాడుతున్నాను.

"ఓ వానరుడా! మీరు ఏమి పనిమీద ఇక్కడికి వచ్చినారు? మీరు అడవులు అన్నీ ఎందుకు వెదకుతున్నారు? ఎవరికీ చొరనలవికాని ఈ బిలాన్ని మీరు ఎట్లా కనుక్కోగలిగినారు? మీరు ఇక్కడ ఉన్న ఈ దివ్యము అయిన కందమూల ఫలాలను హాయిగా తినండి. ఇక్కడి ఈ నిర్మలోదకాలు మీరు కడుపారా త్రాగండి. ఆ తరువాత మీ సంగతి అంతా చెప్పండి" అన్నది.

52

అంతట ఆ వానరసేనా నాయకులు అందరూ విశ్రాంతులు అయినారు. వారిని అందరినీ ఆ ధర్మచారిణి, ఆ ఏకాగ్రచిత్త, ఆ తాపసి స్వయంప్రభ చూచి, "ఓ వానరవీరులారా! ఇక్కడి ఈ ఫలమూలాదులు తిన్నందువల్ల మీ ఆకలిబాధ తీరిపోయినట్లయితే, మీరు ఇక్కడికి వచ్చిన కారణము నేను వినయోగ్యము అయింది అయినట్లయితే నాకు చెప్పవలెను" అని అడిగింది.

అప్పుడు హనుమంతుడు కల్లాకపటము లేకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పతలచుకొని, "ఓ తాపసీ! సమస్తలోకాలకు ప్రభువున్నూ, పరాక్రమానికి దేవేంద్రుడు వంటివాడున్నూ, శాంతానికి వరుణదేవుడివంటివాడున్నూ అయిన దశరథరాముడు తమ్ముడు అయిన లక్ష్మణుణ్ణీ, భార్య వైదేహినీ వెంటపెట్టుకుని దండకారణ్యము వచ్చినాడు. జనస్థానములో ఉంటూ ఉండగా ఆ అన్నదమ్ములు ఇద్దరూ పర్ణశాలలో లేని సమయంలో రావణాసురుడు అనేవాడు సీతాదేవిని బలవంతముగా ఎత్తుకొని పోయినాడు. ఆ రాముడికి సుగ్రీవుడు అనే వానరరాజు చెలికాడు. అతడు పరమపరాక్రమవంతుడు. యమధర్మరాజు పరిపాలించే దక్షిణదిక్కుకు అంగదుడు మొదలు అయిన భయంకరాకారులు అందరూ పోయి విదేహరాజపుత్రి అయిన ఆ సీతాదేవినీ, కామరూపుడు అయిన ఆ రావణాసురుణ్ణీ వెతకవలెను అని ఆ వానరరాజు సుగ్రీవుడు ఆజ్ఞాపించినాడు. అందువల్ల అంగదుడివెంట మేము అందరమూ అగస్త్యమహర్షి సంచరించిన ఈ దక్షిణదిశకు వచ్చినాము. వెదకి వెదకి వేసారిపోయినాము. మాకు అందరికీ ఆకలి వేసింది. అమితముగా దాహము వేసింది. మా ముఖాల కళాకాంతులు పోయినవి. ఒక్క చెట్టు మొదటికి చేరి ముఖాలు వేళ్ళాడవేసుకొని కూర్చున్నాము.

"మేము అందరమూ అట్లా దుఃఖసముద్రములో మునిగిపోయి అంతు తెలియక బాధపడుతూ, అన్నివైపులా పారచూస్తూ ఉండగా లతలూ, వివిధ వృక్షాలూ కమ్ముకొని ఉన్న ఈ బిలము మాకు కనిపించింది. నీళ్ళలో తడిసిపోయి రెక్కలు అల్లాడించుకొంటూ, కారుతున్న నీళ్ళు విదిలించుకొంటూ హంసలూ, బెగ్గురు పక్షులూ, గోరువంకలూ ఈ బిలములో నుంచి బయటికి రావడము చూచినాము.

"మంచిది. ఈ బిలములో నీళ్ళు ఉండి తీరవలెను. మనము అందరమూ ఈ బిలములోకి పోయి దాహము తీర్చుకొందాము అని నేనే వానరవీరులను అందరినీ పురికొల్పినాను. ఈ బిలములో తప్పకుండా నీళ్ళు ఉంటవి అనే అందరూ ఊహించినారు. అంతేకాకుండా, ఈ బిలములో సీతాదేవితో రావణాసురుడు

ఉన్నాడు ఏమోను అని అందరూ అనుమానపడ్డారు. స్వామి కార్యము నెరవేర్చడానికి అందరూ తొందరపడుతూ, అందరమూ ఈ బిలములోకి పోయి చూడవలసిందే అని నిశ్చయించినారు. చేతులతో మేము ఒకండ్లను ఒకండ్లము గట్టిగా పట్టుకొని చిమ్మచీకటితో ఉన్న ఈ బిలములో గబుక్కున చొరబడ్డాము. ఇట్లా మేము అందరమూ ఇక్కడికి వచ్చాము. మేము ఏ పనిమీద బయలుదేరి వచ్చిందిన్నీ చెప్పినాను. ఆకలితో నకనకలాడిపోతూ మేము అందరమూ ఇక్కడికి వచ్చినాము. నీవు మాకు అండ అయినావు.

"ఓ తాపసీ! నీవు ఆతిథ్య ధర్మాన్ని అనుసరించి మాకు అందరికీ ఇచ్చిన కందమూల ఫలాలు ఆకలితో అవసిపోతున్న మేము అందరమూ తనివితీర తిన్నాము. ఆకలి వేసిన్నీ, దాహము వేసిన్నీ చచ్చిపోతున్న మమ్ములను అందరినీ నీవు కాపాడినావు. నీకు ఇప్పుడు మేము ఏమి ప్రత్యుపకారము చేయవలెనో చెప్పు" అన్నాడు.

అట్లా హనుమంతుడు అన్న మాటలు విన్న ఆ సర్వజ్ఞురాలు స్వయంప్రభ వానరయూధపతులను అందరినీ చూచి, "ఓ బలవంతులారా! మీ సాహసకృత్యానికి సంతోషిస్తున్నాను. నేను నా ధర్మాన్ని అనుసరించినాను. ఇందుకు మీరు ఎవరూ నాకు ఏమీ చేయనక్కరలేదు" అని ధర్మయుక్తముగా చెప్పింది.

అంతట హనుమంతుడు ఆ సత్కార్యాచరణపరాయణను చూచి, "ఓ ధర్మచారిణీ! మేము అందరమూ నీ శరణు జొచ్చినాము. మహాపరాక్రమవంతుడు అయిన సుగ్రీవుడు మేము తిరిగి పోవడానికి నిర్ణయించిన గడువు కాలము మేము ఈ బిలములోకి వస్తూ ఉండగానే అయిపోయింది. నీవు పరమ ధార్మికురాలవు. మమ్ములను ఈ భయంకర బిలములో నుంచి నీవే బయటపడవేయలెను. మేము సుగ్రీవాజ్ఞను అతిక్రమించినాము. అతడు మమ్ములను అందరినీ చంపివేస్తాడేమోనని భయపడుతున్నాము. నీవు మమ్ములను అందరినీ ఎట్లాగు అయినా బయటపడవేసి రక్షించవలెను.

"ఓ తాపసీ! మేము మహత్కార్యము నెరవేర్చవలెను. ఇట్లా ఇప్పుడు, ఇక్కడికి వచ్చి చిక్కుపడిపోయినాము. అందువల్ల మేము చేయవలసిన పని చేయకుండా పోయినాము" అని చెప్పినాడు.

ఇట్లా హనుమంతుడు చెప్పిన మాటలు విని స్వయంప్రభ ఆ వానరులు అందరితోనూ, "ఓవానరులారా! ఈ బిలములోకి వచ్చినవారు మళ్ళీ ప్రాణాలతో బయటికి పోవడము అరుదు. నేను నియమపూర్వకముగా సంపాదించిన నా తపోబలముతో మిమ్ములను అందరినీ వెలుపలికి చేరుస్తాను. ఓ వానరులారా!

అయితే మీరు అందరూ కన్నులు మూసుకొనవలెను. మీరు కన్నులు తెరిచేట్లయితే ఈ బిలములోనుంచి బయటపడడము ఉత్తది" అని చెప్పింది.

అప్పుడు ఆ వానరవీరులు అందరూ బయటికి పోవలెను అనే కాంక్షతో సంతోషముగా కళ్ళు మూసుకొన్నారు. అంతేకాదు, తమ కోమల హస్తాలతో కళ్ళను కప్పివేసుకొన్నారు. అప్పుడు స్వయంప్రభ ఆ వానరులను అందరినీ ఆ సంకట ప్రదేశము నుంచి రెప్పపాటులో బయటికి తీసికొనిపోయింది. వారికి అందరికిన్నీ ఆ ధర్మచారిణి ధైర్యము చెప్పి, "ఓ వానరవీరులారా! నానావిధ వృక్షాలతోనూ, లతలతోనూ ఉన్న వింధ్యపర్వతము దక్షిణభాగము ఇదే. ఇదే ప్రస్రవణ పర్వతము. అదే మహోదధి అనే మహాసముద్రము. ఓ వానరులారా! మీకు శుభము అవుతుంది. నేను నా భవనానికి పోతున్నాను" అంటూ శ్రీమంతము అయిన ఆ బిలములోకి పోయింది.

53

అప్పుడు ఆ వానరులు అందరూ అపారము అయిన సముద్రాన్ని చూచినారు. అదే వరుణాలయము. భయంకరముగా ఆలలు లేస్తూ ఉన్నవి. అంతకన్నా భయంకరముగా అది గర్జిస్తూ ఉంది. సగర చక్రవర్తి వృద్ధి చేసిన మహాసముద్రము అది.

మయుడు తన మాయాశక్తితో నిర్మించిన ఆ గిరిదుర్గమ ప్రదేశములో వానరులు వెతుకుతూ ఉన్నప్పుడే వారికి సుగ్రీవుడు గడువుగా పెట్టిన మాసమూ గతించిపోయింది. మహాపరాక్రమవంతులు అయిన ఆ వానరులు అందరూ చక్కగా పూలు పూసిన చెట్లతో ఉన్న ఆ వింధ్యపర్వత నైరుతిదిగ్భాగాన కూర్చొని ఆలోచించ సాగినారు. వారి ఎట్టఎదుట పెద్ద పెద్ద చెట్లను పెనవేసుకొని పోయి పూలు పూస్తూ ఉన్న లతలనూ, కొమ్మలు అన్నీ వంగిపోయేట్లు విరగపూసి వసంతకాలము రాగానే పిందెలు కట్టి, కాయలు కాసి, పండ్లు పండే మామిడి మొదలు అయిన చెట్లనూ చూచినారు. భయకంపితులు అయిపోయినారు. ఒకరితో ఒకరు మాట్లాడుకొని వసంత ఋతువు రాబోతున్నది అని తెలుసుకొన్నారు. సుగ్రీవుడు పెట్టిన గడువు కాలము ఎప్పుడో గడిచిపోయింది అని దుఃఖపడిపోయినారు. భయపడి పోయినారు. నేలమీద కూలపడ్డారు.

అప్పుడు సింహస్కంధుడూ, పీనాయతభుజుడూ, మహాప్రాజ్ఞుడూ, యువరాజూ అయిన అంగదుడు వానరవృద్ధులను తియ్యని మాటలతో పిలిచి, వారిని యథాయోగ్యముగా గౌరవించి, "ఓ వానరవృద్ధులారా! మనము అందరమూ సుగ్రీవాజ్ఞను శిరసావహించి వచ్చినాము. మయుడి బిలములో మనము అందరమూ ఉన్నప్పుడే సుగ్రీవుడు మనకు పెట్టిన మాసము గడువు కాలమూ అయిపోయింది.

మీకు ఈ విషయము తెలుసునో తెలియదో? ఆశ్వయుజమాసము మనకు కాలపరిమితిగా సుగ్రీవుడు నిర్ణయించినాడు. ఆ కాలపరిమితి కాస్తా గడిచి పోయింది. ఇకను ఇప్పుడు మనము ఏమి చేయవలెనో మీరు అందరూ ఆలోచించవలెను.

"ఓ వృద్ధులారా! మీరు అందరూ స్వామిభక్తిపరాయణులు. నీతిమార్గ విశారదులు. సమస్తకార్యనిర్వహణ సమర్థులు. కార్యసాధన సామర్థ్యములో మిమ్ములను మించినవారు ఎవరూ లేరు. మీరు జగత్ప్రసిద్ధ పరాక్రమవంతులు. ఏలికకు మేలు చేయడమే మీరు అందరూ మీపనిగా పెట్టుకొన్నారు. ఆ తేనెకన్నుల వానరరరాజు సుగ్రీవుడు ఆజ్ఞాపించినాడు అని మీరు అందరూ నా వెంట వచ్చినారు. ఇప్పుడు మనము వచ్చినపని నెరవేరలేదు. గడువు కాలము తప్పిపోయింది. ఇక మనకు అందరికీ చావు తప్పదు, సందేహములేదు. సుగ్రీవాజ్ఞను నెరవేర్చనివాడు ఎవడు అయినా సుఖముగా ఉండగలడా? అందులో సుగ్రీవుడు స్వయముగా ఆజ్ఞాపించిన గడువు కాలము అయిపోయింది. ఇకను మనము అందరమూ ప్రాయోపవేశము చేసి ఇక్కడ చచ్చిపోవడము మేలు.

"ఓ వీరులారా! సుగ్రీవుడు స్వభావసిద్ధముగా క్రూరుడు. అతడు ఇప్పుడు మన ఏలిక అయినాడు. గడువు తప్పిన అపరాధులముగా మనము ఆయన దగ్గరకు పోయేట్లయితే, మనలను ఆయన ఏ మాత్రమూ మన్నించడు. మనలను అందరినీ దండిస్తాడు. గడువు తప్పిపోవడమే కాకుండా సీతాదేవి వృత్తాంతము అయినా తెలుసుకోకుండా పోతాము. కనుక ఆయన మనకు మరణదండనమే విధిస్తాడు. మనలను చంపించే పాపానికి ఒడి కట్టుతాడు కాని మనలను కొంచెము అయినా మన్నించడు. అందువల్ల మనము అందరమూ మన బిడ్డలను, భార్యలను, మన ఇండ్లను, వాకిండ్లను, డబ్బును, దస్కాన్నీ వదలుకొని ప్రాయోపవేశము చేసి ఇక్కడనే మరణించడము మంచిది. అతడు యెట్లాగూ బ్రతకనీయడు. అందులో అప్రతిమానముగా హింసపెట్టి మరీ చంపించి వేస్తాడు. కాబట్టి మనము ఇక్కడనే చచ్చిపోవడము మంచిది.

"ఓ వానరులారా! నన్ను యువరాజును చేసింది సుగ్రీవుడు కాదు. ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసివేసే రాముడు నాకు యౌవరాజ్యము ఇప్పించినాడు. నన్ను యువరాజుగా అభిషేకము చేయమని సుగ్రీవునితో చెప్పినాడు. అందువల్ల సుగ్రీవుడు నన్ను యువరాజును చేసినాడు. సుగ్రీవుడు పూర్వమునుంచీ నామీద బద్ధవైరముతో ఉన్నాడు. ఇప్పుడు ఆయనకు నాలో తప్పిదము కనబడగానే పూనికతో తీక్ష్ణము అయిన శిక్ష నాకు విధిస్తాడు. నన్ను చంపివేస్తాడు. తప్పదు. నేను అట్లా చచ్చిపోతూఉంటే నా స్నేహితులు నన్ను చూచి దుఃఖపడడం తప్ప ఏమి

చేయగలుగుతారు? నా స్నేహితులను అందరినీ అట్లా నేను దుఃఖపెట్టినందువల్ల నాకు ప్రయోజనము ఏమిటి? ఓ వానరవీరులారా! ఇది పవిత్రము అయిన సముద్రతీరము. నేను ఇక్కడ అనశన వ్రతము ఆరంభిస్తాను" అన్నాడు.

యువరాజు అయిన చిన్నవాడు అంగదుడు-ఈవిధముగా చెప్పింది అంతా ఆ వానరవృద్ధులు విన్నారు. వారికి జాలి వేసింది. "ఓ అంగదుడా! నీవు చెప్పినట్లు సుగ్రీవుడు స్వభావసిద్ధముగా తీక్ష్ణము అయినవాడు. రాముడు భార్యాసక్తమనస్కుడు అయి ఉన్నాడు. అందువల్ల సీతాదేవిని చూడకుండా మనము పోయేట్లయితే సుగ్రీవుడు రాముణ్ణి సంతోషపెట్టడానికి మనలను తప్పకుండా చంపించి వేస్తాడు. సందేహములేదు. అపరాధము చేసినవాండ్లు తమ స్వామి దగ్గరకు పోవడము తగిన పనికాదు. సీతాదేవిని వెదకి ఆమె వృత్తాంతము తెలిస్తేనే మనము ఆ సుగ్రీవుడి దగ్గరకు పోవలెను లేదా యమసదనానికి మనము అందరమూ ఇటునుంచే నడవడము మంచిది"అన్నారు.

వానరవృద్ధులు భయార్తులు అయి ఇట్లా చెప్పింది అంతా విని తారుడు, "ఓ వానరవీరులారా! దుఃఖపడడము చాలించండి. మీకు అందరికీ ఇష్టము అయ్యేట్లయితే మయుడు మాయాశక్తితో నిర్మించిన బిలములోకి పోయి నివసిద్దాము. అక్కడకి ఎవ్వడూ రాలేడు. పయిగా వృక్షాలూ, జలాలూ, భోజ్యవస్తువులూ, పానద్రవ్యాలూ అక్కడ సమృద్ధముగా ఉన్నవి. మనము అందరమూ హాయిగా అక్కడ ఉండవచ్చును. సుగ్రీవుడుకానీ, రాముడుకానీ, చివరకు దేవేంద్రుడుకానీ అక్కడికి రాలేడు. అక్కడ మనకు ఎవరి భయమూ ఉండదు" అని చెప్పినాడు.

ఈ విధముగా అంగదుడికి అనుకూలముగా తారుడు చెప్పింది వానరులు అందరూ విని సంతుష్టులు అయినారు. అంతట వారు, "ఓ అంగదుడా! ఎట్లా చేస్తే మనకు అందరికీ హాయిగా ఉంటుందో అట్లా ఇప్పుడే చేయవలసింది" అన్నారు.

54

తారాధిపవర్చస్కుడు తారుడు అట్లా అంగదుడికి అనుకూలంగా చెప్పిన మాటలు హనుమంతుడు విన్నాడు. ఇకను అట్లా జరిగేట్లయితే వానర రాజ్యము అంతా అంగదుడిపాలు అయిపోతుంది అనుకొన్నాడు. (గ్రహణమూ, ధారణమూ, స్మరణమూ, ప్రతిపాదకమూ, ఊహా, అపోహా, అర్థవిజ్ఞానమూ, తత్వజ్ఞానమూ అనే) ఎనిమిది బుద్ధి గుణాలూ, (బాహుబలమూ, మనోబలమూ, ఉపాయబలమూ, బంధుబలమూ అనే) నాలుగుబలాలూ, (దేశకాలజ్ఞానమూ, దార్ఢ్యమూ, సర్వక్లేశసహిష్ణుతా, సర్వవిజ్ఞానమూ, దక్షతా, బలమూ, మంత్రగోపనమూ,

అవిసంవాదిత్వమూ, స్వశక్తి పరిజ్ఞానమూ, కృతజ్ఞతా, శరణాగతవాత్సల్యమూ, అమర్షత్వమూ, అచపలతా అనే) పధ్నాలుగు సద్గుణాలూ అంగదుడికి ఉన్నవి అని హనుమంతుడికి తెలుసును.

శుక్లపక్ష చంద్రుడివలె అనుక్షణమూ అంగదుడు తేజోవంతుడూ, బలవంతుడూ, పరాక్రమవంతుడూ అవుతూ ఉన్నాడు అనీ, బుద్ధికి బృహస్పతి అంతటివాడు అనీ, పరాక్రమానికి తండ్రి వాలి అంతటివాడు అనీ హనుమంతుడు గమనించినాడు. స్వామికార్య నిర్వహణములో అలసిపోయి బృహస్పతి చెప్పుచున్నది వింటున్న దేవేంద్రుడివలె, అప్పుడు తారుడి మాటలు వింటూ ఉన్న ఆ సర్వశాస్త్రవిశారదుడు అంగదుడు సుగ్రీవుడితో విడిపడిపోకుండా కలసి ఉండేట్టు చేయడానికి హనుమంతుడు పూనుకొన్నాడు.

అంతట హనుమంతుడు చతురుపాయాలలో మూడవది అయిన భేదోపాయము ప్రయోగించ తలచుకొని తన మాట నేర్పరితనముతో వానరులు ఋక్షబిలములో నివసించే విషయములో భేదాభిప్రాయాలు కలగచేసినాడు. వానరులు అందరూ ఏకాభిప్రాయులు కాకుండా చేసి హనుమంతుడు దండోపాయము అవలంబించదలచి కోపముతో, భయంకరమైన మాటలతో అంగదుణ్ణి బెదరించి, "ఓ తారేయుడా! నీవు యుద్ధములో నీ తండ్రికన్నా గట్టివాడవు. సందేహము లేదు. నీ తండ్రి వలె వానరరాజ్యాన్ని అంతా ఏలే శక్తి నీకు వుంది. ఓ వానరపుంగవా! అయితే ఈ కపులు అందరూ అస్థిర చిత్తులు. ఆలుబిడ్డలను వదలుకొని నీ చెప్పుచేతలలో ఎంతమాత్రమూ పడి ఉండరు. వీరి విషయము వీరి సమక్షములోనే నీకు చెప్పివేస్తాను.

"ఈ జాంబవంతుడూ, ఈ నీలుడూ, ఈ మహాకపి సుహోత్రుడూ నిన్ను అనుసరించుకొని ఎంతమాత్రమూ ఉండరు. సామ దాన భేద దండోపాయాలలో ఏ ఉపాయముతోనూ నీవు ఈ జాంబవంతాదులనుకానీ, నన్ను కానీ సుగ్రీవుడి దగ్గర నుంచి లాగుకొని నీ దగ్గర ఉంచుకోలేవు. అది నీ శక్యముకాదు. బలహీనుడు బలవంతుడితో విరోధము పెట్టుకోకూడదు అని నీతివేత్తలు చెప్పుతూ ఉంటారు. ఆత్మరక్షణము చేసుకోవలసిన దుర్బలుడు బలవంతుడితో విరోధము పెట్టుకోవడము అవివేకము.

"ఓ అంగదుడా! తారుడు చెప్పిన బిలము నీకు రక్షక స్థానము అనుకొంటున్నావు ఏమో! ఈ బిలాన్ని లక్ష్మణుడు తన బాణాలతో అతితేలికగా బ్రద్దలుచేసి వేస్తాడు. ఇదివరకు ఇంద్రుడు మయుడిమీద వజ్రాయుధము వేయడమువల్ల ఈ బిలము ఏర్పడ్డది. లక్ష్మణుడు ఇప్పుడు తన కరుకు అయిన బాణాలతో ఆకుదొప్పనువలె ఈ బిలాన్ని చీల్చివేస్తాడు. వజ్రాయుధమువలెనూ,

పిడుగువలెనూ తాకినంత మాత్రాననే పర్వతాలను అయినా భేదించివేసే బాణాలు ఎన్నో లక్ష్మణుడి దగ్గర ఉన్నవి.

"ఓ పరంతపా! నీవు సుగ్రీవుణ్ణి వదలిపెట్టి ఈ బిలములో ఉండేట్లయితే ఈ వానరవృద్ధులు నీ వెంట ఉండడము మంచిదికాదు అని నిశ్చయించుకొని నిన్ను వదలిపెట్టి పోతారు. నీతో ఉండే వానరులు ఎప్పుడూ ఆలుబిడ్డలను తలచుకొంటూ, దిగులుపడుతూ, సరి అయిన తిండి దొరకక నవసిపోతూ, కటిక రాతినేలమీద పడుకొని కష్టపడుతూ ఏమిచేయడానికీ తోచక నిన్ను వదలిపెట్టి పోతారు. అప్పుడు నీ వెంట నీ మిత్రులు లేకుండానూ, నీ మేలుకోరే బంధువులు లేకుండానూ నీవు ఒంటరివాడవు అయిపోతావు. కష్టాలపాలు అయిపోతావు. గాలికి కొట్టుకొనిపోయే గడ్డిపోచకన్నా నీవు తేలిక అయిపోతావు. నీవు సీతాదేవిని వెతకకుండా నీ రాజాజ్ఞను అతిక్రమించినావు అంటూ లక్ష్మణుడు వచ్చి ఎదుర్కొనడానికి అలవికాకుండా అమితవేగముతో దూసుకొనిపోయే తన బాణాలతో నీమీద పడతాడు. ఏమి అయినప్పటికిన్నీ నిన్ను చంపివేస్తాడు. నీవు మాతో కలసి వచ్చేట్లయితే సుగ్రీవుడు నిన్ను ఏమీ చేయడు. ఆనుపూర్వికముగా నీవు రాజువు అవుతావు.

"ఓ అంగదుడా! సుగ్రీవుడు ధార్మికుడు. అందరినీ సంతోషపెట్టుతూ ఉంటాడు. దృఢవ్రతుడు, పరిశుద్ధుడు, ప్రతిజ్ఞ తప్పనివాడు. నిన్ను అతడు ఎప్పుడూ చంపివేయడు. నీ తల్లిని తారను సంతోషపెట్టడమే తన పనిగా పెట్టుకొన్నాడు. ఆమె కోసమే జీవిస్తున్నాడు. నీవు ఆ తార కొమారుడవు. అతనికి వేరే పిల్లలు లేరు. అందువల్ల నీవే రాజువు అవుతావు, పోదాము పద" అన్నాడు.

55

అంగదుని ప్రాయోపవేశ నిర్ణయము

ఇట్లా హనుమంతుడు రాజగౌరవముతో ధర్మహితముగానూ, నీతియుక్తముగానూ చెప్పింది విని అంగదుడు, "ఓ హనుమంతుడా! సుగ్రీవుడు అస్థిరచిత్తుడు. ఆత్మశుద్ధీ, చిత్తశుద్ధీ లేనివాడు. క్రూరుడు. కపటి. పరాక్రమహీనుడు. ధైర్యహీనుడు. తన జ్యేష్ఠభ్రాత జీవించి ఉండగా ఆయన ప్రియభార్యను పట్టమహిషిని, తనకు తల్లివంటి దానిని తారను అతినీచముగా చేపట్టినాడు. అన్న శత్రువుతో పోరాడటానికి బిలములోకి పోతే ఆ బిలద్వారాన్ని పెద్ద రాయితో మూసివేసినాడు. అటువంటివాడు ఎట్లా ధార్మికుడు అవుతాడు?

"మహోపకారము చేసిన రాముడి చెయ్యిపట్టుకొని ఆ మహాయశుడికి సాయము చేస్తాను అని సత్యప్రమాణము చేసి మరచిపోయినాడు. అటువంటివాడు ఏ ఉపకారాన్ని

జ్ఞాపకము ఉంచుకొంటాడు? లక్ష్మణుడి భయమువల్ల సీతాదేవిని వెతకవలసింది అని మనలను ఆజ్ఞాపించినాడుకాని అధర్మభయమువల్ల మాత్రము కాదు.

"అతడు పాపిష్ఠివాడు. కృతఘ్నుడు. అవివేకి. చంచలచిత్తుడు. ఆ వంశములో పుట్టిన యోగ్యుడు అయినవాడు ఎవడూ అతనిని నమ్మడు. గుణవంతుడు అయినా, గుణహీనుడు అయినా సుగ్రీవుడు తనకు పుట్టే పుత్రుడికే రాజ్యము ఇస్తాడు. తన శత్రువుకు పుట్టిన నన్ను మాత్రము బ్రతుకనీయడు.

"సుగ్రీవాజ్ఞ నెరవేర్చని అపరాధిని, ఋక్షబిలములో ఉండవలెను అని ఆలోచన చేసినట్లున్నూ తెలుస్తుంది. నేను కిష్కింధలో శక్తిహీనుడుగానూ, దుర్బలుడుగానూ, అనాధుడుగానూ జీవించి ఉండడం ఎట్లాగు? సుగ్రీవుడు శరుడు. క్రూరుడు. ఘాతుకుడు. రాజ్యకారణమువల్ల నన్ను గుట్టుచప్పుడుగా ఉరితీస్తాడు. ఉరితీయించుకొని చావడము కన్నా ప్రాయోపవేశము చేయడము మంచిది. మీరు అందరూ అనుమతించవలెను.

"ఓ వానరవీరులారా! మీరు మీ మీ ఇండ్లకు వెళ్ళిపొండి. నేను కిష్కింధాపట్టణానికి రాను. ఇక్కడనే ప్రాణప్రయాణానికి కూర్చుంటాను. నేను చచ్చిపోవడమే మంచిది. బలవంతులు అయిన ఆ రామలక్ష్మణులకు నా నమస్కారాలు చెప్పండి. నా పినతండ్రి సుగ్రీవుణ్ణి నమస్కారపూర్వకముగా కుశలము అడిగినాను అని చెప్పండి. మా పినతల్లి రుమ ఆరోగ్యమూ, కుశలమూ అడిగినాను అని చెప్పండి. మా అమ్మ తారను ఓదార్చండి. ఆమె నన్ను తలచుకొని దుఃఖపడుతూ ఉంటుంది. స్వాభావికముగా ఆమెది జాలిగుండె. నేను ఆమె ప్రియపుత్రుణ్ణి. నేను ఇక్కడ చచ్చిపోయినాను అని వింటుంది. ఆ వెంటనే ఆమె చచ్చిపోతుంది" అని చెప్పి, వానరవృద్ధులకు అందరికీ నమస్కారము చేసి మనస్సు పాడు అయిపోయి ఏడుస్తూ, వేడి వేడి కన్నీళ్ళు కారుస్తూ నేల మీద దర్భలు పరచుకొని పడుకొన్నాడు.

అట్లా అంగదుడు పడుకోగానే వానరులు అందరూ దుఃఖపడిపోయి కన్నీళ్లు కారుస్తూ ఏడ్చినారు. అంతట వారు అందరూ సుగ్రీవుణ్ణి నిందిస్తూ, వాలిని ప్రశంసిస్తూ అంగదుడితోపాటు వారున్నూ ప్రాయోపవేశము చేసి చచ్చిపోవడానికి నిశ్చయించుకొన్నారు. అప్పుడు వారందరూ స్నానము చేసి ఆ సముద్రపు ఉత్తరతీరాన దక్షిణాగ్రాలుగా దర్భలు పరచుకొని తూర్పుముఖము అయి కూర్చున్నారు.

రాముడు వనవాసానికి రావడమూ, దశరథమహారాజు చనిపోవడమూ, జనస్థానములో రాముడు ఖరదూషణాదులను వధించడమూ, రావణాసురుడు సీతాదేవిని అపహరించుకొనిపోవడమూ, జటాయువును ఆ రావణాసురుడు

చంపివేయడమూ, రాముడు వాలిని చంపివేయడమూ, సుగ్రీవుడిమీద రాముడికి కోపము రావడమూ చెప్పుకొని వారు అందరూ భయపడిపోయినారు.

ఆ భయముతో ఆ పర్వతాకారులు వానరులు అందరూ పెద్ద గొంతుతో ఏడువసాగినారు. ఆ ఏడుపులూ, ఆ కేకలూ మేఘగర్జనలవలె ఆ కొండగుహలలో మారుమ్రోగినవి.

56

సంపాతి

అక్కడ కొండగుహలలో ఉంటూ ఉన్న గద్దలరాజు సంపాతి అనేవాడు ఆ అరుపులకూ, ఆ పెడబొబ్బలకూ, ఆ ఏడుపులకూ బయటికి వచ్చినాడు. అతడు జటాయువు జ్యేష్ఠభ్రాత. బలపరాక్రమాలకు ప్రసిద్ధికెక్కినాడు. బహుకాలమునుంచీ జీవిస్తూ ఉన్న వృద్ధు. ప్రాయోపవేశము చేయడానికి కూర్చున్న వానరవీరులను అందరినీ చూచినాడు. సంతోషపడ్డాడు. వానరులు అందరూ వినేటట్టుగా, "ఆహా! దైవము అందరి యోగక్షేమాలనూ విచారిస్తూ ఉంటుంది. బహుకాలంనుంచీ ఆహారము దొరకక బాధపడుతూ ఉన్న నాకు, ఇప్పుడు ఈ వానర రూపము అయిన భక్ష్యాన్ని నా దగ్గరకు పంపించింది. చచ్చిపోయే ఈ వానరులను ఒక్కొక్కణ్ణీ ఒక్కొక్కరోజు భక్షించి వేస్తాను"అన్నాడు.

ఆ సంపాతి మాటలు విని అంగదుడు దిగులుపడిపోయి, "ఓ హనుమంతుడా! ఆహారముకోసము ఆశపడి వచ్చిన ఆ పక్షిని చూడు. సాక్షాత్తూ యముడే గద్దరూపాన ఈ వానరులను అందరినీ చంపివేయడానికి ఇప్పుడు, ఇక్కడికి వచ్చినాడు. మనము రాముడి పని చేయలేదు. సుగ్రీవుడు చెప్పినట్లు నెలరోజుల లోపల తిరిగిపోవడమూ చేయలేదు. ఎన్నడూ ఎరుగని విపత్తు హఠాత్తుగా ఈ వానరులకు అందరికీ వచ్చిపడ్డది. సీతాదేవికి మేలుచేయడానికి ఆ జనస్థానములో జటాయువు చేసింది అంతా మీరు అందరూ వినే ఉన్నారు. ఆ జటాయువుకు పట్టిన గతే ఈ వానరులకు అందరికీ పట్టబోతున్నది.

"సమస్త ప్రాణికోటి తిర్యగ్జంతువులు సయితమూ రాముణ్ణి సంతోషపెట్టడానికి ప్రాణాలు వదలిపెట్టినవి. వానరులున్నూ అంతే. ఒక్కొక్కరే స్నేహమువల్లకానీ, కారుణ్యమువల్లకానీ రాముడికి ఉపకారము చేస్తూ ఉన్నారు. రాముడికి ఉపకారము చేయడానికే జటాయువు ధైర్యము చేసినాడు. ఆ ధర్మజ్ఞుడు అట్లా ప్రాణాలు కోలుపోయి రాముణ్ణి సంతోషపెట్టినాడు. మనమున్నూ ఆ రాముడి కోసమే అడవులకు వచ్చినాము. అలసిపోయినాము. అడవులు అన్నీ వెతకినాము. ఆ మైథిలిని

సీతాదేవిని చూడలేక పోయినాము. ఇప్పుడు ప్రాణాలు వదలిపెట్టి పోతున్నాము. చచ్చిపోవడానికి సిద్ధము అయినాము. ఈ సంపాతి చంపివేస్తాడు అనే భయము ఎందుకు?

"ఆ గద్దలరాజు జటాయువు ఆ రావణాసురుడితో యుద్ధము చేసినాడు. ఆ రాక్షసుడి చేతిలో చచ్చిపోయినాడు. అందువల్ల, అతడు మనవలె సుగ్రీవుడి భయము లేకుండా పరమపదానికి పోయినాడు. సీతారామలక్ష్మణులు వనవాసానికి రావడముతో దశరథమహారాజు చనిపోయినందువల్లనూ, సీతాదేవిని రావణాసురుడు అపహరించుకొనిపోయినందువల్లనూ, జటాయువు చనిపోయినందువల్లనూ ఇప్పుడు ఈ వానరులకు అందరికీ ఈ ప్రాణ సంశయావస్థ వచ్చింది.

"ఒక్క రామబాణముతో వాలి హతుడు అయిపోయినాడు. సీతారామ లక్ష్మణులు వనవాసానికి రావడముతో జనస్థానములో రాక్షసులు అందరూ హతము అయిపోయినారు. ఇంతవరకూ దశరథమహారాజు కైకేయీదేవికి వరము ఇవ్వడముతో ఈ దురవస్థ అంతా వచ్చింది. ఇంతమంది చచ్చిపోవలసి వచ్చింది" అంటూ దుఃఖపడిపోయినాడు.

అంగదుడు అన్న ఈ మాటలు అన్నీ ఆ మహామతిమంతుడు సంపాతి విన్నాడు. అతని మనస్సు అంతా సంచలించిపోయింది. నేలమీద ఉన్న ఆ వానరులను అందరినీ చూచినాడు. భయంకరము అయిన ముక్కుతో మహాస్వనముతో, "ఎవడురా నీవు? నా తమ్ముడు జటాయువు చనిపోయినాడు అని నా మనస్సు చలించిపోయేట్టు చెప్పుతున్నావు. వాడు నా ప్రాణముకన్నా నాకు ప్రియతముడు. జనస్థానములో జటాయువుకూ, రావణాసురుడికీ యుద్ధము ఎందుకు జరిగింది? ఎట్లా నా తమ్ముడు చనిపోయినాడు? నన్ను ఈ గిరి దుర్గమునుంచి మీరు కిందికి దించండి. నా తమ్ముడు జటాయువు మహాపరాక్రమవంతుడు. గుణవంతుడు. ఓ వానరశ్రేష్ఠులారా! జనస్థానములో ఉన్న నా తమ్ముడు జటాయువు మరణాన్ని గురించి వింటాను, చెప్పవలసింది. సూర్యకిరణాలవల్ల నా రెక్కలు కాలిపోయినవి. అందువల్ల, మీ దగ్గరకు చేరే శక్తి నాకు లేదు. నన్ను ఈ కొండమీదనుంచి దింపమని మిమ్ములను వేడుకొంటున్నాను" అంటూ దుఃఖాతిశయమునుంచి హీనస్వరముతో అన్నాడు.

57

ఆ సంపాతి మాటలు ఆ వానరులు నమ్మలేదు. తమను అందరినీ భక్షించివేయడానికి అట్లా అతడు చెప్పుతున్నాడు అనుకొన్నారు. అందరూ ఆలోచించినారు. "మనము చచ్చిపోవడము మేలు అనుకొని ప్రాయోపవేశము చేసి

కూర్చున్నాము. ఇతడు ఇప్పుడు మనలను భక్షించివేసేట్లయితే వెంటనే కృతార్థులము అవుతాము. మన సంకల్పము ఇట్టే నెరవేరుతుంది" అని నిశ్చయించినారు. అంతట అంగదుడు ఆ సంపాతిని పర్వతశిఖరముమీదనుంచి కిందికి దింపి ఇట్లా చెప్పినాడు:

"ఓ సంపాతీ! మహాపరాక్రమవంతుడూ, పరమధార్మికుడూ అయిన ఋక్షరజుడు అనే వానరరాజు ఒకడు ఉండేవాడు. అతడకి వాలి సుగ్రీవులు అనేవాండ్లు ఇద్దరూ ఔరసపుత్రులు. నేను ఆ వాలి పుత్రుడను. నా తండ్రి వాలి పరమపరాక్రమవంతుడు అని ప్రసిద్ధికెక్కినాడు. ఇక్ష్వాకువంశములో పుట్టిన రాముడు పితృాజ్ఞా పరిపాలనము కోసము తమ్ముడు లక్ష్మణునితోనూ, భార్య సీతాదేవితోనూ దండకారణ్యానికి వచ్చినాడు. సీతారామలక్ష్మణులు జనస్థానములో నివసిస్తూ ఉన్నారు. ఒకప్పుడు ఆ అన్నతమ్ములు లేని సమయములో రావణాసురుడు బలవంతముగా సీతాదేవిని ఎత్తుకొని పోయినాడు.

"ఆ సీతాదేవిని రావణాసురుడు ఆకాశమార్గాన తీసుకొని పోతూ ఉండగా, గద్దల రాజు జటాయువు చూచినాడు. ఆ జటాయువు రాముడు తండ్రి దశరథ మహారాజుకు స్నేహితుడు. ఆ రావణాసురుడు సీతను ఎత్తుకొని పోకుండా ఆపివేయవలెను అనుకొని జటాయువు ఆ రావణాసురుణ్ణి అడ్డగించినాడు. అతణ్ణి విరథుణ్ణి చేసివేసినాడు. వృద్ధు అయినందువల్ల జటాయువు ఆ పోరాటములో అలసిపోయినాడు. రావణాసురుడు జటాయువును చంపివేసినాడు. అట్లా చనిపోయిన ఆ జటాయువుకు రాముడు దహనసంస్కారము చేసినాడు. అతడు అందువల్ల ఉత్తమలోకానికి పోయినాడు.

"ఆ మహాత్ముడు రాముడు నా పినతండ్రి అయిన సుగ్రీవుడితో స్నేహము చేసినాడు. నా తండ్రిని వాలిని చంపివేసినాడు. సుగ్రీవుడికి రాజ్యాభిషేకము చేయించినాడు. అట్లా రాముడునుంచి సుగ్రీవుడు సమస్తవానరులకున్నూ రాజు అయినాడు. ఆ సుగ్రీవుడు సీతాదేవిని వెదకమని మమ్ములను ఆజ్ఞాపించినాడు. మేము అరణ్యాలు అన్నీ వెతికినాము. రాత్రిపూట సూర్యప్రభ అగుపించదు. అదేవిధముగా మాకు సీతాదేవి ఇంతవరకూ అగుపించలేదు. మేము ఆమెను వెతకుతూ వెతకుతూ అజ్ఞానమువల్ల ఋక్షబిలములోకి పోయినాము. దానిని మయుడు తన మాయా బలముతో నిర్మించినాడు. ఆ బిలములో మేము వెతకుతూ ఉండగానే సుగ్రీవుడు మేము తిరిగి కిష్కింధకు చేరవలెను అని నిర్ణయించిన గడువు కాలము కాస్తా గతించిపోయింది. మేము అందరమూ సుగ్రీవుడి చెప్పుచేతలలో ఉన్నాము. ఆయన ఆజ్ఞను తప్పిపోయినాము. అందువల్ల, ఆయన దగ్గరకు పోవడానికి మాకు భయము వేసి ప్రాయోపవేశము చేసి కూర్చున్నాము. ఆ మహావీరుడు

రాముడికికానీ, లక్ష్మణుడికికానీ, సుగ్రీవుడికికానీ మామీద కోపము వస్తే మేము బ్రతికి ఉండడము ఉత్తది. అందువల్ల మేము ప్రాయోపవేశము చేసి కూర్చున్నాము."

అంగదుడు ఈవిధముగా సంపాతికి చెప్పి ఊరకున్నాడు.

58

సంపాతి రావణుని జాడ నెఱింగించుట

ప్రాణాలమీద ఆశ వదలుకొని వానరులు జాలిపుట్టేట్టు చెప్పిన మాటలు ఆ సంపాతి విన్నాడు. అతడు కన్నీళ్ళు కారుస్తూ మహాస్వరముతో, "ఓ వానరులారా! యుద్ధములో బలవంతుడు అయిన రావణాసురుడి చేతిలో చనిపోయినాడు అని మీరు చెప్పిన ఆ జటాయువు నా తమ్ముడు. పగ తీర్చుకొనే శక్తి నాకు ఇప్పుడు ఏమాత్రమూ లేదు. వృద్ధాప్యమువల్లనూ, నాకు రెక్కలు లేనందువల్లనూ నేను మీరు చెప్పింది విని సహించి ఊరక ఉండవలసి వచ్చింది.

"పూర్వం వృత్రాసుర వధము అయినప్పుడు మేము అన్నదమ్ములము. అన్యోన్య జయకాంక్షతో ఆకాశానికి ఎగిరి, అనంత కిరణాలతో జ్వలించే ఆదిత్య మండలము వరకూ పోవలెను అనుకొన్నాము. మేము మండలాకారముగా అమితవేగముగా ఆకాశ వీధిన చాలా పైకి పోయినాము. అప్పుడు సూర్యుడు ఆకాశ మధ్యమములోకి వచ్చినాడు. ఆ వేండ్రానికి నా తమ్ముడు సొక్కి సోలిపోయినాడు. అప్పుడు భ్రాతృవాత్సల్య పారవశ్యముతో నేను పోయి నా తమ్ముడిమీద సూర్యరశ్మి పడకుండా నా రెక్కలతో కప్పివేసినాను. ఆ సూర్యకిరణాల వేడికి నా రెక్కలు కాలిపోయి, నేను ఈ వింధ్యపర్వతముమీద పడిపోయినాను. అప్పటినుంచీ నేను ఇక్కడనే నివసిస్తూ ఉన్నాను. నా తమ్ముడు జటాయువు ఏమి అయిపోయినాడో నాకు తెలియదు. ఇప్పుడు మీరు చెప్తుతూ ఉంటే వింటున్నాను" అన్నాడు.

ఇట్లా జటాయువు జ్యేష్ఠభ్రాత సంపాతి చెప్పింది విని మహాప్రాజ్ఞుడూ, యువరాజూ అయిన అంగదుడు "ఓ పక్షిరాజా! నీవు చెప్పింది అంతా విన్నాము. నీవు జటాయువుకు జ్యేష్ఠభ్రాత అయినట్లయితే, ఆ రాక్షసుడు రావణాసురుడు ఎక్కడ నివసిస్తూ ఉన్నాడో నీకు తెలిసివుంటే చెప్పు. వాడు, ముందు ఆలోచన లేని ఆ రాక్షసాధిపతి రావణాసురుడు ఇక్కడికి దగ్గరలో ఉంటూ ఉన్నాడో, దూరములో ఉంటూ ఉన్నాడో చెప్పు" అని అడిగినాడు.

ఆ సంపాతి వానరులు అందరూ సంతోషించేటట్టుగానూ, తన స్థితికి తగినట్టుగానూ, "ఓ వానరులారా! నేను గద్దను. నా రెండు రెక్కలూ తగులపడి పోయినవి. నేను వీర్యహీనుణ్ణి అయిపోయినాను. నేను ఏమి చేయగలను? రాముడి

కోసము వాక్సహాయము మాత్రము చేస్తాను. అదే ఆయనకూ, మీకూ మంచి సాయము అవుతుంది. నేను రావణాసురుడు ఉంటూ ఉన్న ప్రదేశమే కాదు, పాతాళము మొదలు అయిన లోకాలను అన్నిటినీ ఎరుగుదును. మహావిష్ణువు త్రివిక్రమావతారములో తన మూడు అడుగులూ ఉంచడానికి అడిగిన లోకాలను ఎరుగుదును. అమృతమథనమూ, దేవాసుర యుద్ధమూ ఎరుగుదును.

"ఓ వానరవీరులారా! రామకార్యము మీకన్నా ముందుగా నెరవేర్చవలసినవాణ్ణి నేను. అయితే ఏమి చేయను? నేను ముసలివాణ్ణి అయిపోయినాను. నాకు రెక్కలు లేవు. నా పరాక్రమము అడుగంటిపోయింది. నా కీళ్ళు అన్నీ కదిలిపోయినవి. ప్రాణము మాత్రము మిగిలి ఉంది. ఇదివరకు ఒక యువతిని దురాత్ముడు ఆ రావణాసురుడు ఆకాశమార్గాన ఎత్తుకొనిపోతూ ఉంటే చూచినాను. ఆమె సర్వాభరణభూషిత. రూపసంపన్న. ఆమె 'రామా రామా' అంటూనూ, 'లక్ష్మణా' అంటూనూ అరుస్తూనూ, ఏడుస్తూనూ, తన ఒంటిమీది ఆభరణాలు అన్నీ తీసి కిందపారవేస్తూనూ, దేహము అంతా విదిలించుకొంటూనూ రావణాసురుడి అంకభాగాన కనిపించింది. ఆ నల్లటి రాక్షసుడిమీద ఆమె కట్టుకొన్న పట్టుచీర పర్వతాగ్రముమీద సూర్యప్రభవలెనూ, మహామేఘాలమధ్య మెరుపుతీగవలెనూ తళతళ మెరసింది. కాబట్టి, ఆమె సీతాదేవి అయి ఉంటుంది.

"ఓ వానరులారా! రావణాసురుణ్ణిగురించీ, వాడి నివాసస్థానాన్ని గురించీ చెప్పుతాను వినవలసింది. వాడు, ఆ రావణాసురుడు అనే వాడు విశ్రవసుడి పుత్రుడు. కుబేరుడికి సాక్షాత్తు తమ్ముడు. వాడు లంకాపట్టణములో నివసిస్తూ ఉన్నాడు. ఆ లంకాపట్టణము ఇక్కడికి నూరుయోజనాల దూరములో సముద్రము మధ్యను ఒక ద్వీపములో ఉంది. రమణీయము అయిన ఆ లంకాపట్టణాన్ని విశ్వకర్మ ఆ ద్వీపములో నిర్మించినాడు. బంగారుమయము అయిన వాకిండ్లూ, విచిత్రము అయిన కాంచనవేదికలూ, సూర్యకాంతులతో చుట్టూ తళతళలాడే గొప్ప ప్రాకారమూ ఆ లంకాపట్టణానికి ఉన్నవి. అక్కడ, ఆ పట్టణములో రావణాసురుడి అంతఃపురములో, రాక్షసాంగనల కాపలాలో ఆదివరకు కట్టుకొన్న పట్టుచీరతో సీతాదేవి దీనురాలుగా ఉంది. మీరు ఆ లంకాపట్టణము పోయేట్లయితే ఆ జనకరాజసుతను సీతాదేవిని మీరు చూడగలుగుతారు. రావణాసురుణ్ణి చూడవచ్చును. అయితే, ఆ లంకాపట్టణము ఇక్కడి ఈ సముద్రతీరమునుంచి దక్షిణాన సరిగా నూరుయోజనాల దూరములో సముద్రము నడుమ గుప్తముగా ఉంది.

"ఓ వానరులారా! మీరు సాహసము చేసి త్వరగా అక్కడికి పొండి. ఆమెను, ఆ సీతాదేవిని చూడండి. మీరు అక్కడికి పోయి రాగలరు అని నేను దివ్యజ్ఞానముతో

చెప్పుతున్నాను. ఆకాశమార్గాన పోవడానికి ఏడు వీధులు ఉన్నవి. ధాన్యము తిని బ్రతికే పిచ్చుకలూ మొదలు అయినవి ఈ భూమికి అట్టే ఎత్తున కాకుండా మొదటి వీధిలో ఎగిరిపోతూ వస్తూ ఉంటవి. వృక్షాలమీద పండ్లూ అవీ తిని బ్రతికే కాకులూ మొదలు అయిన పక్షులు రెండవ వీధిలో ఎగిరిపోతూ వస్తూ ఉంటవి. కొంచపిట్టలూ, లకుముకిపిట్టలూ, నీరుకాకులూ మొదలు అయినవి ఆకాశమార్గాన మూడవ వీధిలో ఎగిరిపోతూ ఉంటవి. డేగలూ మొదలు అయినవి నాల్గవ వీధిలో ఎగిరిపోతూ ఉంటవి. ఈ వీధులు అన్నిటికన్నా ఎత్తు అయిన అయిదవ వీధిలో గద్దజాతి పక్షులు ఎగిరిపోతూ ఉంటవి. బలముతోనూ, పరాక్రమముతోనూ, సౌందర్యముతోనూ, యౌవనముతోనూ తిరిగే హంసలు ఆకాశాన ఆరవ వీధిలో పోతూ ఉంటవి. అంతకన్నా ఎత్తు అయిన ఏడవ వీధిలో వినతపుత్రులు ఆయిన గరుత్మంతుడూ, అరుణుడూ అవలీలగా పోతూఉంటారు.

"ఓ వానరులారా! మేము ఆ వైనతేయులలో అరుణుడి వంశములో పుట్టినాము. మాకు దేవతా సంబంధము అయిన నేత్రపాటవమూ, అదేవిధముగా బలమూ ఉన్నవి. అందువల్ల, ఇక్కడ ఉండే నేను లంకాపట్టణములో ఆ రావణాసురుణ్ణీ, సీతాదేవినీ చూస్తూ ఉన్నాను. ఆహార బలమువల్లనూ, నైసర్గిక బలమువల్లనూ చూపు చక్కగా నూరుయోజనాల వరకున్నూ పోతుంది. నూరుయోజనాల దూరము లోపల ఉండే సమస్తమూ మాకు కనబడుతవి. అందువల్లనే, బహుదూరములో ఉండే పదార్థాలను మేము కనిపెట్టి తెచ్చుకొని తింటూ ఉంటాము. కోళ్లూ మొదలు అయిన పక్షులు వాటి కాళ్ళ దగ్గర దొరికే వస్తువులనే చూడగలవు. అందువల్ల, అవి ఎక్కడ ఉంటవో అక్కడ వాటి కాళ్ళ దగ్గర ఉండే పదార్థాలనే తీసుకొని తింటూ ఉంటవి.

"ఓ వానరులారా! ఆ రాక్షసుడు రావణాసురుడు చేసింది చాలా తప్పుపని. మీరు వాణ్ణి చూచివస్తే చాలును. రాముడు వాణ్ణి సంహారము చేసివేస్తాడు. అంతటితో నా తమ్ముడినుంచి నాకు రావణాసురుడిమీద ఉన్న కసి అంతా తీరిపోతుంది. మీరు ఈ సముద్రము దాటిపోయే ఉపాయము ఆలోచించండి. పోయి వైదేహిని చూడండి. మీరు వచ్చిన పని అంతా నెరవేరుతుంది.

"ఓ వానరులారా! నన్ను మీరు ఇప్పుడు సముద్రము ఒడ్డుకు తీసుకొని పొండి. స్వర్గతుడు అయిన ఆ పూజ్యుడికి నా తమ్ముడికి నేను జలతర్పణము వదలవలెను" అన్నాడు సంపాతి.

అంతట ఆ మహాపరాక్రమవంతులు వానరులు, సంపాతిని సముద్రతీరానికి తీసుకొని పోయినారు. అతడు అక్కడ జటాయువుకు నీళ్లు వదిలిన తరువాత మళ్లీ

ఆ పర్వతప్రదేశానికి అతణ్ణి తీసుకొని పోయినారు. రావణాసురుడి ఉనికిపట్టు తెలిసినందువల్ల ఆ వానరులు అందరూ అమితానందభరితులు అయినారు.

59

సంపాతి చెప్పిన అమృతమువంటి మాటలు విని ఆ వానరులు అందరూ ఎంతో సంతోషపడ్డారు. వారి దేహాలు పులకలు ఎత్తినవి. అంతట వానరశ్రేష్ఠుడు జాంబవంతుడు వానరులు అందరితోనూ లేచి నిలుచుని, "ఓ సంపాతీ! సీతాదేవి ఎక్కడ ఉంది అంటున్నావు? ఆమెను ఎత్తుకొనిపోయినవాడు ఎవడు అంటున్నావు? సీతాదేవిని ఎత్తుకొనిపోతూ ఉంటే నీవే చూచినావా, మరి ఎవరు అయినా చూచినారా? అంతా వివరముగా చెప్పు. నీవే ఇప్పుడు ఈ వానరులకు అందరికీ దిక్కు. రామలక్ష్మణులు వదిలే వజ్రసమానము అయిన బాణాల వేంద్రాన్నీ, ఆ అన్నదమ్ముల పరాక్రమాన్నీ ఆలోచించకుండా ఉన్నవాడు ఎవడు?" అని అడిగినాడు.

సీతాదేవి వృత్తాంతము వినడానికి వానరులు అందరూ సంతుష్టులు అయి, ఏకాగ్రచిత్తులు అయినందుకు సంపాతి సంతోషించి మళ్ళీ వారిని అందరినీ ఆశ్వాసిస్తూ "సీతాదేవిని ఎత్తుకొని పోవడము నేను ఎట్లా విన్నానో, ఇప్పుడు ఆమె ఎక్కడ ఉందో, నాకు ఎవరు చెప్పినారో అది అంతా చెప్పుతాను వినండి. ఆ పర్వత వైశాల్యము అనేకవేల యోజనాలు ఉంటుంది. ఇది దుర్గమము అయిన ప్రదేశము కూడాను. నేను ఇక్కడ పడిపోయినాను. చిరకాలమునుంచీ నేను ఇక్కడనే ఉంటూ ఉన్నాను. నా బలమూ నశించిపోయినది. ముసలివాణ్ణి అయిపోయినాను. ఇటువంటి దురవస్థలో ఉంటూ ఉన్నా, నా పిల్లవాడు సుపార్శ్వుడు వేళ తప్పకుండా నాకు ఆహారము తెచ్చిపెట్టి నన్ను పోషిస్తూ ఉన్నాడు.

"ఓ వానరులారా! గంధర్వులకు కామము అధికము. పాములకు కోపము అధికము. మృగాలకు భయము అధికము. మాకు పక్షులకు ఆకలి అధికము. ఆనాడు ఆకలితో బాధపడుతూ నా పిల్లవాడి కోసము కనిపెట్టుకొని ఉన్నాను. పొద్దుకూకింది. చీకటి పడిపోయింది. నా పిల్లవాడు వట్టిచేతులతో వచ్చినాడు. నాకు అమితముగా ఆకలివేసి దాహము అయి బాధపడుతున్నాను. పయిగా ముసలివాణ్ణి. నాకు కోపము వచ్చింది. వాణ్ణి కసిరినాను. వాడు, నా పిల్లవాడు బుద్ధిమంతుడు. ఎప్పుడూ నన్ను సంతోషపెట్టుతూ ఉండేవాడు. ఆహారము లేనందుకు బాధపడుతూ ఉన్న నన్ను సమాధానపరచడానికి వాడు జరిగినది జరిగినట్టుగా చెప్పతలచుకొని, 'నాయనా! ఎప్పటిమాదిరిగా వేళతప్పకుండా మాంసముకోసము ఆకాశవీథికి ఎగిరి మహేంద్రపర్వత ద్వారము దగ్గరకు పోయినాను. అక్కడ సముద్రములో వేలకొద్దీ జంతువులు తిరుగుతూ ఉంటవి. వాటిలో వేటిని అయినా పట్టుకోవలెను అనుకొని

నేను అక్కడ ఒక్కణ్ణి తలవంచుకొని దారికి అడ్డముగా కూర్చున్నాను. అప్పుడు కాటుకరంగుతో ఉన్న మహాకాయుడు ఒకడు సూర్యోదయకాంతులతో తేజరిల్లుతూ ఉన్న ఒకానొక స్త్రీని ఎత్తుకొని అక్కడకి వచ్చినాడు. వాండ్లను నేను చూచినాను. ఆహారముకోసము పొంచి ఉన్న నేను వారినే ఆహారము చేసుకోవలెను అనుకొన్నాను. వారిని పట్టుకోవడానికి నిశ్చయించుకొన్నాను. ఇంతలో ఆ మగవాడు వినయ విధేయతలతో, మంచిమాటలతో తనను పోనివ్వవలసింది అని నన్ను బ్రతిమాలుకొన్నాడు. వినయసంపన్నులను ఎవరూ, నీచులు అయినవారు కూడా ఎదిరించరు కదా! నేను ఆ మగవాణ్ణి ఎదిరించకుండా వదలిపెట్టడములో ఆశ్చర్యము ఏమీ లేదు. అప్పుడు వాడు తన తేజస్సుతో ఆకాశాన్ని భేదించుకొని పోయేవాడివలె అమితవేగముతో వెళ్ళిపోయినాడు.

"అప్పుడు ఆకాశములో సంచారము చేసే సిద్ధులూ, చారణులూ, మహర్షులూ నా దగ్గరకు వచ్చి ఆ నల్లటివాడికి దారి ఇచ్చినందుకు నేను తెలివి అయినవాణ్ణి అని నన్ను మెచ్చుకొన్నారు. వారు అందరూ నన్ను చూచి, 'నాయనా సుపార్శ్వుడా! నీవు దైవవశాత్తూ బ్రతికిపోయినావు. వాడు భయమునుంచి నిన్ను వదిలిపెట్టి పోయినాడు. నీకు మంచిది అయింది. సందేహం లేదు' అంటూ ఆ పరమమంగళస్వరూపులు నాతో 'వాడే రాక్షసరాజు రావణాసురుడు. వాడు బలవంతముగా సీతాదేవిని ఎత్తుకొనిపోతున్నాడు. వెంట్రుకలు అన్నీ విడివడిపోయి, కట్టుకొన్న పట్టుచీర జారిపోతూ, పెట్టుకొన్న ఆభరణాలు అన్నీ తీసి విసరివేస్తూ 'రామా రామా' అని అరుస్తూ, వాడి అంకభాగములో పెనగులాడుతూ ఉన్న ఆమే జనకమహారాజు కూతురు సీతాదేవి. దశరథమహారాజు కోడలు. రాముడి భార్య' అని చెప్పినారు.

"నాయనా! ఆ రావణాసురుడివల్ల కాలాతిక్రమణము అయిపోయింది. నేను ఏమీ తేలేకపోయినాను' అని నాపిల్లవాడు సుపార్శ్వుడు నాతో చెప్పినాడు. అది అంతా విన్నప్పటికిన్నీ ఆ రావణాసురుడిమీదికి పరాక్రమించి పోవలెను అనే బుద్ధి నాకు పుట్టలేదు. నేను పక్షిని. నాకు రెక్కలే బలము. నా రెక్కలు రెండూ ఎప్పుడో పోయినవి. ఏమీ చేయలేను. నా వాక్కుకూ, నా బుద్ధిబలానికీ ఏ లోపమూ రాలేదు. ఈ రెండూ చక్కగా ఉన్నవి. ఈ రెంటితో మీకు సాయపడుతున్నాను. నేను చెప్పేది మీరు వినండి. రాముడి పనే నా పని. సందేహము లేదు. మీ పరాక్రమముతో మీరు రామకార్యము సాధించవలెను. మీరు అందరూ మతిమంతులు. మహాబలవంతులు. ఏ పని చేయవలెను అనుకొంటే ఆ పని చేయకల సమర్థులు. దేవతలు సయితము మిమ్ములను సమీపించలేరు. వానరరాజు సుగ్రీవుడు మిమ్ములను పంపించినాడు. కంకపక్షి రెక్కలు కట్టిన రామలక్ష్మణుల బాణాలు ముల్లోకాలనూ

రక్షించకలవు. రావణాసురుడు బలవంతుడు అయితే అయి ఉండవచ్చును. మీరు అందరూ అతిసమర్థులు. మీకు అసాధ్యము అయింది ఏదీ లేదు. అందువల్ల, మీరు ఇప్పుడు కాలవిలంబనము చేయవద్దు. ఈ పని చేయవలెను అని మీరు సంకల్పించుకోడమే తరువాయి, మీవంటి బుద్ధిమంతులు కార్య నిర్వహణములో ఆలస్యము చేయరు, ఆలస్యము చేయకూడదు కూడాను" అని సంపాతి చెప్పినాడు.

60

సంపాతి వృత్తాంతము

అంతట సంపాతి స్నానము చేసి తన తమ్ముడికి ఉదకదానము వదలి వచ్చినాడు. చుట్టూ వానరులు అందరితోనూ కూర్చుని ఉన్న అంగదుణ్ణి చూచి, తనకు అదివరకు నిశాకర మహర్షి చెప్పినట్టు అవుతుంది అని నమ్మి, సంతోషముతో సంపాతి మళ్ళీ, "ఓ వానరులారా! మీరు అందరూ నిశ్శబ్దముగా ఏకాగ్రచిత్తముతో వినండి. సీతాదేవి వృత్తాంతము నేను ఎట్లా తెలుసుకొన్నదీ చెప్పుతాను.

"సూర్యతాపానికీ, సూర్యరశ్మికీ పూర్వము నా దేహము అంతా కాలిపోగానే నేను వింధ్యపర్వత శిఖరము మీద ఈ అరణ్యములో పడిపోయినాను. ఆరు అహోరాత్రములు నేను తెలివి లేకుండా ఇక్కడ పడి ఉన్నాను. ఆ తరువాత నాకు తెలివి అయితే వచ్చింది కాని నా దేహము నా స్వాధీనములో లేకపోయింది. మైకము కమ్ముకొన్నవాడివలె అయిపోయినాను. కన్నులు తెరచి అన్నిదిక్కులా పార చూచినాను. ఏ ప్రదేశములో నేను ఉందీ నాకు గుర్తు తెలియలేదు. సముద్రాలూ, సముద్రతీరాన ఉన్న కొండలూ, సమస్త నదులూ, సరస్సులూ, అడవులూ చూచినాను. ఈ పర్వత చరియలనూ, గుహలనూ, ఇక్కడ సంతోషముతో సంచారము చేస్తూ ఉన్న పక్షిగణాలనూ చూచినాను. ఇది దక్షిణ సముద్రతీరాన ఉన్న వింధ్యపర్వతము అని జ్ఞాపకము వచ్చింది. అంతా పరిశీలించి చూచి అదేను అని నిశ్చయించినాను.

"దేవతలు సయితము గౌరవించిన పుణ్యాశ్రమము ఒకటి ఈ ప్రాంతములో ఉండేది. ఆ పుణ్యాశ్రమములో మహోగ్రముగా తపస్సు చేసిన నిశాకర మహర్షి నివసిస్తూ ఉండేవాడు. నేను ఇది వింధ్యపర్వత శిఖరము అని తెలుసుకోగానే ఆ నిశాకర మహర్షిని పోయి చూడవలెను అనుకొన్నాను. ఈ పర్వతాగ్రమునుంచి మిట్టపల్లాలు ఎంతో కష్టపడి దిగినాను. కరకు అయిన దర్భలు ఉన్న నేలమీద అతి ప్రయాసతో నడిచినాను. ఆశ్రమము చేరినాను. ఆ దుఃఖ సమయములో ఆయనను చూడడము అవసరము అనుకొని అక్కడికి పోయినాను. అదివరకు నేనూ, నా తమ్ముడు జటాయువూ తరచు ఆ మహర్షి దర్శనము చేస్తూ ఉండేవాండ్లము.

"ఆ పుణ్యాశ్రమ పదములో పూలు పూయని చెట్టుకానీ, పండ్లు పండని చెట్టుకానీ ఒకటిన్నీ ఉండేదికాదు. అన్ని చెట్లూ అన్ని కాలాలూ పూలు పూస్తూనూ, పండ్లు పండుతూనూ ఉండేవి. నేను ఆ పుణ్యాశ్రమము సమీపానికి పోగానే సుగంధము గుబాళించింది. నేను మెల్లగా లోపలికి పోయినాను. ఆ మహర్షి దర్శనము చేయడానికి అక్కడ ఒక చెట్టు మొదటిలో కనిపెట్టుకొని కూర్చున్నాను.

"ఆ దుర్ధర్షుడు స్నానము చేసి జ్వలిస్తూ ఉన్న తేజస్సుతో ఉత్తరాభిముఖుడు అయి నాకు దగ్గరగా వచ్చినాడు. మేతవేసేవాడివెంట జంతువులు మూగేట్టుగా అప్పుడు ఆయన వెంట ఎలుగుబంట్లూ, చమరీ మృగాలూ, పెద్దపులులూ, సింహాలూ, ఏనుగులూ, నానాజాతుల పాములూ నడచినవి. రాజు అంతఃపురములోకి పోగానే చతురంగబలాలూ, మంత్రులూ వెనుకకు వెళ్ళిపోయేట్టు ఆ నిశాకర మహర్షి ఆశ్రమములోకి పోగానే ఆ జంతువులు అన్నీ వాటి వాటి తావులకు వెళ్ళిపోయినవి.

"ఆ మహర్షి నన్ను చూచినాడు. సంతోషముగా లోపలికి వెళ్ళిపోయినాడు. ఉత్తరక్షణాన లోపలినుంచి బయటికి వచ్చి, 'నీవు ఏమి పనిమీద వచ్చినావు?' అని ప్రశ్నిస్తూ, 'ఓ సౌమ్యుడా! నీ ఈకలు అన్నీ వికలము అయిపోయినవి. నీ రెండు రెక్కలూ తగులపడి పోయినట్లుగా ఉన్నవి. నీవు ఎవరవో తెలుసుకోలేకుండా ఉన్నాను. నీ చర్మము అంతా వ్రణము అయిపోయినది. ఇక్కడ నేను ఇదివరకు ఇద్దరు గద్దలరాజులను చూస్తూ ఉండేవాణ్ణి. వాండ్లు అన్నదమ్ములు. వాయుసమాన వేగముతో పోతుండేవాళ్లు. కామరూపులు.

"నాయనా! నీవు వాండ్లలో పెద్దవాడివి సంపాతివా? నీ తమ్ముడు జటాయువుకాదూ! మీరు ఇద్దరూ ఇదివరకు మనుష్యరూపముతో వచ్చి నాకు నమస్కారము చేస్తూ ఉండేవాండ్లు కాదూ!

"ఓ సంపాతీ! నీకు ఏమి అయినా జబ్బుచేసిందా? నీ రెక్కలు ఎందుకు పోయినవి? ఎవడు అయినా నీ రెక్కలు ఊడకొట్టినాడా? యథార్థము నాకు చెప్పు" అని ఆ నిశాకరమహర్షి నన్ను అడిగినాడు.

61

"సూర్యుణ్ణి వెంబడించడము పరమసాహసము. అది మహాభయంకరము అయిన పని. ఎవరూ చేయలేరు. అటువంటి పని మేము అన్నదమ్ములము చేసివేసినాము. అది అంతా ఆ మహర్షికి విన్నవించ తలచుకొన్నాను. అంతట ఆ నిశాకరమహర్షిని చూచి, 'ఓ మహాత్ముడా! నా దేహము అంతా వ్రణము అయిపోయినది. నా కీళ్ళు అన్నీ కదలిపోయినవి. నేను మహాబాధలో ఉన్నాను. చెప్పుకోడానికి సిగ్గు

వేస్తూ ఉంది. అందువల్ల తాము అడిగినదానికి జవాబు చెప్పలేకుండా ఉన్నాను: అయినప్పటికిన్నీ చెప్పుకొంటాను.

“వీరులము అయిన మేము అన్నదమ్ములము ఉభయులమూ పోటీ పడ్డాము. మాలో ఎవడు ఎక్కువ పరాక్రమవంతుడో తెలుసుకోవలెను అనుకొన్నాము. గర్వముతో ఒండ్లు ఎరగకుండా ఆకాశానికి ఎగిరినాము. కైలాసపర్వత శిఖరానికి పోయినాము. సూర్యుడు అస్తగిరి చేరేలోపల ఆ సూర్యుడి దగ్గరకు పోయేవాడు మాలో పరాక్రమవంతుడు అని అక్కడ మునుల ఎదుట పందెము కట్టినాము. ఏకకాలాన ఉభయులమూ పైకి ఎగిరినాము. మాకు అప్పుడు ఈ భూమిమీద ఉన్న పట్టణాలు అన్నీ వేరే వేరే బండి చక్రాలవలె కనిపించినవి. మేము అట్లా ఎగిరిపోతూ ఉండగా ఒకచోట వాద్యధ్వనులూ, వేదఘోషమూ వినిపించినవి. మరి ఒకచోట రక్తవస్త్రాలు ధరించిన స్త్రీలు పాటలు పాడుతూ ఉన్నవారు అనేకమంది కనిపించినారు. మేము వేగముగా ఆకాశవీధికి ఎగిరి ఆదిత్య పథానికి పోయినాము. మేము ఉన్న మహారణ్యము ఒక పచ్చికబయలువలె మాకు అక్కడికి కనిపించింది. పెద్ద పెద్ద పర్వతాలు భూమిమీద ఉన్న రాళ్ళవలెనూ, నదులు అన్నీ ఈ నేలమీదపడి ఉన్న తాళ్ళవలెనూ, హిమవత్పర్వతమూ, వింధ్యపర్వతమూ, మేరుపర్వతమూ జలాశయములో నిలుచున్న ఏనుగులవలెనూ కనిపించినవి. అప్పుడు మాకు అమితముగా చెమట పోసింది. భయము వేసింది. దిగులు పడిపోయినాము. చిత్తవిభ్రాంతులు అయిపోయినాము. కన్నులు కనిపించకుండా పోయినవి. ఒండ్లు తెలియకుండా పోయే భయంకరావస్థ వచ్చింది. దిక్కులు తెలియకుండాపోయినవి. నియమము తప్పి లోకము అంతా ప్రళయాగ్నికి దగ్ధము అయిపోతూ ఉన్నట్టు తోచింది. మనస్సు వికలము అయిపోయింది. కంటికి ఏమీ కనిపించకుండా పోయింది. ఎట్లాగో మనస్సు కుదుటతోసి మహాప్రయత్నముతో చూచినాము. ఎట్టఎదుట సూర్యుడు కనిపించినాడు. అప్పుడు అటు సూర్యుడు భూమి అంత ప్రమాణాన కనిపించినాడు. నా తమ్ముడు జటాయువు నాకు చెప్పకుండానే నేలమీద పడిపోతున్నాడు. ఆ క్షణము వరకూ వాడు అట్లాపడిపోతూ ఉన్న సంగతి నాకు తెలియనే తెలియదు. నేను వాడి దురవస్థ చూచి ఆకాశము వదలిపెట్టినాను. వాణ్ణి నా రెక్కలతో కప్పివేసినాను. అందువల్ల వాడు కాలిపోలేదు. నేను అప్పుడు వాయుపథమునుంచి పడుతూ మధ్యలో ఉన్న అగ్నిగోళాలను చూడని ఏమరుపాటువల్ల నేను తగులపడిపోయినాను. జటాయువు జనస్థానములో పడి ఉంటాడు అనుకొన్నాను.

“నేను రెండు రెక్కలూ కాలిపోయి ఒండ్లు తెలియకుండా ఈ వింధ్యపర్వతము మీద పడ్డాను. ఓ మహర్షీ! నా రాజ్యము పోయింది. నా తమ్ముడు పోయినాడు. నా

రెక్కలు పోయినవి. పరాక్రమహీనుణ్ణి అయిపోయినాను. అన్నివిధాల నాకు మరణమే మేలు అనిపిస్తూ ఉంది. నేను ఈ పర్వతశిఖరము నుంచి కిందపడి చచ్చిపోవలెను అనుకొంటున్నాను' అంటూ ఆ నిశాకరమహర్షితో చెప్పుకొన్నాను.

62

"ఆ మునిశ్రేష్ఠుడికి ఈవిధముగా విన్నవించి నేను అమిత దుఃఖముతో ఏడ్చినాను. ఆ మహాత్ముడు నిశాకరమహర్షి ధ్యానములోకి పోయి, 'ఓ సంపాతీ! నీకు మళ్లీ రెక్కలు వస్తవి. పిల్లరెక్కలూ వస్తవి. నీకు కొత్త ప్రాణము వస్తుంది. కొత్తకన్నులు వస్తవి. నీవు పరాక్రమవంతుడవు అవుతావు. బలవంతుడవు అవుతావు. నీవల్ల ఒక మహత్కార్యము నెరవేరవలసి ఉంది అని నేను ఇదివరకు విన్నాను. ఇప్పుడు తపోబలముతో చూచినాను. విదితము అయింది.

"ఇక్ష్వాకువంశములో దశరథమహారాజుకు రాముడు అనే మహాతేజోవంతుడు పుత్రుడుగా పుట్టుతాడు. అతడు నిజము అయిన పరాక్రమవంతుడు అవుతాడు. ఆ రాముణ్ణి అరణ్యవాసము చేయమని తండ్రి ఆజ్ఞాపిస్తాడు. అంతట ఆ రాముడు తమ్ముడు అయిన లక్ష్మణుడితోనూ, భార్య అయిన సీతాదేవితోనూ అరణ్యావాసానికి వస్తాడు. దేవదానవులకు ఎవరికీ జయించ నలవికాని రాక్షసరాజు రావణుడు అనేవాడు జనస్థానమునుంచి ఆ రాముడి భార్యను సీతాదేవిని అపహరించుకొనిపోతాడు. భోగద్రవ్యాలతోనూ, మంచి మంచి భక్ష్యాలతోనూ, భోజ్యపదార్థాలతోనూ వాడు ఆ యశస్వినిని, ఆ మహాపూజ్యురాలిని, ఆ మైథిలిని సీతాదేవిని ప్రలోభ పెట్టుతాడు. ఆ మహాపతివ్రత భర్తృ వియోగదుఃఖములో మునిగిపోయి వాటిని వేటినీ ముట్టుకోదు. దేవేంద్రుడు ఆ సంగతి తెలుసుకొని ఆమెకు దివ్యాన్నము పంపిస్తాడు. దేవతలకు సయితము దుర్లభము అయిన దివ్యాన్నాన్ని ఆమె తీసుకొని, అది దేవేంద్రుడు పంపించింది అని తెలుసుకొని, అందులో మొదటి ముద్ద తీసి, 'నా భర్త మహాప్రభువు రాముడు తన తమ్ముడు లక్ష్మణుడితో కూడా జీవించి ఉన్నా, దేవత్వము పొందినా వారికి ఈ కబళము చెందవలెను' అని నేలమీద ఉంచుతుంది.

"ఓ సంపాతీ! ఆ సీతాదేవిని వెతకడానికి రామదూతలుగా వానరులు బయలుదేరి వస్తారు. వారికి రామమహిషి ఎక్కడ ఉందీ నీవు చెప్పవలెను. అందుకోసము నీవు ఇక్కడే ఉండవలెను. నీవు ఇక్కడనుంచి ఎక్కడికీ పోవడానికి వీలు లేదు. అయినా నీవు రెక్కలు లేనివాడవు. ఎక్కడకు పోతావు? నీవు దేశకాలాలను ఎదురుచూస్తూ ఇక్కడనే ఉండవలెను. నీకు మళ్లీ రెక్కలు వస్తవి. నీకు ఇప్పుడే రెక్కలు వచ్చేట్టు చేయడము నాకు ఇష్టము లేదు. నీవు ఇక్కడనే

ఉండేట్లయితే లోకాలు అన్నిటికీ మేలు అయ్యేపని నీవు చేయకలుగుతావు. రామలక్ష్మణుల పని నీవు చేయవలెను. అది నీ కోసమేకాదు, బ్రాహ్మణుల కోసమూ, దేవతల కోసమూ, మహర్షుల కోసమూ నీవు ఆ పని చేయవలసి ఉంది. అంటే, వానరులకు సీతాదేవి ఎక్కడ ఉందీ నీవు చెప్పవలెను. నాకున్నూ ఆ అన్నదమ్ములను రామలక్ష్మణులను చూడవలెను అని చాలా కోరికగా ఉంది. అయితే బహుకాలము ఈ దేహముతో ఉండడము నాకు ఇష్టము లేదు. కాబట్టి ఈ దేహాన్ని త్యజించివేస్తాను' అని సమస్త విషయాలూ తెలిసిన ఆ నిశాకరమహర్షి నాతో చెప్పినాడు.

63

"వాక్యవిదులలో శ్రేష్ఠుడు అయిన ఆ నిశాకరమహర్షి ఈవిధముగానూ, ఇంకా ఎన్నోవిధాలుగానూ నన్ను మెచ్చుకొని, నాకు అనుజ్ఞ ఇచ్చి తన ఆశ్రమములోకి పోయినాడు.

"నేను మెల్ల మెల్లగా ఆ కొండచరియలోనుంచి పయికి పాకిపోయినాను. అప్పటినుంచి ఇక్కడ ఉంటూ మీ కోసము ఎదురుచూస్తూ ఉన్నాను. ఆ మహర్షి చనిపోయి బహుకాలము అయింది. అప్పటినుంచి నేటికి నూరు సంవత్సరాలు గడచిపోయినవి. నేను ఆ మహర్షి మాటలు మనస్సులో పెట్టుకొని దేశకాలాలు ఎదురు చూస్తూ ఉన్నాను. నిశాకరమహర్షి మహాప్రస్థానము చేసి స్వర్గతుడు అయి పోయిన తరువాత నేను అనేక సంశయాలతో బాధపడుతూ ఉన్నాను. నన్ను దుఃఖము దహించివేస్తూ ఉంది. చచ్చిపోవలెను అని నాకు బుద్ధి పుట్టుతూ ఉంటుంది. అయితే, నిశాకరమహర్షి చెప్పిన మాటలు జ్ఞాపకము వస్తవి. నా బుద్ధి మారిపోతూ ఉంటుంది. నేను బ్రతికి ఉండడము కోసము నాకు ఆ నిశాకరమహర్షి చెప్పిన మాటలు దేదీప్యమానము అయిన అగ్నిజ్వాలలు చీకట్లను పోగొట్టేటట్టు నా దుఃఖాన్ని పోగొట్టుతూ ఉంటవి.

"రావణాసురుణ్ణి ఎదిరించి సీతాదేవిని ఎందుకు కాపాడలేదు అని నేను ఆ దురాత్ముడి పరాక్రమము ఎరిగి ఉన్నప్పటికిన్నీ నా పిల్లవాణ్ణి కసరినాను."

ఈవిధముగా సంపాతి చెప్పుతూ ఉండగా, ఆ వానరులు అందరూ అతనిని చూస్తూ ఉండగా అతడికి రెక్కలు వచ్చినవి. ఎర్రని ఈకలతో తనకు రెక్కలు రావడము సంపాతి చూచుకొన్నాడు. తన శరీరాన్ని అంతా పరిశీలించుకొన్నాడు. అతనికి అంతులేని సంతోషము వేసింది. వానరులను అందరినీ చూస్తూ "ఓ వానరులారా! సూర్యరశ్మికి తగులపడిపోయిన నా రెక్కలు ఆ అమితాత్ముడు నిశాకర మహర్షి ప్రభావమువల్ల నాకు మళ్ళీ వచ్చినవి. నా యౌవనములో నేను

ఎటువంటి బలముతోనూ, పరాక్రమముతోనూ, పౌరుషముతోనూ ఉండేవాణ్ణో, ఇప్పుడు నేను అట్లా ఉన్నాను. ఓ వానరులారా! మీరు ప్రయత్నము చేయండి. తప్పకుండా మీరు సీతాదేవిని చూస్తారు. మీకు కార్యసిద్ధి అవుతుంది అనడానికి నాకు రెక్కలు రావడమే నిదర్శనము" అని సంపాతి వానరులతో చెప్పుతూ, తనకు అదివరకటివలె ఎగిరిపోయే శక్తి వచ్చిందో లేదో తెలుసుకోవలెను అనుకొని ఆ పర్వత శిఖరము మీదినుంచి ఆకాశానికి ఎగిరినాడు.

సంపాతి మాటలు విని, ఆ వానరవీరులు అందరూ సంతుష్టాంతరంగులు అయినారు. పరాక్రమముతో అభ్యుదయోన్ముఖులు అయినారు.

ఆ వానరులు అందరూ వారి వారి పరాక్రమాతిశయముతో వాయుదేవుడి వంటి వేగంతో జనకరాజసుతను సీతాదేవిని వెతకడానికి ప్రయాణము అయి అభిజిన్ముహూర్తము కోసము ఎదురు చూస్తూ దక్షిణదిశాముఖులు అయిపోయినారు.

64

లంకాపట్టణ ప్రయాణ సన్నాహము

సీతాదేవి లంకాపట్టణములో ఉంది అని సంపాతి చెప్పింది అంతా ఆ సింహపరాక్రములు వానరులు అందరూ విన్నారు. సంతోషాతిశయముతో ఎగిరిగంతులు వేసినారు. అందరూ ఒకచోటికి చేరి సింహనాదము చేసినారు. సీతాదేవిని చూడటానికి లంకాపట్టణము పోవలెను అనుకొంటున్నారు. సంతోషంగా సముద్రతీరానికి పోయినారు. ఆ దక్షిణ సముద్రపు ఉత్తరతీరాన ఆ మహాబలవంతులు అందరూ విడిది చేసినారు. సమస్త లోకాలకూ ప్రతిబింబము వంటి ఆ మహాసముద్రాన్ని ఆ భీమపరాక్రములు అందరూ చూచినారు.

ఆ సముద్రములో ఒకచోట అలలు ఆకాశము ఎత్తున లేస్తూ ఉన్నవి. ఒకచోట అలలు కొంచెము కొంచెము ఎత్తు లేస్తూ సమసిపోతూ ఆటలాడుతున్నట్లు కనిపించినవి. ఒకచోట కదలకుండా మెదలకుండా నీళ్ళు నిద్రపోతున్నట్టుగా కనిపించినవి. ఒకచోట జలరాశి పర్వత ప్రమాణాన పైకి లేస్తూ ఉంది. ఒకచోట వికృతము అయిన మహాకాయాలతో జలజంతువులు నోళ్లు తెరిచి క్రీడిస్తూ ఉన్నట్లు కనిపించినవి. పాతాళలోకములో ఉన్న దానవేంద్రులు ఆ మహాసముద్రాన్ని అట్లా కలతపెట్టుతున్నారేమోను అనిపించింది. ఆ వానరుల దేహాలు గగురుపాడిచినవి. వారికి అందరికీ భయము వేసింది. దిగులు వేసింది. అది ఆకాశమువలె అపారము అని వారికి తోచింది. అటువంటి మహాసముద్రాన్ని దాటి పోవడము ఎట్లాగా అని సందేహపడ్డారు. ఆ కపికుంజరులు అందరూ అంతట భయభ్రాంతులు అయినారు.

అట్లా భయపడిపోయిన ఆ వానరవీరులనూ, వానర సైన్యాన్ని ఆ సమయాన అంగదుడు చూచినాడు. ఆ మతిమంతుడు అంతట వారి అందరితోనూ, "ఓ వానర వీరులారా! మీరు భయపడవద్దు. దిగులు పడవద్దు. దిగులు పడడముకన్నా తప్పిదము మరి ఒకటి ఉండదు. కుపిత సర్పము బాలుణ్ణి చంపివేసేటట్లు దిగులు ఎంతటివాండ్లను అయినా హతమార్చి వేస్తుంది. పరాక్రమించవలసిన సమయములో దిగులు పడేట్లయితే పరాక్రమము అడుగు అంటిపోతుంది. పరాక్రమము కోలుపోయిన వాడికి ఏ పురుషార్థమూ సిద్ధించదు" అని చెప్పి, అప్పటికి వారిని అందరినీ సమాధాన పరిచినాడు.

ఆ రాత్రి గడచిపోయింది. అంగదుడు వానరవృద్ధులు అందరితోకూడా ఆలోచించి వానరయోధులను అందరినీ సమావేశ పరిచినాడు. దేవేంద్రుడి చుట్టూ దేవసైన్యమువలె, అంగదుడి చుట్టూ అప్పుడు ఆ వానర సైన్యము అంతా గుమికూడింది. ఆ వానరయోధుల సమూహాన్ని అంతా కట్టుదిట్టముగా ఉంచే శక్తి అంగదుడికీ, హనుమంతుడికీ తప్ప ఆ వానరులలో మరి ఎవరికీ లేదు. అప్పుడు ఆ అరిందముడు, ఆ కాంతిమంతుడు అంగదుడు వానరవృద్ధులను అందరినీ సన్మానించి వానర సైన్యాన్ని ఉద్దేశించి అర్థవంతముగా, "ఓ మహాతేజోవంతులారా! ఇప్పుడు మనలో ఎవడో ఒకడు ఈ మహాసముద్రాన్ని దాటి లంకాపట్టణము పోవలెను. అట్లా మనలో ఎవరో ఒకరు చేయగలిగితేనే సుగ్రీవుడు తన ప్రతిజ్ఞ చెల్లించుకొని సత్యసంధుడు అవుతాడు. నూరు యోజనాల సముద్రమూ లంఘించి పని సాధిస్తేనే మనకు సుగ్రీవుడి భయము లేకుండా పోతుంది. సుఖముగా మనము అందరమూ కిష్కింధకు పోయి మన ఇండ్లనూ, మన ఇల్లాండ్లనూ, మన బిడ్డలనూ చూడగలుగుతాము. సముద్రము దాటి లంకా పట్టణముపోయి వచ్చేవాడి అనుగ్రహము వల్లనే మనము సుగ్రీవుడి సన్నిధికీ, రామలక్ష్మణుల సన్నిధికీ పోవడానికి వీలు అవుతుంది. మీలో ఈ సముద్రము దాటిపోయి రాగలవారు ఇప్పుడు ముందుకు రావలెను. పవిత్రము అయిన అభయదక్షిణ నాకు ఇవ్వవలెను" అని చెప్పినాడు.

అంగదుడు చెప్పిన ఈ మాటలకు ఎవడూ ఏమీ పలుకలేదు. అందరూ కదలకుండా, మెదలకుండా నిశ్శబ్దముగా కూర్చున్నారు. అంతట ఆ వానరోత్తముడు అంగదుడు మళ్ళీ, "ఓ వానరులారా! మీరు అందరూ మేటి బలవంతులు. దృఢపరాక్రములు. ఉత్తమ వంశాలలో పుట్టినారు. అనేక సత్కారాలను అందుకొన్నారు. ఇప్పుడు మీరు వెనుక అంగ వేయవద్దు. ఓ వానరపుంగవులారా! మీరు ఇదివరకు ఎక్కడికి పడితే అక్కడికి, ఏ అంతరాయమూ లెక్క చేయకుండా పోయి వచ్చేవాండ్లు. ఎందుకో ఇప్పుడు ఊరకున్నారు. ఇది బాగాలేదు. మీరు ఎవరు, ఎంతదూరము ఎగిరిపోగలరో చెప్పవలెను" అన్నాడు.

65

వానరవీరులు అందరూ తమ తమ సామర్థ్యాన్ని గురించి యోచించుకొన్నారు. పది యోజనాల దూరము ఎగిరి పోగలను అని గజుడూ, ఇరవై అని గవాక్షుడూ, ముప్పయి అని గవయుడూ, నలభై అని గంధమాదనుడూ, అరవై అని మైందుడూ, డెబ్బై అని ద్వివిదుడూ, ఎనభై అని సుషేణుడూ చెప్పినారు. కాని ఒక్కడున్నూ తాను నూరు యోజనాల దూరము ఎగిరి పోగలను అని చెప్పలేదు.

అప్పుడు ఆ వానరులు అందరిలోనూ ముసలివాడు జాంబవంతుడు, "ఓ అంగదుడా! నాకు పూర్వము ఒకానొకప్పుడు గతి పరాక్రమము కొంత ఉండేది. ఇప్పుడు నా వయస్సు మళ్ళిపోయింది. ముసలివాణ్ణి అయిపోయినాను. మన ఏలిక సుగ్రీవుడూ, అతడికి పరమోపకారము చేసిన రాముడూ మనము ఈ పని చేసుకొని రాగలము అని నమ్మినారు. కాబట్టి, ఈ పనిని ఉపేక్షించడానికి వీలు లేదు. కాల భేదము నుంచి పూర్వము నాకు ఉన్న శక్తి ఇప్పుడు లేదు. కాని తొంభై యోజనాలు మాత్రము నేను ఎగిరి పోగలను. సందేహము లేదు.

"ఓ వానరులారా! నా గమనపరాక్రమము ఇంతమాత్రమేను అని మీరు అనుకొంటున్నారేమో! కాదు. పూర్వము బలిచక్రవర్తి యజ్ఞములో సనాతనుడు అయిన మహావిష్ణువు త్రివిక్రమావతారము ఎత్తి మూడు అడుగులూ ఉంచడానికి ముల్లోకాలూ అతిక్రమించినప్పుడు నేను ఆయనకు (అంటే బ్రహ్మాండానికి) ఇట్టే ప్రదక్షిణము చేసి వచ్చినాను. ఇప్పుడు మసలివాణ్ణి అయిపోయినాను. ఎగిరి పోవడములో మంద విక్రముణ్ణి అయిపోయినాను. నా యౌవనములో నాతోపాటు ఎగిరిపోయిన బలవంతుణ్ణి ఎవణ్ణీ నేను చూడలేదు. ఇప్పుడు నాకు ఎంత శక్తి ఉందోనని తర్కించుకొంటున్నాను. తొంభై యోజనాలు ఎగిరి పోగలను అని ధైర్యముగా చెప్పగలను. అయితే, అందువల్ల మనకు కావలసిన పని నెరవేరదు" అని చెప్పినాడు.

అప్పుడు అంగదుడు ఆ మహాప్రాజ్ఞుణ్ణి జాంబవంతుణ్ణి గౌరవించి వానర యోధులను అందరినీ చూచి, "ఓ వీరులారా! నేను నూరు యోజనాలు లంఘించగలను. అయితే, తిరిగి వచ్చే శక్తి, నాకు ఉంటుందో ఉండదో చెప్పలేకుండా ఉన్నాను. అయినప్పటికిన్నీ నేను పోయివస్తాను" అని చెప్పినాడు.

అంతట వాక్యకోవిదుడు జాంబవంతుడు లేచి, "నాయనా, అంగదుడా! నీవు వానరవీరులలోను, భల్లూకవీరులలోను శ్రేష్ఠుడవు. ఎగిరిపోయే సామర్థ్యము నీకు ఉంది. నాకు తెలుసును. నూరు యోజనాలే కాదు, నీవు వెయ్యి యోజనాలు

అయినా ఎగిరిపోయి తిరిగి సుఖముగా రాగలవు. సందేహము లేదు. అయితే, ఇటువంటి పనికి రాజును భృత్యులు పంపించడము అనుచితము. నాయనా! నీవు మాకు అందరికీ స్వామివి. ఈ వానరులలో ఎవరిని అయినా పోయిరమ్మని నీవు ఆజ్ఞాపించవచ్చును. సైనికులు తమ స్వామిని పంపించడానికి ఎప్పుడూ వీలులేదు. భార్యనువలె స్వామిని సైన్యము అంతా కాపాడవలెను. ఇది రాజధర్మము. నిన్ను మేము అందరమూ భార్యనువలె కాపాడుకోవలెను. ఈపనికి నీవు చెట్టుకు వేరువంటివాడవు. కార్యమూలాన్ని కాపాడుకోవడము కార్యవీరుల కర్తవ్యము. వేరు చెక్కు చెదరకుండా ఉంటేనే వృక్షము ఫలిస్తుంది. ఓ పరంతపా! నీవు బుద్ధిమంతుడవు. ధైర్యవంతుడవు. ఇప్పుడు ఇక్కడ ఈ పని సాధించడానికి నీవే మూలానివి. నీవు పూజనీయుడవు. రాజపుత్రుడవు. నిన్ను ఆశ్రయించుకొని మేము ఈ కార్యము నిర్వహించవలెను. నీవు లేకపోయేట్లయితే మేము ఏమి చేయగలము?" అని చెప్పినాడు.

జాంబవంతుడు చెప్పిన ఈ మాటలకు అంగదుడు, "ఓ జాంబవంతుడా! నేను పోకపోయేట్లయితేనూ, మరి ఒకడు ఎవడూ పోలేకపోయేట్లయితేనూ మనము అందరమూ మళ్లీ ప్రాయోపవేశము చేయవలసిందేను. సుగ్రీవుడి ఆజ్ఞను నెరవేర్చకుండా కిష్కింధకు పోయేట్టయితే మన ప్రాణాలు దక్కవు. ఆయనకు అనుగ్రహము వచ్చినా, ఆగ్రహము వచ్చినా అత్యర్థముగా ఉంటుంది. ఆయన ఆజ్ఞను (మాసం లోపల తిరిగిరమ్మన్న ఆజ్ఞను) అతిక్రమించినాము. ఇకను సీతాదేవిని అయినా చూడకుండా పోయేట్లయితే, ఆయన మనలను అందరినీ చంపివేస్తాడు. ఓ జాంబవంతుడా! నీవు సమస్తమూ తెలిసినవాడవు. ఈ పని చెడకుండా ఉండే ఉపాయము నీవే ఆలోచించవలెను. ఈ వానరులను అందరినీ నీవే కాపాడవలెను' అన్నాడు.

అంతట ఆ మహావీరుడు జాంబవంతుడు అంగదుడితో, "ఓ వీరుడా! నీ ఈ పనిలో ఏ కొంచెము లోపము జరగకుండా చేస్తాను. ఈ కార్యము సాధించుకొని రాగల సమర్థుణ్ణి లంకాపట్టణము పంపిస్తాను" అని బలానికీ, పరాక్రమానికీ, ఎగిరిపోవడానికీ ప్రసిద్ధి కెక్కిన హనుమంతుడి కోసము చూచినాడు. అతడు అప్పుడు ఏకాంతప్రదేశములో కూర్చుని ఉన్నాడు. సముద్రలంఘనానికి అతణ్ణి పురికొల్పడానికి జాంబవంతుడు పూనుకొన్నాడు.

66

హనుమంతుని వృత్తాంతము

అంతట ఆ జాంబవంతుడు హనుమంతుడి దగ్గర చేరి, "ఓ హనుమంతుడా! నీవు వానరవీరులు అందరిలోనూ మేటి వీరుడవు. సర్వశాస్త్ర విశారదుడవు. ఎందుకు

పలకకుండా ఊరక కూర్చున్నావు? నీకు ఈ విషయము ఏమాత్రమూ పట్టనట్టు ఏకాంతముగా కూర్చున్నావు, ఎందువల్ల? నీవు పరాక్రమానికీ, బలానికీ మన వానరరాజు సుగ్రీవుడితోనే కాకుండా, రామలక్ష్మణులతో సరిసమానము అయిన వాడవు. కశ్యపప్రజాపతికీ, వినతకూ పుట్టిన గరుత్మంతుడు పక్షులు అన్నిటిలోను శ్రేష్ఠుడు అని ప్రసిద్ధికెక్కినాడు. ఆ మహాబలవంతుడు, ఆ మహావేగుడు, ఆ మహాయశుడు గరుత్మంతుడు సముద్రములో నుంచి సర్పాలను ఎత్తుకొనిపోవడము నేను ఎన్ని పర్యాయములో చూచినాను. అతని రెక్కలకు ఎంతబలము ఉందో, నీ బాహువులకు అంతబలము ఉంది. పరాక్రమములోకానీ, వేగములోకానీ ఆ గరుత్మంతుడికి నీవు ఏమాత్రమూ తీసిపోవు.

"ఓ హనుమంతుడా! బుద్ధిబలములోను, దేహబలములోను, తేజములోను, పరాక్రమములోను ఈ ప్రాణికోటిలో నిన్ను మించింది ఏదీ లేదు. నిన్ను నీవు ఎరుగకుండా ఉన్నావు ఏమిటి? నాయనా! ముల్లోకాలలోను సాటిలేని అందకత్తె అని ప్రసిద్ధికెక్కింది, అప్సరసలలో ఉత్తమోత్తమురాలు అనే ఖ్యాతి సంపాదించింది, పుంజికస్థల అనే ఆ అప్సరాంగన శాపమువల్ల కుంజరుడు అనే వానరుడికి కూతురుగా పుట్టింది. ఆమె అంజనాదేవి. కామరూపిణి. కేసరుడు అనే వానరుడికి భార్య అయింది. ఆ అంజన వానరి అయినప్పటికిన్నీ సర్వాంగసుందరి. చిత్తము వచ్చిన రూపము ధరిస్తూ ఉండేది. ఒకానొకప్పుడు ఆమె మానవాంగన రూపము ధరించి, రూపయౌవనశాలిగా తేజరిల్లుతూ నానావిధాభరణాలు పెట్టుకొని, రంగు రంగు పూలదండలు వేసుకొని, మహార్హము అయిన పట్టుచీర కట్టుకొని వర్షాకాల మేఘమువంటి పర్వతము మీదికిపోయి విహరించ సాగింది. అట్లా పర్వతాగ్రముమీద విహరిస్తుంటే, ఆ విశాలాక్షి ఎర్ర అంచు పసుపుపట్టు చీరెను వాయుదేవుడు తొలగతోసినాడు. ఒక దానితో ఒకటి కలసి ఒరుసుకొనిపోతూ ఉన్న ఆమె గుండ్రటి తొడలను, బలిసి ఒకదానితో ఒకటి ఒరుసుకొనిపోతూ వున్న ఆమె స్తనాలను, వెడల్పూ నిడుపూ అయిన ఆమె పిరుదులను, సన్నటి ఆమె నడుమును, మనోహరము అయిన ఆమె సర్వాంగాలను వాయుదేవుడు చూచీ చూడటముతో కామమోహితుడు అయినాడు. ఆ సర్వాంగసుందరిమీద వాయుదేవుడికి మనస్సు పోయీ పోవడముతో మన్మథావేశపరవశుడు అయిపోయి, ఆమెను తన పొడుగాటి రెండు చేతులా కౌగిలించుకొన్నాడు.

"అంజన సువృత్త. ఆమె కలవరపడిపోయి, 'నా ఏకపత్నీ వ్రతము పాడుచేయ తలపెట్టినవాడు ఎవడు?' అని అడిగింది. అందుకు వాయుదేవుడు, 'ఓ సుశ్రోణీ!

నిన్ను నేను మోహించినాను. ఓ మనోజ్ఞురాలా! నీవు భయపడవద్దు. నా మనస్సు నీ మీదికి పోయింది. ఓ యశస్వినీ! అందువల్ల, నిన్ను నేను కౌగిలించుకొన్నాను. నీకు మహా బుద్ధిమంతుడూ, అమితపరాక్రమవంతుడూ అయిన పుత్రుడు పుట్టుతాడు. వాడు మహాతేజోవంతుడూ, మహాబలవంతుడూ, మహా ధైర్యవంతుడూ అవుతాడు. ఎంతమేర అయినా ఎగిరి పోవడములోను, దాటిపోవడములోను నాతో సరిసమానము అయినవాడు అవుతాడు' అని చెప్పినాడు. ఆమె వాయుదేవుడు చెప్పిన మాటలు విన్నది. సంతుష్టురాలు అయినది.

"ఓ మహాబాహూ! మీ అమ్మ అంజనాదేవి నిన్ను ఒక కొండ గుహలో కన్నది. నీవు అప్పుడు బాలుడవు. సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఆ సూర్యబింబము ఆ మహారణ్యములో ఒక పండు అని నీవు అనుకొన్నావు. ఆ పండుపట్టుకోడానికి ఎగిరి ఆకాశములో మున్నూరు యోజనాల దూరము పోయినావు. సూర్య తేజానికి నీవు ఏమాత్రమూ సొక్కిపోలేదు.

"నాయనా! నీవు అట్లా అంతరిక్షములో అంతవేగముగా ఎగిరిపోవడము దేవేంద్రుడు చూచినాడు. ఆ ధీమంతుడికి కోపము వచ్చింది. అంతట నీమీద వజ్రాయుధము వదలినాడు. ఆ వేటుకు అక్కడ నుంచి నీవు పర్వత శిఖరము మీద పడ్డావు. నీ ఎడమ చెక్కిలి విరిగిపోయినది. అందువల్లనే నిన్ను అందరూ హనుమంతుడు అని పిలుస్తున్నారు.

"ఓ హనుమంతుడా! నిన్ను దేవేంద్రుడు అట్లా వజ్రాయుధముతో కొట్టడమూ, నీవు పడిపోవడమూ నీ తండ్రి వాయుదేవుడు చూచినాడు. సమస్త గంధాలనూ మోసుకొని పోయి ముల్లోకాలవారినీ సంతోషపెట్టుతూనూ, ఉత్సాహముతో చెలరేగి చెట్లను, గుట్టలను సమస్తము అయినవాటినీ ఛిన్నాభిన్నము చేసివేస్తూనూ ఉండే వాయుదేవుడు నీ తండ్రి పరమ కుపితుడు అయినాడు. ముల్లోకాలలోనూ గాలి వీచడము మానివేసినాడు. ముల్లోకాలూ స్తంభించిపోయినవి. అందుకు లోకనాథులు అయిన సురలు అందరూ సంభ్రాంతులు అయిపోయినారు. అంతట వాయుదేవుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకోడానికి దేవతలు అందరూ పూనుకొన్నారు. బ్రహ్మదేవుడు నీవు ఏ ఆయుధానికిన్నీ చావకుండా ఉండేట్టుగా వరము ఇచ్చినాడు. సహస్రాక్షుడు దేవేంద్రుడు తన వజ్రాయుధము వేటుకు నీవు నొవ్వకుండా ఉండడము చూచి సంతోషించి, నీ చిత్తము వచ్చినప్పుడే నీవు చనిపోయేటట్టుగా ఉత్తమోత్తమము అయిన వరము నీకు ఇచ్చినాడు. వాయుదేవుడు ప్రసన్నుడు అయినాడు. ఓ హనుమంతుడా! నీవు ఈ విధముగా పరమశక్తిమంతుడవు అయినావు.

"ఓ హనుమంతుడా! నీవు వాయుదేవుడికి ఔరసపుత్రుడవు. కేసరికి క్షేత్రజ పుత్రుడవు. భయంకరము అయిన పరాక్రమవంతుడవు. పరాక్రమములో నీవు వాయుదేవుడితో సరిసమానము అయినవాడవు. నీవు సాక్షాత్తూ వాయుదేవుడి పుత్రుడవు అయినందువల్ల, ఆ వాయుదేవుడివలె నీవు ఎక్కడికి అయినా ఎగిరిపోగలవు. సామర్థ్యమూ, పరాక్రమమూ రెండూ ఉన్న వాడవు. మరొక గరుత్మంతుడవు. ఇప్పుడు మా అందరి ప్రాణాలూ పోయేట్టుగా ఉన్నవి. నీవే ఇప్పుడు మమ్ములను అందరినీ రక్షించవలెను. మహావిష్ణువు త్రివిక్రమావతారము ఎత్తినప్పుడు పర్వతాలతోనూ, మహారణ్యాలతోనూ ఉన్న ఈ పృథ్వికి నేను ముయ్యేడుమార్లు ప్రదక్షిణము చేసినాను. అమృత మథన మప్పుడు దేవతలు ఆజ్ఞాపిస్తే నేను ఈ జగత్తులో ఉన్న సమస్త ఓషధులూ పోగుచేసుకొని పోయి ఆ పాల సముద్రములో పడవేసి వచ్చినాను. నాకు అప్పుడు అంత గమనశక్తి ఉండేది. నేను ఇప్పుడు ముసలివాణ్ణి అయిపోయినాను. నా పరాక్రమము క్షీణించిపోయింది. ఈ కాలానికి మాలో సమస్త శక్తులూ ఉన్నవాడవు నీవు ఒక్కడవే. నీవు ఇప్పుడు నీ అతి పరాక్రమము చూపించవలెను. నీవు విజృంభించవలెను. నీవు తప్ప మనలో మరి ఒకడు ఈ సముద్రాన్ని దాటిపోలేడు. ఈ వానర వాహిని అంతా నీ పరాక్రమాన్ని చూడవలెను అనుకొంటున్నది.

"ఓ వానర శార్దూలమా! లే! ఈ మహాసముద్రాన్ని లంఘించు. ఓ హనుమంతుడా! నీ గమనశక్తి ఏ ప్రాణికీ లేదు. నాయనా! వానరులు అందరూ విషణ్ణులు అయి ఉన్నారు. ఎందుకు ఉపేక్షిస్తావు? నీవు మహావేగముతో పోగలవు. మహావిష్ణువువలె ఈ మహా సముద్రాన్ని మూడు అడుగులలో దాటిపో" అని చెప్పినాడు.

జాంబవంతుడు చెప్పిన ఈ మాటలు హనుమంతుడు విన్నాడు. తాను ఎంత వేగవంతుడో తెలుసుకొన్నాడు. అంతట ఆ వానరవాహిని అంతా హర్షించేట్టుగా హనుమంతుడు దేహాన్ని పెంచి మహదాకారముతో కనిపించినాడు.

67

ఆంజనేయుని లంకాపట్టణ ప్రయాణము

నూరు యోజనాల సముద్రాన్ని లంఘించడానికి పరాక్రమముతో గబాగబా పెరిగిపోతూ ఉన్న ఆ వానరోత్తముణ్ణి హనుమంతుణ్ణి వానరులు అందరూ చూచినారు. వారి అందరి దిగులూ వదలిపోయింది. సంతోషాతిశయముతో ఆ వానరులు అందరూ సింహనాదాలు చేసినారు. ఆ మహాబలవంతుణ్ణి అందరూ పొగడినారు. త్రివిక్రమావతారము ఎత్తినప్పుడు శ్రీమన్నారాయణమూర్తివలె హనుమంతుడు

పెరిగిపోయినాడు. అప్పుడు ఆ మహాత్ముణ్ణి హనుమంతుణ్ణి వానరులు అందరూ అన్ని వైపుల నుంచీ చూచినారు. ఆశ్చర్యపడిపోయినారు. సంతోషపడ్డారు. వానరవృద్ధులు అతనిని స్తోత్రము చేయసాగినారు. అట్లా అందరూ స్తోత్రము చేస్తూవుంటే హనుమంతుడు అంతట తోక ఆడిస్తూ అపరిమితముగా దేహాన్ని పెంచివేసినాడు. పర్వతగుహలో సింహమువలె విజృంభించినాడు. అప్పుడు ఆ మహానుబావుడి ముఖము మధ్యాహ్న సూర్యబింబమువలెనూ, పొగలు లేశము అయినా లేకుండా జ్వలిస్తున్న అగ్నిహోత్రమువలెనూ దేదీప్యమానముగా కనిపించింది.

ఆ వానరుల మధ్యను లేచి నిలుచుని ఉన్న హనుమంతుడి దేహము మీది వెంట్రుకలు సంతోషాతిశయమువల్ల నిక్కపొడుచుకొన్నవి. అప్పుడు అతడు వానరవృద్ధులకు అందరికీ నమస్కారము చేసినాడు. ఆ వానర సైన్యాన్ని అంతా చూచి, "ఓ వానరోత్తములారా! వాయుదేవుడు అగ్నిహోత్రుడి చెలికాడు. అమిత బలవంతుడు. గమనశీలుడు. ఇంత అంత అని కొలవడానికి అలవికాని శక్తిమంతుడు. ఆకాశములో సంచరిస్తూ ఉంటాడు. పర్వత శిఖరాలను సైతము విరిచివేస్తూంటాడు. నేను ఆ శీఘ్రగామి పుత్రుణ్ణి. అందువల్ల, ఎగిరిపోవడములో నాతో సరిసమానము అయినవాడు ఎవడూ లేడు. ఆకాశాన్ని ఒరుసుకొని పోయ్యిన మహామేరుపర్వతము అతి విశాలము అయింది. నేను ఆ పర్వతము చుట్టూ ఇట్టే వెయ్యిమార్లు తిరిగి రాగలను. నేను నా బాహువులతో సముద్రజలాలను తోసివేసి పర్వతాలతోనూ, నదులతోనూ, సరస్సులతోనూ ఉన్న ఈ భూమండలాన్ని ఆ సముద్రజలాలలో మునిగిపోయేట్లు చేయగలను. నేను పోయే వేగానికి సముద్రజలాలు పైకి లేస్తవి. అందువల్ల, ఆ సముద్రజలాలలో ఉండే మహాగ్రాహాలు అన్నీ ఆకాశములో కనబడుతవి. ఆహారము కోసము పాములను పట్టుకోడానికి అమిత వేగముతో ఆకాశములో గిర్రున తిరిగే గరుత్మంతుడి చుట్టూ వెయ్యిమార్లు గిర్రున తిరిగి వచ్చే శక్తి నాకు ఉంది.

"సూర్యుడు ఉదయ పర్వతము మీదనుంచి బయలు దేరగానే, నేనూ బయలుదేరి ఆ సూర్యుడికన్నా ముందుగా అస్తగిరికి పోయి అక్కడనుంచి మళ్లీ బయలుదేరి సూర్యుడు ఆకాశ మధ్యములో జ్వలించేటప్పుడు ఆయనకు ఎదురుపడి, కిందికి దిగి ఈ భూమిమీద విశ్రమించకుండా మళ్ళీ భయంకరము అయిన వేగముతో సూర్యుడికి ఎదురుపోగలను. అంతేకాదు, ఆకాశములో సంచారముచేసే ప్రాణులు అన్నిటికంటెనూ నేను వేగముగా పోగలను.

"ఓ వానరులారా! నేను సముద్రాన్ని క్షోభపెట్టగలను. ఈ భూమిని చీల్చి వేయగలను. పర్వతాలను చూర్ణము చేయకలను. నేను ఎగిరిపోయేటప్పుడు నా

తొడల వేగానికి సముద్రము నా వెంట బయలు దేరుతుంది. నేను ఇప్పుడు ఆకాశానికి ఎగరగానే ఇక్కడి తరులతాదులు, పూలు అన్నీ నాతోబాటు ఎగిరి నా వెంటపడుతవి. అట్లా నా వెంటపడి వచ్చే పూలనుంచి నేను పోయే ఆకాశవీధి స్వాతీపథముగా కనబడుతుంది.

"ఓ వానరులారా! నేను ఆకాశానికి ఎగరడమూ, ఆకాశవీధిలో పోవడమూ, ఆకాశవీధినుంచి దిగడమూ ఏకకాలాన జరిగిపోయినట్టుగా సమస్త ప్రాణికోటికీ కనబడుతుంది. నేను మహామేఘము అంతటి శరీరముతో ఆకాశాన్ని మింగివేసేవాడివలె ఆకాశాన్ని ఆవరించి పోతూ ఉన్నట్టు మీకు కనబడుతాను. నేను పూనికతో ఎగిరిపోతూ ఉంటే మేఘాలు అన్నీ చెల్లాచెదురు అయిపోతవి. పర్వతాలు అన్నీ కంపించిపోతవి. సముద్రము క్షోభపడిపోతుంది. నావలె ఎగిరిపోయే సామర్థ్యము వాయుదేవుడికీ, గరుత్మంతుడికీ తప్ప మరి ఎవరికీ లేదు. నేను ఆకాశములో పోతూ ఉంటే ఎగిరి నన్ను వెంబడించకలవాండ్లు వాయుదేవుడూ, గరుత్మంతుడూ తప్ప మరి ఒక ప్రాణి లేదు. మేఘాలలో మెరుపువలె నేను రెప్పపాటులో ఆధారములేని ఆకాశములోకి ఎగిరిపోతాను. నేను సముద్రము దాటిపోయేటప్పుడు త్రివిక్రమావతారములో మహావిష్ణువు ఆకారము మాదిరిగా ఉంటుంది.

"ఓ వానరులారా! నేను సీతాదేవిని చూస్తాను అని నా బుద్ధికి దృఢముగా తోస్తూ ఉంది. మీరు ఇక్కడ సంతోషముగా ఉండండి. నేను పదివేల యోజనాల దూరము పోగలను అనుకొంటున్నాను. వజ్రాయుధము ధరించే దేవేంద్రుణ్ణి అయినా, స్వయంభువు అయిన బ్రహ్మదేవుణ్ణి అయినా నా పరాక్రమముతో ఇట్టే జయించి, వారి చేతులలోనుంచి అమృతాన్ని పెళ్ళగించి తీసుకొని రాగలను అనుకొంటున్నాను" అని హనుమంతుడు గర్జించినాడు.

ఆ అమితపరాక్రమవంతుణ్ణి హనుమంతుణ్ణి చూచి వానరులు అందరూ పరమసంతుష్టులు అయినారు. విస్మితులు అయినారు. వానరుల అందరి దిగులూ పోగొట్టుతూ హనుమంతుడు చెప్పిన మాటలు జాంబవంతుడు విని పరమ సంతోషముతో, "ఓ వీరుడా! ఓ వాయుపుత్రుడా! నీవు ఇప్పుడు నీ బంధువులు అయిన సమస్త వానరుల దుఃఖమూ పోగొట్టినావు. వానరులు అందరూ నీ శుభము కోరుతూ ఉన్నారు. నీవు మంగళప్రదముగా ఉండడానికి పూనికతో ఇక్కడ భగవద్ధ్యానము చేస్తూ ఉంటారు. మహర్షుల అనుగ్రహమువల్లనూ, పెద్దల అనుగ్రహమువల్లనూ, కపివృద్ధుల ఆశీర్వాదమువల్లనూ నీవు ఈ మహాసముద్రాన్ని తప్పకుండా దాటిపోతావు. నాయనా! నీవు తిరిగి వచ్చే వరకున్నూ మేము అందరమూ

ఒంటికాలిమీద నిన్ను ఎదురు చూస్తూ ఉంటాము. వానరుల అందరి ప్రాణాలూ నీ చేతులలో ఉన్నవి" అని చెప్పినాడు.

హనుమంతుడు అప్పుడు ఆ వానరులను అందరినీ చూస్తూ, "నేను లంఘించే వేగానికి ఈ భూమి తట్టుకోలేదు. ఈ మహేంద్రపర్వత శృంగాలు కాళ్ళతో దృఢముగా ఉన్నవి. కాబట్టి ఈ పర్వతప్రదేశము నా వేగానికి నిలుస్తుంది. వివిధవృక్షాలతోనూ, వివిధధాతువులతోనూ శోభిస్తున్న ఈ మహేంద్రపర్వత శిఖరాల మీదికి ఇప్పుడే వెళ్ళిపోతున్నాను. నేను ఇక్కడనుంచి నూరు యోజనాలు దాటిపోవలెను. అట్లా పోవటానికి నేను ఎగురుతూ ఉంటే నా పాదాల తొక్కిడికి ఈ మహేంద్ర పర్వతము ఆగుతుంది" అని చెప్పినాడు.

అంతట ఆ శత్రుమర్దనుడు వాయుపుత్రుడు హనుమంతుడు మహేంద్రపర్వతము మీదికి పోయినాడు. ఆ మహేంద్రపర్వతము మీద నానావిధ వృక్షాలూ శోభాయమానముగా పెరుగుతూ ఉన్నవి. అక్కడ పచ్చికల బయళ్ళలో మృగాలు యథేష్టముగా తిరుగుతూ ఉన్నవి. ఎక్కడ చూచినా పూలతీగలు పూలు పూస్తూనూ, పండ్లచెట్లు కాయలు కాస్తూనూ కనిపించినవి. సింహశార్దూలాలు నిర్భయముగా తిరుగుతూ ఉన్నవి. వివిధఫలరసాలూ ఆస్వాదించి మత్తెక్కిన పక్షి సంఘాలు మనోహరముగా పాటలు పాడుతూ ఉన్నవి. తేటనీళ్ళతో సెలయేళ్ళు పారుతూ ఉన్నవి. ఆ మహేంద్ర పర్వతముమీద మహేంద్రుడితో సరిసమానము అయిన ఆ మహాబలవంతుడు అటూ ఇటూ పచార్లు చేయసాగినాడు.

ఆ మహాబలవంతుడు హనుమంతుడి పాదాల త్రొక్కిడికి ఆ మహేంద్రపర్వతము నలిగిపోయి సింహముచేత దెబ్బతిన్న మదపు టేనుగువలె కనిపించింది.

హనుమంతుడి పాదఘట్టనలకు అక్కడి రాళ్ళగుట్టలు చెల్లాచెదురు అయిపోయినవి. ఆ రాళ్ళలోనుంచి జలప్రవాహాలు బయలుదేరినవి. జింకలూ, ఏనుగులూ భయపడి పరుగులెత్త సాగినవి. మహావృక్షాలు అన్నీ కంపించిపోయినవి. పానమత్తులు అయి అక్కడ విహరిస్తూ ఉన్న నాగ దంపతులూ, గంధర్వ దంపతులూ, విద్యాధర దంపతులూ భయపడి ఆ పర్వత సానువులు వదిలిపెట్టి పరుగులెత్త సాగినారు. పక్షులు గుంపులు గుంపులుగా ఎగిరిపోయినవి. కదిలిపోయిన రాళ్ల కలుగులలోనుంచి మహాసర్పాలు సగము సగము బయటికి వచ్చి బుసలుకొట్టుతూ, పడగలు విప్పి చూస్తూ ఉంటే, ఆ పర్వత శిఖరము మీద పతాకాలు ఎత్తినట్లు కనిపించినవి.

అక్కడ ఉంటూ ఉన్న మహర్షులు అందరూ భయభ్రాంతులు అయి ఆ ప్రదేశము వదలిపెట్టిపోయినందువల్ల మహారణ్యములో తోటిజనులు అందరూ వదలిపెట్టిపోయిన బాటసారివలె అప్పుడు మహేంద్ర పర్వతము కనిపించినది.

అప్పుడు ఆ పరవీరహంత, ఆ మహానుభావుడు, ఆ యశస్వి, ఆ వానర వీరుడు, అమితవేగముతో సముద్ర లంఘనానికి పూనుకొన్న ఆ హనుమంతుడు దృఢమనస్కుడు అయినాడు. మనసా లంకాపట్టణానికి పోయినాడు.

కిష్కింధాకాండ సమాప్తము

సుందరకాండ

సుందరకాండ

1

హనుమంతుని లంకా ప్రయాణము

జాంబవంతుడు ప్రోత్సాహము చేసినందువల్ల సముద్రము దాటిపోయే విషయములో హనుమంతుడు తన శక్తిని తెలుసుకొన్నాడు. అంతట ఆ శత్రుకర్శనుడు, రావణాసురుడు ఎత్తుకొనిపోయిన సీతాదేవి ఎక్కడవుందీ వెతకడానికి దేవగాయకులు అయిన చారణులు సంచారము చేసే ఆకాశమార్గాన పోవలెను అనుకొన్నాడు. ఆ దుర్ఘట కార్యాన్ని తోడు లేకుండానూ, సాటి లేకుండానూ సాధించ తలచుకొన్నాడు. ఆ మహేంద్రపర్వతముమీద నిలుచుని మెడ నిక్కపెట్టి తల ఎత్తి ఆబోతువలె అమిత దర్పముతో సముద్రాన్ని చూడసాగినాడు.

ఆ ధైర్యవంతుడు, ఆ మహాబలవంతుడు హనుమంతుడు వైఢూర్యమణుల వలెనూ, సముద్రజలాలవలెనూ ఉన్న అక్కడి పచ్చిక బయళ్లలో అటూ ఇటూ పచార్లు చేసినాడు. పక్షులను బెదిరించినాడు. పెద్దపెద్ద చెట్లను ఎదురురొమ్ములతో పడతోసినాడు. చెలరేగిన సింహమువలె అనేక మృగాలను హతమార్చినాడు.

ఆ మహేంద్రపర్వతములో వివిధ ధాతువులూ స్వతస్సిద్ధముగా ఉన్నవి. అందువల్ల నీలమువన్నెలతోనూ, ఎర్రటిరంగుతోనూ, ఆకుపచ్చరంగుతోనూ, పసుపుపచ్చరంగుతోనూ, తెలుపూ నలుపూ కలిసిన బూడిదరంగుతోనూ అలంకరించి నట్టు ఆ పర్వతము శోభాయమానముగా కనపడుతూ ఉంటుంది. కామరూపులు అయిన యక్షులూ, కిన్నరులూ, గంధర్వులూ, దేవతలతో సరిసమానము అయిన పన్నగులూ చక్కగా అలంకరించుకొని అక్కడ కన్నుల పండుగగా విహరిస్తూ వుంటారు. ఉత్తమోత్తమము అయిన మదపుటేనుగులకు అది ఉనికిపట్టు. అప్పుడు ఆ మహేంద్రపర్వతముమీద నిలుచుని ఉన్న ఆ హనుమంతుడు పెద్దమడుగు మధ్యను నిలుచున్న మదపుటేనుగువలె కనిపించినాడు.

హనుమంతుడు అక్కడినుండి ఎగిరిపోవలెను అనుకొన్నాడు. సూర్యుడికీ, ఇంద్రుడికీ, వాయుదేవుడికీ, బ్రహ్మదేవుడికీ, పంచ మహాభూతాలకూ నమస్కారము చేసినాడు. అంతట రామాభ్యుదయము కోసము దక్షిణ దిక్కుకు ఎగిరిపోవడానికి

కృతనిశ్చయుడు అయినాడు. తూర్పు దిక్కుకు తిరిగి తన జన్మకు కారణభూతుడు అయిన వాయుదేవునికి మళ్ళీ నమస్కారము చేసినాడు. పర్వసమయములో పొంగే మహాసముద్రము వలె వానరులు అందరూ చూస్తూ ఉండగా హనుమంతుడి దేహము అంతులేకుండా పెరిగింది.

అట్లా అపరిమితముగా తన కాయాన్ని పెంచిన హనుమంతుడు తన చేతులతోనూ, కాళ్ళతోనూ ఆ మహేంద్రపర్వతాన్ని కుదిలించినాడు. ఎప్పుడూ కదలని ఆ మహేంద్రపర్వతము అప్పుడు ఒక ముహూర్తము సేపు కదలుతూ ఉండిపోయింది. ఆ కుదుపుకు అక్కడ చెట్లన పూసిన పూలు అన్నీ రాలి ఆ పర్వతాన్ని అంతా కప్పివేసినవి. ఘుమఘుమ వాసనలు గుబాళిస్తూ అప్పుడు అది అచ్చము పూలకొండవలె తోచింది.

ఆ మహాపరాక్రమవంతుడు హనుమంతుడు కుదిలించిన కుదుపుకు మదపుటేనుగు కార్చే మదధారలవలె ఆ మహేంద్రపర్వతములో నుంచి జలధారలు కారినవి. ఆ కుదుపుకు రాళ్ళు అన్నీ విచ్చిపోయి బంగారూ, వెండీ, ఇనుమూ చారికలు ఆ మహేంద్ర పర్వతముమీద అప్పుడు అగుపించినవి. భగభగమండే అగ్నిహోత్రమధ్య జ్వాలలోనుంచి పొగలు పైకి లేచేటట్టు ఆ పర్వతశిఖరము మీదనుంచి నల్లటి మనశ్శిలల బండలు పైకి రేగినవి.

ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఆ మహేంద్ర పర్వతాన్ని అట్లా కుదిలిస్తూఉంటే, ఆ కుదుపుకు ఆ పర్వతగుహలలో ఉంటూ ఉన్న జంతువులు అన్నీ భయంకరముగానూ, వికృతముగానూ అరచినవి. ఆ జంతువుల అరుపులు అక్కడి వనాలలో మారు మ్రోగడమే కాకుండా, ఈ భూమిమీద దిగంతాలవరకూ వినిపించినవి. ఆ పర్వతము మీద ఉంటూ ఉన్న మహాసర్పాలు స్వస్తిక చిహ్నాలు కనబడేటట్టు పెద్ద పెద్ద పడగలు విప్పి నిప్పులు కక్కుతూ కోరలతో అక్కడి రాళ్ళను కరిచివేసినవి. ఆ కుపితసర్పాలు వేసిన కాట్లకు ఆ రాళ్ళు అన్నీ భగ భగ మండుతూ ముక్కలు ముక్కలుగా పగిలిపోయినవి. అటువంటి విషాగ్నిని హరించే ఓషధులు ఎన్నో ఆ పర్వతముమీద ఉన్నప్పటికిన్నీ, అవి ఏవీ ఆ సమయాన ఆ విషాగ్ని జ్వాలలను చల్లార్చలేకపోయినవి.

ఆ కుదుపుకు ఆ పర్వతముమీద ఉంటూ ఉన్న తాపసులు పృథివ్యాది భూతాలతో ఆ మహేంద్రపర్వతము బ్రద్దలు అయిపోతూ ఉంది అని భయపడ్డారు. ఒంటినిండా రక్తచందనము పూసుకొని మెడలలో ఎర్రటి పూలదండలు వేసికొని, తమతమ ప్రియురాండ్రతో అప్పుడు, అక్కడ మద్యపానము చేస్తూ ఉన్న విద్యాధరులు భయభ్రాంతులు అయిపోయి, చేతులలో ఉన్న పానపాత్రలనూ, మహా విలువయిన

భోజన పాత్రలనూ, బంగారు చెంబులనూ, రుచ్యములయిన లేహ్యాలనూ, రకరకాల భక్ష్యాలనూ, వివిధ మాంసాలనూ, ఎద్దుతోలు వేసిన డాళ్ళనూ, బంగారు పిడులు వేసిన ఖడ్గాలనూ అక్కడనే, ఆ పానభూమిలోనే వదలిపెట్టి ముత్యాలకంఠహారాలతోనూ, అందెలతోనూ, బాజుబందులతోనూ, కంకణాలతోనూ కళకళలాడుతున్న తమతమ ప్రియురాండ్రను వెంటవేసుకొని పైకి ఎగిరినారు. మహావిద్యా ప్రభావమువల్ల (అణిమాద్యష్టసిద్ధులవల్ల) ఆ విద్యాధరులు అట్లా ఎగిరిపోయి ఆధారము ఏమీలేని ఆకాశములో నిలుచుని తమతమ ప్రియురాండ్రను వెంటతెచ్చుకున్నందుకు సంతోష పడుతూను, ఆ మహేంద్రపర్వతము అట్లా కదులుతూ వున్నందుకు ఆశ్చర్యపడుతూను మద్యపానమువల్ల ఎర్రటి తామరరేకులవంటి కన్నులతో క్రిందికి చూడసాగినారు.

అప్పుడు ఆ పర్వత గుహలలో ఆత్మధ్యాన నిమగ్నులు అయి ఉన్న పరమర్షులు ఆకాశంలో నిలుచుని ఉన్న విద్యాధరులతో, "ఓ విద్యాధరులారా! అడుగో, ఆ పర్వతాకారుడు వాయుదేవుడి పుత్రుడు హనుమంతుడు. తిమి తిమింగలాలతో ఉన్న సముద్రాన్ని అమిత వేగముతో దాటిపోవలెను అనుకుంటున్నాడు. రామాభ్యుదయము కోసమూ, రామాభ్యుదయము కాంక్షిస్తూ ఉన్న వానరుల కోసమూ ఈ హనుమంతుడు మహాదుర్ఘట కార్యము తలపెట్టినాడు. ఎవరికీ దాటనలవికాని సముద్రాన్ని దాటి అవతలిగట్టుకు పోవలెను అనుకొంటున్నాడు" అని చెప్పినారు. ఆ మాటలు విద్యాధరులు విన్నారు. ఇంత అంత అని నిర్ణయించ నలవికాని ఆకారములో పెరిగిపోయిన హనుమంతుణ్ణి ఆ మహేంద్రపర్వతము మీద చూచినారు.

అప్పుడు ఆ పర్వతాకారుడు హనుమంతుడు ఒళ్లు విరిచినాడు. అతని ఒంటిమీద రోమాలు అన్నీ నిక్కపొడుచుకొన్నవి. అంతట మహామేఘమువలె గర్జించినాడు. గరుత్మంతుడు పామును విదిలించినట్లు హనుమంతుడు దట్టముగా పెరిగిన వెంట్రుకలతో చుట్టచుట్టుకొని ఉన్న తన తోకను విదిలించినాడు. అట్లా విదిలించిన ఆ హనుమంతుడి తోక ఆకాశములో గరుత్మంతుడు ఎత్తుకొనిపోతూ ఉన్న మహాసర్పమువలె కనిపించింది.

అంతట హనుమంతుడు ఎగిరిపోతలచి ఇనుప గుదియలవంటి తన బాహువులను ముందుకు పారచాచి బిగపట్టినాడు. నడుమును కుంచించినాడు. కళ్ళను ముణుచుకొన్నాడు. ఆ కాంతిమంతుడు, ఆ వీర్యవంతుడు అంతట తన భుజాలనూ, మెడనూ వంచి తనలో ఉన్న శక్తినీ, సామర్థ్యాన్నీ, పరాక్రమాన్నీ ఆవేశింపచేసుకొన్నాడు. కనుచూపుమేరవరకు ఆ దారిని తేరిపార చూచినాడు. ప్రాణవాయువును హృదయములో బంధించినాడు. శ్రవణేంద్రియాలను స్తంభింపచేసినాడు. రెండు పాదాలనూ ఆ కొండకు తన్నిపెట్టినాడు.

ఆకాశములోకి ఎగిరిపోతూ ఉన్న ఆ మహాబలవంతుడు, ఆ కపికుంజరుడు హనుమంతుడు అప్పుడు వానరులను అందరినీ చూచి, "ఓ వానరులారా! వాయువేగముతో పోయే రామబాణమువలె నేను రావణాసురుడు పరిపాలిస్తూ ఉన్న లంకాపట్టణానికి పోతాను. సీతాదేవి ఒకవేళ అక్కడ కనపడకపోయినట్లయితే అక్కడినుంచి అదే వేగముతో దేవలోకము పోతాను. అక్కడకూడా సీతాదేవి కనపడకపోయినట్లయితే అలసట లెక్కచేయకుండా మళ్ళీ లంకాపట్టణానికి పోతాను. రావణాసురుణ్ణి కట్టివేసి ఇక్కడికి ఈడ్చుకొని వస్తాను. ఏవిధముగాను అయినా ఈ పని సాధిస్తాను. సీతాదేవిని వెంటపెట్టుకొని వస్తాను. అట్లా కాకపోయేటట్లయితే రావణాసురుడితో కూడా లంకాపట్టణాన్ని పెళ్ళగించి ఎత్తుకొని వస్తాను" అని చెప్పినాడు.

అంతట ఆ వేగవంతుడు హనుమంతుడు తనకు రెక్కలు ఉన్నట్టు భావించి నిర్విచారముగా చివాలున ఆకాశములోకి ఎగిరినాడు.

ఆ కపికుంజరుడు హనుమంతుడు ఎగిరిన ఉరవడికి ఆ పర్వతము మీద ఉన్న చెట్లు అన్నీ పెళ్ళగిలి కొమ్మలతోనూ, కొమ్మల కొనలను ఉన్న పూలతోనూ, ఆ కొమ్మలమీద ఉన్న లకుముకిపిట్టలతోనూ ఆకాశానికి ఎగిరి, దూరదేశానికి పోయే బంధువును సాగనంపడానికి వెంటపోయే బంధువులవలె, ఆ హనుమంతుణ్ణి ఒక్క ముహూర్తముసేపు వెంబడించినవి. మద్దిచెట్లూ, ఇంకా ఇతర మహోన్నత వృక్షాలూ రాజువెంట పోయే సైన్యాలవలె ఆ హనుమంతుడి వెంట పోయినవి. విరగపూసిన ఆ చెట్లు అన్నీ అట్లా ఎగిరిపోతూ ఉంటే హనుమంతుడి పర్వతాకారము అత్యద్భుతముగా కనిపించింది.

పూర్వము దేవేంద్రుడికి భయపడి పర్వతాలు సముద్రములో పడిపోయినట్లు చేవతో బరువెక్కిన చెట్లు గభాలున ఆ సముద్రములో పడిపోయినవి. మేఘసమానుడు అయిన హనుమంతుడి దేహము అంతటా నానారకాల పూలూ, మొగ్గలూ, మొలకలూ కమ్ముకొన్నందువల్ల రాత్రిపూట మిణుగురు పురుగులతో మెరిసే పర్వతమువలె కనిపించినాడు. ఆ హనుమంతుడి ఉరవడికి వెనుకపడిపోయిన చెట్లు తమ పూలను రాల్చివేసి ఊరికి పోయే చుట్టాన్ని నీళ్ళు అడ్డము వచ్చే వరకూ పంపించి వెనుకకు మళ్ళిన బంధువులవలె సముద్రములో కనపడకుండా పడిపోయినవి. బాగా బరువుచెట్లు ఆ హనుమంతుడి వెంట కొంచెము దూరమే పోయి క్రింద పడిపోయినవి. తేలికచెట్లు మరికొంతదూరము ఆ వానరోత్తముడి వెంటపోయినవి. వాటికన్నా తేలిక అయిన రకరకాల రంగులపూలు ఇంకా మరికొంతదూరము పోయి రాలి సముద్రములో పడ్డవి. అట్లా సముద్రజలాలమీద పడ్డ పూలు అన్నీ చీకటిలో ఆకాశాన ఉదయించిన నక్షత్రాలవలె కనిపించినవి.

సముద్రములో రాలిపోకుండా ఒంటిమీద నిలిచిపోయిన రంగు రంగుల పూలతో ఉరవడిగా పోతూఉన్న హనుమంతుడు ఆకాశములో మెరుపుతీగలతో పోయే మహామేఘమువలె కనిపించినాడు. ఆకాశములోకి నిక్కచాచిన హనుమంతుడి రెండు బాహువులూ పర్వతశిఖరములో నుంచి బయటికి వెళ్ళుకొని వచ్చిన అయిదు తలల పాముల జంటవలె కనిపించినవి. అట్లా పోతూ ఉన్న ఆ హనుమంతుడు మెడను వంచినప్పుడు మహాసముద్ర జలాలను తరంగాలతో కూడా త్రాగపోతున్న వాడివలెనూ, మెడను పైకి ఎత్తినప్పుడు ఆకాశాన్ని మ్రింగివేయ పోతున్నవాడివలెనూ కనిపించినాడు. ఆ హనుమంతుడి గుండ్రని తేనెరంగు కన్నులు ఏకకాలాన ఉదయించిన సూర్యచంద్రుల వలె కనిపించినవి. ఎర్రని ముక్కుతో ఎర్రపడిపోయిన హనుమంతుడి ముఖము సంధ్యారాగము అలముకొన్న సూర్యమండలమువలె కనుపించినది.

అట్లా, ఎగిరిపోతూ హనుమంతుడు పైకి ఎత్తిన పొడుగాటి తోక ఆకాశములో ఇంద్రధ్వజమువలె కనిపించినది. ఆ హనుమంతుడు ఆ తోకను తన చుట్టూ గుండ్రముగా చుట్టుకొన్నాడు. అప్పుడు అతడు పరివేషము మధ్యను ఉన్న సూర్యుడివలె తేజరిల్లినాడు. ఎర్రగా ఉన్న అతని కటి ప్రాంతము పర్వతాన్ని బ్రద్దలుచేసికొని వచ్చిన గైరికధాతువువలె కనిపించినది. ఆ వానరసింహుడు హనుమంతుడు అట్లా అమితవేగముతో సముద్రాన్ని లంఘిస్తూఉంటే అతని చంకలలోనుంచి దూసుకొనిపోయేగాలి మేఘమువలె గర్జించింది. ఉత్తరదిక్కునుంచి దక్షిణదిక్కుకు పోతూ ఉన్న ఆ హనుమంతుడు అప్పుడు ఆ ఆకాశములో ఉత్తరము నుండి దక్షిణదిక్కుకు వ్యాపిస్తూ ఉన్న తోకచుక్క మాదిరిగా కనిపించినాడు.

మహాకాయముతో ఆకాశములో సూర్యుడివలె పోతూ ఉన్న ఆ హనుమంతుడు తన తోకను ముడుస్తూనూ, వేళ్లాడవేస్తూనూ ఉంటే నడికట్టు తాళ్ళు తెంచుకొని పరుగెత్తుతున్న ఏనుగువలె కనిపించినాడు. ఆకాశములో ఎగిరిపోతూ ఉన్న ఆ హనుమంతుడి కాయమూ, క్రింద సముద్రములో పడుతూ ఉన్న అతని నీడా ఏకమై, గాలికి పోతున్న ఓడవలే కనిపించినాడు. ఆ హనుమంతుడు ఎంతమేర సముద్రము దాటుతూ ఉంటే ఆతని వేగానికి అంతమేరా సముద్రానికి పిచ్చెత్తినట్లు అయిపోయింది. ఆ హనుమంతుడు అట్లా అమిత వేగముతో పోతూ వుంటే కొండలంత ఎత్తున పైకిలేచిన తరంగాలు అతని రొమ్ముల తాకిడికి చిందర వందర అయిపోయినవి. అప్పుడు ఆ హనుమంతుడి ఉరవడికి రేగిన గాలీ, మేఘాల గాలీ ఏకమై చేసిన భయంకర ధ్వనికి సముద్రము కంపించిపోయింది. ఆ కపిశార్దూలము ఆ సముద్రము అలలను ఒరుసుకొని పోతూఉంటే భూమ్యాకాశాలను వేటికి అవిగా చీల్చివేస్తూన్నవాడివలెనూ, మందవేగముతో పోతూవుంటే మేరు మందర పర్వతాలవలె

పైకి లేస్తూ ఉన్న సముద్రతరంగాలను లెక్కవేస్తున్నవాడివలెనూ సాగిపోయినాడు. ఆ హనుమంతుడి వేగానికి సముద్రజలము మేఘమండలము వరకూ లేచి శరత్కాలమేఘమువలె ఆకాశాన శోభించింది. ఒంటిమీద బట్టలు తొలిగిపోతే అవయవాలు అన్నీ బయట పడ్డట్టు అప్పుడు సముద్రములో తిములూ, తాబేళ్ళూ, మొసళ్ళూ మొదలయిన జల జంతువులు అన్నీ బయటపడ్డవి. అట్లా ఆకాశములో దాటిపోతూఉన్న హనుమంతుణ్ణి ఆ సముద్రములో ఉన్న పాములు అన్నీ చూచి గరుత్మంతుడు అనుకొని భయపడ్డవి. అట్లా పోతూవున్న హనుమంతుడి నీడ ఆ సముద్ర జలాలమీద ముప్పయి యోజనాల పొడుగునా, పది యోజనాల వెడల్పునా అత్యాశ్చర్యముగా కనిపించింది. అట్లా సముద్రములో వ్యాపించిన ఆ హనుమంతుడి నీడ అతనితో పాటు సముద్రముమీద పోతూ ఉంటే ఆకాశములో పోయే దట్టమైన మేఘపంక్తివలె తోచింది. ఆ మహాతేజస్వి, ఆ మహాకాయుడు నిరాధారము అయిన వాయుమార్గాన పోతూఉంటే రెక్కల పర్వతము ఎగిరిపోతూ ఉన్నట్లు కనిపించింది. ఆ మహాబలవంతుడు హనుమంతుడు అట్లా పోతూ ఉంటే అప్పుడు ఆ సముద్రము పక్కలకు తొలగి మధ్యను తొట్టిగాఉండే దోనెవలె కనిపించింది. గరుత్మంతుడివలె ఎగిరిపోతూ ఉన్న ఆ హనుమంతుడు వాయుదేవుడివలె మేఘాలను వెంట లాగుకొనిపోయినాడు. ఆ హనుమంతుడిని వెంబడించి తెలుపూ, ఎరుపూ, బూడిదరంగూ మేఘాలు అప్పుడు ఆకాశానికి అలంకారముగా కనిపించినవి. ఆ హనుమంతుడు అమితవేగముతో పోతూ ఉంటే మేఘాల చాటుకు పోతూనూ, బయటికి వస్తూనూ మబ్బులతో దాగుడు మూతలు ఆడే చంద్రుడివలె కనిపించినాడు.

ఆకాశములో అట్లా అమితవేగముతో ఎగిరిపోతూ ఉన్న ఆ హనుమంతుడి మీద అప్పుడు దేవతలూ, గంధర్వులూ పూలవాన కురిపించినారు. ఆ హనుమంతుడికి దేహతాపము ఎత్తకుండా సూర్యుడు ఎండకాసినాడు. వాయుదేవుడు రామకార్యార్థసిద్ధి కోసము అనుకూలముగా గాలి వీచినాడు. అట్లా ఆకాశములో ఎగిరిపోతూ ఉన్న హనుమంతుణ్ణి మహర్షులు అందరూ స్తోత్రము చేసినారు. దేవతలూ, గంధర్వులూ ఆ మహాతేజోవంతుణ్ణి పొగిడినారు. అలుపు లేకుండా ఎగిరిపోతూ ఉన్న ఆ హనుమంతుణ్ణి నాగులూ, యక్షులూ, రాక్షసులూ, కిన్నరులూ, కింపురుషులూ మెచ్చుకొన్నారు.

ఆ కపిశార్దూలము హనుమంతుడు అట్లా దాటిపోతూ ఉంటే, సముద్రుడు అతనికి సాయపడవలెను అనుకొన్నాడు. ఇక్ష్వాకువంశీయుల మీద అతనికి ఎంతో గౌరవము ఉంది. ఇక్ష్వాకువంశీయుడు అయిన సగర చక్రవర్తి తనను వృద్ధిచేసినాడు అనీ, ఆ ఇక్ష్వాకువంశీయుడు అయిన రాముడికి హనుమంతుడు సహాయము చేస్తూ

ఉన్నందువల్ల అతడు అలసిపోకుండా తాను ఏది అయినా సదుపాయము చేయవలెను అనీ, రామకార్యార్థి అయిపోతూ ఉన్న హనుమంతుడుకి సహాయపడక పోయేట్లయితే తనను అందరూ అన్నివిధాలా నిందిస్తారు అనీ సముద్రుడు అనుకొన్నాడు.

ఆ వస్తూ ఉన్న హనుమంతుడు కొంచెముసేపు అలుపు తీర్చుకొనే ఏర్పాటు చేసేట్లయితే తక్కిన దారి అంతా సుఖముగా పోగలుగుతాడు అని సముద్రుడు మనస్సులో నిశ్చయించుకొని, తనలో దాగుకొని ఉన్న పర్వతశ్రేష్ఠుణ్ణి మైనాకుణ్ణి చూచి, "హిరణ్యనాభా! పాతాళలోకములో ఉంటూ ఉన్న రాక్షసులు పైకి లేచి రాకుండా వాళ్ళ ద్వారానికి మూతబండగా ఉంటున్నావు. వాళ్ళు, ఆ రాక్షసులు, పరాక్రమవంతులు పైకి రావలెను అని ఎంతో ప్రయత్నము చేస్తే, నీవు అపరిమితాకారముతో ఆ పాతాళ ద్వారానికి అడ్డము అయినావు. నీకు క్రిందికి, మీదికి, పక్కలకు పెరిగే శక్తి ఉంది.

"అందువల్ల నీతో చెప్పుతున్నాను. నీవు ఇప్పుడు పైకి లేవవలెను. రామకార్యార్థము హనుమంతుడు ఎగిరి ఆకాశములో వస్తూ ఉన్నాడు. ఆ కపిశార్దూలము తలపెట్టింది పరమ సాహసకృత్యము. ఇక నీమీదుగా పోతాడు. రాముడు ఇక్ష్వాకు వంశీయుడు. ఆ వంశీయులు అందరూ నాకు పూజనీయులు. నీవు నాలో దాగుకొని నా అభ్యుదయాన్ని కాంక్షిస్తూ ఉన్నవాడవు. అందువల్ల, రాముడు నీకు మరింత పూజనీయుడు. కాబట్టి నీవు నాకు సాయపడవలెను. నా పనిని నీవు ఇప్పుడు తప్పకుండా చేసిపెట్టవలెను. ఏ పని చేయవలసిన సమయములో ఆపని చేయకపోయేట్లయితే సత్పురుషులకు కోపము వస్తుంది. నీవు నీళ్లలోనుంచి పైకి రా! ఈ హనుమంతుడు నీమీద నిలుస్తాడు. ఇతను ఆకాశమార్గాన ఎగిరిపోయేవాండ్లలో శ్రేష్ఠుడు. అతిథిగా వస్తూ ఉన్నాడు కాబట్టి మనకు పూజ్యుడు.

"ఓ మైనాకుడా! నీ బంగారు శిఖరాల మీద ఇదివరకు దేవతలూ, గంధర్వులూ విహరించినారు. ఇప్పుడు హనుమంతుడు నీ మీద నిలుచుని అలుపు తీర్చుకొంటాడు. ఆ తరువాత మిగతా దారి అంతా హాయిగా పోతాడు.

"ఓ మైనాకుడా! రాముడు పరమ సజ్జనుడు. భార్యను పోగొట్టుకొన్నాడు. అతని భార్య మైథిలి ఇప్పుడు పరదేశ వాసము చేస్తూ ఉంది. సీతారాములను ఒకచోటికి చేర్చడానికి ఇప్పుడు ఆకాశమార్గాన హనుమంతుడు ఎగిరిపోతున్నాడు. ఆ రాముడి కోసము ఈతడు పడుతున్న శ్రమ గమనించు. ఇక నీవు పయికి రా" అన్నాడు.

మైనాక పర్వతము

ఈ విధముగా సముద్రుడు చెప్పిన మాటలను ఆ మైనాకుడు విన్నాడు. మేఘమండలాన్ని భేదించుకొని వచ్చే సూర్యుడివలె ఆ సముద్ర జలాలలో నుంచి

మైనాకుడు మహోన్నత వృక్షాలతోనూ, లతలతోనూ, బంగారు శిఖరాలతోనూ పైకి లేచి వచ్చినాడు. అంతవరకూ మునిగి ఉన్న మైనాకుడు సముద్రుడు చెప్పినందువల్ల పైకి పెరిగి బంగారు శిఖరాలతో ఆకాశాన్ని అంటి ఉదయ సూర్యకాంతులతో తేజరిల్లుతూ ఉంటే, నల్లగా కనిపించే ఆకాశము అప్పుడు బంగారుకాంతులతో దేదీప్యమానముగా అగుపించింది. బంగారు మయము అయిన మైనాకపర్వత శిఖరాలు అట్లా మహాప్రభలతో తేజరిల్లుతూ ఉంటే నూరుమంది సూర్యులు ఉదయించినట్లుగా అప్పుడు ఆకాశము కనిపించినది.

ఏ అడ్డమూ లేకుండా అట్లా పైకి లేచిన ఆ మైనాక పర్వతాన్ని హనుమంతుడు చూచినాడు. తనకు సముద్ర మధ్యములో విఘ్నము ఒకటి వచ్చింది అనుకొన్నాడు. వాయుదేవుడు మేఘాలను కిందకు పడతోసేట్టు అట్లా ఆకాశము అంత ఎత్తున పైకి లేచిన ఆ మైనాక పర్వతాన్ని అ మహావేగవంతుడు హనుమంతుడు తన ఎదురు రొమ్ములతో పడతోసినాడు. అంతవేగముతో వచ్చి హనుమంతుడు అట్లా తనను పడతోసినందుకు మైనాకుడికి ఒండ్లు పులకలు ఎత్తింది. అప్పుడు మైనాకుడు మనుష్య రూపము ధరించి తన పర్వత శిఖరము మీద నిలుచుని ఆ వీరుణ్ణి హనుమంతుణ్ణి చూచి, "వానరోత్తమా! నీవు దుర్ఘటము అయిన కార్యము తలపెట్టినావు. నా శిఖరాలమీద వాలు. కొంచెముసేపు అలుపు తీర్చుకో. ఆ తరువాత సుఖముగా పో!

"ఓ హనుమంతుడా! ఈ సముద్రుణ్ణి పూర్వము సగర చక్రవర్తి పుత్రులు అభివృద్ధిచేసినారు. రాముడు ఆ సగర చక్రవర్తి వంశీయుడు. అందువల్ల, ఈ సముద్రుడు రాముడికి మేలు చేయడానికి నిన్ను పూజించతలచుకొన్నాడు. ఉపకారికి ప్రత్యుపకారము చేయడము సనాతన ధర్మము. రాముడికి సాయము చేస్తూ ఉన్న నిన్ను పూజించి, ఈ సముద్రుడు తనకు ఉపకారము చేసిన సాగరుల వంశములో పుట్టిన రాముడికి ప్రత్యుపకారము చేసినవాడు కాదలచుకొన్నాడు. కృతజ్ఞుడు అయిన ఈ సముద్రుడు నాతో, 'మైనాకుడా! ఈ హనుమంతుడు నూరు యోజనాల సముద్రాన్ని దాటిపోవలెను. ఈతడు నీ నెత్తాలలో అలుపు తీర్చుకొనేట్లయితే ఇక్కడ నుంచి మిగతా దారి సులభముగా దాటిపోతాడు. నీవు పైకి లేవవలెను' అని చెప్పి, నిన్ను గౌరవించడానికి నన్ను ప్రోత్సహించినాడు. అందువల్ల, నీవు నామీద విశ్రమించు. ఇక్కడ వున్న రుచ్యము అయిన కందమూల ఫలాలను ఆరగించు. అలుపు తీర్చుకో, ఆ తరువాత పో!

"ఓ హనుమంతుడా! నీకూ నాకూ చాలా గొప్ప సంబంధము ఉంది. నీవు రామదూతవు అయినందువల్ల ఈ సముద్రుడు నన్ను తనకు సాయపడమని ప్రోత్సహించడము ఒక సంబంధము. నీ తండ్రి వాయుదేవుడు పూర్వము నాకు

సాయపడడము మరి ఒక సంబంధము. ఇప్పుడు నీవు ఈ దారిన వస్తూ వున్నావు కనుక, నీవు నా అతిధివి. ఇది ఒక సంబంధము. ఆతిథ్యతిథిమద్భావ సంబంధము ముల్లోకాలలోను ప్రసిద్ధము అయింది. దానిని మహాగుణవంతులు అంగీకరించినారు.

"ఓ వాయుపుత్రుడా! నీవు కపికుంజరుడవు. అమిత వేగముతో ఎగిరిపోయే వానరులలో నిన్ను మించినవాడు మరిఒకడు లేడు అనుకొంటున్నాను. ధర్మజ్ఞులకు, ధర్మ జిజ్ఞాసువులకు అతిథి ప్రాకృతుడు అయినప్పటికిన్నీ పూజార్హుడు. నీవంటి గొప్పవాడితో 'నీవు పూజార్హుడవు' అని చెప్పవలసిన పనేలేదు.

"ఓ హనుమంతుడా! నీవు దేవతలలో శ్రేష్ఠుడు, గొప్పవాడూ అయిన వాయుదేవుడి పుత్రుడవు. వేగానికి నీవు నీ తండ్రితో సరిసమానము అయినవాడవు. ధర్మజ్ఞుడవు. నీకు తెలియంది ఏమీలేదు. నిన్ను పూజించడము అంటే నీ తండ్రిని పూజించడమే అవుతుంది. అందువల్ల, నీవు నాకు పూజనీయుడవు. నీ తండ్రి వాయుదేవుడు నాకు ఎందుకు పూజనీయుడో చెప్పుతాను, విను.

"నాయనా హనుమంతుడా! పూర్వము కృతయుగములో పర్వతాలకు పక్షులవలెనే రెక్కలు ఉండేవి. అవి ఆ కాలములో గరుత్మంతుడివలెనూ, వాయుదేవుడివలెనూ అన్నిదిక్కులకూ ఎగిరిపోతూ ఉండేవి. ఆ పర్వతాలు అట్లా ఎగిరి ఎక్కడికి పడితే అక్కడికి పడిపోతూ ఉంటే దేవతలూ, మహర్షులూ మొదలైన వారు అవి తమ మీద పడిపోతవేమోనని భయశంకితులు అయినారు. సహస్రాక్షుడు దేవేంద్రుడు అప్పుడు క్రుద్ధుడు అయిపోయి వజ్రాయుధముతో ఆ పర్వతాల రెక్కలను అక్కడ అక్కడ ముక్కలు ముక్కలుగా నరికివేసినాడు. అప్పుడు ఆ దేవరాజు కోపముతో నా రెక్కలు నరికివేయడానికి నా మీదికి వచ్చినాడు. నాకు ఆ సమయాన వాయుదేవుడు సాయపడ్డాడు. ఓ హనుమంతుడా! నీ తండ్రి వాయుదేవుడు నాకు ఇచ్చిన ఊపుకు నేను ఈ సముద్రములో గబుక్కున చొరబడ్డాను. నా రెక్కలు పోలేదు. చెక్కుచెదరకుండా ఉన్నాను. నీ తండ్రి వాయుదేవుడు నన్ను అట్లా కాపాడినాడు. అందువల్ల, ఆయన నాకు పూజనీయుడు. ఆయన నుంచి నీవు నాకు పూజనీయుడవు. ఈ మన సంబంధము చాలా గొప్పది. ఓ మహాకపీ! నా పూజను నీవు సంతోషముగా అంగీకరించు. నేను సంతోషిస్తాను. ఈ సముద్రుడు సంతోషిస్తాడు. ఓ కపిసత్తమా! నా మీదను నీవు నిలువు. నీ మార్గాయాసము తీర్చుకో. నా స్నేహాన్ని సమ్మానించు. నీ దర్శనము చేయడమువల్ల నాకు ఇప్పుడు ఎంతో సంతోషముగా ఉంది" అని చెప్పినాడు.

ఇట్లా మైనాకుడు చెప్పింది విని హనుమంతుడు, "ఓ మైనాకుడా! నీవు చెప్పింది విన్నాను. నేను నిన్ను మెచ్చుకుంటున్నాను. నీవు నాకు అతిథి సత్కారము

చేసినట్లే భావిస్తున్నాను. నీకు కోపమువద్దు. ఇది నేను నా పనిమీద పోతున్న సమయము. నేను ఇప్పుడు త్వరగా పోవలెను. ఈ సముద్రమధ్యములో నేను నిలువకూడదు. పొద్దువాలిపోతూ ఉంది. మధ్యను ఎక్కడా ఆగకుండా రామబాణమువలె పోతాను అని నేను వానరులతో శపథము చేసినాను" అని నవ్వుతూ చెప్పినాడు. అంతట ఆ వీర్యవంతుడు హనుమంతుడు ఆ మైనాకుణ్ణి చేతితో తాకినాడు. అప్పుడు ఆ మైనాకుడూ, సముద్రుడూ ఆ వాయుపుత్రుణ్ణి హనుమంతుణ్ణి గౌరవముతో చూస్తూ, 'రామకార్యము నెరవేరవలెను' అని ఆశీర్వదించినారు. వారి సత్కారాలను ఆవిధముగా అందుకొని హనుమంతుడు ఆ మైనాకుణ్ణి వదిలిపెట్టి వాయుమార్గాన ఎగిరిపోయినాడు.

అప్పుడు దేవతలూ, సిద్ధులూ, సప్తమహర్షులూ హనుమంతుడు చేసిన ఆ రెండవ దుర్ఘటకార్యాన్ని ప్రశంసించినారు. (మొదటి దుర్ఘట కార్యము సముద్ర లంఘనము. రెండవ దుర్ఘటకార్యము మైనాక పర్వతము మీద విశ్రమించకుండా పోవడము)

ఆ బంగారు మైనాకుడు చేసిన పనికి దేవతలు అందరూ సంతుష్టులు అయినారు. సహస్రాక్షుడున్నూ సంతోషిస్తున్నాడు. ఆ ధీమంతుడు దేవేంద్రుడు అప్పుడు మైనాకుణ్ణి చూచి గద్గద స్వరముతో, "ఓ హిరణ్యానాభా! నీవు శైలేంద్రుడవు. నీవు చేసిన పనికి నేను సంతుష్టుణ్ణి అయినాను. నీవు మంచివాడవు. నేను నీకు అభయము ఇస్తున్నాను. నీవు సుఖముగా ఉండు. నిర్భయముగా ఉండు. నిన్ను నేను ఏమీ చేయను. నూరు యోజనాల సముద్రము దాటిపోతూ ఉన్న హనుమంతుడికి సాయము చేయడానికి పైకి లేచినావు. అది చాల గొప్పపని. హనుమంతుడు రామదూత. నీవు అతనిని సత్కరించినావు. నాకు చాలా సంతోషము అయింది" అని చెప్పినాడు.

అట్లా ఇంద్రుడు వరము ఇచ్చినందువల్ల మైనాకుడు తన పర్వతాకారముతో అక్కడ, ఆ సముద్రములో నిలిచిపోయినాడు. హనుమంతుడున్నూ ఒక్క ముహూర్తంలో ఆ ప్రదేశము దాటి అవతలకు పోయినాడు.

నాగమాత సురస

అంతట దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, పరమర్షులూ సూర్యకాంతులతో తేజరిల్లే నాగమాతను చూచి, "ఓ సురసా! ఈ కాంతిమంతుడు వాయుపుత్రుడు హనుమంతుడు ఈ సముద్రము మీద ఇప్పుడు ఎగిరిపోతున్నాడు. నీవు ఈతని గమనాన్ని ఒక ముహూర్తముసేపు విఘ్నము చేయవలెను. నీవు పర్వతము అంత

ఎత్తున భయంకరము అయిన రాక్షసిరూపము ధరించి పెద్ద పెద్ద కోరలతో, నోటితో, తేనెరంగు కన్నులతో, ఆకాశము అంత ముఖముతో నిలుచుండవలెను. మేము ఈతని బలమూ, పరాక్రమమూ మళ్ళీ ఇప్పుడు తెలుసుకోవలెను అనుకొంటున్నాము. ఇతడు ఏది అయినా ఉపాయముతో నిన్ను జయిస్తాడో లేక ఓడిపోయి దుఃఖపడుతాడో మేము చూస్తాము" అని చెప్పినారు.

దేవతలు ఈ విధముగా చెప్పి సమ్మానించినందువల్ల, ఆ సురసాదేవి ఆ సముద్రములో చేతులూ, కాళ్ళూ లేకుండా వికృతమూ, భయావహమూ అయిన రాక్షసాకారముతో హనుమంతుణ్ణి కమ్ముకొని, "ఓ హనుమంతుడా! నిన్ను దేవతలు నాకు ఆహారముగా చూపించినారు. నేను నిన్ను భక్షిస్తాను. ఇదిగో నోరు తెరిచినాను, లోపల చొరపడు" అన్నది.

అట్లా అన్న ఆ సురసాదేవిని చూచి ఆ కాంతిమంతుడు హనుమంతుడు చేతులు జోడించి ముఖాన సంతోషము ఉట్టిపడుతూ, "ఓ సురసా! దశరథమహారాజు కొడుకు రాముడు పితృాజ్ఞ పరిపాలనము కోసము తమ్ముడు అయిన లక్ష్మణుడితోనూ, భార్య వైదేహితోనూ దండకారణ్యానికి వచ్చినాడు. అతనికి రాక్షసులతో బద్ధవైరము వచ్చింది. ఆ రాముడు అన్యకార్యాసక్తుడు అయి ఉండగా, అతని భార్య యశస్విని సీతాదేవిని రావణాసురుడు ఎత్తుకొనిపోయినాడు. నేను ఆ రాముడి దూతను. రామాజ్ఞనుంచి నేను ఇప్పుడు ఆ సీతాదేవి దగ్గరకు పోతున్నాను. నీవు నివసిస్తున్నది ఆ రాముడి దేశము. అందువల్ల, నీవు ఆ రాముడికి సహాయము చేయవలెను. అట్లాకాదు అనేట్లయితే నేను ఆ మైథిలినీ, ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసివేసే ఆ రాముణ్ణీ చూచివచ్చి నీ నోటిలో పడుతాను. నీకు సత్యముగా చెప్పుతున్నాను. నా మాట నమ్ము" అన్నాడు.

ఆ కామరూపిణి సురసాదేవి హనుమంతుడితో, "ఎవడున్నూ ఇక్కడ నన్ను మీరిపోవడానికి వీలులేదు. నాకు అట్లా బ్రహ్మదేవుడు వరము ఇచ్చినాడు. ఇప్పుడే నీవు నా నోటిలో పడవలెను" అంటూ పెద్ద నోరు తెరిచింది.

హనుమంతుడికి కోపము వచ్చి, "ఓ సురసా! నన్ను మింగడానికి వీలు అయ్యేట్టు నోరు తెరువు" అంటూ పది యోజనాల వెడల్పుగా తన కాయాన్ని పెంచినాడు. సురస అంతట ఇరవై యోజనాల వెడల్పున నోరు తెరిచింది. ఈవిధముగా ఒకరితో ఒకరు పోటీపడ్డారు. హనుమంతుడు దేహాన్ని తొంభై యోజనాల వెడల్పున పెంచినాడు. సురస నూరు యోజనాల వెడల్పున నోరు తెరిచింది. మహాఘోరనరకము వంటి పొడుగాటి నాలుక చాచింది. అది చూచి ఆ బుద్ధిమంతుడు అంగుష్ఠ మాత్రుడు అయి ఇట్లే ఆ సురస నోటిలోకి పోయి అది నోరు మూసేలోపలనే

పుటిక్కిన బయటికి వచ్చి ఎగిరి ఆకాశములోకి పోయి ఆ సురసను చూస్తూ, "ఓ దాక్షాయణీ! నీవు కోరినట్లు నీ నోటిలో పడ్డాను. నీకు బ్రహ్మదేవుడు ఇచ్చిన వరము సఫలము అయింది. సమస్కారము చేస్తున్నాను" అని చెప్పినాడు.

అప్పుడు సురస తన నిజరూపము ధరించి, "ఓ హనుమంతుడా! నీ కార్యము సాధించడానికి సుఖముగా పో! రాముడితో వైదేహిని చేర్చు" అని చెప్పింది.

హనుమంతుడు చేసిన ఈ మూడవ దుర్ఘట కృత్యానికి సర్వభూతాలూ మెచ్చుకొన్నవి. దాట నలవికాని ఆ వరుణాలయము అయిన సముద్రాన్ని దాటడానికి గరుత్మంతుడివలె హనుమంతుడు ఆకాశమార్గము పట్టినాడు. ఆ ఆకాశము వర్షధారలు కార్చే మేఘాలకు ఉనికిపట్టు, అదే పక్షులు ఎగిరిపోయే దారి. అదే కైశికాదిరాగ ప్రవర్తకులు (దేవగాయకులు) అయిన తుంబురుడు, నారదుడు మొదలు అయినవారి సంచార మార్గము. వంకరగా పొడుగుగా ఉండే ఇంద్రధనుస్సు వ్యాపించేది అక్కడనే. సింహ గజ శార్దూల పన్నగాలను వాహనాలుగా ఎక్కిపోయేవారికీ, అటూ ఇటూ పరుగులెత్తే విమానాలకూ అదే దారి. వజ్రాయుధమూ, పిడుగూ వీటి దెబ్బవల్ల పుట్టే నలభైతొమ్మిది వహ్నులకు అదే స్థానము. పుణ్యము చేసి స్వర్గాన్ని జయించిన మహాభాగులు ఉండేది ఆ తావునే. హోమద్రవ్యాన్ని మోసుకొనిపోయే చిత్రభానుడి రాకపోకలకు అదే దారి. అశ్విన్యాది నక్షత్రాలు అలంకారముగా కనపడుతూ ఉంటే కుజాది గ్రహాలూ, సూర్యచంద్రులూ సంచారముచేసే దారి అదే. మహర్షులూ, యక్షులూ, నాగులూ, గంధర్వులూ తిరిగేదిన్నీ అక్కడనే. అది వివిక్తముగా ఉంటుంది. నిర్మలముగా ఉంటుంది. అది ఈ ప్రపంచాన్ని అంతా వ్యాపించింది. 'విశ్వావసుడు' అనే గంధర్వరాజు ఉండేది అక్కడనే. దేవేంద్రుడి 'ఐరావతము' అనే దిగ్గజము తిరిగేది అక్కడనే. దానిని బ్రహ్మదేవుడు ప్రాణికోటికి పెద్ద విశాలమయిన చాందినిగా నిర్మించినాడు. పరాక్రమవంతులూ, శ్రేష్ఠులూ అయిన విద్యాధరులు విహరించేది అక్కడనే. పట్టులేని ఆ దారిన రెక్కలు ఉన్న పర్వతరాజువలె వాయుపుత్రుడు హనుమంతుడు అందరికీ కనపడేటట్టు పోతున్నాడు.

సింహిక వధ

అట్లా సముద్రాన్ని దాటిపోతూ ఉన్న ఆ హనుమంతుణ్ణి 'సింహిక' అనే రాక్షసి చూచింది. అది కామరూపిణి. ఆలోచించింది, దేహాన్ని పెంచింది. "బహుకాలానికి ఇప్పుడు భోజనము చేయబోతున్నాను. ఇంత పెద్ద జంతువు చిరకాలానికి నాకు చిక్కింది" అని మనస్సులో అనుకొని, ఆ హనుమంతుడి నీడను పట్టుకొన్నది. ఆ సింహిక తన నీడను పట్టుకోగానే సముద్రములో ఎదురుగాలికి తల్లడిల్లే ఓడవలె వేగము కుంటుపడిపోయి హఠాత్తుగా తాను పట్టుపడ్డట్టు

హనుమంతుడు భావించినాడు. పైకీ, కిందికీ, పక్కలకూ చూచినాడు. సముద్రములో లేచిన ఆ మహాసత్త్వము కనిపించింది. వికృతాననముతో అది మహాద్భుతముగా తోచింది. అదివరకు తనతో సుగ్రీవుడు చెప్పిన 'ఛాయాగ్రాహి' అనే జంతువు అదేను అనుకొన్నాడు. సందేహించలేదు. అప్పుడు ఆ మతిమంతుడు హనుమంతుడు ఆ యా గుర్తులను పట్టి అది నిశ్చయముగా సింహికేను అని తెలుసుకొని వర్షాకాల మేఘమువలె మహాకాయుడు అయినాడు. అట్లా పెరిగిపోయిన ఆ హనుమంతుణ్ణి సింహిక చూచింది. మేఘాలవలె గర్జిస్తూ పాతాళద్వారమువలె నోరు తెరచి హనుమంతుడి మీదికి పరుగెత్తింది. తనను మ్రింగివేయడానికి వీలు అయ్యేట్లు నోరు తెరచిన సింహిక ఆయువుపట్టును ఆ మేధావి హనుమంతుడు చూచినాడు. అంతట ఆ మహాబలవంతుడు, ఆ వజ్రసమానదేహుడు హనుమంతుడు తన దేహాన్ని కురచచేసినాడు. ఆ సింహిక తెరచిన నోట పడిపోయినాడు. అట్లా దాని నోటిలో పడుతూ ఉన్న హనుమంతుడు పర్వకాలాన రాహువు నోటిలోకి పోయే పూర్ణచంద్రుడివలె కనిపించినాడు. మనోవేగముతో సమానముగా పోయే ఆ పరాక్రమవంతుడు హనుమంతుడు అప్పుడు ఆ సింహిక ఆయువుపట్టును తన వాడి అయిన గోళ్ళతో చీల్చివేసి (అది నోరు మూసుకొనే లోపలనే) దాని నోటిలో నుంచి బయటికి ఎగిరినాడు. ఆ ప్రశస్తదేహుడు ఆ ధైర్యవంతుడు, ఆ పరమ సమర్థుడు హనుమంతుడు అంతట దానిని పడతోసి, వెంటనే మళ్ళీ దేహాన్ని పెంచినాడు. ఆ సింహిక గుండె బ్రద్దలు అయి ఆ సముద్రములో పడి చచ్చిపోయింది.

అది చూచి సిద్ధ చారణ గంధర్వాదులు ఆకాశము నుంచి హనుమంతుణ్ణి ఉద్దేశించి, "ఓ హనుమంతుడా! ఎగిరిపోయేవాండ్లలో నీవు శ్రేష్ఠుడవు. నీవు ఇప్పుడు మహా భయంకరము అయిన పని చేసినావు. గొప్ప రాక్షసిని చంపినావు. మంగళము అయిన నీ అభీష్టకార్యాన్ని ఇక సాధించు. హనుమంతుడా! నీకు ఉన్నట్టు ధైర్యమూ, దూరదృష్టీ, మేధస్సూ, కార్యసాధన సామర్థ్యమూ ఎవడికి ఉంటవో, వాడి పనులు ఏవీ చెడవు" అని చెప్పినారు.

అట్లా సిద్ధ చారణాదుల సమ్మాన వాక్యాలు వింటూ, ఆ పూజనీయుడు హనుమంతుడు తన ప్రయోజనము సాధించడానికి ఆకాశములో గరుత్మంతుడివలె పోయినాడు.

ఆ సముద్రములో నూరుయోజనాల అవతలున్న గట్టు, దగ్గిర దగ్గిరగా హనుమంతుడికి కనిపించింది. ఆ గట్టు పారచూచినాడు. తీరములో ఉన్న అడవులు కనిపించినవి. నానావిధ వృక్షాలతో ఉన్న ఆ ద్వీపాన్నీ, అక్కడ మలయ పర్వతముమీద ఉన్న ఉద్యాన వనాలనూ కిందికి రాకుండానే చూచినాడు.

ఆ ధైర్యవంతుడు, ఆ మతిమంతుడు హనుమంతుడు అంతట ఆ సముద్రాన్నీ, ఆ సముద్రతీరాన తడి నేలనూ, అక్కడ పెరుగుతూ ఉన్న చెట్లనూ, ఆ సముద్రములోనికి వచ్చి పడుతూ ఉన్న నదులనూ, ఆ నదులు పుట్టిన కొండలనూ చూచినాడు. ఆకాశములో ఎగిరివస్తూ ఉన్న మహామేఘ సమానము అయిన తన రూపాన్ని గురించి యోచించినాడు.

"రాక్షసులు నా వేగాన్ని, నా ఈ మహాకాయాన్ని చూచేట్లయితే నేను ఎవడినో తెలుసుకోవలెను అని కుతూహలపడతారు" అని అనుకొన్నాడు. కొండంత దేహాన్ని కుదించినాడు. అజ్ఞానము వదిలిపోయిన ఆత్మజ్ఞానివలె స్వస్వరూపము ధరించినాడు. విశ్వరూపముతో మూడు అడుగులు వేయడానికి బలిచక్రవర్తి పరాక్రమాన్ని హరించి వేసిన మహావిష్ణువు వామనుడు అయినట్టు హనుమంతుడు తన మహదాకారాన్ని వదిలిపెట్టి ఎప్పటి మాదిరిగా అయిపోయినాడు.

నానావిధ రూపాలు ధరించి ఇతరులకు అశక్యము అయిన పనులు చేసిన ఆ హనుమంతుడు తన నిజరూపముతో ఆ సముద్రతీరము చేరి తన శరీరము చూచుకొన్నాడు. తాను చేయవలసిన పనిని గురించి ఆలోచించుకొన్నాడు. మహాపర్వత శిఖరమువంటి ఆ ధైర్యవంతుడు మొగలి పొదలతోనూ, విరిగిన చేవ చెట్లతోనూ, కొబ్బరి చెట్లతోనూ, నానావిధ వృక్షాలతోనూ, విచిత్ర శిఖరాలతోనూ, ఉన్న లంబపర్వత శిఖరము మీదికి ఎగిరినాడు. ఒండ్లు విదిలించినాడు. అక్కడి పక్షులనూ, మృగాలనూ బెదరించినాడు. అక్కడినుండి త్రికూట పర్వతముమీద ఉన్న లంకా పట్టణాన్ని చూచినాడు. అది దేవేంద్రుడి అమరావతి పట్టణమువలె తోచింది.

2

లంకా పట్టణ వర్ణనము

ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఎవరూ దాటిపోలేని ఆ మహా సముద్రాన్ని దాటిపోయినాడు. త్రికూటపర్వతముమీద ఉన్న లంకా పట్టణాన్ని చూచినాడు. స్వస్థచిత్తుడు అయినాడు. అక్కడి చెట్లు అప్పుడు అతని మీద పూలవాన కురిపించినవి. అతడు పుష్పాభిషేకము చేసిన వీరుడు వలె అప్పుడు తేజరిల్లినాడు. ఆ కాంతిమంతుడు, ఆ ప్రశస్తపరాక్రమవంతుడు నూరుయోజనాల సముద్రాన్ని దాటినప్పటికిన్నీ, ఏ కొంచెమూ అలసిపోలేదు. ఒక్క నిట్టూర్పు అయినా విడువలేదు. "నేను అనేకవందల యోజనాలు దాటిపోగలను. ఈ నూరు యోజనాల దూరమూ దాటి రావడము నాకు ఒక లెక్కా" అని మనస్సులో అనుకొన్నాడు.

అతడు పరమపరాక్రమవంతులలో పరాక్రమవంతుడు. ఎగిరిపోయేవాండ్లు అందరిలో ఉత్తమోత్తముడు. అందువల్లనే, అంతమంది వానరవీరులలో ఆ

హనుమంతుణ్ణే సముద్రము దాటిపొమ్మని జాంబవంతుడు ప్రోత్సహించినాడు. మహావేగుడు హనుమంతుడు అందువల్లనే తెంపుచేసి మహోదధిని దాట లంకాపట్టణము చూచినాడు.

ఆ హనుమంతుడు పచ్చికబయళ్లలోనుంచి పెద్ద పెద్ద రాళ్ళూ, చిన్న కొండలూ చూస్తూ, ఆ ప్రదేశములో ఘుమ ఘుమ వాసనలు గుబాళిస్తూ ఉన్న అడవుల మధ్యనుంచి నడిచాడు. దట్టముగా చెట్లు కమ్ముకొన్న పర్వతశిఖరాలను, పూలు విరగపూసిన అడవులను కలియతిరిగి ఎన్నో శిఖరాలతో ఉన్న లంబపర్వతము మీదికి పోయి నిలుచుని లంకాపట్టణాన్ని చూచినాడు. ఆ తేజోవంతుడు, ఆ వానరపుంగవుడు అక్కడ వనాలను, ఉద్యానవనాలను, చక్కగా పూలు పూసిన సరళ దేవదారు వృక్షాలను, కొండగోగుచెట్లను, ఖర్జూరపుచెట్లను, గజనిమ్మచెట్లను, కొండమల్లెచెట్లను, పిప్పలిచెట్లను, మొగలి పొదలను, కడిమిచెట్లను, అరటిచెట్లను, వేగిసచెట్లను, దేవకాంచన వృక్షాలను చూచినాడు. ఆ చెట్లు కొన్ని పూల బరువుకు వంగిపోతున్నవి. కొన్ని చెట్లు పూలమొగ్గలు తొడుగుతూ ఉన్నవి. పక్షి సమూహాలు అక్కడ అంతటా విహరిస్తూ ఉన్నవి. గాలికి చెట్లు అన్నీ తలలు ఆడిస్తూ ఉన్నవి. విరగపూసిన కలువలతోనూ, కమలాలతోనూ నడబావులూ, వివిధ జలాశయాలూ అక్కడికి కనిపించినవి. అక్కడ హంసలూ, కారండవపక్షులూ విహరిస్తూ ఉన్నవి. అక్కడనే మనోహరము అయిన వివిధక్రీడాప్రదేశాలూ, రమ్యోద్యానవనాలూ ఆ కపికుంజరుడికి కనిపించినవి.

రావణాసురుడు తాను సీతాదేవిని దొంగిలించుకొని పోయినందువల్ల ఆ కోదండపాణి రాముడు ఏ సమయాన అయినా దండయాత్రకు వస్తాడేమోననే భయముతో మహోగ్రధానుష్కులను ఆ లంకా పట్టణానికి కావలి ఉంచినాడు. అట్లా అంతటా కావలి కాస్తూ ఉన్న ఆ భయంకర ధానుష్కులను అందరినీ హనుమంతుడు చూచినాడు.

ఆ లంకాపట్టణము చుట్టూ ఉన్న అగడ్త కమలాలతోనూ, కలువ పూలతోనూ శోభాయమానముగా కనిపించింది. దాని ప్రాకారము బంగారు కాంతులతో ధగధగలాడుతూ కనిపించింది. ఆ పట్టణములో గృహాలు అన్నీ శరత్కాల మేఘాలవలెనూ, అంతరిక్షములో ఒకదానికి ఒకటి ఎదురు బొదురుగా నిలచిన గ్రహాలవలెనూ ఉన్నవి. వీధులకు రెండువైపులా ఉన్న భవనాలు అన్నీ తెల్లటి తళతళలతో ఆకాశాన్ని అంటుతూ ఉన్నవి. ఆ భవనాలకు బంగారు బహిర్ద్వారాలు అమర్చి ఉన్నవి. ఆ బహిర్ద్వారాలమిద లతలూ, పక్షులూ మొదలు అయినవి చెక్కి ఉన్నవి. చేపలూ, మొసళ్ళూ మొదలు అయిన బొమ్మలు వున్న చిన్నచిన్నవీ,

పెద్దపెద్దవీ జెండాలు ఆ పట్టణము అంతటా ఎగురుతూ ఉన్నవి. త్రికూటపర్వతము మీద మంగళకరము అయిన తెల్లటి భవనాలతో ఉన్నందువల్ల, అది ఆకాశములో తేలిపోతూ ఉన్న పట్టణము వలె కనిపించింది.

ఆ పట్టణ ప్రాకారానికి అండలుగా ఉన్న ఇసుక తిన్నెలు జఘనాల వలెనూ, అగడ్తలోవున్న శుద్ధోదకాలు కట్టుకొన్న చీరవలెనూ, శతఘ్నులూ, శూలాలూ తల వెంట్రుకలతో పెట్టుకొన్న కొప్పువలెనూ, కోటబురుజులు కర్ణాభరణాలవలెనూ ఆ లంకాపట్టణము ఒక సుందరాంగనవలె తోచింది. ఆకాశాన్ని ఒరుసుకొని పోయే కైలాసపర్వతమువలెనూ, పెద్దపెద్ద ఎత్తు అయిన భవనాలతో ఆకాశములోనికి ఎగిరిపోతున్న పట్టణమువలెనూ ఆ లంకాపట్టణము కనిపించింది. అది విశ్వకర్మ సంకల్పబలముతో నిర్మించినట్లు తోచింది. అది ఇటువంటిది, అటువంటిది అని ఊహించడానికి అలవికాకుండా ఎంతో అద్భుతముగా అన్ని వైపులా కనిపించింది.

పూర్వము అక్కడ కుబేరుడు నివసించినాడు. ఆ పట్టణాన్ని ఇప్పుడు రావణాసురుడు పరిపాలిస్తున్నాడు. మహాసర్పాలు పర్వతగుహను కాచినట్టు శూలాలతోనూ, పట్టిసాలతోనూ, పెద్ద పెద్ద కోరలతోనూ ఉన్న రాక్షసులు అనేకమంది ఆ పట్టణాన్ని కావలి కాస్తున్నారు. అట్లా రాక్షసులు కావలికాస్తూ వున్న ఆ లంకాపట్టణాన్నీ, దాని చుట్టూవున్న మహాసముద్రాన్నీ హనుమంతుడు అప్పుడు తేరిపార చూచినాడు. ఆ రావణాసురుణ్ణి మహాభయంకర శత్రువుగా భావించినాడు. ఆలోచించసాగినాడు.

"వానరులు అందరూ యీ మహాసముద్రాన్ని దాటి రాలేరు. ఒక వేళ దాటి వచ్చినప్పటికిన్నీ నిరర్థకము అవుతుంది. ఈ లంకాపట్టణాన్ని దేవతలు అయినప్పటికిన్నీ యుద్ధములో జయించడము అశక్యము. ఆ మహాబాహువు రాముడు వచ్చినప్పటికిన్నీ ఎటూ దారి లేకుండా దుర్గమముగా ఉన్న ఈ పట్టణాన్ని జయించలేడు. ఈ రాక్షసులతో సామోపాయము పనిచేయదు. వీండ్లు అందరూ ఐశ్వర్యవంతులు. ధనానికి లొంగరు. మిత్రభేదానికి ఎడమే లేదు. ఇక వీండ్లతో యుద్ధము చేయడము అసంభవము.

"ఆ ధీమంతుడు వానరరాజు సుగ్రీవుడూ, ఆ మహాపరాక్రమవంతుడు అంగదుడూ, నీలుడూ, నేనూ తప్ప మరి వానరులు ఎవరూ ఇక్కడికి రాలేరు. ఇప్పుడు ఇంతకూ ఆ వైదేహి సీతాదేవి జీవించి ఉందో లేదో? ఆమె జీవించి ఉంటే నేను ఆమెను చూచిన తరువాత ఈ విషయము అంతా ఆలోచించవలెను' అని ఆ కొండమీద నిలుచున్న హనుమంతుడు అనుకొన్నాడు.

ఆ బుద్ధిమంతుడు, ఆ బలవంతుడు హనుమంతుడు రామాభ్యుదయ కాంక్షి. అందువల్ల, మళ్ళీ ఆలోచించడము మొదలుపెట్టినాడు.

ఈ లంకాపట్టణాన్ని మహాఘాతుకులు అయిన రాక్షసులు కావలికాస్తూ ఉన్నారు. వాండ్లు అందరూ ఉగ్రతేజస్కులు, మహాబలవంతులు, అమిత పరాక్రమవంతులు. నేను ఈ రూపముతో పోతే వాండ్లు నన్ను పట్టుకొంటారు. అందువల్ల, వాండ్లను వంచనచేసి నేను లోపలికి పోవలెను. సీతాదేవి ఎక్కడ ఉన్నదీ వెతకవలెను. చీకటిపడ్డ తరువాత కనీ కనపడని ఆకారముతో ఈ పట్టణములో చొరపడవలెను. అట్లా చేయకలిగితేనే నేను తలపెట్టిన ఈ మహత్కార్యము సాధించడానికి వీలు అవుతుంది. నేను చేయ సంకల్పించుకొన్న పనికి రాత్రే తగిన సమయము" అని అనుకొన్నాడు.

భయంకర రాక్షసులు కావలికాస్తూ ఉన్నందువల్ల సురాసురులు అయినా ఎదిరించలేని లంకాపట్టణాన్ని చూస్తూ పదే పదే నిట్టూర్పులు విడుస్తూ "రావణాసురుడు దురాత్ముడు. వాడి కంట పడకుండా ఏదో ఒక ఉపాయముతో ఆ మైథిలిని సీతాదేవిని చూడవలెను. ఎట్లా చేస్తే రాముని పని చెడిపోకుండా ఉంటుందో అట్లా చేయవలెను. ఆ జనకాత్మజ దగ్గిర ఎవరూ లేనప్పుడు, ఒంటరిగా ఉన్నప్పుడు నేను పోయి చూడవలెను.

" ఆలోచన లేని దూతలు దేశ కాల విరుద్ధముగా ప్రవర్తిస్తే సూర్యోదయవేళ చీకట్లు పటాపంచలు అయినట్లు, కాబోతున్న పనులు కూడా నాశనము అయిపోతవి. ప్రభువు మంత్రులతో ఆలోచించి ఇది కార్యము, ఇది అకార్యము అని నిశ్చయించి అజ్ఞాపించినప్పటికిన్నీ, తామే పండితులము అనుకొనే దూతలు, చేతకాక పనులు పాడుచేస్తూ ఉంటారు. ఎట్లా చేస్తే రామకార్యము చెడిపోకుండా నెరవేరుతుందో, ఎట్లా చేస్తే నా మనసు వికలము అయిపోకుండా ఉంటుందో, ఎట్లా చేస్తే నా దుస్తర సముద్రలంఘనము వ్యర్థము అయిపోకుండా సార్థకము అవుతుందో అట్లా నేను ఇప్పుడు చేయవలెను. రాక్షసులు నన్ను చూచేట్టు అయితే, రావణాసురుణ్ణి నాశనము చేయవలెను అనుకొంటున్న రాముడి పని పాడు అయిపోతుంది. ఇక్కడ నేను రాక్షసులకు తెలియకుండా ఉండడము అశక్యము. ఒకవేళ నేను రాక్షసరూపము ధరించినప్పటికిన్నీ వాండ్లు నన్ను పట్టుకోగలుగుతారు. ఏ రూపము ధరించినప్పటికిన్నీ వాండ్లు ఎవండ్లను అయినా కనిపెట్టగలరు. రూపమే లేని వాయుదేవుణ్ణి సహితము వాండ్లు శాసిస్తూ ఉన్నారు. వాండ్ల అనుమతి లేకుండా వాయుదేవుడు ఇక్కడ వీచడము లేదు. ఇక్కడ రాక్షసులు తెలుసుకోనిది ఏమీ లేదు. నేను ఇకను ఇప్పుడు నా సహజ రూపములో ఉండేట్లయితే నేను నాశనము అయిపోవడము తప్పదు. ఆ సుగ్రీవ ప్రభువు ప్రయోజనమున్నూ పాడు అయిపోక తప్పదు. అందువల్ల, నేను ఏదో ఒక హ్రస్వరూపము ధరించవలెను. రామకార్య సాఫల్యము కోసము చీకటిపడ్డ

తరువాత లంకా పట్టణానికి పోవలెను. చొరనలవి కాకుండా రావణాసురుడు ఏలుతూ ఉన్న ఈ మహాపట్టణానికి రాత్రిపూటనే పోవడానికి వీలు అవుతుంది. అప్పుడే భవనాలు అన్నీ వెతకడానికిన్నీ, జనకాత్మజను సీతాదేవిని చూడటానికిన్నీ సాధ్యము అవుతుంది'' అని ఆ కపివీరుడు హనుమంతుడు ఆలోచించి నిశ్చయించుకొన్నాడు. సీతాదర్శనోత్సుకతతో సూర్యాస్తమయము కోసము ఎదురుచూస్తూ ఉండిపోయినాడు.

సూర్యాస్తమయము అవుతూ ఉండగా దేహాన్ని కురచ చేసినాడు. పిల్లి అంత దేహముతో అద్భుతముగా కనిపించినాడు. ఆ అసురసంధ్యవేళ ఆ వీర్యవంతుడు హనుమంతుడు ఒక్కగంతువేసి పైకి ఎగిరి మనోహరము అయిన లంకాపట్టణము దగ్గరకు పోయినాడు. బహిర్ద్వారములో నుంచి లోపలికి చూచినాడు.

బంగారు వెండి స్తంభాలతోను, బంగారుమయము అయిన కిటికీలతోను, బంగారు రేకులూ స్ఫటికాలూ తాపటము చేసిన నేలలతోను ఉన్న ఏడు ఎనిమిది అంతస్తుల ప్రాసాద గృహాలను చూచినాడు. వైడూర్యమణులు పొదిగి ముత్యాలతో ముగ్గులు పెట్టిన నేలలతోను, అంతటా విచిత్రముగా అలంకరించిన బంగారు బహిర్ద్వారాలతోను అక్కడి రాక్షసుల భవనాలు ధగధగలాడుతూ కనిపించినవి. తెల్లగా ఎంతో ఎత్తున ఉన్న విమానగృహాలతోను, భీమబలులు అయిన రాక్షసులతోను, ఊహించనలవికాని అద్భుతాకారముతోను గంధర్వ నగరమువలె లంకాపట్టణము కనిపించింది.

ఆ మహాపట్టణాన్ని చూచి హనుమంతుడు విషణ్ణుడు అయినాడు. అయితే సీతాదేవిని చూడగలను అనే ధైర్యముతో సంతోషపడ్డాడు.

అప్పుడు ఆ హనుమంతుడికి సాచివ్యము చేసేవాడివలె చంద్రుడు తారాగణాల మధ్యను తేజరిల్లుతూ, వెన్నెల చాందినీని ఆకాశము అంతటా పరిచి అనంత కిరణాలతో నిలుచున్నాడు. క్షీరమృణాలవర్ణముతోను, శంఖప్రభలతోను ఉదయించిన ఆ చంద్రుడు, అప్పుడు తామరకొలనులో తెల్లని కాంతులతో విహరిస్తూ ఉన్న హంసవలె కనిపించినాడు.

3

హనుమంతుని లంకా పట్టణ ప్రవేశము

ఆ కపికుంజరుడు, ఆ మహాసత్త్వసంపన్నుడు, ఆ మహామేధావి వాయుదేవుడి పుత్రుడు హనుమంతుడు వేళ్ళాడుతున్న మేఘమువలె కనపడే లంబపర్వత శిఖరమువిూదనుంచి మనోధైర్యముతో ఆ రాత్రి బయలుదేరి రావణాసురుడు

ఎలుతున్న లంకాపట్టణములో రమ్యోద్యానవనాలనూ జలాశయాలనూ చూస్తూ ప్రాకారము దగ్గిరకు పోయినాడు.

ఆ లంకాపట్టణములో భవనాలు శరత్కాల మేఘాలవలె తేజరిల్లుతూ ఉన్నవి. సముద్రఘోషమువలె జనుల కలకల ధ్వనులు వినిపించినవి. సముద్రముగాలి చల్లగా వీస్తూ ఉంది. చతురంగ బలాలు సంతోషముతో సింహనాదాలు చేస్తూ ఉన్నవి. బహిర్ద్వారాల దగ్గిర మదపు టేనుగులు కట్టివేసి ఉన్నవి. ఆ యా భవనాలు అన్నీ మెరుపులతో మెరిసే మేఘాలవలె కనిపించినవి. ఆ యా వీధులలో జ్యోతులు వెలుగుతూ ఉన్నవి. చిన్న చిన్న గంటల చప్పుళ్ళు చేస్తూ జండాలు ఎగురుతూ ఉన్నవి. చుట్టూ ప్రాకారము బంగారు కాంతులతో ధగ ధగలాడుతూ ఉంది.

హనుమంతుడు ఆ పట్టణాన్ని నాల్గువైపులా చూచినాడు. ప్రాసాదాలమీద విహార స్థలాలు కనిపించినవి. ఆ విహార స్థలాలలో బంగారు వేదికలు వేసి ఉన్నవి. వాటిలో వైడూర్యమణులు పొదిగి ఉన్నవి. అవి వజ్రాలతోనూ, స్ఫటికాలతోనూ, ముత్యాలతోనూ, రత్నాలతోనూ అలంకరించి ఉన్నవి. వాటి పైభాగాలు రజతమయము అయి తెల్లగా మనోజ్ఞముగా కనిపించినవి. ఆ ప్రాసాదాగ్రభాగాలలో చతుశ్శాలలు వైడూర్యమణులు పొదిగిన సోపానాలతోనూ, స్ఫటిక మణుల తళతళలతోనూ ఆకాశానికి ఎగిరిపోతున్నట్టుగా కనిపించినవి. అందము అయిన నెమళ్ళూ, కొంచపిట్టలూ కలకల ధ్వనులు చేస్తూ ఉన్నవి. ద్వారాల దగ్గిర రాజహంసలు తిరుగుతూ ఉన్నవి. నృత్తగీతవాద్యధ్వనులూ, స్త్రీల ఆభరణాల చప్పుళ్ళూ మారుమోగుతున్నవి. ఆ లంకాపట్టణము 'విటపావతి' అనే కుబేరుడి అలకాపట్టణమువలెనూ, దేవేంద్రుడికి తూర్పు దిక్కున ఉన్న 'వస్వౌకసారము' అనే పట్టణమువలెనూ తోచింది. ఆ వీర్యవంతుడు హనుమంతుడు ఆ పట్టణాన్ని అంతా చూచినాడు. అక్కడ ఉన్న ఆయుధధారులను అందరినీ పరిశీలించి చూచినాడు. సంతోషపడి పోయినాడు. అతడు అదివరకు దూరమునుంచి చూచి ఆ పట్టణాన్ని ఎవడూ జయించలేడు అనుకున్నాడు. ఇప్పుడు దగ్గిరనుంచి చూచినాడు. ఆలోచించసాగినాడు.

"ఈ లంకాపట్టణము చొరనలవికానిదిగా కనబడుతున్నప్పటికిన్నీ కుముదుడూ, అంగదుడూ, సుషేణుడూ, మైందద్వివిదులూ ఈ పట్టణాన్ని జయించగలరు. వారే కాదు, సూర్యపుత్రుడు సుగ్రీవుడుకానీ, కుశపర్వుడుకానీ, ఋక్షుడుకానీ, కేతుమాలుడుకానీ, నేనుకానీ ఈ పట్టణాన్ని సులభముగా కొట్టగలము" అనుకొంటూ ఆ మహాబాహువులను రామలక్ష్మణులను గురించీ, వారి పరాక్రమాన్ని గురించీ యోచించినాడు. సంతోషముతో ఉప్పొంగిపోయినాడు.

ఆ కపివీరుడు అంతట మళ్ళీ ఆ లంకాపట్టణాన్ని చూడసాగినాడు. రత్నాల కాంతులు చీరెగానూ, పశుశాలలు కర్ణభూషలుగానూ, యంత్రాగారాలు స్తనాలుగానూ, సర్వసమృద్ధి నవయౌవనముగానూ ఆ లంకాపట్టణము సింగారించుకొన్న సీమంతినిగా కనిపించింది. ఆ యా మహాగృహాలలో దేదీప్యమానముగా వెలుగుతున్న దీపకాంతుల వల్లనూ, ఆ యా గృహాల తెల్లటి కాంతులవల్లనూ, వీధులలో వేళ్ళాడకట్టిన జ్యోతుల వల్లనూ రావణాసురుడు ఏలుతూ ఉన్న ఆ లంకాపట్టణములో చీకటి అనేది లేదు.

లంకాధి దేవతను జయించుట

అప్పుడు ఆ లంకాపట్టణములోకి రాపోతూ ఉన్న ఆ మహా బలవంతుణ్ణి హనుమంతుణ్ణి లంకాధిదేవత చూచింది. వికృతాననముతో పెద్దపెట్టున అరుస్తూ లేచి హనుమంతుడి ఎట్టఎదుట నిలుచుని, "నీవు ఎవడవు? నీవు అడవిలో ఉండవలసిన కోతివి. ఇక్కడికి ఏమి పనిమీద వస్తున్నావు? నీ ప్రాణము తీసివేస్తాను. ముందు చెప్పు. నీవు ఏమి పనిమీద వచ్చినావో యథార్థము చెప్పు. ఓ కోతీ! రావణాసురుడి సైన్యాలు అన్ని వైపులా కావలి ఉన్నవి. ఈ పట్టణములో చొరపడడము నీ తరము కాదు. ముందు చెప్పు, నీవు ఎందుకు వచ్చినావో" అంటూ అడ్డగించింది.

అట్లా అంటూ ఎట్టఎదుట నిలుచుని ఉన్న ఆ లంకాధిదేవతను ఆ పరమపరాక్రమవంతుడు హనుమంతుడు చూచి, "నీవు అడిగింది అంతా యథార్థము చెప్పుతాను. నీ ముఖము వికృతముగా ఉంది. నీ కన్నులు అంతకన్నా వికృతముగా ఉన్నవి. నీవు ఎవతెవు? ఎందుకు ఈ పట్టణము వాకిట నిలుచున్నావు? ఎందుకు నన్ను అడ్డగించినావు? ఎందుకు దారుణముగా జడిపిస్తున్నావు" అని అడిగాడు.

ఆ మాటలకు ఆ కామరూపిణికి కోపము వచ్చింది. ఆ వాయుపుత్రుణ్ణి చూచి అతి కఠినముగా, "ఓ కోతీ! రావణాసురుడు రాజు. మహాపరాక్రమవంతుడు. నేను ఆయన్ను కనిపెట్టుకొని ఉన్నాను.ఈ పట్టణానికి కావలి కాస్తున్నాను. నన్ను ఎవరూ ఎదిరించలేరు. నన్ను అలక్ష్యము చేసి నీవు ఈ పట్టణములోకి పోలేవు. ఇప్పుడే నిన్ను పెద్దనిదురపోయేట్టు చేస్తాను, జాగ్రత్త. ఓ కోతీ! నేను ఎవరు అనుకొన్నావు? నేనే ఈ లంకాపట్టణాన్ని; అంటే ఈ లంకాధిదేవతను. నా సంగతి చెప్పినాను. ఇక నీ సంగతి చెప్పు" అని అడిగింది.

హనుమంతుడు ఆ క్షణమే యుద్ధసన్నద్ధుడు అయినాడు. పర్వతమువలె అచలముగా, అకంపముగా నిలుచున్న ఆ వికృతాకారను చూచి, "పెద్ద ప్రాకారముతో, బహిర్ద్వారముతో, కోట బురుజులతో వున్న ఈ లంకాపట్టణాన్ని చూడవలెను అనే కుతూహలముతో వచ్చినాను. ఇక్కడ ఉన్న పెద్ద పెద్ద తోపులూ, పూలతోటలూ, పెద్ద పెద్ద భవనాలు చూచిపోతాను" అని చెప్పినాడు.

ఆ మాటలకు ఆ కామరూపిణి మరింత పరుషముగా, "ఓ వానరుడా! నీకు ఏదో దుర్బుద్ధి పుట్టింది. ఇది రావణాసురుడు ఏలుతూ ఉన్న లంకా పట్టణము. నీవు లోపలకి పోవడానికి వీలులేదు. నేను నిన్ను చంపివేస్తాను " అని చెప్పింది.

"ఓ లంకా! నీవు శుభకరివి. నేను ఈ పట్టణము అంతా తిరిగి చూస్తాను. అంతే, ఆ తరువాత నేను వచ్చిన దారినే పోతాను" అని హనుమంతుడు అన్నాడు.

'ఏమిటీ' అంటూ ఆ లంకాధిదేవత భయంకరముగా అరిచింది. అరచెయ్యి చాచింది. హనుమంతుణ్ణి ఫెళ్ళున కొట్టింది. అతనికి మంచి దెబ్బే తగిలింది. క్రోధపరవశుడు అయిపోయినాడు. ఎడమచేతి వేళ్లు ముణిచినాడు. కెవ్వున కేక వేసినాడు. పిడికిలితో ఆ లంకాధిదేవతను కొట్టినాడు. 'ఇది ఆడుది, దీనిని చంపకూడదు' అనుకొన్నాడు. కోపము తగ్గిపోయింది.

హనుమంతుడి పిడికిటిపోటుకు ఆ లంకాధిదేవత అవయవాలు స్వాధీనము తప్పిపోయినవి. ఆ వికారాకార వికృతముగా నోరు తెరచింది. అంతకన్నా వికృతపుచూపుతో తటాలున నేల కూలింది. అట్లా నేలకూలిన ఆ రాక్షసిని, ఆ తేజోవంతుడు హనుమంతుడు తేరిపార చూచినాడు. అతడు సమస్తమూ తెలిసినవాడు. ఆమె ఆడుది అని జాలిపడ్డాడు.

ఆ వానరోత్తముణ్ణి హనుమంతుణ్ణి చూచి, ఆ రాక్షసి మహా భయపడిపోయింది. గర్వము లేకుండా గద్గద కంఠముతో, "మహాబాహూ! అనుగ్రహించు. ఓ వానరోత్తమా! నీవు ఎంతో మంచివాడవు. నన్ను రక్షించు. స్త్రీని చంపకూడదు అనే నియమము మహాబలవంతులూ, శౌర్యవంతులూ తప్పరు. నీవు నన్ను చంపివేయవద్దు. నేను అయితే సాక్షాత్తూ లంకాధిదేవతను. నన్ను ఎవరూ జయించలేరు. అయితే, నీవు మహాబలవంతుడవు. అమిత పరాక్రమవంతుడవు. నీ పరాక్రమముతో నన్ను జయించినావు. (ఇకను ఈ లంకాపట్టణములో రాక్షసుల పని అయిపోయింది)

"ఓ వానరోత్తమా! పూర్వము నాకు బ్రహ్మదేవుడు వరము ఇచ్చినాడు. అది చెప్పుతాను, విను. రావణాసురుడు దిగ్విజయముచేసే సమయములో నందికేశ్వరాదు లను బాధించినాడు. అందుకు వారు 'లంకా పట్టణము భస్మము అయిపోవలెను' అని శాపము పెట్టినారు. నేనూ భస్మము అయిపోతానేమోనని భయపడ్డాను. అంతట బ్రహ్మదేవుడి దగ్గరకు పోయి ఆ నందికేశ్వరాదుల శాపము తొలగించమని ప్రార్థించినాను. బ్రహ్మదేవుడు నా ప్రార్థనను ఆలకించినాడు. లంక ఇప్పుడు దగ్ధము అయిపోదు అని చెప్పుతూ నన్ను చూచి "ఓ లంకాధిదేవతా! ఎప్పుడు అయితే ఒక వానరుడు వచ్చి నిన్ను జయిస్తాడో అప్పుడు రాక్షసులు నాశనము అయిపోతారు" అని బ్రహ్మదేవుడు నాకు చెప్పినాడు.

"ఓ వానరోత్తమా! నీవు ఇప్పుడు ఇక్కడికి వచ్చినావు. నేను నీ దర్శనము చేసినాను. నీవు నన్ను జయించినావు. బ్రహ్మదేవుడు చెప్పిన సమయము వచ్చింది. ఇకను ఈ రాక్షసులు నాశనము అయిపోతారు. అది స్వయంభువు అయిన బ్రహ్మదేవుడి నిర్ణయము. అది దబ్బర కాదు. దానికి తిరుగులేదు. సీతాదేవిని దొంగిలించుకొని రావడముతో దురాత్ముడు అయిన ఈ రావణాసురుడికిన్నీ, సమస్త రాక్షసులకున్నూ చేటుకాలము వచ్చింది.

"వానరోత్తమా! నీవు యీ పట్టణములోకి పో! ఏవి ఏవి చూడవలెను అనుకుంటున్నావో వాటిని అన్నిటినీ చూడు. కావలసిన పనులు అన్నీ చక్కపెట్టుకో. రావణాసురుడు ఏలుతూ ఉన్న ఈ లంకాపట్టణానికి బ్రహ్మదేవుడి నిర్ణయము తప్పదు. నీకు శుభము అవుతుంది. యధేష్టముగా, యధాసుఖముగా ఈ పట్టణము అంతా తిరిగి చూడు. ఆ జనకాత్మజను సీతాదేవిని వెతుకు" అని చెప్పింది.

4
సీతాన్వేషణ ప్రారంభం

ఆ కామరూపిణిని లంకాధిదేవతను ఆ మహాతేజోవంతుడు హనుమంతుడు ఓడించినాడు. అంతట ఆ మహాబాహువు లంకానగర ద్వారములోనుంచి కాకుండా ప్రాకారము మీదుగా ఎగిరి లోపలికి పోయినాడు. (శత్రు గ్రామానికి కానీ, శత్రు నగరానికి కానీ బహిర్ద్వారములో నుంచి పోకూడదు అనీ, అందులో శత్రువును జయించతలచుకొన్నప్పుడు అట్లా ఎంత మాత్రము చేయకూడదు అనీ శాస్త్రములో చెప్పివుంది. హనుమంతుడు సమస్త శాస్త్రాలు చదివినవాడు. అందువల్ల, నగర బహిర్ద్వారములోనుంచి కాకుండా, ఎగిరి ప్రాకారము మీదుగా లంకాపట్టణములోకి పోయినాడు.)

ఆ వానరవీరుడు రామదూత హనుమంతుడు లంకానగరము ప్రవేశిస్తూ శత్రువుల శిరస్సుమీద ఎడమపాదము పెట్టినాడు. అంటే, శత్రుదేశములో ఎడమపాదము పెట్టడమే శత్రువుల శిరస్సు మీద ఎడమపాదము పెట్టినట్టు అని రాజశాస్త్రములో చెప్పి ఉంది. అంతేకాదు, ఎక్కడికి అయినా ప్రయాణము అయేటప్పుడూ, గృహప్రవేశమప్పుడూ, వివాహము చేసుకోడానికి పోయేటప్పుడూ కుడిపాదము పెట్టవలెను అనీ, శత్రు పట్టణములోకి పోయేటప్పుడు మొదట ఎడమ పాదము పెట్టవలెను అనీ బృహస్పతి చెప్పినాడు. అందువల్ల, హనుమంతుడు లంకా పట్టణములో అడుగు వేసీ వేయడము ఎడమ అడుగు వేసినాడు.

ఆ ధైర్యవంతుడు హనుమంతుడు ఆ రాత్రి, ఆ లంకాపట్టణ రాజ వీధిగుండా నడిచినాడు. రమణీయము అయిన ఆ పట్టణాన్ని అంతా తిరిగి చూచినాడు.

ఎటుపోయినా, ఎక్కడ చూచినా నృత్తగీత ధ్వనులు మారుమ్రోగుతున్నవి. స్త్రీ పురుషులు సంతోషాతిశయముతో పెద్దపెట్టున నవ్వుతున్నారు. వజ్రఖచితము అయిన గృహాలు 'ఐరావతము' అనే దేవేంద్రుడి ఏనుగువలె తెల్లటికాంతులతో తేజరిల్లుతూ ఉన్నవి. ఆకాశములో తెల్లటి మేఘాలవలె వివిధాకారాలతో చిత్రవిచిత్రముగా అవి కనిపించినవి. నాలుగు మూలలనూ నాలుగు గదులతోనూ, నాలుగు వైపులనూ నాలుగు ద్వారాలతోనూ ఉన్న 'పద్మము' అనే గృహాలనూ, నడుమ బయలుగా ఉండి దక్షిణపు వైపున ద్వారము లేకుండా ఉండే 'వర్ధమానము' అనే గృహాలనూ, అదేవిధముగా తూర్పుకు వాకిలి లేకుండా ఉండే 'స్వస్తికము' అనే గృహాలనూ చూచినాడు. ఆ గృహాలు అన్నీ పూలదండలతో అలంకరించి ఉన్నవి.

ఆ హనుమంతుడు చిత్రవిచిత్రము అయిన రంగుల పూలదండలతో అలంకరించిన ఆ భవనాలను అన్నిటినీ చూస్తూ, ఆ పట్టణము అంతా తిరుగుతూ సీతాదేవిని తాను చూడకలను అనుకొని సంతోషపడ్డాడు. వివిధాకారాలతో వివిధ వర్ణాలతో ఉన్న ఇంటి ఇంటికీపోయి చూచినాడు. ఆ భవనాలలో స్త్రీలు మద్యపానము చేసి దేవలోకములో అప్సరాంగనలవలె మంద్ర మధ్యమ తార స్వరాలతో ఆలాపిస్తూన్న మధురగానము విన్నాడు. ఆ గృహాలలో స్త్రీలు మెట్లు ఎక్కేటప్పుడూ దిగేటప్పుడూ అయ్యే కాళ్ళ అందెల చప్పుళ్ళూ, మొలనూలి చిరుగంటల చప్పుళ్ళూ, వీరపురుషులు తమ పరాక్రమము చెప్పుకుంటూ భుజాలు అరచేతులతో చరుచుకొంటూ ఉన్న చప్పుళ్ళూ, యోధులు సంతోషాతిశయముతో అరుస్తున్న అరుపులూ విన్నాడు.

ఆ హనుమంతుడు అట్లా పోతూ రాజవీధిలో విడిసిన రాక్షస సైన్యాన్ని (మూలబలాన్ని) చూచినాడు. ఆ సైన్యము మధ్యభాగములో ఉన్న అనేకమంది రాక్షస చారులను చూచినాడు. కూట ముద్గర ముసల ఆయుధ ధారులనూ, ఖడ్గపరిఘా దండాయుధ ధారులనూ, శతఘ్నులను ప్రయోగించే వాండ్లనూ, చిల్లకోలలూ చెట్లూ ఆయుధాలుగా వాడే వాండ్లనూ, పట్టిసాలతో పోరాడే వాండ్లనూ, క్షిపణీపాశమూ వజ్రమూ మొదలు అయిన ఆయుధాలతో ఉన్న వాండ్లనూ, వివిధాయుధ ధారులనూ, రంగురంగుల కవచాలు తొడుగుకొని ఉన్న యోధులనూ, రాజ చిహ్నాలు చిత్రించిన జండాలు పట్టుకొని ఉన్న వాండ్లనూ, వట్టి జండాలు పట్టుకొని ఉన్న వాండ్లనూ చూచినాడు.

ఆ యా గృహాలలో యజ్ఞదీక్షలో ఉన్నవారినీ, దీక్ష అయిపోయిన ముండిత శిరస్కులనూ, జడలు ధరించి జపము చేస్తున్నవారినీ, ఎద్దుతోలు కట్టుకొన్న వారినీ, అరిష్టాలు పోగొట్టడానికి పిడికిటిలో ఉన్న దర్భలు మంత్రించి ఇచ్చేవారినీ, శత్రువులను చంపివేయడానికి అభిచారికహోమాలు చేసేవారినీ చూచినాడు. ఇంకా పట్టణములో వికృత ముఖాలవాండ్లను, వంకర ముఖాలవాండ్లను, ఎక్కువ తక్కువ దేహాలవాండ్లను,

ఒంటి కంటివాండ్లను, ఒకే చెవి ఉన్నవాండ్లను, వేళ్ళాడుతున్న పొట్టలవాండ్లను, వేళ్లాడుతున్న చన్నులు ఉన్నవాండ్లను, మరీ లావాంటివాండ్లు కానివాండ్లను, మరీ సన్నటివాండ్లు కానివాండ్లను, మరీ తెల్లగాను మరీ నలుపుగాను లేకుండా ఉన్న వాండ్లను, మరీ పొడుగుకాకుండాను, మరీ పొట్టికాకుండాను, మధ్య రకముగా ఉన్న వాండ్లను, ఎక్కువ గూని లేనివాండ్లను, పొట్టివాండ్లు కానివాండ్లను, విరూపులను, సురూపులను, సువర్చస్కులను, బహురూపులను, చందనాది మైపూతలు పూసుకొని పూలదండలతోను, అమూల్యాభరణాలతోను అలంకరించుకొని చిత్ర విచిత్ర విశేషాలతో యథేష్టముగా విహరిస్తున్న వాండ్లను చూచినాడు.

ఆ పట్టణములో ఆ యా ఇండ్లలోను, ఆ యా వీధులలోను ఉన్న వారిని అందరినీ చూచి, హనుమంతుడు అంతట పట్టణ మధ్య భాగములో ఉన్న రావణాసురుడి భవనము దగ్గరకు పోయినాడు. అది ఒక పర్వత శిఖరము మీద ఉంది. చుట్టూ పెద్ద ప్రాకారము, బంగారు బహిర్ద్వారము, అగాధము అయిన అగడ్త ఉన్నవి. ఆ అగడ్తనిండా తెల్ల తామరలు ఉన్నవి. ఆ అంతఃపుర మధ్య భాగములో ఒక లక్ష మంది సైనికులు ఏమరుపాటు లేకుండా హెచ్చరికతో ఉన్నారు. రథాలూ, విమానాలూ, అందము అయిన గుర్రాలూ, ఏనుగులూ, తెల్లని మబ్బుల గుంపులవంటి నాల్గు దంతాలు ఉన్న తెల్లని ఏనుగులూ, పొగరెక్కిన మృగాలూ, మదించిన పక్షులూ ఆ అంతఃపురము ఆవరణలో వున్నవి. మహాపరాక్రమవంతులు అయిన రాక్షసులు ఏమరుపాటు లేకుండా కావలి కాస్తున్నారు.

అప్పుడు గుర్రాలు సకిలిస్తున్నవి. స్త్రీల ఆభరణాల ధ్వనులు వినపడుతూ ఉన్నవి. బంగారు ప్రాకార మండలాలతోనూ, మహార్హము అయిన ముక్తామణులతో అలంకరించిన అంతర్భాగాలతోనూ, కృష్ణాగరుచందనాది ధూపాల ఘుమఘుమల తోనూ తేజరిల్లుతూ వున్న రావణాంతఃపురములోనికి హనుమంతుడు గుట్టుచప్పుడుగా పోయినాడు.

5

హనుమంతుడు రాక్షస మందిరాలు వెతుకుట

హనుమంతుడు రాక్షసరాజు భవనములోకి పోయినాడు.

అప్పుడు ఆకాశము మధ్యకు పోయి వెన్నెల కాస్తూ, కాంతులు వెదజల్లుతూ వున్న చంద్రుడు ఆవులమందలో తిరుగుతూ ఉన్న ఆబోతు వలె కనిపించాడు.

ఆ శీతాంశుడు ఈ లోకములో సమస్తము అయిన వారి దుఃఖాలను పోగొట్టుతూనూ, సముద్రాన్ని ఉప్పొంగచేస్తూనూ, సర్వభూతాలనూ తేజరిల్ల చేస్తూనూ ఆకాశములో తిరుగుతూనూ వున్నాడు.

ఏ కాంతి ఈ భూమిలో మందరపర్వతముమీద తేజరిల్లుతూ వుంటుందో, ఏ కాంతి రాత్ర్యారంభ సమయాన సముద్రముమీద తేజరిల్లుతూ వుంటుందో, ఏ కాంతి నీళ్ళలో పద్మాలమీద తేజరిల్లుతూ వుంటుందో ఆ కాంతితో చంద్రుడు అప్పుడు తేజరిల్లుతూ వున్నాడు.

వెండిపంజరములో వున్న హంసవలెనూ, మందరపర్వత కందరములో నిలుచున్న సింహమువలెనూ, మదపుటేనుగుమీద కూర్చున్న మహావీరుడివలెనూ చంద్రుడు అప్పుడు ఆకాశములో భాసిస్తూ ఉన్నాడు.

వాడికొమ్ముల తెల్ల ఆబోతువలెనూ, ఉన్నతశిఖరాల శ్వేత మహా పర్వతమువలెనూ, తెల్లటి దంతాలకు బంగారు పొన్నులు వేసిన మదపుటేనుగు వలెనూ పరిపూర్ణ శృంగాలతో (పదహారు కళలతో) చంద్రుడు అప్పుడు తేజరిల్లుతూ వున్నాడు.

వర్షాకాలము వెళ్ళిపోయినందువల్ల నీటితుంపరుల అడ్డము లేకుండానూ, శీతాకాలము రానందువల్ల మంచుమకిలి లేకుండానూ, సూర్యకాంతులను సంగ్రహించి తక్కిన గ్రహాలను కనపడకుండా చేసి మాలిన్యము ఏమీ లేకుండా కాంతిలక్ష్మికి తన ఒడిలో ఆశ్రయము ఇచ్చిన శశాంకుడు అప్పుడు ఆకాశములో విరాజిల్లుతున్నాడు.

సింహము గుహలోనుంచి శిలాతలానికి వచ్చినట్టూ, మదపుటేనుగు మహారణరంగానికి వచ్చినట్టూ, రాజు రాజ్యానికి వచ్చినట్టూ అప్పుడు చంద్రుడు ఆకాశానికి వచ్చినాడు. రాత్ర్యారంభకాలాన చీకట్లను తన పండువెన్నెలతో తొలగతోసినాడు. మాంస భక్షణ సంచారాదులకు రాక్షసులను పురికొల్పినాడు. కోపాభిమాన సంబంధము అయిన మనో వికారాలను కామినీకాముకులకు పోగొట్టినాడు. జగత్తు అంతా స్వర్గతుల్యముగా చేసివేసినాడు.

కర్ణపేయముగా వీణావాద్యతంత్రీరవాలు వినబడుతున్నవి. స్త్రీలు తమ భర్తలతో కూడా పడుకొని హాయిగా నిద్రపోతున్నారు. నక్తంచరులు అత్యద్భుత రౌద్రవృత్తులు అయి విహరిస్తూ ఉన్నారు.

మద్యపానముతో మత్తెక్కి మైమరిచి నిద్రపోతున్నవారినీ, రథాలతోనూ, గుర్రాలతోనూ, భద్రాసనాలతోనూ సర్వసమృద్ధముగా ఉన్న వారినీ అక్కడి ఇండ్లలో ఆ బుద్ధిమంతుడు హనుమంతుడు చూచినాడు. అక్కడ అప్పుడు రాక్షసవీరులు మత్తెక్కి ఒకండ్లను ఒకండ్లు కౌగలించుకొంటున్నారు. భుజాలు చరచుకొంటున్నారు. కైపుతో పేలుతున్నారు. ఒకండ్లను ఒకండ్లు వెక్కిరించుకొంటున్నారు. రొమ్ములు విరుచు కొంటున్నారు. కనపడ్డ ఆడవాండ్లమీద పడుతున్నారు. విండ్లు ఎక్కుపెట్టుతున్నారు.

ఆ రాక్షసుల ఇండ్లలో అప్పుడు కొందరు మదవతులు చందనాది మైపూతలు పూసుకొంటున్నారు. కొందరు యువతులు నిద్రపోతున్నారు. కొందరు సుందరవదనలు పక పక నవ్వుతున్నారు. కొందరు కాంతలు కోపముతో నిట్టూర్పులు విడుస్తున్నారు. కొందరు సుందరాంగనలు సరససల్లాపాలతో మునిగి తేలుతున్నారు.

ఏనుగులు ఘీంకారాలు చేస్తున్నవి. వీరపురుషులు మడుగులో పాములవలె బుసలు కొట్టుతున్నారు. సత్పురుషులు ఇష్టాగోష్ఠి చేస్తున్నారు. బుద్ధిమంతులు మనోహరముగా మాట్లాడుకొంటున్నారు. కొందరు తమ తమ పనులను శ్రద్ధాసక్తులతో చక్కపెట్టుకొంటున్నారు. కొందరు మంచి మంచి పేర్లు పెట్టి పిలుచుకొంటున్నారు. వారిలో కొందరు జగత్ప్రసిద్ధులు. వారినందరినీ హనుమంతుడు చూచినాడు.

నానాగుణాలు కలవారినీ, తమ గుణాలకు అనుకూలముగా వ్యవహారాలు చక్కపెట్టుకుంటున్నవారినీ, తమ రూపాలకు అనురూపముగా ప్రవర్తిస్తున్నవారినీ, సురూపులనూ, విరూపులనూ చూచినాడు.

ఆభరణాలతో అందముగా అలంకరించుకొని పతుల విషయములో పరిశుద్ధ హృదయాలతో ప్రవర్తిస్తున్న స్త్రీలనూ, ఓరచూపులు చూస్తూ కనుబొమ్మలు తిప్పుతూ శృంగారచేష్టలు చేస్తూ తమ ప్రియులను మద్యపానానికి పురికొల్పుతూ చక్కని చుక్కలవలె తేజరిల్లుతూ ఉన్న స్త్రీలనూ, సౌందర్య కాంతులతో తేజరిల్లుతూ తమ ప్రియులు కౌగలించుకొంటే సిగ్గుపడుతూ సంతోషముతో ఓలలాడుతూ పువ్వులలో దాగుకొన్న పెంటి పిట్టలవలె కనబడుతున్నవారినీ, మేడలమీద తమ తమ ప్రియుల ఒడిలో కూర్చున్నవారినీ, పెండ్లి చేసుకొని పతివ్రతా ధర్మముతో తమ ప్రియులను ఇనుమిక్కిలిగా సంతోషపెట్టుతున్న ప్రియురాండ్లను కొందరినీ, రతిసమయములో దిగంబరలు అయి బంగారుతీగెలవలె తళతళలాడుతున్న వారినీ, కుందనపు బొమ్మలవంటివారినీ, భర్తృవియోగమువల్ల చంద్రునివలె తెల్లగా పాలిపోయినవారినీ, తమ తమ ప్రియులను వెతుకుకొంటూ పోయి కలుసుకొని సంతోషపడుతున్నవారినీ, తమ తమ ఇండ్లకు వచ్చిన ప్రియులను కలుసుకొని సంతోషపడుతున్నవారినీ హనుమంతుడు చూచినాడు.

అప్పుడు హనుమంతుడు ఆ రాక్షసాంగనలలో మనుష్యస్త్రీ ఉందీ లేనిదీ కనుక్కోడానికి చంద్రుని కాంతులతో తేజరిల్లుతూ ఉన్న స్త్రీల ముఖాలను వరుసగా చూచినాడు. కనురెప్పలకు వెంద్రుకలు ఉన్న కన్నులను అన్నిటినీ వరుసగా చూచినాడు. రాముడు చెప్పిన సీతాదేవి సొమ్ముల ఆనవాళ్ళు ఏమి అయినా కనపడుతవేమోనని మెరపు తీగలవంటి ఆభరణాలను పెట్టుకొన్నవారిని వరుసగా చూచినాడు. ఎంత

వెతికినా ఆ సౌందర్యవతి, ఆ అయోనిజ, ఆ కృశాంగి సీతాదేవి హనుమంతుడికి కనిపించలేదు.

6, 7

ఆ హనుమంతుడు తన చిత్తము వచ్చిన రూపము ధరించి ఎక్కడికి అయినా పోగలడు. అదేవిధముగా పోయి ఆ యా విమాన గృహాలు అన్నీ వెతికినాడు. అతడికి ఆ జనకరాజసుత సీతాదేవి కనిపించలేదు. ఆ ధైర్యవంతుడు మళ్ళీ ఒకసారి ఆ యా విమాన గృహాలు అన్నీ వెతికి చూచినాడు. ప్రయోజనము లేకపోయింది.

అక్కడ సూర్యకాంతులతో తేజరిల్లుతూ చుట్టూ సువర్ణ ప్రాకారముతో ఉన్న భవనము ఒకటి కనిపించింది. హనుమంతుడు ఆ భవనము దగ్గిరకు పోయినాడు. క్రూరసింహాలు నివసిస్తూ ఉన్న మహావనము మాదిరిగా మహాభయంకరులు అయిన రాక్షసుల కాపలాలలో అది ఆ కపికుంజరుడికి కనిపించింది. ఆ ధీమంతుడు హనుమంతుడు ఆ భవనాన్ని అన్నివైపులా తిరిగి చూచినాడు. దాని బహిర్ద్వారము వెండితో చేసి, బంగారముతోను వివిధవర్ణాలతోను అలంకరించి ఉంది. లోపలి కక్ష్యలు అన్నీ విశాలముగాను, విచిత్రముగాను కనిపించినవి. ఆ యా కక్ష్యలలో మనోజ్ఞము అయిన ద్వారాలతో మందిరాలు కనిపించినవి. ఏనుగులు ఎక్కిపోయే శూరులు, ఏ పనిని అయినా ఏ మాత్రమూ శ్రమపడకుండా చేసివేసే యోధులూ, మంత్రి ప్రధానులూ ఆ మందిరాలలో నివసిస్తూ ఉన్నారు. ఎదిరించ నలవికాకుండా రథాలను ఎక్కడికి అయినా లాగుకొనిపోయే గుర్రాలూ, సింహ వ్యాఘ్ర చర్మాల కవచాలతోను, బంగారముతోను, వెండితోను, దంతాలతోను చేసిన బొమ్మలతో మహాధ్వనులు చేస్తూ పోయే రథాలూ అక్కడ కనిపించినవి.

అక్కడనే మహారథులు అందరూ నివసిస్తూ ఉన్నారు. ఆ మహా రథులు ఎక్కిపోయే మహా రథాలున్నూ, వారు కూర్చుండే మహాసనాలున్నూ అక్కడనే కనిపించినవి. మహా అందము అయిన పెద్దపెద్ద పశువులూ, రకరకాల పెంపుడు జంతువులూ, రకరకాల రంగు రంగుల పిట్టలూ అక్కడ అసంఖ్యాకముగా తిరుగుతూ ఉన్నవి. సుశిక్షితులు అయిన రాక్షసులు అక్కడ కావలి కాస్తున్నారు. మహా సౌందర్యవంతులు అయిన స్త్రీలు అక్కడ అంతటా తిరుగుతూ ఉన్నారు. ఆ యా మందిరాలలో సంతోషాతిశయముతో యువతులు విర్రవీగుతున్నారు. అది రాక్షస వీరులకు అందరికీ ఉనికిపట్టు. వారి వారి ఆభరణాల ధ్వని సముద్రఘోషమువలె వినిపించింది. రాజచిహ్నాలు అయిన ఛత్రచామరాదులు అన్నీ అక్కడ ఉన్నవి. ఆ భవనాలలో చందనాగరు ఘుమ ఘుమ వాసనలు గుబాళిస్తున్నవి. భేరులూ మృదంగాలూ మోగుతున్నవి. శంఖారావము ఆకాశాన్ని అంటుతూ ఉంది. మహావీరులు

అయిన రాక్షసులు అందరూ అక్కడ నివసిస్తూ ఉన్నందువల్ల, అది సింహాలు నివసిస్తూ ఉన్న మహావనముగా హనుమంతుడికి తోచింది.

అక్కడ ఎప్పుడూ గంధపుష్పాదులతో పూజలు జరుగుతూ వుంటవి. దర్శపూర్ణిమాసాది పర్వదినాలలో ఇష్ట్యాది హోమాదులు జరుగుతూ వుంటవి. రాక్షసులు ఎప్పుడూ కావలి ఉండడము నుంచి ఆ రాజనగరులోకి పోవడము ఎవరి తరమూ కాదు. అది సముద్ర గంభీరము అయింది. ఆ భవనాల మధ్య మహారత్నఖచితము అయిన మహద్భవనము ఒకటి కనిపించింది. అది రావణాసురుడి భవనము.

రావణాసురుడి ఆ రాజనగరు అంతా ఆ మహాకపి హనుమంతుడు తిరిగి చూచినాడు. అట్లా అంతమంది రాక్షసవీరులతో, అన్ని ఏనుగులతో, అన్ని గుఱ్ఱాలతో, అన్ని రథాలతో విరాజిల్లుతూ వున్న ఆ రాజనగరు లంకాపట్టణానికి ఆభరణము అని హనుమంతుడు మనస్సులో అనుకొన్నాడు. అంతట తాను వచ్చిన పని చేయడానికి బయలుదేరినాడు.

హనుమంతుడు నిర్భయముగా అక్కడి ఉద్యానవనాలలోను, ప్రాసాద గృహాలలోను సీతాదేవిని వెతుకుతూ ఇంటి ఇంటికీ పోయినాడు. ముందుగా ఆ పరమ పరాక్రమవంతుడు హనుమంతుడు రావణాసురుడి మంత్రి అయిన ప్రహస్తుడి ఇంటికి పోయినాడు. ఆ ఇల్లు వెతికి అక్కడనుంచి మహాపార్శ్వుడు అనే మంత్రి ఇంటికి పోయినాడు. అక్కడనుంచి మేఘము మాదిరిగా కనుపించే కుంభకర్ణుడి ఇంటికి పోయినాడు. అక్కడనుంచి విభీషణుడి ఇంటికి పోయినాడు. అట్లా వరుసగా మహోదర విరూపాక్ష విద్యుజ్జిహ్వుల భవనాలకూ, వజ్రదంష్ట్రుడి మందిరానికీ, పరమ పరాక్రమవంతుడు అయిన శుకుడి భవనానికీ, ధీమంతుడు అయిన సారణుడి ఆవాసానికీ, ఇంద్రజిత్తు వున్న భవనానికీ, జంబుమాలీ సుమాలీ అనే వాండ్ల ఇండ్లకూ, అట్లాగే రశ్మికేతువూ, సూర్యకేతువూ, ధూమ్రాక్షుడూ, సంపాతీ, విద్యుద్రూపుడూ, ఘనుడూ, విఘనుడూ, శుకనాసుడూ, యుద్ధోన్మత్తుడూ, ధ్వజగ్రీవుడూ, విద్యుజ్జిహ్వుడూ, ఇంద్రజిహ్వుడూ, కరాళుడూ, పిశాచుడూ, శోణితాక్షుడూ అనే వాండ్ల ఇండ్లకూ పోయినాడు. ఆ ఇండ్లలో సీతాదేవిని వెతుకుతూ అక్కడ వారి సిరి సంపదలను గమనించినాడు.

ఆ ధైర్యవంతుడు, ఆ తేజోవంతుడు హనుమంతుడు ఆ యా భవనాలు అన్నీ తిరిగి చూస్తూ రాక్షసేంద్రుడు అయిన రావణాసురుడి భవనము దగ్గరకు పోయినాడు. శూలాలు, ముద్గరాలు, శక్తులు, తోమరాలు అనే ఆయుధాలు పట్టుకొని పడుకొని వున్న రాక్షసాంగనలను, వికృత నేత్రలను చూచినాడు. అక్కడనే వివిధ ఆయుధాలను, కావలి వున్న మహాకాయులను, వివిధ సేనలను చూచినాడు. అమితవేగముతో పోయే ఎఱ్ఱగుఱ్ఱాలను, తెల్లగుఱ్ఱాలను, మదపుటేనుగులను

చూచినాడు. ఆ గుఱ్ఱాలూ, ఏనుగులూ కులము కలవి. చక్కని రూపముతో కనిపించినవి. ఆ ఏనుగులు శత్రువుల ఏనుగులను పీడించి వేస్తవి అని పొగడ్త కెక్కినవి. అవి యుద్ధ పద్ధతులలో శిక్షణపొంది యుద్ధ సమయాలలో దేవేంద్రుడి ఐరావతమువలె సంచరిస్తవి. శత్రుసేనలను అవే సంహారము చేసివేస్తవి. అవి మేఘాలు చినుకులు రాలుస్తూ ఉన్నట్టూ, పెద్ద పెద్ద కొండలు సెలయేళ్ళ కోసము చెమరుస్తూ ఉన్నట్టూ మదజలాలు కారుస్తూ ఉన్నవి. అవి మహా మేఘాలవలె ఘోష పెట్టుతున్నవి. యుద్ధములో వాటిని ఎదిరించడము అశక్యము.

అక్కడనే బంగారు కవచాలు తొడుగుకొని సూర్యప్రభలతో తేజరిల్లుతూ ఉన్న పదాతులున్ను కనిపించినారు. వివిధము లయిన శిబికలున్ను అక్కడనే ఉన్నవి. అక్కడ లతాగృహాలూ, చిత్తరువులతో అలంకరించిన చిత్రశాలలూ, దారువులతో నిర్మించిన క్రీడా పర్వతాలూ, ఇంకా ఇతరము అయిన క్రీడాస్థలాలూ, సంభోగ గృహాలూ, పగలు విలాసముగా పొద్దుపుచ్చే ఇండ్లూ, నెమళ్ళు ఉంటూవున్న ఇండ్లూ, ఇంకా ఆ యా పక్షులు నివసించే గూండ్లూ, పతాకాలు ఎత్తే స్తంభాలు, రత్నాల నిధులూ హనుమంతుడికి కనిపించినవి. అది మందర పర్వతముతో సరిసమానము అయింది. ధీరులు, ధృఢవ్రతులు, తాపసులు అయిన వారికి లభ్యము అయ్యే శివస్థానమువలె అది అగుపించింది. అనంత కిరణాలతో సూర్యుడివలె ఆ భవనము రత్నకాంతులతోను, రావణాసురుడి పరాక్రమాతిశయముతోను తేజరిల్లుతూ ఉంది.

హనుమంతుడు అక్కడ బంగారుమయము అయిన శయ్యలు, బంగారు ఆసనాలు, బంగారు భోజనపాత్రలు చూచినాడు. రత్నమయము అయిన పానపాత్రల నిండా మద్యమూ, మధువూ ఉన్నవి. ఆ భవనము మనోహరముగాను, ఎంతో విశాలముగాను కుబేర భవనము వలె కనిపించింది. స్త్రీల అందెల చప్పుళ్ళూ, మొలనూళ్ళ చప్పుళ్ళూ, మృదంగ ధ్వనులూ, కరతాళ ధ్వనులూ వినిపించినవి. విశాలము అయిన కక్ష్యలతో, ప్రాసాద సమూహాలతో, వందలకొద్దీ ఉత్తమాంగనలతో ఉన్న ఆ మహాభవనములోనికి అప్పుడు హనుమంతుడు పోయినాడు.

రావణాసురుడి రాజభవనాల సమూహాలూ, వైడూర్యమణిఖచితము లయిన వాటి బంగారు కిటికీలూ, ఆ కిటికీలలో గుంపులు గుంపులుగా విహరిస్తూ ఉన్న పక్షులూ వర్షాకాలములో ఆకాశాన్ని అంటి తిరిగే మేఘసమూహాలవలెనూ, తళుక్కున ఆ మేఘాలలో కనిపించే మెరుపు తీగలవలెనూ, వాన కురుస్తుందేమో ననుకుని ఎగిరిపోయే పక్షి సమూహాలవలెనూ కనిపించినవి.

ఆ యా కక్ష్యలలో ఉన్న భవనాలలో వివిధ శాలాగృహాలు, నానావిధ కర్మశాలా గృహాలు కనిపించినవి. శ్రేష్ఠము అయిన శంఖాయుధశాలలూ,

చాపాయుధశాలలూ, మనోహరము అయిన చంద్రశాలలూ ఉన్నవి. అవి అన్నీ ఎంతో విశాలము అయినవి. వివిధ మణిఖచితము అయినవి. వాస్తుదోషము ఏమీ లేనివి. అందువల్లనే, సురాసురులు అందరూ ఆ గృహాలను మెచ్చుకొన్నారు. వాటిని అన్నింటినీ రావణాసురుడు తన భుజబలముతో సంపాదించినాడు.

ఆ భవనాలు అన్నీ ఈ భూమి మీద సర్వగుణోత్తరముగా ఉండవలెను అనుకొని మయుడు వాటిని అన్నిటినీ తీర్చిదిద్దినాడు. ఆ బలవంతుడు హనుమంతుడు ఆ గృహాలను అన్నింటినీ తిరిగి చూచినాడు.

ఆ గృహాల మధ్యను మేఘరూపముతో ఎంతో ఎత్తుగాను, బంగారుమయము అయిన సుందరరూపముతో మనోహరముగాను రావణాసురుడి ఆత్మబలాను రూపముతో అప్రతిమానముగాను వున్న రావణాసురుడి ఆ భవనోత్తమము హనుమంతుడికి అగుపించింది.

అది దైవయోగమువల్ల ఈ భూమిమీదికి వచ్చిన పెద్ద స్వర్గధామమువలె దివ్యకాంతులతో విరాజిల్లుతూవుంది. వివిధ రత్నఖచితము అయిన ఆ భవనము నానాతరులతాదుల పూలతోను, ఆ పూల పుప్పొళ్ళతోను కమ్ముకొన్న పర్వత శిఖరమువలెను, ఆ భవనోత్తమములో కనిపించే అందకత్తెలు మేఘాలలో మెరిసే మెరుపుల వలెను, ఆకాశములో హంసలు మోసుకొనిపోతున్న బ్రహ్మదేవుడి విమానము వలెను, బహురత్న చిత్రితము అయినందువల్ల గైరికాది ధాతువులతో ధగధగలాడుతున్న పర్వతాగ్రమువలెను, చంద్రశుక్రాది గ్రహాలు తేజరిల్లే ఆకాశమువలెను, నానావిధ వర్ణాలతో భాసించే ఇంద్రధనుస్సు వలెను హనుమంతుడికి కనిపించింది.

అది ఆ రాచనగరులో ఉన్న విమానగృహాలు అన్నిటికన్నా శ్రేష్ఠము అయింది, ఉన్నతము అయింది, ఉత్తమము అయింది.

ఈ భూమినిండా పర్వతపంక్తులు వున్నట్టూ, ఆ పర్వతపంక్తుల మీద నానావిధవృక్షాలు వున్నట్టూ, ఆ వృక్షాలు అన్నీ పూలుపూసి వున్నట్టూ, ఆ పూలలో కింజల్కాలు రేకులు ఎంతో రమణీయముగా వున్నట్టూ ఆ భవనములో నేలమీద వివిధ మణులతో చిత్రించి వుంది. అంతేకాదు, తెల్లటి ఇండ్లూ, రకరకాల పూలచెట్లు, కింజల్కాలతో కూడా పద్మాలు వున్న కోనేళ్ళు, నానావిధ వనాలు అక్కడి నేలమీద చిత్రించి వున్నవి.

రత్న ప్రభలతో విరాజిల్లుతూ వున్న ఆ మహాగృహము పేరు పుష్పకము. ఆ పుష్పకవిమాన గృహములో రావణాసురుడు నివసిస్తూ వున్నాడు.

ఆ పుష్పకవిమాన గృహములో వైడూర్యమణులతో చిత్రించిన పక్షులూ, పగడాలతోను, వెండితోను చేసిన పక్షుల ప్రతిమలూ, వివిధ లోహాలతో చేసిన

పాముల ప్రతిమలూ, ఆ యా జాతుల అవయవాల పొంకము తెలిసేటట్టు చేసిన గుర్రాల ప్రతిమలూ మనోహరముగా కనిపించినవి. అక్కడ చిత్రించివున్న పక్షులు సొగసు అయిన ముక్కులతో బంగారుపూలు, పగడాలపూలు రాలిన అందము అయిన వంకర రెక్కలు మురిపెముగా ముడుచుకొని మన్మథుడికి తోడు వచ్చినట్లు కనిపించినవి. మదపుటేనుగులు వాటి అంతట అవి తామరకొలనులో విహరిస్తూ, పద్మ కింజల్కాలు అంటుకొన్న దేహాలు వేసుకొని తొండాలతో కలువపూలు చల్లుతూ, పద్మహస్త అయిన లక్ష్మీదేవిని అభిషేకము చేస్తూ ఉన్నట్టు చిత్రించిన చిత్తరువును అక్కడ హనుమంతుడు చూచినాడు.

రమణీయము, మంగళకరము అయిన మహాపర్వతమువలె కనిపించే ఆ మహా విమానగృహాన్నీ, వసంతఋతువులో విరగపూసిన పూల ఘుమఘుమలు గుబాళించే ఆ పర్వతగుహలవంటి గృహాలనూ హనుమంతుడు తిరిగి చూచి విస్మితుడు అయినాడు.

ఆ రాజనగరులోవున్న భవనాలలోను, లంకాపట్టణములోవున్న భవనాలలోను ఆ రామాయత్తచిత్త సీతాదేవి అతనికి కనిపించలేదు. అందుకు దుఃఖపడిపోయినాడు.

అప్పుడు ఆ హనుమంతుడి మనస్సు పరిపరివిధాల పోయింది. అతనిది అకుంఠిత ధైర్యము. అతని చూపు ఎంతదూరము అయినా పోతుంది. మళ్లీ ఆ వైదేహిని సీతాదేవిని వెతకడానికి కృతనిశ్చయుడు అయినాడు.

8

పుష్పక విమాన వర్ణనము

ఆ మహా విమానగృహము మధ్యను నవరత్న ఖచితము అయిన ఒక గొప్ప విమానాన్ని హనుమంతుడు చూచినాడు. దాని దగ్గిరకు పోయినాడు. తప్తకాంచనముతో చేసిన బంగారు కిటికీలు దానికి అమర్చి వున్నవి. అది ఇంత ఎత్తు, అంత ఎత్తు అని నిర్ణయించడానికి అలవిలేకుండా కనిపించింది. అది సాటిలేని ఆకారముతో అక్కడ ఉంది.

తాను నిర్మించిన విమానాలు అన్నిటికన్నా అది అధికము అయింది అని ఆ విమానాన్ని నిర్మించిన విశ్వకర్మే ఎంతో మెచ్చుకొన్నాడు. అది ఆకాశాన్ని ఒరుసుకొనిపోయి వాయుపథములో నిలుచుని సూర్యసంగాగ మార్గాన్ని చూపించే చిహ్నముగా భాసిస్తున్నది.

అది అతిప్రయత్నముతో విశ్వకర్మ నిర్మించింది. అందులో అమర్చిన ప్రతిదాన్నీ ముందుగా పరిశీలించి, అది తగింది అని నిశ్చయించిన తరువాతనే దానిలో అమర్చినాడు. ఆ విమానములో మహార్హము అయిన మణులు అన్నివైపులా

పొదిగి ఉన్నవి. అందులో ఉన్న విశేషాలు దేవతాగృహాలలో సైతము లేవు. అందులో ఏది చూచినా అది అతిశయముగా తోచక తప్పదు. ఏ భాగము చూచినా ఆశ్చర్యము వేస్తుంది. అది తపోనుష్ఠానమువల్లనూ, పరాక్రమమువల్లనూ లభ్యము అవుతుంది.

అది గోపుర పద్మకాది నానావిధ విచిత్ర సన్నివేశాలతోను (ఆకారాలతోను) నిర్మించింది. ఒక్కొక్కవైపునుంచి ఒక్కొక్క విధముగా కనపడుతూ వుంటుంది. అయితే, అందులో శిల్పవిశేషాలు అన్నీ సరిసమానము అయినవి. ఏ వైపునుంచి చూచినా అది అత్యంత రమణీయముగా గోచరిస్తుంది.

ఆ విమానములో కూర్చున్న దాని యజమాని ఎక్కడికి పోవలెను అని మనస్సులో నిశ్చయించుకొంటే, అది అక్కడికి పోతుంది. అంతేకాదు, దాని యజమాని మనోభావాన్ని పట్టి అది వేగముగా కానీ, మందముగా కానీ పోతుంది. దానిని నివారించడము ఎవరి తరమూ కాదు. అది వాయుసమాన వేగముతో పోతుంది. మహాత్ములూ, పుణ్యాత్ములూ, పరమసంపన్నులూ, ప్రశస్త కీర్తిమంతులూ, ఆనంద కలితలూ అయిన దేవేంద్రాదుల నివాస నిలయము వంటిది. అది సొగసు అయిన వస్తువులతో, మహాసొగసు అయిన పనితనముతో చేసింది. చిత్రవిచిత్రము అయిన అనేక శిఖరాలతోను, మనోహరము అయిన శరత్కాల చంద్రుడి స్వచ్ఛకాంతులతోను, గైరికాది ధాతువులతో ధగధగలాడే అవాంతర శిఖరాలవంటి శిఖరాలతోను ఆ విమానము మహాపర్వత శిఖరమువలె కనిపించింది.

గుండ్రముగాను, వంకరగాను, విశాలముగాను వున్న కనులతోను; కుండలాలతో శోభించే ముఖాలతోను, మహాకాయాలతోను, ఆకాశములో సంచారము చేసే నిశాచరులూ, మహావేగముతో పోయే భూతగణాలూ వేలకొద్దీ ఆ విమానాన్ని మోస్తున్నవి.

వసంతకాల పుష్పసమూహముకన్నా మనోహరముగాను, వసంత ఋతువుకన్నా రమణీయముగాను ఉన్న ఉత్తమము అయిన ఆ పుష్పక విమానాన్ని హనుమంతుడు చూచినాడు.

9

రావణుని రాజభవన సౌందర్యము

ఆ రాజనగరు మధ్యను ఉన్న ఉత్తమోత్తమ భవనము ఒక యోజనము పొడుగూ, ఒక అర్ధయోజనము వెడల్పూ ఉంది. అనేక ప్రాసాద భవనాలతో ఆ భవనము కనిపించింది. అందులోనే రావణాసురుడు నివసిస్తూ ఉన్నాడు.

ఆ అరిసూదనుడు హనుమంతుడు ఆ విశాలలోచన సీతాదేవి కోసము వెతుకుతూ ఆ రాజనగరులో ఉన్న భవనాలు అన్నిటినీ తిరిగి చూచినాడు. అట్లా

ఆ యా భవనాలను చూచి చూచి, ఆ భవనాల మధ్యను ఉత్తమోత్తమముగా కనిపించిన భవనోత్తమము దగ్గరికి వచ్చినాడు. అక్కడ రెండు దంతాల ఏనుగులూ, మూడు దంతాల ఏనుగులూ కిటకిట లాడుతూ కనిపించినవి. వివిధాయుధాలు పట్టుకొని రాక్షస యోధులు ఆ భవనాన్ని కావలి కాస్తూ ఉన్నారు. అంతమంది రాక్షసులు ఉన్నా, అన్ని ఏనుగులు అట్లా కిటకిటలాడుతూ ఉన్నా ఆ భవనము యిరుకు లేకుండా ఎంతో విశాలముగా కనిపించింది.

ఆ భవనములోనే రావణాసురుడి భార్యలు, రాక్షసాంగనలు ఉంటూ ఉన్నారు. వారేకాదు, అతడు తన పరాక్రమముతో లేవనెత్తుకుని వచ్చిన రాజకన్నెలు అందరున్నూ అక్కడే ఉంటూ ఉన్నారు. గాలికి చెలరేగిన మహాసముద్రములో నక్రగ్రాహాలవలెనూ, పెద్ద పెద్ద చేపలవలెనూ, చిన్న చిన్న చేపలవలెనూ, పాములవలెనూ, ఆ ఆడువాండ్లు అందరూ తిరుగుతూ కనుపించినారు.

కుబేరుడి ఇంట్లో ఐశ్వర్యమూ, దేవేంద్రుడి ఇంట్లో వైభవమూ ఆ రావణాసురుడి రాచనగరులో ఎక్కడ చూచినా హనుమంతుడికి కనుపించింది. సర్వజనరంజకుడు అయిన కుబేరుడి భాగ్యమూ, ధర్మవేత్త అయిన యముడి సిరీ, వరుణుడి సంపదా, తక్కిన దిక్పాలకుల సిరిసంపదలూ ఆ దిక్పాలకుల ఇండ్లలోకన్నా అధికముగా ఆ రాచనగరులో కుంభకర్ణ విభీషణాదుల ఇండ్లలోనూ, ఇంకా ఇతర రాక్షసుల ఇండ్లలోను హనుమంతుడు కన్నులారా చూచినాడు.

ఆ మధ్యభవనము పైభాగము మీదనే మరి ఒక హర్మ్యమువంటి పుష్పక విమానాన్ని హనుమంతుడు చూచినాడు. పూర్వము దేవలోకములో విశ్వకర్మ ఆ పుష్పక విమానాన్ని సర్వసంపన్నముగానూ, నవరత్నఖచితముగానూ నిర్మించి బ్రహ్మదేవుడికి యిచ్చినాడు. ఆ విమానాన్ని కుబేరుడు పరమోత్కృష్ట తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ణి మెప్పించి ఈ భూలోకానికి తెప్పించుకొన్నాడు. రావణాసురుడు తన పరాక్రమముతో ఆ కుబేరుణ్ణి జయించి ఆ విమానాన్ని సంపాదించాడు.

పై భాగాన పుష్పక విమానము ఉన్న ఆ రాజభవనములోకి హనుమంతుడు పోయినాడు. అక్కడ ఎంతో సొగసు అయిన స్తంభాలు వెండి బంగారు కాంతులు వెదజల్లుతూ ఉన్నవి. ఆ స్తంభాలమీద తోడేళ్ళు మొదలు అయిన జంతువుల బొమ్మలు నేత్రపర్వముగా చిత్రించి ఉన్నవి. చక్కని కూటాగారాలు (మేడలమీద సావళ్ళు) సుందరాకారముతో మేరుమందర పర్వతాలవలె ఆకాశాన్ని ఒరుసుకొని పోతూ ఉన్నవి. బంగారు సోపానాలూ, మధ్యమధ్యను అందము అయిన వేదికలూ వేసి ఉన్నవి. అవి ఉదయిస్తున్న సూర్యుడివలెనూ, జ్వలిస్తూ ఉన్న అగ్నిహోత్రుడివలెనూ

ధగధగలాడుతూ ఉన్నవి. సర్వతో భద్ర స్వస్తికాద్యాకారాలతో స్ఫటికాలు తాపటముచేసిన పెద్ద పెద్ద బంగారు కిటికీలు వెలుతురు కోసమూ, చిన్న చిన్న కిటికీలు గాలికోసమూ గోడలలో అమర్చి ఉన్నవి. ఇంద్రనీల మణులూ, మహానీలమణులూ పొదిగిన అరుగులు ఎంతో అందముగా ఉన్నవి. కింద నేలలో పగడాలూ, ఎంతో విలువ అయిన వివిధ మణులూ, గుండ్రని ముత్యాలూ తాపటము చేసి ఉన్నవి. తప్త కాంచనము పూతతోను, రక్త చందనము పూతతోనూ తరుణాదిత్య కాంతులతో తేజరిల్లుతూ ఆ భవనము ఘుమఘుమ వాసనలు గుబాళిస్తూ ఉంది. కూటాగారాలన్నీ వివిధ శ్రేష్ఠాకారాలతోనూ, చక్కని అలంకారాలతోనూ ఉన్నవి. అట్లా ఉన్న 'పుష్పకము' అనే ఆ దివ్య విమాన గృహముమీదికి హనుమంతుడు మెట్లు ఎక్కి పోయినాడు.

అక్కడ వాయుదేవుడు ఆ యా రూపాలు ధరించినట్టుగా భక్ష్యాలూ, వివిధాన్నాలూ, మద్యాలూ ఘుమఘుమ వాసనలు కొట్టుతూ ఉన్నవి. బంధువు అయినవాడు తన ఆప్తబంధువుకు ఎదురుగుండా పోయి పిలుచుకొని వచ్చి తన ఇల్లు అంతా చూపించేటట్టు, ఆ మహాబలవంతుణ్ణి హనుమంతుణ్ణి ఆ సుగంధము "రావణాసురుడు యిక్కడ ఉన్నాడు, ఇటు రా" అన్నట్టు పిలిచింది.

పరమ శోభనాకారముతో రావణాసురుడి మనఃకాంత మాదిరిగా ఉన్న ఆ విశాల శాలాగృహములోనికి హనుమంతుడు పోయి చూచినాడు. అక్కడ సోపానాలకు మణులు పొదిగి ఉన్నవి. బంగారపు కిటికీలు అలంకారముగా కనుపించినవి. కింద స్ఫటికాలు తాపటము చేసి ఉన్నవి. మధ్యమధ్యను దంతాల బొమ్మలు పెట్టి ఉన్నవి. ముత్యాలతోనూ, పగడాలతోనూ, వివిధ మణులతోనూ అలంకరించిన వెండి బంగారు స్తంభాలు, ఇంకా చక్కగా సింగారించిన అవాంతర స్తంభాలు వంకరటింకర లేకుండా నిలువుగా ఎంతో ఎత్తున ఉన్నవి. ఆ స్తంభాల చివరను అమర్చిన పక్షుల రెక్కలవంటి రెక్కలు, అ భవనాన్ని ఆకాశానికి ఎగురనెత్తుకొని పోతూ ఉన్నట్లుగా కనిపించినవి.

అక్కడ నేలమీద పెద్ద విశాలమైన చిత్రకంబళము పరచి ఉంది. ఆ చిత్రకంబళము మీద ఈ భూమిలో ఉన్న మహాసముద్రాలు, మహానదులు, వివిధారణ్యాలు, మహాపర్వతాలు, ఆ యా దేశాలు, ఆ యా పట్టణాలు, ఆ యా పట్టణాలలో ఉన్న భవనాలు చిత్రించి ఉన్నవి. ఇంకా నాణ్యము అయిన జముఖాణా లున్నూ పరిచి ఉన్నవి. మధుర గానము చేసే పక్షులు అక్కడ నివసిస్తూ ఉన్నవి. దివ్యసుగంధము అక్కడ గుబాళిస్తూ ఉంది. అగరుధూపాలు వేసినందువల్ల ఒకచోట పొగవన్నెలోనూ, ఆ ధూపాలు పొకని చోట హంసవలె నిర్మలముగానూ తెల్లగానూ, పూలు చల్లిన చోట చిత్రవర్ణాలతోనూ, కోరిన కోర్కెలు యిచ్చి మనస్సుకు ఉల్లాసము కలుగచేసే వశిష్ఠమహర్షి కామధేనువువలెనూ కనిపించింది. రకరకాల రంగులతో

ముచ్చట గొలుపుతూ ఆ భవనము దివ్యసంపదతో లక్ష్మికి పుట్టినిల్లుగా కనిపించింది. కన్నతల్లి తన స్పర్శ రూప శబ్ద రస గంధాదులతో తన పుత్రుడి 'త్వక్ చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణాలు' అనే పంచేంద్రియాలనూ తృప్తిపరచేటట్టుగా శైత్య మాంద్య సౌరభముతో అక్కడ గాలి వీస్తూ ఆ హనుమంతుడి త్వగింద్రియాన్నీ, సుందరవస్తువులతో అతడి నేత్రేంద్రియాన్నీ, నృత్యగీతవాదనధ్వనులతో అతడి కర్ణేంద్రియాన్నీ, అమృతోపమానమైన పానభక్ష్యాన్నాదులతో అతని రసనేంద్రియాన్నీ, అగరు చందనాదిధూపాలతో అతని ఘ్రాణేంద్రియాన్నీ ఆ విశాల శాలాగృహము సంతోషపెట్టింది.

హనుమంతుడు ఆ భవనము అంతా చూచి ఆశ్చర్యపోయి, "ఇది స్వర్గమా, దేవలోకమా, దేవేంద్రుడి అమరావతీ పట్టణమా, తపస్సిద్ధి రూపమైన బ్రహ్మలోకమా" అని ఆలోచించసాగినాడు. అక్కడ బంగారు సెమ్మెలతో దీపాలు నిశ్చలముగా ఏమో ధ్యానము చేస్తూ ఉన్నట్టు వెలుగుతూ ఉన్నవి. పెద్దజూదగాండ్లకు ఓడిపోయిన చిన్నజూదగాండ్లవలె మణిప్రభలతో వెలుగొందుతూ ఉన్న పెద్ద పెద్ద స్తంభాల ఎదుట ఆ కాంచన దీపకళికలు కదలకుండా, మెదలకుండా వెలుగుతూ కనిపించినవి. ఆ దీపాల కాంతులు, రావణాసురుడి దేహకాంతులు, అతడు పెట్టుకొన్న అభరణాల కాంతులు ఏకము అయిపోయి, ఆ విశాల శాలాగృహము ఏకజ్వాలగా వెలుగుతూ ఉన్నట్టు హనుమంతుడికి కనుపించింది.

అక్కడ చిత్రకంబళముమీద రంగురంగుల చీరెలతో, రంగురంగుల పూలదండలతో, నానావిధాలంకారాలతో, నానావిధవేషాలతో ఉత్తమాంగనలు పడుకొని నిద్రపోతూ ఉన్నారు. వారు అందరూ మద్యపానము చేసినారు. క్రీడించినారు. నిశి తిరిగిపోయింది. సొమ్మసిల్లి నిద్రపోయినారు. పద్మవనములో హంసలవలెనూ, తుమ్మెదలవలెనూ ఆభరణాల చప్పుళ్ళు ఏవీ లేకుండా ఆ ఉత్తమాంగనలు నిశ్శబ్దముగా నిద్రపోతూ ఉన్నారు. ఆ అందకత్తెలు కళ్ళుమూసుకొని, పళ్ళు కనబడకుండా పెదవులు మూసుకొని నిద్రపోతూ ఉన్నారు. వారి ముఖాలనుంచి పద్మసుగంధము వీస్తూ ఉంది. సూర్యోదయము కాగానే వికసించి చీకటి పడగానే ముకుళించుకొని పోయే పద్మాలవలె, వారి ముఖాలు కనుపించినవి. ఆ స్త్రీల ముఖాలు సుగంధాదిగుణాలతో అచ్చము పద్మాల మాదిరిగా ఉన్నవి. కాబట్టి, మదము ఎక్కి మైమరచిపోయి మకరందముకోసము, పద్మాలమీదికి పోయే తుమ్మెదలు తప్పకుండా ఆ స్త్రీల ముఖపద్మాలమీద పదే పదే వాలుతవి అని హనుమంతుడు అనుకొన్నాడు. నిర్మలము అయిన నక్షత్రాలతో శరత్కాల స్వచ్ఛాకాశమువలె ఆ ఉత్తమాంగనలతో ఆ విశాల శాలాగృహము హనుమంతుడికి కనుపించింది. ఆ స్త్రీలు అందరి మధ్యనూ పడుకొని ఉన్న ఆ కాంతిమంతుడు రావణాసురుడు నక్షత్రాలమధ్య

చంద్రుడివలె తేజరిల్లుతూ ఉన్నాడు. నేల రాలిన నక్షత్రాలు, పుణ్యశేషమువల్ల ఆ స్త్రీల రూపము ధరించినవి ఏమోను అనుకున్నాడు హనుమంతుడు. ఆకాశములో నక్షత్రాల నైర్మల్యమూ, తళుకు తళుకు మనే వాటి కాంతీ వాటి రూపముగా విశాల శాలాగృహములో పడుకొని ఉన్న స్త్రీలలో మూర్తీభవించినవి.

వారు అందరూ మద్యపానముచేసి మదన వ్యాయామములో ఉన్నప్పుడు వారు పెట్టుకొన్న పెద్ద పెద్ద పూలదండలూ, ఆభరణాలూ చిక్కుపడి పోయినవి. వారు నిద్రకు లోబడిపోయినారు. అందువల్ల, వారి ఆభరణాలు మొదలు అయినవి స్థానాలు తప్పిపోయినవి. కొందరి ముఖాల మీద తిలకాలు కరిగిపోయినవి. కొందరి కాళ్ళ అందెలు జారిపోయినవి. కొందరి కంఠహారాలు పక్కకు పడిపోయినవి. కొందరి ముత్యాలహారాలు పేటలు తెగి దేహము అంతటా వ్యాపించినవి. కొందరి చీరెలు జారిపోయినవి. మొలనూళ్ళు వదులు అయిపోయి పొర్లాడుతూ ఉన్న స్త్రీలు, మార్గాయాసము పోవడానికి నడుము కట్టుతాళ్లు సడలిస్తే నేలమీదపడి పొర్లాడుతూ ఉన్న ఆడుగుర్రపుపిల్లలవలె కనిపించినారు. చెవులకు పెట్టుకున్న కుండలాలు ధగధగలాడుతూనూ, మెడలో వేసుకొన్న పూలదండలన్నీ నలిగిపోయిన్నీ నిద్రపోతున్న ఆ స్త్రీలు, ఆడవిలో మదపుటేనుగు నలగతొక్కిన పూలతీగవలె కనుపించినారు.

ఆ ఉత్తమాంగనలు కొందరు పెట్టుకొన్న ముత్యాలహారాలు చంద్రకిరణాలవలె తేజరిల్లుతూ వారి స్తనాలమధ్య హంసలు పడుకొన్నట్టుగా కనిపించినవి. కొందరు పెట్టుకొన్న వైడూర్యహారాలు వారి స్తనాలమధ్య కాదంబపక్షులవలె కనుపించినవి. కొందరు పెట్టుకొన్న హేమసూత్రాలు వారి స్తనాలమధ్య చక్రవాకపక్షులవలె కనిపించినవి. అట్లా పడుకొని ఉన్న ఆ స్త్రీల జఘనాలు పెద్ద పెద్ద యిసుకతిన్నెలవలెనూ, వారి కంఠహారాలు హంస కారండవ చక్రవాక పక్షులవలెనూ, వారి మొలనూళ్ల గజ్జెలు మొగ్గలవలెనూ, వారి పెద్ద పెద్ద బంగారు ఆభరణాలు వికసించిన కమలాలవలెనూ, వారి అవయవాలు మొసళ్ళవలెనూ, వారి దేహకాంతులు గట్లవలెనూ, వారు శోభాయమానమైన నదులవలెనూ కనుపించినారు.

ఆ ఉత్తమాంగనలు పెట్టుకొన్న ఆభరణాలు వారి మృదువైన కరచరణా ద్యవయవాలమీదనూ, వారి స్తనాలమీదనూ ఆరవళ్లుపడి ఆ ఆరవళ్ళే ఆభరణాలవలె శోభించినవి. వారు విడుస్తున్న ఊపిరులకు వారి పమిట చెరగులు మాటిమాటికీ వారి ముఖాలమీద కొట్టుకొంటూ మనోహరమైన కాంతులతో గాలికి ఎగిరే జెండాలవలె భాసించినవి. ఆ కాంతిసంపన్నులు చెవులకు పెట్టుకున్న కుండలాలు వారి ఊర్పులకు మందమందముగా చలిస్తూ ఉన్నవి. వారు అందరూ ఉత్తమాంగనలు. వారు వదిలే ఊపిరి స్వభావసిద్ధముగా పరిమళిస్తూ ఉంటుంది. అందులో, శర్కర కలిపిన

మద్యము త్రాగి వారు నిద్రపోతూ ఉన్నందువల్ల మరింత మనోహరమైన సుగంధముతో వారు ఊపిరులు వదులుతూ రావణాసురుణ్ణి సేవిస్తూన్నట్టు కనుపించినారు. వారిలో కొందరు మద్యము కైపువల్ల తెలియక రావణాసురుడి ముఖము అనుకొని ప్రక్కన ఉన్న సవతుల ముఖాలను ఆఘ్రాణిస్తూ ఉన్నారు. తమను ఆఘ్రాణిస్తూ ఉన్నవారు తమ సవతులని తెలియక ఆ వరాంగనలుకూడా మద్యపానము కైపువల్ల తమ ప్రభువు రావణాసురుడే తమను అట్లా ఆఘ్రాణిస్తూ ఉన్నాడు అనుకొని, తమ సవతుల ముఖాలను సంతోషముతో ఆఘ్రాణిస్తూ ఉన్నారు. వారిలో కొందరు తమ వస్త్రాలను తలగడలుగా ముణిచిపెట్టుకొని నిద్రపోతూ ఉన్నారు. కొందరు తళతళలాడే దండకడియాలు ఉన్న తమ బాహువులను తలగడలుగా పెట్టుకొని నిద్రపోతూ ఉన్నారు. కొందరు తమకు దగ్గరలో ఉన్నవారి రొమ్ముమీద తల పెట్టుకొని నిద్రపోతూ ఉన్నారు. అట్లా నిద్రపోతూ ఉన్నవారి బాహువులమీద తమ తలలు పెట్టుకొని కొందరు నిద్రపోతూ ఉన్నారు. అట్లా నిద్రపోతూ ఉన్నవాండ్ల తొడలమీద కొందరు తమ తలలు పెట్టుకొని నిద్రపోతూ ఉన్నారు. అట్లా నిద్రపోతూ ఉన్నవాండ్ల పక్కలమీద కొందరు తలలు పెట్టుకొని నిద్రపోతూ ఉన్నారు. కొందరు తమ పక్కన ఉన్నవారి నడుములమీద తల పెట్టుకొని, కొందరు తమ పక్కన ఉన్నవారి పిరుదులమీద తల పెట్టుకొని, కొందరు తమ పక్కన ఉన్నవారిమీద చేతులూ కాళ్ళూ వేసుకునీ నిద్రపోతూ ఉన్నారు.

అట్లా ఒకరిమీద ఒకరు బాహువులు పెనవేసుకొని నిద్రపోతూ ఉన్న ఆ స్త్రీల బాహువుల వరుస ఒక పూలదండవలెనూ, వారి తలలు మత్తెక్కిన తుమ్మెదల గుంపులు ఆ పూలదండల దగ్గరకు మూగుతూ ఉన్నట్లునూ కనిపించింది. వాండ్ల వాండ్ల ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు వాండ్ల వాండ్ల పూలదండలు అన్నీ కలిసిపోయినవి. ఒకళ్ళను ఒకళ్ళు పెనవేసుకుని పడుకున్నందువల్ల ఒకళ్ళ ముంగురులు ఒకళ్ళ ముంగురులతో కలిసిపోయినవి. వాండ్ల వాండ్ల పోకముళ్ళు పెనవేసుకుని పోయినవి. వైశాఖమాసములో పూలతీగెలు అన్నీ గాలికి పెనవేసుకుని ఒకదాని పూలగుత్తులు ఒకదానితో కలిసి, ఒకదాని బోదెమీద ఒకటి అల్లుకొనిపోయి, ఒకదాని చిగుళ్ళు ఒకదానిమీదపడి గజిబిజి అయి ఒకే పూలదండ వలె కనిపించే లతావనములవలె రావణాసురుడి వనితావనము కనిపించింది.

అప్పుడు అక్కడ అట్లా నిద్రపోతూఉన్న స్త్రీలు పెట్టుకున్న ఆభరణాలు కానీ, వారు వేసుకున్న పూలదండలు కానీ, వారు కట్టుకున్న చీరలు కానీ, అన్నిటినీ మించి వారి అవయవాలు కానీ 'యివి వీరివి' అని నిశ్చయించడము అశక్యము. రావణాసురుడు సుఖముగా నిద్రపోతూ ఉన్నందువల్ల బంగారు సెమ్మెలతో

నిశ్చలముగా వెలుగుతూ ఉన్న దీపాలు, వివిధ కాంతులతో విరాజిల్లుతూ ఉన్న ఆ స్త్రీలను అందరినీ చూస్తూ ఉన్నవి.

అట్లా నిద్రపోతూ ఉన్నవారు అందరూ రాజర్షుల స్త్రీలూ, దేవ కన్యలూ, దైత్యాంగనలూ, గంధర్వ సుందరీమణులూ, రాక్షసాంగనలూ! వారు అందరూ ఆ రావణాసురుడికి కామవశంగతులు అయిపోయినారు. వాండ్లను ఎవరినీ రావణాసురుడు కామించి పట్టుకొని రాలేదు. ఆ స్త్రీలను లేవనెత్తుకొని వస్తే వాండ్ల వాండ్లు తనమీదికి యుద్ధానికి వస్తారనీ, అప్పుడు వాండ్లతో తాను యుద్ధము చేయవచ్చును అనీ రావణాసురుడు యుద్ధకాంక్షతో ఆ స్త్రీలలో చాలామందిని తీసుకొని వచ్చినాడు. వారిలో కొందరు మదన మోహితలు అయి రావణాసురుణ్ణి వలచి వచ్చినారు. అక్కడ ఉన్న ఏ ఒక్క స్త్రీనీ రాణాసురుడు తన పరాక్రమముతో లోబరచుకొనలేదు. అతని సౌందర్యాదిగుణాలకే ఆ స్త్రీలు అందరూ అతనికి లోబడిపోయినారు. వారికి ఎవరికీ ఏ యితరుడి మీదనూ కోరిక లేదు. అంతేకాదు, అక్కడ ఉన్న ఏ స్త్రీ అదివరకు ఎవడి పెండ్లామూ కాదు. వాండ్లలో కులము తక్కువది ఒక్కతీ లేదు. రూపములో లోపము ఉన్నది ఒక్కతీ లేదు. నేర్పరి కానిది ఒక్కతీ లేదు. సత్తువ తక్కువది కానీ, భర్తకు ఉపచారాలు చేయనిది కానీ ఒక్కతీ లేదు. కాంతుడు కామించనిది వాండ్లలో ఒక్కతీ లేదు.

హనుమంతుడు ఆ స్త్రీలను అందరినీ చూచినాడు. సీతాదేవికూడా వాండ్లతో కలిసిపోయినట్లయితే తాను చేయగలిగింది ఏమీలేదు అనుకొన్నాడు. దిగులుపడ్డాడు. ఆలోచించినాడు. తన ఊహ తప్పు అనుకొన్నాడు.

సీతాదేవి పాతివ్రత్యాది గుణాలలో అధికురాలు అని నిశ్చయించుకొన్నాడు. "ఈ రావణాసురుడు ఎందుకు ఆమెను అపహరించినాడు? ఈ పరాక్రమవంతుడు చేసింది దుష్టకృత్యము. అయ్యో!" అనుకొన్నాడు.

10

అక్కడ అట్లా ఉన్న హనుమంతుడు స్ఫటికాలతో తళతళలాడుతూనూ, రత్నాలతో ధగధగలాడుతూ ఉన్న స్వర్గధామమువంటి శయనాసన ప్రదేశాన్ని చూచినాడు. అక్కడ ఉన్న వరాసనాలు అన్నీ బంగారముతోనూ, దంతాలతోనూ చేసి వైడూర్యమణులు పొదిగి విచిత్రములయిన ఆకారాలతో ఉన్నవి. ఆ వివిధాసనాలమీద మహార్ఘ్యమైన దుప్పట్లు పరిచి ఉన్నవి. అవి అన్నీ ఎంతో విలువ అయినవి.

అక్కడ ఒక పరమాసనము (గొప్ప మంచము) కనిపించినది. అది బంగారముతో చేసింది. దానికి అశోకపూలదండలు వేళ్ళాడుతూ ఉన్నవి. అది

సూర్యప్రభలతో తేజరిల్లుతూ ఉన్నది. దాని తల వైపున ముత్యాల దండలతో తెల్లగా గుండ్రముగా చంద్రబింబమువలె ఒక శ్వేతచ్ఛత్రము ఉంది. ఆ పరమాసనానికి అన్నివైపులా స్త్రీలు చామరాలు వీస్తున్నారు. అక్కడ దివ్యసుగంధము గుబాళిస్తూ ఉంది. శ్రేష్ఠము అయిన అగరుధూపము అక్కడ అంతటా వ్యాపిస్తూ ఉంది. అక్కడ ఒక పెద్ద దుప్పటి పరచి ఉంది. ఆ దుప్పటిమీద పొట్టేళ్ళ తోళ్ళు కప్పి ఉన్నవి. అక్కడ అంతటా ఘుమఘుమలాడే పూలదండలు వేళ్ళాడుతూ ఉన్నవి.

ఆ పరమాసనముమీద రాక్షసుల నందరిని సుఖపెట్టే మహాబాహువు రాక్షసాధిపతి రావణుడు నీలమేఘమువలె పడుకొని ఉన్నాడు. చెవులకు ఉన్న కుండలాలు ధగధగలాడుతూ ఉన్నవి. ఉబ్బెత్తుకన్నులు, బంగారు సరిగవస్త్రము కట్టుకొని ఉన్నాడు. ఘుమఘుమ వాసనలు గుబాళిస్తూ ఉన్న రక్తచందనము అతని దేహానికి అంతటికీ పూసి ఉంది. ఆతడు ఆకాశములో సంధ్యాకాల రక్తకాంతులతో మెరుపుతో మెరిసే నీలమేఘమువలె కనుపించినాడు. అతడు కామరూపుడు. శ్రేష్ఠము అయిన ఆభరణాలతో అలంకరించుకొన్నాడు. వృక్షాలూ, గుల్మాలూ, వనాలతో నిద్రపోతూఉన్న మందరపర్వతమువలె కనుపించినాడు. నానావిధక్రీడలూ సలిపి అలసి నిద్రపోతూ ఉన్నాడు.

మదపుటేనుగువలె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విడుస్తూ నిద్రపోతూ ఉన్న ఆ పరాక్రమశాలి రావణాసురుడి శయ్యాదగ్గరకు హనుమంతుడు పోయినాడు. చూచినాడు. ఆ హనుమంతుడి మనస్సు కలతపడిపోయింది. భయపడిపోయినవాడివలె అక్కడినుంచి తప్పుకొని మెట్లమీదికి పోయినాడు. ఆ మెట్ల తిరుగుడులో ఉన్న వేదికమీద కూర్చున్నాడు. నిద్రపోతూ ఉన్న రావణాసురుణ్ణి చూడసాగినాడు.

ఆ రావణాసురుడు పడుకొనిఉన్న పరమాసనము మదపుటేనుగు పడుకొన్న సెలయేటి మడుగువలె శోభాయమానముగా కనిపించింది. ఆ పరమ పరాక్రమవంతుడు రావణాసురుడు ఇంద్రధ్వజాలవంటి తన రెండు బాహువులనూ చాచుకొని పడుకొన్నాడు. అతడు ఐరావతముతో పోట్లాడినప్పుడు దాని దంతాలవల్ల అయిన గాయాల మచ్చలు ఎదురు రొమ్ములమీదనూ, దేవేంద్రుడు వజ్రాయుధముతో కొట్టినప్పుడుపడ్డ గాట్ల మచ్చలు మూపురాలమీదనూ, మహావిష్ణువు చక్రాయుధముతో వేసిన దెబ్బల మచ్చలు హెచ్చుతగ్గులు లేకుండా ఉన్న రెండు భుజాల మీదనూ కనుపించినవి. ఆ బాహువులు అమితముగా బలసి ఉన్నవి. అవి ఆ దేహప్రమాణానికి అనుగుణముగా ఉన్నవి. బలిసిన బొటన వేళ్లూ, తక్కిన వేళ్ళూ, ఆ వేళ్ళన్నిటికీ శుభలక్షణాలతో వున్న గోళ్ళూ, ఆ వేళ్ళకు వుంగరాలూ ధగధగలాడుతూ కనుపించినవి. ఆ బాహువులు ఇనప గుదియలవలె బలిష్ఠముగానూ, ఏనుగు తొండాలవలె

గుండ్రముగానూ, విసరి వేసిన అయిదు తలల పాములవలెనూ ఆ తెల్లటి పాన్పు మీద కనుపించినవి. ఆ బాహువులకు కుందేటి నెత్తురువలె ఎర్రగా కనపడుతూ చల్లదనాన్ని యిస్తూ సుగంధము గుబాళిస్తూ వున్న శ్రేష్ఠము అయిన చందనము పూసి వుంది. ఉత్తమాంగనల గాఢాలింగనాది సమ్మర్దమువల్ల ఆ బాహువులు మరింత ఘుమఘుమ వాసనలు గుబాళిస్తూ వున్నవి. అవే, ఆ బాహువులే దేవ దానవ యక్ష గంధర్వ పన్నగులను అందరినీ గగ్గోలు పెట్టించినవి. కోపముతో తిరుగుతూ మందరపర్వతము నడుమ నిద్రపోతూవున్న మహాసర్పాలవలె ఆ బాహువులు ఆ శయ్య మీద కనుపించినవి. కొండ అంతటి ఆ రాక్షసేశ్వరుడు పొడుగాటి ఆ రెండు బాహువులతో రెండు శిఖరాలువున్న మందర పర్వతమువలె శోభించినాడు.

ఆ రాక్షససింహుడి పెద్ద నోటిలోనుంచి మామిడి పున్నాగ పొగడ పూల సువాసనలతోనూ, మృష్టాన్న గంధముతోనూ, మద్యము ఘుమఘుమలతోనూ వస్తూవున్న నిశ్వాసాలు ఆ గృహము అంతటా వ్యాపిస్తూ వున్నవి.

బంగారముతో చేసి ముత్యాలూ మణులూ పొదిగిన కిరీటము పక్కకు తొలగివుంది. ఉజ్జ్వలకుండల కాంతులతో ముఖము తేజరిల్లుతూ వుంది. రక్తచందనము మైపూతతోనూ, శోభాయమానము అయిన కంఠహారాలతోనూ వెడల్పాటి పొడుగాటి బలిష్ఠము అయిన అతని విశాల వక్షఃస్థలము ధగధగలాడుతూ వుంది. పైన కప్పుకొని ఉన్న తెల్ల పట్టు ఉత్తరీయము చెదిరిపోయిన్నీ, నడుముకు చుట్టుకున్న పచ్చని వస్త్రము కదిలిపోయిన్నీ అతడు మినుములరాశివలె కనిపించినాడు. పాము బుసలు కొట్టుతూ ఉన్నట్టు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వదులుతూ ఉన్నాడు. గంగానదీ జలాల మధ్యను పడుకున్న ఏనుగువలె నిద్రపోతూ ఉన్నాడు. నాల్గువైపులా ఉన్న బంగారు సెమ్మెలలో దేదీప్యమానముగా వెలుగుతూ ఉన్న దీపకాంతులతోనూ, దీపకాంతుల వెలుతురులో అతడు పెట్టుకొన్న ఆభరణాల కాంతులతోనూ మెరుపులు మెరుస్తూ ఉన్న మహామేఘము వలె నిద్రపోతూ ఉన్నాడు.

ఈ రాక్షసాధిపతి ప్రియభార్యలు ఆ మహాపరాక్రమవంతుడి పాదాలవైపున భుజాలవైపుగా పడుకొని నిద్రపోతూ ఉన్నారు. చంద్రుడి కాంతులతో తేజరిల్లుతూ, మనోహరమైన కుండలాల కాంతులతో శోభిస్తూ, వికసించిన పూలదండలతో ఘుమఘుమలాడుతూ పడుకొని నిద్రపోతూ ఉన్న ఆ రావణాసురుడి భార్యలను అందరినీ హనుమంతుడు చూచినాడు. వాండ్లు అందరూ నృత్యము చెయ్యడములోనూ, వివిధ వాద్యాలు వాయించడములోనూ అత్యంత నేర్పరులు. ఉత్తమాభరణాల ధగధగలతో ఆ స్త్రీలు అందరూ నిద్రపోతూ ఉన్నారు. బాహువులు తలగడగా

పెట్టుకొన్నందువల్ల ఆ బాహువులకు అలంకరించుకొన్న బాహుపురుల వల్లనూ, చెవులకు పెట్టుకొన్న వజ్ర వైడూర్యమణులు పొదిగిన బంగారు కుండలాలవల్లనూ వాండ్ల ముఖాలు శోభాయమానముగా కనిపించినవి. మంగళకరము అయిన కుండలాలతో, చంద్రబింబాలవంటి ముఖాలతో ఆ విమానగృహము నక్షత్రాలతో నిండిన ఆకాశమువలె అగుపించింది. యౌవన మదాతిశయ వ్యాయామానికి అలసిపోయిన ఆ తనుమధ్యలు ఎక్కడివారు అక్కడ పడుకొని నిద్రపోతూ ఉన్నారు.

కోమలమైన అవయవ విక్షేపాలతో, మేలైన మేని ఛాయతో, నట్టువరాలు నృత్యము చేస్తూ ఉన్నట్టుగా విన్యస్తశుభసర్వాంగిగా ఒకతె నిద్రపోతూ ఉన్నది. మహానదిలో తెప్పకొయ్యను పెనవేసుకొన్న తామరతీగవలె ఒకతె పెద్ద వీణెను కౌగలించుకొని నిద్రపోతూ ఉన్నది. చంకను ఎత్తుకున్న పసిబిడ్డనువలె ఒక అసితేక్షణ చంకలో గుమ్మెట పెట్టుకొని నిద్రపోతూ ఉన్నది. చిరకాలానికి వచ్చిన ప్రియుణ్ణి గట్టిగా కౌగలించుకున్న సర్వాంగసుందరివలె ఒక శుభస్తని రంజను గట్టిగా కౌగలించుకొని నిద్రపోతూ వుంది. కాముకి ఏకాంతములో తన ప్రియుణ్ణి పట్టుకొన్నట్టు ఒక కమలలోచన పిల్లనగ్రోవిని పట్టుకొని నిద్రపోతూవుంది. వాఙ్మయముతో నృత్యము చేసే ఒక భామిని పెనిమిటిని కౌగలించుకొన్నట్టు ఏడుతంత్రుల వీణను పట్టుకొని నిద్రపోతూవుంది. బలిసిన అవయవాలతో, బంగారు కాంతులతో, మృదువైన దేహముతో మనోహరముగా కనిపిస్తూ ఉన్న మత్తలోచన ఒకతె మద్దెలను గట్టిగా కౌగలించుకొని నిద్రపోతూవుంది. తారుణ్య మదముతో అలసిపోయిన ఒక కృశోదరి తన పార్శ్వానికీ బాహువులకూ మధ్యను పణవాన్ని (ఉడుకను) చంకలో పెట్టుకొని నిద్రపోతూవుంది. ఒక భామిని యువకుడు అయిన ప్రియుణ్ణీ తన బిడ్డనూ కౌగలించుకొని పడుకొన్నట్లు, ఒక చేతితో ఒక డిండిమాన్నీ, రెండవ చేతితో యింకొక డిండిమాన్నీ కౌగలించుకొని నిద్రపోతూవుంది. యౌవన మదముతో ఒండ్లు విరుగకుండా ఉన్న ఒక కమలపత్రాక్షి 'ఆడంబరము' అనే వాద్యాన్ని గట్టిగా పట్టుకొని నిద్రపోతూవుంది. వసంతఋతువులో వాడిపోకుండా ఉండడానికి తడిపినప్పటికిన్నీ కొద్దిగా వాడిపోయిన పూలదండవలె ఒక సుందరాంగి తెలియక జలకలశాన్ని బోరగిల తోసుకొని నీళ్ళతో తడిసి నిద్రపోతూవుంది. ఒక అబల సువర్ణ కలశాలవంటి తన స్తనాలను రెండు చేతులతోనూ పట్టుకొని నిద్రకు లోకువ అయిపోయింది. నిండు చంద్రునివంటి ముఖముతోవున్న ఒక కువలయపత్రాక్షి మరి ఒక సుశ్రోణిని కౌగలించుకొని యౌవనమదముతో మైమరచి నిద్రపోతూవుంది. అట్లా అక్కడ స్త్రీలు అందరూ నానావిధవాద్యాలనూ తమ ప్రియులనువలె రొమ్ములకు అదిమిపట్టుకొని నిద్రపోతూ వున్నారు.

ఆ స్త్రీలు అందరికీ ఎడముగా వేరే ఒక ఏకాంత ప్రదేశములో సుందరము అయిన శయ్యమీద ఒక రూపసంపన్న పడుకొని ఉంది. ఆమెను హనుమంతుడు చూచినాడు.

ఆమె మండోదరి, రావణాసురుడి ప్రియభార్య. ఆ అంతఃపురేశ్వరి ముత్యాలతోనూ, రత్నాలతోనూ పొదిగిన ఆభరణాలు పెట్టుకొనివుంది. ఆమె దేహచ్ఛాయ బంగారము మాదిరిగా వుంది. ఆ దేహకాంతులతో ఆ ప్రదేశము అంతా తేజరిల్లుతూ వుంది. ఆ మనోహర రూపమును హనుమంతుడు చూచినాడు. ఆ రూప యౌవన సంపన్నే సీతాదేవి ఏమోను అనుకొన్నాడు.

ఆ మహాబాహువుకు సంతోషము వేసింది. కపి స్వభావముతో చేతులు చరిచినాడు. తోకను ముద్దుపెట్టుకొన్నాడు. ఆడినాడు, పాడినాడు. అటూ యిటూ తిరిగినాడు. స్తంభము ఎక్కినాడు. అక్కడనుంచి క్రిందికి దూకినాడు.

11

ఆ పడుకొని నిద్రపోతూ ఉన్న ఆమె సీతాదేవికాదు అని హనుమంతుడు అనుకొన్నాడు. ఆలోచించసాగినాడు. "రాముణ్ణి ఎడబాసిన సీతాదేవి ఇట్లా నిద్రపోదు. భోజనము చేయదు. అలంకరించుకోదు. మద్యపానము చేయదు. రాముణ్ణి తప్ప మరి ఒకణ్ణి, దేవేంద్రుణ్ణి అయినా దరిచేరనీయదు. రాముడితో సరిసమానము అయినవాడు దేవతలలో సహితము లేడు. ఈ పడుకొన్న ఆమె సీతాదేవి కాదు. మరి ఒకతె" అని నిశ్చయించినాడు.

అంతట హనుమంతుడు ఆ ప్రదేశములో మళ్ళీ తిరగడము మొదలు పెట్టినాడు. అక్కడ పడుకొనివున్న స్త్రీలు కొందరు రతిక్రీడలకు అలసిపోయినారు. కొందరు పాటలు పాడి డస్సిపోయినారు. కొందరు నృత్యము చేసి బడలిపోయినారు. అందరూ తప్పతాగి మైమరచిపోయినారు. అందువల్లనే, మురజాలమీదనూ మద్దెళ్ళమీదనూ, పీఠాలమీదనూ, ఆస్తరణాలమీదనూ పడి ఒండ్లు ఎరుగకుండా నిద్రపోతున్నారు. ఆ సుందరీమణులు అందరి మధ్యను పడుకొని నిద్రపోతూవున్న ఆ మహాబాహువు రావణాసురుడు పెద్ద ఆవులమంద మధ్యను పడుకొని నిద్రపోతూవున్న ఆబోతువలెనూ, మహారణ్యములో పెంటి ఏనుగులమధ్యను నిద్రపోతున్న పోతుటేనుగువలెనూ శోభాయమానముగా కన్పించినాడు.

హనుమంతుడు అక్కడనుంచి కోరుకున్న సమస్త తినుబండారాలు దొరికే పానశాలలోకి పోయినాడు. అక్కడ జింకల మాంసమూ, దున్నపోతుల మాంసమూ, అడవిపందుల మాంసమూ వేరే వేరే పెట్టివున్నవి. వెడల్పాటి బంగారు పాత్రలలో

సగము సగము తిని వదిలిపెట్టిన నెమలి మాంసమూ, కోడి మాంసమూ ఉన్నవి. పెరుగుతోనూ సౌవర్చలవణముతోనూ పక్వము చేసిన అడవిపంది మాంసమూ, గొర్రె మాంసమూ, ఏదుపంది మాంసమూ, జింకల మాంసమూ, వివిధ విధాల పక్వము చేసిన కొక్కిరల మాంసమూ, సగము తిని వదిలేసిన చకోరపక్షుల మాంసమూ, ఒంటిముల్లు చేప మాంసమూ, ఇంగువ, మిరియాలు వేసి వండిన మాంసమూ, రకరకాల లేహ్యాలూ, రకరకాల పానీయాలూ, రకరకాల భోజ్యపదార్థాలూ, ఉప్పూ పులుసూ ప్రధానముగా ఉండే వ్యంజనాలూ, చక్కెర తేనె ద్రాక్ష దానిమ్మ మొదలు అయిన మధుర పదార్థాలు చేర్చి చేసిన చక్కెర, పలుచని రాగషాడబాలూ, పానపాత్రలలో ఉంచిన వివిధఫలరసాలూ హనుమంతుడు చూచినాడు.

అవి అన్నీ సమర్థులైన వంటవాండ్లు రకరకాల రుచులతో, రకరకాలుగా వండి వేరే వేరే పెట్టి వుంచినారు. అవేకాకుండా సముద్ర మథనము అప్పుడు పుట్టిన సురవంటి నిర్మలము అయిన మద్యాలు, చక్కెర ఇప్పపూలు వేసి చేసిన మద్యాలు, తేనెతో చేసిన మద్యాలు, ద్రాక్షపండ్లతో చేసిన మద్యాలు, సుగంధపుష్పాలతోనూ మధురఫలాలతోనూ చేసిన మద్యాలు సుగంధము గుబాళిస్తూ వున్నవి. అక్కడ రకరకాల వెండి పాత్రలు, స్ఫటికాల పాత్రలు, బంగారు చెంబులు, వెండి కలశాలు, బంగారు కలశాలు కనిపించినవి.

శ్రేష్ఠము అయిన పానద్రవ్యాలు సమృద్ధముగా వున్నవి. మణులతో పొదిగిన వెండి, బంగారు పాత్రల నిండా మద్యాలు వున్నవి. సగము తాగిన మద్య పాత్రలు, నిశ్శేషముగా తాగిన మద్యపాత్రలు, ఏమాత్రమూ తాగకుండా నిండా మద్యము వున్న పాత్రలు కనిపించినవి. ఒకచోట వివిధ భక్ష్యాలు పెట్టి వున్నవి. ఒకచోట మద్యాలు అన్నీ ప్రత్యేకము ప్రత్యేకముగా పెట్టి వున్నవి. తినగా మిగిలిన అన్నము ఒకచోట వున్నది. పగిలిపోయిన పాత్రలు ఒకచోట వున్నవి. ఒకచోట పూలదండలు అన్నీ కలిసిపోయి వున్నవి. ఒకచోట జలకలశాలు కనిపించినవి. ఒకచోట పండ్లు కనిపించినవి. పాన భోజన సమయములలో ఆ యా స్త్రీలు తీసివేసిన విలువ అయిన కంఠహారాలు, బాహుపురులు, కాళ్ళ అందెలు పడివున్నవి. నేల అంతటా పూలు చల్లి వున్నవి. అవి అన్నీ శోభాయమానముగా కనిపించినవి.

ఆ పానశాలలో సౌవర్ణరత్నమయము అయిన శయనాసనాలు అగ్నిహోత్ర కాంతులతో ధగధగలాడుతూ కనిపించినవి. కొన్ని శయ్యలు శూన్యముగా వున్నవి. అక్కడ కొందరు సర్వాభరణభూషితలు అయిన స్త్రీలు తమ సౌందర్యాదులను గురించి చర్చించుకొంటున్నారు. కొందరు స్త్రీలు నృత్యగీతాదులను గురించి చెప్పుకొంటూ వున్నారు. కొందరు స్త్రీలు దేశకాలోచిత విషయాలను గురించి

మాట్లాడుకొంటున్నారు. కొన్ని శయ్యలమీద స్త్రీలు ఒకరిని నొకరు కౌగలించుకొని నిద్రపోతున్నారు. కొందరు వరాంగనలు నిద్రాపారవశ్యములో నిద్రపోతున్న అన్యస్త్రీల చీరలను లాగి కట్టుకొని నిద్రపోతున్నారు. మందమారుతానికివలె వాండ్ల వాండ్ల ఉచ్ఛ్వాసనిశ్వాసలవల్ల వాండ్లు వాండ్లు కట్టుకొన్న చీరలు, మెడలలో వేసుకున్న దండలు చిత్ర విచిత్రముగా ఎగురుతూ వున్నవి.

అక్కడ మధురము అయిన మద్యము వాసనలతోనూ, చందనము వాసనల తోనూ, వివిధము అయిన పూల వాసనలతోనూ, నానావిధ ధూప వాసనలతోనూ, గాలి వివిధ సుగంధాలతో చల్లగా, హాయిగా వీస్తూ వుంది. షడ్రసాల సుగంధమూ, చందనాదుల సుగంధమూ, అగరు ధూప సుగంధమూ అప్పుడు ఆ విమానగృహము అంతటా వ్యాపిస్తున్నది.

ఆ అంతఃపురములో అట్లా పడుకొని నిద్రపోతూవున్న స్త్రీలు కొందరు శ్యామవర్ణముతో కనిపించినారు. కొందరు నల్లగానూ, కొందరు బంగారు రంగుతోనూ కనిపించినారు. వారు అందరూ మదన వ్యాయామములో అలిసిపోయి నిద్రాపరవశలు అయినారు. అట్లా నిద్రపోతూవున్న ఆ వరాంగనలు అందరూ ముకుళించుకొన్న పద్మాలవలె కనిపించినారు.

ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఆ అంతఃపురములో ఏ ఒక్క ప్రదేశమూ వదిలిపెట్టకుండానూ, ఏ ఒక్క మనిషినీ వదిలిపెట్టకుండానూ అంతా తిరిగి చూచినాడు. కాని, సీతాదేవి మాత్రము ఆ బుద్ధిమంతుడికి అక్కడ ఎక్కడనూ కనిపించలేదు. ఆ మహాతేజోవంతుడు హనుమంతుడు అట్లా అంతమంది స్త్రీలను చూస్తూ, తాను ధర్మహాని చేస్తున్నాను అనే సందేహంలో పడ్డాడు. పరాయివాడి అంతఃపురాంగనలు అందరూ నిద్రపోతూ వుండగా తాను అట్లా చూడడమువల్ల ధర్మలోపము అవుతుందేమోను అనుకొన్నాడు. రావణాసురుడు ఎత్తుకొని వచ్చిన పరస్త్రీలను అందరినీ చూచినాను. కాని, ఆ స్త్రీలను అనుభవించవలెను అనే ఆసక్తితో నేను వారిని చూడలేదు అనుకొన్నాడు.

ఆ బుద్ధిమంతుడు హనుమంతుడు అచంచల మనస్కుడు. సీతాదేవిని చూడవలెను అనే ఒకే ఒక మనో నిశ్చయముతో అట్లా తిరిగి చూచినాడు. తాను చేయవలసిన పనిని గురించి ఆలోచించినాడు. తాను అట్లా చేయడమే ధర్మము అనుకొన్నాడు. పరపురుషుడు ఎవడూ రాలేడు అనే నమ్మకముతో రావణాసురుడి స్త్రీలు అందరూ విచ్చలవిడిగా నిద్రపోతున్నారు. వారిని అందరినీ నేను చక్కగా చూచినాను. నాకు ఏ కొంచెము మనోవికారమూ కలుగలేదు. శుభాశుభ స్థితులలో ఇంద్రియాల ప్రవర్తనకు మనస్సే కారణము. మనస్సును పట్టే దేహేంద్రియాలు

ప్రవర్తిస్తూ వుంటవి. నా మనస్సు వ్యవస్థ తప్పలేదు. స్త్రీలతోనే స్త్రీలు వుంటారు. స్త్రీలు లేనిచోట నేను సీతాదేవిని వెతికితే ప్రయోజనము వుండదు. అందువల్ల, స్త్రీలు వుండేచోట నేను జాగ్రత్తగా వెతకవలెను. ఏ జాతి జంతువును ఆ జాతి జంతువులలో వెతకడమే ధర్మము. ఒక స్త్రీని సజాతీయులు అయిన స్త్రీలలో వెతకవలెనుగాని మృగాలలో వెతకడము నిరర్థకము. పరిశుద్ధము అయిన హృదయముతో నేను రావణాసురుడి అంతఃపురము అంతా వెతికినాను. అక్కడ దేవతా స్త్రీలు కనిపించినారు. గంధర్వాంగనలు కనిపించినారు. నాగకన్యలు కనిపించినారు. ఆ సీతాదేవి మాత్రము కనిపించలేదు అనుకొంటూ, ఆ అంతఃపురములో వున్న తక్కిన స్త్రీలను అందరినీ పరిశీలించి చూస్తూ, వెనకకు తిరిగి మళ్ళీ అంతఃపురము అంతా వెతకడము మొదలుపెట్టినాడు హనుమంతుడు.

12

సీతాదేవిని చూడవలెను అనే ఉత్సాహముతో హనుమంతుడు ఆ భవనము మధ్యను వున్న లతాగృహాలలోకి, చిత్రశాలాగృహాలలోకి, నిశాగృహాలలోకి పోయినాడు. అవి అన్నీ వెతికి చూచినాడు. అక్కడ ఎక్కడనూ ఆ శుభనేత్రి, రాముడి ప్రాణప్రియ సీతాదేవి కనిపించలేదు. ఆలోచించసాగినాడు. ఆ మైథిలి చనిపోయి అయినా వుంటుంది లేదా ఏ గహన ప్రదేశములో నయినా వుండి వుంటుంది అని హనుమంతుడు అనుకొన్నాడు.

"వీడు, ఈ రావణాసురుడు దుష్టకర్ముడు. ఏ చెడుపనిని అయినా చేయకలడు. ఆ జనకాత్మజ సత్పథము తప్పివుండదు. స్వశీలసంరక్షణా సక్తచిత్త అయి వుంటుంది. అందువల్ల వీడు, ఈ రావణాసురుడు ఆమెను తప్పకుండా చంపివేసి వుంటాడు లేదా ఆ జనకరాజపుత్రి ఈ రావణాసురుడి పనికత్తెల వికారాకారాలను, వికృత వేషాలను, భయంకర నేత్రాలను, వికృతాననలను చూచి భయపడి ప్రాణాలను విడిచివుంటుంది.

"సుగ్రీవుడు చండశాసనుడు, మహాబలవంతుడు. వానరులు అందరూ తిరిగి కిష్కింధకు పోవడానికి అతడు పెట్టిన గడువు కాలము ఎప్పుడో అయిపోయింది. నాకు సీతాదేవి కనుపించలేదు. నేను వచ్చిన పని సాధించలేక పోయినాను. ఇంకను అతని దగ్గరకు పోయే ప్రాప్తము నాకు లేదు.

"ఈ రావణాసురుడి అంతఃపురము అంతా వెతికినాను. వీడి స్త్రీలను అందరినీ చూచినాను. ఆ సాధ్వి సీతాదేవి మాత్రము నాకు అగుపించలేదు. నా శ్రమ అంతా వృధా అయిపోయింది. నేను తిరిగి పోగానే వానరులు అందరూ నా చుట్టూ మూగుతారు. 'ఓ హనుమంతుడా! నీవు పరమపరాక్రమవంతుడవు.

లంకాపట్టణానికి పోయినావు. ఏమి చేసుకొని వచ్చినావు చెప్పు' అని అడుగుతారు. నేను ఆ జనకాత్మజను చూడకుండా వారికి చెప్పగలిగే దేమిటి? "ఈ కాలాతిక్రమణానికి వారు అందరూ ప్రాయోపవేశము చేసి చచ్చిపోవడముకన్నా గత్యంతరము లేదు.

"నేను సీతాదేవిని చూడకుండా పోయేట్లయితే ఆ ముసలివాడు జాంబవంతుడు నన్ను చూచి ఏమి అడుగుతాడో! యువరాజు అంగదుడు నన్ను చూచి ఏమి అంటాడో! వానరులు అందరూ సముద్రము దాటి వచ్చి నన్ను చూచి ఏమి ఏమి ప్రశ్నలు వేస్తారో! అందరూ నన్ను పనికిమాలినవాడు అని నిందిస్తారు.

"అయినా, ఇట్లు నేను నిరుత్సాహపడిపోయినందువల్ల ప్రయోజనము ఏమిటి? ఉత్సాహమే సర్వసంపదలకూ మూలము. ఉత్సాహమే సర్వశుభాలకూ ఆధారము. ఉత్సాహమే సర్వకార్యాలకూ సాధనము. ఉత్సాహము వల్లనే ఏ పని అయినా సమకూరుతుంది. ఏ ప్రాణి చేసే పని అయినా ఉత్సాహమువల్లనే సఫలము అవుతుంది. ఉత్సాహక శక్తి ఉత్తమోత్తమము అయింది. ఇప్పుడు ఉత్సాహముతో మళ్ళీ వెతకడమే నా కర్తవ్యము.

"ఇదివరకు వెతకని ప్రదేశాలు, వెతికిన ప్రదేశాలు మళ్ళీ వెతికి చూస్తాను. ఇదివరకు వెతికిన పానశాలలు, పుష్పగృహాలు, క్రీడాశాలలు, ఈ భవనోద్యానవనాలలో మధ్యను వున్న వీధులు, ఇంకా నేను వెతకకుండా వదిలిపెట్టిన అన్ని ప్రదేశాలు ఇప్పుడు మళ్ళీ వెతకడమే కర్తవ్యము" అనుకొన్నాడు హనుమంతుడు.

ఆ యా ప్రదేశాలు అన్నీ ఆ బుద్ధిమంతుడు హనుమంతుడు మళ్ళీ వెతకడము మొదలు పెట్టినాడు. నేలమాళిగలలోనూ, ఆ రాజనగరులో నాలుగు రహదార్లూ కలిసేచోట మండపాల వంటి చైత్యగృహాలలోనూ, ఆ యా భవనాలకు కొంచెము కొంచెము దూరములో వున్న విహారగృహాలలోనూ వెతుకుతూ ఎత్తుఅయిన భవనాలమీదికి పదేపదే ఎగురుతూ, కిందికి దూకుతూ, మధ్య మధ్యను నిలుచుని చూస్తూ, ద్వారాలు తెరుస్తూ, తలుపులు పడతోస్తూ, లోపలికి పోయి చూస్తూ, బయటికి వస్తూ, ఆ యా ఎత్తు అయిన ప్రదేశాలనుంచి దిగుతూ, మళ్లీ పైకి ఎక్కుతూ అన్ని ప్రదేశాలు హనుమంతుడు వెతికినాడు. ఆ రావణాసురుడి రాజనగరులో ఒక బెత్తెడు ప్రదేశము అయినా వదిలిపెట్టకుండా అంతటా హనుమంతుడు తిరిగి చూచినాడు.

రాజనగరులో ప్రాకారాల మధ్యను వీధులు అన్నీ తిరిగి చూచినాడు. రచ్చమానుల దగ్గిర వేసిన వేదికలు అన్నీ చూచినాడు. నడబావులు, కోనేళ్ళు మొదలు అయినవి అన్నీ పరిశీలించి చూచినాడు. వివిధ వికారాదులతోనూ, నానావిధ

విరూపాలతోనూ ఉన్న రాక్షస స్త్రీలు ఎంతోమంది కనిపించారు. కాని సీతాదేవి మాత్రము కనిపించలేదు. ఈ లోకములో ఎక్కడా కనుపించని అప్రతిమాన సౌందర్యవతులు, విద్యాధర స్త్రీలు కనుపించినారు. కాని రాముణ్ణి సంతోషపెట్టే సీతాదేవి మాత్రము కనుపించలేదు. పెద్ద పెద్ద పిరుదులతో, పూర్ణచంద్రుడివంటి ముఖాలతో భాసించే నాగకన్యలు కనుపించినారు. కాని ఆ సుమధ్యమ సీతాదేవి మాత్రము కనిపించలేదు. దేవతలను కొట్టి రావణాసురుడు బలవంతముగా ఎత్తుకొని వచ్చిన దేవకన్నెలు కనిపించినారు. కాని జనకనందన మాత్రము కనిపించలేదు. అక్కడ ఉన్న వరాంగనలు అందరూ కనిపించినారు. కాని ఆ సీతాదేవి మాత్రము కనిపించలేదు. అందుకు ఆ మహాబాహువుకు హనుమంతుడికి దుఃఖము వచ్చినది. వానరేంద్రుడు తనను పంపించడమూ, తాను సముద్రాన్ని లంఘించడమూ వ్యర్థము అయిన పని అయింది అనుకొన్నాడు. ఆ మారుతాత్మజుడికి మరింత దుఃఖము వచ్చింది. ఆ పుష్పకవిమాన గృహమునుంచి కిందికి దిగినాడు. దుఃఖముతో అతని మనస్సు కొట్టుకులాడింది. ఆలోచించసాగినాడు.

13

హనుమంతుని ఆలోచనలు

ఆ విమానగృహ ప్రాకారముమీదికి వచ్చిన ఆ వేగవంతుడు హనుమంతుడు మేఘము మధ్యను మెరుపువలె తేజరిల్లినాడు.

ఆ కపివీరుడికి ఆ అంతఃపురములో సీతాదేవి కనిపించలేదు. ఆలోచించ సాగినాడు. "లంకాపట్టణము అంతా ఎంతో గాలించినాను. ఆ వైదేహి, ఆ సర్వాంగసుందరి సీతాదేవి కనిపించలేదు. ఈ లంకలో ఉన్న పర్వతాలు, తటాకాలు, సరస్సులు, సెలయేళ్లు, నదులు, బురదతో ఉన్న అడవులు, దుర్గమపర్వతాలు కలయతిరిగినాను. సీతాదేవి కనిపించలేదు. ఆ గృధ్రరాజు సంపాతి ఇక్కడ రావణాసురుడి ఇంట్లో సీతాదేవి వుంది అని చెప్పినాడు. కాని ఆమె కనిపించలేదు.

"పరమధార్మికులకు ఉనికిపట్టు అయిన విదేహ దేశములో, అందులో సత్పురుషులు నివసించే మిథిలాపట్టణములో ఆమె పుట్టింది. జనకమహారాజు కూతురుగా పెరిగింది. అటువంటిది ఆమె సీతాదేవి అసహాయురాలు అయి, దుష్టచారుడు అయిన రావణాసురుడికి వశము అవుతుందా? రావణాసురుడు ఆమెను తీసికొని వచ్చేటప్పుడు వెనుక నుంచి రామబాణాలు వచ్చి పడుతవి ఏమోను అనే భయముతో అమిత వేగముతో ఎగిరి వస్తూవుంటే, ఆమె మధ్యలో జారిపడిపోయింది ఏమో? అట్లాకాకపోయినట్లయితే సిద్ధులు సంచారము చేసే ఆకాశమార్గాన

రావణాసురుడు ఆమెను ఎత్తుకొని వస్తూవుంటే, క్రింద సముద్రాన్ని చూచి గుండె చెదిరి ఆమె పడిపోయిందేమో? రావణాసురుడు అమిత వేగముతో ఎత్తుకొని వస్తూవుంటే, వాడి భుజాల ఒత్తిడికి ఆ విశాలాక్షి ప్రాణము వదిలింది ఏమో? వాడు సముద్రముమీద అట్లా వస్తూవుంటే ఆ జనకాత్మజ పెనుగులాడి సముద్రములో పడిపోయింది ఏమో? అయ్యో! ఆమె తన శీలాన్ని కాపాడుకొంటూ ఉంటే ఈ క్షుద్రుడు రావణాసురుడు ఆ దిక్కులేని ఆమెను, ఆ దీనురాలిని భక్షించి వేసినాడు ఏమో? అట్లా కాకపోయినట్లయితే ఆ అసితేక్షణను సీతాదేవిని ఈ రావణాసురుడి భార్యలు దుష్టహృదయులు అయి కబళించి వేసినారు ఏమో? లేక ఆ పూర్ణచంద్రానన, ఆ పద్మపత్రాక్షి సీతాదేవి రామవదనారవిందాన్ని ధ్యానము చేస్తూ దీనురాలు అయి, పంచత్వము పొందింది ఏమో? హా రామా! హా లక్ష్మణా! హా అయోధ్యా! అంటూ ఏడ్చి ఏడ్చి ఆ వైదేహి, ఆ మైథిలి సీతాదేవి ప్రాణము వదిలిపెట్టింది ఏమో? అట్లా కాకపోయినట్లయితే రావణాసురుడి ఇంట్లోనే పంజరములో పెట్టిన గోరువంకవలె ఏ నేలమాళిగలోనైనా ఏడుస్తూవుందేమో?

"ఆఁ, అంతే అయి ఉంటుంది. జనకరాజపుత్రిక, రాముడి భార్య ఆ సుమధ్యమ, ఆ ఉత్పలపత్రాక్షి సీతాదేవి రావణాసురుడికి వశము అవుతుందా? ఆ జనకాత్మజను రాముడి ప్రియభార్యను దాచి ఉంచినా, ఒక వేళ ఆమె సముద్రములో పడిపోయినా, ఆమె చచ్చిపోయినా నేను ఆ విషయము రాముడికి చెప్పకూడదు. అయ్యో! చెప్పకపోయినా దోషమే, చెప్పినా దోషమే. చెప్పేట్లయితే అతడు చచ్చిపోతాడు. ఆ దోషము నన్ను బాధిస్తుంది. ఇకను నేను ఏమి చేయవలెను? ఒక దానికి ఒకటి విరుద్ధముగా ఉన్నవి. ఈ పని ఇట్లా అయిపోయింది. ఈ స్థితిగతులలో ఉపాయము ఏమిటి?" అనే విచారములో హనుమంతుడు పడిపోయినాడు. మళ్ళీ ఆలోచించ సాగినాడు.

"నేను సీతాదేవిని చూడకుండా ఇక్కడనుంచి కిష్కింధా నగరానికి పోయేట్లయితే, నేను సాధించుకొని పోయినది ఏమిటి? ఈ సముద్రలంఘనమూ, ఈ లంకాపట్టణము అంతా వెతకడమూ, ఈ రాక్షస గృహాలను అన్నిటినీ పరిశీలించడమూ ప్రయోజనముమాలిన పనులు అవుతవి. సీతాదేవి కనపడలేదు అనే కర్ణకఠోరమూ, దారుణమూ, క్రూరమూ, తీక్షణమూ, పరమ అప్రియమూ అయిన మాటచెప్పగానే, రాముడి దేహేంద్రియాలు తపించిపోతవి. అతడు ప్రాణాలు వదులుతాడు. ఆ రాముడిమీద అంత స్నేహముతో ఉంటూ ఉన్న లక్ష్మణుడున్నూ, రాముడు పోయిన తరువాత బ్రతికివుండడు. ప్రాణాలు వదులుతాడు. రామ లక్ష్మణులు చనిపోయినారు అని తెలియగానే భరతుడున్నూ చచ్చిపోతాడు. భరతుడు

చచ్చిపోయిన తరువాత శత్రుఘ్నుడు బ్రతికి ఉండటము ఉత్తది. నల్గురు కొడుకులూ చచ్చిపోయిన తరువాత వారి తల్లులు కౌసల్యా, సుమిత్రా, కైకేయీదేవులున్నూ చచ్చిపోతారు. సందేహము లేదు.

"సుగ్రీవుడు కృతజ్ఞుడు, సత్యసంధుడు. రాముడు చచ్చిపోవడము చూచి అతడున్నూ ప్రాణము వదులుతాడు. భర్తృ శోకముతో బాధపడుతూ, మనస్సు అంతా పాడయిపోయి రుమ ప్రాణము వదులుతుంది. వాలి పోయిన దుఃఖముతో తార ఇప్పటికే కృశించిపోయి ఉంది. ఇక రాజు అయిన సుగ్రీవుడు పోయిన తరువాత ఆమె బ్రతుకదు. తల్లిదండ్రులు పోయిన దుఃఖముతోను, సుగ్రీవుడు పోయిన దుఃఖముతోను అంగదుడున్నూ చచ్చిపోతాడు.

"రాజు చచ్చిపోయిన తరువాత వానరులు అందరూ అరచేతులతోనూ, పిడికిళ్ళతోనూ నెత్తి నెత్తి బాదుకుంటూ ఏడుస్తారు. సుగ్రీవుడు వారు కోరిన కోర్కెలు అన్నీ చెల్లిస్తూ, పెద్దలను అందరినీ గౌరవిస్తూ, చిన్న వాళ్ళను అందరినీ బుజ్జగిస్తూ ఉండేవాడు. అటువంటి సుగ్రీవుడు చచ్చిపోయిన తరువాత వానరులు జీవించరు. వానర కుంజరులు అందరూ కలిసి మెలిసి వనాలలోనూ, పర్వతాల మీదనూ వారి వారి ఇండ్లలో క్రీడించడము అనేది ఇకను వుండదు. రాజు పోయినాడు అనే దుఃఖముతో మంత్రులు అందరూ చచ్చిపోతారు. వానరులు అందరూ ఆలుబిడ్డలతో పర్వతశిఖరాల మీదినుంచి నేలమీదికి దూకి చచ్చిపోతారు. అట్లాకాకపోయేట్లయితే విషము తిని అయినా, ఉరిపోసుకొని అయినా, మండుతూ ఉన్న నిప్పులలోకి దూకి అయినా, ఉపవాసాలు చేసి అయినా, ఆయుధాలతో పొడుచుకొని అయినా చచ్చిపోతారు. ఒక్కరూ జీవించి ఉండరు. అందరూ చచ్చిపోతారు.

"నేను కిష్కింధకు పోవడముతో ఇక్ష్వాకువంశము నాశనము అయిపోతుంది. ఘోరరోదనము ఆరంభము అవుతుంది. వానరులు ఎవరూ జీవించరు. అందువల్ల, నేను కిష్కింధకు పోను. సీతాదేవిని చూడకుండా, సుగ్రీవుడి దర్శనము చేయను. నేను ఇక్కడనే ఉండిపోయేట్లయితే ఆ ధర్మాత్ములు, ఆ మహారధులు రామలక్ష్మణులు నేను సీతాదేవిని వెతికి వస్తాను అనే ఆశతో జీవించి ఉంటారు. వానరులు అందరున్నూ బ్రతికి ఉంటారు. ఇకను నాకు ఇక్కడ ఆ జనకాత్మజ కనపడకపోయేట్లయితే నేను వానప్రస్థుణ్ణి అయి, ఏ చెట్టు కిందను అయినా కూర్చుని చేతికి అందిందీ నోటికి అందిందీ తింటూ కాలక్షేపము చేయడమే కర్తవ్యము. లేదా కందమూల ఫలాలు బహుళముగా దొరికే సముద్ర ప్రాంత ప్రదేశములో చితి పేర్చుకొని, అగ్నిహోత్రుడికి ఆహుతి అయిపోవలెను. అట్లాకాకపోయేట్లయితే ఉపవాసవ్రతము అవలంబించి ప్రాణము త్యజించివేయవలెను. నా దేహాన్ని అప్పుడు కుక్కలూ కాకులూ తింటవి.

మహర్షులు ఇటువంటి మరణాన్ని అంగీకరించినారు. నేను ఇట్లా చేస్తాను. ఆ జానకి కనపడకపోయేట్లయితే సముద్రజలాలలో దూకి ప్రాణాలు వదలివేస్తాను.

"ఈ రాత్రి మంగళకరముగా ఆరంభము అయింది. వెన్నెల అంతకన్నా మనోహరముగా తోడు అయింది. కీర్తిమాలలు నా మెడలో పడుతవి అనుకొన్నాను. కాని సీతాదేవి కనిపించలేదు. ఇంతరాత్రీ నిరర్థకము అయిపోయింది. కాబట్టి నేను తిరిగిపోను. నియమబద్ధుణ్ణి అయి ఏ చెట్టుకిందను అయినా తపస్సు చేస్తాను. ఆ అసితేక్షణను సీతాదేవిని చూడకుండా ఇక్కడనుంచి పోయి అంగదుణ్ణి, వానరులను కలుసుకోను. నేను పోయి వారిని చూచేట్లయితే వాండ్లు అందరూ ప్రాయోపవేశము చేసి చచ్చిపోతారు. చచ్చిపోడమువల్ల అనేక దోషాలు వస్తవి. జీవించి ఉంటే ఎప్పటికైనా శుభాలు సంప్రాప్తము అవుతవి. అందువల్ల జీవించి ఉండవలెను. అనేక శుభాలు సంప్రాప్తము అవుతవి" అనుకొన్నాడు. అట్లా అనుకొంటూ హనుమంతుడు పదే పదే దుఃఖపడ్డాడు. ఆ దుఃఖానికి పారము అతనికి అప్పుడు అగుపించలేదు.

"ఈ మహాబలవంతుణ్ణి దశగ్రీవుణ్ణి చంపివేస్తాను. సీతాదేవి కనపడితే కనపడుతుంది, లేకపోతే లేదు. వీడు చేసిన పనికి నేను బదులు చేసినట్టు అయినా అవుతుంది. అట్లా కాదు, వీణ్ణి, ఈ రావణాసురుణ్ణి సముద్రము మీదుగా ఎత్తుకొనిపోయి, పశువును పశుపతికి వలె వీణ్ణి రాముడికి సమర్పిస్తాను" అనుకొన్నాడు.

"ఆ యశస్విని రామపత్ని సీతాదేవి కనపడేటంతవరకున్నూ, ఈ లంకాపట్టణములో పదే పదే వెతుకుతాను. నేను అప్పుడు సంపాతి చెప్పిన మాటనుపట్టి పోయి రాముణ్ణి తీసుకొని వచ్చి ఉన్నట్లయితే ఏమి అయివుండేదో? అతడు భార్య కనపడక దుఃఖపరవశుడు అయిపోయేవాడు. అంతట కోపము వచ్చి వానరులను అందరినీ బాణాలతో దహించి వేసి ఉండేవాడు. అప్పుడు అట్లా చేయక పోవడమే మంచిది అయింది. నా నుంచి నరులు కాని, వానరులు కాని చచ్చిపోకూడదు. నేను నియతాహారముతో జితేంద్రియుణ్ణి అయి ఇక్కడనే వుండిపోతాను.

"అదిగో, మహోన్నత వృక్షాలతో ఎట్టఎదుట కనపడుతున్నది అశోకవనము. నేను ఈ వనము ఇదివరకు వెతకలేదు. ఇప్పుడు ఈ వనము వెతుకుతాను. అష్టవసువులకూ, ఏకాదశరుద్రులకూ, ద్వాదశాదిత్యులకూ, అశ్వినీ దేవతలకూ, సప్తమరుత్తులకూ నమస్కారము చేస్తున్నాను. ఈమారు రాక్షసులను అందరినీ దుఃఖాలపాలు చేస్తాను. వీండ్లను అందరినీ జయించి వేస్తాను. తపస్వికి తపస్సిద్ధివలె, రాముడికి ఇక్ష్వాకుకుల పావనిని సీతాదేవిని సమర్పిస్తాను" అనుకొంటూ, ఆ మహాతేజోవంతుడు మారుతాత్మజుడు ఒక ముహూర్తము సేపు ఆలోచించినాడు. అతడి దుఃఖము అంతరించింది. ఇంద్రియ వ్యాకులము ఉడిగిపోయింది. లేచినాడు.

"రామలక్ష్మణులకు నమస్కారము. జనకాత్మజకు సీతాదేవికి నమస్కారము. రుద్రుడికి, ఇంద్రుడికి, యముడికి, అగ్నిహోత్రుడికి నమస్కారము. సూర్య చంద్రాదులకూ, మరుద్గణాలకూ నమస్కారము" అంటూ వారి అందరికీ నమస్కారాలు చెప్పినాడు. అంతట సుగ్రీవుడికి నమస్కారము చెప్పినాడు. దశదిశలూ తేరిపార చూచినాడు. అశోక వనానికి బయలుదేరినాడు.

ఆ వాయుపుత్రుడు హనుమంతుడు అశోకవనములోకి పోయినట్లే భావించినాడు. ఇకను అక్కడ చేయవలసిన పనిని గురించి ఆలోచించడము మొదలుపెట్టినాడు. "నేను వెదకపోతూ ఉన్న ఈ అశోకవనములో రాక్షసులు అనేకమంది ఉంటారు. వృక్ష సమూహాలు కిక్కిరిసి ఉన్నవి. చుట్టూ కంచెలు మొదలయినవి కనపడుతున్నవి. కావలివాండ్లు తప్పకుండా అప్రమత్తులుగా ఉంటారు. ఆ సర్వవ్యాపకుడు వాయుదేవుడున్నూ భయముతో చెట్టు కదలిపోకుండా గాలి వీస్తూ ఉన్నాడు. రావణాసురుడికి, రాక్షసులకు కనపడకుండా ఉండడానికీ, రామకార్యార్థసిద్ధికీ నేను నా దేహాన్ని సంక్షిప్తము చేసినాను. మహర్షులతో కూడా దేవతలు అందరూ నాకు ఇక్కడ కార్యసిద్ధి కలగచేయవలెను అని ప్రార్థిస్తున్నాను. తన అంతట తానుగా పుట్టిన ఆ భగవంతుడు, బ్రహ్మదేవుడూ, దేవతలూ, అగ్నిహోత్రుడూ, వాయుదేవుడూ, వజ్రపాణి అయిన దేవేంద్రుడూ, పాశహస్తుడు అయిన వరుణదేవుడూ, సూర్యచంద్రులూ, మహాత్ములు అయిన విశ్వదేవతలూ, మరుత్తులూ, శివదేవుడూ నాకు కార్యసిద్ధి కలగచేస్తారు. సమస్త భూతాలకు ప్రభువు అయిన ఆ సర్వేశ్వరుడూ దారిలో (కనిపించేవీ, కనిపించనివీ) నాకు కార్యసిద్ధి కలుగచేస్తాడు.

"ఉన్నతము అయిన ముక్కుతో, తెల్లని దంతాలతో, ఏ దోషమూ లేని తెల్లని చిరునవ్వుతో, తామరరేకులవంటి నేత్రాలతో, చంద్రబింబము వంటి ముఖముతో కనుపించే ఆ పూజ్యురాలిని సీతాదేవిని ఎప్పుడు చూస్తానో!

"క్షుద్రుడూ, పాపిష్ఠివాడూ, క్రూరకర్ముడూ, భయంకరవేషుడూ అయిన రావణాసురుడు బలవంతముగా లేవనెత్తుకొని వచ్చిన ఆ అబలను, ఆ దీనురాలిని సీతాదేవిని ఇప్పుడు ఏ స్థితిలో చూస్తానో" అనుకొన్నాడు హనుమంతుడు.

14

హనుమంతుని అశోకవన ప్రవేశము

ఆ మహాతేజోవంతుడు హనుమంతుడు ఇట్లా కొంచెముసేపు ఆలోచించినాడు. అంతట ఆ అశోకవనములోకి పోవలెను అనుకొన్నాడు. రావణాసురుడి రాజభవన ప్రాకారముమీదినుంచి అశోకవన ప్రాకారము మీదికి దూకినాడు.

వసంతకాలారంభ సమయములోవలె విరగపూసిన మద్దిచెట్లనూ, మనోహరము అయిన అశోకవృక్షాలనూ, చక్కగా పూసిన సంపంగిచెట్లనూ, విరిగిచెట్లనూ, పొన్నచెట్లనూ, మామిడిచెట్లనూ, తీగకానుగుచెట్లనూ (కపిముఖ వృక్షాలనూ), ఇంకా వివిధ వృక్షాలనూ హనుమంతుడు చూచినాడు. అతడి సర్వాంగాలూ పులకలు ఎత్తినవి. ఆ అశోకవనములో మామిడి తోపులతోనూ, వందలకొద్దీ లతలతోనూ కమ్ముకొని వున్న వృక్షవాటికలోకి హనుమంతుడు ఎగిరి అల్లెత్రాడు వదిలిన ఇనుపబాణమువలె దూసుకొని పోయినాడు.

ఆ అశోకవనము విచిత్రము అయిన మహావనము. ఇక్కడ పక్షులు ఎప్పుడూ మధురగానము చేస్తూ వుంటవి. అంతటా వెండి బంగారు చెట్లు కమ్ముకొని వున్నవి. నానావిధ మృగాలూ, వివిధ పక్షి సంఘాలూ చిత్ర విచిత్రము అయిన వర్ణాలతో శోభాయమానముగా కనపడుతవి. ఆ మహావనములో అనేక అవాంతర ఉద్యానవనాలు వున్నవి. ఆ మహావనము ఉదయిస్తూ వున్న సూర్యకాంతులతో తేజరిల్లుతూ వుంది. వివిధవృక్షాలున్నూ పూలతోనూ, పండ్లతోనూ వున్నవి. అక్కడ మదించిన కోకిలలు కుహూనాదాలు చేస్తూనూ, తుమ్మెదలు ఝుంకారము చేస్తూనూ, నెమళ్లు మత్తు ఎక్కి కేకలు వేస్తూనూ వుంటవి. ఏ ఏ జంతువులు, ఏ ఏ కాలాలలో ఉత్సాహాతిరేకముతో వుంటవో, ఆ అశోకవనములో ఆ యా జంతువులు అన్నీ ఆ యా కాలబేధము లేకుండా అన్ని కాలాలలోనూ ఉత్సాహాతిరేకముతో వుంటూ వున్నవి.

అక్కడ మహావనములో ఆ వరారోహను, ఆ అనిందితను సీతాదేవిని హనుమంతుడు వెదకడము మొదలు పెట్టి ఆ చెట్టుమీదినుంచి ఈ చెట్టుమీదికీ, ఈ చెట్టుమీదినుంచి ఆ చెట్టుమీదికీ దూకుతూ వుంటే ఆ చెట్లు అన్నీ కదలిపోయినవి. వాటిమీద హాయిగా నిద్రపోతూ వున్న పక్షులు అన్నీ నిద్ర మేల్కొన్నవి. భయపడి పోయినవి. రెక్కలు అల్లలాడించుకొంటూ ఆ పక్షుల గుంపులు ఆ చెట్లమీదినుంచి ఎగిరిపోతూ ఉంటే, వాటి రెక్కల తాకిడికి ఆ చెట్లనుంచి రకరకాల రంగు రంగుల పూలు నేలరాలినవి. అట్లా రాలిన పూలు అన్నీ గాలికి ఆ వనమధ్యములో ఉన్న హనుమంతుణ్ణి కమ్ముకొన్నవి. అట్లా అన్నిరకాల పూలు కమ్ముకొని హనుమంతుడు అప్పుడు ఒక పూలకొండవలె కనిపించినాడు. అతడు అట్లా అన్ని దిక్కులకూ పరుగులెత్తుతూ ఉంటే అతడే వసంతుడు అని సర్వభూతాలకూ తోచింది.

ఆ చెట్లమీదినుంచి అట్లా రాలిన రకరకాల రంగుల పూలతో, అక్కడ భూమి సింగారించుకొన్న సుందరాంగివలె శోభించింది. ఆ మహాబలవంతుడు హనుమంతుడు తన బలము అంతటితోనూ కదిలించినందువల్ల రంగుపూలూ,

ఆకులూ, మొగ్గలూ రాలిపోయి ఆ యా చెట్లు పందెము వేసి ఓడిపోయిన జూదగాండ్లు తమ పైబట్టలూ, ఆభరణాలూ కిందపెట్టి నిలుచున్నట్టుగా కనిపించినవి. హనుమంతుడు ఊగించిన ఊపుకు పెద్దగాలికివలె పూలు, ఆకులు, మొగ్గలు రాలిపోయి, పక్షుల గుంపులు అన్నీ ఎగిరిపోయి ఆ చెట్ల బోదెలు మాత్రము మిగిలినవి. అట్లా హనుమంతుడు తన తోకను ఒక్కొక్కచెట్టుకూ చుట్టి, తన కాళ్ళతో ఆ చెట్టును తన్ని పెట్టి, రెండు చేతులతోనూ చెట్టును ఊగిస్తూ ఉంటే విడివడి పోయిన తలవెంట్రుకలతోనూ, ఆలింగనాదులవల్ల నలిగి రాలిపోయిన చందనము మైపూతలతోనూ, అధరపానమువల్ల తెల్లపడిపోయిన పెదవులతోనూ, పూలమొగ్గలవంటి దంతాలతోనూ, గోళ్ళనొక్కులవల్లనూ పళ్ళ కొరుకుళ్ళవల్లనూ పడిన గాట్లతోనూ, సంభోగశ్రాంత అయిన స్త్రీవలె అప్పుడు ఆ అశోకవనము కనిపించింది. వర్షాకాలములో వింధ్యపర్వతముమీద మేఘసమూహాలను వాయుదేవుడు చెల్లాచెదురు చేసివేసేట్లు అప్పుడు ఆ అశోకవనములో పూల తీగలను అన్నిటినీ హనుమంతుడు చిందర వందర చేసివేసినాడు.

ఆ అశోకవనములో హనుమంతుడు అట్లా తిరుగుతూ మనోహరము అయిన మణులు పొదిగిన నేలలు, వెండి బంగారాలు తాపటము చేసిన నేలలూ ఉన్న ప్రదేశాన్ని చూచినాడు. అక్కడ వివిధాకారాలతో ఉన్న నడబావులు (దిగుడుబావులు) కనిపించినవి. ఆ నడబావుల నిండా శుభ్రజలాలు ఉన్నవి. వాటి సోపానాలకు మణులు పొదిగి ఉన్నవి. అక్కడ ఇసుక ముత్యాలవలెనూ పగడాలవలెనూ కనిపించింది. నీళ్ళ దగ్గిర స్ఫటికాల నెలకట్లు ఉన్నవి. ఆ నడబావుల గట్లమీద దేవకాంచన వృక్షాలు చిత్రవిచిత్రముగా శోభిస్తున్నవి. విరగపూసిన కమలాలు, కలువలు ఆ నడబావులలో దట్టముగా అల్లుకొని ఉన్నవి.

అక్కడ చక్రవాకాల మనోహర కూజితాలు, నీరుకోళ్ళ కొలకొల ధ్వనులు, హంస సారసనాదితాలూ ఎప్పుడూ వినపడుతూ ఉంటవి. ఆ నడబావుల సమీపములో అమృతోపమానము అయిన జలాలతో సంతోషము కలుగచేసే సెలయేళ్ళు పారుతున్నవి. సెలయేళ్ళకు ఇరువైపులా ఎంతో ఎత్తున పెరిగిన చెట్లు అలంకారముగా ఉన్నవి. అంతేకాదు, వందలకొద్దీ పూలతీగలు, సంతానకాలు అనే కల్పలతలు రాల్చిన పూలు ఆ ప్రదేశము అంతటా కమ్ముకొన్నవి. అక్కడ నానావిధ గుల్మాలు దట్టముగా పెరిగి ఉన్నవి. గన్నేరు చెట్లతో ఆ ప్రదేశాలు వేటికి అవి విడకొట్టినట్టుగా కనిపించినవి.

ఆ సమీపంలోనే హనుమంతుడు ఈ జగత్తుకు అంతటికి మనోహరము అయిన క్రీడాపర్వతాన్ని ఒకదానిని చూచినాడు. దాని శిఖరాలు ఎంతో ఎత్తున

ఉన్నవి. అది ఒక మహామేఘమువలె కనిపించినది. అన్నివైపులా దానికి చిత్రవిచిత్రము అయిన అవాంతర శిఖరాలు ఉన్నవి. ఆ పర్వతము మీద రాళ్ళతో కట్టిన ఇండ్లూ, ఆ ఇండ్ల చుట్టూ, వివిధ వృక్షాలతో ఉద్యానవనాలు కనిపించినవి.

ఆ కొండలమీదినుంచి ఒక సెలఏరు పరుగెత్తుకొని వస్తూ ఉంది. ఆ సెలయేరు కోపము వచ్చి ప్రియుడి తొడమీదినుంచి లేచి పరుగెత్తిపోతూ ఉన్న ప్రియురాలివలెనూ, ఆ సెలయేటికి ఇరువైపుల పుష్పఫల భారముతో నీళ్ళలోకి వాలిపోయిన చెట్ల కొమ్మలు క్రుద్ధురాలు అయి పారిపోతున్న ఆ యువతిని చేతులతో పోవద్దు అని చెప్పుతూ ఉన్న ఆత్మబంధువుల వలెనూ, కొంతవరకు పారి వెనకకు ఆ కొండవైపుకు మళ్ళిన సెలయేరు బంధువులు చెప్పినందువల్ల ప్రసన్నురాలు అయి మళ్ళీ ప్రియుణ్ణి చేరిపోతున్న ప్రియురాలివలెనూ కనిపించింది.

ఆ పర్వత సమీపాన, ఆ వానరశార్దూలము హనుమంతుడు నానావిధ పక్షిసమూహాలతో ఉన్న తామర కొలనులను చూచినాడు. అక్కడనే నిర్మించిన ఒక నడబావిన్నీ కనిపించింది. ఆ నడబావి నిండా చల్లటి నీళ్ళు ఉన్నవి. దాని సోపానాలకు మణులు పొదిగి ఉన్నవి. అందులో ఇసుక, ముత్యాలవలె కనిపించింది. అక్కడనే వివిధమృగ సమూహాలూ, చిత్రవిచిత్రములయిన ఉద్యానవనాలు, ఆ ఉద్యానవనాల్లో ప్రాసాదగృహాలూ కనిపించినవి. అన్నివైపులా ఆ ఉద్యానవనాలు ఆ అశోకవనానికి అలంకారముగా ఉన్నవి. వాటిని అన్నిటినీ విశ్వకర్మ నిర్మించినాడు. ఆ చెట్లు అన్నీ పూలతోనూ, పండ్లతోనూ శోభాయమానముగా ఉన్నవి. ఎండా వానలు తగలకుండా కూర్చుండడానికి పైన కప్పులూ, పెద్ద పెద్ద మెట్లతో బంగారు అరుగులూ ఉన్నవి.

అక్కడ హనుమంతుడు ఒక శింశుపావృక్షాన్ని (ఇరుగుడు చెట్టును) చూచినాడు. అనేక పూలతీగెలు అల్లుకొని, ఆ చెట్టు రకరకాల ఆకులతో కనిపించింది. అన్ని వైపులా బంగారు అరుగులతో ఆ చెట్టు శోభాయమానముగా ఉంది. అక్కడ నీళ్ళు నిలిచిన గుంటలూ, సెలయేటి ఊటలూ కనిపించినవి. సువర్ణ వృక్షాలు అగ్నిహోత్ర కాంతులతో తేజరిల్లుతూ ఉన్నవి. మేరుపర్వత కాంతులవల్ల సూర్యుడు కాంచన కాంతులతో తేజరిల్లుతూ ఉన్నట్టు అప్పుడు హనుమంతుడు భావించినాడు.

ఆ కాంచనవృక్షసమూహాలతోనూ, అప్పుడు అక్కడ వీస్తూ ఉన్న గాలికి ఆ వృక్షాలకు కట్టిన చిన్న చిన్న గంటలు చేస్తూ ఉన్న ధ్వనులతోనూ చిత్రవిచిత్రముగా ఉన్న ఆ అశోకవనాన్ని చూచి హనుమంతుడు విస్మయపడిపోయినాడు.

కొత్త కొత్తగా పెట్టిన చిగుళ్ళూ ఆకులూ కమ్ముకొని విరగపూసిన పూలతో మనోహరముగా ఉన్న ఆ ఇరుగుడు చెట్టు ఆ మహాబాహువు హనుమంతుడు ఎక్కి,

"ఈ చెట్టుమీద కూచుని సీతాదేవి ఎక్కడ ఉన్నదీ కనిపెట్టుతాను. ఆ దుఃఖార్త సీతాదేవి రామదర్శనాయత్త చిత్తముతో అటూ ఇటూ తిరుగుతూ యాదృచ్ఛికముగా ఇక్కడికి రావచ్చును.

"ఆ దురాత్ముడి ఈ అశోకవనము మహారమణీయముగా ఉంది. సంపంగి చెట్లూ, చందనపుచెట్లూ, పొగడచెట్లూ ఎంతో శోభాయమానముగా ఉన్నవి. ఈ తామరకొలను మనోహరముగా ఉంది. మధుర గానము చేసే పక్షుల గుంపులు ఇక్కడ అశేషముగా ఉన్నవి. రామమహిషి, రాముడి ప్రియురాలు, ఆ పతివ్రత, ఆ జానకి వనసంచారకుశల. అందువల్ల, ఆ రామామణి తప్పకుండా ఇక్కడికి వస్తుంది. రామ వియోగ దుఃఖముతో కృశించిపోతూ ఆ పూజ్యురాలు, ఆ మృగశాబాక్షి సీతాదేవి తన మనస్తాపాన్ని పోగొట్టుకోవడానికి అయినా ఈ తామరకొలను దగ్గిర ఉన్న ఉద్యానవనానికి రావచ్చును. ఆ వామలోచనకు వనవాసము అంటే ఎంతో ఇష్టము. ఆ వనచారిణి సీతాదేవి రామవియోగ శోకముతో తపించిపోతూ ఇక్కడికి రావచ్చును. ఆ జనకరాజసుత, రాముడి ప్రియభార్య ఆ సీతాసతి ఇదివరకు వన్యమృగాలకోసం మోజుపడుతూ వుండేది. ఆ వరవర్ణిని, ఆ యౌవనమధ్యస్థ సీతాదేవి సంధ్యను ఉపాసిస్తుంది. శుభజలాలతో వున్న ఈ నది దగ్గరకు సంధ్యావందనము చేయడానికి ఆమె తప్పకుండా వస్తుంది. ఆ శుభాంగికి, రామపత్నికి శుభకరము అయిన ఈ అశోకవనము తగినట్లుగా ఉంది. చంద్రబింబమువంటి ఆ సీతాదేవి జీవించి ఉన్నట్లయితే శుభ జలాలతో ప్రవహిస్తూవున్న ఈ నది దగ్గరకు తప్పకుండా వస్తుంది" అనుకొన్నాడు.

ఇట్లా ఆలోచించుకొంటూ ఆ మహాపరాక్రమవంతుడు హనుమంతుడు, విరగపూసి దట్టముగా ఆకులు కమ్ముకొని వున్న ఆ శింశుపావృక్షముమీద దాగుకొని కూర్చుని సీతాదేవిని నిరీక్షిస్తూ అన్నివైపులా చూడసాగినాడు.

15

అశోకవనములో సీతాదేవి కనిపించుట

సీతాదేవిని వెతకడానికి అట్లా ఇరుగుడుచెట్టుమీద కూర్చున్న హనుమంతుడు అన్నివైపులా చూస్తూ అక్కడ భూమినీ, ఆ అశోకవనాన్ని కలయచూచినాడు.

సంతాన కల్పలతలూ, పెద్ద పెద్ద చెట్లూ ఎంతో శోభాయమానముగా ఆ అశోకవనానికి అలంకారముగా వున్నవి. ఆ వనము అంతటా దివ్యగంధము గుబాళిస్తూ వుంది. ఎటుచూచినా వివిధమృగాలూ, నానావిధ పక్షులూ కనిపించినవి. ఆ వనములో హర్మ్యాలూ, ప్రాసాద గృహాలూ క్రిక్కిరిసి వున్నవి. కోకిలలు వ్యాకులపడిపోయి ధ్వనులుచేస్తూ వున్నవి. నడబావులనిండా బంగారమువంటి కమలాలు, కలువపూలు

శోభాయమానముగా వున్నవి. చిత్రాసనాలు పరచిన అనేక ఆసనాలు మనోహరముగా ఉన్నవి. అక్కడిచెట్లు అన్ని ఋతువుల పూలూ పూస్తున్నవి. ఋతుభేదము లేకుండా పండ్లు పండుతూ ఉన్నవి.

వందలకొద్దీ అశోకవృక్షాలు విరగపూసి సూర్యోదయ కాంతులతో తేజరిల్లుతూ ఉన్నవి. అవి అన్నీ మండిపోతున్నవా అన్నట్టు కనిపించినవి. పక్షుల గుంపులు పదే పదే వచ్చి వాలడమునుంచి ఆ అశోకవృక్షాల ఆకులు అన్నీ రాలిపోయినవేమో అన్నట్టు తోచినది. అశోకవృక్షాలు మొదలునుంచి చివరివరకూ పూలు విరగపూసి ఎటువంటి దుఃఖాన్ని అయినా పోగొట్టేటట్టుగా వున్నవి. ఆ వృక్షాలు పూల బరువుకు వంగి భూమిని ముద్దుపెట్టుకొంటూ ఉన్నవి ఏమోను అన్నట్టుగా కనుపించినవి. పెద్ద పెద్ద మొదళ్ళతో కొండగోగుచెట్లూ, పొన్నచెట్లూ, ఏడాకుల అరటిచెట్లూ, సంపంగిచెట్లూ, విరిగిచెట్లూ ఇంకా అనేకరకాల చెట్లు విరగపూసినవి. అశోకవృక్షాలు కొన్ని బంగారమువలెనూ, కొన్ని అగ్నిశిఖలవలెనూ, కొన్ని నల్లని కాటుకవలెనూ చిత్ర విచిత్రముగా కనిపించినవి.

ఆ అశోకవనము నానావిధ అవాంతర ఉద్యానవనాలతోనూ, దేవేంద్రుడి నందనోద్యానముకన్నా విచిత్రముగానూ, కుబేరుడి చైత్రరథవనముకన్నా మిన్నగానూ ఉంది. ఆ వనాన్ని కన్నులారా చూడవలసిందే తప్ప, అది అట్లా ఉంటుంది ఇట్లా ఉంటుంది అని ఊహించడము అశక్యము. అది దివ్యశోభతో ఎంతో రమణీయముగా ఉంది. నక్షత్రాలను పోలిన పూలతో అది అయిదవ సముద్రమువలెనూ, రత్నాలు పోలిన పూలతో అది ఆరవ సముద్రమువలెనూ, నానావిధ ధ్వనులు చేసే మృగాల తోనూ, పక్షి గణాలతోనూ, మనోహరమైన వివిధ సుగంధవాసనలతోనూ, అది రెండవ గంధమాదన పర్వతము వలెనూ ఉంది.

ఆ అశోకవనములో హనుమంతుడు కూర్చున్న శింశుపావృక్షానికి దగ్గరలో ఒక చైత్యప్రాసాద గృహము ఉంది. దానిని హనుమంతుడు చూచినాడు. అది కైలాస పర్వతమువలె తెల్లగా ఎంతో ఎత్తున ఉంది. దాని మధ్యను వెయ్యిస్తంభాలు ఉన్నవి. ఆ స్తంభాలమీద ఆ చైత్యప్రాసాద గృహము నిలిచివుంది. ఆ భవనము మెట్లకు పగడాలు పొదిగి ఉన్నవి. దానిలో తప్తకాంచన వేదికలు ఉన్నవి. ఆ భవనము కన్నులు మిరుమిట్లు కొలిపే కాంతులతో ఆకాశాన్ని ఒరుసుకొని పోతున్నట్టుగా కనిపించింది.

ఆ చైత్యప్రాసాద ప్రాంతములో అప్పుడు హనుమంతుడు ఒక స్త్రీని చూచినాడు. ఆమె చుట్టూ రాక్షసాంగనలు ఉన్నారు. ఆమె మాసిపోయిన చీర కట్టుకొనివుంది. ఆమె ఉపవాసాలతో కృశించిపోయి దైన్యముతో మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ ఉంది. ఆమె ఆకారాన్ని పట్టి గుర్తుపట్ట నలవికాకపోయినప్పటికీ

శుక్లపక్ష పాడ్యమి నాటి నిర్మల చంద్రరేఖవలె మనోహర కాంతితో కనిపించింది. మాసి నలిగిపోయిన పసుపుపచ్చ రంగుచీర ఒకే ఒకటి ఉత్తమము అయింది చుట్టుకొని వున్నందువల్ల ఆమె దట్టముగా పొగలు కమ్ముకొన్న అగ్నిశిఖలవలె తోచింది. ఆమె దుఃఖమునుంచి అలంకారాదులు చేసుకోలేదు. అందువల్ల, ఆమె బురదలో పద్మము లేని పద్మినివలె కనిపించింది. దుఃఖముతో తపించిపోతూ, బాధపడుతూ, క్షీణించిపోయి జాలి గొలుపుతూ ఆమె అంగారకగ్రహ బాధను అనుభవిస్తున్న రోహిణివలె కనిపించింది. ప్రియజనులు ఎవరూ కనపడకుండా ఎటుచూచినా రాక్షసస్త్రీలు కనపడుతూ వున్నందువల్ల మందలోనుంచి తప్పిపోయి కుక్కల మధ్యను చిక్కుపడిపోయిన లేడిపిల్లవలె ఆమె చూస్తూవుంది. నల్లని పామువలె జఘనాలవరకూ వేళ్ళాడుతూ వున్న జడనుంచి ఆమె శరత్కాలములో నల్లటి వనపంక్తులలో వున్న భూమి మాదిరిగా తోచింది. సుఖము అనుభవించవలసిన ఆమె, ఎన్నడూ ఏ దుఃఖమూ ఎరగని ఆమె, అట్లా దుఃఖముతో తపించిపోతూవున్న ఆ విశాలాక్షిని హనుమంతుడు చూచినాడు. ఆలోచించినాడు. ఆ యా కారణాలను బట్టి ఆమే సీతాదేవి అనుకొన్నాడు. ఆ కామరూపుడు రాక్షసుడు ఎత్తుకొనిపోతూ వుండగా, తాము వానరులు చూచిన స్త్రీ రూపము అదేను అని హనుమంతుడికి తోచింది.

నిండుచంద్రుని వంటి ముఖము, సొగసు అయిన కనుబొమలు, గుండ్రముగా అందము అయిన స్తనాలు, ఆమె తన దేహకాంతులతో అన్ని దిక్కులా చీకట్లను పోగొట్టుతున్నది. నల్లని తలవెంట్రుకలు, దొండపండువంటి పెదవులు, ఏ లోపమూ లేని అవయవాలూ, పసుపువన్నె తామరరేకులవంటి నేత్రాలు జగత్తుకు అంతటికీ ఏకైక సుందరి అయిన రతీదేవివలెనూ, జగత్తుకు అంతటికీ సంతోషాన్ని ఇచ్చే పండువెన్నెలవలెనూ ఆ పద్మపత్రాక్షి కనిపించింది. నియమాలను పాటిస్తూ ఉన్న తాపసాంగనవలె ఆమె నేలమీద కూర్చుని వుంది.

ఆమె సందేహములో పడ్డ స్మృతివాక్యమువలెనూ, క్షీణించిపోయిన సంపదవలెనూ, విశ్వాసము పోయిన శ్రద్ధవలెనూ, భగ్నము అయిపోయిన ఆశవలెనూ, విఘ్నాలు వచ్చిన కార్యసిద్ధివలెనూ, కలతపడిపోయిన బుద్ధివలెనూ, లేనిపోని అపవాదు వచ్చి చెడిపోయిన కీర్తివలెనూ తోచింది.

రాముడు దగ్గిరలో లేనందువల్ల మనోవ్యధపడుతూనూ, రావణాసురుడు అపహరించుకొని వచ్చినందువల్ల బాధపడుతూనూ, అసహాయురాలు అయి బెదిరిపోయిన జింకపిల్లవలె అన్నివైపులా చూస్తూనూ, వంకరలు తిరిగిన కనురెప్పల నిండా కమ్ముకొన్న కన్నీళ్ళు కారుతూ ముఖాన సంతోష చిహ్నాలు ఏవీ లేకుండానూ, ఎప్పుడూ అలంకారము చేసుకోవలసిన ఆమె, దీనురాలు అయి ఏ

అలంకారమూ చేసుకోకుండా వర్షాకాలములో మేఘాలు కమ్ముకొన్న చంద్రబింబమువలె కనిపించింది.

అభ్యాసము లేనందువల్ల మరుపు తగిలిన విద్యవలె కనిపించిన ఆ సీతాదేవిని పదే పదే హనుమంతుడు చూచినాడు. సందేహములో పడిపోయినాడు. భాషాసంస్కారము లేనందువల్ల ఒక అర్థానికి బదులు మరి ఒక అర్థము స్ఫురింపచేసే వాక్కువలె అలంకారాదులు చేసుకోనందువల్ల మారురూపు పడిపోయిన ఆ సీతాదేవిని పరిశీలించి చూచినాడు. రాముడు చెప్పిన ఆనవాళ్ళు అన్నీ ఆలోచించి చూచినాడు. బహుకష్టము మీద ఆమె సీతాదేవి అనుకొన్నాడు.

ఆ అనిందితను, ఆ జనకరాజసుతను, ఆ విశాలాక్షిని చూచి చూచి యుక్తియుక్తము అయిన హేతువులనుంచి "ఆమే సీతాదేవి" అని హనుమంతుడు నిశ్చయించుకోడానికి మొదలు పెట్టినాడు. ఆమె ఏ ఏ అవయవాలకు ఏ ఏ ఆభరణాలు పెట్టుకొంటుంది అని రాముడు చెప్పినాడో, ఆ యా ఆభరణాలను అన్నిటినీ ఆ చెట్టు కొమ్మలమీద చూచినాడు. భర్త దగ్గిరలో లేనప్పుడు ఆభరణాలు పెట్టుకోకూడదు అని వాటిని ఆమె చెట్టు కొమ్మలకు కట్టింది. ఆ చెట్టు కొమ్మలమీద ధగధగలాడుతూ ఉన్న ఆభరణాలను అన్నిటినీ హనుమంతుడు చూచినాడు. ఆమె చెవులకు పెట్టుకునే చక్కని కర్ణవేష్టాలనూ, స్వదంష్ట్రలనూ, రత్నాలతోనూ పగడాలతోనూ నానా వర్ణాలతోనూ తళతళలాడుతూ ఉన్న హస్తాభరణాలను, ఆ యా ఆభరణాలను బహుకాలము ఆమె పెట్టుకొన్నందువల్ల ఆమె దేహముమీద నల్లగా పడిపోయిన ఆభరణాల అరవళ్ళను చూచినాడు. రాముడు ఆనవాళ్ళుగా చెప్పిన ఆభరణాలు అవేను అని హనుమంతుడు అనుకొన్నాడు. ఆమె ఋష్యమూక పర్వతముమీద పడవేసిన ఆభరణాలు పోను మిగతావి అవేను అని నిస్సందేహముగా నిర్ణయించినాడు. అప్పుడే ఆమె ఋష్యమూకము మీద పసుపురంగుతో ఉన్న బంగారు రేకువంటి ఉత్తరీయము జారవిడిచింది. ఇప్పుడు ఈమె అదే రంగుతో, అదే కాంతితో ఉన్న చీర కట్టుకొని ఉంది. అయితే, బహుకాలమునుంచీ విడువకుండా కట్టుకొని ఉన్నందువల్ల చీర బాగా నలిగిపోయి, మాసిపోయి ఉంది.

ఈ కనకవర్ణాంగే ఆ రాముడి ప్రియమహిషి. ఎట్టఎదుట కంటికి కనపడకుండా ఉన్నప్పటికిన్నీ ఎప్పుడూ ఆ రాముడి మనస్సులో మెలగుతూవున్న పతివ్రత సీతాదేవి ఈమేను. ఆపత్సమయములో ఆడుదానిని కాపాడవలెను అనే కారుణ్యమువల్లను, తనను ఆశ్రయించిన ఆడుదానిని కాపాడలేకపోయానే అనే అనుతాపమువల్లను, తన భార్యను తనకు తెలియకుండా ఎవడో ఎత్తుకొనిపోయినాడు అనే దుఃఖమువల్లను, తన ప్రియురాలు దగ్గిరలేకుండా పోయిందే అనే మదనతాపమువల్లను ఈ విధముగా

కారుణ్యమూ, అనుతాపమూ, దుఃఖమూ మదనతాపమూ అనే నాలుగింటితో రాముడు ఎవరికోసము బాధపడుతున్నాడో, ఆమే ఈమె. ఈ దేవి అంగప్రత్యంగ సౌష్ఠవమూ, ఆ రాముడి అంగప్రత్యంగ సౌష్ఠవమూ ఒక్క మాదిరిగా వున్నవి. ఆ రాముడు ఈమె సౌందర్యానికి తగినట్టుగా ఉన్నాడు. ఈ అసితేక్షణ ఆ రాముడికి తగినట్టుగా వుంది. ఈ దేవి మనస్సులో ఆ రాముడు మెలగుతున్నాడు. ఆ రాముడి మనస్సులో ఈ సీతాదేవి మెలగుతూ వుంది. ఇట్లా ఒకరి మనస్సులో ఒకరు మెలగుతూ వుండటము వల్లనే ఇక్కడ ఈ సీతాదేవి, అక్కడ ఆ ధర్మాత్ముడు రాముడు జీవించి వున్నారు.

ఈ సీతాదేవిని ఎడబాసిన ఆ రాముడు దుఃఖముతో దేహాన్ని చాలించకుండా వుండడము చాలా ఆశ్చర్యమే! మరి ఒకరు ఇట్లా జీవించి వుండలేరు. ఈ మత్తకాశినిని సీతాదేవిని విడిచిపెట్టి ఇంతవరకూ రాముడు జీవించి వుండటము దుష్కరము అయిన విషయమేను" అనుకొంటూ హనుమంతుడు సీతాదేవిని చూస్తూ సంతోషపడి ఆ రామ ప్రభువును మనస్సులో ప్రశంసించినాడు.

16

ప్రశంసించవలసిన సీతాదేవినీ, సుగుణాభిరాముడు అయిన రాముణ్ణీ మనసా ప్రశంసిస్తూ హనుమంతుడు దుఃఖపడిపోయినాడు. ఆ తేజస్వి కొంచెము ఆలోచించినాడు. అతని కన్నులనిండా కన్నీళ్ళు కమ్ముకొన్నవి. సీతాదేవిని గురించి దుఃఖపడిపోయినాడు. "గురుశిక్షితుడు అయిన లక్ష్మణుడు ఈమెను పూజిస్తూ ఉండేవాడు. ఈమె రాముడి ప్రియురాలు. ఈ సీతాదేవి ఇప్పుడు ఇట్లా దుఃఖపడుతూ, బాధపడుతూ ఉంది. ఇంతకూ కాలాన్ని ఎవరూ అతిక్రమించలేరు. రాముడి పరాక్రమమూ, ఆ బుద్ధిమంతుడు లక్ష్మణుడి పరాక్రమమూ ఈమె ఎరుగును. అందువల్లనే, వర్షాకాలములో గంగానదివలె ఈమె ఎక్కువగా కలత పడిపోకుండా ఉంది.

"సీతారాములు సత్స్వభావములోనూ, సదాచారములోనూ, వయస్సులోనూ సరిసమానులుగా వున్నారు. ఉభయులూ సద్వంశాలలో పుట్టినారు. ఆ రాముడికి ఈ సీతాదేవి తగినట్టుగా ఉంది. ఈ అసితేక్షణకు ఆ రాముడు తగినట్టుగా ఉన్నాడు" అనుకొంటూ తప్తకాంచనమువలెనూ, సర్వలోకప్రియ అయిన మహాలక్ష్మీదేవి వలెనూ తేజరిల్లుతూ ఉన్న సీతాదేవిని చూస్తూ రాముణ్ణి తలచుకొని, "ఈ విశాలాక్షి కోసము ఆ మహాబలవంతుడు రాముడు వాలిని చంపివేసినాడు. ఈమె కోసమే రావణాసురుడు అంతటి కబంధుణ్ణి చంపివేసినాడు. దేవేంద్రుడు శంబరాసురుణ్ణివలె, ఈ సీతాదేవినుంచే రాముడు దండకారణ్యములో భయంకరపరాక్రముడు అయిన విరాధుణ్ణి సంహారము చేసివేసినాడు. ఈమె నుంచే జనస్థానములో భయంకరకర్ములు

అయిన పద్నాలుగువేలమంది రాక్షసులను రాముడు అగ్నిజ్వాలలవంటి బాణాలతో చంపివేసినాడు. ఆ విదితాత్ముడు రాముడు ఈమెనుంచే మహాపరాక్రమవంతులు అయిన ఖర దూషణత్రిశిరులను యుద్ధములో సంహారము చేసివేసినాడు. ఈమెనుంచే ఎవడికీ జయించ నలవికాని వాలి వానర రాజ్యాన్ని, లోకము అంతా గౌరవిస్తూ ఉన్న వానరుల ఐశ్వర్యాన్నీ సుగ్రీవుడు సంపాదించ కలిగినాడు. ఈమెనుంచే నేను సమస్త నదులూ, నదములూ సంగమించే రత్నాకరాన్ని దాటివచ్చి ఈ లంకాపట్టణాన్ని చూస్తూ ఉన్నాను.

"ఈ సీతాదేవి కోసము రాముడు సముద్ర పర్యంతము అయిన భూమిని, (భూమినేకాదు) ఈ జగత్తును అంతా తల్లకిందులు చేసివేసినా సమంజసమేను అనిపిస్తూ ఉంది.

"త్రిలోక రాజ్యము హెచ్చా, జనకరాజసుత సీతాదేవి హెచ్చా అని అడిగేట్లయితే, త్రిలోక రాజ్యము సీతాదేవిలో వీసముపాలు చేయదు. నాగలితో దున్నుతూ ఉన్న యజ్ఞక్షేత్రములో ఈ ధర్మశీల, ఈ జనక రాజసుత, ఈ భర్తృదృఢవ్రత భూమిని భేదించుకొని పద్మరాగము, శుభకరము అయిన కేదారపాంసువులు కమ్ముకొని ఉద్భవించింది. యుద్ధములో వెనుకకు తిరగని పరమ పరాక్రమవంతుడూ, ధర్మశీలుడూ అయిన దశరథమహారాజుకు ఈ యశస్విని పెద్ద కోడలు అయింది. ధర్మజ్ఞుడూ, కృతజ్ఞుడూ, విదితాత్ముడూ అయిన రాముడి ప్రియభార్య అయిన ఈ సీతాదేవి ఇప్పుడు రాక్షసస్త్రీల వశము అయిపోయింది.

ఈమె భర్తమీద తనకు ఉన్న ప్రేమాతిశయమునుంచి సమస్త భోగాలు త్యజించివేసింది. దుఃఖాలను లెక్కచేయకుండా ఆ భర్త వెంట నిర్జనారణ్యానికి వచ్చింది. కందమూల ఫలాలతో సంతృప్తి చెందింది. భర్తకు సేవచేయడమే తన పనిగా పెట్టుకొన్నది. స్వంత ఇంట్లో ఉన్నట్టుగా పరమసంతోషముతో భర్తతో మహారణ్యములో కాపురము చేసింది. ఎప్పుడూ చిరునవ్వు చిందులాడుతూ మాట్లాడే ఈ బంగారు బొమ్మ, ఈ సీతాదేవి ఎన్నడూ ఎరగని ఆపదలపాలు అయి ఈ యాతనను అంతా ఓర్చుకొంటూ ఉంది.

"దాహము అయినవాడు చలివేంద్రమును చూడవలెను. అదే విధముగా రాముడు ఈ శీలసంపన్నను సీతాదేవిని చూడవలెను. రాజ్యము పోగొట్టుకొన్న వాడు మళ్ళా రాజ్యాన్ని సంపాదించవలెను. అదేవిధముగా రాముడు ఈ సీతాదేవినే మళ్ళీ సంపాదించుకొని సంతోషపడవలెను. కోరుకోవలసిన భోగపదార్థాలు అన్నీ వదులుకొని, బంధుజనులను అందరినీ వదులుకొని రామగమనకాంక్షతో ఈమె దేహము

చాలించకుండా ఉంది. ఇప్పుడు ఈమె ఈ రాక్షసస్త్రీలవంక చూడటము లేదు. ఇక్కడ ఈ పూలచెట్లవంక కానీ, ఈ పండ్ల చెట్లవంక కానీ చూడటము లేదు. ఏకాగ్రచిత్తముతో ఈమె రాముణ్ణి ధ్యానము చేస్తూ ఉంది.

"స్త్రీలకు ఆభరణాలు అన్నిటికన్నా ఆభరణము అయినవాడు భర్త. ఆ భర్త దగ్గరలో లేనందువల్ల ఈ సీతాదేవి శోభించటము లేదు. ఆ ప్రభువు రాముడు ఈమె లేదు అనే దుఃఖముతో చనిపోకుండా జీవించి ఉన్నాడు. ఆ రాముడు తప్ప మరి ఒకడు అట్లా బ్రతికి ఉండలేడు. ఈ అసితకేశాంత, ఈ శతపత్రేక్షణ ఇట్లా దుఃఖము అనుభవించటము చూస్తూఉంటే, ఈమె సుఖదుఃఖాలతో ఏమాత్రమూ సంబంధము లేని మధ్యస్థుణ్ణి అయిన నా గుండెలు తరుగుకొనిపోతూ ఉన్నవి.

"ఈమెను రామలక్ష్మణులు రక్షించినారు. ఈమె భూదేవివంటి క్షమావంతురాలు. ఇటువంటి ఈ పద్మపత్రాక్షిని సీతాదేవిని ఇప్పుడు చెట్టుకింద వికృతనేత్రలు రాక్షసస్త్రీలు కావలికాస్తున్నారు. మంచుకొట్టుకొని కాంతులుమాసిపోయిన పద్మలతవలెనూ, ప్రియుణ్ణి ఎడబాసిన చక్రవాక పిట్టవలెనూ, దుఃఖపరంపరలతో బాధపడుతూ ఈమె, చూచే వారికి జాలికొలిపే దురవస్థలో పడిపోయింది. ఈ అశోకవనములో పూలబరువుకు వంగిపోయిన చెట్లు, మంచు వదలిపోయిన తరువాత చల్లని వెయ్యి కిరణాలతో ఉదయించే చంద్రుడు ఈమెను మరింత దుఃఖపెడు తున్నారు" అనుకొన్నాడు హనుమంతుడు.

ఇట్లా ఆ బలవంతుడు, ఆ వేగవంతుడు హనుమంతుడు అనుకొంటూ "ఈమె సీతాదేవి" అని నిశ్చయించి ఆ శింశుపావృక్షము మీద కూర్చున్నాడు.

17

నల్లటినీళ్ళ మధ్యలో హంసవలె నిర్మలాకాశ మధ్యములోకి తెల్లకలువపూల గుత్తివంటి స్వచ్ఛ చంద్రుడు పోయినాడు. నిర్మల ప్రభలతో తేజరిల్లే చంద్రుడు సాయముచేయడానికి వచ్చినవాడివలె తన తెల్లటి కిరణాలతో హనుమంతుణ్ణి సంతోషపెట్టినాడు. బరువు ఎక్కువయి నీటిలో మునిగిపోతున్న నావవలె శోకభారముతో నిండు చంద్ర బింబమువంటి సీతాదేవి కుంగిపోతూ ఉంది.

ఆ వైదేహి సమీపములో భయంకరలు అయిన గాక్షసాంగన లున్నారు. వారిలో ఒకతె ఒంటి కంటిది. ఒకతె ఒంటి చెవిది. చెవులు మూసుకొని పోయింది ఒకతె. చేవులే లేనిది ఒకతె. ఒకతెకు చెవులు మేకులవలె వున్నవి. ఒకతె ముక్కులతో నెత్తివైపు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వదులుతూ ఉంది. ఒకతె తల ఎంతో పెద్దది. ఒకతెకు మెడ సన్నగా, పొడుగుగా ఉంది. ఒకతెకు తలవెంట్రుకలు కాసినే ఉన్నవి.

ఒకతెకు తలవెంట్రుకలే లేవు. కంబళివంటి తలవెంట్రుకలు కలది ఒకతె. ఒకతెకు చెవులూ, నొసలూ వేళ్ళాడుతూ ఉన్నవి. ఒకతెకు చన్నులూ, కడుపూ వేళ్ళాడుతూ ఉన్నవి. ఒకతెకు పెదవి వేళ్ళాడుతూ ఉంది. ఒకతెకు గడ్డములో పెదవి ఉంది. ఒకతెకు ముఖము వేళ్ళాడుతూ ఉంది. ఒకతెకు మోకాళ్ళు వేళ్ళాడుతూ ఉన్నవి. ఒకతె పొట్టిది. ఒకతె పొడుగాటిది. ఒకతె గూనిది. ఒకతె వంకరటింకరిది. ఒకతె మరుగుజ్జుది. ఒకతె మిట్టపళ్ళది. ఒకతె నోరు వంకరది. ఒకతె పిల్లికళ్ళది. ఒకతె వికృత ముఖముది.

వాండ్లు అందరూ వికారాకారులు. వాండ్లలో కొందరు కారు నలుపుగానూ, కొందరు గోరోచనము వన్నెతోనూ ఉన్నారు. వాండ్ల అందరి ముఖాలలోనూ కోపము తాండవమాడుతూ వుంది. వాండ్లు అందరూ కలహప్రియులు. ఇనుముతో చేసిన నల్లటి పెద్ద శూలాలూ, కూటాలూ, ముద్గరాలూ అనే ఆయుధాలు ధరించి వున్నారు. వాండ్లలో కొంతమంది తలలు దేహాలలో ఇరుక్కొనిపోయినవి. కొంతమంది ఒంటి చేతివాండ్లు, కొంతమంది ఒంటిపాదమువాండ్లు, కొంతమంది గాడిద చెవులవాండ్లు, కొంతమంది గుఱ్ఱపు చెవులవాండ్లు, కొంతమంది ఆవు చెవులవాండ్లు, కొంతమంది ఏనుగు చెవులవాండ్లు, కొంతమంది కోతి చెవులవాండ్లు. కొంతమందికి పెద్ద పెద్ద ముక్కులు ఉన్నవి. కొంతమందికి ముక్కులే లేవు. కొంతమందికి ముక్కులు అడ్డముగా ఉన్నవి. కొంతమందికి ముక్కులు వికృతముగా వున్నవి. కొంతమందికి ఏనుగు తొండాలు అంత ముక్కులు వున్నవి.

ఏనుగు పాదాలవాండ్లు కొందరూ, ఆవుపాదాలవాండ్లు కొందరూ, మహా పాదాలవాండ్లు కొందరూ, పాదాలకు జుట్టువున్న వాండ్లు కొందరూ, పెద్దతలా అంతకన్నా పెద్ద మెడా వున్న వాండ్లూ, పెద్దపెద్ద స్తనాలు వున్న వాండ్లూ, పెద్ద పెద్ద పొట్టలు వున్న వాండ్లూ, పెద్దనోరు అంతకన్నా పెద్దపెద్ద కన్నులూ వున్న వాండ్లూ, పొడుగాటి నాలుకలు వున్న వాండ్లూ, పొడుగాటి గోళ్ళు వున్నవాండ్లూ, మేకముఖాల వాండ్లూ, ఏనుగుముఖాలవాండ్లూ, ఆవుముఖాలవాండ్లూ, ఆడుపందిముఖాల వాండ్లూ, ఒంటెముఖాలవాండ్లూ పరమభయంకరముగా వున్నారు. ఆ రాక్షసాంగనలు అందరూ ఎప్పుడూ మద్యము తాగుతూనూ, మాంసము తింటూనూ ఒంటినిండా మాంసమూ, నెత్తురూ పులుముకొని చూచేవాండ్లకు ఒండ్లు గగురుపొడిచేటట్టుగా ఉన్నారు. వాండ్లు అందరూ సీతాదేవి చుట్టూ కూర్చుని ఉన్నారు. వాండ్లని అందరినీ హనుమంతుడు చూచినాడు.

అక్కడ చెట్టుకింద కూర్చుని ఉన్న అనిందితను, ఆ జనకాత్మజను సీతాదేవిని ఆ కాంతిమంతుడు హనుమంతుడు చూచినాడు. ఆమె దుఃఖముతో తపించిపోతూ వుంది. కాంతులు మాసిపోయినవి. తలనిండా దుమ్ముకొట్టుకొని వుంది. పుణ్యము

నశించిపోయి ఈ భూమి మీద పడ్డ నక్షత్రము మాదిరిగా వుంది. ఆ సదాచార వంతురాలు తన భర్త దగ్గిరలో లేనందువల్ల ఆభరణాలను అన్నిటినీ పెట్టుకోవటము మానివేసింది. భర్తృవాత్సల్యమే తనకు అమూల్యాభరణముగా భావించింది. అటువంటి సీతాదేవి రాక్షసాధిపతి రావణాసురుడికి చిక్కింది. ఏనుగులమందను వదిలిపెట్టి సింహముపాలు అయిన పెంటి ఏనుగు మాదిరిగా ఉంది. శరత్కాల మేఘాలు కమ్ముకొన్న ప్రతిపత్ చంద్రరేఖవలె స్పష్టముగానూ, అస్పష్టముగానూ ఉంది. దేహసంస్కారములేక మారు రూపుపడిపోయి, వాడుకలేక పాటు తప్పిన వీణమాదిరిగా ఉంది. అట్లా ఉన్న సీతాదేవిని హనుమంతుడు చూచినాడు.

పెనిమిటి అయిన రాముడి వెంట ఎప్పుడూ ఉండవలసిన ఆ సీతాదేవి రాక్షసాంగనల వశము అయింది. ఆమె శోకసాగరములో మునిగి తేలుతూ ఆభరణాలు పెట్టుకొన్నందువల్ల ఆ అశోకవన మధ్యములో ఆమె పూవులులేని పూలతీగమాదిరిగా ఉంది. ఆమె కట్టుకొన్న చీర నలిగి పోయింది. మాసిపోయింది. ఆమె దీనురాలుగా ఉంది. అయితే, భర్తృపరాక్రమాన్ని తలచుకొని ధైర్యముతో తన శీలానికి తానే కాపుదలగా ఉంది. ఆ అసితలోచన సీతాదేవి బెదరిపోయిన జింకపిల్లవలె అన్నిదిక్కులూ చూస్తూ ఉంది. చెట్ల చిగురుటాకులను దహించివేసేట్లుగా ఆమె వేడి వేడి నిట్టూర్పులు విడుస్తూ ఉంది. శోకసమూహము ఆకారము ధరించినట్టుగా ఉంది. ఆమె శోకము సముద్రతరంగాలవలె లేస్తున్నట్టు ఉంది. అయితే, భూదేవి మాదిరిగా ఓర్పుతోనూ, ఆభరణాలు ఏవీ పెట్టుకోకపోయినప్పటికిన్నీ తీర్చిదిద్దిన అవయవాలతోనూ, సహజ సౌందర్యము తోనూ ఉన్న సీతాదేవిని చూచి హనుమంతుడు సంతోషపడ్డాడు. ఆ మదిరేక్షణను చూస్తూ ఆనందబాష్పాలు వదిలినాడు. రాముణ్ణి తలచుకొన్నాడు. సీతాదేవి కనిపించినందుకు ఉప్పొంగిపోయినాడు. మనసా రామలక్ష్మణులకు నమస్కారము చేసినాడు. రాక్షసాంగనలకు తాను కనపడకుండా వుండడానికి ఆ ఇరుగుడు చెట్టు ఆకులు కప్పుకొని ఆ చెట్టు కొమ్మమీదనే కూర్చున్నాడు.

18

ఆ అశోకవనములో హనుమంతుడు సీతాదేవిని చూస్తూ ఉన్నాడు. తెల్లవారటానికి అప్పటికి కొంచెము పొద్దే వుంది. వేదవేదాంగవిదులు, మహా క్రతుయాజకులు అయిన బ్రహ్మరాక్షసులుచేస్తూ వున్న వేదాధ్యయన ధ్వనులు హనుమంతుడికి వినిపించినవి.

శ్రోత మనోహరము అయిన మంగళవాద్యధ్వనులు రాజభవనములో చెలరేగినవి. ఆ మహాబాహువు, ఆ మహాబలవంతుడు రావణాసురుడు నిద్రా

పారవశ్యములో చెదిరిపోయిన పూలదండలతోనూ, తారుమారు అయిన కట్టుబట్టల తోనూ నిద్రమేల్కొన్నాడు. నిద్ర లేస్తూనే సీతాదేవిని గురించి తలచుకొన్నాడు. వాడు మంచి మదముతో వున్నాడు. వాడికి అప్పుడు ఆమెమీద మదనతాపము మరింత అయింది. కామోద్రేకాన్ని అణచుకోలేకపోయినాడు. వెంటనే సమస్తాభరణాలతోనూ అలంకరించుకొన్నాడు. లోకోత్తరము అయిన శోభతో రాజభవనములో నుంచి బయలుదేరినాడు.

సమస్త పుష్ప ఫలభరితము అయిన వృక్షాలతోనూ, కోనేళ్ళతోనూ శోభాయ మానము అయిన పుష్పలతలతోనూ, పూలూ పిందెలూ తిని మత్తెక్కి కలకల ధ్వనులు చేసే రంగురంగుల పిట్టలతోనూ పరమాద్భుతముగానూ, నేత్రపర్వముగానూ కనుపించే తోడేళ్ళూ మొదలు అయిన బొమ్మలతోనూ, నానావిధ మృగ సమూహాల తోనూ, నేల అంతటా రాలిన పండ్లతోనూ, రంగురంగుల పూలతోనూ, మణికాంచన ద్వారాలతోనూ వున్న అశోకవనములోకి వచ్చినాడు.

దేవేంద్రుణ్ణి దేవకన్నెలూ, గంధర్వాంగనలూ వెంబడించేట్టు ఆ పౌలస్త్యుణ్ణి అప్పుడు ఒక నూరుమంది స్త్రీలు వెంబడించినారు. వారిలో కొందరు బంగారు కాగడాలు పట్టుకొన్నారు. కొందరు చామరాలు, కొందరు తాటి విసనకర్రలూ తీసుకొన్నారు. కొందరు బంగారు, వెండి పాత్రలనిండా నీళ్ళు తీసుకొని ముందు నడిచినారు. కత్తులు తీసుకొని కొందరు స్త్రీలు, ఆసనాలు తీసుకొని కొందరు స్త్రీలు ఆ ప్రతాపుడి వెంట నడిచినారు. బరాబరీగా మద్యము వున్న మణిమయ పాత్రను కుడిచేతితో పట్టుకొని ఒక చుక్కవంటి స్త్రీ నడిచింది. తెల్లని కాంతులతోనూ, బంగారు దండము ధగధగలతోనూ రాజహంసవలెనూ, పూర్ణచంద్రుడివలెనూ తేజరిల్లుతూ వున్న ఛత్రము పట్టుకొని ఒకతె నడిచింది. ఆ వరాంగనలు అందరూ నిద్రవల్లనూ, తాగిన కైపువల్లనూ కన్నులు తిరుగుతూ వున్నందువల్ల కన్నులు మూస్తూనూ తెరుస్తూను నీలమేఘమువెంట పోయే మెరుపు తీగెలవలె తళుకుమంటూ రావణాసురుడి వెంట నడిచినారు.

ఆ రావణాసురుడి ప్రియభార్యలు అందరూ అంతవరకూ సొమ్మసిల్లి నిద్రపోయినారు. అందువలన, వారి కంఠహారాలూ, బాహుపురులూ చెదిరిపోయినవి. మైపూతలు మాసిపోయినవి. కొప్పులు వీడిపోయినవి. తలవెంట్రుకల కొనలు జారిపోయినవి. ముఖాలు అంతటా చెమటలు పోసినవి. ఆ చెమటలకు వారు పెట్టుకొన్న పూలదండలు తడిసి వాడిపోయినవి. వారు తలలలో పెట్టుకొన్న పూలదండలు చెదిరిపోయినవి. భర్తృగౌరవమువల్లను, మరులువల్లను తూలిపోతూ అదే ఒక సొగసుగా కనిపిస్తూ ఆ రాక్షసాధిపతి వెంట నడచినారు. ఆ మహాబలవంతుడి

మనస్సు అంతా సీతాదేవి మీదనే ఉంది. అందువల్ల, అతడు మందమందముగా నడిచినాడు. ఆ వరాంగనల మొలనూళ్ళ ఘలఘల ధ్వనులూ, వారి కాళ్ళ అందెల ఘళఘళ ధ్వనులూ హనుమంతుడికి వినిపించినవి. ఇంత అంత అని ఎన్న నలవికాని ఆ బలపరాక్రమవంతుడు, ఏ ఇతరులూ చేయలేని పనులు చేసే ఆ రావణాసురుడు అశోకవనద్వారము దగ్గరకు రావడము హనుమంతుడు చూచినాడు. సువాసనల నూనెలతో తడిపినందువల్ల సుగంధము గుబాళిస్తూ వెలుగుతూ ఉన్న ఎన్నో కాగడాలను అతని ముందు సుందరాంగనలు పట్టుకొని నడుస్తూ ఉన్నారు. మదమువల్లను, మద్యము కైపువల్లను, మదనతాపమువల్లను ఎర్రబడిపోయిన విశాల నేత్రాలతో చెరకువిల్లు వదలిపెట్టి వచ్చిన ప్రత్యక్ష మన్మథుడి మాదిరిగా రావణాసురుడు అశోకవనములోకి వచ్చినాడు. చిలికిన అమృతము నురుగువలె మిసమిసలాడుతూ, బాహుపురిలో తగులుకొని జారిపోతూ ఉన్న ఉత్తరీయాన్ని సవిలాసముగా సవరించుకొంటూ అతడు దగ్గరకు రావడము హనుమంతుడు చూచినాడు. ఆకులు దట్టముగా ఉన్న కొమ్మమీద ఎవరికీ కనపడకుండా ఉండేట్టు ఆకులూ, పూలూ కప్పుకొని కూర్చుని చూడసాగినాడు.

ఆ రావణాసురుడి వరాంగనలు అందరూ రూప యౌవనసంపన్నలు. ఆ సురూపులను అందరినీ హనుమంతుడు చూచినాడు. ఆ మత్తుడు, విశ్రవసుడి పుత్రుడు, రాక్షసాధిపతి నానావిధాభరణాలతోనూ, నిక్కపొడుచుకొన్న చెవులతోనూ, అంతమంది సుందరాంగనలతో నక్షత్రాలమధ్య చంద్రుడి మాదిరిగా ఆ అశోక వనములోకి వచ్చినాడు. ఆ మహాతేజోవంతుణ్ణి హనుమంతుడు చూచినాడు. 'రాజభవనములో నిద్రపోతూ ఉన్న ఆ మహాబాహువు రావణాసురుడు వీడేను' అనుకొంటూ అతడి చేష్టలు కనిపెట్టడానికి కిందికొమ్మమీదికి దిగినాడు. తాను ఉగ్రపరాక్రమవంతుడు అయినప్పటికీన్నీ ఆ రావణాసురుడి తేజానికి తాను లొచ్చేను అనుకుని ఏమాత్రమూ కనపడకుండా ఉండేట్టు ఆకులలో దాక్కొన్నాడు.

కొనలతో కూడా నల్లగా వున్న తలవెంట్రుకలతోనూ, సుందరము అయిన పిరుదులతోనూ, నడుమ సందులేకుండా ఒకదానితో ఒకటి ఒరసుకొనిపోతూవున్న స్తనాలతోను, నల్లని కన్నులతోను కూర్చునివున్న సీతాదేవి దగ్గరకు రావణాసురుడు పోయినాడు.

19

శ్రేష్ఠము అయిన ఆభరణాలతో అలంకరించుకొని శోభాయమానముగా వస్తూ వున్న ఆ రూపయౌవన సంపన్నుణ్ణి రాక్షసాధిపతిని రావణాసురుణ్ణి అప్పుడు ఆ

వరారోహా, ఆ వైదేహి, ఆ జనకరాజపుత్రి సీతాదేవి చూచి పెద్దగాలికి అరటిచెట్టువలె వణికిపోయింది. ఆ విశాలాక్షి, ఆ వరవర్ణిని తన తొడలతో కడుపును, బాహువులతో స్తనాలను కనపడకుండా కప్పివేసుకొని ఏడుస్తూ కూర్చుంది. అట్లా రాక్షసాంగనల కాపలాలో వుంటూ, దుఃఖముతో తపించిపోతూ, సముద్రములో మునిగిపోయిన నావమాదిరిగా వున్న ఆ వైదేహిని దశగ్రీవుడు చూచినాడు. ఆమె ఆస్తరణము ఏమీ లేని కటిక నేలమీద కూర్చుని వుంది. తీక్షవ్రతదీక్షలో వున్నట్టుగా కనిపించింది. నరికితే నేలకూలిన చెట్టుకొమ్మ మాదిరిగా తోచింది. దుమ్మూ ధూళీ అలముకొన్న ఆమె దేహము చిత్రవిచిత్రవర్ణాలతో కనిపించింది. అలంకరించుకోనందువల్ల బురద కొట్టుకున్న తామరతూడువలె ప్రకాశిస్తూనూ ప్రకాశించకుండా ఉంది. విదితాత్ముడూ, రాజసింహుడూ అయిన రాముడి దగ్గరకు ఆమె 'సంకల్పము' అనే గుర్రాన్ని కట్టిన 'మనస్సు' అనే రథము ఎక్కిపోతూ ఉన్నట్టుగా ఉంది. ఆమె ఎండిపోతున్నది. ఏడుస్తున్నది. ధ్యానశోకపరాయణగా ఉంది. ఆమె దుఃఖానికి అంతము అగపడలేదు. రాముడిని అనుసరించుకొని ఉండటమే ఆమె వ్రతము. మణిమంత్రాలకు కట్టుపడిపోయి చుట్టచుట్టుకొన్న పాము మాదిరిగా వుంది. సదాచార సత్యభావమూ, ధర్మప్రధానమూ అయిన వంశములో ఆమె పుట్టింది. అయితే, ఆమె ఆ అశోకవన పరిసరాలకు తగినట్టుగా లేదు. ఆమె విఘ్నము అయిపోయిన ధనలాభమువలెనూ, తిరస్కరించిన ఆజ్ఞవలెనూ, ఉత్పాతకాలాన జ్వలించే దిక్కు వలెనూ, పాడు అయిపోయిన పూజవలెనూ, శూరులు చచ్చిపోయిన సేనవలెనూ, నీళ్లు ఎండిపోతున్న నదివలెనూ, తాకరానివాండ్లు తాకిన వేదివలెనూ, చీకటి కమ్ముకొన్నందువల్ల తొలగిపోయిన వెలుతురువలెనూ, చల్లారిపోయిన అగ్నిశిఖవలెనూ, చంద్రమండలము రాహుగ్రస్తము అయినందువల్ల కాంతులు మాసిపోయిన పున్నమిరాత్రివలెనూ, ఏనుగులు తొండాలతో కెలికి పెరికివేసిన తామరాకులతోనూ, తామరపూలతోనూ, భయపడిపోయిన పక్షులతోనూ, పాడుపడ్డ తామరకొలనువలెనూ ఉంది.

ఆమె సుకుమారి, సుందరాంగి. ఆమె మణిమయము అయిన గర్భ గృహములో ఉండవలసింది. అటువంటి ఆమె, పీకివేస్తే అప్పుడే ఎండకు వాడిపోయిన తామరతూడు మాదిరిగా ఉంది. వేటకాండ్లు పట్టుకొని స్తంభానికి కట్టివేస్తే, పోతుటేనుగును ఎడబాసి నిట్టూర్పులు విడుస్తూ ఉన్న పెంటిఏనుగు మాదిరిగా ఉంది. ఉపవాసాలతో, పెనిమిటిని గురించిన ధ్యానముతో, భయముతో ఆమె క్షీణించిపోయింది. దీనురాలు అయిపోయింది. దుఃఖముతో బాధపడుతూ "రావణాసురుణ్ణి రాముడు పరాభవము చేయవలెను" అని చేతులు జోడించి మనస్సులో దేవతలను ప్రార్థిస్తున్నట్టు కూర్చుని ఉంది.

చక్కని కనురెప్పలతో, ఎర్రటి కనుకొనలతో, తెల్లటి కన్నులతో అన్నివైపులా చూస్తూ ఏడుస్తూ ఉన్న ఆ అనిందితను, రాముణ్ణి అనుసరించుకొని ఉండటమే వ్రతముగా పెట్టుకొన్న ఆ మైథిలిని, ఆ సీతాదేవిని రావణాసురుడు తన చావుకోసము ఆశపెట్టపోయినాడు.

20

రావణుడు సీతను ప్రలోభపెట్ట జూచుట

ఆమె పరమ పతివ్రత. దీనురాలు అయిపోయింది. ఏవిధము అయిన సంతోషమూ లేకుండా తపస్విని మాదిరిగా కూర్చుని ఉంది. అటువంటి సీతాదేవికి రావణాసురుడు తన అభిప్రాయము చెప్పవలెను అనుకొని మధురము అయిన మాటలతో, "ఓ సీతా! నీవు నన్ను చూచి భయపడుతున్నట్టు ఉన్నావు. అందువల్లనే, ఏనుగుతొండాలవంటి నీ తొడలతో నీ కడుపు కనపడకుండానూ, నీ స్తనాలు కనపడ కుండానూ కప్పుకొని కూర్చున్నావు. నీ దేహము నాకు అగపడకూడదు అనుకొన్నావు.

"ఓ విశాలాక్షీ! నిన్ను నేను కామించినాను. నీవు నా ప్రియురాలవు. శుభలక్షణాలతో ఉన్న నీ సర్వాంగాలూ నన్ను ఆకర్షించినవి. నీవు సర్వలోక మనోహరవు. నన్ను గౌరవించు. ఇక్కడ మనుష్యులు కానీ, కామరూపులు అయిన రాక్షసులుకానీ లేరు. నీకు ఎందుకు భయము? నేను నిన్ను కామించినవాణ్ణి. ఓ సీతా! నీవు నన్ను చూచి భయపడవద్దు.

"ఓ భీరూ! పరస్త్రీలతో పోవడముకానీ, పరస్త్రీలను ఎత్తుకొని పోవడము కానీ రాక్షసులకు సర్వవిధాలా స్వధర్మము. సందేహము లేదు. ఓ మైథిలీ! ఇది ఇట్లా ఉన్నప్పటికిన్నీ నీవు కామించనిదే నిన్ను నేను ముట్టుకోను. నీవు నన్ను యథేచ్ఛగా కామించవలెను. ఓ ప్రియురాలా! నీవు ఇక్కడ భయపడనక్కరలేదు. నన్ను నమ్ము. యథార్థముగా నన్ను ప్రేమించు. నీవు ఇట్లా శోకలాలసవు కావద్దు. నీవు దువ్వుకోకుండా ఇట్లా నీ తలవెంట్రుకలను ఒకే జడగా మెలిపెట్టుకోవడమూ, నీవు కటిక నేలమీద పడుకోటమూ, ఏదో ఎప్పుడూ ధ్యానము చేస్తూ ఉండడమూ, మాసిపోయిన చీర వదలకుండా కట్టుకొని ఉండడమూ, సమయాసమయాలు గమనించకుండా ఉపవాసాలు చేయడమూ ఏమీ బాగాలేదు.

"మైథిలీ! నీవు నన్ను చూడు. నానావిధ పూలదండలు వేసుకో. నీ దేహానికి చందనాగరుగంధము పూసుకో. దివ్యాభరణాలు పెట్టుకో. వివిధ చీరలు కట్టుకో. మంచి మద్యము తాగుతూ ఉత్తమశయ్యాసనాలమీద పడుకొంటూ, కూర్చుంటూ, విహరిస్తూ, నృత్యగీతవాద్యాదులతో పొద్దుపుచ్చుతూ హాయిగా ఉండు. నీవు స్త్రీలలో

రత్నమువంటిదానవు. నీవు ఇట్లా ఉండకూడదు. నీ దేహాన్ని చక్కగా అలంకరించుకో. ఓ రూపసీ! నా నివాసము చేరిన నీవు అలంకరణలూ, ఆభరణాలూ లేని దానివిగా ఉండడము ఏమిటి? మనోహరము అయిన నీ యౌవనము అంతా గడచిపోతున్నది. ప్రవాహములో కొట్టుకొనిపోయిన నీళ్ళు తిరిగి రావు. అట్లాగే గడచిపోయిన యౌవనము తిరిగిరాదు.

"ఓ వైదేహీ! ఈ ప్రపంచములో రూపాలను అన్నిటినీ చేసే బ్రహ్మదేవుడికి నిన్ను చేసిన తరువాత నీ రూపమువలె మరి ఒకతెను చేయడము చేతకాక పోయింది అనుకొంటున్నాను. ఓ శుభదర్శనీ! నీ రూపాన్ని పోలినది మరి ఒకతె ఈ జగత్తులో లేదు. ఓ సీతా! నీ రూపాన్ని, నీ యౌవనాన్ని చూస్తే సాక్షాత్తూ బ్రహ్మదేవుడు అయినా నిన్ను మోహిస్తాడు. ఇక ఏ మగవాడు నిన్ను మోహించకుండా ఉండగలడు?

"ఓ సీతా! చంద్రబింబమువంటి నీ ముఖమూ, పెద్ద పెద్ద నీ పిరుదులూ, నీ ప్రతి అవయవమూ ఏ అవయవాన్ని చూస్తే ఆ అవయవము నా కంటిని మరి ఒక దానిని చూడనీయకుండా కట్టివేస్తూ ఉన్నవి. ఓ మైధిలీ! నీవు నా భార్యవు కా. అజ్ఞానము వదలిపెట్టు. నీకు మంచి అవుతుంది. నేను నానా ప్రదేశాలనుంచీ ఎంతోమంది వరాంగనలను ఎత్తుకొని వచ్చినాను. వాండ్లు అందరూ నాకు భార్యలు అయినారు. వాండ్లు అందరిలోనూ నీవు నాకు అగ్రమహిషివిగా ఉండు. ఓ భీరూ! నేను ఈ లోకములో బలవంతముగా ఎత్తుకొని వచ్చిన రత్నాలు అన్నీ నీకు ఇస్తాను. నా రాజ్యము నీకు ఇస్తాను. నేను నీవాణ్ణిగా ఉంటాను.

"ఓ విలాసినీ! నీకోసము నానావిధ నగరాలతో ఉన్న ఈ పృథివిని అంతా జయించి నీ తండ్రి జనకమహారాజుకు ఇస్తాను. నన్ను ఎదిరించిన వాడు ఇదివరకు ఈ లోకములో ఎవడూ నాకు అగపడలేదు. యుద్ధములో నన్ను ఎదుర్కొనగలవాడు ఈ జగత్తులో ఎవడూ లేడు. నా మహత్తర పరాక్రమాన్ని గురించి ఆలోచించు. సురాసురులు నాతో అనేకమార్లు యుద్ధము చేసి ఓడిపోయినారు. నేను వారి టెక్కాలను విరగకొట్టినాను. వారు ఎవరూ నా ఎదుట నిలువలేకపోయినారు.

"ఓ సీతా! నీవు నన్ను వరించు. చక్కగా అలంకరించుకో. నీవు కాంతివంతము అయిన ఆభరణాలను అన్నింటినీ పెట్టుకో. చక్కగా అలంకారము చేసుకొన్న నీ రూపము చూస్తాను.

"ఓ సుందరాననా! నీవు నామీద దయ ఉంచి అలంకరించుకో. యథేష్టముగా అన్ని భోగాలూ అనుభవించు. తాగు, క్రీడించు. నీవాండ్లకు నీ చిత్తము వచ్చినట్టుగా ధనాన్నీ, భూమినీ ఇచ్చుకో. నన్ను నమ్ము, నాతో రమించు. నీకు కావలసిన పనులు

అన్నీ ధైర్యముతో ఆజ్ఞాపించి చేయించుకో. నీవు నా అనుగ్రహముతో సంతోషము అనుభవిస్తూ ఉంటే చూచి నీ బంధువులు అందరూ ఆనందిస్తారు.

"ఓ మంగళస్వరూపిణీ! నీవు నా సర్వవస్తుసమృద్ధినీ, నా ఐశ్వర్యాన్నీ, నా యశస్సునూ చూడు. ఓ సుందరీ! వల్కలాలుకట్టుకొనే రాముడితో ఏమి అనుభవిస్తావు? వాడికి జయము లేదు. సంపద పోయింది. మహారణ్యాలలో తిరుగుతూ ఉన్నాడు. వానప్రస్థవ్రతము అవలంబించి నేలమీద పడుకొంటూ ఉన్నాడు. ఇప్పుడు వాడు బ్రతికి ఉన్నాడో లేదో సందేహమే. కొక్కెర పంక్తులూ, నీలమేఘాలూ కమ్ముకొంటే వెన్నెల అగుపించదు. అట్లాగే, నాదగ్గరవున్న నీవు రాముడికి అగపడవు. వాడు వచ్చి నిన్ను చూడలేడు. హిరణ్యకశిపుడు అంతటివాడు తన భార్యను దేవేంద్రుడు ఎత్తుకొనిపోతే పరాక్రమముతో తిరిగి తెచ్చుకొనలేక పోయినాడు. నారదుడి కాళ్ళుపట్టుకొని భార్యను తెచ్చుకొన్నాడు. కాని, నేను ఎత్తుకొనివచ్చిన నిన్ను మాత్రము రాముడు ఏవిధముగానూ తిరిగి తీసుకొనిపోలేడు.

"ఓ విలాసినీ! నీవు భీరువవు. నీ సహజము అయిన చిరునవ్వూ, నీ అందమయిన పలువరుసా, మనోహరము అయిన నీ నేత్రాలూ, నీ సర్వాంగ సౌందర్యమూ గరుత్మంతుడు సర్పాలను హరించివేసేటట్టు నా మనస్సును హరించివేస్తూ వున్నవి. నలిగి మాసిపోయిన పట్టుచీర కట్టుకొని అలంకారము చేసుకోకుండా కృశించిపోయిన నిన్ను చూస్తూ ఉంటే నా భార్యలను చూచి నేను సంతోషించలేకుండా ఉన్నాను. ఓ జానకీ! అంతఃపురాంగనలు అందరూ సమస్త శుభలక్షణ సంపన్నలు. వాండ్లు అందరికీ నీవు అధికారిణివిగా ఉండు. వాండ్లు అందరూ ముల్లోకాలలోనూ ఉత్తమోత్తమము అయిన స్త్రీలు. లక్ష్మీదేవికి అప్సరసలవలె నీకు వాండ్లు అందరూ సేవచేస్తూ ఉంటారు.

"ఓ సుశ్రోణీ! ఓ సుభ్రూ! ఆ కుబేరుడి దగ్గిర ఉన్న ధనాన్నీ. రత్నాలనూ నేను తీసుకొని వచ్చి నీకు ఇస్తాను. వాటినే కాదు, నేను జయించిన లోకాలనూ, నన్నూ నీవు హాయిగా అనుభవించు. ఓ సీతా! రాముడు తపస్సులో నాతో సరిసమానము అయినవాడు కాడు. బలములోకానీ, పరాక్రమములోకానీ, ధనములోకానీ, తేజస్సులో కానీ నాకు తుల్యుడు కాడు. ఓ లలనా! నీవు తాగు. సుఖముగా తిరుగు. క్రీడించు. అన్ని భోగాలూ అనుభవించు. నీకు నేను ధనము ఇస్తాను. ఈ భూమిని ఇస్తాను. నాతో హాయిగా రమించు. నీ బంధువులు అందరూ నీ దగ్గిరకు చేరి సంతోషపడతారు.

"ఓ భీరూ! నీవు బంగారపు హారాలతో అలంకరించుకో. ఈ సముద్రతీరాన పూలుపూసిన వృక్ష సమూహాలతోనూ, తుమ్మెదల ఝుంకారముతోనూ మనోహరము అయిన ఉద్యానవనాలలో నాతో విహరించు" అని రావణాసురుడు చెప్పినాడు.

21

సీత రావణుని హెచ్చరించుట

ఆ భయంకర రాక్షసుడు రావణాసురుడు చెప్పిన మాటలు సీతాదేవి విన్నది. ఆ శుచిస్మిత, ఆ వరారోహ, ఆ పతివ్రత తన పెనిమిటిని గురించి ఆలోచిస్తూ వణికిపోతూ, ఏడుస్తూ రావణాసురుడితో ప్రత్యక్షముగా కాకుండా, ఒక గడ్డిపోచను అడ్డము పెట్టుకొని దీనస్వరముతో, "ఓ రాక్షసుడా! నామీదినుంచి నీ మనస్సు మళ్ళించుకో. నీ మనస్సు నీ సొంత భార్యలమీద వుంచు. పాపిష్ఠివాడు స్వర్గాన్ని కోరినట్టు నీవు నన్ను ప్రార్థించి ప్రయోజనములేదు. నేను పరిశుద్ధము అయిన వంశములో పుట్టినాను. మహాపూజ్యము అయిన వంశములో పుట్టినవాడు నన్ను పెండ్లి ఆడినాడు. నాకు ఒక్కడే పెనిమిటి. నేను పతివ్రతను. లోకము నిందించే అకార్యము నేను చేయను" అంటూ తన ముఖము ఆ రావణాసురుడికి కనపడకుండా వెనుకకు తిరిగి, "ఓ రాక్షసుడా! నేను ఇతరుడి భార్యను. పతివ్రతను. నీకు తగిన భార్యను కాను. నీవు సత్పురుషుల ధర్మము ఆలోచించు. సత్పురుషుల ఆచారాన్ని పాటించు. ఓ నిశాచరుడా! నీ భార్యలవంటి వాండ్లే ఇతరుల భార్యలు కూడాను. నీవు నీ భార్యలను ఎంత కట్టుదిట్టముగా కాపాడుకొంటూ ఉంటావో, ప్రతి మగవాడూ వాడి భార్యను అదేవిధముగా కాపాడుకొంటూ ఉంటాడు. అందరూ నీవంటి వారే. నీవు నీ భార్యలతో సంతోషపడు. తన సొంత భార్యలతో సంతుష్టి చెందని చపలుణ్ణి, చలితేంద్రియుణ్ణి, శఠుణ్ణి పరదారలు పరాభవిస్తారు. వాడి ఆయురైశ్వర్యాదులను నాశనము చేసివేస్తారు.

"ఓ రావణాసురుడా! ఈ లంకాపట్టణములో నీకు చెప్ప కలిగిన పెద్దలు ఎవరూ లేరా లేక ఆ పెద్దలు చెప్పే మాటలు నీ బుద్ధికి ఎక్కవా? అంతే అయివుంటుంది. సత్పురుషులు నీకు మేలు చేసే మాటలే చెప్పి వుంటారు. నీ బుద్ధి విపరీతము అయిపోయింది. అందువల్ల, వారి మాటలు నీవు పాటించి ఉండవు. నీవు రాక్షసులు అందరిమీదనూ పైకి స్నేహముతో ఉంటున్నావు. లోపల వారి నాశనము తలపెట్టినావు. సత్పురుషుల సదుపదేశము వినకుండా రాజు అన్యాయానికి ఒడికట్టితే సర్వసంపదలూ, రాష్ట్రాలూ, నగరాలూ నాశనము అయిపోతవి. నానావిధ రత్నరాసులతోనూ, సమస్త సంపదలతోనూ, తులతూగుతూ వున్న ఈ లంకారాజ్యము నీ ఒక్కడి అపరాధమువల్ల అచిరకాలములోనే నాశనము అయిపోతుంది. దూరదృష్టిలేని పాపకర్ముడు చేసిన పాపిష్ఠి పనికి నాశనము అయిపోతూ వుంటే సర్వప్రాణికోటీ సంతోషిస్తుంది. ఇదివరకు నీవు ఎవరు ఎవరిని వంచన చేసినావో, వారు అందరూ నీవు దైవవశమువల్ల నాశనము అయిపోతూవుంటే చూచి సంతోషిస్తారు. భయంకరుడవు అయిన నీకు కష్టాలు వస్తే అందరూ అది తమ భాగ్యము అని చెప్పుకొంటారు.

"ఓ రాక్షసుడా! నీ ఐశ్వర్యముతో కానీ, నీ అంతఃపుర ప్రభుత్వాధికారముతో కానీ, నీ ధనముతో కానీ నీవు నన్ను ఆశ పెట్టలేవు. నేను అట్లా ఆశపడేదానను కాను. సూర్యుడివెంట వెలుతురువలె ఆ రామప్రభువుతోటే ఎప్పుడూ నేను ఉండవలెను. నేను ఆయనను వదలిపెట్టను. ఆ లోకనాథుడి ఉత్తమ భుజాన్ని తలగడగా చేసుకొన్న నేను మరి ఒకరి భుజాన్ని ఎట్లా తలగడగా చేసుకొంటాను? వ్రతస్నాతుడూ, విదితాత్ముడూ, బుద్ధిమంతుడూ అయిన బ్రాహ్మణుణ్ణి ఆశ్రయించుకొని ఉండే వేదవిద్యవలె, ఆ మహానుభావుణ్ణే నేను ఆశ్రయించుకొని ఉంటాను. నేను ఆ రామప్రభువుకు తప్ప మరి ఎవరికిన్నీ తగిన భార్యను కాను.

"ఓ రాక్షసుడా! అడవిలో పోతుటేనుగును ఎడబాసి నవసిపోయే పెంటిఏనుగును మళ్ళీ పోతుటేనుగుతో చేర్చేటట్లు, ఇట్లా దుఃఖపడుతూ ఉన్న నన్ను నీవు ఆ రామప్రభువుతో చేర్చు. ఓ రావణాసురుడా! నీవు హాయిగా వుండవలెను అనుకొనేట్లయితే, ఘోరవధ వద్దు అనుకొనేట్లయితే నీవు ఆ పురుషోత్తముడితో స్నేహము చేసుకోవలెను. ఆ మహానుభావుడు స్నేహానికి తగినవాడు. ధర్మజ్ఞుడు అనీ, శరణాగతవత్సలుడు అనీ ప్రసిద్ధి కెక్కినాడు. నీవు జీవించ తలచుకొన్నట్లయితే ఆయనతో చెలిమి చేసుకోవలెను. నీవు ఆ శరణాగతవత్సలుణ్ణి సంతోషపెట్టవలెను. నీవు పరిశుద్ధుడవు అయి నన్ను ఆయనకు సమర్పింపవలెను. ఇట్లా నన్ను ఆయనకు సమర్పించేట్లయితే నీకు మేలు అవుతుంది.

"ఓ రావణుడా! నేను చెప్పినట్లు కాకుండా, నీవు మరిఒక విధముగా ప్రవర్తించేట్లయితే నీకు చావు తప్పదు. దేవేంద్రుడు వదిలే వజ్రాయుధము నిన్ను వదిలిపెట్టిపోతే పోవచ్చును. బహుకాలము యమధర్మరాజు నీ జోలికి రాకుండా ఉండవచ్చును. ఆ లోకనాథుడికి, రాముడికి కోపము వస్తే నిన్ను ఎంతమాత్రమూ వదిలిపెట్టడు. దేవేంద్రుడు వదిలే వజ్రాయుధ ధ్వనివంటి రామ శరాసన ధ్వనిని నీవు త్వరలోనే వింటావు. చక్కని కణుపులతో, మంటలుమండే ముఖాలతో, రామలక్ష్మణుల గుర్తులతో మహావిషసర్పాల వంటి బాణాలు త్వరలోనే ఈ లంకాపట్టణము మీద పడుతవి. కంకపక్షుల రెక్కల బాణాలు ఈ పట్టణము అంతటా దట్టముగా పడి రాక్షసులను అందరినీ రూపుమాపివేస్తవి. గరుత్మంతుడు అమితవేగముతో సర్పాలను చిమ్మివేసేటట్టు రామప్రభువు తన బాణాలతో సర్పాలవంటి రాక్షసులను అందరినీ అమితవేగముతో చిమ్మివేస్తాడు. విష్ణుమూర్తి మూడు అడుగులు వేసి అసురుల దగ్గిరనుంచి రాజ్యలక్ష్మిని స్వాధీనము చేసుకొన్నట్టుగా, అచిరకాలములోనే ఆ అరిందముడు, నా భర్త రామప్రభువు నిన్ను నాశనము చేసి నన్ను తీసుకొనిపోతాడు.

ఓ రావణాసురుడా! రాక్షససేనలను అన్నిటినీ నాశనముచేస్తూ నా పెనిమిటి జనస్థానాన్ని హతస్థానము చేసివేసేటప్పుడు నీవు అశక్తుడవుగా కూర్చున్నావు. ఆ తరువాత నన్ను దొంగిలించుకొని వచ్చినావు. ఓ రాక్షసుడా! నీవు నీచుడవు. ఆ పురుషసింహులు, ఆ అన్నదమ్ములు రామలక్ష్మణులు ఉభయులూ బయటికి పోయినప్పుడు నీవు వారి ఆశ్రమానికి పోయినావు. వారి వాసన అయినా నీకు తగిలి ఉన్నట్లయితే, పెద్దపులుల వాసన తగిలిన కుక్కవలె నీవు పారిపోయి ఉండేవాడవు. నీకూ, ఆ రామలక్ష్మణులకూ యుద్ధమే జరిగి ఉన్నట్లయితే నీవు ఎన్నడో చచ్చిపోయిఉండేవాడవు. ఏకబాహువు అయిన వృత్రాసురుణ్ణి దేవేంద్రుడు రెండు బాహువులు ఉండడమువల్ల చంపివేసినాడు. నీవు ఒక్కడవు. వారు అన్నదమ్ములు ఇద్దరు. వారు నిన్ను చంపివేసేవారు. నా నాథుడు, ఆ రామప్రభువు లక్ష్మణుడితోకూడా త్వరలోనే ఇక్కడికి వస్తాడు. ఆదిత్యుడు తన అనంత కిరణాలతో అల్పజలాలను హరించినట్లు, ఆ నా ప్రభువు తన బాణాలతో నీ ప్రాణాలు పీల్చివేస్తాడు.

"ఓ రావణుడా! నీకు చేటుకాలము వచ్చింది. నీవు కైలాసగిరికి (ఊర్ధ్వలోకము) పోయినా, వరుణప్రభు సభాభవనానికి (అధోలోకము) పోయినా పిడుగుపాటు తప్పించుకోలేని మహావృక్షమువలె నీవు ఆ దాశరథి బాణాన్ని తప్పించుకోలేవు" అని సీతాదేవి చెప్పింది.

22

రావణుడు సీతను బెదిరించుట

అట్లా సీతాదేవి అన్న పరుష వాక్యాలకు ఆ రాక్షసాధిపతి రావణాసురుడు ఆమెకు దుఃఖము వచ్చేటట్టుగా, "ఓ సీతా! మగవాడు ఆడుదానిని ఎంతెంతగా బ్రతిమిలాడుకొంటాడో, అంత అంతగా ఆ ఆడుదానికి లోకువ అయిపోతాడు. సంతోషము కలుగచేసే మాటలు ఎంత ఎంత చెప్పుతాడో, అంత అంతగా వారివల్ల అవమానపడిపోతాడు. నేను నిన్ను కామించినాను. కామము మహా చెడ్డది. ఆ కామము ఎవరిమీద ఎక్కువ అయితే వారిమీద జాలీ, స్నేహమూ ఎక్కువ అవుతవి. ఉరకలు వేస్తూ ముందుకు పరుగులు ఎత్తే గుర్రాలను సారథివలె నా కోపాన్ని మన్మథుడు ఇప్పుడు వెనుకకు లాగుతున్నాడు. ఈ కారణము నుంచి ఓ సుందరాననా! నిన్ను ఇప్పుడు నేను ఏమీ చేయకుండా ఊరుకొంటున్నాను. నీ కపట వైరాగ్యానికి నిన్ను పరాభవింపవలెను. నిన్ను చంపివేయవలెను.

"ఓ మైథిలీ! నీవు అన్న ప్రతి పరుషవాక్యానికీ నిన్ను చిత్రవధ చేయవలెను" అని క్రోధ సంరంభముతో, "ఓ సీతా! నేను నీకు రెండు మాసాలు గడువు పెట్టినాను.

ఆ గడువుకాలము అయిపోగానే నీవు వచ్చి నా శయ్యమీద నాతోకూడా పడుకోవలెను. అట్లా నీవు నన్ను భర్తగా వరించకపోయేట్టయితే గడువుకాలము అయిన మరునాడు నా ప్రాతఃకాలభోజనము కోసము నిన్ను నావంట ఇంట్లో చీల్చి వేస్తారు" అని బెదిరించినాడు.

రావణాసురుడు సీతాదేవిని అట్లా బెదిరిస్తూ ఉంటే అప్పుడు అక్కడ అతని వెంట ఉన్న దేవకన్యలూ, గంధర్వకన్యలూ సీతాదేవి వంక వికృతముగా చూచి దుఃఖపడిపోయినారు. తక్కిన స్త్రీలు పెదవులతోనూ, ముఖాలతోనూ, కన్నులతోనూ సంజ్ఞలు చేస్తూ సీతాదేవిని ఊరడించినారు.

ఆ స్త్రీలు అందరూ తనను అట్లా ఊరడిస్తూ ఉంటే సీతాదేవి పాతివ్రత్య బలముతోనూ, గర్వముతోనూ రావణాసురుణ్ణిచూచి, "ఓ రాక్షసుడా! నీ మేలుకోరేవాడు ఎవడూ ఈ లంకాపట్టణములో లేడు. నిజము. నీవు ఇట్లా తప్పుపని చేస్తూఉంటే నిన్ను ఒక్కడూ అడ్డగించడము లేదు. దేవేంద్రుడి భార్య అయిన శచీదేవివంటి నన్ను, నీవు తప్ప ముల్లోకాలలోనూ ఎవరూ కామించరు. అమితతేజోవంతుడు అయిన రామప్రభువు భార్యతో నీవు కాబట్టి పాపిష్టి మాటలు అన్నావు. ఇకను నీవు ఎక్కడికి పోయినా నీకు మోక్షము లేదు. నిన్ను ఆ రామప్రభువు శిక్షించకుండా ఉండడు. ఓ రావణాసురుడా! అడవిలో గర్వముతో తిరిగే మదపుటేనుగుతో కుందేలు పోరాడితే ఏమి అవుతుందో ఆ తేజోవంతుడితో, రాముడితో నీవు పోరాడితే అదే అవుతుంది. రాముణ్ణి దూరముగా పంపించివేసి నీవు నన్ను దొంగిలించుకొని వచ్చినావు. నీకు సిగ్గు వేయడము లేదా? నీవు ఇంతవరకూ ఆ రామప్రభువు కళ్ళ పడలేదు. ఓ రాక్షసుడా! నల్లగానూ, తేనెరంగుతోనూ ఉన్న నీ క్రూర నేత్రాలు రాలి కింద పడిపోవలెను. నేను ఆ ధర్మాత్ముడి భార్యను, దశరథమహారాజు కోడలను. నీవు నన్ను అన్నమాటలకు నీ నాలుక చీలికలు అయిపోవలెను. ఓ రాక్షసుడా! నీవు భస్మము అయిపోవలెను. నేను ఇప్పుడు పాతివ్రత్య ధర్మము నుంచి నీవు భస్మము అయిపోవలెను అని శాపము పెట్టకుండా ఉన్నాను.

"ఓ రాక్షసుడా! ఆ మహాత్ముడు ఉండగా అయినట్లయితే నన్ను నీవు ఎత్తుకొని రావడానికి వీలు అయ్యేది కాదు. ఇంతకూ నీ చావు కోసము నీవు నన్ను అపహరించి తెచ్చుకొన్నావు. సందేహము లేదు. కుబేరుడి తమ్ముణ్ణి అనీ, శూరుణ్ణి అనీ నీవు చెప్పుకొన్నావే! ఎందుకు ఆ మహానుభావుణ్ణి అప్పుడు అక్కడ నుంచి తొలగించి అతని భార్యను నన్ను దొంగిలించుకొని వచ్చినావు" అని అడిగింది.

రావణాసురుడు తన క్రూర నేత్రాలు తెరిచి తేరిపార సీతాదేవివంక చూచినాడు.

అతడు నీలమేఘమువంటివాడు. పెద్ద పెద్ద భుజాలు, బలిసిన మెడ, సింహము అంతటి బలవంతుడు. సింహమువలె నడుస్తాడు. అతడు కాంతిమంతుడు. కన్నులూ, నాలుకా జ్యోతులవలె వెలుగుతూ ఉంటవి. మంచి ఎత్తు అయినవాడు. అతడు నడుస్తూవుంటే ఆ నడకకు శిరము మీద కిరీటము శోభాయమానముగా కదులుతూ ఉంటుంది.

అతడు చందనచర్చచేసుకొన్న దేహముమీద రంగురంగుల పూలదండలూ, కన్నులు చెదిరిపోయే ఎఱ్ఱటి పూలదండలూ వేసుకొన్నాడు. రక్తవస్త్రము కట్టుకొన్నాడు. బంగారు బాహుపురులు ధగధగలాడుతూ ఉన్నవి. అమృత మధనము అప్పుడు మందర పర్వతానికి చుట్టిన వాసుకివంటి నల్లటి మొలత్రాడుతోనూ, మందర పర్వత శిఖరాలవంటి పెద్ద పెద్ద భుజాలతోనూ, చెవులకు పెట్టుకొన్న కుండలాలు తరుణాదిత్య కాంతులతో ధగధగలాడుతూ ఉన్నందువల్ల ఎఱ్ఱటి చిగుళ్ళూ, ఎఱ్ఱటిపూలు పూసిన అశోకవృక్షాలు వున్న పర్వతమువలె శోభించినాడు. అతడు ఒక కల్పవృక్షమువలెనూ, ఆకారము ధరించిన వసంతుడి వలెనూ అలంకరించుకొన్నప్పటికిన్నీ శ్మశాన మంటపమువలె భయంకరముగా కనిపించినాడు.

ఆ రావణాసురుడు కోపముతో కన్నులు ఎఱ్ఱచేసి వైదేహిని చూస్తూ, పాము బుసలు మాదిరిగా నిట్టూర్పు విడుస్తూ, "ఓ సీతా! వాడు దరిద్రుడు, దుర్మార్గుడు. వాడిని, ఆ రాముణ్ణి అనుసరించడము అనే వ్రతము పట్టినావు. ప్రాతఃసంధ్యను సూర్యుడివలె నిన్ను ఇప్పుడు నా ఓజస్సుతో నాశనము చేసివేస్తాను' అని చెప్పినాడు.

అంతట ఆ శత్రురావణుడు ఏకాక్షినీ, ఏకకర్ణనూ, కర్ణప్రావరణనూ, గోకర్ణినీ, హస్తికర్ణినీ, లంబకర్ణినీ, అకర్ణికనూ, ఏనుగు పాదాల దానినీ, గుఱ్ఱము పాదాల దానినీ, గోవుపాదాల దానినీ, పాదాలకు జుట్టు ఉన్న దానినీ, పెద్దతలా మెడా ఉన్న దానినీ, పెద్ద పెద్ద స్తనాలూ పెద్ద పొట్టా ఉన్న దానినీ, పెద్ద పెద్ద కన్నులూ పెద్ద ముఖమూ ఉన్నదానినీ, పొడుగాటి నాలుక ఉన్నదానినీ, నాలుకలేని దానినీ, ముక్కులేని దానినీ, సింహము ముఖము దానినీ, గోముఖము దానినీ, సూకరముఖము దానినీ- అట్లా భయంకరముగా కనిపించే ఆ రాక్షసస్త్రీలను అందరినీ చూచి "ఓ రాక్షసాంగనలారా! మీరు అందరూ ఏకము అయి ఏపని చేస్తే ఈ జనకరాజు కూతురు సీత నా వశము అవుతుందో, ఆ పని వెంటనే చేయండి. ఈమెకు అనుకూలముగా కాని, ప్రతికూలముగా కాని ప్రవర్తించండి. సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించండి. ఈ వైదేహి నా వశము అయ్యేట్టు మీరు చేయవలెను" అని ఆజ్ఞాపించినాడు.

కామమూ, క్రోధమూ పెనవేసుకొనిపోయి రావణాసురుడు ఆ సీతాదేవిని మాటిమాటికి బెదిరించసాగినాడు.

అప్పుడు ధాన్యమాలిని అనే రాక్షసాంగన (రావణాసురుడి భార్య) చటుక్కున వచ్చి రావణాసురుణ్ణి కౌగలించుకొని, "మహారాజా! నాతో క్రీడించు. ఈ సీత మానవ స్త్రీ. దీని దేహము పాలిపోయింది. ఇది ఏడుస్తూ వుంది. ఓ రాక్షసేశ్వరా! ఇట్లా ఏడ్చే దానితో ఏమి అనుభవిస్తావు? మహాప్రభూ! నీ భుజబలముతో ఆర్జించిన దివ్యమూ ఉత్తమోత్తమము అయిన భోగాలను అనుభవించడానికి బ్రహ్మదేవుడు ఈ సీతను సృష్టించలేదు. నిజము. కోరిక లేనిదానిని కామించే వారికి దేహతాపము తప్ప మరి ఏ సుఖమూ ఉండదు. కోరుకొంటున్న దానిని కామించేవారు చెప్పనలవికాని సంతోషము అనుభవిస్తారు" అని చెప్పింది. ఈ మాటలకు ఆ బలవంతుడికి కోపము చల్లారిపోయింది. ఆ మేఘసమానుడు రావణుడు అప్పుడు నవ్వుతూ వెనుకకు మళ్ళినాడు. భూమి కంపించి పోయేటట్లు అడుగులువేస్తూ, మధ్యాహ్న సూర్యుడివలె తేజరిల్లే తన రాజభవనములోకి పోయినాడు. అతడితోపాటు ఆ రాజ భవనములోకి దేవకన్యలూ, గంధర్వాంగనలూ, నాగకన్యలూ మొదలయిన అతని స్త్రీలు అందరూ పోయినారు.

ఆ ధర్మపరాయణను, ఆ ధృఢవ్రతను, గజగజ వణికిపోయిన సీతాదేవిని రావణాసురుడు అట్లా బెదిరించి పరమభాస్వరము అయిన తన భవనములోకి పోయినాడే కాని, ఆమె మీద మోహము అతడికి వదిలిపోలేదు.

23

రాక్షస స్త్రీలు సీతాదేవిని బెదిరించుట

ఆ శత్రురావణుడు సీతాదేవిని అట్లా బెదిరించి ఆ రాక్షసాంగనలను అందరినీ ఆజ్ఞాపించి వెళ్ళిపోయిన తరువాత ఆ భయంకరాకారులు రాక్షసాంగనలు అందరూ పరుగెత్తుకొనిపోయి సీతాదేవికి ఎదురుగుండా నిలుచున్నారు. వారిలో ఒకతె క్రోధ మూర్ఛిత అయి, అతి పరుషముగా, "ఓ సీతా! పౌలస్త్యవంశములో పుట్టినాడు. చాల గొప్పవాడు. మహాపరాక్రమవంతుడు. అటువంటి దశగ్రీవుడికి రావణాసురుడికి భార్య కావడము నీవు గొప్పగా ఎందుకు భావించవు?" అని అడిగింది.

'ఏకజట' అనే రాక్షసాంగన కోపముతో కన్నులు ఎర్రజేసి ఆ సుమధ్యమను చూచి, "ఓ సీతా! ప్రజాపతులు (మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనేవారు) ఆరుగురు. వారిలో పులస్త్యుడు నాల్గవవాడు. ఆ పులస్త్యుడు బ్రహ్మమానస పుత్రుడు. అతడి మానసపుత్రుడు విశ్రవసుడు. ఆ విశ్రవసుడు మహా ప్రభావము కలవాడు. ప్రజాపతి అయిన బ్రహ్మదేవుడితో సరిసమానము అయినవాడు. అతడు మహర్షి. ఈ రావణుడు ఆ విశ్రవసుడి పుత్రుడు.

"ఓ విశాలాక్షీ! ఈ రావణుడు శత్రురావణుడు, రాక్షసులకు అందరికీ ప్రభువు. నీవు ఇతనికి భార్యవు కా, బాగుంటుంది. ఓ సర్వాంగసుందరీ! నేను చెప్పుతున్న మాట ఒప్పుకోవు ఎందువల్లను?" అని అడిగింది.

'హరిజట' అనే పిల్లికళ్ళ రాక్షసాంగన కోపముతో గ్రుడ్లు త్రిప్పుతూ, "ఓ సీతా! రావణాసురుడు ముప్ఫయిమూడుకోట్ల దేవతలనూ, దేవేంద్రుణ్ణీ జయించినాడు. రాక్షసులకు అందరికీ ప్రభువు. నీవు భార్యవుకా, బదులు చెప్పవద్దు" అన్నది.

'ప్రఘస' అనే రాక్షసాంగన కోపముతో చెలరేగి ఘోరముగా బెదిరిస్తూ "పరమపరాక్రమవంతుడూ, శూరుడూ, యుద్ధాలలో వెనుతీయనివాడూ, బలవంతుడూ అయిన రావణాసురుడికి నీవు భార్యవుగా ఎందుకు ఉండవు?

"ఆ మహాబలవంతుడి భార్యలు అందరిలోనూ ప్రియురాలు మండోదరి. అందరూ గౌరవించే ఆ మహాభాగను వదలిపెట్టి నిన్ను చేపట్టుతాడు. అనేక వేలమంది స్త్రీలతోనూ, నానావిధరత్నకాంతులతోనూ తేజరిల్లే అంతఃపురాన్ని వదిలిపెట్టి రావణాసురుడు నీతో ఉంటాడు" అని చెప్పింది.

'వికట' అనే మరి ఒక రాక్షసి, "ఓ సీతా! రావణాసురుడు నాగులనూ, దానవులనూ, గంధర్వులనూ యుద్ధాలలో అనేక పర్యాయములు జయించినాడు. అటువంటివాడు నీ పక్కను ఉంటాను అంటున్నాడు. ఓ నీచురాలా! రావణాసురుడు సమస్తైశ్వర్యాలతోనూ తులతూగుతూ ఉన్నాడు. మహాపరాక్రమవంతుడు. సర్వరాక్షసులకూ ప్రభువు. అతడి భార్యగా ఉండడానికి నీవు ఎందుకు ఇష్టపడడము లేదు?" అని అడిగింది.

'దుర్ముఖ' అనే రాక్షసి, "ఓ సీతా! నీకు పెద్ద పెద్ద కన్నులు ఉన్నవి. అయితే ప్రయోజనము ఏమిటి? చూడు, రావణాసురుడికి భయపడి సూర్యుడు తాపము ఎత్తకుండా ఎండ కాస్తూ ఉన్నాడు. వాయువు అధికముగా వీచడము లేదు. నీవు అటువంటివాడికి భార్యగా ఎందుకు ఉండవు? ఓ సుభ్రూ! అతడికి భయపడి చెట్లు పూలవాన కురిపిస్తున్నవి. అతడికి భయపడి పర్వతాలూ, మేఘాలూ తాగ యోగ్యము అయిన జలాలను వదులుతున్నవి. అతడు రాక్షసులకు మాత్రమే కాదు, రాజులకు అందరికీ రాజు. ఆ రాజరాజుకు భార్యగా ఉండవలెను అని నీవు ఎందుకు కోరుకోకుండా ఉన్నావు? ఓ భామినీ! నీకు యథార్థము చెప్పినాను. నేను చెప్పినట్టు విను. అట్లా చేయకపోయినట్లయితే నీవు ఇక బ్రతికి ఉండడము ఉత్తది" అని చెప్పింది.

24

ఆ వికృతాననలు, ఆ పరుషస్వభావలు రాక్షసాంగనలు సీతాదేవి చుట్టూ చేరి మళ్ళీ, "ఓ సీతా! రావణాసురుడి అంతఃపురము సర్వభూత మనోహరము అయింది.

అక్కడ శయ్యలు ఎంతో గొప్పగా ఉంటవి. నీవు అక్కడ ఉండవలెను అని ఎందుకు అనుకోవడము లేదు? అవును, నీవు మానవాంగనవు. మానవుడికి భార్యగా ఉండడమే గొప్ప అనుకొంటున్నావు కాని ప్రయోజనము లేదు. రాముడిమీదినుంచి నీ మనస్సు మళ్ళించుకో. నీవు ఇకను ఎప్పటికీ వాణ్ణి చేరలేవు. రావణాసురుడు త్రైలోక్య ఐశ్వర్యాన్ని అనుభవిస్తున్నాడు. రాక్షసప్రభువును భర్తగా వరించి నీ ఇష్టము వచ్చినట్టు హాయిగా క్రీడించు.

"ఓ మంగళస్వరూపిణీ! నీవు అనిందితవు. అయితే మానవాంగనవు అయిపోయినావు. అందువల్లనే, రాజ్యభ్రష్టుడు అయిపోయి, ఏ కోరికా తీర్చుకోలేని ఆ దీనుణ్ణే, ఆ మానవుణ్ణే కావలెను అనుకొంటున్నావు" అని చెప్పినారు.

సీతాదేవి వారి మాటలు విన్నది. తామరరేకులవంటి ఆమె కన్నులనిండా నీళ్ళు కమ్ముకొన్నవి. ఆ రాక్షసాంగనలను అందరినీ చూస్తూ, "మీరు లోకము ద్వేషించే మాటలు చెప్పినారు. మీరు చెప్పింది పాపము అని మీ మనస్సులలో తోచడము లేదా? మానవాంగన రాక్షసుడికి భార్యగా ఉండజాలదు. మీరు అందరూ నన్ను వదిలివేయండి. మీ మాటలు నేను వినను. దీనుడు కావచ్చును, రాజ్యహీనుడు కావచ్చును. ఆ రామప్రభువే నా పెనిమిటి. అతడే నాకు అధికుడు. సువర్చల ఎప్పుడూ సూర్యుణ్ణి అనుసరించుకొని ఉంటుంది. అట్లాగే అనురాగముతో నేనూ నా పెనిమిటిని అనుసరించుకొని ఉంటాను.

"ఆ మహాభాగ శచీదేవి దేవేంద్రుణ్ణి అనుసరించుకొని, అరుంధతీదేవి వశిష్ఠమహర్షిని అనుసరించుకొని ఉంటున్నారు. వారే కాదు. రోహిణీదేవి చంద్రుణ్ణీ, లోపాముద్రాదేవి అగస్త్యుణ్ణీ, సుకన్యాదేవి చ్యవనుణ్ణీ, సావిత్రీదేవి సత్యవంతుణ్ణీ, శ్రీమతీదేవి కపిలుణ్ణీ, దమయంతీదేవి సౌదాసుణ్ణీ, కేశినీదేవి సగరుణ్ణీ, భీమరాజపుత్రి దమయంతి నైషధుణ్ణీ అనుసరించి సమస్త భోగభాగ్యాలూ అనుభవించినారు. అదేవిధముగా ఇక్ష్వాకువంశశ్రేష్ఠుడు అయిన ఆ రామప్రభువును, నాభర్తను నేను అనుసరించుకొని ఉంటాను" అని చెప్పింది.

ఈ మాటలకు ఆ రాక్షసాంగనలు కోపముతో రెచ్చిపోయినారు. వాండ్లు అందరూ రావణాసురుడి చెప్పుచేతలలో ఉంటూ ఉన్న వాండ్లు. అందువల్ల, వాండ్లు సీతాదేవిని బెదిరించసాగినారు. అక్కడ ఆ శింశుపావృక్షముమీద దాక్కొని ఉన్న హనుమంతుడు ఆ రాక్షసాంగనల బెదిరింపులు అన్నీ మెదలకుండా విన్నాడు. వారిని అందరినీ చూడసాగినాడు.

భయముతో వణికిపోతూవున్న సీతాదేవిచుట్టూ ఆ రాక్షస స్త్రీలు అందరూ మూగినారు. ఎర్రగా వేళ్ళాడుతూ ఉన్న తమ తమ పెదవులను నాలుకతో నాకుకొంటూ

పరమక్రుద్ధులై, చటుక్కున గొడ్డళ్ళను చేతులతో పట్టుకొని, ఈ సీత రావణాసురుడికి భార్యగా ఉండతగనిది అంటూ ఆ భయంకర రాక్షసాంగనలు ఆ సుందరాననను సీతాదేవిని బెదిరించినారు.

ఆమె కన్నీళ్ళు తుడుచుకొంటూ హనుమంతుడు దాక్కొనిఉన్న ఇరుగుడుచెట్టు దగ్గరకు పోయింది. ఆ విశాలాక్షి వెంట ఆ రాక్షసాంగనలున్నూ ఆ శింశుపావృక్షము దగ్గరకు పోయి అమె చుట్టూ మూగినారు. అప్పుడు ఆమె శోకసాగరములో మునిగిపోయింది. మలినాంబరముతో, దీనవదనముతో కృశించిపోయిన దేహముతో ఉన్న ఆ సీతాదేవిని ఆ రాక్షసాంగనలు బెదిరించసాగినారు.

'వినత' అనే ఒక రాక్షసి కోరలతోనూ, అంటుకొనిపోయిన ఉదరముతోనూ కోపము మూర్తీభవించినట్టు భయంకరముగా కనపడుతూ, "ఓ సీతా! నీ భర్తమీద నీకు ఉన్న స్నేహాన్ని మాకు చూపించినావు. చాలు. ఓ మంగళస్వరూపిణీ! అన్ని విషయాలలోనూ అతిగా ఉంటే దుఃఖపడవలసి వస్తుంది. నీ పాతివ్రత్యానికి మేము సంతోషించినాము. నీవు మానవసంబంధము అయిన విధిని పాటించినావు.

"ఓ మైథిలీ! నీ మేలుకోరి చెప్పుతున్నాను, నా మాట విను. నేను చెప్పినట్లు చేయవలెను. రావణాసురుణ్ణి భర్తగా వరించు. అతడు సర్వరాక్షసులకు ప్రభువు. పరమపరాక్రమవంతుడు. రూపసి. దేవతలకు ప్రభువు అయిన దేవేంద్రుడు అంతటివాడు. చతురుడు. త్యాగశీలుడు. సమస్తము అయినవారికీ ప్రియదర్శనుడు. రాముడు మానవుడు. దీనుడు. నీవు వాణ్ణి వదిలిపెట్టు, రావణాసురుణ్ణి ఆశ్రయించు. ఓ వైదేహీ! నీవు దివ్యము అయిన అంగరాగముతోనూ, దివ్యాభరణాలతోనూ అలంకరించుకో. ఇది మొదలుకొని సర్వలోకాలవారికీ అధికారిణివి అయిపో.

"ఓ మంగళాకారా! ఓ వైదేహీ! అగ్నిహోత్రుడికి స్వాహాదేవివలెనూ, దేవేంద్రుడికి శచీదేవివలెనూ నీవు రావణాసురుడికి దేవిగా ఉండు. ఆ దీనుడు రాముడు గతాయువు. వాడితో నీకు ఏమి పని? ఓ సీతా! నీవు నేను చెప్పినట్లు చేయకపోయేట్లయితే ఇప్పుడే నిన్ను మేము అందరమూ భక్షించివేస్తాము" అని చెప్పింది.

'వికట' అనే మరి ఒక రాక్షసి చన్నులూ, పొట్టా వేలాడించుకొంటూ సీతాదేవిని చూచి వేళ్ళు ముడిచి, పిడికిలి చూపించి పెద్ద గొంతుతో, "ఓ దుష్టబుద్ధీ! నీ నోటివెంట వచ్చిన అనేక అప్రియాలను మేము విని జాలివల్లనూ, మెత్తదనమువల్లనూ ఓర్చుకొన్నాము. ఈ కాలానికి తగినట్టు నీ మేలుకోరి మేము చెప్పుతున్నాము. నీవు మా మాటలు వినకుండా ఉన్నావు. సముద్రాన్ని దాటి ఎవడూ ఇక్కడికి రాలేడు. ఇటువంటి చోటికి నిన్ను రావణాసురుడు ఎత్తికొని వచ్చినాడు. అందరూ భయపడే రావణాసురుడి రాజ్యములో ఉన్నావు. అతడు నిన్ను మా దగ్గిర దాచిపెట్టినాడు. నీవు

సురక్షితముగా ఉన్నావు. సాక్షాత్తూ దేవేంద్రుడు వచ్చినా నిన్ను ఇక్కడ నుండి తీసుకొని పోలేడు. ఓ మైథిలీ! నీకు మంచి చెప్పుతున్నాము. మా మాటలు విను. ఎందుకు కన్నీళ్ళు కారుస్తావు? ప్రయోజనము మాలిన దుఃఖము వదిలిపెట్టు. రావణుడితో స్నేహముచేసి సంతోషము అనుభవించు. నీ చిత్తము వచ్చినట్టు రాక్షస రాజుతో క్రీడించు. ఓ భీరూ! స్త్రీలకు యౌవనము అనిత్యము. నీకు ఈ సంగతి తెలిసిందే. నీ యౌవనము అయిపోయే లోపలనే నీవు సుఖము అనుభవించవలెను.

"ఓ మదిరేక్షణా! నీవు మనోహరము అయిన ఉద్యానవనాలలోనూ, పర్వత ప్రాంత వనాలలోనూ రాక్షస ప్రభువుతో హాయిగా విహరించు. ఓ సుందరీ! ఏడువేలమంది స్త్రీలు నీ చెప్పుచేతలలో ఉంటారు. నీకు సేవ చేస్తారు. అతడు సర్వరాక్షసులకూ ప్రభువు. అతణ్ణి భర్తగా వరించు.

"ఓ మైథిలీ! నేను చెప్పినట్టు చేయకపోయినట్లయితే నీ గుండెకాయ పెరికి నేను నమిలివేస్తాను" అని అన్నది.

అంతట 'చండోదరి' అనే మరిఒక రాక్షసాంగన కోపముతో చెలరేగి పెద్ద శూలము తిప్పుతూ, "రాక్షసాంగనలారా! ఈ హరిణలోలాక్షిని, భయముతో చన్నులు కదిలిపోతూఉన్న ఈ సీతను రావణాసురుడు ఎత్తుకొనివచ్చినప్పుడే నేను చూచినాను. దీని ప్లీహాన్నీ, దీని గుండెకాయకు ఆధారముగా ఉండే తామర మొగ్గవంటి మాంసఖండాన్నీ, దీని పేగులనూ, దీని మెదడునూ అప్పుడే తినివేయవలెను అనుకొన్నాను" అని చెప్పింది.

అంతట 'ప్రఘస' అనే రాక్షసి, "ఈ సీత క్రూరురాలు. దీని గొంతు పిసికివేస్తాను. ఎందుకు ఆలస్యము? ఇది చచ్చిపోయిన తరువాత రాజుతో ఈ మానవాంగన చచ్చిపోయింది అని చెప్పుతాను. అప్పుడు రాజు మనలను తినివేయ మంటాడు, సందేహము లేదు" అని చెప్పింది.

'అజాముఖి' అనే రాక్షసి, "మీరు అందరూ ఈ సీతను కోసివేసి సరిసమానము అయిన ముక్కలు చేయండి. మనము అందరమూ పంచుకొని తిందాము. నాకు పోట్లాడటము ఇష్టము లేదు. మంచి మంచి పానీయాలనూ, లేహ్యాలనూ వెంటనే తీసుకొనిరండి" అని చెప్పింది.

'శూర్పనఖ' అనే రాక్షసి, "అజాముఖి చెప్పిందే తనకు నచ్చింది అంటూ, వెంటనే మద్యము తీసుకొని రండి. అది అన్ని దిగుళ్ళూ పోకొట్టుతుంది. మానవ మాంసము తిందాము. ఈ లంకాపట్టణ పశ్చిమ ద్వారము దగ్గిర ఉన్న నికుంభిలాదేవత ఎదుట నృత్యం చేద్దాము" అన్నది.

ఇట్లా ఆ ఘోర రాక్షసాంగనలు బెదిరిస్తూ ఉంటే దేవకన్యవంటి ఆ సీతాదేవి ధైర్యము కోల్పోయింది, ఏడ్చింది.

25

క్రూరాత్మలు అయిన ఆ రాక్షసాంగనలు అంత పరుషముగానూ, అంత దారుణముగానూ అన్ని మాటలు అంటూవుంటే, ఆ జనకాత్మజ సీతాదేవి ఏడ్చింది. పరమ భయముతో కన్నీళ్ళు కారుస్తూ గద్గద కంఠముతో, "ఓ రాక్షసాంగనలారా! మానవాంగన రాక్షసుడికి భార్య కాజాలదు. మీ మాట నేను వినను. మీరు అందరూ కోరుకొంటున్నట్లు నన్ను చంపివేయండి. భక్షించండి" అని సీతాదేవి చెప్పింది.

దేవకన్నెవంటి ఆ సీతాదేవిని రావణాసురుడు బెదిరించి పోయినాడు. ఆమెచుట్టూ మూగిన రాక్షస స్త్రీలు అందరూ అట్లా బెదిరించినారు. దుఃఖముతో బాధపడుతూ ఆమెకు మనఃస్వాస్థ్యము తప్పిపోయింది. మందలోనుంచి తప్పిపోయి మహారణ్యములో తోడేళ్ళపాలు అయిన లేడివలె ఆమె తన దేహాన్ని ముణుచుకొని వణకడము మొదలు పెట్టింది. హనుమంతుడు దాక్కొని కూర్చున్న ఇరుగుడు చెట్టు సమీపములో పూలుపూసిన పెద్ద అశోకవృక్షము దగ్గిరకుపోయి దాని కొమ్మను పట్టుకొని నిలుచుని సీతాదేవి తన పెనిమిటిని గురించి ఆలోచించ సాగింది. కన్నులవెంట కారుతున్న కన్నీళ్ళతో తన పీనస్తనాలను తడపివేస్తూ, రాముణ్ణి గురించి ధ్యానిస్తూ అంతులేకుండా దుఃఖపడ్డది.

ఆ రాక్షస స్త్రీలకు భయపడి వివర్ణము అయిపోయిన ముఖముతో గజ గజ వణుకుతూ ఉంటే, ఆమె పెద్ద పొడుగాటి జడ, పాకుతూ ఉన్న పామువలె కనిపించింది. ఆమె నిట్టూర్పులు విడుస్తూ, కన్నీరు కారుస్తూ, "ఓ రామా! ఓ లక్ష్మణా! అయ్యో కౌసల్యా! అయ్యో సుమిత్రా అని అరుస్తూ, ఏడుస్తూ, 'ఈ లోకములో స్త్రీలుకానీ పురుషులుకానీ కాలము రానిదే చనిపోరు' అని తెలిసినవారు చెప్పే లోకోక్తి యథార్థము. నన్ను ఆ క్రూర రాక్షసాంగనలు ఇట్లా కష్ట పెట్టుతున్నారు. రాముణ్ణి ఎడబాసి ఒక ముహూర్తము అయినా జీవించలేని నేను, దుఃఖముతో ఇంకా జీవించే ఉన్నాను. నేను స్వల్ప పుణ్యము చేసి ఉంటాను. బరువు ఎక్కువయి సముద్రమధ్యములో గాలి ఉరవడికి మునిగిపోతూ ఉన్న నావవలె, నేను ఈ రాక్షస స్త్రీలమధ్య అనాథ అయి నాశనము అయిపోతున్నాను. ఈ రాక్షసాంగనల అధీనము అయిపోయినాను. నా పెనిమిటిని ఎడబాసినందువల్ల నీళ్ల ఒరిపిడికి ఏటిగట్టువలె నేను నానాటికి క్షీణించిపోతున్నాను. ఆ పద్మపత్రాయతాక్షుణ్ణి, ఆ సింహవిక్రాంతగామిని, ఆ ప్రియ వాదుణ్ణి, ఆ కృతజ్ఞుణ్ణి, నా నాథుణ్ణి రామప్రభువును పుణ్యాత్ములు చూడగలుగుతారు.

తీక్షణము అయిన విషము తాగినవారు జీవించడము దుర్లభము. అదేవిధముగా, ఆ విదితాత్ముడు రామప్రభువు లేకుండా నేను బ్రతికి వుండడము ఉత్తది.

"నేను ఇదివరకు జన్మాంతరములో ఎటువంటి పాపము చేసినానో, ఇప్పుడు ఇటువంటి ఘోరమూ, దారుణమూ అయిన దుఃఖము అనుభవిస్తున్నాను. ఈ మహా దుఃఖముతో జీవించి ఉండడముకన్నా చచ్చిపోవడము మంచిది అనిపిస్తూ ఉంది. ఇటువంటి రాక్షసస్త్రీలు నన్ను కావలి కాస్తున్నారు. నేను ఇకను రామప్రభువును చేరడము ఉత్తది. నా చిత్తము వచ్చినట్లు జీవించడానికికానీ, చచ్చిపోవడానికికానీ అలవికాకుండా ఉంది. ఛీ! ఛీ! ఈ మానవజన్మ, ఛీ! ఛీ! ఈ పరాధీనత" అంటూ ఏడ్చింది.

26

సీత ఆక్రోశము

ఆ జనకాత్మజ, ఆ బాల సీతాదేవి తలవంచుకొని ముఖము అంతా కన్నీళ్ళతో తడిసిపోయి ఏడుస్తూ పిచ్చి ఎత్తిన దానివలెనూ, మద్యము తాగి మైమరచిపోయినదానివలెనూ, అలసట పోవడానికి నేలమీద పొర్లాడుతున్న ఆడుగుర్రముపిల్లవలెనూ నేలమీద పొర్లాడుతూ, "అయ్యో! నా ప్రభువు ఏమరుపాటు వల్లనో ఏమో, తిరిగిరాలేదు. నేను దుఃఖముతో అరుస్తూ ఉంటే, ఈ కామరూపుడు నన్ను బలవంతముగా ఎత్తుకొని వచ్చినాడు. నేను ఇప్పుడు ఈ రాక్షసాంగనల వశము అయిపోయినాను. వీండ్ల దారుణము అయిన బెదిరింపులు సహించలేకుండా ఉన్నాను. ఆయనను గురించి ఆలోచిస్తూ ఈ మహాదుఃఖము అనుభవించలేను. ఆ మహారథుణ్ణి, నా నాధుణ్ణి వదిలిపెట్టి ఈ రాక్షసాంగనల మధ్యను నేను జీవించి ఉండడము దేనికి? నాకు ధనము ఎందుకు? ఆభరణాలు ఎందుకు? ఇంత దుఃఖము వచ్చినా నా గుండె బద్దలైపోకుండా ఉంది. నా గుండె రాయి అయి ఉంటుంది. అంతే, అది శిథిలము అయిపోదు, చావదు.

"ఆ నా నాధుడు లేకుండా నేను ఒక్క ముహూర్తము అయినా బ్రతికి ఉండకూడదు. అటువంటిది నా ప్రాణాన్ని కాపాడుకొంటున్నాను. పాపపు బ్రతుకు బ్రతుకుతున్నాను. నేను దుష్టురాలను. పతివ్రతను కాను. ఛీ! ఛీ! నాల్గు సముద్రాలూ ఎల్లలుగా ఉన్న ఈ భూమికి అంతా ఆ మహాత్ముడు ప్రభువు. ప్రియంవదుడు. ఆ నా ప్రియుడు లేకుండా నేను జీవించి ఉండడము ఎందుకు? సుఖపడడము ఎందుకు? దేని మీదను అయినా నాకు ఆసక్తి ఎందుకు?" అనుకొని, ఎదుట ఉన్న రాక్షసాంగనలను చూచి, "ఓ రాక్షస స్త్రీలారా! నేను నా దేహాన్ని వదిలి

పెట్టుతున్నాను. మీరు నా దేహాన్ని బద్దలు చేసుకోండి. భక్షిస్తే భక్షించివేయండి. పెనిమిటిని ఎడబాసిన దుఃఖము నేను అట్టేకాలము ఓర్చుకోలేను. నేను ఆ దుష్టుణ్ణి, నిశాచరరాజును, రావణాసురుణ్ణి నా ఎడమ కాలితో నయినా తాకను. ఇకను వాణ్ణి కామించడడము ఏమిటి ? వాడి పాపిష్ఠి స్వభావమునుంచి నన్ను వాడు ప్రార్థించినాడు. నేను వాణ్ణి తిరస్కరించినాను. అది వాడికి తెలియలేదు. వాడూ, వాడి కులమూ నాశనము అయిపోతుంది అనే సంగతి వాడికి తెలియడము లేదు.

"ఓ రాక్షసాంగనలారా! మీరు నన్ను నరికివేయండి. బద్దలు చేసి వేయండి. ముక్కలు ముక్కలు చేసి మండేమంటలలో కాల్చి వేయండి. నేను రావణుణ్ణి అపేక్షించను. మీరు ఎంతసేపు అరిచినా ప్రయోజనము లేదు. ఆ రామప్రభువు సమస్త సద్గుణవంతుడు అని ప్రసిద్ధి కెక్కినాడు. ప్రాజ్ఞుడు. కృతజ్ఞుడు. దయామయుడు. సదాచార సంపన్నుడు. నా దౌర్భాగ్యమువల్ల నన్ను దయతలచకుండా ఉన్నాడు అనుకొంటున్నాను.

"ఆ మహాపరాక్రమవంతుడు ఒక్కగాను ఒక్కడు, జనస్థానములో పధ్నాలుగువేలమంది రాక్షసులను సంహారము చేసివేసినాడు. ఆ రామప్రభువు నన్ను ఎందుకు రక్షించడు? నన్ను ఈ రావణాసురుడు నిరోధిస్తున్నాడు. వీడు నా భర్త ఎదుట అల్పవీర్యుడు. నా భర్త సర్వసమర్థుడు. పోరాటములో వీణ్ణి సంహారము చేసివేస్తాడు. దండకారణ్యములో నా నాథుడు విరాధుడు అంతటివాణ్ణి వధించివేసినాడు. ఆ మహానుభావుడు నన్ను ఎందుకు రక్షించడు? ఈ లంకాపట్టణము సముద్రము నడుమ ఉంది, ఇక్కడికి రావటము అలవికాదు అనుకొంటున్నారు ఏమో? ఆ రామప్రభువు బాణాలకు ఏదీ అడ్డముకాదు.

"ఆ పరాక్రమవంతుడు రామప్రభువు తన ప్రియభార్యను రావణాసురుడు ఎత్తుకొనిపోతే, ఎందుకు ఆమెను రక్షించకుండా ఉన్నాడు? కారణము ఏమి అయి ఉంటుంది? ఇక్కడ ఉన్నట్టు ఆయన ఎరుగడు ఏమో! లక్ష్మణుడు కూడా ఊహించలేదు ఏమో! ఎరిగి ఉన్నట్లయితే, ఈ రావణాసురుణ్ణి ఎదిరించకుండానూ, చంపివేయకుండానూ ఊరక ఉండరు. నన్ను రావణాసురుడు ఎత్తుకొని పోయినాడు అని ఆ రామప్రభువుతో చెప్పడానికి గద్దలరాజు ఆ జటాయువు అయినా లేడు. పోరాటములో రావణాసురుడు ఆ ముసలివాణ్ణి చంపివేసినాడు. జటాయువు అంత ముసలివాడు అయినప్పటికిన్నీ, రావణాసురుడితో నిలబడి ఘోరముగా పోరాడినాడు. అతడు మహాదొడ్డవాడు.

"నేను ఇక్కడ ఉన్నట్టు ఆ రామప్రభువుకు తెలిసి ఉన్నట్లయితే క్రుద్ధుడు అయిపోయి తన బాణాలతో ఈ లోకములో ఒక్క రాక్షసుణ్ణి అయినా బ్రతకనిచ్చేవాడు కాదు. ఈ లంకాపట్టణాన్ని ఊదివేసి ఉండేవాడు. మహోదధిని ఎండకొట్టేవాడు.

రావణాసురుణ్ణి నామరూపాలు లేకుండా చేసివేసేవాడు. మొగుళ్ళుపోయిన రాక్షసాంగనలు ఇంటింటా ఇప్పుడు నావలె ఏడుస్తూ ఉండేవాండ్లు. రామలక్ష్మణులు లంకాపట్టణము అంతా వెతికి రాక్షసులను అందరినీ నాశనము చేసి ఉండేవాండ్లు. ఆ అన్నదమ్ముల కంటపడ్డ శత్రువు ఒక ముహూర్తముసేపు అయినా బ్రతకటము అరుదు. త్వరలోనే ఈ లంకాపట్టణము వీధులలో చితుల పొగలతోనూ, గద్దలతోనూ స్మశానమువలె అయిపోతుంది. అచిరకాలములోనే నా మనోరథము ఈడేరుతుంది. సర్వ రాక్షసులూ నాశనము అయిపోతారు. మీ దుర్మార్గ ప్రవర్తనమే తెలియ చెప్పుతూ ఉంది. అంతేకాదు, ఇప్పుడు ఇక్కడ అనేక అశుభ నిమిత్తాలు కనపడుతున్నవి. తొందరలోనే ఈ లంకాపట్టణము సర్వనాశనము అయిపోతుంది.

నీచుడూ, పాపాత్ముడూ అయిన రావణాసురుడు చచ్చిపోగానే, ఇంతవరకూ ఎదిరించ నలవికాకుండా ఉన్న ఈ లంకాపట్టణము, పెనిమిటి పోయిన ఆడుదాని మాదిరిగా అయిపోతుంది. రాజు చచ్చీ, రాక్షసులు అందరూ నాశనము అయిపోయిన తరువాత ముండమోపులు అయ్యే రాక్షసాంగనలతోపాటు ఈ లంకాపట్టణమున్నూ ముండమోస్తుంది. ఏ మంగళోత్సవమూ ఉండదు. అచిరకాలములో ఇక్కడ ఇంటింటా రాక్షసాంగనలు దుఃఖార్తలు అయిపోతారు. వాండ్ల రోదన ధ్వనులు మిన్ను అంటుతవి.

"ఈ రావణాసురుడు నన్ను దొంగిలించుకొని వచ్చి ఈ లంకా పట్టణములో ఉంచినాడు అని నా నాథుడికి, ఆ రక్తాంతలోచనుడికి రామ ప్రభువుకు తెలిసిన ఉత్తరక్షణాన, ఈ లంకాపట్టణము రామ బాణాలతో దగ్ధము అయిపోతుంది. పెద్ద చీకట్లు కమ్ముకొంటవి. మేటి రాక్షసులు అందరూ సంహారము అయిపోతారు. పట్టణ ప్రభలు మాసిపోతవి.

"ఆ క్రూరుడు, ఆ నీచుడు రావణాసురుడు నాకు పెట్టిన గడువు కాలము అయిపోవచ్చింది. ఈ రాక్షసులు ఎటువంటి పాపకార్యానికి అయినా ఒడికట్టుతారు. ఇది ధర్మము, ఇది అధర్మము అని కానీ; ఇది కార్యము, ఇది అకార్యము అని కానీ వీరికి విచక్షణా జ్ఞానము లేదు. ఇప్పుడు మహోత్పాతము సంభవిస్తుంది. ఈ రాక్షసులు మాంసాశనులు. రావణాసురుడు తన ప్రాతఃకాల భోజనానికి నన్ను తప్పకుండా చంపించి వేస్తాడు.

"ఆ నా ప్రభువును, ఆ ప్రియదర్శనుణ్ణి ఎడబాసిన నేను, ఇట్లా దుఃఖపడడము తప్ప ఏమి చేయగలను? నా పెనిమిటిని వదిలిపెట్టి నేను ఇట్లా ఉండడముకన్నా, ఇక్కడ ఎవడు అయినా విషము ఇచ్చేవాడు ఉంటే అది తాగి చచ్చిపోతే వెంటనే యమధర్మరాజు దర్శనము అయినా అవుతుంది.

"ఆ లక్ష్మణుడికిగానీ, నా నాధుడికిగానీ నేను బ్రతికి ఉన్నట్లు తెలిసి ఉండదు. నేను బ్రతికి ఉన్నాను అని తెలిసి ఉన్నట్లయితే నా కోసము ఆ అన్నదమ్ములు ఈ భూమిని అంతా గాలించి వెదికేవాండ్లు. అట్లా చేయలేదు. కనుక నేను జీవించి ఉన్న సంగతి వారికి తెలియదు.

"ఆ పరాక్రమశాలి రామప్రభువు నా దుఃఖమునుంచి ఈ భూమిమీద తన దేహాన్ని వదిలిపెట్టి దేవలోకము పోయివుంటాడు. అంతే. ఆ రాజీవలోచనుణ్ణి నా నాథుణ్ణి రామప్రభువును చూచే గంధర్వులూ, దేవతలూ, సిద్ధులూ, పరమర్షులూ ధన్యులు.

"అట్లా అయివుండక పోయినట్లయితే ఆ ధర్మకాముడికి, ఆ ధీమంతుడికి ఆ రాజర్షికి, పరమాత్మస్వరూపుడు అయిన ఆ రామప్రభువుకి, భార్య అయిన నాతో ఏ ప్రయోజనమూ లేదు ఏమో! ఇంతకూ ఎదట కంటికి కనపడేవారిమీదనే స్నేహము ఉంటుంది. కంటికి కనపడనివారి మీదనే స్నేహము ఉండదు. కాదు కాదు. కృతఘ్నులు మాత్రమే పూర్వ స్నేహాన్ని విస్మరిస్తారు. రామప్రభువు అటువంటివాడు కాడు. స్నేహాన్ని మరచిపోడు. అయితే నేను ఆడుదానిని. రామప్రభువును ఎడబాసి నవసిపోతున్నానే! నేను ఏమైనా పాపాలు చేసినానేమో లేక నా దౌర్భాగ్యమో!

"ఆ మహాత్ముణ్ణి, ఆ దోషరహితుణ్ణి, ఆ శూరుణ్ణి, ఆ శత్రుసంహారకుణ్ణి రామప్రభువును వదిలిపెట్టి జీవించి ఉండడముకన్నా చచ్చిపోవడము మేలు.

"ఒకవేళ ఆ పురుషోత్తములు, ఆ అన్నదమ్ములు రామలక్ష్మణులు కందమూలాలు తింటూ, శస్త్రాస్త్ర సన్యాసము చేసి మహారణ్యాలలో తిరుగుతూ ఉన్నారేమో! అట్లా కాకపోయినట్లయితే దురాత్ముడు రావణాసురుడు కపటోపాయముతో ఆ అన్నదమ్ములను చంపివేసినాడేమో!

"కాలము ఇట్లా గడిచిపోతున్నది. ఎన్నివిధాల ఆలోచించినా చచ్చిపోవడమే మంచిది అనిపిస్తూ ఉంది. అయితే ఇంత దుఃఖముతో బాధపడుతూ, ఇంత దురవస్థలో ఉన్న నాకు చావు రాకుండా ఉంది.

"మహాత్ములూ, మహాభాగులూ, పాపరహితులూ, జితేంద్రియులూ అయిన మహామునులకు ఇది ప్రియమూ, ఇది అప్రియమూ అనే భేదము ఉండదు. వారికి సుఖదుఃఖాలు సరిసమానము. దేహాభిమానమునుంచి ప్రియాప్రియాలు, సుఖదుఃఖాలు కలుగుతవి. అందువల్ల, దేహాభిమానము వదిలిన మహామునులు ధన్యులు. వారే మహాత్ములు. వారికి నమస్కారము చేస్తున్నాను.

"నేను ఆ విదితాత్ముణ్ణి, ఆ ప్రియార్హుణ్ణి ఎడబాసి పాపిష్ఠి రావణాసురుడి చేతిలో చిక్కినాను. ఇక నేను బ్రతుకను. నా ప్రాణము వదులుతాను" అని సీతాదేవి చెప్పింది.

27

త్రిజట స్వప్నము

సీతాదేవి చెప్పిన మాటలకు ఆ భయంకర రాక్షసాంగనలకు ఒళ్ళెరుగని కోపము వచ్చింది. వారిలో కొంతమంది ఆ మహాబలవంతుడికి రావణాసురుడికి ఆ విషయము విన్నవించడానికి అక్కడనుంచి వెళ్ళిపోయినారు.

ఆ ఘోరదర్శనలలో కొంతమంది సీతాదేవి దగ్గరకుచేరి అదివరకటి మాదిరిగా మళ్ళీ అతిపరుషముగానూ, "ఓ దుష్టురాలా! ఓ పాపిష్ఠురాలా! ఓ సీతా! నిన్ను ఇప్పుడే, ఈనాడే చీల్చివేసి నీ మాంసాన్ని మా చిత్తము వచ్చినట్టు తినివేస్తాము" అని బెదిరించినారు.

అంతవరకూ పడుకొని నిద్రపోతూ ఉన్న ముసలి రాక్షసి త్రిజట అనేది లేచి ఆ రాక్షసాంగనలను అందరినీ చూచి, "దుష్టాంగనలారా! నన్ను తినండి. జనకరాజసుతను, దశరథమహారాజు కోడలిని, లోకము అంతా ప్రేమించే ఈ సీతాదేవిని భక్షించవద్దు. రాక్షస నాశనమూ, ఈ సీతాదేవి పెనిమిటికి అభ్యుదయమూ అయ్యే కల నాకు వచ్చింది. అతి భయంకరము అయిన కల. నా ఒళ్ళు గగురుపాడిచింది" అని చెప్పింది.

ఆ త్రిజట చెప్పింది విని ఆ రాక్షసాంగనలు భయపడిపోయినారు. "ఏమిటి! ఏమి కల వచ్చింది? చెప్పు చెప్పు " అన్నారు.

ఆ త్రిజట ఈవిధముగా చెప్పడము మొదలు పెట్టింది: "ఏనుగు దంతాలతో చేసిన దివ్యము అయిన శిబికను ఒకదాన్ని ఒక వెయ్యిహంసలు ఆకాశమార్గాన మోసుకొని వచ్చినవి. రాముడు తెల్లటి పూలదండలూ, తెల్లటి వస్త్రాలూ ధరించి లక్ష్మణుడితో కూడా ఆ పల్లకిలో కూర్చుని వచ్చినాడు. సీతాదేవి తెల్లటి చీరకట్టుకొని సముద్రము మధ్యను శ్వేతపర్వతముమీద కూర్చుని ఉంది. సూర్యుడితో వెలుతురువలె, రాముడితో సీతాదేవి అప్పుడు కనిపించింది.

"నాలుగు దంతాలతో పెద్ద పర్వతము అంత ఏనుగును రాముడు లక్ష్మణుడితోకూడా ఎక్కడము నేను చూచినాను. దేహకాంతులతో తేజరిల్లుతూ తెల్లటి పూలదండలతోనూ, తెల్లటి వస్త్రాలతోనూ భాసిస్తూ ఉన్న ఆ అన్నదమ్ములు సీతాదేవి దగ్గరకు పోయినారు. శ్వేతపర్వతశిఖర సమీపాన ఆకాశములో రాముడు

ఎక్కిన ఏనుగును సీతాదేవి ఎక్కింది. అంతట ఆ కమలలోచన పెనిమిటి ఒడిలోనుంచి లేచి సూర్యచంద్రులను పట్టుకొన్నది. అది నేను చూచినాను. ఆ అన్నదమ్ములూ, ఆ విశాలాక్షి కూర్చున్న ఆ ఏనుగు లంకాపట్టణము మీద ఆకాశములో కనిపించింది.

"అంతట తెల్లటి ఎనిమిది ఎద్దులు కట్టిన రథముమీద రాముడు సీతాదేవితో కూడా ఇక్కడికి వచ్చినాడు. ఆ పురుషోత్తముడు రాముడు సీతాదేవితోనూ, తమ్ముడు లక్ష్మణునితోనూ సూర్యసమానము అయిన దివ్య పుష్పక విమానము ఎక్కి తూర్పు దిక్కుగా పోయినాడు. మహావిష్ణువువంటి ఆ పరమపరాక్రమవంతుణ్ణి రాముణ్ణి సీతాదేవితోనూ, లక్ష్మణుడితోనూ నేను అట్లా కలలో చూచినాను.

"స్వర్గాన్ని పాపాత్ములు సంపాదించలేరు. అదేవిధముగా ఆ మహా తేజోవంతుణ్ణి రాముణ్ణి సురాసురులుకానీ, రాక్షసులుకానీ, మరి ఎవరు అయినాకానీ జయించలేరు.

"రావణాసురుడు గన్నేరు పూలదండలు వేసుకొని, ఎర్రటి వస్త్రము కట్టుకొని దేహము అంతా నూనెతో తడిసిపోయి తప్పతాగి కైపు ఎక్కి నేలమీద పడిపోయినాడు. అంతేకాదు, రావణాసురుడు పుష్పక విమానములో నుంచి నేలకూలినాడు. అప్పుడు అతని నెత్తిమీద వెంట్రుకలు లేవు. నల్లటిగుడ్డ కట్టుకొని ఉన్నాడు. ఒక ఆడుది అతనిని పడలాగుకొని పోతూ ఉంది. రావణాసురుడు ఎర్రటి పూల దండలు వేసుకొని, రక్తచందనము ఒంటికి పూసుకొని నూనె తాగుతూ, నవ్వుతూ, నాట్యము ఆడుతూ, పిచ్చి ఎత్తినవాడివలె వికృత చేష్టలు చేస్తూ గాడిదలు కట్టిన రథము యెక్కి పోవడము చూచినాను. అతడు ఆ రథము దిగి, ఒక గాడిదను ఎక్కి అమితవేగముగా దక్షిణ దిక్కుకు పోతున్నాడు. అట్టా పోతూపోతూ భయము వేసి తెలివితప్పి ఆ గాడిదమీదనుంచి అతడు తల్లకిందులుగా నేలకూలినాడు. చటుక్కున లేచి అడుగులు తడబడగా, భయమునుంచీ, కైపునుంచీ దేహము స్వాధీనము తప్పిపోయింది. కట్టుకొన్న గుడ్డలు ఊడిపోయినవి. పిచ్చెత్తినవాడివలె పిచ్చిమాటలు మాట్లాడుతూ దుర్గంధముతో దుస్సహముగానూ, భయంకరముగానూ, చీకటిగానూ, నరకము మాదిరిగానూ ఉన్న అమేధ్యపు బురదగుంటలో పడి మునిగిపోయినాడు. ఎర్రచీర కట్టుకొని దేహము అంతా బురదపూసికొని ఉన్న కారునలుపు అడుది ఒకతె, రావణాసురుడి మెడకు తాడుకట్టి దక్షిణ దిక్కుకు లాగుకొని పోతూ ఉంది.

"అదే విధముగా కుంభకర్ణుడున్నూ కనిపించినాడు. రావణాసురుడి కొడుకులు అందరూ నూనెతో తడిసిపోయినారు. రావణాసురుడు పందినీ, ఇంద్రజిత్తు మొసలినీ, కుంభకర్ణుడు ఒంటెనూ ఎక్కి దక్షిణ దిక్కుగా పోయినారు.

"తెల్లటి పూలదండలతోనూ. తెల్లటి వస్త్రాలతోనూ, తెల్లటి గంధము మైపూతతోనూ విభీషణుడు ఒక్కడూ కనిపించినాడు. అతనికి శ్వేతచ్ఛత్రము పట్టినారు. శంఖాలు పూరించినారు. దుందుభులు మోగించినారు. నృత్తగీత వాద్య ధ్వనులు చెలరేగినవి. మేఘ గంభీర ధ్వనులు చేస్తూ దివ్యము అయిన నాలుగు దంతాల ఏనుగు ఒకటి సమస్తాలంకారాలతోనూ వచ్చింది. విభీషణుడు తన నలుగురు మంత్రులతో కూడా ఆ ఏనుగును ఎక్కి ఆకాశములో తిరగటము మొదలుపెట్టినాడు.

"రాక్షసులు అందరూ ఎర్రబట్టలు కట్టుకొని, ఎర్రటి పూలదండలు వేసుకొని వాద్యాలు వాయిస్తూ, పాటలు పాడుతూ, నూనె తాగుతూ ఉన్నారు. రమణీయము అయిన ఈ లంకాపట్టణము బహిర్ద్వారాలు, గోపురాలు కూలిపోయి గుర్రాలతోనూ, రథాలతోనూ, ఏనుగులతోనూ సముద్రములో మునిగిపోయింది.

"రావణాసురుడు ఏలుతూ ఉన్న ఈ లంకా పట్టణానికి రామదూతగా ఒక వానరుడు వచ్చినాడు. వాడు మహాబలవంతుడు. ఆ వానరుడు ఈ లంకాపట్టణాన్ని దహించి వేయడము నేను చూచినాను. రాక్షస స్త్రీలు నూనె తాగి నాట్యము ఆడుతూ, వికటముగా నవ్వుతూ, పెద్ద పెట్టున కేకలువేస్తూ భస్మరాసులు అయిపోయిన ఈ లంకాపట్టణములో తిరగసాగినారు. కుంభకర్ణుడు మొదలగు రాక్షసవీరులు ఎర్రటి బట్టలు కట్టుకొని పేడమడుగులో పడిపోయినారు.

"ఓ రాక్షసస్త్రీలారా! మీరు అందరూ ఇక్కడనుంచి తొలగిపోవలెను. లేకపోతే నాశనము అయిపోతారు. రాముడు ఈ సీతాదేవి దగ్గరకు వచ్చి తీరుతాడు. అతడు కుపితుడు అయిపోయి రాక్షసులతోపాటు మిమ్మలనూ చంపివేస్తాడు. ఈ సీతాదేవి లోకపూజ్యురాలు, ఆ రాముడి ప్రియురాలు. ఈమె అతనిని అనుసరించి వనవాసము చేయడానికి వచ్చింది. మీరు ఈమెను బెదిరించి బాధపెట్టినారు అని ఆ రాముడు తెలుసుకొంటాడు. మిమ్మలను అందరినీ చంపివేస్తాడు. కనుక, మీరు ఇకను క్రూరవాక్యాలు కట్టిపెట్టవలెను. మంచి మాటలు ఈ సీతాదేవితో చెప్పండి. మనము సీతాదేవిని బ్రతిమిలాడికొందాము. ఇదే తరణోపాయము అని నాకు తోస్తూ ఉంది. ఇప్పుడు సీతాదేవి అనుభవిస్తున్న దుఃఖము అంతా తీరిపోతుంది. ఈమె పెనిమిటి తప్పకుండా వస్తాడు. ఈమె ఉత్తమోత్తమము అయిన సంతోషము అనుభవిస్తుంది.

"ఓ రాక్షసాంగనలారా! ఈమె ఏమి అనుకుంటుందోను అనుకోవడమువల్ల లాభము లేదు. ఈమెను ప్రార్థించండి. రామునినుంచి రాక్షసులకు ఘోరము అయిన ఆపదలు రాబోతున్నవి. ఓ స్త్రీలారా! ఈ జనకపుత్రికి మొక్కండి. ఈమెను

ప్రసన్నురాలుగా చేసుకోండి. మీరు మహత్తరము అయిన ఆపదలపాలు కాకుండా మిమ్ములను కాపాడే సామర్థ్యము ఈమెకు మాత్రమే ఉంది. నా కల యథార్థము అవుతుంది. ఈ విశాలాక్షి అవయవాలు ఏవీ విరూపము కాలేదు. ఇప్పుడు ఈమెలో దుఃఖలక్షణాలు కొంచెము అయినా కనపడడము లేదు. ఈమె దేహకాంతి మాత్రము కొస్త మాసిపోయింది. ఈమె దివ్యభోగాలు అనుభవించవలసింది. ఇట్లా దుఃఖాలపాలు కావలసింది కాదు. ఈమె ఇప్పుడు దుఃఖము అనుభవిస్తూ ఉంది.

"మన రాక్షసరాజు వినాశమూ, రాముడి విజయమూ, వైదేహి అభీష్ట సిద్ధీ మనము త్వరలోనే చూస్తాము. ఈ సీతాదేవికి సంతోష సమయము సంప్రాప్తము కాబోతున్నదని తెలియచెప్పడానికే నాకు ఈ కలవచ్చింది. అదిగో, ఈ పద్మపత్రాయతాక్షి ఎడమకన్ను అదురుతూ ఉంది. అంతేకాదు, ఈ వైదేహి ఎడమ భుజము ఏ కారణము లేకుండానే గగురుపాడిచినట్టు వణకుతూ ఉంది. అందువల్ల, రాముడు త్వరలోనే వస్తాడు అని తెలుస్తూ ఉంది.

"అదుగో, పింగళపక్షి చెట్టుకొమ్మమీద గూటిలో కూర్చుని పదే పదే మహా మధురముగా కూస్తూ ఉంది. అంటే, రానున్న రాముడికి స్వాగతము చెప్తుతూ, మాటిమాటికీ సంతోషాన్ని వెల్లడిస్తూ ఉంది. కాబట్టి, రాముడు త్వరలోనే వస్తాడు" అని త్రిజట చెప్పింది.

28

ఆ రాక్షస ప్రభువు రావణాసురుడు వెళ్ళిపోతూ చెప్పిన మాటలకు దుఖముతో బాధపడుతూ, అడవిమధ్యను సింహము ఎదురు అయిన ఆడ ఏనుగువలె సీతాదేవి భయపడిపోయింది. చుట్టూ మూగిన రాక్షసాంగనల మాటలకూ, రావణాసురుడి బెదిరింపులకూ ఆ భీరువు, విజనారణ్య మధ్యములో వదిలిపెట్టిపోయిన చిన్న కన్నె మాదిరిగా ఏడ్చింది.

అంతట ఆమె తనలో, "నన్ను ఇట్లా అవమానిస్తూ ఉంటే క్షణకాలము అయినా నేను బ్రతికి ఉండకూడదు. అయ్యో, నాకు చావు రాకుండా బ్రతికి ఉన్నానే! కాలము రానిదే చావు రాదు అని పెద్దలు చెప్పే మాట నిజము కాబోలు. నా సంతోషము అయిపోయింది. నా హృదయము దుఃఖముతో కొట్టుకులాడుతూ ఉంది. వజ్రాయుధముతో కొట్టిన పర్వత శిఖరమువలె ముక్కలు ముక్కలు అయిపోకుండా నా గుండె స్థిరముగా ఉంది. చూడటానికి రోత వేసే రావణాసురుడు నన్ను ఎట్లాగూ చంపివేస్తాడు. అందువల్ల, నా అంతట నేను చచ్చిపోతే దోషము ఏమీలేదు. యథార్థముగా దోషము లేదు. బ్రతికి ఉండవలెను అనుకొనేట్లయితే నా

మనస్సు రావణాసురుడికి ఇవ్వవలెను. ద్విజుడు అద్విజుడికి మంత్రము ఎన్నడూ చెప్పడు. నేనూ అదేవిధముగా నా మనస్సు వాడికి ఎంతమాత్రమూ ఇవ్వను. రావణాసురుడు నాకు పెట్టిన గడువుకాలము లోపల ఆ లోకనాథుడు రామప్రభువు రాకపోయేట్లయితే, గర్భములో చనిపోయిన శిశువును శస్త్రకుడివలె పదును అయిన కత్తులతో నా అవయవాలను రాక్షసులు తప్పకుండా కోసివేస్తారు. ఇంతకూ రెండు మాసాలూ గడచిపోతవి. ఎంతోకాలమునుంచీ దుఃఖము అనుభవిస్తూ ఉన్నప్పటికిన్నీ రాజాపరాధముచేసినందువల్ల ప్రాతఃకాలాన చంపివేయడానికి కట్టివేసిన దొంగ అనుభవించేటంత దుఃఖము నేను ఇప్పుడు అనుభవించవలసివచ్చిందే, అయ్యో!

"ఓ రామా! ఓ లక్ష్మణా! ఓ సుమిత్రా! రామప్రభువును కన్న ఓ కౌసల్యా! నేను మందభాగ్యురాలను. ఉప్పెనగాలికి మహాసముద్రములో నౌకవలె నేను ఇప్పుడు కొట్టుకులాడుతున్నాను. పిడుగుపాటుకు రెండు ఉద్దండము లయిన సింహాలు చచ్చిపోయినట్లు, జింకరూపము ధరించిన ఆ రాక్షసుడి చేతిలో నా నుంచి ఆ రాజపుత్రులు రామలక్ష్మణులు చనిపోయినారు ఏమో! అంతే అయి ఉంటుంది. యముడే అప్పుడు జింకరూపము ధరించి నన్ను వ్యామోహపెట్టి ఉంటాడు. అవును, అంతే! నా పెనిమిటిని పొమ్మన్నాను. నేను మూఢురాలను. ఆయన తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి ఉండనీయకుండా పంపించివేశాను. ఓ రామా! ఓ సత్యవ్రతా! ఓ దీర్ఘబాహూ! నీవు నిండుచంద్రుడివంటివాడవు. ప్రాణికోటికి మేలు చేసేవాడవు. అందరినీ సంతోషపెట్టేవాడవు. నేను ఇప్పుడు రాక్షసుల చేతిలో చావపోతున్నట్టు తెలియదే!

"ఓ ప్రభూ! మీరు తప్ప నాకు మరి ఒక దైవము లేకపోవడమూ, నా ఈ ఓర్పూ, ఇట్లా నేను నేలమీదపడి ఉండడమూ, ధర్మము తప్పకుండా ఉండడమూ, నా పాతివ్రత్యమూ కృతఘ్నుడికి చేసిన ఉపకారము వలె విఫలమేనా ?

"ఓ నాథా! మిమ్ములను ఎడబాసినందువల్ల నేను కృశించిపోయినాను. నా దేహము వివర్ణము అయిపోయింది. మిమ్ములను చేరగలను అనే ఆశ ఇప్పుడు నిరాశ అయిపోయింది. ఇంతకాలమూ నేను పాటించిన ధర్మమూ వ్యర్థమేనా? నా పాతివ్రత్యమూ నిరర్థకమేనా?

"ఓ స్వామి! మీరు పితృాజ్ఞా పరిపాలనము నియమబద్ధముగా పూర్తి చేస్తారు. చరిత్ర వ్రతులు అవుతారు. అరణ్యము నుంచి అయోధ్యకు పోతారు. మీ కష్టాలు గట్టు ఎక్కుతవి. మీరు నిర్భయముగా విశాల నేత్రలు అయిన ఎంతమంది స్త్రీలతోనో హాయిగా క్రీడిస్తూ ఉంటారు.

"ఓ ప్రభూ! మీ మీద నాకున్న అనురాగమునుంచి నా మనస్సు అంతా మీ మీద లగ్నము చేయడమూ, మీ కోసము తపస్సు చేయడమూ నా నాశనానికి కారణాలు

అయినవి. నా తపస్సు అంతా వ్యర్థము అయిపోయింది. ఛీ! ఛీ! దురదృష్టపు బ్రతుకు బ్రతికి ఉండడము ఎందుకు? ప్రాణము వదిలిపెట్టవలెను. విషము తినికానీ, ఆయుధముతోకానీ తొందరగా ఈ ప్రాణము వదలవలెను. ఈ రావణాసురుడి పట్టణములో నాకు విషముకానీ, ఆయుధముకానీ ఇచ్చే దాత ఎవడు? ఎవడూ లేడు" అనుకొన్నది.

ఈవిధముగా పరిపరివిధాల ఆలోచిస్తూ ఆ సీతాదేవి సర్వాత్మనా రాముణ్ణి తలుచుకొని ఏడ్చింది. ఆమె నోరు ఎండిపోయింది. వణుకుతూ, అట్లాగే ఆలోచించుకుంటూ పూలు విరగపూసిన ఇరుగుడు చెట్టు దగ్గరకు పోయింది. ఆ చెట్టు మొదట్లో నిలుచున్నది. శోకముతో తపించిపోతూ అనేకవిధాల ఆలోచించింది. తన జడను గొంతుకు ఉరిపోసుకొని వెంటనే చచ్చిపోవలెను అనుకొన్నది. ఆ మృదుగాత్రి అట్లా నిశ్చయించుకొని ఆ ఇరుగుడు చెట్టు కొమ్మపట్టుకొని నిలుచున్నది.

ఆ శుభాంగి అప్పుడు రాముణ్ణి గురించీ, లక్ష్మణుణ్ణి గురించీ, తన వంశాన్ని గురించీ ఆలోచించసాగింది. అప్పుడు ఆమెకు శుభనిమిత్తాలు అనేకము తోచినవి. శోకనిమిత్తాలు కాని ఆ శుభసూచకాలు లోకప్రసిద్ధము అయినవి. అదివరకు అటువంటి శుభనిమిత్తాలు తోచినప్పుడు అవి అన్నీ సిద్ధించినవి. ఆమెకు ధైర్యము వచ్చింది.

29

శుభ నిమిత్తాలు

శ్రీమంతుడు అయినవాణ్ణి సేవకులు కమ్ముకొన్నట్టు, సంతోషము ఏమాత్రమూ లేకుండా పరమ దైన్యముతో శింశుపావృక్షము దగ్గరకు పోయిన ఆ శుభాంగిని సీతాదేవిని శుభనిమిత్తాలు కమ్ముకొన్నవి.

నల్లటి కనుపాపలతో, విశాలము అయిన తెల్లటి కనుగుడ్లతో, ఎఱ్ఱటి కనుకొలకులతో, వంకరలు తిరిగిన కనురెప్పల వెంట్రుకలతో ఉన్న ఆ శుభకేశిని శుభనేత్రాలలో వామనేత్రము ఒక్కటీ చేప దెబ్బ తిన్న కమలమువలె అదిరింది.

నాణ్యము అయిన నల్లటి అగరుగంధము పూసుకొనే అందము అయిన ఆమె గుండ్రటి వామభుజము, అదివరకు రాముడు పట్టుకొన్న ఆమె వామభుజము గబగబా అదిరింది.

బలిసి ఒక దానితో ఒకటి ఒరుసుకొనిపోయిన ఏనుగుతొండాలవంటి ఆమె అందము అయిన రెండు తొడలలోనూ ఎడమ తొడ, రాముడు ఎదటికి వచ్చినట్టుగా వణికింది.

తెల్లని కన్నులతో, గుండ్రముగా కొనలు తేలిన పలువరుసతో, పొంకము అయిన అవయవాలతో ఉన్న ఆ శుభాంగి కట్టుకొన్న బంగారురంగుచీర వళ్ళు ఇచ్చింది.

ఇదివరకు ఇటువంటి నిమిత్తాలు చక్కగా ఫలించడము ఆమె ఎరుగును. ఈ నిమిత్తాలనూ, ఇటువంటివే ఇతర నిమిత్తాలనూ ఆమె గమనించింది. ఎండకూ గాలికీ ఎండిపోయిన విత్తనము వానకు మొలకెత్తినట్లు ఆ సీతాదేవి ఆశ మొలకెత్తింది. దొండపండువంటి కింది పెదవితోనూ, చక్కని కనుబొమలతోనూ, అందము అయిన కన్నులతోనూ, తెల్లటి పలువరుసతోనూ శోభాయమానము అయిన ఆ సీతాదేవి ముఖబింబము అప్పుడు రాహువు నోటిలోనుంచి వెలువడిన చంద్రబింబమువలె భాసించింది. దుఃఖముపోయి, కలవరము అణిగి, తాపము శమించి, సంతోషమువచ్చిన సీతాదేవి ముఖబింబము అప్పుడు శుక్లపక్ష చంద్రుడివలె శోభిల్లింది.

30

హనుమంతుని బుద్ధికుశలత

శింశుపావృక్షముమీద దాగుకొని వున్న హనుమంతుడు రాక్షసాంగనలు సీతాదేవిని బెదిరించడము చూచినాడు. త్రిజట తన స్వప్నవృత్తాంతము చెప్పడమున్నూ విన్నాడు. ఆ అశోకవనములో ఉన్న ఆ సీతాదేవి నందనోద్యానవనములో దేవతాస్త్రీవలె అతనికి కనిపించింది. హనుమంతుడు ఆమెను చూచినాడు. అంతట అనేకవిధాల ఆలోచించసాగినాడు.

"సీతాదేవిని వెతకడానికి లక్షలకొద్దీ వానరులు అన్నిదిక్కులకూ బయలుదేరి పోయినారు. నా పూర్వ పుణ్యమువల్ల ఈ సీతాదేవి నాకు ఇక్కడ కనిపించింది. గూఢచారివలె ఎవరికీ తెలియకుండా ఇక్కడకు వచ్చినాను. శత్రుబలము తెలిసిపోయింది. రాక్షసుల యొక్క తారతమ్యాలున్నూ తెలిసినవి. ఈ లంకాపట్టణము అంతా తిరిగి చూడడమున్నూ అయింది. రావణాసురుడి ప్రభావము తెలుసుకొన్నాను.

"ఇంతింత అని ఎన్న నలవికాని ఆ మహానుభావుణ్ణి, ఆ సర్వభూత దయాపరుణ్ణి, తన పెనిమిటిని రాముణ్ణి చూడవలెను అని ఈ సీతాదేవి ఉవ్విళ్ళూరుతూ ఉంది. ఈమెను ఇప్పుడు ఓదార్చడము ఎంత అయినా మంచిది. ఈ పూర్ణచంద్రనిభానన ఇదివరకు ఎన్నడూ ఏ దుఃఖమూ ఎరుగదు. ఇప్పుడు ఈమె ఇంత దుఃఖము పడవలసి వచ్చింది. అంతేకాదు, ఈమె తన దుఃఖానికి అంతము తెలియకుండా బాధపడుతూ ఉంది. ఈమెను ఇప్పుడు ఊరడించవలెను. ఇట్లా దుఃఖముతో తపించిపోతూఉన్న ఈమెను ఓదార్చకుండా పోవడము తప్పు.

"నేను ఈమెతో మాట్లాడకుండా నా దారిన నేను పోయేట్లయితే, ఈ యశస్విని సీతాదేవి తనను కాపాడేవారు ఎవరూ లేరు అనుకొని ప్రాణము వదులుతుంది. నేను ఈమెతో మాట్లాడి పోయేట్లయితే, ఆ సీతాదర్శనలాలసుణ్ణి రాముణ్ణి ఓదార్చడానికి వీలు అవుతుంది. అయితే, ఈ రాక్షసాంగనల ఎదట ఈమెతో మాట్లాడకూడదు. ఇకను నేను ఏమి చేయవలెను? కర్తవ్యము ఏమిటి? చిక్కే వచ్చింది. ఈ రాత్రి గడిచిపోయే లోపలనే నేను ఈమెను ఓదార్చవలెను. లేకపోయినట్లయితే ఈమె ప్రాణము వదులుతుంది. సందేహము లేదు.

"నేను ఈ సుమధ్యమతో మాట్లాడకుండా ఇక్కడ నుంచి పోయేట్లయితే, సీతాదేవి తనతో ఏమి చెప్పమన్నది అని రాముడు నన్ను అడిగితే, నేను ఏమి బదులు చెప్పకలుగుతాను? ఇక్కడి నుంచి వెంటనే వెళ్ళిపోయి, 'నేను సీతాదేవితో ఏమీ మాట్లాడ లేదు. అందువల్ల ఆమె నాతో ఏమీ చెప్పలేదు' అని చెప్పేట్లయితే, రాముడికి నామీద మహా చెడ్డకోపము వస్తుంది. అతడు తన తీక్షణదృష్టులతో నన్ను దహించివేస్తాడు.

"నేను పోయి రామ కార్యార్థము సుగ్రీవుణ్ణి ప్రోత్సాహపరచి సేనలను ఇక్కడికి తీసుకొనివచ్చే లోపలనే ఈ సీతాదేవి ప్రాణత్యాగము చేస్తుంది. అందువల్ల, నేను చేసే ప్రయత్నము వృథా అయిపోతుంది. నేను ఇక్కడనే ఉండవలెను. ఈ రాక్షస స్త్రీలు ఏమరినప్పుడు నాకు అవకాశము దొరుకుతుంది. పరమదుఃఖములో నున్న ఈ సీతాదేవిని అప్పుడు మెల్లగా ఊరడించవలెను.

"ఇప్పుడు నేను చాలా చిన్న ఆకారములో ఉన్నాను. నేను వానరుడను. మానవుడివలె (బ్రాహ్మణుడివలె) సంస్కృత భాషలో మాట్లాడుతాను. వీండ్లు, ఈ రాక్షస స్త్రీలు ఆ భాష తెలుసుకోలేరు. నేను బ్రాహ్మణునివలె సంస్కృతములో మాట్లాడేట్లయితే సీతాదేవి వానరుడు ఇట్లా సంస్కృతములో మాట్లాడటము ఏమిటి అని సందేహిస్తుంది. నన్ను రావణాసురుడు అనుకొని భయపడిపోతుంది. అందువల్ల, అర్థవంతము అయిన కోసలదేశ భాషలోనే అవశ్యమూ మాట్లాడవలెను. ఈమెను మరిఒక భాషలో ఊరడించడానికి వీలులేదు.

"ఇదివరకు ఈ సీతాదేవిని రాక్షసులు భయపెట్టినారు. ఇకను నా రూపాన్ని చూచి, నా మాటలు విని ఈమె మరింత భయపడి పోతుంది. రావణాసురుడు కామరూపుడు అని ఈ విశాలాక్షికి తెలుసు. అందువల్ల, ఈ పతివ్రత నన్ను చూచి రావణాసురుడేను అనుకొని మహా భయపడిపోతుంది. కెవ్వున కేక వేస్తుంది. ఆ కేక వినగానే రాక్షసస్త్రీలు అందరూ యములవాండ్లవలె వెంటనే నా మీదికి వస్తారు. ఆ వికృతాననలు నా చుట్టూ మూగి నన్ను పట్టుకోవడానికికానీ, చంపివేయడానికికానీ

శక్తికొద్దీ ప్రయత్నము చేస్తారు. చిన్నకొమ్మలమీదనుండి పెద్ద కొమ్మమీదికి, అక్కడనుంచి చెట్లపైకి నేను పరుగెత్తుతూ ఉంటే, నన్ను చూచి అనుమానిస్తారు. భయపడిపోతారు.

"అట్లా పరుగులెత్తే నా మహదాకారము చూచి అందరూ వెర్రికేకలు పెట్టుతారు. మరింత భయపడిపోయి ఈ రాక్షసాంగనలు అందరూ రాక్షస రాజభవనములో రావణాసురుడు కావలి ఉంచిన రాక్షసులను పిలుచుకొని వస్తారు. వాండ్లు శూలాలూ, చిల్లకోలలూ, కత్తులూ మొదలు అయిన నానావిధాయుధాలతోనూ భయంకరముగా పోరాడటానికి వచ్చి నా మీద పడతారు. నా చుట్టూ కమ్ముకొంటారు. నన్ను ఎటూ పోనీయకుండా అన్నివైపులా అడ్డగిస్తారు. నేను ఆ రాక్షస సైన్యాలతో పోరాడుతాను. ఈ రాక్షసులలో మహా చురుకు అయినవాండ్లు అనేకమంది ఉన్నారు. వాండ్లు నన్ను పట్టుకొంటే పట్టుకోవచ్చును. అట్లా అయ్యేట్లయితే సీతాదేవికి రామవృత్తాంతము నేను చెప్పడమూ ఉండదు. నేను మహాసముద్రాన్ని దాటిపోవడమూ జరుగదు. పయిగా ఈ రాక్షసులు హింసాభిరుచులు. అందువల్ల, వీండ్లు ఈ సీతాదేవిని చంపివేస్తే చంపివేయవచ్చును కూడాను. నన్ను అయినా చంపివేయవచ్చును. ఇలా అయ్యేట్లయితే రామసుగ్రీవుల కార్యము పాడయిపోతుంది.

"ఈ లంకకు ఎటూ దారిలేదు. ఈ పట్టణానికి చుట్టూ సముద్రము ఉంది. అందుకు తోడు రాక్షసులున్నూ కావలి ఉన్నారు. ఇటువంటి గోప్యము అయిన ఈ ప్రదేశములో సీతాదేవి ఉంది. ఒకవేళ పోరాటములో ఈ రాక్షసులు నన్ను చంపివేసినా, పట్టుకొని బంధించివేసినా రామకార్య సాధనకు తోడుపడకలవాడు మరి ఒకడు లేడు. నన్ను ఈ రాక్షసులు చంపివేసినట్లయితే, ఈ నూరు యోజనాల సముద్రాన్ని దాటి ఇక్కడకు రాకలవాడు వానరులలో మరి ఒకడు లేడు. నేను ఎంత ఆలోచించినా తోచడము లేదు. ఎన్ని వేలమంది రాక్షసులతో నయినా పోరాడే సామర్థ్యము నాకు ఉంది. ఈ రాక్షసులను పోరాటములో చంపివేయగలను. కాని, పోరాటములో అలిసిపోయిన తరువాత ఈ సముద్రాన్ని దాటి నేను అవతలి గట్టుకు చేరలేను.

"ఇంతకూ యుద్ధాలలో జయాపజయాలు ముందుగా నిశ్చయించడానికి వీలులేదు. ఇట్లా అవుతుందో, అట్లా అవుతుందో ననే సందేహము వచ్చే పనులు చేయడము నాకు ఇష్టములేదు. సంశయాస్పదము అయిన పనిని ప్రాజ్ఞుడు అయినవాడు ముందువెనుకలు ఆలోచించకుండా నిర్విచారముగా చేయుడు. అయితే నేను మాట్లాడకుండా పోయేట్లయితే, ఈ సీతాదేవి ప్రాణత్యాగము చేస్తుంది. మాట్లాడేట్లయితే చిక్కు వస్తుంది. దూత వివేకము లేకుండా దేశకాల విరుద్ధముగా ప్రవర్తిస్తే, కానున్న పనులుకూడా సూర్యోదయము అవుతూవుంటే చీకట్లవలె నాశనము అయిపోతవి. ఇట్లా చేయవలెను, అట్లా చేయకూడదు అని ముందుగా నిశ్చయించి

నప్పటికిన్నీ, వివేకములేని దూతలు తాము సర్వమూ, తెలిసిన పండితులము అనుకొని పనులు పాడుచేస్తూ ఉంటారు. రామకార్యము చెడిపోకుండానూ, నేను సముద్రము దాటిన శ్రమ వృథా అయిపోకుండానూ ప్రవర్తించవలెను. అందుకు మార్గము ఏమిటి? నా మాటలు ఈ సీతాదేవి వినడము ఎట్లాగు? విని ఈమె భయపడకుండా ఉండడము ఎట్లాగు?" అని ఆ మతిమంతుడు హనుమంతుడు ఆలోచించినాడు. ఈవిధముగా నిశ్చయించుకొన్నాడు :

"ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసివేసే ఆ రాముణ్ణి స్తోత్రము చేస్తాను. ఈమె మనస్సు అంతా ఆ మహానుభావుడిమీద లగ్నము అయివుంది. కనుక ఈమె భయపడదు. ఆ ఇక్ష్వాకువంశశ్రేష్ఠుడు, ఆ విదితాత్ముడు రాముడు ఈమెకు చెప్పమన్న ధర్మయుక్తము అయిన శుభవాక్యాలు అప్పగిస్తూ మనోహరముగా సర్వమూ చెప్పుతాను. ఈమె నమ్మేటట్టు సర్వమూ చెప్పుతాను."

ఈవిధముగా మనస్సులో నిశ్చయించుకొని ఆ మహానుభావుడు హనుమంతుడు ఆ చెట్టుకొమ్మ నడుమకు వచ్చి సీతాదేవిని చూస్తూ, ఇట్లా మనోహరముగా మొదలు పెట్టినాడు.

31

"రథాలతోనూ, గుర్రాలతోనూ, ఏనుగులతోనూ పుణ్యశీలుడూ, మహా కీర్తిమంతుడూ, ఋజువర్తనుడూ, మహాపరాక్రమవంతుడూ అయిన దశరథమహారాజు ఉండేవాడు. అతడు రాజర్షులలో గుణ శ్రేష్ఠుడు. తపస్సులో ఋషులతోనూ, బలములో పురందరుడితోనూ సరిమానము అయినవాడు. చక్రవర్తులు పుట్టిన వంశములో పుట్టినవాడు. అహింసారతుడు. సత్యపరాక్రముడు. ఇక్ష్వాకువంశీయులలో ముఖ్యుడు. సంపన్నుడు. లక్ష్మీవర్ధనుడు. రాజలక్షణయుక్తుడు. మహాకాంతిమంతుడు. రాజశ్రేష్ఠుడు. చతుస్సముద్రపర్యంతము అయిన ఈ భూమిమీద ప్రజలను సుఖపెట్టేవాడు అనీ, సుఖపడేవాడు అనీ ప్రసిద్ధి కెక్కినాడు.

"ఆ దశరథమహారాజు జ్యేష్ఠపుత్రుడు రాముడు. చంద్రబింబమువంటి ముఖమువాడు. ధానుష్కులు అందరిలోనూ మేటి ధానుష్కుడు. తండ్రికి ఎంతో ఇష్టుడు. తన క్షాత్రధర్మాన్నీ, బంధుజనులనూ, ప్రాణి సమూహాన్నీ, వర్ణాశ్రమ ధర్మాలనూ ఎప్పుడూ కాపాడుతూ ఉండేవాడు. శత్రువులకు తాపమెత్తించేవాడు.

"సత్య సంకల్పుడూ, వృద్ధూ, తండ్రి అయిన దశరథమహారాజు ఆజ్ఞను శిరసావహించి ఆ పరమపరాక్రమశాలి రాముడు భార్యతోనూ, తమ్ముడితోనూ వనవాసము చేయడానికి పోయినాడు. అట్లా మహారణ్యములో తిరుగుతూ రాముడు

శూరులూ, కామరూపులూ అయిన రాక్షసులను అనేకమందిని సంహారము చేసివేసినాడు. జనస్థానములో రాక్షసవధ, ఖరదూషణులు ఉభయులూ రాముడి చేతిలో చచ్చిపోవడమూ రావణాసురుడు విన్నాడు. అంతట రావణాసురుడు ఆ మహారణ్యములో మాయామృగరూపముతో రాముని మోసపుచ్చి కోపముతో అతని భార్యను సీతాదేవిని అపహరించుకొని పోయినాడు. రాముడు ఆ అనిందితను, తన భార్య సీతాదేవిని ఆ మహారణ్యములో వెతుకుతూ 'సుగ్రీవుడు' అనే వానరుడితో స్నేహము చేసినాడు. అంతట ఆ పరపురంజయుడు, ఆ మహాబలవంతుడు రాముడు వాలిని చంపివేసి, వానర రాజ్యాన్ని సుగ్రీవుడికి ఇచ్చినాడు. ఆ సుగ్రీవుడు ఆజ్ఞాపించినందువల్ల సీతాదేవిని వెతకడానికి కామరూపులు అయిన వానరులు వేలకు వేలు అన్నిదిక్కులకు పోయినారు.

"నేనూ ఆ సీతాదేవి కోసము సంపాతి చెప్పినందువల్ల అమిత వేగముతో నూరు యోజనాల సముద్రాన్ని దాటి ఇక్కడికి వచ్చినాను. ఎటువంటి ఆకారముతో, ఎటువంటి దేహచ్ఛాయతో, ఎటువంటి కాంతితో సీతాదేవి ఉంటుంది అని రాముడు చెప్పినాడో అదే విధముగా సీతాదేవి ఇక్కడ నాకు కనిపించింది" అని చెప్పి ఊరుకున్నాడు.

ఆ వానర శ్రేష్ఠుడి మాటలు సీతాదేవి విన్నది. అమెకు అమిత ఆశ్చర్యము వేసింది. ఆ వక్రకేశాంత, ఆ సుకేశిని, ఆ భీరువు సీతాదేవి వెంట్రుకలు కమ్ముకొని ఉన్న తల పైకి ఎత్తి ఆ శింశుపావృక్షము వంక చూచింది. దిక్కులూ, విదిక్కులూ పరిశీలించి చూచింది. సర్వాత్మనా రాముణ్ణి ధ్యానము చేస్తూ ఉన్న ఆ పతివ్రత పరమహర్షము చెందింది.

సీతాదేవి పక్కలను, పైనా, కిందా వెతుకుతూ అచింత్య బుద్ధిమంతుణ్ణి, సుగ్రీవుడి మంత్రిని, ఉదయకాల సూర్యుడువంటి వాతాత్మజుణ్ణి చూచింది.

32

సీత హనుమంతుని చూచుట

ఆ ఇరుగుడు చెట్టుకొమ్మమీద దాగుకొని ఉన్న హనుమంతుని సీతాదేవి చూచింది. అతడు గోరోచనము వన్నెతోనూ, తెల్లని వస్త్రముతోనూ విద్యుత్సమూహము వలె కనిపించినాడు. ఆ ప్రియవాది, ఆ వినయాన్వితుడు వికసించిన అశోక పుష్పకాంతులతో దేదీప్యమానముగా వెలుగుతూ ఉన్నాడు. అతడి నేత్రాలు తప్తకాంచన వర్ణముతో ధగధగలాడుతూ ఉన్నవి. అతణ్ణి చూచి సీతాదేవి కలవరపడ్డది. ఆమెకు అమితాశ్చర్యము వేసింది. ఆలోచించసాగింది.

"ఈ వానరుడి రూపము భయంకరముగా ఉంది. దగ్గరకుపో నలవి కాకుండానూ, చూడ శక్యము కాకుండాను ఉంది. అయ్యో!" అనుకొన్నది. చేష్టలు

తప్పిపోయింది. ఆ భామిని అట్లా భయముతో తెలివి తప్పిపోయి దుఃఖముతో బాధపడుతూ, "ఓ రామా! ఓ లక్ష్మణా!" అంటూ జాలిపుట్టేటుగా మంద స్వరముతో మంద మందముగా ఏడువసాగింది. ఆ చెట్టుకొమ్మమీదనే ఆమెను సమీపిస్తూ ఉన్న ఆ వానర శ్రేష్ఠుణ్ణి చూచి కల ఏమోను అనుకొన్నది.

వానరేంద్రుడు అయిన సుగ్రీవుడు చెప్పినట్టు చేసే ఆ అమాత్యుడూ బుద్ధిమంతు లలో శ్రేష్ఠుడూ, వాయుపుత్రుడూ, వంకర తేలిన పెద్ద ముఖమువాడూ అయిన హనుమంతుణ్ణి చూచి సీతాదేవి ప్రాణముపోయిన దానివలె తెలివి తప్పిపోయింది.

చాలాసేపటికి ఆ విశాలనేత్రికి తెలివివచ్చింది. మళ్ళీ ఆలోచించ సాగింది.

"అయ్యో, నాకు ఇప్పుడు కలలో కోతి కనపడ్డది. ఇట్లా కలలో కోతి కనపడేట్లయితే ఆత్మబంధువులు నాశనము అయిపోతారు అని శాస్త్రాలలో చెప్పి ఉందే! లక్ష్మణుడితో కూడా రామప్రభువు సుఖముగా వుండవలెను. నా తండ్రి జనక మహారాజు సుఖముగా వుండవలెను.

"ఇది కలకాదు. రాముణ్ణి ఎడబాసిన శోకముతోనూ, రాక్షసాంగనల మధ్యను పడిపోయినందువల్ల దుఖముతోనూ బాధపడుతూ వున్న నాకు నిద్ర ఎక్కడిది? నిండుచంద్రునివంటి ఆ రామప్రభువును వదలిన తరువాత నేను ఎప్పుడు నిద్రపోయినాను? సుఖము ఎక్కడిది? నేను నిద్ర పోలేదు. అందువల్ల ఇది కల కాదు.

"ఎప్పుడూ ఆ రాముణ్ణి ధ్యానము చేస్తూ వున్నాను. రామనామము జపము చేస్తూ వున్నాను. అందుకు అనురూపముగా ఆ రామప్రభువును గురించిన కధనే విన్నాను. నా మనస్సు అంతా ఆ రామప్రభువు మీదనే వుంది. ఆయనను గురించిన ఆలోచనలతోనే బాధపడుతున్నాను. అందువల్ల, నాకు ఏది వినిపించినా రామప్రభువును గురించే వినపడుతూ ఉంటుంది. అంతేకాదు, ఆ రామప్రభువును గురించి చెప్పుతున్నవాణ్ణి చూస్తూ ఉన్నాను.

"నా మనోరధమే వానరరూపముగా కనపడుతున్నది ఏమోను! అట్లాకాదు. బుద్ధిబలముతో ఆలోచిస్తూ ఉంటే అట్లాకాదు అనిపిస్తూ ఉంది. కారణము ఏమంటే, మనోరధానికి రూపము ఉండదు. ఈ వానరుడు మంచి స్పష్టము అయిన రూపముతో ఉన్నాడు. నన్ను ఉద్దేశించి మాట్లాడుతున్నాడు. కాబట్టి వాస్తవముగా వానరుడు ఎవడో ఇక్కడికి వచ్చి, నాకు రాముణ్ణి గురించి చెప్పుతూ ఉన్నాడు.

"దేవేంద్రుడికీ, బృహస్పతికీ, అగ్నిహోత్రుడికీ, బ్రహ్మదేవుడికీ నమస్కారము చేస్తున్నాను. నా ఎదుట ఉన్న ఈ వానరుడు చెప్పుతున్నది అంతా యధార్థము అయి తీరవలెను" అనుకొన్నది.

33

సీతా హనుమంతుల సంభాషణ

ఆ మహాతేజోవంతుడు మారుతాత్మజుడు హనుమంతుడు అప్పుడు ఆ చెట్టుమీది నుంచి కిందికి దిగినాడు. పగడమువంటి ముఖముతో, వినీతవేషముతో, దైన్యముతో సీతాదేవిని సమీపించి చేతులు జోడించి శిరసా నమస్కారము చేసి మధురముగా, "ఓ అనిందితా! నీవు ఎవరవు? నీ కన్నులు తామరరేకులు మాదిరిగా ఉన్నవి. నీవు నలిగిపోయిన పట్టుచీర కట్టుకొని ఈ చెట్టుకొమ్మ పట్టుకొని నిలుచున్నావు. తెల్లతామరరేకులవంటి నీ రెండు కన్నులలో నుంచి నీళ్లు చల్లినట్టుగా ఎందుకు శోక బాష్పాలు కారుతున్నవి? ఓ మంగళ స్వరూపిణీ! నీవు దేవతా స్త్రీవా, అసుర స్త్రీవా, నాగాంగనవా, గంధర్వాంగనవా, రాక్షసాంగనవా, యక్షకన్యవా, కిన్నెర యువతివా? నీవు ఎవరవు? ఓ సుందరాననా! నీవు ఏకాదశ రుద్రులకు సంబంధించినదానవా, అష్టవసువులకు సంబంధించినదానవా, సప్తమరుత్తులకు సంబంధించినదానవా? నీవు ఎవరవు? నీవు నాకు దేవతా స్త్రీవిగా కనపడుతున్నావు. చంద్రుడు వదిలిపెట్టితే స్వర్గమునుంచి భూమిమీదపడ్డ నక్షత్రశ్రేష్ఠమూ, శ్రేష్ఠసర్వగుణోపేతమూ అయిన రోహిణీదేవివా ఏమిటి? ఓ కళ్యాణీ! ఓ అసితేక్షణా, నీవు కోపమువల్లనో, ప్రణయకోపము వల్లనో పెనిమిటి అయిన వశిష్ఠమహర్షిని వదిలిపెట్టి వచ్చిన అరుంధతీదేవివా ఏమిటి?

"ఓ సుమధ్యమా! నీ భర్త ఎవరు? నీ పుత్రుడు ఎవరు? నీతండ్రి ఎవరు? నీ తోబుట్టువు ఎవరు? నీ బంధువు ఎవరు అయినా స్వర్గతుడు అయినందువల్ల నీవు ఇట్లా దుఃఖపడుతున్నావా? ఓ శుభాననా! నీ ఏడ్పువల్లనూ, నీ అధిక నిశ్వాసమువల్లనూ, నీవు ఈ భూమిని తాకి ఉండడమువల్లనూ, నీ రాజలక్షణాల వల్లనూ నీవు దేవతాస్త్రీవి కాదు అనుకొంటున్నాను. నీ స్తనజఘనాద్యవయవాలను పట్టీ, సాముద్రిక లక్షణాలనుపట్టీ నీవు రాజు పట్టమహిషివో లేక రాజకన్యవో అయి వుంటావు అని నాకు తోస్తున్నది.

"జనస్థానములో రావణాసురుడు బలవంతముగా ఎత్తుకొని వచ్చిన సీతాదేవివి ఏమోను అనుకొని అడుగుతున్నాను. నాకు నీవు ఎవ్వరివో చెప్పు. నీకు శుభము అవుతుంది. నీ దుఃఖమునుంచీ, నీ అతిమానుషరూపమునుంచీ, నీ తాపసవేషము నుంచీ నీవు రామమహిషివి అనుకొంటున్నాను. సందేహము లేదు" అన్నాడు హనుమంతుడు.

ఈ మాటలు వైదేహి విన్నది. రామకీర్తనానికి ఆమె సంతోషపడిపోయింది. ఆ చెట్టుకింద నిలుచున్న హనుమంతుడితో, "ఈ పృథ్వీమీద రాజసింహులలో శ్రేష్ఠుడూ, విదితాత్ముడూ, శత్రుసైన్య తాపసుడూ అయిన దశరధమహారాజు కోడలిని.

మహాపరాక్రమవంతుడూ, విదేహ దేశాధీశుడూ అయిన జనకమహారాజు కూతురిని. నా పేరు సీత. మహాబుద్ధిమంతుడు అయిన రామప్రభువు భార్యను. నేను ఆ దశరథ మహారాజు ఇంట్లో పన్నెండు సంవత్సరాలు మానుషభోగాలను అన్నిటినీ అనుభవించినాను. సమస్త కోరికలూ సమృద్ధముగా నెరవేరినవి. పదమూడవ సంవత్సరములో దశరథమహారాజు తన ఉపాధ్యాయుడు అయిన వశిష్ఠమహర్షితో ఆలోచించి రామప్రభువుకు రాజ్యాభిషేకము తలపెట్టినాడు. రామాభిషేకానికి సంబారాలు అన్నీ సమకూరుస్తూ ఉండగా దశరథమహారాజు భార్య 'కైకేయీదేవి' అనే ఆమె రామరాజ్యాభిషేకము జరిగేట్టయితే తాను భోజనము చేయను అనీ, నీళ్ళు అయినా తాగను అనీ, ప్రాణము వదులుతాను అనీ చెప్పి, 'ఓ రాజసత్తమా! తాము సంతోషముగా నాకు రెండు వరాలు వాగ్దానము చేసినారు. ఆ వాగ్దానము వ్యర్థము అయిపోకూడదు. ఆ వరానికిగాను రాముణ్ణి వనవాసము చేయించవలెను' అని కోరింది.

"క్రూరమూ, అప్రియమూ అయిన ఆ కైకేయీదేవి కోరికను సత్యవ్రతుడు దశరథ మహారాజు విన్నాడు. తాను కైకేయీదేవికి వరాలు ఇవ్వడము జ్ఞాపకమువచ్చి ఆ మహారాజు మూర్ఛపోయినాడు. ఆ సత్యవ్రతుడు, ఆ పరమధార్మికుడు, ఆ వయోవృద్ధు దశరథమహారాజు తన జ్యేష్ఠపుత్రుణ్ణి రాజ్యాధికారము వదులుకోవలసింది అని యాచించినాడు. అప్పుడు ఆ సర్వాతిశాయి నా పెనిమిటి రామప్రభువు రాజ్యాభిషేకముకన్నా పితృవాక్యపరిపాలనమే ప్రియతమముగా భావించి మనసా, వాచా రాజ్యము వదలుకొన్నాడు. ఆ నా ప్రభువు ఎవరు ఏది అడిగినా లేదు అనకుండా ఇచ్చివేస్తాడు. ప్రాణసంకట సమయాలలో నయినా ఎవరి దగ్గరనూ, ఏదీ పుచ్చుకోడు. ఆయన పరాక్రమము ఎన్నడూ ఎక్కడనూ వ్యర్థము అయిపోదు.

"ఆ మహాయశుడు మహార్హము అయిన వస్త్రాలను వదిలివేసినాడు. మనసా రాజ్యము వదలిపెట్టినాడు. నన్ను తన తల్లి కౌసల్యాదేవి దగ్గర వదిలిపెట్టవలెను అనుకొన్నాడు. నేను పతివ్రతను. ఆయనతో పాటు అడవులలో తిరగవలెను అనుకొన్నాను. అందువల్ల, ఆయనకన్నా ముందుగా ఆయనతో బయలుదేరినాను. నేను ఆ రామప్రభువును వదిలిపెట్టి స్వర్గములో ఉండమన్నా ఉండను. స్నేహితులను సంతోషపెట్టే మహాబాహువు, ఆయన తమ్ముడు లక్ష్మణుడు అన్నగారిని వెంబడించడానికి అంతకుముందే వల్కలాలు కట్టుకొన్నాడు. మేము ముగ్గురమూ దశరథమహారాజు ఆజ్ఞాబద్ధులమయి అదివరకు ఎన్నడూ చూచి ఎరగని భయంకరారణ్యములోకి వచ్చి చేరినాము.

"దండకారణ్యములో ఉంటూ ఉండగా ఆ మహాపరాక్రమవంతుడి భార్యను నన్ను, దురాత్ముడు రావణాసురుడు దొంగిలించుకొని వచ్చినాడు. ఆ రావణాసురుడు

నాకు జీవితానుగ్రహకాలముగా రెండు మాసాలు గడవు పెట్టినాడు. ఇక రెండు మాసాలపైన నేను బ్రతికి ఉండను" అని సీతాదేవి చెప్పింది.

34

సీతాదేవి దుఃఖముతో బాధపడుతూ చెప్పిన మాటలు హనుమంతుడు విన్నాడు. ఆమెను ఓదారుస్తూ, "ఓ దేవీ! నేను రామాజ్ఞను శిరసావహించి ఇక్కడికి, నీదగ్గరకు దూతగా వచ్చినాను. రామప్రభువు క్షేమముగా ఉన్నాడు. ఆ బ్రహ్మాస్త్రసంపన్నుడు, ఆ వేదవిదుడు, వేదవిదులలో శ్రేష్ఠుడు ఆ దాశరథి తన క్షేమము నీకు చెప్పమన్నాడు. నీ భర్తకు ప్రియుడూ, అనుచరుడూ, మహాతేజోవంతుడూ అయిన లక్ష్మణుడు శోకముతో తపించిపోతూ, నీకు శిరసా నమస్కారము చేసినాడు" అని హనుమంతుడు చెప్పినాడు.

ఆ పురుషసింహుల క్షేమము సీతాదేవి విన్నది. సంతోషముతో ఆమె దేహము అంతా పులకరించింది. "బ్రతికి ఉంటే నూరు సంవత్సరాలు అయిపోయిన తరువాతను అయినా సంతోషము అనుభవించవచ్చును అనే లోకోక్తి యథార్థము అని తోస్తున్నది. సంతోషము" అని చెప్పింది. అట్లా హనుమంతుడు వచ్చి తనకు రామలక్ష్మణుల క్షేమము చెప్పినందుకు ఆమెకు అద్భుతము అయిన సంతోషము వేసింది. వారు ఉభయులూ పరస్పరమూ విశ్వసించి పరస్పరమూ మాట్లాడుకొన్నారు.

ఆ మాటలు హనుమంతుడు విని శోకముతోనూ, దైన్యముతోనూ బాధపడుతూ ఉన్న సీతాదేవి దగ్గరకు మెల్లగా పోయినాడు. అట్లా అతడు తన దగ్గిరకు వస్తూవున్నకొద్దీ అతడు రావణాసురుడు ఏమోను అనే సందేహము ఆమెకు వచ్చింది. "నేను ఇతని ఎదుట అనకూడని మాట అన్నాను. అయ్యో! మోసపోయినాను. వీడు రావణాసురుడే, మరి ఒక రూపముతో వచ్చినాడు" అనుకొని, ఆ సర్వాంగసుందరి దుఃఖముతో కుంగిపోయింది. చేతితో పట్టుకొని ఉన్న అశోకవృక్షశాఖను ఆమె వదిలిపెట్టి నేలమీద చతికిలపడి పోయింది. ఆమె భయభ్రాంత అయిపోయింది, దుఃఖపడ సాగింది. అది ఆ మహాబాహువు హనుమంతుడు గమనించినాడు. ఆమెకు సాష్టాంగ నమస్కారము చేసినాడు. అందుకు ఆమె భయముతో హడలిపోయింది. అతనివంక మళ్ళీ ఆమె చూడలేదు.

ఆ హనుమంతుడు అట్లా నమస్కారము చేస్తూ పడి ఉండడము ఆ పూర్ణచంద్రానన సీతాదేవి గమనించింది. పెద్ద నిట్టూర్పు విడిచి మధుర స్వరముతో, "నీవు మాయావివి. మాయవేషముతో ఉన్న రావణాసురుడవు. నీవు మళ్ళీ నన్ను దుఃఖపెట్టడము మంచిదికాదు. నీవు యథార్థ రూపము వదిలిపెట్టి జనస్థానములో

పరివ్రాజక రూపముతో రావడము నేను చూచినాను. నీవు రావణాసురుడవు. ఓ నిశాచరుడా! నేను ఉపవాసాలతో కృశించిపోయినాను. దీనురాలను. శోకముతో తపించిపోతున్నాను. నీవు నన్ను మళ్ళీ బాధ పెట్టుతున్నావు. ఇది నీకు శుభముకాదు.

"ఓ వానరుడా! నా సందేహము సరి అయింది కాదు ఏమోను అనిపిస్తూ ఉంది. ఏమంటే, నిన్ను చూస్తూ ఉంటే నా మనస్సులో సంతోషము వేస్తున్నది. నీవు రామదూతగా అయి ఇక్కడికి వచ్చి ఉన్నట్లయితే నీకు శుభము అవుతుంది. ఓ వానరశ్రేష్ఠుడా! నాకు రామకథలు ఎంత అయినా ఇష్టము. నిన్ను అడుగుతున్నాను, చెప్పు! ఓ వానరుడా! నా ప్రియుడి గుణగణాలు ఎటువంటివో చెప్పు. ఓ మంచివాడా! ప్రవాహవేగము ఎటువంటి ఏటిగట్లను అయినా పడలాగుతుంది. అదేవిధముగా నీ మాటలు నా చిత్తాన్ని ఆకర్షిస్తున్నవి" అని అడిగిందేకాని, లంకా పట్టణానికి రామదూత రావడము అసంభవము అనుకొని తనలో మళ్ళీ, "రావణాసురుడు దొంగిలించుకొని వచ్చి చాలాకాలము అయింది. రాముడు పంపించిన వానరుడు ఇంతకాలానికి ఇప్పుడు కనపడుతున్నాడు. స్వప్న సుఖము ఎంత గొప్పగా ఉంది? ఆశ్చర్యముగానే ఉంది. కలలోను అయినా ఆ పరాక్రమవంతుడు లక్ష్మణుడితో కూడా కనపడుతూ ఉన్నట్లయితే, నేను దుఃఖముతో ఇంత నవసిపోయి ఉండేదాన్ని కాను. నా మీద స్వప్నానికి కూడా మత్సరమే.

"ఇది స్వప్నముకాదు అనిపిస్తూ ఉంది. కలలో కోతి కనపడితే సుఖముగా ఉండడానికి వీలు లేదు. నాకు ఇప్పుడు సంతోషము వేస్తూ ఉందే!

"ఇది నా చిత్తభ్రాంతేమో! లేక వాతము ప్రకోపించి నాకు ఇట్లా కనపడుతూ ఉందేమో! లేక ఉన్మాద వికారమేమో! ఎండమావులవలె ఒకదానికి బదులు మరి ఒకటి కనపడుతున్నదేమో!

"ఇది పిచ్చికాదు, పిచ్చిలక్షణమువంటి చిత్తభ్రాంతీ కాదు. నన్ను గురించి నాకు బాగా తెలుస్తూనే వుంది. నేను తెలివి తప్పిపోలేదు. నా ఎదుట వున్నవాడు వానరుడు అని స్పష్టముగా తెలుస్తూ వుంది" అనుకొని లంకాపట్టణానికి వచ్చినందుకు వానరుడికి వుండే బలాబలాలను గురించీ, ఇచ్ఛాధీనరూపాలు ధరించే రాక్షసుల సామర్థ్యాలను గురించీ చక్కగా ఆలోచించి, తన కన్నుల ఎదుట కనపడుతున్నవాడు రావణాసురుడేను అని మనస్సులో నిశ్చయించుకొని, ఆ తనుమధ్యమ జనకాత్మజ హనుమంతుడితో మారుమాట్లాడకుండా ఊరక వుంది.

ఆ మారుతాత్మజుడు హనుమంతుడు సీతాదేవి మనోవిచారము తెలుసుకొన్నాడు. ఆమెను సంతోషపెట్టడానికి శ్రవణ మనోహరముగా, "ఓ దేవీ! రాముడు సూర్యుడివంటి తేజస్వి. చంద్రుడివంటి సర్వలోక మనోహరుడు. కుబేరుడివంటి

రాజాధిరాజు. మహావిష్ణువువంటి అమిత పరాక్రమవంతుడు. ఆ మహాయశుడు బృహస్పతివంటి సత్యవాది. మూర్తీభవించిన మన్మథుడివంటి రూపసి. అతనిది మధురవాక్కు. మనోహరాకారుడు. కాంతిమంతుడు. కోపము రావలసినప్పుడు అతనికి కోపము వస్తుంది. ఆ వచ్చిన కోపము వ్యర్థము అయిపోదు. తననూ, సారథినీ కాపాడుకొంటూ పదకొండువేలమంది విలుకాండ్లతో పోరాడే మహారథుడు. ఈ లోకము అంతా ఆ మహాత్ముడి బాహుచ్ఛాయను ఆశ్రయించుకొని వుంది. అటువంటివాణ్ణి మాయామృగ రూపముతో మోసపుచ్చి ఆశ్రమములోనుంచి అవతలకు పంపించివేసి, అతడు లేనప్పుడు నిన్ను దొంగిలించుకొని వచ్చిన రావణాసురుడు అనుభవించే ఫలము నీవు త్వరలోనే చూస్తావు. ఆ పరమపరాక్రమశాలి రామప్రభువు క్రుద్ధుడు అయివున్నాడు. అచిరకాలములోనే మంటలు మండే నిప్పులవంటి బాణాలు వదలి రావణాసురుణ్ణి యుద్ధములో సంహారము చేసివేస్తాడు. నేను ఆ మహానుభావుడు పంపిస్తే వచ్చిన దూతను. నీ దగ్గరకు వచ్చినాను.

"ఆ రామప్రభువు నీ వియోగమునుంచి దుఃఖముతో బాధపడుతున్నాడు. నీ క్షేమము తెలుసుకొని రమ్మన్నాడు. ఆ మహాతేజోవంతుడు, ఆ మహాబాహువు సుమిత్రానంద వర్ధనుడు లక్ష్మణుడు నీకు తన నమస్కారాలు చెప్పమన్నాడు. నీ క్షేమము అడగమన్నాడు. ఓ దేవీ! రామప్రభువు మిత్రుడు వానరరాజు సుగ్రీవుడు అనే ఆయన నీ క్షేమము విచారించి రమ్మని చెప్పినాడు. ఆ రామప్రభువూ, ఆయన తమ్ముడు లక్ష్మణుడూ, ఆయన మిత్రుడు సుగ్రీవుడూ నిన్నే ఎప్పుడూ తలచుకొంటూ వుంటున్నారు.

"ఓ దేవీ! నీవు ఇట్లా రాక్షసాంగనల వశము అయినప్పటికిన్నీ, అదృష్టవశాత్తూ జీవించి వున్నావు. నీవు అచిరకాలములో ఆ రామప్రభువునూ, ఆ మహా బలవంతుణ్ణీ లక్ష్మణుణ్ణీ, కోట్లకొద్దీ వానరసేనా సమూహాలతో సుగ్రీవుణ్ణీ చూస్తావు.

"నేను ఆ సుగ్రీవుడి సచివుణ్ణి. హనుమంతుడు అనే వానరుడను. మహోదధిని దాటి ఈ లంకాపట్టణానికి వచ్చినాను. నేను నా పరాక్రమముతో దురాత్ముడు అయిన రావణాసురుడి శిరము మీద నా పాదము ఉంచినాను. అంటే ఈ లంకాపట్టణములో నా ఎడమకాలు పెట్టినాను. నిన్ను చూడటానికి వచ్చినాను. ఓ దేవీ! నీవు అనుకొంటున్నట్టుగా నేను మాయావిని కాను. సందేహించవద్దు. నా మాట నమ్ము" అని సీతాదేవితో చెప్పినాడు.

35

ఆ వానరపుంగవుడు చెప్పిన రామకథను అంతా సీతాదేవి విన్నది. మెల్లగా మనోహరముగా, "ఓ వానరుడా! నీవు ఆ రామప్రభువును ఎక్కడ కలుసుకున్నావు?

లక్ష్మణుణ్ణి నీవు ఎట్లా ఎరుగుదువు? నరులకూ, వానరులకూ సమాగమము ఎట్లా అయింది? ఓ వానరుడా! రాముడి గుర్తులు మళ్ళీ వివరముగా చెప్పు, నా దిగులు వదిలిపోతుంది. రామప్రభువు ఆకారము ఎట్లా ఉంటుంది? వారి అవయవాల పొందిక ఎట్లా ఉంటుంది? ఆ అన్నదమ్ముల చేతులు ఎట్లా ఉంటవి? కాళ్ళు ఎట్లా ఉంటవి? చెప్పు" అని సీతాదేవి అడిగింది.

ఆ మారుతాత్మజుడు హనుమంతుడు, "ఓ కమలపత్రాక్షీ! నీవు నా భాగ్యవశమువల్ల నన్ను రామదూతగా తెలిసికొని రామలక్ష్మణుల అవయవాల పొందికను గురించి అడుగుతున్నావు, సంతోషము. ఓ విశాలాక్షీ! రామలక్ష్మణుల గుర్తులు నీవు ఎరిగినవే నేను చెప్పుతాను.

"ఆ కమలపత్రాక్షుడు, ఆ సర్వాంగసుందరుడు రామప్రభువు ఎప్పుడూ తన కల్యాణగుణాలతో సర్వప్రాణికోటినీ ఆకర్షిస్తూ ఉంటాడు. అతడు దాక్షిణ్యము కలవాడు. అతని కళ్యాణ గుణాలు అన్నీ పుట్టుకతోనే వచ్చినవి. రామప్రభువు తేజానికి సూర్యుడితో సరిసమానము అయినవాడు. ఓర్పుకు పృథివితో సరిసమానము అయినవాడు. బుద్ధికి బృహస్పతితో సరిసమానము అయినవాడు. యశస్సుకు దేవేంద్రుడితో సరిసమానము అయినవాడు. ప్రాణి లోకాన్ని ఎప్పుడూ రక్షిస్తూ ఉంటాడు. స్వజనులను ఎక్కువగా కాపాడుతూ ఉంటాడు. తన కులాచారాన్నీ, ధర్మాన్నీ కాపాడుతూ ఉంటాడు. అతడు పరంతపుడు.

"ఓ భామినీ! రాముడు ఎప్పుడూ నాలుగు వర్ణాలవారినీ కాపాడుతూ ఉంటాడు. లోకమర్యాదలకు అన్నిటికీ అతడు కర్త. అతడే కారయిత. ఆ కాంతిమంతుడు, ఆ పరమపూజ్యుడు బ్రహ్మచర్యవ్రతము అనుష్ఠిస్తూ ఉన్నాడు. సజ్జనులకు ఉపకారము చేస్తూ ఉంటాడు. కర్మ గతిని ఎరిగినవాడు. రాజవిద్యావినీతుడు. బ్రాహ్మణులను ఉపాసిస్తూ ఉంటాడు. శాస్త్రార్థాలు ఎరిగినవాడు. శీలసంపన్నుడు. వినీతుడు. శత్రువులకు తాపము ఎత్తిస్తాడు. యజుర్వేదము చక్కగా చదివినాడు. ధనుర్వేదము అభ్యసించినాడు. వేదవేదాంగాలలో పండితుడు. వేదవిదులు అతనిని ఎప్పుడూ పూజిస్తూ ఉంటారు.

"ఓ దేవీ! రాముడి మూపులు విశాలము అయినవి. ఆ మూపుల సంధి ఎముకలు అగుపడవు. శంఖమువంటి కంఠము, సుందరము అయిన ముఖము, మంచి ఎర్రని కనుకొలుకులు. ఆ మహాబాహువు జగత్ప్రసిద్ధుడు. కంఠస్వరము దుందుభిస్వనము మాదిరిగా ఉంటుంది. దేహము తళతళ మెరుస్తూ ఉంటుంది. ఏ అవయవాలు ఎంత ఉండవలెనో అంతే ఉన్నవి. ఆ ప్రతాపుడు శ్యామవర్ణమువాడు. ఆయన రొమ్ములూ, మణికట్టూ, పిడికిలీ కొట్టవచ్చినట్టుగా ఉంటవి. మోకాళ్ళూ,

వృషణాలూ, తల వెంట్రుకలూ ఒకదానికంటె ఒకటి హెచ్చు తగ్గులు లేకుండా సరిసమానముగా ఉంటవి. లోకడుపూ, బొడ్డుకొనా, రొమ్ములూ పొడుగు అయినవి. కనుకొలుకులూ, గోళ్ళూ, అరచేతులూ, అరికాళ్ళూ ఎఱ్ఱగా ఉంటవి. పాదరేఖలూ, లింగమూ, వెంట్రుకలూ నిగనిగలాడుతూ ఉంటవి. కంఠధ్వనీ, నాభీ, నడకా గంభీరముగా ఉంటవి. కంఠానికి మూడు రేఖలు ఉన్నవి. తలమీద మూడు సుళ్ళు వున్నవి. పిరుదులూ, పిక్కలూ పొట్టివి. అంగుష్ఠ మూలాన నాల్గు రేఖలు వున్నవి. నుదుటనూ, అరికాళ్ళలోనూ, అరచేతులలోనూ నాల్గు రేఖలు ఉన్నవి. ఆయన నాలుగు కిష్కువుల ఎత్తు (నాల్గు చేతులు-అంటే నాలుగు మూరల ఎత్తు). అతని బాహువులూ, ఊరువులూ, పిక్కలూ ఒకదానికంటె ఒకటి హెచ్చు తగ్గులు లేకుండా సమముగా ఉంటవి. పయివరస పళ్ళలో రెండూ, కిందివరస పళ్ళలో రెండూ మొత్తము నాలుగు కోరపళ్ళు ఉన్నవి.

"ఆయన సింహమువలె అప్రతిహతముగానూ, పెద్దపులివలె భయంకరము గానూ, ఏనుగువలె గంభీరముగానూ, ఆబోతువలె సవిలాసముగానూ నడుస్తాడు. దొండపండువంటి పెదవులు, కండలు బలసిన చెక్కిళ్ళు, నిడుపు అయిన ముక్కు, నూనూగు మీసాలు, పలువరుసా, కనుగవా తెల్లగా ఉంటవి. తల్లిదండ్రుల ఉభయుల వంశాలూ పరిశుద్ధము అయినవి.

"ఆయన సత్యధర్మపరాయణుడు. శ్రీమంతుడు. ఆర్జించడమూ, వెచ్చించడమూ ఎరిగినవాడు. ఏ ఏ కాలాలలో, ఏ ఏ దేశాలలో ఎట్లా ప్రవర్తించవలసిందీ తెలిసినవాడు. సర్వప్రాణులూ సంతోషించేట్లు మాట్లాడుతాడు. అతని సవితి తమ్ముడు లక్ష్మణుడు అపరాజితుడు. సౌందర్యములోనూ, గుణగణాలలోనూ అన్నగారితో సమా నము అయినవాడు. అతని దేహచ్ఛాయ మాత్రము బంగారము మాదిరిగా ఉంటుంది.

"ఆ పురుషసింహులు నీ కోసము ఈ భూమి అంతా వెతుకుతూ ప్రియదర్శనుడు అయిన సుగ్రీవుణ్ణి చూచినారు. ఆ సుగ్రీవుణ్ణి అతని అన్న వాలి అనేవాడు తన రాజ్యములో నుంచి వెళ్ళకొట్టినాడు. అతడు ఆ తోబుట్టువు భయమునుంచి, ఆ తోబుట్టువు రావటానికి వీలుకాని ఋశ్యమూక పర్వతముమీద దట్టముగా పెరిగిన అశోక వృక్షాలతో క్రిక్కిరిసిఉన్న మధ్యప్రదేశములో నివసిస్తున్నాడు. మేము ఆ సుగ్రీవుడి సచివులము. అతనితోనే ఉంటున్నాము.

"రమణీయము అయిన ఆ ఋశ్యమూక పర్వతము దగ్గిరకు చేతులలో ధనుస్సులు పట్టుకొని జటావల్కలధారులు అయిన రామలక్ష్మణులు వచ్చినారు. ఆ నరశార్దూలాలను సుగ్రీవుడు చూచి భయపడి పోయినాడు. ఆ అన్నదమ్ముల దగ్గిరకు నన్ను అక్కడనుంచి సుగ్రీవుడు పంపించినాడు. నేను ఆ శుభలక్షణ

లక్షితాంగుల దగ్గిరకు పోయి చేతులు జోడించి నమస్కారము చేసినాను. వారి యధార్థస్థితి తెలుసుకొన్నాను. నేను వారిని సంతోషపెట్టి, నా వీపుమీద ఎక్కించుకొని సుగ్రీవుడి దగ్గిరకు తీసికొని పోయినాను. మహాపరాక్రమవంతుడు అయిన సుగ్రీవుడికి రామలక్ష్మణుల యథార్థ స్థితి తెలియచెప్పినాను. వారు అన్యోన్యమూ మాట్లాడు కొన్నారు. అట్లా వానరనాయకుడు అయిన సుగ్రీవుడూ, నరనాయకుడు అయిన రామప్రభువూ సంతోషముతో స్నేహితులు అయినారు. తమకు అదివరకు సంభవించిన దురవస్థను ఒకరితో ఒకరు చెప్పుకొన్నారు. ఒకరిని ఒకరు ఓదార్చుకున్నారు.

"వాలి పరమపరాక్రమవంతుడు. స్త్రీ హేతువునుంచి సుగ్రీవుణ్ణి వెళ్ళకొట్టినాడు. ఆ సంగతి అంతా రామప్రభువు విని సుగ్రీవుణ్ణి ఊరడించినాడు. వాలిని సంహారము చేసి సుగ్రీవుడికి సుగ్రీవుడి భార్యను ఒప్పగించడానికి రామప్రభువు ప్రతిజ్ఞ చేసినాడు. అప్పుడు లక్ష్మణుడు నీవు ఆశ్రమములో నుంచి కనపడకుండా పోవడమూ, అందుకు రాముడు దుఃఖపడి పోవడమూ సుగ్రీవుడికి చెప్పినాడు. తనవలెనే తన స్నేహితుడున్నూ భార్యను పోగొట్టుకొన్నందుకు సుగ్రీవుడు తెల్లపోయినాడు. నిన్ను రావణాసురుడు ఎత్తుకొని పోయేటప్పుడు నీవు నేలమీద పడవేసిన ఆభరణాలను అన్నిటినీ అప్పుడు ఆ వానరశ్రేష్ఠుడు సంతోషముగా తీసుకొనివచ్చి రామప్రభువుకు చూపించినాడు. నీవు ఉన్న చోటు తెలియదు కనుక చెప్పలేక పోయినాడు.

"రామప్రభువు ఆ ఆభరణాలను చేతులతో పట్టుకొని చూస్తూ మూర్ఛపోయి నాడు. అప్పుడు నేలమీద పడిపోయిన ఆ ఆభరణాలను అన్నిటినీ తీసి నేను జాగ్రత్త చేసినాను. అంతట కొంతసేపటికి తెలివి వచ్చి రామప్రభువు ఆ ఆభరణాలను అన్నిటినీ తీసుకొని ఒడిలో పెట్టుకొని పదే పదే వాటివంక చూస్తూ ఏడ్చినాడు. ఆ ఆభరణాల కాంతులు ఆయనను దహించి వేస్తున్నందువల్లనో అన్నట్లు ఏడుస్తూ నేలమీద పడిపోయినాడు. అప్పుడు లక్ష్మణుడూ, సుగ్రీవుడూ, నేనూ ఎన్నో మాటలు చెప్పి రామప్రభువును ఓదార్చి లేవదీసినాము. అంతట ఆ ఆభరణాలను ఆయన లక్ష్మణుడికి పదేపదే చూపిస్తూ దాచి ఉంచడానికి సుగ్రీవుడికి ఇచ్చివేసినాడు.

"ఓ దేవీ! రామప్రభువు నీ ఎడబాటునుంచి జ్వలిస్తూ ఉన్న అగ్ని పర్వతమువలె ఉడికిపోతున్నాడు. నీ వియోగమునుంచి ఆయన నిద్రపోవడము లేదు. నిద్రపోక పోవడమునుంచీ, దుఃఖాగ్నినుంచీ అగ్నిహోత్రాలు ఉన్న అగ్నిహోత్ర గృహమువలె తపించిపోతున్నాడు. ఎప్పుడూ నిన్ను తలచుకొంటూ భూకంప సమయములో పర్వతమువలె కంపించిపోతున్నాడు. రమ్య కాననాలలో తిరుగుతూ వున్నా, ఆ యా నదుల దగ్గిరకూ, సెలయేళ్ళ దగ్గిరకూ పోయినా నీవు లేనందువల్ల సంతోష పడకుండా ఉన్నాడు.

"ఓ దేవీ! రామప్రభువు సమిత్రబాంధవముగా రావణాసురుణ్ణి సంహారము చేసివేస్తాడు. త్వరలో వస్తాడు. నిన్ను కలుసుకొంటాడు.

"అప్పుడు రామప్రభువూ, సుగ్రీవుడూ ఏకము అయి వాలిని చంపివేయడానికీ, నిన్ను వెతకడానికి ఏర్పాటు చేసుకొన్నారు. అంతట ఆ పరాక్రమశాలురు రామసుగ్రీవులు కిష్కింధకు పోయినారు. యుద్ధము చేసి ఆ వానరేశ్వరుణ్ణి వాలిని రామప్రభువు సంహారము చేసివేసినాడు. అంతట ఆ మహానుభావుడు రామప్రభువు సర్వవానరసంఘాలకున్నూ సుగ్రీవుణ్ణి రాజుగా చేసినాడు. ఈ విధముగా రామప్రభువుకూ, సుగ్రీవుడికీ స్నేహము వృద్ధి అయిపోయింది.

"సుగ్రీవుడు రాజ్యానికి రాగానే మహాబలవంతులు అయిన వానర సేనానాయకులను అందరినీ రావించి నిన్ను వెతకడానికి సేనాసమూహాలను దశదిశలకు పంపించినాడు. మహాపరాక్రమవంతులు అయిన వానర సేనానాయకులు పెద్ద కొండలు అంతటి వానర వీరులనూ, భల్లూక వీరులనూ వెంటపెట్టుకొని సుగ్రీవాజ్ఞను శిరసావహించి నీ కోసము ఇప్పుడు ఈ భూమి అంతా వెతుకుతూ వున్నారు. మహాబలవంతుడూ, కాంతియుతుడూ అయిన వాలి పుత్రుడు అంగదుడు వానర సైన్యములో మూడవ భాగాన్ని వెంటపెట్టుకొని నిన్ను వెతకడానికి ఈ దక్షిణదిశకు వచ్చినాడు. ఆ రామ సుగ్రీవులు ఇద్దరూ హనుమంతుడు అనే నన్ను దూతగా పొమ్మన్నారు. నేను అందువల్ల అంగదుడి వెంట వచ్చినాను. మేము వింధ్య పర్వతములో దారి తెలియక ఒక బిలములో చిక్కుపడిపోయి అనేక అహోరాత్రములు గడిపినాము.

"మేము తిరిగి కిష్కింధకు చేరడానికి సుగ్రీవుడు మాకు నిర్ణయించిన గడువు కాలము గడిచిపోయింది. చొరనలవికాని మహారణ్యాలనూ, మహాపర్వతాలనూ నదీప్రాంతాలనూ మేము నీకోసము వెతికినాము. నీవు ఎక్కడ వుందీ మాకు తెలియలేదు. సుగ్రీవుడు పెట్టిన గడువు కాలము అయిపోయినందువల్ల, మేము తిరిగి కిష్కింధకు పోయేట్లయితే అతడు మమ్మలను చిత్రవధ చేయిస్తాడు. అందువల్ల, మేము దుఃఖ సముద్రములో మునిగి దక్షిణ సముద్రతీరానికి చేరి ప్రాయోపవేశము చేసి ప్రాణాలు వదలడానికి నిశ్చయించుకొన్నాము.

"ఓ దేవీ! మేము అందరమూ ప్రాయోపవేశము చేసి నేలమీద పడుకొన్నాము. అందుకు అంగదుడు విచారపడిపోయినాడు. తన తండ్రిని రామప్రభువు చంపివేయడమూ, నీవు ఎక్కడనూ కనుపించక పోవడమూ, నిన్ను ఎవరు ఎత్తుకొని పోయిందీ చెప్పగలిగిన జటాయువు చచ్చిపోవడమూ మొదలు అయిన విషయాలను అంగదుడు వానర వృద్ధులతో చర్చిస్తూ వుండగా, మా కార్యసిద్ధికి వచ్చినాడో అన్నట్టు

పరమపరాక్రమవంతుడు అయిన పక్షిరాజు సంపాతి అనేవాడు అక్కడికి వచ్చినాడు. అతడు జటాయువు తోబుట్టువు. అంగదుడు చెప్పింది అతడు విన్నాడు. తన తమ్ముడు జటాయువును చంపివేసినట్టు చెప్పినందువల్ల అతడికి కోపము వచ్చింది. అంగదుణ్ణి చూచి 'నా తమ్ముణ్ణి జటాయువును ఎవరు చంపినారు? ఎక్కడ చంపినారు? అంతా వివరముగా చెప్పవలెను' అని అడిగినాడు. నీ కోసము జనస్థానములో జటాయువును ఆ భయంకరాకారుడు రావణాసురుడు చంపివేయడమూ మొదలు అయిన విషయాలు ఆ సంపాతికి అంగదుడు చెప్పినాడు. రావణాసురుడు తన తమ్ముణ్ణి జటాయువును చంపివేసినందుకు సంపాతి దుఃఖపడిపోయినాడు.

ఆ సంపాతే నీవు రావణాసురుడి ఇంట్లో వున్నావు అని మాకు చెప్పినాడు. నీ సంగతి తెలిసినందుకు మేము అందరమూ ఎంతో సంతోషపడ్డాము. వెంటనే అక్కడనుంచి బయలుదేరినాము. నిన్ను చూడగలము అనే సంతోషముతో మా అందరి దేహాలూ పులకలెత్తినవి. మేము ఈ సముద్రము ఉత్తరపుగట్టు చేరినాము. వానరులు అందరూ సముద్రాన్ని చూచి భయపడిపోయినారు. అందరూ మళ్ళీ దిగులుపడిపోయినారు. వానరులను అందరినీ చూచి నేను వాండ్ల భయము పోగొట్టినాను. నూరుయోజనాల సముద్రాన్ని దాటి ఇక్కడికి వచ్చినాను. రావణాసురుణ్ణి చూచినాను. పరమదుఃఖములో వున్న నిన్ను చూచినాను.

"ఓ దేవీ! ఈ వృత్తాంతము అంతా జరిగింది జరిగినట్టు నీకు చెప్పినాను. నేను రామప్రభువు పంపిస్తే వచ్చిన దూతను. మరి ఒకణ్ణి కాను. నీవు నాతో మాట్లాడవలసింది. నేను రామకార్యార్థమే ఇక్కడికి వచ్చినాను. నేను సుగ్రీవుడి సచివుణ్ణి. నీవు తలచినట్టు నేను మాయావిని కాను. ఓ దేవీ! ధానుష్కులు అందరిలోనూ అగ్రగణ్యుడు అయిన నీ పెనిమిటి క్షేమముగా ఉన్నాడు. అన్నగారిని ఆరాధించే ఆ శుభలక్షణుడు లక్ష్మణుడు కుశలముగా ఉన్నాడు. సుగ్రీవుడి ఆజ్ఞను శిరసావహించి పరమపరాక్రమవంతుడు అయిన నీ పెనిమిటికి మేలు చేయడానికి నేను ఒక్కణ్ణే ఇక్కడకు రాగలిగినాను. నేను కామరూపుణ్ణి. మరి ఒక తోడులేకుండా అసహాయుణ్ణిగా నేను ఇక్కడికి వచ్చినాను. నీవు ఎక్కడ ఉందీ తెలియక దుఃఖపడుతూ ఉన్న వానరుల దగ్గిరకు ఇక నేను తిరిగిపోయి, నా భాగ్యవశమువల్ల నీవు నాకు కనిపించిన సంగతి చెప్పి వాండ్ల దుఃఖము పోగొట్టుతాను. నా సముద్రలంఘనము నా అదృష్టమువల్ల వ్యర్థము అయిపోలేదు. నిన్ను చూచిన కీర్తి నాకు దక్కింది. ఆ మహాపరాక్రమవంతుడు రామప్రభువు త్వరలోనే వచ్చి సమిత్రబాంధవముగా రావణాసురుణ్ణి సంహారము చేసి నిన్ను కలుసుకుంటాడు.

"ఓ దేవీ! పర్వతాలలో 'మాల్యవంతము' అనే ప్రసిద్ధము అయిన పర్వతము ఒకటి ఉంది. అక్కడ 'కేసరి' అనే వానరుడు నివసిస్తూ ఉండేవాడు. అతడు ఒకప్పుడు ఆ పర్వతము వదలిపెట్టి 'గోకర్ణము' అనే పర్వతానికి పోయినాడు. దేవర్షులు ఆజ్ఞాపించినందువల్ల అతడు అక్కడ పవిత్రము అయిన సముద్రతీరాన 'శంబనాదనుడు' అనే రాక్షసుణ్ణి చంపివేసినాడు. ఆ కేసరి నా తండ్రి. ఆయన భార్యకు వాయుదేవుడివల్ల నేను పుట్టినాను. నేను చిన్నప్పుడుచేసిన పనికి నాకు ఈ లోకములో 'హనుమంతుడు' అనే పేరు వచ్చింది. ఓ దేవీ! నీకు నమ్మకము కలగడానికోసము నీ పెనిమిటి రామప్రభువు గుణగణాలను వర్ణించినాను. ఓ దేవీ! ఆ రామప్రభువు త్వరలోనే నిన్ను ఇక్కడనుంచి తీసుకొనిపోతాడు" అని చెప్పినాడు.

ఈవిధముగా చెప్పినందువల్ల ఆ హనుమంతుడు రామదూతేను అని సీతాదేవి నమ్మింది. ఆమెకు అమిత సంతోషము వేసింది. ఆనందబాష్పాలు వదిలింది. తెల్లని కనుగుడ్లతోనూ, ఎర్రని కనుకొలకులతోనూ ఉన్న ఆ విశాలాక్షి ముఖబింబము అప్పుడు రాహువు వదిలిన చంద్ర బింబమువలె శోభించింది. అతడు స్పష్టముగా వానరుడే కాని మరి ఒకడు కాదు అని ఆమె అనుకుంది. అంతట హనుమంతుడు మళ్ళీ ఆ ప్రియదర్శిని సీతాదేవితో, "ఓ మైథిలీ! నీకు నేను ఇది అంతా చెప్పినాను. ఊరడిల్లు. నేను ఏమిటి ఎట్లా చేయడము నీకు ఇష్టమో అది చెప్పు. నేను మళ్ళీ పోతాను.

"ఓ దేవీ! మహర్షులు ప్రేరేపించినందువల్ల వానరవీరుడు కేసరి శంబనాదనుడు అనే రాక్షసుణ్ణి యుద్ధములో చంపివేసినాడు. నేను ఆ కేసరి భార్యకు వాయుదేవుడి అనుగ్రహమువల్ల పుట్టినాను. ప్రభావములో నేను ఆ వాయుదేవుడితో సరిసమానము అయినవాణ్ణి" అని హనుమంతుడు చెప్పినాడు.

36

రాముని ఆనవాలు

ఆ మహా తేజోవంతుడు మారుతాత్మజుడు తనను సీతాదేవి నమ్మేటందుకు మళ్లీ వినయముతో, "ఓ మహాభాగా! నేను వానరుడను. ఆ బుద్ధిసంపన్నుడు రామ ప్రభువు నన్ను దూతగా పంపించినాడు. ఓ దేవీ! ఇదిగో చూడు, రామనామాంకితము అయిన ఉంగరము. నీవు నన్ను నమ్మడానికోసము ఈ ఉంగరము ఆయన నాకు ఇచ్చినాడు. నేను తెచ్చినాను. ఊరడిల్లు. నీకు శుభము అవుతుంది. నీ దుఃఖాలు అన్నీ నాశనము అయిపోతవి" అంటూ ఉంగరము ఇచ్చినాడు.

సీతాదేవి ఆ ఉంగరము తీసుకొన్నది. పరిశీలించి చూచింది. తన పెనిమిటి వచ్చినట్టుగా సంతోషపడ్డది. ఆ విశాలాక్షి తామ్రశుక్లాయత నేత్రాలు వికసించినవి.

భర్తృ సందేశానికి ఆమె దేహము పులకరించింది. సిగ్గు వచ్చింది. సంతోషము వేసింది. ఆ మహాకపిని హనుమంతుణ్ణి ఎంతో మెచ్చుకొన్నది.

"ఓ వానరుడా! నీవు ఒక్కడివే ఈ రాక్షసపదాన్ని తిరస్కరించ కలిగినావు. నీవు పరాక్రమశాలివి. సమర్థుడవు. ప్రాజ్ఞుడవు. సముద్రములో నూరుయోజనాల విస్తీర్ణాన్ని గోవుపాదము అంతగా చేసి దాటివచ్చినావు. నీది పొగడవలసిన పరాక్రమము. ఓ వానరపుంగవా! నీవు సామాన్యము అయిన వానరుడవు కావు. నీవు రావణాసురుడికి భయపడలేదు. నీవు సంభ్రమపడలేదు. ఆ విదితాత్ముడు రామప్రభువు నిన్ను పంపించినాడు. కాబట్టి నీతో నేను మాట్లాడుతున్నాను. ఆ దుర్ధర్షుడు రామప్రభువు నీ పరాక్రమము ఎరగకుండానూ, నిన్ను పరీక్షించకుండానూ పంపించి ఉండడు.

"నా భాగ్యవశమువల్ల ఆ ధర్మాత్ముడు, ఆ సత్యసంధుడు రామ ప్రభువూ, ఆ పరాక్రమశాలి లక్ష్మణుడూ కుశలముగా ఉన్నారు. కాకుత్స్థుడు కుశలముగా ఉన్నట్లయితే సముద్రము మొలనూలుగా ఉన్న ఈ భూమిని ప్రళయాగ్నివలె లేచి దహించివేసేవాడు. ఎందుకో ఊరకున్నాడు. ఆ అన్నదమ్ములు దేవతలను అయినా నిగ్రహించే శక్తిమంతులు. అయితే, నా దుఃఖాలకు అంతములేదు ఏమో! ఆ రామప్రభువు నా కోసము దుఃఖపడడము లేదా? నన్ను తీసుకొని పోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాడా? ఆ రామప్రభువు దీనుడుగా లేడా? సంభ్రాంత చిత్తుడు అయి మైమరచిపోయినాడా? పురుషప్రయత్నము చేస్తున్నాడా? ఆ పరంతపుడు విజిగీషువుగా మిత్రుల విషయములో సామదానోపాయాలనూ, శత్రువుల విషయములో దాన భేద దండోపాయాలనూ అనుష్ఠిస్తున్నాడా? ఆ మహానుభావుడు స్నేహితులను సంపాదించుకొన్నాడా? ఇతరులు కూడా తమకు అతడు కావలెను అని కోరుకొంటున్నారా? మంచిమిత్రులు ఉన్నారా? ఆ మిత్రులు ఆయనను తమకు ముఖ్యుడు అనుకొంటున్నారా?

"ఆ రామప్రభువు దేవతల అనుగ్రహాన్ని ఆశిస్తున్నాడా? ఆయన పురుష ప్రయత్నానికి దైవము అనుకూలముగా ఉంటుందా? నేను ఇతర దేశములో ఉన్నందువల్ల నామీద స్నేహము ఆయనకు పోలేదా? నాకు ఈ దుఃఖము లేకుండా చేస్తాడా? ఆయన ఎప్పుడూ సుఖము అనుభవించవలసినవాడు. దుఃఖము అనుభవించవలసినవాడు కాడు. దుఃఖము ఎక్కువయిపోయి, ఆయన కృశించి పోయినాడా? ఆయనకు కౌసల్యా సుమిత్రాదేవుల క్షేమమూ, భరత శత్రుఘ్నుల క్షేమమూ అప్పుడప్పుడూ తెలుస్తూ ఉన్నదా? ఆ పూజనీయుడు నా నిమిత్తము దుఃఖపడుతున్నాడా? అన్యమనస్కుడుగా లేడు కదా! నన్ను కడతేరుస్తాడా?

"ఆ భ్రాతృవత్సలుడు భరతుడు నా కోసము భయంకరము అయిన మంత్రులను ఇచ్చి (ఇరవైఒక్కవేల ఎనమన్నూట డెబ్బయి రథాలూ, అన్నే ఏనుగులూ, అరవై అయిదువేల ఆర్నూటపది గుర్రాలూ, ఒక లక్షా తొంబైవేల మున్నూట ఏబదిమంది పదాతులూ ఉండే) ఓ అక్షౌహిణీ సైన్యాన్ని అన్నగారికి పంపిస్తాడా? ఆ శ్రీమంతుడు వానరాధిపతి సుగ్రీవుడు, దంత నఖాయుధాలతో పోరాడే వానర వీరులను వెంటపెట్టుకొని నా కోసము రామప్రభువుతో వస్తాడా? ఆ సుమిత్రానంద వర్ధనుడు, ఆ సకలాస్త్రకోవిదుడు లక్ష్మణుడున్నూ ఆయన వెంట వచ్చి బాణాలతో రాక్షసులను చంపివేస్తాడా? భయంకరముగా మంటలు మండే బాణాలకు సుహృజ్జనులతో కూడా రావణాసురుడు యుద్ధములో చావడము త్వరలో నేను చూస్తానా? నేను లేకపోవడము వల్ల బంగారము వలె మెరిసిపోతూ పద్మమువలె సుగంధములు గుబాళిస్తూ ఉండే ఆ రామప్రభువు ముఖారవిందము, నీళ్లు అడుగంటి ఎండతాకుడుకు శోషిల్లిన పద్మమువలె అయిపోయిందా? ధర్మసిద్ధికోసము రాజ్యము వదిలిపెట్టి పాదచారి అయి నన్ను వెంటపెట్టుకుని మహారణ్యానికి వచ్చినప్పుడు ఆ రామప్రభువు వ్యథపడలేదు, భయపడలేదు, దుఃఖపడలేదు. ఆ మహానుభావుడు ఇప్పటికిన్నీ అట్లాగే మనోధైర్యముతో ఉంటూ ఉన్నాడా? నామీద ఉన్న స్నేహము ఆ రామప్రభువుకు ఆయన తండ్రి మీద కానీ, తల్లిమీద కానీ, మరి ఎవరిమీద కానీ లేదు. ఆయన మీద నాకు ఉన్న స్నేహమున్నూ అటువంటిదే. ఆయన సంగతి తెలిసేటంత వరకూ నేను జీవించి ఉండవలెను అనుకొన్నాను" అంటూ మహార్థముగానూ, మధురార్థముగానూ చెప్పి రాముణ్ణి గురించి మనోహరము అయిన మాటలు వినడానికోసము ఊరుకున్నది.

అప్పుడు ఆ భయంకర పరాక్రముడు మారుతాత్మజుడు చేతులు జోడించి శిరము వంచి, "ఓ కమలాక్షీ! రామప్రభువు నీవు ఇక్కడ వున్నట్టు ఎరుగడు. అందుచేత, దేవేంద్రుడు తన భార్య శచీదేవి అనుహ్లాదుడి దగ్గర వుంది అని తెలియక ఆమెను తీసుకొని పోనట్టు, నీవు ఎక్కడ వుందీ తెలియక నిన్ను రాముడు ఇంతవరకూ ఇక్కడనుంచి తీసుకొని పోలేదు. శచీదేవి అనుహ్లాదుడి దగ్గర ఉంది అని తెలియగానే దేవేంద్రుడు ఆమెను తీసుకొనిపోయినాడు. అదేవిధముగా నేను పోయి చెప్పగానే రామప్రభువు ఇక్కడికి వచ్చి నిన్ను తీసుకొనిపోతాడు. నేను పోయి చెప్పీ చెప్పడముతో వానర సేనా సమూహాలనూ, భల్లూక సేనాసమూహాలనూ వెంటపెట్టుకొని రామప్రభువు బయలుదేరి వస్తాడు. క్షోభపెట్ట నలవికాని మహాసముద్రాన్ని తన బాణసమూహాలతో స్తంభించిపోయేట్లు చేస్తాడు. ఈ లంకాపట్టణానికి వస్తాడు. రాక్షసులను అందరినీ నిర్మూలనము చేస్తాడు. దారిన అడ్డము అయ్యే సురాసురులనుకానీ, మృత్యువునుకానీ రామప్రభువు సంహారము చేసివేస్తాడు.

"ఓ పూజ్యురాలా! నీవు కనపడకుండా ఉన్నందువల్ల రామప్రభువు దుఃఖసముద్రములో మణిగి సింహము పీడించిన ఏనుగువలె సుఖము లేకుండా బాధపడుతున్నాడు. సుందరము అయిన నేత్రాలతో, దొండపండువంటి మనోహరము అయిన పెదవులతో, ధగధగ మెరిసే కుండలాలతో ఉదయించే పూర్ణచంద్రుడివలె రామప్రభువు నీకు కనపడుతాడు. నీవు చూస్తావు. నేను మలయపర్వతము మీదనూ, వింధ్యపర్వతము మీదనూ, మేరుపర్వతము మీదనూ, మందరపర్వతము మీదనూ, దుర్దరపర్వతము మీదనూ దొరికే కందమూల ఫలాలమీద ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను. ఓ దేవీ! ఐరావతము మీద దేవేంద్రుణ్ణివలె ప్రస్రవణపర్వతముమీద రామప్రభువును నీవు త్వరలోనే చూస్తావు.

"ఓ దేవీ! నీ దుఃఖమునుంచి రామప్రభువు మాంసము తినడము లేదు. మద్యము తాగడము లేదు. వానప్రస్థుడివలె సాయంకాల మప్పుడు మాత్రము ఒక్క పర్యాయమే కందమూలాలను తింటున్నాడు. ఆ మహానుభావుడి మనస్సు అంతా నీ మీదనే ఉంది. తన ఒంటిమీద వాలే ఈగలను కానీ, దోమలను కానీ తోలుకోను అయినా తోలుకోడు. పురుగులను అయినా, పాములను అయినా తోలడు. నీవు లేనందువల్ల కామపరవశుడు అయి ఎప్పుడూ నిన్నే ధ్యానము చేస్తూ ఉన్నాడు. నీ వియోగమునుంచే ఎప్పుడూ శోకపరాయణుడుగా ఉంటున్నాడు. నిన్ను గురించి తప్ప మరి దేనిని ఏ కొంచెమూ ఆలోచించడము లేదు. ఎప్పుడూ నిద్రపోవడము లేదు. ఒక వేళ నిద్రపట్టినా 'సీతా! సీతా!' అని మనోహరముగా పిలుస్తూ నిద్ర మేలుకొంటాడు. ఒక పండును అయినా, ఒక పువ్వును అయినా, మనోహరము అయింది ఇంకా దేనిని అయినా చూడగానే ఆ రామప్రభువు, 'అయ్యో ప్రియురాలా' అని నిన్ను తలచుకొంటూ నిట్టూర్పులు విడుస్తాడు.

"ఓ దేవీ! ఆ ధృఢవ్రతుడు, ఆ మహాత్ముడు రామప్రభువు ఎప్పుడూ పరితాపపడుతూ, 'సీతా! సీతా!' అని నీ పేరు పెట్టి పిలుస్తూ నిన్ను పొందడానికి ప్రయత్నము చేస్తున్నాడు" అని చెప్పినాడు.

ఇట్లా హనుమంతుడు చెప్పింది ఆ వైదేహి విన్నది. రాముడితో సరిసమానముగా దుఃఖపడుతూ ఉన్న ఆమె దుఃఖము ఒక కొంత ఉపశమించింది. శరత్కాలారంభములో మిగిలి ఉన్న మబ్బులలో చంద్రుడు ఉదయించిన శుక్లపక్ష రాత్రివలె ఆమె కనిపించింది.

37

సీత దుఃఖోపశమనము

హనుమంతుడు చెప్పింది అంతా ఆ పూర్ణచంద్రనిభానన సీతాదేవి విన్నది. అంతట ధర్మయుక్తముగా, "ఓ హనుమంతుడా! రామ ప్రభువు ఎప్పుడూ నన్ను తప్ప

మరి దేనినీ తలచుకోడము లేదు అని చెప్పి నన్ను సంతోషపెట్టినావు. నానుంచి ఆ మహానుభావుడు నిరంతరమూ దుఃఖపరాయణుడుగా ఉంటూ ఉన్నాడు అని చెప్పి నన్ను దుఃఖపెట్టినావు. నీవు ఈవిధముగా అమృతముతో విషము కలిపినట్టుగా నాకు చెప్పినావు. మహదైశ్వర్యములో ఉన్నా, దారుణము అయిన కష్టాలు అనుభవిస్తూ ఉన్నా తాటితో కట్టివేసి లాగుకొని పోయినట్లు దైవము మానవుణ్ణి ఎక్కడికో తీసుకొని పోతుంది. ప్రాణికోటి దైవాన్ని నిగ్రహించడము అసంభవము. నిజము. నేనూ, ఆ రామప్రభువూ, లక్ష్మణుడూ మహాకష్టాల పాలయి ఎట్లా కొట్టుకులాడుతున్నామో చూడు. సముద్రమధ్యములో నౌక పగిలిపోవడమువల్ల నీటిలో పడి ఈదుతూ అలసిపోయిన వాడివలె, ఇప్పుడు దుఃఖసముద్రములో మునుగుతూ తేలుతూ ఉన్న రామప్రభువు ఎప్పుడు గట్టు ఎక్కుతాడో? ఓ హనుమంతుడా! నా పెనిమిటి రాక్షసులను అందరినీ సంహారముచేసి రావణాసురుణ్ణి వధించివేసి, లంకాపట్టణాన్ని నిర్మూలనము చేసి నన్ను ఎప్పుడు చూస్తాడో? నాకు రావణాసురుడు సంవత్సరము గడువు పెట్టినాడు. ఈ గడువుకాలము సంవత్సరమూ గడిచిపోయే లోపలనే ఆయన ఇక్కడికి రావలెను అని చెప్పు. ఈ గడువుకాలము వరకూ నా బొందిలో ప్రాణము ఉంటుంది. ఆ క్రూరకర్ముడు రావణాసురుడు నాకు పెట్టిన గడువుకాలములో ఇప్పుడు పదోమాసము జరుగుతూ ఉంది. ఇంకా రెండు మాసాల గడువుకాలమే మిగిలి ఉంది.

"ఓ హనుమంతుడా! రావణాసురుడి తమ్ముడు విభీషణుడు అనే వాడు నన్ను రామప్రభువు దగ్గరకు పంపించివేయడానికి ప్రయత్నము చేసినాడు. కాని, రావణాసురుడికి అట్లా చేయటము ఏమాత్రమూ ఇష్టము లేకపోయింది. అందుకు ఆ రాక్షసుడు ఎంత మాత్రము ఒప్పుకోలేదు. రావణాసురుడు ఇప్పుడు కాలవశంగతుడు అయి ఉన్నాడు. మృత్యుదేవత వాణ్ణి పట్టుకొని పోవడానికి యుద్ధముకోసము వెతుకుతూ ఉంది. విభీషణుడి పెద్దకూతురు 'వల' అనే ఆమెను, ఆమె తల్లి నా వద్దకు పంపించింది. ఆ కన్నె నాకు ఈ సంగతి చెప్పింది.

"ఓ హనుమంతుడా! నా పెనిమిటి శీఘ్రముగానే వచ్చి నన్ను కలుసుకొంటాడు. సందేహము లేదు. ఏమంటే, నా అంతరాత్మ పరిశుద్ధముగా ఉంది. నాకు అట్లా తోస్తున్నది. ఆ రామప్రభువులో ఎన్నో సద్గుణాలు ఉన్నవి. ఉత్సాహమూ, పౌరుషమూ, బలమూ, దయా, కృతజ్ఞతా, శౌర్యమూ, ప్రభావమూ అనేవి అన్నీ ఆయనలో మూర్తీభవించినవి. జనస్థానములో తమ్ముడు దగ్గర లేకుండానే పధ్నాలుగువేలమంది రాక్షసులను ఆయన ఒక్కడే సంహారము చేసివేసినాడు. అటువంటివాడికి ఎటువంటివాడు శత్రువు అయినప్పటికిన్నీ బ్రతికి ఉండలేడు. ఎన్ని కష్టాలు వచ్చినా ఆ పురుషోత్తముడు ఏ మాత్రమూ చలించడు. దేవేంద్రుడి ప్రభావము శచీదేవి

ఎరుగును. రామప్రభువు ప్రభావము నేను ఎరుగుదును. బాణసమూహాలు అనే కిరణాలతో ఆ రామ దివాకరుడు రాక్షసులు అనే జలాలను ఎండకొట్టుతాడు" అంటూ, రాముడికోసము దుఃఖముతో కృశించిపోయిన ఆ సీతాదేవి బొటబొట కన్నీళ్ళు కార్చింది.

అప్పుడు హనుమంతుడు, "ఓ దేవీ! నేను పోయి చెప్పీ చెప్పడముతోటే రామప్రభువు వానరసేనా సమూహాలతోనూ, భల్లూకసేనా సమూహాలతోనూ బయలుదేరి వస్తాడు. ఓ సుందరాననా! అట్లాకాదు అనేట్లయితే ఇప్పుడే నిన్ను యీ దుఃఖము నుంచి నేను తప్పించివేస్తాను. నీవు నా వీపుమీద ఎక్కు. నీతోకూడ నేను ఈ సముద్రాన్ని దాటిపోతాను. నా శక్తి యేమి అని చెప్పేది? రావణాసురుడితో కూడా ఈ లంకాపట్టణాన్ని నా వీపుమీద పెట్టుకొని సముద్రాన్ని దాటిపోగలను. ఓ మైథిలీ! వ్రేల్చిన హవిస్సును అగ్నిహోత్రుడు తీసుకొనిపోయి దేవేంద్రుడికి ఇచ్చేటట్టు, నిన్ను నేను మోసుకొనిపోయి ఆ రామప్రభువుకు సమర్పిస్తాను. రాక్షస సంహారానికి లక్ష్మణుడితోకూడా ప్రయత్నము చేస్తూవున్న మహావిష్ణువు వంటి రామప్రభువును నీవు ఇప్పుడే చూస్తావు. ఐరావత శిరముమీద కూర్చున్న దేవేంద్రుడివలె ప్రస్రవణ పర్వతముమీద కూర్చుని నిన్ను చూడవలెను అని తహతహలాడుతూ వున్న ఆ మహాబలవంతుడు రామప్రభువు నిన్ను ఇప్పుడే చూస్తాడు.

"ఓ మంగళస్వరూపిణీ! నీవు నా వీపుమీద కూర్చో! నా మాట ఉపేక్షించవద్దు. ఆ రామప్రభువు దగ్గరకు నిన్ను తీసికొని పోతాను. మనోజ్ఞుడు అయిన చంద్రుడితోనూ, అమిత కాంతిమంతుడు అయిన సూర్యుడితోనూ నీవు మాట్లాడపోతూ వున్నట్టుగా ఉంటుంది. అంతలో నేను ఈ సముద్రాన్ని ఆకాశమార్గములో దాటిపోతాను. ఓ దేవీ! నేను ఇక్కడనుంచి తీసుకొని పోయేటప్పుడు రాక్షసులు చూచినా ఇబ్బంది ఉండదు. నా అంతటి గమనవేగముకలవాడు ఈ లంకాపట్టణములో ఎవడూ లేడు. నన్ను వెంబడించి రాక్షసులు పట్టుకోడము వుత్తది. నే నెంత సులభముగా ఇక్కడికి వచ్చినానో, అంత సులభముగా నిన్ను నా వీపున ఎక్కించుకొని ఆకాశమార్గాన సముద్రాన్ని దాటిపోతాను. సందేహపడవద్దు" అని చెప్పినాడు.

హనుమంతుడు చెప్పిన ఈ మాటకు సీతాదేవి ఎంతో సంతోషపడ్డది. ఆశ్చర్యముతోనూ, సంతోషముతోనూ ఆమె దేహము ఉప్పొంగి పోయింది.

"ఓ హనుమంతుడా! నీవు నన్ను అంతదూరము ఎట్లా మోసుకొనిపోతావు? నీవు చేయతలచుకొన్నది పరమ సాహసకృత్యముగా నాకు తోస్తున్నది. నీది కాస్త దేహము. నా భర్త దగ్గరకు ఎట్లా మోసుకొని పోవలెను అనుకొన్నావు" అని సీతాదేవి ప్రశ్నించింది.

ఆ కాంతిమంతుడు మారుతాత్మజుడు సీతాదేవి అట్లా ప్రశ్నించినందువల్ల, తనను ఆమె తక్కువవాణ్ణిగా భావిస్తున్నది అనుకొన్నాడు. "ఈ అసితేక్షణ నా బలము ఎరుగదు. నా ప్రభావము ఎరుగదు. నేను ఎంత శక్తిమంతుణ్ణి అయిందీ ఈమె ఊహించలేదు. ఈమె నా మహదాకారము చూస్తే సరిపోతుంది" అనుకొని ఆ అరిమర్దనుడు, ఆ ప్లవంగసత్తముడు, ఆ వాయుపుత్రుడు హనుమంతుడు తన మహదాకారము చూపించడానికి ఆ చెట్టు అవతలకు ఎగిరి తన దేహాన్ని పెంచడము మొదలు పెట్టినాడు. మేరుమందర పర్వతాల అంత ఎత్తు జ్వలితాగ్ని హోత్ర కాంతులతో ఆ సీతాదేవి ఎట్టఎదటికి పోయి హనుమంతుడు నిలుచున్నాడు. ఆ మహాబలవంతుడు ఎర్రటిముఖముతోనూ, వజ్రాయుధాలవంటి కోరలతోనూ, పెద్దపులి గోళ్ళవంటి గోళ్ళతోనూ, పరమ భయంకరము అయిన ఆకారముతోనూ నిలుచుని చేతులు జోడించి సీతాదేవితో, "ఓ దేవీ! పర్వతాలతోనూ, వనాలతోనూ, కోట బురుజులతోనూ, బహిర్ద్వారాలతోనూ ఉన్న ఈ లంకాపట్టణాన్ని రావణాసురుడితో కూడా ఎత్తుకొని పోయే శక్తి నాకు ఉంది. ఓ మంగళ స్వరూపిణీ! నీ బుద్ధి స్థిరము చేసుకో. ఉపేక్షించవద్దు. ఆ రామ ప్రభువు దుఃఖము రూపుమాసి పోతుంది" అని చెప్పినాడు.

ఆ పద్మపత్ర విశాలాక్షి ఆ భయంకరాకారుణ్ణి మారుతాత్మజుణ్ణి చూచి "ఓ మహావీరుడా! నీ ధైర్యమూ, నీ బలమూ, వాయువువంటి నీ గమనశక్తి, అగ్ని హోత్రుడు వంటి నీ తేజమూ చూస్తున్నాను. నిన్ను తెలుసుకొంటున్నాను. నీవు ఇంతవాడవు అయినందువల్లనే, అంతులేని సముద్రాన్ని దాటి ఇక్కడికి వచ్చినావు. నన్ను మోసుకొని పోయే సామర్థ్యము నీకు ఉంది. అయితే, నీవు వచ్చిన పని అయింది. ఇకను ఆ మహాత్ముడి కార్యసిద్ధిని గురించే నీవు అవశ్యమూ ఆలోచించవలెను.

"ఓ పుణ్యాత్ముడా! నేను నీతో బయలుదేరడము మంచిపనికాదు. నీవు వాయువేగముతో ఎగిరిపోతూఉంటే నాకు ఒళ్ళు తెలియకుండా పోతుంది. నీవు అమితవేగముతో సముద్రముమీద ఆకాశమార్గాన పోతూఉంటే, నాకు భయమువేసి నీ వీపుమీద నుంచి నేను జారి సముద్రములో పడిపోతే పడిపోవచ్చును. అట్లా ఒళ్ళు తెలియకుండా సముద్రములో పడిపోగానే తిమింగలాలూ, నక్రాలూ, మత్స్యాలూ నన్ను మింగివేస్తవి. ఓ హనుమంతుడా! శత్రువులను నాశనముచేసే శక్తి నీకు వుంది. కాని, నీతో వచ్చే సాహసము నేను చేయను. నీవు వెంట మరి ఒకరిని తీసుకొనిపోయేటట్లయితే, నీవు సురక్షితముగా పోగలవో లేదోనని నాకు సందేహము వేస్తూవుంది. నీవు నన్ను వీపున ఎక్కించుకొని ప్రయాణము కాగానే ఆ దుష్టాత్ముడు రావణాసురుడు నిన్ను పట్టుకోవలసింది అని భయంకరులయిన రాక్షసులను

ఆజ్ఞాపిస్తాడు. వాళ్ళు అప్పుడు నీ వెంటపడతారు. ఓ వీరుడా! శూలాలతోనూ, ముద్గరాలతోనూ, వివిధాయుధాలతోనూ రాక్షసశూరులు నీ చుట్టూ మూగుతారు. నన్ను తీసికొనిపోయేటట్లయితే అటువంటి అప్పుడు నీ పని ఏమి అవుతుందోనని నాకు సందేహముగా వుంది. అనేకమంది రాక్షసులు సాయుధులుగా ఆకాశములో నిన్ను చుట్టుముట్టితే నీవు ఒంటరివాడవూ, నిరాయుధుడవూ నన్ను కాపాడుతూ ఎట్లా పోరాడుతావు? నీవు ఆ క్రూరకర్ములతో పోరాడుతూ వుంటే, నేను భయార్తను అయి నీ వీపుమీదనుంచి క్రింద పడిపోతే పడిపోవచ్చును. రాక్షసులు భయంకరులు. వాండ్లు అందరూ మహాకాయులు, మహాబలవంతులు. పోరాటములో ఎట్లాగు అయినా నిన్ను జయించి వేస్తారు. ఒకవేళ అట్లా కాకపోయినట్లయితే నీవు యుద్ధము చేస్తూ పరవశుడవు అయితే నేను కిందపడిపోతాను. ఆ పాప రాక్షసులు అప్పుడు నన్ను పట్టుకొనిపోతారు.

“ఓ హనుమంతుడా! యుద్ధములో జయాపజయాలు ఎవరూ ముందుగా నిర్ణయించలేరు. నీవు జయించలేక పోయేట్లయితే, రాక్షసులు నీ చేతులలోనుంచి నన్ను లాగుకొనిపోయి ముక్కలు ముక్కలుగా నరికివేస్తారు లేదా నన్ను పట్టుకొని నాకు ప్రాణాపాయము అయ్యేట్టు బాధపెట్టుతారు. అట్లా అయ్యేటట్లయితే, నీవు ఇంతదూరమూ శ్రమపడి వచ్చి చేసిన ప్రయత్నము అంతా నిష్ఫలము అయిపోతుంది.

“ఓ మతిమంతుడా! నీవు సర్వరాక్షసులనూ చంపివేయ కలవు. నన్ను అవలీలగా తీసుకొనిపోగలవు. అట్లా నీవు నన్ను తీసుకొని పోయేట్లయితే రామప్రభువు కీర్తి పాడయిపోతుంది. జనస్థానములో రావణాసురుడు మాయసన్యాసి వేషము వేసుకొనివచ్చి భార్యను దొంగిలించుకొనిపోతే, ఆ దుష్టాత్ముణ్ణి యుద్ధములో వధించలేక రామప్రభువు ఒక వానరుణ్ణి పంపించి రావణాసురుడి మాదిరిగానే దొంగిలించేట్టు చేసి భార్యను సంపాదించుకొన్నాడు అని శూరులు హేళన చేస్తారు.

“అట్లా కాకపోయేట్లయితే నీవూ, నీతోపాటు వానరులూ, రామ లక్ష్మణులూ కనుక్కోలేని రహస్య ప్రదేశాలలో రాక్షసులు నన్ను దాచిపెట్టుతారు. అప్పుడున్నూ నీవు నా కోసము చేసిన ప్రయత్నము అంతా నిరర్థకము అయిపోతుంది. అందువల్ల, నీవు పోయి చెప్పు. ఆ రామప్రభువును నీవు వెంటపెట్టుకొని వస్తే ఎంత అయినా బాగుంటుంది. ఓ హనుమంతుడా! ఆ మహాత్ముడు రామప్రభువు ప్రాణమూ, ఆయన తమ్ముల ప్రాణాలూ, సుగ్రీవుడి ప్రాణమూ, ఆయన వంశీయుల ప్రాణాలూ నా క్షేమముమీద ఆధారపడి ఉన్నవి. నాకు ఏది అయినా అపాయము అయ్యేట్టయితే దుఃఖముతో కృశించిపోతూ ఉన్న ఆ రామలక్ష్మణులు బ్రతకటము ఉత్తది. వారేకాదు, అప్పుడు సమస్తము అయిన భల్లూకవీరులూ, వానరవీరులూ ప్రాణాలు వదలిపెట్టుతారు.

"ఓ హనుమంతుడా! నాకు నా పెనిమిటిమీద ఉన్న భక్తినుంచి నేను రామ ప్రభువును తప్ప మరి ఒకరి దేహము తాకను. రావణాసురుడు నన్ను బలవంతముగా పట్టుకొన్నాడు. అప్పుడు ఏమి చేయడానికీ నాకు శక్తి లేకపోయింది. నా పెనిమిటి ఎక్కడ ఉన్నాడోను అనే దిగులులో ఉన్నాను. నేను వివశను అయి ఉన్నాను. ఏమి చేసేది? రామప్రభువు ఇక్కడికి వచ్చి రావణాసురుణ్ణి సబాంధవముగా సంహారము చేసివేసి నన్ను ఇక్కడినుంచి తీసుకొని పోయేటట్లయితే, ఆయన గౌరవానికీ, శౌర్యానికీ తగినట్టుగా ఉంటుంది. ఆ మహాపరాక్రమవంతుడు రామప్రభువు యుద్ధములో శత్రువులను మర్దించే పరమపరాక్రమ కృత్యాలను గురించి విన్నాను. వినడమే కాదు, స్వయముగా చూచినాను. దేవ దానవ యక్ష రాక్షస గరుడ గంధర్వులలో ఏ ఒక్కడూ ఆయనకు సాటి అయినవాడు లేడు. ఆ మహాబలవంతుడు, దేవేంద్రుడితో సరిసమానము అయిన ఆ పరమ పరాక్రమవంతుడు రామప్రభువు చిత్ర విచిత్రముగా మెరిసే కార్ముకము తీసుకొని గాలికి చెలరేగిన అగ్నిహోత్రమువలె మంటలు మండుతూ తమ్ముడితో కూడా యుద్ధములో నిలుచుంటే, ఆయన వంక ఎవడు తేరిపారచూడగలడు?

"ఆ రామప్రభువు యుద్ధములో శత్రువులను మర్దిస్తూ, మదపు టేనుగువలె విహరిస్తూ, సూర్యకిరణాలవంటి బాణాలతో ప్రళయకాల సూర్యుడివలె విజృంభిస్తే ఎవడు బ్రతికి ఉండగలడు?

"ఓ హనుమంతుడా! నీవు నా పెనిమిటి రామప్రభువునూ, లక్ష్మణుణ్ణీ, వానరసేనా సమూహాలనూ వెంటనే ఇక్కడికి తీసుకొనిరా! ఎంతో కాలమునుంచి దుఃఖముతో కృశించిపోతూ ఉన్న నన్ను సంతోషపెట్టు" అని సీతాదేవి చెప్పింది.

38

సీత చూడామణిని హనుమంతుని కిచ్చుట

సీతాదేవి చెప్పినమాటలు ఆ వాక్యవిశారదుడు హనుమంతుడు విన్నాడు. సంతోషపడ్డాడు. ఆమెను చూచి, "ఓ దేవీ! నీ దర్శనము శుభప్రదము. నీ స్త్రీ స్వభావానికీ, పతివ్రతవు అయిన నీ అణుకువకూ తగినట్టుగా చెప్పినావు. నా వీపుమీద కూర్చుని సముద్రములో నూరు యోజనాల దూరము దాటిపోవడము ఏ స్త్రీకీ సాధ్యముకాదు. ఓ దేవీ! నీవు జనకరాజపుత్రివి. రామప్రభువును తప్ప అన్యుణ్ణి తాకను అని రెండవ కారణము చెప్పినావు. ఇది ఆ మహాత్ముడి భార్యవు అయిన నీకు అనుగుణముగా ఉంది. ఓ దేవీ! నీవు తప్ప మరి ఏ ఆడుదీ ఈ విధముగా చెప్పదు.

"ఓ దేవీ! నీవు రావణాసురుణ్ణి తృణీకరించి అన్న మాటలు విన్నాను. నీవు నీ గొంతుకు ఉరిపెట్టుకోడానికి చేసిన ప్రయత్నమున్నూ చూచినాను. ఇది అంతా

నిరవశేషముగా ఆ రామప్రభువుకు విన్నవిస్తాను. నాకు నీవు చెప్పిన సమాధానమున్నూ చెప్పుతాను. ఓ దేవీ! అనేక కారణాలనుంచి నీవు దుఃఖపడడము కన్నులారా చూచినాను. ఆ రామప్రభువు మీద నాకు ఉన్న స్నేహాతిశయమునుంచి నా మనస్సు కరిగిపోయింది. నేను నిన్నూ, ఆ ప్రభువునూ సంతోషపెట్టవలెను అనుకొన్నాను. అందువల్ల, అట్లా నా వీపుమీద కూర్చోవలసింది అనీ, నేను తీసికొని పోతాను అనీ చెప్పినాను. ఈ లంకాపట్టణానికి ఎవడూ రాలేడు. ఈ సముద్రము దాటి ఇక్కడికి రావడము అశక్యము. నా సామర్థ్యము నీకు చూపించవలెను అనుకొన్నాను. అందుకోసము అట్లా చెప్పినాను. నాకు ఆ మహానుభావుడిమీద వున్న భక్త్యావేశమునుంచీ, స్నేహాతిశయమునుంచీ నిన్ను వెంటనే ఆయన దగ్గరకు చేర్చవలెను అనుకొన్నాను. అట్లా చెప్పినాను, అంతే.

"ఓ దేవీ! నీకు నాతో కూడా రావడము ఇష్టము లేదు కనుక, ఆ రామప్రభువు నమ్మకము కోసము ఆయన ఎరిగి ఉన్నది ఏది అయినా ఒకటి గుర్తుగా ఇవ్వు" అని హనుమంతుడు అడిగినాడు.

ఈ మాటలకు దేవకన్నె వంటి ఆ సీతాదేవి కన్నీళ్ళు కారుస్తూ మాటలు తడబడుతూ, "ఓ హనుమంతుడా! నేను నీకు ఒక మంచి గుర్తు చెప్పుతాను, నా ప్రియుడికి ఆ వృత్తాంతము జ్ఞాపకము వస్తుంది. పూర్వము మేము చిత్రకూట పర్వతముమీద ఈశాన్య ప్రదేశాన మందాకినీ తీరాన కందమూల ఫలాలు సమృద్ధముగా దొరికేచోట 'సిద్ధాశ్రమము' అనే ప్రదేశములో ఋష్యాశ్రమాలలో నివసిస్తూ వచ్చినాము. అక్కడ నానావిధ పుష్పసుగంధము గుబాళించే ఒక వనములో మేము ఒకనాడు విహరించినాము. జలక్రీడలతో పొద్దు పుచ్చినాము. నా పెనిమిటి అలసిపోయి నా తొడమీద తల పెట్టుకొని నిద్రపోయినాడు. అప్పుడు ఒక కాకి నా చుట్టూ తిరుగుతూ నన్ను ముక్కుతో పొడిచింది. నేను ఆ కాకిని మట్టిగడ్డతో కొట్టి తరిమినాను. అయితే ఆ కాకి అక్కడనే దాగుకొంటూ మళ్ళీ మళ్ళీ రావడము మొదలు పెట్టింది. అది తెచ్చుకొన్న మాంసాన్ని అవతలకి పోయి ముక్కుతో పొడుస్తూ మళ్ళీ నా మీదికి వచ్చింది. ఆ కాకిని తోలివేయడానికి నేను నా ఒడ్డాణము ఊడలాగుతూ ఉంటే నేను కట్టుకొని ఉన్న చీర జారిపోయింది. ఆ ఒడ్డాణము చప్పుడుకు నా పెనిమిటి నిద్ర లేచినాడు. నన్ను చూచి ఎగతాళి చేసినాడు. నాకు సిగ్గు వేసింది, కోపము వచ్చింది. ఏడ్చినాను. నా మాంసము తినడానికి వచ్చి నన్ను పొడుస్తూ ఉన్న కాకిని తోలడానికి నా ఒడ్డాణము ఊడతీస్తే నా చీర జారిపోతే నన్ను చూచి నవ్వినందుకు కోపగించుకొంటూనూ, ఆ కాకిని తోలకపోయినందుకు ఏడుస్తూనూ ఆయన ఒడిలో తలపెట్టుకొని పడుకొన్నాను. నేను అప్పుడు చాలసేపు

నిద్రపోయినాను. ఆ తరువాత ఆయనే నన్ను లేపి నా తొడమీద ఆయన పడుకొన్నాడు. అప్పుడు ఆ కాకి వచ్చి నా స్తనాంతరములో గోళ్లతో గీరింది. అది అట్లా పైకి ఎగురుతూ కిందికి వస్తూ ముక్కుతోనూ, గోళ్ళతోనూ గీకుతూ ఉంటే రక్తము ఆయనమీద పడ్డది. ఆ రక్తానికి తడిసి సుఖముగా నిద్రపోతూఉన్న ఆ పరంతపుడు, ఆ కాంతిమంతుడు నిద్రలేచినాడు. ఆ మహాబాహువు అప్పుడు నా స్తనాలమధ్య గాయాన్ని చూచి క్రుద్ధుడు అయిపోయినాడు. తాచుపాము బుసలవలె నిట్టూర్పులు విడుస్తూ, "ఓ దేవీ! నీ స్తనాంతరములో గాయము చేసినవాడు ఎవడు? కోపముతో చెలరేగిన అయిదు తలలపాముతో ఆటలాడుతున్న వాడు ఎవడు" అని నన్ను అడిగి, అన్నివైపులా పరిశీలిస్తూ నెత్తురు కారుతూ ఉన్న గోళ్ళతోనూ, ముక్కుతోనూ నాకు ఎదురుగుండా కూర్చుని ఉన్న కాకిని చూచినాడు. అది సామాన్యము అయిన కాకి కాదు. దేవేంద్రుడి పుత్రుడు ఆ రూపముతో గాలి అంత వేగముగా నేలమీదకు వచ్చినాడు. ఆ మహాబాహువు, ఆ మతిమంతుడు ఆ కాకిని కోపముతో చుర చుర చూచినాడు. క్రూరము అయిన ఆలోచన చేసినాడు. కూర్చుండే ఆస్తరణములోనుంచి ఒక దర్భకర్రను తీసి బ్రహ్మాస్త్రముగా అభిమంత్రించి ఆ కాకిమీద వదలినాడు. అది ప్రళయకాలాగ్నివలె జ్వలిస్తూ ఆ కాకికి ఎదురుగుండా పోయింది. అప్పుడు ఆ కాకి ఆకాశానికి ఎగిరింది. మంత్ర ప్రభావముతో మంటలు మండుతూ ఉన్న ఆ దర్భకర్రకూడా ఆ కాకితో పాటు పైకి ఎగిరింది. అట్లా ఆ బ్రహ్మాస్త్రము కాకి వెంటబడి అది ఎక్కడికిపోతే అదీ అక్కడికి పోయింది. ఆ కాకి తనను కాపాడేవారికోసము సమస్తలోకాలూ తిరిగింది. ఆ కాకిని తండ్రి అయిన దేవేంద్రుడు కానీ, దేవతలు కానీ, దేవర్షులు కానీ దానిని కాపాడలేదు. అది ముల్లోకాలూ తిరిగింది. కాపాడేవారు ఎవరూ దానికి కనపడలేదు. అంతట అది రామప్రభువు దగ్గరకు వచ్చి శరణము వేడింది. చంపివేయవలసినంత నేరము చేసింది. అయినప్పటికిన్నీ, ఎవరూ కాపాడేవారులేక ఆ కాకి తననే శరణము వేడినందువల్ల ఆ సర్వలోకశరణ్యుడు దయతో దాని ప్రాణాన్ని కాపాడతలచుకొన్నాడు. అంతట ఆ కాకితో, 'బ్రహ్మదేవతాకము అయిన ఈ అస్త్రాన్ని వ్యర్థము చేయటము అశక్యము. అందువల్ల, ఏమి చేయమంటావో నీవే చెప్పు' అన్నాడు. ఆ కాకి అప్పుడు 'ఓ ప్రభూ! నీవు ఆ బ్రహ్మాస్త్రముతో నా కుడికంటిని దహించి వేయవలసింది' అని చెప్పింది. అప్పుడు ఆ దర్భపోక ఆ కుడి కంటిని దహించి వేసింది. అట్లా తన కుడి కంటిని ఇచ్చి ప్రాణము కాపాడుకొని రామప్రభువుకూ, దశరథమహారాజుకూ నమస్కారాలు చెప్పి దాని దారిన అది పోయింది" అని చెప్పుతూ రాముణ్ణి ఉద్దేశించి "ఓ ప్రభూ! నా కోసము కాకివంటిదానిమీద బ్రహ్మాస్త్రము వదిలినావు. నీ దగ్గర నుంచి నన్ను

దొంగిలించుకొనిపోయినవాణ్ణి ఎందుకు క్షమించినావు? ఓ పురుషోత్తముడా! నీవు మహోత్సాహివి. నా మీద దయ ఉంచు. ఓ నాధా! నీవు నాకు నాధుడవు అయి ఉండిన్నీ, ఇప్పుడు నేను అనాధవలె అయిపోయినాను. దయే పరమధర్మము అని నీవే చెప్పినావు. ఓ ప్రభూ! నీవు పరమపరాక్రమశాలివి. మహాబలవంతుడవు. నిరవధిక గుణవంతుడవు. నిన్ను ఎదిరించకలవారు ఎవరూ ఈ జగత్తులో లేరు. సముద్రమువలె నీవు గంభీరుడవు. సముద్రవలయితము అయిన ఈ భూభాగానికి అంతటికీ నీవు ప్రభువువు. నీవు దేవేంద్రుడితో సరిసమానము అయినవాడవు. ఓ ప్రభూ! సమస్త శస్త్రాస్త్రవిదులలో నీవు శ్రేష్ఠుడవు. సత్యసంధుడవు. ఈ రాక్షసులమీద నీ అస్త్రాన్ని ఎందుకు వదలకుండా ఉన్నావు" అని చెప్పి, ఆ హనుమంతుణ్ణి చూస్తూ, "ఓ హనుమంతుడా! యుద్ధములో నాగులుకానీ, గంధర్వులుకానీ, రాక్షసులుకానీ రామప్రభువు పరాక్రమానికి చాలరు. ఆ మహాపరాక్రమశాలి నా విషయములో ఏ కొంచెము తొందర కలిగినా తన తీక్ష్ణబాణాలతో రాక్షసులను అందరినీ నాశనము చేసివేసి నన్ను ఎందుకు తీసుకొనిపోలేదు? ఆ మహావీరుడు, ఆ మహాబలవంతుడు, ఆ పరంతపుడు లక్ష్మణుడు అయినా, అన్నగారి ఆజ్ఞను శిరసావహించి ఎందుకు నన్ను కాపాడకుండా ఉన్నాడు? కారణము ఏమిటి? ఆ పురుషోత్తములు, ఆ వాయ్వగ్ని సమతేజోవంతులు, దేవతలకు అయినా ఎదిరించనలవికాని ఆ అన్నదమ్ములు రామలక్ష్మణులు నన్ను ఎందుకు ఇట్లా ఉపేక్షించి ఊరుకున్నారు? నేను ఏదో మహాపాపము చేసి ఉంటాను. సందేహము లేదు. అందువల్లనే, ఆ పరంతపులు సర్వసమర్థులు అయినప్పటికిన్నీ నన్ను తలచుకోకుండా ఊరకున్నారు" అంటూ జాలిపుట్టేట్టు కన్నీళ్ళు కారుస్తూ చెప్పింది.

ఈ మాటలకు ఆ మహాతేజోవంతుడు "ఓ దేవీ! నీ దుఃఖమునుంచే ఆ రామప్రభువు అన్నిటిమీద విముఖుడుగా ఉన్నాడు. నేను సత్యప్రమాణముచేసి చెప్పుతున్నాను. రామప్రభువు దుఃఖపడగానే లక్ష్మణుడున్నూ దుఃఖపడిపోతున్నాడు. నేను ఎట్లాగో నీ దర్శనము చేసినాను. ఇది దుఃఖానికి సమయము కాదు. ఓ దేవీ! నీ ఈ దుఃఖము అంతా అచిరకాలములోనే పటాపంచలు అయిపోతుంది. నిన్ను చూడవలెను అని ఉత్సాహపడుతూ ఉన్న ఆ పురుషసింహులు అచిరకాలంలోనే ఈ లంకా పట్టణాన్ని భస్మము చేసివేస్తారు. ఓ విశాలాక్షీ! రామప్రభువు యుద్ధములో ఆ క్రూరకర్ముణ్ణి రావణాసురుణ్ణి సబాంధవముగా సంహారము చేసివేసి నిన్ను తీసుకొని అయోధ్యాపట్టణానికి పోతాడు. ఓ దేవీ! ఆ రామప్రభువుకూ, మహాబలవంతుడు అయిన ఆ లక్ష్మణుడికీ, మహాపరాక్రమవంతుడు అయిన ఆ సుగ్రీవుడికీ, వానరవీరులకూ నన్ను ఏమి చెప్పమంటావో నీవు అది చెప్పు" అని అడిగినాడు.

సీతాదేవి దుఃఖముతో, "ఓ హనుమంతుడా! కౌసల్యాదేవి కన్న ఆ సర్వలోకపూజ్యుడికి, ఆ మానవంతుడికి నేను సాష్టాంగ నమస్కారము చేసినాను అనీ, ఆయన క్షేమము అడిగినాను అనీ చెప్పు.

"ఓ హనుమంతుడా! ఆ లక్ష్మణుడు సుమిత్రాదేవి సత్పుత్రుడు. నానావిధభోగ ద్రవ్యాలనూ, సమస్తరత్నాభరణాలనూ, దానదాసీజనాన్నీ, ఈ పృథ్వీమీద దుర్లభము అయిన ఐశ్వర్యాన్నీ వదులుకొని తన తండ్రికీ, తల్లికీ నచ్చచెప్పి రామప్రభువు వెంట మహారణ్యానికి వచ్చినాడు. ఆ ధర్మాత్ముడు అన్నగారిమీద ప్రేమాతిశయమునుంచి అడవిలో అన్నగారికి సేవచేస్తూ ఉన్నాడు. ఆ మహాబాహువు, ఆ సింహస్కంధుడు, ఆ ప్రియదర్శనుడు లక్ష్మణుడు నన్ను తన తల్లివలెనూ, ఆ రామప్రభువును తండ్రివలెనూ భావించినాడు. నన్ను రావణాసురుడు దొంగిలించుకొని రావడము ఆ పరాక్రమశాలి ఎరుగడు. ఆ కాంతిమంతుడు, ఆ సమర్థుడు, ఆ మితభాషి మా మామగారివంటివాడు. ఆ రామప్రభువు ఏ భారము వేస్తే ఆ భారము అంతా వహిస్తూ ఉంటాడు. ఆ లక్ష్మణుడు వెంట ఉండడమునుంచే చనిపోయిన తండ్రిని గురించి ఆ రామప్రభువు తలచుకొనడము లేదు. ఆ లక్ష్మణుడికి నా మాటగా, నేను క్షేమముగా ఉన్నాను అని చెప్పు.

"హనుమంతుడా! ఈ కార్యము నెరవేరడానికీ, రామప్రభువు నా దుఃఖము పోగొట్టడానికీ నీవు కర్తవు. నీ నుంచే ఆ మహానుభావుడు నన్ను తీసుకొనిపోయే ప్రయత్నము చేస్తాడు. నీవు నా పెనిమిటితో ఈవిధముగా చెప్పినాను అని పదే పదే చెప్పవలెను. ఓ రామప్రభూ! నేను ఇంకా ఒక్క మాసమే జీవించి ఉంటాను. మాసము దాటిన తరువాత నేను బ్రతికి ఉండడము ఉత్తది. నేను శపథము చేసి చెప్పుతున్నాను. దేవేంద్రుడి రాజ్యలక్ష్మిని పాతాళ లోకములోనుంచి విష్ణుమూర్తి తీసుకొని వచ్చినట్టు, పాపకర్ముడు రావణాసురుడు దొంగిలించుకొని వచ్చిన నన్ను రామప్రభువు తీసుకొనిపోవలెను" అని చెప్పి తన చీరకొంగున దాచి ఉంచిన దివ్యసుందరము అయిన చూడామణిని తీసి రాముడికి ఇమ్మని చెప్పింది. హనుమంతుడు ఆ చూడామణిని తీసుకున్నాడు. అది చేతికి తొడుగుకోడానికి వీలుకానందువల్ల, వేలికి పెట్టుకొన్నాడు. అంతట ఆమెకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి వినయముతో ప్రక్కను నిలుచున్నాడు. ఆమె దర్శనము అయినందువల్ల ఎంతో సంతోషపడిపోయినాడు. అతని దేహము అక్కడ ఉన్నదే కాని, మనస్సు అంతా రాముడి దగ్గరకు పోయింది.

ఆ సీతాదేవి సిగలో పెట్టుకునే చూడామణి తీసుకొన్న హనుమంతుడు గాలి కదిలించి వదిలిపెట్టిన పర్వతమువలె సంతోషించినాడు.

అప్పుడు మళ్ళీ ప్రయాణము అయినాడు.

39

వానరుల బలపరాక్రమ వర్ణనము

సీతాదేవి చూడామణిని ఇచ్చిన తరువాత హనుమంతుణ్ణి చూచి, "ఓ వానరపుంగవా! ఈ చూడామణిని ఆ రామప్రభువు బాగా ఎరుగును. దీనిని చూడగానే నన్నూ, మా అమ్మనూ, మా మామగారిని దశరథమహారాజునూ ఆయన తలంచుకొంటాడు. నన్ను మా అత్తగారింటికి రామప్రభువుతో ప్రయాణముచేసి పంపించేటప్పుడు ఈ చూడామణిని ఇవ్వడము మా అమ్మ మరచిపోయింది. ప్రయాణము అయిపోతూ ఉండగా మా అమ్మకు జ్ఞాపకమువచ్చి దీనిని తీసుకొని వచ్చి నాకు మా మామగారి సమక్షంలో ఇచ్చింది. అందువల్ల, ఈ చూడామణిని చూడగానే నా పెనిమిటి సంతోషిస్తాడు.

"ఓ హనుమంతుడా! నేను నీతో మళ్ళీ చెప్పుతున్నాను. నీవు ఆ రామప్రభువును ప్రోత్సాహపరచవలెను. ఈ పనిని ఎట్లా ముగించవలెనో అది అంతా నీవే ఆలోచించవలెను. ఈ పనికి నీవే కర్తవు. నీవు ప్రయత్నము చేసి నా దుఃఖాన్ని పోగొట్టవలెను. నీవు ఆలోచించి ప్రయత్నము చేసేట్లయితే నా కష్టాలు అన్నీ గట్టు ఎక్కుతవి" అని చెప్పింది.

"అట్లాగేను" అని ఆ భీమవిక్రముడు శపథము చేసి ఆ వైదేహికి నమస్కారము చేసినాడు. ప్రయాణము అయిపోతున్నాడు. అప్పుడు ఆ హనుమంతుణ్ణి సీతాదేవి చూచి కన్నీళ్లు కారుస్తూ గద్గద కంఠముతో, "ఓ హనుమంతుడా! నీవు రామలక్ష్మణులకూ, సుగ్రీవుడికీ, ఆయన మిత్రులకూ, వానర వృద్ధులకూ, ఇంకా తక్కిన ముఖ్యులకూ నా స్థితిగతులు చెప్పు. నేను వారి క్షేమము అడిగినాను అని చెప్పు. నన్ను ఆ రామప్రభువు ఈ దుఃఖసముద్రములో నుంచి కడతేర్చేటట్టు నీవు చేయవలెను. ఎట్లా చెప్పితే నేను జీవించి ఉండగా ఆ కీర్తిమంతుడు వచ్చి నన్ను చూస్తాడో, అట్లా ఆయనకు చెప్పి నీవు పుణ్యము కట్టుకో. నీ ఉత్సాహ వాక్యాలకు ఆయనకు పౌరుషము పెరిగి నన్ను తీసుకొని పోయేట్లుగా చెప్పవలెను. నా సందేశాన్ని నీవు ఎట్లా చెప్పితే ఆ పరమపరాక్రమశాలి వెంటనే వచ్చి నన్ను తీసుకొని పోతాడో, అట్లా నీవు ఆయనకు చెప్పవలెను" అన్నది.

హనుమంతుడు శిరము ఒగ్గి చేతులు జోడించి, "ఓ దేవీ! నేను చెప్పీ చెప్పడముతోనే ఆ రామప్రభువు వానరవీరులనూ, భల్లూక వీరులనూ వెంటపెట్టుకొని వచ్చేటట్టుగా చేస్తాను. ఆ మహానుభావుడు శత్రువులను అందరినీ జయిస్తాడు. నీ దుఃఖాన్ని పోకొట్టుతాడు. ఆయన బాణాలకు ఇక్కడి రాక్షసులు ఎవరూ ఆయన

ఎదట నిలువలేరు. ఆయన విజయుడుగా నిన్ను వెంటతీసుకొనిపోతాడు. సాగరపర్యంతము అయిన ఈ భూమిని అంతా ఏలుతాడు. ఓ జనకనందినీ! రామప్రభువు నీ కారణమునుంచి ఈ జగత్తును అంతా జయిస్తాడు" అని చెప్పినాడు.

ఇంత చక్కగా హనుమంతుడు అన్న మాటలకు సీతాదేవి అతనిని మెచ్చుకొంటూ, అతనివంక పదే పదే చూస్తూ భర్తమీద ఉన్న స్నేహాతిశయముతో, "ఓ హనుమంతుడా! నీవు అరిందముడవు. నీవు కావలెను అనుకొన్నట్లయితే ఇక్కడను ఎక్కడను అయినా రహస్య ప్రదేశములో ఒకరోజు వుండి నీ అలసట తీర్చుకో. ఆ మరునాడు ప్రయాణము అయిపో. నీవు ఇక్కడ నాకు దగ్గరలో ఉండేట్లయితే నేను కొంతసేపు అయినా దుఃఖము లేకుండా ఉంటాను.

"ఓ హనుమంతుడా! నీవు వెంటనే తిరిగి రావలెను. అందుకే ఇప్పుడు ప్రయాణము అయిపో. అయితే నీవు తిరిగి వచ్చే లోపల నా ప్రాణము ఉంటుందో పోతుందో సందేహమే. నీవు ఇక్కడ నుంచి వెళ్ళిపోయిన తరువాత నా దుఃఖము ఇప్పటికన్న యెక్కువ అవుతుంది. అందువల్ల నీవు త్వరగా రావలెను సుమా!

"ఓ హనుమంతుడా! నాకు ఇప్పుడు ఒకపెద్ద సందేహము వచ్చింది. నీకు సహాయకులుగా వచ్చిన భల్లూకవీరులూ, వానరవీరులూ, నీతోపాటు ఈ సముద్రాన్ని దాటి రాలేకనేకదా ఆవలిగట్టున ఉంది. వారు అందరూ అపారము అయిన ఈ సముద్రాన్ని ఎట్లా దాటి వస్తారు? రామలక్ష్మణులు ఎట్లా ఇక్కడికి వస్తారు? సముద్రాన్ని దాటివచ్చే శక్తి ఆ వాయుదేవుడికీ, గరుత్మంతుడికీ, నీకూ ఉంది. ఇక మరి ఎవరికీ లేదు. అందువల్ల, ఈ సముద్రము దాటే పని నేరవేరడము ఎట్లా? అందుకు ఉపాయము ఏమిటో చెప్పు. నీవు కార్యవిధులలో శ్రేష్ఠుడవు. ఆలోచించి చెప్పు. నీవు ఒక్కడవే ఈ కార్యాన్ని సాధించగలుగుతావు. నీకు అంత శక్తి ఉంది. అందువల్ల నీకు కీర్తి వస్తుంది. కాని, ఆ రామప్రభువు సంపూర్ణము అయిన సైన్యముతో వచ్చి యుద్ధము చేసి రావణాసురుణ్ణి సంహారము చేసివేసి విజయుడుగా నన్ను తీసుకొని పోయేట్లయితేనే నాకు యశస్కరముగా ఉంటుంది. అంతేకాదు, ఆ శత్రుమర్దనుడు తన బాణాలతో ఈ లంకాపట్టణాన్ని ధ్వంసముచేసివేసి నన్ను తీసుకొని పోయేట్లయితేనే ఆయన శౌర్యానికీ, గౌరవానికీ అనుగుణముగా ఉంటుంది. అందువల్ల, ఆ ఆహవ శూరుడికి అనురూపము అయిన పరాక్రమముతో ఈ పని నెరవేరేటట్లు నీవు చూడవలెను" అని చెప్పింది.

ఇట్లా అర్థవంతముగా సీతాదేవి చెప్పిన మాటలు విని హనుమంతుడు, "ఓ దేవీ! వానర భల్లూకసేనలకు ప్రభువూ, వానర శ్రేష్ఠుడూ, సత్వసంపన్నుడూ అయిన సుగ్రీవుడు ఈ కార్యాన్ని సాధించడానికి కృతనిశ్చయుడు అయి ఉన్నాడు. అతడు

రాక్షస సంహారానికి వేలకొద్దీ, లక్షలకొద్దీ, కోట్లకొద్దీ వానర భల్లూక వీరులను వెంటపెట్టుకొని తక్షణమే బయలుదేరి వస్తాడు. ఆ వానర భల్లూక వీరులు అందరూ పరమపరాక్రమవంతులు. సత్వసంపన్నులు. మహాబలవంతులు. వాండ్లు అటు ఆకాశమువరకూ ఎగిరిపోగలరు. ఇటు పాతాళలోకము వరకూ దిగిపోగలరు. అడ్డముగా ఎంతదూరము అయినా ఏ అంతరాయము లేకుండా పోగలరు. వాండ్లు అందరూ సుగ్రీవుడి ఆజ్ఞను జవదాటరు. సుగ్రీవుడు మనసా సంకల్పించుకొంటే చాలును. ఏ పని అయినా అయిపోతుంది. ఆ వానర భల్లూక వీరులు ఎటువంటి మహత్తర కార్యాలను అయినా సాధించగలరు. వాండ్లు అందరూ మహోత్సాహులు. వాయుమార్గాన అనేక పర్యాయములు వాండ్లు అందరూ పర్వతాలతోనూ, మహారణ్యాలతోనూ, మహాసముద్రాలతోనూ ఉన్న ఈ భూభాగాన్ని అంతా తిరిగి చూచినారు. ఆ సుగ్రీవుడి సన్నిధిలో నాతో సరిసమానము అయిన వాండ్లూ, నాకన్నా అధికులూ ఎంతోమంది వానరులు ఉన్నారు. నాకన్నా తక్కువ అయినవాడు ఒక్కడున్నూ లేడు. నేనే సముద్రాన్ని దాటి ఇక్కడికి వచ్చినాను. ఇక నాకన్నా బలవంతుల సంగతి నేను చెప్పనవసరమే లేదు. అత్యంత సమర్థులను రాజులు ఎప్పుడూ మొట్టమొదట పంపించరు. చూచి రావడానికి సామాన్యులనే పంపిస్తూ ఉంటారు. వానర భల్లూక వీరులను గురించి నీవు దిగులుపడ నవసరము లేదు. వానరసేనలు అన్నీ ఒక్క గంతు వేసి ఈ లంకలో వచ్చి పడుతవి. ఆ మహాబలవంతులగు రామలక్ష్మణులను నా వీపు మీద ఎక్కించుకొని వస్తాను. ఉదయించే సూర్యచంద్రులవలె వారిని నీవు చూస్తావు. వానర వీరులు బాణాలు వదిలి ఈ లంకాపట్టణాన్ని ధ్వంసము చేసి వేస్తారు. రావణాసురుణ్ణి సబాంధవముగా సంహారము చేసివేసి ఆ రామప్రభువు నిన్ను వెంటపెట్టుకొని అయోధ్యకు పోతాడు.

"ఓ దేవీ! నీవు ఓర్చుకో. రోజులు లెక్కపెట్టుకొంటూ ఉండు. నీకు శుభము అవుతుంది. జ్వలితాగ్నిహోత్రమువలె ఆ రామప్రభువు అచిరకాలములో వస్తాడు. నీవు చూస్తావు" అని చెప్పి హనుమంతుడు సీతాదేవిని ఓదార్చి పోబోతూ మళ్ళీ, "ఓ దేవీ! శత్రుసంహారకుడు అయిన ఆ రామప్రభువూ, ధనుర్ధరుడు అయిన లక్ష్మణుడూ త్వరలోనే ఈ లంకా ద్వారాన నీకు కనపడుతారు. ఓ పూజ్యురాలా! భల్లూక వీరులను, వానర వీరులను, కొండలు అంతటి వాండ్లను, ఏనుగులు అంతటి వాండ్లను, మహామేఘాలు అంతటి వాండ్లను గుంపులు గుంపులుగా వచ్చి ఈ లంకాపట్టణముమీద పడడము నీవు చూస్తావు. సింహనాదాలు చేస్తూ వాండ్లు అందరూ సింహాలవలెనూ, పెద్దపులులవలెనూ కోరలతోనూ, గోళ్ళతోనూ, రాక్షసులతో యుద్ధము చేయడము చూస్తావు.

"ఓ దేవీ! నీవు దిక్కులేని దానివలె ఏడవవద్దు. మనస్సులోను అయినా దుఃఖపడవద్దు. శచీదేవికి దేవేంద్రుడివలె నీకు నీ నాధుడు రామప్రభువు ఉన్నాడు. ఈ లోకములో ఆ మహానుభావుడికన్నా అధికుడు ఎవడూ లేడు. ఆ అన్నదమ్ములు ఇద్దరూ నీకు ఆశ్రయులు. వారు ఇద్దరూ అగ్నిహోత్రుడూ, వాయుదేవుడూ వంటివారు. రాక్షసాలయము అయిన ఈ భయంకర ప్రదేశములో నీవు ఇకను అట్టే కాలము ఉండవు. నీ పెనిమిటిని రామప్రభువును నేను పోయి కలుసుకోవటమే తరువాయి, ఆయన వచ్చి ఈ లంకమీద పడతాడు. ఓ పూజ్యురాలా! కొంచెము కాలము ఓర్చుకో" అని చెప్పినాడు.

40

ఆ బుద్ధిమంతుడు హనుమంతుడు చెప్పింది విని సీతాదేవి తన మేలుకోసము, "ఓ హనుమంతుడా! నన్ను సంతోషపెట్టే వృత్తాంతము చెప్పినావు. నిన్ను చూస్తూ వుంటే సగము ఎదిగి, మండుటెండలకు మాడిపోయి వానజల్లుకు తేరుకొన్న పయిరు భూమివలె, కార్యసిద్ధి సగము అయినట్టు తోస్తూవుంది. ఇట్లా శోకముతో కృశించి పోయిన అవయవాలతో వున్న నేను ఆ పురుషసింహుణ్ణి చేరేటట్టు నీవు చేయవలెను. నా మీద దయవుంచు. నా కోసము ఆ రామప్రభువునకు వచ్చిన కోపము నుంచి దర్భకర్రను బ్రహ్మాస్త్రముగా చేసి, కాకి కంటిని పోగొట్టినాడు అని నీకు గుర్తుగా చెప్పినాను. ఇంకొక గుర్తు చెప్పుతాను. ఒకనాడు నా నుదుటను బొట్టు చెదిరిపోయింది. నాకు ఆ సంగతి తెలియదు. ఆ మహానుభావుడు నవ్వులాటకు మనశ్శిలను తీసి నా చెక్కిలి మీద బొట్టుగా ఉంచినాడు. ఇది చెప్పు, ఆయనకు జ్ఞాపకము వస్తుంది.

"ఓ హనుమంతుడా! ఆ మహా పరాక్రమవంతుడు మహేంద్ర వరుణుల వంటివాడే. రావణాసురుడు ఇట్లా నన్ను దొంగిలించుకొనివచ్చి రాక్షసుల మధ్యను వుంచితే ఎట్లా ఊరుకున్నాడు? నేను ఈ దివ్యము అయిన చూడామణిని ఎంతో జాగ్రత్తగా దాచి ఉంచినాను. ఇంత దుఃఖములోనూ నేను ఈ చూడామణిని చూస్తూ ఆ పుణ్యాత్ముణ్ణి చూచినట్టు ఇంతవరకూ సంతోషపడుతూ వచ్చినాను. రత్నాకర సంబంధము లయిన మణులు పొదిగిన చూడామణిని ఆ మహానుభావుడి కోసము ఇప్పుడు నీ చేతికి ఇచ్చినాను. శోకలాలసనుగా ఇక నేను బ్రతికి వుండలేను. ఆయన కోసము సహించనలవి కాని దుఃఖాలనూ, హృదయాన్ని ఛేదించే ఈ రాక్షసాంగనల మాటలనూ ఇంతకాలమూ ఓర్చుకొన్నాను. నేను ఇక ఒక మాసమే జీవించి వుంటాను అని ఆ శత్రుసూదనుడితో చెప్పు. ఈ మాసము కడచిపోయిన తరువాత నేను ఒక్కక్షణము అయినా జీవించి వుండను. ఆ మహానుభావుణ్ణి చేరకుండా నేను ఇక బ్రతికి వుండడము ఉత్తది.

"ఓ హనుమంతుడా! ఈ రాక్షసరాజు రావణాసురుడు భయంకరుడు. వీడి దృష్టి నేను భరించలేకుండా ఉన్నాను. నేను ఇటువంటి ఆపదలో ఉన్నాను అని తెలిసిన తరువాత కూడా ఇదివరకటి వలె ఆ మహానుభావుడు ఉపేక్షించేట్లయితే నేను ప్రాణముతో ఉండడము ఉత్తది' అని చెప్పింది.

ఇట్లా జాలిపుట్టేట్టు కన్నీళ్లు కారుస్తూ సీతాదేవి చెప్పిన మాటలకు హనుమంతుడు, "ఓ దేవీ! రామప్రభువుకు ఏమీ తోచక ఏ పని చేయడానికిన్నీ విముఖుడు అయి ఉన్నాడు. నేను సత్యప్రమాణముగా చెప్పుతున్నాను ఆ రామప్రభువు నిన్ను తలచుకొని దుఃఖపడుతున్నాడు. ఆయన దుఃఖపడడము చూచి లక్ష్మణుడు తపించిపోతూ ఉన్నాడు. నేను ఎట్లాగో వచ్చి నీ దర్శనము చేసినాను. ఇకను ఈ క్షణము నుంచి నీవు దుఃఖపడవలసిన అవసరము లేదు.

"ఓ దేవీ! అతిత్వరలో నీ దుఃఖము అంతము అయిపోతుంది. ఆ పురుషసింహులు, ఆ అరిందములు రామలక్ష్మణులు నిన్ను ఎప్పుడు చూడటమా అని తహతహలాడుతూ ఉన్నారు. నేను పోయి చెప్పగానే వారు ఇక్కడికి వస్తారు. ఈ లంకాపట్టణాన్ని భస్మము చేసివేస్తారు. ఓ విశాలాక్షీ! ఆ తరువాత నిన్ను వెంటపెట్టుకొని అయోధ్యాపట్టణానికి ప్రయాణము అయిపోతారు. ఓ దేవీ! ఆ రామప్రభువును ఇంకా సంతోషపెట్టే గుర్తు ఏది అయినా ఉంటే ఇవ్వు" అని చెప్పినాడు.

"ఓ వీరుడా! నేను నీకు ఉత్తమోత్తమము అయిన చూడామణిని ఇచ్చినాను. అది నా కేశపాశములో పెట్టుకొంటూ వచ్చిన దివ్యాభరణము. దానిని చూచి రామప్రభువు నిన్ను నమ్ముతాడు" అని సీతాదేవి చెప్పింది.

ఆ కాంతిమంతుడు హనుమంతుడు అంతట సీతాదేవికి నమస్కారముచేసి ప్రయాణసన్నద్ధుడు అయినాడు. ఎగిరిపోయేటందుకు దేహాన్ని పెంచడము మొదలు పెట్టినాడు. అప్పుడు అతనిని చూస్తూ సీతాదేవి కన్నీళ్లు కారుస్తూ, "ఓ హనుమంతుడా! ఆ అన్నదమ్ములకున్నూ, సుగ్రీవుడికిన్నీ, ఆయన అమాత్యులకున్నూ, తక్కిన అందరికిన్నీ నేను క్షేమముగా ఉన్నాను అని చెప్పు. నన్ను ఈ దుఃఖసముద్రములో నుంచి దాటించి అవతలకు తీసుకొని పోయేటట్టు నీవు ఆ రామప్రభువుకు నచ్చచెప్పవలెను. నా దుఃఖాన్ని గురించీ, రాక్షసుల బెదిరింపుల గురించీ చెప్పు. సుఖముగా పో, నీకు దారిలో ఏ అంతరాయమూ రాదు" అని చెప్పింది.

ఇక చేయవలసింది కాస్తే ఉంది అనుకొంటూ హనుమంతుడు మనస్సులో ఉత్తర దిక్కు చూచినాడు.

41

హనుమంతుడు అశోకవనమును ధ్వంసము చేయుట

ఆ హనుమంతుణ్ణి సీతాదేవి ప్రశంసా వాక్యాలతో సమ్మానించిన తరువాత అతడు అవతలకు పోయినాడు. ఆలోచించసాగినాడు.

"ఇక చేయవలసిన పని కొంచెమే మిగిలివుంది. సీతాదేవిని చూడటమూ అయిపోయింది. సామ దాన భేదాలు అనే మూడు ఉపాయాలూ ఈ రాక్షసుడి దగ్గర పనిచేయవు. దండోపాయమే అవలంబించవలెను. రావణాసురుడు మూర్ఖుడు. అందువల్ల వీడిదగ్గర సామోపాయము పనిచేయదు. వీడు ధనవంతుడు. అందువల్ల దానోపాయము ప్రసక్తే లేదు. బలదర్పితుడు. అందువల్ల భేదోపాయానికి లొంగడు. కాబట్టి పరాక్రమమే పనిచేస్తుంది.

"రామకార్యము సాధించడానికి ఇప్పుడు పరాక్రమము ఒక్కటే పనికివస్తుంది. ఇక్కడ మరి ఒక ఉపాయము పనిచేయదు. ఇప్పుడు ఇక్కడ రాక్షసులతో పోరాడి కొంతమందిని చంపివేసినట్టయితే వీండ్లు ఎట్లాగు అయినా మెత్తపడిపోతారు. ఆజ్ఞాపించిన కార్యానికి విరోధము లేకుండా అనేక పనులు చక్కపెట్ట కలవాడే ఏ పని చేయడానికి అయినా సమర్థుడు అవుతాడు. స్వల్పకార్యము అయినప్పటికిన్నీ ఒక్కకారణముతో సాధించడము సాధ్యముకాదు. కార్యసాధనానికి వివిధోపాయాలూ తెలుసుకొన్నవాడే కార్యాన్ని సాధించకలుగుతాడు. నేను రావణాసురుడి బలాబలాలను ఇక్కడే నిశ్చయించవలెను. యుద్ధములో రాక్షసులకూ, వానరులకూ ఉండే తారతమ్యము తెలుసుకోవలెను. ఇట్లా అన్ని విషయాలూ తెలుసుకొని పోయేటట్లయితే సుగ్రీవాజ్ఞను చక్కగా నెరవేర్చినవాణ్ణి అవుతాను. ఇప్పుడు నాకూ, రాక్షసులకూ సహించనలవికాని యుద్ధము జరిగితేనే వారి బలమూ, నా బలమూ బయట పడుతుంది. మంత్రి వర్గముతోనూ, సేనానాయకులతోనూ రావణాసురుడి బలము నన్ను ఎదుర్కొంటేనే వాడి బలము ఏమిటో, వాడి పథకము ఏమిటో విశదము అవుతుంది. అప్పుడు నా దారిన నేను పోవచ్చును.

"ఈ అశోకవనము దేవేంద్రుడి నందనోద్యానవనమువలె నానావిధ వృక్షాలతోనూ, నానావిధ లతలతోనూ నేత్రపర్వముగానూ, మనోహరముగానూ ఉంది. ఎండిపోయిన అడవిని అగ్నిహోత్రుడివలె ఈ అశోక వనాన్ని నేను ధ్వంసము చేసివేస్తాను. ఈ వనము అంతా విరిగి పడిపోయేట్లయితే రావణాసురుడికి నా మీద తప్పకుండా కోపము వస్తుంది. అంతట వాడు గుర్రాలతోనూ, రథాలతోనూ, ఏనుగులతోనూ, త్రిశూలాలూ ఇనుప పట్టిసాలూ మొదలు అయిన ఆయుధాలతోనూ పెద్ద సైన్యాన్ని

నా మీదికి పంపిస్తాడు. అప్పుడు నాకూ, వారికీ మహా యుద్ధము జరుగుతుంది. ఓర్వనలవికాని పరాక్రమముతో నేనూ, ప్రచండ పరాక్రమముతో రాక్షసులూ పోరాడుతాము. రావణాసురుడు పంపించే సైన్యాన్ని అంతా నాశనము చేసివేసి నా దారిన నేను హాయిగా కిష్కింధకు పోతాను" అని హనుమంతుడు అనుకొన్నాడు.

అంతట భయంకర పరాక్రముడు మారుతాత్మజుడు క్రుద్ధుడు అయిపోయి వాయుదేవుడివలె చెలరేగి ఆ అశోకవనములో మహోన్నత వృక్షాలను అన్నిటినీ విరిచివేయడము మొదలు పెట్టినాడు. నానావిధ వృక్షాలూ, లతలూ పెళ పెళ ధ్వనులతో నేలకూలినవి. మత్తుఎక్కిన రకరకాల పక్షులూ భయపడి వికృతముగా కూస్తూ పైకి ఎగిరిపోసాగినవి. క్రీడాపర్వతాలు అన్నీ పొడి అయిపోయినవి. కోనేళ్ళ మెట్లు అన్నీ విరిగిపోయినవి. క్షణలేశములో ఆ అశోకవనము వికృతముగా కనిపించింది. పెద్ద పెద్ద చెట్లు అన్నీ పడిపోయి, కార్చిచ్చుకు తగులపడి పోయిన మహారణ్యమువలె అయిపోయింది. ఆ యా పెద్ద పెద్ద మానులు అన్నీ కూలిపోయినందువల్ల ఆ యా పుష్పలతలు భయవిహ్వాలలు అయిన స్త్రీలవలె కనిపించినవి. లతాగృహాలూ, చిత్రగృహాలూ, శిలాగృహాలూ కూలిపోయినవి. మహాసర్పాలూ, క్రూరసర్పాలూ విచ్చలవిడిగా బయలుదేరినవి. రావణాసురుడి భార్యలకు భోగస్థానము అయిన ఆ ఉద్యానవనాన్ని అట్లా మొదలు అంటా నాశనము చేసివేసి హనుమంతుడు సంతోషముతో పోరాటానికి ఎదురుచూస్తూ ఆ అశోకవనము దగ్గర కూర్చున్నాడు.

42

హనుమంతుడు రాక్షసులను సంహరించుట

అశోకవనములో చెట్లు పెళపెళా విరిగిపోతూ ఉన్న ధ్వనులూ, అక్కడి పక్షిసంఘాలు ఎగిరిపోతూ పెట్టిన కూతలూ లంకాపట్టణములో అందరికీ వినిపించినవి. అందరూ భయభ్రాంతులు అయిపోయినారు. అక్కడి పక్షి సంఘాలతోపాటు మృగసంఘాలూ భయపడి అరుస్తూ అన్ని దిక్కులా పరుగులెత్తినవి. రాక్షస నాశనాన్ని సూచించే అశుభ నిమిత్తాలు కనిపించినవి.

ఆ అశోక వనములో కావలి ఉంటూ ఉన్న వికృతాననలు రాక్షసాంగనలు చెట్లు విరిగిపోతున్న మహాధ్వనులకు ఉలిక్కిపడి నిద్రలేచినారు. మహాకాయముతో భయంకరాకారుడుగా ఉన్న హనుమంతుణ్ణి చూచినారు. ఆ మహాబాహువు, ఆ మహాసత్త్వుడు, ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఆ రాక్షసాంగనలను అందరినీ చూచినాడు. వాండ్లను ఇంకా భయపెట్టవలెను అనుకొన్నాడు. తన మహాకాయాన్ని మరింత భయంకరముగా పెంచినాడు.

ఆ రాక్షసాంగనలు పర్వతము అంత ఎత్తున ఉన్న ఆ అతికాయుణ్ణి చూచి సీతాదేవి దగ్గరకు పోయి, "ఓ సీతా, వీడు ఎవడు? వీణ్ణి ఎవడు పంపించినాడు? ఎక్కడనుంచి వచ్చినాడు? ఎందుకోసము వచ్చినాడు? నీతో ఏమి మాట్లాడినాడు? ఓ విశాలాక్షీ! మాకు చెప్పు. ఓ సుభగా! భయములేదు, చెప్పు. వీడు నీతో ఏమి మాట్లాడినాడు" అని అడిగినారు.

ఆ మహాసాధ్వి, ఆ సర్వాంగసుందరి సీతాదేవి, "నానావిధభయంకర రూపాలూ ధరించే రాక్షసులను గురించి నేను ఏమీ ఎరుగను. అట్లా తెలుసుకొనే శక్తి నాకు లేదు. వీడు ఎవడో, ఏమి చేస్తున్నాడో మీకే తెలుసును. పాముకాళ్ళు పాముకే తెలియవలెను. సందేహము లేదు. నేనున్నూ ఇతణ్ణి చూచి భయపడుతున్నాను. ఇతడు ఎవడో నేను ఎరుగను. ఎవడో మరి ఈ వచ్చినవాడు కామరూపుడు అయిన రాక్షసుడు అని నేను అనుకొంటున్నాను" అని చెప్పింది.

ఈ మాటలు విని కొందరు రాక్షసాంగనలు భయపడి నాల్గు దిక్కులా పరుగులెత్తినారు. కొందరు అక్కడనే ఉండిపోయినారు. కొందరు వికృతాననలు ఆ మహాకారుణ్ణి, ఆ భయంకరాకారుణ్ణి గురించి చెప్పడానికి రావణాసురుడి దగ్గరకు పోయినారు. "రాజా! భయంకరాకారుడూ, అమిత పరాక్రమవంతుడూ అయిన ఒక వానరుడు సీతాదేవితో మాట్లాడి అశోకవన మధ్యములో ఉన్నాడు. వాడు ఎవడు అని మేము ఎన్నో విధాల ఆ హరిణలోచనను అడిగినాము. ఆ జానకి మాకు ఏమీ చెప్పలేదు. వాడు దేవేంద్రుడి దూతో, కుబేరుడి దూతో, సీతాన్వేషణ కాంక్షతో రాముడు పంపించిన దూతో అయి ఉంటాడు. ఆ అద్భుతరూపుడు తమ ప్రమదావనాన్ని నాశనము చేసివేసినాడు. మనోహరము అయిన మృగాలూ, పక్షులూ భయపడి పారిపోయినవి. వాడు ఆ వనములో పాడుచేయని చోటు ఒక్కటిన్నీ లేదు. ఆ జానకి ఉంటూ ఉన్న చోటుమాత్రము వాడు నాశనము చేయలేదు. ఆమెకు ఇబ్బంది లేకుండా ఉండటానికో, లేక అలసిపోయినందువల్లనో అక్కడి చెట్లను ఏమీ చేయలేదు. అట్లాకాదు, వాడు అలసిపోవడము ఏమిటి! వాడు ఆమెను కాపాడవలెను అనుకొన్నాడు. అందుకోసము ఆ చోటు పాడుచేయలేదు. అందము అయిన పూలతోనూ, చిగురుటాకులతోనూ ఉన్న పెద్ద ఇరుగుడుచెట్టు దగ్గర సీత ఉంది. ఆ చెట్టును ఆ వానరుడు ముట్టుకోలేదు.

"ఓ మహోగ్రుడా! నీవు ఆ ఉగ్రరూపుణ్ణి మహోగ్రముగా శిక్షించవలెను. వాడు సీతతో మాట్లాడినాడు. నీ అశోకవనాన్ని నాశనము చేసివేసినాడు. ఓ రాక్షసేశ్వరుడా! నీ మనస్సు ఉంచిన ఆ సీతతో ఎవడు అయినా మాట్లాడితే వాణ్ణి బ్రతకనీయడమేనా" అన్నారు.

రావణాసురుడు ఆ రాక్షసాంగనల మాటలు విన్నాడు. కోపముతో కనుగుడ్లు తిప్పినాడు. హోమము చేసిన అగ్నిహోత్రమువలె మండిపోయినాడు. మండుతూ ఉన్న దీపములో నుంచి మంటతో నూనె బిందువులు నేల రాలినట్టు క్రుద్ధుడు అయిపోయిన రావణాసురుడి రెండుకన్నులలోనుంచి వేడి వేడి కన్నీటి బిందువులు రాలినవి. అప్పుడు ఆ మహాతేజోవంతుణ్ణి హనుమంతుణ్ణి నిగ్రహించడానికి తనతో సరిసమానము అయిన శూరులను కింకరులు అనే వాండ్లను ఆజ్ఞాపించినాడు. కూటాలూ, ముద్గరాలూ మొదలు అయిన ఆయుధాలు తీసుకొని మహోదరాలతోనూ, మహాదంష్ట్రలతోనూ ఉన్న మహాబలవంతులు ఆ ఘోర రూపులు కింకరులు అనే వాండ్లు యుద్ధసన్నద్ధులు అయి, హనుమంతుణ్ణి పట్టుకోవలెను అనే ప్రయత్నముతో ఆ భవనమునుంచి బయలుదేరినారు.

అశోకవన ద్వారములో యుద్ధసన్నద్ధుడు అయివున్న హనుమంతుడి దగ్గరకు వారు మహావేగముతో మిడుతలు అగ్నిహోత్రము మీదికివలె పోయినారు. నానావిధవర్ణాలతో ఉన్న గదలనూ, బంగారు కట్లు వేసిన ఇనుప గుదియలనూ, సూర్యసమాన కాంతులతో తేజరిల్లుతూ ఉన్న బాణాలనూ వారు హనుమంతుడి మీద వేసినారు. ఇనుపగుదియలతోనూ, అడ్డకత్తులతోనూ, శూలాలతోనూ, ఈటెలతోనూ, చిల్లకోలలతోనూ వారు హనుమంతుడి చుట్టూ అప్పటికి అప్పుడు మూగినారు. అతని ఎదుటకు పోయి కొంతమంది నిలుచున్నారు.

అప్పుడు, ఆ తేజోవంతుడు, ఆ కాంతిమంతుడు, ఆ పర్వతాకారుడు హనుమంతుడు తన తోకతో నేలనుకొట్టి పెద్ద పొలికేక వేసినాడు. మరింతగా దేహాన్ని పెంచినాడు. లంకాపట్టణము అంతటా వినిపించేటట్టు భుజాలు చరుచుకున్నాడు. ఆ భుజాస్ఫాలనమువల్లను అయిన మహాధ్వనికి పక్షులు ఆకాశమునుంచి నేలకూలినవి. అంతట పెద్దగొంతుతో, "ఆ అతిబలవంతుడికి రాముడికి జయము. మహాబలవంతుడు అయిన లక్ష్మణుడికి జయము. రాముడు కాపాడిన సుగ్రీవుడికి జయము. ఓ రాక్షసులారా! కోసల దేశాధీశుడు అయిన రాముడికి నేను దాసుణ్ణి. నా తండ్రి వాయుదేవుడు. నా పేరు హనుమంతుడు. నేను ఎటువంటి శత్రుసైన్యాలను అయినా సంహారము చేయకలను. నేను రాళ్ళతోనూ, చెట్ల బడితెలతోనూ పోరాడడానికి దిగితే, వెయ్యిమంది రావణాసురులు వచ్చినా నన్ను తట్టుకోలేరు. రాక్షసులు అందరూ చూస్తూ ఉండగనే ఈ లంకాపట్టణాన్ని పడగొట్టుతాను. సీతాదేవికి నమస్కారము చేసి నా పని పూర్తి చేసికొని పోతాను" అని చెప్పుతూ ఉంటే, కింకరులు అనే రాక్షసులు భయపడిపోయినారు. సంధ్యాకాల మేఘమువలె రక్తకాంతులతో తేజరిల్లుతూ ఉన్న ఆ మహోన్నత కాయుణ్ణి చూస్తూ

రాజాజ్ఞనుబట్టి నిశ్శంకముగా భయంకరము అయిన వివిధాయుధాలతోనూ ఎదిరించినారు. హనుమంతుడు తనచుట్టూ మూగిన రాక్షసశూరులు అందరూ అట్లా ఎదిరించగానే, ఆ అశోకవన బహిర్ద్వారానికి అమర్చిన భయంకరము అయిన పెద్ద ఇనుపగుదియను ఊడలాగినాడు. దానితో రాక్షసులమీద పడ్డాడు. వారిని అందరినీ ఇట్లే చంపివేసినాడు. గరుత్మంతుడు మహాసర్పాన్ని వలె అంతట హనుమంతుడు తళతళలాడుతూ ఉన్న ఆ ఇనుపగుదియను పట్టుకొని ఆకాశానికి ఎగిరినాడు. మళ్ళీ పోరాటము కోసము అశోకవన బహిర్ద్వారము దగ్గరకు వచ్చి నిలుచున్నాడు.

భయపడి పారిపోయిన రాక్షసులు కొందరు రావణాసురుడి దగ్గరకు పోయి హనుమంతుడు కింకరులను అందరినీ చంపివేసినాడు అని చెప్పినారు. ఆ మహాబలవంతులు అందరూ చనిపోవడము విని, రావణాసురుడు గుడ్లు మిటకరించి అప్రతిమానపరాక్రమవంతుడూ, సమరదుర్జయుడూ అయిన జంబుమాలిని హనుమంతుడి మీదికి పొమ్మని ఆజ్ఞాపించినాడు.

43

కింకరులు అనే రాక్షసులను అందరినీ చంపివేసిన తరువాత హనుమంతుడు ఆలోచించసాగినాడు. "నేను ఈ అశోకవనాన్ని నాశనము చేసినాను. కాని ఇక్కడ ఉన్న ఈ చైత్యప్రాసాదాన్ని వదిలిపెట్టినాను. ఇప్పుడు ఈ భవనాన్ని అందరూ భయపడిపోయేటట్టు పగులకొట్టవలెను" అనుకొంటూ హనుమంతుడు తన బలము చూపించడానికోసము పైకి ఎగిరి మేరుపర్వతశృంగము అంత ఎత్తున ఉన్న ఆ చైత్యప్రాసాద భవనముపైకి పోయినాడు. పర్వతము అంత ఎత్తున ఉన్న ఆ ప్రాసాదముమీద సూర్యుడివలె తేజరిల్లుతూ పగులకొట్ట నలవికాని ఆ భవనాన్ని పగులకొట్టుతూ పారియాత్ర పర్వతమువలె విరాజిల్లినాడు. అంతట తన ప్రభావముతో దేహాన్ని మరింత పెంచి లంకా పట్టణము అంతటా వినిపించేటట్టు భుజస్ఫాలనము చేసినాడు. చెవులు గింగుర్లు ఎత్తే ఆ మహాధ్వనికి పక్షులు నేలకూలినవి. ఆ చైత్యప్రాసాదము బయట కావలి ఉన్న రాక్షసులు దద్దరిల్లిపోయినారు. ఆ రాక్షసులు అందరూ భయభ్రాంతులు అయ్యేట్టు సింహనాదము చేసినాడు. ఆ మహాధ్వనికి అక్కడ కావలి ఉన్న నూరుమంది రాక్షసులూ ఈటెలతోనూ, గండ్రగొడ్డళ్ళతోనూ, కత్తులతోనూ హనుమంతుడి మీదికి పోయినారు. వాండ్లు అందరూ ఆ హనుమంతుడి చుట్టూ మూగినారు. అట్లా ఆ మారుతాత్మజుడి చుట్టూ మూగిన రాక్షస సమూహము గంగాజలాలలో సుడిగుండమువలె కనిపించింది.

అప్పుడు ఆ మారుతాత్మజుడు క్రుద్ధుడు అయిపోయినాడు. పరమ భయంకర రూపము ధరించి ఆ మహాబలవంతుడు అంతట ఆ చైత్యప్రాసాదగృహానికి అమర్చివున్న బంగారు స్తంభాన్ని పెకలించి వేసినాడు. స్తంభాన్ని చేతిలో పట్టుకొని గిర గిరా తిప్పసాగినాడు. అట్లా తిప్పుతూ ఉండగా అక్కడ అగ్నిహోత్రము పుట్టింది. అది ఆ చైత్యప్రాసాద భవనానికి అంటుకొన్నది. భగభగ మంటలు లేచినవి. ఆ భవనము అట్లా కాలిపోతూ ఉంటే, దేవేంద్రుడు వజ్రాయుధముతో కొట్టేట్టు హనుమంతుడు తన చేతిలో ఉన్న ఆ బంగారు స్తంభముతో ఆ నూరుమంది రాక్షసులనూ కొట్టి, చంపివేసి ఆకాశానికి ఎగిరిపోయినాడు.

ఆకాశములో నిలుచుని లంకాపట్టణములో వారికి అందరికీ వినిపించేట్టుగా పెద్ద గొంతుతో, "ఓ రాక్షసులారా! సీతాదేవిని వెదకటానికి వానరరాజు అయిన సుగ్రీవుడు మహాపరాక్రమవంతులూ, అమితబలవంతులూ అయిన నాబోటి వాండ్లను వేలకు వేలమందిని పంపించినాడు. మేము ఈ భూమి అంతటా తిరుగుతున్నాము. మాలో కొందరు పది ఏనుగుల బలము కలవారు. కొందరు నూరు ఏనుగుల బలము కలవారు. కొందరు వెయ్యి ఏనుగుల బలము కలవారు. కొందరు వాయుదేవుడి అంత వేగవంతులు. వానరసేనా నాయకుల బలము ఇంత అంత అని చెప్పనలవికాదు. కోరలూ, గోళ్ళూ ఆయుధాలుగా చేసుకొని పోరాడే వందలకొద్దీ, వేలకొద్దీ, లక్షలకొద్దీ, కోట్లకొద్దీ వానర వీరులతో సుగ్రీవుడు ఇక్కడికి వస్తాడు. మిమ్ములను అందరినీ చంపివేస్తాడు. మీ రాజు అయిన రావణాసురుడు మహాత్ముడు అయిన రాముడి మీద బద్ధవైరము పెట్టుకొన్నాడు. ఇక మీ రాజు ఉండడు. మీరు ఉండరు. ఈ లంకా పట్టణము ఉండదు. సర్వనాశనము అయిపోతుంది" అని చెప్పినాడు.

44

రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి ప్రహస్తుడి పుత్రుడు జంబుమాలి హనుమంతుడి మీదికి బయలుదేరినాడు. అతడు అమితబలవంతుడు. మహాకాయుడు. పెద్ద పెద్ద కోరలతోనూ, పెద్ద పెద్ద మిడిగుడ్లతోనూ, ధగధగలాడే కుండలాలతోనూ ఉండే భయంకరుడు. సమర దుర్జయుడు. ఎర్రటి పూలదండలతోనూ, ఎర్రటి బట్టలతోనూ, ఇంద్రధనుస్సు అంత పెద్ద ధనుస్సు తీసుకొని, పిడుగుల చప్పుళ్ళవలె ఆ ధనుస్సును మోగిస్తూ బయలుదేరినాడు. ఆ ధనుష్టంకారానికి దిక్కులూ, విదిక్కులూ, భూనభోంతరాళాలూ ప్రతిధ్వనించినవి. అట్లా అమిత వేగముతో కంచరగాడిదలు కట్టిన రథముమీద వస్తూ ఉన్న జంబుమాలిని హనుమంతుడు చూచినాడు. ఉప్పొంగిపోయినాడు. పెద్దపెట్టున సింహనాదము

చేసినాడు. గువ్వగూండ్లతో ఉన్న ఆ బహిర్ద్వారము దూలముమీద కూర్చుని ఉన్న హనుమంతుణ్ణి జంబుమాలి చూచి అతడి ముఖానికి గురిచేసి ఒక అర్ధచంద్రాకారపు బాణాన్నీ, తలకు గురిచేసి ముద్దమొన ఉన్న బాణాన్నీ, చేతులకు గురిచేసి మరి పది బాణాలనూ వదిలినాడు. ఆ బాణాలు తగిలి హనుమంతుడి ముఖము ఎఱ్ఱబడి శరత్కాలములో సూర్యకిరణాలకు వికసించిన ఎఱ్ఱతామర పువ్వువలె శోభించింది. నెత్తురుతో తడిసిన హనుమంతుడి ముఖము అప్పుడు ఆకాశములో రక్తచందన బిందువులతో తడిసిన మహాపద్మము వలె తేజరిల్లింది. హనుమంతుడికి అప్పుడు తీవ్రము అయిన కోపము వచ్చింది. పక్కను పెద్దరాయి కనిపించింది. ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఇట్టే ఆ రాతిబండను పెళ్ళగించి తన బలముకొద్దీ జంబుమాలి మీద విసిరివేసినాడు. జంబుమాలి ఆ రాతిని గురిచేసి పది బాణాలు వదిలినాడు. ఆ రాయి ముక్కలు అయిపోయింది. తాను విసరివేసిన రాయి వ్యర్థము అయిపోవటము చూచి ఆ చండవిక్రముడు హనుమంతుడు ఒక పెద్ద సాలవృక్షాన్ని ఇట్టే పెళ్ళగించి గిరగిరా తిప్పసాగాడు. అట్లా గిర్రున తిప్పుతూ ఉన్న సాలవృక్షము మీద ఆ జంబుమాలి కొన్నిబాణాలు వదిలి దాన్ని ముక్కలు ముక్కలు చేసి హనుమంతుడి భుజముమీద అయిదు బాణాలనూ, వక్షఃస్థలముమీద ఒక బాణాన్నీ, మరి పది బాణాలను దేహము అంతటనూ వదిలినాడు. కాయము అంతటా బాణాలు గుచ్చుకొని హనుమంతుడికి మహాకోపము వచ్చి ఇనుపగుదియను తీసుకొని అమితవేగముతో తిప్పుతూ గబుక్కున ముందుకుపోయి చటుక్కున జంబుమాలి వక్షఃస్థలము మీద కొట్టినాడు. జంబుమాలి కింద పడిపోయినాడు. అంతట హనుమంతుడు ఆ ఇనుప గుదియతో జంబుమాలి తలనూ, చేతులనూ, మోకాళ్ళనూ చితుకకొట్టినాడు. అంతటితో ఆగకుండా ఆ రథాన్నీ, ఆ రథానికి కట్టిన గాడిదలనూ నాశనము చేసివేసినాడు. జంబుమాలి మహాకాయము అంతా ముక్కలు ముక్కలు అయిపోయింది. ఆభరణాలు చెక్కుచెదరకుండా అతడు నేలమీద పడిపోయినాడు.

మహాబలవంతులు అయిన కింకరులు చచ్చిపోవడమే కాకుండా జంబుమాలి సంహారమున్నూ రావణాసురుడు విన్నాడు. కోపముతో కన్నులు ఎఱ్ఱపడిపోయినవి. ఎఱ్ఱటి కన్నులు తిప్పుతూ అమితబలవంతులూ, అతివీర్యవంతులూ, మహా పరాక్రమ వంతులూ అయిన అమాత్యపుత్రులను హనుమంతుడి మీదికి పొమ్మని ఆజ్ఞాపించినాడు.

45

హనుమంతుడు అమాత్య పుత్రులను వధించుట

రావణాసురుడు ఆజ్ఞాపించినందువల్ల ఆతని మంత్రుల పుత్రులు అగ్నిహోత్రమువంటి కాంతిమంతులూ, మహాబలవంతులూ, అస్త్రశస్త్రవిదులూ,

అమితపరాక్రమవంతులూ అయిన ఏడుగురు రాక్షసులు హనుమంతుడిమీదికి బయలుదేరినారు. వారి వెంట మహాసైన్యము నడిచింది. వారు ఏడుగురూ ధానుష్కులు. పరస్పర జయైషిణులు. బంగారు జాలర్లు వేసిన ధ్వజాలతోనూ, పతాకాలతోనూ మేఘగంభీర ధ్వనులు చేస్తూ నడిచే మహారథాలమీద ఏడుగురున్నూ తప్తకాంచన ధనస్సులు సారిస్తూ మెరుపులు మెరిసే మేఘాలవలె రావణాసురుడి రాజభవనమునుంచి బయలుదేరినారు. అప్పుడు వారి తల్లులూ, బంధువులూ స్నేహితులూ కింకరులను చంపివేసిన హనుమంతుడి మీదికి పోతున్నారు అని శోకసంభ్రాంతులు అయిపోయినారు.

ఆ మంత్రిపుత్రులు తప్తకాంచన భూషణాలు ధరించి ఆ రథాలమీద ఒకరి రథాన్ని ఒకరు ఒరుసుకొంటూ అశోకవన బహిర్ద్వారము దగ్గరకు పోయినారు. వారు ఏడుగురున్నూ నీలమేఘాలవలె కనిపించినారు. వారి రథాల ధ్వనులు మేఘగర్జనలవలె వినిపించినవి. వారు వారి బాణాలను వర్షమువలె కురిపిస్తూ మహామేఘాలవలె విహరించినారు.

హనుమంతుడు ఆ బాణవర్షములో మునిగిపోయినాడు. వానజల్లు కమ్ముకొన్న హిమవత్పర్వతమువలె అయిపోయినాడు. అంతట ఆ హనుమంతుడు చటుక్కున నిర్మలాకాశానికి ఎగిరి, ఆ ఏడుగురు వదలిన బాణాలనూ, రథాల వేగాన్నీ వ్యర్థము చేసివేసినాడు. ధనుష్మంతులు అయిన ఆ రాక్షసులను తప్పించుకొని ఆ వీరుడు హనుమంతుడు ఆకాశములో విహరిస్తూ ఇంద్రధనుస్సువున్న మేఘాలతో క్రీడించే వాయుదేవుడివలె తేజరిల్లినాడు. మహాభయంకరముగా కేకలువేస్తూ, ఆ మహాసైన్యాన్ని భయపెట్టుతూ ఆ రాక్షసులమీదికి అమిత వేగముతో దూకి, కొందరిని అరచేతులతో చరిచినాడు. కొందరిని పాదాలతో పడతన్నినాడు. కొందరిని పిడికిళ్ళతో పొడిచినాడు. కొందరిని తన గోళ్ళతో చీల్చినాడు. కొందరిని తన వక్షఃస్థలముతోనూ, కొందరిని తన తొడలతోనూ చంపివేసినాడు. అతడి మహాధ్వనులకు కొందరు నేలకూలినారు. అట్లా రాక్షసులు నేలకూలుతూనూ, చచ్చిపోతూనూ ఉంటే రాక్షససైన్యము అంతా భయపడి దశదిశలా పరుగులెత్తింది. ఏనుగులు వికృతముగా అరచినవి. గుర్రాలు నేలకూలినవి. రథాలమీది ధ్వజాలూ, ఛత్రాలూ ముక్కలు ముక్కలు అయిపోయినవి. ఆ దారిన నెత్తురు యేర్లుకట్టి పారింది. అప్పుడు లంకాపట్టణములో నానావిధవికృతధ్వనులూ బయలుదేరినవి.

ఆ మహావీరుడు, ఆ మహాబలవంతుడు, ఆ ప్రచండ పరాక్రమవంతుడు హనుమంతుడు బలవృద్ధులు అయిన రాక్షసులను చంపివేసి మళ్ళీ వచ్చే రాక్షసులతో పోరాటానికి ఎదురుచూస్తూ అశోకవన బహిర్ద్వారాన నిలుచున్నాడు.

46
సేనానాయకుల వధ

హనుమంతుడు మంత్రి పుత్రులను చంపివేసినాడు అని రావణాసురుడు విన్నాడు. క్రుంగిపోయినాడు. జాగ్రత్తగా ఆలోచించినాడు. నీతిశాస్త్రవిశారదులూ, వీరులూ, వాయువేగసమానులూ, సేనానాయకులూ అయిన విరూపాక్ష యూపాక్షులనూ, దుర్ధనుడూ, ప్రఘసుడూ, భాసకర్ణుడూ అనే అయిదుగురు రాక్షసులను పిలిచి, "సేనానాయకులారా! మీరు మహాబలవంతులు. మీరు గుర్రాలతోనూ, ఏనుగులతోనూ, రథాలతోనూ బయలుదేరి పొండి. ఆ వానరుణ్ణి శిక్షించవలెను. మీరు ఆ వానరుణ్ణి పట్టుకొని వచ్చే ప్రయత్నము చేయండి. దేశకాలవిరోధము అయిన పని చేయవద్దు. వాడు చేస్తూఉన్న పనులనుబట్టి వాడు వానరుడు అనుకోడానికి వీలుకాకుండా ఉంది. ఎన్ని విధాల ఆలోచించినా వాడు మహాభూతముగా తోస్తున్నాడు. మనలను అందరినీ నాశనము చేయవలెను అనుకొని దేవేంద్రుడు వాణ్ణి సృష్టించినాడు ఏమో! నేను మీ అందరినీ వెంటపెట్టుకొని నాగులనూ, యక్షులనూ, అసురులనూ, మహర్షులనూ జయించినాను. అందువల్ల వాండ్లు అవశ్యమూ మనకు ఏది అయినా అపకారము తలపెట్టి ఉండవచ్చును. అందులో సందేహము లేదు. మీరు మీ బలము అంతా ఉపయోగించి వాడిని పట్టుకోవలెను. వాడు భయంకర పరాక్రముడు. కాబట్టి వాణ్ణి పట్టుకొని రావలసింది. నేను పూర్వము వాలినీ, సుగ్రీవుణ్ణీ, మహా బలవంతుడు అయిన జాంబవంతుణ్ణీ, వానరసేనానాయకుడు అయిన నీలుణ్ణీ, ఇంకా ద్వివిదుడు మొదలు అయిన వానరవీరులనూ చూచి ఉన్నాను. వారికి ఎవరికీ వీడికి ఉన్న భయంకర గమనము లేదు. వారు ఇటువంటి కాంతిమంతులు కారు. ఇంత పరాక్రమవంతులు కారు. ఇంత ఆలోచన వారికి ఎవరికీ లేదు. ఇంత బలమున్నూ, ఇంత ఉత్సాహమున్నూ వారికి ఎవరికీ లేవు. ఈ వానరుడికి ఉన్న మహత్తర రూపమున్నూ వారికి లేదు. ఇది అంతా ఆలోచిస్తూ ఉంటే, వానర రూపముతో వచ్చిన మహాభూతము ఏమోను అనిపిస్తున్నది. మీరు ప్రయత్నముచేసి ఈ వానరుణ్ణి నిగ్రహించవలెను. మీరు మహా పరాక్రమవంతులు. ముల్లోకాలలో ఉన్న దేవతలూ, అసురులూ, మానవులూ ఏకము అయినా యుద్ధములో మీ ఎదుట నిలువజాలరు. అట్లా అయినప్పటికిన్నీ యుద్ధములో జయాపజయాలు ముందుగా నిశ్చయించడానికి వీలుకాదు. జయము కాంక్షించే నీతిజ్ఞులు ముఖ్యముగా ప్రయత్నముతో తమను తాము రక్షించుకోవలెను. కాబట్టి మీరు జాగ్రత్తగా ప్రవర్తించవలెను" అని చెప్పినాడు.

అంతట ఆ మహాబలవంతులు, ఆ మహావేగవంతులు, అగ్ని హోత్రమువంటి ఆ తేజోవంతులు అయిదుగురూ రాజాజ్ఞను శిరసావహించి మదించిన ఏనుగులతోనూ, అమితవేగముగాపోయే గుర్రాలతోనూ, సమస్తవిధ సైన్యాలతోనూ, వివిధ తీక్షణాయుధాలతోనూ బయలుదేరి హనుమంతుడి మీదికి పోయినారు. అశోకవన బహిర్ద్వారము దగ్గర ఉదయిస్తున్న సూర్యుడివలె తన దేహకాంతులతో తేజరిల్లుతూ ఉన్న ఆ మహాసత్త్వుణ్ణి, ఆ మహాబలవంతుణ్ణి, ఆ మహోత్సాహుణ్ణి హనుమంతుణ్ణి ఆ రాక్షస సేనానాయకులు చూచినారు. వెంటనే వారు అందరూ ఆ మహాకాయుడి చుట్టూ మూగినారు. ఆ యా భయంకరము అయిన ఆయుధాలతో ఎదిరించినారు. అప్పుడు దుర్ధరుడు అనే రాక్షస సేనానాయకుడు పసుపుపచ్చ మొనలతోనూ, తామరరేకులవంటి కాంతితోనూ ఉన్న అయిదు బాణాలను హనుమంతుడి శిరస్సుమీద వదిలినాడు. ఆ అయిదు బాణాలూ తలమీద తగలగానే హనుమంతుడు దశదిశలూ పిక్కటిల్లిపోయేట్టు సింహనాదము చేసి ఆకాశానికి ఎగిరినాడు. అప్పుడు ఆ మహాబలవంతుడు దుర్ధరుడున్నూ రథముతో కూడా ఆకాశానికి ఎగిరి తీక్షణము అయిన బాణాలను హనుమంతుడి మీదకు వదలినాడు. శరత్ కాలములో వర్షము కురిసే మేఘాన్ని అతి సులభముగా వాయువు అడ్డగించేటట్లు బాణవర్షము కురిపిస్తూవున్న ఆ దుర్ధరుణ్ణి హనుమంతుడు అడ్డగించినాడు. దేహాన్ని మరింత పెంచినాడు. చటుక్కున ఎంతో ఎత్తున పైకి ఎగిరి మహావేగముతో పిడుగుల గుంపు పర్వతముమీద పడ్డట్టు ఆ దుర్ధరుడి రథముమీదికి దూకినాడు. అప్పుడు దుర్ధరుడు నేలకూలినాడు. ఎనిమిది గుర్రాలూ చచ్చి రథము నొగా, కండ్లూ విరిగిపోయి నేల కూలింది. అట్లా దుర్ధరుడు చచ్చి నేల కూలడము చూచి ఎదిరించ నలవికాని ఆ అరిందములు విరూపాక్ష యూపాక్షులు ఇద్దరూ కోపముతో ఆకాశానికి ఎగిరినారు. ఆ స్వచ్ఛాకాశములో ఉన్న హనుమంతుడి ఎదురురొమ్ములమీద ఇనుపగుదియలతో కొట్టినారు. గరుత్మంతుడివంటి ఆ పరాక్రమవంతుడు, ఆ మహాబలవంతుడు హనుమంతుడు అమితవేగములో ఆ విరూపాక్ష యూపాక్షులను కొట్టి చటుక్కున నేలమీదికి వచ్చినాడు. అంతట వాయుపుత్రుడు ఒక మద్ది చెట్టును ఇట్టే పెకలించి విరూపాక్ష యూపాక్షులను కొట్టి చంపివేసినాడు. అట్లా ముగ్గురు బలవంతులు అయిన రాక్షసులనూ హనుమంతుడు చంపి వేయడము చూచి, ప్రఘసుడు మహావేగముతో హనుమంతుణ్ణి ఎదిరించినాడు. అమితవీర్యవంతుడు అయిన భాసకర్ణుడు మహాకోపముతో శూలము తీసుకొని హనుమంతుడి మీదికి పోయినాడు. ఆ ఇద్దరూ ఒక పక్కను ఉండి హనుమంతుడితో పోరాటము సాగించినారు. ప్రఘసుడు కరుకు అయిన అడ్డకత్తితోనూ, భాసకర్ణుడు శూలముతోనూ పోరాడినారు.

హనుమంతుడి దేహము అంతా నెత్తురు కమ్ముకొని బాలసూర్య ప్రభలతో తేజరిల్లింది. అప్పుడు అతడు మృగాలతోనూ, పాములతోనూ, చెట్లతోనూ ఉన్న ఒక పర్వతాన్ని పెకలించి ఆ రాక్షసులను ఇద్దరినీ చంపివేసినాడు. ఆ అయిదుగురు సేనానాయకులను చంపివేయడమే కాకుండా మిగిలిన సైన్యాన్ని అంతా చిందరవందరగా చంపివేసినాడు. అసుర సంహార సమయములో దేవేంద్రుడు చేసినట్టు అప్పుడు హనుమంతుడు ఆ రాక్షస సైన్యములో కలత పుట్టించి వారి గుర్రాలను వారి గుర్రాలచేతనే చంపించినాడు. వారి ఏనుగులతో వారి ఏనుగులే పోరాడినవి. వారి రథాలను వారి రథికులే పడగొట్టినారు. వారి యోధులతో వారి యోధులే కలహించి ఒకరిని ఒకరు చంపుకొన్నారు. చచ్చి పడిపోయిన గుర్రాలతోనూ, ఏనుగులతోనూ, విరిగి పడిపోయిన మహా రథాలతోనూ, చచ్చి పడిపోయిన రాక్షస కళేబరాలతోనూ ఆ నేలమీద దారి తెలియకుండా పోయింది. ఆ మహాపరాక్రమవంతుడు హనుమంతుడు రాక్షస సేనానాయకులనూ, వాండ్ల సైన్యాలనూ, వాహనాలనూ నాశనము చేసివేసి ప్రళయ కాలములో ఉగ్రుడు అయ్యే యముడి వలె అశోకవన బహిర్ద్వారము దగ్గర మళ్ళీ వచ్చే రాక్షసుల కోసము ఎదురుచూస్తూ నిలుచున్నాడు.

47

అక్షకుమారుని వధ

ఐదుగురు సేనానాయకులనూ, వారివెంట పోయిన సైన్యాన్నీ, వారి వాహనాలనూ హనుమంతుడు నాశనము చేసివేసినాడు అని రావణాసురుడు విన్నాడు. ఎట్టఎదుట ఉన్న తన కుమారుని అక్షుణ్ణి చూచినాడు. ఆ యుద్ధోన్మత్తుడు, ఆ పరాక్రమవంతుడు అక్షకుమారుడు తనను హనుమంతుడి మీదికి పొమ్మని తండ్రి తన వంక చూచినాడు అని తెలుసుకొన్నాడు. బంగారు పొదిగిన కార్ముకము తీసుకొన్నాడు. బ్రాహ్మణోత్తముల ఆజ్యాహుతులకు మంటలుమండే అగ్నిహోత్రము వలె ఆ సదస్సులో లేచినాడు.

బాలసూర్యప్రభలతో ధగధగలాడుతూ ఉన్న తప్తకాంచన రథము వచ్చింది. అది తపోబలముతో ఆర్జించింది. దానిమీద అంతటా పతాకాలూ, రత్నాలు పొదిగిన ధ్వజమూ అమర్చి ఉన్నవి. మనోవేగముతో పోయే ఎనిమిది గుర్రాలు ఆ రథానికి పూంచి ఉన్నవి. దానిని సురాసురులు ఎవరూ ఎదిరించలేరు. అది ఏ అడ్డూ లేకుండా పరుగులెత్తుతుంది. ఆకాశములో సయితము అది సంచరిస్తుంది. అమ్ముల పొదులూ, ఎనిమిది ఖడ్గాలూ, వరుసగా శక్తి తోమరాలూ మొదలు అయిన ఆయుధాలూ, వేళ్ళాడ కట్టిన గంటలూ, సూర్యచంద్రులవంటి కాంతులతో వెలుగొందుతున్న బంగారు

వెండి పూలదండలూ, యుద్ధానికి అవసరము అయిన సమస్తోపకరణాలూ ఆ రథములో ఉన్నవి.

అక్షకుమారుడు ఆ రథముమీద బయలుదేరినాడు. ఆ రథఘోషముతోనూ, ఆ రథమువెంట బయలుదేరిన గుర్రాలూ ఏనుగులూ మహారథాలు మొదలైన వాటి మహాధ్వనులతోనూ, ఆకాశమూ, పర్వతాలతో ఉన్న ఈ భూమి మారుమోగి పోయినది. ప్రళయకాలాగ్నిహోత్రమువలె తేజరిల్లుతూ ఉన్న హనుమంతుణ్ణి అశోకవన బహిర్ద్వారము దగ్గర అక్షకుమారుడు తన తేనెకన్నులతో చూచినాడు. ఆశ్చర్యపడ్డాడు. కలవరపడిపోయినాడు. అతడు అమితపరాక్రమవంతుడు అని తెలుసుకొన్నాడు. మెప్పుతో చూచినాడు. శత్రువులను జయించే ఆ హనుమంతుడి పరాక్రమాన్నీ, వేగాన్నీ, తన బలాన్నీ సరిచూచుకొన్నాడు. ఆలోచించినాడు. ప్రళయకాలసూర్యుడివలె తేజరిల్లినాడు. పోరాటములో నిగ్రహించ నలవికాని ఆ స్థిరపరాక్రమవంతుణ్ణి హనుమంతుణ్ణి చూచినకొద్దీ అక్షకుమారుడికి కోపము పెచ్చు పెరిగింది. మనస్సు దిటవుపరచుకొన్నాడు. స్థిరచిత్తుడు అయినాడు. అంతట మూడు తీక్ష్ణబాణాలను వదలి హనుమంతుణ్ణి పోరాటానికి పురికొల్పినాడు. ఎంతటి శ్రమను అయినా లక్ష్యము చేయకుండా శత్రువులను జయించే సామర్థ్యము ఆ హనుమంతుడికి ఉంది అని తెలుసుకొన్నాడు. చేతిలో బాణాన్నీ, ధనుస్సునూ పట్టుకొని యుద్ధసూచకముగా హనుమంతుడి వంక తేరిపార చూచినాడు. ఒక్కక్షణము ఆలోచించినాడు. బంగారు పతాకము అమర్చిన బాహుపురులతోనూ, సొగసు అయిన కుండలాలతోనూ ఉన్న అక్షకుమారుడు ప్రచండపరాక్రమముతోనూ, అమితఉరవడితోనూ చెలరేగి పోరాడే హనుమంతుడి మీదికి పోయినాడు.

ఆ ఉభయుల పోరాటానికి సురాసురులు అందరూ సంభ్రమ పడిపోయినారు. అప్పుడు భూమిమీద ఘోరముగా దుమ్ము రేగింది. సూర్యుడు ఎండకాయడము మానివేసినాడు. గాలి వీచడము ఆగిపోయింది. కొండలు అన్నీ కదలిపోయినవి. భూమ్యాకాశాలు రెండూ ధ్వనించినవి. సముద్రము అల్లకల్లోలము అయింది.

గురిపెట్టడములోనూ, బాణాన్ని ఎక్కుపెట్టడములోనూ, ఎక్కుపెట్టిన బాణాన్ని వదలడములోనూ అక్షకుమారుడు అత్యంత నిపుణుడు. బంగారు మొనలతోనూ, రెక్కలతోనూ ఉన్న విషసర్పాలవంటి మూడు తీవ్రము అయిన బాణాలను హనుమంతుడి తలకు గురిచేసి వదలినాడు. ఆ మూడు బాణాలున్నూ పోయి సరిగా హనుమంతుడి శిరముమీద నాటుకొన్నవి. నెత్తురు ధారలు కట్టి అతని గుండ్రని నేత్రాలను తడిపివేసినవి. ఆ రక్తధారలతో హనుమంతుడు అప్పుడే ఉదయిస్తూఉన్న సూర్యుడివలెనూ, నెత్తిన నాటుకొన్న బాణాలు సూర్యుడి

కిరణాలవలెనూ కనిపించినాడు. నానావిధాయుధాలతోనూ, చిత్రవిచిత్రముగా మెరసిపోతూ ఉన్న ధనుస్సులతోనూ పోరాటానికి తలపడ్డ అక్షకుమారుణ్ణి చూచి మెచ్చుకొని హనుమంతుడు పోరాటానికి పూనుకొన్నాడు. మిట్టమధ్యాహ్న సూర్యుడివలె అత్యుగ్రుడు అయిపోయి మహాకోపము వచ్చి, అగ్నిహోత్రమువలె జ్వలిస్తూ తన నేత్రాలతో కాల్చివేసేటట్టు అక్షకుమారుణ్ణీ, అతని సైన్యాన్నీ, అతని వాహనాలనూ చూచినాడు.

తన ధనుస్సును ఇంద్రధనుస్సువలె చేసి, తన బాణాలను వర్షధారవలె కురిపించ తలచుకొని అక్షకుమారుడు పర్వతముమీద మహామేఘము వానకురిసినట్టు, పర్వతాకారుడు అయిన హనుమంతుడి మీద బాణవర్షము కురిపించినాడు. భయంకర పరాక్రమముతో, అధిక తేజముతో ఆకాశములో మహామేఘమువలె తిరుగుతూ ఉన్న అక్షకుమారుణ్ణి చూచి హనుమంతుడు సింహనాదము చేసినాడు. ఆ అక్షకుమారుడు బాలుడు. పరాక్రమముతో గర్వించి, మహాకోపముతో కన్నులు ఎఱ్ఱపడిపోయి, మదించిన ఏనుగు తెలియక గడ్డికప్పిన పెద్దగుంటమీదికి పోయినట్టు హనుమంతుడిమీదికి పోయినాడు. అప్పుడు హనుమంతుడు తన బాహువులనూ, తొడలనూ భయంకరముగా విదిలిస్తూ చటుక్కున ఆకాశానికి ఎగిరినాడు. అట్లా ఆకాశానికి ఎగురుతూ ఉన్న హనుమంతుణ్ణి చూచి అక్షకుమారుడున్నూ రథముతో కూడా ఆకాశానికి ఎగిరి, పర్వతముమీద రాళ్ళవలె, హనుమంతుడిమీద బాణవర్షము కురిపించినాడు. మనోవేగముతో సంచరించే ఆ చండపరాక్రమవంతుడు హనుమంతుడు అక్షకుమారుడి బాణాలకు చిక్కకుండా ఆ బాణాల నడుమనే తిరుగుతూ ఆకాశములో విహరించినాడు. ఆకాశాన్ని అంతా బాణాలతో కప్పివేస్తున్న ఆ అక్షకుమారుణ్ణి చూచి మెచ్చుకొంటూ ఆలోచించసాగినాడు. అంతలో అక్షకుమారుడు వదిలిన, రెండు బాణాలూ వచ్చి హనుమంతుడి ఎదురు రొమ్ములలో పడ్డవి.

హనుమంతుడు అంతట పెద్ద పెట్టున అరిచినాడు. ఆలోచించసాగినాడు. "వీడు, ఈ అక్షకుమారుడు మహాబలవంతుడు. పిల్లవాడు అయినప్పటికిన్నీ గడిదేరి సూర్యుడివలె తేజరిల్లుతూ మహత్కార్యము నెరవేరుస్తున్నాడు. వీడికి యుద్ధతంత్రము అంతా తెలుసును. వీణ్ణి చంపివేయడము ఎట్లాగో నాకు తోచడము లేదు.

"వీడు మహాపరాక్రమవంతుడు. అతి సాహసముతోనూ, హెచ్చరికతోనూ పోరాడుతున్నాడు. నాగులూ, యక్షులూ, దేవతలూ మెచ్చుకొనేట్టు వీడు ఇప్పుడు నా ఎట్టఎదుట నిలుచుని పరాక్రమముతోనూ, ఉత్సాహముతోనూ యుద్ధముచేస్తూ ఉన్నాడు. వీణ్ణి ఇప్పుడు చంపివేయకుండా ఉపేక్షించేట్లయితే, వీడు ఉత్తరోత్తరా

మమ్ములను తప్పకుండా బాధపెట్టుతాడు. ఇప్పుడు వీణ్ణి చంపివేయడమే తగిన పని. చెలరేగుతూ ఉన్న అగ్నిహోత్రాన్ని ఎంతమాత్రమూ ఉపేక్షించరాదు" అని నిశ్చయించి, హనుమంతుడు అక్షకుమారుడి రథానికి కట్టిన ఎనిమిది గుర్రాలమీదికిన్నీ ఆకాశములోనుంచి దూకి, అరచేతులతో చరిచి చంపివేసినాడు. ఆ రథము ఇరుసును విరగతన్నినాడు. గుర్రాలు పడిపోయి, నొగ తొలగిపోయి ఆ రథము ఆకాశములోనుంచి నేలకూలింది. అంతట అక్షకుమారుడు నేలకూలిన ఆ రథము వదలిపెట్టి ధనుస్సూ, ఖడ్గమూ తీసికొని మహర్షి దేహాన్ని వదిలిపెట్టి స్వర్గానికి పోయేట్టు ఆకాశానికి ఎగిరినాడు. వాయువువంటి మహాపరాక్రమవంతుడు హనుమంతుడు సిద్ధులు విహరించే ఆకాశములోనికి అట్లా ఎగిరి వస్తూ ఉన్న అక్షకుమారుణ్ణి చూచి, వాడి రెండు పాదాలూ గట్టిగా పట్టుకొని గరుత్మంతుడు మహాసర్పాన్నివలె వెయ్యిమార్లు గిరగిరాతిప్పి అమితవేగముతో నేలమీద విసిరివేసినాడు.

అక్షకుమారుడు చేతులూ మెడా తొడలూ నడుమూ విరిగి, దేహమునుండి నెత్తురు కారుతూ, ఎముకలూ కాళ్ళూ నలిగిపోయి, కళ్ళు గూండ్లు తిప్పి, కట్టుకొన్న దట్టీ ఊడిపోయి నేలమీద పడ్డాడు.

అప్పుడు జ్యోతిశ్చక్రములో తిరిగే మహావ్రతులు అయిన మహర్షులూ, భూతాలూ, యక్షులూ, పన్నగులూ, దేవతలూ, దేవేంద్రుడూ చూచి ఆశ్చర్యపోయినారు. దేవేంద్రుడివంటి అక్షకుమారుణ్ణి అట్లా చంపివేసి, హనుమంతుడు ఆ అశోకవన బహిర్ద్వారానికి పోయి ప్రళయకాల యముడివలె నిలుచున్నాడు.

48

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రంతో ఆంజనేయుని బంధించుట

అక్షకుమారుణ్ణి హనుమంతుడు చంపివేసినాడు అని రావణాసురుడు విన్నాడు. దుఃఖము అణచుకొన్నాడు. చెడ్డ కోపము వచ్చింది. దేవేంద్రుడివంటి తన కుమారుణ్ణి ఇంద్రజిత్తును చూచి, "నాయనా! నీవు బ్రహ్మదేవుణ్ణి ఆరాధించి అనేక దివ్యాస్త్రాలు సంపాదించినావు. నీవు శస్త్రాస్త్రవేత్తలలో శ్రేష్ఠుడవు. దేవతలతోకూడా దేవేంద్రుణ్ణి జయించినావు. సురాసురులు అందరూ ఏకము అయినప్పటికిన్నీ నీవు జయించకలవు. యుద్ధములో నీ అస్త్రబలానికి సురలుకానీ, అసురులుకానీ నిలువలేరు. మరుద్గణాలున్నూ నిలువలేరు. నీతో పోరాడి జయించ కలవాడు ముల్లోకాలలోను ఎవడూ లేడు. నీ భుజపరాక్రమమూ, నీ తపోబలమూ నిన్ను కాపాడుతూ ఉన్నవి. నీవు దేశ కాల విభాగాలు చక్కగా ఎరిగినవాడవు. మహామతిమంతుడవు. యుద్ధములో నీ పరాక్రమానికి అశక్యము అయింది ఏదీ లేదు. నీ బుద్ధిబలముతో ముందుగా

ఆలోచిస్తే నీకు అసాధ్యము అయింది ఏమీ ఉండదు. ముల్లోకాలలోనూ నీ దేహబలాన్నీ, నీ అస్త్రబలాన్నీ ఎరిగినవాడు ఎవడూ లేడు. నీవు నాతో సరిసమానము అయిన తపోబలము, పరాక్రమము కలవాడవు. యుద్ధసంకట సమయములో నీకు తప్పకుండా జయము సమకూరుతుంది. నీవు ఉన్నందువల్లనే నాకు ఏ దుఃఖమూ లేదు.

"నాయనా! కింకరులు అందరూ చనిపోయినారు. జంబుమాలీ, మంత్రిపుత్రులు ఏడుగురూ, సేనానాయకులు అయిదుగురూ చచ్చిపోయినారు. గుర్రాలూ, మహారధాలూ, సైన్యమూ నాశనము అయిపోయినవి. నీ తమ్ముడు అక్షకుమారుడున్నూ హతుడు అయిపోయినాడు. నాయనా! నీ మీద నాకు ఉన్న నమ్మకము వారి ఎవరిమీదనూ లేదు. నీవు శత్రుసంహారకుడవు. ఓ మతిమంతుడా, నీవు ఆ హనుమంతుడి మహాబలాన్నీ, వాడి ప్రభావాన్నీ, పరాక్రమాన్నీ, నీ బలాన్నీ గురించి ఆలోచించు. నీ బలానికి అనుగుణంగా అమితవేగముతో నీవు వాడితో పోరాడవలెను. మన సేన నాశనము అయిపోకుండా నీ బలమూ, శత్రుబలమూ చూచుకొంటూ పోరాడవలెను.

"నాయనా! ఆ వానరుడు సైన్యాలను గుంపులు గుంపులుగా చంపివేస్తున్నాడు. నీవు ఏ సన్నాహముతో పోతే ఆ శత్రువు హతము అయిపోతాడో ఆ విధముగా పోవలెను. వజ్రాయుధాలు తీసుకొని మన సేనలు అన్నీ వాడిమీద పడ్డప్పటికిన్నీ వాడు చెక్కుచెదరడు. వాడికి ఉన్న వేగము వాయువుకు లేదు. వాడు అగ్నిహోత్రమువంటివాడు. వాడిని ఏ ఆయుధముతోను చంపడానికి అలవికాదు. ఇది అంతా చక్కగా ఆలోచించి నీవు ఏమరుపాటులేకుండా కార్యము చెడకుండా దివ్యము అయిన నీ అస్త్రబలాన్ని స్మరించుకొంటూ వాడి మీదికి పో. అమోఘముగా విజృంభించు. నిన్ను యుద్ధానికి పంపించడము నాకు ఇష్టములేదు. అయితే రాజధర్మాన్నిపట్టీ, క్షత్రధర్మాన్నిపట్టీ పంపిస్తున్నాను.

"ఓ అరిందమా! నీవు నానావిధాయుధాలతో యుద్ధము చేయడములో నీ పాండిత్యము తెలుసుకో. జయించు" అని చెప్పినాడు.

అంతట ఆ మహాబలవంతుడు, ఆ మహాపరాక్రమవంతుడు, దేవతలవంటి ప్రభావముకల ఆ ఇంద్రజిత్తు యుద్ధానికి పోతలచి తండ్రికి ప్రదక్షిణము చేసినాడు. నమస్కారము చేసినాడు. తనవారు అందరూ ప్రశంసిస్తూ ఉండగా పరమోత్సాహముతో ఇంద్రజిత్తు యుద్ధానికి బయలుదేరినాడు.

ఆ కాంతిమంతుడు, ఆ పద్మపత్రాక్షుడు, ఆ మహాతేజోవంతుడు ఇంద్రజిత్తు పర్వకాలములో మహాసముద్రమువలె హనుమంతుడి మీదికి బయలుదేరినాడు.

తీక్షణదంష్ట్రలతో ఉన్న నాల్గు పెద్దపులులు పూంచిన రధము వచ్చింది. ఆ పెద్దపులులు గరుత్మంతుడితో సరిసమానము అయిన వేగముతో పోతవి. ఆ రధముమీద దేవేంద్రుడివంటి ఇంద్రజిత్తు ఎక్కినాడు. అమితవేగముతో హనుమంతుడు ఉన్న చోటుకు పోయినాడు.

హనుమంతుడు ఆ ఇంద్రజిత్తు రధఘోషాన్నీ, అల్లెతాటి ధ్వనినీ విన్నాడు. మళ్ళీ యుద్ధము చేయబోతున్నందుకు సంతోషపడ్డాడు. అప్పుడు రణపండితుడు ఇంద్రజిత్తు పెద్ద ధనస్సును తీసుకొని పదును అయిన ములుకుల బాణాన్ని సంధించి హనుమంతుడి మీద వదలినాడు. అప్పుడు దిక్కులు అన్నీ మాసిపోయినవి. క్రూరమృగాలు నానావిధాలా అరచినవి. ఆ యుద్ధము చూడటానికి జ్యోతిశ్చక్రములో సంచరించే నాగులు, యక్షులు, మహర్షులు, సిద్ధులు వచ్చినారు. ఆకాశములో పక్షిసంఘాలు పరమసంతోషముతో గుంపులు కట్టి తిరుగుతూ పెద్దగా అరచినవి. రధముమీద అతివేగముతో వస్తూఉన్న ఇంద్రజిత్తును ఆ వేగవంతుడు హనుమంతుడు చూచి సింహనాదము చేసినాడు. తన దేహాన్ని పెంచినాడు. రధముమీద ఉన్న ఇంద్రజిత్తు విచిత్రము అయిన కార్ముకాన్ని తీసుకొని నారి సారించి పిడుగుల ధ్వని చేసినాడు. అంతట ఆ మహావేగులు, ఆ మహాబలవంతులు, యుద్ధము అంటే ఏ మాత్రమూ భయములేని ఆ వీరులు బద్ధవైరులు అయిన దేవేంద్రుడూ అసురేంద్రుడూ వలె ఆ హనుమంతుడూ ఇంద్రజిత్తూ ఒకరిని ఒకరు ఎదుర్కొన్నారు.

ఆ మహారధుడు ఇంద్రజిత్తు వదలే బాణాలను హనుమంతుడు తప్పించుకొని, అప్రమేయబలముతో తన తండ్రి వాయుదేవుడివలె ఆకాశములో విహరించసాగినాడు.

ఇంద్రజిత్తు చక్కని రెక్కలు కట్టిన బాణాలను తీసినాడు. వాటి ములుకులకు బంగారము పొదిగివుంది. ఆ బాణాల కొనలు వంగి ఉన్నవి. అవి పొడుగాటివి. వాటికి తీక్షణము అయిన మొదలు ఉన్నవి. ఆ బాణాలను వజ్రాయుధ వేగముతో హనుమంతుడిమీద వదలినాడు. హనుమంతుడు వాటిని అన్నిటినీ తప్పించుకోవడానిక ఇట్టే నేలమీదికి వచ్చినాడు. ఆ ఇంద్రజిత్తు రధధ్వనులూ, మద్దెళ్ళూ తప్పెట్లూ, భేరులూ మొదలు అయిన వాటి ధ్వనులూ, అల్లెతాడు లాగుతూ ఉన్న వింటి ధ్వనినీ విని హనుమంతుడు మళ్ళీ ఆకాశానికి ఎగిరినాడు. అట్లా హనుమంతుడు ఇంద్రజిత్తు గురిపెట్టి వదలిన బాణాలను అన్నిటినీ వ్యర్ధము చేసివేస్తూ ఆ బాణాల మధ్యప్రదేశములో తిరిగినాడు. ఇంద్రజిత్తు బాణాలకు ఆ వాయుపుత్రుడు హనుమంతుడు ఎదురుగుండా నిలుచుని బాణాలు వచ్చిపడే సమయానికి చేతులు చాచి ఆకాశానికి ఎగిరేవాడు.

ఆ ఉభయులూ అమితవేగులు, యుద్ధవిశారదులు. సమస్త ప్రాణికోటీ ఆశ్చర్యపోయేట్టు పోరాడినారు. హనుమంతుణ్ణి కొట్టడము ఎట్లాగో ఇంద్రజిత్తుకి తెలియలేదు. ఇంద్రజిత్తుని కొట్టడము ఎట్లాగో హనుమంతుడికి తెలియలేదు. ఇద్దరూ దేవతలతో సరిసమానము అయిన పరాక్రమవంతులు. ఒకరిని ఒకరు జయించలేక పోయినారు. బాణాన్ని గురిపెట్టడములోనూ, బాణాన్ని ఎక్కుపెట్టడము లోనూ, ఎక్కుపెట్టిన బాణాన్ని వదలడములోనూ ఇంద్రజిత్తు మహా గట్టివాడు. అతడు గురిపెట్టి వదలిన అమోఘము అయిన బాణాలను అన్నిటినీ హనుమంతుడు తప్పించుకొన్నాడు. తన బాణాలు అన్నీ అట్లా వ్యర్థము అయిపోయినందుకు ఇంద్రజిత్తు దుఃఖపడిపోయినాడు. వానరుణ్ణి చంపేయడము అలవికాదు అనుకొన్నాడు. వాణ్ణి పట్టుకునే ఉపాయము ఆలోచించినాడు. అంతట ఆ శస్త్రాస్త్రవిదుడు ఇంద్రజిత్తు హనుమంతుడి మీద బ్రహ్మాస్త్రాన్ని వదలినాడు.

ఆ అస్త్రతత్వవేత్త, ఆ మహాబాహువు హనుమంతుడు ఇంద్రజిత్తు వదలిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడిపోయినాడు. దేహచేష్టలు ఉడిగి పోయినవి. నేలమీద పడిపోయినాడు. తాను బ్రహ్మాస్త్రానికి కట్టుబడి పోయినట్లూ, తన దేహవ్యాపారము ఉడిగిపోయినట్లూ హనుమంతుడు తెలుసుకొన్నాడు. అది స్వాయంభువ మంత్రాలతో అభిమంత్రించిన బ్రహ్మాస్త్రము అని తెలుసుకోగానే, బ్రహ్మానుగ్రహము కోసము ఆలోచించినాడు. పూర్వము బ్రహ్మదేవుడు తనకు ఇచ్చిన వరాన్ని జ్ఞాపకము తెచ్చుకొన్నాడు. బ్రహ్మదేవుడూ, దేవేంద్రుడూ, వాయుదేవుడూ తనను ఎప్పుడూ కాపాడుతూనే ఉంటారు అనీ, తాను భయపడనక్కరలేదు అనీ, ఆ బ్రహ్మాస్త్రానికి కట్టుబడి ఉండవలసిందేను అనీ, దానిని విడిపించుకొనే శక్తి తనకు స్వయముగా లేదు అనీ అనుకొన్నాడు. అంతేకాకుండా, తనను రాక్షసులు పట్టుకొనడము తనకు లాభమేను అనీ, అందువల్ల తాను రావణాసురుడితో మాట్లాడడము సంభవిస్తుంది అనీ, శత్రువులు తనను పట్టుకోవడమే కావలెను అనీ నిశ్చయించుకొన్నాడు.

చక్కగా ఆలోచించి పనులు చేసే ఆ పరవీరహంత హనుమంతుడు అప్పుడు తనకు ఎదురుగుండా రాక్షసులు వచ్చి బెదరిస్తూ ఉంటే చేష్టలు ఉడిగిపోయినాడు. నిర్విచేష్టుడుగా ఉన్న ఆ అరిందముణ్ణి హనుమంతుణ్ణి రాక్షసులు జనపనారతోనూ, నారచీరలతోనూ పేనిన తాళ్ళతోనూ కట్టివేసినారు. అట్లా రాక్షసులు బలవంతముగా తాళ్ళతో కట్టివేస్తూ ఉంటే తనను కుతూహలముతో రావణాసురుడు చూచి తీరుతాడు అనుకొని హనుమంతుడు ఊరుకున్నాడు.

ఆ వీర్యవంతుణ్ణి హనుమంతుణ్ణి రాక్షసులు అట్లా తాళ్ళతో కట్టివేయగానే బ్రహ్మాస్త్రబంధము వదిలిపోయింది. మరి ఒక బంధము వేస్తే బ్రహ్మాస్త్రబంధము

నిలవదు. తాళ్ళతో కట్టివేయడముతో హనుమంతుడు బ్రహ్మాస్త్రబంధమునుంచి విడిపడిపోయినాడు అని ఇంద్రజిత్తు తెలుసుకొన్నాడు. విచారపడ్డాడు. ఆలోచించ సాగినాడు.

"అయ్యో! మహత్కార్యము నిరర్థకము అయిపోయింది. బ్రహ్మాస్త్ర స్వభావాన్ని ఈ రాక్షసులు ఆలోచించలేదు. బ్రహ్మాస్త్రము ప్రతిహతము అయిన తరువాత మరి ఏ అస్త్రమూ పని చేయదు. రాజు అందరినీ సంశయిస్తాడు" అని ఇంద్రజిత్తు అనుకొన్నాడు. బ్రహ్మాస్త్రము విడిపడిపోయినప్పటికిన్నీ తనను రాక్షసులు తాళ్ళతో కట్టివేసి బాధపెట్టుతూ ఈడ్చుకొనిపోతూ ఉంటే హనుమంతుడు ఊరుకున్నాడు. ఆ క్రూరరాక్షసులు హనుమంతుణ్ణి కట్టెలతో కొట్టుతూనూ, పిడికిళ్ళతో పొడుస్తూనూ రాజభవనానికి లాగుకొని పోయినారు.

తాళ్ళతో కట్టి తీసికొని వచ్చిన హనుమంతుణ్ణి ఇంద్రజిత్తు రాజభవనములో రాక్షసులకు అందరికి చూపించినాడు. పెద్ద ఏనుగునువలె తాళ్ళతో కట్టివేసి తీసుకొని వచ్చిన హనుమంతుణ్ణి చూచి రాక్షసులు అందరూ, "వీడు ఎవడు? వీణ్ణి ఎవడు పంపించినాడు? వీడు ఇక్కడికి ఎందుకు వచ్చినాడు? ఏమి పనిమీద వచ్చినాడు? వీడు ఎవడి ఆశ్రయుడు" అని ఒకరిని ఒకరు ప్రశ్నించినారు. కొందరు రాక్షసులు మహాక్రుద్ధులు అయిపోయి, "వీణ్ణి చంపివేయవలెను. వీణ్ణి దహించివేయవలెను. వీణ్ణి నమిలి మింగివేయవలెను" అన్నారు.

ఆ మహాపరాక్రమవంతుణ్ణి హనుమంతుణ్ణి రాక్షసులు వెంటనే రావణాసురుడి సభాభవనానికి లాగుకొని పోయినారు. మహారత్నాలతో అలంకరించిన ఆ సభా భవనములో రావణాసురుణ్ణీ, ఆయన పాదాల సమీపములో ఉన్న మంత్రివృద్ధులనూ హనుమంతుడు చూచినాడు. వికృతాకారులు అయిన రాక్షసులు ఈడ్చుకొని వస్తూఉన్న హనుమంతుణ్ణి ఆ మహాతేజోవంతుడు రావణాసురుడు చూచినాడు.

మిట్టమధ్యాహ్న సూర్యుడివలె తేజరిల్లుతూఉన్న ఆ కాంతిమంతుణ్ణి, ఆ మహాబలవంతుణ్ణి హనుమంతుడు చూచినాడు.

49

అంతట ఆ భయంకర పరాక్రమవంతుడు హనుమంతుడు రావణాసురుడు చేసిన పనికి (అశోకవనాన్ని పాడుచేస్తే రావణాసురుడు తన దగ్గరకు వస్తాడు అనుకొన్నందుకు, తననే రాజసభాభవనానికి రావణాసురుడు రప్పించుకొన్నందుకు) ఆశ్చర్యపడిపోయినాడు. రోషతామ్రాక్షుడు అయిపోయి రావణాసురుడి వంక చూచినాడు.

రావణాసురుడు శ్రేష్ఠము అయిన బంగారముతో చేసి, ముత్యాలు చుట్టిన కిరీటము పెట్టుకొని ఉన్నాడు. వజ్రాలు, మహార్హము అయిన మణులు పొదిగినందువల్ల

చిత్రవిచిత్ర కాంతులతో ఎంతో అందముగా ఉన్న ఆభరణాలు ధరించినాడు. కస్తూరి మొదలు అయిన సుగంధ ద్రవ్యాలతో ఘుమఘుమలాడే రక్తచందన మైపూతతోనూ, ఎర్రటి విశాలనేత్రాలతోనూ భయంకరముగానూ, దర్శనీయముగానూ ఉన్నాడు. తీక్షణము అయిన దంష్ట్రలు తళతళ లాడుతూనూ, పెదవులు వేళ్ళాడుతూనూ, పది తలలు ధగధగలాడుతూనూ ఉన్నవి. ఆ కాంతిమంతుడు, ఆ పరాక్రమవంతుడు నానావిధ సర్పాలు వ్యాపించిన శిఖరాలతో ఉన్న మందరపర్వతము వలె తేజరిల్లుతూ ఉన్నాడు. అతడు కాటుకరాశివలె నల్లగానూ, అతని వక్షఃస్థలాన ఉన్న ముక్తాహారము పూర్ణచంద్రకాంతులతోనూ విరాజిల్లుతూ కొంగలు కమ్ముకొన్న నల్లని మేఘమువలె కనిపించినాడు. చందన చర్చచేసిన భుజకీర్తులతోనూ, దండకడియాలతోనూ అలంకరించిన అతని పీనాయత బాహువులు అయిదు తలల మహాసర్పాలవలె తోచినవి. స్ఫటిక మణులతో చేసి నవరత్నాలు పొదిగి ఆస్తరణాలు పరచిన సింహాసనముమీద కూర్చుని ఉన్నాడు. చక్కగా సింగారించుకొని యువతులు సమీపములో నిలుచుని వింజామరలు వీస్తూ ఉన్నారు.

దుర్ధర్షుడూ, ప్రహస్తుడూ, మహాపార్శ్వుడూ, నికుంభుడూ అనే నలుగురు మంత్రులు ఆ రావణాసురుడి చుట్టూ కూర్చుని ఉన్నారు. ఆ నలుగురు మంత్రులు బలదర్పితులు. మంత్రతత్త్వజ్ఞులు. చుట్టూ నాలుగు సముద్రాలువున్న ఈ లోకమువలె రావణాసురుడు ఆ నల్గురి మధ్యనూ కూర్చున్నాడు. ఆ నలుగురు మంత్రులే కాకుండా, ఇంకా అనేకమంది రాక్షసమంత్రులు అక్కడ కూర్చుని వున్నారు. వారి అందరి మధ్యనూ దేవేంద్రుడివలెనూ, అమిత తేజోవంతము అయిన మేరుశిఖరము వలెనూ, ఆకాశములో ఉన్న నూతన నీలమేఘమువలెనూ కూర్చుని వున్న రావణాసురుణ్ణి హనుమంతుడు చూచినాడు.

భయంకర పరాక్రములు అయిన రాక్షసులు తనను బాధపెట్టుతూ ఉన్నప్పటికిన్నీ రావణాసురుడి వైభవానికి హనుమంతుడు ఆశ్చర్యపడిపోయినాడు. అతని తేజస్సుకు నిశ్చేష్టుడు అయిపోయినాడు. మనస్సులో ఆలోచించసాగినాడు. "ఆహా, రాక్షసరాజు రూపము! ఆహా! వీడి ధైర్యమూ, వీడిబలమూ, వీడికాంతీ ఆశ్చర్యము కలుగచేస్తున్నవి. వీడు సకలశుభలక్షణాలతోను ఉన్నాడు. ఆహా! అధర్మము ఒక్కటి లేకపోయినట్లయితే ఈ రావణాసురుడు దేవేంద్రుడితో కూడా దేవరాజ్యాన్ని అంతా ఏలకలిగేవాడు. వీడు చేసిన భయంకరమూ, క్రూరమూ, జనకంటకమూ అయిన పనులకు దేవతలూ, దానవులూ, సర్వలోకాలూ భయపడిపోయినవి. వీడికి కోపమువస్తే ఈ జగత్తును అంతా సముద్రములో ముంచివేయకలడు. వీడికి అంత శక్తి ఉంది" అని ఆ మతిమంతుడు హనుమంతుడు రావణాసురుడి ప్రభావాన్ని గురించి అనుకొన్నాడు.

50

ఆంజనేయుడు సభా మధ్యములో రావణుని చూచుట

సమస్త లోకాలనూ ఏడిపించే ఆ రావణాసురుడికి మహాకోపము వచ్చింది. గోరోజనపువన్నె నేత్రాలతో ఎట్టఎదుట తేజరిల్లుతూ ఉన్న హనుమంతుణ్ణి చూచి మనస్సులో సందేహించినాడు. ఆలోచించసాగినాడు. "పూర్వము నేను కైలాసపర్వతాన్ని కదలించినపుడు నాకు శాపము పెట్టిన ఆ నందీశ్వరుడు ఈ వానర రూపముతో ఇక్కడికి వచ్చినాడా ఏమిటి? వీడు సాక్షాత్తూ ఆ నందీశ్వరుడివలె ఉన్నాడు లేక ఆ మహాసురుడు బాణుడు ఈ రూపము ధరించి ఇక్కడికి వచ్చినాడా ఏమిటి" అనుకొన్నాడు. రోషతామ్రాక్షుడు అయిపోయినాడు. మంత్రిసత్తముడు అయిన ప్రహస్తుణ్ణి చూచి సమయానికి తగినట్టుగానూ, అర్థవంతముగానూ, "వీడు ఎక్కడనుంచి వచ్చినాడు? వీడు రావడానికి కారణము ఏమిటి? అశోకవనాన్ని ధ్వంసము చేయడములోనూ, రాక్షసాంగనలను బెదిరించడములోనూ వీడి ఉద్దేశ్యము ఏమిటి? ఈ విషయాలు అన్నీ ఈ దురాత్ముణ్ణి అడిగి తెలుసుకోవలసింది. చొరనలవికాని నా లంకాపట్టణానికి వీడు ఎట్లా వచ్చినాడు? ఎందుకు యుద్ధము చేసినాడు? వీడిని, ఈ దుర్మతిని అడిగి తెలుసుకోవలసింది" అని రావణాసురుడు చెప్పినాడు.

ప్రహస్తుడు అంతట హనుమంతుణ్ణి చూచి, "ఓ కపీ! ఊరడిల్లు, నీకు శుభము అవుతుంది. నీవు భయపడవద్దు. నిన్ను దేవేంద్రుడు పంపించినాడా లేక కుబేరుడు ఏమి అయినా పంపించినాడా? కాకపోతే యమధర్మరాజుకానీ, వరుణదేవుడుకానీ నిన్ను చారుడుగా పంపించినారా? ఎప్పుడూ విజయము కాంక్షించే మహావిష్ణువు నిన్ను దూతగా పంపించినాడా? నీవు ఎందుకు ఈ లంకాపట్టణానికి వచ్చినావు? ఎవరు పంపించినప్పటికిన్నీ మేము నిన్ను ఏమీ చేయము. నీవు భయపడకుండా జరిగింది జరిగినట్టు చెప్పు. నిన్ను విడిచిపెట్టుతాము.

"ఓ కపీ! నీవు రూపమాత్ర వానరుడవుగా ఉన్నావు. నీ తేజస్సు నీ రూపానికి అనుగుణముగా లేదు. నీ సంగతి అంతా యథార్థము చెప్పు. అబద్ధము చెప్పేట్లయితే నీ ప్రాణాలు దక్కవు. ఎందుకోసము నీవు ఈ లంకాపట్టణానికి వచ్చినావో అది అయినా చెప్పు" అని అడిగినాడు.

హనుమంతుడు రావణాసురుణ్ణి చూస్తూ, "ఓ రాక్షసరాజా! నేను దేవేంద్రుడికికానీ, యమధర్మరాజుకుకానీ, వరుణదేవుడికికానీ దూతను కాను. కుబేరుడితో నాకు స్నేహము లేదు. నన్ను మహావిష్ణువు ఇక్కడికి పంపించలేదు. నేను వానర జాతీయుణ్ణి. రాక్షసులకు రాజు అయిన నీ దర్శనము చేయవలెను

అనుకొని వచ్చినాను. నాబోటివాండ్లకు నీ దర్శనము కావడము దుర్లభము. అందువల్ల, నీ అశోకవనాన్ని ధ్వంసము చేసివేసినాను.

"బలవంతులు అయిన రాక్షసులు నాతో యుద్ధము చేయడానికి వచ్చినారు. నేను నా దేహాన్ని కాపాడుకోటానికి వాండ్లతో యుద్ధము చేసినాను. వాండ్లు చచ్చిపోయినారు. దేవాసురులు ఎవరున్నూ నన్ను ఏ అస్త్రముతోనూ, ఏ పాశముతోనూ బంధించివేయలేరు. నాకు ఈ వరము బ్రహ్మదేవుడు ఇచ్చినాడు. రాక్షసరాజు అయిన నిన్ను చూడవలెను అనే ఆశతో నేను బ్రహ్మాస్త్రానికి బద్ధుణ్ణి అయిపోయినాను. బ్రహ్మాస్త్రబంధము విడిపోయింది. కాని నన్ను రాక్షసులు బంధించి ఇక్కడికి తెచ్చినారు.

"నేను ఒక రాజకార్యముకోసము ఇప్పుడు నీ దగ్గరకు వచ్చినాను. నన్ను అమితతేజోవంతుడూ, అప్రమేయబలుడూ అయిన రామప్రభువు దూతగా పంపించినాడు.

"ఓ ప్రభూ! నేను నీకు హితము చెప్పుతాను, వినవలసింది" అన్నాడు.

51

రావణునికి హనుమంతుని హితోపదేశము

హనుమంతుడు ఆ మహాబలవంతుణ్ణి రావణాసురుణ్ణి చూచి నిర్భయముగానూ, అర్థవంతముగానూ, "ఓ రాక్షసరాజా! నేను సుగ్రీవుడు ఆజ్ఞాపించినందువల్ల ఈ లంకాపట్టణానికి వచ్చినాను. అతడు వానరరాజు. నీకు సోదరుని వంటివాడు. నీ క్షేమము విచారించమని నాతో చెప్పినాడు. అతడు నీతో చెప్పమన్న ఇహపర సౌఖ్యప్రదమూ, ధర్మార్థ సహితమూ అయిన మాట చెప్పుతాను వినవలసింది.

"అయోధ్యానగరములో దశరథమహారాజు అనే ఆయన రాజ్యపాలనము చేసినాడు. అతడు దేవేంద్రుడివంటి కాంతిమంతుడు. ప్రజలను కన్నతండ్రివలె కాపాడినాడు. ఆయన జ్యేష్ఠపుత్రుడు రాముడు. అతడే ఆయన ప్రియపుత్రుడున్నూ. ఆ రాముడు మహాసమర్థుడు. అమితతేజోవంతుడు. ఆ మహాబాహువు పిత్రాజ్ఞపరిపాలనకోసము తమ్ముడుఅయిన లక్ష్మణుణ్ణీ, తన భార్య అయిన సీతాదేవినీ వెంటపెట్టుకొని దండకారణ్యానికి వచ్చినాడు. ఆ సీతాదేవి విదేహరాజపుత్రి. ఆమె ఆ మహారణ్యములో కనపడకుండా పోయింది. ఆమెను వెతుకుకొంటూ రాముడు తన తమ్ముడు లక్ష్మణుడితోకూడా ఋశ్యమూక పర్వతానికి వచ్చినాడు. సుగ్రీవుడితో చేరినాడు. సీతాదేవిని వెతికి పెట్టుతాను అని సుగ్రీవుడు రాముడితో శపథము చేసినాడు. రాముడు సుగ్రీవుడికి వానరరాజ్యము ఇప్పిస్తాను అని ప్రతిజ్ఞ చేసినాడు.

ఆ ప్రతిజ్ఞ ప్రకారము రాముడు యుద్ధములో వాలిని చంపివేసినాడు. సుగ్రీవుణ్ణి వానరరాజును చేసినాడు.

"ఓ రాజా! నీవు ఇదివరకు ఆ వానరోత్తముణ్ణి వాలిని ఎరుగుదువు. అతణ్ణి రాముడు యుద్ధములో ఒక్కబాణముతో కొట్టివేసినాడు. సుగ్రీవుడు ప్రతిజ్ఞ తప్పనివాడు. సీతాదేవిని వెతకడానికి వానర సమూహాలను అన్నిదిక్కులకూ పంపించినాడు. ఇప్పుడు ఈ భూమి మీద అన్నిదిక్కులనూ, పాతాళలోకములోనూ, ఆకాశములోనూ లక్షలకొద్దీ, కోట్లకొద్దీ వానరులు సీతాదేవిని వెతుకుతూ ఉన్నారు. వానరులలో కొందరు నేల అంటకుండా, ఏ అడ్డూ లేకుండా అమిత వేగముతో పోయే మహాబలవంతులు ఉన్నారు. కొందరు గరుత్మంతుడి అంత వేగముతో పోయేవారు ఉన్నారు. కొందరు వాయువేగముతో పోయేవారు ఉన్నారు. నేను వాయుదేవుడి పుత్రుణ్ణి. నా పేరు హనుమంతుడు.

"ఓ రాజా! నేనున్నూ ఆ సీతాదేవి కోసమే నూరుయోజనాల సముద్రాన్ని దాటి ఇక్కడికి వచ్చినాను. సీతాదేవిని చూడడముకన్నా నాకు వేరే పని లేదు. ఈ లంకాపట్టణము అంతా తిరిగినాను. నీ కాపుదలలో ఉన్న సీతాదేవిని చూచినాను. ఓ రాక్షసరాజా! నీవు శాస్త్రాలు చదివి ధర్మస్వరూపము తెలుసుకొన్నవాడవు. దీక్షతో తపస్సు చేసినవాడవు. మహాప్రాజ్ఞుడవు. ఇట్లా పరదారలను చెరపట్టటము నీకు తగిన పని కాదు. నీవంటి బుద్ధిమంతులు ధర్మవిరుద్ధము అయిన ఇటువంటి పని ఎంతమాత్రమూ చేయరు. ఈ పని ధర్మవిరుద్ధము అయింది మాత్రమే కాదు, ఈ పాడు పనివల్ల అనేక అపాయాలు నీకు వస్తవి. అపాయాలు రావటము మాత్రమేకాదు, ఈ పని సమస్తాన్నీ సమూలముగా నాశనము చేసివేస్తుంది.

"ఓ రాజా! రాముడికి కోపము వస్తే లక్ష్మణుడికిన్నీ కోపము వస్తుంది. ఆ అన్నదమ్ములకు కోపము వచ్చి బాణాలు వదులుతూ ఉంటే వారి ఎదుట నిలువగల శక్తిమంతుడు సురాసురులలో ఎవడున్నూ లేడు. ఓ రాజా! రాముడికి అపరాధముచేసి సుఖముగా ఉండగలవాడు ఎవడూ ముల్లోకాలలోనూ లేడు. నీవు చేసింది అధర్మము. నీతో ఈ మాట చెప్పమని సుగ్రీవుడు నన్ను ఇక్కడికి పంపించినాడు. ఆలోచించు. సీతాదేవిని నీవు రాముడికి ఇచ్చివేయవలె. అట్లా చేసేట్లయితే నీవు ఇదివరకు చేసిన అధర్మము తొలగిపోతుంది. నీవు సకలైశ్వర్యాలతోనూ శుభముగా ఉండగలుగుతావు.

"ఓ రాజా! నేను సీతాదేవిని తెచ్చినాను అని నీకు ఎవరు చెప్పినారు అని అడుగుతావేమో? నేను సీతాదేవిని కళ్ళారా చూచినాను. ఆమెను వెతకడానికి బయలుదేరిన వానరులకు అందరికీ దుర్లభము అయిన సీతాదేవి దర్శనము నాకు

ఈ లంకాపట్టణములో లభించింది. ఇక మిగిలిన పని రాముడే చేసుకొంటాడు. ఆమె ఇప్పుడు శోకపరాయణగా ఉంది. ఆమె నీ స్వాధీనములో ఉంది అనుకొంటున్నావే కాని, నీ ప్రాణాలు తీయడానికి తెచ్చుకొన్న అయిదు తలల మహాసర్పము అని ఎరగకుండా ఉన్నావు. జఠరాగ్ని దీపనము ఎంత ఉన్నప్పటికిన్నీ విషము కలిపిన అన్నము తిని, జీర్ణము చేసుకొని జీవించి ఉండడము అశక్యము. అదేవిధముగా, దేవాసురులు అందరూ ఏకముఅయి స్వాధీనము చేసుకొన్నప్పటికిన్నీ సీతాదేవిని తమ దానినిగా చేసుకోవడము ఉత్తది.

"ఓ రాజా! నీవు ఎంతో కష్టపడి తపస్సు చేసినావు. అందుకు ప్రతిఫలముగా దీర్ఘాయుస్సు సంపాదించుకొన్నావు. దాన్ని నాశనము చేసుకోవడము మంచిది కాదు. నీవు గొప్ప తపస్సు చేసి దేవతలచేతకానీ, అసురులచేతకానీ చావకుండా ఉండే వరము సంపాదించుకొన్నాను అని గర్వపడుతున్నావు. ఈ గొప్ప హేతువు నుంచి ఆ వరము వ్యర్థము అయిపోతుంది. సుగ్రీవుడు దేవతలలో వాడు కాడు. అసురుడు కాడు. రాక్షసుడు కాడు. దానవుడు కాడు. గంధర్వుడు కాడు. యక్షుడు కాడు. పన్నగుడు కాడు. నీవు ఎవడెవండ్లవల్ల చావురాకుండా ఉండే వరము సంపాదించు కొన్నావో, సుగ్రీవుడు వాండ్లలో ఎవడూ కాడు. అతడు వానరమాత్రుడు. అటువంటి సుగ్రీవుడిచేత చావకుండా నీ ప్రాణాలు ఎట్లా దక్కించుకొంటావో చెప్పు.

"ఓ రాజా! ధర్మము అధర్మాన్ని హతమార్చివేసి సత్ఫలితాన్ని ఇస్తుంది. అధర్మము ధర్మాన్ని జయించలేదు. నీవు చేసిన తపస్సూ మొదలు అయిన సత్కర్మలవల్ల సంపాదించుకొన్న ధర్మఫలాన్ని నీవు ఇంతవరకూ అనుభవించినావు. ఇక త్వరలోనే నీవు అధర్మఫలము అనుభవిస్తావు. తప్పదు. జనస్థానములో రాక్షసులను అందరినీ రాముడు ఒక్కడే సంహారము చేసివేసినాడు అని జ్ఞాపకము తెచ్చుకో. అదేవిధముగా వాలిని ఒక్క బాణముతో రాముడు ఒక్కడే చంపివేసినాడు అని కూడా తెలుసుకో. రాముడూ, సుగ్రీవుడూ స్నేహితులు అయినారు అని గమనించు. నీకు మంచి ఏదో ఆలోచించుకో.

"ఓ రాజా! నీ గుర్రాలనూ, నీ ఏనుగులనూ, నీ రథాలనూ, నీ ఈ లంకా పట్టణాన్నీ నేను ఒక్కణ్ణే నాశనముచేసివేయకలను. అయితే, రాముడు అట్లా నిశ్చయించ లేదు. సీతాదేవిని అపహరించుకొని పోయిన శత్రువులను తానే సంహారము చేస్తాను అని రాముడు వానర భల్లూక సమూహాల ఎదుట ప్రతిజ్ఞ చేసినాడు. అందువల్ల, నేను ఆ పని చేయను. ఓ రాజా! సాక్షాత్తూ దేవేంద్రుడు అయినప్పటికిన్నీ రాముడికి అపరాధము చేసి సుఖముగా ఉండడము ఉత్తది. ఇక నీవంటివాడి విషయము వేరే చెప్పవలసిన పనేలేదు. నీ వశములో ఉన్న సీతాదేవి ఈ లంకారాజ్యాన్ని అంతా

నాశనము చేసివేసే కాళరాత్రి అని తెలుసుకో. సీతావిగ్రహ రూపాన ఉన్న కాలపాశాన్ని నీ అంతట నీవు నీ మెడకు తగిలించుకోవద్దు. నీకు హితము ఏదో ఆలోచించుకో. ఈ లంకాపట్టణములో ఇప్పటికే సీతాదేవి ప్రభావమువల్ల మంటలు రగులుకొంటున్నవి. ఇక రాముడి కోపానికి కోటబురుజులూ, వీధులూ మొదలు అయినవి అన్నీ సమూలముగా తగులపడి పోవడమూ నీవు చూస్తావు. నీ మిత్రులనూ, నీ మంత్రులనూ, నీ దాయాదులనూ, నీ తోబుట్టువులనూ, నీ కొడుకులనూ, నీ హితులనూ, నీ భార్యలనూ, నీ భోగభాగ్యాలనూ, ఈ లంకాపట్టణాన్నీ నాశనము చేసుకోవద్దు.

"ఓ రాక్షసరాజా! నేను రాముడి దాసుణ్ణి. అందువల్ల ఆయన ప్రభావము నాకు తెలుసు. రాయబారిగా వచ్చినాను. అందువల్ల నేను నీకు హితము చెప్పుతున్నాను. అందులో నేను వానరుణ్ణి. నేను అటు మానవుణ్ణీ కాను, ఇటు రాక్షసుణ్ణీ కాను. కాబట్టి మధ్యస్థుణ్ణి. నిష్పాక్షికముగా యధార్థము చెప్పుతున్నాను. అబద్ధము ఆడటములేదు. నా మాట విను. ఆ మహాయశుడు రాముడు పంచభూతాలతో కూడా సచరాచరము అయిన సకలలోకాలనూ సంహారము చేసివేయకలడు. తిరిగి సమస్త లోకాలనూ సృష్టించకలడు. అతడు మహావిష్ణువుతో సరిసమానము అయిన పరాక్రమవంతుడు. దేవతలలోకానీ, అసురులలోకానీ, యక్షులలోకానీ, విద్యాధరులలోకానీ, గంధర్వులలోకానీ, సిద్ధులలోకానీ, కిన్నరులలోకానీ, పతగులలోకానీ, ఎవరూ ఎక్కడనూ అతనితో పోరాడలేరు. నీవు ఆ సర్వలోకేశ్వరుడికి మహాపచారము చేసినావు. ఇక నీవు జీవించడము దుర్లభము. త్రిభువనాలలోనూ అతనితో పోరాడకలవాడు ఎవడూ లేడు. రాముడే నీమీదికి యుద్ధానికి వస్తే తనంతటతాను చతుర్ముఖాలతో పుట్టిన ఆ సర్వాతిశాయి బ్రహ్మదేవుడుకానీ, ప్రళయకాలాన సమస్తభూతాలనూ సంహారము చేసివేసే ఆ త్రినేత్రుడు ఆ త్రిపురాంతకుడు రుద్రుడు కానీ, వృత్రాసురుణ్ణి సంహారము చేసివేసిన ఆ దేవరాజుకానీ, వారు ముగ్గురూ ఏకము అయికానీ నిన్ను రక్షించలేరు" అని చెప్పినాడు.

ఇట్లా ఏవిధము అయిన భయము లేకుండా అప్రతిమానముగా, అమోఘముగా హనుమంతుడు చెప్పిన అప్రియవాక్యాలకు కోపముతో తేరిపారచూచి, "ఈ మహాకపిని వెంటనే చంపివేయవలసింది" అని రావణాసురుడు ఆజ్ఞాపించినాడు.

52

విభీషణుని ధర్మోపదేశము

ఆ హనుమంతుణ్ణి చంపివేయవలసింది అని రావణాసురుడు ఆజ్ఞాపించడము విభీషణుడు విన్నాడు. దూతను చంపివేయడము అతనికి ఇష్టము లేకపోయింది. ఆ

విభీషణుడు కార్యాకార్యజ్ఞానము కలవాడు. రావణాసురుడు క్రుద్ధుడు అయి దూతను చంపివేయమని ఆజ్ఞాపించినాడు అని తెలుసుకొన్నాడు. ఆ వాక్యవిశారదుడు విభీషణుడు పూజ్యుడు అయిన తన అన్నగారిని చూచి పరమహితముగా, "ఓ రాజా! క్షమించు. కోపము త్యజించు. ప్రసన్నుడవు కావలెను. నా మాట విను. మంచిచెడ్డలు తెలిసినవారూ, పెద్దలూ అయిన రాజులు దూతను చంపివేయరు. ఓ వీరా! ఈ కపిని చంపడము రాజధర్మ విరుద్ధము అయిన పని. లోకాచారానికి వ్యతిరిక్తమున్నూ అయిన పని. నీవంటివాడు చేయవలసిన్ల పనికాదు. ఈ సమస్తప్రాణికోటిలోను నీవు సమస్తధర్మాలూ తెలిసినవాడవు. నీవు ఉపకారము మరచిపోనివాడవు. మంచిచెడ్డలు తెలిసినవాడవు. రాజధర్మవిశారదుడవు. పరమార్థవేత్తవు. నీవంటి పండితులు కోపము వచ్చి ఇట్లా ఆజ్ఞాపించేట్లయితే, శాస్త్రపాండిత్యము అంతా వృథా శ్రమే అయిపోతుంది.

"ఓ రాజా! నీవు శత్రుసంహారకుడవు. దురాసదుడవు. నీవు ఇప్పుడు ప్రసన్నుడవు కావలెను. యుక్తాయుక్తాలు ఆలోచించి నిశ్చయించవలెను. దూతకు యోగ్యము అయిన దండనము విధించు" అని చెప్పినాడు.

విభీషణుడు చెప్పిన ఈ మాటలు విని రావణాసురుడు మహాకోపముతో, "ఓ విభీషణా! పాపిష్టివాండ్లను చంపివేస్తే పాపము రాదు. వీడు పాపాచారుడు. అందువల్ల వీణ్ణి చంపివేయవలసిందేను" అన్నాడు.

విభీషణుడు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు. రావణాసురుడికి చెడ్డ కోపము వచ్చి అధర్మమూలము అయిన ఆజ్ఞ చేసినాడు అనుకున్నాడు. అది పెద్దలు మెచ్చని ఆజ్ఞ కనుక పరమధర్మముగా, "ఓ లంకేశ్వరా! నీవు ప్రసన్నుడవు కావలెను. కోపము వదిలిపెట్టు. ధర్మార్థాలను చెడకొట్టవద్దు. నా మాట విను. రాజా! ఎటువంటి క్లిష్టసమయాలలోనూ దూతలను చంపకూడదు అని పెద్దలు చెప్పినారు. ఈ వానరుడు నిస్సందేహముగా గొప్ప శత్రువే. రాక్షసవీరులను చంపివేసినాడు. సేనానాయకులను సంహారము చేసివేసినాడు. మంత్రి పుత్రులను హతమార్చినాడు. మన అక్షకుమారుణ్ణి కూడా చంపివేసినాడు. ఇంత అంత అని నిర్ణయించనలవికాని అప్రియమే చేసినాడు. అయినప్పటికీన్నీ, దూతను చంపకూడదు అని పెద్దల అభిప్రాయము.

"పెద్దలు దూతలకు అనేకవిధ శిక్షలు చెప్పినారు. వాటిలో ఏదో ఒక విధము అయిన శిక్ష వేయవలెను కాని చంపివేయకూడదు. దూతకు అంగ వికృతి చేయవచ్చును. కొరడాతో వయ్యిలు వయ్యిలుగా కొట్టి పంపించవచ్చును. తల

గొరిగించవచ్చును. కాల్చి ముద్రవేసి పంపించవచ్చును. ఈ శిక్షలలో ఏది అయిన ఒక శిక్ష విధించవలెను. కాని దూతను చంపివేసినట్టు ఎన్నడూ మనము వినలేదు.

"ఓ రాజా! నీవు ధర్మార్థాలలో మంచి శిక్షణ పొందినవాడవు. మంచి చెడులు ఆలోచించి పనులు చేస్తూ ఉంటావు. నీవు కోపవశమువల్ల ఇటువంటి పని చేయవద్దు. మహాధైర్యవంతులు కోపాన్ని అణుచుకొంటారు. ఓ వీరుడా! ధర్మనిరూపణములో నీ అంతటివాడు మరి ఒకడు లేడు. నీ వలె లౌకికాచారాలు తెలిసినవాడు ఎవడూ లేడు. నీ అంతగా శాస్త్రాలు చదివినవాడున్నూ లేడు. నీకు ఉన్న బుద్ధి కుశలత ఎవరికీ లేదు. సురాసురులలో నీకన్నా ఉత్తముడు మరి ఒకడు లేడు. ఈ కపిని చంపినందువల్ల ఏ లాభమూ కనిపించడములేదు. ఈ వానరుణ్ణి ఇక్కడికి పంపించినవాండ్లను మనము వధించవలెను. వీడు చెడ్డవాడు అయినా, మంచివాడు అయినా వీణ్ణి శత్రువులు పంపించినారు. అందువల్ల వీడు పరాధీనుడు. వాండ్లు చెప్పమన్న మాటలు వీడు మనకు చెప్పినాడు. ఇది వీడి తప్పుకాదు. కాబట్టి వీణ్ణి చంపడము మంచిది కాదు.

"రాజా! వీణ్ణి చంపివేస్తే ఈ మహోదధిని దాటి ఇక్కడకి రాగల ఖేచరుడు మరి ఒకడు లేడు అని నాకు తెలుసును. అయినప్పటికిన్నీ చెప్పుతున్నాను. అన్నా! నీవు పరపురంజయుడవు. కాబట్టి ఈ కోతిని చంపివేసే ప్రయత్నము మానుకోవలెను. ఎదిరించి వచ్చే దేవతలనూ, దేవేంద్రుణ్ణీ చంపవచ్చును కాని దూతను చంపడము మంచిది కాదు.

"రాజా! నీవు యుద్ధప్రియుడవు. నీవు వీణ్ణి చంపివేసేట్లయితే బహుదూర దేశములో ఉన్న ఆ గర్విష్ఠులను, రామలక్ష్మణులను యుద్ధానికి పురికొల్పి ఇక్కడికి తీసుకొని రాగలిగేవాడు మరిఒకడు ఉండడు. నీకు ఉన్న పరాక్రమమూ, ఉత్సాహమూ, ధైర్యమూ సురాసురులకు ఎవరికీ లేదు. నిన్ను ఎవడూ జయించలేడు. నీవు వాండ్లను యుద్ధములో చంపివేయవలెను. నీకు శూరులూ, హితులూ, ఎంతో హెచ్చరిక కలవారూ, మహాగుణవంతుల వంశాలలో పుట్టినవారూ, అభిమానవంతులూ, ఆయుధధారులలో ఉత్తమోత్తములూ అయిన భృత్యులు కోట్లకొద్దీ ఉన్నారు. అందువల్ల నీవు ఆజ్ఞాపించేట్లయితే నీ సేనాధిపతులు ఎవరు అయినా కొంత సైన్యాన్ని తీసికొనిపోయి ఆ మూఢులను రామలక్ష్మణులను నిగ్రహిస్తారు. వారికి మనవాండ్లు తమ ప్రభావాన్ని చూపిస్తారు" అని చెప్పినాడు.

ఆ సురలోకశత్రువు, ఆ మహాబలవంతుడు, ఆ నిశాచరరాజు రావణాసురుడు తన తమ్ముడు విభీషణుడు చెప్పిన ఉత్తమవాక్యాన్ని గురించి ఆలోచించి అంగీకరించినాడు.

53

ఆ మహాబలవంతుడు రావణాసురుడు తన తమ్ముడు విభీషణుడు చెప్పిన మాటలు విన్నాడు. "విభీషణా! నీవు చక్కగా చెప్పినావు. దూతను చంపివేయడము నింద్యము అయిన పనే. అయితే వీణ్ణి మరిఒక విధముగా అవశ్యము శిక్షించవలెను. కోతులకు తోక అంటే మక్కువ. అందువల్ల వీడి తోకను కాల్చివేయవలసింది. కాలిపోయిన తోకతో వీడు ఇక్కడనుంచి వెళ్ళిపోవలెను. వీడు అంగవైకల్యముతో దుఃఖపడటము వీడి ఆప్తులూ, బంధువులూ, దాయాదులూ, స్నేహితులూ మొదలు అయినవారు అందరూ చూడవలెను. వీడి తోకకు నిప్పుముట్టించి అది కాలుతూ ఉంటే వీడిని చతుష్పథాలలోనూ, ఈ పట్టణము అంతటనూ తిప్పవలెను" అని ఆజ్ఞాపించినాడు.

అంతట రాక్షసులు అందరూ రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి చెలరేగి, చిరిగిపోయిన గుడ్డపీలికలను తీసుకొనివచ్చి హనుమంతుడి తోకకు చుట్టడము మొదలుపెట్టినారు. అట్లా రాక్షసులు తన తోకకు గుడ్డపీలికలు చుట్టుతూ ఉంటే అడవిలో ఎండుకట్టెకు అంటుకొన్న అగ్నిహోత్రమువలె హనుమంతుడు మనసా విజృంభించినాడు. గుడ్డపీలికలను చుట్టిన ఆ హనుమంతుడి తోకను నూనెతో రాక్షసులు తడిపి నిప్పు అంటించినారు. హనుమంతుడికి మహా చెడ్డకోపము వచ్చింది. ముఖము ఎర్రపడిపోయింది. భగభగ మంటలు మండుతూఉన్న తన తోకను విదిలించి ఆ రాక్షసులను అందరినీ పడతోసినాడు.

హనుమంతుడి తోకకు నిప్పు అంటించినారు అని అప్పుడు లంకలో ఉన్న రాక్షసులు అందరూ– స్త్రీలూ, పురుషులూ, బాలురూ, వృద్ధులూ తెలుసుకొని సంతోషముతో హనుమంతుణ్ణి చూడటానికి వచ్చినారు. క్రూరరాక్షసులు అందరూ చేరి ఆ పరాక్రమవంతుణ్ణి తాళ్ళతో కట్టివేసినారు. అప్పుడు హనుమంతుడు, "వీండ్లు, ఈ రాక్షసులు నన్ను కట్టివేస్తున్నారు. కాని నన్ను వీండ్లు నిగ్రహించగలరా? ఈ తాళ్ళను తెంచుకొని మళ్ళీ పైకి ఎగిరి వీండ్లను అందరిని చంపివేస్తాను. రామ కార్యార్థము తిరుగుతున్న నాకు, వీండ్లు ప్రతీకారము చేయకలరా? వీండ్లను అందరినీ నేను ఒక్కణ్ణే చంపివేయకలను. అయితే రాముడు తానే రావణాసురుణ్ణి చంపివేయవలెను అని ప్రతిజ్ఞ చేసినాడు. ఆ ప్రతిజ్ఞ సిద్ధించి అతడు సంతోషపడవలెను. కాబట్టి వీండ్లు చేస్తున్న ఈ అవమానాన్ని నేను సహించి ఊరక ఉండవలెను.

"వీండ్లు, ఈ రాక్షసులు నన్ను ఈ లంకాపట్టణము అంతటా తిప్పుతారు. మళ్లీ ఒకసారి ఈ పట్టణాన్ని అంతా చూస్తాను. నేను రాత్రిపూట ఇక్కడికి

వచ్చినాను. అందువల్ల నగరరక్షణ పద్ధతులను నేను చూడలేదు. కాబట్టి పగలు చూడటము అవసరమేను" అనుకొన్నాడు.

అంతట సంతోషముగా రాక్షసులు తన ఆకారాన్ని కురచచేసుకున్న హనుమంతుణ్ణి పట్టుకొని పట్టణము అంతటా తిప్పటానికి బయలు దేరినారు. శంఖాలు పూరిస్తూనూ, భేరులు మోగిస్తూనూ, సింహనాదాలు చేస్తూనూ, భుజాలు చరుచుకొంటూనూ ఆ అరిందముణ్ణి హనుమంతుణ్ణి రాక్షసులు వెంబడించినారు. తోక భగభగ మండుతూ ఉన్నప్పటికిన్నీ అతడు హాయిగా ఆ లంకాపట్టణ వీధులలో నడువసాగినాడు. చిత్రవిచిత్రము అయిన విమానగృహాలనూ, పయికి కనపడని పాతాళగృహాలనూ, తీర్చిదిద్దిన చత్వరాలనూ, క్రిక్కిరిసివున్న ఇండ్లనూ, శృంగాటకాలనూ, రచ్చలనూ, రాజవీధులనూ, చిన్న చిన్న సందులనూ, గొందులనూ, రహస్యద్వారాలనూ, మేఘాలతో సమానము అయిన ఉన్నతగృహాలనూ చూస్తూ పోయినాడు. చత్వరాల లోను, చతుస్తంభ మంటపాలలోను, రాజమార్గాలలోను హనుమంతుడు వేగులవాడు అని రాక్షసులు చాటించినారు. తోక మండుతూ ఉన్న ఆ హనుమంతుణ్ణి చూడవలెను అనే కుతూహలముతో ప్రతి ఇంటిలో నుంచీ స్త్రీలూ, బాలురూ, వృద్ధులూ బయటికి వచ్చినారు. ఆ హనుమంతుణ్ణి చూచినారు.

అట్లా హనుమంతుని తోకకు నిప్పు అంటించి ఆ లంకాపట్టణములో తిప్పుతూ ఉంటే రాజసాంగనలు సీతాదేవి దగ్గరకు పోయి వికృతముగా కళ్ళు తిప్పుతూ, "సీతా! నీ దగ్గరకు వచ్చి మాట్లాడి పోయిన ఆ ఎఱ్ఱటిముఖము కోతి తోకకు నిప్పు అంటించి పట్టణము అంతటా ఊరేగిస్తున్నారు" అని చెప్పినారు.

వైదేహి ఆ భయంకరము అయిన వార్తను విన్నది. ఆమెకు ప్రాణము పోయినట్టు అయిపోయింది. శోకముతో అమితముగా బాధపడ్డది. పరిశుద్ధురాలు అయి ఆ కపికోసము ప్రార్థించింది. "ఓ అగ్నిహోత్రుడా! నేను పతిసేవ చేసి ఉన్నట్లయితే, నేను చేస్తున్న తపస్సుకు ఏమి అయినా బలము ఉన్నట్లయితే, నేను పతివ్రతను అయివున్నట్లయితే హనుమంతుడి తోకను దహించివేయవద్దు.

"ఓ అగ్నిహోత్రుడా! ఆ ధీమంతుడికి రామప్రభువుకు నామీద ఏ కొంచెము అయినా దయ ఉన్నట్లయితే, నేను ఏ కొంచెము అయినా అదృష్టవంతురాలను అయి ఉన్నట్లయితే హనుమంతుడి తోకను దహించివేయవద్దు.

"ఓ అగ్నిహోత్రుడా! ఆ ధర్మాత్ముడు రాముడు నన్ను కలుసుకోవలెను అనుకొంటున్నట్టయితే సదాచారసంపన్నుడు అయిన హనుమంతుడి తోకను దహించివేయవద్దు.

"ఓ అగ్నిహోత్రుడా! అబద్ధము ఆడని సుగ్రీవుడు నన్ను ఈ దుఃఖసముద్రములో నుంచి దాటించవలసి ఉన్నట్లయితే హనుమంతుడు చల్లగా ఉండవలెను."

ఈవిధముగా సీతాదేవి అగ్నిహోత్రుణ్ణి ప్రార్థించింది.

హనుమంతుడి తోకను ఆశ్రయించిన అగ్నిహోత్రుడు ఆదివరకే జ్వాలలతో ప్రదక్షిణము చేసినాడేకాని, ఏ మాత్రము వేడినీ అతడికి కలుగనీయలేదు. హనుమంతుడి తండ్రి వాయుదేవుడు సీతాదేవి నెమ్మదిగా ఉండడానికి మంచుగాలి ఆ ప్రాంతములో వీచినాడు. అట్లా తోక కాలుతూ ఉన్నప్పటికిన్నీ ఏ మాత్రమూ వేడిలేక పోయినందువల్ల హనుమంతుడు ఆశ్చర్యముతో, "ఇదేమిటి, తోక ఇట్లా మండుతూ ఉన్నప్పటికిన్నీ నన్ను ఈ మంటలు దహించటము లేదు? కొంచెము అయినా బాధగా లేదే! మహాజ్వాలలు రేగుతూవున్నా నా తోక చివరను చల్లగా ఉందే! దీనికి కారణము ఏమి అయి ఉంటుంది? స్పష్టముగా తెలుస్తూనే ఉంది. ఇది అంతా రామ ప్రభావము. నేను సముద్రము దాటుతూ ఉండగా పర్వతము ఒకటి పైకి లేచింది. సముద్రుడూ, పర్వతరూపాన పైకిలేచిన ఆ మైనాకుడూ, రాముడికి మేలు చేయడానికి ఇప్పుడు అగ్నిహోత్రుడూ నాకు తోడుపడుతున్నారు. సీతాదేవి దయవల్లనూ, రాముడి ప్రభావమువల్లనూ, నా తండ్రి వాయుదేవుడు స్నేహితుడు అయినందువల్లనూ అగ్నిహోత్రుడు నన్ను కాపాడుతున్నాడు. నేను ఇప్పుడు హాయిగా ఉన్నాను" అనుకొంటూ, ఇక తాను అప్పుడు చేయవలసిన పనిని గురించి ఒక ముహూర్తముసేపు ఆలోచించినాడు. అంతట హనుమంతుడు సింహనాదము చేసి పయికి ఎగిరినాడు. పర్వతశిఖరము అంత ఎత్తున ఉన్న లంకాపట్టణ ద్వారము మీదికి పోయినాడు. ఆ పర్వాతాకారుడు, ఆ మహాధైర్యవంతుడు, ఆ కాంతిమంతుడు అంతట తన మహాకాయాన్ని కుంచించినాడు. కట్టివేసిన తాళ్ళు అన్నీ కుప్పకూలిపోయినట్టు కూలిపోయినవి.

అంతట ఆ కాంతిమంతుడు మళ్ళీ పర్వతాకారము ధరించి నాల్గు దిక్కులా చూచి ఆ బహిర్ద్వారానికి అమర్చి ఉన్న ఇనపగుదియను ఊడపెరికినాడు. ఆ ఇనుపగుదియతో ఆ మహాబాహువు అక్కడ కావలి ఉన్న రాక్షసులను అందరినీ కొట్టి చంపివేసినాడు. అప్పుడు ఆ రణచండవిక్రముడు మళ్ళీ లంకాపట్టణమువంక చూచినాడు.

ఆ మహావీరుడి తోక భగభగ మండుతూ ఉంది.

54, 55

లంకా దహనము

హనుమంతుడు లంకాపట్టణానికి వచ్చిన పనులు అన్నీ అయిపోయినవి. అతడు లంకాపట్టణాన్ని చూస్తూ ఉత్సాహముతో చెలరేగి ఇక తాను చేయవలసిన పనిని గురించి ఆలోచించినాడు. "ఈ రాక్షసులను కష్టాలపాలుచేసిపోవడమే నా కర్తవ్యము. ఈపని ఒకటే మిగిలి ఉంది. అశోకవనాన్ని ధ్వంసము చేసివేసినాను. రాక్షసవీరులను చంపివేసినాను. సైన్యములో కొంతభాగాన్ని సంహారము చేసివేసినాను. ఇకను ఈ పట్టణములో ఉన్న కోటను పాడుచేయవలెను. ఇది ఒక్కటే మిగిలి ఉంది. నేను కోటను తగులపెట్టేట్లయితే సముద్రము దాటి వచ్చిన నా శ్రమ అంతా సఫలము అవుతుంది. ఈపని ఇప్పుడు నేను సులభముగా చేయవచ్చును. నా ఈ తోకను ఆశ్రయించుకొని జ్వలిస్తూ ఉన్న అగ్నిహోత్రుడికి ఈ లంకాపట్టణములో ఉన్న ఉత్తమ గృహాలతో సంతర్పణ చేయడము తగిన పని" అనుకొని మండుతూ ఉన్న తోకతో మెరుపులు మెరిసే మహామేఘమువలె లంకాపట్టణ భవనాలమీదికి పోయినాడు. ఉద్యానవనాలనూ, ప్రాసాదగృహాలనూ చూసుకొంటూ, ఈ ఇంటిమీదినుంచి ఆ ఇంటిమీదికీ, అ ఇంటిమీదినుంచి ఈ ఇంటిమీదికీ ఎగురుతూ ప్రహస్తుడి ఇంటిమీదికిపోయి నిప్పు ముట్టించినాడు. అంతట మహాపార్శ్వుడి ఇంటిమీదికి ఎగిరి కాలాగ్నిహోత్రజ్వాలలవంటి అగ్నిహోత్రాన్ని వదలిపెట్టినాడు. అక్కడనుంచి వజ్రదంష్ట్రుడి ఇంటికీ, శుక్రుడి ఇంటికీ, సారణుడి ఇంటికీ ఎగిరి నిప్పు ముట్టించినాడు. ఆతరువాత ఇంద్రజిత్తు భవనానికి నిప్పు పెట్టినాడు. జంబుమాలి, సుమాలి గృహాలకు నిప్పు అంటించినాడు.

ఆ మహాపరాక్రమవంతుడు హనుమంతుడు అట్లా ఒక్కొక్క ఇంటికీ నిప్పు ముట్టిస్తూ విభీషణుడి ఇల్లుమాత్రము వదలిపెట్టినాడు. రశ్మికేతువు గృహాన్నీ, సూర్యశత్రు భవనాన్నీ, హ్రస్వకర్ణుడి ఆలయాన్నీ, దంష్ట్రుడి నిలయాన్నీ, రోమశుడి మందిరాన్నీ, యుద్ధోన్మత్తుడి సదనాన్నీ, మత్తుడి సదనాన్నీ, ధ్వజగ్రీవుడి నివేశనాన్నీ, విద్యుజ్జిహ్వుడి వేశ్మాన్నీ, హస్తిముఖుడి నికేతనాన్నీ, కరాళపిశాచుల ఆవాసాలనూ, శోణితాక్షుడి ఇంటినీ, కుంభకర్ణుడి భవనాన్నీ, మకరాక్షుడూ, యజ్ఞశత్రువూ, బ్రహ్మశత్రువూ, నరాంతకుడూ, నికుంభుడూ మొదలు అయిన వాండ్ల ఇండ్లను అన్నిటినీ తగులపెట్టినాడు. ఆ యా రాక్షసులు సంపాదించుకొన్న మణిముక్తాప్రవాళాలు అన్నీ ఆ మంటలకు మాడి మసి అయిపోయినవి.

ఆ మహాపరాక్రమవంతుడు హనుమంతుడు ఆ రాక్షసవీరుల ఇండ్లకు అన్నిటికీ నిప్పు ముట్టించి, రావణాసురుడి భవనము మీదికి పోయినాడు. సమస్త

మంగళ ద్రవ్యాలతో మేరు మందర పర్వతాల అంత ఎత్తు ఉన్న ఆ రావణాసురుడి రత్నభూషిత భవనానికి తన తోకకు ఉన్న నిప్పు అన్నివైపులా ముట్టించి ప్రళయకాల మేఘమువలె సింహనాదము చేసినాడు. అప్పుడు వాయుదేవుడూ, అగ్నిహోత్రుడూ ఏకము అయి చెలరేగినందువల్ల ప్రళయకాలములోవలె అగ్నిహోత్రుడు జ్వలించినాడు. అట్లా జ్వాలలతో విజృంభించిన అగ్నిహోత్రుణ్ణి వాయుదేవుడు ఆ యా ఇండ్లమీదికి తీసుకొనిపోయినాడు. అట్లా వాయువు అగ్నిహోత్రుడికి తోడ్పడడము నుంచి లంకాపట్టణము అంతా అచిరకాలములో అంటుకొని భగభగ మండడము మొదలు పెట్టింది. బంగారు కిటికీలతోనూ, ముత్యాలూ రత్నాలూ మొదలు అయిన అలంకారాలతోనూ ఉన్న పెద్ద పెద్ద భవనాలు తగులపడి నేలకూలినవి. అట్లా నిప్పు అంటుకొన్న ఆ విమాన గృహాలు, పుణ్యాంతాన సిద్ధుల విమానాలు ఆకాశమునుంచి నేలకూలినట్టు పడిపోయినవి. రాక్షసులు అందరూ తమ తమ గృహాలు కాపాడుకోలేక భగ్నోత్సాహులు అయిపోయినారు. ఆర్జించిన సంపదలను పోగొట్టుకొని పరమదీనులు అయి, "ఆహా! వీడు సాక్షాత్తూ అగ్నిహోత్రుడు. వానర రూపముతో ఇక్కడికి వచ్చినాడు" అని కేకలు వేస్తూ దిక్కులు తెలియకుండా పరుగులెత్తినారు.

పసిబిడ్డలకు పాలిస్తున్న ఆడవాండ్లు చుట్టూ అగ్నిహోత్రజ్వాలలు కమ్ముకొన్నందువల్ల భయభ్రాంతలు అయి ఏడుస్తూ తలముడులు వీడిపోయి మేడలమీది నుంచి తటాలున కిందికి దూకినారు. అట్లా ఆకాశము అంత ఎత్తునుంచి దూకుతూఉన్న ఆ స్త్రీలు మేఘాలలో మెరుపులవలె మెరిసినారు. వజ్రాలతోనూ, ప్రవాళాలతోనూ, వైడూర్యాలతోనూ, ముత్యాలతోనూ, ఇంకా ఇతర మణులతోనూ, బంగారముతోనూ తాపటము చేసిన భవనాలనుంచి ఆ యా ధాతువులు కరిగి కారిపోవడము హనుమంతుడు చూచినాడు. ఎన్ని ఎండుకట్టెలు ఉన్నప్పటికిన్నీ, ఎంత ఎండుగడ్డి ఉన్నప్పటికిన్నీ అగ్నిహోత్రుడు తృప్తి పడనట్లు, హనుమంతుడు ఆ లంకాపట్టణములో ఎన్ని ఇండ్లు అంటుకొని తగులపడిపోతున్నా తృప్తిపడలేదు. అదేవిధముగా రాక్షసుల పీనుగులు ఎన్ని తనమీద పడుతున్నా భూమి తృప్తిపడలేదు. అప్పుడు ఆ అగ్నిహోత్రశిఖలు ఒకానొకచోట మోదుగుపూలవలెనూ, ఒకానొకచోట బూరుగుపూలవలెనూ, ఒకానొకచోట కుంకుమపూలవలెను తేజరిల్లినవి. అప్పుడు ఆ వేగవంతుడు హనుమంతుడు త్రిపురాలను దహించివేసిన రుద్రుడివలె తేజరిల్లినాడు.

అమితవేగముతో ఆ హనుమంతుడు త్రికూటాచల శిఖరము మీద వదిలిన ఆ అగ్నిహోత్రము లంకాపట్టణము చుట్టూ వ్యాపించి పరమ భయంకరముగా జ్వలించింది. పొగలూ, మంటలూ ఆకాశాన్ని అంటుకొన్నవి. రాక్షసుల దేహాలలో కొవ్వు అగ్నిహోత్రుడికి ఆజ్యధారలు అయినది. అందువల్ల అగ్నిహోత్రుడు అమితముగా

రేగినాడు. అప్పుడు ఆ అగ్నిహోత్రుడు కోటిసూర్యుల కాంతితో తేజరిల్లుతూ, పిడుగుల చప్పుళ్లుచేస్తూ, బ్రహ్మాండాన్ని అంతా పగులకొట్టుతూ ఉన్నట్లు ఆ లంకాపట్టణాన్ని దహించివేయ సాగినాడు. తీక్షణకాంతులతో మోదుగుపూలవంటి మంటలు ఆకాశము వరకూ వ్యాపించినవి. ఆ మంటలతో పాటు పొగలు ఆకాశము వరకూ వ్యాపించడమువల్ల అక్కడి మేఘఖండాలు నల్లకలువలవలె కనిపించినవి.

"వీడు వజ్రపాణి అయిన దేవేంద్రుడో, సాక్షాత్తూ యమధర్మరాజో లేక రుద్రుడో, ప్రళయకాల సూర్యుడో తెలియటములేదు. వీడు వానరుడు మాత్రము కాదు. సాక్షాత్తూ యముడు. సకలలోకాలకూ పితామహుడూ, సర్వసృష్టికర్తా అయిన ఆ చతుర్ముఖ బ్రహ్మదేవుడి ప్రబలకోపము ఈవిధముగా వానరరూపాన రాక్షససంహారము కోసము వచ్చింది ఏమో! అనంతమూ, అవ్యక్తమూ, అచింత్యమూ, ఏకమూ అయిన వైష్ణవతేజము రాక్షసులను నాశనము చేయడానికి ఇప్పుడు తన మాయతో కపిరూపాన వచ్చిందిఏమో" అని రాక్షసులు ఆశ్చర్యపోయి చెప్పుకొంటూ ఉండగా, రాక్షససమూహాలతోనూ, గుర్రాలతోనూ, రథాలతోనూ, ఏనుగులతోనూ, పక్షిసంఘాలతోనూ, మృగాలతోనూ, వృక్షాలతోనూ ఆ లంకా పట్టణము గబగబా తగులబడిపోయింది. అది చూచి ఏమిచేయడానికీ తోచక రాక్షసులు దీనులు అయిపోయి వివిధ వికారధ్వనులతో ఏడ్చినారు.

"అయ్యో తండ్రీ! అయ్యో కొడుకా! అయ్యో కాంతుడా! అయ్యో స్నేహితుడా! సమస్తభోగాలూ అనుభవిస్తూ ప్రాణము పోతున్నదే" అంటూ రాక్షసులు భయంకరముగా కేకలు పెట్టుతూ ఏడ్చినారు. హనుమంతుడి కోపానికి లంకాపట్టణము అంతా అగ్గి అంటుకొని వీరులు అందరూ చచ్చిపోయినారు. యోధులు అందరూ నాశనము అయిపోయినారు. శాపము పెట్టినట్లుగా పట్టణము అంతా నాశనము అయిపోయింది. ఆ మహాధైర్యశాలి హనుమంతుడు అప్పుడు రుద్రుడి కోపానికి ప్రళయకాలాన కీలాభీలముగా దహించుకొనిపోయే భూమండలము మాదిరిగా ఉన్న లంకాపట్టణాన్నీ, భయభ్రాంతులై తిరుగుతూఉన్న రాక్షసులనూ చూచినాడు. అట్లా ఆ అశోక వనాన్ని ధ్వంసముచేసి, పోరాటములో గొప్ప గొప్ప రాక్షసులను చంపివేసి, ఉత్తమోత్తమ గృహాలకు అన్నిటికీ నిప్పు ముట్టించి త్రికూటపర్వత శిఖరాగ్రాన నిలుచున్నాడు. తోకను మంటలు జ్వలిస్తూఉంటే కిరణాలతో తేజరిల్లే సూర్యుడివలె కనిపించినాడు.

సర్వభూతకోటీ అప్పుడు ఆ వానరశ్రేష్ఠుణ్ణి హనుమంతుణ్ణి చూచి ప్రళయకాలాగ్నిహోత్రుడు అనుకొని భయపడిపోయినది.

హనుమంతుడు అప్పుడు రాముణ్ణి ధ్యానించినాడు.

ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఆ లంకాపట్టణాన్ని అంతా అట్లా దహించివేసి సముద్రము దగ్గరకు పోయి తోకను ఉన్న అగ్నిహోత్రాన్ని చల్లార్చుకొన్నాడు.

అప్పుడు ఆ మహాబలవంతుడికి మనస్సులో మహాభయము వేసింది. తనను తానే నిందించుకొంటూ, "నేను ఈ లంకాపట్టణాన్ని ఎందుకు దహించి వేసినాను? చాలా చెడ్డపని చేసినాను. కోపము రేగినప్పుడు నిప్పును నీళ్ళతోవలె కోపాన్ని తన బుద్ధిబలముతో చల్లార్చుకోవలెను. అట్లా కోపాన్ని అణుచుకొనేవారే ధన్యులు. సామాన్యుడికి కోపమువస్తే పాపకార్యాలు చేయకుండా ఉండలేడు. గురువులను అయినా చంపివేస్తాడు. పరుషవాక్యాలతో సత్పురుషులను తిరస్కరిస్తాడు. 'ఇది చెప్పవచ్చును, ఇది చెప్పకూడదు' అనే జ్ఞానము ఉండదు. పాము ఎంతో ఓర్పుతో కుబుసాన్ని వదులుతుంది. అదేవిధముగా ఓర్పుతో కోపాన్ని వదలిపెట్టవలెను. అట్లా చేయగలవాడే మగవాడు.

"అయ్యో! నేను సీతాదేవి ఉంది అని ఆలోచించకుండా లంకా పట్టణానికి నిప్పు పెట్టినాను. నేను స్వామిద్రోహిని అయినాను. నేను దుర్బుద్ధిని. సిగ్గుమాలిన పని చేసినాను. ఛీ, ఛీ! నేను పాపిష్ఠివాణ్ణి. లంకాపట్టణము అంతా తగులపడిపోయింది. సీతాదేవికూడా కాలిపోయి ఉన్నట్లయితే నేను నా అజ్ఞానమువల్ల స్వామికార్యము చెడకొట్టినవాణ్ణి అవుతాను. దేనికోసము ఇంత ప్రయత్నము జరిగిందో అది అంతా నేను చెరిచినవాణ్ణి అవుతాను. ఈ లంకాపట్టణాన్ని తగులపెట్టేటప్పుడు సీతాదేవిని కాపాడవలెను అని నాకు తోచలేదు. అయ్యో! నేను క్రుద్ధుణ్ణి అయిపోయి మొత్తము అంతా పాడుచేసినాను. ఇప్పుడు ఈ లంకాపట్టణములో దగ్ధముకాని ప్రదేశము ఒక్కటిన్నీ కనపడటము లేదు. పట్టణము అంతా భస్మము అయిపోయింది. సీతాదేవి కూడా నాశనము అయిపోయింది ఏమో! అట్లా జరిగి ఉన్నట్లయితే నేను ఇప్పుడు ఇక్కడనే ప్రాణాలు వదిలిపెట్టడము మంచిది.

"నేను ఇట్లా పనిని అంతా పాడుచేసినాను. ఇప్పుడు నేను అగ్నిహోత్రములో దూకడమా, సముద్రములో పడి జలజంతువులకు ఆహారము అయిపోవడమా? నేను బ్రతికి ఉండి సుగ్రీవుణ్ణి చూడడము ఎట్లాగు? 'కోపము వచ్చి కోతి స్వభావమునుంచి లంకాపట్టణాన్ని అంతా దహించివేసినాడు' అని ముల్లోకాలలోనూ నేను ప్రసిద్ధికెక్కుతాను. నేను వానరుడను. చపలుణ్ణి. కాపాడే సామర్థ్యము నాకు ఉన్నప్పటికిన్నీ నేను సీతాదేవిని కాపాడలేదు.

"రాజస స్వభావానికి ఒక వ్యవస్థ అంటూ ఉండదు. అటువంటి రాజస స్వభావము నాలో చెలరేగింది. నేను దురదృష్టవంతుణ్ణి. కోపముతో నాకు ఒళ్ళు తెలియ కుండా పోయింది. నావల్ల ఈ లోకము అంతా నాశనము అయిపోతుంది కాబోలు!

"ఇదివరకు నాకు శుభనిమిత్తాలు ప్రత్యక్షముగా కనిపించినవే! వాటి గతి ఏమిటి? అవి జరుగవలెనే! ఆ శుభనిమిత్తాలు తప్పకుండా జరుగుతవి. సీతాదేవి మంగళరూపిణి. ఎంతమాత్రమూ ఆమె కాలిపోయి ఉండదు. ఆమెను ఆమె తేజస్సే కాపాడి ఉంటుంది. ఆమె అగ్ని హోత్రము. అగ్నిహోత్రము ఎట్లా దహిస్తుంది? ఆమె ఆ ధర్మాత్ముడు రామప్రభువు భార్య. ఆమె తన పాతివ్రత్య మహిమవల్ల జీవించి ఉంటుంది. అగ్నిహోత్రుడు ఆమెను స్పృశించలేడు.

"అగ్నిహోత్రుడు నన్నే దహించి వేయలేదు. నాకు వేడి అయినా వేయలేదు. అది రాముడి ప్రభావమో, సీతాదేవి పుణ్యమహిమో అనుకొన్నాను. రామప్రభువు మనఃకాంతను సీతాదేవిని అగ్నిహోత్రుడు ఎందుకు దహించి వేస్తాడు? ఆమె కాలిపోయి ఉండదు. అగ్నిహోత్రుడు నా తోకకు అయినా వేడి కలుగచేయలేదు. ఆ పూజ్యురాలిని కాపాడి ఉంటాడు. ఆ సీతాదేవే తన తపఃప్రభావముతో, తన సత్యబలముతో, తన పాతివ్రత్యమహిమతో అగ్నిహోత్రుణ్ణి అయినా దహించివేస్తుంది. ఆమెను అగ్నిహోత్రుడు దహించివేయడము ఏమిటి'' అని అనుకొంటూ ఉండగా ఆకాశమార్గములో మాటలు వినిపించినవి.

"ఆహా! ఎంత ఆశ్చర్యము! రాక్షసుల భవనాలమీద హనుమంతుడు భయంకరము అయిన అగ్నిహోత్రాన్ని వదిలినాడు. ఎవరూ చేయలేనిపని చేసినాడు. భవనాలు అన్నీ తగులపడిపోతూ ఉంటే రాక్షసులూ, స్త్రీలూ, పురుషులూ, బాలలూ, వృద్ధులూ భయపడి కోలాహలధ్వనులతోనూ, ఆక్రందనధ్వనులతోనూ పరుగులెత్తు తున్నారు. రావణాసురుడి కోటబురుజులూ, ప్రాకారాలూ, బహిర్ద్వారాలూ దగ్ధము అయిపోతున్నవి. అశోకవనములో సీతాదేవి మాత్రము చెక్కుచెదరకుండా హాయిగా ఉంది. ఇది పరమాశ్చర్యము. ఇదివరకు ఎన్నడూ ఇటువంటి ఆశ్చర్యము ఈ జగత్తులో జరుగలేదు'' అని చారణులు చెప్పుకొంటున్న అమృతవాక్కులను హనుమంతుడు ఆలకించినాడు. సంతోషపడ్డాడు.

సీతాదేవిని మళ్ళీ ప్రత్యక్షముగా చూచి, ఆమె సెలవుపొంది హనుమంతుడు తిరుగు ప్రయాణము చేయవలెను అనుకొన్నాడు.

56

హనుమ లంక నుండి బయలుదేరుట

హనుమంతుడు అంతట సీతాదేవి దగ్గరకు బయలుదేరినాడు. శింశుపా వృక్షము మొదట్లో కూర్చుని ఉన్న ఆమెకు నమస్కారము చేసి, "ఓ పూజ్యురాలా! నీవు సౌభాగ్యవశమువల్ల క్షేమముగా ఉన్నావు. నేను నిన్ను ఇప్పుడు చూచి ప్రయాణము

అయిపోవడానికి వచ్చినాను" అని చెప్పి హనుమంతుడు ప్రయాణ సన్నద్ధుడు అయినాడు.

సీతాదేవి అట్లా ప్రయాణము అయిపోతూ ఉన్న హనుమంతుడి వంక పదేపదే చూచి పెనిమిటిమీది ప్రేమాతిశయముతో, "ఓ హనుమంతుడా! నీవు పరవీరహంతవు. నీవు ఒక్కడివే ఈ రాక్షసులను అందరినీ జయించి నన్ను రామప్రభువు దగ్గరకు తీసుకొనిపోగలవు. నీ బలము ప్రశంసనీయము అయింది. అయితే ఆ శత్రుసంహారకుడు రామప్రభువు ఇక్కడికి వచ్చి ఈ లంకాపట్టణాన్ని తన బాణపరంపరలతో ముంచివేసి నన్ను తీసికొనిపోవలెను. అట్లా చేయడము ఆయన పరాక్రమానికి తగినట్టుగా ఉంటుంది. అందువల్ల ఆ ఆహవశూరుడు, ఆ మహాత్ముడు ఆయనకు అనురూపము అయిన పరాక్రమముతో ఇక్కడికి వచ్చి నన్ను తీసుకొని పోయేట్టు నీవు చేయవలెను" అని చెప్పింది.

ఇట్లా వినయపూర్వకముగానూ, యుక్తియుక్తముగానూ, అర్థవంతముగానూ సీతాదేవి చెప్పిన మాటలు విని, "ఓ దేవీ! రామప్రభువు వానర సమూహాలనూ, భల్లూక సమూహాలనూ వెంటపెట్టుకొని త్వరలోనే ఇక్కడికి వస్తాడు. శత్రువులను అందరినీ సంహారము చేసివేస్తాడు. నీ దుఃఖాన్ని పోకొట్టుతాడు" అంటూ ఆ మారుతాత్మజుడు హనుమంతుడు ఆమెను ఊరడించి, ప్రయాణము అయి పోబోతూ ఆమెకు నమస్కారము చేసినాడు. అంతట ఆ అరిందముడు స్వామి దర్శనోత్సుకతతో అరిష్టము అనే పర్వతము దగ్గరకు పోయినాడు.

ఆ పర్వతము నల్లటి వనపంక్తులతో, ఎత్తు అయిన పద్మక వృక్షాలతోనూ, ఒక వస్త్రము కట్టుకొన్నట్లుగానూ, దాని శిఖరాల నడుమను వేళ్ళాడుతూఉన్న మేఘాలతో ఉత్తరీయము కప్పుకొన్నట్లుగానూ కనిపించింది. ప్రేమాతిశయమువల్ల సూర్యుడు శుభకరము అయిన కిరణాలు అనే చేతులతో మేలుకొలుపుతూ ఉంటే ఆ పర్వతముమీది ధాతువులు కళ్ళు తెరుస్తూనూ, మూస్తూనూ ఉన్నట్టు కనిపించినవి. ఆ పర్వతముమీది జలప్రవాహాల గంభీరధ్వనులు వేదాధ్యయనము చేస్తూ ఉన్నట్టుగానూ, అక్కడి సెలయేళ్ళ వివిధధ్వనులు తాళమృదంగాదులతో సంగీతము ఆలపిస్తున్నట్టుగానూ వినిపించినవి. ఎంతో ఎత్తు ఎదిగిన దేవదారువృక్షాలతో ఆ పర్వతము చేతులు పైకి ఎత్తి తపస్సు చేస్తూఉన్న మహర్షి మాదిరిగా కనిపించింది. ఆ పర్వతముమీదినుంచి అన్ని వైపులా పడుతూ ఉన్న జలపాతాల ఘోషము రొదలు పెట్టుతూ ఉన్నట్టు వినిపించినది. కదులుతూఉన్న నల్లని శరత్కాల వనాలతో ఆ పర్వతము వృద్ధాప్యము వచ్చినవాడు వణుకుతూ ఉన్నట్టుగా తోచింది. గాలి తాకిడికి ఆ పర్వతముమీద ధ్వనిచేస్తూఉన్న వెదుళ్ళు పిల్లనగ్రోవులు ఊదుతూ ఉన్నట్టుగా

వినిపించినవి. భయంకరము అయిన విషసర్పాలతో ఆ పర్వతము కోపమువచ్చి బుసలు విడుస్తున్నట్లుగానూ, మంచు కమ్ముకొన్న గంభీరము అయిన గుహలతో ఆ పర్వతము ధ్యానము చేస్తూ ఉన్నట్లుగానూ, కదులుతూఉన్న మేఘాలు కమ్ముకొని చిన్న చిన్న కొండలతో ఆ పర్వతము నడుస్తూ ఉన్నట్టుగానూ, మేఘపంక్తులు దాటిన శిఖరాలతో ఆ పర్వతము ఆవలిస్తూ ఉన్నట్టుగానూ, ఇంకా ఎన్నో గుహలతో, ఎన్నో శిఖరాలతో ఆ పర్వతము శోభాయమానముగా కనిపించింది. పూలుపూసిన మద్దిచెట్లతోనూ, తాటిచెట్లతోనూ, ఇనుమద్ది చెట్లతోనూ ఎంతో విరివిగా అల్లుకొన్న వివిధ లతలతోనూ నానావిధ మృగాలతోనూ, వివిధ ధాతువులతోనూ, ఎన్నో సెలయేళ్ళతోనూ, పెద్ద పెద్ద రాతిబండలతోనూ ఆ పర్వతము నేత్రపర్వముగా భాసించింది. ఆ పర్వతముమీద మహర్షులూ, యక్షులూ, గంధర్వులూ, కిన్నరులూ, ఉరగులూ నివసిస్తూ ఉన్నారు. అక్కడ గుహలలో సింహాలు నివసిస్తూ ఉన్నవి. పెద్దపులులు ఉన్నవి. రుచ్యము అయిన కందమూలాలూ, పండ్లూ అక్కడ దొరుకుతవి. వెంటనే రాముణ్ణి చూడవలెను అనే ఉత్సాహముతో హనుమంతుడు ఆ పర్వతము మీదికి పోయినాడు.

ఆ హనుమంతుడి పాదాల తొక్కిడికి అందము అయిన ఆ కొండ నెత్తాలలో శిలలు మహాధ్వనులతో పిండి పిండి అయిపోయినవి. అక్కడ నుంచి ఎగిరి హనుమంతుడు ఆ సముద్రాన్ని అవతలి గట్టుకు పోవలెను అనుకొన్నాడు. అందుకోసము దేహాన్ని పెంచినాడు. మీనాలతోనూ, మహోరగాలతోనూ భయంకరముగా ఉన్న ఆ సముద్రాన్ని చూచినాడు. తన తండ్రి వాయుదేవుడివలె దక్షిణమునుంచి ఉత్తరదిక్కుకు పోవడానికి అంతట హనుమంతుడు ఆకాశానికి ఎగిరినాడు.

అట్లా ఎగురుతూఉన్న హనుమంతుడి ఊపుకు ఆ పర్వతము సమస్త ప్రాణులతోనూ కంపించిపోయింది. దాని శిఖరాలూ, ఆ శిఖరాలమీద ఉన్న మహోన్నత వృక్షాలూ మహాధ్వనులతో విరిగి నేలమీద పడిపోయినవి. ఆ హనుమంతుడి ఊరువుల వేగానికి వజ్రాయుధము దెబ్బతిన్నట్టు విరగపూసిన పూలతో చెట్లు అన్నీ నేలకూలినవి. ఆ కొండగుహలలో ఉంటూవున్న మహాబలవంతము అయిన సింహాలు అప్పుడు ఆకాశాన్ని భేదించేట్టుగా గర్జించినవి. అక్కడ విహరిస్తూ ఉన్న విద్యాధరాంగనలు భయపడి తటాలున ఆకాశానికి ఎగరడములో వారి చీరలు జారిపోయినవి. వారి ఆభరణాలు చెల్లాచెదరు అయిపోయినవి. అతి ప్రమాణముతో మహాబలవంతము అయిన మహాసర్పాలు తలలూ, మెడలూ నలిగిపోయి మంటలు మండుతూఉన్న నాలుకలతో బయటికి వచ్చినవి. కిన్నరోరగ గంధర్వ యక్ష

విద్యాధరులు అందరూ బాధపడుతూ ఆ పర్వతాన్ని వదిలిపెట్టి ఆకాశానికి ఎగిరిపోయినారు. మహోన్నత వృక్షాలతోనూ, శిఖరాలతోనూ ముప్పయి యోజనాల ఎత్తునా, పదియోజనాల వెడల్పునా శ్రీమంతముగా ఉన్న ఆ పర్వతము నేలమట్టము అయిపోయినది.

తీరాన అలలు లేస్తూ ఉన్న ఆ సముద్రాన్ని దాటడానికి హనుమంతుడు ఆకాశమార్గాన్ని పట్టినాడు.

57

చంద్రుడు తెల్లకలువగానూ, సూర్యుడు నీరుకోడిగానూ, పుష్యశ్రవణ నక్షత్రాలు కలహంసలుగానూ, మేఘాలు తీరాన వున్న నాచుగానూ, పచ్చిక బయళ్ళుగానూ, పునర్వసు నక్షత్రము తిమింగిలముగానూ, అంగారకగ్రహము మహాగ్రాహముగానూ, ఐరావతము మహాద్వీపముగానూ, స్వాతీనక్షత్రము హంసగానూ, చంద్రకిరణాలు అలలుగానూ, చల్లని నీళ్లుగానూ, యక్షులూ గంధర్వులూ భుజగులూ వికసించిన తామరపూలుగానూ కలువలుగానూ ఉన్న అంతులేని ఆకాశము అనే సముద్రములో హనుమంతుడు ఏమాత్రమూ అలసట లేకుండా వాయు వేగముతో మహానౌకవలె పోసాగినాడు.

ఆ హనుమంతుడు ఆకాశాన్ని మింగివేస్తున్నట్టుగానూ, చంద్రుణ్ణి ఒరుసుకొని పోతున్నట్టుగానూ, నక్షత్రాలతోనూ సూర్యమండలముతోనూ ఉన్న ఆకాశాన్ని అంతా ఈడ్చుకొని పోతున్నట్టుగానూ, మేఘసమూహాన్ని లాక్కొని పోతున్నట్టుగానూ ఆకాశములో పోయినాడు. ఆ మారుతాత్మజుడి కాంతినుంచి మహామేఘాలు తెల్లవిగానూ, ఎర్రవిగానూ, నల్లవిగానూ, పసుపుపచ్చవిగానూ, ఆకుపచ్చవిగానూ, నలుపూ ఎరుపూ కలిసినవిగానూ కనిపించినవి. మాటిమాటికీ మేఘాలలోకి పోతూనూ మళ్ళీమళ్ళీ బయటికివస్తూనూ, మేఘాలు కప్పుకొనిపోతూనూ, ఆ మేఘాలలోనుంచి విడివడుతూనూ చంద్రుడి మాదిరిగా హనుమంతుడు అగుపించినాడు. అట్లా మేఘసమూహాలను దారిచేసుకొని పోతూ, మేఘ గర్జనమువంటి సింహనాదము చేస్తూ గరుత్మంతుడివలె హనుమంతుడు భాసించినాడు.

ఆ మహాతేజోవంతుడు హనుమంతుడు లంకాపట్టణాన్ని అంతా అల్లకల్లోలముచేసి, భస్మముచేసి, రాక్షసవీరులను చంపివేసి, రావణాసురుణ్ణి దుఃఖపెట్టి భయంకరము అయిన సైన్యాన్ని నాశనముచేసి, వైదేహికి నమస్కారముచేసి ఆమె ఆశీర్వాదముతో మళ్లీ ఆ సముద్రాన్ని దాటుతూ మైనాకపర్వతాన్ని తాకినాడు. అంతట ఆ పరమపరాక్రమవంతుడు అల్లెత్రాటినుంచి వెలువడ్డ బాణమువలె

మహావేగముతో పోతూ మహామేఘమువంటి మహేంద్రపర్వతాన్ని చూచి సంతోషముతో ఉప్పొంగిపోయి సింహనాదము చేసినాడు. మేఘగర్జనమువంటి ఆ సింహనాదానికి దిక్కులు అన్నీ పిక్కటిల్లిపోయినవి. ఆ వానరశార్దూలము అంగదాది వానరులు అందరూ ఉన్న ప్రదేశ సమీపానికి చేరి, సుహృద్దర్శనోత్సుకతతో తోకను ఝాడిస్తూ మళ్లీ సింహనాదము చేసినాడు. గరుత్మంతుడు సంచారముచేసే ఆకాశమార్గములో హనుమంతుడు చేసిన ఆ సింహనాదానికి సూర్యమండలముతో కూడ ఆకాశము బద్దలు అయిపోతూ ఉందా అన్నట్టుగా వినిపించింది.

అప్పుడు ఆ సముద్రము ఉత్తర తీరానవున్న ఆ మహాబలవంతులు, ఆ మహాశూరులు, హనుమంతుడు ఎప్పుడు ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తూవున్న ఆ వానరులు, మహామేఘగర్జాధ్వనివంటి హనుమంతుడి సింహనాదాన్నీ, అతని ఊరువుల వేగానికి అయిన మహాధ్వనినీ విన్నారు. వాళ్లు అందరూ ఏమి వినవలసి వస్తుందోనని అంతవరకూ దీనమనస్కులుగా ఉన్నారు. అప్పుడు ఆ హనుమంతుడి సింహనాదాన్ని విని ఉత్సాహభరితులు అయినారు. జాంబవంతుడు అప్పుడు పరమ సంతోషముతో వానరులను అందరినీ చూచి, "ఓ వానరపుంగవులారా! హనుమంతుడు అన్ని విధాలా కృతకృత్యుడై వస్తున్నాడు, సందేహము లేదు. కృతకృత్యుడు కాకపోయినట్లయితే అతని కంఠధ్వని ఇంత గంభీరముగా ఉండదు" అన్నాడు.

హనుమ అంగదాదులను కలుసుకొనుట

ఆ వానరులు అందరూ హనుమంతుడి బాహువుల వేగానికీ, ఊరువుల వేగానికీ అయిన ధ్వనినీ, అతని సింహనాదాన్నీ విని సంతోషముతో ఎగిరి గంతులు వేసినారు. ఆ వస్తూ ఉన్న హనుమంతుణ్ణి చూడడానికి అప్పుడు కొంతమంది చెట్లమీదికి ఎక్కినారు. కొంతమంది పర్వత శిఖరాలమీదికి పోయినారు. దూర దేశమునుంచి వస్తూవున్నవారిని చూచి మిత్రులు వస్త్రాలు ఆడించేట్టుగా ఆ వానరులు అందరూ సంతోషాతిశయముతో ఆ యా చెట్ల చిటారుకొమ్మలమీద కూర్చుని చిన్న చిన్న కొమ్మలను ఆడించినారు. అప్పుడు ఆ బలవంతుడు హనుమంతుడు వాయువు పర్వతగుహలలో చొరబడి గర్జించేట్టుగా గర్జించినాడు. మేఘసమూహమువలె వచ్చి పడుతూవున్న హనుమంతుణ్ణి ఆ వానరులు అందరూ చూచి చేతులు జోడించి నిలుచున్నారు. పర్వతాకారాన వున్న ఆ వేగవంతుడు హనుమంతుడు చెట్లు దట్టముగా ఉన్న ఆ మహేంద్ర పర్వతముమీద దిగినాడు. సంతోషాతిశయముతో మనోహరము అయిన సెలయేటి గట్టున రెక్కలు నరికివేసిన పర్వతమువలె ఆకాశమునుంచి దిగినాడు. వానరపుంగవులు అందరూ మహదానందముతో ఆ

మహాపరాక్రమవంతుడి చుట్టూ అప్పుడు మూగినారు. అట్లా వచ్చిన ఆ వానరోత్తముడికి ఆ వానరులు అందరూ అత్యంత సంతోషముతో పండ్లూ, కందమూలాలూ కానుకలుగా సమర్పించినారు. అప్పుడు ఆ హనుమంతుడు గురువులకూ, వృద్ధులకూ, జాంబవంతుడూ మొదలు అయిన వీరులకూ, యువరాజు అయిన అంగదుడికీ నమస్కారము చేసినాడు. అట్లా తనను గౌరవించి సంతోషపెట్టిన అంగదుణ్ణీ, జాంబవంతుణ్ణీ, తక్కిన వీరులనూ చూచి ఆ పరమపరాక్రమవంతుడు, ఆ పూజ్యుడు హనుమంతుడు, "చూచినాను సీతాదేవిని" అని ఒక్క మాటలో చెప్పివేసినాడు.

అంతట వాలిపుత్రుణ్ణి అంగదుణ్ణి హనుమంతుడు తన చేతితో పట్టుకొని ఆ మహేంద్రపర్వతముమీద రమణీయము అయిన వనప్రదేశానికి తీసుకొని పోయినాడు. అక్కడ అంగదుడి సరసను కూర్చుని, "ఓ వానరపుంగవులారా! లంకాపట్టణములో, అశోకవనములో సీతాదేవి రామదర్శనము కోసము ఉపవాసాలు చేస్తూ నలిగి చిక్కిపోయి ఉంది. ఆ పరమపతివ్రత తల అంతా జడలు కట్టుకొనిపోయి ఏకవేణీధరగా ఉంది. దేహమునిండా మురికి పేరుకొని ఉంది. ఆమెను భయంకరము అయిన రాక్షసాంగనలు కావలి కాస్తూ ఉన్నారు. నేను ఆ జనకాత్మజను సీతాదేవిని చూచినాను" అని చెప్పినాడు.

సీతాదేవిని నేను చూచినాను అనే అమృతోపమానము అయిన హనుమంతుడి మాటలు విని వానరులు అందరూ పరమానందభరితులు అయినారు. ఆ మహా బలవంతులలో కొందరు ఆ వాక్యము వినీవినడముతో సింహనాదము చేసినారు. కొందరు "భలే భలే" అని కేకలు వేసినారు. కొందరు ఆబోతులవలె రంకెలు వేసినారు. కొందరు కిలకిల ధ్వనులు చేసినారు. కొందరు గర్జిస్తున్న వారికి బదులు గర్జించినారు. సంతోషాతిశయముతో కొందరు తమ పొడుగాటి అందము అయిన తోకలు పైకి ఎత్తి నేలకువేసి కొట్టినారు. మరికొందరు పర్వతశిఖరాల మీదికి ఎగిరి అక్కడినుంచి కిందికి దూకి మదపుటేనుగు మాదిరిగా ఉన్న హనుమంతుణ్ణి తాకి చూచినారు.

సీతాదేవిని చూచినాను అని చెప్పి, అట్లా ఆ వానరవీరులు అందరి మధ్యను ఊరక కూర్చున్న హనుమంతుడితో అంగదుడు, "ఓ వానరుడా! నీవు నూరుయోజనాల సముద్రాన్ని ఎగిరిపోయినావు. మళ్ళీ వచ్చినావు. బలానికికానీ, పరాక్రమానికికానీ నీ అంతవాడు మరిఒకడు లేడు. ఆహా! నీకు ఉన్న స్వామిభక్తి మరిఎవడికీ లేదు. నీది ఆశ్చర్యము వేసే పరాక్రమము. నీ ధైర్యము అంతకన్నా ఆశ్చర్యము అయింది. మా భాగ్యవశమువల్ల నీవు ఆ యశస్విని రామపత్నిని చూడకలిగినావు. ఇకను ఆ

రామప్రభువు సీతావియోగ దుఃఖము లేకుండా హాయిగా ఉంటాడు. ఇది అంతా మన అదృష్టము'' అన్నాడు.

అప్పుడు వానరులు అందరూ పరమసంతోషముతో రాతిబండలమీద హనుమంతుడి చుట్టూ మూగి కూర్చున్నారు. వారు అందరూ సముద్రలంఘనాన్ని గురించి, లంకాపట్టణాన్ని గురించి, సీతాదేవిని గురించి, రావణాసురుణ్ణి గురించి వినవలెను అనే కోరికతో చేతులు జోడించి హనుమంతుడి ముఖమువంక చూడసాగినారు. అప్పుడు ఆ వానరుల మధ్యను హనుమంతుడితోనూ, జాంబవంతుడితోనూ, కూర్చునిఉన్న అంగదుడు దేవలోకములో దేవతల మధ్యను దేవేంద్రుడివలె తేజరిల్లినాడు.

58

జాంబవంతుడు ఎంతో సంతోషపడ్డాడు. అతడి దేహము పులకరించింది. హనుమంతుణ్ణి చూచి, "ఓ హనుమంతుడా! నీవు సీతాదేవిని ఎట్లా చూచినావు? ఆమె అక్కడ ఎట్లా ఉంటూ ఉంది? ఆ క్రూరకర్ముడు రావణాసురుడు ఆమె విషయములో ఎట్లా నడుచుకొంటున్నాడు? ఉన్నది ఉన్నట్లు చెప్పు. నీవు చెప్పేది అంతా విన్న తరువాత ఏమిచేయవలసిందీ నిశ్చయిద్దాము. మనము రాముడి దగ్గరకు పోయినప్పుడు ఏది చెప్పవలెనో, ఏది చెప్పకుండా దాచిఉంచవలెనో నీవు బుద్ధిమంతుడవు కనుక ఇప్పుడే నిర్ణయించి అంతా వివరముగా చెప్పు'' అన్నాడు.

అట్లా జాంబవంతుడు ప్రశ్న చేసినందుకు హనుమంతుడు పులకాంకితుడు అయి, మనసా సీతాదేవికి నమస్కారము చేసి ఇట్లా చెప్పసాగినాడు :

హనుమంతుని లంకా ప్రయాణ విశేషాలు

"ఓ వానరయోధులారా! నేను సముద్రము దాటడానికి ఏకాగ్రచిత్తముతో ఈ మహేంద్రపర్వతశిఖరముమీదినుంచి ఆకాశముమీదికి ఎగరడము మీరు అందరూ ఎరుగుదురు. నేను అట్లా ఎగిరిపోతూ ఉండగా, రమణీయము అయిన కాంచనపర్వతశిఖరము ఒకటి సముద్రములో నాకు అడ్డము వచ్చింది. అది నాకు విఘ్నము చేయడానికి వచ్చింది అనుకొన్నాను. స్వర్ణమయము అయిన ఆ పర్వతాన్ని పగులకొట్టి అవతలకు పోవలెను అని నాకు బుద్ధిపుట్టింది. అంతట నేను దానిని నా తోకతో కొట్టినాను. అది వెయ్యి బీటలు ఇచ్చింది. అప్పుడు ఆ పర్వతము నా పూనిక తెలుసుకొని మానవ స్వరముతో మధురముగా, 'ఓ బిడ్డా!' అని సంబోధించి నన్ను సంతోషపెట్టుతూ 'నేను నీ తండ్రి వాయుదేవుడి స్నేహితుణ్ణి. నాయనా! నేను నీకు తండ్రివంటివాడను. నేను ఈ సముద్రములో ఉంటున్నాను. నా పేరు మైనాకుడు.

పూర్వము పర్వతాలు అన్నిటికీ రెక్కలు ఉంటూ ఉండేవి. అందువల్ల యధేష్టముగా పర్వతాలు అన్నీ ఈ భూమిమీద తిరుగుతూ సమస్త భూతాలనూ బాధపెట్టుతూ ఉండేవి. అట్లా పర్వతాలు చేస్తూ వచ్చిన దుశ్చేష్టలను పాకశాసనుడు అయిన దేవేంద్రుడు చూచినాడు. అంతట అతడు తన వజ్రాయుధముతో పర్వతాల రెక్కలను నరికివేయడము మొదలుపెట్టినాడు.

"నాయనా! నన్ను మాత్రము అప్పుడు నీ తండ్రి వాయుదేవుడు దేవేంద్రుడి వజ్రాయుధము దెబ్బ తప్పించడానికి నన్ను ఈ సముద్రములోకి తోసివేసినాడు. అట్లా నీ తండ్రి నాకు మహోపకారము చేసినాడు. కాబట్టి ఇప్పుడు నీకు నేను సహాయము చేయవలెను అనుకొన్నాను. అంతేకాదు, రాముడు ఈ జగత్తులో పరమధార్మికుడు. దేవేంద్రుడితో సరిసమానము అయిన పరాక్రమవంతుడు. నేను అతనికిన్నీ సాయపడవలెను. నీవు అతని దూతవు. కనుక ఈ రెండు కారణాల నుంచీ నీకు సహాయము చేయవలెను అని అనుకొని నేను సముద్రములో నుంచి పయికి లేచినాను. 'ఓ హనుమంతుడా! నీవు ఇప్పుడు కొంచెము అలసట తీర్చుకొని ఇక్కడనుంచి బయలుదేరవచ్చును' అని పర్వతరూపములో ఉన్న మైనాకుడు నాతో చెప్పినాడు. నేను ఆ మహాత్ముడికి నా పని గురించి తెలియచెప్పినాను. అంతట ప్రయాణానికి ఉద్యుక్తుణ్ణి అయినాను. అంతట నాకు అనుజ్ఞ ఇచ్చి మానవ స్వరముతో మాట్లాడిన ఆ మహాశైలము సముద్రము లోనికి అంతర్ధానము అయిపోయింది.

"అంతట నేను అమితవేగముతో ఆకాశమార్గాన ముందుకు సాగిపోయినాను. చాలా దూరము ప్రయాణము చేసినాను. అప్పుడు సర్పమాత సురసాదేవి ఆ సముద్రములో కనిపించింది.

"ఆ సురసాదేవి ఆకాశములో పోతూఉన్న నన్ను చూచి, 'ఓ వానరుడా! దేవతలు నిన్ను నాకు ఆహారముగా ఇచ్చినారు. నేను నిన్ను ఇప్పుడు మింగివేస్తాను. నాకు బహుకాలానికి నీవు దొరికినావు' అంటూ నోరు తెరిచింది. నేను ఆ సురసాదేవికి నమస్కారము చేసినాను. నా ముఖము వెల వెలా పోయింది. ఆ సురసాదేవిని చూచి, 'ఓ దేవీ! దశరథమహారాజు పుత్రుడు రాముడు తమ్ముడు అయిన లక్ష్మణుడితోనూ, భార్య అయిన సీతాదేవితోనూ దండకారణ్యానికి వచ్చినాడు. ఆ పరంతపుడి భార్యను సీతాదేవిని దురాత్ముడు రావణాసురుడు అపహరించుకొని పోయినాడు. ఆ కాంతిమంతుడు రాముడు ఆజ్ఞాపించినందువల్ల నేను ఆయన దూతగా ఆ సీతాదేవి దగ్గరకు పోతున్నాను. ఓ దేవీ! నీవు రాముడి రాజ్యములో నివసిస్తూ ఉన్నావు. కనుక నీవు రాముడికి సహాయము చేయవలెను. నేను ఇప్పుడు

పోయి సీతాదేవిని చూచి తిరిగి వచ్చి ఆమె వృత్తాంతము రాముడికి చెప్పి మళ్లీ నీ దగ్గరకు వచ్చి నీ నోటిలో పడిపోతాను. యధార్థము చెప్పుతున్నాను. నేను ఒట్టుపెట్టుకొంటున్నాను. నీవు నన్ను సందేహించవద్దు' అని సురసాదేవితో చెప్పినాను. నేను ఎన్ని విధాల చెప్పినప్పటికిన్నీ ఆ కామరూపిణి తనను దాటి నేను ముందుకు పోవడానికి వీలులేదు అనీ, అట్లా పోనీయకుండా చేయడానికి తనకు ఒక వరము ఉంది అనీ నాతో చెప్పింది. నా దేహము అప్పుడు పదియోజనాల వెడల్పున ఉండడము చూచి, ఆ సర్పమాత పదిహేనుయోజనాల వెడల్పున తన నోరు తెరచింది. అట్లా ఆమె నోరు తెరవడము చూచి నేను ఆ క్షణములోనే అంగుష్ఠమాత్ర శరీరుణ్ణి అయినాను. వెంటనే ఆ సురస నోట్లోకిపోయి ఉత్తర క్షణాన మళ్ళీ బయటికి వచ్చివేసినాను. అప్పుడు ఆ సురసాదేవి తన ఎప్పటి రూపము ధరించి, 'ఓ వానరుడా! నీవు మంచివాడవు. సుఖముగా పో. నీకు కార్యసిద్ధి అవుతుంది. సీతాదేవిని రాముడి దగ్గరకు చేర్చు. నిన్ను చూస్తే నాకు సంతోషము వేస్తూఉంది. నీవు ఎప్పుడూ సుఖముగా ఉండవలెను' అని చెప్పింది. అప్పుడు సమస్త భూతకోటీ నన్ను ప్రశంసించింది. నేను అంతట గరుత్మంతుడివలె మళ్ళీ ఆకాశానికి ఎగిరినాను.

"అంతలో నా నీడను ఏదో పట్టుకొన్నది. నాకు అది ఏమిటో తెలియలేదు. నా వేగము సన్నగిల్లింది. నేను అంతట అన్ని దిక్కులా చూచినాను. నా వేగాన్ని ఏది అడ్డగించినదో అది నా కంటికి కనబడలేదు. అటువంటి విఘ్నము ఆకాశములో వచ్చిందే అనుకొని దిగులు పడ్డాను. కింది జలాలవైపు చూచినాను. ఆ జలాలలో పడుకొని ఉన్న ఒక రాక్షసాంగనను, భయంకరాకారను చూచినాను. ఆ రాక్షసాంగన నన్ను చూచి పెద్దపెట్టున అరుస్తూ, వికటముగా నవ్వుతూ, ఏవిధము అయిన తొట్రుపాటులేకుండా అమంగళముగా, 'ఓ మహాకాయుడా! నీవు ఎక్కడికిపోతున్నావు? నాకు ఇప్పుడు ఆకలి వేస్తూ ఉంది. ఆహారము కావలెను. బహుకాలమునుంచీ ఆహారము లేకుండా ఉన్నాను. నీవు నాకు ఆహారము అయి నన్ను సంతోషపెట్టవలెను' అన్నది.

"నేను ఆ రాక్షసిని చూచి 'మంచిదేను' అంటూ ఆ రాక్షసి నోటికన్నా ఎక్కువగ నా దేహాన్ని పెంచినాను. ఆ రాక్షసిన్నీ నన్ను మింగివేయడానికి నా దేహముకన్నా ఎక్కువగానూ, భయంకరముగానూ నోరు తెరచింది. నేను కామరూపుణ్ణి అనికానీ, నేను కావాలి అనుకొని అట్లా వికృతరూపము ధరించినాను అనికానీ ఆ రాక్షసి తెలుసుకోలేకపోయింది. అంతట క్షణలేశములో నేను నా దేహాన్ని కుంచించి రాక్షసాంగన నోటిలోకి పోయి, దాని గుండెకాయ ఊడపీకి పయికి వచ్చి, ఆకాశములోకి ఎగిరినాను. నేను దాని గుండెకాయ పీకి వేయగానే ఆ రాక్షసాంగన చేతులు వేల్లాడవేసి భయంకరాకారముతో సముద్రములో పడిపోయినది.

"అప్పుడు ఆకాశములో సంచారము చేస్తూ ఉన్న సిద్ధులూ, చారణులూ నన్ను చూచి, 'ఆహా! హనుమంతుడు క్షణమాత్రములో భయంకరము అయిన సింహికను చంపివేసినాడు' అని ప్రశంసించడము నేను విన్నాను. అట్లా నేను ఆ సింహికను చంపివేసి ఆ అఘాయిత్యపు పని చేసినందుకు నన్ను నేను మెచ్చుకొంటూ, ఆ ఆకాశమార్గాన బహుదూరము ప్రయాణము చేసినాను.

"ఆ సముద్రము దక్షిణతీరమూ, ఆ తీరాన ఉన్న నానావిధ వృక్షాలూ, లంకాపట్టణమూ నాకు కనిపించినవి. సూర్యుడు అస్తమించిన తరువాత రాక్షసులకు ఎవరికీ తెలియకుండా నేను ఆ లంకాపట్టణములోకి పోయినాను. ఆ లంకాపట్టణములో ఉన్న రాక్షసులు అందరూ భయంకర పరాక్రములు. నేను ఆ పట్టణములోనికి పోబోతూ ఉండగా ప్రళయకాలమేఘమువంటి ఆకారముతో ఒకానొక రాక్షసాంగన పెద్దపెట్టున నవ్వుతూ నా ఎట్టఎదుట నిలుచున్నది. భగ భగ మండుతూఉన్న అగ్నిహోత్రమువంటి తలవెంట్రుకలతో ఆ భయంకరాకార నన్ను చంపివేయడానికి నా మీదికి వచ్చింది. నేను ఆ రాక్షసిని నా ఎడమ చేతి పిడికిటితో పొడిచివేసినాను. దానిని జయించినాను. ఆ రాక్షసి నన్ను చూచి భయపడిపోయి, 'ఓ వీరుడా! నేను లంకాపురాధిదేవతను. నీవు నీ పరాక్రమముతో నన్ను జయించినావు. ఇంక ఈ లంకాపట్టణములో సమస్త రాక్షసులనూ నీవు జయించి వేయకలవు' అని నాతో చెప్పింది.

"నేను ఆ రాత్రి అంతా ఆ లంకాపట్టణములో సీతాదేవి కోసము వెతికినాను. రావణాసురుడి అంతఃపురములోనికి పోయినాను. ఆ సుమధ్యమ సీతాదేవి నాకు అక్కడ కనిపించలేదు. నేను దిగులు పడ్డాను. అట్లా దిగులుపడుతూ అన్నివైపులా చూస్తూ ఉండగా చాలా ఎత్తు అయిన ప్రాకారముతో రావణాసురుడి గృహోద్యానవనము కనిపించింది. నేను దాని ప్రాకారముమీదినుంచి ఎన్నో వృక్షాలు ఉన్న ఆ ఉద్యానవనములోకి పోయినాను. ఆ అశోకవన మధ్యములో ఒక పెద్ద ఇరుగుడుచెట్టు ఉంది. నేను ఆ చెట్టు ఎక్కినాను. అక్కడనుంచి నేను ఒక బంగారు అరటితోట చూచినాను. అక్కడ ఆ శింశుపావృక్షముకింద ఆ వరవర్ణిని సీతాదేవిని చూచినాను. ఆమె యౌవనమధ్యస్థ. ఆమె కన్నులు కమల పత్రాల మాదిరిగా ఉన్నవి. ఉపవాసాలతో కృశించిపోయింది. ఒకే వస్త్రము దేహానికి అంతటికీ చుట్టుకొని ఉంది. తల అంతా దుమ్ముకొట్టుకొని ఉంది. మనోవ్యథవల్లనూ, దేహతాపమువల్లనూ ఆమె అవయవాలు అన్నీ వాడిపోయి ఉన్నవి. మాంసము తింటూ, నెత్తురు తాగుతూ ఉన్న రాక్షసాంగనలు ఆమె చుట్టూ కావలి ఉన్నారు. వాండ్లు అందరూ వికృతాకారులు. పెద్దపులుల మధ్య ఉన్న లేడివలె వాండ్ల అందరి మధ్యను సీతాదేవి ఉంది. ఆ రాక్షసాంగనలు ఆమెను మాటిమాటికీ బెదిరిస్తూ ఉన్నారు. ఆమె తలవెంట్రుకలు అన్నీ ఒకే ఒక జడకట్టుకొని

పోయినవి. ఆమె నిరంతరమూ తన భర్తను గురించి ధ్యానము చేస్తూ ఉంది. ఎప్పుడూ కటికనేలమీద పడుకొంటూ ఉండడము నుంచి ఆమె దేహము వివర్ణము అయిపోయింది. హేమంతకాలములో కమలమువలె కనిపించింది. రావణాసురుడికి మనస్సు ఇవ్వనందువల్లనూ, నిర్బంధమువల్లనూ ఆమె చచ్చిపోవడానికి నిశ్చయించు కొన్నది. అల్లా ఉన్న ఆ మృగశాబాక్షిని నేను చూచినాను. ఆ యశస్వినిని చూస్తూ నేను ఆ శింశుపావృక్షముమీద కూర్చున్నాను. అప్పుడు రావణాసురుడి భవనములో స్త్రీల మొలనూళ్ళ చప్పుళ్ళూ, అందెల చప్పుళ్ళూ మహాగంభీరముగా గలగలమని వినిపించినవి. నేను చాల భయపడిపోయినాను. నా దేహాన్ని మరింత చిన్నదిగా చేసుకొన్నాను. ఒక చిన్న పిట్టవలె ఎవరికీ కనపడకుండా ఉండేట్టు దట్టముగా ఉన్న ఆకులమధ్యను కూర్చున్నాను. అప్పుడు ఆ మహాబలవంతుడు రావణాసురుడు భార్యలు అందరితోనూ సీతాదేవి ఉన్న చోటికి వచ్చినాడు.

"ఆ వరారోహ సీతాదేవి రావణాసురుణ్ణి చూచి తన ఊరువులు ముడుచుకొని స్తనాలు కనిపించకుండా ఉండేట్టు చేతులు కట్టుకొని కూర్చున్నది. ఆమె చాల భయపడి పోయింది. దిగులుపడిపోయింది. అన్నిదిక్కులా చూడసాగింది. కాపాడే దిక్కు లేక గడ గడ వణకిపోయింది. పరమదుఃఖములో మునిగిపోయింది. అట్లా ఉన్న ఆ సీతాదేవిని రావణాసురుడు చూచి తలవంచి నమస్కారము చేసి 'నన్ను గౌరవించు' అంటూ, 'ఓ సీతా! నీవు చాలా గర్వముతో ఉన్నావు. అందువల్ల నీవు నన్ను గౌరవించకుండా ఉన్నావు. నీకు రెండు నెలల గడువు ఇస్తున్నాను. గడువు కాలములోపల నీవు నన్ను గౌరవించక పోయేట్లయితే నీ నెత్తురు తాగుతాను' అని చెప్పినాడు.

"ఆ దురాత్ముడు రావణాసురుడు అన్న ఆ మాటలు విని సీతాదేవి పరమకోపముతో, 'ఓ రాక్షసుడా! నీవు రాక్షసులలో అధముడవు. నేను అమిత తేజోవంతుడు అయిన రాముడి భార్యను. దశరథ మహారాజు కోడలిని. అటువంటి నాతో నీవు అవాచ్యాలు అంటున్నావు. నీ నాలుక చీలికలు అయిపోవలెను. నీవు దుష్టుడవు. పాపిష్టివాడవు. నాభర్త లేనప్పుడు ఆయన కళ్ళపడకుండా నీవు నన్ను అపహరించుకొని వచ్చినావు. నీవు పరాక్రమహీనుడవు. ఆ రామప్రభువుకూ, నీకూ ఏ పోలికా లేదు. అంతేకాదు, ఆయనకు దాసుడవుగా ఉండటానికి కూడా నీకు అర్హతలేదు. ఆయన యజ్వ. సత్యవాది. రణశ్లాఘి' అని చెప్పింది.

"ఇట్లా ఇంత పరుషముగా సీతాదేవి అన్న మాటలు రావణాసురుడు విన్నాడు. చితిలో అగ్నిహోత్రమువలె కోపముతో మండిపడుతూ రెండు కళ్ళూ తెరచి ఆమెను చూచినాడు. కుడి పిడికిలితో సీతాదేవిని కొట్టి చంపివేయపోయినాడు. అప్పుడు స్త్రీలు అందరూ హాహాకారాలు చేసినారు.

"ఆ దురాత్ముడి భార్య మండోదరి అనే ఉత్తమోత్తమురాలు ఆ స్త్రీలమధ్య నుంచి వచ్చి ఆ పని చేయనీయకుండా అతణ్ణి నిషేధించింది. మదనతాపముతో కొట్టుకులాడుతూ ఉన్న ఆ రావణాసురుడితో మధురముగా 'ప్రభూ! నీవు దేవేంద్రుడితో సరిసమానము అయిన పరాక్రమవంతుడవు. నీకు ఈమెతో ఏమి పని? దేవ గంధర్వ యక్ష కన్నెలు ఎందరో ఉన్నారు. వారితో క్రీడించు. ఈ సీతతో ఎందుకు' అని చెప్పింది. అంతట ఆ స్త్రీలు అందరూ ఆ నిశాచరరాజును ప్రసన్నుణ్ణి చేసి అతని భవనానికి తీసికొనిపోయినారు.

"అట్లా దశగ్రీవుడు వెళ్ళిపోగానే ఆ వికృతాననలు రాక్షసాంగనలు అతి పరుషమూ, పరమదారుణమూ అయిన మాటలతో సీతాదేవిని బెదిరించినారు. సీతాదేవి వారి మాటలను ఒక గడ్డిపోచకింద కట్టివేసింది. వాండ్ల గర్జనలు ఆమెదగ్గర నిరర్థకము అయిపోయినవి. అప్పుడు ఆ రాక్షసాంగనలకు ఏమి చేయటానికీ తోచలేదు. రావణాసురుడి దగ్గరకు పోయినారు. సీతాదేవి నిశ్చయము చెప్పినారు.

"సీతాదేవిని వశపరచుకోవలెను అనుకొన్న ఆ రాక్షసస్త్రీల ఆశ నిరాశ అయిపోయింది. ఆ ప్రయత్నము వాండ్లు అంతట మానుకొన్నారు. ఆమె చుట్టూ చేరి నిద్రపోయినారు. ఆ రాక్షసాంగనలు అట్లా నిద్రపోయిన తరువాత ఆ మహాపతివ్రత సీతాదేవి పరమదుఃఖముతో ఏడువసాగింది. అప్పుడు ఆ రాక్షసస్త్రీలమధ్య పడుకొని ఉన్న త్రిజట అనే ఒక రాక్షసాంగన నిద్రలేచి తక్కినవాండ్లను అందరినీ నిద్రలేపి, 'మీరు సీతాదేవిని చంపి తినవద్దు. నన్ను తినండి. మీరు ఏమి చేసినా ఈమె మాత్రము నాశనము అయిపోదు. ఈమెను మీరు చంపినా చచ్చిపోదు. నాకు ఒండ్లు గగుర్పొడిచే భయంకరము అయిన కల ఒకటి వచ్చింది. రాక్షసుల నాశనాన్నీ, ఈమె భర్త రాముడి జయాన్నీ ఆ కల సూచించింది. మనలను రాముడు చంపివేయకుండా కాపాడే సామర్థ్యము ఈ సీతాదేవికి ఒక్కతెకే ఉంది. కాబట్టి మనము ఈ వైదేహిని ప్రార్థించవలెను. ఈమెను ప్రార్థించడము ఎంతో మంచిది. ఇంత దుఃఖములో ఉన్న ఈమెను గురించి నాకు ఆ కల వచ్చింది. కాబట్టి ఈమె సమస్త సుఖాలూ అనుభవిస్తుంది. మనము ఎన్ని అపరాధాలు చేసినప్పటికిన్నీ నమస్కారము చేసి ప్రార్థించేట్లయితే ఈమె ప్రసన్నురాలు అవుతుంది' అంటూ చెప్పింది.

"అప్పుడు సీతాదేవి ఆ మాటలు విని తన భర్త వచ్చి జయిస్తాడు అని సంతోషపడి రాక్షసాంగనలను చూచి సిగ్గుపడుతూ, 'ఓ రాక్షసాంగనలారా! ఈ త్రిజట చెప్పింది నిజము అయ్యేట్లయితే మిమ్ములను నేను తప్పకుండా కాపాడుతాను' అన్నది.

"నేను సీతాదేవి దుర్దశను చూచి దుఃఖాక్రాంతుణ్ణి అయిపోయినాను నా మనస్సు మహావ్యధ పడిపోయింది. నేను ఆమెతో మాట్లాడే ఉపాయము ఆలోచించసాగినాను. నాకు ఒక ఉపాయము తోచింది. అంతట ఇక్ష్వాకు వంశాన్ని వర్ణించడము మొదలు పెట్టినాను. నేను చెప్పింది అంతా అమె విన్నది. కన్నీళ్ళు కారుస్తూ ఆమె నన్ను చూచి, 'ఓ వానరపుంగవా! నీవు ఎవరవు? ఎందుకు ఇక్కడికి వచ్చినావు? సముద్రాన్ని ఎట్లా దాటినావు? ఆ రామప్రభువుకూ, నీకూ స్నేహము ఎట్లా అయింది చెప్పు' అన్నది.

"నేను, 'ఓ దేవీ! రామప్రభువుకు సుగ్రీవుడితో స్నేహము అయింది. అతడు వానరరాజు. భయంకర పరాక్రముడు. మహాబలవంతుడు. నేను ఆ సుగ్రీవుడి భృత్యుణ్ణి. నా పేరు హనుమంతుడు. ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసివేసే ఆ రామప్రభువు నన్ను నీ కోసము ఇక్కడికి పంపించినాడు. ఓ యశస్వినీ! ఆ పురుషోత్తముడు, ఆ శ్రీమంతుడు, దశరథమహారాజపుత్రుడు రామప్రభువు స్వయముగా ఈ ముద్దుటుంగరాన్ని నీకు గుర్తుగా ఇవ్వవలసిందిగా నాకు ఇచ్చినాడు' అని చెప్పి ఆ ఉంగరాన్ని ఆమెకు ఇచ్చి, 'ఓ దేవీ! నీవు నన్ను ఆజ్ఞాపించు. నన్ను ఏమి చేయమంటే అది చేస్తాను. నిన్ను రామలక్ష్మణుల దగ్గరకు తీసుకొని పొమ్మనేట్లయితే తీసుకొనిపోతాను' అని నేను చెప్పినాను.

"ఆ జనకనందిని సీతాదేవి ఆలోచించి, 'రామప్రభువే రావణాసురుణ్ణి సంహారము చేసి నన్ను తీసుకొనిపోవలను' అని చెప్పింది. అంతట నేను ఆ పూజ్యురాలికి సాష్టాంగ నమస్కారము చేసి రామప్రభువు సంతోషించేటందుకు ఏది అయినా ఒక వస్తువును గుర్తుగా ఇవ్వవలసింది అని ఆమెను ప్రార్థించినాను. అప్పుడు ఆమె రత్నాలు పొదిగిన చూడామణిని ఇచ్చి, 'ఓ హనుమంతుడా! దీనిని తీసుకో. ఈ చూడామణిని చూచి ఆ రామప్రభువు నిన్ను మెచ్చుకొంటాడు' అని చెప్పింది. ఆమె అప్పుడు మరి ఒక వృత్తాంతాన్ని కూడా గుర్తుగా చెప్పింది.

"నేను అంతట తిరిగి రావలెను అనుకొని ఆమెకు ప్రదక్షిణ నమస్కారాలు చేసినాను. ఆమె ఆలోచిస్తూ నన్ను చూచి, 'ఓ హనుమంతుడా! నా కష్టాలు అన్నీ నీవు ఆ రామప్రభువుతో చెప్పవలెను. నా వృత్తాంతము వినగానే ఆ పరాక్రమవంతులు రామలక్ష్మణులు ఇద్దరూ సుగ్రీవుడితో కూడా బయలుదేరి వెంటనే ఇక్కడికి వచ్చే ఏర్పాటు నీవు చేయవలెను. అట్లా జరుగకపోయేట్లయితే నేను రామప్రభువుకు కనపడతానో కనపడనో చెప్పలేను. నేను ఇక జీవించి ఉండేది రెండు మాసాలేను. ఆతరువాత నేను నాథుడు లేనిదానివలె చచ్చిపోతాను. ఈసంగతి అంతా ఆయనతో చెప్పు' అని ఆమె నాతో చెప్పింది.

"ఇట్లా జాలివేసేట్లు ఆమె చెప్పిన మాటలు నేను విన్నాను. నాకు పట్టరాని కోపము వచ్చింది. ఆలోచించినాను. అపైన చేయవలసిన పనిని నిశ్చయించినాను. అంతట నా దేహాన్ని పర్వతము అంత ఎత్తున పెంచివేసినాను. రావణాసురుడికి కోపము తెప్పించి వాడితో యుద్ధము చేయవలెను అనుకొన్నాను. అప్పుడు ఆ అశోకవనాన్ని అంతా నాశనము చేసివేసినాను. నేను ఆ వనాన్ని విరచివేస్తుంటే అయిన మహాధ్వనికీ, అప్పుడు అక్కడ బెదిరిపోయి పరుగులెత్తుతూ ఉన్న మృగపక్షి సమూహాల భయంకర ధ్వనులకూ అక్కడ ఉన్న వికృతాననలు రాక్షసాంగనలు నిద్రలేచినారు. అట్లా విరిగిపోయిన అశోకవనాన్నీ, పర్వతాకారముతో ఉన్న నన్నూ చూచి వాండ్లు అందరూ వెంటనే రావణాసురుడి దగ్గరకు పరుగులెత్తుకొనిపోయి జరిగింది అంతా చెప్పినారు.

"అప్పుడు రావణాసురుడు నామీదికి కింకరులు అనే రాక్షసులను పంపించినాడు. ఒక ఇనుపగుదియతో నేను వాండ్లను అందరినీ చంపివేసినాను. అప్పుడు నాకు ఒక బుద్ధి పుట్టింది. అక్కడ ఉన్న చైత్యప్రాసాదముమీదికి ఎగిరినాను. లంకాపట్టణానికి అంతటికీ అలంకారముగా ఉన్న ఆ చైత్యప్రాసాదాన్ని ధ్వంసము చేసివేసినాను. అక్కడ ఉన్న స్తంభాన్ని ఒకదాన్ని ఊడపీకి దానితో నూరుగురు రాక్షసులను చంపివేసినాను. అప్పుడు రావణాసురుడు ప్రహస్తుడి పుత్రుణ్ణి జంబుమాలి అనేవాణ్ణి నామీదికి పంపించినాడు. వాడు భయంకరాకారులు అయిన రాక్షసులను వెంటపెట్టుకొని నామీదికి వచ్చినాడు. వాడు, ఆ జంబుమాలి మహాబలవంతుడు. రణకోవిదుడు. నేను వాడినీ, వాడి వెంటవచ్చిన రాక్షససైన్యాన్నీ పరమభయంకరము అయిన ఇనుపగుదియతో కొట్టి చంపివేసినాను. ఆ జంబుమాలిని చంపివేయడము విని రావణాసురుడు అంతట నామీదికి తన మంత్రి పుత్రులను పంపించినాడు. వాండ్లు మహాబలవంతులు. పదాతి సైన్యాలతో వచ్చి నామీద పడ్డారు. నేను ఆ మంత్రిపుత్రులనూ, తక్కినవాండ్లనూ ఇనుప గుదియతోనే యమసదనానికి పంపించివేసినాను. అంతట రావణాసురుడు తన సేనానాయకులను అయిదుగురిని నామీదికి పంపించినాడు. నేను వాండ్లనుకూడా నాశనము చేసివేసినాను. అప్పుడు రావణాసురుడు తన కొడుకు అక్షకుమారుణ్ణి గొప్ప రాక్షససైన్యముతో నామీదికి పంపించినాడు.

"ఆ అక్షకుమారుడు మండోదరి పుత్రుడు. చిన్నవాడు. అయితే రణపండితుడు. తటాలున ఆకాశానికి ఎగిరి నన్ను కొట్టపోయినాడు. నేను వాడి రెండుపాదాలు పట్టుకొని గిరగిరా తిప్పి నేలమీదికి విసరివేసినాను. వాడు చేతులూ, కాళ్ళూ విరిగి చచ్చిపోయినాడు. అక్షకుమారుడు చచ్చిపోవడము తెలియగానే

రావణాసురుడికి చెడ్డ కోపము వచ్చింది. మహాబలవంతుడూ, యుద్ధోన్మత్తుడూ అయిన ఇంద్రజిత్తు అనే తన కొమారుణ్ణి నామీదికి పంపించినాడు. నేను ఆ ఇంద్రజిత్తుతో వచ్చిన సైన్యాన్ని అంతా యుద్ధము చేసి సంహారము చేసివేసినాను. అప్పుడు నేను ఎంతో సంతోషపడ్డాను. ఆ ఇంద్రజిత్తు తన సైన్యము అంతా నాశనము అయిపోవడము చూచి నేను అజేయుడను అని తెలుసుకొని అమితవేగముతో నామీద బ్రహ్మాస్త్రము వదలి నన్ను బంధించివేసినాడు. అప్పుడు రాక్షసులు అందరూ వచ్చి నన్ను పగ్గాలతో కట్టివేసినారు. రావణాసురుడి దగ్గరకు నన్ను తీసుకొనిపోయినారు. ఆ దురాత్ముడు నన్ను చూచి, 'నీవు లంకకు ఎందుకు వచ్చినావు? రాక్షసులను ఎందుకు చంపివేసినావు?' అని అడిగినాడు.

"సీతాదేవి కోసము నేను అట్లా చేసినాను అని వాడితో చెప్పినాను. ఓ రాక్షసరాజా! నేను సీతాదేవిని చూడవలెను అనుకొని ఈ లంకాపట్టణానికి వచ్చినాను. నేను వాయుదేవుడి కుమారుణ్ణి. నా పేరు హనుమంతుడు. నేను సుగ్రీవుడి అమాత్యుణ్ణి. రామదూతను. రామ సందేశము తెలియ చెప్పడానికి నేను ఇక్కడికి దూతగా వచ్చినాను. మహాతేజోవంతుడు సుగ్రీవుడు నీ క్షేమము విచారించమన్నాడు. ధర్మార్థకామసహితము అయిన హితవాక్యము నీతో చెప్పమన్నాడు.

"ఋష్యమూకపర్వతము మీద ఉండగా నాకూ, రణవిశారదుడు అయిన రాముడికీ స్నేహము అయింది. అతడు తన భార్యను రాక్షసుడు ఒకడు అపహరించినాడు అనీ, వాడిని సంహారము చేసి తన భార్యను తెచ్చుకోవడానికి సమస్తవిధాల సహాయము చేయవలసింది అనీ నన్ను కోరినాడు. నేను ఆ రాముడితో నాకూ, వాలికీ ఉన్న విరోధము తెలియ చెప్పినాను. వాలిని చంపివేయడానికి రాముడు ప్రతిజ్ఞ చేసినాడు. అగ్నిసాక్షిగా ఆ మహాప్రభువు రాముడు నాతో స్నేహము చేసినాడు. అంతట అతడు వాలిని ఒక్క బాణముతో సంహారము చేసివేసి నాకు వానరరాజ్యము ఇప్పించినాడు. అందువల్ల నేను అవశ్యమూ రాముడికి సహాయము చేయడానికోసము ధర్మాన్ని అనుసరించి ఈ హనుమంతుణ్ణి నీ దగ్గరకు దూతగా పంపించినాను. నీవు వెంటనే సీతాదేవిని రాముడికి ఇచ్చి వేయవలెను. అట్లా నీవు చేయకపోయేట్లయితే వానరవీరులు అందరూ నీ పట్టణాన్ని ముట్టడించి నీ సైన్యాలను నాశనము చేసి నిన్ను చంపివేస్తారు. ఇదివరకు వానరులు దేవతలకు సాయముచేసి యుద్ధములో జయము సంపాదించి పెట్టినారు. వానరవీరుల ప్రభావము తెలియనివాడు ఎవడూ లేడు. నీకూ వానరులను గురించి తెలుసును.' ఈ విషయము నీతో చెప్పమని వానరరాజు సుగ్రీవుడు నన్ను ఇక్కడికి పంపించినాడు అని నేను చెప్పినాను.

"రావణాసురుడు క్రుద్ధుడు అయిపోయినాడు. అతని కన్నులు జ్యోతులు అయిపోయినవి. ఆ రౌద్రకర్ముడు నన్ను దహించివేసేట్టు చూస్తూ నా ప్రభావము తెలియక నన్ను చంపివేయవలసింది అని ఆజ్ఞాపించినాడు. అప్పుడు అతని తమ్ముడు విభీషణుడు అనేవాడు నన్ను చంపివేయకూడదు అని చెప్పినాడు. ఆ విభీషణుడు మహాబుద్ధిమంతుడు. 'దూతను ఎంతమాత్రమూ చంపకూడదు, వదిలిపెట్టవలసింది. దూతను చంపివేయడము రాజధర్మానికి విరుద్ధము అనీ, అట్లా చేయకూడదు అనీ చెప్పినాడు. అంతేకాదు, హితము చెప్పే దూత తన ప్రభువు చెప్పి పంపించిన మాటలనే నివేదిస్తాడు. ఓ అన్నా! నీవు అతుల పరాక్రమవంతుడవు. దూత ఎటువంటి అపరాధము చేసినప్పటికిన్నీ చంపకూడదు అని శాస్త్రాలు చెప్తుతున్నవి. నీవు వీణ్ణి చంపవద్దు. వికృతరూపుణ్ణి చేసి పంపించి వేయవచ్చును' అని చెప్పినాడు.

"ఇట్లా విభీషణుడు చెప్పిన మాటలు విని రావణాసురుడు నా తోకకు నిప్పు ముట్టించి కాల్చివేయవలసింది అని ఆజ్ఞాపించినాడు.

"అంతట రాక్షసులు జనపనార వస్త్రాలూ, చినిగిపోయిన గుడ్డ పీలికలూ నా తోకకు చుట్టి నూనెతో తడిపినారు. నన్ను పగ్గాలతో కట్టివేసి కట్టెలతో కొట్టుతూ, పిడికిళ్ళతో పొడుస్తూ నా తోకకు నిప్పు ముట్టించినారు. అంతట నన్ను ఆ రాక్షసశూరులు లంకాపట్టణ ద్వారము దగ్గరకు తీసుకొనిపోతూ రాజవీధిలో నన్ను గురించి అందరికీ తెలిసేటట్టు చాటించినారు. నాకు అప్పుడు కోపము వచ్చింది. నా మహదాకారాన్ని కుంచించినాను. కట్టివేసిన తాళ్ళు అన్నీ కుప్పకూలినవి. మళ్ళీ పర్వతాకారము ధరించినాను. ఆ పట్టణ ద్వారానికి అమర్చి ఉన్న ఇనుపగుదియను ఊడపీకి ఆ రాక్షసులను అందరినీ చంపివేసినాను. అమితవేగముతో ఆ పట్టణ ద్వారము మీదికి ఎగిరినాను. ప్రళయకాలాగ్ని హోత్రము ప్రజలను దహించివేసేట్టు, నేను నిర్భయముగా లంకాపట్టణ బహిర్ద్వారాలకూ, కోటబురుజులకూ, వివిధ గృహాలకూ మండుతూ ఉన్న నా తోకతో నిప్పు అంటించినాను. లంకాపట్టణము అంతా తగులబడిపోయింది.

"నేను అప్పుడు సీతాదేవి కూడా దగ్ధము అయిపోయిందేమోనని దిగులు పడ్డాను. రామకార్యము అంతా వ్యర్థము అయిపోయింది ఏమోను అని భయపడి పోయినాను. అయితే ఆకాశములో తిరుగుతూఉన్న చారణులు 'సీతాదేవి తగులపడి పోలేదు. ఆశ్చర్యము' అని చెప్పుకొంటూ ఉన్న మంగళకరము అయిన మాటలు విన్నాను. సీతాదేవి చెక్కు చెదరకుండా ఉంది అని విని సంతోషపడ్డాను. తోక మండుతూ ఉన్నప్పటికిన్నీ ఆ మంటలు నన్ను ఏమాత్రమూ దహించివేయలేదు. అప్పుడు నాకు అనేక శుభనిమిత్తాలు తోచినవి. నేను అంతట మళ్ళీ సీతాదేవి దగ్గరకు పోయి ఆమెను చూచినాను. ఆమె అనుజ్ఞ తీసుకున్నాను. అక్కడనుంచి

అరిష్టపర్వతముమీదకి వచ్చినాను. సముద్రము దాటినాను. ఇప్పుడు మిమ్మల్లను చూస్తూ ఉన్నాను. ఆ రామప్రభువు ప్రభావమువల్లనూ, మీ అందరి అనుగ్రహమువల్లనూ మన ఏలిక సుగ్రీవుడు పంపించిన పని చేయకలిగినాను. ఇకను ఇప్పుడు ఏమి చేయవలసిందీ మీరు ఆలోచించవలెను" అని హనుమంతుడు చెప్పినాడు.

59

కర్తవ్య నిర్ణయము

ఆ మారుతాత్మజుడు హనుమంతుడు మళ్ళీ ఇట్లా చెప్పడము మొదలు పెట్టినాడు :

"సీతాదేవి మహాపతివ్రత. రాముడి ప్రయత్నము, సుగ్రీవుడి తహతహ సఫలము అవుతవి. నేను ఆమెమీద ఎంతో భక్తితో ఉన్నాను. రావణాసురుడు తపోబలసంపన్నుడు. వాడు ఆ తపోబలముతో సమస్తలోకాలనూ దహించి వేయగలడు. ఆ తపోబలమునుంచే సీతాదేవిని తాకినప్పటికిన్నీ వాడు నాశనము అయిపోలేదు. ఇంతవరకూ జరిగింది అంతా నేను చెప్పినాను.

"ఓ వానరులారా! జాంబవంతుడూ, మీరూ ఒప్పుకొనేట్లయితే మనము లంకాపట్టణానికిపోయి ఆ వైదేహిని తీసుకొని రామలక్ష్మణుల దగ్గరకు పోదాము. అట్లాచేస్తేనే బాగుంటుంది అని నాకు తోస్తూ ఉంది. నేను ఒక్కడినే ఆ లంకాపట్టణములో ఉన్న రాక్షసులను అందరినీ, మహాబలవంతుడు అయిన రావణాసురుడితో కూడా ఇట్టే చంపివేయకలను. ఇక పరమపరాక్రమవంతులూ, బలవంతులూ, బుద్ధిమంతులూ, శస్త్రాస్త్రవిదులూ, శూరులూ అయిన మీరు అందరూ నా వెంట వచ్చేట్లయితే వేరే చెప్పవలసిన పనిలేదు. నేను ఒక్కడినే ఆ రావణాసురుడి సైన్యాలనూ, వాడి అనుచరులనూ, వాడి కొడుకులనూ, వాణ్ణీ యుద్ధములో సంహారము చేసివేస్తాను. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్నికానీ, ఐంద్రాస్త్రాన్నికానీ, వాయవ్యాస్త్రాన్నికానీ, వారుణాస్త్రాన్నికానీ ప్రయోగించినప్పటికిన్నీ వాటిని అన్నిటినీ కొట్టివేసి నేను రాక్షసులను అందరినీ నాశనము చేసివేయగలను. మీరు అనుజ్ఞ ఇచ్చేట్లయితే ఆ ఇంద్రజిత్తును కూడా నేనే జయించివేస్తాను. ఎడతెగకుండా నేను కురిపించే రాళ్ళవానకు అమృతపానము చేసిన దేవతలు అయినా ప్రాణాలు వదలవలసిందే. ఇకను రాక్షసులను గురించి చెప్పవలసిన పనే లేదు. ఒకవేళ సముద్రము చెలియలికట్టను దాటితే దాటవచ్చును. మందరపర్వతము చలిస్తే చలించిపోవచ్చును. కాని జాంబవంతుణ్ణి ఏ శత్రుసైన్యాలూ ఏ మాత్రమూ కదిలించలేవు. రాక్షససైన్యాలను అన్నిటినీ అంగదుడు ఒక్కడే సంహారము చేసివేయకలడు. అతడు అంతటి పరాక్రమవంతుడు.

"మహాబలవంతులు అయిన పనస నీలుల ఊరువుల వేగానికి మందర పర్వతము అయినా పగిలిపోక తప్పదు. ఇకను వారు రాక్షసులను ముక్కలు ముక్కలు చేయగలరు అని నేను చెప్పవలెనా? దేవతలలోకానీ, అసురులలోకానీ, యక్షులలో కానీ, గంధర్వులలోకానీ, ఉరగులలోకానీ, పతగులలోకానీ, మైందద్వివిదులతో పోరాడకలవాడు ఒక్కడూ లేడు. వారు అశ్వినీదేవతల పుత్రులు. మహాభాగులు. రణరంగములో వారితో పోరాడగలిగినవారిని ఎవ్వరినీ నేను ఇంతవరకు చూడలేదు. మైందద్వివిదులు ఇద్దరూ బ్రహ్మదేవుడి వరమువల్ల పరమదర్పముతో పోరాడకలరు. వాండ్లు ఇద్దరూ అమృతపానము చేసినారు. పూర్వము బ్రహ్మదేవుడు ఈ మైందద్వివిదులను గౌరవించడాని కోసము వీళ్ళు ఎవరి చేతులలోనూ చావకుండా ఉండేటట్టు వరము ఇచ్చినాడు. ఆ వర ప్రభావము నుంచి మైందద్వివిదులు పరాక్రమించి దేవసేనలను చించి చెండాడి అమృతపానము చేసినారు. అందువల్ల ఈ మైందద్వివిదులు ఇద్దరూ కుపితులు అయ్యేట్లయితే లంకాపట్టణాన్ని అంతా గుర్రాలతోనూ, ఏనుగులతోనూ, రథాలతోనూ నాశనము చేసివేస్తారు. నేనే లంకాపట్టణాన్ని అంతా దగ్ధము చేసి రాజవీధులలో నా పేరు చాటించుకొన్నాను.

"అధికబలవంతుడు అయిన రాముడూ, మహాబలవంతుడు అయిన లక్ష్మణుడూ, రాముడు కాపాడిన వానరరాజు సుగ్రీవుడూ రాక్షసులను జయిస్తారు అనీ, నేను ఆ రామప్రభువు దాసుణ్ణి అనీ, వాయుపుత్రుణ్ణి హనుమంతుణ్ణి అనీ ప్రకటించుకొన్నాను.

"ఓ వానరులారా! ఆ మహాపతివ్రత దురాత్ముడు అయిన రావణాసురుడి అశోకవనములో శింశుపావృక్షముకింద కాలము గడుపుతూ ఉంది. ఆమెను రాక్షసస్త్రీలు కావలి కాస్తున్నారు. ఆమె దుఃఖముతో బాధపడుతూ మేఘాలు కమ్ముకొన్న చంద్రరేఖ మాదిరిగా కళాకాంతులు లేకుండా ఉంది. బలగర్వితుడు అయిన రావణాసురుణ్ణి ఆమె మనస్సులో నయినా లెక్కచేయడము లేదు. నిరంతరమూ ఆమె రాముణ్ణి ధ్యానిస్తూ ఉంది. ఆమెను తలచుకొంటూ ఉంటే నాకు జాలివేస్తున్నది. ఆ సుశ్రోణిని, ఆ మహాపతివ్రతను రావణాసురుడు ఇట్లా ఎంత నిర్బంధించినప్పటికిన్నీ, నహుషుడు ఎంత నిర్బంధించినప్పటికిన్నీ అనన్యచిత్తముతో ఆ పురందరుణ్ణి ధ్యానించిన శచీదేవివలె ఆ వైదేహి సర్వాత్మనా రాముణ్ణే ధ్యానము చేస్తూ ఉంది. ఆనాడు ఏ చీర కట్టుకొన్నదో, ఆ చీరతోనే నేటికిన్నీ ఉంది. దుమ్ముకొట్టుకొని మనోవ్యథతోనూ, దీనురాలు అయి నిరంతరమూ భర్తను ఎదురుచూస్తూ ఉంది. రావణాసురుడు అంతటి మహాపరాధము చేసినప్పటికిన్నీ సీతాదేవి తన పాతివ్రత్య ప్రభావముతో వాడిని నాశనము చేసివేయలేదు.

ఆమెను నిర్బంధించటమునుంచే ఆ రావణాసురుడి తపోమహిమ అంతా నశించి పోయింది. ఆమె పాతివ్రత్య మహిమ ఆ రావణాసురుణ్ణి నాశనము చేసివేయడానికి ఎవరికి అయినా ఉపయోగిస్తుంది. రాముడు వచ్చి రావణాసురుణ్ణి చంపడము నిమిత్తమాత్రము. ఆ సీతాదేవి సహజముగా సన్నటిది. రామవియోగమునుంచి కృశించి మరింత సన్నపడిపోయి ఉంది. పాడ్యమినాడు చదివినవాడి చదువువలె ఆమె సన్నగిల్లి పోయింది. ఆ మహాభాగ ఇప్పుడు శోకపరాయణగా ఉంది. ఇకను ఇప్పుడు మనము ఏమి ప్రతీకారము చేయవలెనో నిశ్చయించవలసింది" అని హనుమంతుడు చెప్పినాడు.

60

హనుమంతుడు చెప్పింది అంతా విని అంగదుడు, "ఓ వానరులారా! మనము సీతాదేవిని చూచి ఆమెను తీసుకొనిపోకుండా రామప్రభువు దగ్గరకు పోవడము అయుక్తము అయిన పని. మీరు అందరూ పరమపరాక్రమవంతులు అని ప్రసిద్ధికెక్కినారు. 'మేము సీతాదేవిని చూచినాము కాని ఆమెను తీసుకొని రాలేదు' అని చెప్పడము కూడా అయుక్తముగానే కనబడుతున్నది.

"ఓ వానరసత్తములారా! ముల్లోకాలలో ఉన్న దేవతలలో కానీ, దైత్యులలో కానీ ఎగిరిపోవడములో మనతో సరిసమానము అయినవాడు ఎవడూ లేడు. అంతేకాదు, మనతో సరిసమానమైన పరాక్రమవంతుడు ఎవడూ లేడు. రాక్షసవీరులను అందరినీ హనుమంతుడే హతమార్చి వేసినాడు. ఇకను మనము అక్కడ చేయవలసింది ఏమీలేదు. కాబట్టి మనము అందరమూ లంకాపట్టణానికి పోయి సీతాదేవిని తీసుకొని రామప్రభువు సన్నిధికి పోదాము" అన్నాడు.

ఇట్లా అంగదుడు చెప్పిన మాటలు జాంబవంతుడు విన్నాడు. అంగదుడి ఉత్సాహానికి సంతోషించినాడు. అయితే అతడు కార్యాకార్యవిచక్షణా జ్ఞానము కలవాడు. అంతట అర్థవంతముగా, "ఓ యువరాజా! నీవు చెప్పింది బాగానే ఉంది. కాని రామప్రభువు కార్యసిద్ధికి ఎట్లా ఆజ్ఞాపించినాడో అట్లా మనము చేయవలెను. కాని మనము మన చిత్తము వచ్చినట్టు చేయకూడదు" అని జాంబవంతుడు చెప్పినాడు.

61

మధువనమును ధ్వంసము చేయుట

జాంబవంతుడు చెప్పిన మాటను అంగదుడూ, హనుమంతుడూ, మొదలు అయిన వానరవీరులు అందరూ శిరసావహించినారు.

అంతట ఆ వానరవీరులు అందరూ పరమసంతోషముతో ఆ మహేంద్ర పర్వతముమీదినుంచి హనుమంతుడి వెనుక బయలుదేరినారు. మేరు మందర పర్వతాలవలెనూ, మదపుటేనుగులవలెనూ వాండ్లు అందరూ మహాకాయులు. మహాబలవంతులు. ఆకాశాన్ని ఆచ్ఛాదించి ఆ ధైర్యవంతుణ్ణి, ఆ మహాబలవంతుణ్ణి, ఆ మహా వేగవంతుణ్ణి, సమస్త భూతకోటీ పూజించే ఆ వాయుపుత్రుణ్ణి హనుమంతుణ్ణి తదేకముగా చూస్తూ, తమ చూపులతో త్రోసుకొనిపోతూ ఉన్నట్టు ముందుకు సాగిపోయినారు. వాండ్లు అందరూ రామకార్యము సాధించి పరమ యశస్సు సంపాదించుకోవలెను అనుకొన్నారు. తాము వచ్చిన పని నెరవేరినందువల్ల ఆ యా దిక్కులలో వెదుకబోయిన తక్కిన వానరవీరులకన్నా తామే అధికులము అనుకొని సంతోషపడ్డారు. అందరూ యుద్ధకాంక్షులు అయినారు. సుగ్రీవుడికి చేసిన ఉపకారానికి వారు అందరూ రాముడికి ప్రత్యుపకారము చేయ నిశ్చయించుకొన్నారు. సీతాదేవిని చూచిన సంతోషవార్త చెప్పడానికి వాండ్లు అందరూ అభిముఖులు అయినారు.

అట్లా ఆ వానరులు అందరూ ఆకాశములో ఎగిరిపోతూ దేవేంద్రుడి నందనోద్యానమువలె భూమిమీద నానావిధవృక్షాలతోనూ, లతలతోనూ ఉన్న వనాన్ని చూచినారు. అది సుగ్రీవుడి మధువనము. ప్రాణికోటిలో ఎవరున్నూ దానివంక తేరిపార చూడటానికి అయినా అలవికాకుండా సర్వభూత మనోహరము అయిన ఆ మధువనాన్ని సుగ్రీవుడి మేనమామ దధిముఖుడు అనే మహాపరాక్రమవంతుడు కాపాడుతున్నాడు. ఆ మధువనాన్ని చూడగానే మధుపింగళ వర్ణముతో ఉన్న ఆ వానరులకు అందరికిన్నీ ఆ వనములో మధువును తాగవలెను అనే బుద్ధి పుట్టింది. అందుకు అనుమతించవలసింది అని అంగదుణ్ణి యాచించినారు. అంగదుడు జాంబవంతుడు మొదలు అయిన వానర వృద్ధులతో చెప్పి ఒప్పించి వానరులు అందరూ ఆ మధువు తాగడానికి అనుమతించినాడు. సంతోషముతో ఓలలాడుతూఉన్న ఆ వానరులు అందరూ అంగదుడు అనుమతించినందుకు మరింత సంతోషముతో ఎగిరి గంతులు వేసినారు.

అప్పుడు ఆ వానరులలో కొందరు పాటలు పాడినారు. కొందరు నృత్యము చేసినారు. కొందరు దండాలు పెట్టినారు. కొందరు పెద్దపెట్టున నవ్వినారు. కొందరు ఎగిరి దూకినారు. కొందరు పరుగులెత్తినారు. కొందరు కేకలు వేసినారు. కొందరు ఒకళ్ళను ఒకళ్ళు కలుసుకొన్నారు. కొందరు ఒకళ్ళను ఒకళ్ళు పట్టుకొన్నారు. కొందరు ఒకళ్ళతో ఒకళ్ళు రహస్యము చెప్పుకొన్నారు. కొందరు ఒకళ్ళతో ఒకళ్ళు ఆడుకొన్నారు. కొందరు ఒక చెట్టుమీదనుంచి ఇంకొక చెట్టుమీదికి ఎగిరి పోయినారు. కొందరు చిటారుకొమ్మలమీదినుంచి కిందికి దూకినారు. కొందరు నేలమీదనుంచి పెద్దపెద్ద ఎత్తు అయిన చెట్లమీదికి ఎగిరినారు.

ఒకడు పాటలు పాడుతూ ఉంటే, ఒకడు పకపక నవ్వుతూ పోయి వాడిమీద పడ్డాడు. ఒకడు నవ్వుతూ ఉంటే, మరి ఒకడు అంతకన్నా ఎక్కువగా నవ్వుతూ పోయి వాడిమీద పడ్డాడు. ఒకడు ఏడుస్తూ ఉంటే, మరి ఒకడు పాటలు పాడుతూ వచ్చి వాణ్ణి పడతోసినాడు. ఒకడు ఒకణ్ణి తోస్తూ ఉంటే, మరి ఒకడు వచ్చి వాండ్లమీద పడి కేకలు పెట్టినాడు.

ఆ వానరులు అందరూ అత్యుత్కటముగా మధుపానము చేసినారు. నానా పిచ్చిచేష్టలు చేయటము మొదలు పెట్టినారు. వారిలో మధువు తాగి మత్తు ఎక్కనివాడు ఎవడూలేడు. అట్లా మత్తు ఎక్కేట్లు తాగినప్పటికిన్నీ, వారిలో తృప్తుడు అయినవాడు ఒక్కడున్నూ లేడు. అట్లా మధుపానముచేస్తూ ఆ వనములో ఉన్న చెట్లనూ, ఆకులనూ, పూవులనూ ధ్వంసము చేసివేస్తూ ఉన్న వానరులను ఆ వనాన్ని కాపాడుతూఉన్న దధిముఖుడు వచ్చి నివారించబోయినాడు. వాండ్లు సంతోషాతిశయముతో ఆ దధిముఖుణ్ణి తిరస్కరించినారు.

అయినప్పటికిన్నీ ఆ వృద్ధుడు, ఆ ఉగ్రతేజుడు దధిముఖుడు ఆ వనాన్ని కాపాడటానికి ప్రయత్నము చేసినాడు. అతడు కొందరిని తిట్టినాడు. కొందరిని అరచేతులతో చరచినాడు. కొందరితో పోట్లాడినాడు. కొందరిని మంచిమాటలతో వేడుకొన్నాడు. అట్లా ఆ దధిముఖుడు ఆ వానరులను అడ్డగిస్తూఉంటే వాండ్లు అందరూ అతని చుట్టూ మూగి నానామాటలూ అంటూ తాము చేస్తున్నది తప్పు అనుకోకుండా అతణ్ణి అవతలికి ఈడ్చినారు. వాండ్లు అందరూ మత్తులో ఉన్నారు. ఆ దధిముఖుణ్ణి గోళ్ళతో రక్కుతూనూ, పళ్ళతో కొరుకుతూనూ, అరచేతులతో చరుస్తూనూ, కాళ్ళతో తన్నుతూనూ ఆ మధువనములో ఉన్న తేనెను అంతా తాగివేయడమే కాకుండా పండ్లు మొదలు అయిన భోజ్యపదార్థాలను అన్నిటినీ కాజేసినారు.

62

అప్పుడు ఆ వానరశ్రేష్ఠుడు హనుమంతుడు, "ఓ వానరవీరులారా! మీరు మనస్సులో భయపడవద్దు. తేనె తాగండి. మిమ్ములను తేనె తాగనీయకుండా మీ మీదికి వచ్చేవారిని నేను అడ్డగిస్తాను" అని వానరులు అందరితోనూ చెప్పినాడు. ఆ మాటలు అంగదుడు విని ప్రసన్న హృదయముతో, "వానరులు తేనె తాగవలసిందే. హనుమంతుడు పని సాధించుకొని వచ్చినాడు. అతడు ఇప్పుడు అకార్యము చేయమన్నా చేయవలసిందే. నేను అవశ్యమూ అంగీకరిస్తున్నాను. మరి ఇప్పుడు హనుమంతుడు చేయమన్నది మంచి పనేను" అన్నాడు.

అంగదుడి నోటిలోనుంచి ఈమాటలు వచ్చి రావడముతో "భలే భలే" అంటూ వానరులు అందరూ పరమసంతోషముతో ఎగిరి గంతులు వేసినారు. అంగదుణ్ణి మెచ్చుకొన్నారు. మహావృక్షాలను ముంచివేసే నదీప్రవాహమువలె వానరులు అందరూ ఆ మధువనముమీద పడ్డారు. అక్కడ ఉన్న కావలివాండ్లను తోసివేసినారు. హనుమంతుడు సీతాదేవిని చూచి మాట్లాడి వచ్చినాడు అనే సంతోషముతోనూ, అంగదుడు మధువును తాగడానికి అనుమతించినాడు అనే సంతోషముతోనూ ఆ మధువనములో తేనెను అంతా తాగడము మొదలు పెట్టినారు. అడ్డగించిన కావలివాండ్లను అందరినీ పట్టుకొని కొట్టి కట్టివేసినారు. తేనెతుట్టెలను రెండు చేతులతో పట్టుకొని ఒక్కొక్కరు ద్రోణము ద్రోణము (కుండెడు కుండెడు) తేనెను తాగినారు. తాగినంత తేనె తాగి మిగతా తేనెను నేలపాలు చేసినారు. కొందరు తేనె తాగిన తరువాత ఆ తేనెతుట్టెలను అవతల పారవేసినారు. కొందరు ఆ తేనెతుట్టెలను ఒకరిమీద ఒకరు వేసి కొట్టినారు. తేనెతాగి మత్తు ఎక్కిన కొందరు చెట్లకొమ్మలు పట్టుకొని కూర్చున్నారు. మత్తు ఎక్కిన కొందరు చెట్లఆకులు పరచుకొని పడుకొన్నారు. కొందరు సంతోషాతిశయముతో ఒకరు ఒకరిని తోస్తూ పిచ్చెత్తినవాండ్లవలె ప్రవర్తించినారు. కొందరు తప్పటడుగులు వేస్తూ నడవలేకపోయినారు. తేనె తాగిన మత్తు ఎక్కినందువల్ల కొందరు సింహనాదాలు చేసినారు. కొందరు పక్షుల కూతలు పెట్టినారు. ఆ మత్తులో కొందరు నేలమీదపడి నిద్రపోయినారు. అప్పుడు కొందరు చేయకూడనిపని చేసినారు. కొందరు అంతకన్నా చేయకూడనిపని చేసినారు. ఇంకా కొందరు ఒక చేయకూడనిపని చేసి తాము అటువంటి పని చేసినాము అని చెప్పినారు. చేయరాని పనిని ఇంకా ఇట్లా చేయవచ్చును అని మరికొందరు అనుకొన్నారు.

ఆ భయంకరాకారులు, ఆ వానర వీరులు ఆ మధువనము కావలివాండ్లను కొట్టి నానాబాధలూ పెట్టినారు. ఆ బాధలకు నిలువలేక కావలివాండ్లు కొందరు దశదిశలా పారిపోయినారు. కొంతమంది కావలివాండ్లకు ఆ వానర వీరులు తమ అపానద్వారాలను చూపించి అవమానించడమే కాకుండా వాండ్లను మోకాళ్ళ మీద దేకించినారు. ఆ కావలివాండ్లు పరమ దుఃఖముతో దధిముఖుడి దగ్గరకుపోయి హనుమంతుడు వరము ఇచ్చినందువల్ల వానర వీరులు అందరూ మధువనములో చొరపడడమూ, నానా దుష్టచేష్టలూ చేయడమూ, తమను అవమానించడమూ విన్నవించినారు. దధిముఖుడు మంచి మాటలతో ఆ కావలివాండ్లను అందరినీ ఓదార్చినాడు. మధువనాన్ని అట్లా పాడుచేసినందుకు క్రుద్ధుడు అయిపోయి, "మీరు నా వెంట రండి. మనము అందరమూ పోదాము. మదము ఎక్కి మధువును తాగిన

ఆ వానర వీరులను అందరినీ మనము మన బలముతో వెళ్ళకొట్టుదాము" అని దధిముఖుడు అన్నాడు.

తమ ఏలిక అభిప్రాయాన్ని మనస్సులో ఉంచుకొని ఏపైన చెట్లనూ, తాటిచెట్లనూ, ఇంకా ఇతరచెట్లనూ, పర్వతాలనూ పెళ్ళగించి ఆయుధాలుగా పట్టుకొని ఆ కావలివాండ్లు మధువనములో అంగదాదులు ఉన్న చోటికి పరుగెత్తినారు. వారి మధ్యను ఉన్న దధిముఖుడున్నూ ఒక వృక్షాన్ని ఇట్టే పెళ్ళగించి చేతిలో పట్టుకొని ఆ కపికుంజరులను ఎదిరించ పోయినాడు. మదము ఎక్కి చెట్లమీదనూ, నేలమీదనూ పడిఉన్న ఆ వానర వీరులను ఎదుర్కొన్నారు.

ఆ వనపాలకుల మధ్యను చెట్టును చేతిలో పట్టుకొని పరుగెత్తుకొని వస్తూవున్న దధిముఖుణ్ణి అప్పుడు అంగదుడు చూచినాడు. ఎదురుగుండా పోయి తన రెండు చేతులా ఆ దధిముఖుణ్ణి కొట్టినాడు. మదాంధుడు అయినందువల్ల ఆ కొట్టింది తన తాతను అనే జ్ఞానము అంగదుడికి లేకపోయింది. అంతటితో పోనీయకుండా ఆ దధిముఖుణ్ణి నేలమీద పడతోసి కుమ్మినాడు. దధిముఖుడి బాహువులూ, భుజాలూ, ఊరువులూ గాయాలు అయినవి. నెత్తురుతో తడిసిపోయినాడు. మూర్ఛపోయినాడు. వెంటనే తెప్పరిల్లినాడు. అప్పుడు ఆ కపికుంజరుడు దధిముఖుడు ఒక దండము తీసుకొని తేనెతాగి మత్తు ఎక్కి ఒండ్లు తెలియకుండా ఉన్న వానర వీరులను తరుముతూ ఎట్లాగో వారిని తప్పించుకొని బయటపడ్డాడు. వెంట ఉన్న కావలివాండ్లను చూచి, "ఈ అంగదాదులను ఇక్కడనే పడిఉండ నిద్దాము. మన ఏలిక అయిన సుగ్రీవుడి దగ్గరకు పోదాము. అతడు ఇప్పుడు రాముడితో కూడా ఉన్నాడు. తప్పు అంతా అంగదుడిదేను అని ఆయనకు తెలియచెప్పుదాము. ఆయనకే కోపము వచ్చి వీండ్లను అందరినీ చంపివేస్తాడు. ఇది పితృపితామహము అయిన మధువనము. ఇంతవరకూ దేవతలకు అయినా చౌరనలవి కాకుండా ఉంది. ఈ మధువనము అంటే మన రాజు సుగ్రీవుడికి ఎంతో ఇష్టము. ఇట్లా మధులుబ్ధులు అయిన ఈ వానరులను అందరినీ ఆ సుగ్రీవుడే దండిస్తాడు. వీండ్లు రాజాజ్ఞను తిరస్కరించినారు. దుర్మార్గులు. వీండ్లను చంపివేస్తే మన కోపము పోతుంది" అని చెప్పి దధిముఖుడు భృత్యులతో కూడ ఆకాశానికి ఎగిరినాడు. సుగ్రీవుడు ఉన్న చోటుకి ఒక నిమిషములో పోయినాడు.

అక్కడ రామలక్ష్మణులనూ, సుగ్రీవుణ్ణీ చూచి దధిముఖుడు ఆకాశము నుంచి మిట్టపల్లాలు లేని సమభూమి మీదికి దిగినాడు. ఆ మహా పరాక్రమవంతుడు దధిముఖుడు తన భృత్యులను అందరినీ వెంటపెట్టుకొని దీనవదనముతో చేతులు జోడించి సుగ్రీవుడి పాదాలకు నమస్కారము చేసినాడు.

63

సుగ్రీవుడు తనకు అట్లా సాష్టాంగ నమస్కారము చేసిన తన మేనమామను మహాపరాక్రమవంతుణ్ణి దధిముఖుణ్ణి చూచి భయపడి పోయి, "ఓ వీరుడా! లే, లే, నా పాదాలు పట్టుకున్నావు ఏమిటి! నీకు నేను అభయము ఇస్తున్నాను. ఇక చెప్పు" అంటూ లేవతీసినాడు.

సుగ్రీవుడు అభయము ఇచ్చినందువల్ల ఆ మహాప్రాజ్ఞుడు దధిముఖుడు "ఓ రాజా! నీ తండ్రి ఋక్షరజుడి కాలములోకానీ, నీ అన్న వాలి కాలములోకానీ, నీవు గద్దె యెక్కిన తరువాత ఇంతవరకూకానీ మధువనము ఎవరికి అయినా చొర నలవికాకుండా ఉంది. అటువంటి నీ మధువనములోకి అంగదాది వానరవీరులు నిర్భయముగా వచ్చినారు. కావలివాండ్లను అందరినీ బెదిరించి పట్టుకొని కొట్టినారు. యథేష్టముగా మధుపానము చేసినారు. వారిలో కొంతమంది తాగినంత తాగి మిగతాది నేలమీద పారబోసినారు. ఈ కావలివాండ్లు అడ్డగిస్తే వాండ్లు కనుబొమ్మలు ఎగరవేసినారు. బెదిరించినారు. వాండ్లకు కోపము వచ్చి కన్నులు ఎర్రచేసి ఈ కావలివాండ్లను కొట్టి తరిమివేసినారు. కొందరిని చేతులమీద కొట్టినారు. కొందరిని మోకాళ్ళమీద కొట్టినారు. కొందరిని లేవనెత్తి తలక్రిందులుచేసి వాండ్ల వాండ్ల పశ్చిమ ద్వారాలను చూచేట్టు చేసినారు.

"ఓ సుగ్రీవుడా! నీవు ఇక్కడ ప్రభువు అయి ఉండగా అంగదాది వీరులు వనపాలకులను ఇట్లా కొట్టినారు. యథేష్టముగా మధుపానము చేసినారు. పండ్లను అన్నిటినీ తినివేసినారు. మధువనాన్ని అంతా నాశనము చేసినారు."

సుగ్రీవుడితో దధిముఖుడు విన్నవించుకోవటము అంతా చూస్తూ వున్న మహాప్రాజ్ఞుడూ, పరవీరహంతా అయిన లక్ష్మణుడు, "ఓ సుగ్రీవుడా! మధువనపాలకుడు ఈ దధిముఖుడు ఎందుకు ఇక్కడికి వచ్చినాడు? ఎందుకు ఇంత దుఃఖపడుతున్నాడు? నీతో ఏమి చెప్పుతున్నాడు" అని అడిగినాడు.

ఆ వాక్యవిశారదుడు సుగ్రీవుడు లక్ష్మణుడితో, "ఓ పూజ్యుడా! సీతాదేవిని దక్షిణ దిక్కున వెదకపోయిన అంగదాది వానరవీరులు వచ్చి మధువనములో ప్రవేశించి మధువును అంతా తాగివేసినారు అని ఈ దధిముఖుడు చెప్పుతున్నాడు. వాండ్లు, ఆ అంగదాది వానరవీరులు వచ్చీ రావడముతో మధువనాన్ని ఆక్రమించుకొన్నారు. దొరికిన తేనెను అంతా తాగి, పండ్లను అన్నిటినీ తిని, చెట్లను విరిచివేసి మధువనాన్ని ధ్వంసము చేసినారట.

"అంగదాది వీరులు కృతకృత్యులు అయివుంటారు. అట్లా కాకపోయినట్లయితే వాండ్లు అటువంటి సాహసము చేసి ఉండరు. వాండ్లు కార్యము సాధించుకొని వచ్చి

ఉంటారు. సందేహము లేదు. హనుమంతుడు సీతాదేవిని చూచి ఉంటాడు. అతడు అంతటి సమర్థుడు. కార్యసాధన సామర్థ్యమూ, బుద్ధిబలమూ, ఉత్సాహమూ, పరాక్రమమూ, విద్యా అనే అయిదున్నూ హనుమంతుడిలో నెలకొని ఉన్నవి. అంతేకాకుండా ఏ పని ఎట్లా చేయవలసిందీ చెప్పటానికి జాంబవంతుణ్ణి మించినవాడు మరి ఒకడు ఎవడూ ఈ జగత్తులో లేడు. అంగదుడు అమితపరాక్రమవంతుడు. వారి యిద్దరి తోడ్పాటుతో హనుమంతుడు ఏపని అయినా సాధించి తీరకలడు.

"అంగదాది వానరవీరులు సంతోషాతిశయముతో మధువనములోకి పోయి మధుపానము చేసి ఉంటారు. మత్తుఎక్కి ఒళ్ళు తెలియక మధువనాన్ని పాడుచేసి ఉంటారు. అందువల్లనే వనపాలకులు నివారించపోతే వాండ్లు అందరూ ఏకము అయి కొట్టి ఉంటారు. ఈ దధిముఖుడు మహాపరాక్రమశాలి అని ప్రసిద్ధికెక్కినాడు. ఎంతో మధురముగా మాట్లాడుతాడు. ఇతణ్ణికూడా వాండ్లు లక్ష్యము చేయలేదు. అందువల్ల ఆ వానరవీరులు అందరూ చేసింది చెప్పడానికి ఈయన ఇక్కడికి వచ్చినాడు.

"ఓ మహాబాహూ! సీతాదేవి వాండ్లకు కనబడి ఉంటుంది. లేకపోతే వానరవీరులు అట్లా చేయరు. అంత నిర్భయముగా వాండ్లు మధువనములోకి పోయి అట్లా యథేష్టముగా తేనె త్రాగరు. ఆ మధువనాన్ని బ్రహ్మదేవుడు మా పూర్వీకులకు వరముగా ఇచ్చినాడు. ఆ వనములోకి పోయిన వానరవీరులు అందరూ బుద్ధిమంతులు, పరాక్రమవంతులు అని ప్రసిద్ధికెక్కినారు. వాండ్లు సీతాదేవిని చూడకపోయినట్లయితే ఆ వనములోకి పోనేపోరు. దానిని పాడుచేసి ఉండరు" అని చెప్పినాడు.

శ్రవణమనోహరము అయిన ఆ మాటలు విని రామలక్ష్మణులు సంతోష పడ్డారు.

అప్పుడు సుగ్రీవుడు దధిముఖుణ్ణి చూచి, "ఓ దధిముఖుడా! ఆ వానరవీరులు కృతకృత్యులు అయి వచ్చి వుంటారు. అందువల్ల వాండ్లు మధువనములో ప్రవేశించి మధువు త్రాగినారు. అందుకు నాకు సంతోషముగా ఉంది. వాండ్ల చేష్టలను నేను క్షమించవలసివుంది. హనుమంతుడు మొదలు అయిన వానర వీరులు సింహాలవంటి దర్పము కలవాండ్లు. బలము కలవాండ్లు. సీతాదేవిని చూచి వాండ్లు కృతార్థులు అయి ఉంటారు. రామలక్ష్మణులూ, నేనూ వాండ్లను వెంటనే చూడవలెను. నీవు పోయి వాండ్లను పంపించు" అని చెప్పినాడు.

సంతోషముతో సుగ్రీవుడి కన్నులు వికసించినవి. దేహము పులకలెత్తింది. రామలక్ష్మణులను చూచినాడు. సంతోషముతో తన దేహము గగుర్పొడిచినందువల్ల కార్యసిద్ధి హస్తగతము అయింది అనుకొన్నాడు. సంతోషపడ్డాడు.

64

సుగ్రీవుడు చెప్పింది దధిముఖుడు విన్నాడు. సంతుష్టుడు అయినాడు. అప్పుడు ఆ మహాబలవంతులకు రామలక్ష్మణులకూ, సుగ్రీవుడికీ నమస్కారము చేసినాడు. తనవెంట వచ్చిన శూరులతో ఆకాశానికి ఎగిరినాడు. ఎంతత్వరగా వచ్చినాడో అంతత్వరగా ఆకాశమార్గాన పోయి మధువనములో దిగినాడు.

అప్పుడు వానరవీరులు అందరూ మత్తువదలిపోయి తేనెవంటి మూత్రాన్ని విసర్జించడము చూచినాడు. వారిదగ్గరకు పోయి చేతులు జోడించి, అంగదుణ్ణి చూచి సంతోషముతో మనోహరముగా, "ఓ యువరాజా! కావలివాండ్లు మిమ్ములను అడ్డగించినారు అనే కోపము వద్దు. అజ్ఞానమువల్ల కోపము వచ్చి వాండ్లు అట్లా చేసినారు. ఓ బలవంతుడా! నీవు యువరాజువు అనీ, ఈ మధువనానికి నీవే ప్రభువు అనీ తెలియక వాండ్లు అపరాధము అట్లా చేసినారు. నీవు క్షమించవలెను.

"ఓ పుణ్యాత్ముడా! నేను పోయి నీ పినతండ్రి సుగ్రీవుడితో నీవు వానరవీరులతో ఇక్కడికి వచ్చినావు అనీ, ఈ వానరవీరులు అందరూ ఈ మధువనాన్ని ధ్వంసము చేసినారు అనీ చెప్పినాను. ఆయనకు కోపము రాలేదు. సంతోషపడ్డాడు. మిమ్ములను అందరినీ వెంటనే తన దగ్గరకు పంపించి వేయవలసింది అని సుగ్రీవుడు నాతో చెప్పినాడు" అని విన్నవించుకొన్నాడు.

ఇట్లా మధురముగా దధిముఖుడు చెప్పింది విని అంగదుడు వానరవీరులు అందరినీ చూచి, "ఓ పరంతపులారా! మన వృత్తాంతము రాముడికి తెలిసింది. మనము పోయిన పని సాధించుకొని వచ్చినాము. కనుక ఇకను ఇక్కడ ఉండడము మంచిదికాదు. మీరు అందరూ యథేష్టముగా మధుపానము చేసినారు. మీ అలసట పోగొట్టుకొన్నారు. ఇకను ఇక్కడ మనము చేయవలసింది ఏమీ లేదు. మనము అందరమూ ఇప్పుడు సుగ్రీవుడి దగ్గరకు పోవలెను.

"ఓ వీరులారా! మీరు అందరూ చెప్పినట్లు చేస్తాను. నేను స్వతంత్రుణ్ణికాను. నేను యువరాజును అయినప్పటికిన్నీ స్వామికార్యము సాధించుకొని వచ్చిన హనుమంతుణ్ణీ, మిమ్ములనూ ఎదిరించి నా ఇష్టము వచ్చినట్టు ఆజ్ఞాపించడము అయుక్తము" అని చెప్పినాడు.

అంగదుడు ఇంత వినయముతో చెప్పినందుకు వానరవీరులు అందరూ సంతోషపడ్డారు. అప్పుడు హనుమంతుడు అంగదుణ్ణి చూచి, "ఓ వానరా! నీవు మా యువరాజువు. నిజముగా నీవు మా రాజువు. కాబట్టే ఇంత చక్కగా చెప్పకలిగినావు. మరి ఒకడు అయినట్లయితే ఐశ్వర్యమదముతో మమ్ములను ఆజ్ఞాపించి ఉండేవాడు.

నీవు చెప్పినట్లుగా చెప్పడము నీకే తగిపోయింది. ఇటువంటి అణకువ మరి ఒకడికి ఉండదు. నీ ఈ వినయము భవిష్యత్తులో నీకు శుభాన్ని ఇస్తుంది.

"ఓ యువరాజా! మన ఏలికదగ్గిరకు పోవడానికి మేము అందరమూ సంసిద్ధముగా ఉన్నాము. ఈ వానరులు ఎవరున్నూ నీ ఆజ్ఞలేనిదే ఒక్క అడుగు అయినా అవతలకు వేయడానికి వీలులేదు. నిజము నేను చెప్పుతున్నాను" అన్నాడు.

హనుమంతుడు ఇట్లా చెప్పిచెప్పడముతో, "మంచిది, బయలుదేరుదాము" అని అంగదుడు అన్నాడు. అంతట ఆ మహాబలవంతులు అందరూ ఆకాశానికి ఎగిరినారు. అప్పుడు ఆ వానరులు అందరూ యంత్రాలతో ఎగరకొట్టిన పర్వతాలవలె ఆకాశమార్గాన కనిపించినారు. వారు అందరూ గాలికి అమితవేగముతో పరుగులెత్తే మేఘాలవలె ఆకాశములో పోతూ మహానాదము చేసినారు.

అంగదాదులు అక్కడికి చేరక పూర్వము దుఃఖముతో బాధపడుతూ ఉన్న ఆ కమలలోచనుణ్ణి రాముణ్ణి చూచి సుగ్రీవుడు, "ప్రభూ! ఊరడిల్లు. నీకు శుభం అవుతుంది. వానరవీరులు సీతాదేవిని చూచి ఉంటారు. సందేహము లేదు. సీతాదేవినే చూచి ఉండకపోయినట్లయితే నేను పెట్టిన గడువుకాలము అయిపోయిన తరువాత వారు ఎవ్వరున్నూ ఎంత మాత్రమూ నాదగ్గరకు తిరిగివచ్చేవారుకారు. యువరాజు అయిన అంగదుడు ఎగిరిపోయేవాండ్లలో శ్రేష్ఠుడు. వాడు ఈ కార్యము సాధించక పోయినట్లయితే నా దగ్గరకు ఎంతమాత్రమూ తిరిగిరాడు. ఒకవేళ స్వామికార్యము సాధించకుండానే తిరిగివస్తూ వానరులు అందరూ మధువనాన్ని పాడుచేయడానికి పూనుకుంటే అంగదుడు కలవరపడి పోయేవాడు. అప్పుడు ఏమి చేసిఉండేవాడో! మా తండ్రి తాతలనాటి నుంచీ ఎంతో జాగ్రత్తగా ఆ మధువనాన్ని కాపాడుతూఉన్న సంగతి అంగదుడికి తెలుసును. సంతోషముతోనే లేకపోయినట్లయితే మధువనాన్ని ఏమాత్రమూ పాడుచేయనిచ్చేవాడు కాదు.

"ఓ ప్రభూ! ఊరడిల్లు. నీవు సువ్రతుడవు. కౌసల్యాదేవి కడుపుచల్లగా పుట్టినావు. సీతాదేవిని హనుమంతుడే చూచి ఉంటాడు. అంతటి మహాకార్యము అతడివల్ల తప్ప మరి ఒకడివల్ల కాదు. ఇటువంటి పనులు చేయడానికి హనుమంతుడు ఒక్కడే సమర్థుడు. సూర్యుడిలో తేజస్సువలె కార్యసిద్ధీ, బుద్ధీ, ప్రయత్నమూ, పరాక్రమమూ హనుమంతుడిలో సుస్థిరముగా ఉన్నవి. జాంబవంతుడు మంత్రిగానూ, అంగదుడు సేనా నాయకుడుగానూ, హనుమంతుడు కార్యనిర్వాహకుడుగానూ పని చేసేట్లయితే ఎటువంటి దుర్ఘటకార్యము అయినా అయి తీరుతుంది. మరిఒక విధముగా ఎన్నటికీ కాదు. ప్రభూ! నీవు ఇప్పుడు ఈ విషయాన్ని గురించి చింతించవద్దు" అని చెప్పినాడు.

ఇట్లా సుగ్రీవుడు రాముడితో చెప్పుతూ ఉండగా వానరవీరులు ప్రస్రవణపర్వత సమీపానికి వచ్చినారు. హనుమంతుడి సాహస కృత్యానికి ఆ వానరవీరులు అందరూ గర్వాతిశయముతోనూ, తమకు కార్యసిద్ధి అయింది అని తెలియచేయడానికిన్నీ గంభీరముగా గర్జనలు చేసినారు.

ఆ వానరవీరుల సింహనాదాలు, సుగ్రీవుడు విన్నాడు. ఆ కపిసత్తముడు సంతోషముతో ఉప్పొంగిపోయినాడు. తోకను పొడుగు చేసినాడు.

అప్పుడు అంగదుడూ, హనుమంతుడూ వానరవీరులను అందరినీ వెంటబెట్టుకొని రామదర్శనము చేయడానికి వచ్చినారు. ఆ మహాబాహువు హనుమంతుడు రాముడికి శిరసా నమస్కారము చేసి, "ప్రభూ! సీతాదేవి పాతివ్రత్య నియమముతో తేజరిల్లుతూ ఉంది" అని చెప్పినాడు. ఆ మాటకు లక్ష్మణుడూ, సుగ్రీవుడూ సంతోషముతో ఉప్పొంగిపోయినారు. ఆ హనుమంతుణ్ణి మెచ్చుకొంటూ చూచినారు.

65

సీతతో తన సంభాషణ హనుమ రామునికి చెప్పుట

ఇప్పుడు ఆ పరవీరహంత రాముడు అత్యంత సంతోషముతోనూ, ఎంతో గౌరవముతోనూ హనుమంతుణ్ణి మెచ్చుకొంటూ చూచినాడు.

సీతాదేవి క్షేమముగా ఉంది అని వినగానే రాముడు వానర వీరులను చూచి, "ఓ వానరులారా! సీతాదేవి ఎక్కడ ఉంది? నన్ను గురించి ఏమి అనుకొంటున్నది? నాకు వివరముగా చెప్పండి" అని అడిగినాడు.

సీతాదేవి వృత్తాంతము అంతా తెలుసుకొని వచ్చిన హనుమంతుణ్ణి వివరాలు అన్నీ చెప్పమని ప్రోత్సహించినారు. అప్పుడు ఆ వాక్యజ్ఞుడు మారుతాత్మజుడు సీతాదేవి ఉంటూ ఉన్న దక్షిణ దిక్కుకు తిరిగి ఆమెకు మనసా నమస్కారము చేసి, "ప్రభూ! నేను నూరు యోజనాల సముద్రాన్ని దాటి సీతాదేవిని వెతుకుతూ పోయినాను. ఆ సముద్రము దక్షిణ తీరానికి దక్షిణముగా ఆ దురాత్ముడు రావణాసురుడు నివసిస్తూ ఉన్న లంకాపట్టణము ఉంది. అక్కడ రావణాసురుడి స్వాధీనములో ఉన్న మహాపతివ్రతను, ఆ పరమసౌందర్యవతిని సీతాదేవిని నేను చూచినాను. ఆమె మనస్సు నీమీద పెట్టుకొని బ్రతికి ఉంది. అక్కడ (అశోకవనము అనే) ప్రమదావనములో ఆమె ఉంది. వికారాకారలు అయిన రాక్షసాంగనలు ఆమె చుట్టూ కావలి ఉన్నారు. వాండ్లు మాటిమాటికీ ఆమెను బెదిరిస్తూ ఉన్నారు. నేను చూచినాను. ఎంతమాత్రమూ దుఃఖము అనుభవించకూడని ఆ పతివ్రత అట్లా దుఃఖము అనుభవిస్తూ ఉంది.

రాక్షసాంగనలు ఆమెను కదలనీయకుండా కావలి కాస్తున్నారు. ఆమె తలవెంట్రుకలు అన్నీ ఒకే జడకట్టుకొని పోయినవి. నిరంతరమూ ఆమె నిన్ను ధ్యానిస్తూ ఉంది. కటిక నేలమీద పడుకొంటూ ఉంది. దేహము వివర్ణము అయిపోయి వుంది. హేమంత కాలములో తామరకొలను మాదిరిగా ఆమె కనిపించింది. ఆమె తన మనస్సును ఈషణ్మాత్రమూ ఆ రావణాసురుడి మీదికి పోనీయకుండా నీ మీదనే నిలిపి ఉంచింది. అందువల్ల ఇప్పుడు ఆమె చచ్చిపోవడానికి నిశ్చయించుకొంది. ఎట్లాగో ఎంతో కష్టపడిపోయి వెతికి ఆమెను నేను చూచినాను.

"నేను ఇక్ష్వాకువంశీయులను గురించి కీర్తించడము మొదలు పెట్టినాను. అప్పుడు ఆమె నన్ను నమ్మింది. నేను ఆమెతో అంతట మాట్లాడినాను. ఇక్కడి సమస్త సంగతులూ నేను ఆమెతో చెప్పినాను. ప్రభూ! నీవు సుగ్రీవుడితో స్నేహము చేయడము విని సంతోషపడ్డది. ఆమె పాతివ్రత్యాన్ని గురించీ, ఆమెకు నీ మీద ఉన్న భక్తిని గురించీ నేను ఎంత అని చెప్పేది! ఎంత చెప్పినా తనివి తీరదు.

"ఓ పురుషోత్తమా! నీ మీది భక్తితో మహోగ్రముగా తపస్సు చేస్తూ ఉన్న ఆ మహాభాగను, ఆ జనకనందినిని సీతాదేవిని నేను చూచినాను. ఓ రామప్రభూ! నీవు మహా ప్రాజ్ఞుడవు. చిత్రకూట పర్వతము మీద మీరు ఉంటున్నప్పుడు జరిగిన కాకివృత్తాంతము అంతా చెప్పింది. అంతట ఆమె నన్ను చూచి, "ఓ వాయుపుత్రుడా! నీవు ఆ నరశార్దూలముతో ఇక్కడ చూచింది అంతా చూచినట్టు సుగ్రీవుడి సమక్షములో రామప్రభువుకు విన్నవించు. నేను ఇంతవరకూ అతిజాగ్రత్తగా దాచి ఉంచిన నా చూడామణిని నీకు ఇస్తాను. దానిని నా ప్రభువుకు సమర్పించు. హనుమంతుడా! ఒకనాడు నా నుదుట తిలకము చెరిగిపోయింది. అప్పుడు నా ప్రభువు మణిశిలను బొట్టుగాచేసి నా చెక్కిలిమీద బొట్టుగా నవ్వులాటకు పెట్టినాడు. నీవు అది జ్ఞాపకము తెచ్చుకోమని చెప్పు. కాంతివంతము అయిన ఈ చూడామణిని నేను ఈ దుఃఖములో చూచుకొంటూ, ఆయనను చూస్తూ ఉన్నట్టు భావించుకొంటూ సంతోషిస్తున్నాను. అటువంటి ఈ చూడామణిని ఆయన కోసము పంపించినాను అని చెప్పు. నేను ఇక ఒక మాసమే జీవించి ఉంటాను. ఈ మాసము దాటిన తరువాత ఈ రాక్షసుల అధీనములో నేను జీవించను" అని చెప్పు.

"ఓ ప్రభూ! ఆమె ధర్మము తప్పలేదు. దేహమంతా కృశించిపోయి ఉంది. అట్లా రావణాసురుడి చెరలో ఉన్న ఆమె లేడివలె ఉత్ఫుల్ల నేత్రాలతో చూచింది. ప్రభూ! నీతో ఆమె చెప్పమన్నది అంతా చెప్పివేసినాను. ఇకను ఎట్లాగు అయినా మనము సముద్రాన్ని దాటిపోయే సాధనము ఏమిటో నీవు ఆలోచించవలెను" అన్నాడు.

ఆ మాటలకు రామలక్ష్మణులు కొంచెము ఊరడిల్లినారు అని హనుమంతుడు తెలుసుకొన్నాడు. సీతాదేవి ఇచ్చిన చూడామణిని రాముడికి ఇచ్చినాడు.

66

హనుమంతుడు చెప్పింది అంతా రాముడు లక్ష్మణుడితో కూడా విన్నాడు. అతడు ఇచ్చిన చూడామణిని తన హృదయానికి అద్దుకొన్నాడు. ఏడ్చినాడు. ఆ చూడామణిని చూడగానే ఆయనకు పట్టరాని దుఃఖము వచ్చింది. ఆపుకోలేక పోయినాడు. ఎట్లాగో అణచుకొని కన్నీళ్ళు కారుస్తూ సుగ్రీవుణ్ణి చూచి, "దూడమీద వాత్సల్యమునుంచి ఆవు పాలు చేపుతుంది. అదేవిధముగా ఈ చూడామణిని చూస్తూఉంటే నా హృదయము ద్రవిస్తూ ఉంది. మణిమయము అయిన ఈ చూడామణిని మా మామగారు జనకమహారాజు సీతాదేవికి ఇచ్చినారు. దీనిని ఆమె తన వివాహసమయములో తలలో పెట్టుకొన్నది.

"ఓ సుగ్రీవుడా! జనకమహారాజు ఒకప్పుడు యజ్ఞము చేసినాడు. అందుకు సంతుష్టుడు అయి దేవేంద్రుడు ఈ చూడామణిని ఆయనకు బహుమానముగా ఇచ్చినాడు. దీని మణులు అన్నీ సముద్రగర్భములో ఉద్భవించినవి. దీనిని గొప్పవారు అందరూ మెచ్చుకొన్నారు. ఓ సుగ్రీవుడా! ఈ చూడామణిని చూస్తూఉంటే మా మామగారిని జనకమహారాజునూ, మా తండ్రిగారిని దశరథమహారాజునూ దర్శనము చేస్తూ ఉన్నట్టుగా ఉంది. ఈ చూడామణి నా ప్రియురాలి శిరస్సు మీద ఎప్పుడూ శోభిస్తూ ఉండేది. ఇప్పుడు దీనిని చూస్తూఉంటే నా సీతను చూస్తూ ఉన్నట్టుగా ఉంది.

"ఓ హనుమంతుడా! దాహమువేసిన వాడికి పదేపదే జలముఇచ్చి దాహము తీర్చేటట్టు ఆ వైదేహి ఇంకా ఏమి ఏమి చెప్పిందో మళ్ళీ చెప్పు.

"లక్ష్మణుడా! సీతాదేవిని వదలిపెట్టివచ్చిన ఈ చూడామణిని, అందులో జలోద్భవము అయిన మణులతో ఉన్న ఈ చూడామణిని చూస్తూఉంటే నాకు దుఃఖము వస్తున్నది ఏమిటి? తమ్ముడా! వైదేహి ఒక్కమాసము జీవించి ఉండగలిగేట్లయితే బహుకాలము జీవిస్తుంది. నేను ఇకను ఆ అసితేక్షణ లేకుండా ఒకక్షణము అయినా జీవించి ఉండలేను. ఆ నా ప్రియురాలు ఎక్కడఉందో అక్కడికి నీవు నన్ను తీసుకొనిపో. ఇప్పుడు ఆమె వృత్తాంతము మనకు తెలిసింది. ఇక ఒక క్షణము అయినా నేను ఇక్కడ ఉండలేను. ఆ సుశ్రోణి, ఆ పరమభీరువు నా భార్య సీతాదేవి ఎప్పుడూ భయపెట్టే ఘోరరాక్షసుల మధ్యను

ఎట్లా ఉండకలుగు తుంది ? శరత్కాల శుభచంద్రుణ్ణి మేఘాలు ఆవరించినట్టు ఆమె చుట్టూ రాక్షసులు మూగితే ఆమె ముఖము కళాకాంతులు మాసిపోయి ఉంటుంది. అది నిశ్చయము.

"ఓ హనుమంతుడా! సీత ఏమి చెప్పింది? ఆమె చెప్పింది చెప్పినట్లు నాకు చెప్పు. మందు ఇస్తేనే రోగి బ్రతుకుతాడు. నా సీత చెప్పింది అంతా నీవు చెప్పితేనే నేను బ్రతుకుతాను. ఓ హనుమంతుడా! ఆ మనోహరాంగి నా భామిని మహామనోహరముగా నాతో మాట్లాడుతూ ఉండేది. నన్ను ఎడబాసిన ఆ సుశ్రోణి ఏమి చెప్పిందో నాకు ఇప్పుడు చెప్పు'' అని అడిగినాడు.

67

"ఓ రామప్రభూ! చిత్రకూటపర్వతముమీద జరిగిన వృత్తాంతము సీతాదేవి నాకు ఇట్లా చెప్పింది. ఆమె చెప్పింది చెప్పినట్లుగా చెప్పుతాను, వినవలసింది, సీతాదేవితో కూడ నీవు నిద్రపోతూ ఉండగా ముందుగా ఆమెకు మెలకువ వచ్చింది. అప్పుడు ఒక కాకి వచ్చి ఆమె స్తనాంతరములో గీరింది. అప్పుడు నీవు ఆమె తొడమీద పడుకొని నిద్రపోతున్నావు. ఆ కాకి ఆమెను అట్లా పదే పదే వచ్చి గీరడము మొదలు పెట్టింది. ఆ నెత్తురుకు తడిసి నీవు నిద్ర లేచినావు. సీతాదేవి స్తనాంతరము నుంచి నెత్తురు కారడము నీవు చూసినావు. క్రుద్ధుడవు అయిపోయినావు. తాచుపాము బుసలు కొట్టేట్టు నీవు నిట్టూర్పులు విడుస్తూ, "ఓ భీరూ! నీ స్తనాలకు మధ్య గీరినవాడు ఎవడు? కోపముతో రేగిన అయిదుతలల పాముతో ఆటలాడ తలచుకొన్నవాడు ఎవడు? అని అడుగుతూ చరచరా నాల్గువైపులా చూచి సీతాదేవికి ఎదురుగుండా నెత్తురు మరకలతో ఉన్న కాకిని నీవు చూచినావు. ఆ కాకి దేవేంద్రుడి కొడుకు. పర్వత ప్రాంతాలలో వాయు వేగముతో తిరుగుతూ ఉండేనాడు. ఓ మహాబాహూ! నీవు అప్పుడు కోపముతో కన్నులు ఎర్రచేసినావు. నీకు క్రూరము అయిన ఆలోచన పోయింది. అంతట నీ దర్భాసనములో నుంచి నీవు ఒక దర్భకర్రను తీసి. బ్రహ్మాస్త్రమంత్రముతో అభిమంత్రించి వదిలిపెట్టినావు. అప్పుడు ఆ దర్భకర్ర ప్రళయకాలాగ్ని హోత్రమువలె జ్వలిస్తూ ఆ కాకికి ఎదురుగుండా పోయింది. ఆ కాకిని వెంబడించింది. అంతట ఆ కాకి ముల్లోకాలూ తిరిగింది. తండ్రి అయిన దేవేంద్రుడు ఆ కాకిని కాపాడలేకపోయినాడు. దేవతలూ, మహర్షులూ కూడా ఆ కాకిని కాపాడలేదు. ఎక్కడికి పోయినా కాపాడేవాండ్లు ఎవరూ దానికి కనబడలేదు. అది ఎంతో భయపడిపోయి చివరకు నీ దగ్గరికే చేరింది. నీవే శరణ్యుడవు అనుకొన్నది. తనను కాపాడమంటూ నిన్ను శరణము వేడింది. చంపివేయవలసినంత అపరాధము

చేసింది. అయినప్పటికిన్నీ నీవు దానిని దయతో కాపాడినావు. బ్రహ్మాస్త్రము వ్యర్థము అయిపోకూడదు కనుక నీవు ఆ కాకి కుడికంటిని కొట్టివేసి వదిలిపెట్టినావు. అప్పుడు ఆ కాకి నీకూ, నీ తండ్రి దశరథమహారాజుకూ నమస్కారాలు చెప్పి దానిదారిని అది పోయింది.

"ఓ హనుమంతుడా! రామప్రభువు అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడు. మహాబలవంతుడు. సత్త్వభావము కలవాడు. ఎందుకు రాక్షసులమీద ఆ ప్రభువు తన అస్త్రాలను ప్రయోగించలేదు అనీ, తనమీద ఏమాత్రము ప్రేమఉన్నా తీక్ష్ణబాణాలతో రావణాసురుణ్ణి చంపివేసి ఉండేవాడవు అనీ, అట్లా కాకపోయినట్లయితే అన్నగారి అనుజ్ఞతో ఆ పరంతపుడు లక్ష్మణుడు అయినా వచ్చి తనను కాపాడి ఉండేవాడు అనీ, అట్లా ఎందుకు చేయలేదు అనీ, ఆ పరంతపులు ఇద్దరూ ఒకేచోట ఉండి కూడా నన్ను చూడకుండా ఉన్నారు ఏమిటి అనీ అడుగుతూ, 'నేను ఏదో గొప్ప పాపము చేసి ఉంటాను. సందేహము లేదు' అంటూ సీతాదేవి కన్నీళ్ళు కార్చింది.

"నేను ఆ పూజ్యురాలితో, ఓ దేవీ! నేను సత్యప్రమాణము చేసి చెప్పుతున్నాను. నీ దుఃఖము నుంచి ఆ రామప్రభువు ఏ పనీ చేయకుండా ఉన్నాడు. ఆయన దుఃఖపడుతూ ఉన్నందువల్ల లక్ష్మణుడున్నూ దుఃఖపడుతూ ఉన్నాడు. ఓ దేవీ! నేను ఎట్లాగో వచ్చి నిన్ను చూస్తున్నాను. నీవు ఇక దుఃఖపడవద్దు. ఇది దుఃఖపడవలసిన సమయము కాదు. త్వరలో నీ దుఃఖము అంతా తీరిపోతుంది. పెద్దపులులవంటి ఆ అన్న తమ్ములు ఇద్దరూ నిన్ను చూడవలెను అని తహతహలాడుతున్నారు. ఇక్కడికి త్వరలోనే వస్తారు. లంకాపట్టణాన్ని భస్మము చేసివేస్తారు.

"ఓ దేవీ! రామప్రభువు రావణాసురుణ్ణి సబాంధవముగా సంహారము చేసివేస్తాడు. నిన్ను తన పట్టణానికి తీసుకొని పోతాడు. తప్పదు. 'ఓ పూజ్యురాలా! రామప్రభువు బాగా ఎరిగిఉందీ, ఆయన చూచి సంతోషించేది ఏది అయినా నాకు నీవు గుర్తుగా ఇవ్వవలెను' అని నేను అడిగినాను. అన్నిదిక్కులా చూస్తూ తన చీరకొంగునుంచి విప్పి ఈ చూడామణిని నాకు ఇచ్చింది. ఓ ప్రభూ! నేను ఈ చూడామణిని తీసుకొని ఆ పూజ్యురాలికి సాష్టాంగ నమస్కారముచేసి అప్పుడే ప్రయాణము అయినాను.

"ఆ వరవర్ణిని సీతాదేవి నన్ను చూచి కన్నీళ్ళు కారుస్తూ దీనురాలు అయి మాటలు తడబడుతూ ఎగిరిపోయేటప్పుడు నేను ఏమి అయిపోతానో అని భయపడుతూ, 'ఓ హనుమంతుడా! సింహాలవంటి రామలక్ష్మణులకూ, సుగ్రీవుడికీ, ఆయన మంత్రులకూ, అందరికీ నా యోగక్షేమము చెప్పు. నన్ను ఈ దుఃఖ

సముద్రములోనుంచి ఆ రామప్రభువు కడతేర్చేటట్టు నీవే చేయవలెను. ఓ హనుమంతుడా! నీవు రామప్రభువు దగ్గరకు పోగానే నా ఈ ఘోర దుఃఖాన్ని గురించీ, ఈ రాక్షసులు నన్ను బెదిరించడాన్ని గురించీ చెప్పవలసింది' అని చెప్పింది.

"ఓ ప్రభూ! నీవు రాజులలో రాజసింహము వంటివాడవు. ఆ పూజ్యురాలు సీతాదేవి చెప్పింది అంతా చెప్పినాను.

68

"ఓ నరశార్దూలమా! నీకు నామీద ఉన్న వాత్సల్యాన్నీ, ఆప్తత్వాన్నీ సీతాదేవి గమనించింది. ప్రయాణము అయిపోవడానికి నా వేగిరపాటును చూచింది. ఆమె మళ్ళీ నాతో, 'ఓ హనుమంతుడా! ఆ రామప్రభువు యుద్ధములో రావణాసురుణ్ణి హతమార్చి నన్ను తీసుకొనిపోయేట్లు చేయవలెను. ఎన్ని విధాల చెప్పవలెనో అన్ని విధాల చెప్పు. ఓ అరిందమా! ఇక్కడను ఎక్కడను అయినా రహస్య ప్రదేశములో నీకు ఇష్టము అయితే ఈరోజు ఉండి అలసట తీర్చుకొని రేపు ప్రయాణము అయిపో. నీవు ఇక్కడ ఒక్కరోజు ఉండేట్లయితే నేను కొంతసేపు అయినా దిగులుపడడము తగ్గుతుంది. మళ్ళీ నీవు వచ్చేవరకూ నేను ప్రాణములతో ఉంటానో, ఉండనో సందేహమే!

'రామప్రభువును ఎడబాసినందువల్ల నేను దుఃఖభాగినిని అయినాను. నాకు దుర్గతిపట్టింది. ఇట్లా దుఃఖపడుతూ ఉన్న నేను నీవు కనపడకుండా పోయిన తరువాత మరింత దుఃఖపడుతూ ఉంటాను.

" 'ఓ వీరుడా! నీకు సాయమువచ్చిన వానరులను గురించీ, ఎలుగుబంట్లను గురించీ పెద్ద సందేహము ఒకటి నన్ను బాధ పెట్టుతూ ఉంది. ఈ మహోదధిని ఎవరూ దాటి రాలేరు. వాండ్లు అందరూ ఎట్లా ఇక్కడికి వస్తారు? ఆ రాజపుత్రులు రామలక్ష్మణులు ఈ మహాసముద్రాన్ని ఎట్లా దాటివస్తారు? సమస్త ప్రాణికోటిలోనూ నీకూ, నీ తండ్రి వాయుదేవుడికీ, గరుత్మంతుడికీ మీ ముగ్గురికీ ఈ సముద్రాన్ని లంఘించే శక్తి ఉంది. ఓ హనుమంతుడా! నీవు కార్యవిదులలో శ్రేష్ఠుడవు. అందరినీ ఈ సముద్రాన్ని దాటించి తీసుకొనిరావడానికి ఏమి ఉపాయము ఉందో చెప్పు.

"ఓ హనుమంతుడా! నీవు పరవీరహంతవు. ఈ లంకాపట్టణములో ఉన్న రాక్షసులను అందరినీ సంహారముచేసే సామర్థ్యము నీ ఒక్కడికే ఉంది. నీవు అట్లాచేసేట్లయితే యశస్సు నీకు వస్తుంది. రావణాసురుణ్ణే వాడి సమస్త సైన్యాలతోనూ సంహారము చేసి రామప్రభువు నన్ను తన పట్టణానికి తీసుకొనిపోయేట్లయితే ఆయనకే కాకుండా నాకున్నూ యశస్కరముగా ఉంటుంది. ఆ పరమపరాక్రమవంతుడి

భయమునుంచే రావణాసురుడు దండకారణ్యములో కపటోపాయముతో నన్ను అపహరించుకొని వచ్చినాడు. కాబట్టి రామప్రభువు రాకుండా నన్ను రామప్రభువు దగ్గరకు తీసుకొనిపోవడము తగినపని కాదు. ఆ శత్రుసంహారకుడు రామప్రభువు లంకాపట్టణాన్ని తన సైన్యాలతో నింపివేసి నన్ను తీసుకొనిపోవడము ఆయన పరాక్రమానికి తగినట్టుగా ఉంటుంది. అందువల్ల ఆ మహాపరాక్రమవంతుడు, ఆ ఆహవశూరుడు ఆయనకు అనురూపము అయిన పరాక్రమముతో వచ్చి నన్ను తీసుకొని పోయేట్టు నీవు చేయవలెను' అంటూ ఆ సీతాదేవి అర్థవంతముగానూ, యుక్తియుక్తముగానూ, వినయాన్వితముగానూ చెప్పిన మాటలకు నేను, 'ఓ దేవీ! వానర సేనలకూ, భల్లూకసేనలకూ ప్రభువు అయిన సుగ్రీవుడు ఆకాశగాములలో శ్రేష్ఠుడు. సత్త్వసంపన్నుడు. అతడు ఈ కార్యము సాధించడానికి కృతనిశ్చయుడుగా ఉన్నాడు.

"పరమపరాక్రమవంతులూ, అమిత శక్తిసంపన్నులూ, మహా బలవంతులూ అయిన వానర భల్లూకవీరులు అనేకమంది ఆ సుగ్రీవుడి చెప్పుచేతలలో ఉన్నారు. వాండ్లు అందరికీ మనోవేగముతోపోయే శక్తివుంది. వాండ్లు అందరూ ఆకాశమార్గానకానీ, పాతాళమార్గానకానీ, తిర్యఙ్మార్గానకానీ ఏ అంతరాయమూ లేకుండా పోగలరు. ఎటువంటి దుర్ఘటకార్యాలను అయినా ఏ మాత్రమూ ఆయాసము లేకుండా చేసివేయగలరు. ఆ మహాభాగులు, ఆ బలదర్పితులు వానరవీరులు అనేక పర్యాయములు ఆకాశమార్గాన పోయి యీ భూమిని అంతా తిరిగి చూచినారు.

"ఆ సుగ్రీవుడి దగ్గర ఉన్న వానరవీరులలో కొందరు నాతో సరిసమానులు. కొందరు నాకన్నా అధికులు. నాకన్నా బలవంతులు అయిన వారిని గురించి నేను వేరే చెప్పవలసిన పనేలేదు. ఎక్కడికి అయినా పంపించవలసి వచ్చినప్పుడు ఎక్కువ అయినవారిని పంపించరు. సామాన్యులనే పంపిస్తూ ఉంటారు.

"ఓ దేవీ! పరితాపపడడము ఇక చాలు. దుఃఖము వదిలిపెట్టు. వానరవీరులు అందరూ ఒక్క గంతువేసి యిక్కడికి వచ్చి పడతారు. ఓ మహాభాగా! నేను ఆ నృసింహులను నా వీపుమీద ఎక్కించుకొని నీ దగ్గరకు వస్తాను. సూర్యచంద్రులవంటి ఆ కాంతిమంతులను నీవు చూస్తావు. సింహమువంటి ఆ శత్రుసంహారకుడు, రాముడు ధనుర్ధరుడు అయి తమ్ముడు లక్ష్మణుడితో కూడా లంకాపట్టణము ద్వారము దగ్గరకు రావడము నీవు చూస్తావు. వారివెంట వానర భల్లూక వీరులు వస్తారు. వారు గోళ్ళతోనూ, కోరలతోనూ పోరాడే సింహ శార్దూలాలవంటి పరాక్రమవంతులు. మత్తమాతంగాలవంటి మహాబలవంతులు. వారిని అందరినీ

నీవు త్వరలోనే చూస్తావు. ఈ లంకాపట్టణములో మలయపర్వత సానువులలో వానర భల్లూక వీరులు సింహనాదాలు చేయటము నీవు త్వరలోనే వింటావు.

"ఓ దేవీ! వనవాస గడువుకాలము అయిపోయి ఆ అరిందముడు రామప్రభువు నిన్ను తీసుకొని అయోధ్యాపట్టణానికి పోయి రాజ్యాభిషేకము చేసుకోవడమున్నూ త్వరలోనే జరుగుతుంది" అని చెప్పినాను.

సుందరకాండ సమాప్తము

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No 97631
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ఇతర ప్రచురణలు :

మహాభారతం
శ్రీ పిలకా గణపతి శాస్త్రి

శ్రీమద్భాగవతం
శ్రీ యామిజాల పద్మనాభస్వామి

జ్ఞానేశ్వరి భగవద్గీత
శ్రీ దిగవల్లి శేషగిరిరావు

**శ్రీ త్యాగరాజ కీర్తనలు, ముత్తుస్వామి కీర్తనలు,
శ్యామశాస్త్రి కీర్తనలు, సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు**

TRIVENI PUBLISHING HOUSE, Machilipatnam - 521 001